శ్రీవేదవ్యాస విరచితం

వామన మహాపురాణం

(తెలుగు అనువాదంతో)

అనువాదకులు

డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి

ఎం.ఎ.(తెలుగు), ఎం.ఎ.(సంస్కృతం), ఎం.యిడి., పిహెచ్.డి.

సంపాదకులు


డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ

ఎం.ఎ.(సంస్కృతం), ఎం.ఎ.(తెలుగు), పిహెచ్.డి.

ప్రత్యేకాధికారి

పురాణ ఇతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2023

VAMANA MAHAPURANAM
(with Telugu Translation)

Translated by
Dr. Dhulipala Prabhakara Krishnamurthy
M.A. (Telugu), M.A. (Sanskrit), M.Ed., Ph.D.

Editor
Dr. Akella Vibhishana Sharma
M.A. (Sanskrit), M.A. (Telugu), Ph.D.

T.T.D. Religious Publications Series No.1436

© All Rights Reserved


First Print : 2023

Copies: 500


Published by:
Sri A.V. Dharma Reddy, I.D.E.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Cover Design
Type Setting
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతిఅమ్మవారు　　　　శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

తిరుమల తిరుపతి దేవస్థానములు
పురాణ ఇతిహాస ప్రాజెక్టు
పండితపరిషత్తు
(సలహామండలి)

అధ్యక్షులు

శ్రీ ఎ.వి.ధర్మారెడ్డి గారు ఐ.డి.ఇ.యస్.

కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు

సభ్యులు

శ్రీమతి యస్. భార్గవి గారు ఐ.ఏ.యస్.
సంయుక్త కార్యనిర్వహణాధికారిణి
తి.తి.దే.,తిరుపతి

డా॥ కందాడై రామానుజాచార్యులుగారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధనీ సంస్కృత కళాశాల,
హైదరాబాద్

డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు,
ప్రభుత్వ ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ,
హైదరాబాద్

డా॥ ధూళిపాళ మహాదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు, తి.తి.దేవస్థానములు

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం - తిరుపతి

డా॥ ఈ.ఏ.శింగరాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాల - తిరుపతి

డా॥ కె. ప్రతాప్‌గారు
విశ్రాంత ఆచార్యులు, సంస్కృత విభాగం
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం - తిరుపతి

కన్వీనర్

డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ

ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుమల తిరుపతి దేవస్థానములు

పురాణ ఇతిహాస ప్రాజెక్టు

పరిష్కరణ పరిషత్తు

డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
పూర్వ ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు,తిరుపతి.

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ సూరం శ్రీనివాసులుగారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీ గోరంట్ల వెంకన్న ఓరియంటల్ కాలేజ్
తిమ్మసముద్రం.

డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తిగారు
విశ్రాంత డిస్ట్రిక్ట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్
నిడదవోలు.

డా॥ కలవకొలను కాశీ విశ్వేశ్వరశర్మగారు
సంస్కృతోపన్యాసకులు,
కె.ఎస్.ఎన్.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
అనంతపురం.

డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ పి.పి.వి.డి నాగత్రిశూలపాణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.ఎస్.బి.ఎన్ డిగ్రీ&పిజి కళాశాల,
అనంతపురం.

శ్రీ గార్లపాటి ప్రభాకరశర్మగారు
విశ్రాంత ప్రిన్సిపాల్, ధర్మప్రబోధ కళాశాల
హిందూ ధర్మప్రచార పరిషత్, తి.తి.దే

కన్వీనర్
డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ
ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

విషయానుక్రమణిక



తొలిపలుకు



"ఓం నమో వేంకటేశాయ"

శ్రీ ఎ.వి. ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

విశ్వమానవ కల్యాణానికి పురాణ వాఙ్మయం పరమప్రయోజనకారి. విద్యా, వైజ్ఞానిక విషయాలు భారతీయులు కొన్నివేల సంవత్సరాలకు ముందే గ్రహించారని, ఈ పురాణాలవల్ల ప్రతి ఒక్కరూ తెలుసుకుంటారు. వ్యాసప్రణీతమైన అష్టాదశపురాణాల ఆంధ్రానువాద కార్యక్రమానికి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీకారం చుట్టింది. ఈ పురాణాలను ప్రతి ఒక్కరికి చేరువ చేయాలనే సంకల్పంతో ముందుకుసాగుతోంది. కేవలం ఆధ్యాత్మిక విషయాలకేకాక, శాస్త్రాధ్యయనానికి కూడా పురాణాలు ఉపయోగపడుతాయి. అందుకే జనసామాన్యానికి పురాణాలను అందించే ప్రయత్నంలో భాగంగా ప్రసిద్ధులైన పండితులతో సరళంగా అనువాద కార్యక్రమాన్ని చేయిస్తున్నాము. దానిలో భాగంగానే ఈ వామనమహాపురాణం కూడా అనువదించబడింది.

అతి ప్రాచీనమైన ఈ వామనమహాపురాణంలో నేటి కాలానికి, నేటి సమాజానికి, నేటి యువతకు ఉపకరించే ఎన్నో అంశాలున్నాయి. అందుకే 'పురాపి నవం పురాణం' అనే నిర్వచనం ప్రసిద్ధమైనది. పురాణాలు అతి ప్రాచీనమైనవైనా, ఈ ఆధునిక కాలానికికూడా ఉపకరించేవి. ఈ అంశంలో అష్టాదశమహాపురాణాలలో వామనమహాపురాణం మరింత విశిష్ట భూమికను నిర్వహిస్తోందని చెప్పవచ్చు.

ఈ పురాణం ప్రధానంగా విష్ణుగాథకుచెందినదైనా, ఇందులో 12 మహావిష్ణుస్తోత్రాలు, ఎనిమిది శివస్తోత్రాలు, నాలుగుదేవీమహాత్మ్యస్తోత్రాలు, సుదర్శనస్తోత్రంతో కలిపి 25 స్తోత్రాలు ఉన్నాయి. అంతేకాక వినాయకోత్పత్తి, కార్తికేయోత్పత్తి, హరిహరాభేదసదాశివతత్త్వ ప్రతిపాదనతో కూడిన గాథలు ఇంచుమించుగా ఈ పురాణంలో సగభాగాన్ని ఆక్రమించుకున్నాయి.

ఈ పురాణం ధర్మాన్ని ఏనాడు విడువరాదని, ధర్మహీనుడైన మానవుడు ఉత్తమస్థితిని పొందలేడని ప్రబోధిస్తున్నది. ఈ పురాణాన్ని 'ధర్మో రక్షతి రక్షితః' అనే ఆర్యోక్తికి వ్యాఖ్యానగ్రంథంగా పేర్కొనవచ్చు. ఇది నేటి సమాజాన్ని సన్మార్గంలో పయనింపజేస్తుంది. అంతేకాక మానవజన్మకు పరమార్థమైన మోక్షాన్ని పొందడానికి, శ్రీహరి భక్తిపారమ్యాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి ఎంతగానో ఉపకరిస్తుంది.

పాపాత్ములలో కృతఘ్నుడికి సమానుడు లేడని నిర్ధారించింది వామనమహాపురాణం. బ్రహ్మహత్య, గోహత్య మొదలైన మహాపాతకాలకు పరిహారమున్నది. కానీ కృతఘ్నుతకు నిష్కృతిలేదని చక్కగా వివరించింది.

ఉత్తమ జీవన విధానంలో సదాచారం మానవుడికి చాలా ప్రధానం. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, సూర్యాది నవగ్రహాలు, సప్తఋషులు, సప్తలోకాలు, తనకు నిత్యం శుభం ప్రసాదించాలని వేడుకోవాలి. జీవులలోకెల్లా నరజన్మ ఉత్తమమైనది. కనుక తప్పక ఈ ఆరాధనాక్రమాన్ని కర్తవ్యదీక్షతో నిర్వహించాలని వామనపురాణం తెలియజేస్తుంది.

ఈ వామనమహాపురాణానికి సరళమైన, వ్యావహారికశైలిలో తెలుగు అనువాదాన్ని అందించిన డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తిగారికి, పరిష్కరించిన పండితప్రకాండులకు, ప్రాజక్టు ప్రత్యేక అధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మగారికి, సంపూర్ణ సహాయ, సహకారాలందించిన ప్రాజెక్టు సిబ్బందికి నా శుభాభినందనలు.

ఈ పురాణం సమాజశ్రేయస్సుకు, శ్రీహరి భక్తికి, ధర్మమార్గానురక్తికి, మానసిక ధైర్యానికి, ప్రకృతివిజ్ఞానానికి ఒక పెన్నిధి. కనుక శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తకోటికి ఈ పురాణం కొంగుబంగారమౌతుందని ఆకాంక్షిస్తున్నాను.

సదా శ్రీవారి సేవలో –

(ఆళ్ళ వేంకట ధర్మారెడ్డి)

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు.

నివేదన

'పుమాన్ పుమాంసం పరిపాతు విశ్వతః' అనే వైదికమంత్రం మానవులు ఒకరికొకరు సాయం చేసుకోవడం వల్ల జన్మను చరితార్థం చేసుకోవాలని హితవు పలికింది. "కృణ్మో బ్రహ్మ వో గృహే సంజ్ఞానాం పురుషేభ్యః" అనే మంత్రం మానవులందరిలో సద్భావనలే కలగాలని పరమాత్మను వేడుకొందామని ప్రబోధిస్తోంది. ఇలాంటి వేదోక్తమైన ఉపదేశాలకు ఉదాహరణప్రాయమైన గాథలకు వామనపురాణం పెన్నిధి. కనుక "వేదాః ప్రతిష్ఠితాస్సర్వే పురాణే నాత్ర సంశయః" వేదాలన్నీ పురాణాలలో పోషింపబడుతున్నాయి," అనే వాక్యం అక్షరసత్యంగా తెలుస్తున్నది.

చతుర్భిశ్చ చతుర్భిశ్చ ద్వాభ్యాం పంచభిరేవ చ ।
హూయతే చ పునర్ద్వాభ్యాం తుభ్యం హోత్రాత్మనే నమః ॥

ఈ చక్కని, చిక్కని శ్లోకం కశ్యపుడు చేసిన వామనపురాణంలోని విష్ణుస్తుతి లోనిది. ఈ శ్లోకం మనకు అవగతం కావాలంటే నీలకంఠులవారు చేసిన వ్యాఖ్యను చదవాలి.

"చతుర్భిరితి ఆశ్రావయేతి చతురక్షరమ్, అస్తు శ్రౌషడితి చతురక్షరమ్. యజేతి ద్వ్యక్షరమ్. యే యజామహే ఇతి పంచాక్షరమ్. ద్వ్యక్షరో వషట్కార ఇతి సప్తదశభిః అక్షరైః యః హూయతే తస్మై హోమాత్మనే నమః" ఇది నీలకంఠులవారి వ్యాఖ్యానం. శ్రౌతవిషయగర్భితంగా ఉన్న పై వామన పురాణశ్లోకం నీలకంఠులవారి వ్యాఖ్యానమూ, తగినంత శ్రౌతపరిజ్ఞానమూలేనిదే తెలియడం గగనకుసుమమే. ఈ పురాణశ్లోకం ఈ శ్రౌతం తెలిసిన నీలకంఠులవారి వ్యాఖ్యానం ద్వారా అర్థాన్ని తేటతెల్లం చేస్తోంది. కనుక పురాణ శ్లోకముల అర్థరచనకు శ్రౌతం కూడా తెలియాలి. వామన పురాణ శ్లోకములు చాలా గంభీరమైనవి. వైదికతను రంగరించుకొన్న పవిత్రతకలవని స్పష్టంగా పెద్దలు ప్రబోధించారు.

మనుస్మృతి పురాణవాఙ్మయవైశిష్ట్యాన్ని చెబుతూ–

బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరేదితి ।
ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ॥ అని హెచ్చరించింది.

ఇతిహాస, పురాణాలను ఆధారంగా చేసుకొని వేద తాత్పర్యాన్ని తీర్మానించాలి. లేకపోతే 'ఇతడు నన్ను మోసగిస్తున్నాడ'ని వేదభారతి భీతినొందుతుంది. చమత్కార గర్భితమైన ఈ శ్లోకం, వేదార్థ వివరణకు పురాణేతిహాస పరిజ్ఞానం లేనివాళ్ళు పూనుకోకూడదని మనుధర్మ శాస్త్రవేత్త చేసిన మహోపదేశం. కనుక పురాణాల పరిజ్ఞానానికి వేదార్థజ్ఞానం, వేదమంత్రాల పరిజ్ఞానానికి పురాణాల పరిచయం చాల ఆవశ్యకం. ఈ విధంగా వేద–పురాణాలకు పరస్పరాకాంక్ష ఉన్నది.

బ్రహ్మదేవుడు వామన మాహాత్మ్యాన్ని కీర్తిస్తూ బోధించిన పురాణమే వామనపురాణం, "సంఖ్యయా దశసాహస్రం, ప్రోక్తం కులపతే పురా" అనే ఆర్షవాక్యం, ఈ పురాణంలో పదివేల శ్లోకాలున్నట్లు స్పష్టం చేస్తోంది. కానీ ఈ పురాణం ప్రస్తుతం 5,838 శ్లోకాలతో లభిస్తోంది.

ప్రాయికంగా 'అవతారాలు' రెండు విధాలు. లోకోత్తరమైన కార్యాన్ని చేయడానికి పరమాత్మ తాను చేయబోయే పనికి అనుకూలంగా స్వరూపం మార్చుకొని మరోరూపం ధరించి సరాసరి భూలోకానికి రావడం ఒక విధానం. మరో విధానం అందరి జీవుల్లా మాతృగర్భావాసం చేసి జన్మించడం. శ్రీహరి ఈ రెండు విధాలుగా అవతారాలెత్తిన సకల జగదుద్ధారకుడు. తొలి పద్ధతికి నృసింహాది రూపాలు, మలి పద్ధతికి రామకృష్ణాది అవతారాలు ఉదాహరణాలు. వామన మూర్తి ఈ రెండింటికీ ప్రాధాన్యమిచ్చిన విలక్షణ అవతారం.

వామనమూర్తి అవతార ప్రసక్తి వేదవాఙ్మయంలో మొదలై కావ్య వాఙ్మయం వరకు కొనసాగింది. వామనమూర్తి కథలో, కథనంలో కూడా చాలా పవిత్రత ఉంది. శ్రీహరి విలక్షణ లీల ఈ అవతారం.

"ఇదం విష్ణుర్విచక్రమే త్రేధా నిదధే పదం సమూఢమస్య పాంసురే"[1] అన్న ఋగ్వేద మంత్రం, విష్ణుమూర్తి మూడడుగులతో ఈ విశ్వాన్ని ఆక్రమించాడని. విష్ణువు యొక్క ధూళిధూసర పాదంలో భూమ్యాకాశాది సమస్త లోకాలూ ఒదిగి పోయాయి–అనిన్నీ చెప్తోంది. అలాగే **"త్రీణి పదా విచక్రమే విష్ణుర్గోపా అదాభ్యః । అతో ధర్మాణి ధారయన్"**[2] అనేమంత్రం ఉరుక్రమ వామనుడూ, గోపవేషధారి అయిన పరమాత్మ ధర్మరక్షణకు మూడుగా అడుగులు వేశాడని అభివర్ణించింది. అంటే విష్ణువు ఈ వామనమూర్తి లీలద్వారా తానే ఈ జగత్తుకు లోపల బైట ఉన్నానని విశ్వానికి ప్రబోధించాడు.

ఇక శతపథ బ్రాహ్మణంలో[3] – "వామనకథ" చాలా చిత్తహరంగా గోచరిస్తుంది. ఒకసారి ప్రజాపతి సంతానమైన దేవాసురులు కలహించుకొన్నారు. అప్పుడు అసురుల చేతిలో దేవతలు ఓడిపోయారు. ఇక అసురుల తమదే ఈ భూమి అని, దాన్ని పంచుకోవడానికి ఒక వ్యాఘ్రచర్మంతో నిర్మించిన త్రాడుతో తూర్పు నుంచి పడమరకు కొలిచి, విభజించుకొంటున్నారు.

అసురుల చేతిలో చిత్తైన దేవతలు, తమకు దిక్కైన యజ్ఞరూపి, వామనుడిగా ఉన్న విష్ణువుని ముందుంచుకొని అసురుల దగ్గరకు వెళ్ళారు. అసురులను తమకు కూడా వాటా ఇవ్వమని కోరారు. అసూయాగ్రస్తులైన అసురులు 'విష్ణువు పడుకొన్నంత మేర నేలనిస్తామని' దేవతలకు చెప్పారు. సరేనన్న దేవతలు వెంటనే వామనునిగా ఉన్న విష్ణువును భూమికి తూర్పుదిక్కున అర్చించి ప్రతిష్ఠించారు తరువాత అగ్నిని అర్చించారు. క్రమంగా తూర్పు భాగమంతా గాయత్రీ ఛందంతో, దక్షిణాన త్రిష్టుప్ఛంధంతో, పశ్చిమాన జగతీఛందంతో, ఉత్తరాన ఆ మూడు ఛందస్సులున్న మంత్రాలతో ఈ అగ్నిని అర్చించారు. ఆ అర్చా ప్రభావంవల్ల భూమినంతా పొందారు.

ఇలా వామనస్వామి తన వైభవాన్ని అగ్నిని ఆరాధించిన తరువాత లీలగా ప్రదర్శించాడు.

ఇక ఈ వామనుడి కథ శ్రీమద్భాగవత పురాణంలో మరింత అందంగాను, లోక ప్రసిద్ధంగాను కనిపిస్తుంది. బలిచక్రవర్తి యజ్ఞం చేస్తుంటే వామనుడిగా మహావిష్ణువు యజ్ఞవాటికకు వెళ్ళాడు. త్రిలోకాధిపతిగా వెలుగొందుతున్న బలిచక్రవర్తిని మూడడుగుల వామనుడు, మూడడుగుల నేలను అడిగాడు. బలి దానమిచ్చాక వామనుడు, ఇంతింతై అంతంతై నేలనూ, నింగిని, బలిశిరస్సునూ మూడడుగులతో ఆక్రమించాడు.

వామన పురాణంలో ఈ వామనమూర్తి వృత్తాంతం మనోహరంగా, జనసామాన్యానికి అర్థమయ్యేట్లుగా ఆవిష్కరించబడింది. మరొక వామనావతారాన్ని కేవలం ఈ పురాణమే వివరిస్తోంది. ఈ వామనావతారంలో ధుంధుడనే దైత్యరాజును సంహరించిన వామనుడిలీల వర్ణించబడింది.

ఈ వామనపురాణం చరాచర సృష్టిలో శ్రేష్ఠమైన వాటిని ప్రబోధించింది.

---

1. ఋగ్వేదం 1-23-17., 2. ఋగ్వేదం 1-22-18.

3. "తావాం వాస్తూ న్యుశ్మసి గమధ్యై, యత్రగావో భూరి శృంగా అయాసః ।
అత్రాహ తదురు గాయస్య వృష్ణః, పరమం పదమవభాతి భూరి ॥" (శతపథ - 1-154-6).

దేవతల్లో ఉత్తముడు మహావిష్ణువు, ఆయుధాల్లో శ్రేష్ఠం సుదర్శనం, పక్షులలో ఉత్తముడు గరుత్మంతుడు, సర్పాలలో వాసుకి, పంచభూతాల్లో పృథివి, నదుల్లో గంగ, నీటపుట్టిన వాటిలో నాణ్యమైనది కమలము, సరోవరాల్లో శ్రేష్ఠతమమైనది మానస సరోవరం. వనాలలో నేత్రమనోహరమైనది నందనం. లోకాలలో గొప్పది బ్రహ్మలోకం. ధర్మాలలో అగ్రగణ్యమైనది సత్యం. క్రతువులలో వరణీయమైనది అశ్వమేధం. తపోధనులలో మహనీయుడు అగస్త్యుడు. పురాణాలలో శ్రేష్ఠమైనది మత్స్యపురాణం, స్మృతులలో మనుస్మృతి గొప్పది. తేజస్వులలో అగ్రేసరుడు సూర్యుడు. జలాశయాల్లో గొప్పది సముద్రం. ధాన్యాలలో వరి వరిష్ఠమైనది. చతుష్పాత్తులలో ప్రథమ పూజనీయమైనది గోవు. పుష్పాలలో జాజి గొప్పది. నగరాలలో కంచి గొప్పది. సుందరీమణులలో రంభ గొప్పది. పట్టణాలలో ఘనమైనది కుశస్థలి (శ్రీరాముని పుత్రుడు కుశుడు నిర్మించినది) పళ్ళల్లో మధురమైనది మామిడి. తెల్లని పదార్థాలలో స్వచ్ఛమైనవి పాలు. కళల్లో మనోరంజకమైనది గణితము. విజ్ఞానాల్లో ఇంద్రజాలము గొప్పది. షడ్రసాలలో కీలకమైనది లవణము. వృక్షాలలో పరమ పవిత్రమైనది అశ్వత్థం. సతీమణుల్లో పార్వతీదేవి – ఇలా భగవానుని సృష్టిలో ఉత్తమమైన వాటిని వివరించిన విజ్ఞాన సముద్రం వామనపురాణం.

కేవలం నేను విష్ణుభక్తుడనని చాటుకోవడం, భావించడం సమజసంకాదు. త్రికరణ శుద్ధిగా విష్ణు పదారవింద మకరందంలో ఓలలాడాలని ఈ పురాణం ప్రబోధిస్తున్నది–

సా జిహ్వా యా హరిం స్తౌతి తచ్చిత్తం యత్తదర్పితమ్ ।
తావేవ కేవలౌ శ్లాఘ్యౌ, యౌ తత్పూజాకృతౌ కరౌ ॥

రోగశ్చాన్యో న సా జిహ్వా, యా న వక్తి హరేర్గుణాన్ ।

హరిభక్తి కలవాడు నిరంతరం తన నాలుకతో హరిని స్తుతిస్తుండాలి. భక్తుడికి హరి స్వరూపమే మనస్సులో సదా నిలిచి ఉండాలి. చేతులతో నిత్యం శ్రీహరిని సేవించే స్థితిలో ఉండాలి. భక్తుడి నాలుకపై నిత్యం శ్రీహరి గానం జరగనప్పుడు, ఆ నాలుక వ్యాధిగ్రస్తమైనదని ఉపదేశించింది. ఉత్తమమైన మానవజన్మ పొందిన తరువాత శ్రీహరి భక్తుడవ్వాలి. భక్తుడైనవాడు సర్వదా మనసా వాచా కర్మణా హరివైభవాన్ని ఆశ్రయించాలి. ఇలా విష్ణు పారమ్యాన్ని ఉపదేశిస్తూ 122 శ్లోకాలలో మనుష్యుడు తన జీవనప్రస్థానంలో ఆచరించాల్సిన సదాచారాలను చక్కగా విశ్లేషించింది.

దధివామనస్తోత్రం వామనుడి స్వరూపాన్ని చక్కగా అభివర్ణించింది–

హేమాద్రి శిఖరాకారం, శుద్ధస్ఫటికసన్నిభమ్ ।
పూర్ణచంద్రనిభం దేవం, ద్విభుజం వామనం స్మరేత్ ॥

వామనో బుద్ధిదాతా చ, హృదిస్థో వామనః స్మృతః ।
వామనస్తారకోభాభ్యాం, వామనాయ నమో నమః ॥

మేరువనే బంగారు కొండవంటి ఆకారం కలవాడు, సత్త్వగుణ సంపన్నుడని తెలిపే తెల్లని స్ఫటికం లాంటివాడు, ఆహ్లాదకరమైన పూర్ణచంద్రునివలె ప్రకాశించేవాడు అయిన రెండు చేతులున్న వామనమూర్తిని చక్కగా స్మరించాలి. ఎందుకంటే వామనుడు సద్బుద్ధినిచ్చేవాడు. ఎవడు ఎదలో వామనుడిని స్మరిస్తాడో, వాడు తప్పక తరిస్తాడు. వామనుడిని సుప్రభాతవేళ బ్రహ్మరుద్ర ఇంద్రాదిదేవతలు కూడా స్మరిస్తారని అణ్ణన్ స్వామి వివరించాడు.

–'త్రైవిక్రమాది చరితం విబుధాః స్తువంతి' "వామన అవతారాన్ని ప్రత్యేకంగా బ్రాహ్మీముహూర్తంలో స్మరించాలి. మనుచరిత్రలో ప్రవరుడు కూడా" "ప్రత్యూషపవనాంకురములు పైకొనువేళ వామనస్తుతి పరత్వమున" లేచేవాడుగా వర్ణింపబడ్డాడు. వామనావతారంలో బలిని మూడడగులు యాచించడంలో చక్కని స్వారస్యమున్నది. అదే గీతలో 1. యత్కరోషి యదశ్నాసి 2. యజ్జుహోషి దదాసి యత్ 3. యత్తపస్యసి కౌంతేయ! తత్కురుష్వ మదర్పణమ్ । అనే శ్లోకంలో వివరించబడింది. మనం ఏ హోమం చేస్తున్నామో, ఏ దానఫలం అనుభవిస్తున్నామో దానిని స్వామికి అర్పించుట – ఏ తపస్సు చేస్తున్నామో, దానిని స్వామికే అప్పగించాలని శ్రీహరి ఉపదేశం. బలిచక్రవర్తి తాను చేసిన సమస్త కర్మఫలాల్ని మూటకట్టి మూడడుగులుగా వామనార్పణం చేయడంలో ఆ ఉపదేశార్థమే ధ్వనిస్తోంది. ఈ అవతారముతో స్వామి గుణాగుణములు చూడకుండా ముల్లోకాల్లోని సర్వప్రాణులకు తన పాదస్పర్శ నిచ్చాడు.

వామనుడు దేవజననీజనకులైన అదితి కశ్యపులకు జన్మించాడు. కనుక ఈ దైవతావతారంలో తారతమ్య వివక్ష లేకుండా త్రిలోకాలను స్పృశించి, త్రివిక్రముడయ్యాడు. అందువల్ల ప్రభాతవేళ మానవులు స్మరిస్తేచాలు త్రిగుణములు దూరమై నిస్త్రైగుణ్యస్థితిలో తరిస్తారు. వామనుడి దయవల్ల బుద్ధివికాసాన్ని, బ్రహ్మచర్యనిష్ఠను, పరోపకారదృష్టిని ఫలంగా పొందుతారు. అందుకే ప్రాబోధకీస్తవమైన 'తిరుప్పావై'లో గోపికలు పలుమార్లు త్రివిక్రమ ప్రశంస చేశారు.


వామనకథ పద్మపురాణం, అగ్నిపురాణాల్లో కూడా విలక్షణంగా చెప్పబడింది. బ్రహ్మవైవర్తంలో చాలా ఆశ్చర్యకరమైన వృత్తాంతం ఉంది. బలిచక్రవర్తి కుమార్తె రత్నమాల బలియజ్ఞవేళ వచ్చిన వామనుణ్ణి చూసి ముగ్ధురాలయ్యింది. మాతృవాత్సల్యంతో దర్శించి తన చనుబాలను ఆ కుర్రవానికి పట్టించాలని ఉవ్విళ్ళూరింది.

'బలియజ్ఞే వామనస్య–దృష్ట్వా రూపం మనోహరమ్ ।
బలికన్యా రత్నమాలా–పుత్రస్నేహం చకార తు ।
మనసా మానసం చక్రే–పుత్రస్య సదృశో మమ ।
పిబేద్యది స్తనం కృష్ణః–కరోమి తం చ వక్షసి ॥
హరిస్తన్మానసం జ్ఞాత్వా–పపౌ జన్మాంతరే స్తనమ్ ।
దదౌ మాతృగతిం తస్యై–కామపూరః కృపానిధిః ॥

వామనుడైన విష్ణువు రత్నమాల మనసెరిగి వెంటనే మరో అవతారంలో చనుబాల నిచ్చేమహాభాగ్యాన్నిచ్చాడు. కానీ తరువాత వామనుడు బలిని మూడడుగుల వరం కోరి నిగ్రహించడం చూచి అప్పుడు బలిపుత్రిక రత్నమాల ఈ బాలుడికి చనుబాలతో విషమివ్వాలని భావించింది. విష్ణువు కృతయుగంలోని ఆమె కోర్కె తీర్చేందుకు ద్వాపరంలో పూతనగా రత్నమాలకు జన్మను ప్రసాదించాడు. కనుక వామనస్వామిని శుద్ధబుద్ధితో వేడుకోవాలి.

–ఆకెళ్ళ విభీషణశర్మ
ప్రత్యేకాధికారి

పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహు: వాయుర్వామో మహేశితు: ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభి: స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రి: వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మన: । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృత: ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధ: ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణు: పురాణావయవో హరి: ।

పురాణప్రశస్తి
(అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥
నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।
పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥

శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం–అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామాథర్వణములనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం–అనేవే పదునాల్గు విద్యలు.

'వేదోఽఖిలో ధర్మమూలం' అన్నట్లు వేదమంతా ధర్మమూలమైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యంకాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీసుతః** –అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలి వుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానాచ్చిరం
యచ్చార్థప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।

కాన్తాసమ్మితతయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్మై స్పృహాం కుర్మహే ॥ (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథాకథనం ద్వారా ధర్మస్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణకథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞాన వైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

కథా ఇమాస్తే కథితా మహీయసాం
వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।
విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!
వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥ (భాగవతం-12-3-14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

'వేదాః ప్రతిష్ఠితాస్సర్వే పురాణే నాత్ర సంశయః' పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

పురాణ ప్రాముఖ్యం

యన్నదృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।
ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానావిధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక -చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

పురాణ శబ్ద నిర్వచనం

పురాణం అంటే - పురా భవం ప్రాచీనకాలంలో రచించబడినది అని అర్థం.

పురాఽపి నవం - ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

పురా-అణతి-అగతానాగతే కథయతీతి పురాణం-అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

పురా-పూర్వస్మిన్ జాతమితి పురాణమ్-పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

పురా-అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

పురా-ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం - పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।
ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥ అథర్వ సంహిత (11-7-24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం.

"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేదస్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".(2-4-10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది-అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు,

శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।
పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।
వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్య నివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూప నిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।
వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥

ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।
మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥

భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।
బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥

లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।
స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥

కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।
మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

దీని తాత్పర్యం ఇది–శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం–శిరస్సు, పద్మపురాణం–హృదయం, విష్ణుపురాణం–దక్షిణహస్తం, వాయుపురాణం–వామహస్తం, భాగవతపురాణం–తొడలు, నారదపురాణం–నాభి, మార్కేండయపురాణం–దక్షిణపాదం, అగ్నిపురాణం–వామపాదం, భవిష్యపురాణం–కుడి మోకాలు, బ్రహ్మవైవర్త పురాణం–ఎడమ మోకాలు, లింగపురాణం–కుడి చీలమండ, వరాహపురాణం–ఎడమ చీలమండ, స్కాంద పురాణం–కేశాలు, వామనపురాణం–చర్మం, కూర్మపురాణం–వీపు, మత్స్యపురాణం–మెదడు, గరుడపురాణం–మజ్జ, బ్రహ్మాండపురాణం–ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆ యా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయమ్ ।
అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు–(1) మత్స్యపురాణం (2) మార్కండేయపురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు –(1) భాగవతం (2) భవిష్యపురాణం –'బ్ర'తో ప్రారంభమయ్యేవి –మూడు (1) బ్రహ్మపురాణం (2) బ్రహ్మాండపురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం –'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణుపురాణం (2) వాయుపురాణం (3) వామనపురాణం (4) వరాహపురాణం –అ=అగ్నిపురాణం నా=నారదపురాణం–ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడపురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రిందివిధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।
భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥
ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్తలింగకే ।
వారాహం చ తథా స్కాందం వామనం కూర్మసంజ్ఞకమ్ ।
మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

సాత్త్వికాలు–

> **వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।**
> **గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥**

రాజసాలు–

> **బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।**
> **భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥**

తామసాలు–

> **మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।**
> **ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥**

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం –అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతర దేవతల కంటె అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానా నామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది.–

> **ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।**
> **క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।**
> **అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥**

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడు రూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।
స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం – అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మపురాణం పేర్కొంటున్నది.

ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।
తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥

చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశభాషితమ్ ।
దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతః పరమ్ ॥

కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।
బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వాయమేవ చ ॥

మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।
పరాశరోక్తమపరే మారీచం భాస్కరాహ్వాయమ్ ॥

ఉపపురాణాలు–(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం (12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతం ప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

పురాణలక్షణం

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం–అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం – అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం – మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం – ఆ యా ఋషుల, రాజుల వంశాలు.

4. మన్వంతరాలు – మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆ యా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.

5. వంశానుచరితం–ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణ పురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పది లక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।
మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం–అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది–

(1) సర్గం: –భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:–విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:–వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:–భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:–కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:–మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:– భగవదవతారాలు, భక్తులు–వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:–జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:–వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:– అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆ యా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥
దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశ పఞ్చ చతుశ్శతమ్ ॥
చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చ శతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥
చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥
కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥
త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । **(భాగవతం-12-13-2-9)**

1. బ్రహ్మపురాణం	-	10,000	శ్లోకాలు
2. పద్మపురాణం	-	55,000	,,
3. విష్ణుపురాణం	-	23,000	,,
4. వాయుపురాణం	-	24,000	,,
5. భాగవతపురాణం	-	18,000	,,
6. నారదపురాణం	-	25,000	,,
7. మార్కండేయపురాణం	-	9,000	,,
8. అగ్నిపురాణం	-	15,400	,,
9. భవిష్యపురాణం	-	14,500	,,
10. బ్రహ్మవైవర్తపురాణం	-	18,000	,,
11. లింగపురాణం	-	11,000	,,
12. వరాహపురాణం	-	24,000	,,
13. స్కందపురాణం	-	81,100	,,
14. వామనపురాణం	-	10,000	,,
15. కూర్మపురాణం	-	17,000	,,
16. మత్స్యపురాణం	-	14,000	,,
17. గరుడపురాణం	-	19,000	,,
18. బ్రహ్మాండపురాణం	-	12,000	,,
మొత్తం శ్లోకాలు	-	**4,00,000**	

పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆ యా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమా, రూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహమైం దనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

పురాణ ప్రయోజనం

యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।
తథా పురాణశ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।

సదాచారం లేనివాడిని వేదాలు గూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, –రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి, అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచితసంస్కారం కల్గించేది. తద్ద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణుపురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం–దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ–ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

"ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం" (ఛాందో 7-1-2).

అందుచేత క్రీ.పూ 600 సం॥ పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీన కాలానికి చెందిన భారతీయ సమాజ స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు- వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తి నివృత్తి రూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకర రామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ-భక్తి-ధ్యాన-జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః" అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాది కథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణ వృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణ సారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితాలని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వత నైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతి ప్రాచీన కాలంనుండి నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతి పురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు - తి.తి.దే.

అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

10,000 వేల శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్ర సగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడ మయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కండు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమ క్షేత్రమనే పూరీ జగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటె బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।
యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 వేల శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగి వున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్" –**సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగ ధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడి యుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాప నిర్ముక్తు డవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతి హేతువులైన, మానవ జీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడి వున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహంవల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।
లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥

3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణుధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం 23,000 వేల శ్లోకాలు. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం-ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తన ప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణ కర్మ నామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో-

అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।
వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర! ॥

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।
తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥

అన్నట్లు - భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** -అనుటవల్ల ఇందులో 24,000 వేల శ్లోకాలున్నాయని గ్రహించాలి. కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం–అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ–ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।
న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేడని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం–అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ–కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।
కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥

5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పంద్రెండు స్కంధాలు, 18,000 వేల శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

'నిగమకల్పతరోర్గళితం ఫలం'–అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీ చింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణ కర్మ నామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది–పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి, అలసిపోయి, తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతని మాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవత శ్రవణమే అని చెప్పి భాగవత ప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతార ప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ–ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలి స్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।
శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।
మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥

'నా కథలు పఠించేవాడు, వినేవాడు, నా కథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో 25,000 వేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం–ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది–

లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।
జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక–ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న–వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం–మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరి సుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।

స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, 9,000 వేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగిను లున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు–అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు. పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు. పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు. ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడి వున్నాయి.

శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।
సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।
అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥

"రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు" అని భావం. ఇలా రామాయణ భారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।
ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు–

యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।
అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000 వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది–

అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।
పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత– ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు– ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది–

నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।
ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥

"ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేడు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి." అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

శుభదం పుణ్యదం చైవ విఘ్ననిఘ్నకరం పరమ్ ।
హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000 వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్థమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం, లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగరవర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్హి వివిధాః క్రియాః ।
అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి - అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం-

భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।
తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది-

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।
స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24,000 వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు, అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నా మాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందుకా దేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహసంజ్ఞితమ్ ।

సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమావ్రజేత్ ॥

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం' – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,100 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతర పురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెంద్రుకలతో పోల్చబడిన ఈ గ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల–జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాది కథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగర పరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తులవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగి వున్నాయి.

సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।
గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలలో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి 10,000 వేల శ్లోకాలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తిజనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నుత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు-ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు - శిష్యుడు-వీరిరువురిలో శ్రేష్ఠ దెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।
శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకల పాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

15. కూర్మపురాణం

17,000 వేల శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి-ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు-మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన-ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు-అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।
ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని, భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం' అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు-ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।
పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14,000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి–మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయేత్పౌరుషం నరః ।
జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమల మధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।
న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –

అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।
నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం. ఇందులో 19,000 వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు–వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।
రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాఙ్ముఖేన ॥

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గల జ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్' అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.

18. బ్రహ్మాండపురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. **"బ్రహ్మాండం చాస్థి గీయతే"** అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 వేల శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం, ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తరభాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషఙ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళు ్ళ, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్నిపునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।
స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

వామన పురాణ సారాంశం

శ్లో॥ నమో నమః కారణవామనాయ నారాయణాయామితవిక్రమాయ ।
శ్రీశార్ఙ్గచక్రాసిగదాధరాయ నమోఽస్తు తస్మై పురుషోత్తమాయ ॥

శ్రీ, శార్ఙ్గ, చక్ర, గదా, ఖడ్గాలను ధరించినవాడు, పురుషోత్తముడు, అమితవిక్రముడునైన నారాయణుడు దేవకార్యసిద్ధికై వామనావతారం ధరించాడు, అట్టి వామనుడైన త్రివిక్రమునకు తన భావనలనన్నింటిని సమర్పిస్తూ, వామనపురాణాన్ని పఠించే మానవునకు విష్ణుభగవానుడు మోక్షాన్ని ప్రసాదిస్తాడని వామనపురాణ ఫలశ్రుతి తెలియజేస్తోంది. వామనరూపంలో బలిని యాచించినవాడును, ఉపాసింపదగినవాడును గావున వామనుడని కీర్తింపబడుతున్నాడని శంకరభాష్యంలో వివరింపబడింది. అంతేగాక! **"వామం శుభం నయతి ప్రాపయతీతి వామనః"** అనే వ్యుత్పత్తినిబట్టి వామనుడు సమస్త శుభాలను కలుగజేసేవాడని కూడ విదితమౌతోంది. ప్రతి మానవుడు బ్రాహ్మీముహూర్తంలో నిద్రలేచిన వెంటనే వామనుని స్తుతించాలని దధివామన స్తోత్రం తెలియజేస్తోంది. అల్లసాని పెద్దన తన మనుచరిత్రగ్రంథంలో పరమనిష్ఠాగరిష్ఠుడు, సదాచార సంపన్నుడునైన ప్రవరాఖ్యుడు నిద్రనుండి లేచినవెంటనే వామనస్తుతి చేసేవాడనియు, తదనంతరం మాత్రమే తన దినచర్యను ప్రారంభించేవాడనియు, వర్ణించియున్నాడు. ఆలోచించిచూడగా ఇహపరసౌఖ్యాలను ప్రసాదించే వామనుడు మానవాళికి ప్రతినిత్యం పూజింపదగిన దైవమనియూ, వామనపురాణం విధిగా పఠింపవలసిన పురాణమనియూ, విదితమౌతోంది.

శ్రీమహావిష్ణువు యొక్క దశావతారాలలో ఐదవ అవతారం వామనావతారం. ఈ గాథను ప్రధాన ఇతివృత్తంగా చేసికొని వ్యాసభగవానుడు తన అష్టాదశమహాపురాణాలలో ఒక పురాణంగా 'శ్రీవామన మహాపురాణాన్ని' రచించాడు. విష్ణుమాహాత్మ్యం అధికంగా వర్ణింపబడిన పురాణాలను సాత్త్విక పురాణాలుగా వర్గీకరించడం చేత, వామనమహాపురాణం సాత్త్వికపురాణంగా కీర్తింపబడుతోంది.

కథాంశాలు

శ్లో॥ త్రైలోక్యరాజ్యమాచ్ఛిద్య బలేరింద్రాయ యో దదౌ ।
నమస్తస్మై సురేశాయ సదా వామనరూపిణే ॥

అనే వామనస్తోత్రంతో వామనపురాణ రచన ప్రారంభమయ్యింది. నారదమహర్షి, పులస్త్యమహర్షిని "బ్రహ్మర్షీ! సర్వసమర్థుడైన శ్రీమహావిష్ణువు వామనరూపం ఎందులకు ధరించాడు? విష్ణు భక్తిపరాయణుడైన ప్రహ్లాదుడు దేవతలతో యుద్ధం ఎందులకు చేశాడు? దక్షప్రజాపతి కుమార్తె అయిన సతీదేవి ఏ కారణం చేత తన శరీరాన్ని దహింపజేసుకున్నది. మళ్లీ హిమవంతుని కుమార్తెగా ఎందులకు జన్మించింది? పార్వతిగా జన్మించిన సతీదేవి తిరిగి ఎందులకు శంకరుని వివాహమాడింది? అంతేగాక పలురకాలైన వ్రతాలు ఆచరించే విధానాలను గూర్చియూ, అనేక తీర్థాల మాహాత్మ్యాలను గూర్చియూ, క్షేత్రాల ప్రాశస్త్యాన్ని గూర్చియూ, దానాలమహిమను గూర్చియూ, నాకు తెలియజేయండి" అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్నలకన్నింటికి సమాధానంగా పులస్త్యమహర్షి తెలియజేసిన కథాంశాలే వామనపురాణంలోని కథాంశాలు.

వామనపురాణం పూర్వోత్తరభాగాలుగా సుమారు పదివేల శ్లోకాలతో **'బృహద్వామనపురాణం'** అనేపేరుతో వ్యాసుడు రచించినట్లు పురాణ వాఙ్మయచరిత్రలో కనబడుతోంది. కాని అందులో పేర్కొనబడిన ఉత్తరభాగం నేడు లభించడం లేదు. ఉత్తర దక్షిణభారతదేశమందంతటా 95 అధ్యాయాలతో సుమారు ఆరువేలశ్లోకాలతో ఒకేభాగంగా మాత్రమే వామనపురాణం మనకు లభ్యమౌతోంది.

శివుడు జీమూతవాహనుడైన విధం (1వ అధ్యాయం) పులస్త్యమహర్షి నారదమహర్షికి వివరించడంతో వామనపురాణ కథ ప్రారంభమయ్యింది. తదనంతరం శరదృతువు రావడంతో శివుడు మందరపర్వతానికి ప్రయాణమైన విధం, దక్షయజ్ఞం (2వ అధ్యాయం), శంకరుడు తనకు సంప్రాప్తమైన బ్రహ్మహత్యా పాతకాన్ని తొలగించుకోవడానికి తీర్థయాత్రలు చేయడం, బదరికాశ్రమంలో నారాయణస్తుతి, వారాణసిలో బ్రహ్మహత్యాదోషంనుండి శంకరుడు విముక్తిపొంది కపాలి నామాన్ని పొందిన విధం (3వ అధ్యాయం), సతీదేవి దక్షయజ్ఞాన్నిగూర్చి తెలిసికొని, అచ్చటకువెళ్ళి ప్రాణత్యాగం చేయడం, దానితో శివుడు కోపంతో శివగణాలతో వెళ్ళి దక్షయజ్ఞధ్వంసం గావించడం (4వ అధ్యాయం), శంకరుని కాలరూప, రాశ్యాదిరూప, స్వరూపకథనం(5వ అధ్యాయం), నరనారాయణోత్పత్తి, బదరికాశ్రమంలో వసంతశోభ, కామదహనం, కామునకు అనంగత్వప్రాప్తి (6వ అధ్యాయం), ఊర్వశి ఉత్పత్తి, ప్రహ్లాద-నరనారాయణ సంవాదం, నారాయణునితో ప్రహ్లాదుని యుద్ధం, భక్తితో నారాయణుని ప్రహ్లాదుడు జయించడం (7,8, అధ్యాయాలు), అంధకాసురుని విజిగీష, దేవాసురుల వాహన వర్ణన, యుద్ధవర్ణన, అంధకుని విజయం (9,10 అధ్యాయాలు), సుకేశి కథ, మగధారణ్యంలోని ఋషులకు ధర్మోపదేశాలు, దేవాదుల ధర్మం, భువనకోశం, 21 విధాలైన నరకాల వివరణ (11వ అధ్యాయం), నరకకారణమైన కర్మలనుగూర్చి సుకేశి ఋషులకు వివరించడం (12వ అధ్యాయం), జంబూద్వీపంయొక్క స్థితి, అందులో ఉన్న పర్వతాలు, నదుల వర్ణన (13వ అధ్యాయం), దశాంగ ధర్మం, ఆశ్రమధర్మం, సదాచార స్వరూప వర్ణన (14వ అధ్యాయం), దైత్యుల ధర్మం, సుకేశి నగరోత్థాన పతనం, వరుణ అసి నదుల మాహాత్మ్యం, లోలార్క ప్రసంగం (15వ అధ్యాయం), దేవతావర్గం శయనించు తిథులు, అశూన్య శయనాది వ్రతాలు, శివపూజా వర్ణన (16వ అధ్యాయం), ఏయే దేవతా శరీరాలనుండి ఏయేవృక్షాలు ఉద్భవించాయో వర్ణన, అఖండ వ్రతవిధానం, విష్ణుపూజా విధానం, విష్ణుపంజర స్తోత్రం (17వ అధ్యాయం), మహిషాసురుని దురాచారాలు, సమస్త దేవతల తేజోరాశితో కాత్యాయనీదేవి ప్రాదుర్భావం, వింధ్య ప్రసంగం, దుర్గాదేవి అవతరించుట (18వ అధ్యాయం), చండముండులద్వారా కాత్యాయనీ సౌందర్యాన్నిగూర్చి మహిషుడు తెలిసికొనుట, మహిషాసురుని సందేశం, యుద్ధోపక్రమం (19వ అధ్యాయం), కాత్యాయనీదేవి దైత్యులతో యుద్ధం, మహిషాసురవధ, కాత్యాయనీదేవి శివపాదమూలంలో లీనమగుట (20వ అధ్యాయం), కురుక్షేత్రంలోని పృథూదకతీర్థ ప్రసంగం, సంవరణ తపతీ వివాహం (21వ అధ్యాయం), కురుక్షేత్ర నిర్మాణగాథ, కురుమహారాజు కథ, పృథూదకతీర్థ మాహాత్మ్యం (22వ అధ్యాయం), వామనచరిత్రకు ఉపక్రమించుట, బలి రాక్షసాధిపతిఅగుట, లక్ష్మీదేవి సమస్త ఐశ్వర్యములతో బలిచక్రవర్తిని చేరడం (23వ అధ్యాయం), బలిని జయించాడనికి ఉపాయం కొఱకు కశ్యపునితో కలసి దేవతలు బ్రహ్మలోకానికి వెళ్ళడం (24వ అధ్యాయం), బ్రహ్మ ఆదేశం మేరకు దేవతలందరు శ్వేతద్వీపంలో తపస్సుచేయడం (25వ అధ్యాయం), కశ్యపుడు

చేసిన నారాయణస్తుతి (26వ అధ్యాయం), అదితి గావించిన విష్ణుస్తోత్రం (27వ అధ్యాయం), విష్ణుభగవానుడు అదితికి వరప్రదానం (28వ అధ్యాయం), అదితి గర్భంలో విష్ణువు ప్రవేశించడంవలన దైత్యులు, దానవులు తేజోహీనమైన విషయాన్ని ప్రహ్లాదుడు బలికి తెలియజేయడం, ప్రహ్లాదుడు విష్ణువును స్తుతించడం (29వ అధ్యాయం), అదితి గర్భంనుండి వామనుడు అవతరించడం, బ్రహ్మగావించిన వామనస్తుతి, వామనుడు బలి యజ్ఞవాటికకు వెళ్ళడం (30వ అధ్యాయం), శుక్ర–బలి సంవాదం, వామనుడు బలినుండి మూడు అడుగుల నేలను దానంగా తీసికొని, త్రివిక్రముడై ముల్లోకాలను ఆక్రమించుట, బలిచక్రవర్తిని సుతల పాతాళానికి పంపుట (31వ అధ్యాయం), ప్లక్ష వృక్షంనుండి సముద్భవమైన సరస్వతీనది ద్వైతవనానికి చేరడం, మార్కండేయ మహాముని చేసిన సరస్వతీనదీస్తోత్రం (32వ అధ్యాయం), సరస్వతీనది కురుక్షేత్రంలో ప్రవేశించి, పశ్చిమదిశగా పయనించగా వేయి తీర్థాలు ఏర్పడడం, తీర్థస్నాన మహత్త్వ వర్ణన, కురుక్షేత్రంలోని సప్తవనాలు, నవనదులు, పవనకుండు, అమృతక్షేత్రం, కులోత్తారణతీర్థం, సప్తసారస్వత తీర్థం మొదలైన సమస్త తీర్థాల మాహాత్మ్య వర్ణన (33 నుండి 37 అధ్యాయాలు), మంకణ మహర్షి సిద్ధుడైన విధం (38వ అధ్యాయం), ఉశనస తీర్థం, పృథూదకతీర్థం, అవకీర్ణ తీర్థమాహాత్మ్యం (39వ అధ్యాయం), వసిష్ఠాపవాహతీర్థం ఉత్పత్తి, మాహాత్మ్యం (40వ అధ్యాయం), శతసాహస్రిక, శతక, రేణుక, ఋణమోచన, పంచవటి, కామ్యకవనాది తీర్థాల వర్ణన (41వ అధ్యాయం), సరస్వతీ నదీమహిమ, తత్సంబంధ తీర్థాల వర్ణన (42వ అధ్యాయం), స్థాణు తీర్థం, స్థాణు వటవృక్షం, సాన్నిహిత సరోవర సంబంధిత ప్రశ్నకు లోమహర్షణుని సమాధానం (43వ అధ్యాయం), స్థాణ్వీశ్వరుని గాథ, హస్తిరూప శంకరస్తుతి, లింగంలో సన్నిధానమగుట (44వ అధ్యాయం), సాన్నిహిత సరస్సు, స్థాణులింగ మాహాత్మ్య వర్ణన (45వ అధ్యాయం), స్థాణులింగం సమీపంలో అసంఖ్యాక లింగాల స్థాపన, దర్శన, అర్చనల మాహాత్మ్యం (46వ అధ్యాయం), వేనరాజు చరిత్ర, పృథుజన్మవృత్తాంతం, వేనుని శివస్తుతి, వేనాదుల సుగతి వర్ణన (47,48 అధ్యాయాలు), చతుర్ముఖోత్పత్తి కథ, బ్రహ్మకృత శివస్తుతి (49వ అధ్యాయం), అక్షయ తృతీయ మాహాత్మ్యం (50వ అధ్యాయం), మేనాదేవికి కుటిల, రాగిణి, ఉమ అనే ముగ్గురు కన్యలు జన్మించుట, శివునిద్వారా ఉమాదేవికి పరీక్ష, మందరాచల గమనం (51వ అధ్యాయం), ఉమను వివాహమాడుటకు శివుడు హిమవంతుని చెంతకు మహర్షులను పంపుట, హిమవంతుడు అంగీకరించుట (52వ అధ్యాయం), ఉమా శంకరుల కల్యాణం, వాలఖిల్యాదుల ఉత్పత్తి (53వ అధ్యాయం), శివభగవానుని కొరకు విశ్వకర్మ గృహం నిర్మించుట, కౌశికి స్థాపన, అగ్ని శివప్రాంగణంలో ప్రవేశించుట, గజాననుని ఉత్పత్తి (54వ అధ్యాయం), దేవి ద్వారా నముచి వధ, శుంభ నిశుంభ వృత్తాంతం, ధూమ్రలోచనుని వధ, చండముండులతో దేవియుద్ధం (55వ అధ్యాయం), చండికనుండి మాతృకల ఉత్పత్తి, అసురులతో యుద్ధం, రక్తబీజ, నిశుంభ, శుంభ వధ, దేవతలు గావించిన దేవీస్తుతి, భవిష్యత్తులో మీరు ప్రార్థించినవెంటనే అవతరించగలనని దేవతలకు దేవి వరదానం చేయుట (56వ అధ్యాయం), కార్తికేయుని జననం, షణ్ముఖుడైన విధం, సేనాపతియైన విధం; దేవగణం, మయూరం, శక్తి, దండాదులు పొందిన విధం (57వ అధ్యాయం), కార్తికేయుడు తారకాసురుని జయించడానికి బయలుదేరుట, పాతాలకేతు వృత్తాంతం, తారకాసుర, మహిషాసుర వధ (58వ అధ్యాయం), ఋతధ్వజుడు పాతాలకేతుపై ఆక్రమణ (59వ అధ్యాయం), తిరిగి తేజస్సు పొందడానికి

శివుడు తపస్సు చేయుట, మురాసుర ప్రస్తావన, సనత్కుమార ప్రస్తావన (60వ అధ్యాయం), పున్నామ నరకాదుల వర్ణన, పుత్రుడు, శిష్యుల విశిష్టత, 12 రకాల పుత్రుల వర్ణన, మురాసుర వధ (61వ అధ్యాయం), శివప్రీతికై అభిషేక, తప్త, కృచ్ఛ్ర వ్రతోపదేశం, హరిహర సంయోగంతో విష్ణుహృదయంలో శివుని నివాసం, శుక్రునకు సంజీవనీ విద్యాశిక్షణ, మంకణుని కథ, సప్తసారస్వత తీర్థమాహాత్మ్యం (62వ అధ్యాయం), దండోపాఖ్యానం, చిత్రాంగద, సురథుల ప్రేమ వృత్తాంతం (63వ అధ్యాయం), విశ్వకర్మ కపిరూపం పొందుట, వేదవతి మున్నగువారి ఉపాఖ్యానం, జాబాలి బంధమోచనం (64వ అధ్యాయం), చిత్రాంగద వృత్తాంతం, ఘృతాచి వృత్తాంతం, విశ్వకర్మ శాపవిముక్తి, ఇంద్రద్యుమ్నాదులు సప్తగోదావరులకు వచ్చుట (65వ అధ్యాయం), శుక్రుడు దండకుని శపించుట, ప్రహ్లాదుడు అంధకునికి హితోపదేశం (66వ అధ్యాయం), నంది సమస్తగణములను ఆహ్వానించుట, సమస్త గణములకు హరిహర ఏకత్వ ప్రతిపాదన తెలియజేసి, సదాశివ దర్శనం అనుగ్రహించుట (67వ అధ్యాయం), అంధకునితో యుద్ధం చేయడానికి శివుడు రుద్రగణంతో బయలుదేరుట, రుద్ర దానవగణాల యుద్ధం, తుహుండాది దైత్యుల వినాశం (68వ అధ్యాయం), శుక్రుడు సంజీవని ప్రయోగించుట, నంది దానవులతో యుద్ధం, శుక్రుని శివుడు ఉదరస్థం గావించుట, శుక్రకృత శివస్తుతి, విశ్వదర్శనం, ప్రమథగణాలు దైత్యులను జయించుట, శివుని వేషంలో అంధకుడు పార్వతిని పొందుటకు విఫల ప్రయత్నం, మాతలి జన్మవృత్తాంతం – సారథ్యం; జంభ, కుజంభుల వధ (69వ అధ్యాయం), శివుడు తన శూలంతో అంధకుని ఛేదించుట, భైరవాదులు ఉద్భవించుట, అంధకకృత భైరవస్తుతి, అంధకునకు భృంగిత్వ సిద్ధి, భృంగికృత పార్వతీస్తుతి (70వ అధ్యాయం), ఇంద్రుడు మలయపర్వతంపై అసురులతో యుద్ధం, ఇంద్రునకు పాకశాసన, గోత్రభిత్తు మున్నగు ప్రఖ్యాత నామాలు లభించడానికి కారణం, మరుత్తుల ఉత్పత్తి వృత్తాంతం (71వ అధ్యాయం), స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షుష, మన్వంతరముల ఉత్పత్తి వర్ణన (72వ అధ్యాయం), కాలనేమి వృత్తాంతం, విష్ణువు కాలనేమిని వధించిన విధం (73వ అధ్యాయం), బలి, బాణాసురులు దేవతలతో యుద్ధం చేయుట, బలివిజయం, ప్రహ్లాదుడు స్వర్గానికి వచ్చి బలిచక్రవర్తికి గావించిన హితోపదేశం (74వ అధ్యాయం), త్రైలోక్యలక్ష్మి బలిని చేరుట, శ్వేతలక్ష్మి మున్నగువారి ఉత్పత్తి, జయశ్రీ బలిచక్రవర్తిలో లీనమగుట, బలియొక్క సర్వసమృద్ధి వర్ణన (75వ అధ్యాయం), అదితి గావించిన సూర్యస్తుతి, అదితి తపస్సు, అదితి గావించిన వాసుదేవస్తుతి, వాసుదేవుడు అదితికి పుత్రునిగా జన్మిస్తానని ఓదార్చి, అదితిగర్భంలో ప్రవేశించుట (76వ అధ్యాయం), విష్ణువు అదితి గర్భంలో ప్రవేశించినట్లు తెలిసికొనిన బలిచక్రవర్తి విష్ణువునుగూర్చి దుర్వచనాలు పలుకుట, తత్కారణంగా ప్రహ్లాదుడు బలిని రాజ్య భ్రష్టుడగునట్లు శపించుట, బలి ప్రార్థనమేరకు ప్రహ్లాదుడు బలికి విష్ణు భక్తుడవు కమ్మని హితోపదేశం చేయుట (77వ అధ్యాయం), బలిని శపించిన పాపం పోగొట్టుకొనుటకు ప్రహ్లాదుడు తీర్థయాత్రలు ప్రారంభించుట, ధుంధువధకై విష్ణువు వామనునిగా అవతరించి త్రివిక్రముడైన విధం (78వ అధ్యాయం), పురూరవుడు చక్కని రూపం పొందిన విధం, శ్రవణద్వాదశీ వ్రతమాహాత్మ్యం (79వ అధ్యాయం), నక్షత్ర పురుష వర్ణన, నక్షత్ర పురుష వ్రతాచరణ విధానం, మహత్త్వం (80వ అధ్యాయం), ప్రహ్లాదుని తీర్థయాత్రా వర్ణన, జలోద్భవాఖ్యానం (81వ అధ్యాయం), శివునిద్వారా విష్ణుదేవునకు సుదర్శనచక్ర ప్రదానం, ఉపమన్యు, శ్రీదాముల వృత్తాంతం, వివిధ తీర్థాల మాహాత్మ్యం (83,84 అధ్యాయాలు), గజేంద్ర మోక్షణకథ (85వ అధ్యాయం), విష్ణుపంజర స్తోత్రం,

సారస్వత విష్ణుస్తోత్రం (86వ అధ్యాయం), మహేశ్వరుడు చెప్పిన పాపశమన స్తోత్రం (87వ అధ్యాయం), అగస్త్యునిచే కీర్తింపబడిన రెండవ పాపశమన స్తోత్రం (88వ అధ్యాయం), బలి యజ్ఞం చేయడానికి కురుక్షేత్రం చేరుట, వామనుని ఆవిర్భావం, బ్రహ్మకృత వామనస్తుతి, భరద్వాజుడు వామనునకు బ్రహ్మచర్యదీక్షను ఇచ్చుట, వేదాధ్యయనం చేయించుట, శ్రీమహావిష్ణువు ఏయే పుణ్యప్రదేశాలలో బహురూపియై నివాసముంటాడో భరద్వాజునకు వివరించుట, వామనుడు కురుజాంగలానికి ప్రయాణమగుట (89,90 అధ్యాయాలు), వామనుని రాకతో భూమి క్షుభితమగుట, బలిశుక్రుల సంవాదం, కోశకారపుత్రుని వృత్తాంతం (91వ అధ్యాయం), బలి బంధనం (92వ అధ్యాయం), బ్రహ్మకృత విశ్వరూప స్తోత్రం (93వ అధ్యాయం), బలికృత సుదర్శనచక్ర స్తోత్రం, ప్రహ్లాదుడు బలితోబాటు సంసారకూపంలో పడినవారికందరికి హితం కలిగించే నారాయణభక్తిమాహాత్మ్యాన్ని బోధించుట (94వ అధ్యాయం), విష్ణుప్రీతికరమైన పుష్పాలు, పత్రాలు, దానాలు వివరించుట; వృద్ధుల వాక్యాలు ఎందులకు అనుసరణీయమో వివరించుట, ఫలశ్రుతి (95వ అధ్యాయం). ఇవే వామనపురాణంలో వర్ణింపబడిన కథాంశాలు. ఇందులో అత్యధికభాగం శ్లోకాలరూపమేగాని అక్కడక్కడ కొన్ని సందర్భాలలో గద్యభాగాలుకూడా చోటుచేసికొన్నాయి. మొత్తం ఈ పురాణంలోని శ్లోకాల, గద్యాల సంఖ్య 5,831.

వామనపురాణంలోని కథాంశాలనన్నిటినీ పరిశీలించగా శివలీలాచరిత్రతో ప్రారంభం కావడం, అనేక శైవగాథలు వర్ణింపబడడం, శాక్తేయ గాథలు వర్ణింపబడడం మనం గమనించవలసిన ప్రత్యేకాంశం. అంతేగాక ఈ పురాణంలో ప్రధాన ఇతివృత్తమైన వామనచరిత్ర 23వ అధ్యాయం వరకు ప్రారంభింపకపోవడం మనం గమనించవలసియుంది. స్కాందంలోని శివరహస్యఖండంలోని సంభవకాండలో పురాణాల వర్గీకరణసందర్భంగా పదిపురాణాలను శివవిషయకములైన శైవపురాణాలుగా పేర్కొనడం జరిగింది. అవి 1. శివపురాణం, 2. భవిష్యపురాణం, 3. మార్కండేయపురాణం, 4. లింగపురాణం, 5. వరాహపురాణం, 6. స్కందపురాణం, 7. మత్స్యపురాణం, 8. కూర్మపురాణం, 9. **'వామన'పురాణం**, 10. బ్రహ్మాండపురాణం. ఇట్లు వామనపురాణం శైవపురాణంగా కీర్తింపబడింది. అట్లే పద్మపురాణంలో రాజసపురాణంగా పేర్కొనబడింది. దీనికి కారణం ఈ పురాణంలో వామనావతారగాథతో సమానమైన ప్రాధాన్యతనిచ్చి శైవగాథలు కూడ అధికంగా వర్ణింపబడడమే. అంతేగాక

శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే ।
శివస్య హృదయగ్ం విష్ణుర్విష్ణోశ్చ హృదయగ్ం శివః ॥

అనే వేదోక్తిని సాకారం చేసిన సదాశివమూర్తి సాక్షాత్కారవర్ణన ఈ పురాణంలో చోటు చేసుకోవడం కూడా కారణం కావచ్చును.

సదాశివమూర్తి సాక్షాత్కారవర్ణన

శంకరుడు అంధకాసురునితో యుద్ధంచేసే సందర్భంలో ఒకనాడు నందిని పిలిచి, 'నీ ఏలుబడిలోనున్న అన్ని గణాలవారిని వెంటనే పిలిపింపు' మని శంకరుడు ఆదేశించాడు. నంది శివగణాల నాయకులనందరిని స్మరించాడు. వెంటనే వేలాది సంఖ్యలో శైవగణ నాయకులు దేవదేవుని చెంతకు చేరుకున్నారు. ఆవిధంగా వచ్చిన

త్రినేత్రులు, జటాధరులు, శాఖులు, కుమారులు, పాశుపతులు, కాలముఖులు, మహాపాశుపతులు మున్నగు అన్నిగణాలవారిని నంది మహేశ్వరునకు పరిచయం చేశాడు. శివభగవానుడు వారినందరిని చేతితో సైగచేసి, కూర్చుండజేశాడు. కాని మహాపాశుపతులనుచూచి, స్వయంగా లేచివెళ్ళి, వారిని కౌగిలించుకుని, మిక్కిలి ఆదరంతో గౌరవించాడు. మహేశ్వరుని ఈ అద్భుత ప్రవర్తననుచూసి, ఆశ్చర్యపడి, నందీశ్వరాదులు "ఓదేవా! మీరు మహాపాశు పతులను మాత్రమే కౌగిలించుకుని గౌరవించడానికి కారణం తెలియజేయవలసినదని" మహేశ్వరుని ప్రార్థించారు. అంతట రుద్రుడు వారికిలా జవాబిచ్చాడు.

"మీరందరు భక్తిభావంతో హరుని పూజించినప్పటికి అహంకార విమూఢులై విష్ణునింద చేస్తున్నారు. మీలోని ఈ అజ్ఞానం వల్ల నేను మిమ్ములను నిరాకరించడం జరిగింది. నేను భగవంతుడనగు విష్ణువునే. విష్ణువు అవ్యయుడనైన నా స్వరూపమే. మాకు భేదం లేదు. ఒకే తత్త్వం రెండు రూపాలలో ఉన్నది. ఈ రహస్యమును తెలిసికొనలేని మీవంటి మూర్ఖులైన భక్తుల కారణంగా నేను నిందలకు గురియగుచున్నాను". అని శివగణాలకు శివభగవానుడు జవాబిచ్చాడు.

అంతట శివగణాలు "ప్రభూ! మీరు జనార్దనుడు ఒక్కటే ఎలా కాగలరు? మీరు నిర్మల, శుద్ధ, శాంత, శుక్ల నిరంజన స్వరూపులు. తెల్లని దేహకాంతి గలవారు. విష్ణువు కాలాంజనసన్నిభుడు కదా! నీలమేఘశ్యాముడు కదా!" అని శివుని ప్రశ్నించారు. "విష్ణువు సర్వవ్యాపియైన శర్వుడే. సర్వగణాధిపుడు ఆయనయే. శ్వేత, (తెలుపు) పీత (పసుపు), రక్త (ఎరుపు), కృష్ణ (నలుపు) వర్ణాలు కలవాడు కూడా ఆయనయే. ఆయనను మించిన ప్రభువు, ధర్మము, లోకంలో మరియొకటి లేదు. ఆయన సర్వపూజ్యుడు, భగవంతుడునగు సదాశివుడే. సాత్త్విక, రాజస, తామస, మిశ్రమ గుణాశ్రయుడూ ఆయనయే. సర్వరూపుడూ ఆయనయే". అని స్పష్టంగా బోధించడమేగాక శంకరుడు ఏకముఖంతో శరీరంనిండా వేలాది శైవ వైష్ణవ చిహ్నాలతో కూడిన సదాశివ తత్త్వాన్ని, రూపాన్ని, శివగణాలకు కనులముందు సాక్షాత్కరింప జేశాడు.

హరుని విగ్రహంలో సగభాగం విష్ణువు, సగభాగం శివుడు. గరుడధ్వజం ధరించి, వృషభారూఢుడై ఒకమారు, వృషభధ్వజం ధరించి, గరుడవాహనుడై ఒకమారు, హరిహరనాథమూర్తిగా దర్శనమిచ్చాడు. అంతలో బహురూపిగా, ఏకరూపిగా, ద్విరూపిగా, రూపరహితునిగా దర్శనమిచ్చాడు. క్షణకాలం తెల్లగాను, క్షణం ఎరుపుగాను, క్షణం పచ్చగాను, క్షణం నల్లగాను మారుతు, వివిధ వర్ణాలలో దర్శనమిచ్చాడు. క్షణంలో శంభుడయ్యాడు. క్షణంలో ప్రభాకరుడయ్యాడు. క్షణంలో ఇంద్రుడయ్యాడు. అర్ధక్షణంలో శంకరుడు విష్ణువుగాను, క్షణంలో శంకరుడు పితామహుడుగాను దర్శనమిచ్చాడు. ఈవిధంగా సర్వ దేవతా స్వరూపుడుగా, నిరాకారుడుగా, త్రిగుణాత్మకుడుగా, గుణాతీతుడుగా, సర్వవర్ణమయుడుగా, వర్ణరహితుడుగా, నిరాకారుడుగా, సాకారుడుగా, ప్రవర్తిల్లే పరబ్రహ్మయైన సదాశివమూర్తి సాక్షాత్కారంతో శివగణాలయొక్క సమస్త పాపాలు తొలగిపోయాయి. వారిలో శివకేశవ భేదదృష్టి నశించి, **"ఏకం సత్"** అనే బ్రహ్మజ్ఞానం కలిగింది. (వామ.పురా.67అధ్యాయం) ఈవిధమైన సదాశివ సాక్షాత్కార వర్ణనద్వారా వామన పురాణం సమాజంలోని శైవ వైష్ణవ వైషమ్యాలను తొలగించడానికి ఎంతో దోహద పడుతోంది. ఈ పురాణం పరబ్రహ్మ తత్త్వాన్ని, రూపాన్ని, పండిత పామరులకందరికి కనులముందు ప్రత్యక్షం గావించింది.

దీనివలన వేద పురాణేతిహాసాల సారమునంతటిని ప్రతిపాదించి, వ్యక్తీకరించి, లోకంలో సర్వమత సామరస్యాన్ని పెంపొందిచే పురాణశ్రేష్ఠం వామనమని నిస్సంశయంగా చెప్పవచ్చును. వ్యాసభగవానుడు సాక్షాత్కరింపజేసిన ఈ హరిహరనాథమూర్తినే తిక్కనసోమయాజి ఉపాసించి యుండవచ్చునని కూడా భావింపవచ్చును.

శూలపాణియైన శ్రీమహావిష్ణువు, చక్రధరుడైన శంకరుడు కలసి దేవాసురుల సొంత ఆయుధాలచేత అవధ్యుడైన జలోద్భవుని సంహరించిన వృత్తాంతము, వీరిరువురు మధునందిని తీర్థంలో కొలువై భక్తులను అనుగ్రహిస్తున్న విధానం కూడా ఈ పురాణంలో వర్ణింపబడ్డాయి ఈ వర్ణన వలన హరిహరాభేద సిద్ధాంతం మరింత స్పష్టంగా వామన పురాణం ప్రబోధిస్తున్నట్లు స్పష్టమౌతోంది.

వామనపురాణంలో పేర్కొనబడిన వామనావతారగాథ వేదమూలకమని చెప్పవచ్చు. ఎందువల్లననగా వేదాలలో వామనరూపవిష్ణువు యొక్క ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తోంది. ఋగ్వేదంలోని ఉరుగాయ త్రివిక్రముని గాథ, శతపథంలోని రాక్షసులనుండి దేవతలు భూమిని లాగుకొనిన వృత్తాంతం కలిసి వామనపురాణంలోని వామన చరిత్రగా రూపొందింది. కాని భూమిని దేవతలు అసురులనుండి లాగుకొనినట్లు శతపథ బ్రాహ్మణంలో వర్ణింపబడగా వామనపురాణంలో మాత్రం విష్ణువు అదితి గర్భంలో వామనుడుగా అవతరించి, అసురరాజైన బలిచక్రవర్తినుండి లాగుకొనినట్లు వర్ణింపబడింది. అంతేగాక శతపథంలో యజ్ఞవ్యాప్తిద్వారా భూమిని దేవతలు ఆక్రమించడం జరిగితే పురాణంలో వామనుడు బలిచక్రవర్తిని, యజ్ఞ సమయంలో మూడడుగుల నేలను యాచించి, త్రివిక్రముడై, ఒక అడుగులో భూమినంతటిని కొలవడం ద్వారా, బలినుండి భూమిని లాగుకోవడం జరిగినట్లు వర్ణింపబడింది. మహాభాగవతంలోని వామనచరిత్రలోనూ, వ్యాసునిచే చెప్పబడిన ఇతర పురాణలలోనూ, వామన చరిత్ర ఈ విధంగానే కనబడుతోంది.

బలిచక్రవర్తి యజ్ఞంచేసిన స్థలం మాత్రం ఒక్కొక్క పురాణంలో ఒక్కొక్క క్షేత్రంగా వర్ణింపబడింది. పద్మ పురాణంలోని బలి పుష్కరతీర్థంలోను, అగ్నిపురాణంలోని బలి గంగానదీ ద్వారమైన హరిద్వార్‌లోను, స్కంధపురాణంలోని బలి ప్రభాసక్షేత్రంలోను, మహాభాగవతంలోని బలి నర్మదానదీతీరంలోను యజ్ఞంనిర్వహించినట్లు వర్ణింపబడింది. కాని వామన పురాణంలో బలిచక్రవర్తి యజ్ఞంచేసినదీ, వామనుడైన విష్ణువు బలిని మోసగించినదీ కురుక్షేత్రంలోనే. అందువల్లనే ఈ పురాణంలో కురుక్షేత్రం ధర్మక్షేత్రమైన విధమూ, కురుక్షేత్రంలో వేయితీర్థాలు ఏర్పడినవిధం సప్తవనాలు, నవనదులు, సప్త సారస్వత తీర్థం మొదలైన అనేక తీర్థాల మాహాత్మ్యవర్ణన చాలా విస్తృతంగా సుమారు 14 అధ్యాయాలలో (33వ అధ్యాయం నుండి 46వ అధ్యాయం వరకు) వర్ణింపబడింది.

విశేషాంశాలు

వామన పురాణంలో ఇతరపురాణాలలో కనబడని నూతనాంశాలు, విశేషాంశాలు కోకొల్లలుగా ఉన్నాయి. శివుని ఆభరణాలుగానున్న సర్పాలపేర్లు, శివుని కాలస్వరూప, రాశిస్వరూప వర్ణన, నరనారాయణులతో ప్రహ్లాదుని యుద్ధం, దేవాసురుల వాహనాలపేర్లు, దేవాదుల యొక్క 12విధాలైన ధర్మాలు, కురురాజు కురుక్షేత్రాన్ని నిర్మించిన విధం, సుకేశి వృత్తాంతం, సనత్కుమారునికి బ్రహ్మచేసిన ద్వాదశ పత్రక యోగోపదేశం, ప్రహ్లాదుని తీర్థయాత్రావర్ణన,

వామనుని వివిధ దేవతారూపాలు, స్థానాలు మొదలైనవి ఈ పురాణంలోని విశేషాంశాలలో కొన్నిమాత్రమే. వామనపురాణంలో వర్ణింపబడిన వేరొక వామనావతార గాథ మిక్కిలి ప్రత్యేకమైన విశేషాంశం.

వేరొక వామన చరిత్ర

అది హిరణ్యకశిపుడు జీవించినకాలం. ఆకాలంలో కశ్యపుని వారసుడైన దనువుకు ధుంధుడనేవాడు జన్మించాడు. వాడు మహాబలపరాక్రమ సంపన్నుడు. ఈ ధుంధుని ఆశ్రయించియే హిరణ్యకశిపుడు లోకాలను బాధించేవాడు. ఈ ధుంధుడు బ్రహ్మనుగూర్చి ఘోరమైన తపస్సుచేశాడు. బ్రహ్మను మెప్పించి, ఇంద్రాది సమస్త దేవతలచేత మరణం లేకుండా వరం పొందాడు. దానితో ధుంధుడు స్వర్గంమీదకు దండెత్తి, ఇంద్రాది దేవతలను పారద్రోలి స్వర్గాన్ని ఆక్రమించాడు. దానితో దేవతలందరు దుఃఖంతో బ్రహ్మలోకం చేరారు. దేవతలు బ్రహ్మలోకంలో ఉన్నారని విని, ధుంధుడు బ్రహ్మలోకానికి వెళ్ళాలని సంకల్పించాడు. కాని మనకు అటువంటి శక్తి లేదని. దైత్యులు అతనికి హితం పలికారు. కాని ధుంధుడు బ్రహ్మలోకానికి వెళ్ళి, దేవతలను జయించాలని పట్టుబట్టాడు. ఎటువంటి కర్మలు చేయడం ద్వారా బ్రహ్మలోకం చేరగలమో తెలియజేయవలసిందని దైత్యులను ధుంధుడు కోరాడు. వారందరు శుక్రాచార్యుడు మాత్రమే తెలియజేయగలడని అతనితో చెప్పారు. ధుంధుడు శుక్రాచార్యుని పిలిపించి, అతనిని బ్రహ్మలోకం చేరగల మార్గాన్ని తెలియజేయవలసిందని ప్రార్థించాడు. అంతట శుక్రాచార్యుడు పూర్వకాలంలో వృత్రాసురుని శత్రువైన ఇంద్రుడు నూరు అశ్వమేధాలు చేసినందున బ్రహ్మలోకానికి వెళ్ళగలిగాడని తెలియజేశాడు. దానితో ధుంధుడు నూరు అశ్వమేధయాగాలు చేయడానికి నిశ్చయించుకున్నాడు. యజ్ఞసంబారాలనన్నిటిని సమకూర్చుకుని, పాపనాశనకరమైన దేవికానదీ తూర్పుతీరాన అశ్వమేధయాగదీక్షను స్వీకరించాడు. యజ్ఞానంతరం యజ్ఞాశ్వం కూడా విడువబడింది. ఆమహాయజ్ఞగుండంనుండి వెలువడిన యజ్ఞధూమంయొక్క వాసనలు బ్రహ్మలోకానికి చేరాయి. దానితో భయభ్రాంతులైన ఇంద్రాది దేవతలు జనార్దనుని శరణుపొంది, ధుంధునినుండి రక్షింపుమని ప్రార్థించారు. శ్రీహరి ధుంధుడు అజేయుడని తెలిసికొని ధర్మనిష్ఠితుడైన అతనిని మాయోపాయంతో బంధించాలని సంకల్పించాడు. తానొక వామన బ్రాహ్మణకుమారుని రూపం ధరించి, దేవికా నదీజలాలలో పడి, మునుగుతూ, తేలుతు కొట్టుకుపోసాగాడు. ఆవిధంగా కొట్టుకుపోతున్న ఆ వామనవటువును యజ్ఞశాలలోని బ్రాహ్మణులు, సదస్యులు చూచి, బయటకుతీశారు. "నీవెవరవు?, ఎందులకీ నదీ ప్రవాహంలో కొట్టుకొని పోతున్నావు?" అని వామనవటువును అడిగారు. అతడు ఇలా జవాబిచ్చాడు. "ఓ దైత్యరాజా! సర్వశాస్త్ర పారంగతుడైన ప్రభాసుడనే బ్రాహ్మణునకు ఇరువురు కుమారులము. పెద్దవాడు నేత్రభాసుడు, చిన్నవాడనైన నేను గతిభాసుడను. మా తండ్రిగారు బంధువులతో కలసి ఒక చక్కని గృహంలో నివాసముండేవారు. మాతండ్రిగారు మరణించిన పిమ్మట అంతిమ సంస్కారాలు యథావిధిగా పూర్తిచేశాము ఆ తరువాత నేను మన తండ్రిగారు వదలిన ఇంటిని మనమిరువురము పంచుకుందామని మా అన్నగారిని ప్రార్థించాను.

కుబ్జుడు, వామనుడు, కుంటివాడు, నపుంసకుడు, కుష్ఠువాడు, పిచ్చివాడు, గ్రుడ్డివాడు, ఆస్తిలో భాగానికి అధికారానికి అర్హులుగారు. నీవు వామనుడవు, మందబుద్ధివి. కావున బ్రతికినంతకాలం తిండితింటూ, ఇంటిలో ఉండడమే కాని నీకు అర్ధభాగం పొందడానికి అర్హత లేదని నా సోదరుడు నాతో పలికాడు. నాకు అర్ధభాగం

వస్తుందని నేను వాదించగా నా సోదరుడు కోపంతో అశక్తుడనైన నన్ను ఈ నదీజలాలలో పడవేశాడు. ఈ నదిలో కొట్టుకుపోతున్న నన్ను మీరే రక్షించారు.” అని ఆ బ్రాహ్మణకుమారుడు తెలియజేశాడు. నన్ను కాపాడిన మీరెవరో తెలియజేయండని వారిని ప్రార్థించాడు. అంతట ఋత్విజులు మేమందరము బ్రాహ్మణులమనియు, యజ్ఞదీక్షలోనున్న ఆ మహాతేజస్వి ధుంధుడనే రాక్షస చక్రవర్తి యనియు, వామనునకు తెలియజేశారు. అంతట ధుంధుడు వామన వటువుతో ఓ బ్రాహ్మణోత్తమా! గృహం, బంగారం, ఏనుగులు, గుఱ్ఱాలు మొదలైనవి నీకు ఏవి కావాలో కోరుకోవలసిందని చెప్పాడు. అంతట భగవంతుడైన వామనుడు నాసోదరుడు అపహరించిన గృహభాగాన్నికూడా కాపాడుకోలేని అసమర్థుడనైన నాకు దాసదాసీలు, రత్నాలు, గృహాలు అవసరం లేదు. నా శరీరప్రమాణానికి అనుగుణంగా మూడడుగుల నేలనుమాత్రం ఈయవలసినదని కోరాడు. అంతకుమించి నేను రక్షించుకొనజాలనని, తెలియజేశాడు. దానితో అచ్చటివారందరు నవ్వుకొనగా ధుంధుడు మూడడుగుల నేలను వామనునికి దానంచేశాడు. దానాన్ని తీసికొనిన వెంటనే వామనుడు త్రివిక్రముడై, మొదటి అడుగుతో భూమండలమునంతటిని ఆక్రమించాడు. రెండవ అడుగుతో స్వర్గసహితమైన భువర్లోకమును, సూర్యచంద్రగ్రహనక్షత్ర మండలములతో నిండిన ఆకాశాన్ని నింపివేశాడు. మూడవ అడుగునకు చోటులేకపోవడంతో భగవంతుడైన త్రివిక్రముడు మిక్కిలి కోపంతో ధుంధుని వీపుమీద పడ్డాడు. దానితో ఆ ప్రదేశంలో 30,000 యోజనాలమేర బ్రహ్మాండమైన గోయి ఏర్పడింది. అంతట త్రివిక్రముడు ధుంధుని దేహాన్ని చీల్చి, ఆ గోతిలోనికి విసరివేసి, బ్రహ్మాండమైన ఇసుకవర్షంతో ఆ గోతిని పూడ్చివేశాడు. త్రివిక్రముడైన ఆ వామనుని ప్రసాదంవల్ల ఇంద్రుడు తాను కోల్పోయిన స్వర్గాధిపత్యాన్ని మరల పొందాడు. ఇసుకతో ధుంధుని పూడ్చిన ప్రదేశాన్ని భగవానుడైన నారాయణుడు కాళిందీ నదీ రూపంగా మార్చి అంతర్ధానమయ్యాడు. ఈవిధంగా శ్రీమహావిష్ణువు దశావతారాలలో ఒకటిగా ప్రఖ్యాతమై, బలిని అనుగ్రహించిన వామనావతారానికి ముందుకాలంలోనే ధుంధురాక్షసుని జయించడానికి శ్రీమహావిష్ణువు మరో వామనుడైన చరిత్ర ఈ వామన పురాణంలో వర్ణింపబడడం ప్రత్యేకాంశం.

యమునా నదీతీరంలోని ఈ త్రివిక్రముని, ప్రహ్లాదుడు తన తీర్థయాత్రలలో భాగంగా దర్శించినట్లు కూడా ఈ పురాణంలో వర్ణింపబడింది.

సంపూర్ణతీర్థ యాత్రాదర్శిని

బలి, బలగర్వంతో శ్రీమహావిష్ణువును ఆక్షేపించిన సందర్భంలో ప్రహ్లాదుడు మిక్కిలి దుఃఖించాడు. “నీవంటి క్రూరుడు, విష్ణువును నిందించేవాడు రాక్షసులకు రాజుగా ఉండడం దానవవంశదౌర్భాగ్యం, జగత్పూజ్యుడైన హరిని నీవు నిందించావు. నీవు చేసిన ఈ పాపకర్మవల్ల నీవు రాజ్యభ్రష్టుడవౌతావు” అని బలిని ప్రహ్లాదుడు శపించాడు. అంతట బలి ప్రహ్లాదుని క్షమాపణ కోరాడు. దానితో ప్రహ్లాదుడు ప్రసన్నుడయ్యాడు. క్షణికమైన మోహం నా వివేకాన్ని మరుగున పడవేసింది. విష్ణువు సర్వాంతర్యామి యనే సత్యం తెలిసికూడా బలిని శపించానని ప్రహ్లాదుడు విచారించాడు. విష్ణుభక్తుడవు కమ్మని బలికి హితోపదేశం చేశాడు. బలిని శపించిన పాపం పోగొట్టుకోవడానికి, మేరు పర్వతం నుండి ప్రహ్లాదుడు తీర్థయాత్రలకు బయలుదేరాడు. శ్రీహరి మత్స్యావతారం ధరించిన మానసతీర్థాన్ని, అక్కడనుండి కూర్మావతారక్షేత్రమైన కౌశికీ నదీతీరానికి, అటునుండి హయముఖతీర్థానికి

వెళ్ళాడు. అదే క్రమంలో ప్రహ్లాదుడు సమస్తతీర్థాలను దర్శించాడు. ఆయా తీర్థాలలో స్నానాలు చేసి, దేవతలకు, పితృదేవతలకు, ఋషులకు తర్పణాలిచ్చాడు. ఆయా తీర్థాలలో కొలువైన ఆయా దేవతా మూర్తులను సేవించాడు. ప్రహ్లాదుడు సేవించిన ఆయా తీర్థాలు, ఆయా తీర్థమాహాత్మ్యగాథలు సుదీర్ఘంగా, చాలా విస్తారంగా, ఈ పురాణంలో 78వ అధ్యాయం నుండి 84వ అధ్యాయం వరకు వర్ణింపబడ్డాయి.

అంతేగాక అనేక తీర్థాల, క్షేత్రాల విశేషాలు సరోమాహాత్మ్యమనే పేరుతో సుమారు 28 అధ్యాయాలలో అతివిస్తారంగా, ఈ పురాణంలో మాత్రమే, కనబడుతున్నాయి. ఈ విధంగా ఆసేతుహిమాచల పర్యంతంగల సమస్త తీర్థమాహాత్మ్యవర్ణనలు అనేక సందర్భాలలో వామనపురాణంలో కనబడడం చేత దీనిని సంపూర్ణ తీర్థయాత్రాదర్శినిగా పేర్కొనవచ్చు. అంతేగాక నిజమైన నదీస్నానం అంటే ఏమిటో ఈ పురాణం ఇలా తెలియజేస్తోంది.

"సంయమనమనే పవిత్ర తీర్థాలతో సత్యం, శీలం, శమం (ఇంద్రియనిగ్రహం) మున్నగు పవిత్ర జలాలతో శోభిల్లే ఆత్మయే పవిత్రమైన నది. ఆ నదిలో స్నానంచేసినవాడు పుణ్యుడు, పవిత్రుడు కాగలడు. అంతేగాని పుణ్యతీర్థాలలోని సామాన్య జలాల వలన పాంచభౌతికమైన శరీరశుద్ధి కలుగునే గాని, అంతరాత్మకు శుద్ధి సిద్ధింపదు. ఆత్మజ్ఞాన సుఖంలో నిమగ్నమై యుండడమే నిజమైన నదీస్నానం. మానవుని ప్రధాన కర్తవ్యం. తెలిసికొనవలసినది కూడా అదియే. దానిని పొందినవారు అనగా ఆత్మజ్ఞానంలో మునకలు వేసినవారు సమస్తమైన కోరికలను వదలివేస్తారు.

సర్వ సమానత్వ భావనలు, ఐకమత్యం, మంచి నడవడిక, అహింసను పాటించడం, కోపాన్ని వదలడం అనే గుణాలే నిజమైన ధనం. దీనితో సమానమైన సంపద మరొకటిలేదు. ఆత్మజ్ఞానంలో స్నానమాచరించినవానికి ఇట్టి సంపద తప్పక లభిస్తుంది. దీనిని తెలిసికొనినచో నిస్సందేహంగా పరబ్రహ్మను పొందగలరు. ఇందులో ఎట్టి సందేహం లేదు". తీర్థస్నానవిధినిగూర్చి, బ్రహ్మతత్త్వాన్నిగూర్చి, బ్రహ్మానందాన్ని పొందేమార్గాన్నిగూర్చి వామనపురాణం స్పష్టంగా తెలియజేసిన మార్గమిది.

వ్రతరత్నాకరం

వామనపురాణంలో అశూన్య శయన ద్వితీయ వ్రతం, కాలాష్టమీ వ్రతం (16వ అధ్యాయం), విష్ణు శయన వ్రతం, శివశయన వ్రతం, అర్థార్థులైనవారికి నిర్ణయింపబడిన ప్రత్యేక వ్రతం (17వ అధ్యాయం), శ్రవణ ద్వాదశీవ్రతం (79వ అధ్యాయం) మున్నగు అనేక వ్రతాలు వర్ణింపబడ్డాయి. అంతేగాక తక్కిన పురాణాలలో ఎక్కడా కనబడనట్టియూ, పూర్వకాలంలో భృగు మహర్షిచే చెప్పబడినట్టియు, సమస్తపాపములనుపోగొట్టునట్టియు, **"నక్షత్ర పురుషవ్రతం"** (80 అధ్యాయంలో చెప్పబడింది) ఇందులో వర్ణింపబడడం విశేషం. జగన్నాథుని అంగోపాంగాలను ఈ వ్రతాచరణద్వారా సేవించినవారియొక్క సర్వాంగాలు సుందరంగా, చూడముచ్చటగా రూపొందుతాయనియు, గత ఏడు జన్మలలో చేసిన పాపములు, కులక్రమాగతంగా వచ్చిన దోషములు, తల్లిదండ్రులు చేసిన పాపసమూహము కూడా కేశవుడు నశింపజేస్తాడనియు ఈ వ్రతఫలంలో పేర్కొనబడింది. అంతేగాక ఈ వ్రతాచరణ వలననే అరుంధతీదేవి స్త్రీలోకానికి పూజ్యురాలైనదనియు, సూర్యభగవానుడు గోవిందుని కుమారునిగా

(రేవంతుడుగా) పొందినాడనియు, రంభ రూపసౌందర్యమును, మేనక వాఙ్మాధుర్యమును, చంద్రుడు చల్లని కాంతిని, పురూరవుడు రాజ్యాన్ని పొందినట్లుగాకూడా ఈ వ్రతమాహాత్మ్యం తెలియజేయడం వలన ఇది సర్వోత్కృష్టమైన వ్రతమని స్పష్టమౌతోంది.

సర్వదేవతాస్తోత్రరత్నాకరం

సుప్రభాతం :

శో॥ బ్రహ్మా మురారిస్త్రిపురాన్తకారీ భానుః శశీ భూమిసుతో బుధశ్చ ।
గురుశ్చ శుక్రః సహభానుజేన కుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥

– వామ.పురా. 14అ. 23 నుండి 27 శ్లో॥

ఇత్యాదిగా 5 శ్లోకాలలో శంకరభగవానునిచే చెప్పబడిన సుప్రభాత స్తోత్రాన్ని విధిగా పఠించాలని వామనపురాణం తెలియజేస్తోంది. ఈ సుప్రభాత స్తోత్రాన్ని భక్తితో పఠించినా, వినినా, స్మరించినా గతరాత్రి సంభవించిన దుస్స్వప్న దోషాలు తొలగిపోవడమేగాక, సమస్తపాపాలనుండి విముక్తి లభించి, సమస్త శుభాలు పొందుతారనడం లో ఎట్టి సందేహము లేదు. ఇటువంటి సుప్రభాత స్తోత్రం వామన పురాణంలో మాత్రమే చోటుచేసుకోవడం విశేషం.

విష్ణుపంజరస్తోత్రం :

విష్ణుపంజరస్తోత్రం సుమారు 13 శ్లోకాలలో వర్ణింపబడింది. ఈ స్తోత్రం పూర్వకాలంలో శివుడు సర్వరక్షార్థం కాత్యాయనీ దేవికి తెలియజేశాడు. దీని ప్రభావం వలన సురకంటకులైన మహిషాసురుడు, రక్తబీజుడు మున్నగు ఎందరో దానవ వీరులను కాత్యాయనీదేవి సంహరింపగలిగింది. సమస్త పీడలనుండి మానవులందరినీ రక్షించే ఈ స్తోత్రం వామన పురాణంలో ఉండడం వల్ల భక్తజనావళికి రక్షాకవచంగా ఈ పురాణం వెలుగొందుతోందని భావించవచ్చు.

వేదోక్త విధానంగా కశ్యపుడు చేసిన విష్ణుస్తోత్రంద్వారా పురుషోత్తముడు ప్రసన్నుడై దేవతల కోరిక తీర్చడానికి సముద్యుక్తుడయ్యాడు. అదేవిధంగా సుమారు 20 శ్లోకాలలో అదితి స్తోత్రరూపంలో నారాయణ వైభవాన్ని కీర్తించింది. "ప్రభూ!, జనార్దనా! నేను చెప్పినదంతయు సత్యమైతే అట్టి సత్యప్రభావం వలన నా మనోరథాలన్నీ సఫలమౌగాక!" అని శ్రీమన్నారాయణుని ప్రార్థించింది. జనార్దనుని వామనునిగా ప్రసవించి, తన కోరికను సఫలం చేసుకున్నది. దీనినిబట్టి శ్రీమన్నారాయణుని ప్రసన్నుని గావించుకొని, తమ కొరికలు నెరవేర్చుకోవడానికి భక్తులందరూ ఈ రెండు విష్ణు స్తోత్రాలు తప్పక పఠించదగినవని చెప్పవచ్చు.

స్తోత్ర చతుష్టయం :

విష్ణుభక్తిపరుడైన ప్రహ్లాదుడు శ్రద్ధగా ప్రతినిత్యం జపించి, ముక్తిని పొందిన నాలుగు విష్ణు స్తోత్రాలను గురించి, వివరించవలసినదిగా నారదుడు పులస్త్య మహర్షిని ప్రశ్నించగా ముందుగా **గజేంద్ర మోక్షణ గాథను**

వివరిస్తూ గజేంద్రుడు ఆర్తితో తన బంధవిముక్తికి దీన హీన స్వరంతో "ఓ అభయప్రదా!, సుబ్రహ్మణ్యా! వేదపారంగతులైనవారు, మహర్షులు, పరతత్త్వంగాను, బ్రహ్మాదులందరికి ఆధారభూతునిగాను కొనియాడబడుచున్నట్టియు, పుండరీకాక్షుడవైనట్టియు నీకు నమస్కారం. శరణాగతుడనైన నన్ను రక్షించి, బంధవిముక్తుని గావింపుమని శ్రీహరిని స్తోత్రం గావించాడు.॥ (వామనపురాణం 85వ అధ్యాయం 31 నుండి 59 వరకు). ఈస్తోత్రం మురారి స్తోత్రాలలో శ్రేష్ఠమైనదనియు, ఈ స్తోత్రాన్ని కీర్తించడం వలనగాని, వినడం వలనగాని, స్మరించడంవలనగాని మానవుడు బంధవిముక్తుడవుతాడని పులస్త్య మహర్షి నారద మహర్షికి తెలియజేశాడు.

విశిష్టమైన నాలుగు విష్ణు స్తోత్రాలలో రెండవది **సారస్వత విష్ణుస్తోత్రం**. మానవులందరినీ హింసించేవాడు, దగాకోరు, నీచుడు, ఇతరులను పీడించేవాడు, క్రూరుడునైన ఒక మహారాజు ఉండేవాడు. వాడు మరణించిన తరువాత జన్మలో భయంకర రాక్షసుడుగా జన్మించాడు. పాపాలు చేస్తూ జీవించేవాడు. వాడు ఒకానొకరోజున ఒక నదీతీరాన విష్ణుపంజర స్తోత్రంతో ఆత్మరక్షణ చేసుకుంటూ తపస్సమాధిలో మునిగిన ఒక యోగివర్యుని చూశాడు. వెంటనే ఆ రాక్షసుడు అతనిపై లంఘించాడు. కాని, ఆద్విజుడు విష్ణుపంజర స్తోత్రం యొక్క ప్రభావంలో ఉండడం వలన రాక్షసుని శక్తులన్నీ నశించాయి. నాలుగు నెలలకాలం అక్కడే అలాగే ఉండిపోయాడు. ఆ బ్రాహ్మణుడు సమాధిస్థితినుండి వెలువడిన తరువాత ఆరాక్షసుని రాకకు కారణంగూర్చి ప్రశ్నించాడు. తన నికృష్టమైన జీవన విధానమునంతటిని యథాతథంగా రాక్షసుడు చెప్పాడు. నా పాపం పూర్తిగా నశించే ధర్మమార్గాన్ని ఉపదేశించవలసిందని ఆ రాక్షసుడు యోగివర్యుని ప్రార్థించాడు. అంతట ఆ బ్రాహ్మణుడు నరులను తినేవారికి నేను ధర్మోపదేశం చేయనని చెప్పాడు. ప్రవచనాలు చెప్పేవారిని ప్రార్థించమని రాక్షసునికి జవాబిచ్చాడు. దానితో చింతాక్రాంతుడైన రాక్షసుడు ఆరు రోజులకొకమారు లభించిన ఒక జంతువును మాత్రం భక్షిస్తూ, తనకు ధర్మోపదేశం చేయగలిగిన బ్రాహ్మణోత్తమునికొరకు అడవులలో వెదకసాగాడు. ఆవిధంగా సంచరిస్తూ వున్న ఆ రాక్షసునకు తన గురువర్యునకై ఫలాహారం సేకరించడానికి వచ్చిన ఒక బ్రహ్మచారి కంటపడ్డాడు. ఆ రాక్షసుడు బ్రహ్మచారిని గట్టిగా పట్టుకుని, తన పాపాలు నిశ్శేషంగా నశించే ఉపాయం తెలియజేసినచో నిన్ను వదులుతాననీ, లేనిచో నిన్ను భక్షిస్తాననీ చెప్పాడు. అంతట ఆ బ్రహ్మచారి ఏమిచేయాలో తోచక అగ్నిదేవుని శరణువేడాడు.

వెంటనే అగ్నిదేవుడు సరస్వతీదేవిని ఆదేశించగా, బ్రహ్మచారి ఎదుట సరస్వతీదేవి ప్రత్యక్షమయ్యింది. 'నేను నీ నాలుకలో నిలచి, నీద్వారా ఈ రాక్షసునకు శ్రేయోదాయకమైన మార్గాన్ని ఉపదేశిస్తానని' పలికింది. సరస్వతీమాత వెంటనే బ్రాహ్మణ కుమారుని నాలుకపై నిలచింది. ఆ కారణంగా ఆ బ్రాహ్మణ కుమారుడు "ఓరాక్షసేంద్రా! నీకేగాక నీవంటి పాపులందరికి శ్రేయస్సును, పుణ్యాన్ని కలిగించే స్తోత్రాన్ని చెబుతాను శ్రద్ధగా వినుము. త్రిసంధ్యలలోను ఈ స్తోత్రాన్ని జపించేవారికి ఈ స్తోత్రం నిస్సంశయంగా శాంతిని పుష్టిని కలిగిస్తుంది". అని రాక్షసునకు తెలియజేశాడు.

ఓం హరిం కృష్ణం హృషీకేశం వాసుదేవం జనార్దనమ్ ।
ప్రణతోఽస్మి జగన్నాథం స మే పాపం వ్యపోహతు ॥– వామ.పురా.86అ.67శ్లో.నుండి105శ్లో. వరకుగల

43 శ్లోకాల సారస్వత విష్ణుస్తోత్రపాఠాన్ని రాక్షసునికి వినిపించాడు. అంతమాత్రమేగాక ఆ బ్రహ్మచారి "నేను చెప్పినదంతయు యథార్థమైతే రాక్షస భయంతో వణకిపోవుచున్న నా శరీరంలోని అవయవాలన్నిటినీ ఈ రాక్షసుడు వెంటనే విడుచుగాక!" అని పలుకగానే బ్రహ్మచారి రాక్షస బంధంనుండి విముక్తుడయ్యాడు. వెంటనే ఆ రాక్షసుడు శాలగ్రామ క్షేత్రానికి చేరాడు. జితేంద్రియుడై, రాత్రింబవళ్ళు సారస్వత విష్ణుస్తోత్రాన్ని పఠిస్తూ, విష్ణుభక్తి పరాయణుడై, తద్వారా సర్వ పాపవినిర్ముక్తుడై విష్ణులోకాన్ని పొందాడు. వాసుదేవుని స్తోత్రాలలో ఉత్తమమైన ఈ స్తోత్రాన్ని వ్యాసభగవానుడు వామన పురాణంలో పొందుపరచి, వైకుంఠం చేరడానికి సులభమైన మార్గాన్ని భక్తకోటికి చూపించాడు.

ప్రహ్లాదుడు భక్తితో నిత్యం జపించే నాలుగు స్తోత్రాలలో మూడవది **"సర్వపాప ప్రమోచన స్తోత్రం"**. పూర్వకాలంలో పాపవశుడైన రుద్రుడు వారాణసి క్షేత్రంలోని సితోదక తీర్థంలో స్నానమాచరించాడు. కేశవుని దర్శించాడు.

నమస్తేఽస్తు జగన్నాథ దేవదేవ నమోఽస్తు తే।
వాసుదేవ నమస్తేఽస్తు బహురూప నమోఽస్తు తే॥ - వామ.పురా. 87అ. 1-50శ్లో.

ఇత్యాదిగా సుమారు 50 శ్లోకాలలో తన పాపాలన్నీ పోగొట్టుకోవడానికి శ్రీమన్నారాయణుని స్తుతించి, పాపవిముక్తుడై ఉపశాంతిని పొందాడు. అంతేగాక శివుడు వారాణసి క్షేత్రంలో వెలువరించిన ఈ స్తోత్రాన్ని పఠించిన మానవుడు సర్వపాప విముక్తుడై, శాంతిని పొంది, ప్రసిద్ధులైన దేవవరులచేత కూడా పూజింపబడతాడని ఈపురాణం స్పష్టంగా తెలియజేస్తోంది.

ప్రహ్లాదుడు పఠించిన స్తోత్ర చతుష్టయంలో నాల్గవదీ, పాపనాశన స్తోత్రద్వయంలో రెండవదీ **"పాపనాశన స్తవం"** ఈ పురాణంలో కనబడుచున్నది. ఇది సర్వవ్యాపి, సర్వదేవతాస్వరూపుడు, నిర్గుణుడు, సగుణుడు, నిరాకారుడు, నిరంజనుడునైన పరబ్రహ్మ పరంగా మనకు దర్శనమిస్తోంది. ఈ స్తోత్రం పూర్వకాలంలో అగస్త్యమహర్షి చెప్పాడని, ఈ స్తోత్రాన్ని పఠించినా, స్మరించినా, వినినా సమస్త పాపాలు నశించి, యశస్వి, ధన్యుడు కాగలడనికూడా ఇందులో పేర్కొనబడింది.

ఇటువంటి విష్ణు స్తోత్రాలతోపాటు అనేక శివ స్తోత్రాలు, దేవీ స్తోత్రాలు కూడా ఇందులో ఉన్నాయి. అంతేకాక 32వ అధ్యాయంలో **"సరస్వతీ నదీస్తోత్రం"**, 47వ అధ్యాయంలో వేనుడు గావించిన **"శివస్తుతి"**, 70వ అధ్యాయంలో అంధకాసుర కృత **"భైరవ ప్రార్థన"**, **"దేవీస్తుతి"**, 76వ అధ్యాయంలో అదితి గావించిన **"ఆదిత్య ప్రార్థన"**, 94వ అధ్యాయంలో బలిచక్రవర్తి గావించిన **"సుదర్శన స్తోత్రం"** మొదలైన సర్వదేవతా స్తోత్రాలు ఈ పురాణంలో కనబడుతున్నాయి. ఈ స్తోత్రరాజములన్నియు **"సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి"**, **"ఏకో నారాయణో దేవః"** **"నారాయణుడే పరబ్రహ్మ"**, మున్నగు ఆర్యోక్తులకు వ్యాఖ్యాగ్రంథములనవచ్చును.

సమాజానికి ఏమి చెబుతోంది? :

పురాణాలు ప్రాచీన గాథలతోను, సంప్రదాయాలతోను కూడియుండి, మోక్షాన్ని పొందాలనుకునే వారికి మాత్రమే ఉపయోగపడే ధర్మోపదేశాలను, సందేశాలను అందిస్తాయని నేటి సమాజంలోని చాలామందిలో

గూడుకట్టుకున్న అభిప్రాయం. సమాజాన్ని సన్మార్గంలో పయనింపజేయడానికి వేదాలు ప్రభుసమ్మితంగాను (రాజశాసనంవలె), పురాణేతిహాసాలు మిత్రసమ్మితంగాను (మిత్రుడు తెలియజేసే పద్ధతిలో), కావ్యనాటకాదులు కాంతాసమ్మితంగాను (భార్యతెలియజేసే విధంగా), ధర్మోపదేశం చేస్తాయన్నది నిత్యసత్య వచనం. ఆత్మతత్త్వజ్ఞానంతోబాటు, సభ్యసమాజాన్ని సన్మార్గంలో ప్రయాణించేటట్లు చేయడానికి వామన పురాణం మిత్రుని వలె బోధిస్తోంది. వామన పురాణం సమాజానికి చేసిన ఈ ధర్మోపదేశం కర్తవ్యోపదేశం అన్ని కాలాలలోని, అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడుతుందని చెప్పవచ్చు. ఉదాహరణకు కొన్ని అంశాలను గూర్చి వామన పురాణం ఏమి ఉపదేశిస్తోందో పరిశీలిద్దాం

పరనిందను గూర్చి :

॥ **"న తథా నిందకః పాపీ యథా శ్రోతా శశిప్రభే"** ॥ – వామ.పురా. 51అ.67శ్లో.

పరనింద పాపంకలిగిస్తుంది. పరనింద చేసినవారికంటె అట్టి పరనిందావాక్యాలను వినేవారికే ఎక్కువ పాపం కలుగుతుందనే పార్వతీదేవి పలుకులద్వారా ఈపురాణం పరనింద చేయరాదని, పరనిందావాక్యాలను వినరాదని సమాజాన్ని హెచ్చరిస్తోంది.

గొడ్డలి వేటుకు తెగినకొమ్మ, చెట్టు తిరిగి చిగురించగలుగుతాయి. నోటినుండి వెలువడిన నిందావాక్యాలతో దూషణలతో గాయపడినవారి మనసుకు కలిగిన పుండు మానిపోదు. దూషణకు గురియైన మానవుడు తిరిగి స్వస్థతను పొందజాలడు. అట్టివాడు రాత్రింబవళ్ళు విచారిస్తూనే ఉంటాడు. కాబట్టి పరనింద చేయరాదని, వినరాదని ఈ పురాణం ధర్మశాసనం చేస్తోంది. ఇది అన్ని కాలాలలోని అన్ని వర్గాల ప్రజలకు ఉపకరించే ధర్మమేగదా!.

పరదారాభిలాషను గూర్చి :

"ఇతరులపై చాడీలు చెప్పడంకంటె మరణించడం మేలు. అసత్యం మాట్లాడడం కంటె మౌనంగా ఉండడం మంచిది. పరదారలను కోరుకోవడంకంటె నపుంసకత్వం శ్రేష్ఠమైనది. పరధనాపహరణం కంటె బిచ్చమెత్తుకుని జీవించడం ఉత్తమం" ఇవి విప్రధేనువులను అపహరించిన సైనికులతో గాధిరాజు పలికిన హితోక్తులు. ఈ పలుకులు తథ్యమైనవి, పథ్యమైనవి, సర్వలోక హితంకరమైనవి. అంతేగాక వామ.పురా. 59అ. 26,27 శ్లోకాలలో "పరదారాగమనం వంశక్షయానికి దారితీస్తుంది. రసాతలంలో పడవేస్తుంది. కాబట్టి పరదారాభిగమనమనే కుత్సితమైన సంకల్పం దుర్మార్గులకేకాదు, సజ్జనులకుకూడా మంచిదికాదని" ప్రహ్లాదుడు అంధకాసురునకు చేసిన ఉపదేశం లోకానికి చేసిన హితోపదేశమేగదా!. ఈసందర్భంగా పరస్త్రీవాంఛతో మూఢుడై రాజ్యంతో సహా నశించిపోయిన దండుడనే మహారాజు వృత్తాంతం సుదీర్ఘంగా ప్రహ్లాదుడు అంధకాసురునకు వివరించినట్లుగా ఈ పురాణంలో వర్ణింపబడింది. ఇది పరదారాభిలాష, సర్వం నశింపజేస్తుందనే సార్వకాలీనమైన, సార్వజనీనమైన ధర్మోపదేశమేగదా!

పుట్టుగ్రుడ్డి, ప్రేమాంధుడు, మదాంధుడు, లోభాంధుడు ఈ నలుగురు కనులముందున్న వాస్తవాలను చూడలేని గ్రుడ్డివారు. కావున ప్రతిమానవుడు రాగం, మోహం, మదం, లోభమనే దుర్గుణాలను వదలి, సత్యమార్గంలో ప్రయాణించాలనికూడా ఈ పురాణం బోధిస్తోంది.

అహింసను గూర్చి :

"గోవులను, బ్రాహ్మణులను, వృద్ధులను, ఆప్తులను, బాలురను, స్వబంధువులను, దురాచారలు కాని స్త్రీలను, గురువులను, ఆచార్యవర్యులను, వారు అపరాధం చేసినప్పటికి వారిని వధింపరాదు. ఒకరి కొరకు అనేకమందిని సంహరింపరాదు. అదేవిధంగా అనేకమందిని రక్షించడానికి ఒకరిని చంపడం పాపం కాదు." అనే శాస్త్రశాసనంకూడా ఈ పురాణంలో పేర్కొనబడింది. దీని ద్వారా **"ఏది హింస? ఏది అహింస?"** అనే ధర్మసందేహానికి సరియైన సమాధానం సమాజానికి లభిస్తోందిగదా!.

61వ అధ్యాయంలో సుతశిష్యుల ధర్మాలను వివరంగా తెలియజేసే సందర్భంలో ఏయే పాపకృత్యాలు చేసినవారు పున్నామనరకాలను పొందుతారో, శేషపాపాల లక్షణాలు ఏమిటో, స్పష్టంగా పేర్కొనడంద్వారా దుర్మార్గులను సైతం సన్మార్గంవైపు నడిపించే మార్గదర్శక గ్రంథంగా, సత్ప్రవర్తనను పెంపొందించే హితోపదేశ కావ్యంగా వామనపురాణాన్ని పేర్కొనవచ్చు.

వారసత్వం గూర్చి :

ఔరసుడు (తనవలన తనభార్యకు స్వయంగా జన్మించినవాడు), క్షేత్రజుడు (భర్త నపుంసకుడు కావడం వలనగానీ, దుర్బలుడు కావడం వలనగానీ, భర్త అనుమతితో భార్య మరొకరి వలన పొందిన పుత్రుడు), దత్తుడు (వేరే తల్లి దండ్రులచేత ఇవ్వబడిన పుత్రుడు), కృత్రిముడు (మిత్రుడు ఇచ్చిన పుత్రుడుగానీ, మిత్రుని పుత్రుడుగానీ), గూఢోత్పన్నుడు (ఏ ఇంట ఎవరికి పుట్టినవాడో తెలియనివాడు), అపవిద్ధుడు (బయటనుండి స్వయంగా తెచ్చుకొని పెంచుకోబడిన పుత్రుడు) అని దాయాదులు ఆరు రకాలు. ఈ ఆరు రకాలవారికీ ఋణ, పిండదానక్రియ, గోత్రసామ్య, కులవృత్తి, ప్రతిష్ఠలు తల్లిదండ్రులనుండి సహజంగా సంక్రమిస్తాయి. కానీనుడు (పెళ్లికాని కన్యకు పుట్టినవాడు), సహోఢుడు (వివాహానికి పూర్వమే గర్భవతి అయిన భార్యకు జన్మించినవాడు), క్రీతుడు (ధనమిచ్చి తెచ్చుకున్నవాడు), పునర్భవుడు (ఒకనికి ఇచ్చిన కన్యను బలవంతంగా అతనినుండి తెచ్చి వేరొకనితో వివాహం చేయగా ఆ భర్తవలన ఆ భార్యకు కలిగిన పుత్రుడు), స్వయందత్తుడు (కరువు కాటకాలలో ఆకలితో అల్లాడుతూ కానీ, ఇతర విపరీత పరిస్థితులలోగానీ స్వయంగా వచ్చి తనను తాను సమర్పించుకున్నవాడు), పారశవుడు (పెళ్లి అయిననూ కాకున్ననూ శూద్ర స్త్రీ యందు బ్రాహ్మణునికి పుట్టిన పుత్రుడు) ఈ 6 రకాలవారూకూడా దాయాదులైనప్పటికి, వీరికిమాత్రం ఋణ, పిండదానక్రియ, గోత్ర కులవృత్తి ప్రతిష్ఠాదులు సంక్రమింపవు. వీరు పేరుకు మాత్రమే పుత్రులుగాని, వీరికి ఏవిధమైన వారసత్వపు హక్కులు సంక్రమింపవని ఈ పురాణంలో స్పష్టంగా పేర్కొనడం వలన వారసత్వపు చట్టం వివరంగా తెలియజేసినట్లయ్యింది. తద్వారా సమాజంలో న్యాయవ్యవస్థను పటిష్టం చేయడానికి కూడా వామనపురాణం సహకరిస్తోందని పేర్కొనవచ్చుగదా!.

ప్రేమ వివాహాలను గూర్చి :

నేటి సమాజంలో విస్తృతంగా వ్యాప్తిపొందిన **"ప్రేమ – వివాహం"** అనే అంశంలో వామనపురాణం ఇచ్చే సందేశం 21వ అధ్యాయంలో వర్ణింపబడిన సంవరణుని వివాహ వృత్తాంతం ద్వారా స్పష్టమౌతోంది. ఈ వివాహ

గాథద్వారా "పరస్పరానురాగబద్ధులైన ప్రేమజంటకు వివాహం జరిపించడం న్యాయం. ఒకరిని వరించిన కన్యకుగాని, వరునకుగాని తాను వరించిన వారితోగాక వేరొకరితో వివాహం జరిపించడం తగదు. అన్యాయం. స్త్రీపురుషులు ఇరువురిలో ఒకరికిమాత్రమే ప్రేమయున్నచో అట్టి ప్రేమవివాహాలు చేయడం తగదు." ఇది వసిష్ఠ మహర్షి లోకానికి తెలియజేసిన సందేశం. వామన పురాణమిచ్చే సందేశంకూడా ఇదే.

గురుపుత్రికను ప్రేమించి, బలాత్కరించిన దండుడు సర్వనాశనమైనతీరు సవిస్తరంగా దండోపాఖ్యానంలో వర్ణింపబడింది. ఆ ఉపాఖ్యానంలోనే ప్రేమపాశబద్ధులైన చిత్రాంగద, వేదవతి, నందయంతి మున్నగు కన్యలు అనేక కష్టనష్టాలకు గురియై, చివరకు వారి తల్లిదండ్రుల ఆమోదంతో ఇంద్రాది దేవ గంధర్వ మహర్షుల సమక్షంలో గాలవమహర్షి పురోహితుడుగా వుండి యథావిధిగా వివాహాలు నిర్వహించిన విధంకూడా చాలా విస్తారంగా వర్ణింపబడింది. దీని ద్వారా ధర్మవిరుద్ధమైన ప్రేమ వినాశహేతువనియు, ధర్మబద్ధమై, పరస్పరానురాగంతో కూడిన ప్రేమ కల్యాణప్రదం కాగలదనియు ఈపురాణం స్పష్టంగా తెలియజేయడమేగాక ప్రేమ వివాహాలకు చక్కని మార్గదర్శక సూత్రాలనుకూడా వెల్లడించిందని చెప్పవచ్చు.

వృక్షో రక్షతి రక్షితః :

ఆశ్వయుజమాసంలో జగన్నాథుని నాభినుండి పద్మం పుట్టగానే ఇతర దేవతలనుండికూడా ఆయా పుష్పాలతో కూడిన వృక్షాలు ఉద్భవించాయి. మన్మథుని కరాగ్రంనుండి అందమైన కదంబవృక్షం పుట్టింది. యక్షేశ్వరుడైన మణిభద్రునినుండి వటవృక్షం ఆవిర్భవించింది. పరమశివుని హృదయంనుండి శుభప్రదమైన ఉమ్మెత్త ఉద్భవించింది. బ్రహ్మదేవుని శరీర మధ్యభాగంనుండి మరకత వర్ణపు ఖదరవృక్షం ఉత్పన్నమయ్యింది. విశ్వకర్మ నుండి కంటకీవృక్షం, పార్వతీదేవి అరచేతినుండి మల్లెపొద ఉద్భవించాయి. గణాధిపుని కుంభస్థలం నుండి సింధువారవృక్షం, యముని కుడివైపు నుండి పాలాశం (మోదుగ), ఎడమవైపునుండి నల్లమేడి, రుద్రుని శరీరం నుండి వృషవృక్షం జన్మించాయి. కుమారస్వామి నుండి బంధుజీవం, సూర్యుని నుండి రావిచెట్టు, కాత్యాయనీదేవి నుండి జమ్మిచెట్టు, లక్ష్మీదేవి కరతలంనుండి మారేడు వృక్షం జన్మించాయి. నాగరాజు నుండి రెల్లుదుబ్బు, వాసుకి విశాలమైన తోకనుండి, వీపునుండి క్రమంగా తెల్ల, నల్ల గరికలు జన్మించాయి. సాధ్యుల హృదయాలనుండి ఎర్రచందన వృక్షాలు పుట్టాయి. ఈవిధంగా తమనుండి జన్మించిన ఆయా వృక్షాలు, పుష్పాలు ఆయా దేవతలకు మిక్కిలి ప్రీతిపాత్రమైనాయని ఈ పురాణంలో వర్ణింపబడింది. ఈ వర్ణన సమస్త వృక్షాలను దేవతా స్వరూపాలుగా భావించి, పూజించి, పరిరక్షించినచో ఆయా దేవతలూ, సర్వదేవతా స్వరూపుడైన శ్రీమన్నారాయణుడూ, మనలను రక్షిస్తాడని వ్యక్తం చేయడమేగదా!. అంతేగాక పర్యావరణ పరిరక్షణద్వారా మానవాళి జీవనానికి రక్షణ ఏర్పడుతుందనియు, **"వృక్షో రక్షతి రక్షితః"** అనియు వామన పురాణం లోకానికి బోధించడమే అవుతుంది.

గో సేవను గూర్చి :

ఈ పురాణంలో పురూరవ చక్రవర్తి పూర్వజన్మల వృత్తాంతాలను వర్ణించే సందర్భంలో మర్త్యలోకంలో రాజకుమారుడుగా జన్మించిన కాలంలో క్షాత్రధర్మాన్ని పాటిస్తూ, దానభోగరతుడై, జితేంద్రియుడై, గోవులను

విడిపించడానికి శత్రువులతో పోరాడి, జయించాడు. ఆ రాజు మరణించిన తరువాత ఇంద్రలోకంచేరి, అక్కడ సమస్తమైన దేవతలచే పూజింపబడినట్లుగా ఈ పురాణంలో వర్ణింపబడింది. దీని ద్వారా స్వధర్మాచరణ వలన ఉత్తమ జన్మలు కలుగుతాయనీ, గోసంరక్షణకు కృషిచేసినవారికి దేవతలచే పూజింపబడే ఇంద్రలోకప్రాప్తి కలుగుతుందనీ తెలియజేసినట్లు అయ్యింది. తద్వారా మానవాళిలో స్వధర్మాచరణను, గోసేవాతత్పరతను, పెంపొందించడానికి వామనపురాణం మార్గదర్శకంగా నిలబడిందని చెప్పవచ్చును.

ధర్మాచరణను గూర్చి :

ధర్మశీలుడు, దురభిమానాన్ని, క్రోధాన్ని జయించినవాడు, విద్యావినయసంపన్నుడు, ఇతరులకు హాని కలిగించనివాడు, తన భార్యతో తృప్తిపడి పరకాంతలను కోరనివాడు ఈ లోకంలో ఎవరికీ భయపడడు. అతనికి ఎక్కడా భయమనేది ఉండదు. ప్రభాకరుడు ధర్మాన్వితుడు. వసిష్ఠుడు క్రోధాన్ని విడిచినవాడు. సూర్య తనయుడైన మనువు విద్యాసంపన్నుడు. అగస్త్యుడు స్వభార్యతోనే తృప్తి చెందినవాడు. ఈ మహనీయులందరు తేజోన్వితులై, శాపానుగ్రహ సామర్థ్యం కలిగి, దేవతలకు, సిద్ధులకుకూడా పూజనీయులయ్యారు.

ధర్మదూరునకు, కలహప్రియునకు, ఇతరులను బాధించేవానికి, వేదశాస్త్రాలను వదలినవానికి, పరదారలను, పరధనాదులను హరించేవానికి, వర్ణసంకరం చేసేవానికి, ఇహపరలోకాలలో ఎక్కడా సుఖం లభింపదు. అంగసుతుడైన **"వేనుడు"** ధర్మహీనుడు–అధర్మయుతుడు. **"విభువు"** అనేవాడు ఎల్లప్పుడూ కలహప్రియుడు. దురాత్ముడైన **"నముచి"** పరపీడకుడు. **"నహుషుడు"** పరస్త్రీ లోలుడు. **"హిరణ్యాక్షుడు"** పరధనాపహర్త. వాని తమ్ముడైన **"హిరణ్యకశిపుడు"** మూర్ఖుడు, దుర్బుద్ధి. **"యదురాజు"** ఇతర వర్ణాలవారితో భోగించినవాడు. వీరంతా గొప్ప రాజులైనప్పటికి నామరూపాలు లేకుండా నశించిపోయారు.

"ధర్మాన్ని ఏనాడు విడువరాదు. ధర్మమే ఉత్తమలోకాలకు చేర్చుతుంది. ధర్మహీనుడైన మానవుడు రౌరవాది నరకాలను పొందుతాడు. మానవులకు ధర్మమే మోక్షాన్ని కలిగిస్తుంది. అధర్మమే పతన హేతువు. ధర్మాన్వితులైనవారు పరదారలకు ఎల్లపుడూ దూరంగా ఉండాలి. పరదారను కోరుకోవడమనే ఒక్క పాపమే మానవుని అనేక నరకాలలోనికి నెట్టివేస్తుంది. అన్ని వర్ణాలవారికి ఇదియే ధర్మం. ఇది నిశ్చయం. ఈ ధర్మవ్యవస్థను పూర్వకాలంలో దేవర్షియైన అసితుడు గరుత్మంతునకు, అరుణునకు వివరించాడు." అని ప్రహ్లాదుడు అంధకునకు గావించిన ధర్మబోధ అన్నివర్ణాలవారికి, అన్ని లోకాలవారికి, అన్ని యుగాలవారికి, మానవాళికంతటికి గావించిన ధర్మోపదేశమేగదా!. ఇహలోకంలోను, పరలోకంలోను కూడా సుఖం పొందాలనుకునేవారందరు ప్రధానంగా ఆచరించవలసిన ధర్మమార్గాన్నీ, ఆచరింపకూడని కర్మలనూ స్పష్టంగా, సోదాహరణంగా, మిత్ర సమ్మితంగా ఉపదేశించడమేగదా!. ధర్మాధర్మ వివరణ అతిస్పష్టంగా లోకానికి తెలియజేయడమేగదా!

ముల్లోకాలకు ప్రభువైన బలిచక్రవర్తి "తండ్రీ! ముల్లోక రాజ్య పరిరక్షణ గావిస్తూ, ధర్మార్థకామమోక్ష సాధకాలైన కర్తవ్యాలు ఏవిధంగా అనుష్ఠించాలో దయతో ఆదేశించండని" ప్రహ్లాదుని ప్రార్థించిన సందర్భంలో ప్రహ్లాదుడు బలిచక్రవర్తికి గావించిన ధర్మార్థయుక్తమైన, ఉత్తమమైన ఉపదేశంలోని ప్రధానాంశాలను పరికిద్దాం.

"వత్సా! భవిష్యత్తులో ఉపయోగపడేది, ప్రపంచానికి హితకరమైనదియునైన ధనాన్ని ధర్మవిరుద్ధంకాని విధంగా సంపాదించాలి. తమ కోరికలను సాధించుకోవడం అందరికీ అమోదయోగ్యమైన తీరులో సాగాలి. మనం చేసే పనులు అడుగడుగునా శ్లాఘింపబడేటట్లు, సత్కీర్తి కలిగేటట్లు, అపకీర్తి కలుగకుండేటట్లు ఉండాలి.

ఉత్తములైనవారు ధనాన్ని అధికంగా సంపాదించాలని కోరుకోవడానికి కారణం ఆపదలో చిక్కుకున్న ఉత్తములను, ధనహీనులైన మిత్రులను, వృద్ధులను, జ్ఞాతులను, గుణవంతులను, బ్రాహ్మణులను తమ ఇండ్లలో శాంతిగా నివసించేటట్లు చేయడానికే. ఆవిధంగా చేయడంవల్ల యశస్సు, కీర్తి లభిస్తాయి. ఎల్లప్పుడూ భూమి బ్రహ్మజ్ఞానం గలవారితో అలంకరింపబడి, క్షత్రియులతో పరిరక్షింపబడుతూ, సస్యసమృద్ధమై, సేవాభావం గలవారితో కళకళలాడుతూ ఉన్నప్పుడే దానిని పరిపాలించే రాజు అభివృద్ధిని పొందగలుగుతాడు.

నాల్గు వర్ణాలవారు తమతమ ధర్మాలను చక్కగా ఆచరించిననాడు రాజ్యంలో ధర్మవృద్ధి కలుగుతుంది. ధర్మవృద్ధి వలన రాజులకు అభ్యుదయం కలుగుతుంది. ధర్మవృద్ధియే వృద్ధి. ధర్మహానియే హానియని పెద్దల నిర్ణయం". ప్రహ్లాదుడు పలికిన ఈ పలుకులద్వారా ధర్మ పరిరక్షణ విషయంలో పాలకులు ఆచరించవలసిన మార్గాలు, సమాజంలోని అన్ని వర్గాలవారు పాటించవలసిన అంశాలు ఈ పురాణం లోకానికి తెలియజేస్తోంది. అంతే గాక పెద్దల మాటలను ఎందులకు పాటించాలో కూడా ఈ పురాణంలో వివరించడం జరిగింది.

పర్యాలోచన చేయగా చతుర్విధ పురుషార్థ సాధన మార్గాలను తెలియజేయడంలోను, బ్రహ్మతత్త్వ ప్రతిపాదనలోను హరిహరాద్వైత తత్త్వ ప్రతిపాదనద్వారా సమాజంలో మతసామరస్యాన్ని పెంపొందించడంలోను, ఈలోకంలో నిర్భయంగా జీవితాన్ని గడపడమేగాక, ఇహపర లోకాలలో సుఖాన్ని పొందడానికి అవసరమైన ధర్మాచరణ మార్గాన్ని తెలియజేయడంలోను, దేశంలోని సమస్త తీర్థ మాహాత్మ్య కథనంలోను వామన పురాణంతో సమానమైన వేరొక పురాణం లేదని నిర్ద్వంద్వంగా ప్రకటించవచ్చును. అందువలననే వ్యాసభగవానుడు.

"చతుర్దశం వామనమాహురగ్ర్యమ్" (అష్టాదశపురాణాలలో అగ్రేసరం వామనం) అని కీర్తించియున్నాడు.

సదా శ్రీవారి సేవలో

ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి

ఓం శ్రీనివాస పరబ్రహ్మణే నమః

శ్రీవేదవ్యాస విరచితం

వామన మహాపురాణమ్ – వామన మహాపురాణం

ప్రథమోఽధ్యాయః – మొదటి అధ్యాయం

శంకరస్య జీమూతకేతురితి నామప్రాప్తిః – శంకరుడు జీమూతకేతువుగా పేరుపొందుట

త్రైలోక్యరాజ్యమాచ్ఛిద్య బలేరింద్రాయ యో దదౌ ।
నమస్తస్మై సురేశాయ సదా వామనరూపిణే ॥1॥

త్రైలోక్యరాజ్యాన్ని బలిచక్రవర్తినుండి లాగుకొని, ఇంద్రునకిచ్చినట్టి వామనరూపియైన శ్రీమహావిష్ణువునకు నమస్కారం.

పులస్త్యమృషిమాసీనమాశ్రమే వాగ్విదాం వరమ్ ।
నారదః పరిపప్రచ్ఛ పురాణం వామనాశ్రయమ్ ॥2॥

వాగ్విదులలో శ్రేష్ఠుడును, తన ఆశ్రమంలో సుఖోపవిష్టుడునైన పులస్త్యమహర్షిని నారదుడు వామనునకు సంబంధించిన పురాణాన్ని గురించి ప్రశ్నించాడు.

కథం భగవతా బ్రహ్మన్ విష్ణునా ప్రభవిష్ణునా ।
వామనత్వం ధృతం పూర్వం తన్మమాచక్ష్వ పృచ్ఛతః ॥3॥

బ్రహ్మర్షీ! ప్రభవిష్ణుడైన విష్ణువు పూర్వకాలంలో వామనరూపాన్ని ఎందులకు ధరించాడో నాకు తెలియజేయ వలసినదిగా కోరుతున్నాను.

కథం చ వైష్ణవో భూత్వా ప్రహ్లాదో దైత్యసత్తమః ।
త్రిదశైర్యుయుధే సార్ధమత్ర మే సంశయో మహాన్ ॥4॥

దైత్యశ్రేష్ఠుడైన ప్రహ్లాదుడు పరమవైష్ణవుడైనప్పటికి దేవతలతో ఎందులకు యుద్ధం చేశాడు? ఈ సందేహం నన్ను పీడిస్తోంది. నా యీ సంశయాన్ని తొలగించండి.

శ్రూయతే చ ద్విజశ్రేష్ఠ దక్షస్య దుహితా సతీ ।
శంకరస్య ప్రియా భార్యా బభూవ వరవర్ణినీ ॥5॥

కిమర్థం సా పరిత్యజ్య స్వశరీరం వరాననా ।
జాతా హిమవతో గేహే గిరీంద్రస్య మహాత్మనః ॥6॥

పునశ్చ దేవదేవస్య పత్నీత్వమగమచ్ఛుభా ।
ఏతన్మే సంశయం ఛింధి సర్వవిత్త్వం మతోఽసి మే ॥7॥

ఓ ద్విజశ్రేష్ఠా! దక్షపుత్రియైన సతీదేవి శంకరునకు ప్రియాతిప్రియమైన భార్య అయ్యిందిగదా? ఆ శుభాంగియైన సతీదేవి తన శరీరాన్ని పరిత్యజించి, పర్వతేశ్వరుడైన హిమవంతుని ఇంట ఎందులకు జన్మించింది? మరల దేవదేవుడైన శంకరుని ఎందులకు పరిణయమాడింది? ఈ నా సంశయాన్ని సర్వజ్ఞులైన మీరు తొలగించండి

తీర్థానాం చైవ మాహాత్మ్యం దానానాం చైవ సత్తమ ।
వ్రతానాం వివిధానాం చ విధిమాచక్ష్వ మే ద్విజ ॥8॥

ఓ బ్రాహ్మణోత్తమా! తీర్థక్షేత్రాల మాహాత్మ్యాన్ని, వివిధ దానాల మహిమను, అనేకవిధాలైన వ్రతాచరణ విధానాలను దయతో నాకు తెలియజేయండి.

ఏవముక్తో నారదేన పులస్త్యో మునిసత్తమః ।
ప్రోవాచ వదతాం శ్రేష్ఠో నారదం తపసో నిధిమ్ ॥9॥

ఈ విధంగా పలికిన తపోనిధియైన నారదునితో మునిశ్రేష్ఠుడు, వాగ్విదాంవరుడునైన పులస్త్యమహర్షి ఇలా పలికాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

పురాణం వామనం వక్ష్యే క్రమాన్నిఖిలమాదితః ।
అవధానం స్థిరం కృత్వా శృణుష్వ మునిసత్తమ ॥10॥

ఓ మునిసత్తమా! వామనపురాణాన్ని ప్రారంభంనుండి క్రమంగా సమగ్రంగా చెబుతాను. సావధానుడవై, స్థిరచిత్తుడవై శ్రద్ధగా వినుము.

పురా హైమవతీదేవీ మందరస్థం మహేశ్వరమ్ ।
ఉవాచ వచనం దృష్ట్వా గ్రీష్మకాలముపస్థితమ్ ॥11॥

పూర్వకాలంలో భగవతియైన హైమవతీదేవి గ్రీష్మఋతువు సమీపించడాన్ని చూచి మందరపర్వతంపైనున్న మహేశ్వరునితో ఇలా పలికింది.

గ్రీష్మః ప్రవృత్తో దేవేశ న చ తే విద్యతే గృహమ్ ।
యత్ర వాతాతపౌ గ్రీష్మే స్థితయోర్నౌ గమిష్యతః ॥12॥

"ఓ దేవేశా! గ్రీష్మకాలం సమీపించింది. నీకు గృహం లేదు గదా! గ్రీష్మకాలంలోని వేడిగాడ్పులను, గ్రీష్మతాపాన్ని తట్టుకొని ఉండడానికి మనం ఎక్కడికి వెళ్ళాలి?"

ఏవముక్తో భవాన్యా తు శంకరో వాక్యమబ్రవీత్ ।
నిరాశ్రయోఽహం సుదతి సదారణ్యచరః శుభే ॥13॥

ఇట్లు ప్రశ్నించిన భవానితో శంకరుడిలా పలికాడు. "సుదతీ!, కల్యాణీ! నేను నిరాశ్రయుడను. సదా అరణ్యసంచారం చేస్తుంటాను".

ఇత్యుక్త్వా శంకరేణాథ వృక్షచ్ఛాయాసు నారద ।
నిదాఘకాలమనయత్సమం శర్వేణ సా సతీ ॥14॥

ఓ నారదా! ఈ విధంగా శంకరుడు పలికిన పలుకులు విని, సతీదేవి భర్తతో కలసి వేసవికాలమునంతటిని చెట్లనీడలందు గడిపింది.

నిదాఘాంతే సముద్భూతో నిర్జనాచరితోఽద్భుతః ।
ఘనాంధకారితాశో వై ప్రావృట్కాలోఽతిరాగవాన్ ॥15॥

వేసవికాలం గడిచినతోడనే అద్భుతమైన వర్షఋతువు వచ్చింది. అది అత్యంతానురాగాన్ని పెంపొందించింది. అది మేఘాల గుంపులతో, దిక్కులన్నిటా చీకట్లు వ్యాపింపజేసింది. దిక్కులు జనసంచారశూన్యమయ్యాయి.

తం దృష్ట్వా దక్షతనుజా ప్రావృట్కాలముపస్థితమ్ ।
ప్రోవాచ వాక్యం దేవేశం సతీ సప్రణయం తదా ॥16॥

ఆ విధంగా సమీపించిన వర్షఋతువును చూసి దాక్షాయణి తన భర్తయైన శంకరునితో ప్రేమపురస్సరంగా ఇలా పలికింది.

వివాంతి వాతా హృదయావదారణా గర్జంత్యమీ తోయధరా మహేశ్వర ।
స్ఫురంతి నీలాభ్రగణేషు విద్యుతో వాశన్తి కేకారవమేవ బర్హిణః ॥17॥

పతన్తి ధారా గగనాత్పరిచ్యుతా బకా బలాకాశ్చ సరన్తి తోయదాన్ ।
కదంబసర్జార్జునకేతకీనగాః పుష్పాణి ముంచంతి సుమారుతాహతాః ॥18॥

ఓ మహేశ్వరా! ఇదిగో గుండెలు బ్రద్దలయ్యేటట్లుగా మేఘాలు గర్జిస్తున్నాయి. తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. నల్లని మబ్బుల గుంపులలో మెరుపులు మెరుస్తున్నాయి. నెమళ్ళు కేకారవాలు చేస్తూ ఆడుతున్నాయి. ఆకాశంనుండి నిరంతరంగా వర్షధారలు పడుతున్నాయి. కొంగలు, కొక్కెర పక్షులు మేఘాల వెంబడి పరుగిడుతున్నాయి. తీవ్రమైన ఆ గాలులకు కదంబ, మద్ది, అర్జున, కేతకీవృక్షాలు పుష్పాలను రాలుస్తున్నాయి.

శ్రుత్వైవ మేఘస్య దృఢం తు గర్జితం త్యజంతి హంసాశ్చ సరాంసి తత్క్షణాత్ ।
నీచోద్ధతాం సత్పురుషా యథాశ్రయాన్ ప్రవృద్ధమూలానపి సంత్యజంతి ॥19॥

ఉద్ధతులైన నీచులవలన సత్పురుషులు తమ ఆశ్రమాలను విడిచి వెళ్ళినట్లుగా మేఘగంభీరగర్జనలు విని, హంసలు తమ సరోవరాలను వదలిపోతున్నాయి.

ఇమాని యూథాని తథా మృగాణాం త్వరన్తి ధావన్తి రమన్తి శంభో ।
ధావన్తి హృష్టాని వనస్థలీషు సర్వాభువస్తోయద సంప్రవృద్ధ్యా ॥20॥

రాజన్తి శష్పావృతసస్యయుక్తాః తథాఽచిరాభాః సుతరాం స్ఫురన్తి ।
పశ్యేహ నీలేషు ఘనేషు దేవ నూనం సమృద్ధిం సలిలస్య దృష్ట్వా ॥21॥

చరన్తి శూరాస్తరుణోద్గమేషు ఉద్వృత్తవేగాః సహసైవ నిమ్నగాః ।
జాతా శశాఙ్కాఙ్కిత చారుమౌళే కిమత్ర చిత్రం యదనుజ్జ్వలం జనమ్ ॥22॥

శ్రయన్తి నీచానుగతా హి యోషితో నీలేషు మేఘేషు సమాశ్రితం నభః ।
పుష్పేషు సర్జా ముకులేషు నీపాః ఫలేషు చ శ్రీశ్చ పయస్స్వథాపగాః ॥23॥

పత్రేషు పద్మేషు మహాసరాంసి సుదుస్తరః సంప్రతి వర్షకాలః ।
ఇతీదృశే శంకర దుఃసహేఽద్భుతే కాలే సురౌద్రే నను తే బ్రవీమి ॥24॥

గృహం కురుష్వాత్ర మహాచలోత్తమే సునిర్వృతా యేన భవామి శంభో ।
ఇత్థం త్రినేత్రః శ్రుతిరామణీయకం శ్రుత్వా వచో వాక్యమిదం బభాషే ॥25॥

న మేఽస్తి విత్తం గృహసంచయార్థే మృగారిచర్మావృతదేహినః ప్రియే ।
మమోపవీతం భుజగేశ్వరః ఫణీ కర్ణేఽపి పద్మశ్చ తథైవ పింగళః ॥26॥

కేయూరమేకం మమ కంబలస్త్వహిః ద్వితీయమన్యో భుజగో ధనంజయః ।
నాగస్తథైవాశ్వతరోఽహి కఙ్కణం సవ్యేతరే తక్షక ఉత్తరే తథా ।
నీలోఽపి నీలాంజనతుల్యవర్ణః శ్రోణీతటం రాజతి సుప్రతిష్ఠః ॥27॥

"ఓ శంభో! రమ్యమైన అరణ్యప్రాంతాలలో లేళ్ళగుంపులు త్వరపడుతున్నాయి. తిరుగుతున్నాయి. పరుగిడు తున్నాయి. క్రీడిస్తున్నాయి. భూమండలమంతయు నీరదములైన మేఘాలు బాగుగా వ్యాపించడంవల్ల అరణ్యభూము లన్నియు పచ్చగడ్డితో కప్పబడి, సస్యయుక్తములై ప్రకాశిస్తున్నాయి. ఓ దేవా! ఇక్కడచూడండి నీలమేఘాలలో మెరుపుతీగల కాంతులు బాగుగా ప్రకాశిస్తున్నాయి. జలసమృద్ధిని చూసి శూరులు పచ్చదనంతో నిండియున్న తరుణ వృక్షాల మధ్య సంచరిస్తున్నారు. నదులు మిక్కిలివేగంగా, ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. చంద్రశేఖరా! ఇట్టి ఉత్తేజకరమైన సమయంలో దుష్ప్రవృత్తి గల వానిని సేవించిన స్త్రీ తన శీలాన్ని కోల్పోవడంలో ఆశ్చర్యమేముంటుంది? ఆకాశం నల్లని మబ్బులతో పూర్తిగా ఆవరింపబడింది. మద్దివృక్షాలు పుష్పాలతోను, కడిమిచెట్లు మొగ్గలతోను, మారేడు చెట్లు ఫలాలతోను, నదీనదాలు జలశోభతోను నిండియున్నాయి. సరోవరాలు పద్మపత్రాలతోను, పద్మాలతోను నిండియున్నాయి. శంకరా! ఇటువంటి భయంకరమైన, దుస్సహమైన, అద్భుతమైన సమయంలో మిమ్ములను ప్రార్థించేదేమనగా ఉత్తమమైనట్టి ఈ మహాపర్వతంపై గృహనిర్మాణం చేయండి. ఓ శంభో! దీనివలన నేను సర్వథా నిశ్చింతగా ఉండగలను". ఇట్లు శ్రవణపేయంగా సతీదేవి పలికిన పలుకులువిని త్రినేత్రుడు సతీదేవితో ఇలా పలికాడు. "ప్రియా! గృహనిర్మాణానికి, గృహానికి అవసరమైన వస్తుసామగ్రిని సమకూర్చుకోవడానికి నావద్ద ధనం లేదు. నేను ధరించేది పులితోలు. నా యజ్ఞోపవీతం భుజగేశ్వరుడు (పాపరేడు). పద్మ, పింగళుడనే సర్పాలు నాకు కర్ణకుండలాలు. కంబళం, ధనంజయమనే సర్పాలు నా రెండు భుజాలకు ధరించే కేయూరాలు. నా కుడిచేతికి

అశ్వతరమనే నాగాన్ని, ఎడమచేతికి తక్షకుడనే నాగాన్ని కంకణంగా ధరిస్తాను. కాటుకరంగుతో నిగనిగలాడే నీలుడు అనే పెద్దసర్పం నా మొలత్రాడు. ఇంతకుమించి నా వద్ద ఏమి గలదు?"

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇతి వచనమథోగ్రం శంకరాత్సా మృడానీ ఋతమపి తదసత్యం శ్రీమదాకర్ణ్య భీతా ।
అవనితలమవేక్ష్య స్వామినో వాసకృచ్ఛ్రాత్ పరివదతి సరోషం లజ్జయోచ్ఛ్వస్య చోష్ణమ్ ॥28॥

శంకరుని ఈ పలుకులు ఉగ్రమైనవి, ఓజోవంతమైనవి, సత్యమైనవి అయినప్పటికిని అసత్య ప్రతీతిని కలిగిస్తున్న ఈ పలుకులను విని సతీదేవి మిక్కిలి భయకంపితురాలయ్యింది. స్వామియొక్క నివాసక్లేశాన్ని చూసి లజ్జారోషాలతో కృంగిపోయి వేడినిట్టూర్పులు విడుస్తూ, చూపులు నేలమీద నిలిపి భర్తతో ఇలా పలికింది.

దేవ్యువాచ – సతీదేవి పలికింది.

కిమేవం సంశ్రితాయాస్తు ప్రావృట్కాలో గమిష్యతి ।
వృక్షమూలే స్థితాయాస్తు సునయేన వదావ్యయ ॥29॥

ప్రభూ! దేవేశా! ఇంతటి భయంకరము, దుర్భరమునైన వర్షాకాలాన్ని చెట్లక్రింద తడుస్తూ, రోదిస్తూ, ఎలా గడపగలను? అందులకే నేనింత గట్టిగా గృహనిర్మాణ విషయంలో మాట్లాడుతున్నాను. అవ్యయుడా! నేనేమి చేయాలో నీవే చెప్పుము.

శంకర ఉవాచ – శంకరుడు పలికాడు.

ఘనావస్థితదేహాయాః ప్రావృట్కాలః ప్రయాస్యతి ।
యథాంబుధారా న తవ నిపతిష్యంతి విగ్రహే ॥30॥

ప్రియురాలా! నీవు మేఘాలను ఆసనంగా చేసుకొని, మేఘాలమీద నివసించి వర్షాకాలమంతటిని గడపవచ్చును. అప్పుడు వర్షపు జలధారలు నీ శరీరంపై పడవుకదా?

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తతో హరస్తద్ఘనఖండమున్నతమారుహ్య తస్థౌ సహ దక్షకన్యయా ।
తతోఽభవన్నామ మహేశ్వరస్య జీమూతకేతుస్త్వితి విశ్రుతం దివి ॥31॥

తదనంతరం హరుడు దాక్షాయణితో కలసి ఒక ఎత్తైన మేఘమండలాన్ని అధిరోహించి ఆసీనుడయ్యాడు. దానితో మహేశ్వరునకు స్వర్గలోకంలో **"జీమూతకేతువు"** అనే పేరు నాటినుండి విఖ్యాతమయ్యింది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే శంకరస్య జీమూతకేతురితి నామప్రాప్తిర్నామ ప్రథమోఽధ్యాయః ॥1॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి శంకరుడు జీమూతకేతువుగా పేరుపొందుట అనే మొదటి అధ్యాయం సమాప్తం.

ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయం
నరోత్పత్తిః ప్రలయశ్చ - నరోత్పత్తి, ప్రళయం

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

తతస్త్రినేత్రస్య గతః ప్రావృట్కాలో ఘనోపరి ।
లోకానందకరీ రమ్యా శరత్సమభవన్మునే ॥1॥

ఓ నారదా! ఆ విధంగా త్రినేత్రుడు మేఘమండలంపై వర్షఋతువు గడిపాడు. తదనంతరం లోకానందకర మైనట్టియు, రమ్యమైనట్టియు శరదృతువు వచ్చింది.

త్యజంతి నీలాంబుధరా నభస్తలం వృక్షాంశ్చ కఙ్కాః సరితస్తటాని ।
పద్మాని గంధం నిలయాని వాయసా రురుర్విషాణం కలుషం జలాశయాః ॥2॥

వికాసమాయాంతి చ పంకజాని చంద్రాంశవో భాంతి లతాః సుపుష్పాః ।
నందంతి హృష్టాన్యపి గోకులాని సంతశ్చ సంతోషమనువ్రజన్తి ॥3॥

ఓ మునీ! నీలమేఘాలు ఆకాశాన్ని వదిలాయి. గ్రద్దలు చెట్లను, నదులు తమ ఒడ్డులను, తామరలు తమ వాసనలను, కాకులు తమ నివాసాలను, రురుజింకలు తమ కొమ్ములను, జలాశయాలు బురదను వదిలాయి. శరదృతువులో పద్మాలు వికసించాయి. చంద్రకిరణాలు కొత్తకాంతులను సంతరించుకున్నాయి. లతలు పుష్పవతులయ్యాయి. ఆలమందలు ఆనందతుందిలాలయ్యాయి. మహంతులగు సాధువులు సంతోషాన్ని పొందారు.

సరస్సు పద్మా గగనే చ తారకా జలాశయేష్వేవ తథా పయాంసి ।
సతాం చ చిత్తం హి దిశాం ముఖైస్సమం వైమల్యమాయాన్తి శశాంకకాంతయః ॥4॥

సరస్సులలో తామరలు, ఆకాశంలో నక్షత్రాలు, జలాశయాలలోని జలము, సాధుజనుల అంతరంగాలు, దిక్కుల ముఖాలు, వీటన్నిటితోబాటు చంద్రుని కాంతులు నైర్మల్యాన్ని సంతరించుకున్నాయి.

ఏతాదృశే హరః కాలే మేఘపృష్ఠాధివాసినీమ్ ।
సతీమాదాయ శైలేంద్రం మందరం సముపాయయౌ ॥5॥

ఇటువంటి మనోహరమైన కాలం సమీపించగానే హరుడు సతీదేవిని తీసికొని మేఘమండలంనుండి దిగి, మందరగిరిని చేరాడు.

తతో మందరపృష్ఠోఽసౌ స్థితః సమశిలాతలే ।
రేమే స శంభుర్భగవాన్ సత్యా సహ మహాద్యుతిః ॥6॥

ఆ మందరపర్వతం మీద చక్కని సమతలమైన శిలాతలంపై మహాద్యుతిమంతుడైన శంకరుడు సతితో గూడి విహరించాడు.

తతో గతాయాం శరది ప్రతిబుద్ధే చ కేశవే ।
దక్షః ప్రజాపతిశ్రేష్ఠో యష్టుమారభత క్రతుమ్ ॥7॥

రమ్యమైన శరత్కాలం గడచి, శ్రీమహావిష్ణువు నిద్రనుండి లేచినకాలం ప్రవేశించడంతో అనగా ఉత్తరాయణం ప్రవేశించడంతో ప్రజాపతిశ్రేష్ఠుడైన దక్షుడు క్రతువు ప్రారంభించాడు.

ద్వాదశైవ స చాదిత్యాన్ శక్రాదీంశ్చ సురోత్తమాన్ ।
సకశ్యపాన్ సమామంత్ర్య సదస్యాన్సమచీకరత్ ॥8॥

ఓ నారదా! ఆ యజ్ఞానికి ద్వాదశాదిత్యులను, ఇంద్రాది సురోత్తములను, కశ్యపమహర్షిని ఆహ్వానించి, సదస్యులను గావించాడు.

అరుంధత్యానుసహితం వసిష్ఠం శంసితవ్రతమ్ ।
సహానుసూయయాఽత్రిం చ సహ ధృత్యా చ కౌశికమ్ ॥9॥

అహల్యయా గౌతమం చ భరద్వాజమమాయయా ।
చంద్రయా సహితం బ్రహ్మన్ ఋషిమంగిరసం తథా ॥10॥

ఆమన్త్ర్య కృతవాన్దక్షః సదస్యాన్యజ్ఞకర్మణి ।
సదస్యాన్గుణసంపన్నాన్వేదవేదాఙ్గపారగాన్ ॥11॥

సువ్రతులైన అరుంధతీ వసిష్ఠులను, అత్రి అనసూయలను, ధృతి కౌశికులను, అహల్యా గౌతములను, అమాయా భరద్వాజులను, చంద్రాంగిరసులను, దక్షుడు తన యజ్ఞానికి ఆహ్వానించి సదస్యులను గావించాడు. వేదవేదాంగపారంగతులను, గుణసంపన్నులను, యజ్ఞకర్మలందు నియమించాడు.

ధర్మం చ స సమాహూయ భార్యయాఽహింసయా సహ ।
నిమన్త్ర్య యజ్ఞవాటస్య ద్వారపాలార్థమాదిశత్ ॥12॥

అహింసాదేవీ సమేతుడైన ధర్ముని ఆహ్వానించి, అతనిని తనయజ్ఞవాటికకు ద్వారపాలకునిగా నియమించాడు.

అరిష్టనేమినం చక్రే ఇధ్మాహరణకారిణమ్ ।
భృగుం చ మంత్రసంస్కారే సమ్యగ్దక్షః ప్రయుక్తవాన్ ॥13॥

చంద్రయా సహితం బ్రహ్మన్ ఋషిమంగిరసం తథా ।
మృష్టాన్నపానసంస్కారే సమ్యగ్ దక్షః ప్రయుక్తవాన్ ॥14॥

ఓ నారదా! దక్షుడు అరిష్టనేమిని సమిధలు సమీకరించు కర్మయందు నియోగించాడు. భృగుమహర్షికి మంత్రసంస్కారబాధ్యతను ఇచ్చాడు. చంద్రాంగిరసులను మృష్టాన్నపానసంస్కార బాధ్యతలందు నియమించాడు.

తథా చంద్రమసం దేవం రోహిణ్యా సహితం శుచిమ్ ।
ధనానామాధిపత్యే చ యుక్తవాన్ హి ప్రజాపతిః ॥15॥

అనంతరం రోహిణీ సహితుడైన చంద్రుని దక్షప్రజాపతి ధనాధిపత్యబాధ్యతలందు నియమించాడు.

జామాతౄన్ దుహితౄంశ్చైవ దౌహిత్రాంశ్చ ప్రజాపతిః ।
సశంకరాం సతీం ముక్త్వా మఖే సర్వాన్న్యమంత్రయత్ ॥16॥

కూతుంర్రను, అల్లుంర్రను, దౌహిత్రులను అందరిని దక్షుడు పిలిపించాడు. కాని సతీశంకరులనుమాత్రం విడిచిపెట్టాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కిమర్థం లోకపతినా ధనాధ్యక్షో మహేశ్వరః ।
జ్యేష్ఠః శ్రేష్ఠో వరిష్ఠోఽపి ఆద్యోఽపి న నిమన్త్రితః ॥17॥

సర్వలోకేశ్వరుడు, ధనాధ్యక్షుడు, సర్వశ్రేష్ఠుడు, జ్యేష్ఠుడు, వరిష్ఠుడు, ఆద్యుడు అయినప్పటికిని మహేశ్వరుని దక్షప్రజాపతి ఎందులకు పిలువనంపలేదు?

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

జ్యేష్ఠః శ్రేష్ఠో వరిష్ఠోఽపి ఆద్యోఽపి భగవాన్ శివః ।
కపాలీతి విదిత్వేశో దక్షేణ న నిమన్త్రితః ॥18॥

ఓ నారదా! శివుడు జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు, వరిష్ఠుడు, ఆద్యుడు అయినప్పటికి **'కపాలి'** అని తెలిసి దక్షుడు ఆయనను ఆహ్వానించలేదు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కిమర్థం దేవతాశ్రేష్ఠః శూలపాణిస్త్రిలోచనః ।
కపాలీ భగవాఞ్జాతః కర్మణా కేన శంకరః ॥19॥

బ్రహ్మర్షీ! దేవతాశ్రేష్ఠుడు, శూలపాణి, త్రిలోచనుడు, భగవానుడునైన శంకరుడు ఏకారణం చేత కపాలి అయ్యాడు?

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రుణుష్వావహితో భూత్వా కథామేతాం పురాతనీమ్ ।
ప్రోక్తాం హ్యాదిపురాణేషు బ్రహ్మణాఽవ్యక్తమూర్తినా ॥20॥

ఓ నారదా! అవ్యక్తమూర్తియైన పరబ్రహ్మచే ఆదిపురాణాలలో చెప్పబడిన ఈ ప్రాచీనకథను శ్రద్ధగా వినుము.

పురా త్వేకార్ణవే లోకే నష్టే స్థావరజంగమే ।
నష్టచంద్రార్కనక్షత్రే ప్రనష్టపవనానలే ॥21॥

అప్రతర్క్యమవిజ్ఞేయం భావాభావవివర్జితమ్ ।
నిమగ్నపర్వతతరుం తమోభూతం సుదుర్దినమ్ ॥22॥

తస్మిన్స శేతే భగవాన్నిశాం వర్షసహస్రకీమ్ ।
రాత్ర్యంతే సృజతే లోకాన్రాజసం రూపమాస్థితః ॥23॥

ప్రాచీనకాలంలో స్థావరజంగమాత్మకమైన ఈ విశ్వమంతయు ఒకే సముద్రమయ్యింది. చంద్రార్కనక్షత్రాలు, వాయ్వగ్నులు నశించిపోయాయి. తరు పర్వతాదులను ముంచివేసి, ఊహకు తర్కానికి ఏ మాత్రము తెలియరాని గాడాంధకారం సర్వత్రా వ్యాపించింది. అందులో భగవంతుడు వెయ్యేండ్ల కాలం నిద్రలోనుండి రాత్రి చివరిభాగంలో రాజసరూపం ధరించి, లోకాలను సృష్టించాడు.

రేజే స పంచవదనో వేదవేదాంగపారగః ।
స్రష్టా చరాచరస్యాస్య జగతోఽద్భుతదర్శనః ॥24॥

ఆ జగత్తునుండి వేదవేదాంగపారగుడు, రజోగుణప్రధానుడు, చరాచరసృష్టికర్తయునైన బ్రహ్మ ఐదు ముఖాలతో ఉద్భవించాడు.

తమోమయస్తథైవాన్యః సముద్భూతస్త్రిలోచనః ।
శూలపాణిః కపర్దీ చ అక్షమాలాం చ దర్శయన్ ॥25॥

అట్లే తమోగుణమయుడు, త్రిలోచనుడు, శూలపాణి, జటాధారియునైన రుద్రుడు రుద్రాక్షమాలతో ఉద్భవించాడు.

తతో మహాత్మా హ్యసృజదహంకారం సుదారుణమ్ ।
యేనాక్రాంతావుభౌ దేవౌ తావేవ బ్రహ్మశంకరౌ ॥26॥

అంతట భగవానుడు దారుణమైన అహంకారాన్ని సృష్టించగా అది బ్రహ్మరుద్రులనిరువురిని ఆక్రమించింది.

అహంకారావృతో రుద్రః ప్రత్యువాచ పితామహమ్ ।
కో భవానిహ సంప్రాప్తః కేన సృష్టోఽసి మాం వద ॥27॥

పితామహోఽప్యహంకారీ ప్రత్యువాచాథ కో భవాన్ ।
భవతో జనకః కోఽత్ర జననీ వా తదుచ్యతామ్ ॥28॥

ఇత్యన్యోన్యం పురా తాభ్యాం బ్రహ్మేశాభ్యాం కలిప్రియ ।
పరివాదోఽభవత్తత్ర ఉత్పత్తిర్భవతోఽభవత్ ॥29॥

భవానప్యంతరిక్షం హి జాతమాత్రస్తదోత్పతత్ ।
ధారయన్నతులాం వీణాం కుర్వన్కిలకిలాధ్వనిమ్ ॥30॥

అహంకారావృతుడైన రుద్రుడు బ్రహ్మతో “నీవెవరవు? నిన్నెవరు సృష్టించారు? ఎవరు నిన్నిక్కడకు పంపారు? నాకు తెలియజేయుము” అన్నాడు. అహంకారావృతుడైన బ్రహ్మకూడా “నీవెవరవు? నీ తండ్రి ఎవరు? నీ తల్లి ఎవరు?” అని రుద్రుని ప్రశ్నించాడు. నారదా! ఈ విధంగా ప్రాచీనకాలంలో బ్రహ్మరుద్రులిరువురకు అన్యోన్యం

వివాదమేర్పడింది. ఆ సమయంలో అక్కడ నీవు ఉద్భవించావు. పుట్టిన వెంటనే సాటిలేని వీణపై కిలకిలధ్వనిని వెలయింపజేస్తూ ఆకాశానికి ఎగిరావు.

తతో వివర్జితః శంభుర్మానినా పద్మయోనినా ।
తస్థావధోముఖో దీనో గ్రహాక్రాంతో యథా శశీ ॥31॥

పరాజితే లోకపతౌ దేవేన పరమేష్ఠినా ।
క్రోధాంధకారితం రుద్రం పంచమం ముఖమబ్రవీత్ ॥32॥

తదనంతరం ఆత్మాభిమానియైన బ్రహ్మచే శంభుడు నిర్జింపబడి, దీనవదనంతో రాహుగ్రస్తుడైన చంద్రునివలె అధోముఖుడై నిలబడ్డాడు. అవమానభారంతో, క్రోధంతో, నల్లనైన ముఖంతో నిలచిన రుద్రుని బ్రహ్మయొక్క పంచమముఖం ఇలా గద్దించింది.

అహం తే ప్రతిజానామి తమోమూర్తే త్రిలోచన ।
దిగ్వాసా వృషభారూఢో లోకక్షయకరో భవాన్ ॥33॥

ఇత్యుక్తః శంకరః క్రుద్ధో బ్రహ్మాణం ఘోరచక్షుషా ।
నిర్దగ్ధుకామస్త్వనిశం దదర్శ భగవానజః ॥34॥

ఓ త్రిలోచనా! "తమోమూర్తివైన నీవు దిగంబరుడవై, వృషభారూఢుడవై, లోకక్షయాన్ని కలుగజేస్తావని నాకు బాగా తెలుసు" అని బ్రహ్మ ఐదవముఖం పలుకగా శంకరుడు కోపోద్రిక్తుడై, భయంకరమైన దృష్టితో బ్రహ్మ ఐదవముఖాన్ని భస్మంచేయడానికి తిలకించాడు.

తతస్త్రినేత్రస్య సముద్భవన్తి వక్త్రాని పంచాథ సుదర్శనాని ।
సితం చ రక్తం కనకావదాతం నీలం తథా పింగజటం చ శుభ్రమ్ ॥35॥

వెంటనే ఆ త్రినేత్రునకు శ్వేతారుణ, కనక, నీల, పింగళ వర్ణాలతో మనోహరమైన ఐదు ముఖాలేర్పడ్డాయి.

వక్త్రాణి దృష్ట్వాఽర్కసమాని సద్యః పితామహో వాక్యమువాచ రుద్రమ్ ।
సమాహతస్యాథ జలస్య బుద్బుదా భవంతి కిం తేషు పరాక్రమోఽస్తి ॥36॥

తచ్ఛ్రుత్వా క్రోధయుక్తేన శంకరేణ మహాత్మనా ।
నఖాగ్రేణ శిరశ్ఛిన్నం బ్రాహ్మం పరుషవాదినమ్ ॥37॥

తచ్ఛిన్నం శంకరస్యైవ సవ్యే కరతలేఽఽపతత్ ।
పతతే న కదాచిచ్చ తదా కరతలాచ్ఛిరః ॥38॥

సూర్యకాంతితో ప్రకాశించే ఆ ముఖాలను చూచి, బ్రహ్మ రుద్రునితో ఇలా పలికాడు. "వాననీళ్ళలో లేచే బుడగల వంటివే నీముఖాలు. బుద్బుదములవంటి నీ ముఖాలకు పరాక్రమం ఏముంటుంది?". ఆ మాటలు వినిన శంకరుడు క్రోధంతో వెంటనే పరుషవాక్యాలు ప్రేలుతున్న బ్రహ్మయొక్క ఐదవముఖాన్ని గోటికొనతో త్రుంచివేశాడు.

ఆ విధంగా తెగిన బ్రహ్మముఖం వెంటనే శివుని అరచేతిలో పడింది. అట్లు పడిన బ్రహ్మ శిరస్సు ఎంత ప్రయత్నించినను శివుని అరచేతినుండి ఊడిపడడంలేదు.

అథ క్రోధావృతేనాపి బ్రహ్మణాద్భుతకర్మణా ।
సృష్టస్తు పురుషో ధీమాన్ కవచీ కుండలీ శరీ ॥39॥

ధనుష్పాణిర్మహాబాహుర్బాణశక్తిధరోఽవ్యయః ।
చతుర్భుజో మహాతూణీ ఆదిత్యసమదర్శనః ॥40॥

స త్వాహ గచ్ఛ దుర్బుద్ధే మా త్వాం శూలిన్నిపాతయే ।
భవాన్పాపసమాయుక్తః పాపిష్ఠం కో జిఘాంసతి ॥41॥

ఇత్యుక్తః శంకరస్తేన పురుషేణ మహాత్మనా ।
త్రపాయుక్తో జగామాథ రుద్రో బదరికాశ్రమమ్ ॥42॥

నరనారాయణస్థానం పర్వతే హి హిమాలయే ।
సరస్వతీ యత్ర పుణ్యా స్యందతే సరితాం వరా ॥43॥

తత్ర గత్వా చ తం దృష్ట్వా నారాయణమువాచ హ ।
భిక్షాం ప్రయచ్ఛ భగవన్మహాకారుణికోఽసి భోః ॥44॥

ఇత్యుక్తో ధర్మపుత్రస్తు రుద్రం వచనమబ్రవీత్ ।
సవ్యం భుజం తాడయస్వ త్రిశూలేన మహేశ్వర ॥45॥

నారాయణవచః శ్రుత్వా త్రిశూలేన మహేశ్వరః ।
సవ్యం నారాయణభుజం తాడయామాస వేగవాన్ ॥46॥

త్రిశూలాభిహతాన్మార్గాత్ తిస్రో ధారా వినిర్యయుః ।
ఏకా గగనమాశ్రిత్య స్థితా తారాభిమండితమ్ ॥47॥

అద్భుతశక్తి గల బ్రహ్మ కూడ అందులకు కోపించి, కవచకుండల శరాలంకృతుడైనట్టియు, బుద్ధిమంతుడైనట్టియు ఒక పురుషుని సృష్టించాడు. అతడు మహాబాహువు, చతుర్భుజుడు, అవ్యయుడు, తన చతుర్భుజాలతో ధనుస్సు, బాణాలు, శక్తి, అమ్ములపొది ధరించి, సూర్యునివలె ప్రకాశిస్తున్నాడు. ఆ దివ్యపురుషుడు శంకరునితో ఇలా పలికాడు "ఓ శంకరా! దుర్బుద్ధీ! నీవు పాపిష్ఠుడవు. నిన్ను నేను సంహరిస్తాను. పాపిష్ఠిని సంహరింపని వాడెవడు?". అతని మాటలకు శంకరుడు సిగ్గుపడి వెంటనే బదరికాశ్రమానికి వెళ్ళాడు.

బదరికాశ్రమం నరనారాయణుల తపోభూమి. హిమవత్పర్వతంపై నున్నది. పరమపవిత్రమైన సరస్వతీనది ప్రవహించే పుణ్యప్రదేశమది. శంకరుడక్కడకు వెళ్ళి, నారాయణుని దర్శించి, "ప్రభో! మీరు అత్యంత కరుణార్ద్ర హృదయులు. భిక్షార్థినై వచ్చాను. కాబట్టి నాకు భిక్షను ప్రసాదించండి". అన్నాడు. రుద్రుడిలా పలుకగానే ధర్మపుత్రుడైన

నారాయణుడు శంకరుని చూసి "ఓ మహేశ్వరా! నీ త్రిశూలంతో నా ఎడమ భుజాన్ని కొట్టు" అన్నాడు. నారాయణుని మాటలను విని మహేశ్వరుడు తన త్రిశూలంతో నారాయణుని ఎడమభుజాన్ని వేగంగా కొట్టాడు. త్రిశూలంచే కొట్టబడిన చోటునుండి మూడు ధారలు బయటకు ప్రవహించాయి. అందొకటి నక్షత్రములచే అలంకరింపబడిన ఆకాశమార్గంలో స్థిరపడింది.

ద్వితీయా న్యపతద్భూమౌ తాం జగ్రాహ తపోధనః ।
అత్రిస్తస్మాత్సముద్భూతో దుర్వాసాః శంకరాంశతః ॥48॥

రెండవధార భూమిపై పడింది. దానిని తపోధనుడైన అత్రిమహర్షి గ్రహించాడు. అందుండి శివాంశతో దుర్వాసమహర్షి జన్మించాడు.

తృతీయా న్యపతద్ధారా కపాలే రౌద్రదర్శనే ।
తస్మాచ్ఛిశుః సమభవత్సంనద్ధ కవచో యువా ॥49॥

మూడవధార భయంకరమైన కపాలంమీద పడింది. దానినుండి కవచంతో కూడిన యువకుడొకడు జన్మించాడు.

శ్యామావదాతః శరచాపపాణిః గర్జన్యథా ప్రావృషి తోయదోఽసౌ ।
ఇత్థం బ్రువన్ కస్య విశాతయామి స్కంధాచ్ఛిరస్తాలఫలం యథైవ ॥50॥

శ్యామమనోహరకాంతితో ధనుర్బాణాలు ధరించిన అతడు "తాళవృక్షం నుండి తాళఫలాలను పడగొట్టిన విధంగా ఎవరి శరీరంనుండి శిరస్సును పడగొట్టాలో చెప్పండి" అని వర్షాకాలంలో మేఘంవలె గర్జించాడు.

తం శంకరోఽభ్యేత్య వచో బభాషే నరం హి నారాయణ బాహుజాతమ్ ।
నిపాతయైనం నర దుష్టవాక్యం బ్రహ్మాత్మజం సూర్యశతప్రకాశమ్ ॥51॥

నారాయణుని బాహువునుండి జన్మించిన ఆ యువకునితో శంకరుడిలా పలికాడు "ఓ నరుడా! వందమంది సూర్యుల ప్రకాశంతో వెలుగుతూ దుర్వాక్యాలు పలుకుతున్న బ్రహ్మపుత్రుడైన ఈ దుష్టుని సంహరింపుము".

ఇత్యేవముక్తః స తు శంకరేణ ఆద్యం ధనుస్త్వాజగవం ప్రసిద్ధమ్ ।
జగ్రాహ తూణాని తథాఽక్షయాణి యుద్ధాయ వీరః స మతిం చకార ॥52॥

శంకరుడిట్లు పలుకగానే అతడు ఆజగవ మనబడే ప్రసిద్ధ ధనుస్సును, అక్షయ తూణీరాలను తీసుకొని యుద్ధానికి సిద్ధపడ్డాడు.

తతః ప్రయుద్ధౌ సుభృశం మహాబలౌ బ్రహ్మాత్మజో బాహుభవశ్చ శార్వః ।
దివ్యం సహస్రం పరివత్సరాణాం తతో హరోఽభ్యేత్య విరంచిమూచే ॥53॥

అంతట మహావీరుడైన బ్రహ్మతనూజుడు, శర్వునివలనకల్గిన బాహుభవుడు వేయి దివ్యసంవత్సరాలు భయంకరమైన యుద్ధం చేశారు. అంతట హరుడు బ్రహ్మతో ఇలా పలికాడు.

జితస్త్వదీయః పురుషః పితామహం నరేణ దివ్యాద్భుతకర్మణా బలీ ।
మహాపృషత్కైరభిపత్య తాడితస్తదద్భుతం చేహ దిశో దశైవ ॥54॥

బ్రహ్మా తమీశం వచనం బభాషే నేహాస్య జన్మాన్యజితస్య శంభో ।
పరాజితశ్చేష్యతేఽసౌ త్వదీయో నరో మదీయః పురుషో మహాత్మా ॥55॥

"ఓ పితామహా! అద్భుతబలశాలియైన ఒక నరుని బాణాల తాకిడికి నీ దివ్యపురుషుడు పరాజితుడయ్యాడు. ఇది దశదిశలలోను పరమాద్భుతమైన సంఘటన. ఇట్లు పలికిన ఈశ్వరునితో బ్రహ్మ ఇలా పలికాడు.

"ఓ శంకరా! ఒక సాధారణమానవునిచే ఓడింపబడిన మహాత్ముడైన నా పురుషుడు ఈ లోకంలో జన్మించినవాడు కాడు. నిజానికి సాధారణుడైన ఈ నరుడే ఓడిపోవలసియున్నది". అని పలికాడు.

ఇత్యేవముక్త్వా వచనం త్రినేత్రం చిక్షేప సూర్యే పురుషం విరించేః ।
నరం నరస్యైవ తదా స విగ్రహే చిక్షేప ధర్మప్రభవస్య దేవః ॥56॥

బ్రహ్మ మాటలను వినిన శంకరుడు వెంటనే ఓడిపోయిన బ్రహ్మపుత్రుని సూర్యునిలోనికి విసిరివేశాడు. నారాయణబాహువునుండి జన్మించిన వీరుని నారాయణ దేహంలోనికి విసిరివేశాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే నరోత్పత్తిప్రళయో నామ ద్వితీయోఽధ్యాయః ॥2॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి నరోత్పత్తి, ప్రళయమనబడే రెండవ అధ్యాయం సమాప్తం.



తృతీయోஉధ్యాయః – మూడవ అధ్యాయం
కపాలమోచనతీర్థమాహాత్మ్యకథనమ్ – కపాలమోచనతీర్థమాహాత్మ్యకథనం

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తతః కరతలే రుద్రః కపాలే దారుణే స్థితే ।
సంతాపమగమద్ బ్రహ్మంశ్చింతయా వ్యాకులేంద్రియః ॥1॥

ఓ నారదా! తన చేతికంటుకొనిన బ్రహ్మకపాలం అట్లే ఉండడంచేత రుద్రుడెంతో వ్యాకులుడయ్యాడు.

తతః సమాగతా రౌద్రా నీలాంజనచయప్రభా ।
సంరక్తమూర్ధజా భీమా బ్రహ్మహత్యా హరాన్తికమ్ ॥2॥

అప్పుడు కాటుకకొండవలె భయంకరాకారంతో ఎర్రని వెంట్రుకలతో రూపుదాల్చిన బ్రహ్మహత్య రుద్రుని సమీపించింది.

తమాగతాం హరో దృష్ట్వా పప్రచ్ఛ వికరాలినీమ్ ।
కాஉసి త్వమాగతా రౌద్రే కేనాప్యర్థేన తద్వద ॥3॥

కరాళాకృతితో వచ్చిన ఆమెను చూసి శంకరుడు "ఓ క్రూరురాలా! నీవెవ్వతెవు? ఇచ్చటికేల వచ్చితివి? చెప్పుము?" అన్నాడు.

కపాలినమథోవాచ బ్రహ్మహత్యా సుదారుణా ।
బ్రహ్మహత్యాஉస్మి సంప్రాప్తా మాం ప్రతీచ్ఛ త్రిలోచన ॥4॥

అప్పుడాభీకరాంగన కపాలితో ఇలా పలికింది "త్రిలోచనా! నేను బ్రహ్మహత్యను, నన్ను స్వీకరించు" అని

ఇత్యేవముక్త్వా వచనం బ్రహ్మహత్యా వివేశ తమ్ ।
త్రిశూలపాణినం రుద్రం సంప్రతాపితవిగ్రహమ్ ॥5॥

ఇట్లు పలికి బ్రహ్మహత్య సంతాపంతో దహనమౌతున్న శరీరం కలవాడును, త్రిశూలధారియునైన రుద్రుని శరీరంలో ప్రవేశించింది. రుద్రుడందులకు ఎంతయో పరితాపం చెందాడు. ఆయన దేహమంతయు కంపించింది.

బ్రహ్మహత్యాభిభూతశ్చ శర్వో బదరికాశ్రమమ్ ।
ఆగచ్ఛన్న దదర్శాథ నరనారాయణావృషీ ॥6॥

ఓ నారదా! బ్రహ్మహత్య సోకిన శంకరుడు వెంటనే బదరికాశ్రమానికి పరుగు తీశాడు. కాని అక్కడ ఆయనకు నరనారాయణులు కనబడలేదు.

అదృష్ట్వా ధర్మతనయౌ చింతాశోకసమన్వితః ।
జగామ యమునాం స్నాతుం సాஉపి శుష్కజలాஉభవత్ ॥7॥

ధర్మపుత్రులు కన్పించకపోవడంతో చింతాశోకవ్యాకులితుడైన శంకరుడు యమునానదికి స్నానం చేయబోగా ఆ నది ఎండిపోయింది.

కాళిందీం శుష్కసలిలాం నిరీక్ష్య వృషకేతనః ।
ప్లక్షజాం స్నాతుమగమదంతర్ధానం చ సా గతా ॥8॥

వృషకేతనుడు కాళిందిలో నీరు లేకపోవడంతో ప్లక్షజానదిలో స్నానమాడబోయాడు. అప్పుడు ఆ నదికూడా ఎండిపోయియున్నది.

తతోఽనుపుష్కరారణ్యం మాగధారణ్యమేవ చ ।
సైంధవారణ్యమేవాసౌ గత్వా స్నాతో యథేచ్ఛయా ॥9॥

అక్కడనుండి పుష్కరారణ్యం, మగధారణ్యం, సైంధవారణ్యం వెళ్ళి అక్కడి జలాలలో యథేచ్ఛగా స్నానం చేశాడు.

తథైవ నిమిషారణ్యం ధర్మారణ్యం తథేశ్వరః ।
స్నాతో నైవ చ సా రౌద్రా బ్రహ్మహత్యా వ్యముంచత ॥10॥

తదనంతరం ఈశ్వరుడు ధర్మారణ్య, నిమిషారణ్య తీర్థాలలో మునిగినప్పటికి అతనిని బ్రహ్మాహత్య వదలలేదు.

సరిత్సు తీర్థేషు తథాఽశ్రమేషు పుణ్యేషు దేవాయతనేషు శర్వః ।
సమాప్లుతో యోగయుతోఽపి పాపాన్నావాప మోక్షం వృషభధ్వజోఽసౌ ॥11॥

అంతట వృషభధ్వజుడైన శివుడు ఎన్నో సరస్సులలో, నదులలో, తీర్థాలలో మునిగినను పుణ్యాశ్రమాలలో దేవాయతనాలలో పూజలు, యోగాభ్యాసాలు చేసినను బ్రహ్మహత్య అతనిని వదలలేదు.

తతో జగామ నిర్విణ్ణః శంకరః కురుజాఙ్గలమ్ ।
తత్ర గత్వా దదర్శాథ చక్రపాణిం ఖగధ్వజమ్ ॥12॥

దానితో నిర్విణ్ణుడైన శంకరుడు కురుజాంగలభూమి చేరి, అందున్న గరుడధ్వజుడు, చక్రపాణియునైన పుండరీకాక్షుని దర్శించాడు.

తం దృష్ట్వా పుండరీకాక్షం శంఖచక్రగదాధరమ్ ।
కృతాంజలిపుటో భూత్వా హరః స్తోత్రముదీరయత్ ॥13॥

శంఖచక్రగదాధరుడైన పుండరీకాక్షుని దర్శించి హరుడు అంజలి ఘటించి ఈ విధంగా స్తోత్రం చేశాడు.
హర ఉవాచ – హరుడు పలికాడు.

నమస్తే దేవతానాథ నమస్తే గరుడధ్వజ ।
శంఖచక్రగదాపాణే వాసుదేవ నమోఽస్తు తే ॥14॥

ఓ దేవతానాథా! నీకు నమస్కారం. ఓ గరుడధ్వజా! నీకు నమస్కారం. శంకచక్రగదాధరా!, వాసుదేవా! నీకు నమస్కారం.

నమస్తే నిర్గుణానన్త అప్రతర్క్యాయ వేధసే ।
జ్ఞానాజ్ఞాన నిరాలంబ సర్వాలంబ నమోఽస్తు తే ॥15॥

నిర్గుణా! అనన్తా! అప్రతర్క్యా! సృష్టికర్తా! జ్ఞానాజ్ఞానస్వరూపా! సర్వాధారా! నిరాధారా! నీకు నమోవాకాలు.

రజోయుక్త నమస్తేఽస్తు బ్రహ్మమూర్తే సనాతన ।
త్వయా సర్వమిదం నాథ జగత్సృష్టం చరాచరమ్ ॥16॥

రజోగుణీ! బ్రహ్మమూర్తీ! సనాతనా! నీకు నమస్కారం. చరాచరాత్మకమైన ఈ జగత్తంతయు నీ సృష్టియే. నీకు వందనము.

సత్త్వాధిష్ఠిత లోకేశ విష్ణుమూర్తే అధోక్షజ ।
ప్రజాపాల మహాబాహో జనార్దన నమోఽస్తు తే ॥17॥

సత్త్వగుణాశ్రయుడవై ప్రజాపాలనమొనరించు అధోక్షజా! లోకేశ్వరా! విష్ణుమూర్తీ! ప్రజాపాలకా! మహాబాహూ! జనార్దనా! నీకు నమస్కారము.

తమోమూర్తే అహం హ్యేష త్వదంశక్రోధసంభవః ।
గుణాభియుక్తో దేవేశ సర్వవ్యాపిన్ నమోఽస్తు తే ॥18॥

ఓ తమోమూర్తీ! నేను నీ క్రోధాంశ సంభవుడను. ఓ సర్వవ్యాపీ! దేవేశా! నీకు ప్రణామం.

భూరియం త్వం జగన్నాథ జలమంబరపావకౌ ।
వాయుర్బుద్ధిర్మనశ్చాపి శర్వరీ త్వం నమోఽస్తు తే ॥19॥

ఓ జగన్నాథా! ఈ భూమి, నీరు, ఆకాశం, అగ్ని, వాయువు, బుద్ధి, మనస్సు, దివారాత్రులు నీవే. నీకు నమస్కారము.

ధర్మో యజ్ఞస్తపః సత్యమహింసా శౌచమార్జవమ్ ।
క్షమా దానం దయా లక్ష్మీర్బ్రహ్మచర్యం త్వమీశ్వర ॥20॥

ఓ ప్రభూ! ధర్మం, యజ్ఞం, తపస్సు, సత్యం, అహింస, శౌచం, ఋజుభావనం, క్షమాగుణం, దానం, దయ, లక్ష్మి, బ్రహ్మచర్యం అన్నియు నీవే.

త్వం సాంగాశ్చతురో వేదాస్త్వం వేద్యో వేదపారగః ।
ఉపవేదా భవానీశ సర్వోఽసి త్వం నమోఽస్తు తే ॥21॥

ప్రభూ! షడంగాలతో కూడిన నాలుగు వేదాలు నీవే. వేదపారగుడవు నీవే. వేదవేద్యుడవు నీవే. ఉపవేదాలు నీవే. సమస్తమూ నీవే. నీకు నమస్సులు.

నమో నమస్తేఽచ్యుత చక్రపాణే నమోఽస్తు తే మాధవ మీనమూర్తే ।
లోకే భవాన్ కారుణికో మతో మే త్రాయస్వ మాం కేశవ పాపబంధాత్ ॥22॥

ఓ అచ్యుతా! చక్రపాణీ! మాధవా! మత్స్యమూర్తీ! నీకు నమస్కారము. లోకంలో పరమకారుణికుడవైన వాడవు నీవే. ఓ కేశవా! ఈ పాపబంధాలనుండి నన్ను రక్షింపుము.

మమాశుభం నాశయ విగ్రహస్థం యద్బ్రహ్మహత్యాభిభవం బభూవ ।
దగ్ధోఽస్మి నష్టోఽస్మ్యసమీక్ష్య కారీ పునీహి తీర్థోఽసి నమో నమస్తే ॥23॥

నా దేహగతమైన అశుభాన్ని హరించుము. బ్రహ్మహత్యాసంభవమైన అగ్నిలో నేను దగ్ధమౌతున్నాను. నష్టమును పొందుచున్నాను. వివేకహీనుడను. నీవు తీర్థస్వరూపుడవు. నన్ను పవిత్రుని గావింపుము. నీకు అనేక వందనాలు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏవం స్తుతశ్చక్రధరః శంకరేణ మహాత్మనా ।
ప్రోవాచ భగవాన్వాక్యం బ్రహ్మహత్యాక్షయాయ హి ॥24॥

ఈ విధంగా మహాత్ముడైన శంకరునిచే స్తుతింపబడిన చక్రధరుడు బ్రహ్మహత్యానివారణకై ఇలా పలికాడు.

హరిరువాచ – హరి పలికాడు.

మహేశ్వర శ్రుణుష్వేమాం మమ వాచం కలస్వనామ్ ।
బ్రహ్మహత్యాక్షయకరీం శుభదాం పుణ్యవర్ధనీమ్ ॥25॥

యోఽసౌ ప్రాఙ్మండలే పుణ్యే మదంశప్రభవోఽవ్యయః ।
ప్రయాగే వసతే నిత్యం యోగశాయీతి విశ్రుతః ॥26॥

చరణాద్దక్షిణాత్తస్య వినిర్యాతా సరిద్వరా ।
విశ్రుతా వరణేత్యేవం సర్వపాపహరా శుభా ॥27॥

సవ్యాదన్యా ద్వితీయా చ అసిరిత్యేవ విశ్రుతా ।
తే ఉభే తు సరిచ్ఛ్రేష్ఠే లోకపూజ్యే బభూవతుః ॥28॥

తాభ్యాం మధ్యే తు యో దేశస్తత్ క్షేత్రం యోగశాయినః ।
త్రైలోక్య ప్రవరం తీర్థం సర్వపాపప్రమోచనమ్ ।
న తాదృశోఽస్తి గగనే న భూమ్యాం న రసాతలే ॥29॥

తత్రాస్తి నగరీ పుణ్యా ఖ్యాతా వారాణసీ శుభా ।
యస్యాం హి భోగినోఽపీశ ప్రయాన్తి భవతో లయమ్ ॥30॥

విలాసినీనాం రశనాస్వనేన శ్రుతిస్వనైర్బ్రాహ్మణపుంగవానామ్ ।
శుచిస్వరత్వం గురవో నిశమ్య హాస్యాదశాసన్త ముహుర్ముహుస్తాన్ ॥31॥

మహేశ్వరా! బ్రహ్మహత్యానివారకములు, కర్ణమధురములు, శుభంకరములు, పుణ్యవర్ధనములునైన నా పలుకులు వినుము. ఇక్కడకు తూర్పుగా ప్రయాగక్షేత్రంలో అవ్యయమైన నా అంశంవలన జన్మించిన యోగశాయి నిత్యనివాసియై యున్నాడు. అతని దక్షిణచరణం నుండి సర్వపాపనాశిని, శుభదాయినియైన **"వరుణానది"** ఉద్భవించింది, రెండవదైన వామచరణం నుండి **"అసి"** అనబడు నది వెలువడింది. ఈ రెండునదులు లోకపూజ్యములు, అతిపవిత్రమైన, శ్రేష్ఠమైన నదులు. ఆ రెంటికి మధ్యనున్న యోగశాయిక్షేత్రం సర్వపాపాలు పోగొట్టు పవిత్రతీర్థం. ఇది ముల్లోకాలలో శ్రేష్ఠమైనది. స్వర్గమర్త్యపాతాళాలలో దీనితో సమానమైన క్షేత్రం వేరొకటిలేదు. ఈశ్వరా! అక్కడ పరమపవిత్రము, మంగళకరమునైన వారాణసి నగరమున్నది. ఆ ప్రదేశంలో భోగులు కూడా నీలో లయం పొందుతారు. అచ్చట విలాసినీస్త్రీల మొలనూలు ధ్వనులు, విప్రశ్రేష్ఠుల వేదధ్వనులతో కలసి పవిత్రతను సంతరించుకుంటాయి. వాని శ్రవణసుభగత్వాన్ని పెద్దలు మందహాసవదనాలతో మాటిమాటికి విని ఆమోదిస్తారు.

వ్రజత్సు యోగిత్సు చతుష్పథేషు పదాన్యలక్తారుణితాని దృష్ట్వా ।
యయౌ శశీ విస్మయమేవ యస్యాం కింస్విత్ప్రయాతా స్థలపద్మినీయమ్ ॥32॥

లత్తుక పారాణి పూసిన వారాణసీపురస్త్రీల చరణచిహ్నాలతో అలంకృతమైన చతుష్పథాలను చంద్రుడు చూచి స్థలపద్మినులు ఆ త్రోవలలో నడిచారా? అని ఆశ్చర్యాన్ని పొందుతాడు.

తుంగాని యస్యాం సురమందిరాణి రుంధన్తి చంద్రం రజనీముఖేషు ।
దివాఽపి సూర్యం పవనాప్లుతాభిర్దీర్ఘాభిరేవం సుపతాకికాభిః ॥33॥

ఆ నగరంలోని ఆకాశాన్నంటే దేవాలయాలు, రాత్రులందు చంద్రకాంతిని, దేవాలయశిఖరాలపై రెపరెపలాడు సుందరమైనట్టియు, మరియు దీర్ఘమైనట్టి, పతాకాలు పగటియందు సూర్యరశ్మిని నిరోధిస్తున్నాయి.

భృంగాశ్చ యస్యాం శశికాంతభిత్తౌ ప్రలోభ్యమానాః ప్రతిబింబితేషు ।
ఆలేఖ్య యోషిద్విమలాననాబ్జేష్వీయుర్భ్రమాన్నైవ చ పుష్పకాన్తరమ్ ॥34॥

అచ్చటి చంద్రకాంతశిలాభిత్తికలపై చిత్రింపబడిన స్త్రీల ముఖపద్మాల ప్రతిబింబాలను చూసి, తుమ్మెదలు భ్రమించి, వానిని వదలి, నిజమైన ఏ ఇతర పుష్పముల వంకకు పోవడంలేదు.

పరిశ్రమశ్చాపి పరాజితేషు నరేషు సమ్మోహనలేఖనేన ।
యస్యాం జలక్రీడనసంగతాసు న స్త్రీషు శంభో గృహదీర్ఘికాసు ॥35॥

అచ్చట వినోదక్రీడలలో పరాజితులైనవారిలో కూడ అలసట గోచరింపదు. తమ గృహములందలి ఈత కొలనులలో జలక్రీడలాడు స్త్రీలలో కూడా పరిశ్రాంతి ఏ మాత్రం కనిపించదు.

న చైవ కశ్చిత్ పరమందిరాణి రుణద్ధి శంభో సహసా ఋతేऽక్షాన్ ।
న చాబలానాం తరసా పరాక్రమం కరోతి యస్యాం సురతం హి ముక్త్వా ॥36॥

శంభో! ఆ నగరవాసులలో ద్యూతక్రీడలలో తప్ప పరగృహములనాక్రమించువారు లేరు. అనంగక్రీడలలో తప్ప అబలలపై పరాక్రమం చూపువారుండరు.

పాశగ్రన్థిర్గజేంద్రాణాం దానచ్ఛేదో మదచ్యుతౌ ।
యస్యాం మానమదౌ పుంసాం కరిణాం యౌవనాగమే ॥37॥

అక్కడ గజరాజులను బంధించడానికే పాశగ్రంథి వేయబడుతుంది. మదపుటేనుగులలోనే దానజలనిరోధం కన్పిస్తుంది. యౌవనంలోనున్న మగఏనుగులలోనే మానం (దేహపు కొలత) మదం (మదజలం) కనిపిస్తాయి. ఈ నాలుగు అవలక్షణాలు అచ్చటనున్న ఎవ్వరిలోను కానరావని భావము.

ప్రియదోషాః సదా యస్యాం కౌశికా నేతరే జనాః ।
తారాగణేऽకులీనత్వం గద్యే వృత్తచ్యుతిర్విభో ॥38॥

ఓ ఈశ్వరా! ఆ నగరమందలి కౌశికులే (గుడ్లగూబలే) దోష (రాత్రి) ప్రియులు. ఇతర జనులు కారు. అకులీనత్వం (భూమిలో లీనం కాకుండుట) నక్షత్రాలలోనే. వృత్తచ్యుతి (శీలము, ఛందోవృత్తము లేకుండుట) గద్యమునందే.

భూతిలుబ్ధా విలాసిన్యో భుజంగపరివారితాః ।
చంద్రభూషితదేహాశ్చ యస్యాం త్వమివ శంకర ॥39॥

ఓ శంకరా! భూతి (ఐశ్వర్యం) లోభం కలిగిన అచటి వారాంగనలే భుజంగులతో (విటులతో) చంద్రులతో (చంద్రహారాలతో) భూషితులై, నీవలె విహరిస్తూ ఉంటారు. ఈశ్వరుడు భస్మసర్పచంద్రాలంకృతుడు. వారాంగనలు ఐశ్వర్య విట చంద్రహారాలంకృతులు అని భావము. తక్కినవారికి లోభం లేదని స్పష్టము.

ఈదృశాయాం సురేశాన వారాణస్యాం మహాశ్రమే ।
వసతే భగవాంల్లోలః సర్వపాపహరో రవిః ॥40॥

ఓ ఈశానా! ఇట్టిగుణవిశిష్టమైన వారాణసీపుణ్యాశ్రమంలో సర్వపాపహరుడైన లోలార్కదేవుడు నివసిస్తున్నాడు.

దశాశ్వమేధం యత్రోక్తం మదంశో యత్ర కేశవః ।
తత్ర గత్వా సురశ్రేష్ఠ పాపమోక్షమవాప్స్యసి ॥41॥

దశాశ్వమేధక్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన అచ్చోట నా అంశతో కేశవుడున్నాడు. ఓ సురశ్రేష్ఠా! నీవచ్చటకు వెళ్ళిన వెంటనే బ్రహ్మహత్యాపాపంనుండి ముక్తిని పొందగలవు.

ఇత్యేవముక్తో గరుడధ్వజేన వృషధ్వజస్తం శిరసా ప్రణమ్య ।
జగామ వేగాద్గరుడో యథాసౌ వారాణసీం పాపవిమోచనాయ ॥42॥

ఇట్లు పలికిన గరుడధ్వజుని పలుకులు వినగానే వృషధ్వజుడు కేశవునకు శిరసా నమస్కరించి, తన పాపవిముక్తికై వారాణసీక్షేత్రానికి గరుత్మంతుడు వెళ్ళిన విధంగా అతివేగంగా వెళ్ళాడు.

గత్వా సుపుణ్యాం నగరీం సుతీర్థాం దృష్ట్వా చ లోలం స దశాశ్వమేధమ్ ।
స్నాత్వా చ తీర్థేషు విముక్తపాపః స కేశవం ద్రష్టుముపాజగామ ॥43॥

అక్కడకు వెళ్ళి, శంకరుడు పవిత్రతీర్థాలతో కూడిన ఆ పుణ్యనగరిని దర్శించి, అందలి తీర్థాలలో స్నానమాడి, దశాశ్వమేధాన్ని, లోలార్కుని దర్శించి, సర్వపాపాలనుండియు విముక్తుడై కేశవుని దర్శించడానికి తిరిగి వెళ్ళాడు.

కేశవం శంకరో దృష్ట్వా ప్రణిపత్యేదమబ్రవీత్ ।
త్వత్ప్రసాదాద్ధృషీకేశ బ్రహ్మహత్యా క్షయంగతా ॥44॥

నేదం కపాలం దేవేశమద్ధస్తం పరిముంచతి ।
కారణం వేద్మి నైవైతత్తన్మే త్వం వక్తుమర్హసి ॥45॥

శంకరుడు కేశవునకు నమస్కరించి ఇలా పలికాడు. "ఓ హృషీకేశా! నీ దయవల్ల బ్రహ్మహత్యాపాతకం తొలగిపోయింది. కాని ఈ కపాలం మాత్రం నా అరచేతిని వదలకున్నది. దీనికి కారణం నాకు తెలియలేదు. దీనిని నీవే నాకు వివరించాలి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు

మహాదేవవచః శ్రుత్వా కేశవో వాక్యమబ్రవీత్ ।
విద్యతే కారణం వత్స తత్సర్వం కథయామి తే ॥46॥

యోఽసౌ సమాగతో దివ్యో హ్రదః పద్మోత్పలైర్యుతః ।
ఏష తీర్థవరః పుణ్యో దేవగంధర్వపూజితః ॥47॥

ఏతస్మిన్ ప్రవరే తీర్థే స్నానం శంభో సమాచర ।
స్నాతమాత్రస్య చాద్యైవ కపాలం పరిమోక్ష్యతి ॥48॥

తతః కపాలీ లోకే చ ఖ్యాతో రుద్ర భవిష్యసి ।
కపాలమోచనేత్యేవం తీర్థం చేదం భవిష్యతి ॥49॥

మహాదేవుని పలుకులు విని కేశవుడిలా పలికాడు "ఓ వత్సా! కపాలమోచనోపాయం నీకు తెలియజేస్తాను. వినుము. ఇదిగో నా ఎదుటనే పద్మోత్పలాలతో నిండియున్న ఈ దివ్యసరోవరం పరమపవిత్రమైన తీర్థరాజము. దేవగంధర్వసేవితమైన పుణ్యతీర్థమిది. ఓ శంభో! శ్రేష్ఠమైన ఈ తీర్థంలో నీవు స్నానమాచరింపుము. నీవు దీనిలో స్నానం చేసినంతమాత్రం చేతనే వెంటనే కపాలమోచనం కాగలదు. ఓ రుద్రా! ఆ కారణంచేత ఈ తీర్థానికి **"కపాలమోచన"** క్షేత్రమనియు, నీకు **"కపాలి"** అనియు ప్రసిద్ధి కలుగుతుంది.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏవముక్తః సురేశేన కేశవేన మహేశ్వరః ।
కపాలమోచనే సస్నౌ వేదోక్తవిధినా మునే ॥50॥

ఓ నారదమహర్షీ! కేశవుడీవిధంగా పలుకగానే మహేశ్వరుడు వేదోక్తవిధిగా కపాలమోచనతీర్థంలో స్నానమాచరించాడు.

స్నాతస్య తీర్థే త్రిపురాన్తకస్య పరిచ్యుతం హస్తతలాత్కపాలమ్ ।
నామ్నా బభూవాథ కపాలమోచనం తత్తీర్థవర్యం భగవత్ప్రసాదాత్ ॥51॥

అట్లు త్రిపురాంతకుడు కపాలమోచనతీర్థంలో స్నానమాచరింపగానే ఆయన అరచేతికంటుకొనియున్న బ్రహ్మకపాలం ఊడిపడింది. భగవత్ప్రసాదంవల్ల ఆ తీర్థం **"కపాలమోచన"** మను పేరుతో పవిత్రతీర్థరాజమై ప్రఖ్యాతి చెందింది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే కపాలమోచన తీర్థమాహాత్మ్య కథనం నామ తృతీయోఽధ్యాయః ॥3॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి కపాలమోచన తీర్థమాహాత్మ్య కథనం అనే మూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్థో౽ధ్యాయః – నాల్గవ అధ్యాయం

వీరభద్రాది రుద్రగణోత్పత్తిః – వీరభద్రుడు మున్నగు రుద్రగణాల పుట్టుక

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏవం కపాలీ సంజాతో దేవర్షే భగవాన్హరః ।
అనేన కారణేనాసౌ దక్షేణ న నిమంత్రితః ॥1॥

ఓ దేవర్షీ! ఈ విధంగా భగవంతుడగు హరుడు కపాలి అయ్యాడు.ఆ కారణంచేత దక్షుడు ఆయనను యజ్ఞమునకు ఆహ్వానించలేదు.

ఏతస్మిన్నంతరే దేవీం ద్రష్టుం గౌతమనందినీ ।
జయా జగామ శైలేంద్రం మందరం చారుకందరమ్ ॥2॥

ఇంతలో గౌతమముని కుమార్తెయైన జయ సతీదేవిని దర్శించడానికి అందమైన గుహలతో కూడిన మందరపర్వతానికి వెళ్ళింది.

తామాగతాం సతీ దృష్ట్వా జయామేకామువాచ హ ।
కిమర్థం విజయా నాగాజ్జయంతీ చాపరాజితా ॥3॥

ఒంటరిగా వచ్చిన జయను చూసిన సతీదేవి విజయ, జయంతి, అపరాజితలు ఎందుకు రాలేదు? నీవొక్కతెవే ఏల వచ్చావు? అని ప్రశ్నించింది.

సా దేవ్యా వచనం శ్రుత్వా ఉవాచ పరమేశ్వరీమ్ ।
గతా నిమంత్రితాః సర్వా మఖే మాతామహస్య తాః ॥4॥

సతీదేవి పలుకులను వినిన జయ పరమేశ్వరితో ఇలా పలికింది. " వారందరు మాతామహుడు చేస్తున్న యజ్ఞానికి ఆహ్వానితులై వెళ్ళారు"

సమం పిత్రా గౌతమేన మాత్రా చైవాప్యహల్యయా ।
అహం సమాగతా ద్రష్టుం త్వాం తత్ర గమనోత్సుకా ॥5॥

తండ్రియైన గౌతమునితోను, తల్లియైన అహల్యతోను కలసి వెళ్తూ నిన్ను చూడాలనే కోరికతో నేనిటు వచ్చాను.

కిం త్వం న వ్రజసే తత్ర తథా దేవో మహేశ్వరః ।
నామంత్రితాసి తాతేన ఉతాహోస్విద్వ్రజిష్యసి ॥6॥

నీవచ్చుటకు మహేశ్వరునితోకలసి రావడంలేదా ఏమి? నీ తండ్రి పిలువనంపలేదా? లేక తరువాత వస్తావా?

గతాస్తు ఋషయస్సర్వే ఋషిపత్న్యస్తథా సురాః ।
మాతృష్వసా! శశాంకశ్చ సపత్నీకో గతః క్రతుమ్ ॥7॥

పిన్నీ! ఋషులందరు, ఋషిపత్నులు, దేవతలు, సపత్నీకుడైన చంద్రుడు యజ్ఞానికి వెళ్ళారు.

చతుర్దశసు లోకేషు జన్తవో యే చరాచరాః ।
నిమన్త్రితాః క్రతౌ సర్వే కిం వా త్వం న నిమంత్రితా ॥8॥

పద్నాలుగు భువనాలలోని జంతువులు, చరాచర ప్రాణులందరు ఆహ్వానితులై యజ్ఞానికి వెళ్ళగా నీతండ్రి నిన్ను పిలువలేదా ఏమి? అని పలికింది.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

జయాయాస్తద్వచః శ్రుత్వా వజ్రపాతోపమం సతీ ।
మన్యునాభిప్లుతా బ్రహ్మన్ పంచత్వమగమత్తదా ॥9॥

నారదా! పిడుగుపాటువంటి జయ పలుకులు వినినతోడనే సతీదేవి క్రోధాతిరేకంతో అప్పటికప్పుడే ప్రాణాలు విడిచింది.

జయా మృతాం సతీం దృష్ట్వా క్రోధశోకపరిప్లుతా ।
ముంచతీ వారి నేత్రాభ్యాం సస్వరం విలలాప హ ॥10॥

క్రోధశోకపరిప్లుతయై సతీదేవి మరణించడం చూచి జయ దుఃఖాతిరేకంతో కన్నీరుకారుస్తూ విలపింప సాగింది.

ఆక్రందితధ్వనిం శ్రుత్వా శూలపాణిస్త్రిలోచనః ।
ఆః కిమేతదితీత్యుక్త్వా జయాభ్యాశముపాగతః ॥11॥

ఆ ఆక్రందనధ్వనిని విని, త్రిలోచనుడైన శూలపాణి “ఆ! ఏమిజరిగింది?” అని పలుకుతు జయను సమీపించాడు.

ఆగతో దదృశే దేవీం లతామివ వనస్పతేః ।
కృత్తాం పరశునా భూమౌ శ్లథాంగీం పతితాం సతీమ్ ॥12॥

అలా సమీపించిన శంకరుడు గండ్రగొడ్డలి దెబ్బకు తెగిపడిన తీగవలె నేలకూలిన సతీదేవిని చూశాడు.

దేవీం నిపతితాం దృష్ట్వా జయాం పప్రచ్ఛ శంకరః ।
కిమియం పతితా భూమౌ నికృత్తేవ లతా సతీ ॥13॥

నేలమీద పడియున్న సతీదేవిని చూసిన శంకరుడు “నరుకబడిన తీగవలె ఈమె నేలపై ఎందుకు పడింది?” అని జయనడిగాడు.

సా శంకరవచః శ్రుత్వా జయా వచనమబ్రవీత్ ।
శ్రుత్వా మఖే చ స్వావజ్ఞాం భగిన్యః పతిభిః సహ ॥14॥

ఆదిత్యాద్యాస్త్రిలోకేశ సమం శక్రాదిభిః సురైః ।
మాతృష్వసా విపన్నేయమన్తర్దుఃఖేన దహ్యతీ ॥15॥

శంకరుని పలుకులు విని, జయ ఇలా బదులు పలికింది. "ప్రభూ! తన తోబుట్టువులెల్లరు భర్తలతో సహ ఆహ్వానింపబడి, దక్షయజ్ఞానికి వెళ్ళిన సంగతియు తనకు జరిగిన అవమానమును ఇంద్రాది సకలదేవతలు, ఆదిత్యులు యజ్ఞానికి వెళ్ళిన విషయమును విని, ఈ నా పినతల్లి అంతర్దుఃఖాగ్నిలో క్రుగ్గి ఈ దశను పొందింది".

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తచ్ఛ్రుత్వాఽథ వచో రౌద్రం రుద్రః క్రోధాప్లుతో బభౌ ।
క్రుద్ధస్య సర్వగాత్రేభ్యో నిశ్చేరుః పావకార్చిషః ॥16॥

జయ మాటలు విన్నంతనే రుద్రుడు క్రోధతామ్రాక్షుడయ్యాడు. ఆయన అంగప్రత్యంగాలనుండియు భయంకరమైన అగ్నిజ్వాలలు బయటకు వచ్చాయి.

తతః క్రోధాత్త్రినేత్రస్య గాత్రరోమోద్భవా మునే ।
గణాః సింహముఖా జాతా వీరభద్రపురోగమాః ॥17॥

ఓనారదా! అట్లు క్రోధోన్మత్తుడైన త్రినేత్రుని రోమకూపాలనుండి వీరభద్రుని పురస్కరించుకొని సింహముఖులైన రుద్రగణాలు వెలువడ్డాయి.

గణైః పరివృతస్తస్మాన్మందరాద్ధిమసాహ్వయమ్ ।
గతః కనఖలం తస్మాద్యత్ర దక్షోఽయజత్ క్రతుమ్ ॥18॥

రుద్రగణాలతో పరివృతుడైన రుద్రుడు మందరాద్రినుండి హిమాద్రికి వెళ్ళాడు. అక్కడనుండి దక్షుడు యజ్ఞం చేస్తున్న **"కనఖల"** ప్రదేశానికి వెళ్ళాడు.

తతో గణానామధిపో వీరభద్రో మహాబలః ।
దిశి ప్రత్యుత్తరాయాం చ తస్థౌ శూలధరో మునే ॥19॥

నారదా! అక్కడ గణాధిపుడైన వీరభద్రుడు భయంకరమైన శూలాన్ని ధరించి, యజ్ఞశాలకు పశ్చిమోత్తర దిశలను ఆక్రమించి నిలబడ్డాడు (వాయవ్యదిక్కులో)

జయా క్రోధాద్గదాం గృహ్య పూర్వదక్షిణతః స్థితా ।
మధ్యే త్రిశూలభృచ్ఛర్వస్తస్థౌ కృద్ధో మహాక్రతౌ ॥20॥

జయ క్రోధావేశంతో కంపించిపోతు గదను చేతపట్టుకొని, తూర్పు దక్షిణ దిక్కులను ఆక్రమించి నిలబడింది. (ఆగ్నేయకోణంలో). ఓ మునీ! మధ్యభాగాన త్రిశూలధారియై శర్వుడు భయంకరాకృతితో నిలబడ్డాడు.

మృగారివదనం దృష్ట్వా దేవాః శక్రపురోగమాః ।
ఋషయో దేవగంధర్వాః కిమిదం త్విత్యచింతయన్ ॥21॥

ఇంద్రాదులు, ఋషులు, యక్షగంధర్వులు, దేవతలు, భయంకరమైన, సింహవదనుడైన వీరభద్రుని చూసి "ఇదేమిటని?" చింతించారు.

తతస్తు ధనురాదాయ శరానాశీవిషోపమాన్ ।
ద్వారపాలస్తదా ధర్మో వీరభద్రం ఉపాద్రవత్ ॥22॥

అంతట ద్వారపాలకుడైన ధర్ముడు పామువిషముతో సమానమైన బాణాలు సంధించిన విల్లు గ్రహించి వీరభద్రునికి ఎదురుగా పరుగుతీశాడు.

తమాపతంతం సహసా ధర్మం దృష్ట్వా గణేశ్వరః ।
కరేణైకేన జగ్రాహ త్రిశూలం వహ్నిసన్నిభమ్ ॥23॥

కార్ముకం చ ద్వితీయేన తృతీయేనాథ మార్గణాన్ ।
చతుర్థేన గదాం గృహ్య ధర్మమభ్యద్రవద్గణః ॥24॥

ఆ విధంగా తనపైకి వస్తున్న ధర్ముని చూసి గణేశ్వరుడు అగ్నిసమానమైన శూలాన్ని ఒక చేతితో పట్టుకున్నాడు. రెండవ చేతితో ధనుస్సును, మూడవ చేతితో బాణాలను, నాల్గవచేతితో గదను ధరించి, ధర్ముని తరుమజొచ్చాడు.

తతశ్చతుర్భుజం దృష్ట్వా ధర్మరాజో గణేశ్వరమ్ ।
తస్థావష్టభుజో భూత్వా నానాయుధ ధరోఽవ్యయః ॥25॥

ఖడ్గ చర్మ గదా ప్రాస పరశ్వధవరాంకుశైః ।
చాపమార్గణభృత్తస్థౌ హంతుకామో గణేశ్వరమ్ ॥26॥

నాలుగు భుజాలతో తన్నెదిరించిన గణాధ్యక్షుని చూచి ధర్ముడు అవ్యయుడై తత్ క్షణమే ఎనిమిది భుజాలు ధరించి, నానాయుధాలతో నిలబడ్డాడు. ఖడ్గం, చర్మం, గద, ఈటె, గొడ్డలి, అంకుశం, చాపబాణాలను ధరించి, గణేశ్వరుని చంపుటకు ధర్ముడు ఉద్యుక్తుడయ్యాడు.

గణేశ్వరోఽపి సంక్రుద్ధో హంతుం ధర్మం సనాతనమ్ ।
వవర్ష మార్గణాంస్తీక్ష్ణాన్యథా ప్రావృషి తోయదః ॥27॥

గణేశ్వరుడు కూడా సనాతనుడైన ధర్ముని సంహరించు తలంపుతో వర్షాకాలపు మేఘం వలె తీక్ష్ణమైన బాణాలనతనిపై వర్షించాడు.

తావన్యోన్యం మహాత్మానౌ శరచాపధరౌ మునే ।
రుధిరారుణసిక్తాంగౌ కింశుకావివ రేజతుః ॥28॥

ఓ నారదా! అట్లు ఆ మహాత్ములైన వారిరువురు పరస్పరం శరచాప ప్రహారాలతో రక్తసిక్తాంగులై పూచిన మోదుగుల వలె ప్రకాశించారు.

తతో వరాస్త్రైర్గణనాయకేన జితః సధర్మస్తరసా ప్రసహ్య ।
పరాఙ్ముఖోఽభూద్విమనా మునీంద్ర సవీరభద్రః ప్రవివేశ యజ్ఞమ్ ॥29॥

ఓ మునీంద్రా! గణనాయకుడైన వీరభద్రుని తీవ్రబాణవృష్టికి ధర్ముడు పరాజితుడై, దీనుడై, ముఖము వంచుకొని తొలగిపోగా వీరభద్రుడు యాగశాలలో ప్రవేశించాడు.

యజ్ఞవాటం ప్రవిష్టం తం వీరభద్రం గణేశ్వరమ్ ।
దృష్ట్వా తు సహసా దేవా ఉత్తస్థుః సాయుధా మునే ॥30॥

ఓ నారదా! యజ్ఞశాలలో ప్రవేశించిన వీరభద్రుని చూడగానే అక్కడున్న దేవతలందరు సాయుధులై లేచి నిలబడ్డారు.

వసవోఽష్టౌ మహాభాగా గ్రహా నవ సుదారుణాః ।
ఇంద్రాద్యా ద్వాదశాదిత్యా రుద్రాస్త్వేకాదశైవ హి ॥31॥

విశ్వేదేవాశ్చ సాధ్యాశ్చ సిద్ధగంధర్వపన్నగాః ।
యక్షాః కింపురుషా భూతాః ఖగాశ్చక్రధరాస్తథా ॥32॥

రాజా వైవస్వతాద్వంశా ధర్మకీర్తిస్తు విశ్రుతః ।
సోమవంశోద్భవశ్చోగ్రో భోజకీర్తిర్మహాభుజః ॥33॥

దితిజా దానవాశ్చాన్యే యేఽన్యే తత్ర సమాగతాః ।
తే సర్వేఽప్యద్రవన్రౌద్రం వీరభద్రముదాయుధాః ॥34॥

తానాపతత ఏవాశు బాణచాపధరో గణః ।
అభిదుద్రావ వేగేన సర్వానేవ శరోత్కరైః ॥35॥

అష్టవసువులు, నవగ్రహాలు, ఇంద్రాది ద్వాదశాదిత్యులు, ఏకాదశరుద్రులు. విశ్వేదేవులు, సాధ్యులు, సిద్ధులు, గంధర్వులు, భయంకరులైన నవగ్రహాలు, యక్షులు, కింపురుషులు, ఖగాలు, చక్రధరులు మున్నగువారందరు సాయుధపాణులై లేచి నిలబడ్డారు. వైవస్వతవంశానికి చెందిన లబ్ధప్రతిష్ఠుడగు ధర్మకీర్తి, ఉగ్రుడు, మహాభుజ పరాక్రమసంపన్నుడైన సోమవంశోద్భవుడగు భోజకీర్తి అక్కడకు చేరిన తదితర దైత్యులు, దానవులందరు తమ తమ ఆయుధాలతో రుద్రమూర్తియైన వీరభద్రుని ఎరుర్కొన్నారు. అంతట రుద్రగణం తమపై పడుతున్న సమస్త శరపరంపరను, తమ శ్రేష్ఠమైన బాణాలతో నాశనం చేశారు.

తే శస్త్రవర్షమతులం గణేశాయ సముత్సృజన్ ।
గణేశోఽపి వరాస్త్రైస్తాంశ్చిచ్ఛేద చ బిభేద చ ॥36॥

వారందరు తమ అసమాన శస్త్రాల వర్షాన్ని వీరభద్రునిపై కురిపింపగా అతడు కూడా తన శ్రేష్ఠమైన ఆయుధాలతో వానినన్నిటిని తుత్తునియలు గావించాడు.

శరైః శస్త్రైశ్చ సతతం వధ్యమానా మహాత్మనా ।
వీరభద్రేణ దేవాద్యాస్త్వవహారమకుర్వత ॥37॥

మహాత్ముడైన వీరభద్రునియొక్క శరములతో శస్త్రములతో నిరంతరం బాధింపబడిన దేవతలందరు అతనికి లొంగిపోయారు.

తతో వివేశ గణపో యజ్ఞమధ్యం సువిస్తృతమ్ ।
జుహ్వానా ఋషయో యత్ర హవీంషి ప్రవితన్వతే ॥38॥

అంతట వీరభద్రుడు మహర్షుల ఆజ్యాహుతులతో వెలుగుచున్న విశాలమైన యజ్ఞశాల మధ్యభాగంలో ప్రవేశించాడు.

తతో మహర్షయో దృష్ట్వా మృగేంద్రవదనం గణమ్ ।
భీతా హోత్రం పరిత్యజ్య జగ్ముః శరణమచ్యుతమ్ ॥39॥

అంతట మహర్షులు తమపైకి వస్తున్న సింహముఖగణాలను చూచి భీతావహులై తమ తమ యజ్ఞవేదికలు వదలి పారిపోయి, నారాయణుని శరణు వేడారు.

తానార్తాన్ చక్రభృద్దృష్ట్వా మహర్షీంస్త్రస్తమానసాన్ ।
న భేతవ్యమితీత్యుక్త్వా సముత్తస్థౌ వరాయుధః ॥40॥

భయకంపితులైన ఆ మహర్షులను చూచి చక్రధరుడైన నారాయణుడు వారికి అభయమొసగి, తన శ్రేష్ఠమైన ఆయుధాలను గ్రహించి నిలబడ్డాడు.

సమానమ్య తతః శార్ఙ్గం శరానాశీవిషోపమాన్ ।
ముమోచ వీరభద్రాయ కాయావరణదారణాన్ ॥41॥

అనంతరం నారాయణుడు తన శార్ఙ్గధనుస్సును ఎక్కుపెట్టి వీరభద్రుని అభేద్యకవచాలను సహితం చీల్చగలిగిన అగ్నిశిఖలవంటి బాణవర్షాన్ని కురిపించాడు.

తే తస్య కాయమాసాద్య అమోఘా వై హరేః శరాః ।
నిపేతుర్భువి భగ్నాశా నాస్తికాదివ యాచకాః ॥42॥

అమోఘాలైన ఆ బాణాలన్నీ వీరభద్రుని శరీరాన్ని తాకి నాస్తికులను యాచించి విఫలమనోరథులైన యాచకులవలె వ్యర్థములై నేలపడిపోయాయి.

శరాంస్త్వమోఘాన్మోఘత్వమాపన్నాన్వీక్ష్య కేశవః ।
దివ్యైరస్త్రైర్వీరభద్రం ప్రచ్ఛాదయితుముద్యతః ॥43॥

అమోఘములైన తన బాణాలన్నీ ఆ విధంగా వ్యర్థమగుటనుచూచి కేశవుడు దివ్యాస్త్రాలతో వీరభద్రుని ముంచెత్తడానికి ఉద్యమించాడు.

తానస్త్రాన్వాసుదేవేన ప్రక్షిప్తాన్గణనాయకః ।
వారయామాస శూలేన గదయా మార్గణైస్తథా ॥44॥

శ్రీహరి ప్రయోగించిన అస్త్రాలనన్నిటిని వీరభద్రుడు త్రిశూలంతోను, గదతోను, బాణాలతోను నివారింపసాగాడు.

దృష్ట్వా విపన్నాన్యస్త్రాణి గదాం చిక్షేప మాధవః ।
త్రిశూలేన సమాహత్య పాతయామాస భూతలే ॥45॥

తన దివ్యాస్త్రాలు సైతం వ్యర్థంకాగా మాధవుడు అతనిపై గదను ప్రయోగించాడు. ఆ గదను వీరభద్రుడు తన త్రిశూలంతో నేలపై పడగొట్టాడు.

తాం గదాం విఫలాం దృష్ట్వా లాంగలం ప్రాక్షిపద్ధరిః ।
లాంగలం చ గణేశోఽపి గదయా ప్రత్యవారయత్ ॥46॥

తాను ప్రయోగించిన గద కూడా విఫలంకాగా శ్రీమహావిష్ణువు వీరభద్రునిపై నాగలిని ప్రయోగించాడు. దానిని కూడా గణేశుడు గదతో నివారించాడు.

ముసలం వీరభద్రాయ సంచిక్షేప హలాయుధః ।
పూర్వవన్ముసలాఘాతం వీరభద్రో న్యవారయత్ ॥47॥

అంతట హరి వీరభద్రునిపై ముసలాన్ని (రోకలి) ప్రయోగించగా వీరభద్రుడు దానినికూడా పూర్వం వలెనె గదతో నివారించాడు.

ముసలం సంహతం దృష్ట్వా లాంగలం చ నివారితమ్ ।
వీరభద్రాయ చిక్షేప చక్రం క్రోధాత్ఖగధ్వజః ॥48॥

రోకలి, నాగలి ఆ విధంగా నివారింపబడగా గరుడధ్వజుడగు శ్రీహరి మిక్కిలి కోపంతో వీరభద్రునిపై చక్రాన్ని ప్రయోగించాడు.

తమాపతంతం శతసూర్యకల్పం సుదర్శనం ప్రేక్ష్య గణేశ్వరస్తు ।
శూలం పరిత్యజ్య జగాద చక్రం యథా మధుం మీనవపుః సురేంద్రః ॥49॥

శతసూర్యుల కాంతితో వచ్చే సుదర్శనచక్రాన్ని చూసి వీరభద్రుడు తన శూలాన్ని వదిలిపెట్టి, మీనశరీరం ధరించి విష్ణువు మధురాక్షసుని మ్రింగినట్లుగా సుదర్శనచక్రాన్ని మ్రింగివేశాడు.

చక్రే నిగీర్ణే గణనాయకేన క్రోధాతిరక్తోఽసితచారునేత్రః ।
సురారిరభ్యేత్య గణాధిపేంద్రం ఉత్క్షిప్య వేగాద్భువి నిష్పిపేష ॥50॥

వీరభద్రుడావిధంగా చక్రాన్ని మ్రింగగానే క్రోధంతో ఎర్రబడిన సుందరనేత్రాలు గల శ్రీమహావిష్ణువు వీరభద్రుని సమీపించి మెరుపువేగంతో అతనిని భూమిపై పడగొట్టాడు.

హరిబాహూరువేగేన వినిష్పిష్టస్య భూతలే ।
సహితం రుధిరోద్గారైర్ముఖాచ్చక్రం వినిర్గతమ్ ॥51॥

ఆ విధంగా భూమిపై పడగొట్టిన వీరభద్రుని శ్రీహరి బాహువులతో తీవ్రమైన వేగంతో మర్దించాడు. అట్లు భయంకరంగా మర్దింపబడిన వీరభద్రుడు రక్తం గ్రక్కి పడిపోవడంతో అతని ముఖంనుండి సుదర్శనచక్రం వెలికివచ్చింది.

తతో నిఃసృతమాలోక్య చక్రం కైటభనాశనః ।
సమాదాయ హృషీకేశో వీరభద్రం ముమోచ హ ॥52॥

ఆ విధంగా వీరభద్రుని ముఖంనుండి బయటకు వెలువడిన చక్రాన్ని హృషీకేశుడు తీసుకొని, వీరభద్రుని వదలిపెట్టాడు.

హృషీకేశేన ముక్తస్తు వీరభద్రో జటాధరమ్ ।
గత్వా నివేదయామాస వాసుదేవాత్పరాజయమ్ ॥53॥

శ్రీహరిచే విడువబడిన వీరభద్రుడు శంకరుని చెంతకు వెళ్ళి వాసుదేవునిచే తనకు కలిగిన పరాజయాన్ని గూర్చి నివేదించాడు.

తతో జటాధరో దృష్ట్వా గణేశం శోణితాప్లుతమ్ ।
నిఃశ్వసన్తం యథా నాగం క్రోధం చక్రే తదాఽవ్యయః ॥54॥

నెత్తుటితో తడిసిన వీరభద్రుని చూసి జటాధరుడైన శివుడు కోపంతో బుసలుకొట్టిన సర్పంవలె క్రోధోద్రిక్తుడయ్యాడు.

తతః క్రోధాభిభూతేన వీరభద్రోఽథ శంభునా ।
పూర్వోద్దిష్టే తదా స్థానే సాయుధస్తు నివేశితః ॥55॥

అనంతరం క్రోధాభిభూతుడైన శంకరుడు అస్త్రసహితుడైన వీరభద్రుని పూర్వం నిలిచిన స్థానంలోనే నిలబెట్టాడు.

వీరభద్రమథాదిశ్య భద్రకాళీం చ శంకరః ।
వివేశ క్రోధతామ్రాక్షో యజ్ఞవాటం త్రిశూలభృత్ ॥56॥

త్రిశూలధారియైన శంకరుడు వీరభద్రుని, భద్రకాళిని ఆదేశించి, క్రోధంతో ఎర్రబడిన కన్నులు కలవాడై యజ్ఞవాటికలో ప్రవేశించాడు.

తతస్తు దేవప్రవరే జటాధరే త్రిశూలపాణౌ త్రిపురాన్తకారిణి ।
దక్షస్య యజ్ఞం విశతి క్షయంకరే జాతో మునీనాం ప్రవరో హి సాధ్వసః ॥57॥

త్రిపురాంతకుడు, త్రిశూలపాణి, జటాధరుడు, దేవప్రవరుడునైన శంకరుడు దక్షుని యజ్ఞశాలలో ప్రవేశించగానే మహర్షులందరు అత్యంతభయభ్రాంతులయ్యారు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్య నారద సంవాదే హరలలితే వీరభద్రాది రుద్రగణోత్పత్తిః నామ చతుర్థోఽధ్యాయః ॥4॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్య నారద సంవాదంలోని హరలలితయందలి వీరభద్రుడు మున్నగు రుద్రగణాల పుట్టుక అనే నాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచమోఽధ్యాయః - ఐదవ అధ్యాయం

దక్షయజ్ఞవాట విధ్వంసః శివస్య కాలరూప, రాశిరూపయోః వర్ణనమ్ -

దక్షయజ్ఞ విధ్వంసం శివునియొక్క కాలరూప, రాశిరూప వర్ణన

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

జటాధరం హరిర్దృష్ట్వా క్రోధాదారక్తలోచనమ్ ।
తస్మాత్ స్థానాదపాక్రమ్య కుబ్జామ్రేఽన్తర్హితః స్థితః ॥1॥

క్రోధతామ్రాక్షుడై వచ్చిన జటాధరుని విష్ణువు చూసి వెంటనే ఆ స్థానం వదలి ఒక గున్నమామిడి తొర్రలో దాగికొన్నాడు.

వసవోఽష్టౌ హరం దృష్ట్వా సుస్రువుర్వేగతో మునే ।
సా తు జాతా సరిచ్ఛ్రేష్ఠా సీతా నామ సరస్వతీ ॥2॥

ఓ నారదా! అష్టవసువులు హరుని చూసిన వెంటనే పలాయనం చిత్తగించారు. వారు పారిపోయిన మార్గం **"సీత"** అనే పేరుతో శ్రేష్ఠమైన నదిగా ప్రసిద్ధమయ్యింది.

ఏకాదశ తథా రుద్రాస్త్రినేత్రా వృషకేతనాః ।
కాందిశీకా లయం జగ్ముః సమభ్యేత్యాథ శంకరమ్ ॥3॥

శంకరుని రాకతో త్రినేత్రులు, వృషకేతనులు అగు ఏకాదశరుద్రులు తమ స్థానాలు వదలి శంకరునిలో లీనమయ్యారు.

విశ్వేఽశ్వినౌ చ సాధ్యాశ్చ మరుతోఽనలభాస్కరాః ।
సమాసాద్య పురోడాశం భక్షయన్తో మహామునే ॥4॥

మహామునీ! నారదా! విశ్వేదేవులు, అశ్వినులు, సాధ్యులు, మరుత్తులు, అగ్నులు, సూర్యులు పురోడాశాన్ని భక్షిస్తూ పారిపోయారు.

చంద్రః సమం చరక్షగణైర్నిశాం సముపదర్శయన్ ।
ఉత్పత్యారుహ్య గగనం స్వమధిష్ఠానమాస్థితః ॥5॥

నక్షత్రాలతోకూడిన చంద్రుడు రాత్రిని ప్రకాశింపజేస్తూ, ఆకాశానికి ఎగిరి తన స్థానాన్ని పొందాడు.

కశ్యపాద్యాశ్చ ఋషయో జపన్తః శతరుద్రియమ్ ।
పుష్పాంజలిపుటా భూత్వా ప్రణతాః సంస్థితా మునే ॥6॥

ఓ నారదా! శతరుద్రీయమును పఠిస్తున్న కశ్యపాది మహర్షులు తలలు వంచి, పూలు నిండిన చేతులు జోడించి నిలబడ్డారు.

అసకృద్దక్షదయితా దృష్ట్వా రుద్రం బలాధికమ్ ।
శక్రాదీనాం సురేశానాం కృపణం విలలాప హ ॥7॥

ఇంద్రాదులను మించి బలప్రదర్శనం చేస్తున్న రుద్రుని చూసి దక్షపత్ని అతికరుణంగా విలపించింది.

తతః క్రోధాభిభూతేన శంకరేణ మహాత్మనా ।
తలప్రహారైరమరా బహవో వినిపాతితాః ॥8॥

అప్పుడు క్రోధావేశంతో శంకరుడు ఎందరో దేవతలను చెంపదెబ్బలతో నేలపై పడగొట్టాడు.

పాదప్రహారైరపరే త్రిశూలేనాపరే మునే ।
దృష్ట్వాగ్నినా తథైవాన్యే దేవాద్యాః ప్రలయం గతాః ॥9॥

ఓ నారదా! త్రిశూలి పాదప్రహారాలతో కొందరిని, శూలఘాతాలతో మరికొందరిని, త్రినేత్రాగ్నిజ్వాలలలో ఇతర దేవతలను లయింపజేశాడు.

తతః పూషా హరం వీక్ష్య వినిఘ్నం తం సురాసురాన్ ।
క్రోధాద్బాహూ ప్రసార్యాథ ప్రదుద్రావ మహేశ్వరమ్ ॥10॥

తమాపతన్తు భగవాన్ సంనిరీక్ష్య త్రిలోచనః ।
బాహుభ్యాం ప్రతిజగ్రాహ కరేణైకేన శంకరః ॥11॥

అంతట శంకరుడు చేసే దేవతామారణాన్ని చూసి పూషుడు క్రోధంతో బాహువులు చాచి, మహేశ్వరునిపై లంఘించాడు. తనపై దుముకుచున్న పూషుని చూసి త్రిలోచనుడు అతని రెండుచేతులను ఒకచేతితో ఒడిసి గట్టిగా పట్టుకున్నాడు.

కరాభ్యాం ప్రగృహీతస్య శంభునాంశుమతోఽపి హి ।
కరాంగులిభ్యో నిశ్చేరురసృగ్ధారాః సమంతతః ॥12॥

శంభుడు ఆ విధంగా గట్టిగా పట్టుకున్న పూషుని వ్రేళ్ళకొనలనుండి రక్తధారలు బాగుగా ప్రవహించేటట్లు చేశాడు.

తతో వేగేన మహతా అంశుమంతం దివాకరమ్ ।
భ్రామయామాస సతతం సింహో మృగశిశుం యథా ॥13॥

వెలుగులు వెదజల్లే ఆ దివాకరుని తనపిడికిలితో బంధించి, లేడిపిల్లను సింహం త్రిప్పినట్లు గిరగిరా త్రిప్పాడు.

భ్రామితస్యాతివేగేన నారదాంశుమతోఽపి హి ।
భుజౌ హ్రస్వత్వమాపన్నౌ తృటితస్నాయుబంధనౌ ॥14॥

ఓనారదా! ఆ విధంగా తీవ్రమైన వేగంతో త్రిప్పగా అంశుమంతుని దీర్ఘబాహువులు కుదించుకొని పొట్టివయ్యాయి. బంధాలన్నీ క్షణంలో విరిగిపోయాయి.

రుధిరాప్లుతసర్వాఙ్గమంశుమంతం మహేశ్వరః ।
సన్నిరీక్ష్యోత్ససర్జైనమన్యతోఽభిజగామ హ ॥15॥

అంతట సర్వాంగాలు రక్తసిక్తములై పడియున్న పూషుని చూసి, వదలి, శివుడు మరొకవైపునకు వెళ్ళాడు.

తతస్తు పూషా విహసన్ దశనాని విదర్శయన్ ।
ప్రోవాచైహ్యేహి కాపాలిన్పునః పునరపీశ్వరమ్ ॥16॥

అట్లు వెళ్ళుతున్న శంకరుని చూసి పూషుడులేచి, పండ్లికిలించి, నవ్వుతూ "ఓ కపాలీ! పోపోకుము, రమ్ము" అని మరల మరల బిగ్గరగా పలికాడు.

తతః క్రోధాభిభూతేన పూష్ణో వేగేన శంభునా ।
ముష్టినాఽఽహత్య దశనాః పాతితా ధరణీతలే ॥17॥

దానితో క్రోధాభిభూతుడైన శంభుడు పిడికిలితో పూషుని మూతిపై గట్టిగా కొట్టగా అతని దంతాలన్నియు ఊడి నేలపై పడ్డాయి.

భగ్నదంతస్తథా పూషా రుధిరాభిప్లుతాననః ।
పపాత భువి నిఃసంజ్ఞో వజ్రాహత ఇవాచలః ॥18॥

అట్లు భగ్నదంతుడైన పూషుడు ముఖమంతా రక్తపు ముద్దకాగా, స్పృహతప్పి వజ్రాయుధం దెబ్బకు నేలకొరిగిన పర్వతం వలె నేలపై పడ్డాడు.

భగోఽపి వీక్ష్య పతితం పూషాణం రుధిరోక్షితమ్ ।
నేత్రాభ్యాం ఘోరరూపాభ్యాం వృషభధ్వజమవైక్షత ॥19॥

అట్లు పూషుడు రక్తపు మడుగులో పడిపోవడం చూసి భగుడు భగ్గుమనే చూపులతో శంకరుని చూశాడు.

త్రిపురఘ్నస్తతః క్రుద్ధస్తలేనాహత్య చక్షుషీ ।
నిపాతయామాస భువి క్షోభయన్ సర్వదేవతాః ॥20॥

శంకరుడు వెంటనే క్రుద్ధుడై, ముష్టిఘాతంతో భగుని కన్నులను క్రూరంగా అణచి, ఆతనిని మట్టి కరపించాడు. వానితో దేవతలందరు హాహాకారాలు చేశారు.

తతో దివాకరాః సర్వే పురస్కృత్య శతక్రతుమ్ ।
మరుద్భిశ్చ హుతాశైశ్చ భయాజ్జగ్మర్దిశో దశ ॥21॥

దానితో భయకంపితులైన ఆదిత్యులందరు, ఇంద్రుని ముందుంచుకుని, మరుత్తులు, అగ్నులతో కలసి, భయంతో దశదిశలకు పారిపోయారు.

ప్రతియాతేషు దేవేషు ప్రహ్లాదాద్యా దితీశ్వరాః ।
నమస్కృత్య తతః సర్వే తస్థుః ప్రాంజలయో మునే ॥22॥

ఓ నారదా! దేవతల పలాయనంతో ప్రహ్లాదాది దితీశ్వరులందరు శివునకు సాష్టాంగపడి, చేతులు కట్టుకొని నిలబడ్డారు.

తతస్తం యజ్ఞవాటం తు శంకరో ఘోరచక్షుషా ।
దదర్శ దగ్ధుం కోపేన సర్వాశ్చైవ సురాసురాన్ ॥23॥

శంకరుడు భయంకరమగు కన్నులతో అగ్నిజ్వాలలు చిమ్ముచు, యాగశాలనంతటిని భస్మీపటలం గావింపనెంచి కలయజూశాడు.

తతో నిలిల్యిరే వీరాః ప్రణేముః దుద్రువుస్తథా ।
భయాదన్యే హరం దృష్ట్వా గతా వైవస్వతక్షయమ్ ॥24॥

కొందరు వీరులు మహాదేవుని దృష్టినుండి తప్పించుకొని దాగుకొన్నారు. కొందరు నమస్కరించారు. కొందరు పారిపోయారు. మరికొందరు భయాతిరేకంతో నేరుగా యమపురికి చేరారు.

తతోఽగ్నయస్త్రిభిర్నేత్రైర్దుఃసహం సమవైక్షత ।
దృష్టమాత్రాస్త్రినేత్రేణ భస్మీభూతాఽభవన్ క్షణాత్ ॥25॥

భరింపశక్యంకాని తాపంతో త్రినేత్రాలనుండి జ్వలిస్తున్న త్రేతాగ్నిశిఖల వేడికి క్షణకాలంలో సర్వము మాడి బూడిదయ్యింది.

అగ్నౌ ప్రనష్టే యజ్ఞోఽపి భూత్వా దివ్యవపుర్మృగః ।
దుద్రావ విక్లవగతిర్దక్షిణాసహితోఽమ్బరే ॥26॥

యజ్ఞాగ్నులు చల్లారినంతనే యజ్ఞదేవత దివ్యమృగరూపం ధరించి దక్షిణతోసహా ఆకాశానికి ఎగిరిపోయింది.

తమేవానుససారేశశ్చాపమానమ్య వేగవాన్ ।
శరం పాశుపతం కృత్వా కాలరూపీ మహేశ్వరః ॥27॥

అట్లు పరుగిడుతున్న యజ్ఞదేవతను చూసి కాలరూపియైన మహేశ్వరుడు పాశుపతాస్త్రం సంధించి దానివెంటబడ్డాడు.

అర్ధేన యజ్ఞవాటాన్తే జటాధర ఇతి శ్రుతః ।
అర్ధేన గగనే శర్వః కాలరూపీ చ కథ్యతే ॥28॥

ఆ సమయంలో శంకరుడు అర్ధరూపంలో యజ్ఞశాలాంతంలో ఉన్నాడు. అతనిపేరు **"జటాధరుడు"** గా విశ్రుతమయ్యింది. అదే సమయంలో తక్కిన అర్ధరూపంలో ఆకాశంలోనున్న శంకరుడు **"కాలరూపుడు"** అని విఖ్యాతుడయ్యాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కాలరూపీ త్వయాఽఽఖ్యాతః శంభుర్గగనగోచరః ।
లక్షణం చ స్వరూపం చ సర్వం వ్యాఖ్యాతుమర్హసి ॥29॥

బ్రహ్మర్షీ! ఆసమయంలో గగనవీథిలోనున్న శంకరుడు కాలరూపిగా పిలవబడ్డాడని మీరు తెలియజేసి యున్నారు. కాలరూపియైన శంకరుని సంపూర్ణస్వరూపాన్ని, లక్షణాలను మీరు నాకు వివరంగా తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

స్వరూపం త్రిపురఘ్నస్య వదిష్యే కాలరూపిణః ।
యేనాంబరం మునిశ్రేష్ఠ వ్యాప్తం లోకహితేప్సునా ॥30॥

నారదా! త్రిపురఘ్నుడు, లోకకల్యాణకాంక్షతో కాలరూపియై గగనాన్ని ఆక్రమించాడు. ఆ కాలరూపి స్వరూపలక్షణాలను వివరిస్తాను. శ్రద్ధగా వినుము.

యత్రాశ్వినీ చ భరణీ కృత్తికాయాస్తథాంశకః ।
మేషో రాశిః కుజక్షేత్రం తచ్ఛిరః కాలరూపిణః ॥31॥

అశ్విని, భరణి, కృత్తిక మొదటిపాదంతో కూడి, మేషరాశిలో నున్న కుజక్షేత్రం ఈశ్వరుని శిరస్సు.

ఆగ్నేయాంశాస్త్రయో బ్రహ్మన్ ప్రాజాపత్యం కవేర్గృహమ్ ।
సౌమ్యార్ధం వృషనామేదం వదనం పరికీర్తితమ్ ॥32॥

తక్కిన కృత్తిక మూడుపాదాలు, రోహిణి, మృగశిర రెండుపాదాలు వృషభరాశితో కూడిన శుక్రక్షేత్రం పరమేశ్వరుని ముఖము.

మృగార్ధమార్ద్రాఽదిత్యాంశాస్త్రయః సౌమ్యగృహం త్విదమ్ ।
మిథునం భుజయోస్తస్య గగనస్థస్య శూలినః ॥33॥

మృగశిర మూడు, నాలుగు పాదాలు, ఆర్ద్రానక్షత్రము, పునర్వసు మొదటి మూడు పాదాలతో కూడి మిథున రాశితో కలసిన బుధక్షేత్రం మహాదేవుని భుజాలు.

ఆదిత్యాంశశ్చ పుష్యం చ ఆశ్లేషా శశినో గృహమ్ ।
రాశిః కర్కటకో నామ పార్శ్వే మఖవినాశినః ॥34॥

చంద్రక్షేత్రం కర్కాటకరాశి, పునర్వసు నాల్గవపాదం, పుష్యమి ఆశ్లేష నక్షత్రాలు కలసి వ్యోమకేశుని రెండు పార్శ్వాలు.

పిత్ర్యర్క్షం భగదైవత్యముత్తరాంశశ్చ కేసరీ ।
సూర్యక్షేత్రం విభోర్బ్రహ్మన్ హృదయం పరిగీయతే ॥35॥

మఖ పూర్వఫల్గుణీ(పుబ్బ), ఉత్తరఫల్గుణీ (ఉత్తర) నక్షత్రప్రథమపాదాల సమాహారమే రవిక్షేత్రమైన సింహరాశి. అదియే మహాకాలుని హృదయం.

ఉత్తరాంశాస్త్రయః పాణిశ్చిత్రార్ధం కన్యకాత్విదమ్ ।
సోమపుత్రస్య సద్మైతద్ద్వితీయం జఠరం విభోః ॥36॥

నారదా! శేషించిన ఉత్తరఫల్గుణీ మూడు పాదాలు, హస్తా, చిత్రానక్షత్రపాదద్వయం పరివ్యాప్తమైన బుధ క్షేత్రమైన కన్యారాశి మహాకాలుని జఠరభాగము.

చిత్రాంశద్వితయం స్వాతిర్విశాఖాయాంశకత్రయమ్ ।
ద్వితీయం శుక్రసదనం తులా నాభిరుదాహృతా ॥37॥

చిత్రానక్షత్రం మూడు నాల్గు పాదాలు, స్వాతి, విశాఖ మొదటి మూడుపాదాలతో కూడిన శుక్రక్షేత్రమైన తులారాశి పరమేశ్వరుని నాభిస్థానము.

విశాఖాంశమనూరాధా జ్యేష్ఠా భౌమగృహం త్విదమ్ ।
ద్వితీయం వృశ్చికోరాశిర్మేఢ్రం కాలస్వరూపిణః ॥38॥

విశాఖ నాల్గవ పాదం, అనూరాధా, జ్యేష్ఠానక్షత్రాలతో కూడిన కుజగృహమైన వృశ్చికరాశి భాగం కాలరూపియైన పరమేశ్వరుని గుహ్యాంగము.

మూలం పూర్వోత్తరాంశశ్చ దేవాచార్యగృహం ధనుః ।
ఊర్వోర్యుగళమీశస్య అమరర్షే ప్రగీయతే ॥39॥

ఓ దేవర్షీ! మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ ప్రథమపాదం కలిపి బృహస్పతిక్షేత్రమైన ధనూరాశి. ఈ భాగం ఈశ్వరుని ఊరువులు.

ఉత్తరాంశాస్త్రయశ్చర్‌క్షం శ్రవణం మకరో మునే ।
ధనిష్ఠార్ధం శనిక్షేత్రం జానునీ పరికీర్తితే ॥40॥

ఓ నారదమునీ! ఉత్తరాషాఢ రెండు, మూడు, నాలుగు పాదాలు, శ్రవణం, ధనిష్ఠానక్షత్రం మొదటి రెండు పాదాల సమాహారం శనిక్షేత్రమైన మకరరాశి. ఇది పరమేశ్వరుని జానువులు (మోకాళ్ళు)గా చెప్పబడుతోంది.

ధనిష్ఠార్ధం శతభిషా ప్రోష్ఠపాదాంశకత్రయమ్ ।
సౌరేః సద్మాపరమిదం కుంభో జజ్ఞే చ విశ్రుతే ॥41॥

ధనిష్ఠ మూడు, నాలుగు పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర మొదటి మూడు పాదాలు గల కుంభరాశి సూర్యుని కుమారుడైన శని గృహము. ఇది ఆ స్వామి జంఘలు (పిక్కలు).

ప్రోష్ఠపదాంశమేకం తు ఉత్తరా రేవతీ తథా ।
ద్వితీయం జీవసదనం మీనస్తు చరణావుభౌ ॥42॥

పూర్వాభాద్ర చివరి పాదము, ఉత్తరాభాద్రా రేవతీనక్షత్రపరివ్యాప్తమైన బృహస్పతి గృహమైన మీనరాశి భాగం మహేశ్వరుని చరణద్వయము.

ఏవం కృత్వా కాలరూపం త్రినేత్రో యజ్ఞం క్రోధాన్మార్గణైరాజఘాన ।
విద్ధశ్చాసౌ వేదనాబుద్ధిముక్తః ఖే సంతస్థౌ తారకాభిశ్చితాఙ్గః ॥43॥

ఈ విధంగా అనంతమైన కాలరూపం ధరించి, త్రినేత్రుడు కోపంతో యజ్ఞమృగాన్ని బాణాలతో కొట్టాడు. ఆ బాణాల తాకిడికి సమస్తబాధలు వదలి, యజ్ఞమృగం తారకలతో కలసి ఆకాశంలోనే నిలచిపోయింది.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

రాశయః కథితా బ్రహ్మన్ త్వయా ద్వాదశ వై మమ ।
తేషాం విస్తరతో బ్రూహి లక్షణాని స్వరూపతః ॥44॥

బ్రహ్మర్షీ! పండ్రెండు రాశుల గురించి మీరు సెలవిచ్చారు. ఆ రాశుల స్వరూపలక్షణాలు విశదంగా నాకు తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

స్వరూపం తవ వక్ష్యామి రాశీనాం శ్రుణు నారద ।
యాదృశా యత్ర సంచారా యస్మిన్ స్థానే వసంతి చ ॥45॥

ఓ నారదా! రాశుల స్వరూపలక్షణాలు వివరిస్తాను వినుము. వాని సంచారం అవి యేయే స్థానాలలో ఉంటాయో వివరిస్తాను.

మేషః సమానమూర్తిశ్చ అజావికధనాదిషు ।
సంచారస్థానమేవాస్య ధాన్యరత్నాకరాదిషు ॥46॥

నవశాద్వలసంఛన్నవసుధాయాం చ సర్వశః ।
నిత్యం చరతి ఫుల్లేషు సరసాం పులినేషు చ ॥47॥

మేషరాశి గొఱ్ఱె ఆకారం కలది. ధాన్యాలు, రత్నాల గనులు, మేకలు, గొఱ్ఱెలు, ధనరాశులు, పచ్చిక బయళు ్ళ, పైరుపచ్చలతో కళకళలాడే జలాశయాలు, కులినస్థలాలు ఈ రాశి సంచారానికి ప్రభావానికి లోనగునట్టి వస్తువులు.

వృషః సదృశరూపో హి చరతే గోకులాదిషు ।
తస్యాధివాసభూమిస్తు కృషీవలధరాశ్రయః ॥48॥

వృషభరాశి వృషభాకారంలోనుండి గోశాలలు, వ్యవసాయభూములను ప్రభావితం చేస్తుంటుంది.

స్త్రీపుంసయోః సమం రూపం శయ్యాసనపరిగ్రహమ్ ।
వీణావాద్యధృఙ్మిథునం గీతనర్తనశిల్పిషు ॥49॥

స్థితం క్రీడా రతిర్నిత్యం విహారావనిరస్య తు ।
మిథునం నామ విఖ్యాతం రాశిర్ద్వేధాత్మకః శివః ॥50॥

మిథునరాశి స్త్రీపురుషుల జంటవలె ఉంటుంది. దాని సంచారానికి లోనగు స్థానాలు, వస్తువులు శయ్యాసనాలు, వీణాది వాద్యధారణం, గీత నర్తన శిల్ప పారగులు, క్రీడల పట్ల ఆసక్తి, అభినివేశాలు. కేళీ విహార సుందర భూములు మొదలైనవి. మిథునరాశి ద్వేధాత్మకమైనది.

కర్కః కులీరేణ సమః సలిలస్థః ప్రకీర్తితః ।
కేదారవాపీపులినే వివిక్తావనిరేవ చ ॥51॥

కర్కటరాశి ఎండ్రకాయ ఆకృతి కలది. దీని సంచారనివాసస్థానాలు నీరు, మాగాణి భూములు, బావులు, నదీతటాలు, ఏకాంతభూములు మున్నగునవి.

సింహస్తు పర్వతారాణ్యదుర్గకందరభూమిషు ।
వసతే వ్యాధపల్లీషు గహ్వరేషు గుహాసు చ ॥52॥

సింహరాశి సింహాకారంలో ఉంటుంది. దాని స్థానాలు గిరి వనాలు, లోయలు, గుహలు, వేటకాండ్ర పల్లె పట్టులు మొదలైన దుర్గమప్రదేశాలు.

వ్రీహిప్రదీపికకరా నావారూఢా చ కన్యకా ।
చరతే స్త్రీ రతిస్థానే వసతే నడ్వలేషు చ ॥53॥

కన్యారాశి ఒకచేతిలో ధాన్యపు కంకులు, మరొక చేతిలో కరదీపిక పట్టుకొని నావ మీద కూర్చున్న కన్యకవలె ఉంటుంది. స్త్రీ పురుష రతిస్థానాలు, రెల్లుపొదలు, ఈ రాశి సంచార ప్రభావస్థానాలు.

తులాపాణిశ్చ పురుషో వీథ్యాపణవిచారకః ।
నగరాధ్వానశాలాసు వసతే తత్ర నారద ॥54॥

ఓ నారదా! చేతిలో త్రాసు పట్టుకొనిన పురుషాకృతిలో తులారాశి ఉంటుంది. విపణివీధులు, వ్యాపార సంస్థలు, నగరకేంద్రస్థానాలు మున్నగునవి ఈ రాశి చరించు స్థానాలు.

శ్వభ్రవల్మీకసంచారీ వృశ్చికో వృశ్చికాకృతిః ।
విషగోమయకీటాదిపాషాణాదిషు సంస్థితః ॥55॥

తేలు ఆకృతిలో వుండే వృశ్చికరాశి పుట్టలు, మెట్టలు, గుంటలు, విషాలు, ఆవుపేడ, రాళ్ళు, రప్పలు, కీటకాలు మున్నగువాటిని ప్రభావితం చేస్తూ వుంటుంది.

ధనుస్తురంగజఘనో దీప్యమానో ధనుర్ధరః ।
వాజిశూరాస్త్రవిద్వీరః స్థాయీ గజరథాదిషు ॥56॥

గుఱ్ఱపు పిరుదులు కలిగి, చేతిలో ధనుస్సు ధరించిన పురుషాకృతి కలది ధనూరాశి. శూరులు, అస్త్రకోవిదులు, వీరులు, గజరథతురగాదులు ఈ రాశి స్థానాలు.

మృగాస్యో మకరో నామ వృషస్కంధే క్షణాజ్గజః ।
మకరోఽసౌ నదీచారీ వసతే చ మహోదధౌ ॥57॥

మకరరాశి లేడి ముఖము, ఎద్దు భుజాలు, కన్నులు, రోమాలు కలిగి మొసలి వలె ఉంటుంది. నదులలో సంచరిస్తూ సముద్రంలో వసతి కలిగియుంటుంది.

రిక్తకుంభశ్చ పురుషః స్కందచారీ జలాప్లుతః ।
ద్యూతశాలాచరః కుంభః స్థాయీ శౌండికసద్మసు ॥58॥

నీరు లేనికుండ భుజంపై పెట్టుకొని, నీట తడిసిన పురుషుని వలె కుంభరాశి ఉంటుంది. జూదగృహాలు, పానశాలలు, ఈ రాశి సంచారనివాసభూములు.

మీనద్వయమథాసక్తం మీనస్తీర్థాబ్ధిసంచరః ।
వసతే పుణ్యదేశేషు దేవబ్రాహ్మణసద్మసు ॥59॥

పరస్పరం జతకూడిన చేపల వలె మీనరాశి కనిపిస్తుంది. పవిత్రతీర్థాలలో, సముద్రాలలో, క్షేత్రాలలో సంచరిస్తూ పుణ్యదేశాలలో దేవబ్రాహ్మణగృహాలలో నివాసం కలిగియుంటుంది.

లక్షణా గదితాస్తుభ్యం మేషాదీనాం మహామునే ।
న కస్యచిత్త్వయాఽఽఖ్యేయం గుహ్యమేతత్పురాతనమ్ ॥60॥

మహామునీ! మేషాది రాశులను గురించి నేను చెప్పిన వివరాలు చాలా గోప్యాలు. పురాతనాలు. వీనిని ఎవనికిని తెలుపవద్దు.

ఏతన్మయా తే కథితం సురర్షే యథా త్రినేత్రః ప్రమమాథ యజ్ఞమ్ ।
పుణ్యం పురాణం పరమం పవిత్రమాఖ్యాతవాన్పాపహరం శివం చ ॥61॥

ఈ విధంగా త్ర్యంబకమహాదేవుడొనర్చిన దక్షయజ్ఞవిధ్వంసచరిత్ర పరమపవిత్రము, పుణ్యావహము, పురాతనము, పాపహరము, శుభప్రదమునై విరాజిల్లుచున్నది. దేవర్షీ! దీనిని నేను నీకు సమగ్రంగా వినిపించాను.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే దక్షయజ్ఞవాట విధ్వంసః శివస్య కాలరూప, రాశిరూపయోః వర్ణనం నామ పంచమోఽధ్యాయః ॥5॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి దక్షయజ్ఞ విధ్వంసం శివునియొక్క కాలరూప, రాశిరూప వర్ణనం అనే ఐదవ అధ్యాయం సమాప్తం.



షష్ఠోఽధ్యాయః - ఆరవ అధ్యాయం
కామదాహః - కామదహనం

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

హృద్భవో బ్రాహ్మణో యోఽసౌ ధర్మో దివ్యవపుర్మునే ।
దాక్షాయణీ తస్య భార్యా తస్యామజనయత్సుతాన్ ॥1॥

హరిం కృష్ణం చ దేవర్షే నరనారాయణౌ తథా ।
యోగాభ్యాసరతౌ నిత్యం హరికృష్ణౌ బభూవతుః ॥2॥

నరనారాయణౌ చైవ జగతో హితకామ్యయా ।
తప్యేతాం చ తపః సౌమ్యౌ పురాణావృషిసత్తమౌ ॥3॥

ప్రాలేయాద్రిం సమాగమ్య తీర్థే బదరికాశ్రమే ।
గృణంతౌ తత్పరం బ్రహ్మ గంగాయా విపులే తటే ॥4॥

మునివరా! ధర్ముడు బ్రహ్మమానసపుత్రుడు, దివ్యశరీరి. దాక్షాయణి ఆయన భార్య. ఆ దంపతులకు హరి, కృష్ణుడు, నరుడు, నారాయణుడు అను నలుగురు కుమారులు కలిగారు. వారిలో హరి, కృష్ణులు యోగాభ్యాస నిరతులయ్యారు. పురాణ ఋషిసత్తములైన నరనారాయణులు లోకకల్యాణార్థం తపస్సు చేయాలనుకున్నారు. వారు హిమాలయాలలోని బదరికాశ్రమంలో గంగాతీరాన పరబ్రహ్మను గూర్చి గొప్ప తపస్సు చేశారు.

నరనారాయణాభ్యాం చ జగదేతచ్చరాచరమ్ ।
తాపితం తపసా బ్రహ్మన్ సంక్షోభం పరమం యయౌ ॥5॥

ఓ నారదా! నరనారాయణులు గావించిన గొప్ప తపస్సునకు చరాచరజగత్తంతయు తల్లడిల్లింది.

సంక్షుబ్ధస్తపసా తాభ్యాం క్షోభణాయ శతక్రతుః ।
రంభామప్సరసాం శ్రేష్ఠాం ప్రైషయత్స మహాశ్రమమ్ ॥6॥

వారి తపస్సును చూసి ఇంద్రుడు కలవరపాటు చెందాడు. వారి తపస్సు భంగపరచుటకై దేవరాజు అప్సరసలలో శ్రేష్ఠయైన రంభను వారి ఆశ్రమానికి పంపాడు.

కందర్పశ్చ సుదుర్ధర్షశ్చూతాంకురమహాయుధః ।
సమం సహచరేణైవ వసంతేనాశ్రమం గతః ॥7॥

వారితోబాటు చూతపల్లవాద్యాయుధాలు ధరించి, సహచరుడైన వసంతునితో కలసి మన్మథుడు కూడా వారి ఆశ్రమానికి వెళ్ళాడు.

తతో మాధవకందర్పౌ తాశ్చైవాప్సరసో వరాః ।
బదర్యాశ్రమమాగమ్య విచిక్రీడుర్యథేచ్ఛయా ॥8॥

వసంతమన్మథులతోబాటు శ్రేష్ఠమైన అప్సరసలు కూడా బదరికాశ్రమమునకువచ్చి వారందరు యథేచ్ఛగా విహరింపసాగారు.

తతో వసన్తే సంప్రాప్తే కింశుకాజ్వలనప్రభాః ।
నిష్పత్రాః సతతం రేజుః శోభయన్తో ధరాతలమ్ ॥9॥

వసంతుని రాకతో ఆకులూడ్చుకొనిపోయి పుష్పించిన మోదుగచెట్లు అగ్నిశిఖల వలె భూమండలానికి అలంకారంగా వెలుగొందాయి.

శిశిరం నామ మాతంగం విదార్య నఖరైరివ ।
వసంతకేసరీ ప్రాప్తః పలాశకుసుమైర్మునే ॥10॥

ఓ నారదా! శిశిరమనే ఏనుగును మోదుగుపూవులనే గోళ్ళతో చీల్చుచున్నదోయనునట్లు వసంతమనే సింహము విజృంభించింది.

మయా తుషారైశ్చ కరీ నిర్జితః స్వేన తేజసా ।
తమేవ హసతేత్యుచ్చైర్వసంతః కుందకుట్మలైః ॥11॥

నా కాంతితో తుషారసముదాయమనే ఏనుగును జయించాననే దర్పంతో మల్లెమొగ్గల ధావళ్యమిషతో వసంతుడు వెక్కిరిస్తున్నాడు.

వనాని కర్ణికారాణాం పుష్పితాని విరేజిరే ।
యథా నరేంద్రపుత్రాణి కనకాభరణాని వై ॥12॥

సర్వాభరణభూషితులై వెలుగొందు రాజకుమారుల వలె పుష్పించిన కర్ణికార ఉద్యానాలతో వనాలు ప్రకాశించాయి.

తేషామను తథా నీపాః కింకరా ఇవ రేజిరే ।
స్వామి సంలబ్ధ సంమానా భృత్యా రాజసుతా ఇవ ॥13॥

వాని ప్రక్కనేనున్న కడిమివృక్షాలు ప్రభుసత్కారమును పొందిన సేవకులతో కూడిన రాజకుమారులవలెను శోభిల్లాయి.

రక్తాశోకవనా భాంతి పుష్పితాః సహసోజ్జ్వలాః ।
భృత్యా వసంతనృపతేః సంగ్రామాసృక్ ప్లుతా ఇవ ॥14॥

మరొకవైపు పుష్పిత అశోకవనాలు తమ ప్రభువైన వసంతునికై పోరాడి, క్షతగాత్రులై నిలచిన సేవకుల వలె విరాజిల్లాయి.

మృగవృందాః పిఞ్జరితా రాజంతే గహనే వనే ।
పులకాభిర్వృతా యద్వత్సజ్జనాః సుహృదాగమే ॥15॥

తెల్లని మచ్చలు గల లేళ్ళగుంపులు గహనకాననాలలో సన్మిత్రులు వచ్చినప్పుడు ఆనందంతో పులకాంకితు లైన సజ్జనులవలె తిరుగుతున్నాయి.

మంజరీభిర్విరాజన్తే నదీకూలేషు వేతసాః ।
వక్తుకామా ఇవాఙ్గుళ్యా కోఽస్మాకం సదృశో నగః ॥16॥

"మము బోలిన వృక్షాలేవి?" అని అంగులీచాలనంతో ప్రశ్నిస్తున్నాయా అన్నట్టుగా నదీతీరాలలో పుష్ప మంజరులతో పేము లతలు వ్యాపించాయి.

రక్తాశోకకరా తన్వీ దేవర్షే కింశుకాఙ్ఘ్రికా ।
నీలాశోకకచా శ్యామా వికాసికమలాననా ॥17॥

నీలేందీవరనేత్రా చ బ్రహ్మన్ బిల్వఫలస్తనీ ।
ప్రోత్ఫుల్లకుందదశనా మంజరీకరశోభితా ॥18॥

బంధుజీవాధరా శుభ్రసిందువారనఖాద్భుతా ।
పుంస్కోకిలస్వనా దివ్యా అంకోలవసనా శుభా ॥19॥

బర్హిబృందకలాపా చ సారసస్వరనూపురా ।
ప్రాగ్వంశరసనా బ్రహ్మన్ మత్తహంసగతిస్తథా ॥20॥

పుత్రజీవాంశుకా భృంగరోమరాజివిరాజితా ।
వసంతలక్ష్మీః సంప్రాప్తా తస్మిన్ బదరికాశ్రమే ॥21॥

ఓ నారదా! రక్తాశోకహస్తాలతో, అరుణకింశుకచరణాలతో, నీలాశోకకచభారంతో, వికసితపద్మముఖంతో, నీలేందీవరనేత్రాలతో, మారేడుపండ్ల స్తనాలతో, వికసిత మల్లెల దంతాలతో, మంజరీకరశోభతో, బంధు జీవాధరాలతో, తెల్లని సిందువార నఖకాంతులతో, అంకోలవస్త్రధారణతో, గండుకోకిలల కలస్వనాలతో, నెమళ్ళ గుంపుల అలంకారాలతో, నీటి బెగ్గురు పక్షుల స్వరనూపురఘలంఘలలతో, ప్రాగ్వంశకటిసూత్రాలతో, మదమరాళగమనంతో, పుత్రజీవాంబరంతో, భ్రమరరోమాళితో, సకలజనమనోభిరామమైన సౌందర్యాన్ని పుణికి పుచ్చుకొని వసంతలక్ష్మి బదరికాశ్రమంలో ప్రవేశించింది.

తతో నారాయణో దృష్ట్వా ఆశ్రమస్యానవద్యతామ్ ।
సమీక్ష్య స దిశః సర్వాస్తతోఽనఙ్గమపశ్యత ॥22॥

తమ ఆశ్రమాన్ని ఆవరించిన ఆ అనవద్యశోభను తిలకిస్తూ నారాయణమహర్షి అచ్చట అనంగుని చూశాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కోఽసావనఙ్గో బ్రహ్మర్షే తస్మిన్బదరికాశ్రమే ।
యం దదర్శ జగన్నాథో దేవో నారాయణోఽవ్యయః ॥23॥

ఓ బ్రహ్మర్షీ! అవ్యయుడు, జగన్నాథుడునైన నారాయణమహర్షి దర్శించిన ఆ అనంగుడెవ్వరు?.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

కందర్పో హర్షతనయో యోఽసౌ కామో నిగద్యతే ।
స శంకరేణ సందగ్ధో హ్యనఙ్గత్వముపాగతః ॥24॥

ఆ కందర్పుడు హర్షతనయుడగు కాముడు. శంకరునిచే దగ్ధశరీరుడై అనంగుడయ్యాడు (శరీర రహితుడయ్యాడు).

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కిమర్థం కామదేవోఽసౌ దేవదేవేన శంభునా ।
దగ్ధశ్చ కారణే కస్మిన్నేతద్వ్యాఖ్యాతుమర్హసి ॥25॥

ఏ కారణంచేత కామదేవుని దేవదేవుడైన శంకరుడు భస్మం గావించాడు? ఆ విషయమంతా వివరించ వలసినదిగా కోరుచున్నాను.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

యదా దక్షసుతా బ్రహ్మన్ సతీ యాతా యమక్షయమ్ ।
వినాశ్య దక్షయజ్ఞం తం విచచార త్రిలోచనః ॥26॥

నారదా! వినుము. దక్షపుత్రియైన సతీదేవి మరణానంతరం త్రిలోచనుడు దక్షయజ్ఞం ధ్వంసం గావించి సంచరిస్తున్నాడు.

తతో వృషధ్వజం దృష్ట్వా కందర్పః కుసుమాయుధః ।
అపత్నీకం తదాఽస్త్రేణ ఉన్మాదేనాభ్యతాడయత్ ॥27॥

అపత్నీకుడైన వృషధ్వజుని చూసి కుసుమాయుధుడైన కందర్పుడు ఉన్మాదనాస్త్రంతో ప్రహారం చేశాడు.

తతో హరః శరేణాథ ఉన్మాదేనాశు తాడితః ।
విచచార తదోన్మత్తః కాననాని సరాంసి చ ॥28॥

ఆ ఉన్మాదాస్త్రప్రభావంవల్ల హరుడు పిచ్చివాని వలె అడవులలో, నదీతీరాలలో తిరుగాడసాగాడు.

స్మరన్ సతీం మహాదేవస్తథోన్మాదేన తాడితః ।
న శర్మ లేభే దేవర్షే బాణవిద్ధ ఇవ ద్విపః ॥29॥

తన భార్య సతీదేవి స్మరణకు రాగా బాణం దెబ్బతిన్న మదగజం వలె మహాదేవుడు మనోనిబ్బరాన్ని కోల్పోయాడు.

తతః పపాత దేవేశః కాళిందీసరితం మునే ।
నిమగ్నే శంకరే ఆపో దగ్ధాః కృష్ణత్వమాగతాః ॥30॥

ఓ నారదా! సతీవిరహతాపాన్ని భరించలేక హరుడు యమునానదిలో దుమికాడు. ఆ విరహాగ్నికి క్రాగి యమునాజలాలు నల్లబడ్డాయి.

తదా ప్రభృతి కాళింద్యా భృఙ్గాఞ్జననిభం జలమ్ ।
ఆస్యన్దత్పుణ్యతీర్థా సా కేశపాశమివావనేః ॥31॥

అప్పటినుండి తుమ్మెద, కాటుకలవంటి రంగునీరు కలిగిన యమున **"కాళింది"** అయ్యింది. ఆ ప్రవాహం భూదేవి కేశపాశం వలె ప్రవహించి పవిత్రతీర్థమయ్యింది.

తతో నదీషు పుణ్యాసు సరస్సు చ సరిత్సు చ ।
పులినేషు చ రమ్యేషు వాపీషు నలినీషు చ ॥32॥

పర్వతేషు చ రమ్యేషు కాననేషు చ సానుషు ।
విచరన్ స్వేచ్ఛయా నైవ శర్మ లేభే మహేశ్వరః ॥33॥

ఆ విధంగా ఎన్నో పవిత్రనదులలో, సరస్సులలో, ప్రవాహాలలో, వాపీకూపాదులలో మునుగుతూ నదీ తీరాలలో ఇసుకతిన్నెలలో, పర్వతభూములలో, అరణ్యాలలో స్వేచ్ఛగా తిరుగాడుతున్నను శివునకు మనశ్శాంతి కలుగలేదు.

క్షణం గాయతి దేవర్షే క్షణం రోదితి శంకరః ।
క్షణం ధ్యాయతి తన్వఙ్గీం దక్షకన్యాం మనోరమామ్ ॥34॥

ధ్యాత్వా క్షణం స్వపితి చ క్షణం స్వప్నాయతే హరః ।
స్వప్నే తథేదం గదతి దృష్ట్వా దక్షస్య కన్యకామ్ ॥ 35॥

ఓ నారదా! శంకరుడు క్షణం పాడుతూ, క్షణం రోదిస్తూ, క్షణం ధ్యానిస్తూ, అందాలరాశియైన దక్షకన్యను స్మరిస్తూ ఉండేవాడు. ఒక్కొక్కప్పుడు ఆమెను గూర్చి కలలు కంటూ కలలలో ఇలా కలవరించేవాడు.

నిర్ఘృణే తిష్ఠ కిం మూఢే త్యజసే మామనిందితే ।
ముగ్ధే త్వయా విరహితో దగ్ధోఽస్మి మదనాగ్నినా ॥36॥

సత్యం ప్రకుపితా దేవి మా కోపం కురు సుందరీ ।
పాదప్రణామావనతమభిభాషితుమర్హసి ॥37॥

శ్రూయసే దృశ్యసే నిత్యం స్పృశ్యసే వంద్యసే ప్రియే ।
ఆలింగ్యసే చ సతతం కిమర్థం నాభిభాషసే ॥38॥

ఓ నిర్దయురాలా! నిలువుము!. ఓ ముగ్ధా! అనింద్యురాలా! నన్నెందుకు త్యజించావు? నీ వియోగంవల్ల మదనాగ్నితో దగ్ధమౌతున్నాను. ఓ సతీ! సుందరీ! నామీద కోపమా? నాపై కోపింపకుము. నీ పాదాలకు

మ్రొక్కుతున్నాను. నాతో మాట్లాడుము. ఓ ప్రియురాలా! నిన్ను ప్రతిక్షణం చూస్తున్నాను. వింటున్నాను. స్పృశిస్తున్నాను. ఆలింగనం చేసుకుంటున్నాను. నీకు నమస్కరిస్తున్నాను. నాతో ఏలమాట్లాడవు?.

విలపంతం జనం దృష్ట్వా కృపా కస్య న జాయతే ।
విశేషతః పతిం బాలే నను త్వమతినిర్ఘృణా ॥39॥

ఇలా విలపించే వానిని చూచి ఎవరికి దయ కలుగదు? అందులోను భర్తయైన వానిపట్ల ఇంతటి కాఠిన్యమా?

త్వయోక్తాని వచాంస్యేవం పూర్వం మమ కృశోదరి ।
త్వయా వినా న జీవేయం తదసత్యం త్వయా కృతమ్ ॥40॥

ఏహ్యేహి కామసంతప్తం పరిష్వజ సులోచనే ।
నాన్యథా నశ్యతే తాపః సత్యేనాపి శపే ప్రియే ॥41॥

కృశోదరీ! నిన్ను వదలి నేను జీవించజాలనని నీవు లోగడ చేసిన బాసలు ఏమయ్యాయి?. నీవు ఎంతటి అసత్య వాదినివి. ఓ సులోచనా! ఇంతటి నిర్దయ వలదు. రమ్ము. నన్ను కౌగలించుకొనుము. లేనిచో ఈ కామాగ్ని చల్లారదు. నేను దగ్ధమగుట తథ్యము. నిజం చెబుతున్నాను.

ఇత్థం విలప్య స్వప్నాంతే ప్రతిబుద్ధస్తు తత్ క్షణాత్ ।
ఉత్కూజతి తథాఽరణ్యే ముక్తకంఠం పునః పునః ॥42॥

తం కూజమానం విలపంతమారాత్ సమీక్ష్య కామో వృషకేతనం హి ।
వివ్యాధ చాపం తరసా వినామ్య సంతాపనామ్నా తు శరేణ భూయః ॥43॥

ఈ విధంగా కలవరించి, స్వప్నభంగం కావడంతో తెలివి తెచ్చుకొని భోరుభోరున ఏడుస్తూ, అడవులలో తిరిగేవాడు. ఇలా దీనంగా విలపిస్తున్న వృషభధ్వజుడైన హరునిచూసి సంతాపమనే మరొకబాణంతో మన్మథుడు మరల కొట్టాడు.

సంతాపనాస్త్రేణ తదా సవిద్ధో భూయః స సంతప్తతరో బభూవ ।
సంతాపయంశ్చాపి జగత్సమస్తం ఫూత్కృత్య ఫూత్కృత్య వివాసతే స్మ ॥44॥

సంతాపాస్త్రంతో కొట్టబడిన శంకరుడు మరింత సంతప్తుడై, వేడినిట్టూర్పులు, ఫూత్కారాలు గావిస్తూ, ప్రపంచాన్నంతటిని తీవ్రతాపంలో ముంచాడు.

తం చాపి భూయో మదనో జఘాన విజృంభణాస్త్రేణ తతో విజృంభే ।
తతో భృశం కామశరైర్వితున్నో విజృంభమాణః పరితో భ్రమంశ్చ ॥45॥

ఆ విధంగా తీవ్రతాపానికి గురియైన శంకరుని మదనుడు మరలా విజృంభణాస్త్రంతో కొట్టాడు. దానితో శివుడు విపరీతంగా ఆవులిస్తూ నాలుగు దిక్కులా కలయజూశాడు.

దదర్శ యక్షాధిపతేస్తనూజం పాంచాలికం నామ జగత్ప్రధానమ్ ।
దృష్ట్వా త్రినేత్రో ధనదస్య పుత్రం పార్శ్వం సమభ్యేత్య వచో బభాషే ।
భ్రాతృవ్య వక్ష్యామి వచో యదద్య తత్త్వం కురుష్వామితవిక్రమోఽసి ॥46॥

అప్పుడతనికి కుబేర పుత్రుడైన **"పాంచాలికుడు"** అనేవాడు కనిపించాడు. వానిని చూసి శివుడు వెంటనే వానిని సమీపించి ఇలా పలికాడు. "బాబూ! నీవు మహావీరుడవు. నీవిప్పుడు నేను చెప్పినట్లు చేయుము" అన్నాడు.

పాంచాలిక ఉవాచ – పాంచాలికుడు పలికాడు.

యన్నాథ మాం వక్ష్యసి తత్కరిష్యే సుదుష్కరం యద్యపి దేవసంఘైః ।
ఆజ్ఞాపయస్వాతులవీర్య శంభో దాసోఽస్మి తే భక్తియుతస్తథేశ ॥47॥

ఓ శంభో! మీరు అసమానపరాక్రమవంతులు. నేను మీకు దాసుడను. మీయందు భక్తిగలవాడను. మీరు చెప్పినది దేవతలకు కూడా అసాధ్యమైనదైనప్పటికి నేను తప్పక చేస్తాను. ఆజ్ఞాపించండి.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు పలికాడు.

నాశం గతాయాం వరదాంబికాయాం కామాగ్నినా ప్లుష్టసువిగ్రహోఽస్మి ।
విజృంభణోన్మాదశరైర్విభిన్నో ధృతిం న విందామి రతిం సుఖం చ ॥48॥

విజృంభణం పుత్ర తథైవ తాపమున్మాదముగ్రం మదనప్రణున్నమ్ ।
నాన్యః పుమాన్ ధారయితుం హి శక్తో ముక్త్వా భవన్తం హి తతః ప్రతీచ్ఛ ॥49॥

పుత్రా! వరదాంబిక మరణానంతరం కామాగ్నిదగ్ధుడనై విజృంభణ, ఉన్మాదనబాణాలకు గురియై ధైర్యాన్ని, సుఖాన్ని, ఆనందాన్ని పొందలేక విలవిలలాడుతున్నాను. పుత్రా! మదనచోదితాలైన ఈ జృంభణ, మాదన, సంతాపనాస్త్రాల వేడిమిని తట్టుకొనగలవాడవు నీవు దక్క మరొకడు లేదు. కావున ఈ అస్త్రాలను నీవు గ్రహించి నాకు శాంతిని కలిగించుము.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్తో వృషభధ్వజేన యక్షః ప్రతీచ్ఛత్స విజృంభణాదీన్ ।
తోషం జగామాశు తతస్త్రిశూలీ తుష్టస్తదైవం వచనం బభాషే ॥50॥

ఈశ్వరుని వచనాలు విని, యక్షపుత్రుడు జృంభణ, మాదనాది అస్త్రాలను గ్రహించాడు. అంతట శివుడు మిక్కిలి సంతోషించినవాడై అతనితో ఇట్లు పలికాడు.

హర ఉవాచ – హరుడు పలికాడు.

యస్మాత్త్వయా పుత్ర సుదుర్ధరాణి విజృంభణాదీని ప్రతీచ్ఛితాని ।
తస్మాద్వరం త్వాం ప్రతిపూజనాయ దాస్యామి లోకస్య చ హాస్యకారి ॥51॥

పుత్రా! దుస్సహములైన జృంభణాది అస్త్రాల తాపాన్ని స్వీకరించిన నీయందు ప్రీతుడనయ్యాను. దానికి బదులుగా నీకు అనుకూలించునదియు, లోకులకు సంతోషకరమైనదియునగు వరమొకటి నీకు ఇస్తున్నాను.

యస్త్వాం యదా పశ్యతి చైత్రమాసే స్పృశేన్నరో వాఽర్చయతే చ భక్త్యా ।
వృద్ధోఽథ బాలోఽథ యువాఽథ యోషిత్ సర్వే తదోన్మాదధరా భవంతి ॥52॥

చైత్రమాసంలో నిన్ను చూసినను, తాకినను, భక్తితో అర్చించినను అట్టివారు వృద్ధులైనను, బాలురైనను, స్త్రీలైనను, పురుషులైనను, వారందరు ఉన్మత్తులౌతారు.

గాయంతి నృత్యంతి రమంతి యక్షవాద్యాని యత్నాదపి వాదయంతి ।
తవాగ్రతో హాస్యవచోఽభిరక్తా భవంతి తే యోగయుతాస్తు తే స్యుః ॥53॥

అట్టివారు ఆ స్థితిలో గానాలు చేస్తారు. నాట్యాలు చేస్తారు. క్రీడిస్తారు. వివిధ వాద్యాలు నేర్పుతో వాయిస్తారు. నీ ముందర హాస్యోక్తులు పలుకుతారు. ఐతే వారందరు యోగయుతులౌతారు.

మమైవ నామ్నా భవితాసి పూజ్యః పాంచాలికేశః ప్రథితః పృథివ్యామ్ ।
మమ ప్రసాదాద్వరదో నరాణాం భవిష్యసే పూజ్యతమోఽభిగచ్ఛ ॥54॥

ఇక నీవు భూలోకంలో నా పేరుతో **"పాంచాలికేశ్వరుడు"**గా విఖ్యాతుడవై నిన్ను కొలచినవారలకు నా అనుగ్రహం వల్ల వరాలనిస్తూ అందరికి పూజ్యుడవు కాగలవు.

ఇత్యేవముక్తో విభునా స యక్షో జగామ దేశాన్ సహసైవ సర్వాన్ ।
కాలంజరస్యోత్తరతః సుపుణ్యో దేశో హిమాద్రేరపి దక్షిణస్థః ॥55॥

తస్మిన్ సుపుణ్యే విషయే నివిష్టో రుద్రప్రసాదాదభిపూజ్యతేఽసౌ ।
తస్మిన్ ప్రయాతే భగవాన్ త్రినేత్రో దేవోఽపి విన్ధ్యం గిరిమభ్యగచ్ఛత్ ॥56॥

విభుడైన ఈశ్వరుడు ఇట్లు చెప్పగా వెంటనే హిమాద్రికి దక్షిణంగాను, కాలంజరమునకు ఉత్తరముగానున్న పవిత్రప్రదేశములకు యక్షుడు వెళ్ళాడు. పుణ్యక్షేత్రంలో ఆ యక్షపుత్రుడు శివానుగ్రహం వల్ల పాంచాలికేశ్వరుడుగా పూజలందుకుంటున్నాడు. అతడు వెళ్ళిపోయిన తరువాత ముక్కంటి కూడా వింధ్యాద్రికి పయనమయ్యాడు.

తత్రాపి మదనో గత్వా దదర్శ వృషకేతనమ్ ।
దృష్ట్వా ప్రహర్తుకామశ్చ తతః ప్రాదుద్రువద్ధరః ॥57॥

అక్కడకు కూడా మదనుడు వెళ్ళి వృషధ్వజునిపై మరల అస్త్రం ప్రహరింప ఉద్యుక్తుడుకాగా హరుడు అచ్చటినుండి పలాయితుడయ్యాడు.

తతో దారువనం ఘోరం మదనాభిసృతో హరః ।
వివేశ ఋషయో యత్ర సపత్నీకా వ్యవస్థితాః ॥58॥

అట్లు పలాయితుడైన హరుడు అనేకమంది ఋషులకు, ఋషిపత్నులకు ఆవాసమైనట్టియు, భయంకరమైనట్టియు దారుకావనంలో ప్రవేశించాడు.

తే చాపి ఋషయః సర్వే దృష్ట్వా మూర్ధ్నా నతాభవన్ ।
తతస్తాన్ ప్రాహ భగవాన్ భిక్షా మే ప్రతిదీయతామ్ ॥59॥

ఆ విధంగా మదనునిచే తరమబడి తమ ఆశ్రమంలో ప్రవేశించిన శివునిచూసి ఋషులు తమ తలలు వంచుకున్నారు. శివుడు వారిని భిక్ష పెట్టుమని అడిగాడు.

తతస్తే మౌనినస్తస్థుః సర్వ ఏవ మహర్షయః ।
తదాఽఽశ్రమాణి పుణ్యాని పరిచక్రామ నారద ॥60॥

నారదా! ఋషులు మౌనంగా ఉండడాన్ని చూసి హరుడు ఆ పుణ్యాశ్రమాలన్నింటా కలయతిరిగాడు.

తం ప్రవిష్టం తదా దృష్ట్వా భార్గవాత్రేయయోషితః ।
ప్రక్షోభమగమన్ సర్వా హీనసత్త్వాః సమంతతః ॥ 61॥

ఇట్లు తిరుగుచున్న శివునిచూసి భార్గవ, ఆత్రేయమహర్షుల భార్యలు విమోహితలై నిగ్రహాన్ని కోల్పోయి, కామార్తలై, శివుడెచ్చటకు పోయిన అచ్చటకు వెంటబడి పోసాగారు.

ఋతే త్వరుంధతీమేకామనసూయాం చ భామినీమ్ ।
ఏతయోర్భర్తృపూజాసు తచ్చింతా సుస్థితం మనః ॥62॥

పరమపతివ్రతలైన అరుంధతీ, అనసూయలు మాత్రం ఏ వికారానికి లోనుగాక వారి భర్తృసేవలో నిమగ్నులై యున్నారు.

తతః సంక్షోభితాః సర్వా యత్ర యాతి మహేశ్వరః ।
తత్ర ప్రయాంతి కామార్తా మదవిహ్వలితేంద్రియాః ॥63॥

తక్కిన ఋషిపత్నులందరు మదవిహ్వలులై సంక్షుభితలై మహేశ్వరుడెచ్చటకు వెళ్లితే అచ్చటకు వెళ్ళుతున్నారు.

త్యక్త్వాఽఽశ్రమాణి శూన్యాని స్వాని తా మునియోషితః ।
అనుజగ్ముర్యథా మత్తం కరిణ్య ఇవ కుంజరమ్ ॥64॥

తమ ఆశ్రమాలు, గృహాలు వదలి మదించిన ఏనుగును వెంబడించిన ఆడ ఏనుగులవలె పరమశివుని వెంట మునిపత్నులు పరుగులు తీశారు.

తతస్తు ఋషయో దృష్ట్వా భార్గవాఙ్గిరసో మునే ।
క్రోధాన్వితాఽబ్రువన్ సర్వే లింగమాపతతాం భువి ॥65॥

తమ భార్యల చేష్టలు చూచి క్రోధోన్మత్తులైన భార్గవ ఆంగిరసాది మహర్షులు శివుని లింగం నేలపడేటట్లుగా శపించారు.

తతః పపాత దేవస్య లింగం పృథ్వీం విదారయత్ ।
అంతర్ధానం జగామాథ త్రిశూలీ నీలలోహితః ॥66॥

వెంటనే శివుని లింగం భూమిని బ్రద్దలు చేస్తూ నేలపై పడింది. అంతట త్రిశూలియు, నీలలోహితుడు నగు శివుడు అంతర్హితుడయ్యాడు.

తతస్తత్పతితం లింగం విభేద్య వసుధాతలమ్ ।
రసాతలం వివేశాథ బ్రహ్మాండం చోర్ధ్వతోఽభినత్ ॥67॥

అట్లు నేలబడిన శివలింగం భూమిని బ్రద్దలు చేసుకొని పాతాళానికి చేరుకున్నది. అట్లే బ్రహ్మాండాన్ని భేదించుకొని ఊర్ధ్వలోకాలకు కూడా వ్యాపించింది.

తతశ్చచాల పృథివీ గిరయః సరితో నగాః ।
పాతాలభువనాః సర్వే జంగమాజంగమాశ్రితా ॥68॥

అంతట నదీనద సముద్ర పర్వతాలతో నిండిన భూగోళం కంపించింది. జంగమాజంగమాశ్రయాలైన పాతాళాది భువనాలన్నీ ఘూర్ణిల్లిపోయాయి.

సంక్షుబ్ధాన్భువనాన్ దృష్ట్వా భూర్లోకాదీన్పితామహః ।
జగామ మాధవం ద్రష్టుం క్షీరోదం నామ సాగరమ్ ॥69॥

ఆ విధంగా సంక్షుభితాలైన భూలోకాది సమస్తభువనాలను చూసి బ్రహ్మ ఆశ్చర్యచకితుడై మాధవుని దర్శించడానికి క్షీరసముద్రానికి వెళ్ళాడు.

తత్ర దృష్ట్వా హృషీకేశం ప్రణిపత్య చ భక్తితః ।
ఉవాచ దేవ భువనాః కిమర్థం క్షుభితా విభో ॥70॥

అచ్చట హృషీకేశుని చూసి భక్తితో నమస్కరించి బ్రహ్మ "ప్రభో! సమస్తభువనాలు ఈ విధంగా సంక్షుభితం కావడానికి కారణమేమి?" అని అడిగాడు.

అథోవాచ హరిర్బ్రహ్మన్ శార్వో లింగో మహర్షిభిః ।
పాతితస్తస్య భారార్తా సంచచాల వసుంధరా ॥71॥

అంతట శ్రీహరి "బ్రహ్మా! శర్వుని లింగం మహర్షుల శాపం కారణంగా ఊడిపడింది. ఆ భారం వహింపలేక భూమి కంపించిపోతున్నది.

తతస్తదద్భుతతమం శ్రుత్వా దేవః పితామహః ।
తత్ర గచ్ఛామ దేవేశ ఏవమాహ పునఃపునః ॥72॥

ఆ అద్భుతానికి విస్మితుడై బ్రహ్మ మనమచ్చటకు పోవుదమని విష్ణువును తొందరపెట్టాడు.

తతః పితామహో దేవః కేశవశ్చ జగత్పతిః ।
ఆజగ్మతుస్తముద్దేశం యత్ర లింగం భవస్య తత్ ॥73॥

అంతట పితామహుడైన బ్రహ్మదేవుడు, జగత్పతియైన మాధవుడు శివలింగం పడిన ప్రదేశానికి చేరారు.

తతోఽనంతం హరిర్లింగం దృష్ట్వాఽరుహ్య ఖగేశ్వరమ్ ।
పాతాళం ప్రవివేశాథ విస్మయాన్తరితో విభుః ॥74॥

ఆద్యన్తాలు కనిపించని ఆ శివలింగాన్ని చూసిన వెంటనే ఆశ్చర్య చకితుడైన విష్ణువు గరుడారూఢుడై పాతాళానికి వెళ్లాడు.

బ్రహ్మా హంసవిమానేన ఊర్ధ్వమాక్రమ్య సర్వతః ।
నైవాంతమలభద్బ్రహ్మాన్ విస్మితః పునరాగతః ॥75॥

బ్రహ్మ హంసవిమానమునెక్కి ఊర్ధ్వలోకాలనన్నిటిని గాలించాడు. కాని శివలింగంయొక్క చివరికొన కనుగొనజాలక విస్మయావిష్టుడై తిరిగివచ్చాడు.

విష్ణుర్గత్వాఽథ పాతాలాన్ సప్తలోకపరాయణః ।
చక్రపాణిర్వినిష్క్రాన్తో లేభేఽన్తం న మహామునే ॥76॥

ఓ నారదా! అదేవిధంగా సప్త పాతాళాలను శోధించిన విష్ణువుకూడా లింగంయొక్క మొదలు కనుగొనలేక తిరిగి వచ్చాడు.

విష్ణుః పితామహశ్చోభౌ హరలింగం సమేత్య హ ।
కృతాంజలిపుటౌ భూత్వా స్తోత్రం దేవౌ ప్రచక్రతుః ॥77॥

అంతట బ్రహ్మవిష్ణువులిరువురు శివలింగాన్ని సమీపించి, చేతులు జోడించి, మహాదేవుని ఈ విధంగా స్తోత్రం చేయడం ప్రారంభించారు.

హరిబ్రహ్మాణావూచతుః – హరిబ్రహ్మలు ఇలా స్తుతించారు.

నమోఽస్తు తే శూలపాణే నమోఽస్తు వృషభధ్వజ ।
జీమూతవాహన కవే శర్వ త్ర్యంబక శంకర ॥78॥

మహేశ్వర మహేశాన సువర్ణాక్ష వృషాకపే ।
దక్షయజ్ఞ క్షయకర కాలరూప నమోఽస్తు తే ॥79॥

త్వమాదిరస్య జగతస్త్వం మధ్యం పరమేశ్వర ।
భవానన్తశ్చ భగవాన్సర్వగస్త్వం నమోఽస్తు తే ॥80॥

ఓ శూలపాణీ! నీకు నమస్కారం. ఓ వృషభధ్వజా! నీకు వందనం. ఓ జీమూతవాహనా! కవీ! శర్వా! త్ర్యంబకా! శంకరా! నీకు నమస్కారం. ఓ మహేశ్వరా! మహేశానా! సువర్ణాక్షా! వృషాకపీ! దక్షయజ్ఞనాశకా! కాలరూపా! నీకు నమస్కారం. ఓ పరమేశ్వరా! ఈ జగత్తునకు ఆది, అంతం నీవే. భగవాన్! నీవు సర్వగుడవు. నీకు వందనాలు.

పులస్త్య ఉవాచ – పులస్త్య మహర్షి పలికాడు.

ఏవం సంస్తూయమానస్తు తస్మిన్ దారువనే హరః ।
స్వరూపీ తావిదం వాక్యమువాచ వదతాం వరః ॥81॥

ఆ దారువనంలో ఈ విధంగా సంస్తూయమానుడైన వాక్యవిశారదుడగు ఈశ్వరుడు హరిబ్రహ్మలకు ప్రత్యక్షమై, వారితో ఇలా పలికాడు.

హర ఉవాచ – హరుడు పలికాడు.

కిమర్థం దేవతానాథౌ పరిభూతక్రమం త్విహ ।
మాం స్తువాతే భృశా స్వస్థం కామతాపితవిగ్రహమ్ ॥82॥

ఓ దేవాధిపులారా! కామసంతప్తుడనై విధిక్రమాలు విసర్జించి, అస్వస్థుడనైన నన్నెందుకు స్తోత్రం చేశారు? అని హరుడు అడిగాడు.

దేవావూచతుః – హరి బ్రహ్మలు ఇలా పలికారు.

భవతః పాతితం లింగం యదేతద్భువి శంకర ।
ఏతత్ప్రగృహ్యతాం భూయః అతో దేవ స్తువావహే ॥83॥

ఓ శంకరా! ఈ భూమిపై పడవేయబడిన మీ లింగరూపమును తిరిగి మీరు పరిగ్రహించండి. అందులకే మేము మిమ్ములను ప్రార్థిస్తున్నాము.

హర ఉవాచ – హరుడు పలికాడు.

యద్యర్చయంతి త్రిదశా మమ లింగం సురోత్తమౌ ।
తదేతత్ప్రతిగృహ్ణీయాం నాన్యథేతి కథంచన ॥84॥

ఓ దేవోత్తములారా! దేవతలందరు నా లింగాన్ని పూజిస్తే నేను దీనిని తిరిగి తీసుకుంటాను. లేనిచో నేను ఏ విధంగాను గ్రహించను.

తతః ప్రోవాచ భగవానేవమస్త్వితి కేశవః ।
బ్రహ్మా స్వయం చ జగ్రాహ లింగం కనకపింగళమ్ ॥85॥

అంతట భగవానుడైన కేశవుడు అట్లేయని అంగీకరించగా బ్రహ్మ స్వయంగా కనకపింగళవర్ణమయమైన శివలింగాన్ని చేతిలోనికి గ్రహించాడు.

తతశ్చకార భగవాంశ్చాతుర్వర్ణ్యం హరార్చనే ।
శాస్త్రాణి చైషాం ముఖ్యాని నానోక్తివిదితాని చ ॥86॥

ఆద్యం శైవం పరిఖ్యాతమన్యత్పాశుపతం మునే ।
తృతీయం కాలవదనం చతుర్థం చ కపాలికమ్ ॥87॥

శివశ్చాసీత్ స్వయం శక్తిర్వసిష్ఠస్య ప్రియః సుతః ।
తస్య శిష్యో బభూవాథ గోపాయన ఇతి శ్రుతః ॥88॥

మహాపాశుపతశ్చాసీద్భరద్వాజస్తపోధనః ।
తస్య శిష్యోఽప్యభూద్రాజా ఋషభః సోమకేశ్వరః ॥89॥

కాలాస్యో భగవానాసీదాపస్తంబస్తపోధనః ।
తస్య శిష్యోఽభవద్వైశ్యో నామ్నా క్రాథేశ్వరో మునే ॥90॥

మహావ్రతీ చ ధనదస్తస్య శిష్యశ్చ వీర్యవాన్ ।
కర్ణోదర ఇతి ఖ్యాతో జాత్యా శూద్రో మహాతపాః ॥91॥

అనంతరం భగవానుడు నాలుగు వర్ణాలవారిని శివార్చనాపరులను గావించాడు. అందులకు కావలసిన ముఖ్యశాస్త్రాలను ప్రవర్తింపజేశాడు. అందులో మొదటిది శైవం. రెండవది పాశుపతం. మూడవది కాలవదనం. నాల్గవది కాపాలికం. ఓ నారదా! వసిష్ఠుని ప్రియపుత్రుడైన శక్తి స్వయంగా శైవుడయ్యాడు. ఆయన శిష్యుడు గోపాయనుడని విన్నాము. తపోధనుడైన భరద్వాజుడు మహాపాశుపతుడయ్యాడు. ఆ తపస్వి శిష్యుడు ఋషభసోమకేశ్వరుడను రాజు. తపోధనుడైన ఆపస్తంభుడు కాలముఖభక్తుడయ్యాడు. ఆయన శిష్యుడు క్రాథేశ్వరుడను వైశ్యుడు. కుబేరుడు మహావ్రతదీక్షితుడు కాగా అతని శిష్యుడు మహాతపస్వియైన కర్ణోదరుడు శూద్రుడు.

ఏవం స భగవాన్ బ్రహ్మా పూజనాయ శివస్య తత్ ।
కృత్వా తు చాతురాశ్రమ్యం స్వమేవ భవనం గతః ॥92॥

ఈ విధంగా భగవంతుడైన బ్రహ్మ నాలుగువర్ణముల వారిని శివపూజకై నియోగించి తన లోకానికి తిరిగి వెళ్ళాడు.

గతే బ్రహ్మణి శర్వోఽపి ఉపసంహృత్య తత్తదా ।
లింగం చిత్రవనే సూక్ష్మం ప్రతిష్ఠాప్య చచార హ ॥93॥

బ్రహ్మ వెళ్ళిన పిదప శివుడు తన లింగాన్ని ఉపసంహరించుకొని సూక్ష్మరూపంలో దానిని చిత్రవనంలో ప్రతిష్ఠించి మరల తిరుగనారంభించాడు.

విచరన్తం తదా భూయో మహేశం కుసుమాయుధః ।
ఆరాత్ స్థిత్వాఽగ్రతో ధన్వీ సంతాపయితుముద్యతః ॥94॥

మహేశ్వరుడట్లు మరలా తిరుగడం చూసి, కుసుమాయుధుడు ఆయనపై మరల అస్త్రప్రహారం చేయడానికి ధనుష్పాణియై ఎదుట నిలబడ్డాడు.

తతస్తమగ్రతో దృష్ట్వా క్రోధాధ్మాతదృశా హరః ।
స్మరమాలోకయామాస శిఖాగ్రాచ్చరణాంతికమ్ ॥95॥

వానిని చూసినంతనే క్రోధంతో కనుల నిప్పులు రాల్చుచు శివుడాతనిని నఖశిఖపర్యంతం వీక్షించాడు.

ఆలోకితస్త్రినేత్రేణ మదనో ద్యుతిమానపి ।
ప్రాదహ్యత తదా బ్రహ్మన్ పాదాదారభ్య కక్షవత్ ॥96॥

నారదా! తాను తేజస్వియైనను త్రినేత్రుని వేడిమికి మదనుడోర్వలేకపోగా అతని పాదాలనుండి నడుము వరకు గల భాగం దగ్ధమయ్యింది.

ప్రదహ్యమానౌ చరణౌ దృష్ట్వాఽసౌ కుసుమాయుధః ।
ఉత్ససర్జ ధనుః శ్రేష్ఠం తజ్జగామాథ పంచధా ॥97॥

పాదాలు ఆ విధంగా తగులబడగా మదనుడు తన ధనుస్సును వదలివేశాడు. అది ఐదు ఖండాలయ్యింది.

యదాసీన్ముష్టిబంధే తద్రుక్మపృష్ఠం మహాప్రభమ్ ।
స చంపకతరుర్జాతః సుగంధాఢ్యో మహాద్యుతిః ॥98॥

బంగారం వలె మెరుస్తున్న ధనుస్సు యొక్క ముష్టిబంధం సువాసనలు వెదజల్లే సంపంగి (చంపక) వృక్షమయ్యింది.

నాహస్థానం శుభాకారం యదాసీద్వజ్రభూషితమ్ ।
తజ్జాతం కేసరారణ్యం బకులం నామతో మునే ॥99॥

ఓ నారదా! వజ్రభూషితమైన దాని సుందరవిలుత్రాడు కేసరవనంలో చక్కని వకుళ(పొగడ)వృక్షంగా మారింది.

యా చ కోటీ శుభా హ్యాసీదింద్రనీలవిభూషితా ।
జాతా సా పాటలా రమ్యా భృఙ్గరాజివిభూషితా ॥100॥

ఓ మునీ! ఇంద్రనీలమణులు పొదిగిన ఆ ధనుస్సుయొక్క అగ్రభాగం తుమ్మెదలతో నిండిన రమ్యమైన పాటల తరువయ్యింది.

నాహోపరి తథా ముష్టౌ స్థానం చంద్రమణిప్రభమ్ ।
పంచగుల్మాఽభవజ్జాతీ శశాఙ్కకిరణోజ్జ్వలా ॥101॥

నాహస్థానానికి పైభాగాన గల చంద్రకాంతమణులు పొదిగిన పిడి చంద్రకాంతి వలె తెల్లనైన ఐదురేఖల మల్లెపొద అయ్యింది.

ఊర్ధ్వం ముష్ట్యా అధః కోట్యోః స్థానం విద్రుమభూషితమ్ ।
తస్మాద్బహుకుటామల్లీ సంజాతా వివిధా మునే ॥102॥

ఓనారదమునీ పిడి పైన, ఒంపుతిరిగిన చివరలకు దిగువ, పగడాలతో అలంకరింపబడిన స్థానం దొంతరలు గల వివిధ నవమల్లికలయ్యాయి.

పుష్పోపగాని రమ్యాణి సురభీణి చ నారద ।
జాతియుక్తాని దేవేన స్వయమాచరితాని చ ॥103॥

నారదా! ఈవిధంగా పరమేశ్వరునిద్వారా సుగంధాలు వెదజల్లే మల్లెమొదలైన జాతిపుష్పాలు సృష్టింపబడ్డాయి.

ముమోచ మార్గణాన్ రమ్యాన్ శరీరే దహ్యతి స్మరః ।
ఫలోపగాని వృక్షాణి సంభూతాని సహస్రశః ॥104॥

తన శరీరం తగలబడడంచూచి మన్మథుడు రమ్యమైన తన బాణాలనుకూడా పారవైచాడు. వానినుండి వేలాది ఫలవృక్షాలు పుట్టాయి.

చూతాదీని సుగంధీని స్వాదూని వివిధాని చ ।
హరప్రసాదాజ్జాతాని భోజ్యాన్యపి సురోత్తమైః ॥105॥

శంకరుని కృప వల్ల దేవతలకు కూడా భోజ్యమైన, రుచికరమైన మామిడి మొదలైన వివిధ రసవంతమైన ఫలాలు ఏర్పడ్డాయి.

ఏవం దగ్ధ్వా స్మరం రుద్రః సంయమ్య స్వతనుం విభుః ।
పుణ్యార్థీ శిశిరాద్రిం స జగామ తపసేఽవ్యయః ॥106॥


ఈ విధంగా రుద్రుడు మన్మధుని దగ్ధం చేసి తన శరీరాన్ని అదుపులోనుంచుకొని పుణ్యార్జనకై తపస్సు చేయడానికి కైలాసానికి వెళ్ళాడు.

ఏవం పురా దేవవరేణ శంభునా కామస్తు దగ్ధః సశరః సచాపః ।
తతస్త్వనఙ్గేతి మహాధనుర్ధరో దేవైః స్తుతో దేవవరైస్తు పూజితః ॥107॥

ఈ విధంగా పూర్వకాలంలో దేవశ్రేష్ఠుడైన శివుడు ధనుర్బాణాలతో సహా మదనుని దగ్ధం కావించగా ఆ మహాధానుష్కుడు ఆనాటినుండియు అనంగుడని పిలువబడ్డాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే కామదాహో నామ షష్ఠోఽధ్యాయః ॥6॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి కామదహనమనే ఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తమోఽధ్యాయః – ఏడవ అధ్యాయం
ప్రహ్లాదయుద్ధమ్ – ప్రహ్లాదుని యుద్ధం

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తతోఽనఙ్గం విభుర్దృష్ట్వా బ్రహ్మన్నారాయణో మునిః ।
విహస్యైవం వచః ప్రాహ కందర్ప ఇహ ఆస్యతామ్ ॥1॥

నారదా! అనంతరం నారాయణమహర్షి కాముని చూసి నవ్వుచు "కందర్పా! వచ్చి ఇచ్చట కూర్చుండుము" అన్నాడు.

తదక్షుబ్ధత్వమీక్ష్యాస్య కామో విస్మయమాగతః ।
వసంతోఽపి మహాచింతాం జగామాశు మహామునే ॥2॥

ఆ మహర్షిస్థైర్యానికి మన్మథుడు ఆశ్చర్యపోయాడు. ఓ మహామునీ! వసంతుడు కూడా వెంటనే ఎంతో విచారానికి లోనయ్యాడు.

తతశ్చాప్సరసో దృష్ట్వా స్వాగతేనాభిపూజ్య చ ।
వసంతమాహ భగవానేహ్యేహి స్థీయతామితి ॥3॥

అనంతరం స్వాగతవాక్యాలతో అప్సరసలను గౌరవించి, నారాయణుడు వసంతునితో ఇలా పలికాడు. "భగవాన్ ఇటు రమ్ము!, ఇక్కడ కూర్చొండుము!" అని.

తతో విహస్య భగవాన్ మంజరీం కుసుమావృతామ్ ।
ఆదాయ ప్రాక్ సువర్ణాంగీమూర్వోర్బాలాం వినిర్మమే ॥4॥

అంతట నారాయణమహర్షి నవ్వుచు ఒక పుష్పమంజరిని తీసుకొని తన ఊరువుపై ఒక సువర్ణాంగియైన బాలికను సృష్టించాడు.

ఊరూద్భవాం స కందర్పో దృష్ట్వా సర్వాంగసుందరీమ్ ।
అమన్యత తదాఽనంగః కిమియం సా ప్రియా రతిః ॥5॥

ఆ విధముగా నారాయణ మహర్షి ఊరువునుండి వెలువడిన అందాలరాశిని చూచి మన్మథుడు ఆశ్చర్య చకితుడై "ఈమె నా భార్యయైన రతీదేవియా!" అనుకున్నాడు.

తదేవ వచనం చారు స్వక్షిభ్రూకుటిలాలకమ్ ।
సునాసా వంశాధరోష్ఠమాలోకనపరాయణమ్ ॥6॥

అదే మొగము, అవే అందమైన కనులు, కనుబొమలు, ముంగురులు అదే అందమైన నాసిక, అవే చక్కని అధరోష్ఠాలు, అదే పలుకు, ఎంత చూసినా తనివి తీరదు.

తావేవ చాప్యవిరలౌ పీవరౌ మగ్నచూచుకౌ ।
రాజేతేఽస్యాః కుచౌ పీనౌ సజ్జనావివ సంహతౌ ॥7॥

ఇద్దరు సత్పురుషుల వలె పరస్పరం ఒరుసుకొని చక్కని చూచుకాలతో చిక్కగా బలిసిన చన్నులు.

తదేవ తనుచార్వఙ్గ్యా వలిత్రయవిభూషితమ్ ।
ఉదరం రాజతే శ్లక్ష్ణం రోమావలివిభూషితమ్ ॥8॥

అదే అందమైన శరీరాంగాలు. త్రివళులతో సన్నగానున్న నడుము, లేత నూగారుతో అందమైన ఉదరం.

రోమావలీ చ జఘనాద్యాతి స్తనతటం త్వియమ్ ।
రాజతే భృఙ్గమాలేవ పులినాత్కమలాకరమ్ ॥9॥

జఘనంనుండి స్తనాల వరకు పైకి వ్యాపించిన రోమావళి, సరోవరం ఒడ్డునుండి వికసించిన తామరపూల కొరకు ఎగ(బాకే తుమ్మెదల గుంపులాగ శోభిల్లుతోంది.

జఘనం త్వతివిస్తీర్ణం భాత్యస్యా రశనావృతమ్ ।
క్షీరోదమథనే నద్ధం భుజంగేనేవ మందరమ్ ॥10॥

వడ్డాణంతో వెలుగొందే జఘనప్రదేశం క్షీరసాగరమథనసమయంలో వాసుకిచే చుట్టబడిన మందర పర్వతం వలె ఉన్నది.

కదలీస్తంభసదృశైరూర్ధ్వమూలైరథోరుభిః ।
విభాతి సా సుచార్వఙ్గీ పద్మకింజల్కసన్నిభా ॥11॥

తలక్రిందుగా నుంచబడిన కదళీకాండాల వంటి నునుపైన తొడలు. పద్మకేసరాలవంటి గౌరవర్ణంతో శోభిల్లుతున్నాయి.

జానునీ గూఢగుల్ఫే చ శుభే జంఘే త్వరోమశే ।
విభాత్యస్యాస్తథా పాదావలక్తకసమత్విషౌ ॥12॥

మోకాళ్ళు, పుష్టియైన మడమలు, రోమరహితమైనట్టియు, శుభంకరమైనట్టియు పిక్కలు. లత్తుకరంగు పాదాలు, ఓహో! ఎంత అందంగా ఉన్నాయి!.

ఇతి సంచింతయన్ కామస్తామనిందితలోచనామ్ ।
కామాతురోఽసౌ సంజాతః కిముతాన్యో జనో మునే ॥13॥

నారదా! ఈ విధంగా మన్మథుడంతటి సుందరుడే ఆ సుందరి శోభకు ముగ్ధుడై కామాతురుడయ్యాడంటే ఇతరులమాట వేరే చెప్పవలెనా?

మాధవోఽప్యుర్వశీం దృష్ట్వా సంచింతయత నారద ।
కింస్విత్కామనరేంద్రస్య రాజధానీ స్వయం స్థితా ॥14॥

ఆయాతా శశినో నూనమీయం కాంతిర్నిశాక్షయే ।
రవిరస్మి ప్రతాపార్తి భీతా శరణమాగతా ॥15॥

ఇత్థం సంచింతయన్నేవ అవష్టభ్యాప్సరో గణమ్ ।
తస్థౌ మునిరివ ధ్యానమాస్థితః స తు మాధవః ॥16॥

ఇక వసంతుడు ఊర్వశిని చూసి "అహో! ఇది మన్మథనృపతి రాజధానియా!. రాత్రి గడచిపోవడంతో సూర్యకిరణాల తాపానికి భయపడి శరణాగతమైన చంద్రజ్యోత్స్నయా!". అని వితర్కించుకొని అప్సరసలను అపవారించి వసంతుడు మౌనివలె ధ్యానమగ్నుడయ్యాడు.

తతః సవిస్మితాన్ సర్వాన్ కందర్పాదీన్ మహామునే ।
దృష్ట్వా ప్రోవాచ వచనం స్మితం కృత్వా శుభవ్రతః ॥17॥

మహామునీ! ఈ విధంగా ఊర్వశి సౌందర్యానికి ముగ్ధులై నిలచిన మన్మథ వసంతాప్సరసలను చూసి శుభవ్రతుడైన నారాయణముని నవ్వుతూ ఇలా అన్నాడు.

ఇయం మమోరుసంభూతా కామాప్సరస మాధవ ।
నియతాం సురలోకాయ దీయతాం వాసవాయ చ ॥18॥

ఇత్యుక్తాః కంపమానాస్తే జగ్ముర్గృహ్యోర్వశీం దివమ్ ।
సహస్రాక్షాయ తాం ప్రాదాద్ రూపయౌవనశాలినీమ్ ॥19॥

"కామా! వసంతా! అప్సరసలారా! ఈ సుందరి నా తొడనుండి పుట్టినది. ఈమెను మీరు తోడుకొనిపోయి మీ దేవేంద్రునికి సమర్పించండి" అని నారాయణముని పలికాడు. ఆ మహర్షి మాటలకు మన్మథాదులు భయకంపితులై మారుమాటాడక ఊర్వశిని తీసుకొని స్వర్గానికి వెళ్ళి సహస్రాక్షునకు సమర్పించారు.

ఆచక్షుశ్చరితం తాభ్యాం ధర్మజాభ్యాం మహామునే ।
దేవరాజాయ కామాద్యాస్తతోఽభూద్విస్మయః పరః ॥20॥

మహామునీ! ఇంద్రునికి ఆ ఇరువురు ధర్మపుత్రులైన నరనారాయణుల చరిత్రనంతటిని మన్మథాదులు నివేదించారు. అది విని దేవేంద్రుడు ఆశ్చర్యచకితుడయ్యాడు.

ఏతాదృశం హి చరితం ఖ్యాతిమగ్ర్యాం జగామ హ ।
పాతాలేషు తథా మర్త్యే దిక్ష్వష్టాసు జగామ చ ॥21॥

ఇట్టి నరనారాయణుల అద్భుతగాథ మర్త్యపాతాళలోకాలలోను, దిగ్దిగంతాలలోను ఖ్యాతి వహించింది.

ఏకదా నిహతే రౌద్రే హిరణ్యకశిపౌ మునే ।
అభిషిక్తస్తదా రాజ్యే ప్రహ్లాదో నామ దానవః ॥22॥

నారదమునీ! ఒకానొకప్పుడు క్రూరుడైన హిరణ్యకశిపుని వధానంతరం ప్రహ్లాదుడను పేరు గల దానవుడు రాజ్యాభిషిక్తుడయ్యాడు.

తస్మిన్ శాసతి దైత్యేంద్రే దేవబ్రాహ్మణపూజకే ।
మఖాని భువి రాజానో యజంతే విధివత్తదా ॥23॥

బ్రాహ్మణాశ్చ తపోధర్మం తీర్థయాత్రాశ్చ కుర్వతే ।
వైశ్యాశ్చ పశువృత్తిస్థాః శూద్రాః శుశ్రూషణే రతాః ॥24॥

చాతుర్వర్ణ్యం తతస్స్వే స్వే ఆశ్రమే ధర్మకర్మణి ।
అవర్తత తతో దేవా వృత్త్యా యుక్తాభవన్మునే ॥25॥

దేవబ్రాహ్మణపూజకుడైన ఆ దైత్యేంద్రుని పాలనలో భూమండలంలోని రాజులందరు విధివిధానంగా యజ్ఞాదులు ఆచరించారు. బ్రాహ్మణులు తపోఽధ్యయనతీర్థయాత్రాది ధర్మకార్యనిరతులై యున్నారు. వైశ్యులు పశుపాలన, శూద్రులు సేవకావృత్తిని యథావిధిగా ఆచరిస్తున్నారు. ఓ మునీ! ఈ విధంగా నాలుగు వర్ణాలవారు తమ తమ ఆశ్రమధర్మకర్మలందు నిరతులు కాగా దేవతలు కూడా తమ తమ వృత్తులను నిర్వర్తిస్తున్నారు.

తతస్తు చ్యవనో నామ భార్గవేంద్రో మహాతపాః ।
జగామ నర్మదాం స్నాతుం తీర్థం వై నకులీశ్వరమ్ ॥26॥

తత్ర దృష్ట్వా మహాదేవం నదీం స్నాతుమవాతరత్ ।
అవతీర్ణం ప్రజగ్రాహ నాగః కేకరలోహితః ॥27॥

గృహీతస్తేన నాగేన సస్మార మనసా హరిమ్ ।
సంస్మృతే పుండరీకాక్షే నిర్విషోఽభూన్మహోరగః ॥28॥

ఆ సమయంలో ఒకనాడు బ్రాహ్మణశ్రేష్ఠుడు, భృగువంశశ్రేష్ఠుడు, తపోధనుడునైన చ్యవనమహర్షి నర్మదానదీతీరంలోని నకులీశ్వరతీర్థంలో స్నానం చేయబోయాడు. మహాదేవుని దర్శనానంతరం స్నానార్థం నర్మదానదిలోనికి దిగిన వెంటనే చ్యవనమహర్షిని ఒక గోధుమవర్ణంగల సర్పం పట్టుకొన్నది. సర్పగ్రస్తుడైన ఆ ముని మనసారా విష్ణువును స్మరించగానే వెంటనే ఆ సర్పం విషరహితమయ్యింది.

నీతస్తేనాతిరౌద్రేణ పన్నగేన రసాతలమ్ ।
నిర్విషశ్చాపి తత్యాజ చ్యవనం భుజగోత్తమః ॥29॥

సంత్యక్తమాత్రో నాగేన చ్యవనో భార్గవోత్తమః ।
చచార నాగకన్యాభిః పూజ్యమానః సమంతతః ॥30॥

విచరన్ప్రవివేశాథ దానవానాం మహత్పురమ్ ।
సంపూజ్యమానో దైత్యేంద్రైః ప్రహ్లాదోఽథ దదర్శ తమ్ ॥31॥

అంతట ఆ సర్పం ఆ మహర్షిని లాగుకొని పాతాళానికి తీసుకొనిపోయి అచ్చట విడిచిపెట్టింది. భార్గవోత్తముడైన చ్యవనమహర్షి అట్లు సర్పంచే విడువబడి నాగకన్యల పూజలందుకుంటూ పాతాళలోకమంతట తిరుగసాగాడు.

ఆ విధంగా తిరుగుతు ఆ మహర్షి విశాలమైన దానవుల నగరంలో ప్రవేశించాడు. అచ్చట దైత్యోత్తములచే పూజింపబడుచున్న ప్రహ్లాదుడు చ్యవనమహర్షిని దర్శించాడు.

భృగుపుత్రో మహాతేజాః పూజాం చక్రే యథార్హతః ।
సంపూజితోపవిష్టశ్చ పృష్టశ్చాగమనం ప్రతి ॥32॥

మహాతేజస్వియగు ప్రహ్లాదుడు భృగుపుత్రుడైన చ్యవనమహర్షిని యథోచితంగా పూజించి, కూర్చుండబెట్టి, ఆయన వచ్చిన కారణం అడిగాడు.

స చోవాచ మహారాజ మహాతీర్థం మహాఫలమ్ ।
స్నాతుమేవాగతోఽస్మ్యద్య ద్రష్టుం వై నకులీశ్వరమ్ ॥33॥

నద్యామేవావతీర్ణోఽస్మి గృహీతశ్చాహినా బలాత్ ।
సమాతీతోఽస్మి పాతాలే దృష్టశ్చాత్ర భవానపి ॥34॥

ఆ మహర్షి "ఓ దైత్యేంద్రా! మహాఫలప్రదమైన మహాతీర్థస్నానం, మహేశ్వరుడైన నకులీశ్వరదర్శనం చేయాలనే కుతూహలంతో నేను వచ్చాను. నేను నదిలో అడుగుపెట్టగానే ఒక సర్పం నన్ను గట్టిగా పట్టుకొని ఈ పాతాళానికి తీసుకొని వచ్చింది. ఇచ్చట నేను మిమ్ము చూడగలిగాను" అని పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా చ వచనం చ్యవనస్య దితీశ్వరః ।
ప్రోవాచ ధర్మసంయుక్తం స వాక్యం వాక్యకోవిదః ॥35॥

వాక్యవిశారదుడైన ప్రహ్లాదుడు ఆ మహర్షి పలుకులను విని, అతనితో ధర్మయుక్తంగా ఇలా పలికాడు.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

భగవన్ కాని తీర్థాని పృథివ్యాం కాని చాంబరే ।
రసాతలే చ కాని స్యురేతద్వక్తుం త్వమర్హసి ॥36॥

"ఓ మహానుభావా! భూమండలంలోను, ఆకాశంలోను, పాతాళంలోను ఏ ఏ పవిత్రతీర్థాలున్నాయో దయచేసి తెలియజేయండి" అని ప్రహ్లాదుడు చ్యవనమహర్షిని అడిగాడు.

చ్యవన ఉవాచ – చ్యవనమహర్షి పలికాడు.

పృథివ్యాం నైమిషం తీర్థమంతరిక్షే చ పుష్కరమ్ ।
చక్రతీర్థం మహాబాహో రసాతలతలే విదుః ॥37॥

"ఓ దైత్యేంద్రా! ఈ భూమండలంలో నైమిశారణ్యతీర్థము, అంతరిక్షంలో పుష్కరతీర్థము, పాతాళంలో చక్రతీర్థము ప్రసిద్ధమైనవి."

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రుత్వా తద్భార్గవవచో దైత్యరాజో మహామునే ।
నైమిషం గంతుకామోఽభూద్దానవానిదమబ్రవీత్ ॥38॥

ఓ నారదమునీ! దైత్యరాజైన ప్రహ్లాదుడు చ్యవనమహర్షి పలుకులు విని నైమిశతీర్థానికి వెళ్ళాలనే కుతూహలంతో దానవులకు ఈ విధంగా చెప్పాడు.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

ఉత్తిష్ఠధ్వం గమిష్యామః స్నాతుం తీర్థం హి నైమిషమ్ ।
ద్రక్ష్యామః పుండరీకాక్షం పీతవాససమచ్యుతమ్ ॥39॥

నైమిశతీర్థంలో స్నానమాచరించడానికి మీరందరు బయలుదేరండి. పీతాంబరధారి, అచ్యుతుడునైన పుండరీకాక్షుని దర్శిద్దాము.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యుక్త్వా దానవేంద్రేణ సర్వే తే దైత్యదానవాః ।
చక్రురుద్యోగమతులం నిర్జగ్ముశ్చ రసాతలాత్ ॥40॥

దానవేంద్రుడు ఈ విధంగా పలుకగానే దైత్యదానవులందరు రసాతలం నుండి బయలుదేరారు.

తే సమభ్యేత్య దైతేయా దానవాశ్చ మహాబలాః ।
నైమిశారణ్యమాగమ్య స్నానం చక్రుర్ముదాన్వితాః ॥41॥

దైత్యదానవులందరు మహా సంరంభంతో నైమిశారణ్యం చేరి, సంతోషంతో నైమిశతీర్థస్నానం గావించారు.

తతో దితీశ్వరః శ్రీమాన్మృగయాం స చచార హ ।
చరన్సరస్వతీం పుణ్యాం దదర్శ విమలోదకామ్ ॥42॥

తస్యాదూరే మహాశాఖం సాలవృక్షం శరైశ్చితమ్ ।
దదర్శ బాణానపరాన్ముఖే లగ్నాన్ పరస్పరమ్ ॥43॥

తతస్తానద్భుతాకారాన్బాణాన్నాగోపవీతకాన్ ।
దృష్ట్వాఽతులం తదా చక్రే క్రోధం దైత్యేశ్వరః కిల ॥44॥

స దదర్శ తతోఽదూరాత్కృష్ణాజినధరౌ మునీ ।
సమున్నతజటాభారౌ తపస్యాసక్తమానసౌ ॥45॥

అనంతరం దైత్యరాజు ప్రహ్లాదుడు వేటకై అరణ్యంలో తిరగసాగాడు. ఆ విధంగా తిరుగుతూ విమలోదకము, పవిత్రమునగు సరస్వతీనదిని దర్శించాడు. దానికి సమీపంలోనే బాణాలతో సందులేకుండా వేధింపబడిన గొప్పశాఖలు

గల ఒక మద్దిచెట్టును చూశాడు. ఆ బాణాలు పరస్పరం ఒకదాని ముఖానికి మరొకటి అంటుకొని యున్నాయి. అద్భుతాకారాలతో నాగులచే చుట్టబడిన ఆ బాణాలను చూడగానే ప్రహ్లాదునకు చాలా కోపం కలిగింది. అక్కడకు దగ్గరలోనే అతడు నల్లని లేడిచర్మాలు ధరించి దీర్ఘజటలతోనున్న ఇరువురు తపస్వులను చూశాడు.

తయోశ్చ పార్శ్వయోర్దివ్యే ధనుషీ లక్షణాన్వితే ।
శార్ఙ్గమాజగవం చైవ అక్షయ్యౌ చ మహేషుధీ ॥46॥

తౌ దృష్ట్వాఽమన్యత తదా దాంభికావితి దానవః ।
తతః ప్రోవాచ వచనం తావుభౌ పురుషోత్తమౌ ॥47॥

వారిరువురి పార్శ్వభాగంలో దివ్యలక్షణాన్వితమైన శార్ఙ్గము, అజగవమనే రెండు దివ్యధనుస్సులు, గొప్పవైన అక్షయ తూణీరాలను చూశాడు. ఆ విధంగా కనిపించిన వారిని చూసి ప్రహ్లాదుడు వారిరువురిని దంభులని (దొంగ సన్న్యాసులని) భావించి ఆ పురుషోత్తములతో ఇలా పలికాడు.

కిం భవద్భ్యాం సమారబ్ధం దంభం ధర్మవినాశనమ్ ।
క్వ తపః క్వ జటాభారః క్వచేమౌ ప్రవరాయుధౌ ॥48॥

మీరెవరు? ధర్మవినాశకరమైన ఇట్టి దాంభికకృత్యాలు ఎందులకు చేస్తున్నారు? మీ తపస్సులెక్కడ? జటలు కట్టిన వేషాలెక్కడ? దివ్యాస్త్రశస్త్రాలెక్కడ?

అథోవాచ నరో దైత్యం కా తే చింతా దితీశ్వర ।
సామర్థ్యే సతి యః కుర్యాత్తత్సంపద్యేత తస్య హి ॥49॥

ఆ మాటలకు నరుడిట్లు సమాధానం చెప్పాడు. "ఓ దైత్యేంద్రా! నీకెందులకు చింత? సమర్థుడైనవాడు ఏపని చేసినప్పటికి అదే వానికి శోభను, గౌరవాన్ని కలిగిస్తుంది.

అథోవాచ దితీశస్తౌ కా శక్తిర్యువయోరిహ ।
మయి తిష్ఠతి దైత్యేంద్రే ధర్మసేతుప్రవర్తకే ॥50॥

అంతట ప్రహ్లాదుడు వారితో ఇలా పలికాడు. "ధర్మసేతుస్థాపనకు దైత్యేంద్రుడనైన నేనుండగా మీ శక్తి ఏమి చేయగలుగుతుంది?"

నరస్తం ప్రత్యువాచాథ ఆవాభ్యాం శక్తిరూర్జితా ।
న కశ్చిచ్ఛక్నుయాజ్జేతుం నరనారాయణౌ యుధి ॥51॥

అంతట నరుడు వానికిట్లు జవాబు చెప్పాడు. "ఓ దైత్యేంద్రా! మాకు కావలసినన్ని శక్తి సామర్థ్యాలున్నాయి. నరనారాయణులమైన మమ్ము యుద్ధంలో జయింపగలిగినవారెవ్వరు లేరు".

దైత్యేశ్వరస్తతః క్రుద్ధః ప్రతిజ్ఞామారురోహ చ ।
యథా కథంచిజ్జేష్యామి నరనారాయణౌ రణే ॥52॥

ఇత్యేవముక్త్వా వచనం మహాత్మా దితీశ్వరః స్థాప్య బలం వనాంతే ।
వితత్య చాపం గుణమావికృష్య తలధ్వనిం ఘోరతరం చకార ॥53॥

ఆ మాటలకు దైత్యేంద్రుడు క్రుద్ధుడై "ఎట్లైనను సరియే నరనారాయణులను సంగ్రామంలో జయించి తీరుతానని ప్రతిజ్ఞ చేశాడు. దితీశ్వరుడిట్లు పలికి తన సేనలను అరణ్యపు హద్దులయందు నిలిపి, తానొక్కడే వెళ్ళి, వారిని యుద్ధానికి రమ్మని భయంకరమైన ధనుష్టంకారము చేశాడు.

తతో నరస్త్వాజగవం హి చాపమానమ్య బాణాన్సుబహూన్సితాగ్రాన్ ।
ముమోచ తానప్రతిమైః పృషత్కై శ్చిచ్ఛేద దైత్యస్తపనీయపుంఖైః ॥54॥

ఆ కఠోరశబ్దాన్ని విని, నరుడు తన అజగవచాపాన్ని ఎక్కుపెట్టి, అప్రతిమానమైన, వాడియైన బాణాలను పెక్కింటిని శత్రువుపై విడిచాడు. దైత్యేశ్వరుడు వానినన్నింటిని బంగరురెక్కలు గల బాణాలతో ఖండించివేశాడు.

ఛిన్నాన్ సమీక్ష్యాథ నరః పృషత్కాన్ దైత్యేశ్వరేణాప్రతిమేన సంఖ్యే ।
క్రుద్ధః సమానమ్య మహాధనుస్తతో ముమోచ చాన్యాన్ వివిధాన్ పృషత్కాన్ ॥55॥

అప్రతిమానమైన తన బాణాలను దైత్యేంద్రుడు అసంఖ్యాకమైన బాణాలతో ఖండించడం చూసి నరుడు కృద్ధుడై తన మహాధనువునెక్కుపెట్టి వివిధ రకాలైన బాణాలు గుప్పించసాగాడు.

ఏకం నరో ద్వౌ దితిజేశ్వరశ్చ త్రీన్ ధర్మసూనుశ్చతురో దితీశః ।
నరస్తు బాణాన్ ప్రముమోచ పంచ షడ్ దైత్యనాథో నిశితాన్ పృషత్కాన్ ॥56॥

నరుడు ప్రయోగించిన ఒక్కొక్కబాణానికి దితిజేశ్వరుడు రెండేసి బాణాలతో బదులిచ్చాడు. నరుడు మూడు బాణాలు వేయగా దైత్యుడు నాలుగు వేశాడు. నరుడు తీవ్రశరాలను ఐదింటిని వేయగా దైత్యనాథుడు వాడియైన ఆరుబాణాలతో బదులిచ్చాడు.

సప్తర్షిముఖ్యో ద్వ్యచతుశ్చ దైత్యో నరస్తు షట్త్రీణి చ దైత్యముఖ్యే ।
షట్ త్రీణి చైకం చ దితీశ్వరేణ ముక్తాని బాణాని నరాయ విప్ర ॥57॥

ఏకం చ షట్ పంచ నరేణ ముక్తాస్త్వష్టౌ శరాః సప్త చ దానవేన ।
షట్ సప్తచాష్టౌ నవషణ్నరేణ ద్విసప్తతిం దైత్యపతిః ససర్జ ॥58॥

ఋషీశ్వరుడు ఏడుబాణాలు వేయగా రాక్షసుడు ఎనిమిదిబాణాలను ప్రయోగించాడు. నరుని తొమ్మిది బాణాలకు దైత్యుడు పదిబాణాలతో సమాధానమిచ్చాడు. నరుడు పన్రెండుబాణాలు వేయగా దైత్యుడు పదిహేను ప్రయోగించాడు. అనంతరం నరుని ముప్పదియారు శరాలను దైత్యుడు డెబ్బదిరెండు శరాలతో వమ్ముచేశాడు.

శతం నరస్త్రీణి శతాని దైత్యః షడ్ ధర్మపుత్రో దశ దైత్యరాజః ।
తతోఽప్యసంఖ్యేయతరాన్హి బాణాన్ ముమోచతుస్తౌ సుభృశం హి కోపాత్ ॥59॥

నరుడు నూరుబాణాలు ప్రయోగించగా దైత్యవల్లభుడు మూడువందలబాణాలను ప్రయోగించాడు. అంతట ధర్మపుత్రుడు ఆరువందలబాణాలు వేయగా రాక్షసాధిపతి వేయిబాణాలు గుప్పించాడు. అనంతరం క్రోధోన్మత్తులై వారిరువురు పరస్పరం అసంఖ్యాకంగా బాణవర్షం కురిపించారు.

తతో నరో బాణగణైరసంఖ్యైరవాస్తరద్భూమిమథో దిశః ఖమ్ ।
స చాపి దైత్యప్రవరః పృషత్కైశ్చిచ్ఛేద వేగాత్తపనీయపుంఖైః ॥60॥

అంతట నరుడు తన శరపరంపరలతో భూమ్యాకాశాలను, దశదిశలను ముంచెత్తగా నిమేషకాలంలోనే దైత్యప్రవరుడు స్వర్ణపక్షాలతో ప్రకాశించే బాణాలతో వానినన్నిటిని ముక్కలు గావించాడు.

తతః పతత్రిభిర్వీరౌ సుభృశం నరదానవౌ ।
తదా వరాస్త్రైర్యుద్ధ్యేతాం ఘోరరూపైః పరస్పరమ్ ॥61॥

ఈ విధంగా నరదానవులు ఇరువురు మహాసాహసంతో పరస్పరం రకరకాలైన శస్త్రాస్త్రాలతో ఘోరమైన యుద్ధం గావించారు.

తతస్తు దైత్యేన వరాస్త్రపాణినా చాపే నియుక్తం తు పితామహాస్త్రమ్ ।
మహేశ్వరాస్త్రం పురుషోత్తమేన సమం సమాహత్య నిపేతతుస్తౌ ॥62॥

అంతట దైత్యరాజు మహాక్రోధంతో బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అంతట పురుషోత్తముడైన నరుడు పాశుపతాస్త్రాన్ని ప్రయోగించాడు. అమోఘమైన ఆ రెండు అస్త్రాలు సమానంగా పరస్పరం దహించుకొని క్రిందపడ్డాయి.

బ్రహ్మాస్త్రే తు ప్రశమితే ప్రహ్లాదః క్రోధమూర్ఛితః ।
గదాం ప్రగృహ్య తరసా ప్రచస్కంద రథోత్తమాత్ ॥63॥

తన బ్రహ్మాస్త్రం విఫలం కావడంతో, కోపంతో మండిపడిన ప్రహ్లాదుడు భయంకరమైన గదను చేబూని రథంనుండి క్రిందకు దూకాడు.

గదాపాణిం సమాయాంతం దైత్యం నారాయణస్తదా ।
దృష్ట్వాథ పృష్ఠతశ్చక్రే నరం యోద్ధుమనాః స్వయమ్ ॥64॥

గదాపాణియై నరునిపై బడనున్న దైత్యుని చూసి నారాయణుడు తాను యుద్ధం చేయదలచి నరుని వెనుకకు నెట్టివేశాడు.

తతో దితీశః సగదః సమాద్రవత్ సశార్ఙ్గపాణిం తపసాం నిధానమ్ ।
ఖ్యాతం పురాణర్షిముదారవిక్రమం నారాయణం నారద లోకపాలమ్ ॥65॥

నారదా! ఆ రాక్షసపతి గదాదండంతో పరమతపోధనుడు, శార్ఙ్గపాణి, ఉదారవిక్రముడు లోకపాలకుడు పురాణమహర్షియునైన నారాయణుని వెంబడించాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే ప్రహ్లాదయుద్ధం నామ సప్తమోఽధ్యాయః ॥7॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి ప్రహ్లాదునియుద్ధమనే ఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టమోఽధ్యాయః - ఎనిమిదవ అధ్యాయం
ప్రహ్లాద వరప్రదానమ్ - ప్రహ్లాద వరప్రదానం

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

శార్ఙ్గపాణినమాయాంతం దృష్ట్వాగ్రే దానవేశ్వరః ।
పరిభ్రామ్య గదాం వేగాన్మూర్ధ్ని సాధ్యమతాడయత్ ॥1॥

తాడితస్యాథ గదయా ధర్మపుత్రస్య నారద ।
నేత్రాభ్యామపతద్వారి వహ్నివర్షనిభం భువి ॥2॥

శార్ఙ్గధనువును ధరించి, తనవైపు వస్తున్న నారాయణుని చూసి దానవేశ్వరుడు తన గదను గిరగిర త్రిప్పి, ఆ సాధ్యుని నెత్తిపై బలముగా మోదాడు. ఓ నారదా! అట్లు గదచే కొట్టబడిన ధర్మపుత్రుని నేత్రాలనుండి అగ్నివర్షం వలె జలధారలు భూమిపై పడ్డాయి.

మూర్ధ్ని నారాయణస్యాపి సా గదా దానవార్పితా ।
జగామ శతధా బ్రహ్మన్ శైలశృఙ్గే యథాఽశనిః ॥3॥

తతో నివృత్య దైత్యేంద్రః సమాస్థాయ రథం ద్రుతమ్ ।
ఆదాయ కార్ముకం వీరస్తూణాద్బాణం సమాదదే ॥4॥

ఆనమ్య చాపం వేగేన గార్ధపత్రాన్ శిలీముఖాన్ ।
ముమోచ సాధ్యాయ తదా క్రోధాంధకారితాననః ॥5॥

తానాపతత ఏవాశు బాణాంశ్చంద్రార్ధసన్నిభాన్ ।
చిచ్ఛేద బాణైరపరైర్నిర్బిభేద చ దానవమ్ ॥6॥

నారాయణుని నెత్తిమీద పడిన ఆ గదాదండం కొండశిఖరం మీద పడిన పిడుగు వలె నూరు ప్రక్కలుగా పగిలిపోయింది. అంతట వెనుదిరిగి ఆ దానవవీరుడు త్వరగా ఆ రథంపైఎక్కి, ధనుస్సును చేతగొని, అమ్ములపొది నుండి బాణాన్ని తీశాడు. క్రోధంతో నల్లబడిన ముఖం గల దానవేశ్వరుడు గృధ్రపత్రాలతో అలంకరింపబడిన బాణాలను వింట సంధించి, సాధ్యునిపై గుప్పించాడు. ఈ విధంగా తనపైకి వస్తున్న అర్ధచంద్రబాణాలను తన శరపరంపరతో మార్గమధ్యలోనే ఖండించి, నారాయణుడు ఆ దానవుని నిశితమగు బాణాలతో గాయపరిచాడు.

తతో నారాయణం దైత్యో దైత్యం నారాయణః శరైః ।
ఆవిధ్యేతాం తదాఽన్యోఽన్యం మర్మభిద్భిరజిహ్మగైః ॥7॥

తతోఽంబరే సంనిపాతో దేవానామభవన్మునే ।
దిదృక్షూణాం తదా యుద్ధం లఘుచిత్రం చ సుష్ఠు చ ॥8॥

తతః సురాణాం దుందుభ్యః ఖేఽవాద్యన్త మహాస్వనాః ।
పుష్పవర్షమనౌపమ్యం ముముచుః సాధ్యదైత్యయోః ॥9॥

అంతట నారాయణుడు దైత్యుని, దైత్యుడు నారాయణుని తీవ్రమైన బాణాలతో భేదించుకున్నారు. సాధ్య, దైత్యుల భీకరసంగ్రామాన్ని తిలకించాలనే కుతూహలం గల దేవతాసమూహం ఆకాశంలోనికి చేరింది. దేవతలు గగనతలం నుండి దుందుభులు పెద్దగా మ్రోగిస్తూ, ఆ వీరులిరువురిపై సాటిలేని పుష్పవర్షాన్ని కురిపించారు.

తతః పశ్యత్సు దైత్యేషు గగనస్థేషు తావుభౌ ।
అయుధ్యేతాం మహేష్వాసౌ ప్రేక్షక ప్రీతివర్ధనమ్ ॥10॥

బబంధతు స్తదాఽఽకాశం తావుభౌ శరవృష్టిభిః ।
దిశశ్చ విదిశశ్చైవ ఛాదయేతాం శరోత్కరైః ॥11॥

ఆ విధంగా ఆకాశంనుండి తిలకిస్తున్న దేవతలకు ప్రీతివర్ధకంగా ఆ వీరులిరువురు అద్భుతసంగ్రామం చేశారు. వారి బాణాసనాలనుండి వెలువడిన అసంఖ్యాకమైన బాణాలతో భూమ్యాకాశాలు, దిక్కులు, మూలలు కూడా కప్పబడ్డాయి.

తతో నారాయణశ్చాపం సమాకృష్య మహామునే ।
బిభేద మార్గణైస్తీక్ష్ణైః ప్రహ్లాదం సర్వమర్మసు ॥12॥

ఓ నారదమహర్షీ! అంతట నారాయణుడు తన ధనుస్సును బాగుగా వంచి, అతితీవ్రమైన బాణాలతో ప్రహ్లాదుని మర్మస్థానాలను కొట్టాడు.

తదా దైత్యేశ్వరః క్రుద్ధశ్చాపమానమ్య వేగవాన్ ।
బిభేద హృదయే బాహ్వోర్వదనే చ నరోత్తమమ్ ॥13॥

అంతట ప్రహ్లాదుడు ప్రచండమైన కోపంతో వేగంగా నారాయణుని వక్షఃస్థలం, బాహువులు, ముఖాన్ని బాణాలతో బాధించాడు.

తతోఽన్యతో దైత్యపతేః కార్ముకం ముష్టిబంధనాత్ ।
చిచ్ఛేదైకేన బాణేన చంద్రార్ధాకారవర్చసా ॥14॥

అపాస్యత ధనుశ్ఛిన్నం చాపమాదాయ చాపరమ్ ।
అధిజ్యం లాఘవాత్కృత్వా వవర్ష నిశితాఞ్ఛరాన్ ॥15॥

తానప్యస్య శరాన్సాధ్యశ్ఛిత్వా బాణైరవారయత్ ।
కార్ముకం చ క్షురప్రేణ చిచ్ఛేద పురుషోత్తమః ॥16॥

అంతట నారాయణుడు ఒక అర్ధచంద్రాకారబాణంతో దైత్యేశ్వరుని చేతిలోని వింటిని ఖండించాడు. అంతట దైత్యుడు వేరొక ధనుస్సును గైకొని తేలికగా నారాయణునిపై వాడియైన శరవర్షాన్ని కురిపించాడు. నారాయణుడు ఆ బాణపరంపరను కూడా ఛేదించి బాణాలను నివారించాడు. అంతేగాక పురుషోత్తముడు దైత్యేశ్వరుని ధనుస్సును కూడా ఛేదించాడు.

ఛిన్నం ఛిన్నం ధనుర్దైత్యస్త్వన్యదన్యత్సమాదదే ।
సమాదత్తం తదా సాధ్యో మునే చిచ్ఛేద లాఘవాత్ ॥17॥

ఈ విధంగా ధనువు ఛిన్నంకాగా దైత్యుడు మరల వేరొక ధనుస్సును చేబట్టాడు. ఆ విధంగా దైత్యుడు చేబట్టిన ధనువులనన్నింటిని సాధ్యుడు తేలికగా ఛేదించాడు.

సంఛిన్నేష్వథ చాపేషు జగ్రాహ దితిజేశ్వరః ।
పరిఘం దారుణం దీర్ఘం సర్వలోహమయం దృఢమ్ ॥18॥

పరిగృహ్యాథ పరిఘం భ్రామయామాస దానవః ।
భ్రామ్యమాణం స చిచ్ఛేద నారాచేన మహామునిః ॥19॥

ఛిన్నే తు పరిఘే శ్రీమాన్ ప్రహ్లాదో దానవేశ్వరః ।
ముద్గరం భ్రామ్య వేగేన ప్రచిక్షేప నరోత్తమే ॥20॥

ఈ విధంగా చాపాలన్నీ ఛిన్నం కాగా దనుజేశ్వరుడు దీర్ఘమైనదియు, సర్వలోహమయమైనదియు, దృఢమైనదియు, దారుణమైనదియునగు పరిఘను గ్రహించాడు. ఆ విధంగా దానవుడు పరిఘను గ్రహించి త్రిప్పుతుండగా సాధ్యుడు ఆ పరిఘను కూడా తన బాణంతో ఛేదించాడు. ఇట్లు పరిఘ కూడా ఛేదింపబడగా దానవేశ్వరుడైన ప్రహ్లాదుడు ముద్గరాన్ని స్వీకరించి, వేగంగా త్రిప్పి, నారాయణునిపై ప్రయోగించాడు.

తమాపతన్తం బలవాన్మార్గణైర్దశభిర్మునే ।
చిచ్ఛేద దశధా సాధ్యః స ఛిన్నో న్యపతద్భువి ॥21॥

ఓ నారదమునీ! ఆ విధంగా తనపై పడబోవు బలవంతమైన ముద్గరాన్ని పదిబాణాలతో ముక్కలు ముక్కలుచేయగా అవన్నీ నేలమీద పడ్డాయి.

ముద్గరే వితథే జాతే ప్రాసమావిధ్య వేగవాన్ ।
ప్రచిక్షేప నరాగ్ర్యాయ తం చ చిచ్ఛేద ధర్మజః ॥22॥

ముద్గరం వ్యర్థం కాగా దైత్యుడు ప్రాసాన్ని వేగంగా ప్రయోగించగా దానిని కూడా ధర్మపుత్రుడు ఖండించాడు.

ప్రాసే ఛిన్నే తతో దైత్యః శక్తిమాదాయ చిక్షిపే ।
తాం చ చిచ్ఛేద బలవాన్ క్షురప్రేణ మహాతపాః ॥23॥

ప్రాసం కూడా ఛిన్నం కాగా దైత్యుడు వెంటనే "శక్తి"ని గ్రహించి నారాయణునిపై ప్రయోగించగా మహాతపస్వియైన అతడు దానిని కూడా ఖండించాడు.

ఛిన్నేషు తేషు శస్త్రేషు దానవోఽన్యన్మహద్ధనుః ।
సమాదాయ తతో బాణైరవతస్తార నారద ॥24॥

ఓ నారదా! ఈ విధంగా దానవుని శస్త్రాలన్నియు ఖండింపబడగా వేరొక ధనుస్సును స్వీకరించి, అన్ని వైపులా బాణాలను కురిపించాడు.

తతో నారాయణో దేవో దైత్యనాథం జగద్గురుః ।
నారాచేనాజఘానాథ హృదయేऽసురతాపనః ॥25॥

అంతట జగద్గురువగు నారాయణుడు ఒక బాణంతో దైత్యుని వక్షఃస్థలాన్ని ఛేదించాడు.

స భిన్నహృదయో బ్రహ్మన్ దేవేనాద్భుతకర్మణా ।
నిపపాత రథోపస్థే తమపోవాహ సారథిః ॥26॥

ఓ నారదా! అద్భుతకర్ముడైన ఆ దేవునిచే వక్షం విదీర్ణం కాగా దైత్యుడు రథంపై ఒరిగిపోయాడు. వెంటనే సారథి అతనిని అచ్చటినుండి దూరంగా తీసుకొనిపోయాడు.

స సంజ్ఞాం త్వచిరేణైవ ప్రతిలభ్య దితీశ్వరః ।
సుదృఢం చాపమాదాయ భూయో యోద్ధుముపాగతః ॥27॥

అచిరకాలంలోనే దితీశ్వరుడు మూర్ఛనుండి తేరుకొని సుదృఢమైన చాపాన్ని గ్రహించి మరల యుద్ధానికి సిద్ధమయ్యాడు.

తమాగతం సం నిరీక్ష్య ప్రత్యువాచ నరాగ్రజః ।
గచ్ఛ దైత్యేంద్ర యోత్స్యామః ప్రాతస్త్వాహ్నికమాచర ॥28॥

అట్లు యుద్ధానికి సంసిద్ధుడైన దైత్యునితో నరాగ్రజుడు ఇలా పలికాడు. "దైత్యేంద్రా! రేపు ప్రాతఃకాలంలో మరలా మనం యుద్ధం చేద్దాము. ఇప్పుడు వెళ్ళు నిత్యాహ్నికాలు నెరవేర్చుకో!"

ఏవముక్తో దితీశస్తు సాధ్యేనాద్భుతకర్మణా ।
జగామ నైమిషారణ్యం క్రియాం చక్రే తదాऽऽహ్నికీమ్ ॥29॥

అద్భుతకర్ముడైన సాధ్యుడిట్లు పలుకగా దితీశుడు కూడా నైమిశారణ్యానికి వెళ్ళి నిత్యాహ్నికకర్మలు నెరవేర్చుకున్నాడు.

ఏవం యుధ్యతి దేవే చ ప్రహ్లాదోऽప్యసురో మునే ।
రాత్రౌ చింతయతే యుద్ధే కథం జేష్యామి దాంభికమ్ ॥30॥

ఓ నారదమునీ! నారాయణుడు గావించు యుద్ధాన్ని చూసి ప్రహ్లాదుడు ఆ రాత్రి "ఈ కపటమునిని జయించుట ఎట్లు?" అని చింతింపసాగాడు.

ఏవం నారాయణేనాసౌ సహాయుధ్యత నారద ।
దివ్యం వర్షసహస్రంతు దైత్యో దేవం న చాజయత్ ॥31॥

ఓ నారదా! ఈ విధంగా వారిరువురు వేయి దివ్యసంవత్సరాలు పోరాడారు. అయినప్పటికి దైత్యరాజు ఆ తపస్విని జయింపలేకపోయాడు.

తతో వర్షసహస్రాంతే హ్యజితే పురుషోత్తమే ।
పీతవాససమభ్యేత్య దానవో వాక్యమబ్రవీత్ ॥32॥

కిమర్థం దేవదేవేశ సాధ్యం నారాయణం హరిమ్ ।
విజేతుం నాఽద్య శక్నోమి ఏతన్మే కారణం వద ॥33॥

వేయిదివ్యసంవత్సరాలు గడచినప్పటికి పురుషోత్తముడు జయింపబడకపోవుటచే దానవుడు పీతాంబర ధారియైన విష్ణువును సమీపించి ఇలా పలికాడు. "ఓ దేవదేవేశా! ఇంతకాలం ఈ నారాయణునితో యుద్ధం చేసినను ఇతనిని జయింపలేకపోవడానికి కారణమేమి" అని అడిగాడు.

పీతవాసా ఉవాచ – విష్ణువు పలికాడు.

దుర్జయోఽసౌ మహాబాహుస్త్వయా ప్రహ్లాద ధర్మజః ।
సాధ్యో విప్రవరో ధీమాన్మృధే దేవాసురైరపి ॥34॥

ఓ ప్రహ్లాదా! మహాబాహువగు ఈ ధర్మపుత్రుని నీవు జయింపజాలవు. ధీమంతుడైన ఈ సాధ్యవిప్రోత్తముని దేవతలు, రాక్షసులు కూడా జయించలేరు.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

యద్యసౌ దుర్జయో దేవ మయా సాధ్యో రణాజిరే ।
తత్కథం యత్ప్రతిజ్ఞాతం తదసత్యం భవిష్యతి ॥35॥

హీనప్రతిజ్ఞో దేవేశ కథం జీవేత మాదృశః ।
తస్మాత్తవాగ్రతో విష్ణో కరిష్యే కాయశోషణమ్ ॥36॥

ఓ ప్రభో! అతడజేయుడైనచో నేను చేసిన ప్రతిజ్ఞ ఎట్లు నెరవేరును? అది అసత్యమౌను గదా!. ఓ దేవేశా! హీనప్రతిజ్ఞుడైన నావంటివాడు ఎట్లు జీవింపగలడు? కాబట్టి ఓ విష్ణూ! నేను నీ ఎదుటనే నా యీ శరీరాన్ని శోషణం కావించుకుంటాను.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్త్వా వచనం దేవాగ్రే దానవేశ్వరః ।
శిరః స్నాతస్తదా తస్థౌ గృణన్బ్రహ్మ సనాతనమ్ ॥37॥

తతో దైత్యపతిం విష్ణుః పీతవాసాబ్రవీద్వచః ।
గచ్ఛ జేష్యసి భక్త్యా తం న యుద్ధేన కదాచన ॥38॥

విష్ణువుతో ప్రహ్లాదుడు ఇట్లు పలికి, శిరఃస్నానం గావించి, ఆసీనుడై పరబ్రహ్మానుసంధానానికి ఉపక్రమించాడు. అంతట విష్ణువు అతనితో ఇలా పలికాడు. "నీవు ఆయనను భక్తిప్రపత్తులతో మాత్రమే జయించగలవు. యుద్ధంలో ఎన్నటికి జయింపజాలవు. కావున నీవు జయింపగలవు? పొమ్ము".

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

అసౌ యద్యజయో దేవ త్రైలోక్యేష్వపి సువ్రత ।
న స్థాతుం త్వత్ప్రసాదేన శక్యం కిము కరోమ్యజ ॥39॥

మయా జితం దేవదేవ త్రైలోక్యమపి సువ్రత ।
జితోఽయం త్వత్ప్రసాదేన శక్రః కిముత ధర్మజః ॥40॥

ఓ దేవదేవా! వీరిరువురు ముల్లోకాలకు అజేయులైనచో ఓ అభవా! నేనెట్లు జీవింతును? నాకు దారియేది?. నీ దయవల్ల నేను ముల్లోకాలను జయించాను. నీ దయవల్ల ఇంద్రుని కూడా జయించాను. ఈ ధర్మజుని జయించుటెట్లు?

పీతవాసా ఉవాచ – పీతవాసుడు పలికాడు.

సోఽహం దానవశార్దూల లోకానామనుకంపయా ।
ధర్మప్రవర్తనార్థాయ తపశ్చర్యాం సమాస్థితః ॥41॥

ఓ దానవశార్దూలా! లోకకల్యాణకాంక్షతో ధర్మప్రవర్తనార్థమై నేనే కఠోర తపశ్చర్యకు పూనుకున్నాను.

తస్మాద్యదీచ్ఛసి జయం తమారాధయ దానవ ।
తం పరాజేష్యసే భక్త్యా తస్మాచ్ఛుశ్రూష ధర్మజమ్ ॥42॥

కాబట్టి నీవు జయింపగోరినచో వానినారాధింపుము. వానిని భక్తితో మాత్రమే జయింపగలవు. కావున ధర్మజునకు శుశ్రూష గావింపుము.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యుక్తః పీతవస్త్రేణ దానవేంద్రో మహాత్మనా ।
అబ్రవీద్వచనం హృష్టః సమాహూయాఽన్ధకం మునే ॥43॥

ఓ నారదమునీ! శ్రీవిష్ణువు ఇట్లు చెప్పగా దానవేంద్రుడు సంతోషించినవాడై అంధకుని పిలిచి అతనితో ఇలా అన్నాడు.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

దైత్యాశ్చ దానవాశ్చైవ పరిపాల్యాస్త్వయాన్ధక ।
మయోత్సృష్టమిదం రాజ్యం ప్రతీచ్ఛస్వ మహాభుజ ॥44॥

ఇత్యేవముక్తో జగ్రాహ రాజ్యం హైరణ్యలోచనిః ।
ప్రహ్లాదోఽపి తదాఽగచ్ఛత్పుణ్యం బదరికాశ్రమమ్ ॥45॥

దృష్ట్వా నారాయణం దేవం నరం చ దితిజేశ్వరః ।
కృతాంజలిపుటో భూత్వా వవందే చరణౌ తయోః ॥46॥

తమువాచ మహాతేజా వాక్యం నారాయణోఽవ్యయః ।
కిమర్థం ప్రణతోఽసీహ మామజిత్వా మహాసుర ॥47॥

ఓ అంధకా! ఈ దైత్యులను, దానవులను నీవు పాలింపుము. నేనీ రాజ్యాన్ని పరిత్యజిస్తున్నాను. ఓ మహాభుజా! నీవు దీనిని గైకొనుము. హిరణ్యాక్షపుత్రుడైన అంధకుడు ప్రహ్లాదుని కోరిక ప్రకారం రాజ్యాన్ని తీసుకొనగా ప్రహ్లాదుడు అచ్చటినుండి పవిత్రమైన బదరికా వనానికి వెళ్ళాడు. అచ్చట నరనారాయణులను చూసి, చేతులు జోడించి, వారికి పాదాభివందనం చేశాడు. ప్రహ్లాదుని చూసి మహాతేజస్వియైన నారాయణుడు ఇలా పలికాడు. "అసురోత్తమా! ఇదేమి? మమ్ము జయింపకనే మాకు నమస్కరించుటేల?".

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

కస్త్వాం జేతుం ప్రభో శక్తః కస్త్వత్తః పురుషోఽధికః ।
త్వం హి నారాయణోఽనన్తః పీతవాసా జనార్దనః ॥48॥

త్వం దేవః పుండరీకాక్షస్త్వం విష్ణుః శార్ఙ్గచాపధృక్ ।
త్వమవ్యయో మహేశాన శాశ్వతః పురుషోత్తమః ॥49॥

త్వాం యోగినశ్చిన్తయన్తి చార్చయన్తి మనీషిణః ।
జపంతి స్నాతకాస్త్వాం చ యజంతి త్వాం చ యాజ్ఞికాః ॥50॥

త్వమచ్యుతో హృషీకేశశ్చక్రపాణిర్ధరాధరః ।
మహామీనో హయశిరాస్త్వమేవ వరకచ్ఛపః ॥51॥

హిరణ్యాక్షరిపుః శ్రీమాన్భగవాన్కార్యసూకరః ।
మత్పితుర్నాశనకరో భవానపి నృకేసరీ ॥52॥

బ్రహ్మా త్రినేత్రోఽమరరాడ్ఢుతాశః ప్రేతాధిపో నీరపతిః సమీరః ।
సూర్యో మృగాఙ్కోఽచల జఙ్గమాద్యో భవాన్విభో నాథ ఖగేంద్రకేతో ॥53॥

త్వం పృథ్వీ జ్యోతిరాకాశం జలం భూత్వా సహస్రశః ।
త్వయా వ్యాప్తం జగత్సర్వం కస్త్వాం జేష్యతి మాధవ ॥54॥

భక్త్యా యది హృషీకేశ తోషమేషి జగద్గురో ।
నాన్యథా త్వం ప్రశక్తోఽసి జేతుం సర్వగతోఽవ్యయః ॥55॥

"ప్రభో! మిమ్ము జయింపగలవారెవ్వరు? మీకంటే అధికుడైనవాడెవ్వడు?. నీవు సాక్షాత్తు నారాయణుడవు, అనంతుడవు, పీతాంబరుడగు జనార్దనుడవు. ఓ దేవా! నీవే పుండరీకాక్షుడవు. నీవే శార్ఙ్గపాణివగు విష్ణుడవు

నీవే. నీవు అవ్యయుడవు, మహేశానుడవు, శాశ్వతుడవు. పురుషోత్తముడవు నీవే. యోగులు నిన్నే ధ్యానిస్తారు. పండితులు నిన్నే అర్చిస్తారు. స్నాతకులు నీ నామాన్నే జపిస్తారు. యాజ్ఞికులు యజ్ఞేశ్వరునిగా నీ గురించి యాగములు చేస్తారు. నీవు అచ్యుతుడవు, హృషీకేశుడవు, చక్రపాణివి, ధరాధరుడవు, మహామత్స్యం నీవే, హయగ్రీవుడవు, కూర్మమూర్తివి నీవే. హిరణ్యాక్షుని సంహరించిన భగవంతుడవగు వరాహమూర్తివి నీవే. నా తండ్రిని సంహరించిన నరసింహస్వామివి కూడా నీవే. హే గరుడధ్వజా! విభో! బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు, అగ్ని, యముడు, వరుణుడు, వాయువు, సూర్యచంద్రులు, జంగమస్థావరాత్మకమైన ఈ సర్వము నీవే. ఓ మాధవా! భూమి, జ్యోతిరాకాశ జలరూపాన వేవేల మూర్తులతో జగత్తునంతటా వ్యాపించియున్న నిన్ను ఎవ్వరు జయింపగలరు?. జగద్గురూ! సర్వగతుడవు, అవ్యయుడవునగు నిన్ను భక్తిచేత మాత్రమే జయింపనగును. మరే విధంగానైనను నిన్ను జయింపలేరు.

భగవానువాచ – భగవానుడు పలికాడు.

> **పరితుష్టోఽస్మి తే దైత్య స్తవేనానేన సువ్రత ।**
> **భక్త్యా త్వనన్యయా చాహం త్వయా దైత్య పరాజితః ॥56॥**
>
> **పరాజితశ్చ పురుషో దైత్య దండం ప్రయచ్ఛతి ।**
> **దండార్థం తే ప్రదాస్యామి వరం వృణు యమిచ్ఛసి ॥57॥**

సువ్రతుడవైన దైత్యపతీ! నీ స్తోత్రానికి సంతోషించాను. అనన్యమైన నీ భక్తిచేత నేను ఓడింపబడ్డాను. ఓడిపోయినవారు పరిహారం చెల్లించుకోవాలి. పరిహారరూపంగా నీకొక వరాన్ని ప్రసాదిస్తున్నాను. నీకు ఇష్టమైనది కోరుకొనుము.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

> **నారాయణ వరం యాచే యం త్వం మే దాతుమర్హసి ।**
> **తన్మే పాపం లయం యాతు శారీరం మానసం తథా ॥58॥**
>
> **వాచికం చ జగన్నాథ యత్త్వయా సహ యుధ్యతః ।**
> **నరేణ యద్యప్యభవద్వరమేనం ప్రయచ్ఛ మే ॥59॥**

ఓ నారాయణా! నీవు నాకు వరాన్ని ప్రసాదింపదలచినచో నేనొక వరాన్ని కోరుకుంటున్నాను. నాయొక్క శారీరిక, మానసిక, వాచిక పాపములన్నియు లయం చేయవలసినదిగా కోరుకుంటున్నాను. ఓ జగన్నాథా! నిన్ను శత్రువుగానెంచి నీతో యుద్ధం చేసిన అపరాధాన్ని క్షమించి, ఈ వరమును అనుగ్రహింపుము.

నారాయణ ఉవాచ – నారాయణుడు పలికాడు.

> **ఏవం భవతు దైత్యేంద్ర పాపం తే యాతు సంక్షయమ్ ।**
> **ద్వితీయం ప్రార్థయ వరం తం దదామి తవాసుర ॥60॥**

ఓ దైత్యేంద్రా! అట్లే అగుగాక! నీ పాపమంతయు క్షయమగుగాక! నీకు రెండవ వరాన్ని కూడా ప్రసాదిస్తున్నాను. కోరుకొనుము.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

యా యా జాయేత మే బుద్ధిః సా సా విష్ణో త్వదాశ్రితా ।
దేవార్చనే చ నిరతా త్వచ్చిత్తా త్వత్పరాయణా ॥61॥

విష్ణూ! నా బుద్ధి ఎల్లవేళలయందు నిన్నాశ్రయించుకొనియుండు గాక! నీ పూజ, అర్చన, ఉపాసనలందే నా చిత్తము లగ్నమై యుండు గాక!

నారాయణ ఉవాచ – నారాయణుడు పలికాడు.

ఏవం భవిష్యత్యసురవరమన్యం యమిచ్ఛసి ।
తం వృణీష్వ మహాబాహో ప్రదాస్యామ్యవిచారయన్ ॥62॥

ఓ దానవా! అట్లేయగు గాక! నీకిష్టమైన మరొక వరం కోరుకొనుము. కాదనకుండా ప్రసాదిస్తాను.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

సర్వమేవ మయా లబ్ధం త్వత్ప్రసాదాదధోక్షజ ।
త్వత్పాదపంకజాభ్యాం హి రతిరస్తు సదా మమ ॥63॥

అధోక్షజా! నీ దయతో నాకన్నియు లభించాయి. ఎల్లప్పుడు నీ పాదాబ్జములందు అనురక్తిని, భక్తిని, నాకనుగ్రహింపుము.

నారాయణ ఉవాచ – నారాయణుడు పలికాడు.

ఏవమస్త్వపరం చాస్తు నిత్యమేవాక్షయోఽవ్యయః ।
అజరశ్చామరశ్చాపి మత్ప్రసాదాద్భవిష్యసి ॥64॥

గచ్ఛ త్వం దైత్యశార్దూల స్వమావాసం క్రియారతః ।
న కర్మబంధో భవతో మచ్చిత్తస్య భవిష్యతి ॥65॥

ప్రశాసయన్నమూన్ దైత్యాన్ రాజ్యం పాలయ శాశ్వతమ్ ।
స్వజాతిసదృశం దైత్య కురు ధర్మమనుత్తమమ్ ॥66॥

అట్లేయగు గాక! అంతే కాదు నా ప్రసాదం వల్ల నీవు అజరామరుడవై, అక్షయుడవై చిరకాలం వర్ధిల్లగలవు. ఓ దైత్యశార్దూలా! వెంటనే నిజావాసానికి వెళ్ళుము. కర్మరతుడవు కమ్ము. మత్పరాయణుడవైన నిన్ను కర్మబంధము అంటదు. శాశ్వతంగా దైత్యరాజ్యాధిపతివై స్వకులోచితమైనట్టియు, ఉత్తమమైనట్టియు, ధర్మాచరణము గావింపుము.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యుక్తో లోకనాథేన ప్రహ్లాదో దేవమబ్రవీత్ ।
కథం రాజ్యం సమాదాస్యే పరిత్యక్తం జగద్గురో ॥67॥

తమువాచ జగత్ స్వామీ గచ్ఛ త్వం నిజమాశ్రమమ్ ।
హితోపదేష్టా దైత్యానాం దానవానాం తథా భవ ॥68॥

జగన్నాథుని మాటలు విని ప్రహ్లాదుడిలా పలికాడు. "ప్రభో! జగద్గురూ! ఒక పర్యాయం వదిలిన రాజ్యాన్ని తిరిగి ఎట్లు గ్రహించగలను?". అందులకు భగవంతుడు " నీవు నీ ఆశ్రమానికి వెళ్ళుము. దైత్యులకు, దానవులకు హితోపదేశకుడవుగానుండి, వారిని కాపాడుము". అని పలికాడు.

నారాయణేనైవ ముక్తః స తదా దైత్యనాయకః ।
ప్రణిపత్య విభుం తుష్టో జగామ నగరం నిజమ్ ॥69॥

నారాయణునిచే అనుజ్ఞాతుడైన దైత్యనాయకుడు స్వామికి మ్రొక్కి సంతోషంతో తన నగరానికి వెళ్ళాడు.

దృష్టః సభాజితశ్చాపి దానవైరంధకేన చ ।
నిమంత్రితశ్చ రాజ్యాయ న ప్రత్యైచ్ఛత్స నారద ॥70॥

ఓ నారదా! తిరిగి వచ్చిన ప్రహ్లాదుని దైత్యులు, దానవులు, అంధకుడు చూచి సంభావించి రాజ్యమును మరల స్వీకరింపమన్నారు. కాని ఆ మహాజ్ఞాని అందులకు అంగీకరించలేదు.

రాజ్యం పరిత్యజ్య మహాసురేంద్రో న్యయోజయత్సత్పథి దానవేంద్రాన్ ।
ధ్యాయన్ స్మరన్ కేశవమప్రమేయం తస్థౌ తదా యోగవిశుద్ధదేహః ॥71॥

నారదా! దానవేంద్రుడు దానవరాజ్యాన్ని పరిత్యజించి, అంధకుని సన్మార్గంలో నడుపుచు, దానవేంద్రులకు మార్గదర్శియై, నిరంతరము అప్రమేయుడైన శ్రీహరిని ధ్యానిస్తూ, స్మరిస్తూ మహాయోగియై, విశుద్ధదేహుడై వర్ధిల్లాడు.

ఏవం పురా నారద దానవేంద్రో నారాయణేనోత్తమపూరుషేణ ।
పరాజితశ్చాపి విముచ్య రాజ్యం తస్థౌ మనో ధాతరి సన్నివేశ్య ॥72॥

ఓ నారదా! పూర్వకాలంలో ఈ విధంగా దానవేంద్రుడైన ప్రహ్లాదుడు పురుషోత్తముడైన నారాయణునిచే పరాజితుడై రాజ్యత్యాగం గావించి, తన చిత్తవృత్తులనన్నింటిని ఆ భగవంతునియందే లగ్నం గావించి ధన్యుడయ్యాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే ప్రహ్లాదవరప్రదానో నామాష్టమోఽధ్యాయః ॥8॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి ప్రహ్లాదవరప్రదానమనే ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



నవమోఽధ్యాయః – తొమ్మిదవ అధ్యాయం
దేవాసురయుద్ధమ్ – దేవాసురయుద్ధం

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

> **నేత్రహీనః కథం రాజ్యే ప్రహ్లాదేనాంధకో మునే ।**
> **అభిషిక్తో జానతాపి రాజధర్మం సనాతనమ్ ॥1॥**

మహామునీ! అంధకుడు గ్రుడ్డివాడని తెలిసియు సనాతనమైన రాజధర్మానికి విరుద్ధంగా అతనిని ప్రహ్లాదుడు ఎట్లు రాజ్యాధిపతిని గావించాడు?

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

> **లబ్ధచక్షురసౌ భూయో హిరణ్యాక్షేఽపి జీవతి ।**
> **తతోఽభిషిక్తో దైత్యేన ప్రహ్లాదేన నిజే పదే ॥2॥**

నారదా! తండ్రి హిరణ్యాక్షుడు జీవించియుండగానే అంధకునకు చూపు తిరిగి వచ్చింది. అందుచే ప్రహ్లాదుడతనిని తన స్థానంలో రాజుగా అభిషిక్తుని గావించాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

> **స చ రాజ్యేఽభిషిక్తస్తు కిమాచరత సువ్రత ।**
> **దేవాదిభిః సహ కథం సమాస్తే తద్వదాఽఽశు మే ॥3॥**

ఓ సువ్రతా! రాజ్యాభిషిక్తుడైన అంధకుడు ఏ విధంగా రాజ్యపాలన చేశాడు? దేవతలతో అతడెట్లు మసలుకున్నాడు. దీనినంతటిని నాకు శీఘ్రంగా తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

> **రాజ్యేఽభిషిక్తో దైత్యేంద్రో హైరిణ్యాక్షస్తదాఽంధకః ।**
> **తపసాఽఽరాధ్య దేవేశం శూలపాణిం త్రిలోచనమ్ ॥4॥**

> **అజేయత్వమవధ్యత్వం సురసిద్ధర్షిపన్నగైః ।**
> **అదాహ్యత్వం హుతాశేన అక్లేద్యత్వం జలేన చ ॥5॥**

> **ఏవం స వరలబ్ధస్తు దైత్యో రాజ్యమపాలయత్ ।**
> **శుక్రం పురోహితం కృత్వా సమధ్యాస్తే తతోఽంధకః ॥6॥**

రాజైన హిరణ్యసుతుడు అంధకుడు. మహాదేవుడగు శూలపాణిని గూర్చి తపస్సు చేసి ప్రసన్నుని గావించుకున్నాడు. దేవ సిద్ధ ఋషి పన్నగాదులచే అజేయత్వం, అవధ్యత్వంతో బాటు అగ్ని దహింపకుండునట్లును, జలంనుండి క్లేద్యత్వం లేకుండునట్లును వరాన్ని పొందాడు. అనంతరం అంధకుడు శుక్రాచార్యుని పురోహితునిగా గావించుకొని రాజ్యపాలన చేశాడు.

తతశ్చక్రే సముద్యోగం దేవానామంధకోఽసురః ।
ఆక్రమ్య వసుధాం సర్వాం మనుజేంద్రాన్పరాజయత్ ॥7॥

పరాజిత్య మహీపాలాన్సహాయార్థం నియోజ్య చ ।
తతస్తు మేరుశిఖరం జగామాద్భుతదర్శనమ్ ॥8॥

అంతట అంధకాసురుడు దేవతలను జయింపనెంచి భూతలాన్నంతటినీ ఆక్రమించుకొని, రాజులనందరిని నిర్జించాడు. అట్లు జయించిన భూమీశులను తనకు సహాయంగా నియోగించుకుని, అద్భుతమైన మేరుశిఖరాన్ని సమీపించాడు.

శక్రోఽపి సురసైన్యాని సముద్యోజ్య మహాగజమ్ ।
సమారుహ్యామరావత్యాం గుప్తిం కృత్వా పునర్యయౌ ॥9॥

శక్రస్యాను తథైవాన్యే లోకపాలా మహౌజసః ।
ఆరుహ్య వాహనం స్వం స్వం సాయుధా నిర్యయుర్బహిః ॥10॥

దేవేంద్రుడు కూడా తన బలాలను సమకూర్చుకొని రాజధాని అమరావతి రక్షణకై తగు ఏర్పాట్లు గావించి ఐరావతగజాన్ని అధిరోహించి రాక్షసునిపైకి వెళ్ళాడు. దేవేంద్రుని అనుసరించి ఇతర దిక్పాలకులు కూడా తమ తమ సైన్యాలతో, తమ తమ ఆయుధాలను ధరించి, తమ తమ వాహనాలను అధిరోహించి, మిక్కిలి పరాక్రమంతో బయలుదేరారు.

దేవసేనాఽపి చ సమం శక్రేణాద్భుతకర్మణా ।
నిర్జగామాతివేగేన గజవాజిరథాదిభిః ॥11॥

అగ్రతో ద్వాదశాదిత్యాః పృష్ఠతశ్చ త్రిలోచనాః ।
మధ్యేఽష్టౌ వసవో విశ్వే సాధ్యాశ్విమరుతాం గణాః ।
యక్ష విద్యాధరాద్యాశ్చ స్వం స్వం వాహనమాస్థితాః ॥12॥

ఇంద్రుని నాయకత్వంలో రథ గజ తురగాదులతో కూడిన దేవసైన్యం వివిధాయుధాలతో పురోగమించింది. ముందుభాగాన ద్వాదశాదిత్యులు, వెనుక రుద్రులు, మధ్యభాగంలో అష్టవసువులు, విశ్వేదేవతలు, సాధ్యులు, మరుద్గణాలు, అశ్వినులు, యక్ష విద్యాధరాదులందరు తమ తమ వాహనాలమీద బయలుదేరారు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

రుద్రాదీనాం వదస్వేహ వాహనాని చ సర్వశః ।
ఏకైకస్యాపి ధర్మజ్ఞ పరం కౌతూహలం మమ ॥13॥

ఓ ధర్మజ్ఞా! ఏకాదశరుద్రులు, తదితరులు ఏ ఏ వాహనాలపై వచ్చారో వివరంగా వినాలని కుతూహలంగా ఉంది.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రుణుష్వ కథయిష్యామి సర్వేషామపి నారద ।
వాహనాని సమాసేన ఏకైకస్యానుపూర్వశః ॥14॥

ఓ నారదా! అంతా వివరంగా చెబుతాను వినుము. వరుసగా ఒక్కొక్కరు ఏ ఏ వాహనంపై వచ్చారో చెబుతాను.

రుద్రహస్తతలోత్పన్నో మహావీర్యో మహాజవః ।
శ్వేతవర్ణో గజపతిః దేవరాజస్య వాహనమ్ ॥15॥

రుద్రుని అరచేతినుండి పుట్టి, అపూర్వజవసత్వాలు కలిగిన శ్వేతగజం ఐరావతం ఇంద్రుని వాహనం.

రుద్రోరుసంభవం భీమం కృష్ణవర్ణో మనోజవమ్ ।
పౌంద్రకం నామ మహిషం ధర్మరాజస్య నారద ॥16॥

రుద్రుని తొడలనుండి పుట్టిన నల్లని భయంకరాకృతితో, మనోవేగంతో పయనించే **"పౌంద్రక"**మనే మహిషం యముని వాహనం.

రుద్రకర్ణమలోద్భూతః శ్యామో జలధి సంజ్ఞకః ।
శింశుమారో దివ్యగతిః వాహనం వరుణస్య చ ॥17॥

రుద్రుని కర్ణమలం (గుమిలి) నుండి పుట్టినట్టియు, చక్కని గమనం గలట్టియు **"జలధి"** అనే పేరు గల నల్లని శింశుమారం (మొసలి) వరుణుని వాహనం.

రౌద్రం శకటచక్రాక్షః శైలాకారం నరోత్తమః ।
అంబికాపాదసంభూతో వాహనం ధనదస్య తు ॥18॥

అంబికాదేవి చరణాలనుండి జన్మించి, బండిచక్రాలవంటి కండ్లతో భయంకరమైన శైలాకారం గల నరోత్తముడు కుబేరుని వాహనం.

ఏకాదశానాం రుద్రాణాం వాహనాని మహామునే ।
గంధర్వాశ్చ మహావీర్యా భుజగేంద్రాస్సుదారుణాః ।
శ్వేతాని సౌరభేయాని వృషాణ్యుగ్రజవాని చ ॥19॥

ఓ మహామునీ! గంధర్వులు, మహావీరులైన పన్నగులు, కామధేనువు (సురభిపుత్రులైన శ్వేత వృషభ రాజాదులు) ఏకాదశరుద్రుల వాహనాలు.

రథం చంద్రమసశ్చార్ధసహస్రం హంసవాహనమ్ ।
హయోష్ట్రరథవాహాశ్చ ఆదిత్యా మునిసత్తమ ॥20॥

ఓ మునిసత్తమా! చంద్రుని రథాన్ని 500 హంసలు, ఆదిత్యుని రథాలను ఉత్తమాశ్వాలు, ఒంటెలు లాగుతున్నాయి.

కుంజరస్థాశ్చ వసవో యక్షాశ్చ నరవాహనాః ।
కిన్నరా భుజగారూఢా హయారూఢౌ తథాశ్వినౌ ॥21॥

వసువులు ఏనుగుల మీద, యక్షులు నరుల మీద స్వారీ చేస్తున్నారు. కిన్నరులు భుజగాలను, అశ్వినులు హయాలను వాహనాలుగా చేసుకున్నారు.

సారంగాధిష్ఠితా బ్రహ్మన్ మరుతో ఘోరదర్శనాః ।
శుకారూఢాశ్చ కవయో గంధర్వాశ్చ పదాతినః ॥22॥

ఓ నారదా! భయంకరులైన మరుత్తులు లేళ్ళను తమ వాహనాలుగా చేసుకున్నారు. కవులు చిలుకలపై బయలుదేరగా గంధర్వులు పాదచారులై నడిచారు.

ఆరుహ్య వాహనాన్యేవం స్వాని స్వాన్యమరోత్తమాః ।
సంనహ్య నిర్యయు ర్హృష్టా యుద్ధాయ సుమహౌజసః ॥23॥

ఇట్లు అమరోత్తములందరు తమ తమ వాహనాలనధిరోహించి, మిక్కిలి పరాక్రమంతో యుద్ధానికి బయలుదేరారు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

గదితాని సురాదీనాం వాహనాని త్వయా మునే ।
దైత్యానాం వాహనాన్యేవం యథావద్వక్తుమర్హసి ॥24॥

ఓ పులస్త్యమహర్షీ! దేవతల వాహనాలనన్నిటిని వివరించారు. అట్లే దైత్యుల వాహనాలను కూడా వివరించవలసినదిగా కోరుతున్నాను.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రుణుష్వ దానవాదీనాం వాహనాని ద్విజోత్తమ ।
కథయిష్యామి తత్త్వేన యథావచ్ఛ్రోతుమర్హసి ॥25॥

ఓ నారదమహర్షీ! దానవుల వాహనాలను గూర్చి కూడా ఉన్నది ఉన్నట్లు చెబుతాను. శ్రద్ధగా వినుము.

అంధకస్య రథో దివ్యో యుక్తః పరమవాజిభిః ।
కృష్ణవర్ణైః సహస్రారస్త్రినల్వపరిమాణవాన్ ॥26॥

అంధకుని దివ్యరథం 1200 మూరల పరిమాణం కలిగి, వేయి ఆకులు గల చక్రాలతో, నల్లని గుఱ్ఱాలతో ఒప్పివున్నది.

ప్రహ్లాదస్య రథో దివ్యశ్చంద్రవర్ణైర్హయోత్తమైః ।
ఉహ్యమానస్తథాఽష్టాభిః శ్వేతరుక్మమయః శుభః ॥27॥

ప్రహ్లాదుడెక్కిన రథం బంగారపు కాంతితో వెలుగొందుతూ, చంద్రునితో సమానమైన తెల్లని కాంతులు వేలార్చే 8 ఉత్తమాశ్వాలు పూన్చబడి వెలుగుతోంది.

విరోచనస్య చ గజః కుజంభస్య తురంగమః ।
జంభస్య తు రథో దివ్యో హయైః కాంచనసన్నిభైః ॥28॥

విరోచనుడు ఏనుగును, కుజంభుడు గుఱ్ఱాన్ని అధిరోహించారు. జంభుడు కాంచనశోభతో వెలిగే గుఱ్ఱాలు కట్టిన రథాన్ని అధిరోహించాడు.

శంకుకర్ణస్య తురగో హయగ్రీవస్య కుంజరః ।
రథో మయస్య విఖ్యాతో దుందుభేశ్చ మహోరగః ॥29॥

శంకుకర్ణుడు అశ్వాన్ని, హయగ్రీవుడు ఏనుగును, మయుడు ఉత్తమమైన రథాన్ని, దుందుభి మహోరగాన్ని అధిరోహించారు.

శంబరస్య విమానోఽభూదయఃశఙ్కోర్మృగాధిపః ।
బలవృత్రౌ చ బలినౌ గదాముసలధారిణౌ ॥30॥

పద్భ్యాం దైవతసైన్యాని అభిద్రవితుముద్యతౌ ।
తతో రణోఽభూత్తుములః సంకులోఽతిభయంకరః ॥31॥

శంబరుడు విమానారూఢుడయ్యాడు. అయఃశంకుడు సింహవాహనాన్ని అధిష్ఠించాడు. గద, ముసలాన్ని ధరించి, మహాబలశాలురైన బలుడు, వృత్రుడు, పాదచారులై సురసైన్యాన్ని ఎదుర్కొనేందుకు విజృంభించారు. అంతట అతిభయంకరమైన సంకులసమరం సాగింది.

రజసా సంవృతో లోకః పిఙ్గవర్ణేన నారద ।
నాజ్ఞాసీచ్చ పితా పుత్రం న పుత్రః పితరం తథా ॥32॥

ఓ నారదా! ఆ యుద్ధంలో రేగిన దుమ్ముధూళితో భూమ్యాకాశాలు గోరోజనవర్ణంతో కప్పబడ్డాయి. రజసాంధకారంలో తండ్రి కొడుకును, కొడుకు తండ్రిని గుర్తింపలేకపోతున్నారు.

స్వానేవాన్యే నిజఘ్నుర్వై పరానన్యే చ సువ్రత ।
అభిద్రుతో మహావేగో రథోపరి రథస్తదా ॥33॥

కొందరు వీరులు తమవారినే సంహరింపసాగారు. మరికొందరు శత్రువులను దునుమాడారు. ఆ యుద్ధంలో మహావేగంతో రథం మీద మరియొక రథం ఆక్రమించింది.

గజో మత్తగజేంద్రం చ సాదీ సాదినమభ్యగాత్ ।
పదాతిరపి సంక్రుద్ధః పదాతినమథోల్బణమ్ ॥34॥

పరస్పరం చ ప్రత్యఘ్నన్నన్యోన్యజయకాంక్షిణః ।
తతస్తు సంకులే తస్మిన్యుద్ధే దైవాసురే మునే ॥35॥

ప్రావర్తత నదీ ఘోరా శమయంతీ రణాద్రజః ।
అసృక్తోయా రథావర్తా యోధసంఘట్టవాహినీ ॥36॥

గజకుంభమహాకూర్మా శరమీనా దురత్యయా ।
తీవ్రాగ్రప్రాసమకరా మహాసిగ్రాహవాహినీ ॥37॥

అంత్రశైవాలసంకీర్ణా పతాకాఫేనమాలినీ ।
గృధ్రకఙ్కమహాహంసా శ్యేనచక్రాహ్వమండితా ॥38॥

వనవాయసకాదంబా గోమాయుశ్వాపదాకులా ।
పిశాచమునిసంకీర్ణా దుస్తరా ప్రాకృతైర్జనైః ॥39॥

ఏనుగులు ఏనుగులను, అశ్వికులు అశ్వికులను, పదాతులు పదాతులను మిక్కిలి కోపంతో వెంటాడారు. పరస్పరం జయకాంక్షతో ఒకరినొకరు మర్దింపసాగారు. ఓ నారదా! ఆ విధంగా సంకులంగా జరిగిన దేవాసురుల యుద్ధంలో చెలరేగిన ధూళి మేఘాలను శమింపజేస్తూ, ఒక భయంకరమైన నది ప్రవహించింది. అందులో రక్తమనే నీరు ప్రవహించింది. రథాలనే సుడిగుండాలు, మృతకళేబరాల వెల్లువలు, ఏనుగు కుంభస్థలాలనే మహాకూర్మాలు, బాణాలనే చేపలు, ప్రాసాయుధాలనే తీవ్రమైన మొసళ్ళు, దీర్ఘకరవాలాలనే ప్రవాహాలు, ఆ నదిలో ఏర్పడ్డాయి. వీరుల ప్రేవులకుప్పలే నాచుకుప్పలుగా, శ్వేతధ్వజాలే తెట్టెలు కట్టిన నురుగులుగా రూపొందాయి. భయంకరమైన డేగలు కంకగృధ్రాలు, చక్రసారసాలుగా వ్యాపించాయి. అడవికాకులు కాదంబపక్షులుగా, జంబుకాలు మండూకాలుగా గుంపులు కట్టిన పిశాచాలే నదీతీరాన తపస్సు చేసే మునులుగా ఏర్పడిన ఆ మహానది సామాన్యజనులు దాటడానికి వీలుకానిదయ్యింది.

రథప్లవైః సంతరంతః శూరాస్తాం ప్రజగాహిరే ।
ఆగుల్ఫాదవమజ్జంతః సూదయంతః పరస్పరమ్ ।
సముత్తరంతో వేగేన యోధా జయధనేప్సవః ॥40॥

ఆ భయంకరమైన యుద్ధమనే నదిని రథాలనే పడవల మీద దాటడానికి ప్రయత్నించిన కొందరు వీరులు ఒక్కరొక్కరు చంపుకుంటూ అందులోపడి మునిగిపోగా విజయలక్ష్మిని వరించగోరిన మరికొందరు సునాయాసంగా దాటగలిగారు.

తతస్తు రౌద్రే సురదైత్యసాదనే మహాహవే భీరుభయంకరేఽథ ।
రక్షాంసి యక్షాశ్చ సుసంప్రహృష్టాః పిశాచయూథాస్త్వభిరేమిరే చ ॥41॥

దేవదానవులకు జరిగిన ఆ ఘోరసంగ్రామం పిరికి పందలకు భయావహమయ్యింది. యక్షరాక్షసులకు సంతోషదాయకమయ్యింది. పిశాచసమూహాలు ఆనందంతో గంతులు వేశాయి.

పిబంత్యసృగ్గాఢతరం భటానామాలింగ్య మాంసాని చ భక్షయంతి ।
వసాం విలుంపంతి చ విస్ఫురంతి గర్జన్త్యథాన్యోన్యమథోవయాంసి ॥42॥

ఆ పిశాచాలు పరస్పరం కౌగిలించుకుంటూ మృతవీరుల రక్తాన్ని కడుపారా త్రాగాయి. మాంస ఖండాలను భక్షించాయి. పక్షులు గంతులు వేస్తూ, కేకలు వేస్తూ, వసను విరిచి విసరివేశాయి.

ముంచంతి ఫేత్కారరవాన్ శివాశ్చ క్రందంతి యోధా భువి వేదనార్తాః ।
శస్త్రప్రతప్తా నిపతన్తి చాన్యే యుద్ధం శ్మశానప్రతిమం బభూవ ॥43॥

తస్మింఛివా ఘోరతరే ప్రవృత్తే సురాసురాణాం సుభయంకరే హ ।
యుద్ధం బభౌ ప్రాణపణోపవిద్ధం ద్వంద్వేతి శస్త్రాక్షగతో దురోదరః ॥44॥

హిరణ్యచక్షోస్తనయో రణేఽన్ధకో రథే స్థితో వాజిసహస్రయోజితే ।
మత్తేభ పృష్ఠస్థితముగ్రతేజసం సమేయివాన్దేవపతిం శతక్రతుమ్ ॥45॥

ఒకవైపు వీరులు బాధతో చేసే ఆర్తనాదాల ఫేత్కారరవాలతోను, రణనిహతులైనవారి శవాలు చెల్లాచెదురుగా పడియుండడంతోను, రణభూమి భయంకరమైన శ్మశానంగా మారింది. భటుల భయంకరమైన శబ్దాలతో కూడిన దేవాసురసంగ్రామం నిపుణులైన యోధుల శస్త్రరూపమైన పాశాన్ని తీసుకొని, ప్రాణాలను బయటకు లాగే ఆటాడుతున్నట్లు ప్రవర్తిల్లింది. హిరణ్యాక్షుని కుమారుడైన అంధకుడు వేయి గుఱ్ఱాలు పూన్చిన రథమెక్కి, మదించిన ఏనుగుపైనున్న మహాతేజస్వియగు దేవేంద్రుని మీదకు లంఘించాడు.

సమాపతంతం మహిషాధిరూఢం యమం ప్రతీచ్ఛన్బలవాన్దితీశః ।
ప్రహ్లాదనామా తురగాష్టయుక్తం రథం సమాస్థాయ సముద్యతాస్త్రః ॥46॥

మహాబలశాలియైన దైత్యపతి ప్రహ్లాదుడు 8 అశ్వాలు పూన్చిన రథాధిరూఢుడై, మహిషాధిరూఢుడై తనమీదకు వచ్చుచున్న యమునిపై అస్త్రప్రయోగం చేశాడు.

విరోచనశ్చాపి జలేశ్వరం త్వగాజ్జంభస్త్వథాగాద్ధనదం బలాఢ్యమ్ ।
వాయుం సమభ్యేత్య చ శంబరోఽథ మయో హుతాశం యుయుధే మునీంద్ర ॥47॥

ఓ నారదమునీంద్రా! అంతట విరోచనుడు వరుణుని, బలశాలియగు కుబేరుని జంభుడు, శంబరుడు వాయుదేవుని, మయుడు అగ్నిని ఎదుర్కొని యుద్ధం చేశారు.

అన్యే హయగ్రీవముఖా మహాబలా దితేస్తనూజా దనుపుంగవాశ్చ ।
సురాం హుతాశార్కవసూరగేశ్వరాన్ ద్వంద్వం సమాసాద్య మహాబలాన్వితాః ॥48॥

హయముఖుడు మొదలైన ఇతర దైత్యదానవవీరులు మహాబలశాలురగు సూర్య, అగ్ని, వసు, ఉరగేంద్రులతో ద్వంద్వయుద్ధానికి తలబడ్డారు.

గర్జంత్యథాన్యోన్యముపేత్య యుద్ధే చాపాని కర్షంత్యతివేగితాశ్చ ।
ముంచంతి నారాచగణాన్సహస్రశో ఆగచ్ఛ హే తిష్ఠసి కిం బ్రువంతః ॥49॥

'ఊరక నిలుచుంటివేమి? యుద్ధానికి రమ్ము?' అని ఒకరినొకరు రెచ్చగొడుతూ, గర్జిస్తూ, ధనుస్సు లెక్కుపెడుతూ, ఒకరిపైనొకరు వేలసంఖ్యలో బాణాలు వేగంగా విడువసాగారు.

శరైస్తు తీక్ష్ణైరతితాపయంతో మందాకినీవేగనిభాం వహంతీమ్ ।
ప్రావర్తయంతో భయదాం నదీం చ హ్యస్త్రైరమోఘైరభితాడయంతః ॥50॥

తీక్ష్ణమైన బాణ పరంపరలతో ఒకరినొకరు బాధింపజేస్తూ, గురితప్పని శస్త్రాస్త్రాలతో, దేహాలు చీల్చుకుంటూ, ఆ వీరులు మందాకినివంటి భయంకరమైన రక్తస్రవంతిని ప్రవహింపజేశారు.

త్రైలోక్యమాకాంక్షిభిరుగ్రవేగైః సురాసురైర్నారద సంప్రబుద్ధైః ।
పిశాచరక్షోగణపుష్టివర్ధనీముత్తర్తుమిచ్ఛద్భిరసృఙ్నదీ బభౌ ॥51॥

ఓ నారదా! త్రైలోక్యవిజిగీషులైన దేవదానవవీరులు పిశాచరక్షోగణపుష్టివర్ధనియైన ఆ రక్తతరంగిణిని దాటడానికి పోటీపడసాగారు.

వాద్యన్తి తూర్యాణి సురాసురాణాం పశ్యంతి ఖస్థా మునిసిద్ధసంఘాః ।
qj ǝ+Ü Ô q| ¥sÁÍ+ sÁ²ç±<ÃÜsÁñ Tò_ **భిముఖాస్తు శూరాః ॥52॥**

ఆ సమయంలో ఆకాశంలో నిలబడి మునులు సిద్ధుల సమూహములు దుందుభులు మ్రోగిస్తూ సురాసురులను వీక్షిస్తున్నారు. శత్రువులకెదురొడ్డి యుద్ధంలో నిహతులైన వీరాగ్రేసరులకు అప్సరసాంగనలు స్వాగతాలు పలుకుతున్నారు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరిలలితే దేవాసురయుద్ధం నామ నవమోఽధ్యాయః ॥9॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్యనారదసంవాదంలోని హరిలలితయందలి దేవాసురయుద్ధమనే తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

దశమోఽధ్యాయః – పదవ అధ్యాయం
అంధకవిజయః – అంధకుని విజయం

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తతః ప్రవృత్తే సంగ్రామే భీరూణాం భయవర్ధనే ।
సహస్రాక్షో మహాచాపమాదాయ వ్యసృజచ్ఛరాన్ ॥1॥

ఈ విధంగా పిరికివారిని హడలెత్తించే సంగ్రామం జరుగుతుండగా ఇంద్రుడు తన పెద్దవిల్లునెక్కుపెట్టి, బాణాలు వదలసాగాడు.

అంధకోఽపి మహావేగం ధనురాకృష్య భాస్వరమ్ ।
పురందరాయ చిక్షేప శరాన్ బర్హిణవాససః ॥2॥

అంధకుడు కూడా దేదీప్యమానంగా వెలుగుతున్న తన వింటిని వంచి నెమలి ఈకలతో అలంకరింపబడిన తీవ్రమైన బాణాలను మహావేగంతో దేవేంద్రునిపై కురిపించాడు.

తావన్యోన్యం సుతీక్ష్ణాగ్రైః శరైః సన్నతపర్వభిః ।
రుక్మపుంఖైర్మహావేగైరాజఘ్నతురుభావపి ॥3॥

వారిరువురు బంగారు రంగుగలట్టియు, తీక్ష్ణమైన అగ్రభాగములు గలట్టియు, బాణాలతో కడువేగంగా ఒకరినొకరు దెబ్బతీసుకొనసాగారు.

తతః క్రుద్ధః శతమఖః కులిశం భ్రామ్య పాణినా ।
చిక్షేప దైత్యరాజాయ తం దదర్శ తథాఽన్ధకః ॥4॥

అంతట దేవేంద్రుడు కుపితుడై తన వజ్రాయుధాన్ని గిరగిర త్రిప్పి దైత్యరాజైన అంధకునిపైకి వేశాడు. దానిని అంధకుడు చూశాడు.

ఆజఘాన చ బాణౌఘైరస్త్రైః శస్త్రైః స నారద ।
తాన్భస్మసాత్తదా చక్రే నాగానివ హుతాశనః ॥5॥

ఓ నారదా! అది చూసి అంధకుడు కూడా తీవ్రమైన శస్త్రాస్త్రాలు ప్రయోగించగా, ఆ శస్త్రాస్త్రాలను దేవేంద్రుడు చెట్లను అగ్ని కాల్చివేసినట్లు బూడిద చేశాడు.

తతోఽతివేగితం వజ్రం దృష్ట్వా బలవతాం వరః ।
సమాప్లుత్య రథాత్తస్థౌ భువి బాహుసహాయవాన్ ॥6॥

అంతట తనపైకి అతివేగంగా రానున్న వజ్రాయుధాన్ని చూసి, బలవంతులలో శ్రేష్ఠుడైన అంధకుడు వెంటనే రథంనుండి దూకి, భుజబలమే సహాయంగా భూమిపై నిలబడ్డాడు.

రథం సారథినా సార్ధం సాశ్వధ్వజసకూబరమ్ ।
భస్మ కృత్వాథ కులిశమంధకం సముపాయయౌ ॥7॥

అంతట ఆ వజ్రాయుధం అంధకుని రథాన్ని, సారథిని, గుఱ్ఱాలను, ధ్వజాన్ని, కూబరాన్ని (బండి నొగ) బూడిద చేసి, అంధకుని సమీపించింది.

తమాపతంతం వేగేన ముష్టినాఽఽహత్య భూతలే ।
పాతయామాస బలవాన్ జగర్జ చ తదాఽన్ధకః ॥8॥

మహాబలశాలియైన అంధకుడు తన కఠోరముష్టిఘాతంతో వేగంగా వస్తున్న వజ్రాయుధాన్ని భూమి మీద పడగొట్టి భయంకరంగా గర్జించాడు.

తం గర్జమానం వీక్ష్యాథ వాసవః సాయకైర్వృథమ్ ।
వవర్ష తాన్ వారయన్ సమభ్యాయాచ్ఛతక్రతుమ్ ॥9॥

ఆ విధంగా గర్జిస్తున్న అంధకునిపై ఇంద్రుడు బాణవర్షం కురిపించాడు. అంధకుడు వాటినన్నిటిని వారించి, ఇంద్రునిపైకి లంఘించాడు.

ఆజఘాన తలేనేభం కుంభమధ్యే పదా కరే ।
జానునా చ సమాహత్య విషాణం ప్రబభంజ చ ॥10॥

వామముష్ట్యా తథా పార్శ్వం సమాహత్యాంధకస్త్వరన్ ।
గజేంద్రం పాతయామాస ప్రహారైర్జర్జరీకృతమ్ ॥11॥

ఇంద్రుని మదపుటేనుగు కుంభస్థలాన్ని తన అరచేతితోను, తుండాన్ని తన పాదాలతోను మర్దించి, మోకాళ్ళతో దాని దంతాలను ముక్కలు గావించాడు. అదే విధంగా ఎడమచేతి పిడికిలితో ఏనుగు పార్శ్వాలను నుగ్గునుగ్గు గావించి, వేగవంతమగు ప్రహారాలతో శిథిలీకృతం చేసి, ఐరావతాన్ని అంధకుడు నేలపై పడగొట్టాడు.

గజేంద్రాత్పతమానాచ్చ అవప్లుత్య శతక్రతుః ।
పాణినా వజ్రమాదాయ ప్రవివేశామరావతీమ్ ॥12॥

నేలమీదకు పడిపోతున్న ఐరావతం నుండి ఇంద్రుడు క్రిందకు దుమికి, త్వరగా తన వజ్రాయుధాన్ని తీసుకొని, అమరావతికి పారిపోయాడు.

పరాఙ్ముఖే సహస్రాక్షే తద్దైవతబలం మహత్ ।
పాతయామాస దైత్యేంద్రః పాదముష్టితలాదిభిః ॥13॥

సురనాయకుడైన ఇంద్రుడు పారిపోగా మిగిలిన దేవతలనందరిని దైత్యనాథుడు పదాఘాతాలతోను, ముష్టిఘాతాలతోను మర్దించాడు.

తతో వైవస్వతో దండం పరిభ్రామ్య ద్విజోత్తమ ।
సమభ్యధావత్ప్రహ్లాదం హంతుకామః సురోత్తమః ॥14॥

బ్రాహ్మణోత్తమా! అంతట తన దండాన్ని త్రిప్పుతూ యముడు ప్రహ్లాదుని చంపడానికి అతనిని వెంబడించాడు.

తమాపతన్తం బాణౌఘైర్వవర్ష రవినందనమ్ ।
హిరణ్యకశిపోః పుత్రశ్చాపమానమ్య వేగవాన్ ॥15॥

అంతట హిరణ్యకశిపుని కుమారుడైన ప్రహ్లాదుడు త్వరగా విల్లునెక్కుపెట్టి బాణవృష్టితో రవినందనుడైన యముని ముంచెత్తాడు.

తాం బాణవృష్టిమతులాం దండేనాహత్య భాస్కరిః ।
శాతయిత్వా ప్రచిక్షేప దండం లోకభయంకరమ్ ॥16॥

యముడు అంతులేని ఆ బాణవృష్టిని తన దండంతో చెదరగొట్టి లోకభయంకరమైన తన దండాన్ని ప్రహ్లాదునిపై ప్రయోగించాడు.

స వాయుపథమాస్థాయ ధర్మరాజకరే స్థితః ।
జజ్వాల కాలాగ్నినిభో యద్వద్దగ్ధుం జగత్త్రయమ్ ॥17॥

యమధర్మరాజుచే వదలబడిన యమదండం ముల్లోకాలను దహించివేసే కాలాగ్నివలె మండుతూ వాయుమార్గంలో ప్రయాణం చేస్తోంది.

జాజ్జ్వల్యమానమాయాన్తం దండం దృష్ట్వాదితేః సుతాః ।
ప్రాక్రోశంతి హతః కష్టం ప్రహ్లాదోఽయం యమేన హి ॥18॥

మండుతూ వస్తున్న యమదండాన్ని చూచి రాక్షసులందరు 'అయ్యో! ప్రహ్లాదుడు యముని చేతిలో హతుడయ్యాడు' అని ఆక్రోశించారు.

తమాక్రందితమాకర్ణ్య హిరణ్యాక్షసుతోఽన్ధకః ।
ప్రోవాచ మాభైష్ట మయి స్థితే కోఽయం సురాధమః ॥19॥

వారి ఆక్రందనాన్ని విని, హిరణ్యాక్షసుతుడైన అంధకుడు 'నేనుండగా భయమెందులకు? ఎవడా సురాధముడు?' అని బిగ్గరగా అరిచాడు.

ఇత్యేవముక్త్వా వచనం వేగేనాభిససార చ ।
జగ్రాహ పాణినా దండం హసన్ సవ్యేన నారద ॥20॥

తమాదాయ తతో వేగాద్భ్రామయామాస చాంధకః ।
జగర్జ చ మహానాదం యథా ప్రావృషి తోయదః ॥21॥

ఓ నారదా! అంధకుడు ఈ విధంగా పలుకుతూ వేగంగా దుమికి తన ఎడమచేతితో యమదండాన్ని పట్టుకొని అట్టహాసం చేశాడు. అంతట అంధకుడు ఆ దండాన్ని తీసుకొని వేగంగా త్రిప్పుతూ వర్షాకాలంలోని మేఘం వలె మహానాదంతో గర్జింపసాగాడు.

ప్రహ్లాదం రక్షితం దృష్ట్వా దండాద్దైత్యేశ్వరేణ హి ।
సాధువాదం దదుర్హృష్టాదైత్యదానవయూథపాః ॥22॥

దైత్యేశ్వరుడైన అంధకునిచే యమదండం నుండి ప్రహ్లాదుడు రక్షింపబడడాన్ని చూచి, దైత్యదానవ యోధులు ఆనందోత్సాహాలతో వారినభినందించారు.

భ్రామయంతం మహాదండం దృష్ట్వా భానుసుతో మునే ।
దుఃసహం దుర్ధరం మత్వా అంతర్ధానమగాద్యమః ॥23॥

ఓ నారదమునీ! ఆ విధంగా అంధకుడు తన మహాదండాన్ని గిరగిరా త్రిప్పడం చూసి భానుసుతుడైన యముడు భరించలేక అంతర్హితుడయ్యాడు.

అంతర్హితే ధర్మరాజే ప్రహ్లాదోఽపి మహామునే ।
దారయామాస బలవాన్ దేవసైన్యం సమంతతః ॥24॥

ఓ మహామునీ! యమధర్మరాజు అంతర్హితుడుకాగా, ప్రహ్లాదుడు దేవసైన్యాన్నంతటిని చెల్లాచెదురు చేశాడు.

వరుణః శింశుమారస్థో బద్ధ్వా పాశైర్మహాసురాన్ ।
గదయా దారయామాస తమభ్యాగాద్విరోచనః ॥25॥

తోమరైర్వజ్రసంస్పర్శైః శక్తిభిర్మార్గణైరపి ।
జలేశం తాడయామాస ముద్గరైః కణపైరపి ॥26॥

అంతట వరుణుడు కుపితుడై తన వాహనమైన మొసలినెక్కి, రాక్షసులను తన పాశాలతో బంధించి, గదతో మోదసాగాడు. అంతట విరోచనుడు వరుణునిపై లంఘించి, వజ్రసమానమైన తోమర, శక్తి, ముద్గర కణపాది ఆయుధాలతో అతనిని మోదసాగాడు.

తతస్తం గదయాఽభ్యేత్య పాతయిత్వా ధరాతలే ।
అభిద్రుత్య బబంధాథ పాశైర్మత్తగజం బలీ ॥27॥

అంతట వరుణుడు విరోచనుని సమీపించి, గదతో మోది, వానిని నేలపై పడగొట్టాడు. అతనివెంట పరుగెత్తి, తన బలమైన పాశాలతో మదపుటేనుగును బంధించిన విధంగా ఆ విరోచనుని బంధించాడు.

తాన్ పాశాన్ శతధా చక్రే వేగాచ్చ దనుజేశ్వరః ।
వరుణం చ సమభ్యేత్య మధ్యే జగ్రాహ నారద ॥28॥

ఓ నారదా! అంతట దనుజేశ్వరుడు వెంటనే వరుణుని పాశాలను త్రెంచుకొని, వరుణునిపైకిదూకి, అతని నడుమును ఒడిసిపట్టాడు.

తతో దంతీ చ శృంగాభ్యాం ప్రచిక్షేప తదాఽవ్యయః ।
మమర్ద చ తదా పద్భ్యాం సవాహం సలిలేశ్వరమ్ ॥29॥

అపుడా రాక్షసుని ఏనుగు తన దంతాలతో వరుణుని క్రిందబడదోసి, జలాధిపతిని, అతని వాహనంతో సహా తనకాళ్ళతో మర్దించింది.

తం మర్ద్యమానం వీక్ష్యాథ శశాఙ్కః శిశిరాంశుమాన్ ।
అభ్యేత్య తాడయామాస మార్గణైః కాయదారణైః ॥30॥

ఆ విధంగా మర్దింపబడుచున్న వరుణుని చూసి, చంద్రుడు వేగంగా వచ్చి, శరీరమును చీల్చునట్టి పదునైన బాణాలతో ఆ ఏనుగును బాధింపసాగాడు.

స తాడ్యమానః శిశిరాంశుబాణైరవాప పీడాం పరమాం గజేంద్రః ।
క్లిష్టశ్చ వేగాత్ప్రయసామధీశం ముహుర్ముహుః పాదతలైర్మమర్ద ॥31॥

చల్లని కిరణములుగల చంద్రునియొక్క బాణములచే గజేంద్రుడు తీవ్రమగు బాధను పొందాడు. అతడు జలాధీశుని మరలమరలా తన పాదములచే మర్దించాడు.

సంమర్ద్యమానో వరుణో గజేంద్రం పద్భ్యాం సుగాఢం జగృహే మహర్షే ।
పాదేషు భూమిం కరయోః స్పృశాంశ్చ మూర్ధానముల్లాల్య బలాన్మహాత్మా ॥32॥

గృహ్యాంగులీభిశ్చ గజస్య పుచ్ఛం కృత్వేహ బంధం భుజగేశ్వరేణ ।
ఉత్పాట్య చిక్షేప విరోచనం హి సకుంజరం ఖే స నియంతృవాహమ్ ॥33॥

ఓ మహర్షీ! అంతట వరుణుడు తన బలమంతా కూడగట్టుకొని, తనను మర్దిస్తున్న ఏనుగు కాళ్ళను తన చేతులతో గట్టిగా పట్టుకున్నాడు. అదే విధంగా తన కాళ్ళతోను, చేతులతోను, నేలను గట్టిగా నొక్కిపట్టి, తలను పైకెత్తి బలంగా తన వ్రేళ్ళతో ఆ ఏనుగు తోకను పట్టుకున్నాడు. అంతేగాక ఏనుగుపైనున్న విరోచనుని నాగ పాశాలతో బంధించి, ఏనుగుతో సహా విరోచనుని బలం కొలది ఆకాశానికి విసరివేశాడు.

క్షిప్తో జలేశేన విరోచనస్తు సకుంజరో భూమితలే పపాత ।
సాట్టం సయంత్రార్గళ హర్మ్యభూమిం పురం సుకేశేరివ భాస్కరేణ ॥34॥

ఆవిధంగా ఆకాశానికి ఎగరగొట్టబడిన విరోచనుడు సూర్యునిచే భూమిమీదకు సాట్టగోపురప్రాకార హర్మ్యాదులతో తోసివేయబడిన 'సుకేశి' నగరం వలె తన గజంతో కూడా నేలమీద పడిపోయాడు.

తతో జలేశః సగదః సపాశః సమభ్యధావద్దితిజం నిహన్తుమ్ ।
తతః సమాక్రందమనుత్తమం హి ముక్తం తు దైత్యైర్ఘనరావతుల్యమ్ ॥35॥

అతనిని చంపడానికి తన గదను, పాశాలను తీసుకొని మీదపడుతున్న వరుణుని చూసి దైత్యభటులు వేఘగర్జనలవలె పెద్దగా హాహాకారాలు చేశారు.

హాహా హతోఽసౌ వరుణేన వీరో విరోచనో దానవసైన్యపాలః ।
ప్రహ్లాద హే జంభ కుజంభకాద్యా రక్షధ్వమభ్యేత్య సమాంధకేన ॥36॥

అయ్యో! వరుణుని చేతిలో విరోచనుడు హతుడౌతున్నాడు గదా! ఓ ప్రహ్లాదా! జంభా! కుజంభకాదులారా! మీరందరు అంధకునితో కూడివచ్చి వీనిని రక్షించండి.

అహో మహాత్మా బలవాన్ జలేశః సంచూర్ణయన్ దైత్యభటం సవాహమ్ ।
పాశేన బద్ధ్వా గదయా నిహంతి యథా పశూన్ వాజిమఖే మహేంద్రః ॥37॥

అయ్యో! బలవంతుడైన వరుణుడు వాహనసహితంగా విరోచనుని చూర్ణం చేస్తూ తన పాశంతో బంధించి, గదతో మర్దించి, అశ్వమేధంలో ఇంద్రుడు పశువును చంపిన విధంగా చంపుతున్నాడు. రక్షించడానికి రండు అంటూ దైత్యులు హాహాకారాలు చేశారు.

శ్రుత్వాఽథ శబ్దం దితిజైః సమీరితం జంభప్రధానా దితిజేశ్వరాస్తతః ।
సమభ్యధావంస్త్వరితా జలేశ్వరం యథా పతంగా జ్వలితం హుతాశనమ్ ॥38॥

ఆ అరుపులు విని, జంభాది ప్రధాన రాక్షసనాయకులు ప్రజ్జ్వరిల్లుతున్న అగ్నిశిఖలపై మిడతలు దూకిన విధంగా వేగంగా వరుణునిపైకి లంఘించారు.

తానాగతాన్వై ప్రసమీక్ష్య దేవః ప్రహ్లాదిముత్సృజ్య వితత్య పాశమ్ ।
గదాం సముద్భ్రామ్య జలేశ్వరస్తు దుద్రావ తాఞ్జంభముఖానరాతీన్ ॥39॥

వారి రాక గమనించిన వరుణుడు విరోచనుని వదలిపెట్టి, తన పాశాన్ని పెంచి, గదాదండాన్ని త్రిప్పుతూ, జంభాదిరాక్షసనాయకులపై విరుచుకుపడ్డాడు.

జంభం చ పాశేన తథా విహత్య తారం తలేనాశనిసంనిభేన ।
పాదేన వృత్రం తరసా కుజంభం నిపాతయామాస బలం చ ముష్ట్యా ॥40॥

జంభుణ్ణి పాశంతో సంహరించాడు. తారదైత్యుని వజ్రతుల్యమైన కరతలప్రహారంతోను, వృత్రాసురుని, కుజంభుని పాదాలతోను, బలుని తనముష్టిఘాతంతోను సంహరించాడు.

తేనార్దితా దేవవరేణ దైత్యాః సంప్రాద్రవన్దిక్షు విముక్తశస్త్రాః ।
తతోఽన్ధకః సుత్వరితోఽభ్యుపేయాద్రణాయ యోద్ధుం జలనాయకేన ॥41॥

ఆ విధంగా దేవశ్రేష్ఠుడైన వరుణునిచే చావుదెబ్బలు తిని, రాక్షసులందరు తమతమ ఆయుధాలను వదలి,

తలకొక దిక్కునకు పారిపాయారు. అంతట అంధకుడు జలాధిపతితో యుద్ధం చేయడానికి వేగంగా పరుగు పరుగున వచ్చాడు.

తమాపతన్తం గదయా జఘాన పాశేన బద్ధ్వా వరుణోఽసురేశమ్ ।
తం పాశమావిద్ధ్య గదాం ప్రగృహ్య చిక్షేప దైత్యః స జలేశ్వరాయ ॥42॥

తన మీద లంఘించిన దైత్యనాథుని వరుణుడు పాశంతో బంధించి, గదతో చావగొట్టాడు. అంతట దైత్యుడు పాశాన్ని త్రెంచుకొని గదను వరుణునిపై ప్రయోగించాడు.

తమాపతన్తం ప్రసమీక్ష్య పాశం గదాం చ దాక్షాయణినందనస్తు ।
వివేశ వేగాత్పయసాం నిధానం తతోఽన్ధకో దేవబలం మమర్ద ॥43॥

దాక్షాయణి పుత్రుడైన వరుణుడు తనవైపు వస్తున్న పాశాన్ని, గదను చూసి, వేగంగా సముద్రంలో మునిగి దాక్కున్నాడు. మిగిలిన దేవసైన్యాన్ని అంధకుడు మర్దించసాగాడు.

తతో హుతాశః సురశత్రుసైన్యం దదాహ రోషాత్ పవనావధూతః ।
తమభ్యయాద్దానవవిశ్వకర్మా మయో మహాబాహురుదగ్రవీర్యః ॥44॥

అంతట అగ్ని వాయువుతో గూడి వచ్చి, దైత్యసేనలను దహింపసాగాడు. అంతట దానవుల విశ్వకర్మయు, మహాబలపరాక్రమసంపన్నుడునైన మయుడు వారితో తలబడ్డాడు.

తమాపతన్తం సహ శంబరేణ సమీక్ష్య వహ్నిః పవనేన సార్ధమ్ ।
శక్త్యా మయం శంబరమేత్య కంఠే సంతాడ్య జగ్రాహ బలాన్మహర్షే ॥45॥

ఓ మహర్షీ! శంబరునితో గూడి తమపై దాడిచేయనున్న మయుని చూసి అగ్ని వాయువుతో కలసి శక్తితో వారి కంఠాలను నరికి గట్టిగా పట్టుకున్నాడు.

శక్త్యా సకాయావరణే విదారితే స భిన్నదేహో న్యపతత్పృథివ్యామ్ ।
మయః ప్రజజ్వాల చ శంబరోఽపకంఠావలగ్నే జ్వలనే ప్రదీప్తే ॥46॥

శక్తిఘాతానికి వాళ్ళ దేహాలు చీలిపోయాయి. ఆ విధంగా భిన్నదేహులైన వారిరువురు నేలపై పడ్డారు. వారి కంఠాలు అగ్ని పట్టుకోవడం చేత మయ శంబరుల దేహాలు జ్వాలలలో మాడిపోయాయి.

సదహ్యమానో దితిజోఽగ్నినాథ సువిస్వరం ఘోరతరం రురావ ।
సింహాభిపన్నో విపినే యథైవ మత్తో గజః క్రందతి వేదనార్తః ॥47॥

ఆ విధంగా తగలబడుచున్న దైత్యులిద్దరు అరణ్యాలలో సింహం చేత చిక్కిన మదపుటేనుగుల వలె వేదనతో ఆర్తనాదాలు చేశారు.

తం శబ్దమాకర్ణ్య చ శంబరస్య దైత్యేశ్వరః క్రోధవిరక్తదృష్టిః ।
ఆః కిం కిమేతన్నను కేన యుద్ధే జితోమయః శంబరదానవశ్చ ॥48॥

ఆ శబ్దం విని దైత్యేశ్వరుడైన అంధకుడు కోపంతో మండిపడుతూ, “ఏమిది? మయశంబరులను యుద్ధంలో జయించినవాడు ఎవ్వడు? వాడెక్కడ?” అని అరిచాడు.

తతోఽబ్రువన్ దైత్యభటా దితీశం ప్రదహ్యతే హ్యేష హుతాశనేన ।
రక్షస్వ చాభ్యేత్య న శక్యతేఽన్యైః హుతాశనో వారయితుం రణాగ్రే ॥49॥

అంతట రాక్షసభటులు “ప్రభూ! అగ్నిదేవుడు వీరిని దహించివేస్తున్నాడు. మీరు వచ్చి వీరిని రక్షించండి. మీరు తక్క అగ్నినుండి వీరిని రక్షించగలిగిన మరొక్కడు లేడు”.

ఇత్థం చ దైత్యైరభినోదితస్తు హిరణ్యచక్షుస్తనయో మహర్షే ।
ఉద్యమ్య వేగాత్పరిఘం హుతాశం సమాద్రవత్తిష్ఠ తిష్ఠ బ్రువన్ హి ॥50॥

ఓ మహర్షీ! రాక్షసులిట్లు చెప్పగానే హిరణ్యాక్ష పుత్రుడైన అంధకుడు వేగంగా పరిఘ(ఇనుప గుదియ) పట్టుకొని “అగ్నీ! నిలువుము నిలువుము” అంటూ వెంబడించాడు.

శ్రుత్వాంధకస్యాపి వచోఽవ్యయాత్మా సంక్రుద్ధచిత్తస్త్వరితో హి దైత్యమ్ ।
ఉత్పాట్య భూమ్యాం చ వినిష్పిపేష తతోఽంధకః పావకమాససాద ॥51॥

సమాజఘానాథ హుతాశనం హి వరాయుధేనాథ వరాఙ్గమధ్యే ।
సమాహతోఽగ్నిః పరిముచ్య శంబరం తథాఽంధకం స త్వరితోఽభ్యధావత్ ॥52॥

అంధకుని కేకలు వినగానే అవ్యయాత్ముడైన అగ్నిదేవుడత్యంతక్రుద్ధుడై ఆ రాక్షసుని వేగంగా లేవదీసి, నేలపై పడవేశాడు. అంతట అంధకుడు అగ్నిని సమీపించాడు. శ్రేష్ఠమైన శస్త్రాలను అంధకుడు హుతాశనునిపై ప్రయోగించాడు. దానితో నెత్తిపై బలమైన దెబ్బ తగలడంతో అగ్ని శంబరుణ్ని వదిలిపెట్టి, అంధకుని మీదకు దూకాడు.

తమాపతన్తం పరిఘేణ భూయః సమాహనన్మూర్ధ్ని తదాఽంధకోఽపి ।
స తాడితోఽగ్నిర్దితిజేశ్వరేణ భయాత్ప్రదుద్రావ రణాజిరాద్ధి ॥53॥

తనపై యుద్ధానికి వస్తున్న అగ్నిదేవుని శిరస్సుపై అంధకుడు మరల పరిఘతో గట్టిగా కొట్టాడు. అంధకుని ద్వారా తాడితుడైన అగ్నిదేవుడు భయంతో యుద్ధభూమి వదలి పారిపోయాడు.

తతోఽన్ధకో మారుత చంద్రభాస్కరాన్ సాధ్యాన్ సరుద్రాశ్వివసూన్ మహోరగాన్ ।
యాన్యాన్ శరేణ స్పృశతే పరాక్రమీ పరాఙ్ముఖాంస్తాన్కృతవాన్రణాజిరాత్ ॥54॥

అనంతరం అంధకుడు వాయు, చంద్ర, సూర్య, సాధ్య, రుద్ర, అశ్వినీకుమార, వసు, మహోరగాదులను ఆయుధాలు పట్టి నిలబడిన ప్రతివారినీ శరప్రహారం చేసి, యుద్ధభూమి వదలి పారిపోయేటట్లు చేశాడు.

తతో విజిత్యామరసైన్యముగ్రం సేంద్రం సరుద్రం సయమం ససోమమ్ ।
సంపూజ్యమానో దనుపుంగవైస్తు తదాఽంధకో భూమిముపాజగామ ॥55॥

ఈ విధంగా ఇంద్ర, రుద్ర, యమ, సోమాదులతో కూడిన దేవతలను, దేవసైన్యాన్ని జయించి, దానవశ్రేష్ఠుల పూజలందుకుని అంధకుడు భూలోకానికి చేరుకున్నాడు.

ఆసాద్య భూమిం కరదాన్నరేంద్రాన్ కృత్వా వశే స్థాప్య చరాచరం చ ।
జగత్సమస్తం ప్రవివేశ ధీమాన్ పాతాళమగ్ర్యం పురమశ్మకాహ్వమ్ ॥56॥


భూలోకంలోని రాజులందరిని లోబరచుకొని వారినుండి పన్నులు వసూలుచేస్తూ, చరాచరజగత్తునంతటిని తన వశం గావించుకొని, ధీమంతుడైన అంధకుడు పాతాళానికి పోయి, 'అశ్మక' మనే నగరాన్ని చేరుకున్నాడు.

తత్ర స్థితస్యాపి మహాసురస్య గంధర్వవిద్యాధరసిద్ధసంఘాః ।
సహాప్సరోభిః పరిచారణాయ పాతాళమభ్యేత్య సమావసన్ స్మ ॥57॥

ఆ మహాదానవుడు అక్కడ ఉండగా గంధర్వ, విద్యాధర, సిద్ధ సంఘాలు అప్సరసలతో కూడి అతనికి సేవలు చేయడానికి పాతాళానికి వెళ్లి అక్కడ నివసించారు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే అంధకవిజయో నామ దశమోఽధ్యాయః ॥10॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి అంధకుని విజయమనే పదవ అధ్యాయం సమాప్తం.



ఏకాదశోఽధ్యాయః – పదకొండవ అధ్యాయం
పుష్కరద్వీపవర్ణనమ్ – పుష్కరద్వీపవర్ణన

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

యదేతద్భవతా ప్రోక్తం సుకేశిపురమంబరాత్ ।
పాతితం భువి సూర్యేణ తదాచక్ష్వ ద్విజోత్తమ ॥1॥

సుకేశీతి చ కశ్చాసౌ కేనదత్తవరశ్చ సః ।
కిమర్థం పాతితో భూమ్యామాకాశాద్భాస్కరేణ హి ॥2॥

ద్విజోత్తమా! సుకేశిపురాన్ని సూర్యుడు ఆకాశంనుండి భూమికి త్రోసివేసినందున సుకేశిపురం భూమిపై పడిందని పూర్వం మీరు చెప్పియున్నారు. ఆ సంఘటన గురించి నాకు తెలియజెప్పండి. సుకేశి ఎవరు? వానికి ఆ నగరం ఎవరిచే ఇవ్వబడింది? ఆ నగరం సూర్యునివలన ఆకాశంనుండి భూమిపై ఎందుకు పడింది?.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రుణుష్వావహితో భూత్వా కథామేతాం పురాతనీమ్ ।
యథా శ్రుతాం మయా పూర్వం కథ్యమానాం మహామునే ॥3॥

ఓ మహామునీ! ఇది చాలా పురాతనమైన గాథ. పూర్వకాలంలో బ్రహ్మ నాకు వినిపించినవిధంగా ఈ వృత్తాంతమంతా నీకు చెబుతున్నాను. శ్రద్ధగా వినుము.

ఆసీన్నిశాచరపతిర్విద్యుత్కేశీతి విశ్రుతః ।
తస్య పుత్రో గుణజ్యేష్ఠః సుకేశిరభవన్మునే ॥4॥

తస్య తుష్టస్తథేశానః పురమాకాశచారి యత్ ।
ప్రాదాదజేయత్వమపి శత్రుభిశ్చాప్యవధ్యతామ్ ॥5॥

ఓ నారదా! ఒకానొకప్పుడు విద్యుత్కేశి అని ప్రఖ్యాతి చెందిన రాక్షసరాజు ఉండేవాడు. సద్గుణవంతుడైన 'సుకేశి' అనువాడు ఆ రాక్షసరాజకుమారుడు. అతని వల్ల సంతుష్టుడైన ఈశానుడు ఆకాశగమనం కలిగిన ఒక నగరాన్ని, అజేయత్వాన్ని, శత్రువులచేత అవధ్యత్వాన్ని వరాలుగా ప్రసాదించాడు.

స చాపి శంకరాత్ప్రాప్య వరం గగనగం పురమ్ ।
రేమే నిశాచరైః సార్ధం సదా ధర్మపథే స్థితః ॥6॥

స కదాచిద్గతోఽరణ్యం మాగధం దానవేశ్వరః ।
తత్రాశ్రమాంస్తు దదృశే ఋషీణాం భావితాత్మనామ్ ॥7॥

మహర్షీన్స తదా దృష్ట్వా ప్రణిపత్యాభివాద్య చ ।
ప్రత్యువాచ ఋషీన్సర్వాన్కృతాసనపరిగ్రహః ॥8॥

ఈ విధంగా ఆకాశనగరాన్ని శంకరునినుండి పొంది, సుకేశి అనే రాక్షసుడు తన నిశాచరులతోకలసి ధర్మమార్గంలో ప్రయాణం చేస్తూ సుఖంగా కాలం గడుపుతున్నాడు. ఆ రాక్షసరాజు ఒకానొకప్పుడు మగధదేశంలో అరణ్యానికి వెళ్లి, అచ్చటి మహర్షుల ఆశ్రమాలను దర్శించాడు. అప్పుడచ్చట మహర్షులను చూసి, వారికి పాదాభివందనం చేసి, వారిచే ఈయబడిన ఉచితాసనాన్ని స్వీకరించి, వారితో రాక్షసరాజు ఇలా పలికాడు.

సుకేశిరువాచ – సుకేశి పలికాడు.

ప్రష్టుమిచ్ఛామి భవతః సంశయోఽయం హృది స్థితః ।
కథయంతు భవంతో మే న చైవం జ్ఞాపయామ్యహమ్ ॥9॥

కింస్విచ్ఛ్రేయః పరే లోకే కిము చేహ ద్విజోత్తమాః ।
కేన పూజ్యస్తథా సత్సు కేనాసౌ సుఖమేధతే ॥10॥

మహనీయులారా! నా మనస్సులో ఒక సందేహం కలిగింది. దయతో దానిని తొలగించండి. ఇది మీకు నా ఆజ్ఞ కాదు. విన్నపం మాత్రమే. బ్రాహ్మణోత్తములారా! ఈ లోకంలోను, పరలోకంలోను, శ్రేయస్సు కలిగించే దేమిటి? దేనివల్ల సజ్జనులలో గౌరవం లభిస్తుంది. మానవుడు దేనివల్ల సుఖంగా ఉండగలుగుతాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్థం సుకేశివచనం నిశమ్య పరమర్షయః ।
ప్రోచుర్విమృశ్య శ్రేయోఽర్థమిహలోకే పరత్ర చ ॥11॥

ఈ విధంగా పలికిన సుకేశి వచనాలు విని మహర్షులు చక్కగా వితర్కించుకుని ఇహపరలోకాలలో శ్రేయోదాయకమైన ఉపాయాన్ని వివరించారు.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

శ్రూయతాం కథయిష్యామస్తవ రాక్షసపుంగవ ।
యద్ధి శ్రేయో భవేద్వీర ఇహ చాముత్ర చావ్యయమ్ ॥12॥

ఓ రాక్షసపుంగవా! వీరుడా! ఇహపరలోకాలలో శ్రేయోదాయకమైన విషయమేదో చెబుతాం. శ్రద్ధగా వినుము.

శ్రేయో ధర్మః పరే లోకే ఇహ చ క్షణదాచర ।
తస్మిన్సమాశ్రితే సత్సు పూజ్యస్తేన సుఖీ భవేత్ ॥13॥

ఓ నిశాచరా! ధర్మాచరణమొక్కటియే ఇహపరలోకాలలో సుఖాన్ని కలిగిస్తుంది. దానిని అనుష్ఠించినవాడు మాత్రమే సజ్జనులలో పూజ్యుడై, సుఖాన్ని పొందగలుగుతాడు.

సుకేశి రువాచ – సుకేశి పలికాడు.

కిం లక్షణో భవేద్ధర్మః కిమాచరణసత్క్రియః ।
యమాశ్రిత్య న సీదంతి దేవాద్యాస్తు తదుచ్యతామ్ ॥14॥

ధర్మం యొక్క లక్షణమేమిటి? దాని ఆచరణ పద్ధతి ఏది? దేనిని ఆశ్రయించడంవల్ల దేవాదులు ఎప్పుడు దుఃఖాన్ని పొందరో అట్టిదానిని గూర్చి వివరించండి.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

దేవానాం పరమో ధర్మః సదా యజ్ఞాదికాః క్రియాః ।
స్వాధ్యాయతత్త్వవేదిత్వం విష్ణుపూజా ఇతిశ్రుతిః ॥15॥

సదా యజ్ఞాదిక్రియలు చేయడం, వేదాధ్యయనం, వేదార్థజ్ఞానసంపాదన, విష్ణుపూజ, దేవతలు అనుష్ఠించవలసిన పరమధర్మములని శ్రుతి చెప్పింది.

దైత్యానాం బాహుశాలిత్వం మాత్సర్యం యుద్ధసత్క్రియాః ।
వేదనం నీతిశాస్త్రాణాం హరభక్తిరుదాహృతా ॥16॥

బాహుబలం, మాత్సర్యబుద్ధి, యుద్ధం, నీతిశాస్త్రజ్ఞానం, హరభక్తి అనేవి దైత్యుల ధర్మాలు.

సిద్ధానాముదితో ధర్మో యోగసిద్ధిరనుత్తమా ।
స్వాధ్యాయో బ్రహ్మవిజ్ఞానం భక్తిర్విష్ణో హరే తథా ॥17॥

యోగసిద్ధి, వేదాధ్యయనం, బ్రహ్మవిజ్ఞానప్రాప్తి, శివకేశవులయందు అచంచలమైన భక్తి, ఇవియే సిద్ధులు ఆచరించవలసిన ధర్మకార్యాలుగా చెప్పబడ్డాయి.

ఉత్కృష్టోపాసనం జ్ఞేయం నృత్యవాద్యేషు వేదితా ।
సరస్వత్యాం స్థిరాభక్తిర్గంధర్వో ధర్మముచ్యతే ॥18॥

ఉత్కృష్టమైన ఉపాసన, నృత్యవాద్యాదులయందు పరిజ్ఞానం, సరస్వతీదేవియందు స్థిరమైన భక్తి, గంధర్వులనుసరించవలసిన ధర్మముగా చెప్పబడుతోంది.

విద్యాధరిత్వమతులం విజ్ఞానం పౌరుషే మతిః ।
విద్యాధరాణాం ధర్మోఽయం భవాన్యాం భక్తిరేవ చ ॥19॥

అసమానవిద్యాసముపార్జన, లోకవిజ్ఞానం, పౌరుషం, భవానియందు భక్తి మున్నగునవి విద్యాధరుల ధర్మాలు.

గాంధర్వవిద్యావేదిత్వం భక్తిర్భానౌ తథా స్థిరా ।
కౌశల్యం సర్వశిల్పానాం ధర్మః కిమ్పురుషః స్మృతః ॥20॥

సంగీతవిద్యానైపుణ్యం, సూర్యునియందు భక్తి, సర్వశిల్ప ప్రావీణ్యం, కింపురుషధర్మాలు.

బ్రహ్మచర్యమమానిత్వం యోగాభ్యాసరతిర్ధృఢా ।
సర్వత్ర కామచారిత్వం ధర్మోఽయం పైతృకః స్మృతః ॥21॥

బ్రహ్మచర్యం, అమానిత్వం, యోగాభ్యాసమునందు దృఢమైన ఆసక్తి, కామచారిత్వం పితృదేవతల ధర్మాలుగా తలచారు.

బ్రహ్మచర్యం సదా సత్యం జప్యం జ్ఞానం చ రాక్షస ।
నియమో ధర్మవేదిత్వమార్షో ధర్మః ప్రచక్షతే ॥22॥

ఓ రాక్షసరాజా! బ్రహ్మచర్యం, సత్యనిష్ఠ, ఎల్లప్పుడు జపమాచరించుట, జ్ఞానసాధన, నియమాచరణం, ధర్మస్వరూపవిజ్ఞానం ఋషుల ధర్మాలుగా చెప్పబడుతున్నాయి.

స్వాధ్యాయో బ్రహ్మచర్యం చ దానం యజనమేవ చ ।
అకార్పణ్యమనాయాసో దయాఽహింసా క్షమాదయః ॥23॥

జితేంద్రియత్వం శౌచం చ మాంగల్యం భక్తిరచ్యుతే ।
శంకరే భాస్కరే దేవ్యాం ధర్మోఽయం మానవః స్మృతః ॥24॥

వేదాధ్యయనము, బ్రహ్మచర్యము, దానము, యజనము, ఔదార్యము, సరళస్వభావము, దయ, అహింస, క్షమాదులు, జితేంద్రియత్వం, శౌచం, మాంగల్యం, అదే విధంగా విష్ణువునందు, శివునియందు, భాస్కరునియందు, దుర్గాదేవియందు భక్తి కలిగియుండుటయు మానవుల ధర్మాలుగా భావింపబడుతున్నాయి.

ధనాధిపత్యం భోగాశ్చ స్వాధ్యాయః శంకరార్చనమ్ ।
అహంకారమశౌండీర్యం ధర్మోఽయం గుహ్యకేష్వితి ॥25॥

ధనాధిపత్యం, భోగాలు, స్వాధ్యాయం, శంకరార్చన, అహంకారం, ఔద్ధత్యం, యక్షుల ధర్మాలు.

పరదారావమర్శిత్వం పారక్యేఽర్థే చ లోలుపాః ।
స్వాధ్యాయస్త్ర్యంబకే భక్తిర్ధర్మోఽయం రాక్షసః స్మృతః ॥26॥

పరదారాగమనం, పరధనమందు లోలుపత్వం, వేదాధ్యయనం, శివభక్తి, మున్నగునవి రాక్షసధర్మాలు.

అవివేకస్తథాఽజ్ఞానం శౌచహానిరసత్యతా ।
పిశాచానామయం ధర్మః సదా చామిషగృధ్నుతా ॥27॥

అవివేకం, అజ్ఞానం, అశౌచం, అసత్యం, సదా మాంసభోజనం పిశాచధర్మాలు.

యోనయో ద్వాదశైవైతాస్తాసు ధర్మాశ్చ రాక్షస ।
బ్రహ్మణా కథితాః పుణ్యా ద్వాదశైవ గతిప్రదాః ॥28॥

ఓ రాక్షసరాజా! పన్నెండు యోనులవారికి బ్రహ్మచే నిర్దేశింపబడిన లక్షణాలు ఇవియే. వారి వారి ధర్మాలే వారి వారికి సద్గతిప్రదాలు.

సుకేశి రువాచ – సుకేశి పలికాడు.

భవద్భిరుక్తా యే ధర్మాః శాశ్వతా ద్వాదశావ్యయాః ।
తత్ర యే మానవా ధర్మాస్తాన్భూయో వక్తుమర్హథ ॥29॥

ఓ మహర్షులారా! ద్వాదశయోనులవారు ఆచరించవలసిన శాశ్వతధర్మాలను వివరించి చెప్పారు. అందులో మానవులాచరించవలసిన ధర్మాలను మరొకమారు దయతో నాకు వివరించండి.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

శ్రుణుష్వ మనుజాదీనాం ధర్మాస్తు క్షణదాచర ।
యే వసంతి మహీపృష్ఠే నరా ద్వీపేషు సప్తసు ॥30॥

యోజనానాం ప్రమాణేన పంచాశత్కోటిరాయతా ।
జలోపరి మహీయం హి నౌరివాస్తే సరిజ్జలే ।
తస్యోపరి చ దేవేశో బ్రహ్మా శైలేంద్రముత్తమమ్ ॥31॥

కర్ణికాకారమత్యుచ్చం స్థాపయామాస సత్తమః ।
స చేమాం నిర్మమే పుణ్యాం ప్రజాం దేవశ్చతుర్దిశమ్ ॥32॥

ఓ నిశాచరా! మహీతలంలోని సప్తద్వీపాలలో నివసించే మనుష్యాది జీవుల ధర్మాలు చెబుతున్నాము. వినుము. యేబదికోట్లయోజనవిస్తీర్ణం కలిగిన సముద్రజలాలపై ఓడ వలె ఈ ధరామండలం నిలిచియుంది. దానిమీద దేవేశుడైన బ్రహ్మ కమలదళాల మధ్య కర్ణిక వలె ఒక ఎత్తైన పర్వతం నిర్మించాడు. దానికి నలుదిశల ఈ పవిత్రమానవాళిని ప్రజాపతి సృష్టించాడు.

స్థానాని ద్వీపసంజ్ఞాని కృతవాంశ్చ ప్రజాపతిః ।
తత్ర మధ్యే చ కృతవాన్ జంబూద్వీపమితి శ్రుతమ్ ॥33॥

తల్లక్షం యోజనానాం చ ప్రమాణేన నిగద్యతే ।
తతో జలనిధిః క్షారో బాహ్యతో ద్విగుణః స్థితః ॥34॥

తస్యాపి ద్విగుణః ప్లక్షో బాహ్యతః సంప్రతిష్ఠితః ।
తతస్త్విక్షురసోదశ్చ బాహ్యతో వలయాకృతిః ॥35॥

ద్వీపాలని పిలువబడే స్థానాలను బ్రహ్మ కల్పించాడు. ఆ ద్వీపాల మధ్య గల ద్వీపాన్ని జంబూద్వీపమంటారు. ఆ జంబూద్వీపం లక్షయోజనాల ప్రమాణం కలది. దానికి రెండింతల విస్తీర్ణం గల క్షారసముద్రంచే ఆ ద్వీపం పరివేష్టితమై యున్నది. దానికి వెలుపల రెండింతల విస్తీర్ణం గల ప్లక్షద్వీపం నిర్మింపబడింది. వలయాకారంలో దానికి ఇక్షురససముద్రం వ్యాపించింది.

ద్విగుణః శాల్మలిద్వీపో ద్విగుణోఽస్య మహోదధిః ।
సురోదో ద్విగుణస్తస్య తస్మాచ్చ ద్విగుణః కుశః ॥36॥

ఘృతోదో ద్విగుణశ్చైవ కుశద్వీపాత్ప్రకీర్తితః ।
ఘృతోదాద్ ద్విగుణః క్రౌంచో దధ్యోదో ద్విగుణస్తతః ॥37॥

సముద్రాద్ద్విగుణః శాకః శాకాద్దుగ్ధాబ్ధిరుత్తమః ।
ద్విగుణః సంస్థితో యత్ర శేషపర్యంకగో హరిః ॥38॥

తస్మాచ్చ పుష్కరద్వీపః స్వాదూదస్తదనంతరమ్ ।
ఏతే చ ద్విగుణాః సర్వే పరస్పరమవస్థితాః ॥39॥

దానికి ద్విగుణప్రమాణంలో శాల్మలిద్వీపం, దానికి రెండింతలుగా దాని చుట్టూ సురాసముద్రం వ్యాపించి యున్నాయి. దానికి రెండింతలు గల కుశద్వీపం, దానికి రెండింతలు ప్రమాణం గల ఘృతసముద్రం (నెయ్యి సముద్రం) దాని చుట్టూ ఆవరించియుంది. ఘృతసముద్రం చుట్టూ రెండింతలు ప్రమాణంలో క్రౌంచద్వీపం, దానికి రెండింతలు ప్రమాణంగల దధిసముద్రం (పెరుగుసముద్రం) ఆవరించి యున్నాయి. దధిసముద్రానికి రెండింతల ప్రమాణం గల శాకద్వీపం ఆవరించి యుండగా దానిచుట్టూ రెండింతల ప్రమాణంగల ఉత్తమమైన క్షీరసముద్రం వ్యాపించియుంది. దానిపై శేషపర్యంకం మీద శ్రీహరి శయనించియుంటాడు. దానికి పైన పుష్కరద్వీపం, దానిపైన స్వాదూదకసముద్రం విస్తరించియున్నాయి. ఒకదానికొకటి రెండురెట్ల విస్తీర్ణంతో ఇవి అన్నియు వ్యాపించి యున్నాయి.

చత్వారింశదిమాః కోట్యో లక్షాశ్చ నవతిః స్మృతాః ।
యోజనానాం రాక్షసేంద్ర పంచ చాతిసువిస్తృతాః ॥
జంబూద్వీపాత్సమారభ్య యావత్ క్షీరాబ్ధిరన్తతః ॥40॥

ఓ రాక్షసేంద్రా! జంబూద్వీపం మొదలు క్షీరసముద్రం వరకు విస్తరించియున్న వీటన్నిటి విస్తీర్ణం నలభై కోట్ల తొంబదియైదు లక్షల యోజనాలు.

తస్మాచ్చ పుష్కరద్వీపః స్వాదూదస్తదనంతరమ్ ।
కోట్యశ్చతస్రో లక్షాణాం ద్విపంచాశచ్చ రాక్షస ॥41॥

పుష్కరద్వీపమానోఽయం తావానంతే మహోదధిః ।
లక్షమండకటాహేన సమంతాదభిపూరితమ్ ॥42॥

ఏవం ద్వీపాస్త్విమే సప్త పృథగ్ధర్మాః పృథక్ క్రియాః ।
గదిష్యామస్తవ వయం శృణుష్వ త్వం నిశాచర ॥43॥

ఓ రాక్షసరాజా! దాని తరువాత పుష్కరద్వీపం, దానిని చుట్టి మంచినీటి సముద్రం ఇవి రెండు ఒక్కొక్కటి నాలుగుకోట్లయాబదిరెండులక్షలయోజనాల విస్తీర్ణంతో వ్యాపించియున్నాయి. వీటన్నింటికి ఆవల అన్నివైపులా

లక్షయోజనాల అండాకారంలో కటాహం(పెంకు)తో బ్రహ్మాండమంతా ఆవరించియుంది. ఈ విధంగా ఏర్పడిన సప్తద్వీపాలకు వేర్వేరుగా ధర్మాలు నిర్దేశింపబడ్డాయి. ఓ నిశాచరా! వాటినన్నింటిని మేము చెబుతాము. శ్రద్ధగా వినుము.

ప్లక్షాదిషు నరా వీర యే వసంతి సనాతనాః ।
శాకాంతేషు న తేష్వస్తి యుగావస్థా కథంచన ॥44॥

మోదంతే దేవవత్తేషాం ధర్మో దివ్య ఉదాహృతః ।
కల్పాంతే ప్రళయస్తేషాం నిగద్యేత మహాభుజ ॥45॥

ఓ మహావీరా! ప్లక్షద్వీపం మొదలు శాకద్వీపం వరకు గల ద్వీపాలలో నివసించే నరులకు మొదటినుండి ఎప్పుడూ కూడా యుగావస్థలు లేవు. వారెల్లప్పుడు దేవతల వలె దివ్యసుఖాలనుభవిస్తూ ఉంటారు. వారికి కల్పాంతమందే ప్రళయం సంభవిస్తుంది.

యే జనాః పుష్కరద్వీపే వసంతే రౌద్రదర్శనే ।
పైశాచమాశ్రితా ధర్మం కర్మాంతే తే వినాశినః ॥46॥

భయంకరాకారులైన పుష్కరద్వీపవాసులు పిశాచధర్మావలంబులై తమకర్మ క్షయం కాగానే వారు నశిస్తారు.

సుకేశి రువాచ – సుకేశి పలికాడు.

కిమర్థం పుష్కరద్వీపో భవద్భిః సముదాహృతః ।
దుర్దర్శః శౌచరహితో ఘోరః కర్మార్థనాశకృత్ ॥47॥

పుష్కరద్వీపం భయంకరంగా ఉండడానికి అందలివారు అశౌచులుగా ఉండడానికి వారు పిశాచధర్మంతో క్రూరులుగా ఉండడానికి వారు కర్మాంతనాశనులుగా ఉండడానికి కారణమేమిటి?

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

తస్మిన్నిశాచరద్వీపే నరకాః సంతి దారుణాః ।
రౌరవాద్యాస్తతో రౌద్రః పుష్కరో ఘోరదర్శనః ॥48॥

రాక్షసా! ఆ ద్వీపంలో రౌరవాది దారుణమైన నరకాలున్నాయి. అందుచేత పుష్కరద్వీపం చూసేవారికి భయంకరంగా ఉంటుంది.

సుకేశి రువాచ – సుకేశి పలికాడు.

కియన్త్యేతాని రౌద్రాణి నరకాణి తపోధనాః ।
కియన్మాత్రాణి మార్గేణ కా చ తేషు స్వరూపతా ॥49॥

తపోధనులారా! భయంకరమైన ఈ నరకాలెన్ని? వాటి స్వరూపస్వభావాలేమిటి? వివరించండి.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

శ్రుణుష్వ రాక్షసశ్రేష్ఠ ప్రమాణం లక్షణం తథా ।
సర్వేషాం రౌరవాదీనాం సంఖ్యా యా త్వేకవింశతిః ॥50॥

ఓ రాక్షసశ్రేష్ఠా! సమస్తనరకాల లక్షణాలు, ప్రమాణాలు వినుము. మొత్తం రౌరవాది నరకాల సంఖ్య ఇరువది ఒకటి

ద్వే సహస్రే యోజనానాం జ్వలితాంగారవిస్తృతః ।
రౌరవో నామ నరకః ప్రథమః పరికీర్తితః ॥51॥

తప్తతామ్రమయీ భూమిరధస్తాద్వహ్నితాపితా ।
ద్వితీయో ద్విగుణస్తస్మాన్మహారౌరవ ఉచ్యతే ॥52॥

తతోఽపి విస్తృతశ్చాన్యస్తామిస్రో నరకః స్మృతః ।
అంధతామిస్రకో నామ చతుర్థో ద్విగుణః పరః ॥53॥

తతస్తు కాలసూత్రేతి పంచమః పరిగీయతే ।
అప్రతిష్ఠం తథా షష్ఠం ఘటీయంత్రం చ సప్తమమ్ ॥54॥

అసిపత్రవనం చాన్యత్సహస్రాణి ద్విసప్తతిః ।
యోజనానాం పరిఖ్యాతమష్టమం నరకోత్తమమ్ ॥55॥

నవమం తప్తకుంభం చ దశమం కూటశాల్మలిః ।
కరపత్రస్తథైవోక్తస్తథాన్యః శ్వానభోజనః ॥56॥

సందంశో లోహపిండశ్చ కరంభసికతా తథా ।
ఘోరా క్షారనదీచాన్యా తథాన్యా కృమిభోజనా ।
తథాష్టాదశమీ ప్రోక్తా ఘోరా వైతరణీ నదీ ॥57॥

తథాఽపరః శోణితపూయభోజనః క్షురాగ్రధారో నిశితశ్చ చక్రకః ।
సంశోషణో నామ తథాపి చాన్తే ప్రోక్తాస్తవైతే నరకాః సుకేశిన్ ॥58॥

వాటిలో మొట్టమొదటిది రౌరవనరకం. ఇది రెండువేలయోజనాల విస్తీర్ణం కలిగి కణకణ మండే నిప్పుకణికలతో నిండియుంటుంది. దానికి రెండింతల ప్రమాణం కలది మహారౌరవనరకం. ఇది రెండవ నరకం. ఇది దిగువనుంచి అగ్నితత్త్వమైన, రాగిరేకుల మయమైన భూమితో నిండియుంటుంది. దీనికి రెండింతల విస్తృతిగల తామిస్ర నామకనరకం మూడవది. దానికి రెండింతల విస్తృతిగల అంధతామిస్రనరకం నాల్గవది. దానితరువాతి ఐదవనరకం కాలసూత్రనరకం. ఆరవది అప్రతిష్ఠనరకం. ఘటీయంత్రమనేనరకం ఏడవది. 'అసిపత్రవననరకం'

ఎనిమిదవది. దీని విస్తీర్ణం 72 యోజనాలు. తొమ్మిదవది 'తప్తకుంభం'. పదియవది 'కూటశాల్మలి'. అట్లే కరపత్రం, శ్వానభోజనం, సందంశం, లోహపిండం, కరంభసికతం, ఘోరమైన క్షారనది, కృమిభోజనం, మున్నగు నరకాలు వరుసగా ఉంటాయి. పదునెనిమిదవది, భయంకరమైన 'వైతరణీ నది'. ఇవి గాక మిగిలిన నరకాలు 'శోణితపూయభోజనం', 'క్షురాగ్రధార', నిశితమైన 'చక్రకం'. అట్లే 'సంశోషణ'మనే అనంతనరకం. ఓ సుకేశీ! ఈ విధంగా నీకు నరకాలను గురించి తెలియజేశాము.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే పుష్కరద్వీపవర్ణనం నామైకాదశోఽధ్యాయః ॥11॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి పుష్కరద్వీపవర్ణనమనే పదకొండవ అధ్యాయం సమాప్తం.



ద్వాదశోఽధ్యాయః - పన్నెండవ అధ్యాయం
కర్మవిపాకః - కర్మవిపాకం

సుకేశి రువాచ - సుకేశి పలికాడు.

> **కర్మణా నరకానేతాన్కేన గచ్ఛంతి వై కథమ్ ।**
> **ఏతద్వదంతు విప్రేంద్రాః పరం కౌతూహలం మమ ॥1॥**

ఓ విప్రశ్రేష్ఠులారా! ఏ ఏ కర్మలు చేస్తే ఈ నరకాలు సంభవిస్తాయి? ఈ వృత్తాంతమంతయు వినాలని కుతూహలంగా వుంది. కాబట్టి మాకు చెప్పండి.

ఋషయ ఊచుః - ఋషులు పలికారు.

> **కర్మణా యేన యేనేహ యాంతి శాలకటంకట ।**
> **స్వకర్మఫలభోగార్థం నరకాన్మే శ్రుణుష్వ తాన్ ॥2॥**

ఓ సుకేశీ! ఏ ఏ దుష్టకర్మలు చేస్తే తమ కర్మఫలాలు అనుభవించడానికి ఈ నరకాలు కలుగుతాయో వివరంగా చెబుతాను. విను.

> **దేవ వేద ద్విజాతీనాం యైర్నిందా సతతం కృతా ।**
> **యే పురాణేతిహాసార్థాన్నాభినందంతి పాపినః ॥3॥**

> **గురునిందాకరా యే చ మఖవిఘ్నకరాశ్చ యే ।**
> **దాతుర్నివారకా యే చ తేషు తే నిపతంతి హి ॥4॥**

ఎల్లప్పుడు దేవతలను, వేదాలను, బ్రాహ్మణులను నిందిస్తూ, పురాణేతిహాసాలను ద్వేషించే పాపులు, గురువులను నిందించేవారు, యజ్ఞాలను ధ్వంసం చేసేవారు, దానం చేయకుండా దాతలను నివారించేవారు, అందరు ఈ నరకాలలో పడతారు.

> **సుహృద్దంపతిసోదర్యస్వామిభృత్యపితాసుతైః ।**
> **యాజ్యాధ్యాపకయోశ్చైవ కృతో భేదోఽధమైర్మిథః ॥5॥**

> **కన్యామేకస్య దత్త్వా చ దదత్యన్యస్య యేఽధమాః ।**
> **కరపత్రేణ పాట్యంతే తే ద్విధా యమకింకరైః ॥6॥**

స్నేహితులను, దంపతులను, సోదరులను, యజమానసేవకులను, పితాపుత్రులను, ఆచార్య యజమానులను, దుర్బుద్ధితో విడదీసేవారు, ఒకనికి తమ కుమార్తెను దానం చేస్తానని చెప్పి ఇవ్వక ఇతరులకు దానమిచ్చే అధములు, వీరందరిని యమకింకరులు రంపాలతో రెండు ముక్కలుగా చీలుస్తారు.

> **పరోపతాపజనకాశ్చందనోశీరహారిణః ।**
> **వాలవ్యజనహర్తారః కరంభసికతాశ్రితాః ॥7॥**

నిమంత్రితోఽన్యతో భుంక్తే శ్రాద్ధే దైవేఽథ పైతృకే ।
సద్విధాఽఽకృష్యతే మర్త్యస్తీక్ష్ణతుండైః ఖగోత్తమైః ॥8॥

పరులకు తాపం కలిగించేవారు, చందనం, వట్టివేర్లు, చామరవ్యజనాలు దొంగిలించేవారు, **"కరంభసికత"** నరకానికి పోతారు. దైవనిమంత్రణం, శ్రాద్ధనిమంత్రణం స్వీకరించి మరియొకచోట భుజించేవారిని భయంకరమైన ఖగాలు తమ ముక్కులతో ముక్కలు ముక్కలుగా చీలుస్తాయి.

కర్మాణి యస్తు సాధూనాం తుదన్వాగ్భిర్నికృంతతి ।
తస్యోపరి తుదంతస్తు తుండైస్తిష్ఠంతి పత్రిణః ॥9॥

మర్మవేధకాలతో, నిందావాక్యాలతో సాధువుల మనస్సులు నొప్పించే దుర్మార్గుల నెత్తిపై వ్రాలి గ్రద్దలు ముక్కులతో పొడుస్తాయి.

యః కరోతి చ పైశున్యం సాధూనామన్యథామతిః ।
వజ్రతుండనఖా జిహ్వామాకర్షంతేఽస్య వాయసాః ॥10॥

సజ్జనులకు వ్యతిరేకంగా చాడీలు చెప్పేవారి నాలుకలను కాకులు వజ్రాయుధసమమైన తమ ఇనుప ముక్కులతో బయటకులాగి చీల్చుతాయి.

మాతాపితృగురూణాం చ యేఽవజ్ఞాం చక్రురుద్ధతాః ।
మజ్జంతి పూయవిణ్మూత్రే త్వప్రతిష్ఠే హ్యధోముఖాః ॥11॥

ఏ పొగరుబోతులు తల్లిదండ్రులను, గురువులను, అవమానిస్తారో వారు మలమూత్రాదులతో నిండిన **"అప్రతిష్ఠ"** మనే నరకకూపాలలో ముంచబడతారు.

దేవతాతిథిభృత్యేషు భూతేష్వభ్యాగతేషు చ ।
అభుక్తవత్సు యేఽశ్నంతి బాలపిత్రగ్నిమాతృషు ॥12॥

దుష్టాసృక్పూయనిర్యాసం భుంజతే త్వధమా ఇమే ।
సూచీముఖాశ్చ జాయంతే క్షుధార్తా గిరివిగ్రహాః ॥13॥

ఏకపంక్త్యుపవిష్టానాం విషమం భోజయంతి యే ।
విడ్భోజనం రాక్షసేంద్ర నరకం తే వ్రజంతి చ ॥14॥

దేవతలకు, అతిథులకు, జీవులకు, సేవకులకు, అభ్యాగతులకు, బాలురకు, పితృదేవతలకు, అగ్నికి పెట్టకుండా తాము భుజించే అధములు చీము, రక్తంతో కలిపిన మాంసాహారాన్ని తినవలసివస్తుంది. నోటినిండా సూదులు గుచ్చబడుటచే తినలేక, ఆకలి తీరక, వేదనతో ఆక్రోశిస్తూ ఉంటారు. వారి శరీరాలు ఉబ్బిపోయి వికృతంగా ఉంటాయి. ఒకే పంక్తిలో కూర్చుండి భుజించేవారికి పక్షపాతంతోను, భేదదృష్టితోను వడ్డించే నీచులు "**విడ్భోజనం**" అనే నరకంలో పడిపోతారు.

ఏకసార్థప్రయాతాశ్చ పశ్యంతశ్చార్థినం నరాః ।
అసంవిభజ్య భుంజంతి తే యాంతి శ్లేష్మభోజనమ్ ॥15॥

పలువురితో కలసి ప్రయాణం చేయునప్పుడు తాము తెచ్చుకున్న తినుబండారాలను ఇతరులతో కలసి పంచుకొని తినకుండా తామే భుజించేవారు "**శ్లేష్మభోజన**"మనే నరకగాములౌతారు.

గోబ్రాహ్మణాగ్నయః స్పృష్టా యైరుచ్ఛిష్టైశ్చ కామతః ।
క్షిప్యంతే హి కరాస్తేషాం తప్తకుంభే సుదారుణే ॥16॥

యథేచ్ఛగా ఎంగిలిచేతులతో గోవులను, బ్రాహ్మణులను, పవిత్రాగ్నులను ముట్టుకొనేవారి చేతులను ఎర్రగా కాగిపోయే కుంభాలలో పడవేస్తారు.

సూర్యేందుతారకా దృష్టా యైరుచ్ఛిష్టైశ్చ కామతః ।
తేషాం నేత్రగతో వహ్నిర్ధమ్యతే యమకింకరైః ॥17॥

అశుచిగావుంటూ, ఎంగిలినోటితో, చేతులతో ఎవరైతే సూర్యుని, చంద్రుని, నక్షత్రాలను యథేచ్ఛగా చూస్తారో వాళ్ళ నేత్రాగ్ని అనగా వారి చూపును యమకింకరులు లాగేస్తారు.

మిత్రజాయాఽథ జననీ జ్యేష్ఠో భ్రాతా పితా స్వసా ।
జామయో గురవో వృద్ధా యైః సంస్పృష్టాః పదానృభిః ॥18॥

బద్ధాంఘ్రయస్తే నిగడైర్లోహైర్వహ్నిప్రతాపితైః ।
క్షిప్యంతే రౌరవే ఘోరే హ్యాజానుపరిదాహినః ॥19॥

మిత్రుని భార్యను, తన తల్లిని, అగ్రజుని, తండ్రిని, తోబుట్టువును, కుమార్తెను, గురువును, పెద్దలను, ఎవరు తమ కాలితో తాకుతారో, అట్టిపాపుల పాదాలను ఇనుప సంకెళ్ళతో కట్టి, మోకాళ్లవరకు అగ్నిలో కాల్చి, **"రౌరవ"** నరకజ్వాలలలో తోసేస్తారు.

పాయసం కృశరం మాంసం వృథా భుక్తాని యైర్నరైః ।
తేషామయోగుడాస్తప్తాః క్షిప్యంతే వదనేఽద్భుతాః ॥20॥

పాయసాన్ని, కిచడీని, మాంసాన్ని, భగవన్నివేదన చేయకుండా భుజించేవారి నోళ్ళలో నిప్పులో కాల్చిన ఇనుపగుండ్లను కుక్కుతారు.

గురుదేవద్విజాతీనాం వేదానాం చ నరాధమైః ।
నిందాఽనిశం శ్రుతా యైస్తు పాపానామభికుర్వతామ్ ॥21॥

తేషాం లోహమయాః కీలా వహ్నివర్ణాః పునః పునః ।
శ్రవణేషు నిఖన్యంతే ధర్మరాజస్య కింకరైః ॥22॥

గురు, దేవ, బ్రాహ్మణులను, వేదాలను గూర్చి చేసే నిందావాక్యాలను ఎల్లప్పుడు శ్రద్ధగా వినే పాపుల చెవులలో యమకింకరులు ఎర్రగా కాల్చిన మేకులను మరల మరలా గ్రుచ్చుతారు.

ప్రపాదేవకులారామాన్ విప్రవేశ్మసభామఠాన్ ।
వాపీకూపతడాగాంశ్చ భంక్త్వా విధ్వంసయంతి యే ॥23॥

తేషాం విలపతాం చర్మ దేహతః క్రియతే పృథక్ ।
కర్తికాభిః సుతీక్ష్ణాభిః సురౌద్రైర్యమకింకరైః ॥24॥

చలివేంద్రాలను, దేవాలయాలను, బ్రాహ్మణనివాసాలను, సభాభవనాలను, మఠాలను, వాపీకూప తటాకాలను, కూల్చి నాశనం చేసే సంఘద్రోహుల చర్మాలను పదునైన కత్తులతో యమకింకరులు ఒలిచి, బాధతో పెద్దగా విలపించే ఆ పాపాత్ములను క్రూరంగా హింసిస్తారు.

గోబ్రాహ్మణార్కమగ్నిం చ యే హి మేహంతి మానవాః ।
తేషాం గుదేభ్యశ్చాంత్రాణి వినిష్కృంతంతి వాయసాః ॥25॥

గోవులకు, బ్రాహ్మణులకు, సూర్యునకు, అగ్నికి ఎదురుగా నిలబడి, మలమూత్రవిసర్జన చేసేవాడి గుదస్థానాన్ని కాకులు ముక్కులతో చీల్చి, లోపలి ప్రేగులు బయటకు లాగుతాయి.

స్వపోషణపరో యస్తు పరిత్యజతి మానవః ।
పుత్రభృత్యకళత్రాదిబంధువర్గమకించనమ్ ।
దుర్భిక్షే సంభ్రమే చాపి స శ్వభోజ్యే నిపాత్యతే ॥26॥

దుర్భిక్షం ఏర్పడినప్పుడు, ప్రకృతివైపరీత్యాల వల్ల, తదితర కారణాలవలన ఏర్పడిన దుర్భరస్థితిలోను పుత్రభృత్యకళత్రాది బంధువులను అన్నార్తులుగా విడిచి, తానొక్కడే కడుపునింపుకునే మానవుడు "**శ్వభోజన**" మనే నరకానికి పోతాడు.

శరణాగతం యే త్యజంతి యే చ బంధనపాలకాః ।
పతంతి యంత్రపీఠే తే తాడ్యమానాస్తు కింకరైః ॥27॥

శరణుజొచ్చినవారిని వదిలివేయువారు, ఇతరులను చెరసాలలలో బంధించేవారు యమకింకరులచే పీడింపబడుతూ "**యంత్రపీఠ**"మనే నరకంలో పడిపోతారు.

క్లేశయంతి హి విప్రాదీన్యాజ్యకర్మసు పాపినః ।
తే పిష్యంతే శిలాపేషే శోష్యంతేఽపి చ శోషకైః ॥28॥

యజ్ఞకర్మలు చేసే విప్రాదులను అకారణంగా బాధించే పాపాత్ములను యమదూతలు శిలాయంత్రాలలో పిండిపిండిగా విసిరి నిప్పుల మీద కాలుస్తారు.

న్యాసాపహారిణః పాపా బధ్యంతే నిగడైరపి ।
క్షుత్ క్షామాః శుష్కతాల్వోష్ఠాః పాత్యంతే వృశ్చికాశనే ॥29॥

ఇతరులు తమ వద్ద దాచుకున్న సొమ్మునపహరించే పాపులు ఆకలితో ఎండిన నాల్కలతో ఆక్రోశిస్తూ ఉండగా వారిని యమదూతలు సంకెళ్ళతో బంధించి, **"వృశ్చికాశన"** మనే నరకంలోనికి తోస్తారు.

పర్వమైథునినః పాపాః పరదారరతాశ్చ యే ।
తే వహ్నితప్తాం కూటాగ్రామాలింగంతే చ శాల్మలీమ్ ॥30॥

పర్వదినాలలో స్త్రీసంభోగం చేసేవారిని, పరభార్యారతులను, "**శాల్మలీ**" అనే నరకంలోనికి త్రోసి, అక్కడ మేకులతో కూడిన భగభగమండే ఇనుప స్తంభాలను కౌగిలింపజేస్తారు.

ఉపాధ్యాయమధఃకృత్య యైరధీతం ద్విజాధమైః ।
తేషామధ్యాపకో యశ్చ స శిలాం శిరసా వహేత్ ॥31॥

ఉపాధ్యాయుని తక్కువచేసి ఎవరు విద్యను అభ్యసిస్తారో, అటువంటివారికి ఎవరు అధ్యయనం చేయిస్తారో, అటువంటి అధములైన శిష్యులు, ఆ ఉపాధ్యాయులు ఇద్దరు తమనెత్తిమీద రాతిబండను మోయవలసివస్తుంది.

మూత్రశ్లేష్మపురీషాణి యైరుత్సృష్టాని వారిణి ।
తే పాత్యంతే చ విణ్మూత్రే దుర్గంధే పూయపూరితే ॥32॥

జలాలలో మలమూత్రవిసర్జనం, నిష్ఠీవనం (ఉమ్మి), చేసేవారిని "**విణ్మూత్ర**" మనే దుర్గంధ భరితమైన నరకంలోనికి తోస్తారు.

శ్రాద్ధేఽ తిథేయమన్యోన్యం యైర్భుక్తం భువి మానవైః ।
పరస్పరం భక్షయంతి తే స్వమాంసాని బాలిశాః ॥33॥

శ్రాద్ధాది కర్మలలో పరస్పరం ఒకరింటికి మరొకరు వెళ్లి భోజనం చేసే మూర్ఖమానవులు పరస్పరం ఒకరిమాంసం మరొకరు తినవలసివస్తుంది.

వేదవహ్నిగురుత్యాగీ మాతాపిత్రోస్తథైవ చ ।
గిరిశృంగాదధః పాతం పాత్యంతే యమకింకరైః ॥34॥

వేదాలను, అగ్నులను, గురువులను, తల్లిదండ్రులను వదలిపెట్టే పాపులను యమకింకరులు గిరిశిఖరాల నుండి క్రిందకు తోసివేస్తారు.

పునర్భూపతయో యే చ కన్యావిధ్వంసకాశ్చ యే ।
తద్గర్భస్రావకృద్యశ్చ కృమీన్ భక్షేత్పిపీలికాః ॥35॥

వితంతువులను పెండ్లాడువాడు, కన్యలను చెరిచేవాడు, గర్భస్రావాలను చేసేవాడు, క్రిములను, చీమలను భక్షించేటట్లు యమకింకరులు చేస్తారు.

చండాలాదంత్యజాద్వాఽపి ప్రతిగృహ్ణాతి దక్షిణామ్ ।
యాజకో యజమానశ్చ స స్యాదశ్మని కీటకః ॥36॥

చండాలాది కడజాతివారినుండి దక్షిణలు తీసుకున్న పురోహితులు, ఆ యజమానులు కూడా శిలాగర్భంలో పురుగులుగా జన్మిస్తారు.

పృష్ఠమాంసాశినో మూఢాస్తథైవోత్కోచజీవినః ।
క్షిప్యంతే వృకభక్షే తే నరకే రజనీచర ॥37॥

ఓ దైత్యేశ్వరా! లంచగొండులు, పృష్ఠమాంసభుక్కులు, "**వృకభక్ష**" మనే నరకంలో పడతారు.

స్వర్ణస్తేయీ చ బ్రహ్మఘ్నః సురాపో గురుతల్పగః ।
తథా గోభూమిహర్తారో గోస్త్రీబాలహతాశ్చ యే ॥38॥

ఏతే నరా ద్విజా యే చ గోషు విక్రయిణస్తథా ।
సోమవిక్రయిణో యే చ వేదవిక్రయిణస్తథా ॥39॥

కూటసత్యాస్త్వశౌచాశ్చ నిత్యనైమిత్తనాశకాః ।
కూటసాక్ష్యప్రదా యే చ తే మహారౌరవే స్థితాః ॥40॥

బంగారం దొంగిలించేవారు, బ్రాహ్మణులను చంపేవారు, సురాపానం చేసేవారు, గురువు భార్యతో సంగమించేవారు, అట్లే గోవులను, భూములను దొంగిలించేవారు, గోవులను, స్త్రీలను, బాలురను చంపేవారు, గోవులను విక్రయించేవారు, సోమవిక్రయం, వేదవిక్రయం చేసే బ్రాహ్మణులు, మోసగాళ్ళు, అశౌచులు, నిత్య నైమిత్తికకర్మలను విడిచినవాళ్ళు, తప్పుడు సాక్ష్యం చెప్పేవారు మహారౌరవనరకాన్ని పొందుతారు.

దశవర్షసహస్రాణి తావత్తామిస్రకే స్థితాః ।
తావచ్చైవాంధతామిస్రే అసిపత్రవనే తతః ॥41॥

తావచ్చైవ ఘటీయంత్రే తప్తకుంభే తతఃపరమ్ ।
ప్రపాతో హి భవేత్తేషాం యైరిదం దుష్కృతం కృతమ్ ॥42॥

యే త్వేతే నరకా రౌద్రా రౌరవాద్యాస్తవోదితా ।
తే సర్వే క్రమశః ప్రోక్తాః కృతఘ్నే లోకనిందితే ॥43॥

వీరందరు పదివేలసంవత్సరాలు తామిస్రక, అంధతామిస్ర, అసిపత్రవన, ఘటీయంత్ర, తప్తకుంభ నరకాలలో క్రమంగా ఒకదాని తరువాత మరియొక నరకంలో యాతనలు అనుభవిస్తారు. నేను వివరించిన మిక్కిలి భయంకరమైన ఈ రౌరవాది నరకాలన్నీ కృతఘ్నులు, లోకనిందకులు కూడా అనుభవిస్తారు.

యథా సురాణాం ప్రవరో జనార్దనో యథా గిరీణామపి శైశిరాద్రిః ।
యథాఽఽయుధానాం ప్రవరం సుదర్శనం యథా ఖగానాం వినతాతనూజః ।
మహోరగాణాం ప్రవరోఽప్యనంతో యథా చ భూతేషు మహీప్రధానా ॥44॥

నదీషు గంగా జలజేషు పద్మం సురారిముఖ్యేషు హరాంఘ్రిభర్తః ।
క్షేత్రేషు యద్వత్కురుజాంగలం వరం తీర్థేషు యద్వత్ప్రవరం పృథూదకమ్ ॥45॥

సరస్సుచైవోత్తరమానసం యథా వనేషు పుణ్యేషు హి నందనం యథా ।
లోకేషు యద్వత్సదనం విరించేః సత్యం యథా ధర్మవిధిక్రియాసు ॥46॥

యథాశ్వమేధః ప్రవరః క్రతూనాం పుత్రో యథా స్పర్శవతాం వరిష్ఠః ।
తపోధనానామపి కుంభయోనిః శ్రుతిర్వరా యద్వదిహాగమేషు ॥47॥

ముఖ్యం పురాణేషు యథైవమాత్స్యం స్వాయంభువోక్తిస్త్వపి సంహితాసు ।
మనుఃస్మృతీనాం ప్రవరో యథైవ తిథీషు దర్శో విషువేషు దానమ్ ॥48॥

తేజస్వినాం చ ప్రవరోఽర్క ఉక్త ఋక్షేషు చంద్రో జలధిర్హ్రదేషు ।
భవాన్ యథా రాక్షససత్తమేషు పాశేషు నాగస్తిమితేషు బంధః ॥49॥

ధాన్యేషు శాలిర్ద్విపదేషు విప్రశ్చతుష్పదే గౌః శ్వపదాం మృగేంద్రః ।
పుష్పేషు జాతీ నగరేషు కాంచీ నారీషు రంభాఽఽశ్రమిణాం గృహస్థః ॥50॥

కుశస్థలీ శ్రేష్ఠతమా పురేషు దేశేషు సర్వేషు చ మధ్యదేశః ।
ఫలేషు చూతో ముకుళేష్వశోకః సర్వౌషధీనాం ప్రవరా చ పథ్యా ॥51॥

మూలేషు కందః ప్రవరో యథోక్తో వ్యాధిష్వజీర్ణం క్షణదాచరేంద్ర ।
శ్వేతేషు దుగ్ధం ప్రవరం యథైవ కార్పాసికం ప్రావరణే హి యద్వత్ ॥52॥

కళాసు ముఖ్యా గణితజ్ఞతా చ విజ్ఞానముఖ్యం తు యథేంద్రజాలమ్ ।
శాకేషు ముఖ్యాత్వపి కాకమాచీ రసేషు ముఖ్యం లవణం యథైవ ॥53॥

తుంగేషు తాలో నలినీషు పంపా వనౌకసేష్వేవ చ ఋక్షరాజః ।
మహీరుహేష్వేవ యథా వటశ్చ యథా హరో జ్ఞానవతాం వరిష్ఠః ॥54॥

యథా సతీనాం హిమవత్సుతా హి యథాఽర్జునీనాం కపిలా వరిష్ఠా ।
యథా వృషాణామపి నీలవర్ణస్తథైవ సర్వేష్వపి దుస్సహేషు ॥55॥

దుర్గేషు రౌద్రేషు నిశాచరేశ నృపాతనం వైతరణీ ప్రధానా ।
పాపీయసాం యద్వదిహా కృతఘ్నః సర్వేషు పాపేషు నిశాచరేంద్ర ॥56॥

బ్రహ్మఘ్న గోఘ్నాదిషు నిష్కృతిర్హి విద్యేత నైవాస్య తు దుష్టచారిణః ।
న నిష్కృతిశ్చాపి కృతఘ్నవృత్తేః సుహృత్కృతం నాశయతోఽబ్దకోటిభిః ॥57॥

రాక్షసేంద్రా! దేవతలందరిలో జనార్దనుడు శ్రేష్ఠుడైనట్లు, పర్వతాలలో హిమవత్పర్వతం వలె, ఆయుధాలలో సుదర్శనచక్రం వలె, పక్షులలో గరుత్మంతుని వలె, మహాసర్పాలలో అనంతుని వలె, పంచభూతాలలో భూమి

వలె, నదులలో గంగానది వలె, జలజాలలో పద్మం వలె, అసురులలో శివభక్తుల వలె, క్షేత్రాలలో కురుక్షేత్రం వలె, తీర్థాలలో పృథూదకం వలె. సరస్సులలో మానస సరోవరం వలె, పుణ్యవనాలలో నందనవనం వలె, లోకాలలో బ్రహ్మలోకం వలె, ధర్మాది క్రియలలో సత్యవాక్పాలనం వలె. క్రతువులలో అశ్వమేధం వలె, స్పర్శసుఖం ఇచ్చేవారిలో పుత్రుడు వరిష్ఠుడైన విధముగా, తపోధనులలో అగస్త్యుని వలె, ఆగమాలలో వేదాల వలె, పురాణాలలో మత్స్య పురాణం వలె, సంహితలలో స్వాయంభువ సంహిత వలె, స్మృతులలో మనుస్మృతి వలె, తిథులలో అమావాస్య వలె, విషువులలో దానం వలె, (దేవతలలో ఇంద్రునివలె అని పాఠాంతరం). తేజఃపుంజాలలో సూర్యుని వలె, నక్షత్రాలలో చంద్రుని వలె, జలాశయాలలో సముద్రం వలె, రాక్షస శ్రేష్ఠులలో నీ వలె, పాశాలలో నాగపాశం వలె, స్తిమితులలో బంధితుని వలె. ధాన్యాలలో వరిధాన్యం వలె, ద్విపాదులలో విప్రుని వలె, చతుష్పాదులలో ఆవు వలె, అడవిజంతువులలో సింహం వలె, పుష్పాలలో జాజి వలె, నగరాలలో కాంచీనగరం వలె, స్త్రీలలో రంభ వలె, ఆశ్రమాలలో గృహస్థాశ్రమం వలె. పురాలలో కుశస్థలి వలె, దేశాలన్నిటిలో మధ్యదేశం వలె, ఫలాలలో మామిడిపండు వలె, మొగ్గలలో అశోకం వలె, ఔషధాలన్నిటిలో కరక్కాయ వలె. గడ్డలలో కంద వలె, వ్యాధులలో అజీర్ణరోగం వలె, తెల్లని పదార్థాలలో పాల వలె, వస్త్రాలలో నూలువస్త్రంవలె. కళలలో గణితజ్ఞానం వలె, విజ్ఞానాలలో మహేంద్రజాలంవలె, శాకాలలో కాకమాచి (ఒకరకమైన ఆకుకూర) వలె, ఆరురుచులలో లవణంవలె. ఎత్తైన వృక్షాలలో తాళవృక్షంవలె, పద్మసరస్సు లలో పంపాసరస్సు వలె, వనచరాలలో జాంబవంతుని వలె, వృక్షాలలో వటవృక్షం వలె, జ్ఞానవంతులలో శివుని వలె. పతివ్రతలలో పార్వతీదేవి వలె, గోవులలో కపిలగోవువలె, వృషభాలలో నీలవర్ణవృషభం వలె, దుస్సహమైనట్టియు, అత్యంతభయంకరమైనట్టియు, నరకాలన్నిటిలోను "**నృపాతన వైతరిణి**" అత్యంత ప్రధానమైనది. అదేవిధంగా ఓ రాక్షసేంద్రా! పాపులందరిలో కృతఘ్నుడు పరమ నికృష్టుడు, కృతఘ్నుత్వం పాపాలన్నిటిలోను అత్యంత భయంకరమైనది. బ్రహ్మహత్యా పాతకులకు, గోహత్యాపాతకులకు, తదితర దుష్టచారులకు, నిష్కృతి (ప్రాయశ్చిత్తం) ఉండవచ్చుగాని, స్నేహితుడొనరించిన మేలును మరచిన కృతఘ్నునకు కోటి సంవత్సరాలకైనను, నిష్కృతి లేదు. ఇది నిశ్చయం.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే కర్మవిపాకో నామ ద్వాదశోఽధ్యాయః ॥12॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి కర్మవిపాకమనే పన్నెండవ అధ్యాయం సమాప్తం.



త్రయోదశోఽధ్యాయః – పదమూడవ అధ్యాయం

భువనకోశ వర్ణనమ్ – భువనకోశ వర్ణనం

సుకేశి రువాచ – సుకేశి పలికాడు.

భవద్భిరుదితా ఘోరా పుష్కరద్వీపసంస్థితిః ।
జంబూద్వీపస్య సంస్థానం కథయంతు మహర్షయః ॥1॥

ఓ మహర్షులారా! పుష్కరద్వీపంలోని ఘోరపరిస్థితులు మీరు వర్ణించారు. ఈ జంబూద్వీపస్థితిగతులను గూర్చి వివరించండి.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

జంబూద్వీపస్య సంస్థానం కథ్యమానం నిశామయ ।
నవభేదం సువిస్తీర్ణం స్వర్గమోక్షఫలప్రదమ్ ॥2॥

ఓ రాక్షసపతీ! నవవిభాగాత్మకమై, సువిశాలమై, స్వర్గమోక్షాలను ప్రదానం చేయగల జంబూద్వీప వృత్తాంతం వినుము.

మధ్యే త్విలావృతో వర్షో భద్రాశ్వః పూర్వతోఽద్భుతః ।
పూర్వ దక్షిణతో వర్షో హిరణ్మాన్ రాక్షసేశ్వర ॥3॥

భారతో దక్షిణే ప్రోక్తో హరిర్దక్షిణపశ్చిమే ।
పశ్చిమే కేతుమాలశ్చ చంపకః పశ్చిమోత్తరే ॥4॥

ఉత్తరేణ కురోర్వర్షః కల్పవృక్షసమావృతః ।
పూర్వముత్తరతో రమ్యో వర్షః కింపురుషః స్మృతః ॥5॥

పుణ్యా రమ్యా నవైవేతే వర్షాః సాలకటంకట ।
ఇలావృతాద్యాశ్చైవాష్టౌ వర్షం ముక్త్వైవ భారతమ్ ॥6॥

న తేష్వస్తి యుగావస్థా జరా మృత్యుభయం న చ ।
తేషాం స్వాభావికీ సిద్ధిః సుఖప్రాయా హ్యయత్నతః ॥7॥

విపర్యయో న తేష్వస్తి నోత్తమాధమమధ్యమాః ।
యదేతద్భారతం వర్షం నవద్వీపం నిశాచర ॥8॥

సాగరాంతరితాః సర్వే అగమ్యాశ్చ పరస్పరమ్ ।

రాక్షసేశ్వరా! మధ్యలో ఇలావృత వర్షం, తూర్పున అద్భుతమైన భద్రాశ్వవర్షం, ఆగ్నేయాన హిరణ్యవర్షం, దక్షిణాన భారతవర్షం, నైఋతి భాగాన హరివర్షం, పశ్చిమాన కేతుమాలవర్షం, వాయవ్యాన చంపకవర్షం, ఉత్తరాన కురువర్షం, ఈశాన్యాన రమ్యమైన కింపురుషవర్షంగా తొమ్మిదిభాగాలుగా జంబూద్వీపం విభక్తమైనది.

ఈ తొమ్మిదిభూభాగాలు మిక్కిలి పవిత్రమైనవి. రమ్యమైనవి. వీనిలో కురువర్షం కల్పవృక్షాలతో నిండియుంటుంది. భారతవర్షం మినహా మిగిలిన ఇలావృతాది ఎనిమిదివర్షాలలో యుగావస్థ గాని, జరామరణభయం గాని ఉండవు. అక్కడి వారలకు అప్రయత్నంగానే సుఖం సిద్ధిస్తుంది. అది సహజసిద్ధము. వారిలో ఉత్తమాధమత్వాది వివక్షగాని, ఎలాంటి విపర్యయాలు గాని ఉండవు. ఓ నిశాచరా! భారతవర్షంలో తొమ్మిదిద్వీపాలున్నాయి. ఈ ద్వీపాలన్నీ సముద్రాలచే వేరుచేయబడి, పరస్పరం అగమ్యాలుగా ఉన్నాయి.

ఇంద్రద్వీపః కశేరూణాస్తామ్రపర్ణో గభస్తిమాన్ ॥9॥

నాగద్వీపః కటాహశ్చ సింహలో వారుణస్తథా ।
అయం తు నవమస్తేషాం ద్వీపః సాగరసంవృతః ॥10॥

కుమారాఖ్యః పరిఖ్యాతో ద్వీపోஉయం దక్షిణోత్తరః ।
పూర్వే కిరాతా యస్యాంతే పశ్చిమే యవనాః స్మృతాః ॥11॥

ఆంధ్రా దక్షిణతో వీర తురుష్కాస్త్వపి చోత్తరే ।
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః శూద్రాస్త్వంతరవాసినః ॥12॥

ఇజ్యాయుద్ధవణిజ్యాద్యైః కర్మభిః కృతపావనాః ।
తేషాం సంవ్యవహారశ్చ ఏభిః కర్మభిరిష్యతే ॥13॥

స్వర్గాపవర్గప్రాప్తిశ్చ పుణ్యం పాపం తథైవ చ ।

భారతవర్షం ఇంద్రద్వీపం, కశేరుణ, తామ్రపర్ణ, గభస్తిమాన్, నాగద్వీపం, కటాహం, సింహళం, వారుణం, కుమారం అనే తొమ్మిదిద్వీపాలుగా విభక్తమైనది. తొమ్మిదవదైన కుమారద్వీపం దక్షిణోత్తరదిశలో సముద్రంచే చుట్టబడియున్నది. దీనికి తూర్పున కిరాతులు, పశ్చిమంలో యవనులు, దక్షిణంలో ఆంధ్రులు, ఉత్తరంలో తురుష్కులు ఉన్నారు. అక్కడ నివసించే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర జాతులవారు క్రమంగా యజ్ఞాలు, యుద్ధాలు, వాణిజ్యాది విధ్యుక్తధర్మాలు నిర్వహిస్తూ, మిక్కిలి పవిత్రులైనారు. వారి పరస్పరాచరణలు, స్వర్గమోక్షసంపాదన, పుణ్యపాపాలు, వారి కర్మాచరణాన్ని అనుసరించి నిర్ణయింపబడతాయి.

మహేంద్రో మలయః సహ్యః శుక్తిమాన్ ఋక్షపర్వతః ॥14॥

వింధ్యశ్చ పారియాత్రశ్చ సప్తాత్ర కులపర్వతాః ।
తథాஉన్యే శతసాహస్రా భూధరా మధ్యవాసినః ॥15॥

విస్తారోచ్ఛ్రాయిణో రమ్యా విపులాః శుభసానవః ।
కోలాహలశ్చ వైభ్రాజో మందరో దర్దురాచలః ॥16॥

వాతధూమో వైద్యుతశ్చ మైనాకః సరసస్తథా ।
తుంగప్రస్థో నాగగిరిస్తథా గోవర్ధనాచలః ॥17॥

ఉజ్జయంతః పుష్పగిరిరర్బుదో రైవతస్తథా ।
ఋష్యమూకః సగోమంతశ్చిత్రకూటః కృతస్మరః ॥18॥

శ్రీపర్వతః కోకణకః శతశోఽన్యేఽపి పర్వతాః ।
తైర్విమిశ్రా జనపదా మ్లేచ్ఛాశ్చార్యాశ్చ భాగశః ॥19॥

అక్కడ మహేంద్ర, మలయ, సహ్య, శుక్తిమాన్, ఋక్ష, వింధ్య, పారియాత్ర అనబడే ఏడు కులపర్వతాలు ఉన్నాయి. ప్రధానమైన ఈ కులపర్వతాలే కాక విస్తారమైనట్టియు, మిక్కిలి విశాలమైనట్టియు, రమణీయమైనట్టియు, ఇతరపర్వతాలు కూడా వందలసంఖ్యలోను వేలసంఖ్యలోను ఉన్నాయి. కోలాహలం, వైభ్రాజం, మందరం, దర్దురం, వాతధూమం, వైద్యుతం, మైనాకం, సరసం, తుంగప్రస్థం, నాగగిరి, గోవర్ధనాచలం, ఉజ్జయంతం, పుష్పగిరి, అర్బుదం, రైవతం, ఋష్యమూకం, గోమంతం, చిత్రకూటం, కృతస్మరం, శ్రీపర్వతం, కోకణకం మున్నగు పర్వతాలు వాటిలో కొన్ని మాత్రమే. ఈ పర్వతప్రదేశాలతో కలిపి మ్లేచ్ఛ, ఆర్య జనపదాలెన్నో వెలిశాయి.

తైః పీయంతే సరిచ్ఛ్రేష్ఠా యాః సమ్యక్తా నిశామయ ।
సరస్వతీ పంచరూపా కాలిందీ చ హిరణ్వతీ ॥20॥

శతద్రుశ్చంద్రికా నీలా వితస్తేరావతీ కుహూః ।
మధురా హారరావీ చ ఉశీరా ఘాతకీ రసా ॥21॥

గోమతీ ధూతపాపా చ బాహుదా సా దృషద్వతీ ।
నిఃస్వరా గండకీ చిత్రా కౌశికీ చ వధూసరా ॥22॥

సరయూశ్చ సలౌహిత్యా హిమవత్పాదనిఃసృతాః ।
వేదస్మృతిర్వేదసినీ వృత్రఘ్నీ సింధురేవ చ ॥23॥

పర్ణాసా నందినీ చైవ పావనీ చ మహీ తథా ।
శరా చర్మణ్వతీ లూపీ విదిశా వేణుమత్యపి ॥24॥

చిత్రా హ్యోఘవతీ రమ్యా పారియాత్రోద్భవాః స్మృతాః ।
శోణో మహానదీ చైవ నర్మదా సురసా క్రియా ॥25॥

మందాకినీ దశార్ణా చ చిత్రకూటా హి దేవికా ।
చిత్రోత్పలా వై తమసా కరతోయా పిశాచికా ॥26॥

తథాన్యా పిప్పలశ్రోణీ విపాశా మంజులావతీ ।
సత్సంతజా శుక్తిమతీ చక్రిణీ త్రిదివా వసుః ॥27॥

ఋక్షపాద ప్రసూతా చ తథాన్యా వల్గువాహినీ ।
శివా పయోష్ణీ నిర్వింధ్యా తాపీ స నిషధావతీ ॥28॥

వేణా వైతరణీ చైవ సినీబాహుః కుముద్వతీ ।
తోయా రేవా మహాగౌరీ దుర్గంధా వాశిలా తథా ॥29॥

వింధ్యపాదప్రసూతాశ్చ నద్యః పుణ్యజలాః శుభాః ।
గోదావరీ భీమరథీ కృష్ణా వేణ్యా సరిద్వతీ ॥30॥

విశమద్రీ సుప్రయోగా వాహ్యా కావేరిరేవ చ ।
దుగ్ధోదా నలినీ చైవ వారిసేనా కలస్వనా ॥31॥

ఏతాశ్చాపి మహానద్యః సహ్యాపాదవినిర్గతాః ।
కృతమాలా తామ్రపర్ణీ బంజులా చోత్పలావతీ ॥32॥

శునీ చైవ సుదామా చ శుక్తిమత్ప్రభవాస్త్విమాః ।
సర్వాః పుణ్యాః సరస్వత్యః పాపప్రశమనాస్తథా ॥33॥

జగతో మాతరః సర్వాః సర్వాః సాగరయోషితః ।
అన్యాః సహస్రశశ్చాత్ర క్షుద్రనద్యో హి రాక్షస ॥34॥

సదాకాలవహాశ్చాన్యాః ప్రావృట్కాలవహాస్తథా ।
మధ్యదేశోద్భవా ఏతాః పిబంతి స్వేచ్ఛయా శుభాః ॥35॥

ఓ రాక్షసేంద్రా! వీరికి జలప్రదానం గావించే శ్రేష్ఠమైన నదులను గూర్చి చెబుతున్నాను. సరస్వతి, పంచరూప. కాళింది, హిరణ్వతి, శతద్రు, చంద్రిక, నీల, వితస్త, ఇరావతి, కుహు, మధుర, హారరావి, ఉశీర, ఘాతకి, రస, గోమతి, ధూతపాప, బాహుద, దృషద్వతి, నిస్వర, గండకి, చిత్ర, కౌశిక, వధూసరా, సరయు, లౌహిత్య మున్నగు నదులన్నియు హిమవత్పర్వతపాదప్రదేశం నుండి ఉద్భవించాయి.

వేదస్మృతి, వేదసిని, వృత్రఘ్ని, సింధు, పర్ణ, నందిని, పావని, మహి, శర, చర్మణ్వతి, లూపి, విదిశ, వేణుమతి, చిత్రాహి, ఓఘవతి, మున్నగు రమ్యమైన నదులు పారియాత్రగిరినుండి ఉద్భవించాయి.

శోణ, మహానది, నర్మదా, సురస, క్రియా, మందాకిని, దశార్ణ, చిత్రకూట, దేవిక, చిత్రోత్పల, తమస, కరతోయ, పిశాచిక, పిప్పలశ్రేణి, విపాశ, వంజులావతి, సత్సంతజ, శుక్తిమతి, చక్రిణి, త్రిదివ, వసు, తదితర నదులు ఋక్షగిరినుండి ప్రభవించాయి.

శివ, పయోష్ణి, నిర్వింధ్య, తాపి, నిషధావతి, వేణ, వైతరణి, సినీబాహు, కుముద్వతి, తోయ, రేవా, మహాగౌరి, దుర్గంధ, వాశిలా మున్నగు పవిత్రనదులు వింధ్యపాదప్రదేశంనుండి ప్రభవించాయి.

గోదావరి, భీమరథి, కృష్ణ, వేణి, సరిద్వతి, సుప్రయోగ, వాహ్యా, కావేరి, దుగ్ధోద, నలిని, వారిసేన, కలస్వన మొదలగు మహానదులు సహ్యాపర్వతపాదప్రదేశంనుండి ఉద్భవించాయి.

కృతమాల, తామ్రపర్ణి, బంజుల, ఉత్పలావతి, శునీ, సుదామ మున్నగునవి శుక్తిమతినుండి పుట్టాయి. ఈ నదులన్నీ పరమపవిత్రమైనవి. పాపాలను పోగొట్టేవి. ఈ జగత్తునకు తల్లులవంటివి.

ఇవి అన్నియు సాగరపత్నులే. ఓ రాక్షసా! ఇంకా ఎన్నో వేలాది క్షుద్రనదులున్నాయి. కొన్ని అన్ని కాలాలలోను ప్రవహించేవి కాగా, మరికొన్ని కేవలం వర్షాకాలంలో మాత్రమే ప్రవహిస్తాయి. మధ్యదేశంలో నివసించేవారు ఈ పవిత్రనదుల జలాలను స్వేచ్ఛగా, సుఖంగా త్రాగుతున్నారు.

మత్స్యాః కుశూద్రాః కిలకుండలాశ్చ పాంచాలకాశ్చైవ సహ కోసలైశ్చ ।
వృకాః శకా బర్బర కౌరవాశ్చ కలింగ వంగాంగ జనాస్తథైతే ॥36॥

మర్మకా మధ్యదేశీయా ఆభీరాః శాఢ్యధానకాః ।
బాహ్లీకా వాటధానాశ్చ ఆభీరాః కాలతోయదాః ॥37॥

అపరాంతాస్తథా శూద్రాః పల్లవాశ్చ సఖేటకాః ।
గాన్ధారా యవనాశ్చైవ సింధుసౌవీర భద్రకాః ॥38॥

శాతద్రవా లలిత్థాశ్చ పారావత సమూషకాః ।
మాఠరోదక ధారాశ్చ కైకేయా దంశనాస్తథా ॥39॥

క్షత్రియాః ప్రతివైశ్యాశ్చ తథా శూద్రకులాని చ ।
కాంబోజా దరదాశ్చైవ బర్బరాశ్చాంగలౌకికాః ॥40॥

వేణాశ్చైవ తుషారాశ్చ బహుధా బాహ్యతోదరాః ।
ఆత్రేయాః సభరద్వాజాః ప్రస్థలాశ్చ దశేరకాః ॥41॥

లంపకా స్తావకా రామా శ్చూడికా స్తంగణైఃసహ ।
అలసాశ్చాలిభద్రాశ్చ కిరాతానాం చ జాతయః ॥42॥

తామసాః కర్మమార్గాశ్చ సుపార్శ్వా గణకాస్తథా ।
కులూతాః కుహికాశ్చూర్ణాస్తూర్ణపాదాః సకుక్కుటాః ॥43॥

మాండవ్యాః పాణవీయాశ్చ ఉత్తరాపథవాసినః ।

మత్స్య, కుశూద్ర, కిలకుండల, పాంచాల, కోసల, వృక, శక, బర్బర, కౌరవ, కళింగ, వంగ, అంగ మర్మక జాతి మనుష్యులు మధ్యదేశీయులు. ఆభీర, శాఢ్యధానక, బాహ్లీక, వాలుధాన, కాలతోయద, శూద్ర, పల్లవ, ఖేటక, గాంధార, యవన, సింధు, సౌవీర, భద్రక, శాతద్రవ, లలిత్థ, పారావత, మూషక, మాఠర, ఉదకధార, కైకేయ, దంశన, క్షత్రియ, ప్రాతివైశ్య, వైశ్య, శూద్రకులాలు, కాంబోజ, దరద, బర్బర, అంగలౌకిక, వేణ, తుషార, బహుధా, బాహ్యతోదర, ఆత్రేయ, భరద్వాజ, ప్రస్థల, దశేరక, లంపక, తావక, రామ, చూడిక, తంగణ, అలస, అలిభద్ర, కిరాతజాతులు, తామస, కర్మమార్గ, సుపార్శ్వ, గణక, కులూత, కుహిక, చూర్ణ, తూర్ణపాద, కుక్కుట, మాండవ్య, పాణవీయ జాతులవారందరు ఉత్తరభారతవాసులు.

అంగా వంగా ముద్గరవాః స్వంతర్గిరి బహిర్గిరాః ॥44॥

తథా ప్రవంగా వాంగేయా మాంసాదా బలదంతికాః ।
బ్రహ్మోత్తరాః ప్రావిజయా భార్గవాంగేయమర్షకాః ॥45॥

ప్రాగ్జ్యోతిషాః పృషఘ్నాశ్చ విదేహాస్తామ్రలిప్తకాః ।
మాలా మగధ గోనందాః ప్రాచ్యాజనపదాస్త్విమే ॥46॥

అంగ, వంగ, ముద్గరవ, అంతర్గిరి, బహిర్గిరి, ప్రవంగ, వాంగేయ, మాంసాద, బలవంతిక, బ్రహ్మోత్తర, ప్రావిజయ, భార్గవ, ఆంగేయమర్షక, ప్రాగ్జ్యోతిష, పృషఘ్న, విదేహ, తామ్రలిప్త, మాల, మగధ, గోనందులు తూర్పుజనపదంలోని వారు.

పుండ్రాశ్చ కేరలాశ్చైవ చౌడాః కుల్యాశ్చ రాక్షస ।
జానుకా మూషికాదాశ్చ కుమారాదా మహాశకాః ॥47॥

మహారాష్ట్రా మాహిషికాః కాలింగాశ్చైవ సర్వశః ।
ఆభీరాః సహవైసక్యా ఆరణ్యాః శబరాశ్చ యే ॥48॥

పులిందా వింధ్యశైలేయా వైదర్భా దండకైః సహ ।
పౌరికాః సారికాశ్చైవ అశ్మకా భోగవర్ధనాః ॥49॥

నైమికాః కుందలా ఆంధ్రాః ఉలిదా నలకారకాః ।
దాక్షిణాత్యా జనపదాస్త్విమే శాలకటంకట ॥50॥

ఓ రాక్షసరాజా! పుండ్ర, కేరళ, చౌడ, కుల్య, జానుక, మూషికాద, కుమారాద, మహాశక, మహారాష్ట్ర, మాహిషిక, కాళింగ, ఆభీర, వైసకి, ఆరణ్య, శబర, పులింద, వింధ్యశైలేయ, వైదర్భ, దండక, పౌరిక, సారిక, అశ్మక, భోగవర్ధన, నైమిక, కుందల, ఆంధ్ర, ఉళిద, నలకారక మున్నగు జనపదాలు దక్షిణభాగంలో ఉన్నాయి.

శూర్పారకా వారిధానా దుర్గాశ్చాలీకటైఃసహ ।
పులీయాశ్చాసి నీలాశ్చ తాపసాస్తామసాస్తథా ॥51॥

కారస్కరాస్తు భమినో నాసికాంతాః సునర్మదాః ।
దారుకచ్ఛాః సుమాహేయాః సహ సారస్వతైరపి ॥52॥

వాత్సీయాశ్చ సురాష్ట్రాశ్చ ఆవంత్యాశ్చార్బుదైఃసహ ।
ఇత్యేతే పశ్చిమామాశాం స్థితా జానపదా జనాః ॥53॥

శూర్పారక, వారిధాన, దుర్గ, శాలీకట, పులీయ, నీల, తాపస, తామస, కారస్కర, భమిన, నాసికాంత, నర్మద, దారుకచ్ఛ, సుమాహేయ, సారస్వత, వాత్సేయ, సురాష్ట్ర, అవంత్య, అర్బుద ఇవి పశ్చిమానగల జనపదాలు. వీరందరు అక్కడి జనులు.

కారూషాశ్చైకలవ్యాశ్చ మేకలాశ్చోత్కలైః సహ ।
ఉత్తమర్ణా దశార్ణాశ్చ గోప్తాః కింకవరైః సహ ॥54॥

తోశలాః కోశలాశ్చైవ త్రైపురాః ఖేల్లిశాస్తథా ।
తురగాస్తుంబరాశ్చైవ వహేలా నైషధైః సహ ॥55॥

అనూపాస్తుండికేరాశ్చ వీతహోత్రా స్త్వవంతయః ।
సుకేశే వింధ్యమూలస్థాస్త్విమే జనపదాః స్మృతాః ॥56॥

ఓ సుకేశీ! కారుష, ఏకలవ్య, మేకల, ఉత్కల, ఉత్తమర్ణ, దశార్ణ, గోప్త, కింకవర. తోశల, కోశల, త్రైపుర, ఖేల్లిశ, తురగ, తుంబర, వహేల, నైషధ, అనూప, తుండికేర, వీతహోత్ర, అవంతి ఈ జనపదాలు వింధ్యపర్వత పాదప్రదేశంలో ఉన్నాయి.

అన్యాన్దేశాన్ప్రవక్ష్యామః పర్వతాశ్రయణస్తు యే ।
నిరాహారా హంసమార్గాః కుపథాస్తంగణాః ఖశాః ॥57॥

కుథ ప్రావరణాశ్చైవ ఊర్ణాప్లుష్టాః సుహూహుకాః ।
త్రిగర్తాశ్చ కిరాతాశ్చ తోమరాః శిశివాద్రికాః ॥58॥

ఇమే తవోక్తా విషయాః సువిస్తరాద్ద్వీపే కుమారే రజనీచరేశ ।
ఏతేషు దేశేషు చ దేశధర్మాన్ సంకీర్త్యమానాన్ శ్రుణు తత్త్వతో హి ॥59॥

ఓ రజనీచరేశ్వరా! ఇక పర్వత ప్రాంతాలలోని ఇతర జనపదాలనుగూర్చి వివరిస్తాము. నిరాహార, హంసమార్గ, కుపథ, తంగణ, ఖశ, కుథప్రావరణ, ఊర్ణ, ప్లుష్ట, హూహుక, త్రిగర్త, కిరాత, తోమర మున్నగునవి హిమవన్నగ ప్రదేశాలు.

కుమారద్వీపంలోని జనపదాలను గూర్చి వివరంగా చెప్పాము. ఇక ఈ ప్రదేశాలలో ఆచరింపబడే ధర్మాచారాలను గూర్చి వివరిస్తాము. శ్రద్ధగా వినుము.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే భువనకోశవర్ణనం నామ త్రయోదశోఽధ్యాయః ॥13॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి భువనకోశవర్ణనం అనే పదమూడవ అధ్యాయం సమాప్తం



చతుర్దశోऽధ్యాయః - పద్నాల్గవ అధ్యాయం
సుకేశ్యనుశాసనమ్ - సుకేశ్యనుశాసనం

ఋషయ ఊచుః - ఋషులు పలికారు.

అహింసా సత్యమస్తేయం దానం క్షాంతిర్దమః శమః ।
అకార్పణ్యం చ శౌచం చ తపశ్చ రజనీచర ॥1॥

దశాంగో రాక్షసశ్రేష్ఠ ధర్మోऽసౌ సార్వవర్ణికః ।
బ్రాహ్మణస్యాపి విహితా చాతురాశ్రమ్యకల్పనా ॥2॥

ఓ రాక్షసశ్రేష్ఠా! అహింస, సత్యం, అస్తేయం (అచౌర్యం), దానం, క్షాంతి (సహనం), దమం (ఇంద్రియ నిగ్రహం), శమం (శాంతి), లోభం లేకుండుట, పవిత్రత, తపస్సు, మొదలైన పది సర్వవర్ణాలవారికి నిర్దేశింపబడిన ధర్మదేవతయొక్క అంగాలు. ఈ ధర్మాలు నాలుగు ఆశ్రమాల వారికి విహితమైనప్పటికి బ్రాహ్మణులకు కూడా అనుష్ఠేయాలే.

సుకేశి రువాచ - సుకేశి పలికాడు.

విప్రాణాం చాతురాశ్రమ్యం విస్తరాన్మే తపోధనాః ।
ఆచక్షధ్వం న మే తృప్తిః శ్రుణ్వతః ప్రతిపద్యతే ॥3॥

ఓ తపోధనులారా! బ్రాహ్మణులు జీవితంలో నాల్గు ఆశ్రమాలయందు ఆచరించవలసిన ధర్మవిధులను గూర్చి నాకు చెప్పండి. ఇంతవరకు వినినదానితో నా జ్ఞానతృష్ణ తీరలేదు.

ఋషయ ఊచుః - ఋషులు పలికారు.

కృతోపనయనః సమ్యగ్ బ్రహ్మచారీ గురౌ వసేత్ ।
తత్ర ధర్మోऽస్య యస్తం చ కథ్యమానం నిశామయ ॥4॥

స్వాధ్యాయోऽథాగ్ని శుశ్రూషా స్నానం భిక్షాటనం తథా ।
గురోర్నివేద్య తచ్చాద్యమనుజ్ఞాతేన సర్వథా ॥5॥

గురోః కర్మణి సోద్యోగః సమ్యక్ ప్రీత్యుపపాదనమ్ ।
తేనాహూతః పఠేచ్చైవ తత్పరో నాన్యమానసః ॥6॥

ఏకం ద్వౌ సకలాన్వాऽపి వేదాన్ప్రాప్య గురోర్ముఖాత్ ।
అనుజ్ఞాతో వరం దత్వా గురవే దక్షిణాం తతః ॥7॥

గృహస్థాశ్రమ కామస్తు గార్హస్థ్యాశ్రమ మావసేత్ ।
వానప్రస్థాశ్రమం వాऽపి చతుర్థం స్వేచ్ఛయాऽऽత్మనః ॥8॥

తత్రైవ వా గురోర్గేహే ద్విజో నిష్ఠామవాప్నుయాత్ ।
గురోరభావే తత్పుత్రే తచ్ఛిష్యే తత్సుతం వినా ॥9॥

శుశ్రూషన్నిరభిమానో బ్రహ్మచర్యాశ్రమం వసేత్ ।
ఏవం జయతి మృత్యుం స ద్విజః సాలకటంకట ॥10॥

ఉపావృత్తైస్తు తైస్తస్మాద్గృహస్థాశ్రమకామ్యయా ।
అసమానార్షకులజా కన్యోద్వాహ్యా నిశాచర ॥11॥

స్వకర్మణా ధనం లబ్ధ్వా పితృదేవాఽతిథీనపి ।
సమ్యక్ సంప్రీణయేద్భక్త్యా సదాచారరతో ద్విజః ॥12॥

ఓ రాక్షసరాజా! ఉపనయనమయిన పిమ్మట బ్రహ్మచారి గురుకులావాసం చేస్తూ, అక్కడి విధులన్నీ పాటించాలి. వినుము. వేదాధ్యయనం, అగ్నిసేవనం, స్నానం, భిక్షాటనం, తెచ్చిన భిక్షను గురువునకు నివేదించి ఆయన అనుజ్ఞతో భుజించుట. ఉత్సాహంతో గురువుగారికి అన్నివిధాలా శుశ్రూష చేస్తూ, ఆయన ప్రేమకు పాత్రులు కావడం, గురువు పిలిచినపుడు భక్తి శ్రద్ధలతో వెళ్ళి ఆయన బోధించే పాఠాలు వినడం. ఒకటి రెండు లేక వేదాలనన్నిటిని గురుముఖతః అభ్యసించి, గురువునకు తగిన దక్షణనిచ్చి, ఆయన అనుజ్ఞతో తన ఇష్టప్రకారం గృహస్థాశ్రమాన్నిగాని, వానప్రస్థాశ్రమాన్నిగాని, సన్న్యాసాశ్రమాన్నిగాని స్వీకరించడం, లేదా గురువు ఇంట్లోనే వుండి నైష్ఠికజీవితం గడపడం, ఆయన తరువాత ఆయన కుమారుని గాని, కుమారులు లేని పక్షంలో ఆయన శిష్యులను గాని, ఏ మాత్రం గర్వాభిమానాలు లేకుండా సేవించడం, బ్రహ్మచర్యాశ్రమవిధులు. ఓ రాక్షసరాజా! ఈ విధంగా నడుచుకొనే బ్రాహ్మణుడు మృత్యువును కూడా జయిస్తాడు. ఓ రాక్షసరాజా! గృహస్థుగానుండగోరినవాడు గురువు యొక్క ఆశ్రమం వదలి, తనకంటే భిన్నగోత్ర ఋషి పరంపరకు చెందిన ఉత్తమకులవధువును భార్యగా స్వీకరించాలి. తన విధ్యుక్త ధర్మానుసారం ధనోపార్జన చేసి, పితృదేవతలను, అతిథులను భక్తితో సంతృప్తి పరచుచు, చక్కని నడవడిక కలిగియుండాలి.

సుకేశి రువాచ – సుకేశి పలికాడు.

సదాచారేతి గదితం యుష్మాభిర్మమ సువ్రతాః ।
లక్షణం శ్రోతుమిచ్ఛామి కథయధ్వం తదద్య మే ॥13॥

సదాచరణం, మంచి నడవడిక అన్నారు కదా! ఆ మంచి నడవడిక అనగానేమో దయచేసి వివరించండి.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

సదాచారో నిగదితస్తవ యోఽస్మాభి రాదరాత్ ।
లక్షణం తస్య వక్ష్యామస్తచ్ఛృణుష్వ నిశాచర ॥14॥

ఓ రాక్షసేంద్రా! నీమీదగల ఆదరంతో నీకు సదాచారాన్ని వివరించాము. దానిని గురించి వివరంగా వినుము.

గృహస్థేన సదా కార్యమాచారపరిపాలనమ్ ।
న హ్యాచార విహీనస్య భద్రమత్ర పరత్ర చ ॥15॥

గృహస్థు ఎల్లప్పుడు ఆచారవంతుడుగా వుండాలి. ఆచారహీనునకు ఇహపరాలలో ఎక్కడా కూడా మేలు కలుగదు.

యజ్ఞదానతపాంసీహ పురుషస్య న భూతయే ।
భవంతి యః సముల్లంఘ్య సదాచారం ప్రవర్తతే ॥16॥

సదాచారాన్ని ఉల్లంఘించినవానికి యజ్ఞ, దాన, తపాదులవల్ల మంచి కలుగదు.

దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతే ।
కార్యో యత్నః సదాచార ఆచారో హ్యన్యలక్షణమ్ ॥17॥

దురాచారపరులైన మానవులకు ఇహపరలోకాలలో సుఖం కలుగదు. కాబట్టి ప్రయత్నపూర్వకముగా అయినా మానవుడు సదాచరణ చేయాలి. సదాచరణ చెడును నశింపజేస్తుంది.

తస్య స్వరూపం వక్ష్యామః సదాచారస్య రాక్షస ।
శ్రుణుష్వైకమనాస్త్వం చ యది శ్రేయోఽభివాంఛసి ॥18॥

ఓ రాక్షసా! ఆ సదాచరణస్వరూపాన్ని చెబుతున్నాను. నీకు శ్రేయస్సు కలగాలని నీవు కోరుకున్నచో ఏకాగ్రమైన మనస్సుతో వినుము.

ధర్మోఽస్యమూలం ధనమస్య శాఖా పుష్పం చ కామః ఫలమస్య మోక్షః ।
అసౌ సదాచార తరుః సుకేశిన్ సంసేవితో యేన స పుణ్యభోక్తా ॥19॥

ఓ సుకేశీ! సదాచారవృక్షానికి ధర్మం మూలం (వ్రేళ్ళు). ధనం దానికి శాఖలు. కామం దాని పుష్పము, మోక్షం దాని ఫలము. ఇటువంటి సదాచారవృక్షాన్ని సేవించేవాడే పుణ్యాత్ముడు.

బ్రాహ్మే ముహూర్తే ప్రథమం విబుధ్యేదనుస్మరేద్దేవవరాన్మహర్షీన్ ।
ప్రాభాతికం మంగలమేవ వాచ్యం యదుక్తవాన్ దేవపతిస్త్రినేత్రః ॥20॥

బ్రాహ్మీముహూర్తంలో నిద్రలేచి, దైవస్మరణ, మహర్షిస్మరణ చేయాలి. అనంతరం శంకరప్రోక్తమైన సుప్రభాతస్తోత్రాన్ని పఠించాలి.

సుకేశి రువాచ – సుకేశి పలికాడు.

కిం తదుక్తం సుప్రభాతం శంకరేణ మహాత్మనా ।
ప్రభాతే యత్పఠన్మర్త్యో ముచ్యతే పాపబంధనాత్ ॥21॥

పాపబంధ విముక్తికై శంకరుడనుగ్రహించిన సుప్రభాతస్తోత్రమెట్టిది?

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

శ్రూయతాం రాక్షసశ్రేష్ఠ సుప్రభాతం హరోదితమ్ ।
శ్రుత్వా స్మృత్వా పఠిత్వా చ సర్వపాపైః ప్రముచ్యతే ॥22॥

ఓ రాక్షస శ్రేష్ఠా! శంకరుడు అనుగ్రహించిన సుప్రభాతస్తోత్రం వినుము. దీనిని వినిన, పఠించిన, స్మరణ గావించిన సర్వపాపవిముక్తి కల్గుతుంది.

బ్రహ్మా మురారిస్త్రిపురాంతకారీ భానుః శశీ భూమిసుతో బుధశ్చ ।
గురుశ్చ శుక్రః సహ భానుజేన కుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥23॥

బ్రహ్మ, మురారి, త్రిపురాంతకుడు, సూర్యుడు, చంద్రుడు, భూమికుమారుడైన అంగారకుడు, బుధుడు, గురుడు, శుక్రుడు, సూర్యపుత్రుడైన శనైశ్చరుడు వీరందరు నాకు సుప్రభాతం అనుగ్రహించుగాక!

భృగుర్వసిష్ఠః క్రతురంగిరాశ్చ మునిః పులస్త్యః పులహః సగౌతమః ।
రైభ్యో మరీచిశ్చ్యవనో ఋభుశ్చ కుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥24॥

భృగువు, వసిష్ఠుడు, క్రతువు, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, గౌతముడు, రైభ్యుడు, మరీచి, చ్యవనుడు, ఋభుడు మున్నగు మహర్షులందరు నాకు సుప్రభాతమొసగుదురుగాక!

సనత్కుమారః సనకః సనందనః సనాతనోఽథాసురిపింగలౌ చ ।
సప్తస్వరాః సప్తరసాతలాశ్చ కుర్వంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥25॥

సనత్కుమారుడు, సనకసనందనులు, సనాతనుడు, అసురిపింగళులు, సప్తస్వరాలు, సప్తరసాతలాలు, నాకు సుప్రభాతము కలిగించుగాక!

పృథ్వీ సగంధా సరసాస్తథాఽఽపః సంస్పర్శవాయుర్జ్వలనః సుతేజాః ।
నభః సశబ్దం మహతా సహైవ యచ్ఛంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥26॥

సప్తార్ణవాః సప్తకులాచలాశ్చ సప్తర్షయో ద్వీపవరాశ్చ సప్త ।
భూరాదయః సప్తతథైవ లోకా యచ్ఛంతు సర్వే మమ సుప్రభాతమ్ ॥27॥

ఇత్థం ప్రభాతే పరమం పవిత్రం పఠేత్స్మరేద్వా శృణుయాచ్చ భక్త్యా ।
దుఃస్వప్ననాశోఽనఘ సుప్రభాతం భవేచ్చ సత్యం భగవత్ప్రసాదాత్ ॥28॥

గంధగుణంగల పృథ్వి, రసాత్మకమైన జలాలు, స్పర్శగుణాత్మకమైన వాయువు, తేజోరూపమైన అగ్ని, శబ్దగుణాత్మకమైన ఆకాశం, మహత్తుతోకూడి ఈ సుప్రభాతవేళ నాకు మంగళము చేకూర్చుగాక!. సప్తసముద్రాలు, సప్తకులపర్వతాలు, సప్తర్షులు, సప్తద్వీపాలు, భూలోకాది సప్తభువనాలు, నాకు సుప్రభాతమును కలిగించుగాక!. ప్రభాతసమయంలో నిద్రనుండి లేచినవెంటనే ఈ సుప్రభాతాన్ని భక్తితోపఠించిన, వినిన, స్మరించిన గతరాత్రి సంభవించిన దుస్స్వప్నదోషాలు తొలగిపోయి, భగవత్కృపవల్ల శుభాలు పొందుతారు. ఇందులో సందేహం లేదు. ఇది సత్యము.

తతః సముత్థాయ విచింతయేత ధర్మం తథార్థం చ విహాయ శయ్యామ్ ।
ఉత్థాయ పశ్చాద్ధరిరిత్యుదీర్య గచ్ఛేత్తదోత్సర్గవిధిం హి కర్తుమ్ ॥29॥

ఈ విధంగా భగవత్స్మరణతో శయ్యనుండి లేచి, ధర్మార్థచింతనపూర్వకంగా శ్రీహరి నామాన్ని స్మరించిన పిమ్మట నిత్య నైమిత్తిక విధులు నిర్వర్తించడానికి ఉపక్రమించాలి.

న దేవ గో బ్రాహ్మణ వహ్నిమార్గే న రాజమార్గే న చతుష్పథే చ ।
కుర్యాదథోత్సర్గమపీహ గోష్ఠే పూర్వాం పరాం నైవ సమాశ్రితో గామ్ ॥30॥

దేవ గో బ్రాహ్మణ వహ్ని మార్గాలను, రాజమార్గాలను, చతుష్పథాలను, గోశాలలను వదలి తూర్పు, పడమర దిక్కులందుగాక మలమూత్రాలను విసర్జించాలి.

తతస్తు శౌచార్థముపాహరేన్మృదం గుదేత్రయం పాణితలే దశైవ ।
తథోభయోః సప్త తథైవ పాదయోః లింగే తథైకాం మృదమాహరేత ॥31॥

మలవిసర్జన తరువాత మట్టితో గుదస్థానాన్ని ముమ్మారు, ఎడమ అరచేతిని పదిపర్యాయాలు, అనంతరం కాళ్ళుచేతులు ఏడుపర్యాయాలు, లింగాన్ని ఒకపర్యాయం శుభ్రం చేసుకోవాలి.

నాంతర్జలాద్రాక్షస మూషికస్థలాత్ శౌచావశిష్టాచరణాత్ తథాన్యైః ।
వల్మీకమృచ్చైవహి శుద్ధయే సదా గ్రాహ్యా సదాచారవిదా నరేణ ॥32॥

ఓ రాక్షసా! సదాచారం తెలిసినవాడు, ఈ మట్టిని నీటినుండి గాని, ఎలుకరంధ్రంనుండి గాని ఇతరులు ఉపయోగించగా మిగిలినదిగాని తీసికొనరాదు. శుద్ధికొరకు ఎల్లప్పుడు పాము పుట్టమట్టినే గ్రహించాలి.

ఉదఙ్ముఖః ప్రాగ్వదనోఽపి విద్వాన్ ప్రక్షాళ్య పాదౌ భువి సంనివిష్టః ।
సమాచమేదద్భిరఫేనిలాభిరాదౌ పరిమృజ్య ముఖం ద్విరద్భిః ॥33॥

తెలిసిన వ్యక్తి తూర్పుముఖంగా గాని, ఉత్తరముఖంగా గాని, తిరిగి పాదప్రక్షాళన గావించుకొని, భూమిపై బాగుగా కూర్చొండి ముందుగా రెండుమార్లు నీటితో ముఖమును కడుగుకొని, నురుగులేని నీటితో పుక్కిలించాలి.

తతః స్పృశేత్ ఖాని శిరఃకరేణ సంధ్యాముపాసీత తతః క్రమేణ ।
కేశాంశ్చ సంశోధ్య చ దంతధావనం కృత్వా తథా దర్పణదర్శనం చ ॥34॥

కృత్వా శిరః స్నానమథాంగికం వా సంపూజ్య తోయేన పితౄన్సదేవాన్ ।
హోమం చ కృత్వాఽఽలభనం శుభానాం కృత్వా బహిర్నిర్గమనం ప్రశస్తమ్ ॥35॥

దూర్వాం దధిం సర్పిరథోదకుంభం ధేనుం సవత్సాం వృషభం సువర్ణమ్ ।
మృద్గోమయం స్వస్తికమక్షతాని లాజామధు బ్రాహ్మణకన్యకాశ్చ ॥36॥

శ్వేతాని పుష్పాణి చ శోభనాని హుతాశనం చందనమర్కబింబమ్ ।
అశ్వత్థవృక్షం చ సమాలభేత తతస్తు కార్యో నిజజాతిధర్మః ॥37॥

అనంతరం చేతితో ఇంద్రియాలను శిరస్సును స్పృశించి, దంతధావనంచేసి, తల దువ్వుకొని, అద్దంలో ముఖం చూసుకొనిన పిమ్మట యథావిధిగా సంధ్యావందనం చేయాలి. అటుపిమ్మట శిరస్నానం గాని, ఆంగికస్నానం గాని చేసి, దేవతలను, పితృదేవతలను పూజించి, తర్పణం విడిచి, హోమం చేసి, మంగళద్రవ్యాలను స్పృశించి, తదనంతరం బయటకు వెళ్ళడం ప్రశస్తం. ఈ మంగళద్రవ్యాలలో గరిక, పెరుగు, నెయ్యి, ఉదకకుంభం, దూడతోనున్న

గోవు, వృషభం, బంగారం, మృత్తిక, ఆవుపేడ, స్వస్తికం, అక్షతలు, పేలాలు, తేనె, బ్రాహ్మణకన్య, తెల్లని పూలు, అగ్ని, చందనం, సూర్యబింబం, రావిచెట్టు మిక్కిలి శుభప్రదమైనవి. దీనిలో ఏ ఒక్కదానినైనను స్పృశించిన పిమ్మట మాత్రమే స్వజాతి ధర్మానుగుణమైన కార్యాలను నిర్వర్తించాలి. అనగా ఈ మంగళద్రవ్యాలలో ఏదేని ఒక మంగళద్రవ్యాన్ని స్పృశించిన పిమ్మట తమ ఇతరపనులను చూచుకోవాలని భావము.

దేశానుశిష్టం కులధర్మమగ్ర్యం స్వగోత్రధర్మం న హి సంత్యజేత ।
తేనార్థసిద్ధిం సముపాచరేత నాసత్ప్రలాపం న చ సత్యహీనమ్ ॥38॥

న నిష్ఠురం నాగమశాస్త్రహీనం వాక్యం వదేత్సాధుజనేన యేన ।
నింద్యో భవేన్నైవ చ ధర్మభేదీ సంగం న చాసత్సు నరేషు కుర్యాత్ ॥39॥

దేశకాలాదులను అనుసరించి తన కులధర్మాన్ని, తన గోత్రం వారికి నిర్దేశింపబడిన ధర్మకార్యాలను వదలకుండా నిర్వర్తించాలి. తద్ద్వారా అర్థసిద్ధిని పొందుతూ, అనవసరవిషయాలు, అసత్యవచనాలు, పరుషవచనాలు, వేదశాస్త్ర విరుద్ధమైన వచనాలు మాట్లాడకుండా కాలాన్ని గడపాలి. లేనిచో సజ్జననిందకు గురి కావలసివస్తుంది. సదాచార శీలురకు ధర్మభంగం చేయడం గాని, దుష్టులతో సహవాసం గాని, ఏనాడూ చేయరాదు.

సంధ్యాసు వర్జ్యం సురతం దివా చ సర్వాసు యోనీషు పరాబలాసు ।
అగారశూన్యేషు మహీతలేషు రజస్వలాస్వేవ జలేషు వీర ॥40॥

ఉభయ సంధ్యలలోగాని, పగటివేళగాని, స్త్రీసంగమం పనికిరాదు. పరస్త్రీలతో సంభోగమసలే పనికిరాదు. ఇండ్లులేని బయలు ప్రదేశాలలోగాని, నీళ్ళలోగాని స్త్రీసంగమం చేయరాదు. ఋతుకాలాలలో (స్త్రీ రజస్వల సమయాలలో) స్త్రీలతో సంగమించరాదు.

వృథాటనం వృథా దానం వృథా చ పశుమారణమ్ ।
న కర్తవ్యో గృహస్థేన వృథా దారపరిగ్రహః ॥41॥

వృథాఽటనాన్నిత్యహాని ర్వృథా దానాద్ధన క్షయః ।
వృథా పశుఘ్నః ప్రాప్నోతి పాతకం నరకప్రదమ్ ॥42॥

ప్రయోజనం లేకుండా తిరుగుట, వ్యర్థంగా దానం చేయుట, పశువులను చంపుట చేయరాదు. గృహస్థు అక్రమంగా భార్యను పరిగ్రహించరాదు. వ్యర్థంగా తిరుగుటవలన నిత్య నైమిత్తిక కర్మలకు అంతరాయం కలుగుతుంది. వృథాగా దానం చేయుటవలన ధననష్టం కలుగుతుంది. ఉబుసుపోకకు పశువులను సంహరించువాడు నరకానికి పోతాడు.

సంతత్యా హానిరశ్లాఘా వర్ణసంకరతో భయమ్ ।
భేతవ్యం చ భవేల్లోకే వృథా దారపరిగ్రహాత్ ॥43॥

పరస్వే పరదారేషు న కార్యా బుద్ధిరుత్తమైః ।
పరస్వం నరకాయైవ పరదారాశ్చ మృత్యవే ॥44॥

అక్రమంగా భార్యను పరిగ్రహించడం వల్ల సంతానహాని, అమంగళకరమైన వర్ణసంకరభయం సంభవిస్తాయి. ఉత్తములైనవారు పరధనానికి గాని, పర భార్యను గాని ఆశించరాదు. వానిలో మొదటిదైన పరధన స్వీకారం నరకద్వారమైతే రెండవదైన పరదారాగ్రహణం మృత్యుహేతువౌతుంది.

నేక్షేత్పరస్త్రియం నగ్నాం న సంభాషేత తస్కరాన్ ।
ఉదక్యా దర్శనం స్పర్శం సంభాషాం చ వివర్జయేత్ ॥45॥

నగ్నంగానున్న పరస్త్రీలను చూడరాదు. చోరులతో సంభాషించరాదు. ఋతుకాలంలోనున్న స్త్రీలను చూడరాదు, తాకరాదు, వారితో సంభాషించరాదు.

నైకాసనే తథా స్థేయం సోదర్యా పరజాయయా ।
తథా సాపత్నమాతుశ్చ తథా స్వ దుహితృష్వపి ॥46॥

తోబుట్టువులతో గాని, ఇతరుల భార్యలతో గాని, సవతితల్లితో గాని, వయస్సువచ్చిన కూతుళ్ళతో గాని ఒకేఆసనంమీద కూర్చుండరాదు.

న చ స్నాయీత వై నగ్నో న శయీత కదాచన ।
దిగ్వాససోఽపి న తథా పరిభ్రమణమిష్యతే ॥47॥

దిగంబరంగా స్నానం చేయుట గాని, శయనించుట గాని, ఎన్నడు చేయరాదు. అదే విధముగా దిగంబరముగా అటు ఇటు తిరుగుట కూడా చేయరాదు.

భిన్నాంశ్చ శయ్యాసనభాజనాదీన్ శుద్ధ్యైరతః సంపరివర్జయేత్తాన్ ।
నందాసు నాభ్యంగముపాచరేత క్షౌరం చ రిక్తాసు జయాసు మాంసమ్ ॥48॥

పూర్ణాసు యోషిత్పరివర్జనీయా భద్రాసు సర్వాణి సమాచరేచ్చ ।
నాభ్యంగమర్కే న చ భూమిపుత్రే క్షౌరం చ శుక్రే రవిజే చ మాంసమ్ ॥49॥

బుధేషు యోషిన్నసమాచరేత శేషేషు సర్వాణి సదైవ కుర్యాత్ ।
చిత్రాసు హస్తే శ్రవణే న తైలం క్షౌరం విశాఖాస్వభిజిత్సు వర్జ్యమ్ ॥50॥

విరిగిపోయిన, పగిలిపోయిన శయ్యలను, ఆసనాలను, పాత్రలను, దూరంగా వదలివేయాలి. పాడ్యమి, షష్ఠి, ఏకాదశి తిథులలో తైలాభ్యంగనం ఆచరించరాదు. చతుర్థి, నవమి, చతుర్దశులలో క్షౌరం చేసుకొనరాదు. శుక్ల పంచమి, దశమి, పూర్ణిమ తిథులలో స్త్రీసంగమం పనికిరాదు. ద్వితీయ, సప్తమి, ద్వాదశి తిథులలో అన్ని పనులు చేయవచ్చును. ఆదివారం, మంగళవారాలలో తలంటుస్నానం, శుక్రవారం క్షౌరకర్మ పనికిరాదు. శనివారం మాంసాహారం వర్జించాలి. బుధవారాలలో స్త్రీసంగమం కూడదు. తక్కిన దినాలలో అన్ని పనులు చేయవచ్చును. చిత్ర, హస్త, శ్రవణ నక్షత్రాలలో అభ్యంగనస్నానము. విశాఖ, అభిజిత్తులలో క్షౌరము పనికిరావు.

మూలే మృగే భాద్రపదాసు మాంసం యోషిన్మఘా కృత్తికమోత్తరాసు ।
సదైవ వర్జ్యం శయనే ఉదక్శిరస్తథా ప్రతీచ్యాం రజనీచరేశ ॥51॥

రాక్షసేశ్వరా! మూల, మృగశిర, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర నక్షత్రదినాలలో మాంసభక్షణం, మఘ, కృత్తిక, ఉత్తర నక్షత్రాలలో స్త్రీసంగమం చేయకూడదు. పశ్చిమ, ఉత్తర దిశలుగా తలపెట్టుకుని ఏనాడు నిద్రించరాదు.

భుంజీత నైవేహ చ దక్షిణాముఖో న చ ప్రతీచీమభిభోజనీయమ్ ।
దేవాలయం చైత్యతరుం చతుష్పథం విద్యాధికం చాపి గురుం ప్రదక్షిణమ్ ॥52॥

దక్షిణదిశగా గాని, పడమటదిక్కుగా గాని కూర్చుండి భోజనం చేయరాదు. దేవాలయాలకు, దారిప్రక్కన నాల్గుమార్గాలు కలిసేచోటవుండే చెట్లకు, విద్యాధికులకు, గురువులకు ప్రదక్షిణగా వెళ్ళాలి.

మాల్యాన్నపానం వసనాని యత్నతో ధృతాని చాన్యైర్న హి ధారయేద్బుధః ।
స్నాయాచ్ఛిరః స్నానతయా చ నిత్యం నిష్కారణం నైవ మహానిశాసు ॥53॥

గ్రహోపరాగే స్వజనాయ యాతే ముక్త్వా చ జన్మర్క్షగతే శశాంకే ।
నాభ్యంగితం కాయముపస్పృశేచ్చ స్నాతో న కేశాన్విధునీత చాపి ॥54॥

తెలిసినవాడు ఇతరులు ఉపయోగించిన పూమాలలను, అన్నపానీయాలను, వస్త్రాలను, ప్రయత్నపూర్వకంగా ధరించరాదు. ప్రతినిత్యం శిరస్నానం చేయాలి. విశేషకారణం లేకుండా రాత్రివేళల శిరస్నానం చేయరాదు. గ్రహణపర్వాలలో గాని, బంధువులు మరణించినప్పుడు గాని, చంద్రుడు జన్మనక్షత్రంలోనికి ప్రవేశించినప్పుడు గాని, రాత్రులలో శిరస్నానం చేయవచ్చును. రాక్షసరాజా! తలంటుకొనినవానిని తాకరాదు. తలస్నానం చేసిన వెంటనే వెంట్రుకలను విదిలించరాదు.

గాత్రాణి నైవాంబర పాణినా చ స్నాతో విమృజ్యాద్రజనీచరేశ ।
వసేత్సుదేశేషు సురాజకేషు సుసంహితేష్వేవ జనేషు నిత్యమ్ ॥55॥

అక్రోధనా న్యాయపరా విమత్సరాః కృషీవలా హ్యోషధిజాతయశ్చ ।
స్వాపస్తు వైద్యో ధనికశ్చ యత్ర సచ్ఛ్రోత్రియస్తత్ర వసేత నిత్యమ్ ॥56॥

న తేషు దేశేషు వసేత బుద్ధిమాన్ సదా నృపో దండరుచిస్త్వశక్తః ।
జనోఽపి నిత్యోత్సవబద్ధవైరః సదా జిగీషుశ్చ నిశాచరేంద్ర ॥57॥

రాక్షసేంద్రా! స్నానం చేసి, విడిచినగుడ్డతో గాని, చేతితో గాని, స్నానం చేసిన శరీరాన్ని తుడుచుకొనకూడదు. చక్కనిరాజ్యపాలనలోనున్న దేశంలో ఐకమత్యంతో కలిసికట్టుగానున్న సమాజంలోను, అక్రోధనులు, న్యాయ ప్రియులునైన జనుల మధ్యలోను, కష్టపడి సేద్యం చేసే రైతులున్న చోట, ఔషధమొక్కలు సమృద్ధిగా లభించే చోట, నదులున్న చోట, వైద్యుడు, ధనికుడు, సచ్ఛ్రోత్రియుడునైన బ్రాహ్మణుడు నివసించే చోట, శాశ్వతంగా నివాసం ఏర్పరుచుకోవాలి. అశక్తుడు, ప్రజలను దండించడం ఇష్టపడే రాజున్న చోట, పరస్పర వైరంతోను, నిత్యోత్సవాలతోను, ఎల్లప్పుడు జగడాలతోను, లాలసులైన జనం నివసించే చోట బుద్ధిమంతుడు నివసించరాదు. ఈ విషయాలు మరువరాదు.

యచ్చ వర్జ్యం మహాబాహో సదా ధర్మస్థితైర్నరైః ।
యద్భోజ్యం చ సముద్దిష్టం కథయిష్యామహే వయమ్ ॥58॥

మహావీరా! ఎల్లప్పుడు ధర్మమునందు నిలకడగల మానవుడు భుజింపదగినవేవో, విడువదగినవేవో చెప్పుచున్నాము. వినుము.

భోజ్యమన్నం పర్యుషితం స్నేహాక్తం చిరసంభృతమ్ ।
అస్నేహా వ్రీహయః శ్లక్ష్ణా వికారాః పయసస్తథా ॥59॥

శశకః శల్యకో గోధా సమేధా మత్స్య కచ్ఛపౌ ।
తద్వద్ద్విదలకాదీని భోజ్యాని మనురబ్రవీత్ ॥60॥

మణిరత్నప్రవాళానాం తద్వన్ముక్తాఫలస్య చ ।
శైలదారుమయానాం చ తృణమూలౌషధాన్యపి ॥61॥

శూర్పధాన్య తృణానాం చ సంహతానాం చ వాససామ్ ।
వల్కలానామశేషాణామంబునా శుద్ధిరిష్యతే ॥62॥

సస్నేహానామథోష్ణేన తిలకల్కేన చాలికమ్ ।
కార్పాసికానాం వస్త్రాణాం శుద్ధిః స్యాద్భహిరంబునా ॥63॥

నాగదంతాస్థిశృంగాణాం తత్క్షణాచ్ఛుద్ధిరిష్యతే ।
పునః పాకేన భాండానాం మృణ్మయానాం చ మేధ్యతా ॥64॥

శుచిభైక్షం కారుహస్తః పణ్యయోషిన్ముఖం తథా ।
రథ్యాగతమవిజ్ఞాతం దాసవర్గేణ యత్కృతమ్ ॥65॥

వాక్ప్రశస్తం చిరానీతమనేకాంతరితం లఘు ।
చేష్టితం బాలవృద్ధానాం బాలస్య తు ముఖం శుచి ॥66॥

నూనె లేదా నేతితో బాగా వండబడిన అన్నం చాలాకాలం క్రిందటిదైనను తినవచ్చును. నూనె, నేయి తగలకుండా వండబడిన బియ్యపుటన్నం, పాయసాన్నం, కుందేలు, ఏదుపంది, మొసలి, ముళ్ళపంది, తాబేలు మాంసాలు , చేపలు, పప్పులు, కూరలు మున్నగువానిని తినవచ్చునని మనువు అభిప్రాయము. మణిరత్నప్రవాళాలు, శిలాదారుమయాలు, తృణధాన్యాలు, గడ్డలు, ఔషధవస్తువులు, నూతనవస్త్రాలు, అన్నిరకాల నారవస్త్రాలు, చెట్ల బెరడుతో చేసిన వస్త్రాలు, నీటితో కడిగి శుద్ధి చేయాలి. జిడ్డు కలిగిన వస్తువులనన్నిటిని నువ్వులనూనెలో కాచిన కషాయంలో శుభ్రం చేయాలి. నూలు ఉన్నిబట్టలను బూడిద కలసిన నీటితో శుభ్రం చేయాలి. ఏనుగుదంతాలు, కొమ్ములు, పరిశుద్ధములే. మట్టిపాత్రలకు శుద్ధిసాధనం అగ్నిసంస్కారం మాత్రమే. భిక్షాటన వల్ల తెచ్చిన అన్నం, శిల్పిహస్తం, స్త్రీముఖం, బజారునుండి తెచ్చినవి, దాసదాసీలు చేసినవి, ప్రశస్తమైన వస్తువులు, చిరకాలం క్రిందట

తెచ్చిన వస్తువులు, చాలా చేతులు మారిన వస్తువులు, తేలిక వస్తువులు, బాల వృద్ధుల కృత్యాలు, బాలల ముఖాలు, ఇవన్నియు పరిశుద్ధములే.

కర్మాంతాంగారశాలాస్తు స్తనంధయసుతాః స్త్రియః ।
వాగ్విపృషో ద్విజేంద్రాణాం సంతప్తాశ్చాంబుబిందవః ॥67॥

ధాన్యపుకొట్లు, బొగ్గు నిల్వచేయు కొట్లు, బాలింతస్త్రీలు, పాలుత్రాగే శిశువులు, బ్రాహ్మణుల నోటినుండి వెలువడు వాక్కుతుంపరలు, ఉష్ణోదకములు ఇవన్నియు పరిశుద్ధములే.

భూమిర్విశుద్ధ్యతే ఖాతదాహమార్జనగోక్రమైః ।
లేపాదుల్లేఖనాత్సేకాద్వేశ్మ సంమార్జనార్చనాత్ ॥68॥

పారతో గడ్డి, గాదం తొలగించి గాని, పైనున్న చెత్త కాల్చి గాని, చీపురుతో చిమ్మి గాని ఒకరాత్రి పగలు ఆవులచే త్రొక్కించి గాని, ఆవుపేడతో అలికించి గాని, ఆవుపంచకం చల్లి గాని భూమిని శుద్ధి చేసుకొనవచ్చును. ఇంటిని ఊడ్చి గాని, ఇంటిలో పూజచేయడంద్వారా గాని ఇంటిని శుద్ధి చేసుకోవాలి.

కేశ కీటావపన్నేఽన్నే గోఘ్రాతే మక్షికాన్వితే ।
మృదంబు భస్మక్షారాణి ప్రక్షేప్తవ్యాని శుద్ధయే ॥69॥

వెంట్రుకలు పడిన, మక్షికాది కీటకాలు వాలిన, గోవులు వాసన చూసిన అన్నం మీద మృత్తిక, భస్మ, క్షారాలు కలిపిన జలం చిలికించి పవిత్రం చేసుకోవాలి.

ఔదుంబరాణాం చామ్లేన క్షారేణ త్రపుసీసయోః ।
భస్మాంబుభిశ్చ కాంస్యానాం శుద్ధిః ప్లావో ద్రవస్య చ ॥70॥

రాగిపాత్రలను ఆమ్లజలంతోను, సీసపుపాత్రలు క్షారజలంతోను, కంచుపాత్రలను బూడిద కలిపిన నీటితోను శుద్ధిచేసుకోవాలి.

అమేధ్యాక్తస్య మృత్తోయైర్గంధాపహరణేన చ ।
అన్యేషామపి తద్ద్రవ్యైః శుద్ధిర్గంధాపహారతః ॥71॥

మలస్పర్శ కలిగిన వస్తువులను దుర్వాసన వదిలే వరకు మట్టితోను, నీటితోను శుద్ధి చేసుకోవాలి. ఇతర వస్తువులను కూడా దుర్గంధం వదిలేవరకు ఆ విధంగానే శుద్ధి చేసుకోవాలి.

మాతుః ప్రస్రవణే వత్సః శకునిః ఫలపాతనే ।
గర్దభో భారవాహిత్వే శ్వా మృగ గ్రహణే శుచిః ॥72॥

చనుబాలు త్రాగే శిశువు పవిత్రుడు. పండు క్రిందకు పడవేసే సమయంలో పక్షి, బరువు మోయుచున్న గాడిద, లేడిని పట్టుకున్న కుక్క పరిశుద్ధమైనవిగా తలంచాలి.

రథ్యాకర్దమతోయాని నావః పథి తృణాని చ ।
మారుతేనైవ శుద్ధ్యన్తి పక్వేష్టకచితాని చ ॥73॥

దారి, బురద, నీరు, పడవలు, దారిలో పెరిగిన గడ్డి, వీటినన్నిటిని గాలి శుభ్రపరుస్తుంది. కాల్చిన ఇటుకలు కూడా ఆ విధంగానే శుభ్రమౌతాయి.

పక్వం ద్రోణాధికం చాన్నమమేధ్యాభిప్లుతం భవేత్ ।
అగ్రముద్ధృత్య సంత్యాజ్యం శేషస్య ప్రోక్షణం స్మృతమ్ ॥74॥

ద్రోణపరిమాణమునకు మించిన వండబడిన అన్నమునకు అపవిత్రవస్తు స్పర్శ కలిగినచో అట్టి అన్నం పైభాగంలోని పొర తీసి పారవైచి, మిగిలిన దానిపై నీరు ప్రోక్షించి శుద్ధి చేసుకోవాలి.

ఉపవాసస్త్రిరాత్రం వా దూషితాన్నస్య భోజనే ।
అజ్ఞాతజ్ఞాతపూర్వే వా నైవ శుద్ధిర్విధీయతే ॥75॥

శుద్ధం కాని అన్నం తెలియక తినినచో మూడురాత్రులు ఉపవాసం చేసి దోషం పోగొట్టుకొనవచ్చును. తెలిసి కూడా దూషితాన్నం తినినచో దానికి శుద్ధి లేనేలేదు.

ఉదక్యాస్నాతనగ్నాంశ్చ సూతికాన్త్యావసాయినః ।
స్పృష్ట్వా స్నాయీత శౌచార్థం తథైవ మృతహారిణః ॥76॥

సస్నేహమస్థి సంస్పృశ్య సవాసాః జలమావిశేత్ ।
ఆచమ్యైవ తు నిఃస్నేహం గామాలభ్యార్కమీక్ష్య చ ॥77॥

నలంఘయేన్నరం నాసృక్ శరీరోద్వర్తనాని చ ।
గృహోదుచ్ఛిష్ట విణ్మూత్ర పాదాంభాంసి క్షిపేర్బహిః ॥78॥

పంచపిండాననుద్ధృత్య న స్నాయాత్పరవారిణి ।
స్నాయీత దేవఖాతేషు సరస్సు చ సరిత్సు చ ॥79॥

నోద్యానాదౌ వికాలేషు ప్రాజ్ఞస్తిష్ఠేత్కదాచన ।
నాలపేజ్జనవిద్విష్టం వీరహీనాం తథా స్త్రియమ్ ॥80॥

రజస్వలయైన స్త్రీని, స్నానము చేయనివానిని, దిగంబరులను, ప్రసూతియైన స్త్రీని, అంత్యజులను, శవవాహకులను తాకినచో స్నానంతో శుద్ధియౌతుంది. మాంసంతో కూడిన ఎముకను తాకినచో సచేలస్నానం చేయాలి. ఎండిన ఎముకను తాకినచో ఆచమనం చేసి గాని ఆవును స్పృశించి గాని, సూర్యుని దర్శించి గాని శుద్ధి చేసుకొనవచ్చును.

రక్తం, నలుగుపెట్టి పారవేసిన పిండి, వీటిని దాటకూడదు. ఎంగిలి, చెత్తా చెదారం, పెద్దలకు పాదప్రక్షాలన చేసిన నీరు, మూత్రాదులు ఇంటికి బయట పారబోయాలి. ఇతరులకు చెందిన జలాశయాలలో స్నానం చేసేముందు

ఐదు దోసిళ్ళ నీరు బయటకు చిమ్మాలి. ప్రకృతిసిద్ధమైన చెరువులలో, జలాశయాలలో, నదీనదాలలో స్నానం చేయాలి. ప్రాజ్ఞుడు అనుచితసమయాలలో, ఉద్యానవనాలలో నిలబడడు. జనవిద్వేషియైన వ్యక్తితో మాట్లాడడు. వితంతువులైన స్త్రీలతో వ్యర్థంగా మాట్లాడడు.

దేవతా పితృ సచ్ఛాస్త్ర యజ్ఞ సత్రాది నిన్దకైః ।
కృత్వా తు స్పర్శమాలాపం శుద్ధ్యతేఽర్కవిలోకనాత్ ॥81॥

దేవ పితృ నిందకులను, వేదశాస్త్ర యజ్ఞాది దూషకులను తాకినను, అట్టివారితో సంభాషించినను వెంటనే సూర్యుని దర్శించి పవిత్రులు కావచ్చును.

అభోజ్యాః సూతికాః షండో మార్జారాఖూ చ కుక్కుటాః ।
పతితాపవిద్ధనగ్నాశ్చండాలాద్యాధమాశ్చ యే ॥82॥

సూతికులు, షండులు, మార్జార, మూషిక, శునక, కుక్కుట పతితులు, అపవిత్రులు, నగ్న చండాలాది హీనులనుండి భోజనం గ్రహించరాదు.

సుకేశి రువాచ – సుకేశి పలికాడు.

భవద్భిః కీర్తితా భోజ్యా య ఏతే సూతికాదయః ।
అమీషాం శ్రోతుమిచ్ఛామి తత్త్వతో లక్షణాని హి ॥83॥

మహనీయులారా! సూతికాదులనుండి భోజనం గ్రహించకూడదన్నారు గదా! అటువంటివారి లక్షణాలు వినాలని కుతూహలంగా వుంది. దయచేసి వారి లక్షణాలు నాకు వివరించండి.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

బ్రాహ్మణీ బ్రాహ్మణశ్చైవ యావచ్ఛేషత్వమాగతౌ ।
తావుభౌ సూతికేత్యుక్తౌ తయోరన్నం విగర్హితమ్ ॥84॥

బ్రాహ్మణుని భ్రష్టుని గావించిన బ్రాహ్మణస్త్రీ మరియు ఆ బ్రాహ్మణుడు ఇద్దరు కూడా "**సూతికలు**" అనబడతారు. వారి చేతితిండి తినరాదు.

న జుహోత్యుచితే కాలే న స్నాతి న దదాతి చ ।
పితృదేవార్చనాద్ధీనః స షండః పరిగీయతే ॥85॥

సకాలంలో స్నాన జప సంధ్యావందనాదులు, హోమాది కర్మలు, దేవ పితృ కార్యాలు, దానధర్మాదులు చేయనివాడు "**షండుడు**".

దంభార్థం జపతే యశ్చ తప్యతే పఠతే తథా ।
న పరత్రార్థముద్యుక్తో మార్జారః పరికీర్తితః ॥86॥

డాంబికంగా జపం, తపం యజ్ఞాదులు చేస్తూ, పరలోకచింతన లేనివాడు "**మార్జారుడు**" అనబడతాడు.

విభవే సతి నైవాత్తి న దదాతి జుహోతి న ।
తమాహురాఖుం తస్యాన్నం భుక్త్వా కృచ్ఛ్రేణ శుద్ధ్యతి ॥87॥

సంపద కలిగినప్పటికి దాన హోమాదులు చేయకుండా తామే అనుభవించువారు "**మూషికాలు**". వారి చేతి అన్నం తినిన, కృచ్ఛ్రవ్రతం చేస్తేనే ఆ పాపం పోతుంది.

సభాగతానాం యః సభ్యః పక్షపాతం సమాశ్రయేత్ ।
తమాహుః కుక్కుటం దేవాస్తస్యాప్యన్నం విగర్హితమ్ ॥88॥

సభలోనున్న సభ్యులపట్ల పక్షపాతబుద్ధితో బాహాటంగా వ్యవహరించేవాడు "**కుక్కుటుడు**". అటువంటివాడు ఒసగిన అన్నం కూడా తినరాదు.

స్వధర్మం యః సముత్సృజ్య పరధర్మం సమాచరేత్ ।
అనాపది స విద్వద్భిః పతితః పరికీర్త్యతే ॥89॥

ఎటువంటి ఆపద కలగకపోయినను స్వధర్మాన్ని విడిచి, పరధర్మాన్ని ఆశ్రయించేవాడు "**పతితుడు**" అని పండితులచే పరిగణింపబడతాడు.

దేవత్యాగీ పితృత్యాగీ గురువద్భుగ్నకస్తథా ।
గోబ్రాహ్మణస్త్రీవధకృదపవిద్ధః ప్రకీర్త్యతే ॥90॥

దేవపితృకార్యాలు వదలినవాడు, గురువులపట్ల భక్తి లేనివాడు, గోబ్రాహ్మణులను, స్త్రీలను వధించు దుష్టుడు "**అపవిద్ధుడు**" అని పిలవబడతాడు.

యేషాం కులే న వేదోఽస్తి న శాస్త్రం నైవ చ వ్రతమ్ ।
తే నగ్నాః కీర్తితాః సద్భిస్తేషామన్నం విగర్హితమ్ ॥91॥

ఎవరి ఇంట్లో ఎప్పుడు ఎటువంటి వ్రతాలు గాని, వేదాధ్యయన శాస్త్రచర్చలు గాని జరగవో వారు "**నగ్నులు**". వారింటిలో భోజనం గర్హించదగినది.

ఆశార్తానామదాతా చ దాతుశ్చ ప్రతిషేధకః ।
శరణాగతం యస్త్యజతి స చండాలోఽధమో జనః ॥92॥

ఇతరులకు ఆశ కలిగించి దానిని పూర్తిచేయనివాడు, దానం చేసే వానిని అడ్డగించేవాడు, తనను ఆశ్రయించు వానిని నట్టేట ముంచువాడు "**చండాలుడు**". అట్టివాడు అధముడు.

యో బాంధవైః పరిత్యక్తః సాధుభిర్బ్రాహ్మణైరపి ।
కుండాశీయశ్చ తస్యాన్నం భుక్త్వా చాంద్రాయణం చరేత్ ॥93॥

బంధువులచే పరిత్యజింపబడినవాడు, సాధువులచేత, బ్రాహ్మణులచేత విడువబడినవాడు కుండాశీయుడు. అట్టివానిఇంట భుజించేవాడు చాంద్రాయణవ్రతం ఆచరించాలి.

యో నిత్యకర్మణో హానిం కుర్యాన్నైమిత్తికస్య చ ।
భుక్త్వాన్నం తస్య శుద్ధ్యేత త్రిరాత్రోపోషితో నరః ॥94॥

నిత్య నైమిత్తిక కర్మలు వదలిన వానింట భుజించువాడు మూడు రాత్రులు ఉపవాసము చేస్తే శుద్ధుడౌతాడు.

నిత్యస్య కర్మణో హానిః కేవలం మృతజన్మసు ।
న తు నైమిత్తికోచ్ఛేదః కర్తవ్యో హి కథంచన ॥95॥

ఇంటిలో జననం గాని, మరణం గాని సంభవిస్తే నిత్యకర్మలు మానవచ్చు గాని నైమిత్తిక కర్మలు చేయుట ఎన్నడు మానరాదు.

జాతే పుత్రే పితుః స్నానం సచైలం తు విధీయతే ।
మృతే చ సర్వబంధూనామిత్యాహ భగవాన్ భృగుః ॥96॥

పుత్రుడు పుట్టగానే తండ్రి సచేలస్నానం చేయాలి. కుటుంబంలోనివారు ఎవరైనా మరణిస్తే బంధువులందరు స్నానం చేయాలని భృగుమహర్షి వచించాడు.

ప్రేతాయ సలిలం దేయం బహిర్దగ్ధ్వా తు గోత్రజైః ।
ప్రథమేఒహ్ని చతుర్థే వా సప్తమేవాఒస్థిసంచయమ్ ॥97॥

మరణించినవానిని ఇంటిబయట దూరంగా దహనం చేయాలి. సగోత్రీయులు జలతర్పణం వదలాలి. మొదటిరోజున గాని, నాల్గవరోజున గాని, ఏడవరోజున గాని అస్థిసంచయనం చేయాలి.

ఊర్ధ్వం సంచయనాత్తేషామంగస్పర్శో విధీయతే ।
సోదకైస్తు క్రియా కార్యా సంశుద్ధైస్తు సపిండజైః ॥98॥

అస్థి సంచయనానంతరం వాని అంగస్పర్శ విధింపబడినది. సపిండీకులు శుద్ధి అనంతరం శ్రాద్ధకర్మ చేయాలి.

నృపోద్బంధన శస్త్రాంబు వహ్నిపాతమృతేషు చ ।
బాలే ప్రవ్రాజి సంన్యాసే దేశాంతర మృతే తథా ॥99॥

సద్యః శౌచం భవేద్వీర తచ్చాప్యుక్తం చతుర్విధమ్ ।
గర్భస్రావే తదేవోక్తం పూర్ణకాలేన చేతరే ॥100॥

విషప్రయోగం వల్ల, ఉరి వల్ల, శస్త్రాల వల్ల, అగ్ని వల్ల, నీటిలో మునిగినందు వల్ల, పైనుండి క్రిందికి పడినందు వల్ల, మృతికలిగినప్పుడు, బాలురు, సన్న్యాసులు మరణించినప్పుడు, దేశాంతరగతులు మరణించినప్పుడు ఇట్టి పరిస్థితులలో నాల్గు రకాలైన సద్యశ్శుద్ధి చెప్పబడింది. గర్భస్రావం కలిగినప్పుడు కూడా ఇంతే. ఇతరులకు మాత్రం ఆశౌచకాలం పరిపూర్తియైన పిమ్మట మాత్రమే శుద్ధియౌతుంది.

బ్రాహ్మణానామహోరాత్రం క్షత్రియాణాం దినత్రయమ్ ।
షడ్రాత్రం చైవ వైశ్యానాం శూద్రాణాం ద్వాదశాహ్నికమ్ ॥101॥

దశ ద్వాదశ మాసార్ధమాససంఖ్యైర్దినైర్గతైః ।
స్వాః స్వాః కాలే క్రియాః కుర్యుః సర్వే వర్ణా యథాక్రమమ్ ॥102॥

బ్రాహ్మణులకు ఒకరోజు, క్షత్రియులకు మూడురోజులు, వైశ్యులకు ఆరురోజులు, శూద్రులకు 12 రోజులు అశుచి. అన్ని జాతులవారును వారి వారి ఆచారాలను అనుసరించి వరుసగా 10,12,15,30 రోజులకు శ్రాద్ధకర్మలు చేయాలి.

ప్రేతముద్దిశ్య కర్తవ్యమేకోద్దిష్టం విధానతః ।
సపిండీకరణం కార్యం ప్రేత ఆవత్సరాన్నరైః ॥103॥

తతః పితృత్వమాపన్నే దర్శపూర్ణాదిభిర్దినైః ।
ప్రీణనం తస్య కర్తవ్యం యథా శ్రుతి నిదర్శనాత్ ॥104॥

చనిపోయినవారికి విధివిధానంగా ఏకోద్దిష్టకర్మ జరపాలి. సంవత్సరాంతంలో సపిండీకరణశ్రాద్ధం చేయాలి. దానితో ప్రేతత్వవిముక్తి కలిగి, పితృత్వం కలుగుతుంది. తదనంతరం ఆ పితరులకు అమావాస్య, పూర్ణిమ తిథులలో వేదవిహితవిధానంగా తర్పణం చేయాలి.

పితురర్థం సముద్దిశ్య భూమి దానాదికం స్వయమ్ ।
కుర్యాద్యేనాస్య సుప్రీతాః పితరో యాంతి రాక్షస ॥105॥

యద్యదిష్టతమం కించిద్యచ్చాస్య దయితం గృహే ।
తత్తద్గుణవతే దేయం తదేవాక్షయమిచ్ఛతా ॥106॥

ఓ రాక్షసేశ్వరా! పితరులకు ఉత్తరోత్తరసద్గతులు కలగడానికి భూ, గో, హిరణ్య దానాదులు చేయాలి. పితరులకు వారి జీవితకాలంలో ఏ ఏ వస్తువులు మిక్కిలి ఇష్టమో, ఏవి మిక్కిలి ప్రియకరమైనవో ఆయా వస్తువులు అక్షయత్వం పొందాలనుకునే బుద్ధిమంతులు అర్హులైనవారికి ఆయా వస్తువులను దానం చేయాలి.

అధ్యేతవ్యాస్త్రయో నిత్యం వేదాశ్చ విదుషా సదా ।
ధర్మతో ధనమాహార్యం యష్టవ్యం చాపి శక్తితః ॥107॥

విద్వాంసుడు ప్రతిదినం వేదత్రయాన్ని అధ్యయనం చేయాలి. ధర్మమార్గంలో ధనార్జనచేసి, తన శక్త్యనుసారం యజ్ఞాదులు చేయాలి.

యచ్చాపి కుర్వతో నాత్మా జుగుప్సామేతి రాక్షస ।
తత్కర్తవ్యమశంకేన యన్న గోప్యం మహాజనే ॥108॥

ఓ దానవా! తన అంతరాత్మకు జుగుప్సావహం కాని పనులు. పెద్దల యెడ దాచనవసరం లేని పనులు, గృహస్థుడైనవాడు సంకోచం లేకుండా ఆచరించాలి.

ఏవమాచరతో లోకే పురుషస్య గృహే సతః ।
ధర్మార్థకామసంప్రాప్తిం పరత్రేహ చ శోభనా ॥109॥

ఈ విధంగా సదాచరణచేసే గృహస్థులకు ఎల్లప్పుడు ధర్మార్థకామాలు సంప్రాప్తిస్తాయి. అట్టివారు ఈ లోకంలోను, పరలోకంలోను కూడ సుఖాలు పొందుతారు.

ఏష తూద్దేశతః ప్రోక్తో గృహస్థాశ్రమ ఉత్తమః ।
వానప్రస్థాశ్రమం ధర్మం ప్రవక్ష్యామ్యవధార్యతామ్ ॥110॥

ఇంతవరకు ఉత్తమగృహస్థాశ్రమధర్మాలు చెప్పియున్నాము. ఇక వానప్రస్థాశ్రమధర్మాలు వివరిస్తాము. జాగ్రత్తగా వినుము.

అపత్యసంతతిం దృష్ట్వా ప్రాజ్ఞో దేహస్య చానతిమ్ ।
వానప్రస్థాశ్రమం గచ్ఛేదాత్మనః శుద్ధికారణమ్ ॥111॥

తెలివిగల గృహస్థు పుత్రపౌత్రాదులు కలిగిన పిమ్మట తనశరీరపాటవం తగ్గడం గ్రహించిన వెంటనే ఆత్మశుద్ధికోసం వానప్రస్థాశ్రమం స్వీకరించాలి.

తత్రారణ్యోపభోగైశ్చ తపోభిశ్చాత్మదర్శనమ్ ।
భూమౌ శయ్యా బ్రహ్మచర్యం పితృదేవాతిథిక్రియాః ॥112॥

హోమస్త్రిషవణం స్నానం జటావల్కలధారణమ్ ।
వన్యస్నేహనిషేవిత్వం వానప్రస్థవిధిస్త్వయమ్ ॥113॥

అరణ్యాలలో దొరికే కందమూలాదులు తింటూ, ఇంద్రియాలను అదుపులోనుంచుకొని ఆత్మదర్శనం కొరకు తపమాచరించాలి. భూమి మీద శయనిస్తూ బ్రహ్మచర్యం పాటించాలి. పితరులను, దేవతలను ఉపాసిస్తూ అతిథి అభ్యాగతుల సేవలు చేయాలి. హోమం, త్రికాలస్నానం, సంధ్యానుష్ఠానం, జటావల్కల ధారణం, వనాలలో లభ్యమయ్యే తైలాదులు ఉపయోగిస్తూ వానప్రస్థజీవితం గడపాలి.

సర్వసంగపరిత్యాగో బ్రహ్మచర్యమమానితా ।
జితేంద్రియత్వమావాసే నైకస్మిన్ వసతే చిరమ్ ॥114॥
అనారంభస్తథాऽऽహారో భిక్షాన్నం నాతికోపితా ।
ఆత్మజ్ఞానావబోధేచ్ఛా తథా చాత్మావబోధనమ్ ॥115॥
చతుర్థే చాశ్రమే ధర్మాస్తేఽస్మాభిః పరికీర్తితాః ।

సర్వసంగపరిత్యాగం, బ్రహ్మచర్యం, అహంభావం లేకుండుట, ఇంద్రియాలను జయించుట, ఒకేచోట దీర్ఘకాలం నివసింపకుండుట, లౌకికకార్యాలకు దూరంగా ఉండుట, భిక్షాన్నం ఆహారంగా తీసుకొనుట, చీటికి మాటికి కోపింపకుండుట, ఆత్మజ్ఞానాపేక్ష కలిగి, ఆత్మను తెలుసుకొనుట, తెలియజెప్పుట ఇవి సన్న్యాసాశ్రమధర్మాలు.

వర్ణధర్మాస్తథా చాన్యాన్నిశామయ నిశాచర ॥116॥

గార్హస్థ్యం బ్రహ్మచర్యం చ వానప్రస్థం త్రయాऽऽశ్రమాః ।
క్షత్రియస్యాపి గదితో య ఆచారో ద్విజస్య హి ॥117॥

నిశాచరా! ఇప్పుడు నాల్గు వర్ణాల వారు అనుసరించవలసిన ధర్మాలను వివరిస్తాము.బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం అను మూడు ఆశ్రమ విధులు బ్రాహ్మణులతోబాటు క్షత్రియులు కూడా ఆచరించాలి.

వైఖానసత్వం గార్హస్థ్యమాశ్రమద్వితయం విశః ।
గార్హస్థ్యమాశ్రమం త్వేకం శూద్రస్య క్షణదాచర ॥118॥

ఓ రాక్షసా! గార్హస్థ్య, వానప్రస్థ ఆశ్రమధర్మాలు రెండింటిని వైశ్యులు అనుష్ఠించాలి. శూద్రులకు గృహస్థాశ్రమ నిర్వహణ మాత్రమే ఉత్తమమైన ధర్మంగా చెప్పబడింది.

స్వాన్ స్వాన్ వర్ణాశ్రమ ప్రోక్తాన్ స్వధర్మాన్నైవ హాపయేత్ ।
సంతాపయతి తస్యాసౌ పరికుప్యతి భాస్కరః ॥119॥

కుపితః కులనాశాయ దేహరోగవివృద్ధయే ।
భానుర్వై యతతే తస్య నరస్య క్షణదాచర ॥120॥

తస్మాత్స్వధర్మం న హి సంత్యజేత న హాపయేచ్చాపి హి నాత్మవంశమ్ ।
యః సంత్యజేచ్చాపి నిజం హి ధర్మం తస్మై ప్రకుప్యేత దివాకరస్తు ॥121॥

ఈ విధంగా నాల్గు వర్ణాల వారు తమకు విధింపబడిన ఆశ్రమధర్మాలను విడువకుండా ఆచరించాలి. అట్లుగాక తమ తమ ధర్మాలను పరిత్యజించినవారు ప్రత్యక్షదైవమైన సూర్యుని కోపానికి గురికాగలరు. సూర్యుడు కుపితుడైనచో మానవులు దేహరోగపీడితులౌతారు. కులనాశనం జరుగుతుంది. కాబట్టి ఓ రాక్షసరాజా! తన క్షేమం, వంశక్షేమం కోరే మానవుడు ఎట్టి పరిస్థితులలోను స్వధర్మాచరణాన్ని, తన వంశధర్మాన్ని విడువరాదు. అట్లు వదలిన మానవుడు భాస్కరుని కోపాగ్నికి ఆహుతి కాగలడు. ఇది నిశ్చయము.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్తో మునినా సుకేశీ ప్రణమ్య తాన్ బ్రహ్మనిధీన్ మహర్షీన్ ।
జగామ చోత్పత్యపురం స్వకీయం ముహుర్ముహుర్ధర్మమవేక్షమాణః ॥122॥

ఓ నారదా! ఈవిధంగా ఋషులచే చేయబడిన ప్రబోధను విని, సుకేశి బ్రహ్మజ్ఞాననిధులైన ఆ మహర్షులకు నమస్కరించి, వారి ఉపదేశమును మరల మరల నెమరువేసుకొనుచు ఆకాశమార్గంలో తన నగరానికి తిరిగి వెళ్ళాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే సుకేశ్యనుశాసనం నామ చతుర్దశోఽధ్యాయః ॥14॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి సుకేశ్యనుశాసనమనే పద్నాల్గవ అధ్యాయం సమాప్తం



పంచదశోఽధ్యాయః – పదిహేనవ అధ్యాయం

లోలార్క జననమ్ – లోలార్కుని పుట్టుక

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తతః సుకేశిర్దేవర్షే గత్వా స్వపురముత్తమమ్ ।
సమాహూయాబ్రవీత్సర్వాన్రాక్షసాన్ధార్మికం వచః ॥1॥

అహింసా సత్యమస్తేయం శౌచమింద్రియసంయమః ।
దానం దయా చ క్షాంతిశ్చ బ్రహ్మచర్యమమానితా ॥2॥

శుభా సత్యా చ మధురా వాఙ్నిత్యం సత్క్రియారతిః ।
సదాచారనిషేవిత్వం పరలోకప్రదాయకాః ॥3॥

ఇత్యూచుర్మునయో మహ్యం ధర్మమాద్యం పురాతనమ్ ।
సోఽహమాజ్ఞాపయే సర్వాన్ క్రియతామవికల్పతః ॥4॥

ఓ దేవర్షీ! సుకేశి ఉత్తమమైన తన నగరం చేరి, ధార్మికులైన రాక్షసులనందరిని పిలిపించి, రాక్షసులతో ఇలా పలికాడు. "రాక్షసులారా! అహింస, సత్యం, అచౌర్యం, శౌచం, ఇంద్రియనిగ్రహం, దానం, దయ, క్షాంతి, బ్రహ్మచర్యం, అమానిత్వం, శుభకరమైన, సత్యమైన, మధురమైన భాషణం, ఎల్లప్పుడు మంచి పనులు చేయుటలో ఆసక్తి, సదాచరణం, చక్కని నడవడిక, ఉత్తమలోకాలు కలిగిస్తాయని పురాతనము, భవ్యమునైన ధర్మస్వరూపాన్ని మునులు నాకు తెలియజేసియున్నారు. దీనిని నిస్సంకోచంగా మీరందరు ఆచరించాలని ఆజ్ఞాపిస్తున్నాను".

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తతః సుకేశివచనాత్సర్వ ఏవ నిశాచరాః ।
త్రయోదశాంశతో ధర్మం చక్రుర్ముదితమానసాః ॥5॥

సుకేశి ఆజ్ఞానుసారం ఆ రాక్షసులందరు 13 అంశాలతో కూడిన ధర్మాన్ని ఎంతో నిష్ఠతో, సంతోషంతో అనుష్ఠింపసాగారు.

తతః ప్రవృద్ధిం సుతరామగచ్ఛంత నిశాచరాః ।
పుత్రపౌత్రార్థసంయుక్తాః సదాచారసమన్వితాః ॥6॥

ఆ ధర్మాచరణప్రభావంతో నిశాచరులు పుత్రపౌత్రాభివృద్ధి, శక్తిసంపదాభివృద్ధి కలిగి పురోగమించారు.

తతస్తు తేజసా తేషాం రాక్షసానాం మహాత్మనామ్ ।
గంతుం నాశక్నువన్సూర్యో నక్షత్రాణి న చంద్రమాః ॥7॥

రాక్షసులావిధంగా సంపాదించిన ధర్మజ్యోతి తేజస్సు సూర్యచంద్రనక్షత్రాల రాకపోకలను నిరోధించింది.

తతస్త్రిభువనే బ్రహ్మన్నిశాచరపురం విభో ।
దివా చంద్రేన సదృశః క్షణదాయాం చ సూర్యవత్ ॥8॥

విప్రోత్తమా! ఆ రాక్షసుల నగరం ముల్లోకాలలోను పగటివేళలలో చంద్రుని వలెను, రాత్రిసమయాలలో సూర్యుని వలెను ప్రకాశింపసాగింది.

న జ్ఞాయతే గతిర్వ్యోమ్ని భాస్కరస్య తతోఽంబరే ।
శశాంకమివ తేజస్త్వాదమన్యన్త పురోత్తమమ్ ॥9॥

తదనంతరం ఆకాశంలో సూర్యగమనమే కనిపించలేదు. దివ్యమైన ఆ రాక్షసనగరమును అందరు చంద్రుడని భావింపసాగారు.

స్వం వికాసం విముంచంతి నిశామితి వ్యచింతయన్ ।
కమలాకరే చ కమలా మిత్రమిత్యభిగమ్య హి ।
రాత్రౌ వికసితా బ్రహ్మన్విభూతిం దాతుమీప్సితామ్ ॥10॥

ఆ నగరం విరజిమ్మే వెలుగు వెల్లువలను రాత్రియని భ్రమించి, సరోవరాలలోని కమలాలు వికసించలేదు. కాని రాత్రివేళలలో సుకేశి నగరాన్ని సూర్యుడనుకొని అభీప్సితమగు శోభను ఇచ్చుటకు వికసింపసాగాయి.

కౌశికా రాత్రిసమయం బుద్ధ్వా నిరగమన్కిల ।
తాన్వాయసాస్తదా జ్ఞాత్వా దివా నిఘ్నంతి కౌశికాన్ ॥11॥

పగటివేళలలో సుకేశి నగర కాంతివలన రాత్రిగా భ్రమించి గుడ్లగూబలు బయటకు రాగా, పగలు అనుకుని బయలుదేరిన కాకులు వాటిని చంపసాగాయి.

స్నాతకాస్త్వాపగాస్వేవ స్నానజప్య పరాయణాః ।
ఆకంఠమగ్నాస్తిష్ఠంతి రాత్రిం జ్ఞాత్వాథ వాసరమ్ ॥12॥

స్నాతకులు రాత్రిని పగలని భ్రమించి, గొంతువరకు నీటిలోదిగి స్నానాలు చేస్తూ, జపాలు చేసేవారు.

న వ్యయుజ్యంత చక్రాహ్వాస్తదా వై పురదర్శనే ।
మన్యమానాస్తు దివసమిదముచ్చైః బ్రువంతి చ ॥13॥

ఆ నగరకాంతికి రాత్రిని పగలని భ్రమించిన చక్రవాకపక్షులు విడిపోవడం మాని, తమలో తాము బిగ్గరగా ఇలా మాట్లాడుకున్నాయి.

నూనం కాంతావిహీనేన కేనచిచ్చక్రపత్రిణా ।
ఉత్సృష్టం జీవితం శూన్యే పూత్కృత్య సరితస్తటే ॥14॥

తతోఽను కృపయాఽఽవిష్టో వివస్వాన్ తీవ్రరశ్మిభిః ।
సంతాపయజ్జగత్సర్వం నాస్తమేతి కథంచన ॥15॥

అన్యే వదంతి చక్రాహ్వో నూనం కశ్చిన్మృతోఽభవత్ ।
తత్కాంతయా తపస్తప్తం భర్తృశోకార్తయా తతః ॥16॥

ఆరాధితస్తు భగవాన్ తపసా వై దివాకరః ।
తేనాసౌ శశినం జిత్వా నాస్తమేతి రవిర్ధ్రువమ్ ॥17॥

"భార్యావియోగాన్ని సహించలేక ఒక చక్రవాకం నదీతీరంలో ప్రాణం విడిచినట్లు తోస్తున్నది. వాటి కరుణ దశకు జాలిపడి సూర్యభగవానుడు తన తీవ్రకిరణాలతో జగత్తునంతటిని తపింపజేస్తూ క్షణకాలమైనా అస్తమించుట లేదు. ఆ మాటలు విసిన వేరొక చక్రవాకం "కాదు కాదు భర్తయైన చక్రవాకం చనిపోతే భర్తృవియోగం భరించలేక చక్రవాకి దీనంగా విలపిస్తూ తపించియుంటుంది. దాని తపస్సునకు సంతోషించి సూర్యుడు చంద్రుని జయించి అస్తమించకుండా ఉన్నాడు. ఇదే ముమ్మాటికీ నిజం" అన్నది.

యజ్వానో హోమశాలాసు సహర్త్విగ్భిరథాధ్వరే ।
ప్రావర్తయంత కర్మాణి రాత్రావపి మహామునే ॥18॥

మహామునీ! యాజ్ఞికులు, ఋత్విక్కులతో రాత్రియైనను పగలనుకుని యజ్ఞకర్మలు నిర్వర్తిస్తూనేయున్నారు.

మహాభాగవతాః పూజాం విష్ణోః కుర్వంతి భక్తితః ।
రవౌ శశిని చైవాన్యే బ్రహ్మణోఽన్యే హరస్య చ ॥19॥

కామినశ్చాప్యమన్యంత సాధుచంద్రమసా కృతమ్ ।
యది యం రజనీ రమ్యా కృతా సతతకౌముదీ ॥20॥

మహాభాగవతులైన భక్తులు రాత్రింబవళ్ళు విష్ణుదేవుని, ఇతరులు హరుని, బ్రహ్మను భక్తితో అర్చించసాగారు. కాముకులకైనచో నిరంతరం వెన్నెలతో వెలిగే పున్నమి రాత్రులు ప్రసాదించిన చంద్రుని కార్యము ఎంతగానో ప్రశంసాపాత్రమయ్యింది.

అన్యేఽబ్రువన్ లోకగురురస్మాభిశ్చక్రభృద్వశీ ।
నిర్వ్యాజేన మహాగంధైరర్చితః కుసుమైః శుభైః ॥21॥

సహలక్ష్మ్యా మహాయోగీ నభస్యాదిచతుర్ష్వపి ।
అశూన్యశయనా నామ ద్వితీయా సర్వకామదా ॥22॥

తేనాసౌ భగవాన్ప్రీతః ప్రాదాచ్ఛయనముత్తమమ్ ।
అశూన్యం చ మహాభోగైరనస్తమితశేఖరమ్ ॥23॥

మరికొందరు "మనమందరము సర్వకామదాయి, అశూన్యశయన ద్వితీయ సంభవించే శ్రావణమాసంతో ప్రారంభించి నాలుగు నెలలు విశుద్ధ భావంతో మిక్కిలి సుగంధభరితమైన పూలతో మహాలక్ష్మితో కూడినట్టియు, సుదర్శనచక్రాన్ని ధరించినట్టియు శ్రీమహావిష్ణువును ఆరాధించాము. అందులకు శ్రీమహావిష్ణువు సంతోషించి, మనకు మహాభోగాలతో కూడి ఎల్లప్పుడు శోభాయమానంగా వుండే ఉత్తమమైన అశూన్యశయన సౌఖ్యం (పూర్ణచంద్రోదయం) ప్రసాదించాడు" అని అన్నారు.

అన్యేఽబ్రువన్ ధ్రువం దేవ్యా రోహిణ్యా శశినః క్షయమ్ ।
దృష్ట్వా తప్తం తపోఘోరం రుద్రారాధనకామ్యయా ॥24॥

పుణ్యాయామక్షయాష్టమ్యాం వేదోక్తవిధినా స్వయమ్ ।
తుష్టేన శంభునా దత్తో వరశ్చాస్యై యదృచ్ఛయా ॥25॥

మరికొందరు ఇలా పలికారు. "తన భర్తయైన చంద్రుని క్షీణదశకు దుఃఖించి, రోహిణీదేవి శివుని గూర్చి ఉగ్రమైన తపస్సు చేసి, వేదోక్తరీతిలో అక్షయాష్టమినాడు ఆ మహాదేవుని ప్రసన్నుని చేసుకోగా సంతసించిన ఆయన వెంటనే చంద్రునికి అక్షయునిగా పూర్ణచంద్రునిగా వరమిచ్చాడు" అని సమాధానం చెప్పుకున్నాడు.

అన్యేఽబ్రువంశ్చంద్రమసా ధ్రువమారాధితో హరిః ।
వ్రతేనేహ త్వఖండేన తేనాఖండః శశీ దివి ॥26॥

మరికొందరు ఇలా పలికారు. "చంద్రుడు శ్రీహరిని ఉద్దేశించి, అఖండమైన వ్రతం చేసి, ఆయన దయవలన అఖండత్వాన్ని సంపాదించుకున్నాడు".

అన్యేఽబ్రువన్ శశాంకేన ధ్రువం రక్షా కృతాఽఽత్మనః ।
పదద్వయం సమభ్యర్చ్య విష్ణోరమితతేజసః ॥27॥

తేనాసౌ దీప్తిమాన్ చంద్రః పరిభూయ దివాకరమ్ ।
అస్మాకమానందకరో దివా తపతి సూర్యవత్ ॥28॥

లక్ష్యతే కారణైరన్యైర్బహుభిః సత్యమేవ హి ।
శశాంకః నిర్జితః సూర్యో న విభాతి యథా పురా ॥29॥

యథా పద్మకరాః శ్లక్ష్ణా రణద్భృంగగణాకులాః ।
వికచాః ప్రతిభాసంతే జాతః సూర్యోదయో ధ్రువమ్ ॥30॥

యథా చాన్యే విభావ్యంతే వికచాః కుముదాకరాః ।
అతో విజ్ఞాయతే చంద్ర ఉదితశ్చ ప్రతాపవాన్ ॥31॥

ఇతరులు కొందరు "అమితతేజస్వియైన శ్రీహరిచరణద్వయారాధన వలన చంద్రుడు తన కాంతిపుంజాలతో దివాకరుని జయించి, ఆకాశంలో సూర్యుని వలె వెలుగుతూ మనకు ఆనందం కలుగజేస్తున్నాడు అని అన్నారు.

చంద్రునికోడిపోయి సూర్యుడు పూర్వం వలె ప్రకాశింపలేకపోవుచున్నాడని కొందరనగా, మరికొందరు భ్రమర ఝుంకారాలతో నిండిన కమలాలు వికసించడం చూస్తే సూర్యుడు ఉదయించడం నిజమని వ్యక్తమౌతోందన్నారు. వికసించిన కలువలతో నిండిన ఈ కుముదాకరాలు చంద్రోదయాన్ని చెప్పకుండా చెబుతున్నాయికదా!" అని మరికొందరన్నారు.

ఏవం సంభాషతాం తత్ర సూర్యో వాక్యాని నారద ।
అమన్యత కిమేతద్ధి లోకో వక్తి శుభాశుభమ్ ॥32॥

ఏవం సంచింత్య భగవాన్ దధ్యౌ ధ్యానం దివాకరః ।
ఆసమంతాజ్జగద్గ్రస్తం త్రైలోక్యం రజనీచరైః ॥33॥

ఓ నారదా! అచ్చటి ప్రజలు ఈవిధంగా మాట్లాడుకోవడం చూసి సూర్యుడు తనలో "ఇదేమి? నన్ను చూసి వీరీవిధంగా శుభాశుభాలు పలుకుచున్నారు?" అని తలుస్తూ ముల్లోకాలు రాక్షసులు ఆక్రమించి యుండడాన్ని గ్రహించాడు.

తతస్తు భగవాన్ జ్ఞాత్వా తేజసోఽప్యసహిష్ణుతామ్ ।
నిశాచరస్య వృద్ధిం తామచింతయత యోగవిత్ ॥34॥

తతో జ్ఞాత్వా చ తాన్ సర్వాన్ సదాచారరతాన్ శుచీన్ ।
దేవబ్రాహ్మణపూజాసు సంసక్తాన్ధర్మసంయుతాన్ ॥35॥

తతస్తు రక్షః క్షయకృత్తిమిరద్విపకేసరీ ।
మహాంశు నఖరః సూర్యస్తద్విఘాతమచింతయత్ ॥36॥

అంతట యోగవిదుడైన భాస్కరుడు సహింపరాని నిశాచరుల తేజస్సును వృద్ధిని చూసి, అందులకు గల హేతువును విచారించి, వారందరు సదాచారసంపన్నులని, దేవబ్రాహ్మణభక్తులని, ధర్మానురక్తులని, అదియే వారి అభ్యుదయహేతువని తెలుసుకున్నాడు. అంధకారమనే గజం పాలిటి సింహము, రాక్షసాంతకుడు, మహాకిరణములనే నఖములతోకూడిన సూర్యుడు ఆ రాక్షసుల వధోపాయాన్ని గురించి యోచించాడు.

జ్ఞాతవాంశ్చ తతశ్ఛిద్రం రాక్షసానాం దివస్పతిః ।
స్వధర్మవిచ్యుతిర్నామ సర్వధర్మవిఘాతకృత్ ॥37॥

పిమ్మట సహస్రాంశుడు సర్వధర్మనాశకమగు స్వధర్మమార్గచ్యుతి ఒక్కటే రాక్షసనిర్మూలనకు మార్గమని గ్రహించాడు.

తతః క్రోధాభిభూతేన భానునా రిపుభేదినా ।
తద్భీతం రాక్షసపురం తన్నష్టం చ యథేచ్ఛయా ॥38॥

స భానునా తదా దృష్టః క్రోధాధ్మా తేన చక్షుషా ।
నిపపాతాంబరాద్భ్రష్టః క్షీణపుణ్య ఇవ గ్రహః ॥39॥

అంతట సూర్యుడు తన ఆగ్నేయనేత్రాలతో క్రోధాభిభూతుడై శత్రువినాశకరాలైన చూపులతో ఆ రాక్షస నగరాన్ని ముంచెత్తాడు. సూర్యుని క్రోధాగ్నికి దగ్ధమైన రాక్షసనగరం పుణ్యక్షయం పొందిన గ్రహం వలె ఆకాశంనుండి క్రిందకు పడిపోయింది.

ఏవమేతత్సమాలోక్య పురం శాలకటంకటః ।
నమో హరాయ శర్వాయ ఇదముచ్చైరుదీరయత్ ॥40॥

తన నగరం ఆ విధంగా నేలకూలడం చూసి సుకేశి ఉచ్చైఃస్వరంతో "ఓ హరా! నీకు నమస్కారము. ఓ శర్వా! నీకు నమస్కారం" అని ఆక్రోశించాడు.

తదాక్రందితమాకర్ణ్య చారణా గగనే చరాః ।
హాహేతి చుక్రుశుః సర్వే హరభక్తః పతత్యసౌ ॥41॥

ఆకాశగతులైన చారణులు ఆ ఆక్రందనను ఆలకించి "అయ్యో! అయ్యో! ఈ మహేశ్వర భక్తుడు పడిపోవు చున్నాడే!" అని ఆక్రోశించారు.

తచ్చారణవచః శర్వః శ్రుతవాన్సర్వగోఽవ్యయః ।
శ్రుత్వా సంచింతయామాస కేనాసౌ పాత్యతే భువి ॥42॥

సర్వవ్యాపి, అవ్యయుడునైన శివుడు చారణుల మాటలు విని, తన భక్తుని పడత్రోయువాడెవడా?అని ఆలోచించాడు.

జ్ఞాతవాన్దేవపతినా సహస్రకిరణేన తత్ ।
పాతితం రాక్షసపురం తతః క్రుద్ధస్త్రిలోచనః ॥43॥

రాక్షసపురమును కూలద్రోసినది సహస్రకిరణుడైన సూర్యుడని గ్రహించినంతనే త్రిలోచనుడు క్రుద్ధుడయ్యాడు.

క్రుద్ధస్తు భగవాంచ్ఛంభుర్భానుమంతమపశ్యత ।
దృష్టమాత్రస్త్రినేత్రేణ నిపపాత తతోఽమ్బరాత్ ॥44॥

క్రుద్ధుడైన శివభగవానుడు తన మూడవ నేత్రంతో సూర్యుని తీక్ష్ణంగా విలోకించాడు. మహాదేవుని చూపుతోనే దివాకరుడు ఆకాశంనుండి క్రిందపడిపోయాడు.

గగనాత్స పరిభ్రష్టః పథి వాయునిషేవితే ।
యదృచ్ఛయా నిపతితో యంత్రముక్తో యథోపలః ॥45॥

ఆకాశంనుండి భ్రంశం పొంది, యంత్రంతో విసరివేయబడిన రాయివలే సూర్యుడు క్రింద పడ్డాడు.

తతో వాయుపథాన్ముక్తః కింశుకోజ్జ్వలవిగ్రహః ।
నిపపాతాంతరిక్షాత్స వృతః కిన్నరచారణైః ॥46॥

మోదుగపుష్పంవలె ప్రకాశవంతమైన ఆకృతి కలిగిన సూర్యుడు తనను పరివేష్టించియున్న కిన్నర చారణులతోబాటు వాయుమార్గం నుండి క్రిందకు పడిపోయాడు.

అంశుభిర్వేష్టితో భానుః ప్రవిభాత్యంబరాత్పతన్ ।
అర్ధం పక్వం యథా తాలాత్ఫలం కపిభిరావృతమ్ ॥47॥

అంతరిక్షం నుండి ఆ విధంగా చారణులతో కూడి క్రిందపడుతున్న సూర్యుడు, సగం పండినదీ, తాళవృక్షం నుండి జారుచున్నదీ, కోతులచే చుట్టబడినదీ అయిన తాటిపండు వలె ప్రకాశించాడు.

నిపతస్వ హరిక్షేత్రే యది శ్రేయోఽభివాంఛసి ।
తతోఽబ్రవీత్పతన్నేవ వివస్వాం స్త్వాంస్తపోధనాన్ ॥48॥

ఆవిధంగా పడిపోవుచున్న సూర్యునివద్దకు వచ్చి ఋషులు "నీకు శుభం కలగాలంటే భూమిమీద హరిక్షేత్రంలో పడవలసినదని" అన్నారు.

కిం తత్ క్షేత్రం హరేః పుణ్యం వదధ్వం శీఘ్రమేవ మే ।
తమూచుర్మునయః సూర్యం శ్రుణు క్షేత్రం మహాఫలమ్ ॥49॥

సాంప్రతం వాసుదేవస్య భావితం శంకరస్య చ ।
యోగశాయినమారభ్య యావత్కేశవదర్శనమ్ ।
ఏతత్ క్షేత్రం హరేః పుణ్యం నామ్నా వారాణసీ పురీ ॥50॥

తచ్ఛ్రుత్వా భగవాన్భానుర్భవనేత్రాభితాపితః ।
వారణాయాస్తథైవాస్యాస్త్వంతరే నిపపాత హ ॥51॥

మహనీయులారా! "ఆ క్షేత్రమెచటనున్నదో వెంటనే తెలియజేయండి" అని క్రిందపడుచున్న సూర్యుడు తపోధనులను ప్రార్థించాడు. అంతట మహర్షులు "ఓ భాస్కరుడా! ప్రస్తుతం శ్రీహరికి ప్రీతికరంగావుండి, భవిష్యత్తులో శివునకు ప్రేమపాత్రం కాబోయే ఆ క్షేత్రమేదో చెబుతున్నాము వినండి. యోగశాయితో ప్రారంభమై, కేశవుని దర్శనం వరకు వ్యాపించియున్న పవిత్రహరిక్షేత్రమే వారాణసి నగరం. వారి మాటలు విని, శివనేత్రాగ్ని జ్వాలలకు దగ్ధమౌతున్న భాస్కరుడు వరుణ, అసి నదుల మధ్యప్రదేశంలో పడిపోయాడు.

భానౌ తతః ప్రదహ్యతి నిమజ్జ్యాస్యాం లులద్రవిః ।
వారణాయాం సమభ్యేత్య నిమజ్జతి యథేచ్ఛయా ॥52॥

భూయోఽసిం వరణాం భూయో భూయోఽపి వరణామసీమ్ ।
లులం స్త్రినేత్రవహ్న్యార్తో భ్రమతేఽలాత చక్రవత్ ॥53॥

శివనేత్రాగ్నిజ్వాలలకు తట్టుకోలేక సూర్యుడు అసీనదిలో పడి, అక్కడినుండి దొర్లుకుంటూ పోయి వరణా జలాలలో మునిగాడు. మరల అసి, మరల వరణ, మరల అసి, మరల వరణనదీజలాలలో మాటిమాటికి అగ్నిచక్రం వలె యథేచ్ఛగా దొర్లుతూ తన మండే శరీరాన్ని సూర్యుడు ఆ నదీజలాలలో తడుపుకోసాగాడు.

ఏతస్మిన్నంతరే బ్రహ్మన్నృషయో యక్షరాక్షసాః ।
నాగా విద్యాధరాశ్చాపి పక్షిణోఽప్సరసస్తథా ॥54॥

యావన్తో భాస్కరరథే భూతప్రేతాదయః స్థితాః ।
తావన్తో బ్రహ్మసదనం గతా వేదయితుం మునే ॥55॥

ఓ నారదా! ఇంతలో సూర్యరథంలోనున్న ఋషులు, యక్షరాక్షసులు, నాగులు, విద్యాధరులు, అప్సరసలు, పక్షులు, భూతప్రేతాదులు అందరూ కలసి ఈ వృత్తాంతమంతటిని విరించికి తెలియజేయడానికి బ్రహ్మలోకానికి వెళ్లారు.

తతో బ్రహ్మా సురపతిః సురైః సార్ధం సమభ్యగాత్ ।
రమ్యం మహేశ్వరావాసం మందరం రవికారణాత్ ॥56॥

గత్వా దృష్ట్వా చ దేవేశం శంకరం శూలపాణినమ్ ।
ప్రసాద్య భాస్కరార్థాయ వారాణస్యాముపానయన్ ॥57॥

అంతట దేవపతియైన బ్రహ్మ దేవగణంతో కూడి, సూర్యుని రక్షించడానికి సుందరమైనట్టియు, మహేశ్వరావాస మైనట్టియు, మందరపర్వతానికి వెళ్ళాడు. అక్కడకు వెళ్ళి దేవేశుడు శూలపాణియైన శంకరుని ప్రసన్నం గావించుకున్నాడు. భాస్కరుని రక్షించడానికి వారాణసీ నగరానికి తోడితెచ్చాడు.

తతో దివాకరం భూయః పాణినాఽఽదాయ శంకరః ।
కృత్వా నామాస్య లోలేతి రథమారోపయత్పునః ॥58॥

ఆరోపితే దినకరే బ్రహ్మాఽభ్యేత్య సుకేశినమ్ ।
సబాంధవం సనగరం పునరారోపయద్దివి ॥59॥

మంటలవేడిమికి అటునిటు దొర్లుచున్న సూర్యుని శివుడు చేతితో స్పృశించి, ఆయనకు "**లోలుడు**" అను పేరు పెట్టి, రథంపై కూర్చుండబెట్టాడు. ఆ విధంగా సూర్యుని పునఃప్రతిష్ఠితుని గావించి, బ్రహ్మ సుకేశిని సమీపించి, ఆయనను ఆయననగరంతో, బంధుజనులతో సహా మరలా దివియందు ప్రతిష్ఠితుని గావించాడు.

సమారోప్య సుకేశిం చ పరిష్వజ్య చ శంకరమ్ ।
ప్రణమ్య కేశవం దేవం వైరాజం స్వగృహం గతః ॥60॥

సుకేశికి పునరావాసం కల్పించి, శంకరుని ఆలింగనం చేసుకొని, విష్ణునకు నమస్కరించి, విరించి తిరిగి తన వైరాజసదనానికి వెళ్ళాడు.

ఏవం పురా నారద భాస్కరేణ పురం సుకేశేర్భువి సన్నిపాతితమ్ ।
దివాకరో భూమితలే భవేన క్షిప్తస్తు దృష్ట్వాఽ నల సంప్రదగ్ధః ॥61॥

ఆరోపితో భూమితలాద్భవేన భూయోఽ పి భానుః ప్రతిభాసనాయ ।
స్వయంభువా చాపి నిశాచరేంద్రస్త్వారోపితః ఖే సపురః సబంధుః ॥62॥

నారదా! ఈ విధంగా పూర్వకాలంలో సుకేశి నగరం సూర్యునిచేత భూమి మీదకు త్రోయబడగా సూర్యుడు హరనేత్రాగ్ని వలన దగ్ధుడై, భూమి మీద పడిపోయాడు. కరుణామయుడగు శివుడు సూర్యుని భూమినుండి ఉద్ధరించి, మరల ప్రకాశించేటట్లు చేశాడు. విరించి రాక్షసేంద్రుడైన సుకేశిని అతని నగరం, పరివారంతో సహా మరల అంతరిక్షంలో నిలిపాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే హరలలితే సుకేశిచరితే లోలార్కజననం నామ పంచదశోఽ ధ్యాయః ॥15॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని హరలలితయందలి సుకేశిచరిత్రలో లోలార్కజననమనే పదిహేనవ అధ్యాయం సమాప్తం.



షోడశోఽధ్యాయః – పదహారవ అధ్యాయం
అశూన్యశయనద్వితీయా, కాలాష్టమీ వ్రతవర్ణనం చ –
అశూన్యశయనద్వితీయ, కాలాష్టమి వ్రతాల వర్ణనం

నారద ఉవాచ – నారదమహర్షి పలికాడు.

యానేతాన్భగవానాహ కామిభిః శశినం ప్రతి ।
ఆరాధనాయ దేవాభ్యాం హరీశాభ్యాం వదస్వ తాన్ ॥1॥

శివకేశవులను ప్రసన్నం గావించుకోడానికి కాముకులు చంద్రునకు ఉపదేశించిన వ్రతాలను నాకు తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రుణుష్వ కామిభిః ప్రోక్తాన్వ్రతాన్ పుణ్యాన్ కలిప్రియ ।
ఆరాధనాయ శర్వస్య కేశవస్య చ ధీమతః ॥2॥

నారదా! శివకేశవులను ప్రసన్నం గావించుకోడానికి బుద్ధిమంతులైన కాముకులు ప్రవచించిన పుణ్యవ్రతాలను గూర్చి వినుము.

యదాఽఽషాఢీం రవిః ప్రాప్య వ్రజతే చోత్తరాయణాత్ ।
తదా స్వపితి దేవేశో భోగిభోగే శ్రియఃపతిః ॥3॥

ప్రతిసుప్తే విభౌ తస్మిన్ దేవా గంధర్వ గుహ్యకాః ।
దేవానాం మాతరశ్చాపి ప్రసుప్తాశ్చాప్యనుక్రమాత్ ॥4॥

ఉత్తరాయణం నుండి దక్షిణాయనంలోనికి సూర్యుడు ప్రవేశించగానే ఆషాఢశుక్లఏకాదశినాడు దేవాధిదేవుడు, లక్ష్మీపతియునైన శ్రీమన్నారాయణుడు శేషశయనం మీద నిద్రిస్తాడు. తమ ప్రభువు నిద్రించినతోడనే దేవతలు, గంధర్వులు, యక్షులు వారి తల్లులు క్రమంగా గాఢనిద్రలో మునిగిపోతారు.

నారద ఉవాచ – నారదమహర్షి పలికాడు.

కథయస్వ సురాదీనాం శయనే విధిముత్తమమ్ ।
సర్వాననుక్రమేణైవ పురస్కృత్య జనార్దనమ్ ॥5॥

ఓ మునీశ్వరా! జనార్దనునినుండి క్రమంగా దేవతలు మున్నగువారందరి శయనవిధినిగూర్చి నాకు తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

మిథునాభిముఖే సూర్యే శుక్లపక్షే తపోధన ।
ఏకాదశ్యాం జగత్స్వామీ శయనం పరికల్పతే ॥6॥

ఓ తపోధనా! ఆషాఢశుద్ధఏకాదశినాడు సూర్యుడు మిథునరాశిలో ప్రవేశించగానే జగన్నాథుడు శయనానికి ఉపక్రమిస్తాడు.

శేషాహిభోగపర్యంకం కృత్వా సంపూజ్య కేశవమ్ ।
కృత్వా పవిత్రకం చైవ సమ్యక్ సంపూజ్య వై ద్విజాన్ ॥7॥

అనుజ్ఞాం బ్రాహ్మణేభ్యశ్చ ద్వాదశ్యాం ప్రయతః శుచిః ।
లబ్ధ్వా పీతాంబరధరః స్వస్థో నిద్రాం సమానయన్ ॥8॥

శేషునిపడగలపై శయ్యను ఏర్పాటు చేసి, దానిపై యజ్ఞోపవీతంతో కూడిన కేశవుని ప్రతిమనుంచి చక్కగా పూజించి, బ్రాహ్మణుల ఆజ్ఞతో పీతాంబరధారియై శుచియై, ప్రయత్నశీలుడైన మానవుడు ద్వాదశినాడు బ్రాహ్మణపూజ చేసి, స్వామిని సుఖశయనుని గావించాలి.

త్రయోదశ్యాం తతః కామః స్వపతే శయనే శుభే ।
కదంబానాం సుగంధానాం కుసుమైః పరికల్పితే ॥9॥

త్రయోదశినాడు సుగంధపరిమళమైన కదంబపుష్పశయ్యపై మన్మథునకు శయనం ఏర్పాటుచేయ బడుతుంది.

చతుర్దశ్యాం తతో యక్షాః స్వపంతి సుఖశీతలే ।
సౌవర్ణపంకజకృతే సుఖాస్తీర్ణోపధానకే ॥ 10॥

చతుర్దశినాడు యక్షులు బంగారుకమలాలుపరచిన శీతలశయ్య మీద మంచితలగడలనమర్చుకొని నిద్రిస్తారు.

పౌర్ణమాస్యాముమానాథః స్వపతే చర్మసంస్తరే ।
వైయ్యాఘ్రే చ జటాభారం సముద్గ్రంథ్యాన్యచర్మణా ॥11॥

పౌర్ణమినాడు పరమశివుడు జటాజూటాన్ని పులితోలుతో ముడివేసుకుని వ్యాఘ్రాజినం మీద శయనిస్తాడు.

తతో దివాకరో రాశిం సంప్రయాతి చ కర్కటమ్ ।
తతోఽమరాణాం రజనీ భవతే దక్షిణాయనమ్ ॥12॥

అంతట దివాకరుడు కర్కటరాశిలో ప్రవేశించడంతో దేవతలకు రాత్రి ప్రారంభమౌతుంది. అదియే దక్షిణాయనము.

బ్రహ్మా తథా ప్రతిపది నీలోత్పలమయేఽనఘ ।
తల్పే స్వపితి లోకానాం దర్శయన్మార్గముత్తమమ్ ॥13॥

ఓ పవిత్రమునీ! పాడ్యమినాడు బ్రహ్మ నల్లకలువల శయ్య మీద శయనిస్తాడు. లోకాలకు ఉత్తమమైన మార్గాన్ని చూపుతాడు.

విశ్వకర్మా ద్వితీయాయాం తృతీయాయాం గిరేః సుతా ।
వినాయకశ్చతుర్థ్యాంతు పంచమ్యామపి ధర్మరాట్ ॥14॥

షష్ఠ్యాం స్కందః ప్రస్వపితి సప్తమ్యాం భగవాన్రవిః ।
కాత్యాయనీ తథాష్టమ్యాం నవమ్యాం కమలాలయా ॥15॥

దశమ్యాం భుజగేంద్రాశ్చ స్వపంతే వాయుభోజనాః ।
ఏకాదశ్యాం తు కృష్ణాయాం సాధ్యా బ్రహ్మన్ స్వపంతి చ ॥16॥

తదనంతరం వరుసగా విదియనాడు దేవశిల్పియైన విశ్వకర్మ, తదియనాడు పార్వతీదేవి, చవితినాడు వినాయకుడు, పంచమినాడు యమధర్మరాజు, షష్ఠినాడు స్కందుడు, సప్తమినాడు సూర్యభగవానుడు, అష్టమినాడు కాత్యాయిని, నవమినాడు మహాలక్ష్మి, దశమినాడు వాయువును భుజించే పన్నగాలు నిద్రిస్తారు. కృష్ణపక్ష ఏకాదశినాడు సాధ్యులు నిద్రిస్తారు.

ఏష క్రమస్తే గదితో నభాదౌ స్వపతాం మునే ।
స్వపత్సు తత్ర దేవేషు ప్రావృట్కాలః సమాయయౌ ॥17॥

ఓ నారదమునీ! ఈ క్రమంలో దేవతలు శ్రావణమాసంలో నిద్రించగా అప్పటినుండి వర్షాకాలం ప్రారంభమౌతుంది.

కంకాః సమం బలాకాభిరారోహన్తి నగోత్తమాన్ ।
వాయసాశ్చాపి కుర్వన్తి నీడాని ఋషిపుంగవ ॥18॥

ఓ ఋషిశ్రేష్ఠా! గ్రద్దలు, కొంగలు, ఎత్తైనపర్వతాలపైకి చేరతాయి. కాకులు గూళ్ళుకట్టడం మొదలు పెడతాయి.

వాయస్యశ్చ స్వపంత్యేవమృతౌ గర్భభరాలసాః ।
యస్యాం తిథౌ ప్రస్వపితి విశ్వకర్మా ప్రజాపతిః ॥19॥

ద్వితీయా సా శుభా పుణ్యా సుపుణ్యా శయనోదితా ।
తస్యాం తిథావర్చయిత్వా శ్రీవత్సాంకం చతుర్భుజమ్ ॥20॥

పర్యంకస్థం సమం లక్ష్మ్యా గంధపుష్పాదిభిర్మునే ।
తతో దేవాయ శయ్యాయాం ఫలాని ప్రక్షిపేత్సుధీః ।
సురభీణి నివేద్యేత్థం విజ్ఞాప్యో మధుసూదనః ॥21॥

ఆ ఋతువులో గర్భభారంతో వుండే ఆడకాకులు ఆ గూళ్ళలో నిద్రిస్తాయి. నారదా! ప్రజాపతి విశ్వకర్మ నిద్రించిన రోజును పవిత్రమైన "**అశూన్యశయనద్వితీయ**" అంటారు. ఆ రోజున శ్రీవత్సాంకుడు, చతుర్భుజుడునైన

శ్రీమహావిష్ణువును మహాలక్ష్మితో కూడా శయనం మీద వుంచి, గంధపుష్పాదులతో పూజించి ఆ శయ్యమీద చక్కని సువాసనగల ఫలాలనుంచి, వాటిని నివేదించి, మధుసూదనుని ఇలా ప్రార్థించాలి.

యథా హి లక్ష్మ్యా న వియుజ్యసే త్వం త్రివిక్రమానంతజగన్నివాస ।
తథా త్వశూన్యం శయనం సదైవ అస్మాకమేవేహ తవ ప్రసాదాత్ ॥22॥

యథా త్వశూన్యం తవ దేవ తల్పం సమం హి లక్ష్మ్యా వరదాచ్యుతేశ ।
సత్యేన తేనామిత వీర్య విష్ణో గార్హస్థ్యనాశో మమ నాస్తు దేవ ॥23॥

ఓ త్రివిక్రమా! అనంతా! జగన్నివాసా! నీవేవిధంగా క్షణకాలం కూడా వదలకుండా లక్ష్మీదేవితో వుంటావో అదే విధంగా నీ అనుగ్రహం వల్ల మా శయ్యలు కూడా ఒకక్షణకాలం కూడా శూన్యంగా వుండకుండుగాక! మేము కూడా అశూన్యశయనలమగుదుము గాక! లక్ష్మితో కూడి ఎట్లు నీ తల్పం ఎప్పుడు అశూన్యంగా వుండదో అదే విధంగా ఓ అమితవీర్యా! విష్ణూ! మాకు ఏనాడు గార్హస్థ్యనష్టము కలుగకుండు గాక!.

ఇత్యుచ్చార్య చ దేవేశం ప్రసాద్య చ పునః పునః ।
నక్తం భుంజీత దేవర్షే తైలక్షారవివర్జితమ్ ॥24॥

ద్వితీయేఽహ్ని ద్విజాగ్ర్యాయ ఫలం దద్యాద్విచక్షణః ।
లక్ష్మీధరః ప్రియతాం మే ఇత్యుచ్చార్య నివేదయేత్ ॥25॥

అనేన తు విధానేన చాతుర్మాస్యవ్రతం చరేత్ ।
యావద్ వృశ్చికరాశిస్థః ప్రతిభాతి దివాకరః ॥26॥

ఈ విధంగా ప్రార్థించి మరలా మరలా నమస్కరించి శ్రియఃపతిని ప్రసన్నుని గావించుకొని నారదా! ఆనాడు రాత్రివేళ నూనె, ఉప్పు లేని భోజనం చేయాలి. మరునాడు బ్రాహ్మణోత్తమునకు ఒక ఫలాన్ని శక్తికొలది దక్షిణతో దానం చేయాలి. 'లక్ష్మీనాథుడు సంతోషించుగాక!' అని సంకల్పించుకొని ఫలదానం చేయాలి. ఈ విధంగా సూర్యుడు వృశ్చికరాశిలో ప్రవేశించువరకు చాతుర్మాస్యవ్రతం ఆచరించాలి.

తతో విబుధ్యంతి సురాః క్రమశః క్రమశో మునే ।
తులాస్థే తు హరిః పూర్వం కామః శివః పశ్చాద్విబుధ్యతే ॥27॥

తత్ర దానం ద్వితీయాయాం మూర్తిర్లక్ష్మీధరస్య చ ।
శయ్యా చాస్తరణోపేతా యథా విభవమాత్మనః ॥28॥

ఏష వ్రతస్తు ప్రథమః ప్రోక్తస్తవ మహామునే ।
యస్మింశ్చీర్ణే వియోగస్తు న భవేదిహ కస్యచిత్ ॥29॥

ఓ నారదా! అంతట దేవతలు క్రమక్రమంగా ఒక్కొక్కరుగా నిద్రనుండి మేల్కొంటారు. సూర్యుడు తులారాశిలోనికి చేరగానే శ్రీహరి నిద్రనుండి లేస్తాడు. తదనంతరం కాముడు, శివుడు మేల్కొంటారు. అంతట విదియనాడు లక్ష్మీనారాయణప్రతిమను, తల్పం ఆస్తరణతో కూడా తన వైభవానికి తగిన రీతిలో దానం చేయాలి.

ఓ మహామునీ! ఈ విధంగా మొదటివ్రతాన్ని నీకు తెలియజేశాను. దీనిని ఆచరించినవారికి జీవితంలో ఎవరితోను ఎప్పుడూ వియోగం కలుగదు.

నభస్యే మాసి చ తథా యా సా కృష్ణాష్టమీ శుభా ।
యుక్తా మృగశిరేణేవ సా తు కాలాష్టమీ స్మృతా ॥30॥

అదే విధంగా మృగశిరాయుక్తమైన శ్రావణకృష్ణపక్షఅష్టమి కూడా శుభప్రదమైనది. దానిని "**కాలాష్టమి**" అంటారు.

తస్యాం సర్వేషు లింగేషు తిథౌ స్వపితి శంకరః ।
వసతే సన్నిధానే తు తత్ర పూజాఽక్షయా స్మృతా ॥31॥

ఆ తిథినాడు శంకరుడు అన్ని లింగాలలోను నిద్రిస్తాడు. ఆ సమయంలో ఆయనను ఆరాధించినవాని పూజ అక్షయఫలదాయకమౌతుంది.

తత్ర స్నాయీత వై విద్వాన్ గోమూత్రేణ జలేన చ ।
స్నాతః సంపూజయేత్పుష్పైర్ధత్తూరస్య త్రిలోచనమ్ ॥32॥

ధూపం కేసర నిర్యాసం నైవేద్యం మధుసర్పిషీ ।
ప్రీయతాం మే విరూపాక్షస్త్విత్యుచ్చార్య చ దక్షిణామ్ ॥33॥

విప్రాయ దద్యాన్నైవేద్యం సహిరణ్యం ద్విజోత్తమ ।
తద్వదాశ్వయుజే మాసి ఉపవాసీ జితేంద్రియః ॥34॥

నవమ్యాం గోమయస్నానం కుర్యాత్పూజాం తు పంకజైః ।
ధూపయేత్సర్జనిర్యాసైర్నైవేద్యం మధుమోదకైః ॥35॥

కృత్వోపవాసమష్టమ్యాం నవమ్యాం స్నానమాచరేత్ ।
ప్రీయతాం మే హిరణ్యాక్షో దక్షిణా సతిలా స్మృతా ॥36॥

అప్పుడు విజ్ఞుడు గోమూత్రజలాలతో అభిషేకించి, ఉమ్మెత్తపూలతో త్రిలోచనుని పూజించాలి. కేసరాల పోడితో ధూపం వేసి, తేనె, నేయి నైవేద్యం చేయాలి. 'విరూపాక్షుడు నాయెడ ప్రసన్నుడౌగాక' అని పలికి నైవేద్యాన్ని సువర్ణ సహితంగా బ్రాహ్మణోత్తములకు దానమివ్వాలి. అదే విధంగా ఆశ్వయుజంలో ఉపవసించి, జితేంద్రియుడై, నవమినాడు గోమయస్నానం చేయాలి. కమలాలతో పూజించాలి. సర్జవృక్షం యొక్క లత్తుకతో ధూపం సమర్పించి, తేనెకుడుములు నైవేద్యం చేయాలి. అష్టమినాడు ఉపవాసం చేసి, నవమినాడు స్నానం చేసి, 'హిరణ్యాక్షుడు నన్ను అనుగ్రహించుగాక!' అనిపలుకుతూ నువ్వులు, దక్షిణ దానం చేయాలి.

కార్తికే పయసా స్నానం కరవీరేణ చార్చనమ్ ।
ధూపం శ్రీవాసనిర్యాసం నైవేద్యం మధుపాయసమ్ ॥37॥

స నైవేద్యం చ రజతం దాతవ్యం దానమగ్రజే ।
ప్రీయతాం భగవాన్ స్థాణురితి వాచ్యమనిష్ఠురమ్ ॥38॥

కార్తికమాసంలో పాలతో అభిషేకించి, కరవీరపుష్పాలతో పూజించాలి. శ్రీగంధధూపం వేసి, తేనెపాయసం నివేదించాలి. ఆ నైవేద్యాన్ని రజతంతో బాటు బ్రాహ్మణునకిచ్చి సౌమ్యంగా 'భగవంతుడైన స్థాణువు నన్ననుగ్రహించు గాక!" అని నమస్కరించాలి.

కృత్వోపవాసమష్టమ్యాం నవమ్యాం స్నానమాచరేత్ ।
మాసి మార్గశిరే స్నానం దధ్నార్చా భద్రయా స్మృతా ॥39॥

ధూపం శ్రీవృక్షనిర్యాసం నైవేద్యం మధునోదనమ్ ।
సన్నివేద్యా రక్తశాలిర్దక్షిణా పరికీర్తితా ॥40॥

నమోఽస్తు ప్రీయతాం శర్వ ఇతి వాచ్యం చ పండితైః ।

మార్గశీర్షమాసంలో అష్టమినాడు ఉపవసించి, నవమినాడు స్నానంచేయాలి. తరువాత శివుని పెరుగుతో అభిషేకించాలి. భద్రపుష్పాలతో అర్చన చేయాలి. బిల్వవృక్షపు బెరడుతో ధూపం వేయాలి. తేనెతో వండిన అన్నం నివేదనచేసి, దానిని ఎర్రబియ్యంతోను, దక్షిణతోను దానం చేయాలి. 'శ్రీ శర్వునకు నమస్కారం. ఆ ప్రభువు ప్రీతుడగుగాక! అని ప్రార్థించాలి.

పౌషే స్నానం చ హవిషా పూజా స్యాత్తగరైః శుభైః ॥41॥

ధూపో మధుక నిర్యాసో నైవేద్యం మధుశష్కులీ ।
సముద్గా దక్షిణా ప్రోక్తా ప్రీణనాయ జగద్గురోః ॥42॥

వాచ్యం నమస్తే దేవేశ త్ర్యంబకేతి ప్రకీర్తయేత్ ।

పవిత్రమైన పుష్యమాసంలో నేతితో అభిషేకం చేయించి, మంగళప్రదమైన తగరుపూలతో పూజించాలి. మధూకచెట్టుబెరడు ధూపం వేసి, మధు, శష్కులి (రొట్టె) నివేదన చేయాలి. పెసలు దక్షిణగా ఆ నైవేద్యం బ్రాహ్మణులకు దానం చేసి, 'దేవాదిదేవా!, త్ర్యంబకా! నీకు నమస్కారం అని ప్రార్థించి, జగద్గురుని ప్రసన్నం చేసుకోవాలి.

మాఘే కుశోదకస్నానం కుముదేన శివార్చనమ్ ॥43॥

ధూపః కదంబనిర్యాసో నైవేద్యం సతిలౌదనమ్ ।
పయోభక్తం తు నైవేద్యం సరుక్మం ప్రతిపాదయేత్ ॥44॥

ప్రీయతాం మే మహాదేవ ఉమాపతిరితీరయేత్ ।

మాఘమాసంలో కుశోదకంతో అభిషేకం చేయించి, కలువలతో శివార్చన చేయాలి. కడిమిచెట్టు బెరడుతో ధూపం వేసి, తిలాన్నం నివేదించాలి. బంగారం, పాయసాన్నం దక్షిణగా నివేదిత అన్నాన్ని బ్రాహ్మణునకు దానమీయాలి. 'ఉమాకాంతుడగు మహాదేవుడు ప్రీతుడగుగాక!' అని సమర్పించాలి.

ఏవమేవ సముద్దిష్టం షడ్భిర్మాసైస్తు పారణమ్ ।
పారణాంతే త్రినేత్రస్య స్నపనం కారయేత్క్రమాత్ ॥45॥

గోరోచనాయుక్త గుడేన చైవ దేవం సమాలభ్య చ పూజయేత్తు ।
ప్రీయస్వ దీనోఽస్మి భవాంస్త్వమీశ మచ్ఛోకనాశం ప్రకురుష్వ యోగ్యమ్ ॥46॥

ఈ విధంగా ఆరునెలల కాలం సాగే ఈ వ్రతపారణం జరుగుతుంది. పారణం సమాప్తమైన తరువాత త్రిలోచనునికి యథావిధిగా అభిషేకం చేయించాలి. ఓ మహర్షీ! గోరోజనం, బెల్లం కలిపిన మిశ్రమంతో స్వామిని తాకి పూజించాలి. 'ఈశ్వరా! ఈ దీనుని యెడ ప్రసన్నుడవు కమ్ము, నాశోకాన్ని నాశనం చేయుము' అని ఆత్మనివేదనం చేయాలి.

తతస్తు ఫాల్గునే మాసి కృష్ణాష్టమ్యాం యతవ్రతైః ।
ఉపవాసం సముదితం కర్తవ్యం ద్విజసత్తమ ॥47॥

ద్వితీయేఽహ్ని తతః స్నానం పంచగవ్యేన కారయేత్ ।
పూజయేత్కుందకుసుమైర్ధూపయేచ్చందనేన చ ॥48॥

నైవేద్యం సఘృతం దద్యాత్ తామ్రపాత్రే గుడోదనమ్ ।
దక్షిణాం చ ద్విజాతిభ్యో నైవేద్యైః సహితాం మునే ॥49॥

వాసోయుగం ప్రీణయేచ్చ రుద్రముచ్చార్య నామతః ।

ఓ బ్రాహ్మణోత్తమా! అనంతరం ఫాల్గుణమాసంలో, కృష్ణపక్షంలో, అష్టమినాడు యథావిధిగా ఉపవాసం చేయాలి. ఆ మరునాడు పంచగవ్యంతో అభిషేకించాలి. మల్లెపూలతో పూజించి చందనంతో ధూపం వేయాలి. రాగిపాత్రలో నేయి, బెల్లంతో వండిన అన్నం నివేదన చేయాలి. ఓ మహర్షీ! వస్త్రద్వయంతో, దక్షిణతో నైవేద్యాన్ని రుద్రనామోచ్చారణచేస్తూ బ్రాహ్మణునకు దానం చేయాలి.

చైత్రే చౌదుంబరజలైః స్నానం మందారకార్చనమ్ ॥50॥

గుగ్గులుం మహిషాఖ్యం చ ఘృతాక్తం ధూపయేద్బుధః ।
సమోదకం తథా సర్పిః ప్రీణనం వినివేదయేత్ ॥51॥

దక్షిణా చ సనైవేద్యా మృగాజినముదాహృతమ్ ।
నాగేశ్వర నమస్తేస్తు ఇదముచ్చార్య నారద ॥52॥

ప్రీణనం దేవనాథాయ కుర్యాచ్ఛ్రద్ధాసమన్వితః ।

చైత్రమాసంలో మేడిఫలరసంతో అభిషేకం జరిపించి, మందారపుష్పాలతో పూజించాలి. మహిష అను పేరు గల గుగ్గిలం నేతితో తడిపి, ధూపం వేయాలి. నేతికుడుములు ప్రేమతో నైవేద్యం చేయాలి. ఈ నైవేద్యంతో బాటు కృష్ణాజినాన్ని (మృగచర్మాన్ని) దక్షిణగా బ్రాహ్మణునకు దానం చేయాలి. 'ఓ నాగేశ్వరా! నీకు నమస్కారం' అని శ్రద్ధాభక్తులతో ప్రార్థించి దేవేశుని సంప్రీతుని చేయాలి.

వైశాఖే స్నానముదితం సుగంధకుసుమాంభసా ॥53॥

పూజనం శంకరస్యోక్తం చూతమంజరిభిర్విభోః ।
ధూపః సర్జస్య నిర్యాసో నైవేద్యం సఫలం ఘృతమ్ ॥54॥

నామ జప్యమపీశస్య శాలఘ్నేతి విపశ్చితా ।
జలకుంభాన్స నైవేద్యాన్ బ్రాహ్మణాయ నివేదయేత్ ॥55॥

సవస్త్రాంశ్చైవ సాన్నాద్యాంస్తచ్చిత్తైస్తత్పరాయణైః ।

వైశాఖమాసంలో సుగంధభరితమైన పుష్పోదకంతో శివుని అభిషేకించి, తియ్యమామిడి పుష్పగుచ్ఛాలతో పూజించాలి. సాలవృక్షపు బెరడును ధూపం వేసి, నేతిని, పండ్లను నైవేద్యం చేయాలి. శాలఘ్నా! (దక్షయజ్ఞ ధ్వంసకా! లయకారకా! అనిఅర్థాలు) అనే ఈశ్వర నామాన్ని జపిస్తూ, నైవేద్యాన్ని జలకుంభాలతో, వస్త్రాలతో, ఈశ్వరాయత్తచిత్తాలతో బ్రాహ్మణునకు దానం చేయాలి.

జ్యేష్ఠే స్నానం చామలకైః పూజార్కకుసుమైస్తథా ॥56॥

పూజయేద్రుద్రనేత్రం చ వృషాంకం వృష్టికారకమ్ ।
సక్తూంశ్చ సఘృతాన్దేవే దధ్నాక్తాన్వినివేదయేత్ ॥57॥

ఉపానద్యుగళం ఛత్రం దానం దద్యాచ్చ భక్తిమాన్ ।
నమస్తే భగనేత్రఘ్న పూష్ణో దశననాశన ॥58॥

ఇదముచ్చారయేద్భక్త్యా ప్రీణనాయ జగత్పతేః ।

జ్యేష్ఠమాసంలో స్వామికి ఆమలకజలస్నానం చేయించి, అర్కపుష్పాలతో (జిల్లేడుపూలతో) పూజించాలి. అభ్యుదయకారియైన సరళవృక్ష బెరడులు ధూపం వేయాలి. నేయి, పెరుగులతో తడిసిన పేలపిండిని నైవేద్యం చేయాలి. పాదరక్షలు, గొడుగు భక్తితో దక్షిణగా సమర్పించాలి. అనంతరం జగత్పతి ప్రీతి సంపాదనకై "భగుని నేత్రములడచిన ప్రభూ! నీకు నమస్సులు, పూషా అను పేరుగల సూర్యుని పండ్లూడగొట్టిన స్వామీ! నీకు ప్రణామము" అని ఉచ్చరిస్తూ భక్తిపూర్వకంగా ప్రార్థించాలి. శివుని ప్రసన్నం చేసుకోవాలి.

ఆషాఢే స్నానముదితం శ్రీఫలైరర్చనం తథా ॥59॥

ధత్తూరకుసుమైః శుక్లైర్ధూపయేత్సిల్హకం తథా ।
నైవేద్యం సఘృతాపూపాః దక్షిణా సఘృతా యవాః ॥60॥

నమస్తే దక్షయజ్ఞఘ్న ఇదముచ్చైరుదీరయేత్ ।

ఆషాఢమాసంలో బిల్వోదకస్నానం చేయించి, తెల్ల ఉమ్మెత్తపూలతో అర్చన చేయాలి. సాంబ్రాణి ధూపం వేసి, నేతితో వండిన అప్పాలు నైవేద్యం చేయాలి. నేయి, యవలు దక్షిణగా ఇవ్వాలి. 'దక్షయజ్ఞనాశకా!' అని బిగ్గరగా కీర్తించాలి.

శ్రావణే భృంగరాజేన స్నానం కృత్వార్చయేద్ధరమ్ ॥61॥
శ్రీవృక్షపత్రైః సఫలైర్ధూపం దద్యాత్తథాఽగురుమ్ ।
నైవేద్యం సఘృతం దద్యాద్దధిపూర్వాశ్చ మోదకాన్ ॥62॥

దధ్యోదనం సకృసరం మాషధానాః సశష్కులీః ।
దక్షిణాం శ్వేతవృషభం ధేనుం చ కపిలాం శుభామ్ ॥63॥

కనకం రక్తవసనం ప్రదద్యాద్బ్రాహ్మణాయ హి ।
గంగాధరేతి జప్తవ్యం నామ శంభోశ్చ పండితైః ॥64॥

శ్రావణమాసంలో భృంగరాజపత్రజలం (గుంటకరాకు నీరు) తో స్నానం చేయించి, మారేడుదళాలతో పూజించాలి. అగరు ధూపం వేసి, నేతితో వండిన మోదకాలు (లడ్డులు), పెరుగువడలు, పెరుగు అన్నం, మినప రొట్టె నైవేద్యం చేయాలి. దక్షిణగా తెల్లని వృషభాన్ని, కపిలగోవు, బంగారం, ఎర్రని వస్త్రాలు బ్రాహ్మణులకు దానం చేయాలి. శివుని "**గంగాధర**" అని కీర్తించాలి.

అమీభిః షడ్భిరపరైర్మాసైః పారణముత్తమమ్ ।
ఏవం సంవత్సరం పూర్ణం సంపూజ్య వృషభధ్వజమ్ ॥65॥

అక్షయాన్ లభతే లోకాన్ మహేశ్వరవచో యథా ।
ఇదముక్తం వ్రతం పుణ్యం సర్వపాపహరం శుభమ్ ॥66॥

స్వయం రుద్రేణ దేవర్షే తత్తథా న తదన్యథా ।

ఈ విధంగా తక్కిన ఆరుమాసాలు వ్రతం చేసి, పారణ చేయాలి. ఇట్లు సంవత్సరంపాటు వృషభకేతనుని ఆరాధించినవారు అనంతమైన కోర్కెలను సిద్ధింపచేసుకోగలరని స్వయముగా మహేశ్వరుడు వక్కాణించాడు. ఓ దేవర్షీ! అన్నివిధాలా అక్షయత్వాన్ని ప్రసాదించే ఈ ఉత్తమమైన పుణ్యవ్రతాన్ని సాక్షాత్తుగా రుద్రుడే వివరించాడు. దీనికి తిరుగులేదు. దీనితో సాటియైనది మరొకటిలేదు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే అశూన్యశయనద్వితీయా, కాలాష్టమీవ్రత వర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥16॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని అశూన్యశయనద్వితీయ, కాలాష్టమీవ్రత వర్ణనం అనే పదహారవ అధ్యాయం సమాప్తం.



సప్తదశోఽధ్యాయః – పదిహేడవ అధ్యాయం

మహిషాసురోత్పత్తిః – మహిషాసురజననం

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

మాసి చాశ్వయుజి బ్రహ్మన్ యదా పద్మం ప్రజాపతేః ।
నాభ్యా నిర్యాతి హి తదా దేవోద్యానాన్యథాఽభవన్ ॥1॥

ప్రజాపతీ! బ్రహ్మర్షే! ఆశ్వయుజమాసంలో జగన్నాథుని నాభినుండి పద్మం పుట్టగానే దేవతా వనములు వైభ్రాజము, మిశ్రకము, త్రిప్రకారథము, చైత్రరథము అనునవి ఆవిర్భవించాయి.

కందర్పస్య కరాగ్రే తు కదంబశ్చారుదర్శనః ।
తేన తస్య పరాప్రీతిః కదంబేన వివర్ధతే ॥2॥

మన్మథుని కరాగ్రంనుండి అందమైన కదంబం పుట్టింది. ఆయనకు ఆ పుష్పమంటే ఎంతో ప్రీతి.

యక్షాణామధిపస్యాపి మణిభద్రస్య నారద ।
వటవృక్షః సమభవత్తస్మింస్తస్య రతిః సదా ॥3॥

ఓ నారదా! యక్షేశ్వరుడైన మణిభద్రునినుండి వటవృక్షం పుట్టింది. ఆయనకు ఆ వృక్షమంటే ఎంతో ప్రేమ.

మహేశ్వరస్య హృదయే ధత్తూరవిటపః శుభః ।
సంజాతః స చ శర్వస్య రతికృత్తస్య నిత్యశః ॥4॥

పరమశివుని హృదయం నుండి శుభప్రదమైన ఉమ్మెత్త ఉద్భవించింది. శివుడు దానియందు ఎల్లప్పుడు ప్రీతి కలిగియుంటాడు.

బ్రహ్మణో మధ్యతో దేహాజ్జాతో మరకతప్రభః ।
ఖదిరః కంటకీ శ్రేయానభవద్విశ్వకర్మణః ॥5॥

బ్రహ్మదేవుని శరీరమధ్యభాగంనుండి మరకతవర్ణపు ఖదిరవృక్షం (చంద్రచెట్టు) జన్మించింది. విశ్వకర్మనుండి కంటకీవృక్షం జన్మించింది.

గిరిజాయాః కరతలే కుందగుల్మస్త్వజాయత ।
గణాధిపస్య కుంభస్థో రాజకే సింధువారకః ॥6॥

పార్వతీదేవి అరచేతినుండి మల్లెపొద పుట్టింది. గణాధిపుని కుంభస్థలం నుండి సింధువారవృక్షం (వావిలిచెట్టు) జన్మించింది.

యమస్య దక్షిణే పార్శ్వే పాలాశో దక్షిణోత్తరే ।
కృష్ణోదుంబరకో రౌద్రో జాతః క్షోభకరోఽవ్యయః ॥7॥

యముని దక్షిణపార్శ్వం నుండి పాలాశం (మోదుగ), దక్షిణోత్తరం నుండి నల్లమేడి, రుద్రుని దేహం నుండి క్షోభను కలిగించే వృషవిటపం (అడ్డసరప) జన్మించాయి.

స్కందస్య బంధుజీవశ్చ రవేరశ్వత్థ ఏవ చ ।
కాత్యాయన్యాః శమీజాతా బిల్వో లక్ష్మ్యా కరేఽభవత్ ॥8॥

కుమారస్వామి నుండి బంధుజీవం (మంకెనచెట్టు), సూర్యుని నుండి రావిచెట్టు, కాత్యాయని నుండి జమ్మిచెట్టు, లక్ష్మీదేవి కరతలం నుండి మారేడువృక్షం జన్మించాయి.

నాగానాం ముఖ్యతో బ్రహ్మన్ శరస్తంబో వ్యజాయత ।
వాసుకేర్విస్తృతే పుచ్ఛే పృష్ఠే దూర్వా సితాసితా ॥9॥

నాగులలో ముఖ్యుడు అనగా నాగాధిపతినుండి రెల్లుదుబ్బు పుట్టింది. వాసుకి విశాలమైన తోకనుండి, వీపునుండి క్రమంగా తెల్ల, నల్లగరిక జన్మించాయి.

సాధ్యానాం హృదయే జాతో వృక్షో హరితచందనః ।
ఏవం జాతేషు సర్వేషు తేన తత్ర రతిర్భవేత్ ॥10॥

సాధ్యుల హృదయాలనుండి హరిచందన (ఎర్రచందనం) వృక్షాలు ఉద్భవించాయి. ఈ విధంగా తమ నుండి జన్మించిన వృక్షాదులు ఆయా దేవతలకు మిక్కిలి ప్రీతిపాత్రమయ్యాయి.

తత్ర రమ్యే శుభే కాలే యా శుక్లైకాదశీ భవేత్ ।
తస్యాం సంపూజయేద్విష్ణుం తేనాఖండోఽయమూర్జతే ॥11॥

అటువంటి రమణీయమైన శుభసమయంలో శుక్లపక్ష ఏకాదశినాడు తమ కోర్కెలు తీరడానికి శ్రీమహావిష్ణువును పూజించాలి.

పత్రైః పుష్పైః ఫలైర్వాపి గంధవర్ణ రసాన్వితైః ।
ఓషధీభిశ్చ ముఖ్యాభిర్యావత్ స్యాచ్ఛరదాగమః ॥12॥

శరదృతువు వచ్చే వరకు గంధ, వర్ణ, రసాన్వితమైన పత్ర, పుష్ప ఫలాలతోను, ముఖ్యమైన ఓషధులతోను శ్రీహరిని చక్కగా పూజించాలి.

ఘృతం తిలా వ్రీహి యవా హిరణ్యం కనకాది యత్ ।
మణిముక్తాప్రవాళాని వస్త్రాణి వివిధాని చ ॥13॥
రసాని స్వాదు కట్వమ్ల కషాయలవణాని చ ।
తిక్తాని చ నివేద్యాని తాన్యఖండాని యాని చ ॥14॥
తత్పూజార్థం ప్రదాతవ్యం కేశవాయ మహాత్మనే ।
యావత్సంవత్సరం పూర్ణమఖండం ప్రభవేద్గృహే ॥15॥

నేయి, తిలలు, బియ్యం, యవలు, బంగారం, వెండి మొదలైనవి, మణులు, ముత్యాలు, పగడాలు, వివిధ వస్త్రాలు, తీపి, పులుపు మున్నగు షడ్రసోపేతమైన వస్తువులను అఖండాలుగా సేకరించి, మహాత్ముడైన కేశవునకు సమర్పించాలి. ఈ విధంగా సంవత్సరం పూర్తియైన వెంటనే ఆ గృహంలో సర్వసమృద్ధులు కలుగుతాయి.

కృతోపవాసో దేవర్షే ద్వితీయేహని సంయతః ।
స్నానేన యేన స్నాయీత తేనాఖండం హి వత్సరమ్ ॥16॥

సిద్ధార్థకైస్తిలైర్వాపి తేనైవోద్వర్తనం స్మృతమ్ ।
హవిషా పద్మనాభస్య స్నానమేవం సమాచరేత్ ॥17॥

ఓ దేవర్షీ! ఉపవాసం చేసి, ఆ మరునాడు ఉదయం జితేంద్రియుడై, వ్రతనియతాత్ముడై, సంవత్సరకాలం నిర్విఘ్నంగా జరిగేందుకు చెప్పబోయే విధంగా చేయాలి. సువాసన గల తెల్ల ఆవాలు గాని, నువ్వులు గాని, పిండి చేసి, దేహానికి నలుగుపెట్టుకొని స్నానం చేయాలి. విష్ణువును నేతితో అభిషేకించాలి.

హోమస్తేనైవ గదితో దానే శక్తిర్నిజా ద్విజ ।
పూజయేద్వాథ కుసుమైః పాదాదారభ్య కేశవమ్ ॥18॥

నేతితోనే హోమం చేసి, తన శక్తిననుసరించి ఘృతదానం చేయాలి. తదనంతరం పద్మనాభుని కుసుమాలతో పాదాలనుండి ప్రారంభించి పూజించాలి.

ధూపయేద్వివిధం ధూపం యేన స్యాద్వత్సరం పరమ్ ।
హిరణ్యరత్నవాసోభిః పూజయేచ్చ జగద్గురుమ్ ॥19॥

రకరకాలైన పరిమళధూపాలు వేయాలి. ఆ విధంగా ఆ సంవత్సరం పరమపవిత్రమౌతుంది. అనంతరం ఆ జగన్నాథుని స్వర్ణరత్నాలతోను, వస్త్రాలతోను పూజించి, అలంకరించాలి.

రాగఖాండవచోష్యాణి హవిష్యాణి నివేదయేత్ ।
తతః సంపూజ్య దేవేశం పద్మనాభం జగద్గురుమ్ ॥20॥

విజ్ఞాపయేన్మునిశ్రేష్ఠ మంత్రేణానేన సువ్రత ।
నమోఽస్తు తే పద్మనాభ పద్మాధవ మహాద్యుతే ॥21॥

ధర్మార్థకామమోక్షా మే హ్యఖండాః సంతు కేశవ ।
వికాసిపద్మపత్రాక్షయథాఽఖండోఽసి సర్వతః ॥22॥

తేన సత్యేన ధర్మాద్యాస్త్వఖండాః సంతు కేశవ ।
ఏవం సంవత్సరం పూర్ణం సోపవాసో జితేంద్రియః ॥23॥

అఖండం పారయేద్బ్రహ్మంస్తం వ్రతం సర్వవస్తుషు ।
అస్మింశ్చీర్ణే హి వ్యక్తం తు పరితుష్యంతి దేవతాః ॥24॥

మిష్టాన్నం, రుచ్యములైన చోష్య హవిష్యాదులు నైవేద్యం చేయాలి. మునిశ్రేష్ఠా! ఇలా సమర్పించిన తరువాత ఆ జగద్గురుని సమంత్రకంగా ఈ విధంగా కీర్తించాలి "ఓ పద్మనాభా! నీకు నమస్కారము. పద్మాపతీ! మహాద్యుతీ! నీకు నమస్కారము. వికసించిన తామరరేకులవంటి కన్నులు గలవాడా! ఓ కేశవా! నీవేవిధంగా పరిపూర్ణుడవై, సర్వత్ర నిండియున్నావో అట్లే నేను ఆచరించు ధర్మార్థకామమోక్షాలు అఖండంగా పరిపూర్ణత్వాన్ని కలిగి యుండేటట్లు అనుగ్రహించుము". ఈ విధంగా ఉపవాసియై, ఇంద్రియనిగ్రహంతో, ఆ సంవత్సరం వ్రతం నిర్వహిస్తే గృహస్థు సర్వవిషయాలలోను, పూర్ణత్వాన్ని సిద్ధింపజేసుకుంటాడు. ఈ విధంగా వ్రతమాచరిస్తే దేవతలందరు సంతోషిస్తారు.

ధర్మార్థకామమోక్షాద్యాస్త్వక్షయాః సంభవంతి హి ।
ఏతాని తే మయోక్తాని వ్రతాన్యుక్తాని కామిభిః ॥25॥

ఇటువంటి వ్రతం చేసినవానికి చతుర్విధపురుషార్థాలు సంపూర్ణంగా సిద్ధిస్తాయి. ఓ నారదా! అర్థార్థులైనవారికి నిర్ణయింపబడిన వ్రతాలను నీకు తెలియజేశాను.

ప్రవక్ష్యామ్యధునా త్వేతద్వైష్ణవం పంజరం శుభమ్ ।
నమో నమస్తే దేవేశ చక్రం గృహ్య సుదర్శనమ్ ॥26॥

ప్రాచ్యాం రక్షస్వ మాం విష్ణో త్వామహం శరణం గతః ।

ఓ నారదా! ఇక సర్వమంగళకరమైన విష్ణుపంజరస్తోత్రం వినిపిస్తాను. "ఓ దేవేశా! నీకు నమస్కారము. నేను నీకు శరణాగతుడను. ఓ విష్ణూ! సుదర్శనచక్రాన్ని ధరించి నీవు నన్ను తూర్పున రక్షించుము.

గదాం కౌమోదకీం గృహ్య పద్మనాభామితద్యుతే ॥27॥

యామ్యాం రక్షస్వ మాం విష్ణో త్వామహం శరణం గతః ।

అమితతేజస్వియైన పద్మనాభా! కౌమోదకీగదను ధరించి, నన్ను దక్షిణదిశలో రక్షింపుము. ఓ విష్ణూ! నీకు శరణాగతుడను.

హలమాదాయ సౌనందం నమస్తే పురుషోత్తమ ॥28॥

ప్రతీచ్యాం రక్ష మాం విష్ణో త్వామహం శరణం గతః ।

ఓ పురుషోత్తమా! నీకు నమస్కారము. ఓ విష్ణూ! సౌనందహలాన్ని ధరించిన నీవు పశ్చిమదిక్కున నన్ను రక్షింపుము. నేను నీకు శరణాగతుడను.

ముసలం శాతనం గృహ్య పుండరీకాక్ష రక్ష మామ్ ॥29॥

ఉత్తరస్యాం జగన్నాథ భవంతం శరణం గతః ।

ఓ పుండరీకాక్షా! ఉత్తమమైన నీ ముసలాయుధంతో ఉత్తరాన నన్ను రక్షింపుము. ఓ జగన్నాథా! నేను నీకు శరణాగతుడను.

శార్ఙ్గమాదాయ చ ధనురస్త్రం నారాయణం హరే ॥30॥

నమస్తే రక్ష రక్షోఘ్న ఈశాన్యాం శరణం గతః ।

ఓ హరే! శార్ఙ్గధనుస్సును, నారాయణాస్త్రాన్ని ధరించి నన్ను ఈశాన్యదిశలో రక్షింపుము. రాక్షససంహారకా! నేను నీకు శరణాగతుడను.

పాంచజన్యం మహాశంఖమన్తర్బోధ్యం చ పంకజమ్ ॥31॥

ప్రగృహ్య రక్ష మాం విష్ణో ఆగ్నేయ్యాం యజ్ఞసూకర ।

ఓ విష్ణూ!, యజ్ఞవరాహమా! పాంచజన్యశంఖాన్ని అంతర్బోధ్యకమలాన్ని ధరించి, నన్ను ఆగ్నేయ దిక్కున రక్షింపుము.

వర్మసూర్యశతం గృహ్య ఖడ్గం చర్మసమం తథా ॥32॥

నైరృత్యాం మాం చ రక్షస్వ దివ్యమూర్తే నృకేసరిన్ ।

ఓ నారసింహా! దివ్యమూర్తీ! సూర్యశతమనే డాలును, చంద్రమనే ఖడ్గాన్ని ధరించి, నైరృతిదిక్కున నన్ను రక్షింపుము.

వైజయంతీం ప్రగృహ్య త్వం శ్రీవత్సం కంఠభూషణమ్ ॥33॥

వాయవ్యాం రక్ష మాం దేవ అశ్వశీర్ష నమోఽస్తు తే ।

ఓ హయగ్రీవప్రభూ! నీకు నమస్కారము. వైజయంతీ మాలను, శ్రీవత్సాంకాన్ని ధరించిన నీవు నన్ను వాయవ్యదిశలో రక్షింపుము.

వైనతేయం సమారుహ్య అంతరిక్షే జనార్దన ॥34॥

మాం త్వం రక్షాజిత సదా నమస్తే త్వపరాజితః ।
విశాలాక్షం సమారుహ్య రక్ష మాం త్వం రసాతలే ॥35॥

ఓ జనార్దనా! గరుడవాహనారూఢుడవై నన్ను అంతరిక్షంలో రక్షింపుము. అజితా! అపరాజితా! సదా నీకు నమస్కృతులు. విశాలాక్షాన్ని అధిరోహించి, నీవు నన్ను పాతాళంలో రక్షింపుము.

అకూపార నమస్తుభ్యం మహామీన నమోఽస్తు తే ।
కరశీర్షాంఘ్రి సర్వేషు తథాష్టబాహుపంజరమ్ ॥36॥

కృత్వా రక్షస్వ మాం దేవ నమస్తే పురుషోత్తమ ।
ఏతదుక్తం భగవతా వైష్ణవం పంజరం మహత్ ॥37॥

ఆదికూర్మమా! నీకు నమస్కారం. ఓ మహామీనా! నీకు నమస్సులు. అష్టబాహుపంజరరూపాన నా శరీరంలోని చేతులు, తల, పాదాలు, మడమలు మున్నగువానిని రక్షింపుము. పురుషోత్తమదేవా! నీకు నమస్కారం. ఈ విధముగా వైష్ణవపంజరమహత్వము కీర్తింపబడింది.

పురా రక్షార్థమీశేన కాత్యాయన్యై ద్విజోత్తమ ।
నాశయామాస సా యత్ర దానవం మహిషాసురమ్ ।
నమరం రక్తబీజం చ తథాన్యాన్సురకంటకాన్ ॥38॥

ఈ విష్ణుపంజరస్తోత్రం పూర్వం శివుడు రక్షకొరకై కాత్యాయనికి చెప్పాడు. ఓ ద్విజోత్తమా! దీని ప్రభావం వలన మహిషాసురుడు, నమరుడు, రక్తబీజుడు తదితరులు ఎందరో దానవులను, సురకంటకులను ఆ మహాదేవి నాశనం గావించింది.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కశ్చాసౌ మహిషో నామ రక్తబీజాదయశ్చ కే ।
కాఽసౌ కాత్యాయనీ నామ యా జఘ్నే మహిషాసురమ్ ॥39॥

నమరం రక్తబీజం చ తథాన్యాన్సురకంటకాన్ ।
కశ్చాసౌ మహిషో నామ క్వాస్తే జాతశ్చ కస్య సః ॥40॥

కశ్చాసౌ రక్తబీజాఖ్యో నమరః కస్య చాత్మజః ।
ఏతద్విస్తారతస్తాత యథావద్వక్తుమర్హసి ॥41॥

మహిషుడనే వాడెవడు? రక్తబీజాదులెవరు? కాత్యాయని ఎవరు? దేవకంటకులైన మహిషదైత్యునీ, నమర రక్తబీజులను వధించిన కాత్యాయని ఎవరు? మహిషుడనే వాడు పుట్టిన వంశమేది? నమరరక్తబీజులు ఎవరి కుమారులు? మహర్షీ! ఈ విషయాలన్నీ నాకు వివరంగా తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రూయతాం సంప్రవక్ష్యామి కథాం పాపప్రణాశనీమ్ ।
సర్వదా వరదా దుర్గా యేయం కాత్యాయనీ మునే ॥42॥

ఓ నారదమునీ! పాపాలను పోగొట్టునట్టి దుర్గాదేవి పూర్వ కథ చెబుతున్నాను, వినుము. సమస్తమైన వరాలు ప్రసాదించే దుర్గయే ఆ కాత్యాయని.

పురాఽసురవరౌ రౌద్రౌ జగత్క్షోభకరావుభౌ ।
రంభశ్చైవ కరంభశ్చ ద్వావాస్తాం సుమహాబలౌ ॥43॥

పూర్వకాలంలో జగత్తునంతా సంక్షోభింపజేసే మహాబలశాలులైన రంభుడు, కరంభుడనే ఇద్దరు రాక్షసులు ఉండేవారు.

తావపుత్రౌ చ దేవర్షే పుత్రార్థం తేపతుస్తపః ।
బహూన్వర్షగణాన్ దైత్యౌ స్థితౌ పంచనదీజలే ॥44॥

ఓ నారదా! అపుత్రకులైన వారిరువురు పుత్రప్రాప్తి కొరకు పంచనదీజలాలలో చాలా యేండ్లు తపస్సు చేశారు.

తత్రైకో జలమధ్యస్థో ద్వితీయోఽప్యగ్నిపంచమః ।
కరంభశ్చైవ రంభశ్చ యక్షం మాలవటం ప్రతి ॥45॥

వారిలో కరంభుడు జలమధ్యంలోను, రంభుడు అగ్నిమధ్యంలోను వుండి, మాలవటయనే యక్షుని గూర్చి తపస్సు గావించారు.

ఏకం నిమగ్నం సలిలే గ్రాహరూపేణ వాసవః ।
చరణాభ్యాం సమాదాయ నిజఘాన యథేచ్ఛయా ॥46॥

కరంభుడు నీటిలో మునిగియుండగా ఇంద్రుడు మకరరూపంలో కరంభుని చరణాలు పట్టుకుని లాగుకునిపోయి వధించాడు.

తతో భ్రాతరి నష్టే చ రంభః కోపపరిప్లుతః ।
వహ్నౌ స్వశీర్షం సంఛిద్య హోతుమైచ్ఛన్మహాబలః ॥47॥

సోదరుని చావునకు కోపించి రంభుడు తనతలను నరకి అగ్నిలో ఆహుతి చేయడానికి తలంచాడు.

తతః ప్రగృహ్య కేశేషు ఖడ్గం చ రవిసప్రభమ్ ।
ఛేత్తుకామో నిజం శీర్షం వహ్నినా ప్రతిషేధితః ॥48॥

ఉక్తశ్చ మా దైత్యవర నాశయాత్మానమాత్మనా ।
దుస్తరా పరవధ్యాపి స్వవధ్యాప్యతిదుస్తరా ॥49॥

యచ్చ ప్రార్థయసే వీర తద్దదామి యథేప్సితమ్ ।
మా మ్రియస్వ మృతస్యేహ నష్టా భవతి వై కథా ॥50॥

తనజుట్టు ఒకచేతితో పట్టుకుని, రెండవ చేతితో మెరిసిపోతున్న ఖడ్గం గ్రహించి, తన తలను నరుకుకొనబోగా రంభుని అగ్నిహోత్రుడు వారించి ఇలా పలికాడు. "ఓ దైత్యవరా! ఆత్మహత్య మంచిదికాదు. కావున ఆత్మహత్య చేసుకొనవద్దు. పరహత్యా పాతకంకంటే ఆత్మహత్యాపాతకం భయంకరమైనది, దుస్తరమైనది. కాబట్టి నిన్ను నీవు చంపుకొనవద్దు. చచ్చినవానిని ఎవడు పట్టించుకొనడు గదా! నీ కోరిక ఏదో తెలియజేయుము. నీ అభీష్టాన్ని నేను నెరవేరుస్తాను".

తతోఽబ్రవీద్వచో రంభో వరం చేన్మే దదాసి హి ।
త్రైలోక్యవిజయీ పుత్రః స్యాన్మే త్వత్తేజసాధికః ॥51॥

అజేయో దైవతైః సర్వైర్యుధి దైత్యైశ్చ పావక ।
మహాబలో వాయురివ కామరూపీ కృతాస్త్రవిత్ ॥52॥

అంతట రంభుడు ఇలా పలికాడు. "ఓ అగ్నీ! నాకు నీవు వరమీయదలచినచో నీకంటే అధికతేజస్సు కలవాడును, దేవతలకు అజేయుడును, ముల్లోకాలను జయించగలవాడును, వాయువువలె బలవంతుడును, కామరూపుడును, సర్వాస్త్రకోవిదుడును అయిన పుత్రుని నాకు ప్రసాదించుము".

తం ప్రోవాచ కవిర్బ్రహ్మన్ బాఢమేవం భవిష్యతి ।
యస్యాం చిత్తం సమాలంబ్య కరిష్యసి తతస్సుతః ॥53॥

అందులకు అగ్ని "నిశ్చయంగా అట్లే జరుగుతుంది. నీకు ప్రియురాలైన స్త్రీయందు అట్టి పుత్రుని పొందుము" అని పలికాడు.

ఇత్యేవముక్తో దేవేన వహ్నినా దానవో యయౌ ।
ద్రష్టుం మాలవటం యక్షం యక్షైశ్చ పరివారితమ్ ॥54॥

అగ్నిదేవుడు అట్లు పలుకగా అనేకమంది యక్షులతో పరివేష్టితుడైయున్న మాలవటయక్షుని దర్శించడానికి ఆ దానవుడు వెళ్ళాడు.

తేషాం పద్మనిధిస్తత్ర వసతే నాన్యచేతనః ।
గజాశ్చ మహిషాశ్చాశ్వా గావోఽజా విపరిప్లుతాః ॥55॥

తాన్ దృష్ట్వైవ తదా చక్రే భావం దానవపార్థివః ।
మహిష్యాం భావయుక్తాయాం త్రిహాయణ్యాం తపోధన ॥56॥

సా సమాగాచ్ఛ దైత్యేంద్రం కామయంతీ తరస్వినీ ।
స చాపి గమనం చక్రే భవితవ్యప్రచోదితః ॥57॥

తస్యాం సమభవద్గర్భస్తాం ప్రగృహ్యాథ దానవః ।
పాతాళం ప్రవివేశాథ తతః స్వభవనం గతః ॥58॥

ఆ ప్రదేశంలో గజాశ్వ మహిషములు, గోవులు, మేకలచే పరివృతుడైయుండియు అనన్యచిత్తుడైన పద్మనిధి నివసించుచుండేవాడు. వాటి మధ్యలో వున్నట్టియు, మూడేండ్ల వయస్సు గలట్టియు, అందముగానున్నట్టియు, ఆడమహిషాన్ని చూసి ఆ దానవుడు మోహితుడయ్యాడు. ఓ నారదమునీ! విధివిధానం వల్ల ఆ ఆడమహిషం కూడా ఆ రాక్షసునితో సంగమించడానికి త్వరగా అతనిని సమీపించగా అతడు దానితో రమించాడు. వెంటనే అది గర్భం ధరించగా దానిని తీసుకొని అతడు పాతాళంలో తన భవనానికి చేరాడు.

పృష్టశ్చ దానవైః సర్వైః పరిత్యక్తశ్చ బంధుభిః ।
అకార్యకారీ చేత్యేవం భూయో మాలవటం గతః ॥59॥

అతడు చేసిన అకార్యానికి తోటి రాక్షసులు అతనిని పరిత్యజించగా అతడు ఆ ప్రదేశాన్ని వదలి, తిరిగి మాలవటం చేరాడు.

సాఽపి తేనైవ పతినా మహిషీ చారుదర్శనా ।
సమం జగామ తత్పుణ్యం యక్షమండలముత్తమమ్ ॥60॥

ఆ మహిషికూడా పతిని అనుగమించి, పుణ్యప్రదము, ఉత్తమమునైన ఆ యక్షమండలానికి వెళ్ళింది.

తతస్తు వసతస్తస్య శ్యామా సాధువనే మునే ।
అజీజనత్సుతం శుభ్రం మహిషం కామరూపిణమ్ ॥61॥

ఓ నారదమునీ! వారక్కడ వుండగా ఆ నల్లని మహిషి ఒకనాడు చక్కని అందమైన దున్నపోతును ప్రసవించింది. అది కామరూపి.

ఏతామృతుమతీం జాతాం మహిషోఽన్యో దదర్శ తామ్ ।
సా చాభ్యగాద్దితివరం రక్షంతీ శీలమాత్మనః ॥62॥

ఒకనాడామహిషి ఋతుమతియై యుండగా మరొక మహిషం దానిని చూసి మోహంతో వెంబడించగా ఆ మహిషి తన శీలాన్ని రక్షించుకోడానికి భర్తయైన రాక్షసుని సమీపించింది.

తమున్నామితనాసం చ మహిషం వీక్ష్య దానవః ।
ఖడ్గం నిష్కృష్య తరసా మహిషం తముపాద్రవత్ ॥63॥

మోర ఎత్తుకొని వెంటబడిన ఆ దున్నపోతుమీదకు ఆ రాక్షసుడు కత్తిదూసి లంఘించాడు.

తేనాపి దైత్యస్తీక్ష్ణాభ్యాం శృంగాభ్యాం హృది తాడితః ।
నిర్భిన్నహృదయో భూమౌ పపాత చ మమార చ ॥64॥

అంతట ఆ దున్నపోతు తనకొమ్ములతో రాక్షసుని గుండెలలో కుమ్మగా, హృదయం చీలిపోయి ఆ రాక్షషుడు భూమిపైపడి మరణించాడు.

మృతే భర్తరి సా శ్యామా యక్షాణాం శరణం గతా ।
రక్షితా గుహ్యకైః సార్ధం నివార్యం మహిషం తతః ॥65॥

తనభర్త మరణించడంతో ఆ మహిషి యక్షులను శరణువేడింది. యక్షులచేత ఆ దున్నపోతు నివారింపబడింది.

తతో నివారితో యక్షైః హయారిర్మదనాతురః ।
నిపపాత సరో దివ్యం తతో దైత్యోఽభవన్మృతః ॥66॥

నమరో నామ విఖ్యాతో మహాబల పరాక్రమః ।
యక్షానాశ్రిత్య తస్థౌ సా కాలం గమయతీ వనే ॥67॥

అంతట ఆ దున్నపోతు మోహాతిరేకంతో చేయునది లేక సమీపంలోనున్న ఒక దివ్యసరస్సులో పడి చనిపోయి, ఒక రాక్షసుని రూపం పొందింది. ఆ బలపరాక్రమసంపన్నుడైన రాక్షసుడే "నమరుడు" గా ఖ్యాతి చెందాడు. అతడు ఆ యక్షుల చెంతజేరి అరణ్యంలో కాలక్షేపం చేస్తున్నాడు.

స చ దైత్యేశ్వరో యక్షైః మాలవటపురస్సరైః ।
చితామారోపితః సా చ శ్యామా తం చారుహత్పతిమ్ ॥68॥

తతోఽగ్నిమధ్యాదుత్తస్థౌ పురుషో రౌద్రదర్శనః ।
వ్యద్రావయత్స తాన్యక్షాన్ ఖడ్గపాణిర్భయంకరః ॥69॥

అంతట చనిపోయిన రాక్షసుని మాలవటాది యక్షులు చితిపై చేర్చగా ఆ మహిషి కూడా తన పతితో చితాగ్నిలో దూకింది. అంతట ఆ చితాగ్ని మధ్యనుండి రౌద్రాకారుడగు పురుషుడు ఒకడు బయలుదేరి ఖడ్గపాణియై ఆ యక్షులనందరిని వెడలగొట్టాడు.

తతో హతాస్తు మహిషాః సర్వ ఏవ మహాత్మనా ।
వినా సంరక్షితారం హి మహిషం రంభనందనమ్ ॥70॥

ఆ వీరుడు రంభనందనుడైన మహిషుని వదలి మిగిలిన మహిషములనన్నిటిని వధించాడు.

స నామతః స్మృతో దైత్యో రక్తబీజో మహామునే ।
యోఽజయత్సర్వతో దేవాన్సేంద్రరుద్రార్కమారుతాన్ ॥71॥

ఓ మహామునీ! అతడే రక్తబీజుడు. అతడు ఇంద్ర, రుద్ర, సూర్య, మరుత్తులతో సహా దేవతలనందరిని జయించాడు.

ఏవం ప్రభావో దనుపుంగవోఽసౌ తేజోఽధికస్తత్ర బభౌ హయారిః ।
రాజ్యేఽభిషిక్తశ్చ మహాసురేంద్రైః వినిర్జితైః శంబరతారకాద్యైః ॥72॥

రాక్షసవీరులందరు గొప్ప పరాక్రమవంతులు. వీరందరిలోను మహిషాసురుడు గొప్పవాడు. శంబర తారకాదులందరిని జయించాడు. రాక్షసశ్రేష్ఠులందరు అతనిని తమ ప్రభువుగా రాజ్యాభిషేకం చేశారు.

అశక్నువద్భిః సహితైశ్చ దేవైః సలోకపాలైః సహుతాశభాస్కరైః ।
స్థానాని ముక్తాని శశీంద్ర భాస్కరైః ధర్మశ్చ దూరే ప్రతియోజితం చ ॥73॥

అతని ధాటికి నిలువలేక లోకపాలకులందరు సూర్యచంద్రాగ్నులతో సహా తమ తమ స్థానాలు వదలి పారిపోయారు. ధర్మానికి స్థానం లేకుండా పోయింది గదా!

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే మహిషాసురోత్పత్తిర్నామ సప్తదశోఽధ్యాయః ॥17॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్యనారదసంవాదంలోని మహిషాసురోత్పత్తి అనే పదిహేడవ అధ్యాయం సమాప్తం.

అష్టాదశోఽధ్యాయః – పద్దెనిమిదవ అధ్యాయం

దేవీమాహాత్మ్యే కాత్యాయనీజననమ్ – దేవీమాహాత్మ్యంలో కాత్యాయనీదేవి అవతరించినవిధం

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తతస్తు దేవా మహిషేణ నిర్జితాః స్థానాని సంత్యజ్య సవాహనాయుధాః ।
జగ్ముః పురస్కృత్య పితామహం తే ద్రష్టుం గదాచక్రధరం శ్రియః పతిమ్ ॥1॥

నారదమహర్షీ! మహిషునిచే నిర్జింపబడిన దేవతలందరు తమ తమ లోకాలను, ఆయుధాలను, వాహనాలను వదలి, బ్రహ్మను ముందుంచుకుని, లక్ష్మీపతియు, గదాచక్రధరుడునైన నారాయణుని దర్శించడానికి వెళ్ళారు.

గత్వా త్వపశ్యంశ్చ మిథః సురోత్తమౌ స్థితౌ ఖగేంద్రాసనశంకరౌ హి ।
దృష్ట్వా ప్రణమ్యైవ చ సిద్ధిసాధకౌ న్యవేదయంస్తన్మహిషారి చేష్టితమ్ ॥2॥

అచ్చటకు వెళ్ళిన దేవతలందరు అచ్చట శివకేశవులనిరువురను చూసి, నమస్కరించి, సిద్ధిప్రదాయకులైన వారిరువురితో దుష్టుడైన మహిషుని అత్యాచారాలను ఇలా విన్నవించారు.

ప్రభోఽశ్విసూర్యేంద్వనిలాగ్నివేధసాం జలేశశక్రాది సురాధికారాన్ ।
ఆక్రమ్య నాకాత్తు నిరాకృతా వయం కృతావనిస్థా మహిషాసురేణ ॥3॥

ప్రభో! దురాత్ముడైన మహిషాసురుడు సూర్య, చంద్ర, వాయు, అగ్ని, పితామహులు, వరుణుడు, ఇంద్రుడు, అశ్వినీదేవతలు మొదలుగా గల దేవతల అధికారాలను ఆక్రమించి, వారిని స్వర్గంనుండి భూమండలానికి తరిమివేశాడు.

ఏతద్భవంతౌ శరణాగతానాం శ్రుత్వా వచో బ్రూత హితం సురాణామ్ ।
న చేద్వ్రజామోఽద్య రసాతలం హి సంకాల్యమానా యుధి దానవేన ॥4॥

అట్టి మేమందరము మీశరణాగతులమైనాము. మాకు మేలు కలుగు విధానం తెలియజేయండి. లేనిచో ఆ దానవుని దెబ్బలకు భయపడి, మేము రసాతలానికి పోతాము.

ఇత్థం మురారిః సహ శంకరేణ శ్రుత్వా వచో విప్లుతచేతసాం హి ।
దృష్ట్వాత్ర చక్రే సహసైవ కోపం కాలాగ్నికల్పో హరిరవ్యయాత్మా ॥5॥

దేవతల దీనవచనాలను వారిరువురు వినిన వెంటనే అవ్యయుడైన శ్రీహరి కాలాగ్నివలె క్రోధంతో నిండిపోయాడు.

తతోఽనుకోపాన్మధుసూదనస్య సశంకరస్యాపి పితామహస్య ।
తథైవ శక్రాదిషు దైవతేషు మహద్ధి తేజో వదనాద్వినిఃసృతమ్ ॥6॥

ఆ వెంటనే శంకరుడు, పితామహుడు కూడా క్రోధమూర్ఛితులయ్యారు. అదే విధంగా ఇంద్రాది దేవతలు క్రుద్ధులు కాగా వారి అందరి ముఖాలనుండి గొప్పదైన తేజస్సు బయల్వెడలింది.

తచ్చైకతాం పర్వతకూటసన్నిభం జగామ తేజః ప్రవరాశ్రమే మునే ।
కాత్యాయనస్యాప్రతిమేన తేజసా మహర్షిణా తేజ ఉపాకృతం చ ॥7॥

ఆ విధంగా దేవతలనుండి బయలుదేరిన క్రోధాగ్ని అంతయు కలసి ఒక భయంకరమైన తేజశ్శిఖరంగా ఆవిర్భవించి అసమానతేజస్వియైన కాత్యాయనమహర్షిఆశ్రమంలో ఆయన తేజస్సుతో కలసి విజృంభించింది.

తేనర్షి సృష్టేన చ తేజసావృతం జ్వలత్ప్రకాశార్కసహస్రతుల్యమ్ ।
తస్మాచ్చ జాతా తరలాయతాక్షీ కాత్యాయనీ యోగవిశుద్ధదేహా ॥8॥

ఆ మహర్షిచే సృష్టింపబడిన సహస్రసూర్యకాంతితో వెలిగే మహాజ్యోతినుండి యోగవిశుద్ధశరీరంతో అతిసుందరమూర్తియైన కాత్యాయనీదేవి ఉద్భవించింది.

మహేశ్వరాద్వక్త్రమథో బభూవ నేత్రత్రయం పావక తేజసా చ ।
యామ్యేన కేశా హరితేజసా చ భుజాస్తథాష్టాదశ సంప్రజజ్ఞిరే ॥9॥

మహేశ్వరుని తేజస్సు ఆమె ముఖంగా అవతరించింది. అగ్నికాంతితో నేత్రత్రయం, యముని తేజస్సు వల్ల కేశాలు, విష్ణుతేజం వల్ల పదునెనిమిది బాహువులు ఏర్పడ్డాయి.

సౌమ్యేన యుగ్మం స్తనయోః సుసంహితం మధ్యం తథైంద్రేణ చ తేజసాऽభవత్ ।
ఊరూ చ జంఘే చ నితంబసంయుతే జాతే జలేశస్య తు తేజసా హి ॥10॥

చంద్రుని తేజస్సుతో చక్కని స్తనద్వయం, ఇంద్రుని తేజస్సుతో నడుము, వరుణుని కాంతి వల్ల తొడలు, పిక్కలు, పిరుదులు ఏర్పడ్డాయి.

పాదౌ చ లోకప్రపితామహస్య పద్మాభికోశప్రతిమౌ బభూవతుః ।
దివాకరాణామపి తేజసాంగులీః కరాంగులీ చ వసుతేజసైవ ॥11॥

బ్రహ్మతేజం వల్ల పాదాబ్జాలు, ఆదిత్యుల కాంతివల్ల పాదాంగుళులు, వసువుల తేజస్సుతో చేతివ్రేళ్ళు ఏర్పడ్డాయి.

ప్రజాపతీనాం దశనాశ్చ తేజసా యాక్షేణ నాసా శ్రవణౌ చ మారుతాత్ ।
సాధ్యేన చ భ్రూయుగళం సుకాంతిమత్ కందర్పబాణాసనసన్నిభం బభౌ ॥12॥

ప్రజాపతుల కాంతితో దంతాలు, యక్షుల తేజంతో నాసిక, మరుత్తులవలన చెవులు, సాధ్యుల కాంతితో అందమైన కనుబొమలు రూపొంది ఆమె కందర్పుని బాణాసనం వలె విరాజిల్లింది.

తచ్చాపి తేజోత్తమముత్తమం మహన్నామ్నా పృథివ్యామభవత్ప్రసిద్ధమ్ ।
కాత్యాయనీత్యేవ తదా బభౌ సా నామ్నా చ తేనైవ జగత్ప్రసిద్ధా ॥13॥

కాత్యాయనమహర్షి తపశ్శక్తితో నిండిన ఆ తేజోమూర్తి నాటినుండి కాత్యాయనీదేవిగా లోకంలో ప్రసిద్ధి గాంచింది.

దదౌ త్రిశూలం వరదస్త్రిశూలీ చక్రం మురారిర్వరుణశ్చ శంఖమ్ ।
శక్తిం హుతాశః శ్వసనశ్చ చాపం తూణం తథాక్షయ్యశరౌ వివస్వాన్ ॥14॥

వరప్రదాయుడైన త్రిశూలి ఆ దేవికి త్రిశూలం ఇచ్చాడు. మురారియైన శ్రీవిష్ణువు చక్రాన్ని యిచ్చాడు. వరుణుడు శంఖాన్ని, అగ్ని శక్తిఅనే ఆయుధాన్ని, వాయువు ధనుస్సును, సూర్యుడు అక్షయశరతూణీరాలను ఇచ్చారు.

వజ్రం తథేంద్రః సహ ఘంటయా చ యమోఽథ దండం ధనదో గదాం చ ।
బ్రహ్మాక్షమాలాం సకమండలుం చ కాలోఽసిముగ్రం సహ చర్మణా చ ॥15॥

ఇంద్రుడు వజ్రాయుధం, యముడు ఘంటతోబాటు దండం, కుబేరుడు గద, బ్రహ్మ అక్షమాల కమండలాలు, కాలుడు మహోగ్రఖడ్గం, డాలు ఆ దేవికి ఇచ్చారు.

హారం చ సోమః సహ చామరేణ మాలాం సముద్రో హిమవాన్మృగేంద్రమ్ ।
చూడామణిం కుండలమర్ధచంద్రం ప్రాదాత్కుఠారం సురశిల్పకర్తా ॥16॥

చంద్రుడు కంఠహారం, చామరాలు. సముద్రుడు మాల, హిమవంతుడు మృగరాజైన సింహాన్ని వాహనంగాను, విశ్వకర్మ కుండలాలను, చూడామణిని, అర్ధచంద్రుని, కుఠారాన్ని ప్రదానం చేశారు.

గంధర్వరాజో రజతానులిప్తం పానస్య పూర్ణం సదృశం చ భాజనమ్ ।
భుజంగహారం భుజగేశ్వరోఽపి అమ్లానపుష్పామృతవః స్రజం చ ॥17॥

గంధర్వరాజు రజతానులిప్తమైనట్టియు, ఉత్తమమైనట్టియు, పానపాత్రను, భుజగేశ్వరుడైన శేషుడు సర్పమణిహారాన్ని, ఋతువులు ఎన్నడూ వాడిపోని పుష్పమాలను సమర్పించారు.

తదాతితుష్టా సురసత్తమా సా అట్టాట్టహాసం ముముచే త్రినేత్రా ।
తాం తుష్టువుర్దేవవరాః సహేంద్రాః సవిష్ణురుద్రేంద్వనిలాగ్ని భాస్కరాః ॥18॥

ఆ విధంగా దేవతాశ్రేష్ఠులచేత సంభావింపబడిన ఆ దేవి అట్టాట్టహాసం చేసింది. దానితో బ్రహ్మవిష్ణు రుద్రేంద్రాదులు, చంద్ర అగ్ని మున్నగు దేవతా సమూహమంతా సంతోషించారు.

నమోఽస్తు దేవ్యై సురపూజితాయై యా సంస్థితా యోగవిశుద్ధదేహా ।
నిద్రాస్వరూపేణ మహీం వితత్య తృష్ణాత్రపాక్షుద్భయదా చ కాంతిః ॥19॥

శ్రద్ధా స్మృతిః పుష్టిరథో క్షమా చ ఛాయా చ శక్తిః కమలాలయా చ ।
మేధా స్మృతిః క్షాంతిరథేహ మాయా నమోఽస్తు దేవ్యై భవితవ్యతాయై ॥20॥

దేవతలచేత పూజింపబడు దేవీ! నీకు నమస్కారము. పృథ్వియందలి సమస్త జీవులలో నిద్రారూపంగాను, తృష్ణగాను, లజ్జగాను, ఆకలిగాను, భయంగాను, కాంతిగాను, శ్రద్ధగాను, స్మృతిగాను, పుష్టిగాను, క్షమగాను,

ఛాయగాను, శక్తిగాను, లక్ష్మిగాను, మేధస్సుగాను, క్షాంతిగాను, మాయగాను, నిండియుండి సంసార రూపంలో నుండే పరమేశ్వరీ! నీకు నమస్కారము. తల్లీ! నీకు నమస్కారము.

తతః స్తుతా దేవవరైర్మృగేంద్రమారుహ్య దేవీ ప్రగతావనాధ్యమ్ ।
వింధ్యం మహాపర్వతముచ్చశృంగం చకార యం నిమ్నతరం త్వగస్త్యః ॥21॥

ఈ విధంగా దేవతలందరు స్తోత్రం చేసిన వెంటనే ఆ దేవి సింహవాహనమెక్కి, ఎత్తైన శిఖరాలతో కూడి అగస్త్యమునివల్ల అనంతరకాలంలో తగ్గి, కుంచించుకుపోయిన వింధ్యపర్వతానికి వెళ్ళింది.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కిమర్థమద్రిం భగవానగస్త్యస్తం నిమ్నశృంగం కృతవాన్మహర్షిః ।
కస్మై కృతే కేన చ కారణేన ఏతద్వదస్వామలసత్త్వవృత్తే ॥22॥

మహర్షీ! భగవంతుడైన అగస్త్యమహర్షి ఎందువలన, ఎవరికొరకు వింధ్యాద్రి ఔన్నత్యాన్ని తగ్గించాడు. పుణ్యపురుషులైనమీరు దీనినంతటిని నాకు వివరించండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

పురా హి వింధ్యేన దివాకరస్య గతిర్నిరుద్ధా గగనే చరస్య ।
రవిస్తతః కుంభభవం సమేత్య హోమావసానే వచనం బభాషే ॥23॥

పూర్వకాలంలో ఒకానొకనాడు వింధ్యుడు ఆకాశం పొడవునకు ఎగిరి సూర్యగమనాన్ని నిరోధించాడు. అంతట రవి కుంభజుడైన అగస్త్యుని చేరి, ఆ ముని హోమకార్యానంతరం ఇలా పలికాడు.

సమాగతోఽహం ద్విజదూరతస్త్వాం కురుష్వ విశ్వోద్ధరణం మునీంద్ర ।
దదస్వ దానం మమ యన్మనీషితం చరామి యేన త్రిదివేషు నిర్వృతః ॥24॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! నేను చాలాదూరం నుండి వచ్చాను. నన్నుద్ధరింపుము. నేను నిరాటంకంగా అంతరిక్షంలో సంచరించడానికి వీలుగా నా మనోరథాన్ని నెరవేర్చుము.

ఇత్థం దివాకరవచో గుణసంప్రయోగి శ్రుత్వా తదా కలశజో వచనం బభాషే ।
దానం దదామి తవ యన్మనసస్త్వభీష్టం నార్థీ ప్రయాతి విముఖో మమ కశ్చిదేవ ॥25॥

శ్రుత్వా వచోఽమృతమయం కలశోద్భవస్య ప్రాహ ప్రభుః కరతలం వినిధాయ మూర్ధ్ని ।
ఏషోఽద్య మే గిరివరః ప్రరుణాద్ధి మార్గం వింధ్యస్య నిమ్నకరణే భగవన్యతస్వ ॥26॥

అర్థగర్భితమైన సూర్యుని ఈ మాటలు విని, అగస్త్యుడు "నన్ను అర్థించినవారెవ్వరు విఫలులై తిరిగి వెళ్లరు. నీ మనోభీష్టాన్ని తెలుపుము. నేను నెరవేర్చెదను" అని పలుకగా అమృతసమానమైన ఆ మాటలకు సంతోషించి, చేతులు జోడించి, సూర్యుడు "ఈ పర్వతశ్రేష్ఠుడు నా మార్గాన్ని నిరోధించాడు. ఈ వింధ్యుని ఔన్నత్యాన్ని తగ్గించండి" అని విన్నవించాడు.

ఇతి రవివచనాదథాహ కుంభజన్మా కృతమితి విద్ధి మయా హి నీచశృంగమ్ ।
తవ కిరణజితో భవిష్యతి మహీధ్రో మమ చరణ సమాశ్రితస్య కా వ్యథా తే ॥27॥

ఇట్లుపలికిన రవిమాటలు విని అగస్త్యుడిలా పలికాడు. ఓ దివాకరా! నీవు నన్ను ఆశ్రయించావు. ఇంక నీకు ఏమి బాధ కలుగుతుంది? వింధ్యుని శిఖరాలు అణచబడినవిగా తలంచుము. నీ కిరణప్రసారానికి అతని ఆటంకం వుండదు.

ఇత్యేవముక్త్వా కలశోద్భవస్తు సూర్యం హి సంస్తూయ వినమ్రభక్త్యా ।
జగామ సంత్యజ్య హి దండకాం తు వింధ్యాచలం వృద్ధవపుర్మహర్షిః ॥28॥

గత్వా వచః ప్రాహ మునిర్మహీధ్రం యాస్యే మహాతీర్థవరం సుపుణ్యమ్ ।
వృద్ధోస్మ్యశక్తశ్చ తవాధిరోఢుం తస్మాద్భవాన్నీచతరోఽస్తు సద్యః ॥29॥

అని అగస్త్యుడు పలికి సూర్యునకు వినయంతోను, భక్తితోను మ్రొక్కి, స్తుతించి, దండకారణ్యం విడిచి, వింధ్యాచలానికి ప్రయాణమయ్యాడు. అగస్త్యుడు వింధ్యాచలం చేరి వింధ్యునితో ఇలా పలికాడు. "ఓ అచలోత్తమా! నేను వృద్ధుడను, పుణ్యతీర్థయాత్రలకు వెళ్ళుచున్నాను. నిన్ను అధిరోహించి, దాటి వెళ్ళుటకు అశక్తుడను. కనుక నీవు వెంటనే క్రిందకు బాగుగా వంగియుండుము".

ఇత్యేవముక్తో మునిసత్తమేన స నీచశృంగస్త్వభవన్మహీధ్రః ।
సమాక్రమంశ్చాపి మహర్షిముఖ్యః ప్రోల్లంఘ్య వింధ్యం త్విదమాహ శైలమ్ ॥30॥

యావన్న భూయో నిజమావ్రజామి మహాశ్రమం ధౌతవపుః సుతీర్థాత్ ।
త్వయా నతావత్త్విహ వర్ధితవ్యం న చేద్ విశప్స్యేఽహమవజ్ఞయా తే ॥31॥

మునిశ్రేష్ఠుడైన అగస్త్యుడిట్లు పలుకగా వింధ్యుడు తన శిఖరాల ఔన్నత్యాన్నితగ్గించి, క్రిందకు తగ్గిన వాడయ్యాడు. అగస్త్యమహర్షి వింధ్యాద్రిని దాటి, తదనంతరం వింధ్యునితో ఇలా పలికాడు. "ఓ శైలమా! నేను తీర్థావగాహనం చేసి, పరిశుద్ధుడనై తిరిగి నా ఆశ్రమానికి వచ్చే వరకు నీవు పెరగకుండా ఇట్లే అవనతుడవై యుండుము. లేనిచో నీ అవజ్ఞకు శాపాన్ని పొందగలవు".

ఇత్యేవముక్త్వా భగవాన్ జగామ దిశం స యామ్యాం సహసాంతరిక్షమ్ ।
ఆక్రమ్య తస్థౌ సహితాం తదాశాం కాలే ప్రజామ్యత్ర యదా మునీంద్రః ॥32॥

వింధ్యునితో ఇట్లు పలికిన అగస్త్యమహర్షి ఆకాశమార్గంలో దక్షిణదిశగా వెళ్ళి తగిన అదను చూసి, తిరిగి తన ఆశ్రమానికి వెళ్ళే ఉద్దేశ్యంతో ఆ దక్షిణదిక్కునందే కాలం గడుపుతున్నాడు.

తత్రాశ్రమం రమ్యతరం హి కృత్వా సంశుద్ధజాంబూనదతోరణాంతమ్ ।
తత్రాథ నిక్షిప్య విదర్భపుత్రీం స్వమాశ్రమం సౌమ్యముపాజగామ ॥33॥

అక్కడనే బంగారుతోరణాలతో, అందమైన ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకొని, విదర్భరాజపుత్రియగు లోపాముద్రను అచ్చట ఉంచి, తిరిగి అగస్త్యుడు తన ఆశ్రమానికి వెళ్ళాడు.

ఋతావృతౌ పర్వదినేషు నిత్యం తమంబరే హ్యాశ్రమమావసత్సః ।
శేషం హి కాలం స హి దండకాస్థస్తపశ్చచారామితకాంతిమాన్మునిః ॥34॥

ప్రతి ఋతువులోని పర్వదినాలలో ఆ మహర్షి దక్షిణదిక్కులోనున్న ఆశ్రమంలో వుంటూ, ఇతర సమయాలలో దండకారణ్యంలోని నిజాశ్రమంలో తపస్సు చేసుకుంటూ వుంటున్నాడు.

వింధ్యోఽపి దృష్ట్వా గగనే మహాశ్రమవృద్ధిం న యాత్యేవ భయాన్మహర్షేః ।
నాసౌ నివృత్తేతి మతిం విధాయ స సంస్థితో నీచతరాగ్రశృంగః ॥ 35॥

వింధ్యుడు కూడా ఆకాశంలోనే ఆ దివ్యాశ్రమాన్ని చూసి, మహర్షికి భయపడి, పెరుగుట మాని, మహర్షి ఎప్పుడు తిరిగి వస్తాడోనని ప్రతీక్షిస్తూ తన శిఖరాలను ఒంచుకొనియే యున్నాడు.

ఏవం త్వగస్త్యేన మహాచలేంద్రః స నీచశృంగో హి కృతో మహర్షే ।
తస్యోర్ధ్వశృంగే మునిసంస్తుతా సా దుర్గా స్థితా దానవనాశనార్థమ్ ॥36॥

దేవాశ్చ సిద్ధాశ్చ మహోరగాశ్చ విద్యాధరా భూతగణాశ్చ సర్వే ।
సర్వాప్సరోభిః ప్రతిరామయంతః కాత్యాయనీం తస్థురపేతశోకాః ॥37॥

ఓ నారదమహర్షీ! ఈ విధంగా తపోధనుడైన అగస్త్యుడు వింధ్యుని శిఖరాలను వంచి పాదాక్రాంతం చేశాడు. అట్టి వింధ్యాద్రి ఊర్ధ్వ శృంగాన్ని అధిరోహించి మునీశ్వరులంతా స్తుతిస్తూ ఉండగా కాత్యాయని రాక్షస సంహారార్థం నిలచియున్నది. ఇక తమ బాధలనన్నింటిని మరచి దేవతలు, సిద్ధులు, ఉరగులు, విద్యాధరులు, భూతగణాలు, అప్సరసలు మున్నగువారందరు కాత్యాయనీ మాతను రంజింపజేస్తూ, ఆమె సేవలో ఉండిపోయారు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే దేవీమాహాత్మ్యే కాత్యాయనీ జననం నామ అష్టాదశోఽధ్యాయః ॥18॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని దేవీమాహాత్మ్యంలో కాత్యాయనీదేవి అవతరించిన విధం అనే పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనవింశోఽధ్యాయః - పందొమ్మిదవ అధ్యాయం
దేవీమాహాత్మ్యపరికీర్తనమ్ - దేవీమాహాత్మ్యపరికీర్తనం

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

తతస్తు తాం తత్ర తదా వసంతీం కాత్యాయనీం శైలవరస్య శృంగే ।
అపశ్యతాం దానవసత్తమౌ ద్వౌ చండశ్చ ముండశ్చ తపస్వినీం భృశమ్ ॥1॥

నారదమహర్షీ! వింధ్యపర్వతశిఖరాన తపస్వినిగానున్న కాత్యాయనీదేవిని చండుడు, ముండుడు అనబడే ఇద్దరు రాక్షసవీరులు చూశారు.

దృష్ట్వైవ శైలాదవతీర్య శీఘ్రమాజగ్మతుః స్వం భవనం సురారీ ।
దృష్ట్వోచతుస్తౌ మహిషాసురస్య దూతావిదం చండముండౌ దితీశమ్ ॥2॥

ఆమెను చూసిన వెంటనే మహిషాసురదూతలగు రాక్షసులిరువురు పర్వతం దిగి, తమ భవనానికి వెళ్ళి, మహిషాసురుని దర్శించి, అతనితో ఇలా పలికారు.

స్వస్థో భవాన్ కింత్వసురేంద్ర సాంప్రతమాగచ్ఛ పశ్యామ చ తత్ర వింధ్యమ్ ।
తత్రాస్తి దేవీ సుమహానుభావా కన్యా సురూపా సురసుందరీణామ్ ॥3॥

ఓ ప్రభూ! మీరీ సమయంలో ఇంత స్వస్థతతో ఎలా ఉండగలుగుతున్నారు?. మీరు మాతో రండి. మనం వింధ్యపర్వతానికి వెళ్ళి అక్కడ దేవతాసుందరులలో మిక్కిలి సుందరమైనట్టియు, శ్రేష్ఠమైన లక్షణాలు కలిగినట్టియు ఒక కన్యను చూడవచ్చు.

జితస్తయా తోయధరోఽలకైర్హి జితః శశాంకో వదనేన తన్వ్యా ।
నేత్రైస్త్రిభిస్త్రీణి హుతాశనాని జితాని కంఠేన జితస్తు శంఖః ॥4॥

ఆమె కేశాలు మేఘాలను జయించాయి. ఆమె ముఖం చంద్రుని ధిక్కరించింది. మూడు నేత్రాలు త్రేతాగ్నులను వెక్కిరిస్తున్నాయి. ఆమె తన కంఠంతో శంఖాన్ని జయించింది.

స్తనౌ సువృత్తావథ నిమ్నచూచుకౌ స్థితౌ విజిత్యైవ గజస్య కుంభౌ ।
త్వాం సర్వజేతారమితి ప్రతర్క్య కుచౌ స్మరేణైవ కృతౌ సుదుర్గౌ ॥5॥

ఆమె గుండ్రని నిమ్నచూచుకాలు గల స్తనాలు ఏనుగు కుంభస్థలాలను జయించాయి. ముల్లోకాలను జయించిన నీ వృత్తాంతం విని మన్మథుడు ఆమె కుచాలను తనకు చక్కని దుర్గాలుగా చేసుకున్నాడు.

పీనాః సశస్త్రాః పరిఘోపమాశ్చ భుజాస్తథాష్టాదశ భాంతి తస్యాః ।
పరాక్రమం వై భవతో విదిత్వా కామేన యంత్రా ఇవ తే కృతాస్తు ॥6॥

ఇనుపచువ్వలవంటి బలిసిన పదునెనిమిది భుజములు శస్త్రములతో ఒప్పుచున్నవి. ఆమె పరాక్రమాన్ని గ్రహించిన మన్మథుడు వాటిని వివిధ యంత్రాలుగా చేసుకున్నాడనిపిస్తున్నది.

మధ్యం చ తస్యాస్త్రివలీతరంగం విభాతి దైత్యేంద్ర సురోమరాజి ।
భయాత్తవారోహణకాతరస్య కామేన సోపానమివ ప్రయుక్తమ్ ॥7॥

మూడు వళులతో, రోమసమూహంతో అందమైన ఆమె నడుము చూస్తే భయంతో మన్మథుడు ఎక్కడానికి ఏర్పరచుకున్న సోపానపంక్తిలా ఉంటుంది.

సా రోమరాజీ నితరాం హి తస్యా విరాజతే పీన కుచావలగ్నా ।
ఆరోహణే త్వద్భయకాతరస్య స్వేదప్రవాహోఽసురమన్మథస్య ॥8॥

ఆమె పీన కుచాల క్రిందనున్న చక్కని రోమపంక్తి మీ ప్రతాపోద్ధతికి భయాతురుడైన మన్మథుని ఒంటినుండి జారిన చెమట బిందువులవలె కన్పిస్తున్నది.

నాభిర్గభీరా నితరాం విభాతి ప్రదక్షిణాస్యాః పరివర్తమానా ।
తస్యైవ లావణ్యగృహస్య ముద్రా కందర్పరాజ్ఞా స్వయమేవ దత్తా ॥9॥

కుడివైపు ప్రదక్షిణంగా తిరిగి, లోతైన నాభి సౌందర్యగృహం మీద దానికి రాజైన మన్మథుడు వేసిన ముద్ర వలె భాసిస్తున్నది.

విభాతి రమ్యం జఘనం మృగాక్ష్యాః సమం తతో మేఖలయావఘృష్టమ్ ।
మన్యే హ్యహం కామనరాధిపస్య ప్రాకారగుప్తం నగరం సుదుర్గమ్ ॥10॥

వడ్డాణంతో పరివేష్టితమైన ఆమె జఘనప్రదేశం చూస్తే మన్మథుడు ఎత్తైన ప్రహరీగోడతో నిర్మించుకున్న శత్రుదుర్భేద్యమైన దుర్గమా? అనిపిస్తున్నది.

వృత్తావరోమౌ చ మృదూ కుమార్యాః శోభేత ఊరూ సమనుత్తమౌ హి ।
ఆవాసనార్థం మకరధ్వజేన జనస్య దేశావివ సన్నివిష్టౌ ॥11॥

రోమరహితములై, గుండ్రనివై, మృదువుగానున్న ఆమె ఊరువులు మన్మథనరేశ్వరుడు తనవారలకై ఏర్పరచుకున్న నివేశన స్థలాల వలె కన్పిస్తున్నాయి.

తజ్జానుయుగ్మం మహిషాసురేంద్ర హ్యత్యున్నతం భాతి తథైవ తస్యాః ।
సృష్ట్వా విధాతా హి నిరూపణాయ శ్రాంతస్తథా హస్తతలౌ దదౌ హి ॥12॥

మహిషాసురేంద్రా! కొంచెం ఉబ్బెత్తుగానున్న ఆమె అందమైన మోకాళ్ళను చూస్తే బ్రహ్మ ఆమెను సృష్టించి, అలసిపోయి, తన సృష్టిసౌందర్యసమగ్రతను నిరూపించడానికి తన రెండు అరచేతులను వానిపై పెట్టుకున్నట్లు తోస్తున్నది.

జంఘే సువృత్తేఽపి చ రోమహీనే శుభే చ దైత్యేశ్వర తే తదీయే ।
ఆనమ్య లోకానివ నిర్మితే యేఽసూపం విజిత్యైవ కృతే వరే హి ॥13॥

ఆ సుందరియొక్క వర్తులవలైనట్టియు, రోమరహితములైనట్టియు పిక్కలు ప్రపంచంలోని సౌందర్య సృష్టినంతటిని అధఃకరిస్తున్నాయి.

పాదౌ చ తస్యాః కమలోదరాభౌ ప్రయత్నతస్తౌ హి కృతౌ విధాత్రా ।
ఆజ్ఞాయి తస్యా నఖరత్నమాలా నక్షత్రమాలా గగనే యథైవ ॥14॥

తామరపువ్వులలోని మృదుత్వాన్ని తలదన్నే ఆమె పాదాలను విధాత ఎంతో శ్రమపడి నిర్మించాడు. ఆమె నఖరత్నమాల ఆకాశమున నక్షత్రపంక్తి వలె తెలుసుకొనబడుతోంది.

ఏవం స్వరూపా దనునాథ కన్యా మహోగ్రశస్త్రాణి చ ధారయంతీ ।
దృష్ట్వా యథేష్టం న చ వేద్మి కా సా సుతా తథా కస్యచిదేవ బాలా ॥15॥

ఇంతటి అందాలరాశియైన ఆ కన్య ఓ దనుజేశ్వరా! భయంకరమైన శస్త్రాస్త్రాలు ధరించియున్నది. ఆమెను మేము చాలా దీక్షగా చూశాము. అయినప్పటికి ఆ బాల ఎవరి కుమార్తెయో? ఎవరో? ఏమో? తెలుసుకోలేకపోయాము.

తద్భూతలే రత్నమనుత్తమం స్థితం స్వర్గం పరిత్యజ్య మహాఽసురేంద్ర ।
గత్వాఽథ వింధ్యే స్వయమేవ పశ్య కురుష్వ యత్తేఽభిమతం క్షమం చ ॥16॥

దివి నుండి భువికి దిగిన అనర్ఘరత్నం ఆ బాలిక. ఓ మహా అసురేంద్రా! నీవే స్వయంగా వెళ్ళి ఆమెను చూడుము. ఆ తరువాత నీకు ఇష్టమైన విధంగా చేయుము.

శ్రుత్వైవ తాభ్యాం మహిషాసురస్తు దేవ్యాః ప్రవృత్తిం కమనీయరూపామ్ ।
చక్రే మతిం నాత్ర విచార్యమస్తి ఇత్యేవముక్త్వా మహిషో మహర్షే ॥17॥

దేవి కమనీయసౌందర్యమును గురించి ఆ రాక్షసులిరువురు చెప్పినదంతయు విని మహిషాసురుడు "ఇందులో ఇంకా ఆలోచించవలసినది ఏమియూలేదు" అని భావించాడు.

ప్రాగేవ పుంసస్తు శుభాశుభాని స్థానే విధాత్రా ప్రతిపాదితాని ।
యస్మిన్యథా యాతి చ సోఽథ విప్ర స నీయతే వా వ్రజతి స్వయం వా ॥18॥

నారదా! జీవుల శుభాశుభాలు ముందుగానే బ్రహ్మచే నిర్ణయింపబడియుంటాయి. ఎవడు ఎప్పుడు ఎక్కడకు వెళ్ళాలో అక్కడకు స్వయంగానైనా వెళతాడు. లేదా తీసుకొనిపోబడతాడు.

తతోఽనుముండం నమరం స చండం బిడాలనేత్రం సపిశంగబాష్కలమ్ ।
ఉగ్రాయుధం విక్షురరక్తబీజౌ సమాదిదేశాథ మహాసురేంద్రః ॥19॥

అప్పుడా రాక్షసేంద్రుడు చండ, ముండ, నమర, బిడాలనేత్ర, పిశంగ, బాష్కల, ఉగ్రాయుధ, విక్షుర, రక్తబీజాదులను ఆజ్ఞాపించాడు.

ఆహత్య భేరీం రణకర్కశాస్తే స్వర్గం పరిత్యజ్య మహీధరం తు ।
ఆగమ్య మూలే శిబిరం నివేశ్య తస్థుశ్చ సజ్జాదనునందనాస్తే ॥20॥

ఆ యుద్ధోన్మాదులందరు యుద్ధభేరీలు మ్రోగించి, స్వర్గం వదలి, భూమి మీద వింధ్యపర్వతాన్ని చేరి, ఆ పర్వత మూలంలో స్కంధావారాలు నిర్మించుకున్నారు.

తతస్తు దైత్యో మహిషాసురేణ సంప్రేషితో దానవయూథపాలః ।
మయస్య పుత్రో రిపుసైన్యమర్దీ సదుందుభిర్దుందుభినిఃస్వనస్తు ॥21॥

అంతట ఆ మహిషుడు శత్రుసంహారకుడు, తన సేనాపతి, మయాసురుని కుమారుడు, దుందుభివంటి కంఠధ్వని గల దుందుభి అనే రాక్షసుని దేవి వద్దకు దూతగా పంపాడు.

అభ్యేత్య దేవీం గగనస్థితోఽపి సదుందుభిర్వాక్యమువాచ విప్ర ।
కుమారి దూతోఽస్మి మహాసురస్య రంభాత్మజస్యాప్రతిమస్య యుద్ధే ॥22॥

ఓ నారదా! దుందుభి దేవిచెంతకు చేరి, సమీపంలో ఆకాశంలో నిలబడి ఇలా పలికాడు. "ఓ కుమారీ! నేను యుద్ధంలో అప్రతిమానుడు, రంభాసురుని కుమారుడునైన మహిషాసురుని దూతను".

కాత్యాయనీ దుందుభిమిత్యువాచ ఏహ్యేహి దైత్యేంద్ర భయం విముంచ ।
వాక్యం చ యద్రంభసుతో బభాషే వదస్వ తత్సత్యమపేతమోహః ॥23॥

దుందుభి పలికిన మాటలు వినగానే కాత్యాయని "ఓ దైత్యేంద్రా! భయాన్ని విడచిరమ్ము! రంభుని కుమారుడైన మహిషాసురుడు పంపిన సందేశం వినిపింపుము" అని పలికింది.

తతస్తు వాక్యాద్దితిజః శివాయాస్త్యక్త్వాంబరం భూమితలే నిషణ్ణః ।
సుఖోపవిష్టః పరమాసనే చ రంభాత్మజేనోక్తమువాచ వాక్యమ్ ॥24॥

దేవి మాటలు విని దుందుభి ఆకాశం నుండి భూమికి దిగి, దేవికి ఎదురుగా శ్రేష్ఠమైన ఆసనంపై సుఖంగా కూర్చుని, మహిషాసురుని సందేశాన్ని ఇలా వినిపించాడు.

దుందుభి రువాచ – దుందుభి పలికాడు.

ఏవం సమాజ్ఞాపయతే సురారిస్త్వాం దేవి దైత్యో మహిషాసురస్తు ।
యథామరా హీనబలాః పృథివ్యాం భ్రమంతి యుద్ధే విజితా మయా తే ॥25॥

ఓ దేవీ! మహిషాసురుడు నీకిలా ఆజ్ఞాపించాడు. నాతో యుద్ధంలో ఓడిపోయి అమరులందరు బలహీనులై, భూమిపై తిరుగుతున్నారు.

స్వర్గో మహీం వాయుపథాశ్చ వశ్యాః పాతాళమన్యే చ మహీశ్వరాద్యాః ।
ఇంద్రోఽస్మి రుద్రోఽస్మి దివాకరోఽస్మి సర్వేషు లోకేష్వధిపోఽస్మి బాలే ॥26॥

స్వర్గ మర్త్య పాతాళాలు, వాయుమండలం, అక్కడి రాజులు, తక్కిన రాజులందరు నాకు వశులైపోయారు. నేనే ఇంద్రుడను, నేనే రుద్రుడను, నేనే సూర్యుడను, ఓ బాలా! సమస్తలోకాలకు అధిపుడను నేనే.

న సోఽస్తి నాకే న మహీతలే వా స్వర్గేఽపి పాతాళతలేఽపి యుద్ధే ।
సర్వాణి మామద్య సమాగతాని వీర్యార్జితానీహ విశాలనేత్రే ॥27॥

విశాలమైన నేత్రాలు గలదానా! స్వర్గంలో ఎవరూ లేరు. భూమండలంలో గాని, పాతాళంలో గాని ఎవరూ లేరు. యుద్ధంలో అందరూ నాకు వశులైనారు. సమస్తమూ నాకు వశమైనది. నా పరాక్రమానికి అనర్ఘరత్నాలన్నీ నాకు లోబడి, నన్ను చేరాయి.

స్త్రీరత్నమగ్ర్యం భవతీ చ కన్యా ప్రాప్తోఽస్మి శైలం తవ కారణేన ।
తస్మాద్భజస్వేవ జగత్పతిం మాం పతిస్తవార్హోఽస్మి విభుః ప్రభుశ్చ ॥28॥

ఓ బాలా! ఇప్పుడు నా ఎదురుగా స్త్రీరత్నమున్నది. నీవు కన్యవు. నీ కొరకు నేను ఈ వింధ్యపర్వతప్రాంతానికి వచ్చాను. జగత్పతిని, సర్వప్రభువును అయిన నన్ను కన్యారత్నమైన నీవు వరించి వివాహమాడుము.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్తా దితిజేన దుర్గా కాత్యాయనీ ప్రాహ మయస్య పుత్రమ్ ।
సత్యం ప్రభుర్దానవరాట్ పృథివ్యాం సత్యం చ యుద్ధే విజితామరశ్చ ॥29॥

మయపుత్రుడైన దుందుభి పలికిన ఈ మాటలు విని, కాత్యాయని వానితో ఇలా పలికింది. "సత్యమే మీ ప్రభువైన దానవేశ్వరుడు యుద్ధంలో భూమండలాన్ని, దేవతలను, జయించినమాట సత్యమే.

కిం త్వస్తి దైత్యేశ కులేఽస్మదీయే ధర్మో హి శుల్కాఖ్య ఇతి ప్రసిద్ధః ।
తం చేత్ప్రదద్యాన్మహిషో మమాద్య భజామి సత్యేన పతిం హయారిమ్ ॥30॥

కాని, ఓ దైత్యేశా! మా కులాచారం ప్రకారం ధర్మశుల్కం చెల్లించి కన్యను వివాహమాడాలి. మీ మహిషుడు ఆ ధర్మశుల్కాన్ని చెల్లించినచో నేనాతనిని తప్పక వివాహమాడతాను".

శ్రుత్వాఽథ వాక్యం మయజోఽబ్రవీచ్చ శుల్కం వదస్వాయతపత్రనేత్రే ।
దద్యాత్స్వమూర్ధానమపి త్వదర్థే కిన్నామ శుల్కం చ యదస్త్వలభ్యమ్ ॥31॥

దేవి పలుకులను విని దుందుభి ఇలా పలికాడు. పద్మనేత్రీ! "ఆ శుల్కమేదో తెలియజేయుము. నీ కొరకు మా ప్రభువు తన శిరస్సునైనా సమర్పించడానికి సిద్ధంగా ఉన్నాడు. ఆయనకు అలభ్యమైన వివాహశుల్కమేదియు నుండదు" అని పలికాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్తా దనునాయకేన కాత్యాయనీ సస్వనమున్నదిత్వా ।
విహస్య చైతద్వచనం బభాషే హితాయ సర్వస్య చరాచరస్య ॥32॥

మయపుత్రుడైన దుందుభి పలుకులు విని కాత్యాయని ఫకాలున నవ్వి, ఉచ్చైఃస్వరముతో చరాచర జీవులందరకు కల్యాణప్రదమైన పలుకులను ఇలా పలికింది.

శ్రీదేవ్యువాచ – దేవి పలికింది.

కులేఽస్మదీయే శ్రుణు దైత్య శుల్కం కృతం హి యత్పూర్వతరైః ప్రసహ్య ।
యో జేష్యతేఽస్మత్కులజాం రణాగ్రే తస్యాః పతిః సోఽపి భవిష్యతీతి ॥33॥

ఓ రాక్షసా! శుల్కం గూర్చి చెబుతున్నాను వినుము. మా ముందుతరాలవారిలో వారు చేసిన ఆచారాన్ని చెబుతాను విను. మా కులకన్యను పెండ్లాడదలచినవాడు ముందుగా ఆ కన్యను యుద్ధంలో జయించాలి. అప్పుడే ఆ కన్యకు అతడు భర్త కాగలడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తచ్ఛ్రుత్వా వచనం దేవ్యా దుందుభిర్దానవేశ్వరః ।
గత్వా నివేదయామాస మహిషాయ యథాయథమ్ ॥34॥

నారదా! దేవి మాటలు వినిన దుందుభి మహిషుని వద్దకు వెళ్ళి ఉన్నదున్నట్లుగా విన్నవించాడు.

స చాభ్యగాన్మహాతేజాః సర్వదైత్యపురస్సరః ।
ఆవృత్య వింధ్యశిఖరం యోద్ధుకామః సరస్వతీమ్ ॥35॥

ఆ మహాతేజస్వియైన రాక్షసుడు సమస్తదైత్యులతోకూడి ఆ సరస్వతీదేవితో యుద్ధం చేయాలనే కాంక్షతో వింధ్యాచలాన్ని చుట్టుముట్టాడు.

తతః సేనాపతిర్దైత్యో విక్షురో నామ నారద ।
సేనాగ్రగామినం చక్రే నమరం నామ దానవమ్ ॥36॥

స చాపి తేనాధికృతశ్చతురంగం సమూర్జితమ్ ।
బలైకదేశమాదాయ దుర్గాం దుద్రావ వేగతః ॥37॥

నారదా! తదనంతరం సేనాపతియైన విక్షురుడు అనే దైత్యుడు నమరుడను దైత్యుని సేనాగ్రగామిగా చేశాడు. వాడు కూడా చతురంగబలాలతో మరొకవైపు నుండి దుర్గాదేవితో యుద్ధానికి తలబడ్డాడు.

తమాపతంతం వీక్ష్యాథ దేవా బ్రహ్మపురోగమాః ।
ఊచుర్వాక్యం మహాదేవీం వర్మబంధనమాశ్రయ ॥38॥

వాని యుద్ధతికి వెరగుపడి, బ్రహ్మపురస్సరులైన దేవతలు దేవితో "అమ్మా! కవచం ధరించు తల్లీ!" అని విన్నవించారు.

అథోవాచ సురాన్దుర్గా న బధ్నామి చ దేవతాః ।
కవచం కోఽత్ర సంతిష్ఠేన్మమాగ్రే దానవాధమః ॥39॥
యదా న దేవ్యా కవచం కృతం శస్త్రనివారణమ్ ।
తదా రక్షార్థమస్యాస్తు విష్ణుపంజరముక్తవాన్ ॥40॥

అంతట ఆ దుర్గ దేవతలతో "కవచం నాకెందులకు? ఈ రాక్షసాధములు నా ఎదుట నిలబడగలరా?" అంటూ కవచం ధరించకుండానే విష్ణుపంజరస్తోత్రాన్ని స్మరించింది.

సా తేన రక్షితా బ్రహ్మన్ దుర్గా దానవసత్తమమ్ ।
అవధ్యం దైవతైః సర్వైర్మహిషం ప్రత్యపేషయత్ ॥41॥

ఏవం పురా దేవవరేణ శంభునా తద్వైష్ణవం పంజరమాయతాక్ష్యాః ।
ప్రోక్తం తయా చాపి హి పాదఘాతైర్నిషూదితోఽసౌ మహిషాసురేంద్రః ॥42॥


ఓ నారదా! ఆ స్తోత్రప్రభావంతో ఆ తల్లి సర్వదేవతలచేతను, అవధ్యుడైన మహిషదైత్యుని పీడించింది. ఆ విధంగా పూర్వకాలంలో దుర్గాదేవికి విష్ణుపంజరకవచాన్ని పరమశివుడు ఉపదేశించాడు. దానిప్రభావంతో దేవి మహిషుని నేలబెట్టి కాళ్ళతో రాచి, సంహరించింది.

ఏవం ప్రభావో ద్విజ విష్ణుపంజరః సర్వాసు రక్షాస్వధికో హి గీతః ।
కస్తస్య కుర్యాద్భువి దర్పహానిం యస్య స్థితశ్చేతసి చక్రపాణిః ॥43॥

ఓ బ్రాహ్మణోత్తమా! కాత్యాయనీదేవి దాని ప్రభావంతో సకలరాక్షససంహారం గావించింది. లోకంలోని సమస్తరక్షాకవచాలలోను విష్ణుపంజరం సర్వోత్తమంగా కీర్తింపబడుతోంది. ఆ చక్రధారియైన విష్ణువును హృదయంలో ప్రతిష్ఠించుకున్నవానిని యుద్ధంలో ఎదుర్కొనగలవాడెవ్వడు?

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే దేవీమాహాత్మ్యపరికీర్తనం నామైకోనవింశోఽధ్యాయః ॥19॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని దేవీమాహాత్మ్యపరికీర్తనమనే పందొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



వింశతితమోఽధ్యాయః – ఇరవైయవ అధ్యాయం
దేవీమాహాత్మ్యే మహిషాసురవధః – దేవీమాహాత్మ్యంలో మహిషాసురవధ

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కథం కాత్యాయనీదేవీ సానుగం మహిషాసురమ్ ।
సవాహనం హతవతీ తథా విస్తరతో వద ॥1॥

అయం చ సంశయో బ్రహ్మన్ హృది మే పరివర్తతే ।
విద్యమానేషు శస్త్రేషు యత్పద్భ్యాం తమమర్దయత్ ॥2॥

బ్రహ్మన్! ఆ కాత్యాయనీదేవి ఆ మహిషాసురుని సకలసైన్యంతో సహా ఎలా సంహరించిందో వివరంగా చెప్పండి. అన్ని శస్త్రాస్త్రాలు కలిగి కూడా ఆ దేవి మహిషాసురుని కాళ్ళతో ఎలా మర్దించిందా" అనే సందేహం నా హృదయంలో కలిగింది.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శృణుష్వావహితో భూత్వా కథామేతాం పురాతనీమ్ ।
వృత్తాం దేవయుగస్యాదౌ పుణ్యాం పాపభయాపహామ్ ॥3॥

నారదా! పవిత్రము, పాపభయాపహారమునైన ఈ వృత్తాంతము అతిపురాతనమైనది. ఇది కృతయుగం నాటిది. దీనిని శ్రద్ధగా ఆలకింపుము.

స ఏవమసురః క్రుద్ధః సమాపతత వేగవాన్ ।
స గజాశ్వరథో బ్రహ్మన్ దృష్టో దేవ్యా యథేచ్ఛయా ॥4॥

ఆ విధంగా క్రోధోన్మత్తుడైన నమరుదు చతురంగబలంతో దేవి మీద లంఘించడంతో ఆమె వానివైపు తదేక దీక్షగా చూచింది.

తతో దేవగణైర్దైత్యాన్సమానమ్యాథ కార్ముకమ్ ।
వవర్ష శైలం బాణౌఘైర్ద్యౌరివాంబుద వృష్టిభిః ॥5॥

అంతట ఆ రాక్షసుడు ప్రచండమైన బాణాసనాన్ని ఎక్కు పెట్టి ఆకాశంనుండి ప్రచండమైన జలధారలు కురిసినట్టుగా బాణవర్షాన్ని వింధ్యపర్వతంపై కురిపించాడు.

తద్ధనుర్దానవే సైన్యే దుర్గయా నమితం బలాత్ ।
సువర్ణపృష్ఠం విబభౌ విద్యుదంబుధరేష్వివ ॥6॥

దాని ఔద్ధత్యంచూచి భగవతి మహావేగంతో తన ధనుస్సును బలంగా వంచింది. బంగారు వికారం గల ఆ ధనుస్సు దానవసైన్యంలో మేఘాల మధ్య ప్రళయవిద్యుత్తు వలె వెలిగింది.

బాణైః సురరిపూనన్యాంస్తాడయామాస సువ్రత ।
గదయా ముసలేనాన్యాన్ స్వస్థానేభ్యో న్యపాతయత్ ॥7॥

అంతట ఆ దేవి కొందరిని బాణాలతోను, కొందరిని ఖడ్గంతోను, కొందరిని గదతోను, కొందరిని ముసలంతోను వారి వారి స్థానాలనుండి పడగొట్టి సంహరించింది.

ఏకోఽప్యసౌ బహూన్ దైత్యాన్ కేసరీ కాలసన్నిభః ।
విధున్వన్కేసరసటా నిషూదయతి దానవాన్ ॥8॥

ఆ దేవి వాహనమైన కాలమృత్యువువంటి సింహం ఒంటరిగానే తన జటలను ఝుళిపించి ఎందరో రక్కసులను సంహరించింది.

కులిశాభిహతా దైత్యాః శక్త్యా నిర్భిన్నవక్షసః ।
లాంగూలైర్దారితగ్రీవా ద్విధా కృత్తాః పరశ్వథైః ॥9॥

కొందరు రాక్షసులు వజ్రఘాతాలకు మరణించారు. కొందరి గుండెలు శక్తి తగిలి బ్రద్దలయ్యాయి. కొందరి కంఠాలు నాగలి వేటులకు చీలిపోయాయి. మరికొందరి తలలు గొడ్డలి దెబ్బలకు తెగిపోయాయి.

దండనిర్భిన్నశిరసశ్చక్రవిచ్ఛిన్నబంధనాః ।
చేలుః పేతుశ్చ మత్తాశ్చ తత్యజుశ్చాపరే రణమ్ ॥10॥

దండం వ్రేటులకు ఎందరి తలలో నుగ్గైపోతే చక్రజ్వాలలకు ఎందరో సంధిబంధాలు, మాంసఖండాలు ఊడిపోయాయి. ఎందరో భయకంపితులై ప్రాణాలు విడిచారు. ఇతరులు ఆ భయానకసంఘటనకు బెదిరి పారిపోయారు.

తే వధ్యమానా రుద్రాస్యా దుర్గయా దైత్యదానవాః ।
కాలరాత్రిం మన్యమానా దుద్రువుర్భయపీడితాః ॥11॥

ఆ దేవి రౌద్రరూపం దైత్యులకు, దానవులకు ప్రత్యక్షకాళరాత్రిగా, మృత్యువుగా భాసించడంతో భయపీడితులయ్యారు.

సేనాన్యం భగ్నమాలోక్య దుర్గామగ్రే తథా స్థితామ్ ।
దృష్ట్వా జగామ నమరో మత్తద్విరదసంస్థితః ॥12॥

సమాగమ్య చ వేగేన దేవ్యాం శక్తిం ముమోచ హ ।
త్రిశూలమపి సింహాయ ప్రాహిణోద్దానవో రణే ॥13॥

తన సైన్యం ఈ విధంగా నాశనం కావడం ఆ దేవి చెక్కుచెదరకుండా ఉండడం చూసిన నమరుడు మదించిన ఏనుగునెక్కి వేగంగా దేవి మీదకు లంఘించి, ఆమెపైకి శక్తిని విడిచాడు. ఆ దానవుడు సింహం మీదకు త్రిశూలాన్ని ప్రయోగించాడు.

తావాయాంతౌ తతో దేవ్యా హుంకారేణాథ భస్మసాత్ ।
కృతౌ తతో గజేంద్రేణ గృహీతో మధ్యతో హరిః ॥14॥

దేవి చేసిన హుంకారంతోనే ఆ రెండు ఆయుధాలు భస్మమైపోయాయి. అంతలో ఆ రాక్షసుని ఏనుగు తన తొండంతో దేవి సింహం యొక్క నడుము పట్టుకున్నది.

అథోత్పత్య చ వేగేన తలేనాహత్య దానవమ్ ।
గతాసుః కుంజర స్కంధాత్ క్షిప్య దేవ్యై నివేదితః ॥15॥

ఏనుగు పట్టును మెరుపు వేగంతో విడిపించుకొనిన ఆ సింహం తన పంజాతో దానవుని గట్టిగా కొట్టగా వాడు ఏనుగు మీదనుండి క్రిందపడి ప్రాణాలు వదిలాడు. అతని మృతదేహాన్ని సింహం దేవికి సమర్పించింది.

గృహీత్వా దానవం యుద్ధే బ్రహ్మన్ కాత్యాయనీ రుషా ।
సవ్యేన పాణినాఽఽ భ్రామ్యా వాదయత్పటహం యథా ॥16॥

బ్రహ్మన్! కాత్యాయని మిక్కిలి కోపంతో ఆ దానవుని పట్టుకొని, ఎడమచేతితో గిరగిర త్రిప్పుతూ డోలు వాయించినట్లుగా తాడించింది.

తతోఽట్టహాసం ముముచే తాదృశే వాద్యతాం గతే ।
హాస్యాత్సముద్భవంస్తస్యా భూతా నానావిధాః క్రమాత్ ॥17॥

వెంటనే వాని శరీరం డోలుగా మారింది. అది చూసి కాత్యాయని వికటాట్టహాసం చేయడంతో ఆ నవ్వులోనుండి రకరకాలైన అద్భుతమైన భూతాలు వెలువడ్డాయి.

కేచిద్వ్యాఘ్రముఖా రౌద్రా వృకాకారా స్తథాఽపరే ।
హయాస్యా మహిషాస్యాశ్చ వరాహవదనాః పరే ॥18॥

వాటిలో కొన్ని వ్యాఘ్రముఖాలు గలవి కాగా, మరికొన్ని తోడేలు ముఖాలతో నున్నాయి. మరికొన్ని అశ్వముఖాలతోను, దున్నపోతుల, పందుల ముఖాలతోను ఉన్నాయి.

ఆఖు కుక్కుటవక్త్రాశ్చ గోఽజావికముఖాస్తథా ।
నానా వక్త్రాక్షిచరణా నానాయుధధరాస్తథా ॥19॥

గాయంత్యన్యే హసంత్యన్యే క్రీడంత్యన్యే తు సంహతాః ।
వాదయంత్యపరే తత్ర స్తువంత్యన్యే తథాంబికామ్ ॥20॥

మరికొన్ని ఎలుకలు, కోళ్ళు, ఆవులు, మేకలు, గొఱ్ఱెల ముఖాలు గలవిగా నున్నాయి. వాటి కన్నులు, కాళ్ళు రకరకాలుగా నున్నాయి. నానావిధాలైన ఆయుధాలు ధరించిన ఆ భూతగణాలు కొన్ని పాడుతుంటే, కొన్ని నవ్వుతున్నాయి. కొన్ని ఆడుతుంటే కొన్ని వాద్యాలు మ్రోగిస్తున్నాయి. మిగిలినవి అంబికను స్తోత్రం చేస్తున్నాయి.

సా తైర్భూతగణైర్దేవీ సార్ధం తద్దానవం బలమ్ ।
శాతయామాస చంక్రామ్య యథా తృణ్యాం మహాశనిః ॥21॥

ఆ దేవి ఆ భూతగణాలతో కలసి పిడుగుల వర్షం పంటచేలను ధ్వంసం చేసినట్లు ఆ రాక్షససైన్యాన్ని నాశనం చేసింది.

సేనాన్యే నిహతే తస్మింస్తథా సేనాగ్రగామిభిః ।
చిక్షురః సైన్యపాలస్తు యోధయామాస దేవతాః ॥22॥

సేనాపతి మరణించి, సేనాముఖం ప్రీగిపోవడంతో సైన్యపాలకుడైన చిక్షురుడు దేవతలతో యుద్ధానికి తలబడ్డాడు.

కార్ముకం దృఢమాకర్ణమాకృష్య రథినాం వరః ।
వవర్ష శరజాలాని యథా మేఘో వసుంధరామ్ ॥23॥

ఆ మహారథుడు భయంకరమైన ధనుస్సునెక్కుపెట్టి, వర్షధారలు భూమిని ముంచినట్లు దేవిసైన్యాన్ని బాణాలతో ముంచాడు.

తాన్ దుర్గా స్వశరైశ్ఛిత్త్వా శరసంఘాన్ సుపర్వభిః ।
సౌవర్ణపుంఖానపరాన్ శరాన్ జగ్రాహ షోడశ ॥24॥

అతని బాణాలను దుర్గ తన వాడియైన శరాలతో ఛేదించి, బంగారురెక్కలు గల పదహారు ఉత్తమమైన బాణాలను గ్రహించింది.

తతశ్చతుర్భిశ్చతురస్తురంగానపి భామినీ ।
హత్వా సారథిమేకేన ధ్వజమేకేన చిచ్ఛిదే ॥25॥

దేవి నాల్గుబాణాలతో చిక్షురుడి నాలుగుగుఱ్ఱాలను, ఒకబాణంతో సారథిని, ఒకబాణంతో ధ్వజాన్ని ఛేదించింది.

తతస్తు సశరం చాపం చిచ్ఛేదైకేషుణాంబికా ।
ఛిన్నే ధనుషి ఖడ్గం చ చర్మ చాదత్తవాన్బలీ ॥26॥

ఒక వాడిబాణంతో ఆ రాక్షసుని ధనుర్బాణాలను ఖండించడంతో ఆ వీరుడైన చిక్షురుడు ఖడ్గం, చర్మం ధరించి విజృంభించాడు.

తం ఖడ్గం చర్మణా సార్ధం దైత్యస్యాధున్వతో బలాత్ ।
శరైశ్చతుర్భిశ్చిచ్ఛేద తతః శూలం సమాదదే ॥27॥

అంతట భగవతి నాలుగుబాణాలతో వాటిని ఖండించగా వాడు వెంటనే శూలం ధరించాడు.

సముద్యమ్య మహాశూలం ప్రాద్రవత్స తథాంబికామ్ ।
క్రోష్టుకో ముదితోఽరణ్యే మృగరాజవధూం యథా ॥28॥

దానిని వేగంగా త్రిప్పుతూ, సంతోషంతో, ఆడసింహం మీదకు దుమికే నక్కవలె ఆ రాక్షసుడు కాత్యాయని మీదకు లంఘించాడు.

తస్యాభిపతతః పాదౌ కరౌ శీర్షం చ పంచభిః ।
శరైశ్చిచ్ఛేద సంక్రుద్ధాన్యపతత్స హతోఽసురః ॥29॥

అంతట ఆ దేవి క్రోధంతో ఐదుబాణాలు వేసి, ఆ రాక్షసుని కరచరణాలను, తలను ఖండించి వేసింది. దానితో ఆ చిక్షురుడు విగతజీవుడై నేలకు ఒరిగాడు.

తస్మిన్సేనాపతౌ క్షుణ్ణే తదోగ్రాస్యో మహాసురః ।
సమాద్రవత వేగేన కరాలాస్యాస్తు దానవాః ॥30॥

సేనాపతి ఓడిపోగా ఉగ్రాస్య, కరాళాస్యులనే మహారాక్షసులు ఇద్దరు కాత్యాయనితో యుద్ధానికి సిద్ధపడ్డారు.

బాష్కలశ్చోద్ధతశ్చైవ ఉగ్రాస్యోఽథోగ్ర కార్ముకః ।
దుర్ధరో దుర్ముఖశ్చైవ బిడాలనయనోఽపరః ॥31॥

ఏతేఽన్యే చ మహాత్మానో దానవా బలినాం వరాః ।
కాత్యాయనీమాద్రవంత నానాశస్త్రాస్త్రపాణయః ॥ 32॥

బాష్కలుడు, ఉద్ధతుడు, ఉగ్రాస్యుడు, ఉగ్రకార్ముకుడు, దుర్ధరుడు, దుర్ముఖుడు, బిడాలనయనుడు, మహాబలశాలులైన తదితర దానవవీరులు నానాశస్త్రాస్త్రాలు ధరించి, దేవికి ఎదురుగా పరుగెత్తారు.

తాన్ దృష్ట్వా లీలయా దుర్గా వీణాం జగ్రాహ పాణినా ।
వాదయామాస హసతీ తథా డమరుకం వరమ్ ॥33॥

వారిని చూసి ఆ దుర్గ అలవోకగా వీణను, డమరుకాన్ని, చేతగొని నవ్వుతూ వాయించనారంభించింది.

యథా యథా వాదయతే దేవీ వాద్యాని తాని చ ।
తథా తథా భూతగణా నృత్యంతి చ హసంతి చ ॥34॥

ఆమె ఏ ఏ విధాలుగా వాయిస్తూవుంటే భూతగణాలన్నీ ఆయా విధాలుగా నవ్వుతూ నృత్యం చేయసాగాయి.

తతోఽసురాః శస్త్రధరాః సమభ్యేత్య సరస్వతీమ్ ।
అభ్యఘ్నంస్తాంశ్చ సా దేవీ జగ్రాహ పరమేశ్వరీ ॥35॥
ప్రగృహ్య కేశేషు మహాసురాంస్తానుత్పత్య సింహాత్తు నగస్య సానుమ్ ।
ననర్త వీణాం పరివాదయంతీ పపౌ చ పానం జగతాం జనిత్రీ ॥36॥

ఆ రాక్షసులు శస్త్రాలతో సరస్వతిని ప్రహరించగా ఆ పరమేశ్వరి ఆ రాక్షసుల కేశాలు పట్టుకొని సింహంనుండి పర్వతసానువు మీదకు దూకి, వీణవాయిస్తూ, పానం చేస్తూ, నాట్యం చేయసాగింది.

తతస్తు దేవ్యా బలినో మహాసురా దోర్దండనిర్ధూతవిశీర్ణదర్పాః ।
విశస్త్రవస్త్రా వ్యసవశ్చ జాతాస్తతస్తు తాన్వీక్ష్య మహాసురేంద్రాన్ ॥37॥

దేవ్యా మహౌజా మహిషాసురస్తు వ్యద్రావయద్భూతగణాన్ ఖురాగ్రైః ।
తుండేన పుచ్ఛేన తథోరసాన్యాన్నిఃశ్వాసవాతేన చ భూతసంఘాన్ ॥38॥

ఆ దేవి బాహుబలం వల్ల ఆ మహాదానవుల గర్వం సర్వంపటాపంచలు కాగా, వారందరు వివస్త్రలు, విశస్త్రులునై, ప్రాణాలు కోల్పోయి, నేలపై పడ్డారు. ఆ విధంగా చచ్చిపడిన తన వారిని చూసి మహావీరుడైన మహిషుడు తన కాలిడెక్కలతో, ఉరస్సుతో, తోకతో, కాళ్ళతో, నిఃశ్వాసవాయువులతో, ఆ భూతగణాలనన్నిటిని పారద్రోలాడు.

విషాణకోట్యా చ పరాన్ప్రమథ్య దుద్రావ సింహం ప్రతిహంతుకామః ।
తతోఽంబికా క్రోధవశం జగామ చిక్షేప దైత్యం సహసైవ లీలయా ॥39॥

అతని కొమ్ములతో తక్కిన భూతగణాలను వ్యాకులపరచి, సింహాన్ని చంపడానికి దాని వెంటపడ్డాడు. అది చూసి అంబిక క్రోధంతో నిండిపోయింది. ఆ దైత్యుని లీలగా ఎదుర్కొన్నది.

తతః స కోపాదథ తీక్ష్ణశృంగః క్షిప్రం గిరీన్భూమిమశీర్ణయచ్చ ।
సంక్షోభయంస్తోయనిధీన్ ఘనాంశ్చ విధ్వంసయన్ ప్రాద్రవతాథ దుర్గామ్ ॥40॥

అంతట ఆ మహిషుడు కోపంతో, వాడియైన కొమ్ములతో క్రుమ్మి, పర్వతశిఖరాలను, భూతలాన్ని, సముద్రాలను, మేఘాలను, ఛిన్నాభిన్నం చేసి, దుర్గాదేవి మీదకు విరుచుకుపడ్డాడు.

సా చాథ పాశేన బబంధ దుష్టం స చాప్యభూద్భిన్నకటః కరీంద్రః ।
కరం ప్రచిచ్ఛేద చ హస్తినోఽగ్రం స చాపి భూయో మహిషోఽభిజాతః ॥41॥

అంతట ఆమె పాశంతో ఆ దుష్టుని కట్టివేయగా వాడు మదించినఏనుగు వలె మారాడు. ఆమె ఆ ఏనుగుతుండాన్ని నరికివేయగా వాడు మరలా దున్నపోతుగా మారాడు.

తతోఽస్య శూలం వ్యసృజద్భవానీ సశీర్ణమూలో న్యపతత్పృథివ్యామ్ ।
శక్తిం ప్రచిక్షేప హుతాశవక్త్రాం సా కుంఠితాగ్రా న్యపతన్మహర్షే ॥42॥

అంతట భవాని వానిపై శూలం విసరగా అది పొడియై క్రింద పడిపోయింది. అగ్నిదత్తమైన శక్తిని ప్రయోగించగా అదికూడా మొక్కవోయి నేలపై పడింది.

చక్రం హరేర్దానవ చక్రహంతుః క్షిప్రం చ వక్రత్వముపాగతం హి ।
గదాం సమావిధ్య ధనేశ్వరస్య క్షిప్తాఽఽశు భగ్నా న్యపతత్ పృథివ్యామ్ ॥43॥

ఓ మహర్షీ! అంతట దుర్గాదేవి విష్ణుదత్తమైన చక్రాన్ని వానిపై ప్రయోగించగా అది తన చక్రత్వాన్ని కోల్పోయి, వక్రత్వాన్ని పొందింది. అంతట ఆమె మండిపడి, కుబేరదత్తమైన గదను ప్రయోగించగా అది వేగంగా భగ్నమై, భూమిపై పడింది.

జలేశపాశోఽపి మహాసురేణ విషాణతుండాగ్రఖురప్రణున్నః ।
నిరస్యతత్ కోపితయా చ ముక్తో దండస్తు యామ్యో బహుఖండతాం గతః ॥44॥

వరుణుడిచ్చిన పాశాన్ని కూడా ఆ మహారాక్షసుడు తన కొమ్ములతో, ముట్టెతో, గిట్టలతో ముక్కలు చేశాడు. దానితో కోపోద్రిక్తురాలైన దుర్గాదేవి యముడిచ్చిన కాలదండాన్ని ప్రయోగించగా అది వేయి వ్రక్కలయ్యింది.

వజ్రం సురేంద్రస్య చ విగ్రహేఽస్య ముక్తం సుసూక్ష్మత్వముపాజగామ ।
సంత్యజ్య సింహం మహిషాసురస్య దుర్గాధిరూఢా సహసైవ పృష్ఠమ్ ॥45॥

ఇంద్రదత్తమైన వజ్రాయుధం మహిషుని తాకి నుగ్గుగా మారింది. దానితో దుర్గాదేవి రెచ్చిపోయి, సింహ వాహనం మీదనుండి, మహిషుని వీపుమీదకు లంఘించింది.

పృష్ఠస్థితాయాం మహిషాసురోఽపి పోప్లూయతే వీర్యమదాన్ మృడాన్యామ్ ।
సా చాపి పద్భ్యాం మృదుకోమలాభ్యాం మమర్ద తం క్లిన్నమివాజినం హి ॥46॥

మహిషుడు ఆమెను తన వీపు మీదినుండి క్రిందకు తోయాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు. ఆమె ఆ మహిషాసురుని తన మెత్తని పాదాలతో తడిసిన తోలును తొక్కిన విధంగా మర్దించింది.

సమృద్యమానో ధరణీధరాభో దేవ్యా బలీ హీనబలో బభూవ ।
తతోఽస్య శూలేన బిభేద కంఠం తస్మాత్పుమాన్ ఖడ్గధరో వినిర్గతః ॥47॥

ఆ విధంగా ఆమె మహిషుని మర్దించగా వాని బలమంతా నశించింది. అంతట మహిషుని శిరస్సును ఆమె శూలంతో తెగవేసింది. ఆ కళేబరంనుండి ఖడ్గధారియైన పురుషుడు బయటకు వచ్చాడు.

నిష్క్రాంతమాత్రం హృదయే యదా తమాహత్య సంగృహ్య కచేషు కోపాత్ ।
శిరః ప్రచిచ్ఛేద వరాసినాఽస్య హాహాకృతం దైత్యబలం తదాఽభూత్ ॥48॥

ఆ విధంగా బయటకు వచ్చిన అతనిని వెంటనే ఆ దేవి వాని గుండెలపై బలంగా తాడించి మహాక్రోధంతో వాని జుట్టు పట్టుకుని తన వాడియైన ఖడ్గంతో శిరస్సును ఖండించింది. దానితో రాక్షసుల బలాలలో హాహాకారాలు చెలరేగాయి.

స చండముండాః సమయాః సతారాః సహాసిలోమ్నా భయకాతరాక్షాః ।
సంతాడ్యమానాః ప్రమథైర్భవాన్యాః పాతాలమేవావివిశుర్భయార్తాః ॥49॥

అంతట దేవియొక్క ప్రమథ గణాలచే చావుదెబ్బలు తినిన చండ, ముండ, మయ, తార, అసిలోమాది రాక్షసులు భయకంపితులై పాతాళలోకానికి పారిపోయారు.

దేవ్యా జయం దేవగణా విలోక్య స్తువంతి దేవీం స్తుతిభిర్మహర్షే ।
నారాయణీం సర్వజగత్ప్రతిష్ఠాం కాత్యాయనీం ఘోరముఖీం సురూపామ్ ॥50॥

సంస్తూయమానా సురసిద్ధసంఘైః కాత్యాయనీ సా హరపాదమూలే ।
భూయో భవిష్యామమరార్థమేవముక్త్వా సురాంస్త్రాన్ప్రవివేశ దుర్గా ॥51॥

ఓ మహర్షీ! పరమేశ్వరి విజయాన్ని విలోకించిన దేవతలందరు ఘోరముఖి, సౌందర్యరాశి, సర్వజగద్రక్షకి, నారాయణియునైన ఆ కాత్యాయనిని పలువిధాల స్తుతించారు. ఆ విధంగా సురసిద్ధగణాలచే స్తుతింపబడుతున్న కాత్యాయనీదేవి దేవకార్యార్థం తాను మరలా జన్మించగలనని చెప్తూ ఆ దేవతలనందరిని వీడి హరుని పాదాలచెంతకు చేరింది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే దేవీమాహాత్మ్యే మహిషాసురవధో నామ వింశతితమోఽధ్యాయః ॥20॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని దేవీమాహాత్మ్యమందలి మహిషాసురవధ అనబడే ఇరవైయవ అధ్యాయం సమాప్తం.



ఏకవింశోఽధ్యాయః - ఇరవైఒకటవ అధ్యాయం

ఉమాసంభవః - ఉమాసంభవం

నారద ఉవాచ - నారదుడు పలికాడు.

పులస్త్య కథ్యతాం తావద్భూయో దేవ్యాః సముద్భవః ।
మహత్కౌతూహలం మేఽద్య విస్తరాద్బ్రహ్మవిత్తమ ॥1॥

బ్రహ్మవేత్తలైన ఓ పులస్త్యమునీ! దుర్గాదేవి మరల ఎప్పుడు ఉద్భవించిందో వినాలని నాకు మిక్కిలి కుతూహలంగా ఉన్నది. కావున నాకు ఇప్పుడు వివరంగా తెలియజేయండి.

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

శ్రూయతాం కథయిష్యామి భూయోఽస్యాః సంభవం మునే ।
శుంభాసుర వధార్థాయ లోకానాం హితకామ్యయా ॥2॥

ఓ నారదమునీ! శుంభాసురుని సంహరించి, లోకాలను రక్షించాలనే కుతూహలంతో మరలా ఆదేవి ఏ విధంగా జన్మించిందో వివరంగా చెబుతాను. శ్రద్ధగా వినుము.

యా సా హిమవతః పుత్రీ భవేనోఢా తపోధన ।
ఉమా నామ్నా చ తస్యాః సా కోశాజ్జాతా తు కౌశికీ ॥3॥

ఓ తపోధనా! ఆమె హిమవంతుని పుత్రిగా జన్మించింది. భవుని పెండ్లాడింది. ఆమె పేరు ఉమ. ఆమె కోశం నుండి కౌశికి జన్మించింది.

సంభూయ విన్ధ్యం గత్వా చ భూయో భూతగణైర్వృతా ।
శుంభం చైవ నిశుంభం చ వధిష్యతి వరాయుధైః ॥4॥

జన్మించిన వెంటనే ఆమె భూతగణాలతో వింధ్యపర్వతానికి చేరి, తన ఉత్తమమైన ఆయుధాలతో శుంభ నిశుంభులను సంహరించింది.

నారద ఉవాచ - నారదుడు పలికాడు.

బ్రహ్మంస్త్వయా మమాఖ్యాతా మృతా దక్షాత్మజా సతీ ।
సంజాతా హిమవత్పుత్రీత్యేవం మే వక్తుమర్హసి ॥5॥

ఓ బ్రహ్మర్షీ! మీరు ముందుగా దక్షుని కుమార్తెయైన సతీదేవి మరణించినదని తెలియజేసి యున్నారు. మరణించిన సతీదేవి ఏ విధంగా హిమవంతుని ఇంట జన్మించిందో తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

యథా హి పార్వతీ కోశాత్సముద్భూతా హి కౌశికీ ।
యథా హతవతీ శుంభం నిశుంభం చ మహాసురమ్ ॥6॥

ఆ పర్వతపుత్రిక కోశాన కౌశికి జన్మించిన విధం, ఆమె మహారాక్షసులైన శుంభనిశుంభులను సంహరించిన విధం వివరంగా తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

కస్య చేమౌ సుతౌ వీరౌ ఖ్యాతౌ శుంభనిశుంభకౌ ।
ఏతన్మే తత్త్వతః సర్వం యథావద్వక్తుమర్హసి ॥7॥

ఈ శుంభనిశుంభులనే రాక్షసవీరులు ఎవరి కుమారులు? వారి గాథనంతటిని నాకు తెలియజేయ వలసినదిగా ప్రార్థిస్తున్నాను.

భగవన్ త్వత్ప్రసాదేన దేవ్యాశ్చరితముత్తమమ్ ।
శ్రుతం విస్తరతో బ్రూహి పార్వత్యాః సంభవం మునే ॥8॥

భగవాన్! మీ దయవలన ఉత్తమమైన దేవీచరిత్రను విన్నాను. పార్వతిజన్మవృత్తాంతాన్ని వివరంగా తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

దిష్ట్యా సంకథయిష్యామి పార్వత్యాః సంభవం మునే ।
శృణుష్వావహితో భూత్వా స్కందోత్పత్తిం చ శాశ్వతీమ్ ॥9॥

ఓ నారదమునీ! నీకిప్పుడు పార్వతిజన్మవృత్తాంతాన్ని, స్కందుని జన్మవృత్తాంతాన్ని వివరిస్తాను. శ్రద్ధగా వినుము.

రుద్రః సత్యాం ప్రనష్టాయాం బ్రహ్మచారివ్రతే స్థితః ।
నిరాశ్రమత్వమాపన్నస్తపస్తప్తుం వ్యవస్థితః ॥10॥

సతీదేవి మరణానంతరం నిరాశ్రయుడైన రుద్రుడు బ్రహ్మచర్యదీక్ష వహించి తపశ్చర్యలో మునిగిపోయాడు.

స చాసీద్దేవసేనానీర్దైత్యదర్పవినాశనః ।
శివరూపత్వమాస్థాయ సైనాపత్యం సముత్సృజత్ ॥11॥

ఆ విధంగా దైత్యదర్పవినాశకుడు, దేవసేనాధ్యక్షుడునైన శంకరుడు తన దేవసేనాపతిత్వాన్ని విడిచాడు.

తతో వినా కృతా దేవాః సేనానాథేన శంభునా ।
దానవేంద్రేణ విక్రమ్య నిశుంభేన పరాజితా ॥12॥

దేవసేనాధ్యక్షుడైన శంకరుడు లేకపోవడంచే దేవతలందరు దానవేంద్రుడైన నిశుంభునితో పోరాడి పరాజితులయ్యారు.

తతో జగ్ముః సురేశానం ద్రష్టుం చక్రగదాధరమ్ ।
శ్వేతద్వీపే మహాహంసం ప్రపన్నాః శరణం హరిమ్ ॥13॥

అంతట వారందరు శ్వేతద్వీపవాసి, మహాహంసస్వరూపుడు, చక్రగదాపాణియునైన శ్రీహరిని శరణుజొచ్చారు.

తానాగతాన్ సురాన్ దృష్ట్వా తతః శక్రపురోగమాన్ ।
విహస్య మేఘగంభీరం ప్రోవాచ పురుషోత్తమః ॥14॥

దేవేంద్రుని నాయకత్వంలో తనను ఆశ్రయించిన దేవతలను చూసి, నవ్వి, పురుషోత్తముడైన హరి మేఘ గంభీరధ్వనితో ఇలా పలికాడు.

కిం జితాస్త్వసురేంద్రేణ నిశుంభేన దురాత్మనా ।
యేన సర్వే సమేత్యైవ మమ పార్శ్వముపాగతాః ॥15॥

దురాత్ముడైన నిశుంభుడు మిమ్ములను జయించినాడా ఏమి? మీరందరు కలిసికట్టుగా నా దగ్గరకు వచ్చినారు.

తద్యుష్మాకం హితార్థాయ యద్వదామి సురోత్తమాః ।
తత్కురుధ్వం జయో యద్ధి సమాశ్రిత్య భవేత్తతః ॥16॥

అట్లైనచో మీ మేలు గోరి నేను చెప్పిన విధంగా మీరు చేయండి. అప్పుడు మీకు జయం తప్పక లభిస్తుంది.

య ఏతే పితరో దేవాస్త్వగ్నిష్వాత్తేతి విశ్రుతాః ।
అమీషాం మానసీ కన్యా మేనా నామ్నాఽస్తి దేవతా ॥17॥

అగ్నిష్వాత్తులనే పితృదేవతలున్నారు కదా! వారి మానసపుత్రిక మేనాదేవి.

తామారాధ్య మహాతిథ్యాం శ్రద్ధయా పరయాఽమరాః ।
ప్రార్థయధ్వం సతీమేనాం ప్రాలేయాద్రి మహార్థతః ॥18॥

ఓ దేవతలారా! మహాతిథినాడు పరమశ్రద్ధాభక్తులతో ఆమెను ఆరాధించి, ఆ మహాసతి హిమవంతుని వివాహమాడునట్లు ప్రసన్నురాలుని గావించుకొనండి.

తస్యాం సా రూపసంయుక్తా భవిష్యతి తపస్వినీ ।
దక్షకోపాద్యయా ముక్తం మలవజ్జీవితం ప్రియమ్ ॥19॥

దక్షునిపై కోపించి తన అపవిత్రశరీరాన్ని విసర్జించిన మహాతపస్విని సతీదేవి మేనాదేవి గర్భమందు జన్మిస్తుంది.

సా శంకరాత్స తేజోఽంశం జనయిష్యతి యం సుతమ్ ।
స హనిష్యతి దైత్యేంద్రం శుంభం చ సపదానుగమ్ ॥20॥

ఆ సౌందర్యవతియైన పార్వతి శంకరుని తేజోంశం కలిగిన కుమారుని ప్రసవించగలదు. ఆ కుమారుడు దైత్యేంద్రుడైన శుంభుని, వాని అనుచరుని సంహరించగలడు.

తస్మాద్గచ్ఛత పుణ్యం తత్కురుక్షేత్రం మహాఫలమ్ ।
తత్ర పృథూదకే తీర్థే పూజ్యంతాం పితరోఽవ్యయాః ॥21॥

మహాతిథ్యాం మహాపుణ్యే యది శత్రుపరాభవమ్ ।
భవనాథాత్మనా సర్వే ఇచ్ఛథ క్రియతామితి ॥22॥

కాబట్టి మీరందరు మహాఫలదాయకమైన కురుక్షేత్రానికి వెళ్లి, అచ్చటి పృథూదకతీర్థంలో మహాతిథినాడు పితృదేవతలనారాధించండి. మీరు శత్రువులనందరిని ఓడించి సుఖింపనెంచినచో ఈ విధంగా చేయండి. మరొకదారి లేదు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యుక్తా వాసుదేవేన దేవాః శక్రపురోగమాః ।
కృతాంజలిపుటా భూత్వా పప్రచ్ఛుః పరమేశ్వరమ్ ॥23॥

వాసుదేవుడు ఇట్లు పలుకగా దేవేంద్రుని నేతృత్వంలోని దేవతలందరు చేతులు జోడించి పరమేశ్వరుని ఇలా ప్రశ్నించారు.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

కిం తత్కురుక్షేత్రమితి యత్ర పుణ్యం పృథూదకమ్ ।
ఉద్భవం తస్య తీర్థస్య భగవాన్ ప్రబ్రవీతు నః ॥24॥

హే భగవాన్! కురుక్షేత్రమనగానేమి? పుణ్యప్రదమైన పృథూదకతీర్థమెట్లు ఆవిర్భవించింది? వాటిని గూర్చి మాకు వివరించండి?

కేయం ప్రోక్తా మహాపుణ్యా తిథీనాముత్తమా తిథిః ।
యస్యాం హి పితరో దివ్యా అద్భిః పూజ్యాః ప్రయత్నతః ॥25॥

పితృదేవతలను జలములతో పూజింపదగిన ఆ మహాతిథి ఏనాడు సంభవిస్తుందో తెలియజేయండి?

తతః సురాణాం వచనాన్మురారిః కైటభార్దనః ।
కురుక్షేత్రోద్భవం పుణ్యం ప్రోక్తవాంస్తాం తిథీమపి ॥26॥

దేవతల ప్రశ్నలను వినిన మురారియు, కైటభమర్దనుడునునైన శ్రీమహావిష్ణువు పవిత్రమైన కురుక్షేత్రగాథను, మహాతిథినిగూర్చి ఇలా వివరింపసాగాడు.

శ్రీభగవానువాచ – విష్ణుభగవానుడు పలికాడు.

సోమవంశోద్భవో రాజా ఋక్షో నామ మహాబలః ।
కృతస్యాదౌ సమభవదృక్షాత్సంవరణోఽభవత్ ॥27॥

కృతయుగారంభంలో సోమవంశోద్భవుడైన ఋక్షుడను మహాపరాక్రమశాలియైన రాజు కలడు. అతని పుత్రుడు సంవరణుడు.

స చ పిత్రా నిజే రాజ్యే బాల ఏవాభిషేచితః ।
బాల్యేఽపి ధర్మనిరతో మద్భక్తశ్చ సదాఽభవత్ ॥28॥

అతనిని బాల్యంలోనే తండ్రియైన ఋక్షుడు రాజ్యాభిషిక్తుని గావించాడు. అతడు బాల్యంనుండి నా భక్తుడై, ధర్మనిరతుడై, రాజ్యపాలన సాగిస్తున్నాడు.

పురోహితస్తు తస్యాసీద్వసిష్ఠో వరుణాత్మజః ।
స తమధ్యాపయామాస సాంగాన్వేదానుదారధీః ॥29॥

వరుణపుత్రుడైన వసిష్ఠుడు అతని పురోహితుడు. ఆ రాజు అతని వద్ద సాంగోపాంగంగా వేదాధ్యయనం చేశాడు.

తతో జగామ చారణ్యే త్వనధ్యాయే నృపాత్మజః ।
సర్వకర్మసు నిక్షిప్య వసిష్ఠం తపసాం నిధిమ్ ॥30॥

ఒక అనధ్యయనం రోజున ఆ రాజు రాజకార్యాలనన్నిటిని తపోనిధియైన వసిష్ఠునకప్పగించి వేటకై అరణ్యానికి వెళ్ళాడు.

తతో మృగస్య వ్యాక్షేపాదేకాకీ వాజినా వనమ్ ।
వైభ్రాజం స జగామాథ మనోన్మాదేన తన్మనే ॥31॥

ఓ నారదా! వైభ్రాజమనే అరణ్యంలో వేటాడుతూ మనోన్మాదంతో గుఱ్ఱంతో సహా ఒంటరిగా సంచరింపసాగాడు.

తతస్తు కౌతుకావిష్టః సర్వర్తుకుసుమే వనే ।
అవితృప్తః సుగంధస్య సమంతాద్వ్యచరద్వనమ్ ॥32॥

ఆ వనమందలి వివిధపుష్పపరిమళాలతో తృప్తి పడక, ఆ వనమంతటా చాలాసేపు విహరించాడు.

స వనాన్తం దదర్శాథ ఫుల్లకోకనదావృతమ్ ।
కహ్లారపద్మకుముదైః కమలేందీవరైరపి ॥33॥

ఆ విధంగా సంచరిస్తూ వనాంతప్రదేశం చూశాడు. ఆ వనాంతప్రదేశం వికసించిన కోకనద, కహ్లార, పద్మ, కుముద, కమల, ఇందీవరాది పుష్పాలతో నిండియున్నది.

తత్ర క్రీడన్తి సతతమప్సరోఽమరకన్యకాః ।
తాసాం మధ్యే దదర్శాథ కన్యాం సంవరణోఽధికామ్ ॥34॥

అక్కడ దేవతాస్త్రీలు, అప్సరసలు నిరంతరం క్రీడిస్తూ కనిపించారు. ఆ సుందరీమణుల మధ్యలో నాయకమణి వంటి సుందరాంగిని సంవరణుడు చూశాడు.

దర్శనాదేవ స నృపః కామమార్గణపీడితః ।
తథా సా తం సమీక్ష్యైవ కామబాణాతురాఽభవత్ ॥35॥

ఆ సుందరాంగిని చూసిన క్షణమే ఆ రాజు కామపీడితుడయ్యాడు. ఆమె కూడ ఇతనిని చూసిన మాత్రం చేతనే మన్మథబాణాలచే పీడింపబడి, రాజుమీద మరులుగొన్నది.

ఉభౌ తౌ పీడితౌ మోహం జగ్మతుః కామమార్గణైః ।
రాజా చలాసనో భూమ్యాం నిపపాత తురంగమాత్ ॥36॥

ఈ విధంగా వారివురు కామమోహితులయ్యారు. ఆ క్షణంలో మోహాతిశయంతో రాజు మూర్ఛపొంది, గుఱ్ఱంమీదనుండి క్రింద పడిపోయాడు.

తమభ్యేత్య మహాత్మానో గంధర్వాః కామరూపిణః ।
సిషిచుర్వారిణా తేన లబ్ధసంజ్ఞోఽభవత్ క్షణాత్ ॥37॥

అది చూసి కామరూపిణులైన గంధర్వస్త్రీలు వెంటనే ఆ రాజుపై నీళ్ళు చిలకరించి, మూర్ఛనుండి తేరుకొనేటట్లు చేశారు.

సా చాప్సరోభిరుత్పాట్య నీతా పితృకులం నిజమ్ ।
తాభిరాశ్వాసితా చాపి మధురైర్వచనాంబుభిః ॥38॥

మోహంతో మూర్ఛిల్లిన ఆ బాలికను కూడా సేద దీర్చి, అప్సరసలు ఆమెను లేవదీసి, ఆమెను తండ్రి ఇంటికి చేర్చి, తీయని మాటలతో శాంతింపజేశారు.

స చాప్యారుహ్య తురగం ప్రతిష్ఠానం పురోత్తమమ్ ।
గతస్తు మేరుశిఖరం కామచారీ యథాఽమరః ॥39॥

స్పృహ వచ్చిన తరువాత ఆ రాజు గుఱ్ఱమెక్కి మేరుశిఖరం చేరి, తన రాజధానియైన ప్రతిష్ఠానపురానికి కామచారియైన దేవత వలె చేరుకున్నాడు.

యదా ప్రభృతి సా దృష్టా చక్షుషా తపతీ గిరౌ ।
తదా ప్రభృతి నాశ్నాతి దివా స్వపితి వా నిశి ॥40॥

గిరిప్రదేశంలో తపతిని కండ్లతో చూసినది మొదలు రాజు రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మానివేశాడు.

తతః సర్వవిదవ్యగ్రో విదిత్వా వరుణాత్మజః ।
తపతీ తాపితం వీరం పార్థివం తపసాం నిధిః ॥41॥

సముత్పత్య మహాయోగీ గగనం రవిమండలమ్ ।
వివేశ దేవం తిగ్మాంశుం దదర్శ స్యందనే స్థితమ్ ॥42॥

తం దృష్ట్వా భాస్కరం దేవం ననామ ద్విజసత్తమః ।
ప్రతిప్రణమితశ్చాసౌ భాస్కరేణాప్యసావృషిః ॥43॥

ఆ విషయమంతా గ్రహించిన తపోనిధి, వరుణపుత్రుడు, రాజు మనోగతం తెలిసినవాడై, వెంటనే గగన మండలానికి ఎగసి, రథం మీద ఆసీనుడైన సూర్యభగవానుని దర్శించి ప్రణామం చేశాడు. సూర్యుడు కూడా ఆ వసిష్ఠునకు ప్రతినమస్కారం చేశాడు.

జ్వలజ్జటాకలాపోఽసౌ దివాకరసమీపగః ।
శోభతే వారుణిః శ్రీమాన్ ద్వితీయ ఇవ భాస్కరః ॥44॥

ప్రకాశించుచున్న జటలతో సూర్యుని సమీపములోనున్న వసిష్ఠమహర్షి రెండవసూర్యుని వలె ప్రకాశించాడు.

తతః సంపూజితోఽర్ఘ్యాద్యైర్భాస్కరేణ తపోధనః ।
పృష్ఠశ్చాగమనే హేతుం ప్రత్యువాచ దివాకరమ్ ॥45॥

అర్ఘ్యపాద్యాదులతో సూర్యుడు ఆ మహర్షిని పూజించి, మహర్షి వచ్చిన కారణమడిగాడు.

సమాయాతోఽస్మి దేవేశ యాచితుం త్వాం మహాద్యుతే ।
సుతాం సంవరణస్యార్థే త్వం చ తాం దాతుమర్హసి ॥46॥

అంతట ఆ మహర్షి సూర్యునకు ఈ విధంగా జవాబిచ్చాడు. ఓ దేవేశా! ఓ మహాద్యుతే! రాకుమారుడైన సంవరణునికై నీ కుమార్తెను అర్థించడానికి వచ్చాను. నీ కుమార్తెను సంవరుణునకిచ్చి వివాహం చేయుట తగినదని చెప్పాడు.

తతో వసిష్ఠాయ దివాకరేణ నివేదితా సా తపతీ తనూజా ।
గృహాగతాయ ద్విజపుంగవాయ రాజ్ఞోఽర్థతః సంవరణస్య చైవ ॥47॥

తన ఇంటికేతెంచిన ఆ విప్రోత్తమునకు సూర్యుడు తన కుమార్తెయైన తపతిని సంవరణునకు భార్య గావించవలసినదిగా చెప్పి వసిష్ఠునకు అప్పగించాడు.

సావిత్రమాసాద్య వచో వసిష్ఠః స్వమాశ్రమం పుణ్యముపాజగామ ।
సా చాపి సంస్మృత్య నృపాత్మజం తం కృతాంజలిర్వారుణిమాహ దేవీ ॥48॥

ఆ తపతిని తీసుకుని వసిష్ఠుడు తన పుణ్యాశ్రమానికి చేరుకొనగా ఆ తపతి తాను చూసిన రాకుమారుడు గురుతురాగానే చేతులు జోడించి, వసిష్ఠునితో ఇలా పలికింది.

తపత్యువాచ – తపతి పలికింది.

బ్రహ్మన్ మయా ఖేదముపేత్య యో హి సహాప్సరోభిః పరిచారికాభిః ।
దృష్టోహ్యరణ్యేఽమరగర్భతుల్యో నృపాత్మజో లక్షణతోఽపి జానే ॥49॥

భగవన్! నేనొకపర్యాయం అప్సరసలతో, పరిచారికలతో కూడి ఒక కుమారుని చూసి ఖేదపడ్డాను. దేవతుల్యుడైన అతని లక్షణాలు చూడగా అతనొక రాజకుమారుడని తోచింది.

పాదౌ శుభౌ చక్రగదాసి చిహ్నౌ జంఘే తథోరూ కరిహస్తతుల్యౌ ।
కటిర్యథా కేసరిణస్తథైవ క్షామం చ మధ్యం త్రివలీనిబద్ధమ్ ॥50॥

గ్రీవాస్య శంఖాకృతిమాదధాతి భుజౌ చ పీనౌ కఠినౌ సుదీర్ఘౌ ।
హస్తౌ తథా పద్మదలోద్భవాంకౌ ఛత్రాకృతిస్తస్య శిరో విభాతి ॥51॥

నీలాశ్చ కేశాః కుటిలాశ్చ తస్య కర్ణౌ సమాంసౌ సుసమా చ నాసా ।
దీర్ఘాశ్చ తస్యాంగులయః సుపర్వాః పద్భ్యాం కరాభ్యాం దశనాశ్చ శుభ్రాః ॥52॥

చక్రగదాది చిహ్నాలతో అతని పాదాలు అందంగా వున్నాయి. ఏనుగు తొండములవంటి జంఘులు, ఊరువులు, సింహం నడుమువంటి సన్నని నడుము కలవాడు, త్రివళులు, శంఖంవంటి మెడ, పుష్టిగా, లావుగా బలిష్ఠంగా వున్న ఆజానుబాహువులు, పద్మచిహ్నాలతో కూడిన అరచేతులు, ఛత్రంవంటి శిరస్సు, నల్లని ఒంపులు తిరిగిన కేశాలు, ముంగురులు, సమానంగా వున్న కర్ణనాసికలు, పొడవైన వేళ్ళు, శుభ్రమైన కాళ్ళు చేతులు, తెల్లని దంతాలు, అన్ని సలక్షణంగా వున్నాయి.

సమున్నతః షడ్భిరుదారవీర్యస్త్రిభిర్గభీరస్త్రిషు చ ప్రలంబః ।
రక్తస్తథా పంచసు రాజపుత్రః కృష్ణశ్చతుర్భిస్త్రిభిరానతోఽపి ॥53॥

ద్వాభ్యాం చ శుక్లః సురభిశ్చతుర్భిః సంత్యేవ పద్మాని దశైవ చాస్య ।
వృతః స భర్తా భగవన్హి పూర్వం తం రాజపుత్రం పరమం విచింత్య ॥54॥

మహాపరాక్రమవంతుడైన ఈ రాజపుత్రునకు లలాటం, కంఠం, కపోలం, గ్రీవం, కటి జంఘాలు ఈ ఆరు అంగాలు ఉన్నతమైనవి. నాభి, మధ్య, నవ్వు, ఈ మూడు మిక్కిలి గంభీరమైనవి. అతని రెండుభుజాలు, అండకోశం, ఆ మూడు ప్రలంబమైనవి. రెండుకన్నులు, అధరం, రెండుఅరచేతులు, రెండుపాదాలు, గోళ్ళు ఈ ఐదు రక్తవర్ణం కలిగినవి. అతని కేశములు, కనురెప్పల వెంట్రుకలు, కనుబొమలు ఈ నాలుగునల్లనైనవి. అతడుమూడింట అవనతుడు. అతని దంతములు, నేత్రములు శ్వేతవర్ణం కలవి. కేశములు, ముఖము, రెండుచెక్కిళ్ళు ఈ నాల్గు భాగములు సుగంధపరిమళమైనవి. అతనినేత్రములు, ముఖమండలం మొదలగు పది శరీరభాగాలు పద్మసమాన మైనవి. ఓ బ్రహ్మర్షీ! అటువంటి సుందరుడైన రాకుమారుని చూసి నేను లోగడ అతనిని భర్తగా వరించియున్నాను.

దదస్వ మాం నాథ తపస్విముఖ్య గుణోపపన్నాయ సమీహితాయ ।
స్నేహాత్రపకామం ప్రవదంతి సంతో దాతుం తథాఽన్యస్య విభో క్షమస్త్వమ్ ॥55॥

ప్రభో! తపస్విముఖ్యా! సర్వగుణసంపన్నుడైన ఆ రాజకుమారునకు నన్నిచ్చి వివాహం చేయండి. ఒకరిని వరించిన వారిని వేరొకరికి ఇచ్చుట అనుచితమని పెద్దల వాక్యము. కావున ఓ విభో! నన్ను క్షమింపుము.

దేవదేవ ఉవాచ – దేవదేవుడు పలికాడు.

ఇత్యేవముక్తః సవితుశ్చ పుత్ర్యా ఋషిస్తదా ధ్యానపరో బభూవ ।
జానే తమేవ వర్షసుతం సకామం ముదా యుతో వాక్యమిదం జగాద ॥56॥

సూర్యపుత్రికయైన తపతి ఈ విధంగా పలుకగా ఆ మహర్షి ధ్యానంలో మునిగాడు. ఆమె కూడా రాకుమారుని పట్ల మోహితురాలని గ్రహించి, సంతోషించి ఇలా పలికాడు.

స ఏవ పుత్రీ క్షితిపాత్మజస్త్వయా దృష్టః పురా కామయసే యమద్య ।
స ఏష చాయాతి సమాశ్రమం వై ఋక్షాత్మజః సంవరణో హి నామ్నా ॥57॥

ఓ పుత్రీ! నీవు అరణ్యంలో చూసి మోహించినవాడు నిజంగా ఈ రాజపుత్రుడే. అతడే ఋక్షుని కుమారుడు. సంవరుణుడని పిలవబడుతున్నాడు. అతడు నా ఆశ్రమానికి వస్తూవుంటాడని పలికాడు.

అథాజగామైవ నృపస్య పుత్రస్తదాశ్రమం బ్రాహ్మణపుంగవస్య ।
దృష్ట్వా వసిష్ఠం ప్రణిపత్య మూర్ధ్నా స్థితాం త్వపశ్యత్తపతీం నరేంద్రః ॥58॥

అదే సమయంలో ఆ రాజకుమారుడు విప్రోత్తముని ఆశ్రమానికి వచ్చి, వసిష్ఠుని చూసి శిరస్సు వంచి, నమస్కరించి కూర్చున్నాడు. అచటనేయున్న తపతిని చూశాడు.

దృష్ట్వా చ తాం పద్మవిశాలనేత్రాం సందృష్టపూర్వేయమితి వ్యచింతయత్ ।
పప్రచ్ఛ కేయం లలనా ద్విజేంద్ర స వారుణిః ప్రాహ నరాధిపేంద్రమ్ ॥59॥

పద్మవిశాలాక్షియైన తపతిని ఆ రాజు చూసి తాను పూర్వం చూసిన సుందరాంగి ఈమెయే అని తలంచాడు. ఓ ద్విజేంద్రా! ఈ లలనామణి ఎవరు? అని రాజశ్రేష్ఠుడు వరుణాత్మజుడైన వసిష్ఠమహర్షిని ప్రశ్నించాడు.

ఇయం వివస్వద్దుహితా నరేంద్ర నామ్నా ప్రసిద్ధా తపతీ పృథివ్యామ్ ।
మయా తవార్థాయ దివాకరోఽర్థితః ప్రాదాన్మయా త్వాశ్రమమానినిన్యే ॥60॥

ఓ నరేంద్రా! ఈమె సూర్యపుత్రిక. ఈమె భూమండలంలో తపతి అనే పేరుతో ప్రసిద్ధిగాంచింది. నేను నీ కొరకు దివాకరుని అర్థించి ఈమెను నా ఆశ్రమానికి తీసుకొని వచ్చాను.

తస్మాత్సముత్తిష్ఠ నరేంద్ర దేవ్యాః పాణిం తపత్యా విధివద్గృహాణ ।
ఇత్యేవముక్తో నృపతిః ప్రహృష్టో జగ్రాహ పాణిం విధివత్తపత్యాః ॥61॥

ఓ రాజేంద్రా! కాబట్టి నీవు వెంటనే లెమ్ము. విధిపూర్వకంగా ఈ తపతి పాణిగ్రహణం చేయుము అని వసిష్ఠుడు సమాధానమిచ్చాడు. దానితో సంవరణుడు మహదానందాన్ని పొంది, విధ్యుక్త విధానంగా తపతిని పరిణయమాడాడు.

సా తం పతిం ప్రాప్య మనోఽభిరామం సూర్యాత్మజా శక్రసమప్రభావమ్ ।
రేమే చ తేనైవ గృహోత్తమేషు యథా మహేంద్రేణ పులోమజా దివి ॥62॥

దేవేంద్రసమానుడు, మనోభిరాముడునైన ఆ రాజును సూర్యపుత్రిక భర్తగా పొంది, దేవలోకంలో ఇంద్రునితో విహరించే పులోమజ వలె ఆమె ఉత్తమమైన భవనాలలో అతనితో రమించింది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే ఉమాసంభవో నామైకవింశోఽధ్యాయః ॥21॥

శ్రీవామన మహాపురాణమందలి పులస్త్యనారదసంవాదంలోని ఉమాసంభవమనే ఇరవైఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్వావింశోఽధ్యాయః - ఇరవైరెండవ అధ్యాయం
సరోమాహాత్మ్యే కురుజాంగలమాహాత్మ్యకథనమ్ - సరోమాహాత్మ్యంలో కురుక్షేత్రమాహాత్మ్యవర్ణన

దేవదేవ ఉవాచ - దేవదేవుడు పలికాడు.

తస్యాం తపత్యాం నరసత్తమేన జాతః సుతః పార్థివలక్షణస్తు ।
స జాతకర్మాదిభిరేవ సంస్కృతో హ్యవర్ధతాజ్యేన హుతో యథాగ్నిః ॥1॥

ఆ నరశ్రేష్ఠుడు తపతియందు మహారాజలక్షణాలు కలిగిన ఒక కుమారుని పొందాడు. జాతకర్మాది సంస్కారాలు గావింపబడిన ఆ బాలుడు ఆజ్యాహుతులతో ప్రజ్జ్వరిల్లు అగ్నిహోత్రుని వలె ప్రవర్ధమానుడయ్యాడు.

కృతం చ చూడాకరణం తు దేవా విప్రేణ మిత్రా వరుణాత్మజేన ।
నవాబ్దికస్య వ్రతబంధనం చ వేదే చ శాస్త్రే విధిపారగోఽభూత్ ॥2॥

వసిష్ఠుడా బాలునకు చూడాకరణాది సంస్కారాలు జరిపించాడు. తొమ్మిదేండ్లవయస్సులో బ్రహ్మచర్యాశ్రమాన్ని స్వీకరించి వేదశాస్త్రాదులలో ప్రావీణ్యం సంపాదించాడు.

తతశ్చతుఃషడ్భిరపీహ వర్షైః సర్వజ్ఞతామభ్యగమత్తతోఽసౌ ।
ఖ్యాతః పృథివ్యాం పురుషోత్తమోఽసౌ నామ్నా కురుః సంవరణస్య పుత్రః ॥3॥

పదేండ్లవయస్సునకే సర్వజ్ఞత్వం గడించిన పురుషశ్రేష్ఠుడు, సంవరణుని కుమారుడునైన అతడు "**కురు**" అనే పేర భూమండలంలో విఖ్యాతుడయ్యాడు.

తతో నరపతిర్దృష్ట్వా పుత్రం తం షోడశాబ్దికమ్ ।
దారక్రియార్థమకరోద్యత్నం శుభకులే తతః ॥4॥

రాజైన సంవరణుడు తన కుమారుడు పదహారు సంవత్సరాల వయస్సు కలవాడు కాగానే శుభవంశంలో జన్మించిన తగిన వధువు కొరకు ప్రయత్నాలు సాగించాడు.

సౌదామిన్ీం చ సుదామ్నస్తు సుతాం రూపాధికాం నృపః ।
కురోరర్థాయ వృతవాన్సప్రాదాత్కురవేఽపి తామ్ ॥5॥

సుదాముని కుమార్తెయైన "**సౌదామిని**" అనే రూపవతిని తన కుమారుడైన కురునకు అర్ధాంగిగా నిశ్చయించుకున్నాడు. సుదాముడు కూడా తన కుమార్తెను సంతోషంగా కురునకిచ్చి వివాహం జరిపించాడు.

స తాం నృపసుతాం లబ్ధ్వా స్వధర్మానవిరోధయన్ ।
రేమే తన్వ్యా సహ తయా పౌలోమ్యా మఘవానివ ॥6॥

కురుడు ఆ రాజపుత్రికను పొంది, ఆమెతో కలసి, ధర్మార్థాలకు విఘాతం లేని విధంగా పౌలోమితో ఇంద్రుని వలె సకలభోగాలు అనుభవించాడు.

తతో నరపతిః పుత్రం రాజ్యభారక్షమం బలీ ।
విదిత్వా యౌవరాజ్యాయ విధానేనాభ్యషేచయత్ ॥7॥

తన కుమారుడు రాజ్యభారదక్షుడగుట గమనించిన సంవరణుడు అతనిని విధివిధానంగా యౌవరాజ్య పదవికి అభిషేకించాడు.

తతో రాజ్యేఽభిషిక్తస్తు కురుః పిత్రా నిజే పదే ।
స పాలయామాస మహీం పుత్రవచ్చ ప్రజాః స్వయమ్ ॥8॥

అనంతరం రాజ్యాభిషేకాన్ని పొందిన ఆ కురురాజు తండ్రిఅడుగుజాడలలో నడుచుకుంటూ ప్రజలను కన్నతండ్రి వలె పాలింపసాగాడు.

స ఏవ క్షేత్రపాలోఽభూత్పశుపాలః స ఏవ హి ।
స ఏవ రాజపాలశ్చ అజాపాలో మహాబలః ॥9॥

ఆ మహాబలుడు తానే క్షేత్రపాలకుడుగా, పశుపాలకుడుగా, రాజపాలకుడుగా, సర్వపాలకుడుగా మహాసమర్థతతో ప్రజాపాలన సాగించాడు.

తతోఽస్య బుద్ధిరుత్పన్నా హ్యస్మింల్లోకే గరీయసీ ।
యావత్కీర్తిః సుసంస్థా హి తావద్వాసస్తయా సహ ॥10॥

అతడు కీర్తిని మించినది ఏదీ లేదని గ్రహించాడు. కీర్తి పృథ్విపై నిలచినంత కాలం స్వర్గంలో దేవతలతో నివసించవచ్చునని తెలుసుకున్నాడు.

అస్త్వేవం నృపతిశ్రేష్ఠో యాథాతథ్యమమన్యత ।
నిచచార మహీం సర్వాం కీర్త్యర్థం తు నరాధిపః ॥11॥

కీర్తికి గల శక్తిని గుర్తించిన ఆ రాజశ్రేష్ఠుడు దానిని సంపాదించడానికి భూమండలమంతటా పర్యటన గావించాడు.

తతో ద్వైతవనం నామ పుణ్యం లోకచరో వశీ ।
తదాఽసావతిసంతుష్టో వివేశాభ్యంతరం తతః ॥12॥

అంతట ఆ రాజు ద్వైతవనమనే పుణ్య ప్రదేశానికి చేరుకుని, సంతోషంతో ఆ వనంలో ప్రవేశించాడు.

తత్ర దేవీం దదర్శాథ పుణ్యాం పాపవిమోచనీమ్ ।
ప్లక్షజాం బ్రహ్మణః పుత్రీం హరిజిహ్వాం సరస్వతీమ్ ॥13॥

అచ్చట బ్రహ్మపుత్రికయు, పాపనాశినియు, పుణ్యరూపిణియు, హరిజిహ్వయు, ప్లక్షజయునైన సరస్వతిని చూశాడు.

సుదర్శనస్య జననీం హ్రదం కృత్వా సువిస్తృతమ్ ।
తస్యాస్తజ్జలమాసాద్య స్నాత్వా ప్రీతోఽభవన్నృపః ॥14॥

ఆమె సుదర్శనుని తల్లి. ఆ భగవతి కోటితీర్థాలతో పరివేష్టింపబడి, చక్కని సరోవరంగా విరాజిల్లుతోంది. ఆమెయొక్క పవిత్రజలాలలో ఆ రాజు స్నానం చేసి మిక్కిలి సంతసించాడు.

సమాజగామ చ పునర్బ్రహ్మణో వేదిముత్తరామ్ ।
స్యమంతపంచకం నామ ధర్మస్థానమనుత్తమమ్ ॥15॥

ఆసమంతాద్యోజనాని పంచ పంచ చ సర్వతః ।

అతడు ఆ సరోవరానికి ఉత్తర దిక్కులోనున్న బ్రహ్మవేదివద్దకు వెళ్ళాడు. అది ధర్మభూమి. పేరు "స్యమంత పంచకమ్". ఎటుచూచినా ఐదుయోజనాల విస్తీర్ణం కలిగియుంది.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

కిమన్యా వేదయో దేవ బ్రహ్మణః పురుషోత్తమ ॥16॥

యేనోత్తరతయా వేదీ గదితా సర్వపంచకే ।

ఓ పురుషోత్తమా! ఉత్తరానగలవేది "సర్వపంచకవేది" అని పిలవబడుతోందని చెబుతున్నారు గదా!. ఇంతకు బ్రహ్మవేదిలు ఎన్నియున్నాయి? అవి యేవి?

హరిరువాచ – శ్రీహరి పలికాడు.

వేదయో లోకనాథస్య పంచధర్మస్య సేతవః ॥17॥

యాసు చేష్టం సురేశేన లోకనాథేన శంభునా ।
ప్రయాగో మధ్యమా వేదిః పూర్వా వేదిర్గయా శిరః ॥18॥

విరజా దక్షిణావేది రనంతఫలదాయినీ ।
ప్రతీచీ పుష్కరావేదిస్త్రిభిః కుండైరలంకృతా ॥19॥

స్యమంతపంచకే చోక్తా వేదిరేవోత్తరా తథా ।
తదమన్యత రాజర్షిరిదం క్షేత్రం మహాఫలమ్ ॥20॥

కరిష్యామి కృషిష్యామి సర్వాన్కామాన్యథేప్సితమ్ ।
ఇతి సంచింత్య మనసా త్యక్త్వా స్యందనముత్తమమ్ ॥21॥

లోకనాథుని వేదికలు ఈ లోకంలో ఐదున్నాయి. అవి ధర్మసేతువులు. ఆ ప్రదేశాలలో లోకేశ్వరుడైన శివుడు యజ్ఞాలు చేశాడు. వానిలో మధ్యవేది "ప్రయాగ". తూర్పువేది "గయ". దక్షిణాన అనంతఫలమిచ్చేది "విరజా వేది". పశ్చిమాన మూడు కుండాలతో కూడినది "పుష్కరవేది". ఉత్తరాన ఉన్నదానిని అక్షయమైన "స్యమంత పంచకవేది" అంటారు. అంతట ఆ రాజర్షి ఈ క్షేత్రం మహాఫలదాయకం కాబట్టి ఇక్కడ కృషి చేసి, అన్ని కామ్యాలను పండించుకుంటానని నిశ్చయించుకుని తన రథంనుండి కిందకు దిగాడు.

చక్రే కీర్త్యర్థమతులం స్థానం తత్పార్థివర్షభః ।
కృత్వా సీరం ససౌవర్ణం గృహ్య రుద్రవృషం ప్రభుః ॥22॥

వోఢారం యామ్య మహిషం స్వయం కర్షితుముద్యతః ।
తం కర్షంతం నరవరం సమభ్యేత్య శతక్రతుః ॥23॥

ప్రోవాచ రాజన్కిమిదం భవాన్కర్తుమిహోద్యతః ।
రాజాఽబ్రవీత్సురవరం తపః సత్యం క్షమాం దయామ్ ॥24॥

కృషామి శౌచదానే చ యోగం చ బ్రహ్మచారితామ్ ।
తం చోవాచ హరిర్దేవః కస్మాద్బీజం నరేశ్వర ॥25॥

లబ్ధం త్వయేతి సహసా హ్యవహస్య గతస్తతః ।

ఆ క్షేత్రాన్ని తనకీర్తిసాధనకు నిలయం గావించుకున్నాడు. ఆ రాజశ్రేష్ఠుడు ఒక బంగారు నాగలికి రుద్రుని ఎద్దును, యముని పౌండ్రకమనే మహిషాన్ని కట్టి, స్వయంగా దున్నడం మొదలుపెట్టాడు. అలా సేద్యం చేస్తున్న రాజును సమీపించి 'ఈ వ్యవహారమంతా ఏమిటని" ఇంద్రుడు అడిగాడు. అందులకు రాజు తపస్సు, సత్యం, క్షమ, దయ, శౌచం, దానం, యోగం, బ్రహ్మచర్యం వీటిని సేద్యం చేస్తున్నానని ఇంద్రునకు బదులు పలికాడు. అంతట ఇంద్రుడు అతనితో ఈ అష్టాంగధర్మబీజం నీకు ఎవరు ఇచ్చారని పలికి, చిరునవ్వునవ్వి, అచ్చటినుండి వెడలిపోయాడు.

గతేఽపి శక్రే నృపతిరహన్యహని సీరధృక్ ॥26॥

కృషతేఽన్యత్సమంతాచ్చ సప్తక్రోశాన్మహీపతిః ।
తతోఽహమబ్రువం గత్వా కురో కిమిదమిత్యథ ॥27॥

ఇంద్రుడు వెళ్ళిపోయిన తరువాత కూడా ఆ రాజు ప్రతిదినం సేద్యం సాగిస్తూ, ఆ చుట్టుపట్ల ఏడు క్రోశాల భూమిని దున్నాడు. అంతట నేను కురురాజు వద్దకు వెళ్ళి ఏమి చేయుచున్నావు? అని అడిగాను.

తదాష్టాంగం మహాధర్మం సమాఖ్యాతం నృపేణ హి ।
తతో మయాఽస్య గదితం నృపబీజం క్వ తిష్ఠతి ॥28॥

అప్పుడు ఆ మహారాజు అష్టాంగమహాధర్మాన్ని నాకు వివరంగా చెప్పాడు. దానికి బీజమెక్కడున్నదని నేనతనిని అడిగాను.

స చాహ మమ దేహస్థం బీజం తమహమబ్రువమ్ ।
దేహ్యహం వాపయిష్యామి సీరం కృషతు వై భవాన్ ॥29॥

దానికతడు తన దేహంలో వున్నదని సమాధానమిచ్చాడు. అంతట నేను దానిని భూమిలో నాటెదనని పలికాను.

తతో నృపతినా బాహుర్దక్షిణః ప్రసృతః కృతః ।
ప్రసృతం తం భుజం దృష్ట్వా మహాచక్రేణ వేగతః ॥30॥

సహస్రధా ప్రతిచ్ఛేద యస్మాదేకభుజోఽభవత్ ।
తతః సవ్యో భుజో రాజ్ఞా దత్తశ్ఛిన్నోఽప్యసౌ మయా ॥31॥

అంతట ఆ రాజు తన కుడిచేతిని చాపగా నేను వెంటనే చక్రంతో దానిని వేయి ముక్కలుగా ఖండించాను. దానితో అతడు ఏకభుజుడయ్యాడు. అంతట ఆ రాజు తన ఎడమచేతిని కూడా యివ్వగా అదే విధంగా దానిని కూడా ముక్కలు గావించాను.

తథైవోరుయుగం ప్రాదాన్మయా ఛిన్నౌ చ తావుభౌ ।
తతః సమే శిరః ప్రాదాత్తేన ప్రీతోఽస్మి తస్య చ ॥32॥

వరదోఽస్మీత్యథేత్యుక్తే కురుర్వరమయాచత ।

అనంతరం ఆ రాజు తన రెండు ఊరువులను చూపగా వానిని కూడా ఖండించాను. చివరిగా అతడు తన శిరస్సును కూడా సమర్పించగా నేను మిక్కిలి ప్రీతిచెంది "నీకు వరమిచ్చెదను, కోరుకొనమని" కురురాజుతో పలుకగా అతడిట్లు పలికాడు.

కురురువాచ – కురురాజు పలికాడు.

యావదేతన్మయా కృష్టం ధర్మక్షేత్రం తదస్తు వః ॥33॥

స్నాతానాం చ మృతానాం చ మహాపుణ్యఫలం త్విహ ।
ఉపవాసశ్చ దానం చ స్నానం జప్యం చ మాధవ ॥34॥

హోమయజ్ఞాదికం చాన్యచ్ఛుభం వాప్యశుభం విభో ।
త్వత్ప్రసాదాద్ధృషీకేశ శంఖచక్రగదాధర ॥35॥

అక్షయం ప్రవరే క్షేత్రే భవత్వత్ర మహాఫలమ్ ।

నేను సేద్యం చేసిన ఈ నేల అంతయు ధర్మక్షేత్రం కావాలి. ఇక్కడ స్నానం చేసిన, చనిపోయిన అందరు మహాపుణ్యఫలం పొందాలి. ఓ మాధవా! ఇక్కడ చేసిన ఉపవాసం గాని, దానం గాని, స్నానం గాని, జపం గాని, హోమం గాని, యజ్ఞాదులు గాని, శుభాశుభకర్మలన్నియు ఓ హృషీకేశా! శంఖచక్రగదాధరా! నీ అనుగ్రహం వలన అక్షయఫలదాయకాలు కావాలి.

తథా భవాన్సురైః సార్ధం సమం దేవేన శూలినా ॥36॥

వసాత్ర పుండరీకాక్ష మన్నామవ్యంజకేఽచ్యుత ।
ఇత్యేవముక్తస్తేనాహం రాజ్ఞా బాఢమువాచ తమ్ ॥37॥

తథా చ త్వం దివ్యవపుర్భవ భూయో మహీపతే ।
తథాంతకాలే మయ్యేవ లయమేష్యసి సువ్రత ॥38॥

శాశ్వతీ తవ కీర్తిశ్చ భవిష్యతి న సంశయః ।
తత్ర వై యాజకో యజ్ఞాన్యజిష్యసి సహస్రశః ॥39॥

"నా పేర వ్యవహరింపబడే ఈ ప్రదేశంలో సమస్తదేవతలు త్రిశూలధారియైన శంకరునితో గూడి, ఓ పుండరీకాక్షా! నీవు సదా నివసింపుము" అని కోరాడు. అంతట నేను ఆ రాజుతో "రాజా! అట్లే అగుగాక! నీవు మరలా దివ్యదేహమును ధరింపుము. ఓ సువ్రతా! అంత్యకాలంలో నీవు నాలో లయం కాగలవు. నీ కీర్తి శాశ్వతంగా నిలిచిపోతుంది. ఇందులో సందేహం లేదు. ఈ క్షేత్రంలో యాజ్ఞికులు వేలాది యజ్ఞాలు చేయగలరు" అని పలికాను.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తస్య క్షేత్రస్య రక్షార్థం దదౌ స పురుషోత్తమః ।
యక్షం చ చంద్రనామానం వాసుకిం చాపి పన్నగమ్ ॥40॥

విద్యాధరం శంకుకర్ణం సుకేశం రాక్షసేశ్వరమ్ ।
అజావనం చ నృపతిం మహాదేవం చ పావకమ్ ॥41॥

ఆ క్షేత్రాన్ని రక్షించడానికి శ్రీమన్నారాయణుడు చంద్రుడనేపేరు గల యక్షుని, వాసుకి అనే పేరు గల పన్నగాన్ని, శంకుకర్ణుని, విద్యాధరుని, సుకేశి అనే రాక్షసేశ్వరుని, అజావనుడు అనే నరపతిని, పావకుని, మహాదేవుని నియమించాడు.

ఏతాని సర్వతోఽభ్యేత్య రక్షంతి కురుజాంగలమ్ ।
అమీషాం బలినోఽన్యే చ భృత్యాశ్చైవానుయాయినః ॥42॥

అప్పటినుండి వారు, వారి శక్తిశాలురైన భృత్యులు, అనుచరులు కలిసి ఈ కురుజాంగల భూమిని (కురుక్షేత్రమును) రక్షిస్తున్నారు.

అష్టౌ సహస్రాణి ధనుర్ధరాణాం నివారయంతీహ సుదుష్కృతాన్వై ।
స్నాతుం న యచ్ఛన్తి మహోగ్రరూపాస్త్వన్యస్య తే వీర చరాచరాణామ్ ॥43॥

పాపులు, దుర్మార్గులు, ఈ క్షేత్రాన్ని సమీపించకుండా ఎనిమిదివేలమంది ధనుర్ధారులు కాపాడుతున్నారు. వీరు అట్టివారిని ఇచ్చట స్నానంచేయకుండా నిరోధిస్తున్నారు.

తస్యైవ మధ్యే బహుపుణ్యయుక్తం పృథూదకం పాపహరం శివం చ ।
పుణ్యా నదీ ప్రాఙ్ముఖతాం ప్రయాతా జలౌఘయుక్తస్య సుతా జలాఢ్యా ॥44॥

ఆ కురుజాంగలక్షేత్రం మధ్యలో పైన చెప్పిన పాపహారి, పవిత్రము, మంగళకరమునైన పృథూదక తీర్థమున్నది. అక్కడ స్వచ్ఛమైన జలాలతో నిండిన ఒక పవిత్రనది తూర్పుముఖంగా ప్రవహిస్తూ ఉంటుంది.

పూర్వం నదీయం ప్రపితామహేన సృష్టా సమం భూతగణైః సమస్తైః ।
మహీజలం వహ్ని సమీరమేవ ఖం త్వేవమాదౌ విబభౌ పృథూదకః ॥45॥

ప్రాచీనకాలంలో బ్రహ్మ పంచభూతములతో కూడిన ఈ సృష్టినంతటిని గావించాడు. అనాదికాలం నుండి భూమి, నీరు, తేజస్సు, వాయువు, ఆకాశాలతో బాటు ఈ పృథూదకక్షేత్రం కూడా విరాజిల్లుతోంది.

సర్వే తథా తోయధయో మహాంతస్తీర్థాని నద్యః స్రవణాః సరాంసి ।
సంనిర్మితానీహ మహాభుజేన స దేవమార్గః సలిలం హి తేషు ॥46॥

ఆ మహావిష్ణువు సంకల్పంవల్ల సమస్త మహార్ణవాలు, తీర్థాలు, నదులు, తటాకాలు, సరోవరాలు, మున్నగునవన్నియు తమతమ జలాలతో ఈ ప్రదేశాన సమీకరింపబడి ఐక్యభావాన్ని భజిస్తున్నాయి.

సరస్వతీదృషద్వత్యోరంతరే కురుజాంగలే ।
మునిప్రవరమాసీనం పురాణం లోమహర్షణమ్ ।
అపృచ్ఛంత ద్విజవరాః ప్రభవం సురసత్తమాః ॥47॥

కురుజాంగల క్షేత్రంలో సరస్వతీ, దృషద్వతీ నదుల మధ్య ఆసీనుడైన లోమహర్షణమునిని బ్రాహ్మణులు ఆ పవిత్రసరోవరప్రభావం తెలుపవలసినదిగా అర్థించారు.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

ప్రమాణం సరసో బ్రూహి తీర్థానాం చ విశేషతః ।
దేవతానాం చ మాహాత్మ్యముత్పత్తిం వామనస్య చ ॥48॥

ఏతచ్ఛ్రుత్వా వచస్తేషాం తాన్ ద్విజాన్ లోమహర్షణః ।
ప్రణిపత్య పురాణర్షిమిదం వచనమబ్రవీత్ ॥49॥

"ఓ మహర్షీ! ఆ సరోవరప్రమాణం, అందలి తీర్థాలు, వాటి ప్రమాణం, అందలి దేవతల వివరంతో బాటు వామనుని జన్మవృత్తాంతం కూడా తెలియజేయుము" ఆ బ్రాహ్మణుల మాటలు వినిన లోమహర్షణమహర్షి ప్రణమిల్లి, వారితో ఇలా పలికాడు.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణమహర్షి పలికాడు.

బ్రహ్మాణమీశం కమలాసనస్థం విష్ణుం చ లక్ష్మీసహితం తథైవ ।
రుద్రం చ దేవం ప్రణిపత్య మూర్ధ్నా తీర్థం వరం బ్రహ్మసరః ప్రవక్ష్యే ॥50॥

కమలాసనాసీనుడైన బ్రహ్మకు, లక్ష్మీసహితుడైన నారాయణునకు, రుద్రునకు నమస్కరించి బ్రహ్మసరోవర మాహాత్మ్యాన్ని చెబుతున్నాను.

రంతుకాదౌజసం చాపి పావనాచ్చ చతుర్ముఖమ్ ।
సరః సన్నిహితం ప్రోక్తం బ్రహ్మణః పూర్వమేవ తు ॥51॥

రంతుకంనుండి ఔజసం వరకు, పావనం నుండి చతుర్ముఖం వరకు వ్యాపించిన సరస్సును సన్నిహితసరోవరమని పూర్వం బ్రహ్మ చెప్పియున్నాడు.

కలిద్వాపరయోర్మధ్యే వ్యాసేన చ మహాత్మనా ।
సరః ప్రమాణం యత్ప్రోక్తం తచ్ఛృణ్వన్తు ద్విజోత్తమాః ॥52॥

ద్వాపర కలియుగాల మధ్యకాలంలో మహాత్ముడైన వ్యాసభగవానుదు సరోవరప్రమాణం చెప్పియున్నాడు. అది చెబుతాను ఓ ద్విజోత్తములారా! వినండి.

విశ్వేశ్వరాద్ధస్తిపురం తథా కన్యా జరద్గవీ ।
యావదోఘవతీ ప్రోక్తా తావత్సంనిహితం సరః ॥ 53॥

విశ్వేశ్వరంనుండి హస్తిపురం వరకు, జరద్గవికన్యనుండి ఓఘవతివరకు సన్నిహితసరస్సు వ్యాపించియున్నది.

మయా శ్రుతం ప్రమాణం తు కథ్యమానం తు వామనమ్ ।
తచ్ఛృణ్వంతు ద్విజశ్రేష్ఠాః పుణ్యం వృద్ధికరం మహత్ ॥54॥

ఓ ద్విజశ్రేష్ఠులారా! వామనునికి చెందినవి పూర్వము నేను విని ఇపుడు మీకు చెప్పబోవు వివరాలు, పరమపుణ్యప్రదాలు. అవి కూడా వినండి.

విశ్వేశ్వరాద్దేవవరాత్ నృపావనాత్ సరస్వతీ ।
సరః సన్నిహితం ప్రోక్తం సమంతాదర్ధయోజనమ్ ॥55॥

విశ్వేశ్వరం నుండి దేవవరం, నృపావనంనుండి సరస్వతి, వీనికి మధ్య విస్తరించిన అర్ధయోజన ప్రమాణం గల సరస్సే సన్నిహితము.

ఏతదాశ్రిత్య దేవాశ్చ ఋషయశ్చ సమాగతాః ।
సేవంతే ముక్తికామార్థం స్వర్గార్థం చాపరే స్థితాః ॥56॥

దానినాశ్రయించుకొని దేవతలు, ఋషులు, తదితరులు స్వర్గప్రాప్తికి, మోక్షప్రాప్తికి, ఆ పావనతీర్థాన్ని సేవిస్తారు.

బ్రహ్మణా సేవితమిదం సృష్టికామేన యోగినా ।
విష్ణునా స్థితికామేన హరిరూపేణ సేవితమ్ ॥57॥

సృష్టికార్యం సాగించడానికి యోగనిష్ఠుడై బ్రహ్మ దీనిని సేవించాడు. స్థితికార్యనిర్వహణకై విష్ణువు ఇచ్చట తపస్సుగావించి హరిరూపాన్ని పొందాడు.

రుద్రేణ చ సరోమధ్యం ప్రవిష్టేన మహాత్మనా ।
సేవ్య తీర్థం మహాతేజాః స్థాణుత్వం ప్రాప్తవాన్హరః ॥58॥

రుద్రుడు ఈ సరోవర మధ్యభాగంలో ప్రవేశించి మహాతేజోవంతమైన స్థాణుపదాన్ని సంపాదించాడు.

ఆద్యైషా బ్రహ్మణో వేదిస్తతో రామహ్రదః స్మృతః ।
కురుణా చ యతః కృష్టం కురుక్షేత్రం తతః స్మృతమ్ ॥59॥

మొదట దాని పేరు బ్రహ్మవేది. అనంతరకాలంలో అదియే రామహ్రదం అని పిలువబడింది. తదనంతరం కురుమహారాజు దున్నినందున ఇది కురుక్షేత్రమయ్యింది.

తరంతుకారంతుకర్యోర్యదంతరం యదంతరం రామహ్రదాచ్చతుర్ముఖమ్ ।
ఏతత్కురుక్షేత్రసమంతపంచకం పితామహస్యోత్తర వేదిరుచ్యతే ॥60॥

తరంతుక అరంతుక, రామహ్రద, చతుర్ముఖాల మధ్య భాగాన విస్తరించియున్న దీనినే కురుక్షేత్ర సమంతపంచకము అనియు, బ్రహ్మఉత్తరవేది అనియు అంటారు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే కురుజాంగలమాహాత్మ్యకథనం నామ ద్వావింశోఽధ్యాయః ॥22॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి కురుజాంగల మాహాత్మ్యకథనం అనే ఇరవైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రయోవింశోఽధ్యాయః – ఇరవై మూడవ అధ్యాయం

బలినా లక్ష్మ్యాది సకలైశ్వర్యప్రాప్తిః – బలిచక్రవర్తి లక్ష్మీదేవిమున్నగు సమస్తైశ్వర్యాలు పొందినవిధం

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

బ్రూహి వామనమాహాత్మ్యముత్పత్తిం చ విశేషతః ।
యథా బలిర్నియమితో దత్తం రాజ్యం శతక్రతోః ॥1॥

ఓ మహర్షీ! వామనమాహాత్మ్యం, ఆయన జన్మవిశేషం, బలిని నిగ్రహించి అతని రాజ్యాన్ని ఇంద్రునకు ఇచ్చిన గాథను వినిపింపుము.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణమహర్షి పలికాడు.

శృణ్వంతు మునయః ప్రీతా వామనస్య మహాత్మనః ।
ఉత్పత్తిం చ ప్రభావం చ నివాసం కురుజాఙ్గలే ॥2॥

ఓ మునులారా! మహాత్ముడగు వామనదేవుని ఉత్పత్తిని, గొప్పతనాన్ని, ఈ కురుజాంగలభూమిలో నివాసమున్న విధానం, మున్నగునవి చెబుతాను. ప్రీతితో వినండి.

తథైవ వంశం దైత్యానాం శృణ్వంతు ద్విజసత్తమాః ।
యస్మిన్ వంశే సమభవద్బలిర్వైరోచనిః పురా ॥3॥

ఓ ద్విజోత్తములారా! దైత్యవంశము గూర్చి, అట్లే పూర్వకాలంలో వైరోచనుడు ఏ వంశంలో జన్మించినదీ వివరిస్తాను.

దైత్యానామాదిపురుషో హిరణ్యకశిపుః పురా ।
తస్య పుత్రో మహాతేజాః ప్రహ్లాదో నామ దానవః ॥4॥

తస్మాద్విరోచనో జజ్ఞే బలిర్జజ్ఞే విరోచనాత్ ।

ప్రాచీనకాలంలో విరోచనపుత్రుడు బలిరాజు ఆవిర్భవించిన దైత్యవంశానికి హిరణ్యకశిపుడు మూలపురుషుడు. ఆయన కుమారుడు మహాతేజస్వియైన ప్రహ్లాదుడనే దానవుడు. అతనికి విరోచనుడు జన్మించాడు. బలి ఆ విరోచనుని పుత్రుడు.

హతే హిరణ్యకశిపౌ దేవానుత్సాద్య సర్వతః ॥5॥

రాజ్యం కృతం చ తేనేష్టం త్రైలోక్యే సచరాచరే ।
కృతయత్నేషు దేవేషు త్రైలోక్యే దైత్యతాం గతే ॥6॥

దేవతలనందరిని జయించి, హిరణ్యకశిపుడు మరణించిన తరువాత ఆ వంశంవారు మూడులోకాలను నిష్కంటకంగా పాలించసాగారు. వారిని నిర్జించడానికి దేవతలు చేసిన యత్నాలు ఫలించలేదు. మూడు లోకాలు దైత్యుల వశమయ్యాయి.

జయే తథా బలవతోర్మయశంబరయోస్తథా ।
శుద్ధాసు దిక్షు సర్వాసు ప్రవృత్తే ధర్మకర్మణి ॥7॥

బలవంతులైన మయుడు, శంబరుడు విజేతలయ్యారు. దిక్కులన్నీ స్వచ్ఛమయ్యాయి. ప్రజలంతా ధర్మకార్యాలలో నిమగ్నులయ్యారు.

సంప్రవృత్తే దైత్యపథే అయనస్థే దివాకరే ।
ప్రహ్లాదశంబరమయైరనుహ్రాదేన చైవ హి ॥8॥

దిక్షు సర్వాసు గుప్తాసు గగనే దైత్యపాలితే ।
వేదేషు మఖశోభాం చ స్వర్గస్థాం దర్శయత్సు చ ॥9॥

దైత్యవిధానం సర్వత్రా వ్యాపించింది. సూర్యుడు అయనపథాన్ని చేరుకున్నాడు. ప్రహ్లాద, మయ, శంబర అనుహ్లాదులు నలుదిక్కులను, గగనవీధిని చక్కగా రక్షింపసాగారు. వారి ఏలుబడిలో దేవతలు యజ్ఞశోభను నలువైపులా వెదజల్లసాగారు.

ప్రకృతిస్థే తతో లోకే వర్తమానే చ సత్పథే ।
అభావే సర్వపాపానాం ధర్మభావే సదోత్థితే ॥10॥

చతుష్పాదే స్థితే ధర్మే హ్యధర్మే పాదవిగ్రహే ।
ప్రజాపాలనయుక్తేషు భ్రాజమానేషు రాజసు ।
స్వధర్మయుక్తేషు తథా సర్వేష్వాశ్రమవాసిషు ॥11॥

ఈ విధంగా లోకాలన్నీ శాంతిసౌఖ్యాలతో సన్మార్గంలో ధర్మాచరణం చేస్తుండగా పాపాలన్నీ హరించుకుపోయి ధర్మం నాల్గుపాదాలతో విస్తరించి, ఎల్లప్పుడు ధర్మం ఉద్దీప్తం చేయబడింది. అధర్మం ఒంటికాలిమీద నిలిచిపోయింది. రాజులంతా ప్రజాపాలన ధర్మయుక్తంగా సాగిస్తున్నారు. ఆశ్రమవ్యవస్థను పరిరక్షిస్తూ ప్రజాపాలన చేస్తున్నారు. ప్రజలంతా తమ తమ విధులు చక్కగా నిర్వహిస్తున్నారు.

అభిషిక్తోఽసురైః సర్వైర్దైత్యరాజ్యే బలిస్తదా ।
హృష్టేష్వసురసంఘేషు నదత్సు ముదితేషు చ ॥12॥

ఇట్టి స్థితిలో దైత్యులందరు బలిని దైత్యరాజ్యమునందభిషిక్తుని గావించారు. దైత్యగణాలలో ఆనందోత్సాహాలు మిన్నుముట్టాయి.

అథాభ్యుపగతా లక్ష్మీర్బలిం పద్మాంతరప్రభా ।
పద్మోద్యతకరా దేవీ వరదా సుప్రవేశినీ ॥13॥

అంతట పద్మమధ్యమంలో ప్రకాశించునదియు, వరదాయినియునైన లక్ష్మీదేవి పైకెత్తిన చేతులలో పద్మములు ధరించి, మంగళప్రదమైన రాకతో బలిని సమీపించింది.

శ్రీరువాచ – లక్ష్మీదేవి పలికింది.

బలే బలవతాంశ్రేష్ఠ దైత్యరాజ మహాద్యుతే ।
ప్రీతాస్మి తవ భద్రం తే దేవరాజ పరాజయే ॥14॥

దైత్యేశ్వరుడు, మహాతేజస్వియునగు బలీ! నీవు బలవంతులలో శ్రేష్ఠుడవు. నీవు దేవేంద్రుని జయించి నందులకు నేను ప్రీతురాలనయ్యాను. నీకు మేలగుగాక!

యత్త్వయా యుధి విక్రమ్య దేవరాజః పరాజితః ।
దృష్ట్వా తే పరమం సత్త్వం తతోఽహం స్వయమాగతా ॥15॥

నీవు యుద్ధంలో విక్రమించి దేవరాజును ఓడించావు. అట్టి నీ ధైర్యసాహసాలు చూసి నేనే స్వయంగా వచ్చాను.

నాశ్చర్యం దానవవ్యాఘ్ర హిరణ్యకశిపోః కులే ।
ప్రసూతస్యాసురేంద్రస్య తవ కర్మేదమీదృశమ్ ॥16॥

ఓ దానవవ్యాఘ్రా! అసురేంద్రుడైన హిరణ్యకశిపుని వంశంలో జన్మించిన నీవు ఈ అద్భుతకార్యాలు చేయడానికి తగియున్నావు. ఇందులో ఆశ్చర్యమేమియులేదు.

విశేషితస్త్వయా రాజన్ దైత్యేంద్రః ప్రపితామహః ।
యేన యుక్తం హి నిఖిలం త్రైలోక్యమిదమవ్యయమ్ ॥17॥

ఓ రాజా! మీ ప్రపితామహుని కీర్తికి నీవీవిధంగా వన్నె తెచ్చావు. నీవు ముల్లోకాలను ఆక్రమించి, అనుభవించుట నీవంటివానికి యుక్తమే కదా!.

ఏవముక్త్వా తు సా దేవీ లక్ష్మీర్దైత్యనృపం బలిమ్ ।
ప్రవిష్టా వరదా సేవ్యా సర్వదేవమనోరమా ॥18॥

ఈ విధంగా బలిచక్రవర్తితో పలికిన వరదాయిని, సర్వదేవసేవితురాలు, సమస్తదేవసుందరియునైన లక్ష్మీదేవి దైత్యవల్లభుడైన బలిలో ప్రవేశించింది.

తుష్టాశ్చ దేవ్యః ప్రవరా హ్రీః కీర్తిర్ద్యుతిరేవ చ ।
ప్రభా ధృతిః క్షమా శక్తిరృద్ధిర్దివ్యా మహామతిః ॥19॥

శ్రుతిర్విద్యా స్మృతిః కీర్తిః శాంతిః పుష్టిస్తథా క్రియా ।
సర్వాశ్చాప్సరసో దివ్యా నృత్తగీతవిశారదాః ॥ 20॥

ప్రపద్యంతే తు దైత్యేంద్రం త్రైలోక్యం స చరాచరమ్ ।
ప్రాప్తమైశ్వర్యమతులం బలినా బ్రహ్మవాదినా ॥21॥

వెనువెంటనే హ్రీ(సిగ్గు), కీర్తి, ద్యుతి, ప్రభ, ధృతి, క్షమ, బుద్ధి, మహామతి, శ్రుతి, విద్య, స్మృతి, కీర్తి, శాంతి, పుష్టి, క్రియ మొదలైన శ్రేష్ఠమైన దేవీగణం సంతోషంతో ఆమెననుసరించారు. నృత్తగీతాలలో విశారద లైన అప్సరసలందరు దైత్యేంద్రుడైన బలిచక్రవర్తిని ఆశ్రయించారు. ఈ విధంగా బ్రహ్మావాదియైన దైత్యపతి ముల్లోకాల ఐశ్వర్యాన్నంతటిని పాదాక్రాంతం చేసుకున్నాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే బలినా లక్ష్మ్యాది సకలైశ్వర్యప్రాప్తిర్నామ త్రయోవింశోఽధ్యాయః ॥23॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి బలిచక్రవర్తి లక్ష్మీదేవి మున్నగు సమస్తైశ్వర్యాలు పొందిన విధమనే ఇరవైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్వింశోఽధ్యాయః – ఇరవైనాల్గవ అధ్యాయం

బ్రహ్మసభావర్ణనమ్ – బ్రహ్మసభావర్ణన

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

దేవానాం బ్రూహి మే కర్మ యద్వృత్తాస్తే పరాజితాః ।
కథం దేవాధిదేవోఽసౌ విష్ణుర్వామనతాం గతః ॥1॥

ఓ మహర్షీ! పరాజయం పొందిన దేవతలు తదనంతరం ఏమి చేశారు? దేవాధిదేవుడైన విష్ణువు ఎలా వామనరూపం ధరించాడు?.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణమహర్షి పలికాడు.

బలిసంస్థం చ త్రైలోక్యం దృష్ట్వా దేవః పురందరః ।
మేరుసంస్థం యయౌ శక్రః స్వమాతుర్నిలయం శుభమ్ ॥2॥

ముల్లోకాలు బలికి స్వాధీనం కావడంతో ఇంద్రుడు తన మాతృస్థానమైన మేరుగిరికి వెళ్ళాడు.

సమీపం ప్రాప్య మాతుశ్చ కథయామాస తాం గిరమ్ ।
ఆదిత్యాశ్చ రణే సర్వే దానవేన పరాజితాః ॥3॥

ఇంద్రుడు తన తల్లియైన అదితిని సమీపించి, సంగ్రామభూమిలో దానవుల చేత దేవతలందరు నిర్జింపబడిన వృత్తాంతమునంతటిని వివరించాడు.

అదితిరువాచ – అదితి పలికింది.

యద్యేవం పుత్ర యుష్మాభిర్న శక్యో హంతుమాహవే ।
బలిర్విరోచనసుతః సర్వైశ్చైవ మరుద్గణైః ॥4॥

సహస్రశిరసా శక్యం కేవలం హంతుమేవ హి ।
తేనైకేన సహస్రాక్ష హంతుం నాన్యేన శక్యతే ॥5॥

పుత్రా! మరుద్గణాల సహాయంతో కూడా నీవు విరోచనసుతుడైన బలిని జయించలేనన్నావు. అట్టి పరిస్థితులలో సహస్రశీర్షుడైన శ్రీమహావిష్ణువు మాత్రమే బలిని యుద్ధంలో సంహరించగలడు. తక్కినవారెవరు బలిని జయింపలేరు.

తద్వత్పృచ్ఛాద్య పితరం కశ్యపం బ్రహ్మవాదినమ్ ।
పరాజయార్థం దైత్యస్య బలేస్తస్య మహాత్మనః ॥6॥

కాబట్టి మనం బ్రహ్మజ్ఞుడు, మీతండ్రియునైన కశ్యపుని వద్దకు వెళ్ళి బలిని పరాభవించు ఉపాయమును గూర్చి అడుగుదము.

తతో౽దిత్యా సహ సురాః సంప్రాప్తాః కశ్యపాంతికమ్ ।
తత్రాపశ్యంశ్చ మారీచం మునిం దీప్తతపోనిధిమ్ ॥7॥

అంతట దేవతలు అదితితో కూడి కశ్యపుని నివాసానికి వెళ్ళి, అచ్చట పరమతపోనిధి, మరీచిపుత్రుడునైన కశ్యపమహర్షిని దర్శించారు.

ఆద్యం దేవగురుం దివ్యం ప్రదీప్తం బ్రహ్మతేజసా ।
తేజసా భాస్కరాకారైః స్థితమగ్నిశిఖోపమమ్ ॥8॥

ఆద్యుడు, దేవతలకుగురువు, దివ్యబ్రహ్మతేజస్సుతో వెలుగొందుతున్నావాడు, తేజస్సులో భాస్కరునివలె ప్రకాశిస్తున్నవాడు, అగ్నిశిఖ వలె తేజరిల్లుతున్నవాడు అయిన ఆ మహనీయుని దర్శించారు.

న్యస్తదండం తపోయుక్తం బద్ధకృష్ణాజినాంబరమ్ ।
వల్కలాజినసంవీతం ప్రదీప్తమివ తేజసా ॥9॥

హుతాశవద్దీప్యమానమాజ్యగంధపురస్కృతమ్ ।
స్వాధ్యాయవంతం పితరం వపుష్మంతమివానలమ్ ॥10॥

ఆ తపస్వి దండం, కృష్ణాజినాంబరం, వల్కలాజినం ధరించి తేజస్సుతో ప్రదీప్తమై, నేతి వాసనలతో కూడినవాడై, హోమాగ్ని వలె వెలుగొందుతూ, స్వాధ్యాయనిరతుడైన తండ్రి, రూపుదాల్చిన అగ్నిహోత్రుని వలె ఉన్నాడు.

బ్రహ్మవాదినమత్యుగ్రం చరాచరగురుం ప్రభుమ్ ।
బ్రహ్మణా ప్రతిమం లక్ష్మ్యా కశ్యపం దీప్తతేజసమ్ ॥11॥

బ్రహ్మవాది, సత్యవాది, దేవతలకు దానవులకు తండ్రి, బ్రహ్మతో సమానమైన శోభకలిగి, పరిపూర్ణమైన తేజస్సుతో వెలుగొందు కశ్యపుని దర్శించారు.

యః స్రష్టా సర్వలోకానాం ప్రజానాం పతిరుత్తమః ।
ఆత్మభావవిశేషేణ తృతీయో౽యం ప్రజాపతిః ॥12॥

సర్వలోకస్రష్ట, ప్రజాపతులలో నుత్తముడు, ఆత్మభావవిశేషం చేత కశ్యపుడు ప్రజాపతులలో మూడవవాడు.

అథ ప్రణమ్య తే దేవాః సహాదిత్యా సురర్షభాః ।
ఊచుః ప్రాంజలయః సర్వే బ్రహ్మాణమివమానసాః ॥13॥

అటువంటి కశ్యపబ్రహ్మను దర్శించి, అదితితో కూడిన దేవతలందరు, మహర్షులందరు, బ్రహ్మమానస పుత్రులు బ్రహ్మకు నమస్కరించిన విధంగా నమస్కరించి అంజలి ఘటించి ఇలా విన్నవించారు.

అజేయో యుధి శక్రేణ బలిర్దైత్యో బలాధికః ।
తస్మాద్విధత్త నః శ్రేయో దేవానాం పుష్టివర్ధనమ్ ।
శ్రుత్వా తు వచనం తేషాం పుత్రాణాం కశ్యపః ప్రభుః ॥14॥

"యుద్ధంలో బలిదైత్యుడు దేవేంద్రునకు అజేయుడైనాడు. అందువలన దేవతల శ్రేయస్సునకు, పుష్టికి, వృద్ధికి తగిన ప్రయత్నం చేయండి" తన పుత్రుల ఈ దీనవచనాలు విని కశ్యపుడు వారితో ఇలా పలికాడు.

కశ్యప ఉవాచ – కశ్యపుడు పలికాడు.

కురుధ్వం గమనే బుద్ధిం బ్రహ్మలోకాయ లోకకృత్ ।
కథయిష్యత్యుపాయం వో యథా జేష్యథ దైత్యపమ్ ॥15॥

సృష్టికర్తయైన బ్రహ్మలోకానికి వెళ్ళడానికి ఆలోచిద్దాం. బ్రహ్మ ఆ దైత్యనాథుని జయించే ఉపాయం చెప్ప గలడు.

శక్ర గచ్ఛామ సదనం బ్రహ్మణః పరమాద్భుతమ్ ।
యథా పరాజయం సర్వే బ్రహ్మణః ఖ్యాతుముద్యతాః ॥16॥

"ఓ దేవరాజా! మనమందరము ఇప్పుడు పరమాద్భుతమైన బ్రహ్మసదనానికి వెళ్ళి ఆయనకు ఈ పరాజయ గాథను తెలుపుదము".

సహాదిత్యాస్తతో దేవా యాతాః కాశ్యపమాశ్రమమ్ ।
ప్రస్థితా బ్రహ్మసదనం బ్రహ్మర్షిగణసేవితమ్ ॥17॥

అంతట అదితితో కూడి కశ్యపాశ్రమానికి వెళ్ళిన దేవతలందరు అచ్చటినుండి బ్రహ్మర్షి గణసేవితమైన బ్రహ్మలోకానికి బయలుదేరారు.

తే ముహూర్తేన సంప్రాప్తా బ్రహ్మలోకం సువర్చసః ।
దివ్యైః కామగమైర్యానైర్యథార్హైః సుమహాబలైః ॥18॥

వారు కామగమనం కల్గిన దివ్యమైన ప్రయాణసాధనాలెక్కి, క్షణంలో తేజోమయమైన బ్రహ్మలోకం చేరుకున్నారు.

బ్రహ్మాణం ప్రష్టుమిచ్ఛంతస్తపోరాశిం తమవ్యయమ్ ।
అధ్యగచ్ఛన్త విస్తీర్ణాం బ్రహ్మణః పరమాం సభామ్ ॥19॥

వారందరు అవ్యయుడు, తపోరాశియునైన బ్రహ్మను దర్శించే కుతూహలంతో సువిశాలమైనట్టియు, ఉత్తమమైనట్టియు బ్రహ్మసభను చూసి పరమానందాన్ని పొందారు.

షట్పదోద్గీతమధురాం సామగైః సముదీరితామ్ ।
శ్రేయస్కరీమమిత్రఘ్నీం దృష్ట్వా సంజహృషుస్తదా ॥20॥

భ్రమర ఝుంకారాలవలె మధురమైన సామగానం అంతటా ప్రతిధ్వనిస్తూ, శ్రేయస్సులను కలుగజేసి, శత్రునాశనం కలగజేయగల మనోహరమైన బ్రహ్మసభను చూచి వారందరు పరమానందం పొందారు.

ఋచో బహ్వృచముఖ్యైశ్చ ప్రోక్తాః క్రమపదాక్షరైః ।
శుశ్రువుస్త్వమరవ్యాఘ్రా వితతేషు చ కర్మసు ॥21॥

బహ్వృచప్రముఖులచే క్రమపాదాక్షరసమన్వితంగా ఆయా సంబద్ధక్రతువులకనుగుణంగా పఠింపబడే ఋగ్వేదమంత్రాలను ఆ విబుధవర్యులు ఆలకించారు.

యజ్ఞవిద్యావేదవిదః పదక్రమవిదస్తథా ।
స్వరేణ పరమర్షీణాం సా బభూవ ప్రణాదితా ॥22॥

యజ్ఞవిద్యాపారగులు, పదక్రమపాఠవిదులు, సస్వరమంత్రపాఠకుల సునాదాలతో ఆ సభ మారుమ్రోగు తోంది.

యజ్ఞసంస్తవవిద్భిశ్చ శిక్షావిద్భిస్తథా ద్విజైః ।
ఛందసాం చ తథా విజ్ఞైః సర్వవిద్యావిశారదైః ॥23॥

లోకాయతికముఖ్యైశ్చ శుశ్రువుః స్వరమీరితమ్ ।
తత్ర తత్ర చ విప్రేంద్రాన్నియతాన్సంశితవ్రతాన్ ॥24॥

యజ్ఞప్రశంసలతోబాటు శిక్షా శాస్త్రంలో పారీణులైన ద్విజులయొక్కయు, వేదార్థం తెలిసినవారు, సర్వవిద్యా కోవిదులు, లౌకిక విద్యలలోకూడా ప్రవీణులగువారలయొక్కయు ప్రవచనాలను తత్తత్ప్రదేశాలలో పుణ్యవ్రతులైన దేవతలందరు వినగలిగారు.

జపహోమపరాన్ముఖ్యాన్ దదృశుః కశ్యపాత్మజాః ।
తస్యాం సభాయామాస్తే స బ్రహ్మా లోకపితామహః ॥25॥

చరాచరగురుః శ్రీమాన్ విద్యయా వేదమాయయా ।
ఉపాసతే యం తత్రైవ ప్రజానాం పతయో విభుమ్ ॥26॥

జపహోమనిరతులైన కశ్యపకుమారులు ఆ సభామధ్యంలో శ్రీమంతుడు, సురాసురగురుడు, సర్వలోక పితామహుడునైన బ్రహ్మను చూశారు. అక్కడనే ప్రజాపతులందరు ఆయనను సేవిస్తున్నారు.

దక్షః ప్రచేతాః పులహో మరీచిశ్చ ద్విజోత్తమాః ।
భృగురత్రిర్వసిష్ఠశ్చ గౌతమో నారదస్తథా ॥27॥

విద్యాస్తథాన్తరిక్షం చ వాయుస్తేజో జలం మహీ ।
శబ్దః స్పర్శశ్చ రూపం చ రసో గంధస్తథైవ చ ॥28॥

ప్రకృతిశ్చ వికారాశ్చ యచ్చాన్యత్కారణం మహత్ ।
సాంగోపాంగాశ్చ చత్వారో వేదా లోకపతిస్తథా ॥29॥

తపాంసి క్రతవశ్చైవ సంకల్పః ప్రాణ ఏవ చ ।
ఏతే చాన్యే చ బహవః స్వయంభువముపాసతే ॥30॥

దక్షుడు, ప్రచేతసుడం, పులహ, మరీచులు, భృగువు, అత్రి, వసిష్ఠుడు, గౌతముడు, నారదుడు, మున్నగు బ్రహ్మణ్యులు, సమస్తవిద్యలు, అంతరిక్షం, వాయువు, తేజస్సు, జలం, భూమి, శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం, ప్రకృతి వికృతులు, మహత్తు, కారణం, సాంగోపాంగాలైన నాల్గు వేదాలు, ప్రజాపతులు, తపస్సులు, క్రతువులు, సంకల్పం, ప్రాణం, మున్నగునవన్నియు దేహం ధరించి బ్రహ్మను సేవిస్తున్నాయి. అంతేగాక ఇంకా ఎందరెందరో మహనీయులు ఆ మహనీయుని ఆరాధిస్తున్నారు.

ధర్మో హ్యర్థశ్చ కామశ్చ క్రోధో హర్షశ్చ నిత్యశః ।
శుక్రో బృహస్పతిశ్చైవ సంవర్తోஉథ బుధస్తథా ॥31॥

శనైశ్చరశ్చ రాహుశ్చ గ్రహాః సర్వే వ్యవస్థితాః ।
మరుతో విశ్వకర్మా చ వసవశ్చ ద్విజోత్తమాః ॥32॥

దివాకరశ్చ సోమశ్చ దినం రాత్రిస్తథైవ చ ।
అర్ధమాసాశ్చ మాసాశ్చ ఋతవః షట్ చ సంస్థితాః ॥33॥

తాం ప్రవిశ్య సభాం దివ్యాం బ్రహ్మణః సర్వకామదామ్ ।
కశ్యపస్త్రిదశేశశ్చ పుత్రో ధర్మభృతాం వరః ॥34॥

ధర్మార్థకామాలు, క్రోధహర్షాలు, శుక్రబృహస్పతులు, సంవర్తకుడు, బుధుడు, శనైశ్చరుడు, రాహువు మున్నగు సమస్తగ్రహాలు ఆయనను సేవిస్తున్నాయి. మరుత్తులు, విశ్వకర్మ, వసువులు, సూర్యచంద్రులు, అహోరాత్రులు, పక్షాలు, మాసాలు, షడృతువులు, సేవిస్తూ ఉండగా సర్వకామ్యాలు సమకూర్చే ఆ దివ్యసభలోనికి కశ్యపుడు తన సుతులైన దేవతలందరితో కలసి ప్రవేశించాడు.

సర్వతేజోమయీం దివ్యాం బ్రహ్మర్షిగణసేవితామ్ ।
బ్రాహ్మ్యా శ్రియా సేవ్యమానామచింత్యాం విగతక్లమామ్ ॥35॥

బ్రహ్మాణం ప్రేక్ష్య తే సర్వే పరమాసనమాస్థితమ్ ।
శిరోభిః ప్రణతా దేవం దేవా బ్రహ్మర్షిభిః సహ ॥36॥

బ్రహ్మర్షిసమూహంతో సేవింపబడుతు, బ్రాహ్మీశ్రీలు (లక్ష్మీ సరస్వతులు) సేవించుచుండగా మనస్సునకు ఆహ్లాదం కలిగించే పెద్దసభలో ఉత్తమోత్తమమైన ఆసనంపై కూర్చున్న బ్రహ్మదేవునకు బ్రహ్మర్షులతో సహా అందరూ తలలు వంచి ప్రణామాలు చేశారు.

తతః సంస్పృశ్య చరణౌ నియతాః పరమాత్మనః ।
విముక్తాః సర్వపాపేభ్యః సర్వే విగతకల్మషాః ॥37॥

ఆ విధంగా ఆ పరమాత్మ పాదాలు స్పృశించి, సమస్తపాపాలనుండి విముక్తులై, కల్మషరహితులైన దేవతలందరు స్వస్థచిత్తులై నిలబడ్డారు.

దృష్ట్వా తు తాన్ సురాన్సర్వాన్ కశ్యపేన సహాగతాన్ ।
ఆహ బ్రహ్మా మహాతేజా దేవానాం ప్రభురీశ్వరః ॥38॥

కశ్యపునితో వచ్చిన సమస్తదేవతాసమూహాన్ని చూచి దేవేశ్వరుడైన బ్రహ్మ వారితో ఇలా పలికాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే బ్రహ్మసభావర్ణనం నామ చతుర్వింశోఽధ్యాయః ॥24॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి బ్రహ్మసభావర్ణనమనే ఇరవైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచవింశోఽధ్యాయః – ఇరవైఐదవ అధ్యాయం

కశ్యపేన సహస్రవర్షవ్రతధారణమ్ – కశ్యపుని సహస్రవర్ష వ్రతధారణం

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

యదర్థమిహ సంప్రాప్తా భవంతః సర్వ ఏవ హి ।
చింతయామ్యహమవ్యగ్రమేతదర్థం మహాబలాః ॥1॥

ఓ మహాబలులారా! మీరందరు ఇచ్చటకు వచ్చిన కారణమును నేను ముందుగానే తెలుసుకొని, ఆ విషయమే ఆలోచిస్తున్నాను.

భవిష్యతి చ వః సర్వం కాంక్షితం యత్సురోత్తమాః ।
బలేర్దానవముఖ్యస్య యోఽస్య జేతా భవిష్యతి ॥2॥

ఓ సురోత్తములారా! మీకోరిక ఫలించగలదు. దానవముఖ్యుడైన బలిని జయించగలవాడు జన్మించగలడు.

న కేవలం సురారీణాం గతిర్మమ స విశ్వకృత్ ।
త్రైలోక్యస్యాపి నేతా చ దేవానామపి స ప్రభుః ॥3॥

సమస్తవిశ్వాన్ని సృష్టించగల ఆ మహనీయుడు మిమ్ములను, నన్ను మాత్రమే గాక ముల్లోకాలను ఉద్ధరించి మనకందరికి నాయకుడు కాగలడు.

యః ప్రభుః సర్వలోకానాం విశ్వం యశ్చ సనాతనమ్ ।
పూర్వజం యం మమ ప్రాహురాదిదేవం సనాతనమ్ ॥4॥

సకలవిశ్వనిర్మాత, ఈశ్వరుడు, సనాతనుడునగు ఆ ప్రభువు సృష్టికంటే ముందునుండియున్న శాశ్వతుడు.

తం దేవాశ్చ మహాత్మానం న విదుః కోఽస్యసావితి ।
దేవానస్మాంశ్చ విశ్వం చ స వేత్తి పురుషోత్తమః ॥5॥

నేనుగాని, మీరుగాని, వేదాలుగాని ఆ పురుషోత్తముడెవడో, ఎలా వుంటాడో అనే విషయం ఎరుగలేరు. కాని ఆ మహాత్ముడు మాత్రం మనలను, వేదాలను, విశ్వాన్ని చక్కగా ఎరిగియున్నాడు.

తస్యైవ తు ప్రసాదేన ప్రవక్ష్యే పరమాం గతిమ్ ।
యది యోగం సమాస్థాయ తపశ్చరతి దుశ్చరమ్ ॥6॥

క్షీరోదస్యోత్తరే కూలే ఉదీచ్యాం దిశి విశ్వకృత్ ।
అమృతం నామ పరమం స్థానమాహుర్మనీషిణః ॥7॥

ఆ ప్రభువు అనుగ్రహం చేతనే మీకు చక్కని ఉపాయం చెప్తున్నాను. క్షీరసాగరానికి ఉత్తరతీరంపైనున్న స్థానంలో ఆ విశ్వప్రభువు యోగసమాధి నిష్ఠితుడై, దుష్కరమైన తపస్సు చేస్తుంటాడు. అది ఆ విశ్వప్రభుని నివాసం. దానిని మానవులు "**అమృతమని**" పిలుస్తారు.

భవంతస్తత్ర వై గత్వా తపసా శంసితవ్రతాః ।
అమృతం స్థానమాసాద్య తపశ్చరత దుశ్చరమ్ ॥8॥

మీరందరు ఆ అమృతస్థానానికి వెళ్ళి, వ్రతదీక్ష పూని, దుష్కరమైన తపస్సు చేయండి.

తతః శ్రోష్యథ సంఘుష్టాం స్నిగ్ధగంభీరనిఃస్వనామ్ ।
ఉష్ణాంతే తోయదస్యేవ తోయపూర్ణస్య నిఃస్వనమ్ ॥9॥

రక్తాం పుష్టాక్షరాం రమ్యామభయాం సర్వదా శివామ్ ।
వాణీం పరమసంస్కారాం వదతాం బ్రహ్మవాదినామ్ ॥10॥

అప్పుడు మీకు వేసవి చివర తొలకరి మేఘధ్వనివంటి స్నిగ్ధగంభీరమైన ధ్వని ఒకటి రమ్యంగా, అభయ ప్రదంగా, మంగళకరంగా, నిండుగా, కర్ణపేయంగా వినిపిస్తుంది.

దివ్యాం సత్యాకరాం సత్యాం సర్వకల్మషనాశినీమ్ ।
సర్వదేవాధిదేవశ్చ తతోఽసౌ భావితాత్మనః ॥11॥

తద్వ్రతస్య సమాప్త్యాం తు యోగవ్రతవిసర్జనే ।
అమోఘం తస్య దేవస్య విశ్వతేజో మహాత్మనః ॥12॥

ఆ వాణి పరమసత్యమైనది, దివ్యమైనది, పరమసంస్కృతమైనది, సత్యనిర్మాణదక్షమైనది. అది మీకు వ్రతదీక్షా సమాప్తి సమయాన ఆ పురుషోత్తముని ముఖనిర్గతమై, అమోఘప్రభావం కలిగి, శ్రవణగోచరం కాగలదు.

కస్య కిం వో వరం దేవా దదామి వరదః స్థితః ।
స్వాగతం చ సురశ్రేష్ఠా మత్సమీపముపాగతాః ॥13॥

అంతట నారాయణుడు "ఎవరికి ఏ వరం కావాలి? కోరుకొనుడు. నేను యిచ్చుటకు సిద్ధంగా వున్నాను. నా వద్దకు వచ్చిన మీకందరకు స్వాగతము" అని పలుకగలడు.

తతోఽదితిః కశ్యపశ్చ గృహ్ణీయాతాం వరం తదా ।
ప్రణమ్య శిరసా పాదౌ తస్మై దేవాయ ధీమతే ॥14॥

భగవానేవ నః పుత్రో భవత్వితి ప్రసీద నః ।
ఉక్తశ్చ పరయా వాచా తథాఽస్త్వితి స వక్ష్యతి ॥15॥

వెంటనే అదితికశ్యపులు వరాన్ని గ్రహింతురు గాక! వారు నారాయణుని "ప్రభూ! మీరు మాకు కుమారునిగా జన్మించండి" అని పాదాభివందనపూర్వకంగా యాచింతురు గాక! ఆ సర్వేశ్వరుడు "తథాస్తు" అని కరుణిస్తాడు.

దేవా బ్రువంతి తే సర్వే కశ్యపోఽదితిరేవ చ ।
తథాఽస్త్వితి సురాః సర్వే ప్రణమ్య శిరసా ప్రభుమ్ ॥16॥

బ్రహ్మదేవుని మాటలు విని, అదితికశ్యపులతో సహా దేవగణమంతా ఆయనకు శిరసా ప్రణమిల్లి, అట్లే చేస్తామన్నారు.

శ్వేతద్వీపం సముద్దిశ్య గతాః సౌమ్యాం దిశం ప్రతి ।

తేఽచిరేణైవ సంప్రాప్తాః క్షీరోదం సరితాం పతిమ్ ॥17॥

అంతట వారందరు దక్షిణదిశగా శ్వేతద్వీపానికి ప్రయాణించి, అచిరకాలంలోనే నదీపతియైన క్షీరసముద్రాన్ని చేరుకున్నారు.

యథాఽఽదిష్టం భగవతా బ్రహ్మణా సత్యవాదినా ।
తే క్రాంత్వా సాగరాన్ సర్వాన్ పర్వతాంశ్చ సకాననాన్ ॥18॥

నదీశ్చ వివిధాః పుణ్యాః పృథివ్యాం తే సురోత్తమాః ।
అపశ్యంత తమో ఘోరం సర్వసత్త్వవివర్జితమ్ ॥19॥

సర్వసముద్రాలను, పర్వతారణ్యాలను, నదీనదాలను, భూములను, సత్యవాదియైన బ్రహ్మ ఆదేశించిన విధంగా దాటి, వారు మహాభయంకరమైన అంధకారంలో ప్రవేశించారు.

అభాస్కరమమర్యాదం తమసా సర్వతో వృతమ్ ।
అమృతం స్థానమాసాద్య కశ్యపేన మహాత్మనా ॥20॥

దీక్షితాః కామదం దివ్యం వ్రతం వర్షసహస్రకమ్ ।
ప్రసాదార్థం సురేశాయ తస్మై యోగాయ ధీమతే ॥21॥

అచ్చట సూర్యుడు లేడు. ఎటువంటి జీవరాశులు లేవు. దానికి అవధులు లేవు. ఎటు చూసినా చీకటి. ఆ అమృతస్థానానికి చేరి కశ్యపుడు దేవతలందరి కామ్యాలు తీర్చే సహస్రవర్షవ్రతదీక్ష పూనినాడు.

నారాయణాయ దేవాయ సహస్రాక్షాయ భూతయే ।
బ్రహ్మచర్యేణ మౌనేన స్థానవీరాసనేన చ ॥22॥

క్రమేణ చ సురాః సర్వే తపోయోగం సమాస్థితాః ।
కశ్యపస్తత్ర భగవాన్ ప్రసాదార్థం మహాత్మనః ।
ఉదీరయంశ్చ వేదోక్తం యమాహుః పరమం స్తవమ్ ॥23॥

దేవతలందరు శ్రీమన్నారాయణుని గూర్చి మౌనంగా బ్రహ్మచర్యయోగదీక్షతో వీరాసనాలు వైచికొని, ఉగ్రమైన తపస్సు ప్రారంభించారు. శ్రీపురుషోత్తముని ప్రసన్నుని గావించడానికి కశ్యపుడు వేదోక్త విధానంగా స్తోత్రం గావించాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే కశ్యపేన సహస్రవర్షవ్రతధారణం నామ పంచవింశోఽధ్యాయః ॥25॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి కశ్యపుని సహస్రవర్షవ్రతధారణమనే ఇరవైఐదవ అధ్యాయం సమాప్తం.



షడ్వింశోఽధ్యాయః - ఇరవైఆరవ అధ్యాయం

కశ్యపకృత శ్రీమన్నారాయణస్తోత్రం - కశ్యపుడు చేసిన శ్రీమన్నారాయణస్తోత్రం

కశ్యప ఉవాచ - కశ్యపుడు పలికాడు. (కశ్యపుడు శ్రీమన్నారాయణుని ఇలా స్తోత్రం చేశాడు)
ఓం నమో భగవతే వాసుదేవాయ ।

ఏకశృంగ వృషార్చే వృషసింధో వృషాకపే సురవృష అనాదిసంభవ రుద్ర కపిల విష్వక్సేన సర్వభూతపతే ధ్రువ ధర్మాధర్మ వైకుంఠ వృషావర్త అనాదిమధ్యనిధన ధనంజయ శుచిశ్రవ పృశ్నితేజః నిజజయ అమృతశయ సనాతన త్రిధామన్ తుషిత మహాతత్త్వ లోకనాథ పద్మనాభ విరించే బహురూప అక్షయ అక్షర హవ్యభుక్ ఖండపరశో శక్ర ముంజకేశ హంస మహాదక్షిణ హృషీకేశ సూక్ష్మ మహానియమధర విరజః లోకప్రతిష్ఠ అరూప అగ్రజ ధర్మజ ధర్మనాభ గభస్తినాభ శతక్రతునాభ చంద్రరథ సూర్యతేజః సముద్రవాసః అజ సహస్రశిరః సహస్రపాద అధోముఖ మహాపురుష పురుషోత్తమ సహస్రబాహో సహస్రమూర్తే సహస్రాస్య సహస్రసంభవ సహస్రసత్త్వం త్వామాహుః ।

పుష్పహాస చరమ త్వమేవ వౌషట్ । వషట్కారం త్వామాహురగ్ర్యం మఖేషు ప్రాశితారం సహస్రధారం చ। భూశ్చ భువశ్చ స్వశ్చ త్వమేవ వేదవేద్య బ్రహ్మశయ బ్రాహ్మణప్రియ । త్వమేవ ద్యౌరసి మాతరిశ్వాఽసి ధర్మోఽసి। హోతా పోతా మంతా నేతా హోమహేతుస్త్వమేవ । అగ్ర్య విశ్వ ధామ్నా త్వమేవ దిగ్భిః సుభాండ ఇజ్యోఽసి । సుమేధోఽసి । సమిధ స్త్వమేవ । పతిర్గతిర్దాతా త్వమసి । మోక్షోఽసి । యోగోఽసి । సృజసి ధాతా పరమ యజ్ఞోఽసి । సోమోఽసి । దీక్షితోఽసి । దక్షిణాఽసి । విశ్వమసి స్థవిర హిరణ్యగర్భ నారాయణ త్రినయన ఆదిత్యవర్ణ ఆదిత్యతేజః మహాపురుష పురుషోత్తమ ఆదిదేవ సువిక్రమ ప్రభాకర శంభో స్వయంభూః భూతాదిః మహాభూతోఽసి । విశ్వభృత విశ్వం త్వమేవ విశ్వగోప్తాఽసి పవిత్రమసి । విశ్వభవ ఊర్ధ్వకర్మన్ అమృత దివస్పతే వాచస్పతే ఘృతార్చే అనంతకర్మవంశ ప్రాగ్వంశ విశ్వపాస్త్వమేవ । వరార్థినాం వరదోఽసి త్వమ్ ।

చతుర్భిశ్చ చతుర్భిశ్చ ద్వాభ్యాం పంచభిరేవ చ ।
హూయతే చ పునర్ద్వాభ్యాం తుభ్యం హోత్రాత్మనే నమః ॥1॥

భగవంతుడైన వాసుదేవునకు నమస్కారము.। ఓ దేవా! ఏకశృంగా! వృషర్చీ! సింధుపతే! వృషాకపీ! సురశ్రేష్ఠా! అనాదిసంభవా! రుద్రా! కపిలా! విష్వక్సేనా! సర్వభూతపతీ! ధ్రువా! ధర్మాధర్మా! వైకుంఠా! వృషావర్తా! అనాదిమధ్యనిధనా! ధనంజయా! శుచిశ్రవా! పృశ్ని (సూర్య) తేజా! నిజజయా! అమృతేశయా! సనాతనా! త్రిధామా! తుషితా! మహాతత్త్వా! లోకనాథా! పద్మనాభా! విరించీ! బహురూపా! అక్షయా! అక్షరా! హవ్యభోజీ! ఖండపరశూ! శక్రా! ముంజికేశా! హంసా! మహాదక్షిణా! హృషీకేశా! సూక్ష్మా! మహానియమధరా! విరజా! లోకప్రతిష్ఠా! అరూపా! అగ్రజా! ధర్మజా! ధర్మనాభా! గభస్తినాభా! శతక్రతునాభా! చంద్రరథా! సూర్యతేజా! సముద్రవాసా! అజా! సహస్రశీర్షా! సహస్రపాదా! అధోముఖా! మహాపురుషా! పురోషోత్తమా! సహస్రబాహూ! సహస్రమూర్తీ! సహస్రముఖా! సహస్రసంభవా! సహస్రసత్త్వా! ఈవిధంగా నిన్ను వర్ణిస్తారు.

ఓ పుష్పహాసా! చరమా! వౌషట్ వషట్కారాలు నీవే! నిన్ను మొదటివాడవనీ, యజ్ఞభోక్తవనీ, సహస్రధారివనీ, భూర్భువఃస్వః రూపుడవనీ, వేదవేద్యుడవనీ, మహాశయుడవనీ, బ్రాహ్మణప్రియుడవనీ అంటారు. అంతరిక్షం ధర్మం

వాయువు నీవే! హోతవూ, పురోహితుడవూ నీవే! మంత్రానివీ నీవే! నేతవూ, హోమహేతువూ నీవే! నీవే అగ్ర్యుడవు. విశ్వధాముడవూ నీవే! దిక్కులు నీవే! సుభాండమూ, యజింపబడదగినవాడవూ నీవే! చక్కని మేధాస్వరూపివీ నీవే! సమిధలు నీవే! పతి, గతి, దాత నీవే! మోక్షమూ నీవే! యోగమూ నీవే! స్రష్టవూ నీవే! ధాతవు, పరమయజ్ఞానివీ నీవే! సోమరసానివీ, దీక్షితుడవూ, దక్షిణాకూడా నీవే! విశ్వానివి నీవే! స్థవిరుడవు, హిరణ్యగర్భుడవు, నారాయణుడవు, త్రినేత్రుడవు, ఆదిత్యవర్ణుడవు, ఆదిత్య తేజుడవు, మహాపురుషుడవు పురుషోత్తముడవు, ఆదిదేవుడవు, సువిక్రముడవు, ప్రభాకరుడవు, శంభుడవు, స్వయంభువు నీవే! సమస్త భూతజాలానికి ఆదివి, మహాభూతానివి నీవే! విశ్వాన్ని భరించేవాడవు, విశ్వానివి నీవే! విశ్వరక్షకుడవు కూడా నీవే! నీవు పవిత్రుడవు, విశ్వభవుడవు, ఊర్ధ్వ కర్మవు. అమృతానివి, దివస్పతివి, వాచస్పతివి, ఘృతార్చివి, అనంతకర్మవంశానివి, ప్రాగ్వంశానివి (అన్నివంశాలకు పూర్వమున్నవాడవు). విశ్వరక్షకుడవు నీవే! వరాలర్థించే వారికి వరాలనిచ్చే వాడవూ నీవే!

నిన్ను నాలుగు మరియు నాలుగు, రెండు మరియు ఐదు, మరలా రెండు హోమాలతో అర్చిస్తారు. అట్టి హోత్రాత్మవైన (యజ్ఞస్వరూపుడవైన) నీకు నమస్సులు.

ఇతి శ్రీవామన మహాపురాణే మహాపులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే కశ్యపకృత శ్రీమన్నారాయణ స్తోత్రం నామ షడ్వింశోఽధ్యాయః ॥26॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి కశ్యపుడు చేసిన శ్రీమన్నారాయణ స్తోత్రమనే ఇరవైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తవింశోఽధ్యాయః – ఇరవైఏడవ అధ్యాయం
అదితికృత విష్ణుస్తోత్రమ్ – అదితిచేసిన విష్ణుస్తోత్రం

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

నారాయణస్తు భగవాన్ శ్రుత్వైవం పరమం స్తవమ్ ।
బ్రహ్మజేన ద్విజేంద్రేణ కశ్యపేన సమీరితమ్ ॥1॥

ఉవాచ వచనం సమ్యక్ తుష్టః పుష్టపదాక్షరమ్ ।
శ్రీమాన్ ప్రీతమనా దేవో యద్వదేత్ప్రభురీశ్వరః ॥2॥

వరం వృణుధ్వం భద్రం వో వరదోఽస్మి సురోత్తమాః ।

బ్రాహ్మణశ్రేష్ఠుడు, బ్రహ్మజ్ఞానియునైన కశ్యపుడొనర్చిన ఉత్తమస్తోత్రాన్ని విని సంతోషించిన నారాయణుడు స్పష్టముగా చక్కని మాటలలో "ఓ దేవతలారా! మీకు కావలసిన వరం కోరండి! ఇస్తాను. మీకు కల్యాణమగుగాక!" అని పలికాడు.

కశ్యప ఉవాచ – కశ్యపుడు పలికాడు.

సుప్రీతోఽసి సురశ్రేష్ఠ సర్వేషామేవ నిశ్చయాత్ ॥3॥

వాసవస్యానుజో భ్రాతా జ్ఞాతీనాం నందవర్ధనః ।
ఆదిత్యా అపి చ శ్రీమాన్ భగవానస్తు వై సుతః ॥4॥

అదితిర్దేవమాతా చ ఏతమేవార్థముత్తమమ్ ।
పుత్రార్థం వరదం ప్రాహ భగవంతం వరార్థినీ ॥5॥

ఓ సురశ్రేష్ఠా! మీరు మాయందు ప్రసన్నులగుట నిశ్చయము. దయచేసి ఇంద్రునకు తమ్మునిగా జ్ఞాతులకు ఆనందవర్ధనునిగా, అదితికి పుత్రునిగా జన్మింపుము. దేవమాత అదితి కూడా అదే సంకల్పంతో ఆ వరదేశ్వరుని తన గర్భంలో జన్మింపుమని వరమడిగింది.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

నిఃశ్రేయసార్థం సర్వేషాం దేవతానాం మహేశ్వర ।
త్రాతా భర్తా చ దాతా చ శరణం భవ నస్సదా ॥6॥

ఓ మహేశ్వరా! సమస్తదేవతల పరమకల్యాణం కొఱకు మీరు మమ్ములను సదా రక్షించేవారుగా, పాలన, పోషణ చేసేవారుగా, దానమిచ్చేవారుగా ఉండవలెనని దేవతలు శరణు వేడారు.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

తతస్తానబ్రవీద్విష్ణుర్దేవాంస్తాన్స్వయమేవ చ ।
సర్వేషామేవ యుష్మాకం యే భవిష్యన్తి శత్రవః ॥
ముహూర్తమపి తే సర్వే న స్థాస్యంతి మమాగ్రతః ॥7॥

హత్వాఽసురగణాన్సర్వాన్ యజ్ఞభాగాగ్రభోజినః ।
హవ్యదాంశ్చ సురాన్ సర్వాన్ కవ్యాదాంశ్చ పితౄనపి ॥8॥

కరిష్యే విబుధశ్రేష్ఠాః పారమేష్ఠ్యేన కర్మణా ।
యథాయాతేన మార్గేణ నివర్తధ్వం సురోత్తమాః ॥ 9॥

ఏవముక్తే తు దేవేన విష్ణునా ప్రభవిష్ణునా ।
తతః ప్రహృష్టమనసః పూజయంతిస్మ తం ప్రభుమ్ ॥10॥

విశ్వేదేవా మహాత్మానః కశ్యపోఽదితిరేవ చ ।
నమస్కృత్య సురేశాయ తస్మై దేవాయ రంహసా ॥11॥

ప్రయాతాః ప్రాగ్దిశం సర్వే విపులం కశ్యపాశ్రమమ్ ।
తే కశ్యపాశ్రమం గత్వా కురుక్షేత్రవనం మహత్ ॥12॥

సంప్రసాద్యాదితిం తత్ర తపసే తాం న్యయోజయన్ ।
సా చచార తపో ఘోరం వర్షాణామయుతం తదా ॥13॥

తస్యా నామ్నా వనం దివ్యం సర్వకామప్రదం శుభమ్ ।
ఆరాధనాయ కృష్ణస్య వాగ్యతా వాయుభోజనా ॥14॥

దైత్యైర్నిరాకృతాన్ దృష్ట్వా సభయానృషిసత్తమాన్ ।
వృథా పుత్రాఽహమితి సా నిర్వేదాత్ ప్రణతా హరిమ్ ।
తుష్టావ వాగ్భిరిష్టాభిః స్తుతిభిః సా తపోధనా ॥15॥

శరణ్యం శరణం విష్ణుం ప్రణతా భక్తవత్సలమ్ ।
దేవదైత్యమయం చాదిమధ్యమాంతస్వరూపిణమ్ ॥16॥

అంతట విష్ణువు దేవతలతో, కశ్యపునితో స్వయంగా ఇలా పలికాడు."మీకందరకు శత్రువులుగానున్న రాక్షసులనందరిని ముహూర్తమాత్రంలో సంహరించగలను. వారెవరు నా ఎదుట నిలువజాలరు. యజ్ఞభాగాగ్ర భోజకులైన దేవతలకందరికి హవ్యాలు, పితృదేవతలకు కవ్యాలు తిరిగి ఇప్పించగలను. ఓ సురోత్తములారా! మీరు ఏ మార్గంలో వచ్చారో అదే మార్గంలో తిరిగి మీ మీ ప్రదేశాలకు వెళ్ళండి". ప్రభవిష్ణుడైన విష్ణుదేవునిమాటలు విని, సంతుష్టాంతరంగులై, అదితికశ్యపులతో కూడిన విశ్వేదేవతలందరు ఆ దేవదేవునికి నమస్కరించి, అర్చించి,త్వరగా తూర్పుదిశగా పయనించి, విశాలమైన కశ్యపాశ్రమానికి వెళ్ళారు. కురుక్షేత్రవనమైన ఆ ఆశ్రమానికి వెళ్ళి, దేవమాత అదితిని ప్రసన్నురాలిని గావించుకొని, ఆమెను తపోదీక్షలో కూడా నిలిపారు. ఆ సాధ్వి పదివేలసంవత్సరాలు ఘోరమైన తపస్సు చేసింది. అన్ని కోర్కెలు తీర్చే ఆ వనం ఆమెపేర ప్రసిద్ధి చెందింది. ఆమె కృష్ణుని ఆరాధించుటకు వాఙ్నియమంతో వాయుభోజనం చేస్తూ, తపించింది. రాక్షసులచే నిర్జింపబడిన తన పుత్రులను తలంచుకొని, తన మాతృత్వం వ్యర్థమయ్యిందని నిర్వేదం చెందింది. ఆ వేదనకు శ్రీహరి మీద భక్తి తోడు కాగా, తపోధనురాలైన

ఆమె పరమార్థబోధకాలైన విశేషవచనాలతో సర్వలోకశరణ్యుడు, భక్తవత్సలుడు, దేవదైత్యమయుడు, ఆదిమధ్యాంత స్వరూపియునైన మహావిష్ణువును ఇలా స్తుతించింది.

అదితిరువాచ – అదితి పలికింది.

నమః కృత్యార్తినాశాయ నమః పుష్కరమాలినే ।
నమః పరమకల్యాణ కల్యాణాయాదివేధసే ॥17॥

నమః పంకజనేత్రాయ నమః పంకజనాభయే ।
నమః పంకజసంభూతి సంభవాయాత్మయోనయే ॥18॥

శ్రియః కాంతాయ దాంతాయ దాంతదృశ్యాయ చక్రిణే ।
నమః పద్మాదిహస్తాయ నమః కనకవాససే ॥19॥

తథాஉత్మజ్ఞానయజ్ఞాయ యోగిచింత్యాయ యోగినే ।
నిర్గుణాయ విశేషాయ హరయే బ్రహ్మరూపిణే ॥20॥

జగత్సంతిష్ఠతే యత్ర జగతో యో న దృశ్యతే ।
నమః స్థూలాతిసూక్ష్మాయ తస్మై దేవాయ శార్ఙ్గిణే ॥21॥

యం న పశ్యంతి పశ్యంతో జగదప్యఖిలం నరాః ।
అపశ్యద్భిర్జగద్యశ్చ దృశ్యతే హృది సంస్థితః ॥22॥

బహిర్జ్యోతిరలక్ష్యో యో లక్ష్యతే జ్యోతిషః పరః ।
యస్మిన్నేవ యతశ్చైవ యస్యైతదఖిలం జగత్ ॥23॥

తస్మై సమస్తజగతాం సునాథాయ నమో నమః ।
ఆద్యః ప్రజాపతిర్యస్తు పితౄణాం యః పరః పతిః ।
పతిః సురాణాం యస్తస్మై నమః కృష్ణాయ వేధసే ॥24॥

యః ప్రవృత్తైర్నివృత్తైశ్చ కర్మభిస్తు విరజ్యతే ।
స్వర్గాపవర్గఫలదో నమస్తస్మై గదాభృతే ॥ 25॥

యశ్చింత్యమానో మనసా సద్యః పాపం వ్యపోహతి ।
నమస్తస్మై విశుద్ధాయ పరస్మై హరిమేధసే ॥26॥

యం పశ్యంత్యఖిలాధారమీశానమజమవ్యయమ్ ।
న పునర్జన్మ మరణం ప్రాప్నువంతి నమామి తమ్ ॥27॥

యో యజ్ఞైర్యజ్ఞపురుష ఇజ్యతే యజ్ఞమాస్థితః ।
తం యజ్ఞపురుషం విష్ణుం నమామి ప్రభుమీశ్వరమ్ ॥28॥

గీయతే సర్వవేదేషు వేదవిద్భిర్విదాం గతిః ।
యస్తస్మై వేదవేద్యాయ విష్ణవే జిష్ణవే నమః ॥29॥

యతో విశ్వం సముద్భూతం యస్మిన్ప్రలయమేష్యతి ।
విశ్వోద్భవప్రతిష్ఠాయ నమస్తస్మై మహాత్మనే ॥30॥

బ్రహ్మాదిస్తంబపర్యంతం వ్యాప్తం యేన చరాచరమ్ ।
మాయాజాలం సమున్నద్ధం తముపేంద్రం నమామ్యహమ్ ॥31॥

యస్తృతీయస్వరూపస్థో బిభర్త్యఖిలమీశ్వరః ।
విశ్వం విశ్వపతిం విష్ణుం తం నమామి ప్రజాపతిమ్ ॥32॥

మూర్తం తమోఽసురమయం తద్వినా వినిహంతి యః ।
రాత్రిజం సూర్యరూపీ చ తముపేంద్రం నమామ్యహమ్ ॥33॥

యస్యాక్షిణీ చంద్రసూర్యౌ సర్వలోకే శుభాశుభమ్ ।
పశ్యతః కర్మ సతతం తముపేంద్రం నమామ్యహమ్ ॥34॥

యస్మిన్సర్వేశ్వరే నిత్యం సత్యమేతన్మయోదితమ్ ।
నానృతం తమజం విష్ణుం నమామి ప్రభుమవ్యయమ్ ॥35॥

యద్యేతత్సత్యముక్తం మే భూయశ్చాతో జనార్దన ।
సత్యేన తేన సకలాః పూర్యంతాం మే మనోరథాః ॥36॥

కృత్యాభిచారాది ఆర్తి పోగొట్టువానికి నమస్కారము. పద్మమాలాధరునకు నమస్కారం,పరమకల్యాణరూపునికి నమస్కారం, మొదటి బ్రహ్మకు నమస్సులు. పద్మనేత్రునకు నమస్సులు, పంకజనాభునకు నమస్కారం, పద్మసంభవ జనకునకు నమస్కారం, ఆత్మయోనికి నమస్సులు. లక్ష్మీపతికి, దాంతునకు, దృశ్యజగత్తు నియామకునకు, చక్రధరునకు, పద్మాదులు పాణియందు ధరించినవానికి, పీతాంబరధారికి నమస్సులు. ఆత్మజ్ఞానయజ్ఞరూపికి, యోగిధ్యేయునకు, మహాయోగికి, నిర్గుణునకు, విశేషునకు, బ్రహ్మరూపియైన శ్రీహరికి నమస్సులు. జగత్తులో ఉంటూనే దానికి అగోచరుడగు వానికి, స్థూలునకు, అతిసూక్ష్మమైనవానికి, శార్ఙ్గపాణికి, నమస్సులు. ప్రపంచాన్ని అంతటిని చూడగలిగిన చూపు గలవారెవరిని చూడజాలరో, జగద్దృష్టి వదిలిన వాడెవనిని తమ హృదయములో నిలుపుకొని చూడగలరో అట్టివానికి నమస్కారము. బయటి వెలుగులో ఎవడు కనిపించడో, సమస్త వెలుగులకు వెలుపలి తత్త్వమెవడో, ఈ విశ్వమంతయు ఎవనియందు, ఎవనినుండి, ఎవనిరూపాన విస్తరించియున్నదో అట్టి సర్వజగన్మయునకు మరల మరల నమస్సులు. సర్వానికి ఆద్యుడు, ప్రజాపతి, పితరులకు పరమాధిపతి, దేవపతి యునగు శ్రీకృష్ణునకు నమస్కరిస్తాను. ప్రవృత్తి, నివృత్తాత్మకములైన కర్మలు ఎవరిని అంటజాలవో, స్వర్గాపవర్గ ఫలములనొసంగు గదాధరునకు ప్రణామము. స్మరణమాత్రం చేతనే సమస్తపాపములు పోగొట్టగలిగిన, శుద్ధ స్వరూపియైన, శ్రీహరిమేధునకు నమస్సులు. అఖిలాధారుడు, ఈశ్వరుడు, అజుడు, అవ్యయుడునైన ఏ

ప్రభువుదర్శనం చేయువారలు జననమరణములనుండి ముక్తులగుదురో అట్టి మహనీయునకు నమస్సులు. యజ్ఞపరములైన జ్ఞానులచే యజ్ఞరూపాన యజ్ఞసంస్థితుడై ఆరాధింపబడు యజ్ఞపురుషుడైన విష్ణునకు, పరమేశ్వరునకు నమస్సులు. వేదవిదులైన జ్ఞానులచేతను, వేదములచేతను కీర్తింపబడు శాశ్వతుడైన వేదవేద్యునకు, విష్ణువునకు నమస్కారములు. ఎవనినుండి విశ్వము జనించునో, ఎవనిలోనుండునో, ఎవనిలో లయమగునో అట్టి విశ్వోద్భవ ప్రతిష్ఠుడగు మహాత్మునకు నమస్సులు. బ్రహ్మ మొదలు గడ్డిపోచ వరకు గల ఈ చరాచరసృష్టి యంతయు ఎవనిచే పరివేష్టితమైనదో అట్టి మాయాశక్తి సమన్వితుడైన ఉపేంద్రునకు నమస్కరిస్తున్నాను. ఎవడు మూడవదైన జలస్వరూపస్థితుడై, ఈ అఖిలవిశ్వాన్ని ధరించి రక్షించుచున్నాడో అట్టి విశ్వరూపుడు, విశ్వపతియునైన విష్ణుదేవునకు నమస్కారము. అసురతత్త్వరూపాన దైత్యులలోని తమస్సును, అంధకారమును పోగొట్టు సూర్యునివలె నశింపజేయు ఉపేంద్రునకు నమస్కారము. జీవుల శుభాశుభకర్మలు, సూర్యచంద్రులనే నేత్రాలతో రాత్రింబవళ్ళు చూచుచుండు ఉపేంద్రునకు నమస్కారము. ఆ సర్వేశ్వరునియందే సర్వము ఇమిడియున్నదని చెప్పబడిన మాట సత్యము. అది అనృతము కాదు. అట్టి అజుడు, అవ్యయుడు, ప్రభుడునగు శ్రీమహావిష్ణువునకు నమస్కరిస్తున్నాను. ప్రభూ!, జనార్దనా! నేను చెప్పినదంతయు సత్యమగుచో సత్యప్రభావము వలన నా మనోరథములన్నియు సఫలమగు గాక!.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే అదితికృతవిష్ణుస్తోత్రం నామ సప్తవింశోఽధ్యాయః ॥27॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యంలో అదితిచేసిన విష్ణుస్తోత్రమనే ఇరవైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టావింశతితమోఽధ్యాయః - ఇరవైఎనిమిదవ అధ్యాయం

అదితిగర్భే వాసుదేవధారణమ్ - అదితిగర్భంలో వాసుదేవుని ధరించినవిధం

లోమహర్షణ ఉవాచ - లోమహర్షణుడు పలికాడు.

ఏవం స్తుతోఽథ భగవాన్వాసుదేవ ఉవాచ తామ్ ।
అదృశ్యః సర్వభూతానాం తస్యాః సందర్శనే స్థితః ॥1॥

అదితి గావించిన స్తోత్రం విని, భగవంతుడైన వాసుదేవుడు ఇతరులకెవ్వరికి కనబడకుండా అదితికి మాత్రమే గోచరించి ఇలా పలికాడు.

శ్రీభగవానువాచ - విష్ణుభగవానుడు పలికాడు.

మనోరథాంస్త్వమదితే యానిచ్ఛస్యభివాంఛితాన్ ।
తాంస్త్వం ప్రాప్స్యసి ధర్మజ్ఞే మత్ప్రసాదాన్నసంశయః ॥2॥

శృణు త్వం చ మహాభాగే వరో యస్తే హృది స్థితః ।
మద్దర్శనం హి విఫలం న కదాచిద్భవిష్యతి ॥3॥

యశ్చేహ మద్వనే స్థిత్వా త్రిరాత్రం వై కరిష్యతి ।
సర్వే కామాః సమృద్ధ్యంతే మనసా యానిహేచ్ఛతి ॥4॥

దూరస్థోఽపి వనం యస్తు అదిత్యాః స్మరతి నరః ।
సోఽపి యాతి పరం స్థానం కిం పునర్నివసన్నరః ॥5॥

యశ్చేహ బ్రాహ్మణాన్ పంచ త్రీన్వా ద్వావేకమేవ వా ।
భోజయేచ్ఛ్రద్ధయా యుక్తః స యాతి పరమాం గతిమ్ ॥6॥

ఓ ధర్మజ్ఞురాలా! అదితీ! నా అనుగ్రహం చేత నీ మనోరథాలన్నీ నెరవేరగలవు. నీవు కోరుకున్న వాంఛితములన్నియు పొందగలవు. ఇందులో సందేహము లేదు. ఓ మహాభాగ్యురాలా! నీవు వినుము. నా దర్శనం ఎప్పుడూ విఫలం కాజాలదు. కావున నీ మనస్సులోని కోరిక తప్పక సిద్ధిస్తుంది. ఈ అదితివనం (కురుక్షేత్రం) లో మూడు రాత్రులు నిద్ర చేసి, సాధన చేసినచో మనస్సులోని కోరికలన్నియు తీరుతాయి. దూరంగానుండి కూడా ఈ అదితివనాన్ని స్మరించినవారికి పరమపదం ప్రాప్తించుచుండగా అక్కడ నివసించు నరుని విషయంలో చెప్పవలెనా?. ఈ ప్రదేశంలో భక్తి శ్రద్ధలతో ఐదుగురు బ్రాహ్మణులకు గాని, ముగ్గురు బ్రాహ్మణులకు గాని, లేదా కనీసం ఒక్క బ్రాహ్మణునకైనా భోజనం పెట్టి, సంతృప్తి పరచువారలకు పరమపదం లభిస్తుంది.

అదితిరువాచ - అదితి పలికింది.

యది దేవః ప్రసన్నస్త్వం భక్త్యా మే భక్తవత్సల ।
త్రైలోక్యాధిపతిః పుత్రస్తదస్తు మమ వాసవః ॥7॥

హృతం రాజ్యం హృతశ్చాస్య యజ్ఞభాగ ఇహాసురైః ।
త్వయి ప్రసన్నే వరద తత్ప్రాప్నోతు సుతో మమ ॥8॥

హృతం రాజ్యం న దుఃఖాయ మమ పుత్రస్య కేశవ ।
ప్రపన్నదాయవిభ్రంశః పీడాం మే కురుతే హృది ॥9॥

భక్తవత్సలా! దేవా! మీరు నా భక్తికి ప్రసన్నులైనచో నా కుమారుడైన ఇంద్రుడు త్రైలోక్యాధిపతి యగును గాక! రాక్షసులచే నా కుమారుడు కోల్పోయిన రాజ్యం, యజ్ఞభాగాలు నీ ప్రసాదం వల్ల నా పుత్రునకు మరల లభించు గాక! ఓ కేశవా! నా కుమారుడు రాజ్యం కోల్పోయినందులకు నా కుమారునకు చింత లేదు. శరణాగతులకు దాయభాగవిభ్రంశం కలగడం నన్ను వేధిస్తోంది.

శ్రీభగవానువాచ – విష్ణుభగవానుడు పలికాడు.

కృతః ప్రసాదో హి మయా తవ దేవి యథేప్సితమ్ ।
స్వాంశేన చైవ తే గర్భే సంభవిష్యామి కశ్యపాత్ ॥10॥

తవ గర్భసముద్భూతస్తతస్తే యే సురారయః ।
తానహం నిహనిష్యామి నిర్వృతా భవ నందిని ॥11॥

దేవీ! నీ మనోభీష్టాన్ని అనుగ్రహించాను. కశ్యపుని ద్వారా నా అంశతో నీ కడుపున జన్మిస్తాను. నేను నీ కడుపున పుట్టి, దేవవిరోధులైన రాక్షసులనందరిని సంహరిస్తాను. నీవు ఆనందంతో తిరిగి వెళ్ళు.

అదితిరువాచ – అదితి పలికింది.

ప్రసీద దేవదేవేశ నమస్తే విశ్వభావన ।
నాహం త్వాముదరే వోఢుమీశ శక్ష్యామి కేశవ ।
యస్మిన్ ప్రతిష్ఠితం సర్వం విశ్వయోనిస్త్వమీశ్వరః ॥12॥

ఓ దేవదేవా! విశ్వభావనా! నన్ను అనుగ్రహించు. ఓ కేశవా! సమస్తలోకాలను నీ కుక్షిలో నింపుకున్న సర్వేశ్వరుడవైన, విశ్వగర్భుడవైన నిన్ను నేను నా కడుపులో మోయజాలను.

శ్రీభగవానువాచ – విష్ణుభగవానుడు పలికాడు.

అహం చ త్వాం వహిష్యామి స్వాత్మానం చైవ నందిని ।
న చ పీడాం కరిష్యామి స్వస్తి తేఽస్తు వ్రజామ్యహమ్ ॥13॥

దేవీ! నేను నిన్ను, నన్ను కూడా మోయగలను. కావున నీవు భయపడవలదు. నీకెటువంటి బాధను కలుగనీయను. నీకు మేలు కలుగు గాక! నేను వెళ్ళివస్తాను.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

ఇత్యుక్త్వాఽన్తర్హితే దేవేఽదితిర్గర్భం సమాదధే ॥14॥

గర్భస్థితే తతః కృష్ణే చచాల సకలా క్షితిః ।
చకంపిరే మహాశైలా జగ్ముః క్షోభం మహాబ్ధయః ॥15॥

యతో యతోఽదితిర్యాతి దదాతి పదముత్తమమ్ ।
తతస్తతః క్షితిః ఖేదాన్ననామ ద్విజపుంగవాః ॥16॥

దైత్యానామపి సర్వేషాం గర్భస్థే మధుసూదనే ।
బభూవ తేజసో హానిర్యథోక్తం పరమాత్మనా ॥17॥

భగవానుడు ఈ విధంగా పలికి అంతర్హితుడు కాగా అదితి గర్భం ధరించింది. కృష్ణుడామె గర్భస్థుడౌటతో భూమియంతయు కంపించింది. మహాపర్వతాలు కదలిపోయాయి. మహాసముద్రాలు సంక్షుభితాలయ్యాయి. ఓ బ్రాహ్మణోత్తములారా! ఆ మహాదేవియైన అదితి అడుగు పెట్టిన ప్రతిచోటా భూమి బాధతో కృంగిపోయేది. అంతేగాక సమస్తరాక్షసులను తన గర్భంలో ధరించిన మధుసూదనుడు గర్భస్థుడగుటవలన పరమాత్మవచనానుసారము దైత్యులు క్రమంగా తమ తేజస్సును కోల్పోసాగారు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే అదితిగర్భే వాసుదేవధారణం నామ అష్టావింశతితమోఽధ్యాయః ॥28॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి అదితిగర్భంలో వాసుదేవుని ధరించినవిధం అనే ఇరవైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనత్రింశోఽధ్యాయః – ఇరవైతొమ్మిదవ అధ్యాయం

బలిం ప్రతి ప్రహ్లాదస్య శాపః – ప్రహ్లాదుడు బలిని శపించుట

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

నిస్తేజసోఽసురాన్ దృష్ట్వా సమస్తానసురేశ్వరః ।
ప్రహ్లాదమథ పప్రచ్ఛ బలిరాత్మపితామహమ్ ॥1॥

రాక్షసులందరు తేజోహీనులగుట చూసి రాక్షసేశ్వరుడైన బలి తన తాతయైన ప్రహ్లాదుని ఇలా ప్రశ్నించాడు.

బలిరువాచ – బలిచక్రవర్తి పలికాడు.

తాత! నిస్తేజసో దైత్యా నిర్దగ్ధా ఇవ వహ్నినా ।
కిమేతే సహసైవాద్య బ్రహ్మదండహతా ఇవ ॥2॥

దురిష్టం కిం ను దైత్యానాం కిం కృత్యా సురనిర్మితా ।
నాశాయైషా సముద్భూతా యేన నిస్తేజసోఽ సురాః ॥3॥

పితామహా! మనవారలైన దైత్యులందరు అగ్నిదగ్ధులైనట్లు తేజస్సు కోల్పోయినారు. ఆకస్మికంగా మనవారు బ్రహ్మదండతాడితులైనారా యేమి? అది వారి దురదృష్టమా? లేక దైత్యవంశనాశనానికి విధి ప్రయోగించిన అభిచారకృత్యాప్రయోగమా? ఇందులకు కారణమేమి?

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

ఇత్థం దైత్యవరస్తేన పృష్టః పౌత్రేణ బ్రాహ్మణాః ।
చిరం ధ్యాత్వా జగాదైవమసురం తం తదా బలిమ్ ॥4॥

బ్రాహ్మణులారా! మనుమడు వేసిన ప్రశ్నను విని ప్రహ్లాదుడు బాగా ఆలోచించి అతనితో ఇలా పలికాడు.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

చలంతి గిరయో భూమిర్జహాతి సహజాం స్థితిమ్ ।
నద్యః సముద్రాః క్షుభితా దైత్యా నిస్తేజసః కృతాః ॥5॥

కొండలు కదలాడుతున్నాయి. భూమి తన సహజస్థితిని కోల్పోతున్నది. హఠాత్తుగా నదులు, సముద్రాలు క్షోభిస్తున్నాయి. దైత్యులు నిస్తేజులౌతున్నారు.

సూర్యోదయే యథా పూర్వం తథా గచ్ఛంతి న గ్రహాః ।
దేవతానాం పరా లక్ష్మీః కారణేనానుమీయతే ॥6॥

సూర్యోదయ సమయంలో గ్రహాలు ఎప్పటివలె తమ తమ కక్ష్యలలో సంచరించడం లేదు. ఆలోచింపగా ఇది దేవతలకు అభ్యుదయకాలమనిపిస్తోంది.

మహదేతన్మహాబాహో కారణం దానవేశ్వర ।
న హ్యల్పమితి మంతవ్యం త్వయా కార్యం కథంచన ॥7॥

ఈ ఉత్పాతాలకు ఏదో పెద్దకారణమే ఉంటుంది. ఓ దానవేశ్వరా! దీనిని మనం తేలికగా త్రోసివేయరాదు.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

ఇత్యుక్త్వా దానవపతిం ప్రహ్లాదః సోఽసురోత్తమః ।
అత్యర్థభక్తో దేవేశం జగామ మనసా హరిమ్ ॥8॥

స ధ్యానం ప్రథమం కృత్వా ప్రహ్లాదస్తు తతోఽసురః ।
విచారయామాస తతో యథా దేవం జనార్దనమ్ ॥9॥

స దదర్శోదరే తస్యాః ప్రహ్లాదో వామనాకృతిమ్ ।
తదంతశ్చ వసూన్రుద్రానశ్వినౌ మరుతస్తథా ॥10॥

సాధ్యాన్విశ్వాంస్తథా దేవాన్గంధర్వోరగరాక్షసాన్ ।
విరోచనం చ తనయం బలిం చాసుర నాయకమ్ ॥11॥

జంభం కుజంభం నరకం బాణమన్యాంస్తథాసురాన్ ।
ఆత్మానం గగనం వాయుం మనస్తోయం హుతాశనమ్ ॥12॥

సముద్రాద్రిద్రుమద్వీపాన్సరాంసి చ పశూన్ మహీమ్ ।
వయో మనుష్యానఖిలాంస్తథైవ చ సరీసృపాన్ ॥13॥

సమస్తలోకస్రష్టారం బ్రహ్మాణం భవమేవ చ ।
గ్రహనక్షత్రతారాద్యానృషీంశ్చైవ ప్రజాపతిమ్ ॥14॥

సంపశ్యన్విస్మయావిష్టః ప్రకృతిస్థః క్షణాత్పునః ।
ప్రహ్లాదః ప్రాహ దైత్యేంద్రం బలిం వైరోచనం తదా ॥15॥

దానవేశ్వరుడగు బలితో ఇలా చెప్పి, అసురోత్తముడైన ప్రహ్లాదుడు ఏకాగ్రచిత్తంతో శ్రీహరిని ధ్యానించాడు. ప్రహ్లాదుడు ముందుగా శ్రీహరిని ధ్యానించిన పిదప శ్రీహరిని వెదకనారంభించాడు. అంతట ప్రహ్లాదుడు అదితిగర్భంలో వామనాకృతిలోనున్న బాలుని దర్శించాడు. ఆ చిన్నశిశువులో వసువులను, రుద్రులను, అశ్వినీదేవతలను, మరుత్తులను, సాధ్యులను, విశ్వేదేవులను, దేవతలను, గంధర్వులను, ఉరగులను, రాక్షసులను, విరోచనుని, అతని కుమారుడైన బలిని, జంభ కుజంభులను, నరకబాణాది అన్యరాక్షసులను, తనతో బాటు గగనము, వాయువు, జలము, అగ్ని మున్నగు పంచభూతాలను, సముద్రాలను, పర్వతాలను, వృక్షాలను, ద్వీపాలను, సరస్సులను, పశువులను, భూమండలమును, నరమృగపక్ష్యాదులను, సరీసృపాలను, విధాతయైనట్టియు, సమస్తలోకాలను సృష్టించునట్టియు బ్రహ్మను, శివుని, గ్రహనక్షత్రతారాదులను, ఋషులను, ప్రజాపతులను, సమస్తవిశ్వాన్ని చూసి ఆశ్చర్యచకితుడై వెంటనే ప్రకృతిస్థుడై ప్రహ్లాదుడు దైత్యరాజైన బలితో ఇలా పలికాడు.

వత్స జ్ఞాతం మయా సర్వం యదర్థం భవతామియమ్ ।
తేజసో హానిరుత్పన్నా తచ్ఛృణు త్వమశేషతః ॥16॥

వత్సా! నీవు నీ వారలు తేజోహీనులగుటకు కారణం నేను సంపూర్ణంగా తెలుసుకున్నాను. దానిని సమగ్రంగా వినుము.

దేవదేవో జగద్యోనిర్జగదాదిరజః ప్రభుః ।
అనాదిరాదిర్విశ్వస్య వరేణ్యో వరదో హరిః ॥17॥

పరావరాణాం పరమః పరాపరవతాం గతిః ।
ప్రభుః ప్రమాణం మానానాం సప్తలోకగురోర్గురుః ।
స్థితిం కర్తుం జగన్నాథో హ్యదిత్యా గర్భగః ప్రభుః ॥18॥

అయోని, జగద్యోని, దేవదేవుడు, జగత్తునకు ముందుపుట్టినవాడు, మొదలు లేనివాడు, విశ్వానికి మొదలైనవాడు, వరదాతలలో శ్రేష్ఠుడు, శ్రీహరి, పరావరేశ్వరుడు, అందరకు పరమగతియైనవాడు, సమస్తమైన కొలతలకు ప్రమాణమైనవాడు, సమస్తలోకాధిపతులకు అధిపతియైన ఆ జగన్నాథుడు, ఊహకందని ప్రభువు, విశ్వస్థితిని ఉద్ధరించడానికి సామాన్యునివలె గర్భస్థుడైనాడు.

ప్రభుః ప్రభూణాం పరమః పరాణామనాదిమధ్యో భగవాననన్తః ।
త్రైలోక్యమంశేన సనాథమేకః కర్తుం మహాత్మాఽదితిజోఽవతీర్ణః ॥19॥

న యస్య రుద్రో న చ పద్మయోనిర్నేంద్రో న సూర్యేందుమరీచిమిశ్రాః ।
జానన్తి దైత్యాధిపతే స్వరూపం స వాసుదేవః కలయాఽవతీర్ణః ॥20॥

ప్రభువులకు ప్రభువు, పరములకు పరము, ఆదిమధ్యాంతములు లేనివాడు, తన కళాంశతో ముల్లోకాలను సనాథం చేయడానికి అదితిగర్భంలో అవతరించాడు. ఓ దైత్యపతీ! రుద్రుడు, బ్రహ్మ, ఇంద్రుడు, సూర్యచంద్ర మరీచ్యాదులు, ఏ అప్రమేయుని స్వరూపం తెలియజాలకున్నారో ఆ వాసుదేవుడు తన అంశంతో అవతరించాడు.

యమక్షరం వేదవిదో వదంతి విశంతి యత్రైవ విధూతపాపాః ।
యస్మిన్ ప్రవిష్టా న పునర్భవంతి తం వాసుదేవం ప్రణమామి చాద్యమ్ ॥21॥

వేదవిదులు ఎవనిని నాశనరహితుడని చెప్పుదురో, పాపరహితులైనవారు ఎవనియందు లయమగుచున్నారో, ఎవనియందు లయమందినవారు తిరిగి మరల జన్మను పొందరో అట్టి వాసుదేవునకు నమస్కరిస్తున్నాను.

భూతాన్యశేషాణి యతో భవంతి యథోర్మయస్తోయనిధేరజస్రమ్ ।
లయం చ యస్మిన్ ప్రణయే ప్రయాన్తి తం వాసుదేవం ప్రణతోఽస్మ్యచింత్యమ్ ॥22॥

అనంతమైన జీవరాసులు ఎవనినుండి సముద్రంలోని కెరటాల వలె నిరంతరం ఉద్భవిస్తూ ఉంటాయో, తిరిగి అవియన్నియు ఏ దివ్యతత్త్వమందు లయమవుతున్నాయో అట్టి అచింత్యస్వభావుడైన వాసుదేవునకు నమస్కరిస్తున్నాను.

రూపం చ చక్షుర్గ్రహణే త్వగేషా స్పర్శగ్రహిత్రీ రసనా రసస్య ।
ఘ్రాణం చ గంధగ్రహణే నియుక్తం త్వఘ్రాణచక్షూంషి న తాని యస్య ॥23॥

సర్వేశ్వరో వేదితవ్యః స యుక్త్యా హ్యనాదిమధ్యం త్వనఘం చ దేవమ్ ।
నమామ్యహం తం హరిమీశితారం లోకైకనాథం భవభీతినాశనమ్ ॥24॥

రూపాలను దర్శించడానికి కన్నులను, స్పర్శజ్ఞానం తెలియడానికి చర్మాన్ని, రుచిని తెలియడానికి జిహ్వను, గంధాన్ని ఆఘ్రాణించడానికి నాసికను, జీవరాసులకు ప్రదానం చేస్తూ తాను ఆఘ్రాణచక్షుఃశ్రవణాదులు లేకుండా ఉంటాడో అట్టి పరమేశ్వరునకు నమస్సులు. పరమార్థదృష్టితో చూస్తే ఎవడు స్వయంప్రకాశకుడో, సర్వేశ్వరుడో, యుక్తి చేత తెలియదగిన శరణ్యుడో, అనాదిమధ్యలయుడెవ్వడో, ఎవడు పాపరహితుడో, అట్టి లోకైకనాథుడు, భవభీతినాశకుడు, పరమేశ్వరుడునైన శ్రీహరికి నమస్కరిస్తున్నాను.

యేనైకదంష్ట్రేణ సముద్ధృతేయం ధరాఽచలా ధారయతీహ సర్వమ్ ।
శేతే గ్రసిత్వా సకలం జగద్యస్తమీడ్యమీశం ప్రణతోఽస్మి విష్ణుమ్ ॥25॥

ఈ భూమండలమంతటిని ఒక్క దంష్ట్రతో ఎత్తిన శక్తిసంపన్నుడెవడో, సకలజగత్తును ధరించువాడెవడో మరల ఈ జగత్తునంతటిని తనలోనే చేర్చుకొనే వాడెవడో, అట్టి పూజ్యుడగు శ్రీమహావిష్ణువునకు నమస్కరిస్తున్నాను.

అంశావతీర్ణేన చ యేన గర్భే హృతాని తేజాంసి మహాసురాణామ్ ।
నమామి తం దేవమనంతమీశమశేషసంసారతరోః కుఠారమ్ ॥26॥

మాతృగర్భంలో అంశతో ప్రవేశించినమాత్రం చేతనే మహాదైత్యయోధుల తేజస్సునంతటిని ఎవడు హరించి వేశాడో అట్టి అనంతునకు, ఈశ్వరునకు, సంసారవృక్షాన్ని ఛేదించే గొడ్డలియైన దేవదేవునకు నమస్సులు.

దేవో జగద్యోనిరయం మహాత్మా స షోడశాంశేన మహాసురేంద్ర ।
సురేంద్రమాతుర్జఠరం ప్రవిష్టో హృతాని వస్తేన బలం వపూంషి ॥27॥

ఓ రాక్షసేంద్రా! ఇటువంటి జగత్ప్రభుడైన దేవదేవుడు తన పదునారవకళాంశతో దేవమాత అదితి గర్భగతుడైనాడు. అతడే నీ తేజోబలాలను హరించాడు.

బలిరువాచ – బలిచక్రవర్తి పలికాడు.

తాత కోఽయం హరిర్నామ యతో నో భయమాగతమ్ ।
సంతి మే శతశో దైత్యా వాసుదేవబలాధికాః ॥28॥

విప్రచిత్తిః శిబిః శంకుర్జంభః కుంభస్తథైవ చ ।
హయశిరా అశ్వశిరా భంగకారో మహాహనుః ॥29॥

వాతాపిః ప్రవశః శుంభః కుకురాక్షశ్చ దుర్జయః ।
ఏతే చాన్యే చ మే సంతి దైతేయా దానవాస్తథా ॥30॥

మహాబలా మహావీర్యా భూభారధరణక్షమాః ।
ఏషామేకైకశః కృష్ణో స వీర్యబలసంమితః ॥31॥

తాతా! మనకు భయోత్పాతకుడైన ఆ హరి ఎవడు? ఆ వాసుదేవుని మించిన బలాఢ్యులైన వందలాది దైత్యులెందరో నా వద్దనున్నారు. విప్రచిత్తి, శిబి, శంకు, జంభుడు, కుంభుడు, హయశిరుడు, అశ్వశిరుడు, భంగకారుడు, మహాహనువు, వాతాపి, ప్రవశుడు, శుంభుడు, కుకురాక్షుడు, దుర్జయుడు వీరే గాక తదితరులెందరో దైత్యులు దానవులు ఉన్నారు. వీరందరు మహాబలవీర్యసంపన్నులు. భూభారాన్నంతటిని మోయగల సమర్థులు. వీరిలో ఏ ఒక్కరి సగం బలానికి కూడా కృష్ణుడు సరిపోడు.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

పౌత్రస్యైతద్వచః శ్రుత్వా ప్రహ్లాదో దైత్యపుంగవః ।
సక్రోధశ్చ బలిం ప్రాహ వైకుంఠాక్షేపవాదినమ్ ॥32॥

వినాశముపయాస్యంతి దైత్యాస్తే చాపి దానవాః ।
యేషాం త్వమీదృశో రాజా దుర్బుద్ధిరవివేకవాన్ ॥33॥

మనుమని ఈ మాటలు వినిన దైత్యపుంగవుడైన ప్రహ్లాదుడు వైకుంఠపతిని అధిక్షేపిస్తున్న బలిని క్రోధంతో చూస్తూ, అతనితో ఇలా పలికాడు. "దైత్యదానవులకు వినాశకాలం సమీపించింది. కావుననే ఇటువంటి అవివేకి, దుర్బుద్ధి మీకు రాజయ్యాడు.

దేవదేవం మహాభాగం వాసుదేవమజం విభుమ్ ।
త్వామృతే పాపసంకల్పః కోఽన్య ఏవం వదిష్యతి ॥34॥

య ఏతే భవతా ప్రోక్తాః సమస్తా దైత్యదానవాః ।
సబ్రహ్మకాస్తథా దేవాః స్థావరాంతాశ్చ జాతయః ॥35॥

త్వం చాహం చ జగచ్చేదం సాద్రిద్రుమనదీవనమ్ ।
సముద్రద్వీపలోకాశ్చ యచ్చేంగతి చ నేంగతి ॥ 36॥

యస్యాభివాద్యవంద్యస్య వ్యాపినః పరమాత్మనః ।
ఏకైకాంశకలాజన్మ కస్తమేవం వదిష్యతి ॥37॥

నీవంటి పాపసంకల్పుడు తప్ప ఆ దేవదేవుని, మహాభాగుని, అజుడు విభుడునైన వాసుదేవుని గూర్చి ఇటువంటి వాక్యాలు మరెవ్వడు నోట రానీయడు. నీవు చెప్పుచున్న ఈ దైత్యదానవులందరు బ్రహ్మాది దేవతలు జంగమస్థావరాంతాలైన విభూతులు. నీవు, నేను గిరినదనదీసముద్రద్వీపాదులతో కూడిన ఈ చరాచరజగత్తంతయు ఆ విశ్వవంద్యుడు, సర్వవ్యాపియునైన పరమాత్మయొక్క ఒక్కొక్క అల్పాంశంనుండి ప్రభవించినవే. నీవు తప్ప ఆ దేవదేవుని గూర్చి ఈ విధంగా ఎవడు మాట్లాడగలడు?

ఋతే వినాశాభిముఖం త్వామేకమవివేకినమ్ ।
దుర్బుద్ధిమజితాత్మానం వృద్ధానాం శాసనాతిగమ్ ॥38॥

శోచ్యోఽహం యస్య మే గేహే జాతస్తవ పితాఽధమః ।
యస్య త్వమీదృశః పుత్రో దేవదేవావమానకః ॥39॥

తిష్ఠత్యనేకసంసారసంఘాఘౌఘవినాశినీ ।
కృష్ణే భక్తిరహం తావదవేక్ష్యో భవతా న కిమ్ ॥40॥

సర్వనాశనం దిశగా పరుగిడుతున్న అవివేకివి, దుర్బుద్ధివి, అహంకారివి, గురువుల, పెద్దల శాసనాన్ని అతిక్రమించే నీవు మాత్రమే ఇలా ప్రేలదగియున్నావు. దేవదేవుని అవమానించే ఇటువంటి పుత్రుని కనిన అధముడైన నీ తండ్రి నా వంశంలో పుట్టినందుకు నేను విచారింపతగినవాడను అయితిని. అనంతమైన సంసారపాశసంఘాలను తెగటార్చే కృష్ణుని పట్ల భక్తివిషయం అలా వదిలేద్దాము.

న మే ప్రియతరం కృష్ణాదపి దేహం మహాత్మనః ।
ఇతి జానాత్యయం లోకో భవాంశ్చ దితిజాధమః ॥41॥

జానన్నపి ప్రియతరం ప్రాణేభ్యోఽపి హరిం మమ ।
నిందాం కరోషి తస్య త్వమకుర్వన్గౌరవం మమ ॥42॥

విరోచనస్తవ గురుః గురుస్తస్యాప్యహం బలే ।
మమాపి సర్వజగతాం గురుర్నారాయణో హరిః ॥43॥

నిందాం కరోషి తస్మింస్త్వం కృష్ణే గురుగురోర్గురౌ ।
యస్మాత్తస్మాదిహైశ్వర్యాదచిరాద్భ్రంశమేష్యసి ॥44॥

నా యీ దేహం కంటే నాకు కృష్ణుడే ప్రియుడనే విషయం లోకానికంతా తెలుసు. నీకు కూడా తెలుసు. నాకు ప్రాణాలకంటే శ్రీహరి ప్రియతరమని తెలిసి కూడా నా గురుత్వాన్ని మంటగలిపి ఆ మహనీయుని నిందించావు. ఓ బలీ! ఓ రాక్షసా! విరోచనుడు నీకు గురువు. వానికి తండ్రినైనందుకు నేను గురువును. జగత్తునకంతటికి గురుడైన ఆ నారాయణుడు నాకు గురువు. అట్టి సర్వగురువులకు గురువైన హరిని నీవు నిందించావు. కాబట్టి నీవైశ్వర్యపదవి నుండి అచిరకాలంలో భ్రష్టుడవౌతావు.

స దేవో జగతాం నాథో బలే మమ జనార్దన ।
న త్వహం ప్రత్యవేక్ష్యస్తే పితుర్మాన్యోఽత్ర యో గురుః ॥45॥

ఏతావన్మాత్రమప్యత్ర నిందతా జగతో గురుమ్ ।
నాపేక్షితం త్వయా యస్మాత్తస్మాచ్ఛాపం దదామి తే ॥46॥

యథా మే శిరసశ్ఛేదాదిదం గురుతరం వచః ।
త్వయోక్తమచ్యుతాక్షేపి రాజ్యభ్రష్టస్తథా పత ॥47॥

యథా న కృష్ణాదపరః పరిత్రాణం భవార్ణవే ।
తథాఽచిరేణ పశ్యేయం భవన్తం రాజ్యవిచ్యుతమ్ ॥48॥

ఓ బలీ! ఆ జనార్దనుడు సర్వలోకాధినాథుడు. నేను నీకు గురువును. కావున నీవు నన్ను అవమానించరాదు. ఇట్టి మర్యాదలనన్నిటినీ కాలదన్ని, ఆ జగద్గురువును నిందించిన నీవు శాపార్హుడవు. నీవు పలికిన నిందావాక్యాలు నాకు తలగొట్టినదానికంటే ఎక్కువ అవమానకారణాలు. కాబట్టి నీవు రాజ్యభ్రష్టుడవై పతనం పొందగలవని శపిస్తున్నాను. ఈ సంసారసముద్రం దాటడానికి కృష్ణుని మించిన నావ లేదు. కాబట్టి అచిరకాలంలోనే నీవు రాజ్యాన్ని కోల్పోవుట నేను చూడగలను.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే బలిం ప్రతి ప్రహ్లాదస్య శాపో నామ ఏకోనత్రింశోఽధ్యాయః ॥29॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి ప్రహ్లాదుడు బలిని శపించుట అనే ఇరవైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



త్రింశోఽధ్యాయః – ముప్పైయవ అధ్యాయం

వామనావతరణం, బ్రహ్మకృతవామనస్తుతిశ్చ – వామనుడవతరించుట, బ్రహ్మగావించిన వామనస్తుతి

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

ఇతి దైత్యపతిః శ్రుత్వా గురోర్వచనమప్రియమ్ ।
ప్రసాదయామాస గురుం ప్రణిపత్య పునః పునః ॥1॥

ప్రహ్లాదుడు పలికిన క్రోధపూర్ణమైన అప్రియవచనాలు విని, దైత్యేశ్వరుడైన బలి ఆయనను ప్రసన్నుని గావించుకొనుటకు మాటిమాటికి మ్రొక్కి ఇలా పలికాడు.

బలిరువాచ – బలిచక్రవర్తి పలికాడు.

ప్రసీద తాత మా కోపం కురు మోహహతే మయి ।
బలావలేపమూఢేన మయైతద్వాక్యమీరితమ్ ॥2॥

మోహోపహతవిజ్ఞానః పాపోఽహం దితిజోత్తమ ।
యచ్ఛప్తోఽస్మి దురాచారస్తత్సాధు భవతా కృతమ్ ॥3॥

రాజ్యభ్రంశం యశోభ్రంశం ప్రాప్స్యామీతి తతస్త్వహమ్ ।
విషణ్ణోఽస్మి యథా తాత తథైవావినయః కృతః ॥4॥

త్రైలోక్యైశ్వర్యమన్యద్వా కిమపీహ న దుర్లభమ్ ।
సంసారే దుర్లభాస్తాత గురవో యే భవద్విధాః ॥5॥

తత్ప్రసీద న మే కోపం కర్తుమర్హసి దైత్యప ।
త్వత్కోపపరిదగ్ధోఽహం పరితప్యే దివానిశమ్ ॥6॥

పితామహా! ప్రసన్నులు కండు. మోహంచేత బాధింపబడిన నాపై కోపగించకండి. దేహబలగర్వంతో నేను ఆ విధంగా మాట్లాడినాను. దైత్యోత్తమా! మూర్ఖత్వం నా విజ్ఞానాన్ని నశింపజేసింది. నేను పాపిని, దుర్మార్గుడను. మీరు నన్ను శపించడం మంచిదే. మీరు చెప్పినట్లుగా నా అవినయం వల్ల రాజ్యనాశనాన్ని, కీర్తినాశనాన్ని పొంది, విషణ్ణుడనగుట నాకు తగినదే. త్రైలోక్యరాజ్యాధికారం తదితరసంపదలు సంపాదించడం కష్టమైన పని కాదు. కాని తమవంటి గురుజనులు లభించడం దుర్లభం. కాబట్టి తాతా! నన్ను కరుణించు. కోపించకు. నీ కోపాగ్నిలో దగ్ధుడనై రాత్రింబవళ్ళు పరితపిస్తూ వుంటాను.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

వత్స కోపేన మే మోహో జనితస్తేన తే మయా ।
దత్తః శాపో వివేకశ్చ మోహేనాపహృతో మమ ॥7॥

యది మోహేన మే జ్ఞానం న క్షిప్తం స్యాన్మహాసుర ।
తత్కథం సర్వగం జానన్ హరిం కంచిచ్ఛపామ్యహమ్ ॥8॥

యోఽయం శాపో మయా దత్తో భవతే దైత్యపుంగవ ।
భావ్యమేతేన తే నూనం తస్మాత్త్వం మా విషీద వై ॥9॥

అద్య ప్రభృతి దేవేశే భగవత్యచ్యుతే హరౌ ।
భవేస్త్వం భక్తిమానీశే స తే త్రాతా భవిష్యతి ॥10॥

శాపం ప్రాప్య చ మే వీర దేవేశః సంస్మృతస్త్వయా ।
తథా తథా వదిష్యామి శ్రేయస్త్వం ప్రాప్స్యసే యథా ॥11॥

వత్సా! కోపం నన్ను మూర్ఖుని చేసింది. అందువలన నాకు వివేకం నశించి నిన్ను శపించాను. మోహం వలన నా వివేకం నశింపకపోతే శ్రీహరి సర్వజ్ఞుడని తెలిసి కూడా నిన్ను నేను ఎందుకు శపించాలి?. నేనిచ్చిన శాపం నీవు అనుభవింపక తప్పదు. అయినప్పటికి నీవు విచారింపవద్దు. నేటినుండి దేవదేవుడు భగవానుడునైన అచ్యుతుని నీవు భక్తితో ఆరాధింపుము. ఆయనకు భక్తుడవు కమ్ము. ఆ ఈశ్వరుడే నిన్ను రక్షింపగలడు. మహావీరా! నీకు నా శాపం లభించినందువలన నీకు ఆ దేవదేవుని నిరంతరస్మరణ లభిస్తుంది. నీవు భవిష్యత్తులో ఏ విధంగా శ్రేయస్సును పొందగలవో ఆ యా ఉపాయాలు నేను చెబుతూ ఉంటాను.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

అదితిర్వరమాసాద్య సర్వకామసమృద్ధిదమ్ ।
క్రమేణైవ హరిర్వృద్ధిం దేవః ప్రాప్తో మహాయశాః ॥12॥

తతో మాసే చ దశమే కాలే ప్రసవ ఆగతే ।
అజాయత స గోవిందో భగవాన్వామనాకృతిః ॥13॥

అవతీర్ణే జగన్నాథే తస్మిన్ సర్వామరేశ్వరే ।
దేవాశ్చ ముముచుర్దుఃఖం దేవమాతాఽదితిస్తథా ॥14॥

వవుర్వాతాః సుఖస్పర్శా విరజస్కమభూన్నభః ।
ధర్మే చ సర్వభూతానాం తదా మతిరజాయత ॥15॥

నోద్వేగశ్చాప్యభూద్దేహే మానవానాం ద్విజోత్తమాః ।
తదా హి సర్వభూతానాం ధర్మే మతిరజాయత ॥16॥

తం జాతమాత్రం భగవాన్బ్రహ్మా లోకపితామహః ।
జాతకర్మాదికాం కృత్వా క్రియాం తుష్టావ చ ప్రభుః ॥17॥

మహర్షులారా! సకలకామదాయియైన, వరం పొందిన వెంటనే అదితిగర్భంలో దేవదేవుడు క్రమంగా వృద్ధి పొందుతున్నాడు. ప్రసవసమయమైన 10వ నెలలో భగవంతుడైన గోవిందుడు వామనాకృతిలో జన్మించాడు. జగన్నాథుడు వామనుడై అవతరించిన సమయంలో సమస్తదేవతలకు, దేవమాతయైన అదితికి, సకలదుఃఖాలు

తొలగిపోయాయి. వాయువులు సుఖస్పర్శతో వీచాయి. ఆకాశం నిర్మలంగా యున్నది. ఆ సమయంలో సకలజీవుల లోను ధర్మబుద్ధి కలిగింది. మానవులకు శరీరబాధలు తొలగిపోయాయి. సకలజీవుల మనస్సులలో ధర్మాసక్తి పెరిగింది. భగవంతుడు జన్మించిన వెంటనే సర్వలోకపితామహుడైన విరించి వచ్చి వామనునకు జాతకర్మాది క్రియలు పూర్తిగావించి ఈ విధంగా స్తోత్రం చేశాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

జయాధీశ జయాజేయ జయ సర్వగురో హరే ।
జన్మమృత్యుజరాతీత జయానంత జయాచ్యుత ॥18॥

జయాజిత జయాశేష జయావ్యక్తస్థితే జయ ।
పరమార్థార్థ సర్వజ్ఞ జ్ఞానజ్ఞేయార్థనిశ్చిత ॥19॥

జయాశేష జగత్సాక్షిన్ జగత్కర్తర్జగద్గురో ।
జగతోఽజగతశ్చేశ స్థితౌ పాలయసే జయ ॥20॥

జయాఖిల జయాశేష జయ సర్వహృదిస్థిత ।
జయాదిమధ్యాంతమయ సర్వజ్ఞానమయోత్తమ ॥21॥

ముముక్షుభిరనిర్దేశ్య నిత్యహృష్ట జయేశ్వర ।
యోగిభిర్ముక్తికామైస్తు దమాదిగుణభూషణ ॥22॥

జయాతిసూక్ష్మ దుర్జ్ఞేయ జగన్మూల జగన్మయ ।
జయ సూక్ష్మాతిసూక్ష్మత్వం జయ యోగిన్నతీంద్రియ ॥23॥

జయ స్వమాయాయోగస్థ శేషభోగశయాక్షర ।
జయైకదంష్ట్రాప్రాంతేన సముద్ధృతవసుంధర ॥24॥

నృకేసరిన్సురారాతివక్షఃస్థలవిదారణ ।
సాంప్రతం జయ విశ్వాత్మన్ మాయావామన కేశవ ॥25॥

స్వమాయాపటలచ్ఛన్నజగద్ధాతర్జనార్దన ।
జయాచింత్య జయానేకస్వరూపైకనిధే ప్రభో ॥26॥

వర్ధస్వ వర్ధితానేకవికారప్రకృతే హరే ।
త్వయైషా జగతీశేషసంస్థితా ధర్మపద్ధతిః ॥27॥

న త్వామహం న చేశానో నేంద్రాద్యాస్త్రిదశా హరే ।
జ్ఞాతుమీశాన ఋషయః సనకాద్యా న యోగినః ॥28॥

త్వం మాయాపటసంవీతో జగత్యత్ర జగత్పతే ।
కస్త్వాం వేత్స్యతి సర్వేశ త్వత్ప్రసాదం వినా నరః ॥29॥

త్వమేవారాధితో యేన ప్రసాదసుముఖ ప్రభో ।
స ఏవ కేవలం దేవ వేత్తి త్వాం నేతరో జనః ॥30॥

నన్దీశ్వరేశ్వరేశాన విభో వర్ధస్వ వామన ।
ప్రభవాయాస్య విశ్వస్య విశ్వాత్మన్ పృథులోచన ॥31॥

సర్వాధీశా! జయము. సర్వాజేయా! జయము. సర్వగురూ! హరీ! నీకు జయము. జన్మమృత్యు జయాతీతా!, అనంతా!, అచ్యుతా! జయము. నీకు జయమగుగాక!. అజితా! అశేషా! అవ్యక్తరూపా! జయము. పరమార్థరూపా!, సర్వజ్ఞా! జ్ఞానజ్ఞేయసారరూపా! నీకు జయము. అశేషా! జగత్సాక్షీ! జగత్కర్తా!, జగద్గురూ! నీకు జయము. జగత్ స్థితిపాలకా! నీకు జయమగు గాక!. అఖిలస్వరూపా!, సకలజీవహృదయనివాసా! ఆదిమధ్యాంతమయా! సర్వజ్ఞానమయా! ఉత్తమా! నీకు జయమగు గాక!. ముముక్షువులకు కూడా నిర్దేశింపనలవికాని వాడా!, నిత్యహృష్టా! ఈశ్వరా! నీకు జయము. యోగులకు, ముక్తికాములకు ఈశ్వరా! నీకు జయము. దయాది సద్గుణభూషణా! నీకు జయము. అతిసూక్ష్మా! సూక్ష్మా! నీకు జయము. దుర్జ్ఞయా!, ఇంద్రియరూపా!, ఇంద్రియరహితా! జయము. స్వమాయా యోగస్థితా!, శేషశాయీ! అక్షరా! నీకు జయము జయము. ఏకదంష్ట్రాగ్రభాగాన వసుంధరను నిలిపిన ప్రభూ! నీకు జయము. నృకేసరీ! దేవశత్రు వక్షఃస్థల విదారణా! ప్రస్తుతం కపట వామనరూపం దాల్చిన విశ్వాత్మికా! నీకు జయము. స్వీయమాయా పరిచ్ఛిన్నా! జగద్ధాతా! జనార్దనా! అచింత్యా! అనేకస్వరూపాలలో వెలిగే ఏకైకతత్త్వమా! ప్రభూ! నీకు జయమగు గాక!. బహువిధప్రకృతివికృతులను పెంపొందించు వాడా! నీకు జయము. ఓ హరీ! నీవొక్కడవే జగతీశేషసంస్థితుడవు, జగదీశుడవగు నీవు ధర్మానికి మూలాధారుడవు. నిన్ను నేను గాని, ఈశానుడు గాని, ఇంద్రాది దేవతలు గాని, సనకాది మునులు, యోగులు గాని తెలియజాలరు. నీవు స్వీయమాయ అనే తెర మరుగున ఉంటావు. అట్టి నీవు ఎక్కడ ఉంటావో తెలియని మాయావతివైన నిన్నెరుగగలవారెవ్వరు?. నీ అనుగ్రహం గలవాడు మాత్రమే నిన్నెరుగగలడు. నిన్నారాధించి, నీ కృపకు పాత్రుడగువాడే నిన్ను గుర్తించగలడు. ఇతరులెవ్వరు నిన్ను గుర్తింపజాలరు. ఓ నందీశ్వరా! ఈశానా! ఈశ్వరా! భూతభావనా! వృద్ధి పొందుము. ఓ విశాలనేత్రా! విశ్వాత్మా! వామనా! విశ్వకళ్యాణార్థం నీవు వృద్ధి పొందుము. నీకు జయమగు గాక!.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

ఏవం స్తుతో హృషీకేశః స తదా వామనాకృతిః ।
ప్రహస్య భావగంభీరమువాచారూఢసంపదమ్ ॥32॥

స్తుతోఽహం భవతాపూర్వమింద్రాద్యైః కశ్యపేన చ ।
మయా చాస్య ప్రతిజ్ఞాతమింద్రస్య భువనత్రయమ్ ॥33॥

భూయశ్చాహం స్తుతోఽదిత్యా తస్యాశ్చాపి మయా శ్రుతమ్ ।
యథా శక్రాయ దాస్యామి త్రైలోక్యం హతకంటకమ్ ॥34॥

సోఽహం తథా కరిష్యామి యథేంద్రో జగతః పతిః ।
భవిష్యతి సహస్రాక్షః సత్యమేతద్బ్రవీమి వః ॥35॥

ఇట్లు స్తుతించిన బ్రహ్మస్తోత్రం విని, వామనాకృతి దాల్చిన హృషీకేశుడు చిరునవ్వు నవ్వి, భావగంభీరంగా ఇట్లు పలికాడు. "విరించీ! నీవు, ఇంద్రాది దేవతలు, కశ్యపుడు పూర్వం నన్ను స్తుతించగా ఇంద్రునకు ముల్లోకాధిపత్య మిస్తానని ప్రతిజ్ఞ చేశాను. తరువాత అదితి స్తోత్రం విని, శత్రువులను సంహరించి, శక్రునకు త్రిలోకాధిపత్యం ఇస్తానని అదితికి మాట ఇచ్చాను. ఇంద్రుణ్ణి జగత్తునకు అధిపతిని చేసి, ఆ మాట నిలబెట్టుకుంటాను. సహస్రాక్షుడు ముల్లోకాధిపతి కాగలడు. ఇది తథ్యము. నేను సత్యమే పలుకుతున్నాను" అని శ్రీహరి పలికాడు.

తతః కృష్ణాజినం బ్రహ్మా హృషీకేశాయ దత్తవాన్ ।
యజ్ఞోపవీతం భగవాన్దదౌ తస్య బృహస్పతిః ॥36॥

ఆషాఢమదదాద్దండం మరీచిర్బ్రహ్మణః సుతః ।
కమండలుం వసిష్ఠస్య కుశాంశ్చీరమథాంగిరాః ।
ఆసనం చైవ పులహః పులస్త్యః పీతవాససీ ॥37॥

ఉపతస్థుశ్చ తం వేదాః ప్రణవోచ్చారభూషణాః ।
శాస్త్రాణ్యశేషాణి తథా సాంఖ్యయోగోక్తయస్తథా ॥38॥

స వామనో జటీ దండీ ఛత్రీ ధృతకమండలుః ।
సర్వవేదమయో దేవో బలేరధ్వరమభ్యగాత్ ॥39॥

అంతట వామనుడైన వటువునకు బ్రహ్మ కృష్ణాజినాన్ని, బృహస్పతి యజ్ఞోపవీతాన్ని ఇచ్చారు. బ్రహ్మ కుమారుడైన మరీచి ఆషాఢదండాన్ని (పాలాశదండాన్ని), వసిష్ఠుడు కమండలాన్ని, అంగిరసుడు పట్టుపుట్టాలను ఇచ్చారు. పులహుడు ఆసనాన్ని, పులస్త్యుడు పీతాంబరాలను ఇచ్చారు. ఓంకారం చేత, స్వరాల చేత అలంకరింపబడిన సకలవేదాలు, శాస్త్రాలు, సాంఖ్యయోగవిద్యలు వామనుని ఆశ్రయించాయి. జటలు, దండం, కమండలం, ఛత్రం, ధరించి సర్వవేదమయుడైన ఆ వామనుడు బలిచక్రవర్తి చేస్తున్న యజ్ఞవాటికకు ప్రయాణమయ్యాడు.

యత్ర యత్ర పదం విప్రా భూభాగే వామనో దదౌ ।
దదాతి భూమిర్వివరం తత్ర తత్రాభిపీడితా ॥40॥

స వామనో జడగతిర్మృదు గచ్ఛన్సపర్వతామ్ ।
సాద్రిద్వీపవనాం సర్వాం చాలయామాస మేదినీమ్ ॥41॥

బృహస్పతిస్తు శనకైర్మార్గం దర్శయతే శుభమ్ ।
తథా క్రీడా వినోదార్థే గతిర్జగతి సాఽభవత్ ॥42॥

తతః శేషో మహానాగో నిఃసృత్యాసౌ రసాతలాత్ ।
సాహాయ్యం కల్పయామాస దేవదేవస్య చక్రిణః ॥43॥

తదస్యాపి చ విఖ్యాతం మహావిపులముత్తమమ్ ।
తస్య సందర్శనాదేవ నాగేభ్యో న భయం భవేత్ ॥44॥

ఆ వామనుడు తన చిట్టిఅడుగులుంచిన స్థలమంతా భూమి పీడితురాలై, వివరం (రంధ్రం) చేసింది. ఆ విధంగా మెల్లగా అడుగులు వేస్తూ వామనుడు నడువగా సముద్ర, పర్వత ద్వీపాదులతో కూడిన భూమండలమంతా కంపింపసాగింది. బృహస్పతి మెల్లమెల్లగా శివంకరమైన చక్కని మార్గము చూపిస్తూ ఉండగా ఆ కుహనా వటువు ఆటలలోవలే సరదాగా అతిమందగమనంతో పయనించాడు. అంతట పాతాళంనుండి మహానాగుడైన శేషుడు బయలుదేరి వచ్చి దేవదేవుడైన వామనునికి తోడైనాడు. ఆ ఉత్తమమైన శేషబిలం ఈనాటికీ ప్రసిద్ధి వహించియున్నది. దానిని దర్శించినవారికి సర్పభయం ఉండదు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే వామనావతరణం, బ్రహ్మకృత వామనస్తుతిర్నామ త్రింశోఽధ్యాయః ॥30॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి వామనుడవతరించుట, బ్రహ్మగావించినవామనస్తుతి అనే ముప్పైయవ అధ్యాయం సమాప్తం.



ఏకత్రింశోఽధ్యాయః - ముప్పైఒకటవ అధ్యాయం

వామనబలిచరితమ్ - వామనబలిచరిత్ర

లోమహర్షణ ఉవాచ - లోమహర్షణుడు పలికాడు.

సపర్వతవనాముర్వీం దృష్ట్వా సంక్షుభితాం బలిః ।
పప్రచ్ఛోశనసం శుక్రం ప్రణిపత్య కృతాంజలిః ॥1॥

ఆచార్య క్షోభమాయాతి సాబ్ధిభూభృద్వనా మహీ ।
కస్మాచ్చ నాసురాన్ భాగాన్ ప్రతిగృహ్ణంతి వహ్నయః ॥2॥

ఇతి పృష్టోఽథ బలినా కావ్యో వేదవిదాం వరః ।
ఉవాచ దైత్యాధిపతిం చిరం ధ్యాత్వా మహామతిః ॥3॥

సమస్తపర్వతవనాలతో కూడిన భూమి ఆ విధంగా కంపించడం చూసి తన గురువు శుక్రాచార్యులకు ప్రణమిల్లి బలి ఇలా అడిగాడు. ఆచార్యదేవా! సముద్రపర్వతాదులతో సహా ఈ భూమి కదలాడుతోంది. అసురులిచ్చు హవిస్సులను అగ్నులు తిరస్కరిస్తున్నాయి. ఈ ఘోరానికి కారణం ఏమిటి?. బలి అడిగిన ప్రశ్నలకు వేదవిదాంవరుడైన శుక్రాచార్యుడు చాలాసేపు ఆలోచించి ఆ దైత్యపతితో ఇలా పలికాడు.

అవతీర్ణో జగద్యోనిః కశ్యపస్య గృహే హరిః ।
వామనేనేహ రూపేణ పరమాత్మా సనాతనః ॥4॥

స నూనం యజ్ఞమాయాతి తవ దానవపుంగవ ।
యస్య పాదప్రతిక్షేపాదియం ప్రచలితా మహీ ॥5॥

కంపంతే గిరయశ్చైవ సంక్షుబ్ధా మకరాలయాః ।
నైనం భూతపతిం భూమిః సమర్థా వోఢుమీశ్వరమ్ ॥6॥

సదేవాసురగంధర్వయక్షరాక్షసపన్నగా ।
అనేనైవ ధృతా భూమిరాపోఽగ్నిః పవనో నభః ।
ధారయత్యఖిలాన్దేవాన్మనుష్యాంశ్చ మహాసురాన్ ॥7॥

ఇయమస్య జగద్ధాతుర్మాయా కృష్ణస్య దుస్త్యజా ।
ధార్యధారకభావేన యథా సంపీడితం జగత్ ॥8॥

తత్సన్నిధానాదధునా భాగహారాః సురోత్తమాః ।
భుంజతే నాసురాన్భాగానపి వై తే త్రయోఽగ్నయః ॥9॥

జగత్కారణుడైన శ్రీహరి కశ్యపుని ఇంట అవతరించాడు. వామనరూపుడుగా సనాతనుడైన పరమాత్మ నీ యజ్ఞవాటికకు వస్తున్నాడు. ఓ దానవశ్రేష్ఠా! ఆయన అడుగుల బరువుకు భూమి కంపిస్తోంది. కొండలు

కంపిస్తున్నాయి. సముద్రాలు అల్లకల్లోలమవుతున్నాయి. ఈ భూతేశ్వరుని భారం భూమి మోయలేకున్నది. దేవాసురగంధర్వయక్ష పన్నగమానవాదులతో కూడిన పృథ్వి, జలం, అగ్ని, వాయువు, ఆకాశమనే పంచభూతాత్మకమైన విశ్వాన్నంతటిని ఆయన ధరించియున్నాడు. అట్టి సర్వాధారుడైన విష్ణుని అనిర్వచనీయమైన మాయ వలన ధార్యధారకసంబంధం ఏర్పడి జగత్తు పీడింపబడుతోంది. ఆయన సన్నిధానప్రభావం వల్ల సురద్వేషులైన రాక్షసులు యజ్ఞార్హతను కోల్పోయారు. అందుచేతనే అగ్నులు వారు అర్పించే హవిస్సులను స్వీకరించడంలేదు.

శుక్రస్య వచనం శ్రుత్వా హృష్టరోమాఽబ్రవీద్బలిః ।
ధన్యోఽహం కృతపుణ్యశ్చ యతో యజ్ఞపతిః స్వయమ్ ॥ 10॥

యజ్ఞమభ్యాగతో బ్రహ్మన్ మత్తః కోఽన్యోఽధికః పుమాన్ ।
యం యోగినః సదోద్యుక్తాః పరమాత్మానమవ్యయమ్ ॥11॥

ద్రష్టుమిచ్ఛంతి దేవోఽసౌ మమాధ్వరముపైష్యతి ।
యన్మయాఽఽచార్య కర్తవ్యం తన్మమాదేష్టుమర్హసి ॥12॥

శుక్రాచార్యుని మాటలను వినినంతనే ఆనందంతో రోమాంచితుడైన బలి "ఆచార్యదేవా! నేను ధన్యుడను, నేను పుణ్యాత్ముడను, ఎందుచేతననగా యజ్ఞపతియైన ఆ పరమాత్ముడే స్వయంగా నా యజ్ఞవాటికకు వస్తున్నాడు. నాకంటే అధికుడెవ్వడు? యోగిజనులు ఎంతో శ్రమించి అవ్యయుడైన ఏ పరమాత్మను దర్శించాలని కోరుకుంటారో అట్టి దేవదేవుడు స్వయంగా నా యజ్ఞానికి వస్తున్నాడు. గురుదేవా! ఈ సమయంలో నా కర్తవ్యమేమిటో దయతో నన్ను ఆదేశించండి".

శుక్ర ఉవాచ – శుక్రాచార్యుడు పలికాడు.

యజ్ఞభాగభుజో దేవా వేదప్రామాణ్యతోఽసుర ।
త్వయా తు దానవా దైత్య యజ్ఞభాగభుజః కృతాః ॥13॥

అయం చ దేవః సత్త్వస్థః కరోతి స్థితిపాలనమ్ ।
విసృష్టం చ తథైవాన్తే స్వయమత్తి ప్రజాః ప్రభుః ॥14॥

త్వయా తు వంచితా దేవా నూనం విష్ణుః స్థితౌ స్థితః ।
విదిత్వైతన్మహారాజ కురు యత్తే మనోగతమ్ ॥15॥

త్వయా చ దైత్యాధిపతే స్వల్పకేఽపి హి వస్తుని ।
ప్రతిజ్ఞా నైవ వోఢవ్యా వాచ్యం సామ తథా ఫలమ్ ॥16॥

కృతకృత్యస్య దేవస్య దేవార్థం చాపి కుర్వతః ।
నాలం దాతుమహం దేవ త్వయా వాచ్యం తు యాచతః ।

కృష్ణస్య దేవభూత్యర్థం ప్రవృత్తస్య మహాసుర ॥17॥

దైత్యరాజా! వేదాలననుసరించి సత్త్వగుణసంపన్నులైన దేవతలకే యజ్ఞభాగం ఏర్పడింది. కాని నీవు నీ శక్తి, సామర్థ్యాల వల్ల దానిని దానవులకు, దైత్యులకు కూడా సాధించిపెట్టావు. సత్త్వస్వరూపుడైన పరమాత్మ సృష్టి పాలన చేస్తూనే చివర్లో తాను సృష్టించిన ప్రజలనందరిని తానే భక్షిస్తూంటాడు. స్థితిపాలకుడైన విష్ణువు నిన్ను తప్పక వంచిస్తాడు. ఈ సత్యాన్ని తెలుసుకొని, ఈ అభీష్టానుసారం చెయ్యి. ఓ దైత్యాధిపా! నీవు ఎట్టి పరిస్థితులలోను కూడా ఆయనకు ఏ చిన్న వస్తువు కూడా ఇస్తానని ప్రతిజ్ఞ చేయవద్దు. ఆయనతో మధురంగా ప్రయోజనశూన్యంగా మాట్లాడి ఆయనను పంపివేయుము. కృతకృత్యుడైన కృష్ణుడు దేవకార్యం సాధించడానికి నిన్ను యాచిస్తే ఓ మహాసురా! దానిని ఈయవద్దు. చాలినంత ధనమిస్తానని మాత్రం చెప్పుము.

బలిరువాచ – బలిచక్రవర్తి పలికాడు.

బ్రహ్మన్ కథమహం బ్రూయామన్యేనాపి హి యాచితః ।
నాస్తీతి కిము దేవేశం సంసారాఘౌఘహారిణమ్ ॥18॥

భగవన్! ఇతరుడైన యాచకుడు వచ్చి, దేహి (ఇమ్ము!) అని యాచిస్తే వానికే లేదని చెప్పలేను. అట్టితరి సంసారపాపాలు పోగొట్టే దేవదేవుడే అడిగితే లేదని ఎలా చెప్పగలను?.

వ్రతోపవాసైర్వివిధైర్యః ప్రభుర్గృహ్యతే హరిః ।
స చేద్వక్ష్యతి దేహీతి గోవిందః కిమతోఽధికమ్ ॥19॥

ఎన్నియో ఉపవాసాలు, వ్రతాలు చేస్తే గాని లభింపని ప్రభువైన గోవిందుడు స్వయంగా వచ్చి యాచించడం కంటే మించిన భాగ్యం ఏముంటుంది?

యత్ప్రీతికరణాయైవ పుంభిః శౌచగుణాన్వితైః ।
యజ్ఞాః క్రియంతే దేవశ్చ స మాం దేహీతి వక్ష్యతి ॥20॥

శమదమాది సద్గుణసంపన్నులైనవారు. ఏయజ్ఞేశ్వరుని ప్రీతికై యజ్ఞకార్యాలన్నీచేస్తూ ఉంటారో అట్టి దేవదేవుడు నన్ను యాచిస్తున్నాడు కదా!.

తత్సాధు సుకృతం కర్మ తపః సుచరితం చ నః ।
యన్మయా దత్తమీశశ్చ స్వయమాదాస్యతే హరిః ॥21॥

అది చాలు కదా! మనమెంతటి పుణ్యం సత్కర్మలు, తపస్సు, సదాచరణ చేసిన వారమో తెలుస్తోంది కదా! నేనిచ్చిన దానం ఈశ్వరుడైన హరి స్వయంగా గ్రహిస్తున్నాడు కదా!.

నాస్తీత్యహం గురో వక్ష్యే కథమాగతమీశ్వరమ్ ।
ప్రాణత్యాగం కరిష్యామి న నాస్తీతి న మే క్వచిత్ ॥22॥

అట్టి విశ్వేశ్వరుడే స్వయంగా యాచించినపుడు లేదని ఎలా చెప్పగలను?. ప్రాణత్యాగం చేస్తాను గాని లేదని మాత్రం నేనెప్పుడూ చెప్పను.

తదేతద్వాంఛితం ప్రాప్తం నూనం చాత్ర న సంశయః ।
యజ్ఞేఽస్మిన్యది యజ్ఞేశో యాచతే మాం జనార్దన ॥23॥

ఈ యజ్ఞంలో యజ్ఞేశ్వరుడైన జనార్దనుడు నన్ను యాచిస్తే ఆయన కోరిక తప్పనిసరిగా తీరుస్తాను. ఇందులో సందేహం లేదు.

నిజమూర్ధానమప్యస్మై దాస్యామ్యేవావిచారితమ్ ।
స మే వక్ష్యతి దేహీతి గోవిందః కిమతోఽధికమ్ ॥24॥

గోవిందుడు "దేహీ" యని యాచిస్తే నా తలనైనా ఆలోచించకుండా ఆయనకు ఇస్తాను. ఇంతకంటే గొప్ప పనేముంది?

నాస్తీతి యన్మయా నోక్తమన్యేషామపి యాచితమ్ ।
వక్ష్యామి కథమాయాతే తస్మిన్నభ్యాగతేఽచ్యుతే ॥25॥

ఇంతవరకు ఇతర యాచకులెవ్వరు వచ్చి యాచించినా నేను "లేదు" అని అనలేదు. అటువంటి నేను ఈనాడు అచ్యుతుడే అభ్యాగతుడుగా వచ్చినప్పుడు లేదని ఎలా చెప్పగలను?.

శ్లాఘ్య ఏవ హి ధీరాణాం దానాచ్చాపత్సమాగమః ।
న బాధాకారి యద్దానం తదంగ బలవత్స్మృతమ్ ॥26॥

తనకు బాధ కలిగించని దానం ఎంతో ప్రశంసింపదగినదని పెద్దలవాక్యం. ధీరులైనవారికి దానం వలన ఆపద సంభవించినా అది శ్లాఘ్యమే అవుతుంది.

మద్రాజ్యే నాసుఖీ కశ్చిన్నదరిద్రో న చాతురః ।
నాభూషితో న చోద్విగ్నో న ప్రసాదవివర్జితః ॥27॥

నా రాజ్యంలో సుఖి కాని వాడు ఒక్కడునూ లేదు. దరిద్రుడు గాని, ఆతురుడు గాని లేదు. అలంకారాలచే అలంకరింపబడనివాడు గాని, ఉద్విగ్నుడైనవాడు గాని, దయావిహీనుడు గాని, ఒక్కడు కూడా లేదు.

హృష్టస్తుష్టః సుగంధీ చ తృప్తః సర్వగుణాన్వితః ।
జనః సర్వో మహాభాగ కిముతాహం సదా సుఖీ ॥28॥

అందరూ సంతుష్టులు, సుఖులు, తృప్తులు, సకలసద్గుణశోభితులు. ఓ మహాభాగా! అందరికంటే నేనెల్లప్పుడూ సుఖంగా ఉంటున్నాను.

ఏతద్విశిష్టమత్రాప్తం దానబీజఫలం మయా ।
విదితం మునిశార్దూల యథైతత్త్వన్ముఖాచ్ఛ్రుతమ్ ॥29॥

ఇదంతా దానమనే విత్తు యొక్క ఫలమే గదా! మునిశ్రేష్ఠా! ఈ విషయం తమరే చెప్పారు గదా!

ఏతద్బీజవరం దానబీజం పతతి చేద్గురో ।
జనార్దనే మహాపాత్రే కిం న ప్రాప్తం తతో మయా ॥30॥

ఓ గురూత్తమా! ఈ శ్రేష్ఠమైన దానమనే విత్తు జనార్దనుడనే మహాపాత్రలో పడితే ఇంక నేను పొందవలసింది ఏమున్నది?

విశిష్టం మమ తద్దానం పరితుష్టాశ్చ దేవతాః ।
ఉపభోగాచ్ఛతగుణం దానం సుఖకరం స్మృతమ్ ॥31॥

నా దానం స్వీకరించినందులకు దేవతలు పరితుష్టులైనచో నా దానం విశిష్టమైన దానమౌతుంది. తాను అనుభవించడంకంటే దానం చేయడం శతగుణితమైన సుఖాన్ని ప్రసాదిస్తుందని చెప్పబడుతోంది.

మత్ప్రసాదపరో నూనం యజ్ఞేనారాధితో హరిః ।
తేనాభ్యేతి న సందేహో దర్శనాదుపకారకృత్ ॥32॥

యజ్ఞారాధితుడైన శ్రీహరి నన్ను తప్పక అనుగ్రహిస్తాడు. ఆయన తప్పక వస్తాడు. నాకు దర్శనమిచ్చి, నాకు శుభాన్ని కలగజేస్తాడు. ఇందులో సందేహంలేదు.

అథ కోపేన చాభ్యేతి దేవభాగోపరోధినమ్ ।
మాం నిహంతుం తతో హి స్యాద్వధః శ్లాఘ్యతమోఽచ్యుతాత్ ॥33॥

దేవతలకు యజ్ఞభాగం నిరోధించిన కారణంగా కోపంతో నన్ను వధించడానికి వచ్చినప్పటికి ఆ అచ్యుతుని చేత వధింపబడడం కూడా నాకు ప్రశంసనీయమే కాగలదు.

సమాహన్తుం హృషీకేశః కథం వై సముపేష్యతి ॥34॥

అయినా హృషీకేశుడు నన్ను చంపడానికి ఎందుకు వస్తాడు?

ఏతత్ జ్ఞాత్వా మునిశ్రేష్ఠ దానవిఘ్నపరేణ న ।
త్వయా భావ్యం జగన్నాథే గోవిందే సముపస్థితే ॥35॥

మునిశ్రేష్ఠా! ఇవన్నీ సాకల్యంగా ఆలోచించి తెలుసుకున్నదేమంటే జగన్నాథుడు, గోవిందుడు యాచించినచో మీరు దానానికి విఘ్నం కలిగించకండి.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

ఇత్యేవం వదతస్తస్య యజ్ఞవాటముపాగతః ।
సహైవామరవృందైః స బృహస్పతిపురస్సరైః ॥36॥

బలిచక్రవర్తి ఇలా పలుకుచుండగనే జనార్దనుడు సకలదేవతాబృందంతో బృహస్పతి పురస్సరంగా అచ్చటకు వచ్చి చేరాడు.

బలిః పునరువాచేదం శుక్రం నిజపురోహితమ్ ।
మాం చ యాచితుమభ్యేతి యతో గేహాగతో హరిః ॥37॥

తన గురువైన శుక్రాచార్యునితో బలి మరలా ఇలా పలికాడు. శ్రీహరి నన్ను యాచించడానికి నా గృహానికి వచ్చాడు.

స యథాఽఽత్మేచ్ఛయా సర్వచేతఃసాక్షీ జనార్దనః ।
సర్వదేవమయోఽచింత్యో మాయావామనరూపధృత్ ॥38॥

సకలజీవసాక్షీభూతుడు, సర్వదేవమయుడు, అచింత్యుడునగు జనార్దనుడు తన ఇచ్ఛానుసారం కపట వామనరూపంలో ఇచ్చటకు వచ్చియున్నాడు.

తం దృష్ట్వా యజ్ఞవాటం తు ప్రవిష్టమసురాః ప్రభుమ్ ।
జగ్ముః ప్రభావతః క్షోభం తేజసా తస్య నిష్ప్రభాః ॥39॥

ఆ విధంగా విచ్చేసిన తేజోమయుని చూడగానే యజ్ఞశాలలోనున్న దైత్యులందరు సంక్షోభంతో తమ తేజస్సు కోల్పోయారు.

వేపుశ్చ మునయస్తత్ర యే సమేతా మహాధ్వరే ।
వసిష్ఠో గాధిజో గర్గస్తథాఽన్యే మునిసత్తమాః ॥40॥

బలిశ్చైవాఖిలం జన్మ మేనే సఫలమాత్మనః ।
తతః సంక్షోభమాపన్నో న కశ్చిత్కించిదుక్తవాన్ ॥41॥

యజ్ఞదీక్షలోనున్న మునులు, వసిష్ఠ, విశ్వామిత్ర, గర్గాది మహర్షులు, బలిచక్రవర్తి, మున్నగువారందరు తమ జన్మలు సార్థకమైనాయని తలంచారు. సంభ్రమాశ్చర్యాలలో మునిగి వారెవ్వరు ఏమీ మాట్లాడలేకపోయారు.

ప్రత్యేకం దేవదేవేశం పూజయామాస తేజసా ।
అథాసురపతిం ప్రహ్వం దృష్ట్వా మునివరాంశ్చ తాన్ ॥42॥

అంతట అసురపతియైన బలి మునివరులందర్నీ, దేవదేవేశుడైన జనార్దనుని ప్రత్యేకంగా పూజించాడు.

దేవదేవపతిః సాక్షాద్విష్ణుర్వామనరూపధృక్ ।
తుష్టావ యజ్ఞం వహ్నిం చ యజమానమథర్త్విజః ।
యజ్ఞకర్మాధికారస్థాన్ సదస్యాన్ద్రవ్యసంపదః ॥43॥

సదస్యాః పాత్రమఖిలం వామనం ప్రతి తత్ క్షణాత్ ।
యజ్ఞవాటస్థితా విప్రాః సాధుసాధ్వితి్యుదీరయన్ ॥44॥

వామనరూపధారియైన దేవాధిదేవుడు, విష్ణువు వినయంతో వంగినమస్కరించిన బలిని, మునులను, ఆ యజ్ఞాన్ని, అగ్నులను, యజమానిని, ఋత్విజులను, యజ్ఞకర్మాధికారులను, సదస్యులను, ద్రవ్యసంపదను బహువిధాల ప్రశంసించాడు. సర్వోత్తమాధికారియైన వామనదేవుని చూసి సదస్యులందరు సాధువాక్యాలు పలికారు.

స చార్ఘ్యమాదాయ బలిః ప్రోద్భూతపులకస్తథా ।
పూజయామాస గోవిందం ప్రాహ చేదం మహాసురః ॥45॥

ఆనందంతో దేహమంతా పులకించగా బలిచక్రవర్తి అర్ఘ్యపాద్యాదులతో గోవిందుని అర్చించి, గోవిందునితో ఇలా పలికాడు.

బలిరువాచ – బలిచక్రవర్తి పలికాడు.

సువర్ణరత్నసంఘాతాన్ గజాశ్వసమితిస్తథా ।
స్త్రియో వస్త్రాణ్యలంకారాన్గావః కుప్యం చ పుష్కలమ్ ॥46॥

సర్వం చ సకలాం పృథ్వీం భవతో వా యదీప్సితమ్ ।
తద్దదామి శృణు శ్రేష్ఠ మమార్థాః సంతి తే ప్రియాః ॥47॥

వటూత్తమా! నాకు కలిగిన సంపదలలో నీకేది ఇష్టమో దానిని కోరుకో. తప్పక ఇస్తాను. బంగారం, రత్నరాసులు, గజాశ్వసమూహాలు, సుందరాంగనలు, దివ్యవస్త్రాభరణాదులు, ఆలమందలు, గ్రామాలు, సర్వంసహా భూమండలం. ఇందులో నీకేమి కావాలో కోరుకో.

ఇత్యుక్తో దైత్యపతినా ప్రీతిగర్భమిదం వచః ।
ప్రాహ సస్మితగంభీరం భగవాన్వామనాకృతిః ॥48॥

దైత్యపతి ఇట్లు అత్యంతప్రేమాతిశయంతో పలికిన మాటలు విని, చిరునవ్వు నవ్వుతూ, గంభీరమైన స్వరంతో వామనాకృతినొందిన భగవానుడిలా పలికాడు.

మమాగ్నిశరణార్థాయ దేహి రాజన్పదత్రయమ్ ।
సువర్ణగ్రామరత్నాది తదర్థిభ్యః ప్రదీయతామ్ ॥49॥

ఓ రాజా! నా పవిత్రాగ్నులను రక్షించుకోవడానికి మూడడుగుల నేలనిమ్ము. సువర్ణగ్రామరత్నాదులను వాటిని కోరుకున్నవారికిమ్ము.

బలిరువాచ – బలిచక్రవర్తి పలికాడు.

త్రిభిః ప్రయోజనం కిం తే పదైః పదవతాం వర ।
శతం శతసహస్రం వా పదానాం మార్గతాం భవాన్ ॥50॥

పదవీధారులలో శ్రేష్ఠుడా! మూడడుగుల నేలతో నీకేమి ప్రయోజనం కలుగుతుంది? మీరు నూరు అడుగులు గాని, వేయి అడుగులు గాని నేలను అడగండి.

శ్రీవామన ఉవాచ – వామనుడు పలికాడు.

ఏతైః పదైః దైత్యపతే కృతకృత్యోఽస్మి మార్గణే ।
అన్యేషామర్థినాం విత్తమిచ్ఛయా దాస్యతే భవాన్ ॥51॥

ఓ రాక్షసేశ్వరా! ఈ మాత్రం అడుగుల నేల నాకు చాలును. ఇతర యాచకులకు నీ విత్తమునంతటిని దానమిమ్ము.

ఏతచ్ఛ్రుత్వా తు గదితం వామనస్య మహాత్మనః ।
దదౌ తస్మై మహాబాహుర్వామనాయ పదత్రయమ్ ॥52॥

మహాత్ముడైన వామనుని పలుకులు విని మహాబాహువైన బలిచక్రవర్తి వామనునకు మూడడుగుల నేలను దానమిచ్చాడు.

పాణౌ తు పతితే తోయే వామనోఽభూదవామనః ।
సర్వదేవమయం రూపం దర్శయామాస తత్క్షణాత్ ॥53॥

దానజలం చేతిలో పడగానే వామనుడు అవామనుడయ్యాడు. తత్క్షణమే సర్వదేవమయమైన తన విరాడ్రూపాన్ని చూపించాడు.

చంద్రసూర్యౌ తు నయనే ద్యౌః శిరశ్చరణౌ క్షితిః ।
పాదాంగుల్యః పిశాచాస్తు హస్తాంగుల్యశ్చ గుహ్యకాః ॥54॥

విశ్వేదేవాశ్చ జానుస్థా జంఘే సాధ్యాః సురోత్తమాః ।
యక్షా నఖేషు సంభూతా లేఖాశ్చాప్సరసస్తథా ॥55॥

దృష్టిర్ఋక్షాణ్యశేషాణి కేశాః సూర్యాంశవః ప్రభోః ।
తారకా రోమకూపాణి రోమేషు చ మహర్షయః ॥56॥

బాహవో విదిశస్తస్య దిశః శ్రోత్రే మహాత్మనః ।
అశ్వినౌ శ్రవణే తస్య నాసా వాయుర్మహాబలః ॥57॥

ప్రసాదే చంద్రమా దేవో మనో ధర్మః సమాశ్రితః ।
సత్యమస్యాభవద్వాణీ జిహ్వా దేవీ సరస్వతీ ॥58॥

గ్రీవాఽదితిర్దేవమాతా విద్యాస్తద్వలయస్తథా ।
సర్వద్వారమభూన్మైత్రం త్వష్టా పూషా చ వై భ్రువౌ ॥59॥

ముఖే వైశ్వానరశ్చాస్య వృషణౌ తు ప్రజాపతిః ।
హృదయం చ పరం బ్రహ్మ పుంస్త్వం వై కశ్యపో మునిః ॥60॥

పృష్ఠేఽస్య వసవో దేవా మరుతః సర్వసంధిషు ।
వక్షఃస్థలే తథా రుద్రా ధైర్యం చాస్య మహార్ణవాః ॥61॥

ఉదరే చాస్య గంధర్వా మరుతశ్చ మహాబలాః ।
లక్ష్మీర్మేధా ధృతిః కాంతిః సర్వవిద్యాశ్చ వై కటిః ॥62॥

సర్వజ్యోతిరసౌ దేవస్తపశ్చ పరమం మహత్ ।
తస్య దేవాధిదేవస్య తేజః ప్రోద్భూతముత్తమమ్ ॥63॥

తనౌ కుక్షిషు వేదాశ్చ జానునీ చ మహామఖాః ।
ఇష్టయః పశవశ్చాస్య ద్విజానాం చేష్టితాని చ ॥64॥

ఆ విరాడ్రూపుని నేత్రాలు సూర్యచంద్రులు. శిరస్సు ద్యులోకం. చరణాలు భూమి. కాలివ్రేళ్ళు పిశాచాలు. చేతి వ్రేళ్ళు యక్షులు. మోకాళ్లు విశ్వేదేవులు. పిక్కలు సాధ్యులు. గోళ్ళు యక్షులు. రేఖలు అప్సరోగణం. చూపులు నక్షత్రాలు. కేశాలు సూర్యకిరణాలు. రోమకూపాలు తారకలు. రోమాలలో మహర్షులు ఉన్నారు. ఆయన బాహువులు విదిశలు. రెండు చెవులు దిశలు. శ్రవణేంద్రియాలు అశ్వినీదేవతలు. నాసిక వాయువు. ఆ మహాత్ముని ప్రసాదగుణం చంద్రుడు. మనస్సు ధర్మదేవత. ఆయన వాక్కు సత్యము. జిహ్వ సరస్వతి. కంఠం దేవమాత అదితి. కంఠమండలి త్రివళులు వేదత్రయం (త్రయీవిద్య). గుదం స్వర్గద్వారం. కనుబొమ్మలు త్వష్టపూషలు. నోరు వైశ్వానరాగ్ని. వృషణాలు ప్రజాపతులు. హృదయం పరబ్రహ్మ. పుంస్త్వం కశ్యపుడు. వీపు వసువులు. సర్వసంధులు మరుత్తులు. వక్షోభాగం రుద్రుడు. ధృతి (సహనశక్తి) మహాసముద్రాలు. ఉదరంలో గంధర్వులు. మేధ లక్ష్మీదేవి. ధృతి కాంతి సకలవిద్యలు కటిప్రదేశం. ఆ మహాప్రభువుయొక్క తేజస్సు సకలమైన గ్రహనక్షత్రాది జ్యోతిర్గణంగా వెలుగుతోంది. నిగమాలన్నీ ఆయన శరీరంలో కుక్షిలోనున్నాయి. మహాయజ్ఞాలు, ఇష్టులు, గోబ్రాహ్మణకర్మలు మోకాళ్ళలో నిలిచాయి.

తస్య దేవమయం రూపం దృష్ట్వా విష్ణోర్మహాబలాః ।
నోపసర్పంతి తే దైత్యాః పతంగా ఇవ పావకమ్ ॥65॥

చిక్షురస్తు మహాదైత్యః పాదాంగుష్ఠం గృహీతవాన్ ।
దంతాభ్యాం తస్య వై గ్రీవామంగుష్ఠేనాహనద్ధరిః ॥66॥

ప్రమథ్య సర్వానసురాన్పాదహస్తతలైర్విభుః ।
కృత్వా రూపం మహాకాయం సంజహారాశు మేదినీమ్ ॥67॥

మహాత్ముడగు శ్రీమహావిష్ణువు యొక్క సర్వదేవాత్మకమైన ఆ విశ్వరూపాన్ని చూసి రాక్షసులందరు అగ్నిజ్వాలలో పడే శలభాల వలె ఆయన మీదకు లంఘించారు. మహాదైత్యుడైన చిక్షురుడు ఆయన కాలి బొటనవ్రేలును దంతాలతో పట్టుకొనగా ఆ దైత్యుని కంఠాన్ని కొనగోటితో శ్రీహరి త్రుంచాడు. ఆ విధంగా రాక్షసులనందరిని తన అరచేతులతో, అరికాళ్ళతో అణగద్రొక్కి, త్రివిక్రమరూపంతో భూమండలమంతటా విజృంభించాడు.

తస్య విక్రమతో భూమిం చంద్రాదిత్యౌ స్తనాంతరే ।
నభో విక్రమమాణస్య సక్థిదేశే స్థితావుభౌ ॥68॥

పరం విక్రమమాణస్య జానుమూలే ప్రభాకరౌ ।
విష్ణోరాస్తాం స్థితస్యైతౌ దేవపాలనకర్మణి ॥69॥

జిత్వా లోకత్రయం కృత్స్నం హత్వా చాసురపుంగవాన్ ।
పురందరాయ త్రైలోక్యం దదౌ విష్ణురురుక్రమః ॥70॥

ఆ విధంగా త్రివిక్రమరూపంలో భూమిని ఆక్రమించినప్పుడు సూర్యచంద్రులు ఆయన స్తనాల మధ్య నిలిచారు. ఆకాశాన్ని ఆక్రమించినప్పుడు పిరుదుల వద్దకు దిగారు. ఇంకా పై భాగాన్ని ఆక్రమించగా సూర్యచంద్రులు మోకాళ్ళ వద్దకు చేరారు. ఈ విధంగా దేవకార్యం సాధించడానికి శ్రీమహావిష్ణువు విరాడ్రూపం ధరించాడు. అట్లు విరాడ్రూపాన్ని ధరించిన విష్ణువు రాక్షసవీరులనందరిని సంహరించి, లోకత్రయాన్ని జయించి, త్రైలోక్యాన్ని పురందరునకిచ్చాడు.

సుతలం నామ పాతాలమధస్తాద్వసుధాతలాత్ ।
బలేర్దత్తం భగవతా విష్ణునా ప్రభవిష్ణునా ॥71॥

భగవంతుడు, ప్రభవిష్ణువునైన శ్రీమహావిష్ణువు భూమికి క్రిందనున్న సుతలమనే పాతాళలోకాన్ని బలిచక్రవర్తికి ప్రదానం చేశాడు.

అథ దైత్యేశ్వరం ప్రాహ విష్ణుః సర్వేశ్వరేశ్వరః ।
యత్త్వయా సలిలం దత్తం గృహీతం పాణినా మయా ॥72॥

కల్ప ప్రమాణం తస్మాత్తే భవిష్యత్యాయురుత్తమమ్ ।
వైవస్వతే తథాఽతీతే కాలే మన్వంతరే తథా ॥73॥

సావర్ణికే తు సంప్రాప్తే భవానింద్రో భవిష్యతి ।
ఇదానీం భువనం దత్తం సర్వం శక్రాయ వై తవ ॥74॥

చతుర్యుగవ్యవస్థా చ సాఽధికా త్వేకసప్తతిః ।
నియంతవ్యా మయా సర్వే యే తస్య పరిపంథినః ॥75॥

తేనాహం పరయా భక్త్యా పూర్వమారాధితో బలే ।
సుతలం నామ పాతాలం సమాదాయ వచో మమ ॥76॥

వసాసుర మమాదేశం యథావత్పరిపాలయన్ ।
తత్ర దేవాసురోపేతే ప్రాసాదశతసంకులే ॥77॥

ప్రోత్ఫుల్లపంకజసరోద్రుమశుద్ధసరిద్వరే ।
సుగంధీరూపసంపన్నో హేమాభరణభూషితః ॥78॥

స్రక్చందనాది దిగ్ధాంగో నృత్యగీతమనోహరాన్ ।
ఉపభుంక్ష్వ మహాభోగాన్ విపులాన్ దానవేశ్వర ॥79॥

మమాజ్ఞయా బలే తత్ర తిష్ఠ స్త్రీశతసంవృతః ।
యావత్సురైశ్చ విప్రైశ్చ విరోధం న కరిష్యసి ॥80॥

తావత్త్వం భుంక్ష్వ సంభోగాన్ సర్వకామసమన్వితాన్ ।
యదా సురైశ్చ విప్రైశ్చ విరోధం త్వం కరిష్యసి ।
బంధకృచ్చ తదా పాశో దారుణో ఘోరదర్శనః ॥81॥

అంతట దైత్యపతితో విష్ణువు ఇలా పలికాడు. "ఓ బలిరాజా! నీవిచ్చిన దానజలాన్ని నా చేతితో గ్రహించాను. ఆ కారణం చేత నీకు ఉత్తమమైన కల్పాయుర్దాయం చేకూరింది. ప్రస్తుతం జరుగుచున్న వైవస్వతమన్వంతరం గడచిన తరువాత రాబోవు సావర్ణికమన్వంతరంలో నీవు ఇంద్రపదవిని పొందగలవు. ఇప్పుడు నీ యొక్క సమస్తభువనాలు ఇంద్రునకీయబడుతున్నాయి. ఈ లోపల సంభవించే డెబ్బదియొక్క చతుర్యుగచక్రాల లోపల ఇంద్రుని ఎదురించు శత్రువులందరు నా చేత దండింపబడతారు. ఓ బలిచక్రవర్తీ! ఎందుకనగా అతడు పూర్వం నన్ను ఎంతో భక్తితో ఆరాధించాడు. నీవు నా ఆదేశానుసారం సుతలలోకానికి వెళ్ళి, అక్కడ నివసించు. అక్కడ నీకు వందలకొలది ఉత్తుంగ సౌధాలు, కమలాకరాలు, ఉపవనాలు, చీనిచీనాంబరాలు, రత్నాభరణాదులు, స్రక్చందనాది సకలసౌఖ్యాలు సమకూరగలవు. అచ్చట మనోహరమైన నృత్యగీతాది వినోదాలు, మహాభోగాలు, అనేకం నీకు లభిస్తాయి. ఓ బలిరాజా! అక్కడ నీవు నా ఆజ్ఞానుసారం శతాధికసుందరీమణులతో విహరించగలవు. దేవబ్రాహ్మణ విరోధంతో ప్రవర్తించనంతకాలము నీవచ్చట నివసింపగలవు. అక్కడ నీవు అంతకాలం వరకు సమస్తభోగాలను అనుభవిస్తూ, సమస్తమైన కోరికలు తీర్చుకోగలవు. నీవు ఎప్పుడు దేవతలతోను, బ్రాహ్మణులతోను విరోధం పెట్టుకుంటావో అప్పుడు నిన్ను భయంకరమైన వరుణపాశాలు బంధింపగలవు.

బలిరువాచ – బలిచక్రవర్తి పలికాడు.

తత్రాశనం మే పాతాలే భగవన్ భవదాజ్ఞయా ।
కిం భవిష్యత్యుపాదానముపభోగోపపాదకమ్ ।
ఆప్యాయితోఽతో దేవేశ స్మరేయం త్వామహం సదా ॥82॥

ఓ పూజ్యుడా! మీ ఆదేశానుసారం పాతాళలోకంలో ఉన్నంతకాలం అచట నాకు తగిన ఆహారమేమి? ఉపభోగ పదార్థములేవి? అక్కడ నాకు ఏమి లభింపగలవు? ఓ దేవేశా! నీచేత పాలింపబడిన నేను ఎల్లప్పుడూ నిన్ను స్మరిస్తాను.

భగవాన్ ఉవాచ – భగవానుడు పలికాడు.

దానాన్యవిధిదత్తాని శ్రాద్ధాన్యశ్రోత్రియాణి చ ।
హుతాన్యశ్రద్ధయా యాని తాని దాస్యంతి తే ఫలమ్ ॥83॥

అదక్షిణాస్తథా యజ్ఞాః క్రియాశ్చావిధినా కృతాః ।
ఫలాని తవ దాస్యంతి అధీతాన్యవ్రతాని చ ॥84॥

ఉదకేన వినా పూజా వినా దర్భేణ యాః క్రియాః ।
ఆజ్యేన చ వినా హోమః ఫలం దాస్యంతి తే బలే ॥85॥

ఓ బలిరాజా! అవిధిపూర్వకంగా చేసిన దానాలు, అవైదికంగా చేసిన శ్రాద్ధకర్మలు, శ్రద్ధ లేకుండా చేసిన హోమాలు, అట్టి వాటి ఫలం నీవు పొందగలవు. దక్షిణ ఇవ్వకుండా చేసిన యజ్ఞాలు, విధివిహితం కాని కర్మలు, బ్రహ్మచర్యదీక్ష లేకుండా గావించిన వేదాధ్యయనాలు, వాటిఫలాలు నీకు ఈయబడతాయి. ఉదకం లేకుండా చేసే పూజలు, దర్భలు లేకుండా జరిపే క్రియలు, నేయి లేని హోమాలు, వాటి ఫలం నీకు ఇవ్వబడుతుంది.

యశ్చేదం స్థానమాశ్రిత్య క్రియాః కాశ్చిత్కరిష్యతి ।
న తత్ర చాసురో భాగో భవిష్యతి కదాచన ॥86॥

ఈ ప్రదేశంలో చేయబడిన ఎటువంటి కర్మలలోను అసురులకు భాగాలు ఎప్పుడూ ఉండవు.

జ్యేష్ఠాశ్రమే మహాపుణ్యే తథా విష్ణుపదే హ్రదే ।
యే చ శ్రాద్ధాని కుర్వంతి వ్రతం నియమమేవ చ ॥87॥

క్రియా కృతా చ యా కాచిద్విధినా చ మహాత్మనా ।
సర్వం తదక్షయం తస్య భవిష్యతి న సంశయః ॥88॥

పరమపావనమైన జ్యేష్ఠాశ్రమంలో, విష్ణుపదసరోవరంలో, నియమపూర్వకంగా ఏ యే శ్రాద్ధకర్మలు ఆచరింపబడునో విధివిధానంగా గాని, అవిధిపూర్వకంగా గాని చేయబడు సమస్తకర్మలకు అక్షయఫలప్రాప్తి కలుగుతుంది. ఇందులో సందేహంలేదు.

జ్యేష్ఠమాసే సితే పక్షే ఏకాదశ్యాముపోషితః ॥89॥

ద్వాదశ్యాం వామనం దృష్ట్వా స్నాత్వా విష్ణుపదే తథా ।
దత్త్వా దానం యథాశక్తి ప్రాప్నోతి పరమం పదమ్ ॥90॥

జ్యేష్ఠశుద్ధ ఏకాదశినాడు ఉపవసించి, ద్వాదశినాడు వామనదర్శనం చేసుకుని విష్ణుపదసరోవరంలో స్నానమాచరించి, యథాశక్తి దానం చేస్తే పరమపదం లభిస్తుంది.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

బలయేఽముం వరం దత్త్వా శక్రాయాపి త్రివిష్టపమ్ ।
వ్యాపినా తేన రూపేణ జగామాదర్శనం హరిః ॥91॥

శ్రీహరి ఈ విధంగా బలిచక్రవర్తికి వరాన్ని, ఇంద్రునకు స్వర్గరాజ్యాన్ని యిచ్చి తన విశ్వరూపంతో అంతర్ధానమయ్యాడు.

శశాస చ యథాపూర్వమింద్రస్త్రైలోక్యపూజితః ।
అవసచ్చ యథా స్థానం బలిః పాతాళమాశ్రితః ॥92॥

ఇంద్రుడు పూర్వం వలె ముల్లోకాలను పాలించాడు. గడువు పూర్తయ్యేవరకు బలిచక్రవర్తి పాతాళలోకంలో ఉండిపోయాడు.

ఇత్యేతత్కథితం తస్య విష్ణోర్మాహాత్మ్యముత్తమమ్ ।
శృణుయాద్యో వామనస్య సర్వపాపైః ప్రముచ్యతే ॥93॥

ఇట్టి వామనరూపియైన శ్రీమహావిష్ణువు మాహాత్మ్యగాథ వినిన వారి సమస్తపాపములు తొలగిపోతాయి.

బలిప్రహ్లాదసంవాదం మంత్రితం బలిశుక్రయోః ।
బలేర్విష్ణోశ్చ కథితం యే స్మరిష్యంతి మానవాః ॥94॥

నాధయో వ్యాధయస్తేషాం న చ మోహాకులం మనః ।
భవిష్యతి ద్విజశ్రేష్ఠాః పాపం తస్య కదాచన ॥95॥


చ్యుతరాజ్యో నిజం రాజ్యమిష్టప్రాప్తిం వియోగవాన్ ।
సమాప్నోతి మహాభాగా నరః శ్రుత్వా కథామిమామ్ ॥96॥

బ్రాహ్మణో వేదమాప్నోతి జయతి క్షత్రియో మహీమ్ ।
వైశ్యో ధనసమృద్ధిం చ శూద్రః సుఖమవాప్నుయాత్ ।
వామనస్య చ మాహాత్మ్యం శృణ్వన్ పాపైః ప్రముచ్యతే ॥97॥

బలిప్రహ్లాదుల సంవాదం, బలిశుక్రాచార్యుల మంత్రాలోచన, బలివామనదేవుల చరిత్ర స్మరించిన మానవులకు ఎటువంటి ఆధులు, వ్యాధులు, మోహాలు కలుగవు. అట్టివాడికి ఎప్పటికి ఎటువంటి పాపమంటదు. అధికారం, నిజరాజ్యం కోల్పోయినవారికి అధికారప్రాప్తి, తిరిగి తమ రాజ్యప్రాప్తి కలుగుతుంది. వియోగిజనులకు ఇష్టజనసమాగమం ఈ కథాశ్రవణం చేయు మానవులకు లభిస్తుంది. బ్రాహ్మణులకు వేదవిద్య, క్షత్రియులకు భూవిజయం, వైశ్యులకు ధనసమృద్ధి, శూద్రులకు సుఖప్రాప్తి కలిగి శ్రీ వామదేవుని మాహాత్మ్యశ్రవణం వలన సమస్తపాపాలు నశిస్తాయి.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే వామనబలిచరితం నామైకత్రింశోఽధ్యాయః ॥31॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి వామనబలిచరితమనే ముప్పైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వాత్రింశోऽధ్యాయః - ముప్పైరెండవ అధ్యాయం

సరస్వతీస్తోత్రమ్ - సరస్వతీస్తోత్రం

ఋషయ ఊచుః - ఋషులు పలికారు.

కథమేషా సముత్పన్నా నదీనాముత్తమా నదీ ।
సరస్వతీ మహాభాగా కురుక్షేత్రప్రయాయినీ ॥1॥

కథం చ సర ఆసాద్య కృత్వా తీర్థాని పార్శ్వతః ।
ప్రయాతా పశ్చిమామాశాం దృశ్యాదృశ్యగతిః శుభా ।
ఏతద్విస్తరతో బ్రూహి తీర్థం బ్రహ్మవిదాం వర ॥2॥

కురుక్షేత్రం గుండా ప్రవహించే నదులలోకెల్లా ఉత్తమమైన సరస్వతీనది ఎలా పుట్టింది? సరోవరంలో జేరి తన తీరంపై అనేక తీర్థాలు నెలకొల్పి, దృశ్యాదృశ్య గమనంతో ఈ పవిత్రనది పశ్చిమాభిముఖంగా ఎలా ప్రవహించింది. ఓ బ్రహ్మవిదాంవరా! అతిప్రాచీనమైన తీర్థముల వంశక్రమమంతా మాకు వివరంగా తెలియజేయుము.

లోమహర్షణ ఉవాచ - లోమహర్షణుడు పలికాడు.

ప్లక్షవృక్షాత్సముద్భూతా సరిచ్ఛ్రేష్ఠా సనాతనీ ।
సర్వపాపక్షయకరీ స్మరణాదపి నిత్యశః ॥3॥

సైషా శైలసహస్రాణి విదార్య చ మహానదీ ।
ప్రవిష్టా పుణ్యతోయైషా వనం ద్వైతమితి శ్రుతమ్ ॥4॥

తస్మిన్ ప్లక్షే స్థితాం దృష్ట్వా మార్కండేయో మహామునిః ।
ప్రణిపత్య తదా మూర్ధ్నా తుష్టావాథ సరస్వతీమ్ ॥5॥

ప్లక్షవృక్షం (జువ్విచెట్టు) నుండి సముద్భవమైనది, అతిప్రాచీనమైనది, ఉత్తమమైనది, స్మరణమాత్రం చేతనే ప్రతినిత్యం సర్వపాపాలు పోగొట్టునది సరస్వతీనది. వేల పర్వతాలను చీల్చుకుంటూ ఆ మహానది తన పుణ్యజలాలతో ద్వైతవనానికి చేరింది. ప్లక్షవృక్షంలో నుండగా ఆమెను దర్శించిన మార్కండేయమహాముని శిరసా ప్రణామం చేసి, ఆ దేవిని ఇలా స్తోత్రం చేశాడు.

త్వం దేవి సర్వలోకానాం మాతా దేవారణిః శుభా ।
సదసద్దేవి యత్కించిన్మోక్షబోధాయ యత్పలమ్ ॥6॥

యథా జలం సాగరే హి తథా తత్త్వయి సంస్థితమ్ ।
అక్షరం పరమం బ్రహ్మ విశ్వం చైతత్ క్షరాత్మకమ్ ॥7॥

దారుణ్యవస్థితో వహ్నిర్భూమౌ గంధో యథా ధ్రువమ్ ।
తథా త్వయి స్థితం బ్రహ్మ జగచ్చేదమశేషతః ॥8॥

"దేవీ! నీవు సర్వలోకజననివి. మంగళమూర్తివైన దేవమాతవు. సదసద్రూపమైనదంతయు మోక్షదాయి అయినది. అర్థవంతమైన పదమేదైతే కలదో అదంతయు యోనిలో నిహితమైనట్లు సర్వం నీలో గర్భితమై యున్నది. అక్షరమైన పరబ్రహ్మతత్త్వము, క్షరాత్మకమైన విశ్వమంతయు పరాశక్తివగు నీలో ఇమిడియున్నది. దారువులో అగ్ని వలె, భూమిలో గంధగుణం వలె అనంతమైన జగత్తు, బ్రహ్మతత్త్వము నీలో నిండియున్నది.

ఓంకారాక్షరసంస్థానం యత్ర దేవి స్థిరాస్థిరమ్ ।
తత్ర మాత్రాత్రయం సర్వమస్తి యద్దేవి నాస్తి చ ॥9॥

త్రయో లోకాస్త్రయో వేదాస్త్రైవిద్యం పావకత్రయమ్ ।
త్రీణి జ్యోతీంషి వర్గాశ్చ త్రయో ధర్మాదయస్తథా ॥10॥

త్రయో గుణాస్త్రయో వర్ణాస్త్రయో దేవాస్తథా క్రమాత్ ।
త్రిధాతవస్తథావస్థాః పితరశ్చాణిమాదయః ॥11॥

ఏతన్మాత్రాత్రయం దేవి తవ రూపం సరస్వతీ ।
విభిన్నదర్శనా ఆద్యా బ్రహ్మణో హి సనాతనాః ॥12॥

ఓ దేవీ! స్థావరజంగమములన్నీ ప్రతిష్ఠితములై ఉన్నదీ, అ, ఇ, ఉ అనే మూడక్షరముల సంపుటీరూపమైనదీ అయిన ఓంకారంలో కనిపించీ కనిపించనిది అయిన సమస్తము ఉంటుంది. ఆ ఓంకారం నీ రూపమే. మూడు లోకాలు, మూడు వేదాలు, మూడు విద్యలు, త్రేతాగ్నులు, జ్యోతిత్రయం, త్రివర్గాలు, ధర్మాదిత్రయం, త్రిగుణాలు, త్రివర్ణాలు, త్రిమూర్తులు, మూడు ధాతువులు, అవస్థాత్రయం, పితరులు, మాత్రాత్రయం మొదలుగా గల త్రిపుటి అంతయు ఓ సరస్వతీదేవీ! నీ రూపమే. పరతత్త్వం యొక్క విభిన్నదర్శనాలన్నీ సనాతనివగు నీ లీలలే.

సోమసంస్థా హవిఃసంస్థాః పాకసంస్థాః సనాతనాః ।
తాస్త్వదుచ్చారణాద్దేవి క్రియంతే బ్రహ్మవాదిభిః ॥13॥

ఓ దేవీ! బ్రహ్మవాదులు నిన్ను ఉచ్చరించినంతమాత్రం చేతనే సోమసంస్థలు, హవిఃసంస్థలు, పాకయజ్ఞాలు చేయగలుగుతున్నారు.

అనిర్దేశ్యం తథా చాన్యదర్ధమాత్రాశ్రితం పరమ్ ।
అవికార్య క్షయం దివ్యం పరిణామవివర్జితమ్ ॥14॥

ఓ దేవీ! అర్ధమాత్రాపరిమితమైన నీ పరమపదము అటువంటిదని నిర్దేశింపరాకున్నది. అది అవికారి. అక్షయమైనది. దివ్యమైనది. సర్వపరిణామరహితమైనది.

తథైతత్పరమం రూపం యన్న శక్యం మయోదితుమ్ ।
న చాస్యేన తథా జిహ్వా తాల్వోష్ఠాదిభిరుచ్యతే ॥15॥

ఓ దేవీ! అట్టి నీ దివ్యరూపాన్ని నేనే కాదు ఇతరులెవ్వరును కూడా వర్ణింపజాలరు. నోటికి గాని, నాలుకకు గాని, తాలువులకు(దవడలు) గాని, పెదవులకుగాని దానిని వర్ణింపగల శక్తి లేదు.

స విష్ణుః స శివో బ్రహ్మ చంద్రార్కజ్యోతిరేవ చ ।
విశ్వావాసం విశ్వరూపం విశ్వాత్మానం మహేశ్వరమ్ ॥16॥

సాంఖ్యసిద్ధాంతవేదోక్తం బహుశాఖాస్థిరీకృతమ్ ।
అనాదిమధ్యనిధనం సదసచ్చ సదైవ తు ॥17॥

ఆ నీ రూపమే విష్ణువు, శివుడు, బ్రహ్మ, సూర్యచంద్రాగ్నులు, విశ్వావాసము, విశ్వరూపం, విశ్వాత్మ, సాంఖ్యం, బహుశాఖావిస్తృతమైన వేదప్రతిపాదితమైనదియు, ఆదిమధ్యాంతహీనమనియు, సత్తని, అసత్తనియు చెప్పబడినదియు నీ రూపమే.

ఏకం త్వనేకధాఽప్యేకం భావభేదసమాశ్రితమ్ ।
అనాఖ్యం షడ్గుణాఖ్యం చ బహ్వాఖ్యం త్రిగుణాశ్రయమ్ ॥18॥

ఒకటియై కూడా అనేకము, ఒకే భావాన్ని ఆశ్రయించియున్నదీ, పేరు లేనిదీ యైనా ఆరు విధాల, అనేక విధాల పేర్కొనబడినది. త్రిగుణాలతో కూడినది నీవే.

నానాశక్తివిభావజ్ఞం నానాశక్తివిభావకమ్ ।
సుఖాత్సౌఖ్యం మహాసౌఖ్యం రూపం తత్త్వగుణాత్మకమ్ ॥19॥

నానాశక్తుల తత్త్వం తెలిసినది, నానాశక్తుల సంపుటియైనది, సుఖాలన్నిటికీ సుఖమైనది, సర్వతత్త్వ గుణాత్మకమైన మహాసుఖమే నీ రూపము.

ఏవం దేవి త్వయా వ్యాప్తం నిష్కలం సకలం జగత్ ।
అద్వైతావస్థితం బ్రహ్మ యచ్చ ద్వైతే వ్యవస్థితమ్ ॥20॥

ఓ భగవతీ! సగుణనిర్గుణాత్మకమైన ఈ విశ్వమునంతటిని ఇటువంటి అద్భుతరూపంతో ఆవరించి యున్నావు. అద్వయబ్రహ్మగా, ద్వైతబ్రహ్మగా నీవే వ్యవహరింపబడుతున్నావు.

యేఽర్థా నిత్యా యే వినశ్యంతి చాన్యే యేఽర్థాః స్థూలా యే తథా సంతి సూక్ష్మాః ।
యే వా భూమౌ యేఽంతరిక్షేఽన్యతో వా తేషాం దేవి త్వత్త ఏవోపలబ్ధిః ॥21॥

ఈ భూమిమీదగాని, అంతరిక్షంలోగాని, ఇతరత్రాగాని యున్నట్టి శాశ్వత, అశాశ్వత, స్థూల, సూక్ష్మాది వస్తుజాలమంతటికి ఆధారము నీవే.

యద్వా మూర్తం యదమూర్తం సమస్తం యద్వా భూతేష్వేకమేకం చ కించిత్ ।
యచ్చ ద్వైతే వ్యస్తభూతం చ లక్ష్యం తత్సంబద్ధం త్వత్స్వరైర్వ్యంజనైశ్చ ॥22॥

ఓ దేవీ! రూపు కట్టినట్టియు, కంటికి కనబడనట్టియు, ఒకటిగాను, అనేకంగాను, వ్యస్తంగాను, సమస్తంగాను కనిపించునట్టియు, ఈ అఖిలము నీవగు స్వరవ్యంజనాల సమాహారమే. నీ మనోహరవిన్యాసమే.

ఏవం స్తుతా తదా దేవీ విష్ణోర్జిహ్వా సరస్వతీ ।
ప్రత్యువాచ మహాత్మానం మార్కండేయం మహామునిమ్ ।
యత్ర త్వం నేష్యసే విప్ర తత్ర యాస్యామ్యతంద్రితా ॥23॥

తనను ఈ విధంగా స్తుతించిన మహాత్ముడగు మార్కండేయమహామునితో విష్ణుజిహ్వాయైన ఆ సరస్వతీదేవి ఇలా పలికింది. "విప్రోత్తమా! నీవెచ్చటికి కొనిపోదువో అచ్చటికి నీ వెంట అవిశ్రాంతంగా వస్తాను. నడువుము"

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు పలికాడు.

ఆద్యం బ్రహ్మసరం పుణ్యం తతో రామహ్రదం స్మృతమ్ ।
కురుణా ఋషిణా కృష్టం కురుక్షేత్రం తతః స్మృతమ్ ।
తస్య మధ్యేన వై యాహి పుణ్యాపుణ్యా జలావహా ॥24॥

"ఓ తల్లీ! మొదట బ్రహ్మసరోవరంగా, అనంతరం రామసరస్సుగా, తదనంతరం మహర్షి కురువుచేత దున్నబడి, కురుక్షేత్రంగా విఖ్యాతి గాంచిన పవిత్రక్షేత్రం మధ్యలోని ఈ పావనజలాలతో త్వరితంగా ప్రవహింపుము" అని మార్కండేయుడు పలికాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే సరస్వతీస్తోత్రం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥32॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి సరస్వతీ స్తోత్రమనే ముప్పైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రయస్త్రింశోऽధ్యాయః - ముప్పైమూడవ అధ్యాయం
కురుక్షేత్రమాహాత్మ్యమ్ - కురుక్షేత్రమాహాత్మ్యం

లోమహర్షణ ఉవాచ - లోమహర్షణుడు పలికాడు.

ఇతి ఋషేర్వచనం శ్రుత్వా మార్కండేయస్య ధీమతః ।
నదీప్రవాహసంయుక్తా కురుక్షేత్రం వివేశ హ ॥1॥

తత్ర సా రంతుకం ప్రాప్య పుణ్యతోయా సరస్వతీ ।
కురుక్షేత్రం సమాప్లావ్య ప్రయాతా పశ్చిమాం దిశమ్ ॥2॥

తత్ర తీర్థసహస్రాణి ఋషిభిః సేవితాని చ ।
తాన్యహం కీర్తయిష్యామి ప్రసాదాత్పరమేష్ఠినః ॥3॥

బుద్ధిమంతుడైన మార్కండేయమహర్షి మాట విని, సరస్వతి ప్రవాహరూపంతో కురుక్షేత్రంలో ప్రవేశించింది. తరువాత రంతుకం చేరి, కురుక్షేత్రాన్ని తడుపుతూ పశ్చిమదిశగా పయనించింది. అక్కడ మహర్షులచేత సేవింపబడిన వేయి తీర్థాలున్నాయి. పరమేష్ఠికృపవలన వాటిని వర్ణిస్తాను వినండి.

తీర్థానాం స్మరణం పుణ్యం దర్శనం పాపనాశనమ్ ।
స్నానం పుణ్యకరం ప్రోక్తమపి దుష్కృతకర్మణః ॥4॥

యే స్మరిష్యంతి తీర్థానాం దేవతాః ప్రీణయంతి చ ।
స్నాంతి చ శ్రద్దధానాశ్చ తే యాంతి పరమాం గతిమ్ ॥5॥

పవిత్రతీర్థాలను స్మరిస్తే పుణ్యం కలుగుతుంది. తీర్థాలను దర్శిస్తే పాపక్షయమౌతుంది. స్నానం చేస్తే పరమదుశ్చేష్టితులకు కూడా ముక్తి కలుగుతుంది. ఎవరు తీర్థాలను స్మరిస్తారో దేవతాప్రీతికరమైన కార్యాలు చేస్తారో, స్నానాలు చేస్తారో, వాటిపట్ల శ్రద్ధ కలిగియుంటారో వారంతా ఉత్తమగతులు పొందుతారు.

అపవిత్రః పవిత్రో వా సర్వావస్థాం గతోऽపి వా ।
యః స్మరేత్ కురుక్షేత్రం స బాహ్యాభ్యంతరః శుచిః ॥6॥

అపవిత్రుడైనా, పవిత్రుడైనా ఎట్టిస్థితిలోనున్నా కురుక్షేత్రాన్ని స్మరించినంతనే మానవునకు బాహ్యాభ్యంతర శుచిత్వం కలుగుతుంది.

కురుక్షేత్రం గమిష్యామి కురుక్షేత్రే వసామ్యహమ్ ।
అప్యేతాం వాచముత్సృజ్య సర్వపాపైః ప్రముచ్యతే ॥7॥

'నేను కురుక్షేత్రం వెళతాను, కురుక్షేత్రంలో నివసిస్తాను' అని నోట పలికినంతమాత్రం చేతనే సమస్తపాపాలు తొలగిపోతాయి.

బ్రహ్మజ్ఞానం గయాశ్రాద్ధం గోగ్రహే మరణం ధ్రువమ్ ।
వాసః పుంసాం కురుక్షేత్రే ముక్తిరుక్తా చతుర్విధా ॥8॥

బ్రహ్మజ్ఞానం, గయాశ్రాద్ధం, గోగ్రహంలో మరణం, కురుక్షేత్రంలో నివాసం ఈ నాల్గు విధానాల వల్ల మానవులకు ముక్తి కలుగుతుందని చెప్పబడింది.

సరస్వతీదృషద్వత్యోర్ద్వయోర్నద్యోర్యదంతరమ్ ।
తం దేవనిర్మితం దేశం బ్రహ్మావర్తం ప్రచక్షతే ॥9॥

సరస్వతీ, దృషద్వతీ అను ఈ రెండు దేవనదుల మధ్య గల భూమి దేవనిర్మితమైనది. దానిని బ్రహ్మావర్తమంటారు.

దూరస్థోఽపి కురుక్షేత్రం గమిష్యామి వసామ్యహమ్ ।
ఏవం యః సతతం బ్రూయాత్సోఽపి పాపైః ప్రముచ్యతే ॥10॥

చాలా దూరంలో ఉన్నప్పటికీ కూడా 'నేను కురుక్షేత్రం వెడతాను. అక్కడ నివసిస్తాను' అని నిరంతరం పలికినవాని సర్వపాపాలు తొలగిపోతాయి.

తత్రైవ చ వసన్ధీరః సరస్వత్యాస్తటే స్థితః ।
తస్య జ్ఞానం బ్రహ్మమయం భవిష్యతి న సంశయః ॥11॥

కురుక్షేత్రంలో నివసిస్తూ, సరస్సులో స్నానం చేస్తూ, సరస్వతీతీరాన ఉండేవారికి బ్రహ్మజ్ఞానం కలుగుతుంది అనడంలో సందేహం లేదు.

దేవతా ఋషయస్సిద్ధాః సేవంతే కురుజాంగలమ్ ।
తస్య సంసేవనాన్నిత్యం బ్రహ్మ చాత్మని పశ్యతి ॥12॥

దేవతలు, ఋషులు, సిద్ధులు కురుజాంగలాన్ని సదా సేవిస్తారు. ఆ కారణం చేత వారు బ్రహ్మను తమలో చూడగలుగుతున్నారు.

చంచలం హి మనుష్యత్వం ప్రాప్య యే మోక్షకాంక్షిణః ।
వసంతి నియతాత్మానో యేఽపి దుష్కృతకారిణః ॥13॥

చంచలమైనట్టియు, క్షణభంగురమైనట్టియు, మానవజీవితమును పొంది, మోక్షకాంక్షులైనవారు జితేంద్రియులై, ఈ క్షేత్రాన్ని సేవిస్తారు.

తే విముక్తాశ్చ కలుషైరనేకజన్మసంభవైః ।
పశ్యంతి నిర్మలం దేవం హృదయస్థం సనాతనమ్ ॥14॥

ఎంతటి దురాచారులైనను, అనేకజన్మార్జితములైన పాపాలనుండి విముక్తులై, తమ హృదయాలలోనున్న సనాతనుడైన పవిత్రబ్రహ్మతత్త్వాన్ని చూడగలుగుతారు.

బ్రహ్మవేదిః కురుక్షేత్రం పుణ్యం సన్నిహితం సరః ।
సేవమానా నరా నిత్యం ప్రాప్నువంతి పరం పదమ్ ॥15॥

నిత్యము బ్రహ్మవేదియైన కురుక్షేత్రాన్ని సన్నిహితసరోవరాన్ని భజించే మానవుడు పరమపదప్రాప్తి పొందుతాడు.

గ్రహనక్షత్రతారాణాం కాలేన పతనాద్భయమ్ ।
కురుక్షేత్రమృతానాం చ పతనం నైవ విద్యతే ॥16॥

గ్రహ నక్షత్ర తారకలకైనా కాలం తీరిన తరువాత పతనం పొందుతామనే భయముండవచ్చును గాని కురుక్షేత్రంలో మరణించినవారికి అటువంటి భయముండదు.

యత్ర బ్రహ్మాదయో దేవా ఋషయః సిద్ధచారణాః ।
గంధర్వాశ్చాప్సరో యక్షాః సేవంతే స్థానకాంక్షిణః ॥17॥

బ్రహ్మాది దేవతలు, ఋషులు, సిద్ధులు, యక్షులు, గంధర్వులు, అప్సర్సలు మున్నగువారు తమ తమ పదవులను నిలబెట్టుకొనుటకు కురుక్షేత్రాన్ని సేవిస్తారు.

గత్వా తు శ్రద్ధయా యుక్తః స్నాత్వా స్థాణుమహాహ్రదే ।
మనసా చింతితం కామం లభతే నాత్రసంశయః ॥18॥

అక్కడకు వెళ్ళి శ్రద్ధతో స్థాణుసరోవరంలో స్నానం చేస్తే మనస్సులోని కామ్యాలన్నీ లభిస్తాయి. ఇందులో సందేహం లేదు.

నియమం చ నరః కృత్వా సరః కృత్వా ప్రదక్షిణమ్ ।
రంతుకం చ సమాసాద్య క్షామయిత్వా పునః పునః ॥19॥

సరస్వత్యాం నరః స్నాత్వా యక్షం దృష్ట్వా ప్రణమ్య చ ।
పుష్పం ధూపం చ నైవేద్యం దత్త్వా వాచముదీరయేత్ ॥20॥

తవ ప్రసాదాత్ యక్షేంద్ర వనాని సరితస్తథా ।
భ్రమిష్యామి చ తీర్థాని హ్యవిఘ్నం కురు మే సదా ॥21॥

వ్రతనిష్ఠతో ఆ సరోవరానికి ప్రదక్షిణం చేసి, రంతుకానికి వెళ్ళి, మరలా మరలా క్షమాయాచన చేస్తూ, సరస్వతీనదిలో స్నానం చేసి, యక్షుని దర్శించి, నమస్కరించి, ధూపదీపపుష్పనైవేద్యాదులతో పూజించి, ఇలా ప్రార్థించాలి. "ఓ యక్షేంద్రా! నీఅనుగ్రహం వలన నేను తలబెట్టిన ఈ తీర్థ, వన, సరోవరాల పర్యటన నిర్విఘ్నంగా నెరవేరు గాక!" అని ప్రార్థించాలి.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే కురుక్షేత్రమాహాత్మ్యం నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥33॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి కురుక్షేత్రమాహాత్మ్యమనే ముప్పైమూడవ అధ్యాయం సమాప్తం.

చతుస్త్రింశోఽధ్యాయః – ముప్పైనాల్గవ అధ్యాయం

సప్తవనాది వర్ణనం, తీర్థస్నానఫలకథనం చ – సప్తవనాలు, నవనదులు మున్నగు వర్ణన, తీర్థస్నానఫలకథనం

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

వనాని సప్త నో బ్రూహి నవనద్యశ్చ కాః స్మృతాః ।
తీర్థాని చ సమగ్రాణి తీర్థస్నానఫలం తథా ॥1॥

యేన యేన విధానేన యస్య తీర్థస్య యత్ఫలమ్ ।
తత్సర్వం విస్తరేణేహ బ్రూహి పౌరాణికోత్తమ ॥2॥

పౌరాణికోత్తమా! సప్తవనాలు, నవనదులు, తీర్థాలు, తీర్థస్నానఫలం, ఏయే తీర్థాలను ఏయే విధంగా సేవిస్తే ఏయే ఫలాలు కలుగుతాయో వివరంగా మాకు తెలియజేయండి.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

శృణు సప్తవనానీహ కురుక్షేత్రస్య మధ్యతః ।
యేషాం నామాని పుణ్యాని సర్వపాపహరాణి చ ॥3॥

కామ్యకం చ వనం పుణ్యం తథాఽదితివనం మహత్ ।
వ్యాసస్య చ వనం పుణ్యం ఫలకీవనమేవ చ ॥4॥

తథా సూర్యవనం స్థానం తథా మధువనం మహత్ ।
పుణ్యశీతవనం నామ సర్వకల్మషనాశనమ్ ॥5॥

ఓ ఋషులారా! కురుక్షేత్రమధ్యభూమిలో ఏడు వనాలున్నాయి. వాటి పేర్లు చాలా పవిత్రమైనవి. అవి సర్వపాపాలను హరిస్తాయి. పవిత్రమైన కామ్యకవనం, అదితివనం, వ్యాసవనం, ఫలకీవనం, సూర్యవనం, మధువనం, శీతవనం ఇవన్నియు సమస్తకల్మషాలను హరిస్తాయి.

వనాన్యేతాని వై సప్త నదీః శృణుత మే ద్విజాః ।
సరస్వతీ నదీ పుణ్యా తథా వైతరణీ నదీ ॥6॥

ఆపగా చ మహాపుణ్యా గంగా మందాకినీ నదీ ।
మధుస్రవా వాసునదీ కౌశికీ పాపనాశనీ ॥7॥

దృషద్వతీ మహాపుణ్యా తథా హిరణ్వతీ నదీ ।
వర్షాకాలవహాః సర్వా వర్జయిత్వా సరస్వతీమ్ ॥8॥

ఏతాసాముదకం పుణ్యం ప్రావృట్కాలే ప్రకీర్తితమ్ ।
రజస్వలాత్వమేతాసాం విద్యతే న కదాచన ।
తీర్థస్య చ ప్రభావేణ పుణ్యాహ్యేతాః సరిద్వరాః ॥9॥

ఇక నదుల వివరాలు వినండి. సరస్వతీనది, వైతరణీనది, ఆపగానది, గంగానది (మందాకినీ), మధుస్రవా, వాసునది, కౌశికీనది, దృషద్వతీనది, హిరణ్వతీనది ఈ తొమ్మిది నదులు పరమపవిత్రమైనవి. సకల పాపనాశకమైనవి. ఈ తొమ్మిది నదులలో సరస్వతీనది తప్ప తక్కినవన్నీ వర్షాకాలంలో ప్రవహించే నదులు. ఈ నదులలోని జలాలు పుణ్యప్రదమైనవి. వర్షాకాలంలోనే కాదు ఎప్పుడును వీటి ఉదకానికి రజస్వలదోషమంటదు. అవి పవిత్రమైన జలాలు. అందులకు కారణం అక్కడున్న పుణ్యతీర్థాలే.

శృణ్వంతు మునయః ప్రీతాస్తీర్థస్నానఫలం మహత్ ।
గమనం స్మరణం చైవ సర్వకల్మషనాశనమ్ ॥10॥

రంతుకం చ నరో దృష్ట్వా ద్వారపాలం మహాబలమ్ ।
యక్షం సమభివాద్యైవ తీర్థయాత్రాం సమారభేత్ ॥11॥

ఓ మహాఋషులారా! మీ యందలి ప్రేమతో ఇక మహిమాన్వితమైన తీర్థస్నానఫలం చెబుతాను వినండి. వానిని స్మరించినా, వాటిచెంతకు చేరినా సమస్తకల్మషాలు నశిస్తాయి. యాత్రికుడు మొట్టమొదట రంతుకానికి వెళ్లి మహాబలుడైన, ద్వారపాలుడైన యక్షునకు మ్రొక్కి తీర్థయాత్ర ప్రారంభించాలి.

తతో గచ్ఛేద్ధి విప్రేంద్రా నామ్నాఽదితివనం మహత్ ।
అదిత్యా యత్ర పుత్రార్థే కృతం ఘోరం మహత్తపః ॥12॥

తత్ర స్నాత్వా చ సంపూజ్య హ్యదితిం దేవమాతరమ్ ।
పుత్రం జనయతే శూరం సర్వదోషవివర్జితమ్ ।
ఆదిత్యశతసంకాశం విమానం చాధిరోహతి ॥13॥

ఓ బ్రాహ్మణోత్తములారా! అక్కడనుండి అదితివనానికి వెళ్ళాలి. అక్కడ దేవమాతయైన అదితి పుత్రార్థియై, కఠోరమైన తపస్సు గావించింది. వామనుని పుత్రునిగా పొందింది. కాబట్టి అదితివనంలో స్నానం చేసి, అదితిదర్శనం చేసినచో సర్వదోషరహితుడు, శూరుడు, వందమంది సూర్యుల కాంతితో వెలిగే విమానం మీద తిరుగునట్టి పుత్రుడు కలుగుతాడు.

తతో గచ్ఛేద్ధి విప్రేంద్రా విష్ణుస్థానమనుత్తమమ్ ।
సవనం నామ విఖ్యాతం యత్ర సంనిహితో హరిః ॥14॥

విమలే చ నరః స్నాత్వా దృష్ట్వా చ విమలేశ్వరమ్ ।
నిర్మలం స్వర్గమాయాతి రుద్రలోకం చ గచ్ఛతి॥15॥

హరిం చ బలదేవం చాప్యేకాదశ్యాం సమన్వితౌ ।
దృష్ట్వా దోషైర్విముచ్యేత కలికల్మషసంభవైః ॥16॥

ఓ ద్విజశ్రేష్ఠులారా! అదితివనంనుండి సవనమని ప్రఖ్యాతి చెందినట్టియు, ఉత్తమమైనట్టియు, విష్ణుస్థానానికి వెళ్ళాలి. అక్కడ అన్నివేళలా శ్రీహరి సన్నిహితుడై యుంటాడు. అక్కడనుండి విమలతీర్థానికి వెళ్ళి, అందు

స్నానమాచరించి, విమలేశ్వరుని దర్శించినచో నిర్మలమైన స్వర్గాన్ని పొందవచ్చును. అంతే గాక రుద్రలోకం కూడా పొందవచ్చు. శ్రీహరి, బలరాముడు ఒకేచోట ఆసీనులైయుండగా ఏకాదశినాడు దర్శించినచో కలిదోషాలు తొలగి ముక్తిని పొందవచ్చును.

తతః పారిప్లవం గచ్ఛేత్తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
తత్ర స్నాత్వా చ దృష్ట్వా చ బ్రహ్మాణం వేదసంయుతమ్ ॥17॥

బ్రహ్మయజ్ఞఫలం ప్రాప్య నిర్మలః స్వర్గమాప్నుయాత్ ।
తత్రాపి సంగమం రమ్యం కౌశిక్యాస్తీర్థసంభవమ్ ।
సంగమే చ నరః స్నాత్వా ప్రాప్నోతి పరమం పదమ్ ॥18॥

అక్కడినుండి ముల్లోకాలలో విఖ్యాతమైన పరిప్లవతీర్థానికి వెళ్లి, స్నానంచేసి, వేదాలతో సంబంధం కలిగిన బ్రహ్మదేవుని దర్శించాలి. దానివలన బ్రహ్మయజ్ఞఫలం పొంది, నిర్మలమైన స్వర్గాన్ని పొందుతాడు. అక్కడినుండి కౌశికీతీర్థం నుంచి పుట్టిన రమణీయసంగమస్థానంలోని జలాలలో స్నానం చేస్తే మానవులు పరమపదాన్ని పొందుతారు.

ధరణ్యాస్తీర్థమాసాద్య సర్వపాపవిమోచనమ్ ।
క్షాంతియుక్తో నరః స్నాత్వా ప్రాప్నోతి పరమం పదమ్ ॥19॥

ధరణ్యామపరాధాని కృతాని పురుషేణ వై ।
సర్వాణి క్షమతే తస్య స్నానమాత్రస్య దేహినః ॥20॥

అనంతరం పాపాలు పోగొట్టే ధరణీతీర్థంలో స్నానమాచరించిన మానవుడు క్షాంతిగలవాడై పరమపదం పొందుతాడు. ఆ తీర్థంలో స్నానం చేసినంతనే ధరణిమాత ప్రాణుల సర్వాపరాధాలను క్షమిస్తుంది.

తతో దక్షాశ్రమం గత్వా దృష్ట్వా దక్షేశ్వరం శివమ్ ।
అశ్వమేధస్య యజ్ఞస్య ఫలం ప్రాప్నోతి మానవః ॥21॥

అక్కడినుండి దక్షాశ్రమానికి వెళ్లి, దక్షేశ్వరుని దర్శించిన మానవులకు అశ్వమేధయజ్ఞఫలం కలుగుతుంది.

తతః శాలూకినం గచ్ఛేత్ స్నాత్వా తీర్థే ద్విజోత్తమః ।
హరిం హరేణ సంయుక్తం పూజయిత్వా తు భక్తితః ।
ప్రాప్నోత్యభిమతం లోకం సర్వపాపవివర్జితః ॥22॥

తరువాత శాలూకినీతీర్థంలో స్నానం చేసి, అక్కడ వెలసిన హరిహరులను భక్తితో పూజిస్తే పాపరహితులై, ఇష్టమైన లోకాలను పొందుతారు.

సర్పిర్దధి సమాసాద్య నాగానాం తీర్థముత్తమమ్ ।
తత్ర స్నానం నరః కృత్వా ముక్తో నాగభయాద్భవేత్ ॥23॥

అచ్చటినుండి సర్పిర్దధి అనే ప్రసిద్ధమైన నాగతీర్థంలో స్నానం చేస్తే సర్వవిషభయాలుండవు.

తతో గచ్ఛేచ్చ విప్రేంద్రా నరకోద్ధారరంతుకమ్ ।
తత్రాపి రజనీమేకాం స్నాత్వా తీర్థవరే శుభే ॥24॥

తత్ర ద్వితీయం సంపూజ్య ద్వారపాలం ప్రయత్నతః ।
బ్రాహ్మణాన్ భోజయిత్వా చ ప్రణిపత్య క్షమాపయేత్ ॥25॥

తవ ప్రసాదాద్యక్షేంద్ర ముక్తోఽహం సర్వకిల్బిషైః ।
సిద్ధిర్మయాభిలషితా సంసారే తాం లభామ్యహమ్ ॥26॥

ఏవం ప్రసాద్య యక్షేంద్రం తతః పంచనదం వ్రజేత్ ॥27॥

ఓ ద్విజశ్రేష్ఠులారా! అచ్చటినుండి నరకోద్ధారకుడైన రంతుకద్వారపాలుని వద్దకు వెళ్లి, ఒకరాత్రి అక్కడ గడిపి, ఆ పవిత్రతీర్థంలో స్నానమాచరించి, ప్రయత్నపూర్వకంగా అక్కడనున్న రెండవ ద్వారపాలుని కూడా పూజించాలి. అనంతరం బ్రాహ్మణులను భుజింపజేసి, ద్వారపాలునకు మ్రొక్కి, "యక్షేశ్వరా! నా అపరాధాలు క్షమించండి, మీ దయవల్ల సమస్తకిల్బిషాలు తొలగి, నేను కోరిన సిద్ధి లభించునట్లొనరింపుము" అని అతణ్ణి ప్రసన్నుని చేసుకోవాలి. అనంతరం పంచనదం చేరాలి.

పంచనద్యస్య రుద్రేణ కృతా దానవభీషణాః ।
తేన సర్వేషు లోకేషు తీర్థం పంచనదం స్మృతమ్ ॥28॥

కోటితీర్థాని రుద్రేణ సమాజహ్రే యతస్తతః ।
తేన త్రైలోక్యవిఖ్యాతం కోటితీర్థం ప్రచక్షతే ॥29॥

తస్మింస్తీర్థే నరః స్నాత్వా దృష్ట్వా కోటీశ్వరం హరమ్ ।
పంచయజ్ఞానవాప్నోతి నిత్యం శ్రద్ధాసమన్వితః ॥30॥

తత్రైవ వామనో దేవః సర్వదేవైః ప్రతిష్ఠితః ।
తత్రాపి చ నరః స్నాత్వా హ్యగ్నిష్టోమఫలం లభేత్ ॥31॥

రాక్షసులకు భయంకరమైనవీ, రుద్రునిచేత ఏర్పాటుచేయబడినవీ అయిన పంచసరస్సులు పంచనద తీర్థంగా లోకప్రసిద్ధిగాంచాయి. అక్కడ త్రిలోకఖ్యాతి పొందినట్టియు, రుద్రుడు సమావేశపరచిన కోటితీర్థాలతో కూడినట్టియు, కోటితీర్థమని ప్రఖ్యాతి చెందిన తీర్థమున్నది. ఆ పవిత్రతీర్థంలో స్నానం చేసి, కోటీశ్వరమహాదేవుని దర్శించినచో ఐదు యజ్ఞాలు చేసిన ఫలం కలుగుతుంది. అక్కడే సమస్తదేవతలచేత ప్రతిష్ఠింపబడిన వామనదేవుని సన్నిధిలో స్నానం చేస్తే మానవుడు అగ్నిష్టోమయజ్ఞఫలాన్ని పొందగలడు.

అశ్వినోస్తీర్థమాసాద్య శ్రద్ధావాన్యో జితేంద్రియః ।
రూపవాన్భాగ్యయుక్తశ్చ స యశస్వీ న సంశయః ॥32॥

జితేంద్రియుడు, శ్రద్ధాన్వితుడునగు వాడు అశ్వినీతీర్థాన్ని సేవించి, రూపసంపదను, యశస్సును, భాగ్యాన్ని పొందగలడు. అతడు యశస్వి కాగలడు. ఇందులో సందేహం లేదు.

వరాహతీర్థమాఖ్యాతం విష్ణునా పరికల్పితమ్ ।
తస్మిన్ స్నాత్వా శ్రద్దధానః ప్రయాతి పరమాం గతిమ్ ॥33॥

విష్ణువుచే పరికల్పితమైన వరాహతీర్థంలో మునిగిన శ్రద్ధాళువు పరమపదాన్ని పొందగలడు.

తత్ర గచ్ఛేచ్చ విప్రేంద్రాః సోమతీర్థమనుత్తమమ్ ।
యత్ర సోమస్తపస్తప్త్వా వ్యాధిముక్తోऽభవత్పురా ॥34॥

తత్ర సోమేశ్వరం దృష్ట్వా స్నాత్వా తీర్థవరే శుభే ।
రాజసూయశ్చ యజ్ఞస్య ఫలం ప్రాప్నోతి మానవః ॥35॥

వ్యాధిభ్యశ్చ వినిర్ముక్తః సర్వదోషవివర్జితః ।
సోమలోకమవాప్నోతి చంద్రేణ రమతే చిరమ్ ॥36॥

భూతేశ్వరం చ తత్రైవ జ్వాలామాలేశ్వరం తథా ।
తచ్చ లింగం సమభ్యర్చ్య న భూయో జన్మ చాప్నుయాత్ ॥37॥

ఓ బ్రాహ్మణోత్తములారా! అక్కడినుండి పవిత్రమైన సోమతీర్థం వెళ్ళాలి. పూర్వకాలంలో చంద్రుడు అక్కడే తపస్సు చేసి, వ్యాధినుండి విముక్తుడయ్యాడు. అట్టి శుభప్రదమైన తీర్థశ్రేష్ఠంలో స్నానమాచరించి, సోమేశ్వరుని దర్శించిన మానవుడు రాజసూయయాగఫలం పొందుతాడు. అట్టివాడు సమస్తవ్యాధులనుండి విముక్తుడై, సర్వదోషవివర్జితుడై సోమలోకం పొంది, చంద్రునితో చిరకాలం క్రీడిస్తాడు. అచ్చటనేయున్న భూతేశ్వరలింగాన్ని జ్వాలామాలేశ్వరలింగాన్ని అర్చించిన మానవుడు మరలా జన్మలను పొందదు.

ఏకహంసే నరః స్నాత్వా గోసహస్రఫలం లభేత్ ।
కృతశౌచం సమాసాద్య తీర్థసేవీ ద్విజోత్తమః ॥38॥

పౌండరీకమవాప్నోతి కృతశౌచో భవేన్నరః ।
తతో ముంజవటం నామ మహాదేవస్య ధీమతః ॥39॥

ఉపోష్య రజనీమేకాం గాణపత్యమవాప్నుయాత్ ।
తత్రైవ చ మహాగ్రాహీ యక్షిణీ లోకవిశ్రుతా ॥40॥

స్నాత్వాऽభిగమ్య తత్రైవ ప్రసాద్య యక్షిణీం తతః ।
ఉపవాసం చ తత్రైవ మహాపాతకనాశనమ్ ।
కురుక్షేత్రస్య తద్ద్వారం విశ్రుతం పుణ్యవర్ధనమ్ ॥41॥

ప్రదక్షిణముపావర్త్య బ్రాహ్మణాన్భోజయేత్తతః ।
పుష్కరం చ తతో గత్వా హ్యభ్యర్చ్య పితృదేవతాః ॥42॥

జామదగ్న్యేన రామేణ కృతం తచ్చ మహాత్మనా ।
కృతకృత్యో భవేద్రాజా అశ్వమేధం చ విందతి ॥43॥

కన్యాదానం చ యస్తత్ర కార్తిక్యాం వై కరిష్యతి ।
ప్రసన్నా దేవతాస్తస్య దాస్యంత్యభిమతం ఫలమ్ ॥44॥

ఏకహంసతీర్థంలో స్నానమాచరించిన మానవుడు వేయిగోవులను దానం చేసిన ఫలాన్ని పొందుతాడు. అచ్చటినుండి వెళ్లి, కృతశౌచక్షేత్రంలో తీర్థసేవ చేసిన నరుడు శుచియై పుండరీకయజ్ఞం చేసిన ఫలాన్ని పొందుతాడు. అచ్చటినుండి ముంజవటతీర్థంలో ముంజవటేశ్వరుని అర్చించి, ఒకరాత్రి ఉపవసించినచో గాణపత్యం ప్రాప్తిస్తుంది. అచ్చటనే మహాగ్రాహి యక్షిణీతీర్థమున్నది. అక్కడ స్నానం, ఉపవాసం చేసి, యక్షిణీదేవతను ప్రసన్నురాలిని గావించుకొన్నచో ఘోరపాపాలన్నీ నశిస్తాయి. ఆ ప్రదేశం కురుక్షేత్రం యొక్క పుణ్యవర్ధకద్వారంగా ప్రసిద్ధి చెందింది. దానికి ప్రదక్షిణ చేసి బ్రాహ్మణసమారాధన చేయాలి. అచ్చటినుండి జమదగ్నిపుత్రుడు పరశురాముడు ప్రతిష్ఠించిన పుష్కరతీర్థంలో పితృదేవతలనర్చించిన రాజు అశ్వమేధయాగం చేసిన ఫలం పొంది ధన్యుడౌతాడు. అచ్చట కార్తికమాసంలో కన్యాదానం చేసినవానికి దేవతలు ప్రసన్నులై కోర్కెలన్నీ సిద్ధింపజేస్తారు.

కపిలశ్చ మహాయక్షో ద్వారపాలః స్వయం స్థితః ।
విఘ్నం కరోతి పాపానాం దుర్గతిం చ ప్రయచ్ఛతి ॥45॥

పత్నీ తస్య మహాయక్షీ నామ్నోలూఖలమేఖలా ।
ఆహత్య దుందుభిం సా తు భ్రమతే నిత్యమేవ హి ॥46॥

సా దదర్శ స్త్రియం చైకాం సపుత్రాం పాపదేశజామ్ ।
తామువాచ తదా యక్షీ ఆహత్య నిశి దుందుభిమ్ ॥47॥

యుగంధరే దధి ప్రాశ్య ఉషిత్వా చాచ్యుతస్థలే ।
తద్వద్భూతాలయే స్నాత్వా సపుత్రా వస్తుమిచ్ఛసి ॥48॥

దివా మయా తే కథితం రాత్రౌ భక్ష్యామి నిశ్చితమ్ ।
ఏతచ్ఛ్రుత్వా తు వచనం ప్రణిపత్య చ యక్షిణీమ్ ॥49॥

ఉవాచ దీనయా వాచా ప్రసాదం కురు భామినీ ।
తతః సా యక్షిణీ తాం తు ప్రోవాచ కృపయాన్వితా ॥50॥

యదా సూర్యస్య గ్రహణం కాలేన భవితా క్వచిత్ ।
సన్నిహిత్యాం తదా స్నాత్వా పూతా స్వర్గం గమిష్యసి ॥51॥

కపిలుడనే మహాయక్షుడు స్వయంగా అచ్చట ద్వారపాలకుడుగానుండి పాపులకు విఘ్నాలు కలిగించి దుర్గతిని కలిగిస్తాడు. ఉలూఖలమేఖల అనే ఆ యక్షుని భార్య మహాయక్షిణి ఎల్లప్పుడూ దుందుభి మ్రోగిస్తూ సంచరిస్తూ ఉంటుంది. ఒక పర్యాయం ఆ యక్షిణి పాపదేశంలో పుట్టి, కుమారునితో వచ్చిన ఒక స్త్రీని చూసి రాత్రివేళ దుందుభిని మ్రోగిస్తూ ఆమెతో ఇలా పలికింది. "యుంగధర తీర్థంలో పెరుగుతిని, అచ్యుతతీర్థంలో ఉపవాసం చేసి, భూతాలయ తీర్థంలో స్నానం చేస్తే నీ కొడుకుతో జీవించగలవు. ఈ విషయం నేను నీకు పగటివేళ చెబుతున్నాను. రాత్రి కాగానే నిన్ను తప్పక భక్షిస్తాను". ఆ మాటలకు భయపడి, ఆ స్త్రీ యక్షిణికి నమస్కరించి నన్నెట్లైనను కాపాడుమని దీనంగా వేడుకున్నది. అంతట ఆ యక్షిణి దయతో ఆ స్త్రీతో ఇలా పలికింది. "సూర్యగ్రహణ సమయంలో ఎప్పుడైనా ఇచ్చటి సన్నిహితతీర్థంలో స్నానమాచరించినచో పవిత్రురాలవై స్వర్గానికి పోగలవు" అని పలికింది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే సప్తవనాది వర్ణనం, తీర్థఫలస్నాన కథనం నామ చతుస్త్రింశోఽధ్యాయః ॥34॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి సప్తవనాలు, నవనదులు మున్నగు వర్ణన, తీర్థస్నానఫలకథనమనే ముప్పైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచత్రింశోఽధ్యాయః – ముప్పైఐదవ అధ్యాయం

రామహ్రదాదితీర్థమాహాత్మ్యకథనమ్ – రామహ్రదం, లోకోద్ధారం మున్నగు తీర్థాల మాహాత్మ్యకథనం

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

తతో రామహ్రదం గచ్ఛేత్తీర్థసేవీ ద్విజోత్తమః ।
తత్ర రామేణ విప్రేణ తరసా దీప్తతేజసా ॥1॥

క్షత్రముత్సాద్య విప్రేణ హ్రదాః పంచ నివేశితాః ।
పూరయిత్వా నరవ్యాఘ్ర రుధిరేణేతి నః శ్రుతమ్ ॥2॥

పితరస్తర్పితాస్తేన తథైవ చ పితామహాః ।
తతస్తే పితరః ప్రీతా రామమూచుర్ద్విజోత్తమాః ॥3॥

ఓ బ్రాహ్మణోత్తములారా! తీర్థసేవ చేయగోరు బ్రాహ్మణోత్తముడు అచ్చటినుండి రామహ్రదానికి వెళ్లాలి. అక్కడ మహాతేజస్వియైన భార్గవరాముడు క్షత్రియసంహారం గావించి, వారిరక్తంతో 5 సరోవరాలు నింపాడని వినియున్నాము. ఆ జలాలతో పితృపితామహులకు తర్పణాలిచ్చినందున పితృదేవతలు తృప్తులై పరశురామునితో ఇలా పలికారు.

రామరామ మహాబాహో ప్రీతాః స్మస్తవ భార్గవ ।
అనయా పితృభక్త్యా చ విక్రమేణ చ తే విభో ॥4॥

వరం వృణీష్వ భద్రం తే కమిచ్ఛసి మహాయశః ।
ఏవముక్తస్తు పితృభీ రామః ప్రభవతాం వరః ॥5॥

అబ్రవీత్ప్రాంజలిర్వాక్యం స పితౄన్గగనస్థితాన్ ।
భవంతో యది మే ప్రీతాస్తదనుగ్రాహ్యతామయమ్ ॥6॥

పితృప్రసాదాదిచ్ఛేయం తపసాప్యాయనం పునః ।
యచ్చ రోషాభిభూతేన క్షత్రముత్సారితం మయా ॥7॥

తతస్తు పాపాన్ముచ్యేయం యుష్మాకం తేజసా హ్యహమ్ ।
హ్రదాశ్చైతే తీర్థభూతా భవేయుర్భువి విశ్రుతాః ॥8॥

ఏవం శ్రుత్వా శుభవాక్యం రామస్య పితరస్తదా ।
ప్రత్యూచుః పరమప్రీతా రామం హర్షపురస్కృతాః ॥9॥

మహాపరాక్రమవంతుడవైన ఓ భార్గవరామా! నీ పరాక్రమానికి, నీ పితృభక్తికి మేము సంతోషించాము. మహాయశస్వీ! నీకేమి వరము కావలయునో కోరుకొనుము. నీకు కల్యాణమగు గాక!" ఆకాశవీధిలోనుండి ఇట్లు పలికిన తన పితృదేవతలకు భార్గవరాముడు చేతులు జోడించి, నమస్కరించి ఇలా పలికాడు. "మీరు నా యెడ

"ప్రసన్నులైనచో, మీరు నన్ను అనుగ్రహింపదలచినచో, మీ దయవల్ల నేను మరలా తపస్సిద్ధి పొందాలి. రోషాతిరేకంతో క్షత్రియసంహారం చేసినందున నాకు కలిగిన పాపం నశించాలి. మీ ప్రభావం వల్ల ఈ 5 సరోవరాలు పవిత్రతీర్థాలుగా ప్రసిద్ధి చెందాలి". భార్గవరాముడు పలికిన ఈ శుభవాక్యాలు విని, హర్షంతో ఆయన పితరులు ప్రేమతో అభయమిస్తూ ఇలా బదులు పలికారు.

తపస్తే వర్ధతాం పుత్ర పితృభక్త్యా విశేషతః ।
యచ్చ రోషాభిభూతేన క్షత్రముత్సాదితం త్వయా ॥10॥

తతశ్చ పాపాన్ముక్తస్త్వం పాతితాస్తే స్వకర్మభిః ।
హ్రదాశ్చైతేఽద్య తీర్థత్వం గమిష్యన్తి న సంశయః ॥11॥

హ్రదేష్వేతేషు యః స్నాత్వా స్వాన్ పితౄంస్తర్పయిష్యతి ।
తస్య దాస్యంతి పితరో యథాఽభిలషితం ఫలమ్ ॥12॥

ఈప్సితాన్ మానసాన్కామాన్ స్వర్గవాసం చ శాశ్వతమ్ ।
ఏవం దత్త్వా వరాన్విప్రా రామస్య పితరస్తదా ॥13॥

రామం సుభార్గవం ప్రీతా స్తత్రైవాన్తర్దధుస్తదా ।
ఏవం రామహ్రదాః పుణ్యా భార్గవస్య మహాత్మనః ॥14॥

పుత్రా! విశిష్టమైన నీ పితృభక్తివల్ల నీతపస్సు వర్ధిల్లుతుంది. కోపవశాన నీకు సంక్రమించిన క్షత్రియవధ పాతకం తొలగిపోయింది. ఆ క్షత్రియులు తమ దుష్కర్మలవల్లనే చంపబడ్డారు. నీవు నిర్మించిన ఈ సరస్సులకు తీర్థత్వం ఈనాడే లభిస్తుంది. ఇందులో సందేహంలేదు. ఈ సరస్సులలో స్నానంచేసి, ఎవరు తమ పితరులకు తర్పణాలు విడుస్తారో వారి కోర్కెలన్నీ వారి పితరులు సిద్ధింపజేస్తారు. బ్రాహ్మణోత్తములారా! మనోవాంఛితాలు నెరవేరడంతోబాటు శాశ్వతమైన స్వర్గవాసంకూడా నీకు లభిస్తుందని భార్గవరామునకు పితరులు వరమిచ్చారు. ఈవిధంగా భార్గవరామునికి వరమిచ్చి ఆయన పితృదేవతలు అంతర్ధానమయ్యారు. ఈ విధంగా మహాత్ముడగు భార్గవరామునిచే నెలకొల్పబడిన రామహ్రదాలు పరమపవిత్రాలు.

స్నాత్వా హ్రదేషు రామస్య బ్రహ్మచారీ శుచివ్రతః ।
రామం సమభ్యర్చ్య తథా విందేద్బహు సువర్ణకమ్ ॥15॥

శుచివ్రతుడై, బ్రహ్మచర్యనియమంతో ఈ సరస్సులలో స్నానం చేసి భార్గవరాముని అర్చిస్తే, బహు సువర్ణప్రాప్తి కలుగుతుంది.

వంశమూలం సమాసాద్య తీర్థసేవీ సుసంయతః ।
స్వవంశముద్ధరేద్విప్రాః స్నాత్వా చైవ సమూలకమ్ ॥16॥

కాయశోధనమాసాద్య తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
శరీరశుద్ధిమాప్నోతి స్నాతస్తస్మిన్న సంశయః ॥17॥

శుద్ధదేహశ్చ సంయాతి యస్మాన్నావర్తతే పునః ।
తావద్భ్రమంతి తీర్థేషు సిద్ధాస్తీర్థపరాయణాః ।
యావన్న ప్రాప్నువంతీహ తీర్థం తత్కాయశోధనమ్ ॥18॥

తస్మింస్తీర్థే చ సంప్లావ్య కాయం సంయతమానసః ।
పరం పదమవాప్నోతి యస్మాన్నావర్తతే పునః ॥19॥

జితేంద్రియుడగు తైర్థికుడు తన వంశాభివృద్ధి కోసం వంశమూలంలో స్నానం చేసి, అటనుండి ముల్లోకాలలో కాయశోధనమనే పేరొందిన తీర్థంలో స్నానం చేసి, తప్పకుండా కాయసిద్ధి పొందుతాడు. ఇందులో సందేహం లేదు. పరిశుద్ధమైన దేహాన్ని పొంది, పునరావృత్తిలేని లోకాలకు పోతాడు. తీర్థపరాయణులైన సిద్ధులు కాయశోధనం పొందేవరకు తీర్థాటనం చేస్తూ వుంటారు. ఆ తీర్థంలో స్నానం చేసి, సంయతచిత్తులగువారు పునరావృత్తి రహితమైన పరమపదాన్ని చేరుకుంటారు.

తతో గచ్ఛేచ్ఛ విప్రేంద్రాస్తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
లోకా యత్రోద్ధృతాః సర్వే విష్ణునా ప్రభవిష్ణునా ॥20॥

లోకోద్ధారం సమాసాద్య తీర్థం స్మరణతత్పరః ।
స్నాత్వా తీర్థవరే తస్మింల్లోకం పశ్యతి శాశ్వతమ్ ॥21॥

యత్ర విష్ణుః స్థితో నిత్యం శివో దేవశ్చ శాశ్వతః ।
తౌ దేవౌ ప్రణిపాతేన ప్రసాద్య ముక్తిమాప్నుయాత్ ॥22॥

అనంతరం ఉత్తములగు విప్రులు సమస్తలోకాలు ఉద్ధరించే విష్ణువుచేత ఉద్ధరింపబడి లోకోద్ధారమను పేరుతో ముల్లోకాలలో ఖ్యాతి గడించిన తీర్థం చేరి, అందు స్నానం చేసి, శాశ్వతలోకాలను పొందుతారు. సనాతనులైన శివవిష్ణువులిరువురు నిత్యం సన్నిహితులైనచోట వారిరువురకు ప్రణమిల్లి ప్రసన్నులను గావించుకొని ముక్తిని పొందుతారు.

శ్రీతీర్థం తు తతో గచ్ఛేచ్ఛాలగ్రామమనుత్తమమ్ ।
తత్ర స్నాతస్య సాన్నిధ్యం సదా దేవీ ప్రయచ్ఛతి ॥23॥

అచటినుండి పరమోత్తమమైన శాలగ్రామశ్రీతీర్థం చేరి, అందు స్నానం చేసినచో పరమేశ్వరి సాన్నిధ్యం ఎల్లప్పుడూ లభిస్తుంది.

కపిలా హ్రదమాసాద్య తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
తత్ర స్నాత్వాఽర్చయిత్వా చ దైవతాని పితౄంస్తథా ॥24॥

కపిలానాం సహస్రస్య ఫలం విందతి మానవః ।
తత్ర స్థితం మహాదేవం కాపిలం వపురాస్థితమ్ ॥25॥

దృష్ట్వా ముక్తిమవాప్నోతి ఋషిభిః పూజితం శివమ్ ।
సూర్యతీర్థం సమాసాద్య స్నాత్వా నియతమానసః ॥26॥

అనంతరం మూడులోకాలలో ప్రసిద్ధిచెందిన కపిలతీర్థం చేరి, ఆ తీర్థంలో స్నానం చేసి, దేవతలను, పితృదేవతలను అర్చించిన మానవులకు వేయి కపిలగోవులను దానం చేసిన ఫలం కలుగుతుంది. అచ్చటనే కపిలరూపంలో వెలసినట్టియు, ఋషులచే పూజింపబడినట్టియు మహాదేవుడైన శివుని దర్శించినచో ముక్తి కలుగుతుంది.

అర్చయిత్వా పితౄన్ దేవానుపవాసపరాయణః ।
అగ్నిష్టోమమవాప్నోతి సూర్యలోకం చ గచ్ఛతి ॥27॥

సహస్రకిరణం దేవం భానుం త్రైలోక్యవిశ్రుతమ్ ।
దృష్ట్వా ముక్తిమవాప్నోతి నరో జ్ఞానసమన్వితః ॥28॥

తరువాత సూర్యతీర్థం చేరి, అందు స్నానమాచరించి, స్థిరచిత్తంతో ఉపవాసపూర్వకంగా పితరులను, దేవతలను అర్చించినచో అగ్నిష్టోమయాగఫలాన్ని పొందడమే గాక సూర్యలోకప్రాప్తి కూడా కలుగుతుంది. జ్ఞానియైన మానవుడు సహస్రకిరణుడు, త్రైలోక్యవిఖ్యాతుడునైన భానుని దర్శించి మోక్షగామి కాగలడు.

భవానీవనమాసాద్య తీర్థసేవీ యథాక్రమమ్ ॥29॥
తత్రాభిషేకం కుర్వాణో గోసహస్రఫలం లభేత్ ।

అనంతరం తీర్థసేవి యథాక్రమంగా అచ్చటినుండి భవానీవనాన్ని చేరి, అచ్చట అభిషేకాదులు ఒనర్చినచో గోసహస్రదానఫలాన్ని పొందుతాడు.

పితామహస్య పిబతో హ్యమృతం పూర్వమేవ హి ।
ఉద్గారాత్సురభిర్జాతా సా చ పాతాలమాశ్రితా ॥30॥

తస్యాః సురభయో జాతా మాతరో లోకమాతరః ।
తాభిస్తత్సకలం వ్యాప్తం పాతాలం సునిరంతరమ్ ॥31॥

పితామహస్య యజతో దక్షిణార్థముపాహృతాః ।
ఆహూతా బ్రాహ్మణాస్తే చ విభ్రాంతా వివరేణ హి ॥32॥

తస్మిన్వివరద్వారే తు స్థితో గణపతిః స్వయమ్ ।
యం దృష్ట్వా సకలాన్ కామాన్ ప్రాప్నోతి నియతేంద్రియః ॥33॥

పూర్వకాలంలో బ్రహ్మదేవుడు అమృతపానం చేసి, పుక్కిలించగా అందుండి సురభి (కామధేనువు) జన్మించి పాతాళానికి వెళ్ళింది. లోకమాతయైన ఆ సురభికి ఎన్నో గోవులు జన్మించాయి. ఆ గోవులతో పాతాళలోకం నిండిపోయింది. అనంతరకాలంలో బ్రహ్మయజ్ఞం చేశాడు. అప్పుడు దక్షిణగా ఇవ్వడానికి ఆ గోవులను

పిలిచాడు.అప్పుడు ఆ గోవులు ఒక బిలద్వారం గుండా ప్రయాణించి వెళ్ళాయి. ఆ బిలద్వారం వద్ద స్వయంగా వేంచేసియున్న గణపతిని జితేంద్రియుడై దర్శించినచో సకలవాంఛలు సిద్ధిస్తాయి.

సంగినీం తు సమాసాద్య తీర్థం ముక్తిసమాశ్రయమ్ ।
దేవ్యాస్తీర్థే నరః స్నాత్వా లభంతే రూపముత్తమమ్ ॥34॥

అనంతాం శ్రియమాప్నోతి పుత్రపౌత్రైః సమన్వితః ।
భోగాంశ్చ విపులాంల్లబ్ధ్వా ప్రాప్నోతి పరమం పదమ్ ॥35॥

అనంతరం ముక్తినిలయమైన సంగినీతీర్థం చేరి, ఆ తీర్థంలోని దేవీతీర్థంలో స్నానం చేసిన మానవుడు ఉత్తమమైన చక్కని రూపాన్ని పొందగలడు. అంతే గాక అనంతమైన సంపద కలుగుతుంది. పుత్రపౌత్రాదులతో కూడి, సమస్తమైన భోగాలననుభవించి, పరమపదాన్ని కూడా పొందగలడు.

బ్రహ్మావర్తే నరః స్నాత్వా బ్రహ్మజ్ఞానసమన్వితః ।
జాయతే నాత్ర సందేహః ప్రాణాన్ ముంచతి చేచ్ఛయా ॥36॥

బ్రహ్మావర్తంలో స్నానమాచరించిన మానవుడు బ్రహ్మజ్ఞానసమన్వితుడై, తన ఇచ్ఛానుసారం ప్రాణాలు విడువగలడనుటలో సందేహం లేదు.

తతో గచ్ఛేద్ధి విప్రేంద్రా ద్వారపాలం చ రంతుకమ్ ।
తత్ర తీర్థే సరస్వత్యా యక్షేంద్రస్య మహాత్మనః ॥37॥

తత్ర జ్ఞానం సమాసాద్య హ్యుపవాసపరాయణః ।
యక్షస్య చ ప్రసాదేన లభతే కామికం ఫలమ్ ॥38॥

బ్రాహ్మణోత్తములారా! అచ్చటినుండి రంతుకద్వారపాలతీర్థం చేరి, రంతుకద్వారపాలకుని సేవించాలి. మహాత్ముడైన యక్షేంద్రుని తీర్థంలోని సరస్వతీతీర్థంలో ఉపవాసముండి స్నానమాచరించినచో యక్షుని ప్రసాదం వల్ల కామితఫలాలు పొందుతారు.

తతో గచ్ఛేద్ధి విప్రేంద్రా బ్రహ్మావర్తం మునిస్తుతమ్ ।
బ్రహ్మావర్తే నరః స్నాత్వా బ్రహ్మ చాప్నోతి నిశ్చితమ్ ॥39॥

విప్రేంద్రులారా! అచ్చటినుండి మునిస్తుత్యమైన బ్రహ్మావర్తం చేరి, ఆ తీర్థంలో స్నానం చేసిన మానవునకు బ్రహ్మప్రాప్తి కలుగుతుంది. ఇది నిశ్చయము.

తతో గచ్ఛేచ్చ విప్రేంద్రాః సుతీర్థకమనుత్తమమ్ ।
తత్ర సన్నిహితా నిత్యం పితరో దైవతైస్సహ ॥40॥

తత్రాభిషేకం కుర్వీత పితృదేవార్చనే రతః ।
అశ్వమేధమవాప్నోతి పితౄన్ ప్రీణాతి శాశ్వతమ్ ॥41॥

ఓ బ్రాహ్మణోత్తములారా! అచ్చటినుండి సుతీర్థకమనే పేరు గల తీర్థం చేరాలి. ఆ తీర్థంలో పితరులు, దేవతలు నిత్యనివాసులై ఉంటారు. పితృదేవార్చనారతుడైన మానవుడు అచ్చటి పితృదేవతలకు, దేవతలకు, అభిషేకాదులు చేసి, వారిని సంప్రీతులను చేసినచో అశ్వమేధయాగం చేసిన ఫలం పొందుతాడు.

తతో౽ంబువనం ధర్మజ్ఞ సమాసాద్య యథాక్రమమ్ ।
కామేశ్వరస్య తీర్థే తు స్నాత్వా శ్రద్ధా సమన్వితః ॥ 42॥

సర్వవ్యాధివినిర్ముక్తో బ్రహ్మ చాప్నోతి నిశ్చితమ్ ।
మాతృతీర్థే చ తత్రైవ యత్ర స్నాతస్య భక్తితః ॥43॥

ప్రజా వివర్ధతే నిత్యమనంతాం చాప్నుయాచ్ఛ్రియమ్ ।

ఓ ధర్మజ్ఞా! అక్కడినుండి క్రమంగా అంబువనం చేరి, అచ్చటి కామేశ్వరతీర్థంలో శ్రద్ధాసమన్వితుడై స్నానం చేసినచో సర్వవ్యాధులనుండి వినిర్ముక్తుడై, నిశ్చితంగా బ్రహ్మలోకం చేరుతాడు. ఇది నిశ్చయము. అదే క్షేత్రంలో నున్న మాతృతీర్థంలో భక్తితో స్నానం చేసినచో సంతానవృద్ధి కలిగి, అనంతైశ్వర్యాలు పొందుతాడు.

తతః సీతావనం గచ్ఛేన్నియతో నియతాశనః ॥44॥
తీర్థం తత్ర చ విప్రేంద్రా మహదన్యత్ర దుర్లభమ్ ।
పునాతి దర్శనాదేవ దండకం చ ద్విజోత్తమాః ॥45॥

ఓ బ్రాహ్మణోత్తములారా! అచ్చటినుండి నియమంతో నియతాశనుడై సీతావనం చేరాలి. అక్కడ మరెక్కడా లేని దుర్లభమైన తీర్థమున్నది. దర్శనమాత్రం చేతనే పవిత్రులను చేయు ఆ దివ్యక్షేత్రం దండకం.

కేశానభ్యుక్ష్య చైకస్మిన్పూతో భవతి పాపతః ।
తత్ర తీర్థవరం చాన్యత్ స్వానులోమాపహం మహత్ ॥46॥

తత్ర విప్రా మహాప్రాజ్ఞా విద్వాంసస్తీర్థతత్పరాః ।
స్వానులోమాపహే తీర్థే విప్రాస్త్రైలోక్యవిశ్రుతే ॥47॥

ప్రాణాయామైర్నిర్హరన్తి స్వలోమాని ద్విజోత్తమాః ।
పూతాత్మానశ్చ తే విప్రాః ప్రయాన్తి పరమాం గతిమ్ ॥48॥

అక్కడ శిరోముండనం చేసుకొనిన మానవుడు పాపాలనుండి విముక్తుడై, పవిత్రుడౌతాడు. అక్కడ స్వానులోమాపహం అనే ముల్లోకాలలో విఖ్యాతి గాంచిన వేరొకతీర్థం వుంది. అక్కడ మహాప్రాజ్ఞులు, విద్వాంసులు, తీర్థతత్పరులునైనవారు ప్రాణాయామరీతిచే తమ శరీరంమీది రోమాలనన్నిటిని పోగొట్టుకుంటారు. అటువంటి పవిత్రులు పరమపదం పొందుతారు.

దశాశ్వమేధికం చైవ తత్ర తీర్థం సువిశ్రుతమ్ ।
తత్ర స్నాత్వా భక్తియుక్తస్తదేవ లభతే ఫలమ్ ॥49॥

అక్కడ దశాశ్వమేధికమని విఖ్యాతి చెందిన వేరొక తీర్థమున్నది. ఆ తీర్థంలో భక్తియుక్తుడై స్నానమాచరించినచో దశాశ్వమేధయాగఫలం లభిస్తుంది.

తతో గచ్ఛేద్ధి శ్రద్ధావాన్మానుషం లోకవిశ్రుతమ్ ।
దర్శనాత్తస్య తీర్థస్య ముక్తో భవతి కిల్బిషైః ॥50॥

పురా కృష్ణమృగాస్తత్ర వ్యాధైస్తు శరపీడితాః ।
అవగాహ్య సరస్యస్మిన్మానుషత్వముపాగతాః ॥51॥

తతో వ్యాధాశ్చ తే సర్వే తానపృచ్ఛన్ద్విజోత్తమాన్ ।
మృగాః క్వ ఋషయో యాతా అస్మాభిః శరపీడితాః ॥52॥

నిమగ్నాస్తే సరః ప్రాప్య కిం తద్బ్రూత ద్విజోత్తమాః ।
తేఽబ్రువంస్తత్ర వై పృష్టా వయం తే చ ద్విజోత్తమాః ॥53॥

అస్య తీర్థస్య మాహాత్మ్యాన్మానుషత్వముపాగతాః ।
తస్మాద్యూయం శ్రద్దధానాః స్నాత్వా తీర్థే విమత్సరాః ॥54॥

సర్వపాపవినిర్ముక్తా భవిష్యథ న సంశయః ।
తతః స్నాతాశ్చ తే సర్వే శుద్ధదేహా దివంగతాః ॥55॥

ఏతత్తీర్థస్య మాహాత్మ్యం మానుషస్య ద్విజోత్తమాః ।
యే శృణ్వంతి శ్రద్దధానాస్తేఽపి యాన్తి పరాం గతిమ్ ॥56॥

శ్రద్ధాళువైన మానవుడు అచ్చటినుండి లోకవిఖ్యాతమైన మానుషతీర్థానికి వెళతాడు. ఆ తీర్థాన్ని దర్శించినంత మాత్రం చేతనే కిల్బిషాలనుండి విముక్తుడౌతాడు. పూర్వకాలంలో అచ్చట వేటగాళ్ళ బాణాలచే పీడింపబడిన కృష్ణమృగాలు ఈ సరస్సులో స్నానమాచరించి, మానుషత్వాన్ని పొందాయి. ఆ విధంగా మానుషత్వం పొంది వచ్చిన బ్రాహ్మణోత్తములను చూసి వేటగాళ్ళు వారితో "ఓ ఋషులారా! మా బాణాలు తగిలిన లేళ్ళు ఎక్కడకు పోయాయి?. ఈ సరస్సులో మునిగిన తరువాత అవి ఏమయ్యాయి?" అని అడిగారు. అందులకు ఆ బ్రాహ్మణులు "ఆ కృష్ణమృగాలు మేమే. ఈ తీర్థమాహాత్మ్యం వల్ల మేము ఉత్తమమానుషజన్మను పొందాము. కాబట్టి మీరు కూడా మత్సరరహితులై, శ్రద్ధాళువులై, ఈ తీర్థంలో స్నానం చేసినచో సమస్తపాపాలనుండి విముక్తులు కాగలరు. ఇందులో సందేహం లేదు. అనంతరం వారందరు ఆ తీర్థంలో స్నానం చేసి, పవిత్రశరీరులై స్వర్గానికి వెళ్లారు. ఓ బ్రాహ్మణోత్తములారా! ఇటువంటి మహిమ గల మానుషతీర్థం యొక్క మాహాత్మ్యాన్ని వినిన శ్రద్ధాళువులు కూడా పరమపదాన్ని పొందుతారు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే రామహ్రదాది తీర్థ మాహాత్మ్య కథనం నామ పంచత్రింశోఽధ్యాయః ॥35॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి రామహ్రదం, లోకోద్ధారం మున్నగు తీర్థాల మాహాత్మ్య కథనమనే ముప్పైఐదవఅధ్యాయం సమాప్తం.

షట్‌త్రింశోఽధ్యాయః – ముప్పైఆరవ అధ్యాయం

కపిస్థలాది తీర్థమాహాత్మ్యకథనమ్ – కపిస్థలం మొదలైన తీర్థాల మాహాత్మ్యకథనం

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

మానుషస్య తు పూర్వేణ క్రోశమాత్రే ద్విజోత్తమాః ।
ఆపగా నామ విఖ్యాతా నదీ ద్విజనిషేవితా ॥1॥

మానుషతీర్థానికి తూర్పుగా క్రోశెడు (4మైళ్ళు) దూరాన ద్విజోత్తములచే సేవింపబడునట్టి '**ఆపగ**' అని ప్రసిద్ధిచెందిన నదియున్నది.

శ్యామాకం పయసా సిద్ధమాజ్యేన చ పరిప్లుతమ్ ।
యే ప్రయచ్ఛంతి విప్రేభ్యస్తేషాం పాపం న విద్యతే ॥2॥

అక్కడ పాలతో వండి, నేతితో కలపబడిన శ్యామాక (సామధాన్యం) పరమాన్నం బ్రాహ్మణులకు సమర్పించువారు పాపములను పొందరు.

యే తు శ్రాద్ధం కరిష్యంతి ప్రాప్య తామాపగాం నదీమ్ ।
తే సర్వకామసంయుక్తా భవిష్యన్తి న సంశయః ॥3॥

ఆ నదీతీరంలో శ్రాద్ధకర్మలు జరుపువారి సర్వకామ్యములు సిద్ధింపబడుననుటలో సందేహంలేదు.

శంసంతి పితరస్తస్య స్మరంతి చ పితామహాః ।
అస్మాకం చ కులే పుత్రః పౌత్రో వాఽపి భవిష్యతి ॥4॥

య ఆపగాం నదీం గత్వాఽస్మాంస్తిలైస్తర్పయిష్యతి ।
తేన తృప్తా భవిష్యామో యావత్ కులశతం భవేత్ ॥5॥

తమ వంశంలోని ఎవడైనా ఒక పుత్రుడు గాని, పౌత్రుడు గాని ఆ నదీతీరంలో తమకు తిలతర్పణాలు చేయువాడు పుట్టి, తమకు నూరు కల్పాలవరకు సద్గతులు కల్గించునా అని పితరులు ఎదురు చూస్తూ ఉంటారు. పితామహులు స్మరిస్తూ ఉంటారు.

నభస్యే మాసి సంప్రాప్తే కృష్ణపక్షే విశేషతః ।
చతుర్దశ్యాం తు మధ్యాహ్నే పిండదో ముక్తిమాప్నుయాత్ ॥6॥

భాద్రపద కృష్ణపక్ష చతుర్దశినాడు విశేషించి మధ్యాహ్నసమయాన అచ్చట పిండప్రదానం చేయువానికి మోక్షం కలుగుతుంది.

తతో గచ్ఛేచ్చ విప్రేంద్రా బ్రహ్మణః స్థానముత్తమమ్ ।
బ్రహ్మోదుంబరమిత్యేవం సర్వలోకేషు విశ్రుతమ్ ॥7॥

తదనంతరం అచ్చటినుండి బ్రహ్మకు ముఖ్యస్థానమైన బ్రహ్మోదుంబరమనే సమస్తలోకాలలో ప్రసిద్ధమైన ప్రదేశానికి వెళ్ళాలి.

తత్ర బ్రహ్మర్షికుండేషు స్నాతస్య ద్విజసత్తమాః ।
సప్తర్షీణాం ప్రసాదేన సప్తసోమఫలం లభేత్ ॥8॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! అచ్చటనున్న బ్రహ్మర్షికుండంలో స్నానం చేసినవారు సప్తర్షుల అనుగ్రహం వల్ల ఏడు సోమయాగాలు చేసిన పుణ్యం పొందగలరు.

భరద్వాజో గౌతమశ్చ జమదగ్నిశ్చ కశ్యపః ।
విశ్వామిత్రో వసిష్ఠశ్చ అత్రిశ్చ భగవానృషిః ॥9॥

ఏతే సమేత్య తత్కుండం కల్పితం భువి దుర్లభమ్ ।
బ్రహ్మణా సేవితం తస్మాద్బ్రహ్మోదుంబరముచ్యతే ॥10॥

భరద్వాజుడు, గౌతముడు, జమదగ్ని, కశ్యపుడు, విశ్వామిత్రుడు, వసిష్ఠుడు, అత్రి మున్నగు సప్తర్షులు కలసి భూలోకంలో దుర్లభమైన ఆ తీర్థాన్ని కల్పించారు. ఈ తీర్థాన్ని చతుర్ముఖబ్రహ్మ స్వయంగా సేవించినందున బ్రహ్మోదుంబరతీర్థంగా ప్రశస్తి పొందింది.

తస్మింస్తీర్థవరే స్నాత్వా బ్రహ్మణోఽ వ్యక్తజన్మనః ।
బ్రహ్మలోకమవాప్నోతి నాత్ర కార్యా విచారణా ॥11॥

దేవాన్పితౄన్సముద్దిశ్య యో విప్రం భోజయిష్యతి ।
పితరస్తస్య సుఖితా దాస్యంతి భువి దుర్లభమ్ ॥12॥

సప్తర్షీంశ్చ సముద్దిశ్య పృథక్ స్నానం సమాచరేత్ ।
ఋషీణాం చ ప్రసాదేన సప్తలోకాధిపో భవేత్ ॥13॥

ఓ బ్రాహ్మణోత్తములారా! అవ్యక్తజన్ముడగు బ్రహ్మయొక్క బ్రహ్మతీర్థంలో స్నానం చేసినచో బ్రహ్మలోకప్రాప్తి కలుగుతుంది. ఇందులో ఆలోచించవలసినదేదియూ లేదు. ఆ ప్రదేశంలో ఒక బ్రాహ్మణునకు దేవతలను, పితరులను ఉద్దేశించి పెట్టినచో దానితో సంతుష్టులైన పితరులు అతనికి ఈలోకంలో దుర్లభమైన దానిని ప్రదానం చేస్తారు. ప్రత్యేకంగా సప్తర్షులను ఉద్దేశించి ఆ కుండంలో స్నానం చేస్తే ఆ ఋషుల అనుగ్రహం వల్ల సప్తలోకాధిపత్యం పొందవచ్చును.

కపిస్థలేతి విఖ్యాతం సర్వపాతకనాశనమ్ ।
యస్మిన్ స్థితః స్వయం దేవో వృద్ధకేదారసంజ్ఞితః ॥14॥

తత్ర స్నాత్వార్చయిత్వా చ రుద్రం దండిసమన్వితమ్ ।
అంతర్ధానమవాప్నోతి శివలోకే స మోదతే ॥15॥

యస్తత్ర తర్పణం కృత్వా పిబతే చులుకత్రయమ్ ।
దేవదేవం నమస్కృత్య కేదారస్య ఫలం లభేత్ ॥16॥

యస్తత్ర కురుతే శ్రాద్ధం శివముద్దిశ్య మానవః ।
చైత్రశుక్లచతుర్దశ్యాం ప్రాప్నోతి పరమం పదమ్ ॥17॥

సమస్తపాపాలను పోగొట్టు కపిస్థలమనే ప్రసిద్ధతీర్థమున్నది. అచ్చట వృద్ధకేదారేశ్వరమహాదేవుడు నెలకొని యున్నాడు. అక్కడ దండితో కూడియున్న రుద్రుని స్నాతుడై, అర్చించినచో అంతర్ధానశక్తిని పొంది, శివలోకంలో సుఖించవచ్చును. అచ్చట తర్పణం విడిచి, ముమ్మార్లు ఆచమనం చేసి, దండిదేవునకు నమస్కరించినచో కేదారక్షేత్రాటనఫలం పొందగలరు. చైత్రశుక్లచతుర్దశినాడు శివునకు ప్రీతిగా అచ్చట శ్రాద్ధమొనరించినచో పరమపదం లభిస్తుంది.

కలస్యాం తు తతో గచ్ఛేద్యత్ర దేవీ చ సంస్థితా ।
దుర్గా కాత్యాయనీ భద్రా నిద్రా మాయా సనాతనీ ॥18॥

కలస్యాం చ నరః స్నాత్వా దృష్ట్వా దుర్గాం తటస్థితామ్ ।
సంసారగహనం దుర్గం నిస్తరేన్నాత్ర సంశయః ॥19॥

అచ్చటినుండి దుర్గ, కాత్యాయని, భద్ర, నిద్ర, మాయ, సనాతని అనే పేర్లతో విరాజిల్లే దేవీస్థానమైన కలసానికి వెళ్ళాలి. ఆ కలసీతీర్థంలో స్నానం చేసి, ఒడ్డునే యున్న దుర్గాదేవిని దర్శించినచో దుస్తరమైన సంసార సాగరాన్ని నిస్సందేహంగా దాటవచ్చు.

తతో గచ్ఛేద్ధి సరకం త్రైలోక్యస్యాపి దుర్లభమ్ ।
కృష్ణపక్షే చతుర్దశ్యాం దృష్ట్వా దేవం మహేశ్వరమ్ ॥20॥

లభతే సర్వకామాంశ్చ శివలోకం స గచ్ఛతి ।
తిస్రః కోట్యస్తు తీర్థానాం సరకే ద్విజసత్తమాః ॥21॥

బ్రాహ్మణులారా! తదనంతరం ముల్లోకాలలో దుర్లభమైన సరకక్షేత్రాన్ని దర్శించాలి. కృష్ణపక్షచతుర్దశినాడు అచ్చట వెలసిన మహాదేవుని సేవిస్తే కోరికలన్నీ ఫలించి శివలోకం పొందవచ్చును. ఈ సరకక్షేత్రంలో ముక్కోటితీర్థాలున్నాయి.

రుద్రకోటిస్తథా కూపే సరోమధ్యే వ్యవస్థితా ।
తస్మిన్ సరసి యః స్నాత్వా రుద్రకోటిం స్మరేన్నరః ॥22॥

పూజయిత్వా రుద్రకోటిం భవిష్యతి న సంశయః ।
రుద్రాణాం చ ప్రసాదేన సర్వదోషవివర్జితః ॥23॥

ఐంద్రజ్ఞానేన సంయుక్తః పరం పదమవాప్నుయాత్ ।

ఆ సరోవరం మధ్యభాగంలోనున్న ఒక బావిలో కోటిరుద్రులున్నారు. ఆ సరస్సులో స్నానం చేసి, కోటిరుద్రులను స్మరించిన మానవుడు రుద్రకోటి అనుగ్రహం వలన కోటిరుద్రులను పూజించిన ఫలం పొందుతాడు. సర్వదోషములు తొలగిపోతాయి. ఇంద్రజ్ఞానం పొంది, పరమపదాన్ని పొందుతాడు.

ఇడాస్పదం చ తత్రైవ తీర్థం పాపభయాపహమ్ ॥24॥

యస్మిన్ముక్తిమవాప్నోతి దర్శనాదేవ మానవః ।
తత్ర స్నాత్వార్చయిత్వా చ పితృదేవగణానపి ॥25॥

న దుర్గతిమవాప్నోతి చింతితం మనసాఽఽప్నుయాత్ ।

అక్కడనే సర్వపాపభయాలు పారద్రోలే ఇడాస్పదతీర్థం కలదు. దాని దర్శనమాత్రం చేతనే నరులు ముక్తి పొందగలరు. అక్కడ స్నానం చేసి, దేవపితృగణాలను అర్చిస్తే కోరిన కోర్కెలు సిద్ధిస్తాయి. ఎటువంటి దుర్గతులు కలుగవు.

కేదారం చ మహాతీర్థం సర్వకల్మషనాశనమ్ ॥26॥
తత్ర స్నాతస్తు పురుషః సర్వదానఫలం లభేత్ ।

అచ్చటనే సర్వకల్మషనాశకమైన కేదారతీర్థమున్నది. అచ్చట స్నానం చేసిన మానవునకు సకలదానఫలం కలుగుతుంది.

కింరూపం చ మహాతీర్థం తత్రైవ భువి దుర్లభమ్ ॥
తస్మిన్స్నాతస్తు పురుషః సర్వయజ్ఞఫలం లభేత్ ॥27॥

అక్కడనే భూలోకంలో దుర్లభమైన కింరూపతీర్థమున్నది. ఆ మహాతీర్థంలో మునిగినచో సర్వయజ్ఞఫలం లభిస్తుంది.

సరకస్య తు పూర్వేణ తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
అన్యజన్మ భువిఖ్యాతం సర్వపాపప్రణాశనమ్ ॥28॥

సరకక్షేత్రానికి తూర్పుదిశగా ముల్లోకాలలో ప్రఖ్యాతి చెందిన అన్యజన్మమనే తీర్థమున్నది. అది అన్నిపాపాలను నశింపజేస్తుది.

నారసింహం వపుః కృత్వా హత్వా దానవమూర్జితమ్ ।
తిర్యగ్యోనిస్థితో విష్ణుః సింహీషు రతిమాప్తవాన్ ॥29॥

తతో దేవాః సగంధర్వా ఆరాధ్య వరదం శివమ్ ।
ఊచుః ప్రణతసర్వాంగా విష్ణుదేహస్య లంభనే ॥30॥

తతో దేవో మహాత్మాసౌ శారభం రూపమాస్థితః ।
యుద్ధం చకార సుమహద్దివ్యం వర్షసహస్రకమ్ ॥31॥

యుద్ధ్యమానౌ తు తౌ దేవౌ పతితౌ హ్రదమధ్యతః ॥32॥

తస్మిన్సరస్తటే విప్రో దేవర్షిర్నారదః స్థితః ।
అశ్వత్థస్థానమాశ్రిత్య ధ్యానస్థస్తౌ దదర్శ హ ॥33॥

విష్ణుశ్చతుర్భుజో జజ్ఞే లింగాకారః శివః స్థితః ।
తౌ దృష్ట్వా తత్ర పురుషౌ తుష్టావ భక్తిభావతః ॥34॥

నరసింహరూపంలో క్రూరరాక్షసుని సంహరించిన విష్ణువు ఆ సింహరూపంలోనే వుండి, సింహాల పట్ల మమకారం పెంచుకున్నాడు. అంతట దేవతలు, గంధర్వులు మున్నగువారందరు శివుని ఆరాధించి, సాష్టాంగ ప్రణామాలు చేసి, విష్ణువు ఘోరరూపాన్ని గూర్చి విన్నవించారు. అంతట మహేశ్వరుడు శరభమనే మృగరూపం ధరించి, నరసింహునితో వేయి దివ్యవర్షాలు యుద్ధం చేశాడు. వారిరువురు ఆ విధంగా పోరాడుతూ, చివరకు ఈ సరోవరంలో పడిపోయారు. ఆ సరోవరతీరంలో ఒక రావిచెట్టు క్రింద ధ్యానస్థుడైయున్న నారదమహర్షి ఆ విషయం చూశాడు. అంతట విష్ణువు చతుర్భుజాకారాన్ని, శివుడు లింగాకృతిని పొంది నిలిచారు. ఆ పరమపురుషులిరువురిని చూసి, నారదుడు భక్తితో ఇలా స్తోత్రం చేశాడు.

నమః శివాయ దేవాయ విష్ణవే ప్రభవిష్ణవే ।
హరయే చ ఉమాభర్త్రే స్థితికాలభృతే నమః ॥35॥

హరాయ బహురూపాయ విశ్వరూపాయ విష్ణవే ।
త్ర్యంబకాయ సుసిద్ధాయ కృష్ణాయ జ్ఞానహేతవే ॥36॥

ధన్యోఽహం సుకృతీ నిత్యం యద్దృష్టౌ పురుషోత్తమౌ ।
మమాశ్రమమిదం పుణ్యం యువాభ్యాం విమలీకృతమ్ ॥37॥

అద్య ప్రభృతి త్రైలోక్యే అన్యజన్మేతి విశ్రుతమ్ ॥38॥

య ఇహాగత్య చ స్నాత్వా పితౄన్ సంతర్పయిష్యతి ।
తస్య శ్రద్ధాన్వితస్యేహ జ్ఞానమైంద్రం భవిష్యతి ॥39॥

అశ్వత్థస్య చ యన్మూలం సదా తత్ర వసామ్యహమ్ ।
అశ్వత్థవందనం కృత్వా యమం రౌద్రం న పశ్యతి ॥40॥

శివునకు నమస్కారం. దేవునకు నమస్కారం. విష్ణునకు, ప్రభవిష్ణునకు నమస్కారం. హరునకు, ఉమాభర్తకు, స్థితిలయకర్తకు నమస్కారం. బహురూపధారియగు హరునకు నమస్కారం. విశ్వరూపుడైన విష్ణునకు నమస్కారం. సిద్ధమూర్తియగు త్ర్యంబకునకు నమస్కారం. జ్ఞానహేతువైన కృష్ణునకు నమస్కారం. నేనెంతో ధన్యుడను. సుకృతిని. పురుషోత్తములైన మిమ్ములను నిత్యము దర్శింపగల్గితిని. మీ ఇరువురిచే పవిత్రీకృతమైన ఈ నా ఆశ్రమం పుణ్యస్థలం. ఇది ఈనాటినుండి అన్యజన్మక్షేత్రంగా ఖ్యాతి పొందగలదు. ముల్లోకాలలో ఉత్తమమైన ఇచ్చట స్నానం

చేసి,పితరులకు తర్పణమిచ్చిన శ్రద్ధాళువునకు మహేంద్రజ్ఞానం కలుగుతుంది. నేనెల్లప్పుడూ నివసించే అశ్వత్థమూలాన్ని చూసి, ఆ వృక్షానికి వందనమొనర్చువారు భయంకరమైన యమదర్శనం చేయరు.

తతో గచ్ఛేద్ధి విప్రేంద్రా నాగస్య హ్రదముత్తమమ్ ।
పుండరీకాంభసి స్నాత్వా పౌండరీకఫలమాప్నుయాత్ ॥41॥

దశమ్యాం శుక్లపక్షస్య చైత్రస్య తు విశేషతః ।
స్నానం జపస్తథా శ్రాద్ధం ముక్తిమార్గప్రదాయకమ్ ॥42॥

బ్రాహ్మణోత్తములారా! అచ్చటినుండి ఉత్తమమైన నాగహ్రదానికి వెళ్ళాలి. పౌండరీకతీర్థంలో స్నానం చేసినచో పౌండరీకయజ్ఞఫలం లభిస్తుంది. చైత్రశుక్లదశమినాడు అచ్చట స్నానజపశ్రాద్ధాదులు విశేషించి చేసినచో ముక్తి పొందవచ్చును.

తతస్త్రివిష్టపం గచ్ఛేత్తీర్థం దేవనిషేవితమ్ ।
తత్ర వైతరణీ పుణ్యా నదీ పాపప్రమోచనీ ॥43॥

తత్ర స్నాత్వాఽర్చయిత్వా చ శూలపాణిం వృషధ్వజమ్ ।
సర్వపాపవిశుద్ధాత్మా గచ్ఛేచ్చ పరమాం గతిమ్ ॥44॥

అచ్చటినుండి దేవతలు సేవించే త్రివిష్టపతీర్థానికి వెళ్ళాలి. అక్కడ పాపవిమోచనం చేసే వైతరణి అనే పుణ్యనదియున్నది. అక్కడ స్నానం చేసి శూలపాణియు, వృషధ్వజుడునైన మహాదేవుని అర్చించినచో సర్వపాపాలు వదలి, విశుద్ధాత్ముడై పరమగతిని పొందుతాడు.

తతో గచ్ఛేద్ధి విప్రేంద్రా రసావర్తనముత్తమమ్ ।
తత్ర స్నాత్వా భక్తియుక్తః సిద్ధిమాప్నోత్యనుత్తమమ్ ॥45॥

చైత్రశుక్లచతుర్దశ్యాం తీర్థే స్నాత్వా హ్యలేపకే ।
పూజయిత్వా శివం తత్ర పాపలేశో న విద్యతే ॥46॥

బ్రాహ్మణోత్తములారా! తదనంతరం రసావర్తనమనే ఉత్తమతీర్థంలో భక్తిశ్రద్ధలతో స్నానం చేసినచో ఉత్తమమైన సిద్ధి కలుగుతుంది. చైత్రశుక్లచతుర్దశినాడు అలేపనమనే తీర్థంలో మునిగి, శివపూజ గావించినచో ఏ మాత్రమూ పాపమంటజాలదు.

తతో గచ్ఛేద్ధి విప్రేంద్రా ఫలకీవనముత్తమమ్ ।
యత్ర దేవాః సగంధర్వాః సాధ్యాశ్చ ఋషయస్తథా ।
తపశ్చరంతి విపులం దివ్యం వర్షసహస్రకమ్ ॥47॥

విప్రేంద్రులారా! అచ్చటినుండి ఉత్తమమైన ఫలకీవనానికి వెళ్ళాలి. అక్కడ దేవతలు, గంధర్వులు, సాధ్యులు, ఋషులు వేయి దివ్యసంవత్సరాలనుండి తపస్సు చేస్తున్నారు.

దృషద్వత్యాం నరః స్నాత్వా తర్పయిత్వా చ దేవతాః ।
అగ్నిష్టోమాతిరాత్రస్య ఫలం విందతి మానవః ॥48॥

దృషద్వతినదిలో స్నానం చేసి, దేవపితృతర్పణాదులు చేసిన మానవుడు అగ్నిష్టోమ, అతిరాత్రక్రతుఫలం పొందుతాడు.

సోమక్షయే చ సంప్రాప్తే సోమస్య చ దినే తథా ।
యః శ్రాద్ధం కురుతే మర్త్యస్తస్య పుణ్యఫలం శృణు ॥49॥

గయాయాం చ యథా శ్రాద్ధం పితౄన్ ప్రీణాతి నిత్యశః ।
తథా శ్రాద్ధం చ కర్తవ్యం ఫలకీవనమాశ్రితైః ॥50॥

మనసా స్మరతే యస్తు ఫలకీవనముత్తమమ్ ।
తస్యైవ పితరస్తృప్తిం ప్రయాస్యంతి న సంశయః ॥51॥

సోమవారంనాడు చంద్రక్షీణమైనచో అనగా అమావాస్యతో కూడిన సోమవారంనాడు ఏ మానవుడు శ్రాద్ధకర్మ చేస్తాడో అతనికి కలిగే పుణ్యఫలం వినుము. గయాశ్రాద్ధం పితృదేవతలకు ఎల్లప్పుడు ఎటువంటి తృప్తిని ఇస్తుందో అట్లే ఫలకీవనంలో చేసిన శ్రాద్ధకర్మ కూడా అంతటి ఫలాన్ని ప్రసాదిస్తుంది. అంతే కాదు మనసా ఫలకీవనాన్ని స్మరించినంత మాత్రం చేతనే మానవుని పితరులు సంతృప్తులౌతారనడంలో సందేహం లేదు.

తత్రాపి తీర్థం సుమహత్సర్వదేవైరలంకృతమ్ ।
తస్మిన్ స్నాతస్తు పురుషో గోసహస్రఫలం లభేత్ ॥52॥

అక్కడే సర్వదేవతలకు నిలయమైన మహాతీర్థం ఒకటున్నది. అందులో స్నానం చేసిన వానికి వేయిగోవులు దానం చేసిన ఫలం లభిస్తుంది.

పాణిఖాతే నరః స్నాత్వా పితౄన్ సంతర్ప్య మానవః ।
అవాప్నుయాద్రాజసూయం సాంఖ్యం యోగం చ విందతి ॥53॥

పాణిఖాతతీర్థంలో స్నాతుడై, పితృతర్పణం చేసిన మానవునకు రాజసూయం చేసిన ఫలం కలిగి, సాంఖ్య యోగసిద్ధి కలుగుతుంది.

తతో గచ్ఛేద్ధి సుమహత్తీర్థమిశ్రకముత్తమమ్ ।
తత్ర తీర్థాని మునినా మిశ్రితాని మహాత్మనా ॥54॥

వ్యాసేన మునిశార్దూల దధీచ్యర్థం మహాత్మనా ।
సర్వతీర్థేషు స స్నాతో మిశ్రకే స్నాతి యో నరః ॥55॥

తరువాత అతిమహిమ గల మిశ్రకతీర్థం వస్తుంది. దధీచిమహర్షి కొరకు వ్యాసమహర్షి సర్వతీర్థజలాలను అచ్చట మిశ్రితం చేసాడు. ఆ మిశ్రకంలో స్నానం చేసినచో సకలతీర్థాలలో స్నానం చేసిన ఫలం లభిస్తుంది.

తతో వ్యాసవనం గచ్ఛేన్నియతో నియతాశనః ।
మనోజవే నరః స్నాత్వా దృష్ట్వా దేవమణిం శివమ్ ॥56॥

మనసా చింతితం సర్వం సిధ్యతే నాత్ర సంశయః ।

అక్కడినుండి నియతాహారియై, నిష్ఠతో వ్యాసవనానికి వెళ్ళాలి. అక్కడ మనోజవతీర్థంలో మునిగి, దేవతా రత్నమైన శివుని దర్శిస్తే మనసులోని తలంపులన్నీ సిద్ధించడం నిశ్చయం.

గత్వా మధువటీం చైవ దేవ్యాస్తీర్థం నరః శుచిః ॥57॥

తత్ర స్నాత్వా చ వై దేవాన్ పితౄంశ్చ ప్రయతో నరః ।
స దేవ్యా సమనుజ్ఞాతో యథా సిద్ధిం లభేన్నరః ॥58॥

అనంతరం మధువటి అనే దేవీతీర్థంలో నరుడు శుచియై స్నానం చేసి, దేవపితృతర్పణాదులు చేస్తే ఆ దేవి కృపవలన గొప్పసిద్ధులు లభిస్తాయి.

కౌశిక్యాః సంగమే యస్తు దృషద్వత్యాం నరోత్తమః ।
స్నాయీత నియతాహారః సర్వపాపైః ప్రముచ్యతే ॥59॥

నియతాహారియైన ఉత్తమనరుడు దృషద్వతీ, కౌశికీనదుల సంగమంలో స్నానం చేసినచో సర్వపాపముల నుండి ముక్తుడౌతాడు.

తతో వ్యాసస్థలీం గచ్ఛేద్యత్ర వ్యాసేన ధీమతా ।
పుత్రశోకాభిభూతేన దేహత్యాగాయ నిశ్చయః ॥60॥

కృతో దేవైశ్చ విప్రేంద్ర పునరుత్థాపితస్తదా ।
అభిగమ్య స్థలీం తస్య పుత్రశోకం న విందతి ॥61॥

ఓ విప్రేంద్రా! అక్కడినుండి వ్యాసస్థలికి వెళ్ళాలి. అక్కడనే పుత్రశోకంతో తల్లడిల్లిన వ్యాసుడు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డాడు. అంతట దేవతలు ఉపశమనవాక్యాలు పలికి ఆయన నిర్ణయాన్ని మార్పించారు. ఆ తీర్థంలో స్నానం చేసిన వారికి పుత్రశోకం కలుగదు.

కిందత్తరూపమాసాద్య తిలప్రస్థం ప్రదాయ చ ।
గచ్ఛేచ్చ పరమాం సిద్ధిం తతో ముక్తిమవాప్నుయాత్ ॥62॥

తరువాత కిందత్తమనే తీర్థంలో ఒక ప్రస్థం (కొలత విశేషం మానెడు) నువ్వులు దానం చేసినచో ఋణబాధలు తొలగిపోయి పరమపదసిద్ధి లభిస్తుంది.

అహ్నం చ సుదినం చైవ ద్వే తీర్థే భువి దుర్లభే ।
తయోః స్నాత్వా విశుద్ధాత్మా సూర్యలోకమవాప్నుయాత్ ॥63॥

అహ్నం, సుదినం అనే అతిదుర్లభమైన రెండు తీర్థాలలో విశుద్ధాత్ముడై స్నానం చేసిన వానికి సూర్యలోకప్రాప్తి కలుగుతుంది.

కృతజప్యం తతో గచ్ఛేత్ త్రిషు లోకేషు విశ్రుతమ్ ।
తత్రాభిషేకం కుర్వీత గంగాయాం ప్రయతః స్థితః ॥64॥

అర్చయిత్వా మహాదేవమశ్వమేధఫలం లభేత్ ।
కోటితీర్థం చ తత్రైవ దృష్ట్వా కోటీశ్వరం ప్రభుమ్ ॥65॥

తత్ర స్నాత్వా శ్రద్ధధానః కోటియజ్ఞఫలం లభేత్ ।

అనంతరం ముల్లోకాలలో ప్రసిద్ధమైన కృతజప్యతీర్థం వస్తుంది. ఇంద్రియనిగ్రహం కలిగి, అచ్చట గంగాస్నానం చేసి, మహాదేవుని అర్చిస్తే అశ్వమేధఫలం లభిస్తుంది. అక్కడ కోటితీర్థంలో స్నానం చేసి, శ్రద్ధాభక్తులతో కోటీశ్వరస్వామిని దర్శిస్తే కోటియజ్ఞాలు చేసిన ఫలం కలుగుతుంది.

తతో వామనకం గచ్ఛేత్త్రిషు లోకేషు విశ్రుతమ్ ॥66॥

యత్ర వామనరూపేణ విష్ణునా ప్రభవిష్ణునా ।
బలేరపహృతం రాజ్యమింద్రాయ ప్రతిపాదితమ్ ॥67॥

తత్ర విష్ణుపదే స్నాత్వా అర్చయిత్వా చ వామనమ్ ।
సర్వపాపవిశుద్ధాత్మా విష్ణులోకమవాప్నుయాత్ ॥68॥

అచ్చటినుండి ముల్లోకాలలో ప్రసిద్ధిగాంచిన వామనక్షేత్రానికి వెళ్ళాలి. అచ్చటనే వామనమూర్తి బలిని వంచించి, రాజ్యాన్ని తీసుకొని ఇంద్రునకు ప్రసాదించాడు. అక్కడి విష్ణుపదతీర్థంలో స్నానం చేసి, వామనుని అర్చించిన నరుడు సర్వపాపవిముక్తుడై, విశుద్ధాత్ముడై, విష్ణులోకాన్ని పొందుతాడు.

జ్యేష్ఠాశ్రమం చ తత్రైవ సర్వపాతకనాశనమ్ ।
తం తు దృష్ట్వా నరో ముక్తిం సంప్రయాతి న సంశయః ॥69॥

జ్యేష్ఠమాసే సితే పక్షే ఏకాదశ్యాముపోషితః ।
ద్వాదశ్యాం చ నరః స్నాత్వా జ్యేష్ఠత్వం లభతే నృషు ॥70॥

తత్ర ప్రతిష్ఠితా విప్రా విష్ణునా ప్రభవిష్ణునా ।
దీక్షా ప్రతిష్ఠా సంయుక్తా విష్ణుప్రీణనతత్పరాః ॥71॥

తేభ్యో దత్తాని శ్రాద్ధాని దానాని వివిధాని చ ।
అక్షయాణి భవిష్యన్తి యావన్మన్వంతరస్థితిః ॥72॥

అక్కడనే సకలపాపనాశనియైన జ్యేష్ఠాశ్రమమున్నది. దానిని దర్శించినంతమాత్రంచేతనే నరుడు ముక్తుడౌతాడు. ఇందులో సంశయం లేదు. జ్యేష్ఠశుద్ధ ఏకాదశినాడు ఉపవసించి, ద్వాదశినాడు ఆ తీర్థంలో

స్నానం చేస్తే నరులలో శ్రేష్ఠత్వాన్ని పొందుతాడు. అచ్చట అత్యంతవ్రతదీక్షాపరులు, పవిత్రులునైన బ్రాహ్మణులను విష్ణుభగవానుడు నిల్పినాడు. ఆ విష్ణుభక్తులకొసగు దానములు, అచ్చట జరుపబడు శ్రాద్ధములు అక్షయమై, మన్వంతరాంతంవరకు వానికర్తలకు ఫలములిస్తూ ఉంటాయి.

తత్రైవ కోటితీర్థం చ త్రిషు లోకేషు విశ్రుతమ్ ।
తస్మింస్తీర్థే నరః స్నాత్వా కోటియజ్ఞఫలం లభేత్ ॥73॥

కోటీశ్వరం నరో దృష్ట్వా తస్మింస్తీర్థే మహేశ్వరమ్ ।
మహాదేవప్రసాదేన గాణపత్యమవాప్నుయాత్ ॥74॥

అక్కడే త్రిభువనప్రసిద్ధమైన కోటితీర్థమున్నది. ఆ తీర్థంలో స్నానం చేసిన మానవునకు కోటియజ్ఞఫలం కలుగుతుంది. ఆ తీర్థంలోని కోటీశ్వరమహాదేవుని దర్శనం చేస్తే ఆ స్వామి కృప వల్ల గణాధిపత్యం లభిస్తుంది.

తత్రైవ సుమహత్తీర్థం సూర్యస్య చ మహాత్మనః ।
తస్మిన్ స్నాత్వా భక్తియుతః సూర్యలోకే మహీయతే ॥75॥

అచ్చటనే మహిమాన్వితమైన సూర్యతీర్థమున్నది. భక్తియుక్తుడై ఆ తీర్థంలో స్నానం చేయువాడు సూర్యలోకం పొందుతాడు.

తతో గచ్ఛేచ్చ విప్రేంద్రాస్తీర్థం కల్మషనాశనమ్ ।
కులోత్తారణకం నామ్నా విష్ణునా కల్పితం పురా ॥76॥

వర్ణానామాశ్రమాణాం చ తారణాయ సునిర్మలమ్ ।
బ్రహ్మచర్యాత్పరం మోక్షం య ఇచ్ఛంతి సునిర్మలమ్ ।
తేఽపి తత్తీర్థమాసాద్య పశ్యన్తి పరమం పదమ్ ॥77॥

బ్రహ్మచారీ గృహస్థశ్చ వానప్రస్థో యతిస్తథా ।
కులాని తారయేత్ స్నాతః సప్త సప్త చ సప్త చ ॥78॥

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః స్త్రియః శూద్రాశ్చ తత్పరాః ।
తీర్థస్నాతా భక్తియుతాః పశ్యన్తి పరమం పదమ్ ॥79॥

విప్రేంద్రులారా! అక్కడినుండి సకలకల్మషనాశకమైన కులోత్తారణతీర్థానికి వెళ్ళాలి. సకలవర్ణాశ్రమ వాసులను ఉద్ధరించడానికి దానిని స్వయంగా విష్ణుభగవానుడే పూర్వం కల్పించాడు. ఆ తీర్థాన్ని సేవించినవారు పరమపదాన్ని పొందుతారు. బ్రహ్మచర్యానంతరమే మోక్షం పొందాలని కోరేవారు ఆ తీర్థంలో ప్రవేశించినంతనే పరమపదాన్ని దర్శిస్తారు. ఆ తీర్థంలో స్నానం చేసిన బ్రహ్మచారి గాని, గృహస్థు గాని, వానప్రస్థుడు గాని, యతీశ్వరుడు గాని, తమ 21 తరాలవారిని తరింపజేస్తారు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులలో ఎవరైనను, స్త్రీలైనను విష్ణుభక్తి తత్పరులై అక్కడ స్నానం చేసినచో విష్ణుపదాన్ని దర్శించగలరు.

దూరస్థోఽపి స్మరేద్యస్తు కురుక్షేత్రం సవామనమ్ ।
సోఽపి ముక్తిమవాప్నోతి కిం పునస్తు వసన్నరః ॥80॥

ఎంత దూరంగా ఉన్నవారైనా, వామనదేవునితో కూడిన ఈ కురుక్షేత్రాన్ని భక్తితో స్మరిస్తే వారందరకు ముక్తి లభిస్తుంది. అటువంటప్పుడు ఆ పవిత్రభూమిలో నివసించేవారి భాగ్యవిశేషం చెప్పాలా?

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే కపిస్థలాది తీర్థమాహాత్మ్య కథనం నామ షట్త్రింశోఽధ్యాయః ॥36॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి కపిస్థలం మొదలైన తీర్థాల మాహాత్మ్యకథనమనే ముప్పైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తత్రింశోఽధ్యాయః – ముప్పైఏడవ అధ్యాయం

అమృతక్షేత్రాది తీర్థమాహాత్మ్యకథనమ్ – అమృతక్షేత్రం, పవనహ్రదం, మున్నగుతీర్థాల మాహాత్మ్యకథనం

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

పవనస్య హ్రదే స్నాత్వా దృష్ట్వా దేవం మహేశ్వరమ్ ।
విముక్తః సర్వకలుషైః శైవం పదమవాప్నుయాత్ ॥1॥

పుత్రశోకేన పవనో యస్మింల్లీనో బభూవ హ ।
తతః సబ్రహ్మకైర్దేవైః ప్రసాద్య ప్రకటీకృతః ॥2॥

పవనకుండంలో స్నానం చేసి, మహేశ్వరదర్శనం చేసుకున్నవాడు సర్వపాపములనుండి విముక్తుడై శివపదాన్ని పొందుతాడు. పుత్రశోకంతో వాయువు అందులో లీనుడైపోగా బ్రహ్మాదిదేవతలు ప్రసన్నులై మరల ప్రతిష్ఠింపజేశారు.

అతో గచ్ఛేత అమృతం స్థానం తచ్ఛూలపాణినః ।
యత్ర దేవైః సగంధర్వైః హనుమాన్ ప్రకటీకృతః ॥3॥

తత్ర తీర్థే నరః స్నాత్వా అమృతత్వమవాప్నుయాత్ ।

అక్కడినుండి దేవగంధర్వుల ద్వారా ఎచట హనుమంతుడు ప్రకటింపబడినాడో ఆ పవిత్రశివక్షేత్రమైన అమృతక్షేత్రానికి వెళ్ళాలి. అక్కడ స్నానం చేసిన మానవుడు అమృతత్వాన్ని పొందుతాడు.

కులోత్తారణమాసాద్య తీర్థసేవీ ద్విజోత్తమః ॥4॥
కులాని తారయేత్సర్వాన్ మాతామహపితామహాన్ ।

అంతట తీర్థసేవకుడైన ద్విజోత్తముడు కులోత్తారణతీర్థాన్ని సేవించినచో తన మాతామహపితామహాదు లందరు తరిస్తారు.

శాలిహోత్రస్య రాజర్షేస్తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ॥5॥

తత్ర స్నాత్వా విముక్తస్తు కలుషైర్దేహసంభవైః ।

రాజర్షిశాలిహోత్రతీర్థం ముల్లోకాలలో ప్రసిద్ధమైనది. అక్కడ స్నానం చేసి దేహగతమైన దోషాలనన్నిటిని పోగొట్టుకొనవచ్చును.

శ్రీకుంజం తు సరస్వత్యాం తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ॥6॥

తత్ర స్నాత్వా నరో భక్త్యా హ్యగ్నిష్టోమఫలం లభేత్ ।

సరస్వతీతటంలో ముల్లోకాలలో విఖ్యాతమైన శ్రీకుంజతీర్థం కలదు. అచ్చట భక్తితో స్నానం చేసిన మానవుడు అగ్నిష్టోమఫలాన్ని పొందుతాడు.

తతో నైమిషకుంజం తు సమాసాద్య నరః శుచిః ॥7॥

నైమిషస్య చ స్నానేన యత్పుణ్యం తత్సమాప్నుయాత్ ।

అక్కడినుండి నైమిషకుంజానికి చేరి, శుచియైన మానవుడు నైమిషంలో స్నానం చేసిన ఫలాన్ని పొందుతాడు.

తత్ర తీర్థం మహత్ఖ్యాతం వేదవత్యా నిషేవితమ్ ॥8॥
రావణేన గృహీతాయాః కేశేషు ద్విజసత్తమాః ।
తద్వధాయ చ సా ప్రాణాన్ముముచే శోకకర్శితా ॥9॥

తతో జాతా గృహే రాజ్ఞో జనకస్య మహాత్మనః ।
సీతా నామేతి విఖ్యాతా రామపత్నీ పతివ్రతా ॥10॥

సా హృతా రావణేనైవ వినాశాయాత్మనః స్వయమ్ ।
రామేణ రావణం హత్వా అభిషిచ్య విభీషణమ్ ॥11॥

సమానీతా గృహం సీతా కీర్తిరాత్మవతా యథా ।
తస్యాస్తీర్థే నరః స్నాత్వా కన్యాయజ్ఞఫలం లభేత్ ॥12॥

విముక్తః కలుషైః సర్వైః ప్రాప్నోతి పరమం పదమ్ ।

అక్కడనే మహిమోపేతమైన వేదవతీతీర్థమున్నది. అచ్చట రావణుడు వేదవతికేశాలు పట్టుకోగా కోపంతో ఆమె రావణుని వధించడానికి శరీరత్యాగం చేసింది. అనంతరం ఆమె జనకమహారాజు ఇంట సీత అనే పేరుతో జన్మించింది. రామపత్నియై పతివ్రతగా విఖ్యాతి చెందింది. ఆమెను రావణుడు ఆత్మనాశనానికి అపహరించుకొని పోగా రాముడు రావణుని సంహరించి, లంకారాజ్యానికి విభీషణుని రాజ్యాభిషిక్తునిచేసి, జితేంద్రియుడైన పురుషుడు కీర్తిని పొందిన విధంగా ఆ సాధ్విని తన ఇంటికి తిరిగి తీసుకొనిపోయాడు. ఆ వేదవతీతీర్థంలో స్నానం చేసిన మానవుడు కన్యాయజ్ఞఫలాన్ని పొందుతాడు. సమస్తకలుషములనుండి విముక్తుడై పరమపదాన్ని పొందుతాడు.

తతో గచ్ఛేచ్చ సుమహద్బ్రహ్మణః స్థానముత్తమమ్ ॥13॥

యత్ర వర్ణావరః స్నాత్వా బ్రాహ్మణ్యం లభతే నరః ।
బ్రాహ్మణశ్చ విశుద్ధాత్మా పరం పదమవాప్నుయాత్ ॥14॥

అచ్చటినుండి ఉత్తమస్థానమైన బ్రహ్మతీర్థానికి వెళ్ళాలి. అక్కడ స్నానం చేసినచో నిమ్నవర్ణాలవారు కూడా బ్రాహ్మణ్యాన్ని పొందుతారు. బ్రాహ్మణులు స్నానమాచరించినచో విశుద్ధాత్ములై పరమపదాన్ని పొందుతారు.

తతో గచ్ఛేత్సోమతీర్థం త్రైలోక్యే చాపి దుర్లభమ్ ।
యత్ర సోమస్తపస్తప్త్వా ద్విజరాజ్యమవాప్తవాన్ ॥15॥

తత్ర స్నాత్వార్చయిత్వా చ స్వపితౄన్ దైవతాని చ ।
నిర్మలః స్వర్గమాయాతి కార్తిక్యాం చంద్రమా యథా ॥16॥

అనంతరం త్రైలోక్యదుర్లభమైన సోమతీర్థానికి వెళ్ళాలి. సోముడు అక్కడ తపస్సు చేసి ద్విజరాజ్యాన్ని పొందాడు. అక్కడ స్నానం చేసి తన పితరులను, దేవతలను అర్చించినచో కార్తికపూర్ణిమాచంద్రుని వలె నిర్మలుడై స్వర్గాన్ని పొందుతాడు.

సప్తసారస్వతం తీర్థం త్రైలోక్యస్యాపి దుర్లభమ్ ।
యత్ర సప్తసరస్వత్య ఏకీకృతా వహంతి చ ॥17॥

సుప్రభా కాంచనాక్షీ చ విశాలా మానసహ్రదా ।
సరస్వత్యోఘనామ్నీ చ సురేణుర్విమలోదకా ॥18॥

పితామహస్య యజతః పుష్కరేషు స్థితస్య హ ।
అబ్రువనృషయస్సర్వే నాయం యజ్ఞో మహాఫలః ॥19॥

న దృశ్యతే సరిచ్ఛ్రేష్ఠా పుష్కరస్థా వై సరస్వతీ ।
తచ్ఛ్రుత్వా భగవాన్ప్రీతః సస్మారాథ సరస్వతీమ్ ॥20॥

పితామహేన యజతా హ్యాహూతా పుష్కరేషు చ ।
సుప్రభా నామ సా దేవీ తత్ర ఖ్యాతా సరస్వతీ ॥21॥

తాం దృష్ట్వా మునయః ప్రీతా వేగయుక్తాం సరస్వతీమ్ ।
పితామహం మానయన్తీం తే తు తాం బహు మేనిరే ॥22॥

ఏవమేషా సరిచ్ఛ్రేష్ఠా పుష్కరస్థా సరస్వతీ ।
సమానీతా కురుక్షేత్రం మంకణేన మహాత్మనా ॥23॥

ఎక్కడ సప్తసరస్వతులు ఏకీకృతమై, ప్రవహిస్తున్నాయో అదియే త్రైలోక్యదుర్లభమైన సప్తసారస్వతతీర్థము. సుప్రభ, కాంచనాక్షి, విశాల, మానసహ్రద, సరస్వత్యోఘ, సురేణు, విమలోదక అనే 7 సప్తసరస్వతులుగా విఖ్యాతములు. పుష్కరక్షేత్రంలో యజ్ఞం చేస్తున్న బ్రహ్మను చూసి ఋషులు నదీశిరోమణియైన సరస్వతీనది లేనిచోట నిర్వహింపబడుచున్న ఈ యజ్ఞం మహాఫలాన్ని ఈయజాలదని వక్కాణించారు. ఆ మాటలను వినిన బ్రహ్మ సంప్రీతుడై సరస్వతిని స్మరించాడు. ఆ విధంగా బ్రహ్మచే పిలువబడిన సరస్వతి సుప్రభాదేవిగా పుష్కరక్షేత్రానికి చేరుకున్నది. బ్రహ్మమీది గౌరవంతో వడివడిగా వచ్చిన సరస్వతిని చూసి ఋషులు సంతోషించి గౌరవించారు. పుష్కరక్షేత్రంలోనున్న నదీశ్రేష్ఠమైన సరస్వతిని మహాత్ముడగు మంకణుడు కురుక్షేత్రానికి తీసుకొనివచ్చాడు.

నైమిషే మునయః స్థిత్వా శౌనకాద్యాస్తపోధనాః ।
తే పృచ్ఛంతి మహాత్మానం పురాణం లోమహర్షణమ్ ॥24॥

కథం నః స్యాద్యజ్ఞఫలం వర్తతాం సత్పథే మునే ।
తతోఽబ్రవీన్మహాభాగః ప్రణమ్య శిరసా మునీన్ ॥25॥

సరస్వతీ స్థితా యత్ర తత్ర యజ్ఞఫలం మహత్ ।
ఏతచ్ఛ్రుత్వా తు మునయో నానాస్వాధ్యాయవేదినః ॥26॥

సమాగమ్య తతః సర్వే సంస్మరంతి సరస్వతీమ్ ।
సా తు ధ్యాతా తతస్తత్ర ఋషిభిః సత్రయాజిభిః ॥27॥

సమాగతా ప్లావనార్థం యజ్ఞం తేషాం మహాత్మనామ్ ।
నైమిషే కాంచనాక్షీ తు స్మృతా మంకణకేన సా ॥28॥

సమాయాతా కురుక్షేత్రం పుణ్యతోయా సరస్వతీ ।

శౌనకాదిమహర్షులు నైమిశారణ్యంలో పౌరాణికోత్తముడైన లోమహర్షణుని "మేము సన్మార్గంలో నడుస్తూ, యజ్ఞఫలం పొందే మార్గాన్ని ఓ మహామునీ! మాకు తెలియజేయండి" అని అడిగారు. అంతట మహాభాగుడైన లోమహర్షణుడు మునులకందరికి శిరసా నమస్కరించి ఇలా పలికాడు. "సరస్వతీనది ఎచ్చట ఉండునో అచ్చట నిర్వహింపబడిన యజ్ఞం గొప్ప ఫలాన్నిస్తుంది". మునులందరు ఈ మాటలను విని, స్వాధ్యాయపరులైన వారందరు ఒకచోట సమాగతులై సరస్వతిని స్మరించారు. సత్రయాగనిష్ఠులైన ఆ మహర్షులట్లు ధ్యానింపగానే వారి యజ్ఞం పవిత్రం చేయడానికి సరస్వతి వారి యజ్ఞస్థలానికి చేరుకున్నది. మంకణమహర్షిచే ధ్యానింపబడగానే కాంచనాక్షి అనే సరస్వతి నైమిషంనుండి కురుక్షేత్రానికి వచ్చి చేరింది.

గయస్య యజమానస్య గయాయాం చ మహాక్రతౌ ॥29॥

ఆహూతా చ సరిచ్ఛ్రేష్ఠా గయయజ్ఞే సరస్వతీ ।
విశాలాం నామ తాం ప్రాహుర్ఋషయః సంశితవ్రతాః ॥30॥

సరిత్సా హి సమాహూతా మంకణేన మహాత్మనా ।
కురుక్షేత్రం సమాయాతా ప్రవిష్టా చ మహానదీ ॥31॥

గయుడను రాజు గయలో మహాక్రతువును ఆరంభించి, అక్కడకు నదీశిరోమణియైన సరస్వతిని ఆహ్వానించాడు. ఆ విధంగా గయకు చేరిన సరస్వతిని విశాల అను పేరుతో ఋషులందరు పిలిచారు. ఆ సరస్వతి మంకణుని ప్రార్థనను మన్నించి కురుక్షేత్రం చేరింది.

ఉత్తరే కోశలాభాగే పుణ్యే దేవర్షిసేవితే ।
ఉద్దాలకేన మునినా తత్ర ధ్యాతా సరస్వతీ ॥32॥
ఆజగామ సరిచ్ఛ్రేష్ఠా తం దేశం మునికారణాత్ ।
పూజ్యమానా మునిగణైర్వల్కలాజినసంవృతైః ॥33॥

దేవర్షిసేవితమైన ఉత్తరకోశలపుణ్యభూమికి ఉద్దాలకముని ధ్యానించగా సరస్వతి వచ్చిచేరింది. ఆ ముని కారణంగా ఆ ప్రదేశానికి శ్రేష్ఠమైన సరస్వతీనది వచ్చింది. అచ్చట ఆ శ్రేష్ఠతరంగిణిని వల్కలాజినధారులైన మునిసమూహం పూజించింది.

మనోహరేతి విఖ్యాతా సర్వపాపక్షయావహా ।
ఆహూతా సా కురుక్షేత్రే మంకణేన మహాత్మనా ।
ఋషేః సమ్మానార్థాయ ప్రవిష్టా తీర్థముత్తమమ్ ॥34॥

సువేణురితి విఖ్యాతా కేదారే యా సరస్వతీ ।
సర్వపాపక్షయా జ్ఞేయా ఋషిసిద్ధనిషేవితా ॥35॥

సాఽపి తేనేహ మునినా హ్యారాధ్య పరమేశ్వరమ్ ।
ఋషీణాముపకారార్థం కురుక్షేత్రం ప్రవేశితా ॥36॥

సర్వపాపహారిణియైన ఆ నది మనోహరగా పిలువబడింది. ఆ నది మంకణుని ప్రార్థనను అంగీకరించి ఋషుల పట్ల గౌరవంతో కురుక్షేత్రానికి వచ్చింది. కేదారతీర్థంలోనున్న సరస్వతిని సువేణు అంటారు. ఋషులచే, సిద్ధులచే సేవింపబడిన ఆమె సర్వపాపహారిణి. ఆ మునియే పరమేశ్వరుని ఆరాధించి ఋషుల ఉపకారార్థం ఆమెను కూడా పవిత్రకురుక్షేత్రానికి రావించాడు.

దక్షేణ యజతా సాఽపి గంగాద్వారే సరస్వతీ ।
విమలోదా భగవతీ దక్షేణ ప్రకటీకృతా ॥ 37॥

సమాహూతా యయౌ తత్ర మంకణేన మహాత్మనా ।
కురుక్షేత్రే తు కురుణా యజతా చ సరస్వతీ ॥38॥

సరోమధ్యే సమానీతా మార్కండేయేన ధీమతా ।
అభిష్టూయ మహాభాగాం పుణ్యతోయాం సరస్వతీమ్ ॥39॥

యత్ర మంకణకః సిద్ధః సప్తసారస్వతే స్థితః ।
నృత్యమానశ్చ దేవేన శంకరేణ నివారితః ॥ 40॥

ఆ సరస్వతీపుణ్యనదియే యజ్ఞదీక్షితుడైన దక్షునిచేత గంగాద్వారంలో విమలోదరూపంలో వెలువరింపబడింది. మహాత్ముడైన మంకణుని పిలుపునందుకొని ఆమె కూడా కురురాజయజ్ఞస్థలమైన కురుక్షేత్రం చేరుకుంది. మహానుభావుడైన మార్కండేయమహర్షిస్తోత్రానికి సంతోషించి ఆ పుణ్యోదకయైన సరస్వతి సరోవరమధ్యస్థలానికి వచ్చి చేరింది. ఆ సప్తసారస్వతతీర్థంలో నృత్యం చేస్తున్న సిద్ధుడైన మంకణుని నృత్యాన్ని శంకరుడు నివారించాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే అమృతక్షేత్రాది తీర్థమాహాత్మ్యకథనం నామ సప్తత్రింశోఽధ్యాయః ॥37॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి అమృతక్షేత్రం, పవనహ్రదం, మున్నగుతీర్థాల కథనమనే ముప్పైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టత్రింశోऽధ్యాయః – ముప్పైఎనిమిదవ అధ్యాయం
మంకణస్య సిద్ధత్వప్రాప్తిః – మంకణమహర్షి సిద్ధుడైన వృత్తాంతం

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

కథం మంకణకః సిద్ధః కస్మాజ్జాతో మహానృషిః ।
నృత్యమానస్తు దేవేన కిమర్థం స నివారితః ॥1॥

మంకణకుడు సిద్ధుడెట్లయ్యాడు? ఆ మహర్షి ఎవరి కుమారుడు? ఆ మహర్షి నృత్యం చేస్తూ ఉండగా శివుడు ఎందుకు నివారించాడు?

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

కశ్యపాచ్చ సుతో జజ్ఞే మానసో మంకణో మునిః ।
స్నానం కర్తుం వ్యవసితో గృహీత్వా వల్కలం ద్విజాః ॥2॥

తత్రాగతా హ్యప్సరసో రంభాద్యాః ప్రియదర్శనాః ।
స్నాంత్యేవ రుచిరాకారా ముక్తవస్త్రా అనిందితాః ॥3॥

తతో మునేస్తదా క్షోభాద్రేతః స్కన్నం యదంభసి ।
వ్యాధో జగ్రాహ తద్రేతః కలశే న్యక్షిపత్తథా ॥4॥

సప్తధా ప్రవిభాగం తు కలశస్య జగామ హ ।
తత్రర్షయః సప్త జాతా విదుర్యాన్మరుతో గణాన్ ॥5॥

వాయువేగో వాయుబలో వాయుహా వాయుమండలః ।
వాయుకాలో వాయురేతా వాయుచక్రశ్చ వీర్యవాన్ ॥6॥

తస్యర్షేస్తనయా ఏతే ధారయంతి చరాచరమ్ ।

ఓ ద్విజులారా! మంకణముని కశ్యపమహర్షిమానసపుత్రుడు. ఒకనాడాయన వల్కలాలతో స్నానం చేయడానికి ఉద్యుక్తుడయ్యాడు. అప్పుడచ్చటకు సుందరులు, ప్రియదర్శనులు, కోమలాంగులునైన రంభాది అప్సరసలు వచ్చి వస్త్రాలను విడిచి, ఆయనతోబాటు స్నానం చేయసాగారు. అంతట మహర్షికి మనస్సు క్షోభించినందున ఆ ముని వీర్యం నీటిలో జారిపడగా వ్యాధుడు దానినొక కలశంలోనుంచాడు. కలశంలోని ఆ వీర్యం ఏడు భాగాలై, అందులోనుండి ఏడుగురు ఋషులు ఉద్భవించారు. వారినే సప్తమరుద్గణాలంటారు. వాయువేగ, వాయుబల, వాయుహా, వాయుమండల, వాయుకాల, వాయురేత, వాయుచక్ర అనేపేర్లు గల మహావీర్యవంతులు ఉద్భవించారు. ఆ ఋషికి పుట్టిన ఈ ఏడుగురు కుమారులు ఈ చరాచరజగత్తునంతటిని భరిస్తున్నారు.

పురా మంకణకః విద్ధః కుశాగ్రేణేతి మే శ్రుతమ్ ॥7॥

క్షతాత్కిల కరే విప్రాస్తస్య శాకరసోఽ స్రవత్ ।
స వై శాకరసం దృష్ట్వా హర్షావిష్టః స నృత్తవాన్ ॥8॥

తతః సర్వం ప్రనృత్తం చ స్థావరం జంగమం చ యత్ ।
ప్రనృత్తం చ జగద్దృష్ట్వా తేజసా తస్య మోహితమ్ ॥9॥

బ్రహ్మాదిభిః సురైస్తత్ర ఋషిభిశ్చ తపోధనైః ।
విజ్ఞప్తో వై మహాదేవో మునేరర్థే ద్విజోత్తమాః ॥10॥

నాయం నృత్యేద్యథా దేవ తథా త్వం కర్తుమర్హసి ।
తతో దేవో మునిం దృష్ట్వా హర్షావిష్టమతిం తదా ॥11॥

సురాణాం హితకామార్థం మహాదేవోఽ భ్యభాషత ।
హర్షస్థానం కిమర్థం చ తవైవం మునిసత్తమ ।
తపస్వినో ధర్మపథే స్థితస్య ద్విజసత్తమ ॥12॥

సిద్ధపురుషుడైన మంకణకుడు పూర్వమొకమారు కుశాగ్రంతో చేయి కోసుకున్నట్లు, ఆ వ్రణం నుండి శాకరసం ద్రవించినట్లు వినియున్నాను. చేతినుండి కారుచున్న శాకరసాన్ని చూసి ఆయన ఆనందంతో నాట్యం చేయసాగాడు. ఆయన తేజస్సునకు మోహం చెంది స్థావరజంగమాత్మకమైన జగత్తంతయు ఆయనతో బాటు నాట్యం చేయసాగింది. ఈ విధంగా నాట్యం చేస్తున్న జగత్తునంతటిని చూసి బ్రహ్మాదిదేవతలు, తపోధనులైన ఋషులు అందరు కలసి మహాదేవుని దర్శించి ఇలా విన్నవించారు. "ఓ దేవా! నీవెట్లు నృత్యం చేస్తున్నావో ఆ విధంగా నృత్యం చేస్తున్న ఈ మునిని నృత్యం చేయకుండా నివారించండి" అని. అంతట శివుడు హర్షోన్మత్తుడైన మునిని చూసి, దేవహితం కొరకు అతనిని ఇలా ప్రశ్నించాడు – " ఓ మునిసత్తమా! ఓ బ్రాహ్మణోత్తమా! తపస్వియు, ధర్మమార్గానుయాయియునైన నీవింతటి హర్షాతిరేకం పొందడానికి కారణమేమిటో తెలియజేయుము" అని.

ఋషిరువాచ – మంకణమహర్షి పలికాడు.

కిం న పశ్యసి మే బ్రహ్మన్ కరాచ్ఛాకరసం స్రుతమ్ ।
యం దృష్ట్వా చ ప్రనృత్తో వై హర్షేణ మహతాన్వితః ॥13॥

హే భగవాన్! నా చేతినుండి కారుచున్న శాకరసాన్ని చూడడం లేదా? దానిని చూసియే నేను ఆనందంతో నృత్యం చేస్తున్నాను.

తం ప్రహస్యాబ్రవీద్దేవో మునిం రాగేణ మోహితమ్ ।
అహం న విస్మయం విప్ర గచ్ఛామీహ ప్రపశ్య మామ్ ॥14॥

ఏవముక్త్వా మునిశ్రేష్ఠం దేవదేవో మహాద్యుతిః ।
అంగుల్యగ్రేణ విప్రేంద్రాః స్వాంగుష్ఠస్తాడితోఽ భవత్ ॥15॥

తతో భస్మక్షతాత్తస్మాన్నిర్గతం హిమసన్నిభమ్ ।
తద్దృష్ట్వా వ్రీడితో విప్రః పాదయోః పతితోఽబ్రవీత్ ॥16॥

ఆ మహర్షిమాటలకు నవ్వి పరమేశ్వరుడు – "ఓ రాగమోహితుడవైన మునీ! ఇందులో నాకేమీ ఆశ్చర్యం కనిపించడంలేదు. నన్ను చూడు" అని మునిశ్రేష్ఠునితో పలికి, ఆ మహాతేజస్వియైన దేవదేవుడు తన అంగుళి చివరిభాగంతో బొటనవ్రేలిని ప్రహరించాడు. అంతట అందులోనుండి తెల్లని మంచువంటి భస్మం బయటకు వచ్చింది. మంకణుడది చూసి సిగ్గుపడి, పరమేశ్వరుని పాదాలమీద వ్రాలి ఇలా ప్రార్థించాడు.

నాన్యద్దేవాదహం మన్యే శూలపాణేర్మహాత్మనః ।
చరాచరస్య జగతో గురుస్త్వమపి శూలధృక్ ॥17॥

త్వదాశ్రయాశ్చ దృశ్యంతే సురా బ్రహ్మాదయోఽనఘ ।
సర్వస్త్వమసి దేవానాం కర్తా కారయితా మహాన్ ॥18॥

త్వత్ప్రసాదాత్సురాః సర్వే మోదంతే హ్యకుతోభయాః ।
సురాసురస్య చాధీశ న తపో మే క్షరేన్మహత్ ॥19॥

"ఓ శూలపాణీ! నీకంటే వేరేదైవమున్నాడని నేను భావించడం లేదు. చరాచరజగత్తునకు శూలపాణివైన నీవే శ్రేష్ఠుడవు. ఈ బ్రహ్మాది దేవతలందరు నిన్ను ఆశ్రయించియే బ్రతుకుతున్నారు. ఓ అనఘా! దేవశ్రేణిలో అగ్రస్థానం నీదే. సర్వదేవతాస్వరూపుడవు నీవే. ఈ జగత్తునంతటిని సృష్టించువాడవు, నడిపించువాడవు, నీవే. నీ అనుగ్రహం వల్లనే దేవతలందరు ఎవరినుండియు ఎటువంటి భయము లేక ఆనందంతో నున్నారు. సురాసురులకు ఆధీశుడవు నీవే. నీ దయవల్ల నా తపస్సు నశింపకుండు గాక!".

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

ఏవం స్తుత్వా మహాదేవం ఋషిః స ప్రణతోఽభవత్ ।
తతో దేవః ప్రసన్నాత్మా తమృషిం వాక్యమబ్రవీత్ ॥20॥

మంకణమహర్షి ఈ విధంగా మహాదేవుని స్తుతించి, పాదాలపై బడి, నమస్కరించాడు. అంతట మహాదేవుడు ప్రసన్నాత్ముడై ఆ మహర్షితో ఇలా పలికాడు.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు పలికాడు.

తపస్తే వర్ధతాం విప్ర మత్ప్రసాదాత్సహస్రధా ।
ఆశ్రమే చేహ వత్స్యామి త్వయా సార్ధమహం సదా ॥21॥

సప్తసారస్వతే స్నాత్వా యో మామర్చిష్యతే నరః ।
న తస్య దుర్లభం కించిదిహ లోకే పరత్ర చ ॥22॥

సారస్వతం చ తం లోకం గమిష్యతి న సంశయః ।
శివస్య చ ప్రసాదేన ప్రాప్నోతి పరమం పదమ్ ॥23॥

ఓ విప్రా! నా దయ వల్ల నీ తపస్సు వేయిరెట్లు వృద్ధి పొందుతుంది. నీతో బాటు ఈ ఆశ్రమంలో నేనెల్లప్పుడు నివసిస్తాను. సప్తసారస్వతక్షేత్రంలో స్నానం చేసి ఏ మానవుడు నన్ను పూజిస్తాడో ఆ మానవుడికి ఇహపరలోకాలలో దుర్లభమైనది ఏదీ వుండదు. శివానుగ్రహం వల్ల అట్టి అదృష్టవంతుడు సారస్వతలోకం పొందుతాడు. అంతేగాక పరమపదాన్ని కూడా పొందుతాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే మంకణస్య సిద్ధత్వప్రాప్తిర్నామ అష్టత్రింశోఽధ్యాయః ॥38॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి మంకణమహర్షి సిద్ధుడైన వృత్తాంతమనే ముప్ఫైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనచత్వారింశోఽధ్యాయః - ముప్పైతొమ్మిదవ అధ్యాయం

ఔశనసాదితీర్థమాహాత్మ్యకథనమ్ - ఔశనస, పృథూదకం మున్నగుతీర్థాల మాహాత్మ్యకథనం

లోమహర్షణ ఉవాచ - లోమహర్షణుడు పలికాడు.

తతశ్చౌశనసం తీర్థం గచ్ఛేత్తు శ్రద్ధయాఽన్వితః ।
ఉశనా యత్ర సంసిద్ధో గ్రహత్వం సమవాప్తవాన్ ॥1॥

తస్మిన్పుణ్యే కురుక్షేత్రే పాతకైర్జన్మసంభవైః ।
ముక్తో యాతి పరం బ్రహ్మ యతో నావర్తతే పునః ॥2॥

శ్రద్ధతో అచ్చటనుండి ఔశనసతీర్థానికి వెళ్ళాలి. అక్కడనే ఉశనసుడు అనగా శుక్రుడు సిద్ధి పొంది గ్రహత్వాన్ని పొందాడు. ఆ పుణ్యప్రదమైన కురుక్షేత్రంలో స్నానం చేస్తే అనేక జన్మలలో సంభవించిన పాపాలనుండి ముక్తిని పొంది పునరావృత్తిరహితమైన పరబ్రహ్మను చేరుకుంటారు.

రహోదరో నామ మునిర్యత్ర ముక్తో బభూవ హ ।
మహతా శిరసా గ్రస్తస్తీర్థమాహాత్మ్యదర్శనాత్ ॥3॥

భయంకరమైన శిరస్సుతో పీడింపబడిన రహోదరుడనే ముని అక్కడనే ఆ శిరస్సునుండి విముక్తుడయ్యాడు.

ఋషయ ఊచుః - ఋషులు పలికారు.

కథం రహోదరో గ్రస్తః కథం మోక్షమవాప్తవాన్ ।
తీర్థస్య తస్య మాహాత్మ్యం శ్రోతుమిచ్ఛామహే వయమ్ ॥4॥

రహోదరమహర్షికి శిరోగ్రహణం ఎలా సంభవించింది? అది ఆ తీర్థమహిమవల్ల ఎలా తొలగిపోయింది? మాకు వినాలని కుతూహలంగా వుంది. దయతో చెప్పండి.

లోమహర్షణ ఉవాచ - లోమహర్షణుడు పలికాడు.

పురా వై దండకారణ్యే రాఘవేణ మహాత్మనా ।
వసతా ద్విజశార్దూల రాక్షసాస్తత్ర హింసితాః ॥5॥

తత్రైకస్య శిరశ్ఛిన్నం రాక్షసస్య దురాత్మనః ।
క్షురేణ శితధారేణ తత్పపాత మహావనే ॥6॥

రహోదరస్య తల్లగ్నం జంఘాయాం వై యదృచ్ఛయా ।
వనే విచరతస్తస్య హ్యస్థి భిత్వా వివేశ హ ॥7॥

స తేన లగ్నేన తదా విహర్తుం న శశాక హ ।
అభిగమ్య మహాప్రాజ్ఞస్తీర్థాన్యాయతనాని చ ॥8॥

స పూతితా విస్రవతా వేదనార్తో మహామునిః ।
జగామ సర్వతీర్థాని పృథివ్యాం యాని కానిచిత్ ॥9॥

తతః స కథయామాస ఋషీణాం భావితాత్మనామ్ ।
తేऽబ్రువన్నృషయో విప్రా ప్రయాహ్యౌశనసం ప్రతి ॥10॥

తేషాం తద్వచనం శ్రుత్వా జగామ స రహోదరః ।
తత ఔశనసం తీర్థం తస్యాపః స్పృశతస్తదా ॥11॥

తచ్ఛిరః శరణం ముక్త్వా పపాతాంతర్జలే ద్విజాః ।
తతః స విరజా భూత్వా పూతాత్మా వీతకల్మషః ॥12॥

ఆజగామాశ్రమం ప్రీతః కథయామాస చాఖిలమ్ ।
తే శ్రుత్వా ఋషయః సర్వే తీర్థమాహాత్మ్యముత్తమమ్ ॥13॥

కపాలమోచనమితి నామ చక్రుః సమాగతాః ।

ఓ బ్రాహ్మణులారా! పూర్వం శ్రీరాముడు దండకారణ్యంలో వున్నప్పుడు ఎందరో దుష్టరాక్షసులను సంహరించాడు. అప్పుడొక దుర్మార్గుని తలను నిశితకరవాలంతో ఖండించగా అది పోయి ఒక మహారణ్యంలో పడింది. అది ఆ అడవిలో సంచరిస్తున్న రహోదరుని జంఘభాగంలోని ఎముకను చీల్చుకొని ఆ రాక్షసుని తలలోపల ప్రవేశించింది. అది ఆ విధంగా తగుల్కొన్నందున ఆ మహర్షి దర్శింప సంకల్పించుకొనిన తీర్థాలకు వెళ్ళలేకపోయాడు. ఆ విధంగా చీము కారుతూ బాధ కలిగిస్తున్నా ఆ ముని ఆ వేదనతోనే భూమండలంలోనున్న సమస్తతీర్థాలను సేవించసాగాడు. దారిలో తాము దర్శించిన ఋషులకు తమ బాధ తెలుపుకొనగా వారాతనిని ఔశనసతీర్థానికి వెళ్ళమని సలహా యిచ్చారు. ఆ రహోదరముని వారి మాటప్రకారం ఔశనసతీర్థానికివెళ్ళి, ఆ తీర్థంలోని జలాన్ని స్పృశించాడు. ఓ బ్రాహ్మణోత్తములారా! వెంటనే రహోదరుని జంఘుకు తగుల్కొనిన రాక్షసుని శిరస్సు వూడి నీళ్ళలో పడిపోయింది. అంతట అతడు బాధనుండి విముక్తుడై, పవిత్రుడై, పాపరహితుడయ్యాడు. ఆ విధంగా రహోదరుడు సంతోషాన్ని పొంది, తన ఆశ్రమానికి తిరిగి వెళ్ళి ఆ విషయం అందరకు వివరంగా చెప్పాడు. అది వినిన ఋషులందరు ఆ తీర్థమహిమకు సంతసించి దానికి కపాలమోచనతీర్థమని నామకరణంచేశారు.

తత్రాపి సుమహత్తీర్థం విశ్వామిత్రస్య విశ్రుతమ్ ॥14॥

బ్రాహ్మణ్యం లబ్ధవాన్యత్ర విశ్వామిత్రో మహామునిః ।
తస్మిన్ తీర్థవరే స్నాత్వా బ్రాహ్మణ్యం లభతే ధ్రువమ్ ॥15॥

బ్రాహ్మణస్తు విశుద్ధాత్మా పరం పదమవాప్నుయాత్ ।

అక్కడనే సుప్రసిద్ధమైన విశ్వామిత్రతీర్థమున్నది. విశ్వామిత్రమహర్షి అక్కడనే బ్రహ్మత్వాన్ని పొందాడు. తీర్థశ్రేష్ఠమైన ఈ విశ్వామిత్రతీర్థంలో స్నానం చేస్తే బ్రాహ్మణత్వం లభిస్తుంది. ఇది నిశ్చయం. బ్రాహ్మణుడు ఈ తీర్థంలో స్నానం చేస్తే విశుద్ధాత్ముడై పరమపదం పొందుతాడు.

తతః పృథూదకం గచ్ఛేన్నియతో నియతాశనః ॥16॥

తత్ర సిద్ధస్తు బ్రహ్మర్షిర్ఋషంగురితి నామతః ।
జాతిస్మరో ఋషంగుస్తు గంగాద్వారే సదా స్థితః ॥17॥

అంతకాలం తతో దృష్ట్వా పుత్రాన్ వచనమబ్రవీత్ ।
ఇహ శ్రేయో న పశ్యామి నయధ్వం మాం పృథూదకమ్ ॥18॥

అటు పిమ్మట మితాహారియైన నరుడు అక్కడినుండి పృథూదకతీర్థానికి వెళ్ళాలి. అక్కడ ఋషంగుడనే బ్రహ్మర్షి సిద్ధి పొందాడు. పూర్వజన్మస్మృతి గలిగిన ఋషంగుడు మొదట గంగాద్వారంలో వుండేవాడు. తనకు అంత్యకాలం రానున్నట్టు తెలిసికొని పుత్రులతో ఇలా "ఇక్కడ నాకు శ్రేయస్సు కలుగదు. వెంటనే నన్ను పృథూదక క్షేత్రానికి తరలించండి" అన్నాడు.

విజ్ఞాయ తస్య తద్భావం ఋషంగోస్తే తపోధనాః ।
తం వై తీర్థే ఉపానిన్యుః సరస్వత్యాస్తపోధనమ్ ॥19॥

స తైః పుత్రైః సమానీతః సరస్వత్యాం సమాప్లుతః ।
స్మృత్వా తీర్థగుణాన్ సర్వాన్ ప్రాహేదమృషిసత్తమః ॥20॥

తండ్రిభావాన్ని గుర్తించిన కుమారులు ఆయనను వెంటనే పృథూదకానికి తీసుకొని వెళ్ళారు. పుత్రులచే తీసుకురాబడిన ఆ మహర్షి సరస్వతీనదిలో స్నానం చేసి, ఆ తీర్థగుణాలనన్నిటిని తలంచుకొని, ఇలా పలికాడు.

సరస్వత్యుత్తరే తీర్థే యస్త్యజేదాత్మనస్తనుమ్ ।
పృథూదకే జప్యపరో నూనం చామరతాం వ్రజేత్ ॥21॥

తత్రైవ బ్రహ్మయోన్యస్తి బ్రహ్మణా యత్ర నిర్మితా ।
పృథూదకం సమాశ్రిత్య సరస్వత్యాస్తటే స్థితః ॥22॥

చాతుర్వర్ణ్యస్య సృష్ట్యర్థమాత్మజ్ఞానపరోఽభవత్ ।
తస్యాభిధ్యాయతః సృష్టిం బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ॥23॥

ముఖతో బ్రాహ్మణా జాతా బాహుభ్యాం క్షత్రియాస్తథా ।
ఊరుభ్యాం వైశ్యజాతీయాః పద్భ్యాం శూద్రస్తతోఽభవన్ ॥24॥

చాతుర్వర్ణ్యం తతో దృష్ట్వా ఆశ్రమస్థం తతస్తతః ।
ఏవం ప్రతిష్ఠితం తీర్థం బ్రహ్మయోనీతి సంజ్ఞితమ్ ॥25॥

సరస్వతి ఉత్తరతీరంలోని పృథూదకతీర్థంలో జపం చేస్తూ ప్రాణాలు విడిచిన మానవునకు తప్పక అమరత్వం లభిస్తుంది. అక్కడనే బ్రహ్మచే నిర్మింపబడిన బ్రహ్మయోని కలదు. బ్రహ్మ సరస్వతీతటాన పృథూదకంలో నివసించి నాలుగు వర్ణాలవారిని సృష్టించడానికి తగిన ఆత్మజ్ఞానం పొందాడు. అవ్యక్తజన్ముడైన బ్రహ్మ సృష్టించాలని

సంకల్పించినంతనే అతని ముఖం నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, ఊరువుల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు జన్మించారు. ఆ నాలుగు వర్ణాలవారిని ఆశ్రమధర్మాలలో అన్నిచోట్లా స్థాపించారు. ఆ కారణంచేత ఆ తీర్థం బ్రహ్మయోనిగా పిలవబడింది.

తత్ర స్నాత్వా ముక్తికామః పునర్యోనిం న పశ్యతి ।
తత్రైవ తీర్థం విఖ్యాతమవకీర్ణేతి నామతః ॥26॥

యస్మిన్ తీర్థే బకో దాల్భ్యో ధృతరాష్ట్రమమర్షణమ్ ।
జుహావ వాహనైః సార్ధం తత్రాబుధ్యత్తతో నృపః ॥27॥

ముక్తిని కోరువారు బ్రహ్మయోని తీర్థంలో స్నానం చేసినచో మరల జన్మను పొందరు. అక్కడనే అవకీర్ణమనే తీర్థమున్నది. అక్కడనే దాల్భ్యుడైన బకుడు అసహిష్ణుడైన ధృతరాష్ట్రుని అతని వాహనములతో సహా యజ్ఞంలో బలియివ్వడానికి సిద్ధపడగా రాజునకు అప్పుడు బుద్ధివచ్చింది.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

కథం ప్రతిష్ఠితం తీర్థమవకీర్ణేతి నామతః ।
ధృతరాష్ట్రేణ రాజ్ఞా స కిమర్థం న ప్రసాదితః ॥28॥

అవకీర్ణమనే పేరు గల తీర్థమెలా ఏర్పడింది? దానిని ధృతరాష్ట్రుడు ఎందులకు ప్రసన్నం చేసుకోలేదు?

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

నైమిషేయాశ్చ ఋషయో దక్షిణార్థం యయుః పురా ।
తత్రైవ చ బకో దాల్భ్యో ధృతరాష్ట్రమయాచత ॥29॥

తేనాపి తత్ర నిందార్థముక్తం యశ్చానృతం తు తత్ ।
తతః క్రోధేన మహతా మాంసాన్యుత్కృత్య తత్ర హ ॥30॥

పృథూదకే మహాతీర్థే అవకీర్ణేతి నామతః ।
జుహావ ధృతరాష్ట్రస్య రాష్ట్రం నరపతేస్తతః ॥31॥

హూయమానే తదా రాష్ట్రే ప్రవృత్తే యజ్ఞకర్మణి ।
అక్షీయత తతో రాష్ట్రం నృపతేర్దుష్కృతేన వై ॥32॥

తతః స చింతయామాస బ్రాహ్మణస్య విచేష్టితమ్ ।
పురోహితేన సహితో రత్నాన్యాదాయ సర్వశః ॥33॥

ప్రసాదనార్థం విప్రస్య హ్యవకీర్ణం యయౌ తదా ।
ప్రసాదితః స రాజ్ఞా చ తుష్టః ప్రోవాచ తం నృపమ్ ॥34॥

బ్రాహ్మణా నావమంతవ్యా పురుషేణ విజానతా ।
బ్రాహ్మణశ్చేదవజ్ఞాతో హన్యాత్రిపురుషం కులమ్ ॥35॥

ఏవముక్త్వా స నృపతిమాజ్యేన పయసా పునః ।
ఉత్థాపయామాస మృతాంస్తస్య రాజ్ఞో హితే స్థితః ॥36॥

పూర్వం నైమిశారణ్యవాసులైన ఋషులు దక్షిణకై ధృతరాష్ట్రుని వద్దకు వెళ్ళారు. వారందరి పక్షాన దాల్భ్యుడైన బకుడు ఆ నరపతిని యాచించాడు. ధృతరాష్ట్రుడు పల్కిన నిందాగర్భితమైన అసత్యానికి మండిపడి దాల్భ్యుడైన బకుడు అభిచారికహోమం పృథూదక క్షేత్రంలోని అవకీర్ణతీర్థం వద్ద ప్రారంభించి, అందులో ధృతరాష్ట్రుని రాజ్యంతో సహా వేల్చుటకై తన తొడమాంసాన్ని బయటకు తీసి హోమాగ్నిలో వేశాడు. ఆ విధంగా యజ్ఞం ప్రారంభం కావడంతో దుష్టుడైన ఆ నరపతి రాజ్యం క్షీణించింది. రాజ్యనాశనానికి దుఃఖించిన రాజు తాను పూర్వం ఋషులను అవమానించడం గుర్తుకు రాగా భయపడి, పురోహితునితో బాటు రత్నరాశులు తీసుకొని అవకీర్ణతీర్థానికి వెళ్లి, వాటిని దాల్భ్యునికి సమర్పించి, పాదాలపైబడి, శరణాగతుడయ్యాడు. అందుకు సంతోషించి, ఆ మహర్షి ఇలా అన్నాడు. "విజ్ఞానియైనవాడు బ్రాహ్మణులనెన్నడు అవమానించకూడదు. బ్రాహ్మణులకు గావించిన అవమానం మూడు తరాలవారిని దహించివేస్తుంది". ఈ విధంగా హెచ్చరించి రాజుశ్రేయస్సును కోరుతూ నేయితో, పాలతో హోమాలు చేసి చనిపోయినవారిని మళ్ళీ బ్రతికించాడు.

తస్మింస్తీర్థే తు యః స్నాతి శ్రద్దధానో జితేంద్రియః ।
స ప్రాప్నోతి నరో దివ్యం మనసా చింతితం ఫలమ్ ॥37॥

అట్టి అవకీర్ణతీర్థంలో విజితేంద్రుడై, శ్రద్ధతో స్నానం చేసిన మానవునకు మనస్సులో చింతించిన ఫలాలన్నీ లభిస్తాయి.

తత్ర తీర్థం సువిఖ్యాతం యాయాతం నామ నామతః ।
యస్యేహ యజమానస్య మధు సుస్రావ వై నదీ ॥38॥

తస్మిన్ స్నాతోఽథ భక్త్యా తు ముచ్యతే సర్వకిల్బిషైః ।
ఫలం ప్రాప్నోతి యజ్ఞస్య హ్యశ్వమేధస్య మానవః ॥39॥

తదనంతరం మిక్కిలి విఖ్యాతమైన యాయాతతీర్థం వస్తుంది. అచ్చట యయాతి అశ్వమేధయాగాన్ని చేస్తున్న సమయంలో ఆ నది తేనెను ప్రవహింపచేయసాగింది. అక్కడ భక్తితో స్నానం చేసిన నరుడు సమస్తపాపాలనుండి విముక్తుడౌతాడు. అశ్వమేధయాగఫలం పొందుతాడు.

మధుస్రవం చ తత్రైవ తీర్థం పుణ్యతమం ద్విజాః ।
తస్మిన్ స్నాత్వా నరో భక్త్యా మధునా తర్పయేత్పితౄన్ ॥40॥

మధుస్రవం అనే పవిత్రతీర్థం అక్కడే వున్నది. అందులో స్నానమాచరించి పితరులకు తేనెతో తర్పణాలిచ్చిన నరుడు తరించగలడు.

తత్రాపి సుమహత్తీర్థం వసిష్ఠోద్వాహసంజ్ఞితమ్ ।
తత్ర స్నాతో భక్తియుతో వాసిష్ఠం లోకమాప్నుయాత్ ॥41॥

అక్కడనే వాసిష్ఠోద్వాహమనే మహత్తరమైన తీర్థం కలదు. అక్కడ భక్తితో స్నానం చేసిన మానవునకు వసిష్ఠలోకం సంప్రాప్తిస్తుంది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే ఔశనసాది తీర్థమాహాత్మ్య కథనం నామ ఏకోనచత్వారింశోఽధ్యాయః ॥39॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి ఔశనస, పృథూదకం మున్నగు తీర్థాల మాహాత్మ్యకథనమనే ముప్పైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



చత్వారింశోఽధ్యాయః – నలభైయవ అధ్యాయం

వసిష్ఠాపవాహతీర్థమాహాత్మ్యకథనమ్ – వసిష్ఠాపవాహతీర్థమాహాత్మ్యకథనం

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

వసిష్ఠస్యాపవాహోఽసౌ మహావేగో బభూవ హ ।
కిమర్థం సా సరిచ్ఛ్రేష్ఠా తమృషిం ప్రత్యవాహయత్ ॥1॥

సరస్వతీనది వసిష్ఠుని కొనిపోవుట ఎలా జరిగింది? ఆ సర్వోత్తమమైన నది వసిష్ఠమహర్షిని తన జలాలలోనికి ఎందుకు లాగుకొనిపోయింది?

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

విశ్వామిత్రస్య రాజర్షేర్వసిష్ఠస్య మహాత్మనః ।
భృశం వైరం బభూవేహ తపః స్పర్ధా కృతే మహత్ ॥2॥

ఆశ్రమో వై వసిష్ఠస్య స్థాణుతీర్థే బభూవ హ ।
తస్య పశ్చిమదిగ్భాగే విశ్వామిత్రస్య ధీమతః ॥3॥

యత్రేష్ట్వా భగవాన్ స్థాణుః పూజయిత్వా సరస్వతీమ్ ।
స్థాపయామాస దేవేశో లింగాకారాం సరస్వతీమ్ ॥4॥

వసిష్ఠస్తత్ర తపసా ఘోరరూపేణ సంస్థితః ।
తస్యేహ తపసా హీనో విశ్వామిత్రో బభూవ హ ॥5॥

సరస్వతీం సమాహూయ ఇదం వచనమబ్రవీత్ ।
వసిష్ఠం మునిశార్దూలం స్వేన వేగేన చానయ ॥6॥

ఇహాయాతం మునిశ్రేష్ఠం హనిష్యామి న సంశయః ।
ఏతచ్ఛ్రుత్వా తు వచనం వ్యథితా సా నదీ కిల ॥7॥

తథా తాం వ్యథితాం దృష్ట్వా వేపమానాం మహానదీమ్ ।
విశ్వామిత్రోఽవదత్ క్రుద్ధో వసిష్ఠం శీఘ్రమానయ ॥8॥

తతో గత్వా సరిచ్ఛ్రేష్ఠా వసిష్ఠం మునిసత్తమమ్ ।
కథయామాస రుదతీ విశ్రామిత్రస్య తద్వచః ॥9॥

తపః కృశాం వివర్ణాం చ భృశం శోకసమన్వితామ్ ।
ఉవాచ తాం సరిచ్ఛ్రేష్ఠాం విశ్వామిత్రాయ మాం వహ ॥10॥

తమ తమ తపోబలాలను పురస్కరించుకుని రాజర్షియైన విశ్వామిత్రునకు, బ్రహ్మర్షియైన వసిష్ఠునకు చిరకాలంగా శత్రుత్వం ఉంది. స్థాణుతీర్థంలో వసిష్ఠమహర్షి ఆశ్రమం ఉంది. దానికి పశ్చిమదిక్కులో ధీమంతుడైన

విశ్వామిత్రుని ఆశ్రమం ఉంది. స్థాణుతీర్థంలో దేవాదిదేవుడైన శివభగవానుడు యజ్ఞం చేసిన తరువాత సరస్వతీనదిని పూజించి ఆమెనొక లింగాకారంలో ప్రతిష్ఠించాడు. అక్కడ వసిష్ఠుడు ఘోరమైన తపోనిష్ఠలోనున్నాడు. తపోహీనుడైన విశ్వామిత్రుడు సరస్వతీనదిని పిలిచి "మునిశార్దూలమైన వసిష్ఠుని నీ వేగంతో ఇక్కడకు తీసుకురా. అట్లు తీసుకొని వచ్చిన వసిష్ఠుని నేను సంహరిస్తాను. ఇందులో సంశయం లేదు". అని పలికాడు. విశ్వామిత్రుని ఈ మాటలు విని సరస్వతీనది చాలా వ్యథచెందింది. ఆ విధంగా వ్యథచెందుతూ వణకుతున్న సరస్వతీనదితో విశ్వామిత్రుడు మిక్కిలి కోపంతో "వసిష్ఠుని వెంటనే తీసుకొనిరమ్ము" అని ఆజ్ఞాపించాడు. అంతట సరస్వతీనది మునిసత్తముడైన వసిష్ఠుని చెంతకువెళ్ళి, రోదిస్తూ విశ్వామిత్రుడు చెప్పిన మాటలను చెప్పింది. తపస్సుచే కృశించినట్టియు, వివర్ణుడైనట్టియు, శోకసమన్వితుడైనట్టియు వసిష్ఠుడు సరిచ్ఛ్రేష్ఠమైన సరస్వతీనదితో విశ్వామిత్రుని చెంతకు నన్ను తీసుకొనిపొమ్మని పలికాడు.

తస్య తద్వచనం శ్రుత్వా కృపాశీలస్య సా సరిత్ ।
ప్లావయామాస తత్స్థానం ప్రవాహేణాంభసస్తదా ॥11॥

స చ కూలాపహారేణ మైత్రావరుణిరుద్యతః ।
వాహమానస్య తుష్టావ తదా దేవీం సరస్వతీమ్ ॥12॥

పితామహస్య సరసః ప్రవృత్తాఽసి సరస్వతి ।
వ్యాప్తం త్వయా జగత్సర్వం తవైవాంభోభిరుత్తమైః ॥13॥

త్వమేవాకాశగా దేవీ మేఘేషు సృజసే పయః ।
సర్వాస్త్వాపస్త్వమేవేతి త్వత్తో వయం వహామహే ॥14॥

పుష్టిర్ధృతిస్తథా కీర్తిః సిద్ధిః కాంతిః క్షమా తథా ।
స్వధా స్వాహా తథా వాణీ తవాయత్తమిదం జగత్ ॥15॥

త్వమేవ సర్వభూతేషు వాణీరూపేణ సంస్థితా ।
ఏవం సరస్వతీ తేన స్తుతా భగవతీ తదా ॥16॥

సుఖేనోవాహ తం విప్రం విశ్వామిత్రాశ్రమం ప్రతి ।
నివేదయత్తదాఽర్చిత్వా విశ్వామిత్రాయ తం మునిమ్ ॥17॥

తమానీతం సరస్వత్యా దృష్ట్వా కోపసమన్వితః ।
అథాన్విషత్ప్రహరణం వసిష్ఠాంతకరం తదా ॥18॥

తం తు క్రుద్ధమభిప్రేక్ష్య బ్రహ్మహత్యాభయాన్నదీ ।
అపోవాహ వసిష్ఠం చ మధ్యేన స్వాంభసస్తతః ।
ఉభయోః కుర్వతీ వాక్యం వంచయిత్వా చ గాధిజమ్ ॥19॥

తతో౽ పవాహితం దృష్ట్వా వసిష్ఠం ఋషిసత్తమమ్ ।
అబ్రవీత్క్రోధరక్తాక్షో విశ్వామిత్రో మహాతపాః ॥20॥

యస్మాన్మాం సరితాం శ్రేష్ఠే వంచయిత్వా వినిర్గతా ।
శోణితం వహ కల్యాణి రక్షోగ్రామసుసంయుతా ॥21॥

తతః సరస్వతీ శప్తా విశ్వామిత్రేణ ధీమతా ।
అవహచ్ఛోణితోన్మిశ్రం తోయం సంవత్సరం తదా ॥22॥

ఆ కృపాశీలుని వచనానుసారం ఆ నది ఆయనను తన ప్రవాహజలాలలో కొని పోసాగింది. అలా నదీప్రవాహంలో కొట్టుకొని పోతూ ఆ వసిష్ఠ మహాముని సరస్వతిని ఈ విధంగా స్తుతించాడు. "బ్రహ్మసరస్సునుండి ఉద్భవించిన పావనసరస్వతీ! నీ పవిత్రజలాలతో జగత్తునంతటిని ముంచావు. నీవే ఆకాశాన ప్రవహించి మేఘాలకు నీరు ప్రసాదిస్తున్నావు. జలాలన్ని నీరూపమే. పుష్టి, ధృతి, కీర్తి, సిద్ధి, కాంతి, క్షమ, స్వధా, స్వాహా, వాణి, ఇత్యాదులతో కూడిన ఈ జగత్తుకంతటికీ నీవే ఆధారం. అన్ని జీవరాసులలోను వాణీరూపంలో నీవే నెలకొనియున్నావు". ఈ విధంగా వసిష్ఠునిచే స్తోత్రం చేయబడిన సరస్వతి సంతసించి ఆయనను సుఖంగా తన ప్రవాహంతో విశ్వామిత్రుని దగ్గరకు తీసుకొని పోయి విశ్వామిత్రునకు వసిష్ఠుణ్ణి గూర్చి నివేదించింది. అట్లు సరస్వతిచే తీసుకొనిరాబడిన వసిష్ఠుని చూసి, కోపంతో ఆయనను సంహరించడానికి విశ్వామిత్రుడు ఆయుధాన్ని ధరించగా బ్రహ్మహత్యాపాతకం సంభవిస్తుందనే భయంతో ఆ నది తన ప్రవాహమధ్యభాగంలో ముంచివేసింది. ఆ విధంగా ఇద్దరి ఆదేశాలను గౌరవించింది. ప్రవాహమధ్యలో ముంచబడిన వసిష్ఠుని కానక విశ్వామిత్రుడు సరస్వతి చేసిన మోసానికి కోపించి ఎరుపెక్కిన కన్నులతో "ఓ ఉత్తమస్రోతస్వినీ! కల్యాణీ! నన్నీవిధంగా వంచించినందులకు ప్రతిఫలంగా నీవు నీళ్లకు బదులుగా రక్తం ప్రవహిస్తూ రాక్షసులకు నిలయమై యుండగలవు" అని సరస్వతీనదిని శపించాడు. విశ్వామిత్రుని చేత ఆ విధంగా శపింపబడిన సరస్వతీనది ఒక సంవత్సరకాలం రక్తంతో కూడిన నీటిని ప్రవహింపజేస్తూయున్నది.

అథర్షయశ్చ దేవాశ్చ గంధర్వాప్సరసస్తదా ।
సరస్వతీం తదా దృష్ట్వా బభూవుర్భృశదుఃఖితాః ॥23॥

తస్మింస్తీర్థవరే రమ్యే శోణితం సముపావహత్ ॥24॥

తతో భూతపిశాచాశ్చ రాక్షసాశ్చ సమాగతాః ।
తతస్తే శోణితం సర్వే పిబంతి సుఖమాసతే ॥25॥

దృష్టాశ్చ తేన సుభృశం సుఖితా విగతజ్వరాః ।
నృత్యంతశ్చ హసంతశ్చ యథా స్వర్గజితస్తథా ॥26॥

కస్యచిత్త్వథ కాలస్య మునయః శతయోజనాత్ ।
తీర్థయాత్రాం సమాజగ్ముః సరస్వత్యాం తపోధనాః ॥27॥

తాం దృష్ట్వా రాక్షసైర్ఘోరైః పీయమానాం మహానదీమ్ ।
పరిత్రాణే సరస్వత్యాః పరం యత్నం ప్రచక్రిరే ॥28॥

తే తు సర్వే మహాభాగాః సమాగమ్య మహావ్రతాః ।
ఆశ్రిత్య సరితాం శ్రేష్ఠామిదం వచనమబ్రువన్ ॥29॥

కిం కారణం సరిచ్ఛ్రేష్ఠే శోణితేన వహస్యహో ।
ఏవమాకులతాం యాతః శ్రుత్వా పృచ్ఛామహే వయమ్ ॥30॥

ఆ విధంగా రక్తజలాలతో నిండిన సరస్వతిని చూసి దేవగంధర్వాప్సరసలు ఎంతో దుఃఖించారు. రక్తంతో నిండిన ఆ నది చుట్టూ భూతపిశాచరాక్షసులు మూగి మహాసంతోషంతో ఆ రక్తం త్రాగుతూ తృప్తిగా ఎటువంటి విచారం లేకుండా నృత్యాలు చేస్తూ, వికటాట్టహాసం చేస్తూ, స్వర్గాన్ని జయించినట్టుగా ఆనందింపసాగారు. అటు పిమ్మట కొంత కాలానికి కొందరు తపోధనులైన ఋషులు నూరు యోజనాల దూరం నుండి బయలుదేరి తీర్థయాత్రార్థం సరస్వతీనదిని సమీపించారు. ఘోరరాక్షసులచే త్రాగబడుచున్న సరస్వతీనదిని చూసి వారు ఆమెను రక్షించాలని గొప్ప ప్రయత్నం చేయసాగారు. మహావ్రతులు, మహాభాగులునైన వారందరు కలసి శ్రేష్ఠమైన సరస్వతీనదిని సమీపించి "ఓ నదీశ్రేష్ఠమా! ఈ విధంగా రక్తజలాలతో నిండి యుండడానికి కారణం ఏమిటి? ఈ విధంగా వ్యాకులత పొందడానికి గల కారణం వినాలని నిన్ను మేము అడుగుతున్నాం" అని అడిగారు.

తతః సా సర్వమాచష్ట విశ్వామిత్రవిచేష్టితమ్ ।
తతస్తే మునయః ప్రీతాః సరస్వత్యాం సమానయన్ ॥31॥

అరుణాం పుణ్యతోయౌఘాం సర్వదుష్కృతనాశనీమ్ ।
దృష్ట్వా తోయం సరస్వత్యా రాక్షసా దుఃఖితా భృశమ్ ॥32॥

ఊచుస్తాన్వై మునీన్సర్వాన్ దైత్యయుక్తాః పునః పునః ।
వయం హి క్షుధితాః సర్వే ధర్మహీనాశ్చ శాశ్వతాః ॥33॥

న చ నః కామకారోఽయం యద్వయం పాపకారిణః ।
యుష్మాకం చాప్రసాదేన దుష్కృతేన చ కర్మణా ॥34॥

పక్షోఽయం వర్ధతేఽస్మాకం యతశ్చ బ్రహ్మరాక్షసాః ।
ఏవం వైశ్యాశ్చ శూద్రాశ్చ క్షత్రియాశ్చ వికర్మభిః ॥35॥

యే బ్రాహ్మణాన్ ప్రద్విషంతి తే భవంతీహ రాక్షసాః ।
ఆచార్యం మాతరం చైవ పితరం యే ద్విషంతి హ ॥36॥

వృద్ధానామవమానేన తే భవంతీహ రాక్షసాః ।
యోషితాం చైవ పాపానాం యోనిదోషేణ వర్ధతే ॥37॥

శక్తా భవంతః సర్వేషాం లోకానామపి తారణే ।
తేషాం తే మునయః శ్రుత్వా కృపాశీలాః పునశ్చ తే ॥38॥

అంతట సరస్వతి విశ్వామిత్రుడు చేసిన ఆగడాన్ని వివరించి చెప్పింది. అంతట ఆ మునులందరు సంతోషించి, సమస్తపాపాలనూ పోగొట్టే అరుణానదీపవిత్రజలాలను తెచ్చి, సరస్వతిలో కలిపారు. ఆమెను పవిత్రం చేశారు. పవిత్రురాలైన సరస్వతీనదీజలాలను చూసి రాక్షసులు చాలా దుఃఖించారు. ఆ రాక్షసులందరు మునులతో మళ్ళీ మళ్ళీ ఇలా పలికారు." మేము శాశ్వతంగా ధర్మహీనులమై, ఆకలితో అల్లాడుతున్నాం. మేము స్వయంగా ఈ మార్గాన్ని ఎంచుకోలేదు. మేము చేసిన పాపకర్మల వల్ల, మీ అనుగ్రహం లభించకపోవడం వల్ల మాజాతి పెరిగిపోతూ మేము బ్రహ్మరాక్షసులమయ్యాము. బ్రాహ్మణులను ద్వేషించిన వైశ్య, శూద్ర, క్షత్రియులందరు బ్రహ్మరాక్షసులౌతారు. గురువును, తల్లిని, తండ్రిని ఎవరు ద్వేషిస్తారో వారును, వృద్ధులను అవమానపరచినవారును బ్రహ్మరాక్షసులౌతారు. పాపిష్ఠిస్త్రీలతో సంగమం చేయడం వల్ల మా జాతి పెరిగిపోతున్నది. ఓ తపోధనులారా! మీరు సమస్తలోకాలను తరింపజేయగల సమర్థులు". ఆ రాక్షసుల ఈ దీనాలాపాలను విని దయామయులైన మునులు తమలో తాము సంప్రదించుకున్నారు.

ఊచుః పరస్పరం సర్వే తప్యమానాశ్చ తే ద్విజాః ।
క్షుతకీటావపన్నం చ యత్త్వశిష్టాశితం భవేత్ ॥39॥

కేశావపన్నమాధూతం మారుతశ్వాసదూషితమ్ ।
ఏతైః సంస్పృష్టమన్నం చ భాగో వై రాక్షసో భవేత్ ॥40॥

తస్మాత్ జ్ఞాత్వా సదా విద్వాంస్తాన్యేతాని వివర్జయేత్ ।
రాక్షసాన్నె భోజయతే యో భుంక్తే స్వయమీదృశమ్ ॥41॥

శోధయిత్వా తు తత్తీర్థమృషయస్తే తపోధనాః ।
మోక్షార్థం రక్షసాం తేషాం సంగమం చాప్యకల్పయన్ ॥42॥

అరుణాయాః సరస్వత్యాః సంగమే లోకవిశ్రుతే ।
త్రిరాత్రోపోషితః స్నాతో ముచ్యతే సర్వకిల్బిషైః ॥43॥

ప్రాప్తే కలియుగే ఘోరే హ్యధర్మే ప్రత్యుపస్థితే ।
అరుణాసంగమే స్నాత్వా ముక్తిమాప్నోతి మానవః ॥44॥

తతస్తే రాక్షసాః సర్వే స్నాతాః పాపవివర్జితాః ।
దివ్యమాలాంబరధరాః స్వర్గస్త్రీభిః సమన్వితాః ॥45॥

తుమ్ములతో తుంపరలు పడినవి, దురాచారులు ముందుగా తిన్నవి, ఎంగిలి చేసినవి, కీటకాదులు వాలినవి, వెంట్రుకలచే కలుషితమైనవి, గాలి వలన, నోటిశ్వాస వలన, కలుషితమైన భోజనం రాక్షసభోజ్యం. కాబట్టి విజ్ఞులైనవారు దీనిని గుర్తించి, ఇటువంటి ఆహారాన్ని వర్జించాలి. ఇటువంటి తిండి తినినవాడు రాక్షసభోజనం

చేసినట్లవుతుంది. ఈ విధంగా ఆలోచించుకొని ఆ మహర్షులు ఆ తీర్థాన్ని పవిత్రంచేసి, రాక్షసులనుద్ధరించడానికై అక్కడ అరుణాసరస్వతీ నదుల పవిత్రసంగమాన్ని కల్పించారు. లోకప్రసిద్ధమైన అరుణాసరస్వతుల సంగమప్రదేశంలో మూడురాత్రులు ఉపవసించి స్నానం చేస్తే సమస్తకిల్బిషాలు తొలగిపోతాయి. ఘోరమైన కలియుగం వచ్చినప్పుడు, అధర్మం పెల్లుబికినప్పుడు అరుణాసరస్వతీసంగమంలో స్నానం చేసిన మానవుడు ముక్తిని పొందుతాడు. అంతట ఆ రాక్షసులందరు ఆ సంగమతీర్థాలలో స్నానమాచరించి, పాపరహితులై, దివ్యమాల్యాంబరధారులై, స్వర్గస్త్రీలతో కూడినవారయ్యారు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే వసిష్ఠాపవాహతీర్థమాహాత్మ్యకథనం నామ చత్వారింశోఽధ్యాయః ॥40॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి వసిష్ఠాపవాహతీర్థమాహాత్మ్యకథనం అనే నలబైయవ అధ్యాయం సమాప్తం.



ఏకచత్వారింశోఽధ్యాయః - నలబైఒకటవ అధ్యాయం

శతసాహస్రికాది తీర్థమాహాత్మ్యకథనమ్ - శతసాహస్రిక, ఋణమోచన, మున్నగుతీర్థాల మాహాత్మ్యకథనం

లోమహర్షణ ఉవాచ - లోమహర్షణుడు పలికాడు.

సముద్రాస్తత్ర చత్వారః దర్విణా నిర్మితాః పురా ।
ప్రత్యేకం చ నరః స్నాతో గోసహస్రఫలం లభేత్ ॥1॥

యత్కించిత్క్రియతే తస్మింస్తపస్తీర్థే ద్విజోత్తమాః ।
పరిపూర్ణం హి తత్సర్వమపి దుష్కృతకర్మణః ॥2॥

శతసాహస్రకం తీర్థం తత్రైవ శతికం ద్విజాః ।
ఉభయోరిహ సుస్నాతో గోసహస్రఫలం లభేత్ ॥3॥

ప్రాచీనకాలంలో దర్వి చతుస్సముద్రాలను నిర్మించాడు. వానిలో ఒక్కొక్క దానిలో స్నానం చేసిన నరుడు గోసహస్రదానఫలాన్ని పొందుతాడు. ఓ బ్రాహ్మణోత్తములారా! ఆ తీర్థాలలో చేసిన తపస్సు ఎంత స్వల్పమైన ఎంతటి దుష్కృతుడు చేసినా సంపూర్ణఫలాన్ని ఇస్తుంది. అక్కడే శతసాహస్రిక, శతికతీర్థాలు కూడా వున్నాయి. ఆ రెండింటిలో చక్కగా స్నానం చేస్తే వేయి గోవులను దానం చేసిన ఫలం లభిస్తుంది.

సోమతీర్థం చ తత్రాపి సరస్వత్యాస్తటే స్థితమ్ ।
యస్మిన్ స్నాతస్తు పురుషో రాజసూయఫలం లభేత్ ॥4॥

రేణుకాశ్రమమాసాద్య శ్రద్దధానో జితేంద్రియః ।
మాతృభక్త్యా తు యత్పుణ్యం తత్పుణ్యం ప్రాప్నుయాన్నరః ॥5॥

అక్కడే సరస్వతీతీరంలోనున్న సోమతీర్థంలో స్నానం చేసినవాడు రాజసూయయాగఫలం పొందుతాడు. రేణుకాశ్రమాన్ని సేవించిన శ్రద్ధాళువు, జితేంద్రియుడు, మాతృసేవ చేసినవాడు పొందిన పుణ్యఫలాన్ని పొందుతాడు.

ఋణమోచనమాసాద్య తీర్థం బ్రహ్మనిషేవితమ్ ।
ఋణైర్ముక్తో భవేన్నిత్యం దేవర్షిపితృసంభవైః ।
కుమారస్యాభిషేకం చ ఓజసం నామ విశ్రుతమ్ ॥6॥

తస్మిన్ స్నాతస్తు పురుషో యశసా చ సమన్వితః ।
కౌమారం పురమాప్నోతి కృత్వా స్నానం తు మానవః ॥7॥

చైత్రషష్ఠ్యాం శుక్లే పక్షే యస్తు శ్రాద్ధం కరిష్యతి ।
గయాశ్రాద్ధే చ యత్పుణ్యం తత్ఫలం ప్రాప్నుయాన్నరః ॥8॥

సాన్నిహిత్యం యథా శ్రాద్ధం రాహుగ్రస్తే దివాకరే ।
తథా శ్రాద్ధం తత్ర కృతం నాత్ర కార్యా విచారణా ॥9॥

ఓజసే హ్యక్షయం శ్రాద్ధం వాయునా కథితం పురా ।
తస్మాత్సర్వప్రయత్నేన శ్రాద్ధం తత్ర సమాచరేత్ ॥10॥

యస్తు స్నానం శ్రద్దధానః చైత్రషష్ట్యాం కరిష్యతి ।
అక్షయ్యముదకం తస్య పితౄణాముపజాయతే ॥11॥

బ్రహ్మసేవితమైన ఋణమోచనక్షేత్రాన్ని సేవించిన పుణ్యుడు దేవర్షిపితృఋణాల నుండి ముక్తుడౌతాడు. ఓజసతీర్థంగా వినుతిగాంచిన కుమారాభిషేకతీర్థాన స్నానమాడినవాడు యశోవంతుడౌతాడు. అంతేగాక అచ్చట స్నానమాచరించిన మానవుడు కుమారపురాన్ని చేరతాడు. చైత్రశుద్ధషష్ఠినాడు శ్రాద్ధకర్మ చేసినవాడు గయాశ్రాద్ధ ఫలితాన్ని పొందుతాడు. సన్నిహితక్షేత్రంలో సూర్యగ్రహణంనాడు చేసిన శ్రాద్ధము గయాశ్రాద్ధఫలాన్ని యిస్తుంది. ఇందులో ఆలోచించవలసినది ఏమియు లేదు. ఓజసక్షేత్రంలో చేసిన శ్రాద్ధం అక్షయఫలమిస్తుందని పూర్వం వాయుదేవుడు వక్కాణించియున్నాడు. కాబట్టి అన్ని విధాలుగా ప్రయత్నించియైనా అచ్చట శ్రాద్ధకర్మను ఆచరించాలి. చైత్రషష్ఠినాడు శ్రద్ధతో అచ్చట స్నానం చేస్తే పితరులకు అక్షయమైన ఉదకప్రాప్తి కలుగుతుంది.

తత్ర పంచవటం నామ తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
మహాదేవః స్థితో యత్ర యోగమూర్తిధరః స్వయమ్ ॥12॥

తత్ర స్నాత్వాఽర్చయిత్వా చ దేవదేవం మహేశ్వరమ్ ।
గాణాపత్యమవాప్నోతి దైవతైః సహ మోదతే ॥13॥

అచ్చట త్రైలోక్యవిఖ్యాతి గాంచిన పంచవటమనే తీర్థమున్నది. అక్కడ మహాదేవుడు స్వయంగా యోగమూర్తిగా అవతరించి నివాసమున్నాడు. అక్కడ స్నానం చేసి, దేవదేవుడైన మహేశ్వరుని అర్చించిన మానవుడు గాణాపత్యం పొంది, దేవతలతో కలసి సుఖిస్తాడు.

కురుక్షేత్రం చ విఖ్యాతం కురుణా యత్ర వై తపః ।
తప్తం సుఘోరం క్షేత్రస్య కర్షణార్థం ద్విజోత్తమాః ॥14॥

తస్య ఘోరేణ తపసా తుష్ట ఇంద్రోఽబ్రవీద్వచః ।
రాజర్షే పరితుష్టోఽస్మి తపసాఽనేన సువ్రత ॥15॥

యజ్ఞం చ యే కురుక్షేత్రే కరిష్యంతి శతక్రతుమ్ ।
తే గమిష్యంతి సుకృతాంల్లోకాన్ పాపవివర్జితాన్ ॥16॥

ఓ ద్విజోత్తములారా! అక్కడే భూమిని దున్నుటకై కురురాజు ఘోరతపస్సునాచరించిన కురుతీర్థముంది. ఆయన చేసిన ఉగ్రతపస్సుకు సంతోషించి ఇంద్రుడు ఇలా పలికాడు."ఓ రాజర్షీ! సువ్రతా! నీవు చేసిన ఈ తపస్సుకు సంతోషించాను. ఈ కురుక్షేత్రంలో ఇంద్రయాగం చేసినవారు పాపరహితమైన సుకృతలోకాలకు వెళ్ళగలరు".

అవహస్య తతః శక్రో జగామ త్రిదివం ప్రభుః ।
ఆగమ్యాగమ్య చైవైనం భూయో భూయోఽవహస్య చ ॥17॥

శతక్రతురనిర్విణ్ణః పృష్ట్వా పృష్ట్వా జగామ హ ।
యదా తు తపసోగ్రేణ సంతప్తం దేహమాత్మనః ।
తతః శక్రోఽబ్రవీత్ప్రీతో బ్రూహి యత్తే చికీర్షితమ్ ॥18॥

తదనంతరం నవ్వుతూ ఇంద్రుడు స్వర్గానికి వెళ్ళాడు. అదే విధంగా ఇంద్రుడు నవ్వుతూ మాటి మాటికి వస్తూ, వెడుతూ కురురాజుతో మాట్లాడుతూ గడిపాడు. చివరకు తీవ్రమైన తపస్సు చేసి, కురురాజు తన దేహం పవిత్రం చేసుకోగా అప్పుడు ఇంద్రుడు సంతోషించి నీకేం కావాలో కోరుకొనుమని ప్రీతితో పలికాడు.

కురురువాచ – కురురాజు పలికాడు.

యే శ్రద్దధానా తీర్థేఽస్మిన్మానవా నివసంతి హ ।
తే ప్రాప్నువంతి సదనం బ్రహ్మణః పరమాత్మనా ॥19॥

అన్యత్ర కృతపాపా యే పంచపాతకదూషితాః ।
అస్మింస్తీర్థే నరాః స్నాత్వా ముక్తా యాంతు పరాంగతిమ్ ॥20॥

కురుక్షేత్రే పుణ్యతమే కురుక్షేత్రం ద్విజోత్తమాః ।
తం దృష్ట్వా ముక్తపాపస్తు పరం పదమవాప్నుయాత్ ॥21॥

కురుక్షేత్రే నరః స్నాత్వా ముక్తో భవతి కిల్బిషైః ।
కురుణా సమనుజ్ఞాతః ప్రాప్నోతి పరమం పదమ్ ॥22॥

ఈ తీర్థంలో శ్రద్ధాభక్తులతో నివసించేవారికి బ్రహ్మలోకప్రాప్తి కలగాలి. ఎక్కడ ఎట్టి పాపాలు చేసినా, పంచమహాపాతకాలతో దూషితులైనా ఈ తీర్థంలో స్నానం చేస్తే నరులు ఆ పాపాలనుండి విముక్తులై, పరమపదం పొందాలి. ఓ ద్విజోత్తములారా! కురుక్షేత్రంలోని తీర్థాలన్నిటిలోను కురుతీర్థం పవిత్రమైనది. దానిని దర్శించిన మాత్రం చేతనే పాపాలనుండి విముక్తులై పరమపదం పొందుతారు. కురుతీర్థంలో స్నానం చేసిన మానవుడు సమస్తకిల్బిషాలనుండి ముక్తుడౌతాడు. కురువు అనుగ్రహంతో పరమపదం పొందుతాడు.

తతో గచ్ఛేదనరకం తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
యత్ర పూర్వం స్థితో బ్రహ్మా దక్షిణే చ మహేశ్వరః ॥23॥

రుద్రపత్నీ పశ్చిమతః పద్మనాభోత్తరే స్థితః ।
మధ్యే హ్యనరకం తీర్థం త్రైలోక్యస్యాపి దుర్లభమ్ ॥24॥

యస్మిన్ స్నాతాస్తు పురుషాః ప్రముచ్యంతే చ పాతకైః ।
వైశాఖే చ యదాఽష్టమ్యాం మంగళస్య దినం భవేత్ ॥25॥

తదా స్నానం తత్ర కృత్వా ముక్తో భవతి పాతకైః ।
యః ప్రయచ్ఛేచ్చ కనకం తుర్యభాగేన సంయుతమ్ ॥26॥

కలశం చ తథా దద్యాదపూపైః పరిశోభితమ్ ।
దేవతాః ప్రీణయేత్పూర్వం కరకై రత్నసంయుతైః ॥27॥

తతస్తు కలశౌ దద్యాత్సర్వపాతకనాశనౌ ।
అనేనైవ విధానేన యస్తు స్నానం సమాచరేత్ ॥28॥

స ముక్తః కలుషైః సర్వైః ప్రయాతి పరమం పదమ్ ।
అన్యత్రాపి యదా షష్ఠీ మంగళేన భవిష్యతి ॥29॥

తత్రాపి ముక్తిఫలదా కృత్యా తస్మిన్భవిష్యతి ।
తీర్థే చ సర్వతీర్థానాం యస్మిన్ స్నాతో ద్విజోత్తమాః ॥30॥

సర్వదేవైరనుజ్ఞాతః పరమం చాప్నుయాత్పదమ్ ।

అక్కడినుండి ముల్లోకాలలో విఖ్యాతమైన అనరకతీర్థాన్ని చేరుకోవాలి. అక్కడ తూర్పుదిక్కున బ్రహ్మ, దక్షిణాన మహేశ్వరుడు, పశ్చిమాన రుద్రపత్ని, ఉత్తరాన పద్మనాభుడు కొలువైయున్నారు. మధ్యభాగాన ముల్లోకాలలో దుర్లభమైన అనరకతీర్థముంది. అక్కడ స్నానం చేసిన మానవులు పాతకాలనుండి విడువబడతారు. వైశాఖషష్ఠీ మంగళవారంనాడు అక్కడ స్నానం చేసినవారు సమస్తపాతకాలనుండి విముక్తులవుతారు. అక్కడ నాలుగు పాత్రలలో అన్నము, అప్పాలతో నింపిన కలశాన్ని దేవతలకు ప్రీతిగా సమర్పించాలి. తదనంతరం సర్వపాతకనాశనానికి కలశాలను దానం చేయాలి. ఈ విధంగా ఎవరు స్నానం చేస్తారో వారు సర్వపాపవిముక్తులై పరమపదానికి వెళతారు. షష్ఠితో కూడిన మంగళవారం రోజున, ఇతరత్ర కూడా ఈ విధంగా చేస్తే ముక్తి లభిస్తుంది. ఓ బ్రాహ్మణులారా! తీర్థాలలో ఉత్తమమైన ఈ తీర్థంలో స్నానం చేసిన నరుడు సర్వదేవతలచే అనుజ్ఞాతుడై పరమపదం పొందుతాడు.

కామ్యకం చ వనం పుణ్యం సర్వపాతకనాశనమ్ ॥31॥

యస్మిన్ ప్రవిష్టమాత్రస్తు ముక్తో భవతి కిల్బిషైః ।
యమాశ్రిత్య వనం పుణ్యం సవితా ప్రకటః స్థితః ॥32॥

పూషా నామ ద్విజశ్రేష్ఠా దర్శనాన్ముక్తిమాప్నుయాత్ ।
ఆదిత్యస్య దినే ప్రాప్తే తస్మిన్ స్నాతస్తు మానవః ॥33॥

విశుద్ధమానసోఽభ్యేతి మనసా చింతితం ఫలమ్ ॥34॥

పుణ్యదాయియైన కామ్యకవనంలో ప్రవేశించినంతమాత్రంచేతనే సర్వపాతకాలు నశించి మానవుడు ముక్తిని పొందుతాడు. ఈ వనంలో సూర్యుడు పూష అనే పేరుతో ప్రత్యక్షరూపంలో ఉంటాడు. ఆయనను దర్శించి నంతనే ముక్తి కలుగుతుంది. ఆదివారంనాడు ఇచ్చట స్నానం చేసే మానవుడు విశుద్ధమానసుడై మనోరథాలనన్నిటిని సఫలం గావించుకుంటాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే శతసాహస్రికాది తీర్థమాహాత్మ్య కథనం నామ ఏకచత్వారింశోఽధ్యాయః ॥41॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి శతసాహస్రిక, ఋణమోచన, మున్నగు తీర్థాల మాహాత్మ్య కథనమనే నలబైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్విచత్వారింశోఽధ్యాయః - నలబైరెండవ అధ్యాయం
సరస్వతీనదీమాహాత్మ్యకథనమ్ - సరస్వతీనదీ మాహాత్మ్య కథనం

ఋషయ ఊచుః - ఋషులు పలికారు.

కామ్యకస్య తు పూర్వేణ కుంజం దేవైర్నిషేవితమ్ ।
తస్య తీర్థస్య సంభూతిం విస్తరేణ బ్రవీతు నః ॥1॥

కామ్యకవనానికి తూర్పున దేవతలచే సేవింపబడే కుంజకతీర్థమున్నది. ఆ తీర్థం పుట్టుక వివరాలు మాకు సవిస్తరంగా తెలియజేయండి.

లోమహర్షణ ఉవాచ - లోమహర్షణుడు పలికాడు.

శృణ్వంతు మునయః సర్వే తీర్థమాహాత్మ్యముత్తమమ్ ।
ఋషీణాం చరితం శ్రుత్వా ముక్తో భవతి కిల్బిషైః ॥2॥

మునులారా! ఉత్తమమైన ఆ తీర్థమహిమను, ఋషుల చరిత్రను వినండి. అందువలన పాపవిముక్తి కలుగుతుంది.

నైమిషేయాశ్చ ఋషయః కురుక్షేత్రం సమాగతాః ।
సరస్వత్యాం చ స్నానార్థం ప్రవేశం న చ లేభిరే ॥3॥

తతస్తు కల్పయామాసుస్తీర్థం యజ్ఞోపవీతినమ్ ।
శేషాస్తు మునయస్తత్ర న ప్రవేశం హి లేభిరే ॥4॥

రంతుకస్యాశ్రమాద్యావత్తావత్తీర్థం చ చక్రకమ్ ।
బ్రాహ్మణైః పరిపూర్ణం తు దృష్ట్వా దేవీ సరస్వతీ ॥5॥

హితార్థం సర్వవిప్రాణాం కృత్వా కుంజాని సా నదీ ।
ప్రయాతా పశ్చిమం మార్గం సర్వభూతహితే స్థితా ॥6॥

పూర్వప్రవాహే యః స్నాతి గంగాస్నానఫలం లభేత్ ।
ప్రవాహే దక్షిణే తస్యా నర్మదా సరితాంవరా ॥7॥

పశ్చిమే తు దిశాభాగే యమునా చాశ్రితా నదీ ।
యదా హ్యుత్తరో యాతి సింధుర్భవతి సా నదీ ॥8॥

ఏవం దిశాప్రవాహేణ హ్యతిపుణ్యా సరస్వతీ ।
తస్యాం స్నాతః సర్వతీర్థే స్నాతో భవతి మానవః ॥9॥

ఒక పర్యాయం సరస్వతీనదీస్నానార్థం నైమిశారణ్యవాసులైన ఋషులు కురుక్షేత్రానికి వెళ్ళారు. కాని వారికక్కడ ప్రవేశం లభించలేదు. అంతట ఆ ఋషులు యజ్ఞోపవీతి అనే తీర్థాన్ని కల్పించారు. మిగిలిన ఋషులకు

కూడా అందులో ప్రవేశం దొరకలేదు. రంతుకాశ్రమం నుండి చక్రతీర్థం వరకు గల ప్రదేశమంతా బ్రాహ్మణులతో నిండియుండడం చూసిన సరస్వతీదేవి ఆ మునుల హితంకోరి వారి వసతికొరకు ఎన్నో లతాగృహాలను నిర్మించి, సర్వప్రాణుల కల్యాణార్థం పశ్చిమాభిముఖంగా ప్రవహింపసాగింది. తూర్పుప్రవాహంలో స్నానంచేస్తే గంగాస్నానఫలం లభిస్తుంది. దక్షిణప్రవాహంలో స్నానంచేస్తే నర్మదాస్నానఫలం లభిస్తుంది. పడమరదిశలో యమునానదిగాను, ఉత్తరదిక్కులో సింధునదిగాను, ఆ సరస్వతీనదియే రూపొందింది. ఈ విధంగా అతిపుణ్యమైన సరస్వతీనది నలుదిశలలో ప్రవహిస్తోంది. అట్టి సరస్వతీనదిలో స్నానంచేసిన మానవునకు సర్వతీర్థస్నానఫలం లభిస్తుంది.

తతో గచ్ఛేద్ద్విజశ్రేష్ఠా మదనస్య మహాత్మనః ।
తీర్థం త్రైలోక్యవిఖ్యాతం విహారం నామ నామతః ॥10॥

యత్ర దేవాః సమాగమ్య శివదర్శనకాంక్షిణః ।
సమాగతా న చాపశ్యన్దేవం దేవ్యా సమన్వితమ్ ॥ 11॥

తేఽస్తువంత మహాదేవం నందినం గణనాయకమ్ ।
తతః ప్రసన్నో నందీశః కథయామాస చేష్టితమ్ ॥ 12॥

భవస్య ఉమయా సహ విహారే క్రీడితం మహత్ ।
తచ్ఛ్రుత్వా దేవతాస్తత్ర పత్నీరాహూయ క్రీడితాః ॥13॥

తేషాం క్రీడావినోదేన తుష్టః ప్రోవాచ శంకరః ।
యోఽస్మింస్తీర్థే నరః స్నాతి విహారే శ్రద్ధయాన్వితః ॥14॥

ధనధాన్యప్రియైర్యుక్తో జాయతే నాత్ర సంశయః ।

బ్రాహ్మణోత్తములారా! అచ్చటనుండి విహారమనే పేరుతో ముల్లోకాలలో ఖ్యాతి వహించిన మహాత్ముడగు మదనుని తీర్థానికి వెళ్లాలి. అచ్చట శివదర్శనార్థం దేవతలందరు గుమిగూడగా వారికి శివపార్వతుల దర్శనం కాలేదు. అంతట వారందరు కలసి మహాదేవుని, నందిని, గణనాయకుని స్తుతించారు. అంతట నందీశ్వరుడు సంతోషించి, శివుడు ఉమాదేవితో విహారతీర్థంలో విహరిస్తున్నారని తెలియజేశాడు. అది విని దేవతలందరు తమ తమ భార్యలను పిలిపించి, వారితో కలసి విహరించారు. వారి క్రీడలకు సంతోషించి "ఈ విహారతీర్థంలో ఏ మానవుడు శ్రద్ధతో స్నానం చేస్తాడో వాడు ధనధాన్యభివృద్ధికలిగి ప్రియురాండ్రతో సుఖిస్తాడు. ఇందులో సందేహమేమియులేదు" అని శంకరుడు వరమిచ్చాడు.

దుర్గాతీర్థం తతో గచ్ఛేద్దుర్గయా సేవితం మహత్ ॥15॥

యత్ర స్నాత్వా పితౄన్ పూజ్య న దుర్గతిమవాప్నుయాత్ ।
తత్రాపి చ సరస్వత్యాః కూలం త్రైలోక్యవిశ్రుతమ్ ॥16॥

దర్శనాన్ముక్తిమాప్నోతి సర్వపాతకవర్జితః ।
యస్తత్ర తర్పయేద్దేవాన్ పితౄంశ్చ శ్రద్ధయా నరః ॥17॥

అక్షయ్యం లభతే సర్వం పితృతీర్థం విశిష్యతే ।
మాతృహా పితృహా యశ్చ బ్రహ్మహా గురుతల్పగః ॥18॥

స్నాత్వా శుద్ధిమవాప్నోతి యత్ర ప్రాచీసరస్వతీ ।
దేవమార్గం ప్రవిష్టా చ దేవమార్గేణ నిఃసృతా ॥19॥

ప్రాచీసరస్వతీ పుణ్యా అపి దుష్కృతకర్మణామ్ ।

అనంతరం దుర్గాదేవికి నివాసమైన దుర్గాతీర్థానికి వెళ్ళాలి. అక్కడ స్నానం చేసి పితృపూజ చేస్తే ఎటువంటి దుర్గతులు కలుగవు. అక్కడ త్రిలోకవిశ్రుతమైన సరస్వతీకూపమున్నది. దానిని దర్శించినంతమాత్రం చేతనే సమస్తపాపాలు నశించి ముక్తి కలుగుతుంది. అక్కడ శ్రద్ధాభక్తులతో దేవపితృతర్పణాలు చేస్తే అది అంతయు అక్షయ ఫలప్రదమౌతుంది. పితృతీర్థం చాలా విశిష్టమైనది. ప్రాచీసరస్వతిలో స్నానం చేస్తే పితృహత్య, మాతృహత్య బ్రహ్మహత్య చేసినవాడు, గురుభార్యాసంగమం చేసినవాడు కూడా పాపరహితుడై శుద్ధుడౌతాడు. దేవమార్గంలో (ఆకాశంలో) ఉద్భవించి ఆకాశాన ప్రవహించిన ప్రాచీసరస్వతి పరమదుర్మార్గులను సహితం పవిత్రులను గావిస్తుంది.

త్రిరాత్రం యే కరిష్యంతి ప్రాచీం ప్రాప్య సరస్వతీమ్ ॥20॥

న తేషాం దుష్కృతం కించిద్దేహమాశ్రిత్య తిష్ఠతి ।
నరనారాయణౌ దేవౌ బ్రహ్మా స్థాణుస్తథా రవిః ॥21॥

ప్రాచీం దిశాం నిషేవంతే సదా దేవాః సవాసవాః ।
యే తు శ్రాద్ధం కరిష్యంతి ప్రాచీమాశ్రిత్య మానవాః ॥22॥

తేషాం న దుర్లభం కించిదిహలోకే పరత్ర చ ।
తస్మాత్ ప్రాచీ సదా సేవ్యా పంచమ్యాం చ విశేషతః ॥23॥

పంచమ్యాం సేవమానస్తు లక్ష్మీవాంశ్చ భవేన్నరః ।

ప్రాచీసరస్వతీతీరాన మూడురాత్రులు గడిపినవారి శారీరకమైన దుష్కర్మలు నిలువజాలవు. నరనారాయణులు, బ్రహ్మరుద్రాదిత్యులు, ఇంద్రాది దేవతలు అందరు తూర్పుదిక్కును సేవిస్తుంటారు. అటువంటి ప్రాచీదిశనాశ్రయించి శ్రాద్ధకర్మలొనర్చుమానవులకు ఇహపరలోకాలలో దుర్లభమైనదేదియు వుండదు. కావున మానవులెల్లప్పుడు ముఖ్యంగా పంచమీతిథులలో తూర్పుదిక్కును ఆరాధించాలి. పంచమినాడు తూర్పుదిశను ఆరాధించినవాడు ఐశ్వర్యవంతుడౌతాడు.

తీర్థమౌశనసం తత్ర త్రైలోక్యస్యాపి దుర్లభమ్ ॥24॥

ఉశనా యత్ర సంసిద్ధ ఆరాధ్య పరమేశ్వరమ్ ।
గ్రహమధ్యేషు పూజ్యతే తస్య తీర్థస్య సేవనాత్ ॥25॥

ఏవం శుక్రేణ మునినా సేవితం తీర్థముత్తమమ్ ।
యే సేవంతే శ్రద్దధానాస్తే యాంతి పరమాం గతిమ్ ॥26॥

యస్తు శ్రాద్ధం నరో భక్త్యా తస్మింస్తీర్థే కరిష్యతి ।
పితరస్తారితాస్తేన భవిష్యంతి న సంశయః ॥27॥

అక్కడ ముల్లోకాలలో దుర్లభమైన ఉశనతీర్థమున్నది. అక్కడ ఉశనుడు (శుక్రాచార్యుడు) పరమేశ్వరుని ఆరాధించి సిద్ధిపొంది, గ్రహమండలంలో పూజ్యుడైనాడు. ఆ విధంగా శుక్రునిచే సేవింపబడిన ఆ ఉత్తమతీర్థాన్ని శ్రద్ధతో సేవిస్తే పరమగతి లభిస్తుంది. ఆ తీర్థంలో భక్తితో మానవుడు శ్రాద్ధకర్మ చేస్తే వాని పితరులు తరిస్తారు. ఇందులో సందేహంలేదు.

చతుర్ముఖం బ్రహ్మతీర్థం యత్ర మర్యాదయా స్థితమ్ ।
యే సేవంతే చతుర్దశ్యాం సోపవాసా వసంతి చ ॥28॥

అష్టమ్యాం కృష్ణపక్షస్య చైత్రే మాసి ద్విజోత్తమాః ।
తే పశ్యంతి పరం సూక్ష్మం యస్మాన్నావర్తతే పునః ॥29॥

ద్విజోత్తములారా! ఎక్కడ నాల్గుద్వారాలుగల బ్రహ్మతీర్థం నియతంగా ఉంటుందో ఆ బ్రహ్మతీర్థాన్ని చతుర్దశినాడు ఉపవసించి విధ్యుక్తంగా సేవించినా, చైత్రబహుళఅష్టమినాడు ఆరాధించినా, అట్టివారు పునరావృత్తిరహితమైన పరమసూక్ష్మపదాన్ని పొందుతారు.

స్థాణుతీర్థం తతోగచ్ఛేత్సహస్రలింగశోభితమ్ ।
తత్ర స్థాణువటం దృష్ట్వా ముక్తో భవతి కిల్బిషైః ॥30॥

అక్కడినుండి సహస్రలింగశోభితమైన స్థాణుతీర్థానికి వెళ్ళాలి. అచ్చటి స్థాణువటాన్ని దర్శిస్తే సకలపాపాలు తొలగిపోతాయి.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే సరస్వతీనదీమాహాత్మ్యకథనం నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥42॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి సరస్వతీనదీమాహాత్మ్యకథనమనే నలభైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రిచత్వారింశోఽధ్యాయః - నలబైమూడవ అధ్యాయం
స్థాణుతీర్థ, సాన్నిహిత్యసరోవరమాహాత్మ్యకథనమ్ - స్థాణుతీర్థం, సాన్నిహిత్యసరోవరం యొక్క మాహాత్మ్యకథనం

ఋషయ ఊచుః - ఋషులు పలికారు.

స్థాణుతీర్థస్య మాహాత్మ్యం వటస్యాపి మహామునే ।
సాంనిహత్యసరోత్పత్తిం పూరణం పాంశునా తతః ॥1॥

లింగానాం దర్శనాత్పుణ్యం స్పర్శనేన చ కిం ఫలమ్ ।
తథైవ సరమాహాత్మ్యం బ్రూహి సర్వమశేషతః ॥2॥

మహామునీ! స్థాణుతీర్థము, అక్కడి వటవృక్షమాహాత్మ్యము, సాన్నిహిత్యసరోవరోత్పత్తి, దానిని మట్టితో పూడ్చుట, ఆ సరోవరమాహాత్మ్యము, అక్కడి లింగాల దర్శనం వలన, స్పర్శవలన కలిగే ఫలము అన్నీ వివరంగా తెలియజేయండి.

లోమహర్షణ ఉవాచ - లోమహర్షణుడు పలికాడు.

శృణ్వంతు దేవతాస్సర్వాః పురాణం వామనం మహత్ ।
యచ్ఛ్రుత్వా ముక్తిమాప్నోతి ప్రసాదాద్వామనస్య తు ॥3॥

సనత్కుమారమాసీనం స్థాణోర్వటసమీపతః ।
ఋషిభిర్వాలఖిల్యాద్యైః బ్రహ్మపుత్రైర్మహాత్మభిః ॥4॥

మార్కండేయో మునిస్తత్ర వినయేనాభిగమ్య చ ।
పప్రచ్ఛ సరమాహాత్మ్యం ప్రమాణం చ స్థితం తదా ॥5॥

మునులారా! మీరందరు దేనిని విన్నంతనే శ్రీవామనదేవునికృపవల్ల ముక్తి కలుగుతుందో అట్టి ఉత్తమమైన వామనపురాణాన్ని శ్రద్ధగావినండి. స్థాణువటసమీపంలో వాలఖిల్యాదిమునులు బ్రహ్మపుత్రులైన మహనీయులతో ఆసీనుడైన బ్రహ్మమానసపుత్రుడైన సనత్కుమారుని సమీపించి, మార్కండేయముని అభివాదం చేసి, ఒకమారు ఆ సరోవరంయొక్క విస్తారం, మహిమలు వివరించవలసినదిగా వినయంగా అర్థించారు.

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు పలికాడు.

బ్రహ్మపుత్ర మహాభాగ సర్వశాస్త్రవిశారద ।
బ్రూహి మే సరమాహాత్మ్యం సర్వపాపభయాపహమ్ ॥6॥

కాని తీర్థాని దృశ్యాని గుహ్యాని ద్విజసత్తమ ।
లింగాని కతిపుణ్యాని స్థాణోర్యాని సమీపతః ॥7॥

యేషాం దర్శనమాత్రేణ ముక్తిం ప్రాప్నోతి మానవః ।
వటస్య దర్శనం పుణ్యముత్పత్తిం కథయస్వ మే ॥8॥

ప్రదక్షిణాయాం యత్పుణ్యం తీర్థస్నానేన యత్ఫలమ్ ।
గుహ్యేషు దేవదృష్టేషు యత్పుణ్యమభిజాయతే ॥9॥

దేవదేవో యథా స్థాణుః సరమధ్యే వ్యవస్థితః ।
కిమర్థం పాంశునా శక్రస్తీర్థం పూరితవాన్పునః ॥10॥

స్థాణుతీర్థస్య మాహాత్మ్యం చక్రతీర్థస్య యత్ఫలమ్ ।
సూర్యతీర్థస్య మాహాత్మ్యం సోమతీర్థస్య బ్రూహి మే ॥11॥

శంకరస్య చ గుహ్యాని విష్ణోః స్థానాని యాని చ ।
కథయస్వ మహాభాగ సరస్వత్యాః సవిస్తరమ్ ॥12॥

త్వం దేహీ చాపి దేవస్య మాహాత్మ్యం వేత్సి తత్త్వతః ।
విరించస్య ప్రసాదేన విదితం సర్వమేవ చ ॥13॥

"బ్రహ్మపుత్రా!, మహాభాగా! సర్వశాస్త్రవిశారదా! సర్వపాపాలు క్షాళనం చేసే సరోవరమహిమను నాకు తెలుపుము. ఏ యే తీర్థాలు ప్రత్యక్షంగా దర్శనమిస్తున్నాయి?. ఏ యే తీర్థాలు గుప్తంగా వున్నాయి?. స్థాణునకు అతిదగ్గరగానున్న అతిపవిత్ర లింగాలేవి?. దర్శనమాత్రంచేతనే ముక్తిప్రదాలైన ఆ లింగాలనుగురించి, పవిత్రవటవృక్షదర్శనంవల్ల కలిగే పుణ్యం, దాని ఉత్పత్తి, ప్రదక్షిణఫలం, తీర్థస్నానఫలం వివరించండి. అచ్చట ప్రత్యక్షంగా, పరోక్షంగా వుండే దేవతలను ఆరాధిస్తే కలిగే ఫలం, దేవాదిదేవుడైన స్థాణువు సరోవరం మధ్య ఉండడం, శక్రుడు ఆ తీర్థాన్ని మట్టితో పూడ్చడం, ఆ స్థాణుతీర్థమహిమ, చక్రతీర్థ, సూర్యతీర్థ, సోమతీర్థాల మహిమల విశేషాలు వివరించండి. మహామునీ! బ్రహ్మముఖతః తమరు తెలుసుకున్న వివరాలతో ఈశ్వరుని గుహ్యస్థానాలు, విష్ణుస్థానాలు, సరస్వతీ వృత్తాంతం, దేవాధిదేవుని మహిమ, మున్నగునవన్నియు సవిస్తరంగా తెలియజేయండి" అని మార్కండేయమహర్షి సనత్కుమారునికి విన్నవించాడు.

లోమహర్షణ ఉవాచ – లోమహర్షణుడు పలికాడు.

మార్కండేయవచః శ్రుత్వా బ్రహ్మాత్మా స మహామునిః ।
అతిభక్త్యా తు తీర్థస్య ప్రవణీకృతమానసః ॥14॥

పర్యంకం శిథిలీకృత్య నమస్కృత్య మహేశ్వరమ్ ।
కథయామాస తత్సర్వం యచ్ఛ్రుతం బ్రహ్మణః పురా ॥15॥

మార్కండేయముని మాటలు వినిన వెంటనే బ్రహ్మాత్ముడైన ఆ మహాముని తీర్థములయందు అతిశ్రద్ధ కలవాడై, ఎంతో భక్తితో, మనస్సును ఓంకారమయం చేసికొని, తన పర్యంకాసనముద్రను వీడి, పరమశివునకు నమస్కరించి, తాను పూర్వం బ్రహ్మవలన విన్నదంతయు చెప్పనారంభించాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారమహర్షి పలికాడు.

నమస్కృత్య మహాదేవమీశానం వరదం శుభమ్ ।
ఉత్పత్తిం చ ప్రవక్ష్యామి తీర్థానాం బ్రహ్మభాషితామ్ ॥16॥

ఓ మహామునీ! వరదుడు, కల్యాణకరుడునగు మహేశ్వరునకు నమస్కరించి, ఇంతకుముందు నేను బ్రహ్మ ద్వారా తెలుసుకొనిన తీర్థాల ఉత్పత్తిని గురించి వినిపిస్తాను.

పూర్వమేకార్ణవే ఘోరే నష్టే స్థావరజంగమే ।
బృహదండమభూదేకం ప్రజానాం బీజసంభవమ్ ॥17॥

తస్మిన్నండే స్థితో బ్రహ్మా శయనాయోపచక్రమే ।
సహస్రయుగపర్యంతం సుప్త్వా స ప్రత్యబుధ్యత ॥18॥

సత్త్వోద్రిక్తస్తథా బ్రహ్మా శూన్యం లోకమపశ్యత ।
సృష్టిం చింతయతస్తస్య రజసా మోహితస్య చ ॥19॥

రజః సృష్టిగుణం ప్రోక్తం సత్త్వం స్థితిగుణం విదుః ।
ఉపసంహారకాలే చ ప్రవర్తేత తమోగుణః ॥20॥

గుణాతీతః స భగవాన్ వ్యాపకః పురుషః స్మృతః ।
తేనేదం సకలం వ్యాప్తం యత్కించిజ్జీవసంజ్ఞితమ్ ॥21॥

స బ్రహ్మా స చ గోవింద ఈశ్వరః స సనాతనః ।
యస్తం వేద మహాత్మానం స సర్వం వేదనిశ్చితమ్ ॥22॥

గుణాతీతః స పురుషః పరమాత్మా సనాతనః ।
యస్తం వేద మహాత్మానం స సర్వం వేద మోక్షవిత్ ॥23॥

కిం తేషాం సకలైస్తీర్థైరాశ్రమైర్వా ప్రయోజనమ్ ।
యేషాం చానన్తకం చిత్తమాత్మన్యేవ వ్యవస్థితమ్ ॥24॥

పూర్వం భయంకరమైన జలప్రళయమేర్పడి, స్థావరజంగమాత్మకమైన జగత్తంతా నశించిపోయింది. సకలజీవసృష్టికి మూలమైన ఒకపెద్ద అండం పుట్టింది. ఆ అండంలోనున్న బ్రహ్మ వేయి యుగాల పాటు నిద్రించి, మేల్కొన్నాడు. సత్త్వోద్రిక్తుడైన బ్రహ్మ అప్పుడు లోకమంతా శూన్యం కావడం చూశాడు. అంతట ఆయన రజోగుణ మోహితుడై సృష్టి చేయనాలోచించాడు. సృష్టిగుణం రజస్సు, స్థితిగుణం సత్త్వంగా తెలుసుకోవాలి. ఉపసంహారకాలంలో తమోగుణం ప్రవర్తిస్తుంది. కానీ భగవంతుడు వాస్తవంగా సర్వవ్యాపకుడు. గుణాతీతుడు. వానినే పురుషుడంటారు. జీవమనే పేరుతో సమస్తపదార్థములయందు ఆయనే వ్యాపించియుంటాడు. అతడే బ్రహ్మగా, ఈశ్వరుడుగా, గోవిందుడుగా పిలువబడే సనాతనుడు. ఈ పరతత్త్వాన్ని గుర్తించినవానికి సకలం నిశ్చయంగా తెలిసియుంటుంది.

అతడే గుణాతీతుడు. పురుషుడు, పరమాత్మ, సనాతనుడు. ఆ మహాత్మునిగూర్చి తెలిసినవాడు సర్వం తెలిసినవాడౌతాడు. అతడే సర్వజ్ఞుడు. అతడే మోక్షవిదుడు. ఆవిధంగా ఆత్మతత్త్వం తెలుసుకున్న మహనీయులకు ఈ తీర్థాలు, ఆశ్రమాలు, ఏమీ అవసరంలేదు. అట్టివారి అనంతమైన చిత్తం ఆత్మయందే వ్యవస్థితమై యుంటుంది.

**ఆత్మా నదీ సంయమపుణ్యతీర్థా సత్యోదకా శీలశమాదియుక్తా ।
తస్యాం స్నాతః పుణ్యకర్మా పునాతి న వారిణా శుద్ధ్యతి చాంతరాత్మా ॥25॥**

**ఏతత్ప్రధానం పురుషస్య కర్మ యదాత్మసంబోధసుఖే ప్రవిష్టమ్ ।
జ్ఞేయం తదేవ ప్రవదంతి సంతస్తత్రాప్యదేహీ విజహాతి కామాన్ ॥26॥**

**నైతాదృశం బ్రాహ్మణస్యాస్తి విత్తం యథైకతా సమతా సత్యతా చ ।
శీలే స్థితిర్దండవిధానవర్జనమక్రోధనశ్చోపరమః క్రియాభ్యః ॥27॥**

**ఏతద్ బ్రహ్మ సమాసేన మయోక్తం తే ద్విజోత్తమ ।
యత్ జ్ఞాత్వా బ్రహ్మ పరమం ప్రాప్స్యసి త్వం న సంశయః ॥28॥**

సంయమమనే పవిత్రతీర్థాలతో సత్యం, శీలం శమాదులనే పవిత్రోదకాలతో శోభించే ఆత్మయే పవిత్రమైన నది. ఆ నదిలో స్నానంచేసినవాడు పుణ్యకర్మ చేసినవాడు, పవిత్రుడు అవుతాడు. అంతేగాని అంతరాత్మశుద్ధి నీటివలన కలుగనేరదు. ఆత్మజ్ఞానసుఖంలో నిమగ్నమైయుండడం మానవుడి ప్రధానకర్తవ్యం. అదే తెలియవలసిన ఏకైకవస్తువనియు, దానిని పొందినవాడు సమస్తమైన కోరికలను వదలివేయుననియు, పెద్దలగు సాధువులు చెబుతున్నారు. బ్రాహ్మణుడన్నవాడికి సర్వసమతాభావాలు, ఏకత్వం, శీలం వదలకుండుట, హింసాత్యాగం, క్రోధరాహిత్యం, అసంగం అనే గుణాలే నిజమైన ధనం. దీనితో సమానమైన విత్తం మరొకటి లేదు. ఓ బ్రాహ్మణోత్తమా! బ్రహ్మస్వరూపాన్ని గురించి నీకు సంక్షేపంగా తెలియజేశాను. దీనిని తెలుసుకున్నచో నిస్సందేహంగా నీవు పరబ్రహ్మను పొందగలవు. ఇందులో సంశయం లేదు.

**ఇదానీం శృణు చోత్పత్తిం బ్రహ్మణః పరమాత్మనః ।
ఇమం చోదాహరంస్తత్ర శ్లోకం నారాయణం ప్రతి ॥29॥**

**ఆపో నారా వై తనవ ఇత్యేవం నామ శుశ్రుమః ।
తాసు శేతే స యస్మాచ్చ తేన నారాయణః స్మృతః ॥30॥**

**విశుద్ధసలిలే తస్మిన్విజ్ఞాయాంతర్గతం జగత్ ।
అండం విభజ్య భగవాంస్తస్మాదోమిత్యజాయత ॥31॥**

**తతో భూరభవత్తస్మాద్భువ ఇత్యపరః స్మృతః ।
స్వః శబ్దశ్చ తృతీయోఽభూద్భూర్భువః స్వేతి సంజ్ఞితాః ॥32॥**

**తస్యాం తేజః సమభవత్తత్సవితుర్వరేణ్యం యత్ ।
ఉదకం శోషయామాస యత్తేజోఽణు వినిఃసృతమ్ ॥33॥**

**తేజసా శోషితం శేషం కలలత్వముపాగతమ్ ।
కలలాద్బుద్బుదం జ్ఞేయం తతః కాఠిన్యతాం గతమ్ ॥34॥**

కాఠిన్యాద్ధరణీ జ్ఞేయా భూతానాం ధారిణీ హి సా ।
యస్మిన్ స్థానే స్థితం హ్యండం తస్మిన్సన్నిహితం సరః ॥35॥

యదాద్యం నిఃసృతం తేజస్తస్మాదాదిత్య ఉచ్యతే ।
అండమధ్యే సముత్పన్నో బ్రహ్మా లోకపితామహః ॥36॥

తస్యోల్బం మేరురభవజ్జరాయుః పర్వతాః స్మృతాః ।
గర్భోదకం సముద్రాశ్చ తథా నద్యః సహస్రశః ॥37॥

నాభిస్థానాద్యదుదకం బ్రహ్మణో నిర్మలం మహత్ ।
మహత్సరస్తేన పూర్ణం విమలేన వరాంభసా ॥38॥

తస్మిన్మధ్యే స్థాణురూపీ వటవృక్షో మహామనాః ।
తస్మాద్వినిర్గతా వర్ణా బ్రాహ్మణాః క్షత్రియా విశః ॥39॥

శూద్రాశ్చ తస్మాదుత్పన్నాః శుశ్రూషార్థం ద్విజన్మనామ్ ।

ఇప్పుడు పరమాత్మయైన బ్రహ్మోత్పత్తిని గూర్చి వినండి. నారాయణుని విషయంలో ఈ శ్లోకాన్ని సాధారణంగా చెబుతూ వుంటారు. "ఆపః(నీరు), నార(పరమాత్మ), తనుః(శరీరం) అను పేర్లు మనం వింటూవుంటాము. పరమాత్మ ఆ నారంలో(నీటిలో) శయనించినందున నారాయణుడని భగవంతునకు పేరు. జగత్తంతయు నీటిలో మునిగియున్నదని తెలిసికొనిన ఆ ప్రభువు ఆ పెద్దగ్రుడ్డును బద్దలు చేయగా అందుండి ఓంకారము బయలుదేరినది. అందులో నుండి ముందుగా "భూః", తదనంతరం "భువః", మూడవమారు "స్వః" ఉత్పన్నమయ్యాయి. ఆ మూడు నామాలు క్రమంగా కలసి "భూర్భువస్స్వః" అయ్యాయి. అవియే భూర్భువస్వర్లోకాలు. ఆ సవితృదేవత యొక్క ఏ వరేణ్యం (తేజస్సు) ఉన్నదో అది దానినుండి అనగా అండం నుండి ఉత్పన్నమైనది. అండం నుండి ఉత్పన్నమైన తేజస్సు నీళ్ళనన్నింటిని ఎండింప జేసింది. నీరు ఎండగా మిగిలినది కలలం (పిండం)గా మారింది. దాని నుండి బుద్బుదం(బుడగ)ఏర్పడి అది గట్టిపడింది. ఆ విధంగా గట్టి పడిన దానిని "ధరణి" అన్నారు. అదియే సకలజీవులను ధరిస్తుంది. ఆ అండం నిలిచిన ప్రదేశమే సన్నిహితసరస్సు. ఆదిలో వచ్చిన తేజస్సు కాబట్టి దానిని "ఆదిత్యుడు" అన్నారు. లోకపితామహుడైన విరించి గ్రుడ్డు మధ్యలో నుండి ఉద్భవించాడు. ఆ అండం యొక్క ఉల్బం(మధ్యావరణం) "మేరుపర్వతం". యోని పర్వతాలు. సప్త సముద్రాలు, వేలాదినదులు గర్భోదకం(ఉమ్మనీరు). బ్రహ్మ నాభిప్రదేశానవున్న నిర్మలమైన, విశాలమైన, ఉత్తమమైన జలరాశితో ఆ మహత్సరోవరం నింపబడింది. దానికి మధ్యలో స్థాణురూపమైన వటవృక్షం వెలిసింది. ఈ స్థాణు వటవృక్షంనుండి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు ఉద్భవించారు. ద్విజులైన ఈ మూడు వర్ణాలవారికి సేవ చేసే నిమిత్తం అదే స్థాణువటం నుండి శూద్రులు జన్మించారు. ఈ విధంగా నాలుగు వర్ణాల వారి సృష్టి సరోవరం మధ్యలో గల స్థాణురూపంలోనున్న వటవృక్షం నుండియే జరిగింది.

తతశ్చింతయతః సృష్టిం బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ।
మనసా మానసా జాతాః సనకాద్యా మహర్షయః ॥40॥

పునశ్చింతయతస్తస్య ప్రజాకామస్య ధీమతః ।
ఉత్పన్నా ఋషయః సప్త తే ప్రజాపతయోऽభవత్ ॥41॥

అవ్యక్తజన్ముడైన బ్రహ్మ సృష్టికార్యాన్ని గూర్చి ఆలోచించగా ఆయన మనస్సునుండి సనకాది ఋషులు మానసపుత్రులుగా ఉద్భవించారు. ప్రజాసృష్టికి ఆయన మరల సంకల్పించగా సప్తర్షులు ఉత్పన్నమైనారు. వారే ప్రజాపతులు.

పునశ్చింతయతస్తస్య రజసా మోహితస్య చ ।
వాలఖిల్యాః సముత్పన్నా స్తపః స్వాధ్యాయతత్పరాః ॥42॥

తే సదా స్నాననిరతా దేవార్చనపరాయణాః ।
ఉపవాసైర్వ్రతైస్తీవ్రైః శోషయంతి కళేబరమ్ ॥43॥

వానప్రస్థేన విధినా అగ్నిహోత్రసమన్వితాః ।
తపసా పరమేణేహ శోషయంతి కళేబరమ్ ॥44॥

దివ్యం వర్షసహస్రం తే కృశా ధమనిసంతతాః ।
ఆరాధయంతి దేవేశం న చ తుష్యతి శంకరః ॥45॥

రజోగుణమోహితుడై బ్రహ్మ మరల ఆలోచింపగా తపస్స్వాధ్యాయనిరతులైన వాలఖిల్యులు జన్మించారు. వారు సదా స్నాననిరతులై, దేవార్చనపరాయణులై, తీవ్రమైన ఉపవాసాలతోను, వ్రతాలతోను తమ శరీరాలను శుష్కింపజేసుకుంటున్నారు. వానప్రస్థపద్ధతిలో అగ్నికర్మలు నెరవేర్చుకుంటూ కఠోరమైన తపస్సుతో తమ శరీరాలను శుష్కింపజేసుకున్నారు. ఆ విధంగా వేయి దివ్యసంవత్సరాలు తపించినందున వారి దేహాలలోని రక్తమాంసాలు శుష్కించి, కేవలం నాడులు, నరాలు మిగిలిపోయాయి. ఆ విధంగా ఆరాధించినప్పటికి వారికి శంకరుడు ప్రసన్నుడు కాలేదు.

తతః కాలేన మహతా ఉమయా సహ శంకరః ।
ఆకాశమార్గేణ తదా దృష్ట్వా దేవీ సుదుఃఖితా ॥46॥

ప్రసాద్య దేవదేవేశం శంకరం ప్రాహ సువ్రతా ।
క్లిశ్యంతే తే మునిగణా దేవదారువనాశ్రయాః ॥47॥

తేషాం క్లేశక్షయం దేవ విధేహి కురు మే దయామ్ ।
కిం వేద ధర్మనిష్ఠానామనంతం దేవ దుష్కృతమ్ ॥48॥

నాద్యాపి యేన శుద్ధ్యంతి శుష్కస్నాయ్వస్థిశోషితాః ।
తచ్ఛ్రుత్వా వచనం దేవ్యాః పినాకీ పాతితాంధకః ।
ప్రోవాచ ప్రహసన్ మూర్ధ్ని చారుచంద్రాంశుశోభితః ॥49॥

అటు పిమ్మట చాలాకాలానికి శివపార్వతులు ఆకాశమార్గాన వెడుతుండగా ఎండిన దేహాలు గల వీరిని చూసిన పార్వతీదేవి దుఃఖించి, భర్తను ప్రసన్నుని గావించుకొని, శంకరునితో ఇలా పలికింది. "ప్రభో! దేవదారు

వనంలో ఆ మునులు ఆ విధంగా కష్టపడుతున్నారు. దయతో వారి క్లేశాలను తొలగించండి. ఆస్తికులై వేదధర్మ నిష్ఠతో ఎమకలుమాత్రమే మిగిలేటట్లు ఇంతకాలంగా ఘోరతపస్సుచేసినా శుద్ధులుకాకపోవడానికి వీరు అంతటి దుష్కర్మలు చేశారా?" పార్వతీదేవి పలికిన ఈ మాటలు విని, చంద్రమౌళి, పినాకపాణి, అంధకాంతకుడునైన పరమేశ్వరుడు చిరునవ్వు నవ్వి ఇలా పలికాడు.

శ్రీమహాదేవ ఉవాచ – మహాదేవుడు పలికాడు.

న వేత్సి దేవి తత్త్వేన ధర్మస్య గహనాం గతిమ్ ।
నైతే ధర్మం విజానంతి న చ కామవివర్జితాః ॥**50**॥

న చ క్రోధేన నిర్ముక్తాః కేవలం మూఢబుద్ధయః ।
ఏతచ్ఛ్రుత్వాఽ బ్రవీద్దేవి మామైవం సంశితవ్రతాన్ ॥**51**॥

దేవ ప్రదర్శయాత్మానం పరం కౌతూహలం హి మే ।
స ఇత్యుక్త ఉవాచేదం దేవదేవః స్మితాననః ॥**52**॥

తిష్ఠ త్వమత్ర యాస్యామి యత్రైతే మునిపుంగవాః ।
సాధయంతి తపో ఘోరం దర్శయిష్యామి చేష్టితమ్ ॥**53**॥

ఇత్యుక్తా తు తతో దేవీ శంకరేణ మహాత్మనా ।
గచ్ఛస్వేత్యాహ ముదితా భర్తారం భువనేశ్వరీ ॥**54**॥

యత్ర తే మునయః సర్వే కాష్ఠలోష్ఠసమాః స్థితాః ।
అధీయానా మహాభాగాః కృతాగ్నిసదనక్రియాః ॥**55**॥

తాన్ విలోక్య తతో దేవో నగ్నః సర్వాంగసుందరః ।
వనమాలాకృతాపీడో యువా భిక్షాకపాలభృత్ ॥**56**॥

ఆశ్రమే పర్యటన్ భిక్షాం మునీనామాశ్రమం ప్రతి ।
దేహి భిక్షాం తతశ్చోక్త్వా సంభ్రమన్నాశ్రమం యయౌ ॥**57**॥

తం విలోక్యాశ్రమగతం యోషితో బ్రహ్మవాదినామ్ ।
సకౌతుకస్వభావేన తస్య రూపేణ మోహితాః ॥**58**॥

ప్రోచుః పరస్పరం నార్య ఏహి పశ్యామ భిక్షుకమ్ ।
పరస్పరమితి ప్రోక్త్వా గృహ్య మూలఫలం బహు ॥**59**॥

గృహాణ భిక్షామూచుస్తాస్తం దేవం మునియోషితః ।
స తు భిక్షాకపాలం తత్ప్రసార్య బహు సాదరమ్ ॥**60**॥

దేహి భిక్షాం శివం వోఽస్తు భవతీభ్యస్తపోధనాః ।
హసమానస్తు దేవేశస్తత్ర దేవ్యా నిరీక్షితః ॥**61**॥

తత్ర దత్త్వైవ తాం భిక్షాం పప్రచ్ఛుస్తాః స్మరాతురాః ।

"దేవీ! నీవు ధర్మసూక్ష్మం తెలియక ఇలా అంటున్నావు. వీరు ధర్మమెరిగినవారు కారు. కామవివర్జితులు కారు. క్రోధాన్ని విడిచినవారు కారు. వీరు కేవలం మూఢబుద్ధులు". శివుని ఈ పలుకులను విని దేవి "ప్రభూ! తపోవ్రతనిష్ఠులైన వీరిని గూర్చి ఆ విధంగా మాట్లాడవద్దు. మీరనుగ్రహించి వారికిదర్శనమొసగి రక్షించండి" అని వేడుకోగా ఆ దేవదేవుడు నవ్వుచూ ఇలా పలికాడు. "నీవిక్కడేయుండి చూస్తూఉండు. ఈ మునిపుంగవులు చేసే ఘోరమైన తపస్సు తీరును తెలియజేస్తాను. వారి పనులు నీకే అర్థమౌతాయి" అన్నాడు. అందులకు పార్వతి సంతోషించి భర్తతో "మంచిది. అలాగే వెళదాం" అనిపలుకగా వారిరువురు బయలుదేరారు. కట్టెపుల్లలు, ఇనుప వూచల వలె నుండి వేదాధ్యయనాలు, అగ్నికర్మలు అదే పనిగా చేస్తున్న ఆ మునుల చెంతకు చేరి, వారిని చూసి, పరమేశ్వరుడు సర్వాంగసుందరము, దిగంబరము, వనమాలా భూషితమునైన యువాకృతి ధరించి, చేతితో కపాలం పట్టుకుని మున్యాశ్రమాలవెంట భిక్షాటనం చేయసాగాడు. అప్పుడు భిక్షాందేహి (భిక్షనిమ్ము) అని పలుకుతూ మున్యాశ్రమంలో ప్రవేశించాడు. అట్లు ఆశ్రమంలో ప్రవేశించిన అందమైన యువతపస్విని నగ్నంగా చూడడంతో సహజమైన ఉత్కంఠతో ఆ మునుల భార్యలు మోహంలో మునిగిపోయారు. ఆ స్త్రీలందరు పరస్పరం ఆ సుందరభిక్షుకుని చూచెదమనుచు, కందమూలఫలాలు తీసుకొని, భిక్ష పెట్టుటకు బయలుదేరి, అతనితో ఆ మునిపత్నులు భిక్షను తీసుకోమన్నారు. అంతట దేవేశుడు కూడా భిక్షాకపాలాన్ని ముందుకు చాపి, "భిక్షనీయండి మీకు మేలు కలుగు గాక!" అనిపలుకుతూ నవ్వులొలకబోశాడు. ఆయన నవ్వులకు మరింత కామాతిరేకంతో మునిపత్నులు అతనికి భిక్షనిచ్చి ఇలా ప్రశ్నింపసాగారు.

నార్య ఊచుః – మునిపత్నులు పలికారు.

కోఽసౌ నామ వ్రతవిధిస్త్వయా తాపస సేవ్యతే ॥ 62॥

యత్ర నగ్నేన లింగేన వనమాలావిభూషితః ।
భవాన్వై తాపసో హృద్యో బ్రూహి స్మ యది మన్యసే ॥63॥

"ఓయీ! అందమైన తాపస యువకుడా! ఈ విధంగా, దిగంబరంగా లింగంతో వనమాలావిభూషితుడవై భిక్షాటన చేసే వ్రతవిధానమెట్టిది? దాని విధానమెక్కడ వున్నది? మాకు తెలియజేయాలని నీవు భావిస్తే తెలియజెయ్యి".

ఇత్యుక్తస్తాపసీభిస్తు ప్రోవాచ హసితాననః ।
ఇదం మమ వ్రతం కించిన్న రహస్యం ప్రకాశ్యతే ॥64॥

శృణ్వంతి బహవో యత్ర తత్ర వ్యాఖ్యా న విద్యతే ।
అస్య వ్రతస్య సుభగా ఇతి మత్వా గమిష్యథ ॥65॥

కామాతురులై, ఈ విధంగా పలికిన తాపసస్త్రీల పలుకులు విని, శివుడు నవ్వుతూ ఇలా జవాబిచ్చాడు – "ఓ సుందరులారా! ఈ నా వ్రతం చాలా రహస్యమైనది. దీని విధానం, ఫలం, ఎక్కడపడితే అక్కడ అందరూ వింటూండగా వివరింపరాదు. కావున ఈ వ్రతాన్ని గూర్చి తలుస్తూ మీరు వెళ్ళండి".

ఏవముక్తస్తదా తేన తాః ప్రత్యూచుస్తదా మునిమ్ ।
రహస్యేహి గమిష్యామో మునే నః కౌతుకం మహత్ ॥66॥

శివుడిట్లు పలుకగానే ఆ స్త్రీలు ఇలా జవాబిచ్చారు. "ఓ మునీ! రహస్యమైనదైనచో మనము రహస్య స్థలానికి వెళ్ళెదము. మాకు వినాలని మిక్కిలి కుతూహలంగా వున్నది".

ఇత్యుక్త్వా తాస్తదా తం వై జగృహుః పాణిపల్లవైః ।
కాచిత్ కంఠే సకందర్పా బాహుభ్యామపరాస్తథా ॥67॥

జానుభ్యామపరా నార్యః కేశేషు లలితా పరాః ।
అపరాస్తు కటీరంధ్రే అపరాః పాదయోరపి ॥68॥

క్షోభం విలోక్య మునయ ఆశ్రమేషు స్వయోషితామ్ ।
హన్యతామితి సంభాష్య కాష్ఠపాషాణపాణయః ॥69॥

పాతయంతి స్మ దేవస్య లింగముద్ధృత్య భీషణమ్ ।
పాతితే తు తతో లింగే గతోఽన్తర్ధానమీశ్వరః ॥70॥

దేవ్యా స భగవాన్ రుద్రః కైలాసం నగమాశ్రితః ।

అని పలుకుతూ ఆ స్త్రీలు చిగురుల వంటి తమ చేతులతో అతనిని పట్టుకున్నారు. కొందరు సుందరాంగులు ఆయన మెడను మోహావేశంతో పెనవేసుకున్నారు. కొందరు మోకాళ్ళు, మరికొందరు కేశాలతోను అందంగా పెనవేసుకున్నారు. కొందరు స్త్రీలు ఆయన నాభిరంధ్రాన్ని చుట్టివేసుకున్నారు. మరికొందరు పాదాలను పెనవేసుకున్నారు. ఈ విధంగా మోహావేశంతో కన్నుగానక ప్రవర్తిస్తున్న తమ స్త్రీల వికారచేష్టలను చూసి, ఆగ్రహోదగ్రులై, "ఈతనిని చంపుదాం" అని అంటూ కట్టెలు, రాళ్ళు తీసుకొని ఆయన భీషణ లింగాన్ని నేలపై పడగొట్టారు. తన లింగం ఊడి నేలపై పడిన వెంటనే మహాదేవుడు అంతర్హితుడయ్యాడు. రుద్ర భగవానుడు వెంటనే పార్వతీదేవితో కలసి కైలాసగిరి చేరుకున్నాడు.

పతితే దేవదేవస్య లింగే నష్టే చరాచరే ॥71॥

క్షోభో బభూవ సుమహానృషీణాం భావితాత్మనామ్ ।
ఏవం దేవే తదా తత్ర వర్తతి వ్యాకులీకృతే ॥72॥

ఉవాచైకో మునివరస్తత్ర బుద్ధిమతాం వరః ।
న వయం విద్మః సద్భావం తాపసస్య మహాత్మనః ॥73॥
విరించిం శరణం యామః స హి జ్ఞాస్యతి చేష్టితమ్ ।
ఏవముక్తాః సర్వ ఏవ ఋషయో లజ్జితా భృశమ్ ॥74॥

బ్రహ్మణః సదనం జగ్ముర్దేవైః సహ నిషేవితమ్ ।
ప్రణిపత్యాథ దేవేశం లజ్జయాఽధోముఖాః స్థితాః ॥75॥

దేవదేవుని లింగం భూమిపై పడగానే చరాచరసృష్టియంతా క్షోభకు గురియైనది. భగవానుని వ్యాకులపాటు వలన ఆత్మజ్ఞానులైన ఋషుల హృదయాలు క్షోభించాయి. అంతట ఆ మునులలో బుద్ధిమంతుడైనవాడొకడు "మనం ఆ మహాత్ముడైన తపస్వి సద్భావాన్ని తెలుసుకోలేకపోయాం. ఇప్పుడు మనమందరం వెళ్ళి విరించిని శరణు వేడుదాం. ఇందులో రహస్యం తెలిసినవాడతడే" అని సలహా ఇచ్చాడు. అంతట ఆ మునులందరు తమ తొందరపాటునకు, మూర్ఖత్వానికి సిగ్గుపడి, దేవతలచే సేవింపబడుతున్న బ్రహ్మసదనానికి వెళ్లారు. వారందరు బ్రహ్మకు నమస్కరించి సిగ్గుతో తలవంచుకొని నిలబడ్డారు.

అథ తాన్దుఃఖితాన్ దృష్ట్వా బ్రహ్మా వచనమబ్రవీత్ ।
అహో ముగ్ధా యదా యూయం క్రోధేన కలుషీకృతాః ॥76॥

న ధర్మం చ క్రియాం కాంచిజ్జానధ్వం మూఢబుద్ధయః ।
శ్రూయతాం ధర్మసర్వస్వం తాపసాః క్రూరకర్మణః ॥77॥

విదిత్వా యద్బుధః క్షిప్రం ధర్మస్య ఫలమాప్నుయాత్ ।
యోఽసావాత్మని దేహేఽస్మిన్విభుర్నిత్యో వ్యవస్థితః ॥78॥

సోఽనాదిః స మహాస్థాణుః పృథక్త్వే పరిసూచితః ।
మణిర్యథోపధానేన ధత్తే వర్ణోజ్జ్వలోఽపి వై ॥79॥

తన్మయో భవతే తద్వదాత్మాఽపి మనసా కృతః ।
మనసో భేదమాశ్రిత్య కర్మభిశ్చోపచీయతే ॥80॥

తతః కర్మవశాద్భుంక్తే యద్భోగాన్ స్వర్గనారకాన్ ।
తన్మనః శోధయేద్ధీమాన్ జ్ఞానయోగముపక్రమైః ॥81॥

తస్మిన్ శుద్ధే హ్యన్తరాత్మా స్వయమేవ నిరాకులః ।
న శరీరస్య సంక్లేశైరపి నిర్దహనాత్మకః ॥82॥

శుద్ధిమాప్నోతి పురుషః సంశుద్ధం యస్య నో మనః ।
క్రియానియమనార్థాయ పాతకేభ్యః ప్రకీర్తితాః ॥83॥

యస్మాదత్యావిలం దేహం న శీఘ్రం శుద్ధ్యతే కిల ।
తేన లోకేషు మార్గోఽయం సత్పథస్య ప్రవర్తకః ॥84॥

వర్ణాశ్రమవిభాగోఽయం లోకాధ్యక్షేణ కేనచిత్ ।
నిమిత్తం మోహమాహాత్మ్యం చిహ్నంచోత్తమభాగినామ్ ॥85॥

భవంతః క్రోధకామాభ్యామభిభూతాశ్రమే స్థితాః ।
జ్ఞానినామాశ్రమో వేశ్మ వేశ్మాశ్రమమయోగినామ్ ॥86॥

క్వచ న్యస్తసమస్తేచ్ఛా క్వచ నారీమయో భ్రమః ।
క్వ క్రోధ ఈదృశో ఘోరో యేనాత్మానం న జానథ ॥87॥

యత్క్రోధనో యజతి యచ్చ దదాతి నిత్యం యద్వా తపస్తపతి యచ్చ జుహోతి తస్య ।
ప్రాప్నోతి నైవ కిమపీహ ఫలం హి లోకే మోఘం ఫలం భవతి తస్య హి కోపనస్య ॥88॥

అంతట దుఃఖితులైన ఆ మునులను చూసి బ్రహ్మ ఇలా పలికాడు.“అహో! ముగ్ధులైన మిమ్ములను క్రోధం కలుషాత్ములను గావించింది. మూఢబుద్ధులారా! మీరు ధర్మకార్యస్వరూపాన్ని ఏ మాత్రం తెలుసుకోలేక పోయారు. పరమ క్రూరమైన కార్యమాచరించారు. తాపసులైన మీరు ధర్మసర్వస్వం వినండి. ధర్మస్వరూపం గుర్తించిన విజ్ఞుడు శీఘ్రమే ఉత్తమ ఫలం పొందుతాడు. ఆ పరమేశ్వరుడు మీ శరీరాలలోని, ఆత్మలలో, సదా నిలచియున్నాడు. అతడు అనాది. మహాస్థాణువు. మీకంటే భిన్నుడు కాడు. పరమప్రకాశవంతమైన మణిపైన కప్పబడిన వస్త్రముయొక్క రంగులో పైకి కనబడినవిధంగా ప్రాణులదేహంలో వుంటూ, వారి కర్మవాసనల అంతరాలననుసరించి, భిన్నప్రకృతులరూపాన కనిపిస్తాడు. ఆయా జీవుల మనోభావాలచేత పరిచ్ఛిన్నుడైయుంటాడు. కాని ఆయనకు వారి కర్మవాసనలుమాత్రము అంటవు. వారి కర్మానుసారమే స్వర్గనరకాది భోగాలనుభవించడం జరుగుతుంది. కనుక ఈ విషయం గుర్తించి బుద్ధిమంతులైనవారు జ్ఞానయోగాది సాధనలద్వారా తమ మనస్సులను పరిశుద్ధం గావించుకోవాలి. చిత్తం శుద్ధియైనవెంటనే అంతరాత్మ తనంత తానే నిశ్చలంగా వుండిపోతుంది. ఎటువంటి వ్యాకులానికి లోను గాదు. అట్టి మానసిక నైర్మల్యం లేనంతవరకు ఎంతకాలం వ్రతోపవాసాలతో శరీరం శుష్కింపజేసుకున్నా ఏమీ ప్రయోజనం వుండదు. మనస్సును పాపాలనుండి మరలించేవే సత్క్రియలు. ఈ అనుష్ఠానాలన్నీ చిత్తశుద్ధికోసమే ఉద్దేశింపబడినాయి. పాపపంకిలమైన ఈ దేహాన్ని శుద్ధిపరచుకోవడానికే ఈ లోకంలో జ్ఞానమార్గం ప్రవర్తితమయ్యింది. అటువంటి సత్ప్రవర్తనకు సాధనభూతంగానే పరమేశ్వరుడు వర్ణాశ్రమధర్మవ్యవస్థనేర్పరచినాడు. కాని ఎక్కువమంది అజ్ఞానాన్ని, మోహాన్ని గొప్ప విషయంగా భావించి గొప్పవారనుకుంటున్నారు. ఇక మీరు కామక్రోధాదులతో నిండిన ఆశ్రమంలో ఉన్నారు. నిజమైన జ్ఞానులకు ఇల్లే ఆశ్రమము. జ్ఞానులు కానివారికి ఆశ్రమాలు ఇంటికంటే కూడ నికృష్టమైనవిగా వుంటాయి. స్త్రీసంబంధమైన భ్రమలకు లోనైన మీరెక్కడ? నిరీహమైన జీవితమెక్కడ? క్రోధానికి దాసులైన మీరెక్కడ? ఆత్మజ్ఞానమెక్కడ?. క్రోధాభిభూతులు చేసే యజ్ఞాలు, ఇచ్చే దానాలు, హోమం చేసే ఆహుతులు, ఆచరించే తపోవ్రతాలు, నిష్ప్రయోజనాలే. ఈ జన్మలో అవి ఎటువంటి ఫలితాలను ఈయజాలవు. కోపిష్టి చేసే పనులన్నీ దేనికి పనికిరాకుండపోతాయి.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే స్థాణుతీర్థ, సాన్నిహిత్యసరోవరమాహాత్మ్య కథనం నామ త్రిచత్వారింశోఽధ్యాయః ॥43॥

శ్రీవామన మహాపురాణమందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి సాన్నిహిత్య సరోవరంయొక్క మాహాత్మ్య కథనమనే నలభైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుశ్చత్వారింశోఽధ్యాయః – నలభైనాల్గవ అధ్యాయం
స్థాణ్వీశ్వరవృత్తాంతః, హస్తిరూపశంకరస్తుతిశ్చ – స్థాణీశ్వరవృత్తాంతం, హస్తిరూపశంకరస్తుతి

సనత్కుమార ఉవాచ – సనత్కుమారమహర్షి పలికాడు.

బ్రహ్మణో వచనం శ్రుత్వా ఋషయః సర్వ ఏవ తే ।
పునరేవ చ పప్రచ్ఛుర్జగతః శ్రేయకారణమ్ ॥1॥

బ్రహ్మ పలికిన మాటలు విని‌న ఋషులందరు "ఇప్పుడు జగత్తునకు శ్రేయస్సు ఎలా కలుగుతుంది" అని మరలా ప్రశ్నించారు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

గచ్ఛామః శరణం దేవం శూలపాణిం త్రిలోచనమ్ ।
ప్రసాదాద్దేవదేవస్య భవిష్యథ యథా పురా ॥2॥

ఇత్యుక్త్వా బ్రహ్మణా సార్ధం కైలాసం గిరిముత్తమమ్ ।
దదృశుస్తే సమాసీనముమయా సహితం హరమ్ ॥3॥

తతః స్తోతుం సమారబ్ధో బ్రహ్మా లోకపితామహః ।
దేవాధిదేవం వరదం త్రైలోక్యస్య శివం ప్రభుమ్ ॥4॥

"మనమందరం వెళ్ళి శూలపాణి, త్రిలోచనుడు, దేవదేవుడునైన శివుని శరణు వేడుదాం. ఆయన అనుగ్రహంవలన యథాపూర్వస్థితి ఏర్పడుతుంది" అని పలికిన బ్రహ్మతో కలిసి ఆ మునులందరు కైలాసానికి వెళ్ళి, ఉమాసహితుడైన శంకరుని దర్శించారు. అంతట లోకపితామహుడైన బ్రహ్మ దేవాధిదేవుడు, వరదుడు, త్రిలోకేశ్వరుడునైన శివుని ఇలా స్తుతించడం ప్రారంభించాడు.

అనంతాయ నమస్తుభ్యం వరదాయ పినాకినే ।
మహాదేవాయ దేవాయ స్థాణవే పరమాత్మనే ॥5॥

నమోఽస్తు భువనేశాయ తుభ్యం తారక సర్వదా ।
జ్ఞానానాం దాయకో దేవస్త్వమేకః పురుషోత్తమః ॥6॥

నమస్తే పద్మగర్భాయ హృత్పద్మశాయినే నమః ।
ఘోరశాంతిస్వరూపాయ చండక్రోధ నమోఽస్తు తే ॥7॥

నమస్తే దేవ విశ్వేశ నమస్తే సురనాయక ।
శూలపాణే నమస్తేఽస్తు నమస్తే విశ్వభావన ॥8॥

ఓ అనంతా! నీకు నమస్కారం. పినాకధారీ! వరదా! మహాదేవా! స్థాణూ! పరమాత్మా! నీకు ప్రణామం. భువనేశ్వరుడవైన నీకు నమస్కారం. తారకా! సర్వదా! సకలజ్ఞానప్రదాయకా! దేవా! నీవొక్కడవే పురుషోత్తముడవు.

పద్మగర్భుడవైన నీకు నమస్కారం. హృత్పద్మములయందు శయనించు నీకు నమస్కారం. ఘోరరూపా! శాంతిరూపా! చండకోపనా! నీకు నమస్సులు. ఓ దేవా! విశ్వేశా! నీకు నమస్కారం. సురనాయకా! నీకు నమస్కారం. ఓ శూలపాణీ! నీకు నమస్కారం. ఓ విశ్వభావనా! నీకు నమస్కారం.

ఏవం స్తుతో మహాదేవో బ్రహ్మణా ఋషిభిస్తదా ।
ఉవాచ తానాబ్రజత లింగం వో భవితా పునః ॥9॥

క్రియతాం మద్వచః శీఘ్రం యేన మే ప్రీతిరుత్తమా ।
భవిష్యతి ప్రతిష్ఠాయాం లింగస్యాత్ర న సంశయః ॥10॥

యే లింగం పూజయిష్యంతి మామకం భక్తిమాశ్రితాః ।
న తేషాం దుర్లభం కించిద్భవిష్యతి కదాచన ॥11॥

సర్వేషామపి పాపానాం కృతానామపి జానతా ।
శుద్ధ్యతే లింగపూజాయా నాత్ర కార్యా విచారణా ॥12॥

యుష్మాభిః పాతితం లింగం తారయిత్వా మహత్సరః ।
సన్నిహత్యాం తు విఖ్యాతం తస్మింఛ్ఛీఘ్రం ప్రతిష్ఠితమ్ ॥13॥

యథాభిలషితం కామం తతః ప్రాప్స్యథ బ్రాహ్మణాః ।
స్థాణునామ్నా హి లోకేషు పూజనీయో దివౌకసామ్ ॥14॥

స్థాణ్వీశ్వరే స్థితో యస్మాత్తతః స్థాణ్వీశ్వరః స్మృతః ।
యే స్మరంతి సదా స్థాణుం తే ముక్తాః సర్వకిల్బిషైః ॥15॥

శుద్ధదేహా భవిష్యంతి దర్శనాన్మోక్షగామినః ।
ఇత్యేవముక్తా దేవేన ఋషయో బ్రహ్మణా సహ ॥16॥

తస్మాద్దారువనాల్లింగం నేతుం సముపచక్రముః ।
అశక్తాస్తం చాలయితుం తే దేవా ఋషిభిస్సహ ॥17॥

శ్రమేణ మహతా యుక్తా బ్రహ్మాణం శరణం యయుః ।
తేషాం శ్రమాభిపన్నానామిదం బ్రహ్మో బ్రవీద్వచః ॥18॥

ఈ విధంగా బ్రహ్మచేతను, ఋషులచేతను స్తుతింపబడిన మహాదేవుడు ఇలా పలికాడు. "భయపడకండి! వెళ్ళండి! లింగం మరలా ప్రతిష్ఠితమౌతుంది. నాకు ప్రీతికరంగా నేను చెప్పినట్లు చేయండి. నిస్సందేహంగా లింగప్రతిష్ఠ జరుగుతుంది. నా లింగాన్ని ఎవరు భక్తితో పూజిస్తారో వారలకు అసాధ్యమంటూ ఉండదు. పాపాలు తెలిసిచేసినప్పటికి ఎలాంటివాడైనా లింగార్చన చేసినంతటనే శుద్ధుడౌతాడు. ఇందులో సందేహించవలసినది ఏదీ లేదు. మీరు పడగొట్టిన లింగాన్ని వెంటనే తీసుకువెళ్ళి సాన్నిహిత్యమనే మహత్సరోవరంలో ప్రతిష్ఠించండి. అందు

వలన మీ మనోవాంఛితాలన్నీ నెరవేరుతాయి. దానిని స్థాణువనే పేరుతో దేవతలందరూ పూజిస్తారు. ఈశ్వరుడు స్థాణువునందుండుటచే స్థాణ్వీశ్వరుడనబడతాడు. ఈ స్థాణువును సదా స్మరించినవారు అన్నిపాపాలనుండి విముక్తులౌతారు. ఈ స్థాణువును దర్శించినంతమాత్రం చేతనే శుద్ధదేహులై, మోక్షగాములౌతారు". మహాదేవుడు ఇలా చెప్పగానే బ్రహ్మతో కూడిన మునులందరు దారువనం నుండి లింగాన్ని తీసుకురావడానికి ప్రయత్నించారు. కాని ఆ లింగాన్ని కదలించలేకపోవడంచేత దేవతలు, ఋషులు అందరు కలసి బ్రహ్మను శరణు వేడారు. మిక్కిలి శ్రమపడిన వారితో బ్రహ్మ ఇలా పలికాడు.

కిం వా శ్రమేణ మహతా న యూయం వహనక్షమాః ।
స్వేచ్ఛయా పాతితం లింగం దేవదేవేన శూలినా ॥19॥

తస్మాత్తమేవ శరణం యాస్యామః సహితాః సురాః ।
ప్రసన్నశ్చ మహాదేవః స్వయమేవ స నేష్యతి ॥20॥

మీరెంతగా శ్రమించినా దేవదేవుని ఇచ్ఛానుసారం భూమిమీద పడిన లింగాన్ని తీసుకొని పోలేరు. కనుక ఆయననే మరల శరణువేడితే ఆయనే దయతో దానిని తీసుకొని రాగలడు.

ఇత్యేవముక్తా ఋషయో దేవాశ్చ బ్రహ్మణా సహ ।
కైలాసం గిరిమాసాద్య రుద్రదర్శనకాంక్షిణః ॥21॥

న చ పశ్యంతి తే దేవం తతశ్చింతాసమన్వితాః ।
బ్రహ్మాణమూచుర్మునయః క్వ స దేవో మహేశ్వరః ॥22॥

తతో బ్రహ్మా చిరం ధ్యాత్వా దేవదేవం మహేశ్వరమ్ ।
హస్తిరూపేణ తిష్ఠంతం మునిభిర్మానసః స్తుతమ్ ॥23॥

ఇట్లు పలికి ఋషులు, దేవతలు బ్రహ్మతో కలసి రుద్రదర్శనకాంక్షతో మరలా కైలాసశిఖరానికి వెళ్ళారు. కాని అక్కడ వారికి రుద్రుడు కనిపించలేదు. అంతట వారు చింతాసమన్వితులై "ఓ బ్రహ్మదేవా! మహేశ్వరుడు ఎక్కడున్నాడు?" అని బ్రహ్మతో పలికారు. అంతట బ్రహ్మ ధ్యాననిష్ఠుడై ఆలోచింపగా ఆయనను స్తోత్రంచేస్తున్న దేవతల, ఋషుల మనస్సులలోనే శంకరుడు ఏనుగురూపంలో వున్నట్లు కనుగొన్నాడు.

అథ తే ఋషయస్సర్వే దేవాశ్చ బ్రహ్మణా సహ ।
గతా మహత్సరః పుణ్యం యత్ర దేవః స్వయం స్థితః ॥24॥

న చ పశ్యంతి తే దేవమన్విషంతస్తతస్తతః ।
తతశ్చింతాన్వితా దేవా బ్రహ్మణా సహితాస్తథా ॥25॥

పశ్యంతి దేవీం సుప్రీతాం కమండలువిభూషితామ్ ।
ప్రీయమాణాస్తదా దేవీమిదం వచనమబ్రువన్ ॥26॥

అంతట బ్రహ్మను ముందుంచుకొని ఆ దేవతలు, ఋషులు అందరు మహాదేవుడు స్వయంగా ప్రకాశించే మహత్సరోవరానికి వెళ్లారు. అక్కడ కూడా శివుడు కనిపించక వారంతా వెతకసాగారు. చింతాకులమైన హృదయాలతో ఉండిపోయారు. అంతట పార్వతీదేవి కమండలధారిణియై ప్రసన్నవదనంతో కనిపించగా వారందరు ఆమెను స్తోత్రం చేశారు.

క్వ దేవి మాతర్దేవేశో దృశ్యతే సర్వదా సమః ।
శ్రమేణ మహతా యుక్తా అన్విషంతో మహేశ్వరమ్ ॥27॥

తతస్తు కృపయాఽఽవిష్టా దేవీ వచనమబ్రవీత్ ।
అత్రైవాద్య మహాభాగాస్తం ద్రక్ష్యథ మహేశ్వరమ్ ॥28॥

పీయతామమృతం దేవాస్తతో జ్ఞాస్యథ శంకరమ్ ।
ఏతచ్ఛ్రుత్వా తు వచనం భవాన్యా సముదాహృతమ్ ॥29॥

సుఖోపవిష్టాస్తే దేవాః పపుస్తదమృతం శుచి ।
అనంతరం సుఖాసీనాః పప్రచ్ఛుః పరమేశ్వరీమ్ ॥30॥

"ఓ మాతా! దేవేశుడెక్కడ? ఎంతో శ్రమతో మహేశ్వరుణ్ణి వెతికాము" అని దేవతలు, ఋషులు పలుకగా ప్రీతురాలైన ఉమాదేవి వారితో ఇలా పలికింది. "మీరు వెదకి వెదకి బాగా అలసిపోయారు. కాబట్టి మీరంతా ముందు ఈ అమృతాన్ని త్రాగండి. అప్పుడు ఇక్కడే శంకరుని జాడ తెలుసుకోగలరు". భవానీదేవియొక్క ఈ మాటలను విని, వారందరు సంతుష్టులై, అచ్చట కూర్చొని, పవిత్రమైన అమృతపానం చేశారు. అనంతరం సుఖాసీనులై వారామెను ఇలా అడిగారు.

క్వ స దేవ ఇహాయాతో హస్తిరూపధరః స్థితః ।
దర్శితశ్చ తదా దేవ్యా సరోమధ్యే వ్యవస్థితః ॥31॥

దృష్ట్వా దేవం హర్షయుక్తాః సర్వే దేవాః సవాసవాః ।
బ్రహ్మాణమగ్రతః కృత్వా ఇదం వచనమబ్రువన్ ॥32॥

హస్తిరూపంలో అచ్చటకు వచ్చిన ఈశ్వరుణ్ణి చూసి వారందరు ఈశ్వరుడు ఎక్కడున్నాడని దేవిని అడిగారు. ఆ సరోవరం మధ్యలో ఏనుగురూపంలో వున్న శివుణ్ణి చూపించింది. సరస్సు మధ్యలో మునిగియున్న మహాదేవుని చూసి బ్రహ్మను ముందుంచుకొని ఆ దేవర్షులిలా పలికారు.

త్వయా త్యక్తం మహాదేవ లింగం త్రైలోక్యవందితమ్ ।
తస్య చానయనే నాన్యః సమర్థః స్యాన్మహేశ్వర ॥33॥

ఇత్యేవముక్తో భగవాన్దేవో బ్రహ్మాదిభిర్హరః ।
జగామ ఋషిభిః సార్ధం దేవదారువనాశ్రమమ్ ॥34॥

తత్ర గత్వా మహాదేవో హస్తిరూపధరో హరః ।
కరేణ జగ్రాహ తతో లీలయా పరమేశ్వరమ్ ॥35॥

తమాదాయ మహాదేవః స్తూయమానో మహర్షిభిః ।
నివేశయామాస తదా సరః పార్శ్వే తు పశ్చిమే ॥36॥

తతో దేవాః సర్వ ఏవ ఋషయశ్చ తపోధనాః ।
ఆత్మానం సఫలం దృష్ట్వా స్తోత్రం చక్రుర్మహేశ్వరే ॥37॥

"మహాదేవా! నీవు వదలిన త్రిలోకవందనీయమైన లింగాన్ని ఇతరులెవ్వరు తీసుకొని వచ్చుటకు సమర్థులు కాకున్నారు". బ్రహ్మాదుల ఈ విన్నపాన్ని హరుడు విని వారందరిని వెంటబెట్టుకొని దేవదారు వనాశ్రమానికి వెళ్లి, ఏనుగు రూపంలోనున్న హరుడు తొండంతో అలవోకగా లింగాన్ని పట్టుకొనివచ్చి, మహర్షులస్తోత్రపాఠాల మధ్య, ఆ మహాసరస్సునకు పశ్చిమదిక్కుననిలిపాడు. అంతట దేవతలు, ఋషులు తమజన్మలు ధన్యమైనవని సంతోషించి పరమశివుని ఇలా స్తోత్రంచేశారు.

నమస్తే పరమాత్మన్, అనంతయోనే, లోకసాక్షిన్, పరమేష్ఠిన్, భగవన్, సర్వజ్ఞ, క్షేత్రజ్ఞ, జ్ఞానజ్ఞేయ, సర్వేశ్వర, మహావిరించే, మహావిభూతే, మహాక్షేత్రజ్ఞ, మహాపురుష, సర్వభూతావాస, మనోనివాస, ఆదిదేవ, మహాదేవ, సదాశివ, ఈశాన, దుర్విజ్ఞేయ, దురారాధ్య, మహాభూతేశ్వర, పరమేశ్వర, మహాయోగేశ్వర, త్ర్యంబక, మహాయోగిన్, పరబ్రహ్మన్, పరమజ్యోతిః, బ్రహ్మవిదుత్తమ, ఓంకార, వషట్కార, స్వాహాకార, స్వధాకార, పరమకారణ, సర్వగత, సర్వదర్శన, సర్వశక్త, సర్వదేవ, అజ, సహస్రార్చిః, సుధామన్, హరధామ, వంశవర్త, సంవర్త, సంకర్షణ, వడవానల, అగ్నీషోమాత్మక, పవిత్ర, మహాపవిత్ర, మహామేఘ, మహాకామహన్, హంస, పరమహంస, మహారాజిక, మహేశ్వర, మహాకాముక, మహాహంస, భవక్షయకర, సురసిద్ధార్చిత, హిరణ్యవాహ, హిరణ్యరేతః, హిరణ్యనాభ, హిరణ్యాగ్రకేశ, ముంజకేశిన్, సర్వలోకవరప్రద, సర్వానుగ్రహకర, కమలేశయ, హృదయేశయ, జ్ఞానోదధే, శంభో చ విభో, మహాయజ్ఞ, మహాయాజ్ఞిక, సర్వయజ్ఞమయ, సర్వయజ్ఞసంస్తుత, నిరాశ్రయ, సముద్రేశ, అత్రిసంభూత, భక్తానుకంపక, అభగ్నయోగ, యోగధర, వాసుకిమహాహివిద్యోతితవిగ్రహ, హరితనయన, త్రిలోచన, జటాధర, నీలకంఠ, చంద్రార్ధధర, ఉమాశరీరార్ధధర, శూలధర, పినాకధర, ఖడ్గచర్మధర, గజచర్మధర, దుస్తరసంసారమహాసంహారకర, ప్రసీద, భక్తజనవత్సల ॥38॥

ఏవం స్తుతో దేవగణైః సుభక్త్యా స బ్రహ్మముఖ్యైశ్చ పితామహేన ।
త్యక్త్వా తదా హస్తిరూపం మహాత్మా లింగం తదా సంనిధానం చకార ॥39॥

"ఓ పరమాత్మా! అనంతయోనీ! లోకసాక్షీ! పరమేష్ఠీ! భగవాన్! సర్వజ్ఞా! క్షేత్రజ్ఞా! జ్ఞానముచే తెలియదగినవాడా! సర్వేశ్వరా! మహావిరించీ! మహావిభూతీ! మహాక్షేత్రజ్ఞా! మహాపురుషా! సర్వభూతావాసా! మనోనివాసా! ఆదిదేవా! మహాదేవా! సదాశివా! ఈశానా! దుర్విజ్ఞేయా! దురారాధ్యా! మహాభూతేశ్వరా! పరమేశ్వరా! మహాయోగేశ్వరా! త్ర్యంబకా! మహాయోగీ! పరబ్రహ్మ! పరంజ్యోతీ! బ్రహ్మవిదుత్తమా! ఓంకారరూపా! వషట్కారా! స్వాహాకారా! స్వధాకారా!

పరమకారణా! సర్వగతా! సర్వదర్శనా! సర్వశక్తా! సర్వదేవా! అజా! సహస్రార్చీ! సుధామా! హరధామా! వంశవర్తా! సంవర్తా! సంకర్షణా! బడబానలా! అగ్నీషోమాత్మకా! పవిత్రా! మహాపవిత్రా! మహామేఘా! మహాకామహన్తా! హంసా! పరమహంసా! మహారాజకా! మహేశ్వరా! మహాకాముకా! మహాహంసా! భవక్షయకరా! సురసిద్ధార్చితా! హిరణ్యవాహా! హిరణ్యరేతా! హిరణ్యనాభా! హిరణ్యాగ్రకేశా! ముంజకేశా! సర్వలోకవరప్రదా! సర్వానుగ్రహకరా! కమలేశయా! హృదయేశయా! జ్ఞానసముద్రా! శంభో! విభో! మహాయజ్ఞా! మహాయాజ్ఞికా! సర్వయజ్ఞమయా! సర్వయజ్ఞసంస్తుతా! నిరాశ్రయా! సముద్రేశా! అత్రిసంభూతా! భక్తానుకంపకా! అభగ్నయోగా! యోగధరా! వాసుకిమహామహివిద్యోతితవిగ్రహా! హరితనయనా! త్రిలోచనా! జటాధరా! నీలకంఠా! చంద్రార్ధధరా! ఉమాశరీరార్ధధరా! శూలధరా! పినాకధరా! ఖడ్గచర్మధరా! గజచర్మధరా! దుస్తరసంసార మహాసంహారకరా! భక్తజనవత్సలా! నీకు ప్రణామము. మాయందు ప్రసన్నుడవు కమ్ము!". ఈ విధంగా బ్రహ్మాదిదేవతాముఖ్యులచే భక్తిప్రపత్తులతో స్తుతింపబడిన మహాదేవుడు సంతోషించి ఏనుగురూపాన్ని విడిచి లింగమధ్యంలో ప్రవేశించాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే స్థాణ్వీశ్వర వృత్తాంతః, హస్తిరూపశంకరస్తుతిర్నామ చతుశ్చత్వారింశోఽధ్యాయః ॥44॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి స్థాణ్వీశ్వరవృత్తాంతం, హస్తిరూపశంకరస్తుతి అనే నలభైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచచత్వారింశోఽధ్యాయః – నలభైఐదవ అధ్యాయం

సాన్నిహితసరోమాహాత్మ్యకథనమ్ – శంకరుడు సాన్నిహితసరోవరమాహాత్మ్యం తెలియజేయుట

సనత్కుమార ఉవాచ – సనత్కుమారమహర్షి పలికాడు.

అథోవాచ మహాదేవో దేవాన్ బ్రహ్మపురోగమాన్ ।
ఋషీణాం చైవ ప్రత్యక్షం తీర్థమాహాత్మ్యముత్తమమ్ ॥1॥

ఏతత్సన్నిహితం ప్రోక్తం సరః పుణ్యతమం మహత్ ।
మయోపవేశితం యస్మాత్తస్మాన్ముక్తిప్రదాయకమ్ ॥2॥

ఇహ యే పురుషాః కేచిద్బ్రాహ్మణాః క్షత్రియా విశః ।
లింగస్య దర్శనాదేవ పశ్యంతి పరమం పదమ్ ॥3॥

అహన్యహని తీర్థాని ఆసముద్రాత్సరాంసి చ ।
స్థాణుతీర్థం సమేష్యంతి మధ్యం ప్రాప్తే దివాకరే ॥4॥

స్తోత్రేణానేన సతతం యే మాం స్తోష్యంతి భక్తితః ।
తస్యాహం సులభో నిత్యం భవిష్యామి న సంశయః ॥5॥

ఇత్యుక్త్వా భగవాన్రుద్రో హ్యంతర్ధానం గతః ప్రభుః ।
దేవాశ్చ ఋషయః సర్వే స్వాని స్థానాని భేజిరే ॥6॥

అంతట దేవాధిదేవుడైన శంకరుడు ఋషుల సమక్షంలో బ్రహ్మపురోగాములైన దేవతలతో ఆ ఉత్తమ తీర్థమాహాత్మ్యముగురించి వివరించాడు. ఈ సాన్నిహిత సరస్సు సకల తీర్థాలలో ఉత్తమో-త్తమమైనది. ఇది నాకు నివాసంకావడంవల్ల ముక్తిప్రదాయకమైనది. ఇక్కడి నా లింగదర్శనం చేసినంతమాత్రాన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యాదులందరు పరమపదం పొందుతారు. మధ్యాహ్నసమయంలో ప్రతిరోజు సముద్రనదీసరోవరాలు సమస్తతీర్థాలు ఇక్కడ ఈ స్థాణుతీర్థంలో చేరి కలుస్తాయి. ఈ స్తోత్రం ఎవరు శ్రద్ధాభక్తులతో ఇక్కడ పఠించి నన్ను ప్రసన్నుని చేసుకుంటారో వారికి నేనెల్లప్పుడు అందుబాటులోఉంటాను. ఇందులో సందేహంలేదు. ఈవిధంగా పలికి భగవానుడైన రుద్రుడు అంతర్ధానమయ్యాడు. దేవతలంతా తమ తమ నివాసాలకు వెళ్ళారు.

తతో నిరంతరం స్వర్గం మానుషైర్మిశ్రితం కృతమ్ ।
స్థాణులింగస్య మాహాత్మ్యదర్శనాత్ స్వర్గమాప్నుయుః ॥7॥
తతో దేవగణాస్సర్వే బ్రహ్మాణం శరణంయయుః ।
తానువాచ తదా బ్రహ్మా కిమర్థమిహ చాగతః ॥8॥

తతో దేవాస్సర్వ ఏవ ఇదం వచనమబ్రువన్ ।
మానుషేభ్యో భయం తీవ్రం రక్షాస్మాకం పితామహ ॥9॥

తానువాచ తదా బ్రహ్మా దేవాన్ త్రిదశనాయకః ।
పాంశునా పూర్యతాం శీఘ్రం సార్థం శక్రే హితం కురు ॥10॥

తతో వవర్ష భగవాన్ పాంశునా పాకశాసనః ।
సప్తాహం పూరయామాసుః సేంద్రా దేవాస్తదా స్మృతాః ॥11॥

తం దృష్ట్వా పాంశువర్షం చ దేవదేవో మహేశ్వరః ।
కరేణ ధారయామాస లింగం తీర్థవటం తథా ॥12॥

తస్మాత్పుణ్యతమం తీర్థం పాద్యం యత్రోదకం స్థితమ్ ।
తస్మిన్ స్నాతః సర్వతీర్థే స్నాతో భవతి మానవః ॥13॥

స్థాణులింగమాహాత్మ్యంవల్ల ఆ లింగదర్శనంచేసిన మానవులందరికి స్వర్గప్రాప్తికలిగి, స్వర్గలోకం మనుష్యులతో నిండిపోయింది. దానితో భయమందిన దేవతలందరు బ్రహ్మను శరణుపొందారు. బ్రహ్మ వారితో మీరందరు ఇక్కడికి ఎందుకువచ్చారు? అని అడిగాడు. అంతట దేవతలందరు బ్రహ్మగారితో ఇలా పలికారు. "ఓ పితామహా! మాకు మానవులవల్ల తీవ్రమైన భయమేర్పడింది. మమ్ములను రక్షించు" అని బ్రహ్మను వేడుకున్నారు. అంతట త్రిదశాధిపతియైన బ్రహ్మ దేవతలతో ఇలా పలికాడు "వెంటనే ఆ సరోవరాన్ని మట్టితో పూడ్చి, ఇంద్రునకు ఊరట కలిగించండి". అంతట పాకశాసనుడైన ఇంద్రుడు వారం రోజులపాటు ధూళివర్షం కురిపించి, ఆ సరస్సును పూడ్చాడు. అది చూసి దేవదేవుడైన మహేశ్వరుడు లింగాన్ని, వటవృక్షాన్ని చేతితో ఎత్తి పట్టుకున్నాడు. అందుచేత ఈ తీర్థంలోని నీరు పుణ్యతమమయ్యింది. ఆ నీటిలో స్నానం చేస్తే సర్వతీర్థస్నానఫలం లభిస్తుంది.

యస్తత్ర కురుతే శ్రాద్ధం వటలింగస్య చాంతరే ।
తస్య ప్రీతాశ్చ పితరో దాస్యంతి భువి దుర్లభమ్ ॥14॥

అచ్చట వటలింగేశ్వరసమీపంలో శ్రాద్ధకర్మనాచరించిన మానవుని పితరులు సంతోషించి దుర్లభమైన ఫలాన్ని ఇస్తారు.

పూరితం చ తతో దృష్ట్వా ఋషయః సర్వ ఏవ తే ।
పాంశునా సర్వగాత్రాణి స్పృశంతి శ్రద్ధయాఽన్వితాః ॥15॥

తేఽపి నిర్ధూతపాపాశ్చ పాంశునా మునయో గతాః ।
పూజ్యమానాః సురగణైః ప్రయాతా బ్రహ్మణః పదమ్ ॥16॥

యే తు సిద్ధాః మహాత్మానస్తే లింగం పూజయంతి చ ।
వ్రజన్తి పరమాం సిద్ధిం పునరావృత్తిదుర్లభమ్ ॥17॥

ఏవం జ్ఞాత్వా తదా బ్రహ్మా లింగం శైలమయం తదా ।
ఆద్యలింగం తదాఽఽస్థాప్య తస్యోపరి న్యధీయత ॥18॥

తతః కాలేన మహతా తేజసా తస్య రంజితమ్ ।
తస్యాపి స్పర్శనాత్సిద్ధాః పరం పదమవాప్నుయుః ॥19॥

తతో దేవైః పునర్బ్రహ్మా విజ్ఞప్తో ద్విజసత్తమాః ।
ఏతే యాంతి పరాం సిద్ధిం లింగసందర్శనాత్పరామ్ ॥20॥

పూడిపోయిన సరోవరాన్ని చూసి ఋషులందరు అక్కడి ధూళిని శ్రద్ధాభక్తులతో తమ శరీరాలకు పూసుకునేవారు. అందువల్ల ఆ మునులందరు పాపవిముక్తులై, దేవతలకు సైతం పూజ్యులై బ్రహ్మపదం చేరుకుంటారు. సిద్ధులు మహాత్ములు ఎవరైనా ఆ లింగాన్ని పూజిస్తే పరమసిద్ధిని పొంది, పునరావృత్తి రహితమైన లోకాలకు వెళతారు. ఈ విషయం గ్రహించినంతనే బ్రహ్మ ఇచ్చట ఆద్యలింగాన్ని ప్రతిష్ఠించి, దానిపై శిలాలింగాన్ని ప్రతిష్ఠించాడు. అనంతరం చాలా కాలానికి ఆద్యలింగస్పర్శప్రభావం వల్ల శిలాలింగం కూడా తనను స్పృశించినవారికి కూడా పరమపదప్రాప్తి కలిగిస్తుంది. ఓ విప్రోత్తములారా! దేవతలు శైలలింగస్పర్శమాత్రం చేతనే మానవులు పరమపదం పొందడం చూసి, ఆవిషయం మరల బ్రహ్మకు విన్నవించారు.

తచ్ఛ్రుత్వా భగవాన్ బ్రహ్మా దేవానాం హితకామ్యయా ।
ఉపర్యుపరి లింగాని సప్త తత్ర చకార హ ॥21॥

తతో యే ముక్తి కామాశ్చ సిద్ధాశ్రమపరాయణాః ।
సేవ్యం పాంశుం ప్రయత్నేన ప్రయాతాః పరమం పదమ్ ॥22॥

పాంశవోఽపి కురుక్షేత్రే వాయునా సముదీరితాః ।
మహాదుష్కృతకర్మాణః ప్రాపయంతి పరం పదమ్ ॥23॥

అజ్ఞానాత్ జ్ఞానతో వాఽపి స్త్రియో వా పురుషస్య వా ।
నశ్యతే దుష్కృతం సర్వం స్థాణుతీర్థప్రభావతః ॥24॥

లింగస్య దర్శనాన్ముక్తిః స్పర్శనాచ్చ వటస్య చ ।
తత్సన్నిధౌ జలే స్నాత్వా ప్రాప్నోత్యభిమతం ఫలమ్ ॥25॥

పితౄణాం తర్పణం యస్తు జలే తస్మిన్కరిష్యతి ।
బిందౌ బిందౌ తు తోయస్య హ్యనంతఫలభాగ్భవేత్ ॥26॥

యస్తు కృష్ణతిలైః శ్రాద్ధః స్థాణోర్లింగస్య పశ్చిమే ।
తర్పయేచ్ఛ్రద్ధయా యుక్తః ప్రీణయేత్సయుగత్రయమ్ ॥27॥

యావన్మన్వంతరం ప్రోక్తం యావల్లింగస్య చ స్థితిః ।
తావత్ప్రీతాశ్చ పితరః పిబంతే జలముత్తమమ్ ॥28॥

అది విని భగవానుడైన బ్రహ్మ దేవతలకు మేలు చేయడానికి ఆ శిలాలింగం మీద ఒకదానిపై మరొకటిగా 7 లింగాలు స్థాపించాడు. అప్పటినుండి శమదమపరాయణులైన ముముక్షువులు అక్కడ ధూళిసేవనం వలననే పరమపదాన్ని పొందుతున్నారు. కురుక్షేత్రంలో గాలిలో ఎగిరే ధూళికణాలు కూడా తమ స్పర్శతో మహాపాపులను కూడా పవిత్రులను చేసి, పరమ పదాన్ని పొందింపజేయగలవు. తెలిసిగాని, తెలియకగాని, స్త్రీగాని, పురుషుడుగాని స్థాణుతీర్థంలో ప్రవేశిస్తే పాపాలు నశిస్తాయి. లింగదర్శనం వల్ల, వటవృక్షస్పర్శ వల్ల ముక్తి కలుగుతుంది. అచ్చటి జలాలలో స్నానమాడినవారు కోరిన ఫలితాలను పొందుతారు. ఇక్కడ పితృదేవతలకు వదిలే తర్పణోదకాలలోని ప్రతిబిందువు అనంతఫలాన్ని ఇస్తుంది. లింగానికి పశ్చిమభాగాన నల్లనువ్వులతో శ్రాద్ధతర్పణాలు ఇచ్చినవారి పితరులు మూడుయుగాలవరకు సుఖిస్తారు. మన్వంతరకాలం వరకు, అచ్చట లింగం నిలిచియున్నంత వరకు, అట్టివారి పితరులు ఉత్తమజలాలను పానం చేస్తూ వుంటారు.

కృతే యుగే సాన్నిహిత్యం త్రేతాయాం వాయుసంజ్ఞితమ్ ।
కలిద్వాపరయోర్మధ్యే కూపే రుద్రహ్రదం స్మృతమ్ ॥29॥

చైత్రస్య చ కృష్ణపక్షే చ చతుర్దశ్యాం నరోత్తమః ।
స్నాత్వా రుద్రకరే తీర్థే పరం పదమవాప్నుయాత్ ॥30॥

వటే యస్తు స్థితో రాత్రౌ ధ్యాయతే పరమేశ్వరమ్ ।
స్థాణోర్వటప్రసాదేన మనసా చింతితం ఫలమ్ ॥31॥

కృతయుగంలో దానికి సాన్నిహిత్యతీర్థమనియు, త్రేతాయుగంలో వాయుతీర్థమనియు, ద్వాపర కలియుగాల మధ్య రుద్రహ్రదమనియు పేర్లు. చైత్రకృష్ణచతుర్దశినాడు రుద్రహ్రదంలో స్నానం చేసినవారికి పరమపదప్రాప్తి కలుగుతుంది. అచ్చటి వటమూలంలో కూర్చొని రాత్రికాలంలో పరమశివుని ధ్యానించినవారికి స్థాణువటమహిమ వల్ల అనుకున్నకోరికలు నెరవేరుతాయి.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే సాన్నిహిత సరోమాహాత్మ్య కథనం నామ పంచచత్వారింశోఽధ్యాయః ॥45॥

శ్రీవామనపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి శంకరుడు సాన్నిహిత సరోవరమాహాత్మ్యం తెలియజేయుట అనే నలభైఐదవ అధ్యాయం సమాప్తం.



షట్చత్వారింశోఽధ్యాయః - నలబైఆరవ అధ్యాయం
స్థాణుతీర్థమాహాత్మ్యకథనమ్ - స్థాణుతీర్థ మాహాత్మ్యకథనం

సనత్కుమార ఉవాచ - సనత్కుమార మహర్షి పలికాడు.

స్థాణోర్వటస్యోత్తరతః శుక్రతీర్థం ప్రకీర్తితమ్ ।
స్థాణోర్వటస్య పూర్వేణ సోమతీర్థం ద్విజోత్తమాః ॥1॥

స్థాణోర్వటం దక్షిణతో దక్షతీర్థముదాహృతమ్ ।
స్థాణోః పశ్చిమదిగ్భాగే స్కందతీర్థం ప్రతిష్ఠితమ్ ॥2॥

ఏతాని పుణ్యతీర్థాని మధ్యే స్థాణురితి స్మృతః ।
తస్య దర్శనమాత్రేణ ప్రాప్నోతి పరమం పదమ్ ॥3॥

అష్టమ్యాం చ చతుర్దశ్యాం యస్త్వేతాని పరిక్రమేత్ ।
పదేపదే యజ్ఞఫలం స ప్రాప్నోతి న సంశయః ॥4॥

ఏతాని మునిభిః సాధ్యైరాదిత్యైర్వసుభిస్తదా ।
మరుద్భిర్వహ్నిభిశ్చైవ సేవితాని ప్రయత్నతః ॥5॥

అన్యే యే ప్రాణినః కేచిత్ ప్రవిష్టాః స్థాణుముత్తమమ్ ।
సర్వపాపవినిర్ముక్తాః ప్రయాంతి పరమాం గతిమ్ ॥6॥

అస్తి తత్సంనిధౌ లింగం దేవదేవస్య శూలినః ।
ఉమా చ లింగరూపేణ హరపార్శ్వం న ముంచతి ॥7॥

తస్యా దర్శనమాత్రేణ సిద్ధిం ప్రాప్నోతి మానవః ।
వటస్య ఉత్తరే పార్శ్వే తక్షకేణ మహాత్మనా ॥8॥

ప్రతిష్ఠితం మహాలింగం సర్వకామప్రదాయకమ్ ।
వటస్య పూర్వదిగ్భాగే విశ్వకర్మకృతం మహత్ ॥9॥

లింగం ప్రత్యఙ్ముఖం దృష్ట్వా సిద్ధిమాప్నోతి మానవః ।
తత్రైవ లింగరూపేణ స్థితా దేవీ సరస్వతీ ॥10॥

ప్రణమ్య తాం ప్రయత్నేన బుద్ధిం మేధాం చ విందతి ।

బ్రాహ్మణోత్తములారా! స్థాణువటానికి ఉత్తరంగానున్ననది శుక్రతీర్థమని కీర్తింపబడుతోంది. స్థాణువటానికి తూర్పున సోమతీర్థమున్నది. స్థాణువటానికి దక్షిణంలో దక్షతీర్థం, పశ్చిమభాగంలో స్కందతీర్థం వున్నాయి. ఆ పుణ్యతీర్థాల మధ్యనున్నది స్థాణువు. దాని దర్శనమాత్రం చేత పరమపదం లభిస్తుంది. అష్టమి, చతుర్దశి తిథులలో దానికి ప్రదక్షిణంచేస్తే, అడుగడుగునకు యజ్ఞఫలంలభిస్తుంది. సందేహం లేదు. ఈ తీర్థాలను మునులు,

సాధ్యులు, ఆదిత్యులు, వసువులు, మరుత్తులు, అగ్నులు మున్నగువారందరు శ్రద్ధగా సేవించారు. ఈ స్థాణుక్షేత్రరాజాన్ని దర్శించిన ఇతరప్రాణులందరు సర్వపాపాలనుండి విముక్తులై పరమపదం పొందుతారు. దాని సన్నిధిలో మహాదేవుడైన శూలపాణి లింగము, దానికి ప్రక్కనే ఎల్లప్పుడు విడువకుండా లింగరూపంలో ఉమాదేవి ఉన్నారు. ఆమెను దర్శించినంతమాత్రాన మానవుడు సిద్ధి పొందుతాడు. వటవృక్షానికి ఉత్తరంగా మహాత్ముడగు తక్షకుడు ప్రతిష్ఠించిన సర్వకామప్రదాయకమైన మహాలింగమున్నది. వటానికి తూర్పుదిశగా విశ్వకర్మ నిలిపిన లింగాన్ని దర్శించిన మానవుడు సిద్ధి పొందుతాడు. అక్కడే లింగరూపంలో సరస్వతీదేవి వున్నది. ఆమెకు భక్తితో నమస్కరిస్తే బుద్ధి, మేధా, శక్తులు లభిస్తాయి.

వటపార్శ్వే స్థితం లింగం బ్రహ్మణా తత్ప్రతిష్ఠితమ్ ॥11॥

దృష్ట్వా వటేశ్వరం దేవం ప్రయాతి పరమం పదమ్ ।
తతః స్థాణువటం దృష్ట్వా కృత్వా చాపి ప్రదక్షిణమ్ ॥12॥

ప్రదక్షిణీకృతా తేన సప్తద్వీపా వసుంధరా ।
స్థాణోః పశ్చిమదిగ్భాగే నకులీశో గణః స్మృతః ॥13॥

తమభ్యర్చ్య ప్రయత్నేన సర్వపాపైః ప్రముచ్యతే ।

వటానికి ప్రక్కగా బ్రహ్మప్రతిష్ఠితమైన వటేశ్వరలింగదర్శనం పరమపదం ప్రసాదిస్తుంది. అంతట స్థాణు వటాన్ని దర్శించి, ప్రదక్షిణం చేస్తే సప్తద్వీపాలతో కూడిన భూమండలానికంతటికి ప్రదక్షిణం చేసిన ఫలం లభిస్తుంది. స్థాణువునకు పడమరదిశగా నకులీశగణం వున్నారు. దానిని చక్కగా అర్చిస్తే సర్వపాపాలనుండి విముక్తులౌతారు.

తస్య దక్షిణ దిగ్భాగే తీర్థం రుద్రాకరం స్మృతమ్ ॥14॥

తస్మిన్ స్నాతః సర్వతీర్థే స్నాతో భవతి మానవః ।
తస్య చోత్తరదిగ్భాగే రావణేన మహాత్మనా ॥15॥

ప్రతిష్ఠితం మహాలింగం గోకర్ణం నామ నామతః ।
ఆషాఢమాసే యా కృష్ణా భవిష్యతి చతుర్దశీ ।
తస్యాం యోఽర్చయతి గోకర్ణం తస్య పుణ్యఫలం శృణు ॥16॥

అచ్చటకు దక్షిణ దిగ్భాగంలో రుద్రకరతీర్థమున్నది. దానిలో స్నానం చేస్తే అన్ని తీర్థాలలో స్నానం చేసిన ఫలం కలుగుతుంది. దానికి ఉత్తరదిగ్భాగంలో రావణమహాత్మునిచే ప్రతిష్ఠింపబడిన గోకర్ణేశ్వరమహాలింగమున్నది. ఆషాఢ బహుళచతుర్దశినాడు ఆ గోకర్ణుని అర్చిస్తే కలిగే పుణ్యం ఎట్టిదో వినండి.

కామతోఽకామతో వాపి యత్పాపం తేన సంచితమ్ ।
తస్మాద్ విముచ్యతే పాపాత్ పూజయిత్వా హరం శుచిః ॥ 17॥

కౌమారబ్రహ్మచర్యేణ యత్పుణ్యం ప్రాప్యతే నరైః ।
తత్పుణ్యం సకలం తస్య అష్టమ్యాం యోఽర్చయేచ్ఛివమ్ ॥18॥

యదిచ్ఛేత్ పరమం రూపం సౌభాగ్యం ధనసంపదః ।
కుమారేశ్వరమాహాత్మ్యాత్ సిద్ధ్యతే నాత్ర సంశయః ॥19॥

ఆ లింగార్చనవల్ల తెలిసీ తెలియక చేసిన పాపాలన్నీ తొలగిపోతాయి. ఆ హరుని శుచియై అష్టమినాడు పూజిస్తే బ్రహ్మచర్యవ్రతం చక్కగా పాటించిన ఫలమంతా కలుగుతుంది. కుమారేశ్వరుని మహిమవలన కోరిన రూపసౌందర్యం, సౌభాగ్యం, ధనసంపదలన్నీ నిస్సంశయంగా లభిస్తాయి.

తస్య చోత్తర దిగ్భాగే లింగం పూజ్య విభీషణః ।
అజరశ్చామరశ్చైవ కల్పయిత్వా బభూవ హ ॥20॥

ఆషాఢస్య తు మాసస్య శుక్లాయాచాష్టమీ భవేత్ ।
తస్యాం పూజ్య సోపవాసో హ్యమృతత్వమవాప్నుయాత్ ॥21॥

దానికి ఉత్తరదిశగానున్న లింగాన్ని పూజించి, విభీషణుడు జరామరణాదులను జయించాడు. ఆషాఢ శుక్ల అష్టమినాడు ఉపవసించి, ఆ లింగపూజ చేసినచో అమృతత్వం లభిస్తుంది.

ఖరేణ పూజితం లింగం తస్మిన్ స్థానే ద్విజోత్తమాః ।
తం పూజయిత్వా యత్నేన సర్వకామానవాప్నుయాత్ ॥22॥

దూషణస్త్రిశిరాశ్చైవ తత్ర పూజ్య మహేశ్వరమ్ ।
యథాభిలషితాన్ కామానాపతుస్తౌ ముదాన్వితౌ ॥23॥

చైత్రమాసే సితే పక్షే యో నరస్తత్ర పూజయేత్ ।
తస్య తౌ వరదౌ దేవౌ ప్రయచ్ఛేతేఽభివాంఛితమ్ ॥24॥

ఓ ద్విజోత్తములారా! అక్కడ ఖరుడు (దానవుడు) పూజించిన లింగాన్ని యత్నపూర్వకంగా అర్చిస్తే అన్నికోరికలు ఫలిస్తాయి. అక్కడే మహేశ్వరారాధన చేసి దూషణుడు, త్రిశిరుడు కూడా చింతితఫలాలు పొంది సంతోషించారు. చైత్రశుక్లపక్షంలో ఆ రెండు లింగాలను అర్చించినవారలకు ఆ దేవతలు కోరుకున్న వరాలన్నీ ప్రసాదిస్తారు.

స్థాణోర్వటస్య పూర్వేణ హస్తిపాదేశ్వరః శివః ।
తం దృష్ట్వా ముచ్యతే పాపైరన్యజన్మని సంభవైః ॥25॥

స్థాణువటానికి తూర్పుదిశలో హస్తిపాదేశ్వర లింగముంది. దాన్ని దర్శిస్తే ఇతరజన్మలలో వచ్చిన పాపాలన్నీ తొలగిపోతాయి.

తస్య దక్షిణతో లింగం హారీతస్య ఋషేః స్థితమ్ ।
యత్రప్రణమ్య ప్రయత్నేన సిద్ధిం ప్రాప్నోతి మానవః ॥26॥

దానికి దక్షిణదిశగా హారీతముని ప్రతిష్ఠించిన లింగానికి భక్తితో నమస్కరించినవానికి సిద్ధులు లభిస్తాయి.

తస్య దక్షిణపార్శ్వే తు వాపీ తస్య మహాత్మనః ।
లింగం త్రైలోక్య విఖ్యాతం సర్వపాపహరం శివమ్ ॥27॥

దానికి దక్షిణంగా మహాత్ముడగు హారీతమునియొక్క దిగుడుబావి ఉంది. దానిలో హారీతుడు ప్రతిష్ఠించిన, ముల్లోకాలలో ప్రసిద్ధి చెందిన సర్వపాపహరలింగం ఉంది.

కంకాలరూపిణా చాపి రుద్రేణ సుమహాత్మనా ।
ప్రతిష్ఠితం మహాలింగం సర్వపాపప్రణాశనమ్ ॥28॥

భుక్తిదం ముక్తిదం ప్రోక్తం సర్వకిల్బిషనాశనమ్ ।
లింగస్య దర్శనాచ్చైవ అగ్నిష్టోమఫలం లభేత్ ॥29॥

అస్థిపంజరరూపంలో ఉన్న రుద్రునిచేత ప్రతిష్ఠితమైన మహాలింగం సర్వపాపాలు హరించి భుక్తి ముక్తులు ప్రసాదిస్తుంది. దానిని దర్శించినంతమాత్రాన అగ్నిష్టోమయాగఫలం లభిస్తుంది.

తస్య పశ్చిమదిగ్భాగే లింగం సిద్ధ ప్రతిష్ఠితమ్ ।
సిద్ధేశ్వరం తు విఖ్యాతం సర్వసిద్ధిప్రదాయకమ్ ॥30॥

దానికి పశ్చిమదిశగా సిద్ధులచే ప్రతిష్ఠింపబడి, సకలసిద్ధులు ప్రసాదించే విఖ్యాతమైన సిద్ధేశ్వరలింగం కలదు.

తస్య దక్షిణదిగ్భాగే మృకండేన మహాత్మనా ।
తత్ర ప్రతిష్ఠితం లింగం దర్శనాత్ సిద్ధిదాయకమ్ ॥31॥

దానికి దక్షిణదిగ్భాగంలో మహాత్ముడైన మృకండుడు ప్రతిష్ఠించిన శివలింగమున్నది. దానిని చూసినంత మాత్రంచేతనే అది సర్వసిద్ధులను కలుగజేస్తుంది.

తస్య పూర్వే చ దిగ్భాగే ఆదిత్యేన మహాత్మనా ।
ప్రతిష్ఠితం లింగవరం సర్వకిల్బిషనాశనమ్ ॥32॥

దానికి తూర్పుదిశలో మహాత్ముడైన ఆదిత్యునిచే ప్రతిష్ఠితమైనట్టియు, సర్వపాపాలు నశింపజేయునట్టియు శ్రేష్ఠమైన శివలింగమున్నది.

చిత్రాంగదస్తు గంధర్వో రంభాచాప్సరసాం వరా ।
పరస్పరం సానురాగౌ స్థాణుదర్శనకాంక్షిణౌ ॥33॥

దృష్ట్వా స్థాణుం పూజయిత్వా సానురాగౌ పరస్పరమ్ ।
ఆరాధ్య వరదం దేవం ప్రతిష్ఠాప్య మహేశ్వరమ్ ॥34॥

చిత్రాంగదేశ్వరం దృష్ట్వా తథా రంభేశ్వరం ద్విజ ।
సుభగో దర్శనీయశ్చ కులే జన్మ సమాప్నుయాత్ ॥35॥

చిత్రాంగదుడను గంధర్వుడు, అప్సరోమణి రంభ, పరస్పర అనురాగబద్ధులై స్థాణుమహాదేవుని దర్శనార్థం వెళ్లి, ఆ మహాదేవుని పూజించి, తమ అనురాగానికి ప్రతీకలుగా వరదుడైన మహాదేవుని రెండు లింగాలు ప్రతిష్ఠించారు. ఓ ద్విజులారా! చిత్రాంగదేశ్వర, రంభేశ్వరులనే ఆ లింగాలను దర్శించినవారు సుందరసుభగాకారాలతో సత్కులంలో జన్మిస్తారు.

తస్య దక్షిణతో లింగం వజ్రిణా స్థాపితం పురా ।
తస్య ప్రసాదాత్ ప్రాప్నోతి మనసా చింతితం ఫలమ్ ॥36॥

దానికి దక్షిణదిశలో పూర్వం ఇంద్రుడు శివలింగాన్ని స్థాపించాడు. ఆ శివలింగం అనుగ్రహంవల్ల అనుకున్న కోరికలు సిద్ధిస్తాయి.

పరాశరేణ మునినా తథైవారాధ్య శంకరమ్ ।
ప్రాప్తం కవిత్వం పరమం దర్శనాచ్ఛంకరస్య చ ॥37॥

అదేవిధంగా పరాశరమునికూడా ఆ శంకరుని ఆరాధించి, దర్శించి, ఉత్తమమైన కవిత్వశక్తిని పొందాడు.

వేదవ్యాసేన మునినా ఆరాధ్య పరమేశ్వరమ్ ।
సర్వజ్ఞత్వం బ్రహ్మజ్ఞత్వం ప్రాప్తం దేవప్రసాదతః ॥38॥

వేదవ్యాసమహర్షి కూడా ఆ పరమేశ్వరుని ఆరాధించి సర్వజ్ఞత్వం, బ్రహ్మజ్ఞానం ఆ మహాదేవుని ప్రసాదం వల్ల పొందాడు.

స్థాణోః పశ్చిమదిగ్భాగే వాయునా జగదాయునా ।
ప్రతిష్ఠితం మహాలింగం దర్శనాత్ పాపనాశనమ్ ॥39॥

స్థాణులింగానికి పడమర దిశలో జగత్ప్రాణమైన వాయుదేవునిచే ప్రతిష్ఠింపబడిన మహాలింగదర్శనంచే సమస్తపాపాలు నశిస్తాయి.

తస్యాపి దక్షిణే భాగే లింగం హిమవతేశ్వరమ్ ।
ప్రతిష్ఠితం పుణ్యకృతాం దర్శనాత్ సిద్ధికారకమ్ ॥40॥

దానికి దక్షిణంగానున్న హిమవతేశ్వరలింగాన్ని దర్శించిన పుణ్యాత్ములకు సమస్తసిద్ధులు ప్రసాదింపబడతాయి.

తస్యాపి పశ్చిమే భాగే కార్తవీర్యేణ స్థాపితమ్ ।
లింగం పాపహరం సద్యో దర్శనాత్ పుణ్యమాప్నుయాత్ ॥41॥

దానికి కూడా పశ్చిమభాగంలో కార్తవీర్యుడు స్థాపించిన శివలింగమున్నది. దాన్నిదర్శించినవెంటనే అది పుణ్యాలను ప్రసాదిస్తుంది.

తస్యాప్యుత్తరదిగ్భాగే సుపార్శ్వే స్థాపితం పునః ।
ఆరాధ్య హనుమాంశ్చాపి సిద్ధిం దేవప్రసాదతః ॥42॥

దానికి ఉత్తరదిశగా సుపార్శ్వునిచే స్థాపింపబడిన లింగాన్ని ఆరాధించి, దేవప్రసాదంచే హనుమంతుడు సిద్ధిని పొందాడు.

తస్యైవ పూర్వదిగ్భాగే విష్ణునా ప్రభవిష్ణునా ।
ఆరాధ్య వరదం దేవం చక్రం లబ్ధం సుదర్శనమ్ ॥43॥

దానికి తూర్పుదిశలోనున్న మహాదేవుని ఆరాధించి, ప్రభవిష్ణువైన విష్ణువు సుదర్శనచక్రాన్ని సంపాదించాడు.

తస్యాపి పూర్వదిగ్భాగే మిత్రేణ వరుణేన చ ।
ప్రతిష్ఠితౌ లింగవరౌ సర్వకామప్రదాయకౌ ॥44॥

దానికి తూర్పుదిశలో మిత్రావరుణులచే ప్రతిష్ఠితమైన రెండు శివలింగాలు సర్వకామప్రదాయకాలై విలసిల్లాయి.

ఏతాని మునిభిః సాధ్యైరాదిత్యైర్వసుభిస్తథా ।
సేవితాని ప్రయత్నేన సర్వపాపహరాణి వై ॥45॥

ఈ శివలింగాలను మునులు, సాధ్యులు, ఆదిత్యులు, వసువులు, ప్రయత్నపూర్వకంగా సేవించారు. వీరందరు శ్రద్ధాభక్తులతో సేవించడంవల్ల సర్వపాపవిముక్తులయ్యారు.

స్వర్ణలింగస్య పశ్చాత్తు ఋషిభిస్తత్త్వదర్శిభిః ।
ప్రతిష్ఠితాని లింగాని యేషాం సంఖ్యా న విద్యతే ॥46॥

స్వర్ణలింగానికి వెనుకవైపున తత్త్వద్రష్టలైన ఋష్యాదులు స్థాపించిన లింగాలు లెక్కకు మించి ఉన్నాయి.

తథా హ్యుత్తరతస్తస్య యావదోఘవతీ నదీ ।
సహస్రమేకం లింగానాం దేవ పశ్చిమతః స్థితమ్ ॥47॥

తస్యాపి పూర్వదిగ్భాగే వాలఖిల్యైర్మహాత్మభిః ।
ప్రతిష్ఠితా రుద్రకోటిర్యావత్సంనిహితం సరః ॥48॥

అదేవిధంగా దానికి ఉత్తరాన ఓఘవతీ నదివరకుగల భూభాగంలో స్వామికి పశ్చిమాన ఒక వేయి లింగాలు స్థాపించబడ్డాయి. దానికి తూర్పుదిశగా సన్నిహితసరస్సువరకు గల భూభాగంలో మహాత్ములగు వాలఖిల్యమునులు ఒక కోటిలింగాలను ప్రతిష్ఠించారు.

దక్షిణేన తు దేవస్య గంధర్వైర్యక్షకిన్నరైః ।
ప్రతిష్ఠితాని లింగాని యేషాం సంఖ్యా న విద్యతే ॥49॥

స్వామికి దక్షిణంగా గంధర్వ యక్షకిన్నరులు ప్రతిష్ఠించిన లింగాలు లెక్కలేనన్ని వున్నాయి.

తిస్రః కోట్యోఽర్ధకోటీ చ లింగానాం వాయురబ్రవీత్ ।
అసంఖ్యాతాః సహస్రాణి యే రుద్రాః స్థాణుమాశ్రితాః ॥50॥

వాయువు చెప్పినట్లుగా మూడున్నరకోట్ల లింగాలు స్థాణుక్షేత్రంలో వెలిశాయి. ఇకపోతే ఆ స్థాణులింగేశ్వరుని ఆశ్రయించి అచ్చటనున్న వేలాది రుద్రులసంఖ్య లెక్కించుటకువీలుకానిది.

ఏతత్ జ్ఞాత్వా శ్రద్దధానః స్థాణులింగం సమాశ్రయేత్ ।
యస్య ప్రసాదాత్ ప్రాప్నోతి మనసా చింతితం ఫలమ్ ॥51॥

అకామో వా సకామో వా ప్రవిష్టః స్థాణుమందిరమ్ ।
విముక్తః పాతకైర్ఘోరైః ప్రాప్నోతి పరమం పదమ్ ॥52॥

ఈ విషయాలనన్నిటినీ గ్రహించి, ఆ స్థాణ్వీశ్వరమహాలింగాన్ని శ్రద్ధాభక్తులతో ఆశ్రయించినవారి కోరికలన్నీ సిద్ధిస్తాయి. సకామంగాగాని, నిష్కామంగాగాని స్థాణువు ఆలయంలో ప్రవేశించిన ప్రతిమానవుడు ఘోర పాపాలనుండి విముక్తుడై, పరమపదం పొందుతాడు.

చైత్రమాసే త్రయోదశ్యాం దివ్యనక్షత్రయోగతః ।
శుక్రార్కచంద్రసంయోగే దినే పుణ్యతమే శుభే ॥53॥

ప్రతిష్ఠితం స్థాణులింగం బ్రహ్మణా లోకధారిణా ।
ఋషిభిర్దేవసంఘైశ్చ పూజితం శాశ్వతీః సమాః ॥54॥

చైత్రత్రయోదశినాడు దివ్యనక్షత్రాలు శుక్రసూర్యచంద్రగ్రహాలతో కలసియున్న పరమపుణ్యదినాన ఆ స్థాణులింగాన్ని సాక్షాత్తు విరించి ప్రతిష్ఠించాడు. అప్పటినుండి ఎన్నో సంవత్సరాలుగా దానిని ఋషిముని దేవతాసంఘాలు సేవిస్తూ వున్నాయి.


తస్మిన్ కాలే నిరాహారా మానవాః శ్రద్ధయాన్వితాః ।
పూజయంతి శివం యే వై తే యాంతి పరమం పదమ్ ॥55॥

తదారూఢమిదం జ్ఞాత్వా యే కుర్వంతి ప్రదక్షిణమ్ ।
ప్రదక్షిణీకృతా తైస్తు సప్తద్వీపా వసుంధరా ॥56॥

ఆ పవిత్రదినాన ఉపవసించి, శ్రద్ధాభక్తులతో పరమశివుని ఆరాధించిన నరుడు పరమపదాన్ని పొందుతాడు. అచ్చట ఆ పరమేశ్వరుని సన్నిధానాన్ని భావించుకొని, ఆ ప్రదేశానికి ప్రదక్షిణ చేస్తే సప్తద్వీపాలతో కూడిన ఈ భూమండలానికి ప్రదక్షిణంచేసిన పుణ్యఫలం లభిస్తుంది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారద సంవాదే సరోమాహాత్మ్యే స్థాణుతీర్థమాహాత్మ్యకథనం నామ షట్చత్వారింశోఽధ్యాయః ॥46॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి స్థాణుతీర్థమాహాత్మ్య కథనమనే నలబైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తచత్వారింశోఽధ్యాయః - నలభైఏడవ అధ్యాయం

వేనరాజచరితమ్ - వేనరాజుచరిత్ర

మార్కండేయ ఉవాచ - మార్కండేయ మహర్షి పలికాడు.

స్థాణుతీర్థప్రభావం తు శ్రోతుమిచ్ఛామ్యహం మునే ।
కేన సిద్ధిరిహ ప్రాప్తా సర్వపాపభయాపహా ॥1॥

మహామునీ! స్థాణుతీర్థమహిమ సమగ్రంగా వినగోరుతున్నాను. అక్కడ సర్వపాపాలు పోగొట్టుకొని ఎవరు సిద్ధి పొందారు?

సనత్కుమార ఉవాచ - సనత్కుమార మహర్షి పలికాడు.

శృణు సర్వమశేషేణ స్థాణుమాహాత్మ్యముత్తమమ్ ।
యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముక్తో భవతి మానవః ॥2॥

ఏకార్ణవే జగత్యస్మిన్నష్టే స్థావరజంగమే ।
విష్ణోర్నాభిసముద్భూతం పద్మమవ్యక్తజన్మనః ।
తస్మిన్ బ్రహ్మా సముద్భూతః సర్వలోకపితామహః ॥3॥

తస్మాన్మరీచిరభవన్ మరీచేః కశ్యపః సుతః ।
కశ్యపాదభవద్భాస్వాంస్తస్మాన్మనురజాయత ॥4॥

మనోస్తు క్షువతః పుత్ర ఉత్పన్నో ముఖసంభవః ।
పృథివ్యాశ్చతురంతాయా రాజా ధర్మస్య రక్షితా ॥5॥

తస్య పత్నీ బభూవాథ భయా నామ భయావహా ।
మృత్యోః సకాశాదుత్పన్నా కాలస్య దుహితా తదా ॥6॥

తస్యాం సమభవద్వేనో దురాత్మా వేదనిన్దకః ।
స దృష్ట్వా పుత్రవదనం క్షుతో రాజా వనం యయౌ ॥7॥

తత్ర కృత్వా తపో ఘోరం ధర్మేణావృత్య రోదసీ ।
ప్రాప్తవాంస్తత్పరం ధామ పునరావృత్తిదుర్లభమ్ ॥8॥

వేనో రాజా సమభవత్సమస్తే క్షితిమండలే ।
స మాతామహదోషేణ వేనః కాలాత్మజాత్మజః ॥9॥
ఘోషయామాస నగరే దురాత్మా వేదనిన్దకః ।
న దాతవ్యం న యష్టవ్యం న హోతవ్యం కదాచన ॥10॥

అహమేకోఽత్ర వై వంద్యః పూజ్యోఽహం భవతాం సదా ।
మయా హి పాలితా యూయం నివసధ్వం యథాసుఖమ్ ॥11॥

తన్మత్తోఽన్యో న దేవోఽస్తి యుష్మాకం యః పరాయణమ్ ।
ఏతచ్ఛ్రుత్వా తు వచనమృషయః సర్వ ఏవ తే ॥12॥

పరస్పరం సమాగమ్య రాజానం వాక్యమబ్రువన్ ।
శ్రుతిః ప్రమాణం ధర్మస్య తతో యజ్ఞః ప్రతిష్ఠితః ॥13॥

యజ్ఞైర్వినా నో ప్రీయంతే దేవాః స్వర్గనివాసినః ।
అప్రీతా న ప్రయచ్ఛంతి వృష్టిం సస్యస్య వృద్ధయే ॥14॥

తస్మాద్ యజ్ఞైశ్చ దేవైశ్చ ధార్యతే స చరాచరమ్ ।
ఏతచ్ఛ్రుత్వా క్రోధదృష్టిర్వేనః ప్రాహ పునః పునః ॥15॥

ఓ మహర్షీ! అత్యుత్తమమైన ఈ స్థాణుతీర్థమహిమ పూర్తిగా విను. దీనిని వినిన మానవుడు పాపాలన్నింటినుండి విముక్తుడౌతాడు. మహాప్రళయసమయంలో ఈ స్థావరజంగమాత్మకమైన సృష్టి అంతా నశించి ఒకేసముద్రంగా మారిపోగా, అవ్యక్తజన్ముడైన విష్ణువుయొక్క నాభినుండి కమలం పుట్టింది. దానినుండి సర్వలోకపితామహుడైన బ్రహ్మ ఉద్భవించాడు. ఆయననుండి మరీచి జన్మించగా ఆయన కుమారుడుగా కశ్యపుడు జన్మించాడు. కశ్యపునకు సూర్యుడు సంభవించగా, ఆయనకు మనువు జన్మించాడు. ఆ మనువు తుమ్మగా ఆయన ముఖంనుండి ఉద్భవించిన పుత్రుడు చతురంతభూమండలానికి అంతటకు రాజైనాడు. ధర్మాన్ని చక్కగా రక్షిస్తున్నాడు. మృత్యుముఖంనుండి కాలుని కుమార్తెగా జన్మించి, భయాన్ని కలిగించే భయా అనునామె ఆ రాజునకు భార్యయైనది. ఆమెకు దుష్టుడు, వేదదూషకుడునైన వేనుడు జన్మించాడు. ఆ దుష్టుని ముఖం చూడగానే కోపంతో తండ్రి అరణ్యానికి వెళ్లాడు. అక్కడ ఆయన కఠోరమైన తపస్సు చేసి, ధర్మంతో భూమ్యాకాశాలను నింపి, పునరావృత్తిరహితమైన బ్రహ్మసదనం చేరాడు. కాలుని దౌహిత్రుడైన వేనుడు భూమండలానికి అంతటికి పాలకుడై, తన మాతామహ దోషంవలన వేదనిందకుడై, రాజ్యంలో ఇలా చాటింపు వేయించాడు. “నా రాజ్యంలో ఎవరు ఎప్పుడు దానాలు చేయరాదు. యజ్ఞహోమాలు చేయరాదు. ఆహుతులనీయరాదు. నేనొక్కడనే వందనీయుడను. నన్ను మాత్రమే అందరూ పూజించాలి. ఇలా చేస్తే రాజ్యంలోని మీరంతా సుఖిస్తారు. నాకంటే వేరైన దేవుడెవడూ లేడు”. వేనుని ఈ వాక్యాలకు చింతించి ఋషులంతా కలసివెళ్ళి ఇలా హితం పలికారు. “రాజా! వేదాలు ధర్మానికి మూలప్రమాణాలు. ఆ వేదాలు యజ్ఞకర్మను విధించాయి. యజ్ఞాలు చేయకపోతే దేవతలు ప్రీతులుకారు. దేవతలు ప్రీతులు కాకపోతే పైరులకు అవసరమైన వర్షాలు కురిపించరు. ఈ విధంగా ఈ సృష్టియంతా దేవతలమీద, యజ్ఞాలమీద ఆధారపడియుంది”. అని పలికిన ఋషుల మాటలు విని, కోపంతో వేనుడు మరల మరల ఇలా పలికాడు.

న యష్టవ్యం న దాతవ్యమిత్యాహ క్రోధమూర్ఛితః ।
తతః క్రోధసమావిష్టా ఋషయః సర్వ ఏవ తే ॥16॥

నిర్జఘ్నుర్మంత్రపూతైస్తే కుశైర్వజ్రసమన్వితైః ।
తతస్త్వరాజకే లోకే తమసా సంవృతే తదా ॥17॥

దస్యుభిః పీడ్యమానాస్తానృషీంస్తే శరణం యయుః ।
తతస్తే ఋషయః సర్వే మమన్థుస్తస్య వై కరమ్ ॥18॥

సవ్యం తస్మాత్సముత్తస్థౌ పురుషో హ్రస్వదర్శనః ।
తమూచుర్ఋషయః సర్వే నిషీదతు భవానితి ॥19॥

తస్మాన్నిషాదా ఉత్పన్నా వేనకల్మష సంభవాః ।
తతస్తే ఋషయః సర్వే మమన్థుర్దక్షిణం కరమ్ ॥20॥

మథ్యమానే కరే తస్మిన్నుత్పన్నః పురుషోఽపరః ।
బృహచ్ఛైలప్రతీకాశో దివ్యలక్షణలక్షితః ॥21॥

ధనుర్బాణాంకితకరశ్చక్రధ్వజసమన్వితః ।
తముత్పన్నం తదా దృష్ట్వా సర్వే దేవాః సవాసవాః ॥22॥

అభ్యషించన్పృథివ్యాం తం రాజానం భూమిపాలకమ్ ।
తతః స రంజయామాస ధర్మేణ పృథివీం తదా ॥23॥

పిత్రాఽపరంజితా తస్య తేన సా పరిపాలితా ।
తతో రాజేతి శబ్దోఽస్య పృథివ్యా రంజనాదభూత్ ॥24॥

"యజ్ఞాలు చేయరాదు. దానాలు ఇవ్వకూడదు" అని గర్జించి వేనుడు క్రోధమూర్ఛితుడయ్యాడు. దానితో ఋషులందరు కోపించి అభిమంత్రించినట్టియు, వజ్రోపమానమైనట్టియు, కుశలతో దుష్టుడైన వేనుని ప్రహరించి సంహరించారు. అంతట లోకము అరాచకమై అశాంతి పెల్లుబికింది. దస్యులు పీడించగా ప్రజలందరు నానాబాధలకు లోనై, ఘోషిస్తూ మహర్షులను శరణువేడారు. అంతట ఆ ఋషులు వేనుని ఎడమచేతిని మథించగా దానినుండి ఒక మరుగుజ్జు జన్మించాడు. అంతట మునులందరు అతనితో "నీవిక్కడ కూర్చుండుము" అని తెలియజేశారు. ఆ పొట్టివానినుండి వేనుని పాపఫలంగా నిషాదులు జన్మించారు. అంతట ఋషులు వేనుని కుడిచేతిని మథించారు. దానినుండి పెద్దపర్వతాకారంతో దివ్యలక్షణాలతో కూడిన మరియొక పురుషుడు ఉద్భవించాడు. అతని చేతులలో ధనుర్బాణశంఖచక్రాది రేఖలున్నాయి. ఆ విధంగా జన్మించిన ఆ పురుషుణ్ణి చూచి ఇంద్రాదిదేవతలందరు అతనిని భూమిపాలకునిగా, రాజుగా అభిషేకించారు. అతడు ధర్మాత్ముడై, భూమినంతటిని రంజింపజేశాడు. తన తండ్రి పెట్టిన బాధలకు క్షోభించిన పృథివిని అతడు తన పాలనతో రంజింపజేసి, రాజు అనే శబ్దాన్ని సార్థకం చేశాడు.

స రాజ్యం ప్రాప్య తేభ్యస్తు చింతయామాస పార్థివః ।
పితా మమ అధర్మిష్ఠో యజ్ఞవ్యుచ్ఛిత్తికారకః ॥25॥

కథం తస్య క్రియా కార్యా పరలోకసుఖావహా ।
ఇత్యేవం చింతయానస్య నారదోఽభ్యాజగామ హ ॥26॥

తస్మై స చాసనం దత్త్వా ప్రణిపత్య చ పృష్టవాన్ ।
భగవన్ సర్వలోకస్య జానాసి త్వం శుభాశుభమ్ ॥27॥

పితా మమ దురాచారో దేవబ్రాహ్మణనిందకః ।
స్వకర్మరహితో విప్ర పరలోకమవాప్తవాన్ ॥28॥

తతోఽబ్రవీన్నారదస్తం జ్ఞాత్వా దివ్యేన చక్షుషా ।
మ్లేచ్ఛమధ్యే సముత్పన్నం క్షయ కుష్ఠ సమన్వితమ్ ॥29॥

తచ్ఛ్రుత్వా వచనం తస్య నారదస్య మహాత్మనః ।
చింతయామాస దుఃఖార్తః కథం కార్యం మయా భవేత్ ॥30॥

ఇత్యేవం చింతయానస్య మతిర్జాతా మహాత్మనః ।
పుత్రః స కథ్యతే లోకే యః పితౄంస్త్రాయతే భయాత్ ॥31॥

ఏవం సంచింత్య స తదా నారదం పృష్టవాన్ మునిమ్ ।
తారణం మత్పితుస్తస్య మయా కార్యం కథం మునే ॥32॥

వారినుండి రాజ్యం స్వీకరించిన తదుపరి ఆ రాజు ఇలా ఆలోచనలో పడ్డాడు. "నా తండ్రి అధార్మికుడు, యజ్ఞవిఘాతకుడు. ఆయనకు ఉత్తమలోకప్రాప్తి ఎలా కలుగుతుంది?". ఆ విధంగా చింతావ్యాకులుడైన రాజువద్దకు నారదమహర్షి వచ్చాడు. ఆ రాజు నారదునకు తగిన ఆసనమిచ్చి, నమస్కరించి ఇలా ప్రశ్నించాడు. "భగవన్! తమరు సమస్తలోకాలలోని శుభాశుభకర్మల రహస్యం తెలిసినవారు. నా తండ్రి దుష్టుడు. దేవబ్రాహ్మణనిందకుడు. విహితకర్మలు చేయకుండగనే పరలోకగతుడయ్యాడు". అంతట నారదుడు దివ్యదృష్టితో అంతయు గ్రహించి, అతనితో ఇలా పలికాడు. "ఓ రాజా! నీ తండ్రి మ్లేచ్ఛులలో జన్మించాడు. అంతేకాదు క్షయ కుష్ఠరోగాలతో బాధపడుతున్నాడు". మహాత్ముడైన నారదుని ఈ మాటలు విని, ఆ రాజు చాలా దుఃఖించి తానేమిచేయవలెనా? యని ఆలోచనలో దిగాడు. "పుత్రుడనగా పితరులను భయాలనుంచి రక్షించువాడే" అను భావన ఆయనకు తోచింది. అంతట మరల నారద మహామునిని తన తండ్రి తరించుటకు తానేమి చేయవలెనో వివరించుమని వేడుకున్నాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

గచ్ఛ త్వం తస్య తం దేహం తీర్థేషు కురు నిర్మలమ్ ।
యత్ర స్థాణోర్మహత్తీర్థం సరః సంనిహితం ప్రతి ॥33॥

నీవు తీర్థాలనన్నిటిని దర్శించి, అచ్చటి నీళ్ళతో ఇతని దేహాన్ని శుద్ధి చేయుము. సన్నిహితసరోవరం దగ్గరనున్న స్థాణుతీర్థానికి కూడా వెళ్ళుము.

ఏతచ్ఛ్రుత్వా తు వచనం నారదస్య మహాత్మనః ।
సచివే రాజ్యమాధాయ రాజా స తు జగామ హ ॥34॥

స గత్వా చోత్తరాం భూమిం మ్లేచ్ఛమధ్యే దదర్శ హ ।
కుష్ఠరోగేణ మహతా క్షయేణ చ సమన్వితమ్ ॥35॥

తతః శోకేన మహతా సంతప్తో వాక్యమబ్రవీత్ ।
హే మ్లేచ్ఛా నౌమి పురుషం స్వగృహం చ నయామ్యహమ్ ॥36॥

తత్రాహమేనం నిరుజం కరిష్యే యది మన్యథ ।
తథేతి సర్వే తే మ్లేచ్ఛాః పురుషం తం దయాపరమ్ ॥37॥

ఊచుః ప్రణతసర్వాంగా యథా జానాసి తత్కురు ।
తత ఆనీయ పురుషాన్ శిబికావాహనోచితాన్ ॥38॥

దత్వా శుల్కం చ ద్విగుణం సుఖేన నయత ద్విజమ్ ।
తతః శ్రుత్వా తు వచనం తస్య రాజ్ఞో దయావతః ॥39॥

గృహీత్వా శిబికాం క్షిప్రం కురుక్షేత్రేణ యాంతి తే ।
తత్ర నీత్వా స్థాణుతీర్థే అవతార్య చ తే గతాః ॥40॥

నారదమహర్షి మాటలు విని ఆ రాజు తన రాజ్యభారాన్ని మంత్రులకు అప్పగించి తాను బయలుదేరాడు. అచ్చటినుండి ఉత్తరభూములకు వెళ్ళి, అక్కడ మ్లేచ్ఛుల మధ్య కుష్ఠ, క్షయ వ్యాధులతో బాధపడుతున్న తండ్రిని చూశాడు. అంతట తాను చాలా దుఃఖించి ఆ మ్లేచ్ఛులతో ఇలా పలికాడు. “ఓ మ్లేచ్ఛులారా! నేనీ పురుషునకు నమస్కరించి, ఈయనను ఇంటికి తీసుకొనిపోయి రోగవిముక్తుని చేసుకుంటాను. మీరు అనుమతిని ఇవ్వండి”. అందులకు ఆ మ్లేచ్ఛులంతా ప్రణామం చేసి అలాగే మీ ఇష్టానుసారం చేసుకొనవచ్చునని పలికారు. అంతట ఆ రాజు పల్లకిబోయీలను రప్పించి, వారికి రెట్టింపు కూలి ఇచ్చి వారితో ఇలా పలికాడు. “ఈ బ్రాహ్మణుని సుఖంగా తీసుకొనివెళ్లండి”. దయాళువైన ఆ రాజు మాటలనువిని, రాజు కోరికమేరకు అతనిని శిబికపైన ఎక్కించి, దానిని ఎత్తుకొని త్వరితగతిని కురుక్షేత్రంలోని స్థాణుతీర్థం వద్ద దించి బోయీలు వెళ్ళిపోయారు.

తతః స రాజా మధ్యాహ్నే తం స్నాపయతి వై తదా ।
తతో వాయురంతరిక్షే ఇదం వచనమబ్రవీత్ ॥41॥

అంతట ఆ రాజు మధ్యాహ్నకాలాన అతనిని నదిలో స్నానం చేయించాడు. ఆ సమయాన ఆకాశంనుండి వాయువు ఏతెంచి ఇలా పలికాడు.

మా తాత సాహసం కార్షీస్తీర్థే రక్ష ప్రయత్నతః ।
అయం పాపేన ఘోరేణ అతీవ పరివేష్టితః ॥42॥

వేదనిన్దా మహత్పాపం యస్యాంతో నైవ లభ్యతే ।
సోఽయం స్నానాన్మహాతీర్థం నాశయిష్యతి తత్క్షణాత్ ॥43॥

"వత్సా! తొందర పడవద్దు. తీర్థపవిత్రతను కాపాడుము. ఇతనిని మహాఘోరమైన పాపాలు చుట్టుకుని యున్నాయి. వేదనిందయనే మహాపాపానికి నిష్కృతి లేదు. అటువంటివారు ఈ మహాతీర్థంలో స్నానం చేస్తే తీర్థపవిత్రత తక్షణం నశించిపోతుంది".

ఏతద్వాయోర్వచః శ్రుత్వా దుఃఖేన మహతాఽన్వితః ।
ఉవాచ శోకసంతప్తస్తస్య దుఃఖేన దుఃఖితః ।
ఏష ఘోరేణ పాపేన అతీవ పరివేష్టితః ॥44॥

ప్రాయశ్చిత్తం కరిష్యేఽహం యద్వదిష్యంతి దేవతాః ।
తతస్తా దేవతాః సర్వా ఇదం వచనమబ్రువన్ ॥45॥

వాయువు మాటలు విని మరింతగా దుఃఖిస్తూ "అయ్యో! ఈయన ఎంతటి భయంకరపాపాలకు నెలవైనాడు?. ఈ పాపపరిహారానికి ఏదైనా ప్రాయశ్చిత్తం వుంటే నేనది తప్పక చేస్తాను. దేవతలారా! దయతో సెలవీయండి" అని అర్థించాడు. దేవతలు అతనితో ఇలా పలికారు.

స్నాత్వా స్నాత్వా చ తీర్థేషు అభిషించస్వ వారిణా ।
ఓజసా చులుకం యావత్ ప్రతికూలే సరస్వతీమ్ ॥46॥

స్నాత్వా శుద్ధిమవాప్నోతి పురుషః శ్రద్ధయాన్వితః ।
ఏష స్వపోషణపరో దేవదూషణతత్పరః ॥47॥

బ్రాహ్మణైశ్చ పరిత్యక్తో నైష శుద్ధ్యతి కర్హిచిత్ ।
తస్మాదేనం సముద్దిశ్య స్నాత్వా తీర్థేషు భక్తితః ॥48॥

అభిషించస్వ తోయేన తతః పూతో భవిష్యతి ।

"నీవు వరసగా ఒక్కొక్క తీర్థంలో స్నానం చేసి, ఆ నీళ్ళతో ఇతనిని అభిషేకించుము. ఈ విధంగా ఓజస తీర్థం నుండి సరస్వతికి ఆవలనున్న చులుకతీర్థం వరకు చేయుము. శ్రద్ధతో ఈ విధంగా తీర్థస్నానం చేస్తే పురుషుడు శుద్ధుడౌతాడు. ఇతడు అతిస్వార్థపరుడు, దేవదూషకుడు, బ్రాహ్మణులచే పరిత్యజింపబడ్డాడు. కాబట్టి ఇతడు పవిత్రుడు కానేరడు. కావున ఇతనిని ఉద్దేశించి నీవు తీర్థాలలో మునిగి, ఆ నీటితో మార్జనం చేస్తే ఇతడు శుద్ధుడౌతాడు".

ఇత్యేతద్వచనం శ్రుత్వా కృత్వా తస్యాశ్రమం తతః ॥49॥

తీర్థయాత్రాం యయౌ రాజా ఉద్దిశ్య జనకం స్వకమ్ ।
స తేషు ప్లావనం కుర్వంస్తీర్థేషు చ దినే దినే ॥50॥

అభ్యషించత్ స్వపితరం తీర్థతోయేన నిత్యశః ।
ఏతస్మిన్నేవ కాలే తు సారమేయో జగామ హ ॥51॥

స్థాణోర్మఠే కౌలపతిర్దేవ ద్రవ్యస్య రక్షితా ।
పరిగ్రహస్య ద్రవ్యస్య పరిపాలయితా సదా ॥52॥

ప్రియశ్చ సర్వలోకేషు దేవకార్యపరాయణః ।
తస్యైవం వర్తమానస్య ధర్మమార్గే స్థితస్య చ ॥53॥

కాలేన చలితా బుద్ధిర్దేవద్రవ్యస్య నాశనే ।
తేనాధర్మేణ యుక్తస్య పరలోకగతస్య చ ॥54॥

దృష్ట్వా యమోఽబ్రవీద్వాక్యం శ్వయోనిం వ్రజ మా చిరమ్ ।
తద్వాక్యానంతరం జాతః శ్వా వై సౌగంధికే వనే ॥55॥

తతః కాలేన మహతా శ్వయూథపరివారితః ।
పరిభూతః సరమయా దుఃఖేన మహతావృతః ॥56॥

త్యక్త్వా ద్వైతవనం పుణ్యం సాన్నిహిత్యం యయౌ సరః ।
తస్మిన్ ప్రవిష్టమాత్రస్తు స్థాణోరేవ ప్రసాదతః ॥57॥

అతీవ తృషయా యుక్తః సరస్వత్యాం మమజ్జ హ ।
తత్ర సంప్లుతదేహస్తు విముక్తః సర్వకిల్బిషైః ॥58॥

ఆహారలోభేన తదా ప్రవివేశ కుటీరకమ్ ।
ప్రవిశన్తం తదా దృష్ట్వా శ్వానం భయసమన్వితః ॥59॥

స తం పస్పర్శ శనకైః స్థాణుతీర్థే మమజ్జ హ ।
పతతః పూర్వతీర్థేషు విప్రుషైః పరిషించతః ॥60॥

శునోఽస్య గాత్రసంభూతైరబ్బిందుభిః స సించితః ।
విరక్తదృష్టిశ్చ శునః క్షేపేణ చ తతః పరమ్ ॥61॥

స్థాణుతీర్థస్య మాహాత్మ్యాత్ స పుత్రేణ చ తారితః ।
నియతస్తత్ క్షణాజ్జాతో దివ్యదేహసమన్వితః ।

ప్రణిపత్య తదా స్థాణుం స్తుతిం కర్తుం ప్రచక్రమే ॥62॥

ఆ మాటలు విన్న ఆ రాజు ఆయనకొక కుటీరాన్ని అక్కడ నిర్మించి, అందులో అతణ్ణివుంచి, తాను మనస్సులో తండ్రి ముక్తిని కాంక్షిస్తూ, తీర్థయాత్రలకు బయలుదేరాడు. ప్రతిరోజు ఆయా తీర్థాలలో మునిగి,

అందలి పవిత్రోదకాలు తెచ్చి, తండ్రిపై ప్రోక్షణ చేసేవాడు. ఇలా వుండగా కొన్నాళ్ళకు అచ్చటకు ఒక కుక్క వచ్చింది. అది పూర్వజన్మలో స్థాణుమఠంలో కాలస్వామి యొక్క ద్రవ్యరక్షణబాధ్యత అప్పగింపబడిన అధికారిణిగా వుండేది. సర్వజనప్రియుడై, దైవకార్యానురక్తుడై, కౌలపతి పేరుతో వ్యవహరింపబడేవాడు. ఈ విధంగా ధర్మమార్గంలో అతడు జీవయాత్ర కొనసాగించేవాడు. కాలాంతరంలో అతని బుద్ధి చలించి, దేవద్రవ్యనాశనానికి కారకుడయ్యాడు. ధర్మదూరుడై, మరణించిన అతడు పరలోకానికి వెళ్ళాడు. అతణ్ణి చూసి యముడు తత్క్షణమే వెళ్ళి కుక్కగా జన్మించమని శాసించాడు. మరుక్షణమే అతడు సౌగంధికవనంలో శునకజన్మమెత్తి, అనేకశునకాలతో కలసి, చాలకాలం తిరిగాడు. కొన్నాళ్ళకొక ఆడకుక్క (సరమ) చేత అవమానింపబడి, ఎంతగానో దుఃఖించాడు. అంతట ద్వైతవనాన్ని వదలి ఒంటరిగా పవిత్రమైన సాన్నిహిత్యసరోవరానికి పారిపోయాడు. అక్కడ స్థాణ్వీశ్వరుని దయవల్ల విపరీతమైన దాహం తీర్చుకోవడానికి సరస్వతీనదిలో మునిగాడు. దాహశాంతికి నీళ్లలో మునిగిన ఆ కుక్క సకలపాపాలనుండి విముక్తి పొందింది. స్నానం చేయగానే ఆకలితో అలమటించి, ఆహారాన్ని వెదుకుతూ రాజుగారి తండ్రియున్న కుటీరంలో ప్రవేశించింది. అతడు ఆ కుక్కను చూసి భయపడి, మెల్లగా దానిని తాకాడు. వెంటనే స్థాణుతీర్థంలో మునిగాడు. ఆ కుక్క వెనుకటి తీర్థంలో మునిగిన తనశరీరాన్ని విదిలించుకొనగా ఆ కుక్క శరీరంనుండి వచ్చిన నీటిబిందువులు ఆ రాజుమీద పడ్డాయి. ఆ విధంగా స్థాణుతీర్థ జలాలు ఆరాజుమీద పడడంచేత, కుక్కపైగల భయంతో ఆ రాజు స్థాణుతీర్థంలోపడి స్నానంచేసిన మాహాత్మ్యంవల్ల, తనపుత్రునిద్వారా తండ్రి ఉద్ధరింపబడి, వెంటనే ఇంద్రియజయం కలిగి, దివ్యశరీరాన్ని పొందాడు. అంతట వేనుడు మహానందంతో స్థాణుభగవానునికి ప్రణమిల్లి ఇలా స్తోత్రం చేయసాగాడు.

వేన ఉవాచ – వేనుడు పలికాడు.

ప్రపద్యే దేవమీశానం త్వామజం చంద్రభూషణమ్ ।
మహాదేవం మహాత్మానం విశ్వస్య జగతః పతిమ్ ॥63॥

ఓ శంకరా! నీవు దేవుడవు, ఈశానుడవు, పుట్టుకలేనివాడవు, చంద్రభూషణుడవు, మహాదేవుడవు, మహాత్ముడవు. విశ్వానికి ఈ జగత్తునకు పతివి. అట్టి నిన్ను శరణు వేడుతున్నాను.

నమస్తే దేవదేవేశ సర్వశత్రునిషూదన ।
దేవేశ బలివిష్టంభ దేవదైత్యైశ్చ పూజిత ॥64॥

ఓ దేవదేవేశా! సమస్తశత్రుసంహారకా! దేవేశా! బలిని నిరోధించినవాడా! దేవతల చేతను, దైత్యుల చేతను, పూజింపబడినవాడా! నీకు నమస్కారము.

విరూపాక్ష సహస్రాక్ష త్ర్యక్ష యక్షేశ్వర ప్రియ ।
సర్వతః పాణిపాదాంత సర్వతోఽక్షి శిరోముఖ ॥65॥

సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠసి ।
శంకుకర్ణ మహాకర్ణ కుంభకర్ణార్ణవాలయ ॥66॥

గజేంద్రకర్ణ గోకర్ణ పాణికర్ణ నమోఽస్తు తే ।
శతజిహ్వ శతావర్త శతోదర శతానన ॥67॥

గాయన్తి త్వాం గాయత్రిణో హ్యర్చయం త్యర్కమర్చిణః ।
బ్రహ్మాణం త్వా శతక్రతో ఉద్వంశమివ మేనిరే ॥68॥

విరూపాక్షా! సహస్రాక్షా! ముక్కంటీ! కుబేరప్రియా! చేతులు, కాళ్ళు, కళ్ళు, తల, ముఖం, చెవుల రూపంలో సమస్త విశ్వాన్నీ ఆవరించియున్నావు. అన్నిచోట్ల వున్నావు. నీవు శంకుకర్ణుడవు. మహాకర్ణుడవు, కుంభకర్ణుడవు. సముద్రాలకు నిలయుడవు. గజేంద్రకర్ణుడవు. గోకర్ణా! పాణికర్ణా! నీకు నమస్కారము. ఓ శతజిహ్వ! శతావర్తా! శతోదరా! శతాననా! నీకు నమస్కారము. గాయత్రీమంత్రంతో నిన్నే గానం చేస్తున్నారు. సూర్యారాధకులు నిన్నే ఆరాధిస్తున్నారు. ఓ శతక్రతూ! నిన్ను వారంతా పరబ్రహ్మగా పరిగణిస్తున్నారు.

మూర్తౌ హి తే మహామూర్తే సముద్రాంబుధరా తథా ।
దేవతాః సర్వ ఏవాత్ర గోష్ఠే గావ ఇవాసతే ॥69॥

శరీరే తవ పశ్యామి సోమమగ్నిం జలేశ్వరమ్ ।
నారాయణం తథా సూర్యం బ్రహ్మాణం చ బృహస్పతిమ్ ॥70॥

ఓ మహామూర్తీ! నీ అనంతమైన మూర్తితో సముద్రాలు, మేఘాలు, దేవతలు అందరు పశువుల కొట్టంలో ఆవుల వలె ఆశ్రయం పొందియున్నారు. ఓ ప్రభూ! నీ శరీరంలో చంద్రాగ్నివరుణులను నారాయణ, సూర్య, విరించి, బృహస్పతులను దర్శిస్తున్నాను.

భగవాన్ కారణం కార్యం క్రియాకరణమేవ తత్ ।
ప్రభవః ప్రలయశ్చైవ సదసచ్చాపి దైవతమ్ ॥71॥

నమో భవాయ శర్వాయ వరదాయోగ్రరూపిణే ।
అంధకాసురహంత్రే చ పశూనాం పతయే నమః ॥72॥

త్రిజటాయ త్రిశీర్షాయ త్రిశూలాసక్తపాణయే ।
త్ర్యంబకాయ త్రినేత్రాయ త్రిపురఘ్న నమోఽస్తు తే ॥73॥

భగవాన్! నీవు కారణం, కార్యం, క్రియకు కారణుడవు. సర్వం నీనుండి ప్రభవిస్తుంది. నీవే ప్రలయానివి. సదసత్ దైవతానివి నీవే. భవా! నీకు నమస్కారము. శర్వా!, వరదా!, ఉగ్రరూపీ!, అంధకాసురభంజకా!, పశుపతీ!, నీకు నమస్కారము. త్రిజటేశ్వరా!, త్రిశీర్షా!, త్రిశూలధరా!, త్ర్యంబకా!, త్రినేత్రా!, త్రిపురసంహారకా!, నీకు నమోవాకములు.

నమో ముండాయ చండాయ అండాయోత్పత్తిహేతవే ।
డిండిమాసక్తహస్తాయ డిండిముండాయ తే నమః ॥74॥

నమోర్ధ్వకేశదంష్ట్రాయ శుష్కాయ వికృతాయ చ ।
ధూమ్రలోహితకృష్ణాయ నీలగ్రీవాయ తే నమః ॥75॥

నమోఽస్త్వప్రతిరూపాయ విరూపాయ శివాయ చ ।
సూర్యమూలాయ సూర్యాయ స్వరూపధ్వజమాలినే ॥76॥

నమో మానాతిమానాయ నమః పటుతరాయ తే ।
నమో గణేంద్రనాథాయ వృషస్కంధాయ ధన్వినే ॥77॥

సంక్రందనాయ చండాయ పర్ణధారపుటాయ చ ।
నమో హిరణ్యవర్ణాయ నమః కనకవర్చసే ॥78॥

నమః స్తుతాయ స్తుత్యాయ స్తుతిస్థాయ నమోఽస్తు తే ।
సర్వాయ సర్వభక్షాయ సర్వభూతశరీరిణే ॥79॥

నమో హోత్రే చ హంత్రే చ సితోదగ్రపతాకినే ।
నమో నమ్యాయ నమ్రాయ నమః కటకటాయ చ ॥80॥

నమోఽస్తు కృశనాశాయ శయితాయోత్థితాయ చ ।
స్థితాయ ధావమానాయ ముండాయ కుటిలాయ చ ॥81॥

నమో నర్తనశీలాయ లయవాదిత్రశాలినే ।
నాట్యోపహారలుబ్ధాయ ముఖవాదిత్రశాలినే ॥82॥

నమో జ్యేష్ఠాయ శ్రేష్ఠాయ బలాతిబలఘాతినే ।
కాలనాశాయ కాలాయ సంసారక్షయరూపిణే ॥83॥

ముండుడా!, చండుడా!, అండరూపా!, ఉత్పత్తిహేతూ!, డిండిమహస్తుడా!, డిండిముండా (ఒక ఓషధిపేరు)!, నీకు నమస్కారము. ఊర్ధ్వకేశివి, ఊర్ధ్వదంష్ట్రుడవు, శుష్కించినవాడవు, వికృతుడవు, ధూమ్రలోహిత కృష్ణవర్ణుడవు, నీలకంఠుడవునగు నీకు నమస్కారము. అప్రతిమానమైన రూపం కలవాడవు, విరూపుడవు, శివుడవు, సూర్యునకు మూలమైనవాడవు, సూర్యుడవు, నీ రూపమే అయిన ధ్వజమాలికలు కలవాడవునైన నీకు నమస్కారము. మానము, అతిమానము నీవే. పాటవమంతా నీ రూపమే. సమస్త గణాధీశులకు ప్రభువు నీవే. వృషభస్కంధుడవు, మహాధానుష్కుడవు నీవే. నీకు నమస్సులు. నీవు సంక్రందనుడవు. చండుడవు, పత్రధారపుటములు కలవాడవు. హిరణ్యవర్ణుడవు, కనకాభశరీరుడవు నీవే. నీకు ప్రణామములు. స్తుతింపబడినవాడవు. స్తుతింపబడదగినవాడవు, స్తుతిరూపాన నిలచువాడవు నీవే. నీకు నమస్సులు. సర్వుడవు, సర్వ భక్షకుడవు, సర్వభూతశరీరివి నీవే. హోతవు, హంతవు, సితోదగ్రపతాకం కలవాడవునైన నీకు నమస్కారము. నమస్కరింపదగినవాడవు నీవే. నమ్రుడవు నీవు. నీకు నమస్కారము. కటకటుడవైన నీకు నమస్కారము. కృశనాశా!, శయితా!, ఉత్థితా!, స్థితా!, ధావమానా!, ముండిత శిరస్కుడా!, కుటిలుడా!, నీకు నమస్కారము. నర్తనశీలీ!, లయవాదిత్రశాలీ! నీకు నమస్సులు. నాట్యప్రదర్శనలోలా!

ముఖవాద్యప్రవీణా! నీకు నమస్కారము. జ్యేష్ఠా!, శ్రేష్ఠా!, బలాతిబలఘాతుకా!, కాలనాశకా!, కాలస్వరూపా!, సంసారక్షయరూపీ! నీకు నమస్కారము.

హిమవద్దుహితుః కాంత భైరవాయ నమోఽస్తు తే ।
ఉగ్రాయ చ నమో నిత్యం నమోఽస్తు దశబాహవే ॥84॥

చితిభస్మ ప్రియాయైవ కపాలాసక్తపాణయే ।
విభీషణాయ భీష్మాయ భీమవ్రత ధరాయ చ ॥85॥

నమో వికృతవక్త్రాయ నమః పూతోగ్రదృష్టయే ।
పక్వామమాంసలుబ్ధాయ తుంబివీణా ప్రియాయ చ ॥86॥

నమో వృషాంకవృక్షాయ గోవృషాభిరుతే నమః ।
కటంకటాయ భీమాయ నమః పరపరాయ చ ॥87॥

నమః సర్వవరిష్ఠాయ వరాయ వరదాయినే ।
నమో విరక్తరక్తాయ భావనాయాక్షమాలినే ॥88॥

విభేదభేదభిన్నాయ ఛాయాయై తపనాయ చ ।
అఘోరఘోరరూపాయ ఘోరఘోరతరాయ చ ॥89॥

నమః శివాయ శాన్తాయ నమశ్శాన్తతమాయ చ ।
బహునేత్రకపాలాయ ఏకమూర్తే నమోఽస్తు తే ॥ 90॥

ఓ పార్వతీప్రియా!, భైరవా!, ఉగ్రా!, దశబాహూ!, నీకు ప్రతినిత్యము నమస్సులు. చితిభస్మప్రియా!, కపాలహస్తా!, విభీషణా!, భయంకరా!, కఠోర వ్రతధరా!, వికృతముఖా!, పవిత్రమైన తీవ్రదృష్టి గలవాడా!, పక్వం చేసిన ఆమమాంసలోలుడా!, తుంబివీణాప్రియా! నీకు నమస్కారము. వృషాంక (రుద్రాక్ష) వృక్షరూపా!, ఆబోతు రంకె వంటి కంఠధ్వనిగల ప్రభూ!, కటంకటా(అగ్నిరూపా)!, భీమా!, పరాపరస్వరూపా!, నీకు నమస్సులు. ఓ సర్వశ్రేష్ఠా!, వరా!, వరదా!, నిరాసక్తా!, కర్మఫలదాతా!, రుద్రాక్షమాలాధరా! నీకు నమస్సులు. విభేదభేద భిన్నరూపా!, ఛాయారూపా!, ఊష్మరూపా!, అఘోరఘోరరూపా!, ఉగ్రాత్యుగ్రుడా! నీకు నమస్కారము. శివా! నీకు నమస్కారము. శాంతా!, శాంతతమరూపా! నీకు నమస్కారము. బహునేత్రా!, కపాలా!, ఏకరూపీ! నీకు నమస్కారము.

నమః క్షుద్రాయ లుబ్ధాయ యజ్ఞభాగప్రియాయ చ ।
పంచాలాయ సితాంగాయ నమో యమనియామినే ॥91॥

నమశ్చిత్రోరుఘంటాయ ఘంటాఘంట నిఘంటినే ।
సహస్రశతఘంటాయ ఘంటామాలావిభూషిణే ॥92॥

ప్రాణసంఘట్టగర్వాయ నమః కిలికిలిప్రియే ।
హుంహుంకారాయ పారాయ హుంహుంకార ప్రియాయ చ ॥93॥

నమః సమసమే నిత్యం గృహవృక్షనికేతినే ।
గర్భమాంసశృగాలాయ తారకాయ తరాయ చ ॥94॥

నమో యజ్ఞాయ యజినే హుతాయ ప్రహుతాయ చ ।
యజ్ఞవాహాయ హవ్యాయ తప్యాయ తపనాయ చ ॥95॥

నమస్తు పయసే తుభ్యం తుండానాం పతయే నమః ।
అన్నదాయాన్నపతయే నమో నానాన్నభోజినే ॥96॥

నమః సహస్రశీర్షాయ సహస్రచరణాయ చ ।
సహస్రోద్యతశూలాయ సహస్రాభరణాయ చ ॥97॥

బాలానుచరగోప్త్రే చ బాలలీలావిలాసినే ।
నమో బాలాయ వృద్ధాయ క్షుబ్ధాయ క్షోభణాయ చ ॥98॥

గంగాలులితకేశాయ ముంజకేశాయ వై నమః ।
నమః షట్కర్మతుష్టాయ త్రికర్మనిరతాయ చ ॥99॥

నగ్నప్రాణాయ చండాయ కృశాయ స్ఫోటనాయ చ ।
ధర్మార్థకామమోక్షాణాం కథ్యాయ కథనాయ చ ॥100॥

సాంఖ్యాయ సాంఖ్యముఖ్యాయ సాంఖ్యయోగముఖాయ చ ।
నమో విరథరథ్యాయ చతుష్పథరథాయ చ ॥101॥

కృష్ణాజినోత్తరీయాయ వ్యాలయజ్ఞోపవీతినే ।
వక్త్రసంధాన కేశాయ హరికేశ నమోఽస్తు తే ।
త్ర్యంబికాంబిక నాథాయ వ్యక్తావ్యక్తాయ వేధసే ॥102॥

కామకామద కామఘ్న తృప్తాతృప్తవిచారిణే ।
నమః సర్వద పాపఘ్న కల్పసంఖ్యావిచారిణే ॥103॥

క్షుద్రరూపా!, లుబ్ధరూపా!, యజ్ఞభాగప్రియా!, పాంచాలజాతీశ్వరా!, శ్వేతాంగధరా!, మృత్యునిరోధకా!, నీకు నమస్కారము. విచిత్రమైన పెద్ద గంటకలవానికి, ఘంటాఘంటనిఘంటికునకు నమస్కారము. సహస్ర శతఘంటలు కలవానికి, ఘంటామాలావిభూషితుడైన వానికి నమస్సులు. ప్రాణవాయుసంఘట్టనశక్తితో గర్వించువాడా!, కిలికిలినాదప్రియా!, హుంకారరూపా!, హుంకారప్రియా! నీకు నమస్కారము. సమసమా!, గృహవృక్ష నివాసీ(బిల్వవృక్షనివాసి)!, శిశుమాంసభోజియగు నక్కా!, తరింపజేయువాడా!, దాటించు నౌకారూపా! నీకు నమస్సులు.

యజ్ఞరూపుడు, యాజకరూపుడు, హుతస్వరూపుడు, సర్వభూతబలియు, యజ్ఞవాహనుడు, హవ్యరూపుడు, తపస్సుయు, తపనుడునగు నీకు నమస్కారము. జలస్వరూపుడవైన నీకు నమస్కారము. వక్త్రాధిపతియు,

అన్నదాతయు, అన్నపతియు, నానాన్నభోజియునైన నీకు నమస్కారము. సహస్రశీర్షా!, సహస్రచరణా!, సహస్రోద్యతశూలీ!, సహస్రాభరణా!, నీకు నమస్కారము. శిశువులను రక్షించువాడా!, బాలలీలావిలాసీ!, బాలరూపా!, వృద్ధరూపా!, క్షోభించువాడా!, క్షోభింపజేయువాడా! నీకు నమస్కారము. గంగాధరా!, ముంజకేశా! నీకు నమస్కారము. షట్కర్మసంతోషీ!, కర్మత్రయనిరతా! నీకు నమస్కారము. నగ్నప్రాణా!, చండా!, కృశా!, స్ఫోటనా (సాక్షాత్కరించువాడా)!, చతుర్విధపురుషార్థ ప్రతిపాదకా! నీకు నమస్సులు. సాంఖ్యశాస్త్రం నీవే. సాంఖ్యసారతత్త్వం నీవే. సాంఖ్యయోగ శాస్త్రాధినేతవు నీవే. విరథుడవు, రథ్యుడవు, చతుష్పథ రథికుడవు నీవే. అట్టి నీకు నమస్కారము. మృగచర్మధరా!, సర్పయజ్ఞోపవీతా!, ముఖముపై పడుతున్న కేశములు కలవాడా!, పసుపు, ఎరుపు రంగు గల కేశములు కలవాడా!, నీకు నమస్కారము. మూడుకన్నులుగల అంబికాపతీ!, వ్యక్తావ్యక్తస్వరూపా!, విరించీ!, నీకు నమస్కారము. నీవే కోరికవు!, కోర్కెలను తీర్చువాడవు నీవే!, కోర్కెలు లేకుండగా చేయువాడవు నీవే!, తృప్తాతృప్తవిచారకా!, సర్వదాతా!, పాపఘ్నా!, కల్పసంఖ్యావిచారకా!, నీకు నమస్సులు.

మహాసత్త్వ మహాబాహో మహాబల నమోఽస్తు తే ।
మహామేఘ మహాప్రఖ్య మహాకాల మహాద్యుతే ॥ 104॥

మేఘావర్త యుగావర్త చంద్రార్క పతయే నమః ।
త్వమన్నమన్నభోక్తా చ పక్వభుక్ పావనోత్తమ ॥105॥

జరాయుజాండజాశ్చైవ స్వేదజోద్భిదజాశ్చ యే ।
త్వమేవ దేవదేవేశ భూతగ్రామశ్చతుర్విధః ॥106॥

మహాసత్త్వా!, మహాబాహూ!, మహాబలా!, మహామేఘా!, మహాప్రఖ్యా!, మహాకాళా!, మహాద్యుతీ! నీకు నమస్కారము. మేఘావర్తా!, యుగావర్తా!, చంద్రసూర్యపతీ!, నీకు నమస్కారము. అన్నానివి నీవే. అన్నభోక్తవు నీవే. పక్వభోజీవీ, పావనోత్తముడవు నీవే. నీకు నమస్కారము. జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజాలనే నాల్గురకాల జీవసమూహం నీవే. దేవదేవేశా! నీకు నమస్కారము.

స్రష్టా చరాచరస్యాస్య పాతా హంతా తథైవ చ ।
త్వామాహుర్బ్రహ్మవిద్వాంసో బ్రహ్మ బ్రహ్మవిదాం గతిమ్ ॥107॥

మనసః పరమజ్యోతిస్త్వం వాయుర్జ్యోతిషామపి ।
హంసవృక్షే మధుకరమాహుస్త్వాం బ్రహ్మవాదినః ॥108॥

యజుర్మయో ఋఙ్మయస్త్వామాహుః సామమయస్తథా ।
పఠ్యసే స్తుతిభిర్నిత్యం వేదోపనిషదాం గణైః ॥109॥

ఈ చరాచరజగత్తును సృష్టించినది నీవే. దీనిని రక్షించి లయం చేసేదికూడా నీవే. బ్రహ్మవేత్తలైనవారు నిన్ను సృష్టికర్తగా, బ్రహ్మవేత్తలకు పరమగమ్యంగా పేర్కొంటారు. నీవు మనస్సుయొక్క వెలుగువు. దివ్యజ్యోతులలోని వాయువు నీవే. హంసవృక్షంపై (జీవాత్మలపై) తిరిగే తుమ్మెదయని నిన్ను బ్రహ్మవాదులు ప్రశంసిస్తారు. యజుర్వేద

మయుడవు, ఋగ్వేదమయుడవు, సామవేదమయుడవు నీవే. వేదాలు, ఉపనిషత్తులు సదా నిన్నే స్తుతిస్తూ ఉంటాయి.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః శూద్రా వర్ణావరాశ్చ యే ।
త్వమేవ మేఘసంఘాశ్చ విద్యుతోఽశనిగర్జితమ్ ॥110॥

సంవత్సరస్త్వమృతవో మాసో మాసార్ధమేవ చ ।
యుగా నిమేషాః కాష్ఠాశ్చ నక్షత్రాణి గ్రహాః కలాః ॥111॥

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర తదితరవర్ణాలు నీవే. మేఘబృందం, విద్యుత్తు, అశనిపాతం (పిడుగుపాటు) నీవే. సంవత్సరం, ఋతువులు, మాసాలు, పక్షాలు, యుగాలు, నిమేషకాష్ఠాలు, నక్షత్రగ్రహకళలు అన్నీ నీరూపాలే.

వృక్షాణాం కకుభోఽసి త్వం గిరీణాం హిమవాన్ గిరిః ।
వ్యాఘ్రో మృగాణాం పతతాం తార్క్ష్యోఽనన్తశ్చ భోగినామ్ ॥112॥

క్షీరోదోఽస్యుదధీనాం చ యంత్రాణాం ధనురేవ చ ।
వజ్రం ప్రహరణానాం చ వ్రతానాం సత్యమేవ చ ॥113॥

త్వమేవ ద్వేష ఇచ్ఛా చ రాగో మోహః క్షమా క్షమే ।
వ్యవసాయో ధృతిర్లోభః కామక్రోధౌ జయాజయౌ ॥114॥

త్వం శరీ త్వం గదీ చాపి ఖట్వాంగీ చ శరాసనీ ।
ఛేత్తా భేత్తా ప్రహర్తాఽసి మన్తా నేతా సనాతనః ॥115॥

వృక్షాలలో అర్జునవృక్షానివి నీవే. గిరులలో హిమవంతానివి నీవే. మృగాలలో వ్యాఘ్రము నీవే. పక్షులలో గరుత్మంతుడవు నీవే. సర్పాలలో అనంతుడవు నీవే. సముద్రాలలో క్షీరసముద్రం నీవే. యంత్రాలలో ధనుస్సు, ప్రహరణాలలో వజ్రాయుధము, వ్రతాలలో సత్యవ్రతము నీవే. ద్వేషం, కోరిక, రాగమోహాలు, క్షమాక్షమలు, వ్యవసాయము, ధృతి, లోభం, కామక్రోధాలు, జయాపజయాలు అన్నీ నీవే. ధనుర్ధారివి నీవే. గదాధరుడవు నీవే. ఖట్వాంగాలు, తూణీరాలు నీవే. ఛేత్తవు, భేత్తవు నీవే. ప్రహర్తవు, మననశీలివి, నేతవు, సనాతనుడవు నీవే.

దశలక్షణసంయుక్తో ధర్మోఽర్థః కామ ఏవ చ ।
సముద్రాః సరితో గంగా పర్వతాశ్చ సరాంసి చ ॥116॥

లతావల్ల్యస్తృణౌషధ్యః పశవో మృగపక్షిణః ।
ద్రవ్యకర్మ గుణారంభః కాలపుష్పఫలప్రదః ॥117॥

ఆదిశ్చాంతశ్చ వేదానాం గాయత్రీ ప్రణవస్తథా ।
లోహితో హరితో నీలః కృష్ణః పీతః సితస్తథా ॥118॥

దశలక్షణలక్షితమైన ధర్మము, అర్థకామాలు నీవే. సముద్రాలు, నదులు, గంగ, పర్వతాలు, సరోవరాలు, లతలు, తృణాలు, ఓషధులు, పశుమృగపక్షిగణాలు అన్నీ నీవే. ద్రవ్యకర్మగుణాల ఉద్గమం, కాలమనే పుష్పం, దాని ఫలం యిచ్చేది నీవే. వేదాల ఆద్యంతాలు, గాయత్రి, ఓంకారం, లోహిత, హరిత, నీల, కృష్ణ, పీత, శ్వేత వర్ణాలునీవే.

కద్రుశ్చ కపిలశ్చైవ కపోతో మేచకస్తథా ।
సవర్ణాశ్చాప్యవర్ణశ్చ కర్తా హర్తా త్వమేవ హి ॥119॥

త్వమింద్రశ్చ యమశ్చైవ వరుణో ధనదోఽనిలః ।
ఉపప్లవశ్చిత్రభానుః స్వర్భానుర్భానురేవ చ ॥120॥

శిక్షాహౌత్రం త్రిసౌపర్ణం యజుషాం శతరుద్రియమ్ ।
పవిత్రం చ పవిత్రాణాం మంగళానాం చ మంగళమ్ ॥121॥

తిందుకో గిరిజో వృక్షో ముద్గం చాఖిలజీవనమ్ ।
ప్రాణాః సత్త్వం రజశ్చైవ తమశ్చ ప్రతిపత్పతిః ॥122॥

ప్రాణోఽపానః సమానశ్చ ఉదానో వ్యాన ఏవ చ ।
ఉన్మేషశ్చ నిమేషశ్చ క్షుతం జృంభితమేవ చ ॥123॥

లోహితాంతర్గతో దృష్టిర్మహావక్త్రో మహోదరః ।
శుచిరోమా హరిశ్మశ్రురూర్ధ్వకేశశ్చలాచలః ॥124॥

కద్రు, కపిల, కపోత, మేచకాది వర్ణాలన్నీ నీ విలాసాలే. సమానవర్ణం కలిగియుండడం, అవర్ణం, కర్తృత్వం, ఉపసంహరణ అన్నియు నీవే. నీవే ఇంద్రుడవు. యముడవు, వరుణుడవు, కుబేరుడవు, వాయువు, రాహువు, అగ్ని, సూర్యుడవు, అన్నియు నీవే. నీవు యజ్ఞజ్ఞానోపదేష్టవు. త్రిసుపర్ణఛందస్స్వరూపివి. యజుర్వేదములోని శతరుద్రీయము నీవు. పవిత్రులలో పవిత్రుడవు, శివంకరులలో శివంకరుడవు. తిందుక, గిరిజ తరువులు, అందరకు జీవనరూపమైన పెసరధాన్యము. ప్రాణతత్త్వము, సత్త్వరజస్తమాలు, ప్రతిపత్పతి. ప్రాణ అపాన సమాన ఉదాన వ్యాన రూపమైన పంచప్రాణాలు, ఉన్మేష నిమేషాలు, తుమ్ముట, ఆవులించుట అన్నియు నీవే. రక్తంలో దాగియున్నది నీవే. దృష్టివి, మహావక్త్రుడవు, మహోదరుడవు, శ్వేతరోముడవు, పచ్చని గడ్డం కలవాడవు నీవే. ఊర్ధ్వకేశివి, చలాచలుడవు నీవే. నీకు నమస్సులు.

గీత వాదిత్ర నృత్యజ్ఞో గీతవాదిత్రకప్రియః ।
మత్స్యో జాలో జలౌకాక్ష కాలః కేళికలా కవిః ॥125॥

అకాలశ్చ వికాలశ్చ దుష్కాలః కాల ఏవ చ ।
మృత్యుశ్చ మృత్యుకర్తా చ యక్షో యక్షభయంకరః ॥126॥

గీతవాదిత్రనృత్యజ్ఞాతవు, గీతవాదిత్రనృత్యప్రియుడవు, మత్స్యానివి, వలవు, జలగవు, కాలుడవు, కేళికలవు, కవివి, అకాల వికాల దుష్కాల కాలములు నీ రూపములే. మృత్యువు, మృత్యుకారకుడవు నీవే. యక్షుడు, యక్షులకు భయము గొల్పువాడవు నీవే.

సంవర్తకోఽన్తకశ్చైవ సంవర్తక బలాహకః ।
ఘంటాఘంటీ మహాఘంటీ చరీమాలీ చ మాతలిః ॥127॥

బ్రహ్మకాల యమాగ్నీనాం దండీముండీ త్రిముండధృక్ ।
చతుర్యుగశ్చతుర్వేదశ్చాతుర్హోత్రప్రవర్తకః ॥128॥

సంవర్తకుడు, అంతకుడు, సంవర్తకబలాహక మేఘాలు అన్నీ నీరూపాలే. ఘంటవు, ఘంట కలవాడవు, మహాఘంటివి, మందగతివి, మాలాధరుడవు, మాతలివి నీవే. బ్రహ్మకాలయమాగ్నులను దండించేవాడవు నీవే. కేశరహితుడవు, త్రిమస్తకుడవు, చతుర్యుగాలను, చతుర్వేదాలను, నాలుగు హోత్రాలను ప్రవర్తింపజేయువాడవు నీవే.

చాతురాశ్రమ్యనేతా చ చాతుర్వర్ణ్యకరస్తథా ।
నిత్యమక్షప్రియో ధూర్తో గణాధ్యక్షో గణాధిపః ॥129॥

రక్తమాల్యాంబరధరో గిరికో గిరికప్రియః ।
శిల్పం చ శిల్పినాం శ్రేష్ఠః సర్వశిల్పిప్రవర్తకః ॥130॥

నాలుగు ఆశ్రమాలకు అధినాయకుడవు నీవు. చాతుర్వర్ణ్యకర్తవు నీవే. నీవెల్లప్పుడు జూదప్రియుడవు. ధూర్తుడవు. సర్వగణాధ్యక్షుడవు. గణాధిపుడవు నీవే. ఎర్రని మాలలు, వస్త్రాలు ధరించువాడవు, కందుకానివి, కందుకప్రియుడవు, శిల్పానివి, శిల్పులలో శ్రేష్ఠుడవు, సర్వశిల్పులను ప్రవర్తింపజేసిన ప్రభుడవు నీవు.

భగనేత్రాంకుశశ్చండః పూష్ణో దంతవినాశనః ।
స్వాహా స్వధా వషట్కారో నమస్కారో నమో నమః ॥131॥

గూఢవ్రతో గుహ్యతపాస్తారకాస్తారకామయః ।
ధాతా విధాతా సంధాతా పృథివ్యా ధరణోఽపరః ॥132॥

భగనేత్రాంకుశుడవు, చండుడవు, పూషుని దంతాలను నాశనమొనర్చినవాడవు, స్వాహా, స్వధా వషట్కార నమస్కార రూపివైన నీకు అనేక నమస్సులు. నీవు గూఢవ్రతుడవు. గుహ్యతపస్వివి. తారకవు, తారకామయుడవు. ధాతవు, విధాతవు, సంధాతవు, ధరణికి మరియొక ఆధారమైనవాడవు.

బ్రహ్మ తపశ్చ సత్యం చ వ్రతచర్యమథార్జవమ్ ।
భూతాత్మా భూతకృద్ భూతిర్భూతభవ్యభవోద్భవః ॥133॥

భూర్భువః స్వరృతం చైవ ధ్రువో దాంతో మహేశ్వరః ।
దీక్షితోఽదీక్షితః కాంతో దుర్దాంతో దాంతసంభవః ॥134॥

చంద్రావర్తో యుగావర్తః సంవర్తక ప్రవర్తకః ।
బిందుః కామో హ్యణుః స్థూలః కర్ణికారస్రజప్రియః ॥135॥

నందీముఖో భీమముఖః సుముఖో దుర్ముఖస్తథా ।
హిరణ్యగర్భః శకునిర్మహోరగపతిర్విరాట్ ॥136॥

నీవే బ్రహ్మవు, తపస్సువి, సత్యానివి, వ్రతచర్యవు, ఋజుత్వానివి, భూతస్వరూపుడివి, పంచభూతములను సృష్టించినవాడవు, ఐశ్వర్యానివి, భూతభవిష్యద్వర్తమానాలకు కారణానివి. భూలోకం, భువర్లోకం, స్వర్లోకం, ఋతం, ధ్రువం, దాంతం, అన్నీ నీ రూపాలే. నీవు మహేశ్వరుడవు. దీక్షితుడవు. దీక్షారహితుడవు. కాంతుడవు. దుర్దాంతుడవు. దాంతికి మూలానివి నీవే. చంద్రుని రూపాన, యుగాల రూపాన, మేఘాల రూపాన నీవే మాటిమాటికి వస్తూ వుంటావు. బిందురూపివి, అణురూపివి, స్థూలరూపివి, కర్ణికార (గన్నేరు) పుష్పమాలాప్రియుడవు. నందిముఖుడవు, భీమముఖుడవు, సుముఖుడవు, దుర్ముఖుడవు, హిరణ్యగర్భుడవు, పక్షివి, భయంకరమైన సర్పశ్రేష్ఠుడవు, విరాట్పురుషుడవు నీవే.

అధర్మహా మహాదేవో దండధారో గణోత్కటః ।
గోనర్దో గోప్రతారశ్చ గోవృషేశ్వరవాహనః ॥137॥

త్రైలోక్యగోప్తా గోవిందో గోమార్గో మార్గఏవ చ ।
స్థిరః శ్రేష్ఠశ్చ స్థాణుశ్చ విక్రోశః క్రోశ ఏవ చ ॥138॥

దుర్వారణో దుర్విషహో దుఃస్సహో దురతిక్రమః ।
దుర్ధర్షో దుష్ప్రకాశశ్చ దుర్దర్శో దుర్జయో జయః ॥139॥

శశాంకానలశీతోష్ణః క్షుత్తృష్ణా చ నిరామయః ।
ఆధయో వ్యాధయశ్చైవ వ్యాధిహా వ్యాధినాశనః ॥140॥

సమూహశ్చ సమూహస్య హంతా దేవః సనాతనః ।
శిఖండీ పుండరీకాక్షః పుండరీకవనాలయః ॥141॥

త్ర్యంబకో దండధారశ్చ ఉగ్రదంష్ట్రః కులాంతకః ।
విషాపహః సురశ్రేష్ఠః సోమపాస్త్వం మరుత్పతే ।
అమృతాశీ జగన్నాథో దేవదేవ గణేశ్వరః ॥142॥

అధర్మనాశకుడవు, మహాదేవుడవు, దండధారివి, ఉత్కటగణరూపివి, గోవు వలె రంకె వేయువాడవు, గోవులను దాటించువాడవు, వృషభేశ్వరవాహనుడవు. ముల్లోకాలను రక్షించువాడవు, గోవిందుడవు, గోమార్గానివి, మార్గానివి, స్థిరుడవు, శ్రేష్ఠుడవు, స్థాణురూపివి, విక్రోశ, క్రోశరూపివియైన నీకు నమస్సులు. నిన్నెవరు వారించలేరు. దుర్విషహుడవు, దుస్సహుడవు, దురతిక్రముడవు, దుర్ధర్షుడవు, దుష్ప్రకాశుడవు, దుర్దర్శుడవు, దుర్జయుడవు, విజయానివీ నీవే. నీవు చంద్రాగ్నుల వలె చల్లగా వేడిగా వుంటావు. ఆకలి, దప్పిక, ఆరోగ్యం, ఆధివ్యాధులు,వ్యాధిని శమింపజేయువాడవు, వ్యాధిని పోగొట్టువాడవు నీవే. సమూహము, సమూహాన్ని సంహరించువాడవు నీవే. సనాతనుడవు, దేవుడవు, శిఖండివి, పుండరీకాక్షుడవు, పుండరీకవనాలలో నివసించువాడవు నీవే. త్ర్యంబకుడవు, దండధరుడవు, ఉగ్రదంష్ట్రుడవు, కులాంతకుడవు, విషనాశకుడవు, దేవశ్రేష్ఠుడవు, సోమరసపాయివి, మరుత్తుల నాయకుడవు, అమృతభోజివి, జగన్నాథుడవు, దేవదేవుడవు, దేవగణాధిపతివి నీవే.

మధుశ్చ్యుతానాం మధుపో బ్రహ్మవాక్ త్వం ఘృతచ్యుత ।
సర్వలోకస్య భోక్తా త్వం సర్వలోకపితామహః ॥143॥

హిరణ్యరేతాః పురుషస్త్వమేకః త్వం స్త్రీపుమాంస్త్వం హి నపుంసకం చ ।
బాలో యువా స్థవిరో దేవదంష్ట్రా త్వన్నో గిరిర్విశ్వకృద్ విశ్వహర్తా ॥144॥

త్వం వై ధాతా విశ్వకృతాం వరేణ్య స్త్వాం పూజయంతి ప్రణతాః సదైవ ।
చంద్రాదిత్యౌ చక్షుషీ తే భవాన్ హి త్వమేవ చాగ్నిః ప్రపితామహశ్చ ।
ఆరాధ్య త్వాం సరస్వతీం వాగ్లభంతే అహో రాత్రే నిమిషోన్మేషకర్తా ॥145॥

మధువులొలికించు వారల మధువు త్రాగువాడవు, బ్రహ్మవాణివి, నేయి రాల్చువాడవు నీవే. సర్వలోకాలు నీకు భోజ్యాలు. సర్వలోకాలకు పితామహుడవు నీవే. నీవు హిరణ్యరేతస్కుడవు. ఏకైకపరమపురుషుడవు నీవే. నీవు స్త్రీవి, పురుషుడవు, నపుంసకుడవు, బాలుడవు, ముసలివాడవు, స్థవిరుడవు, ఐరావతగజానివి. పర్వతము వలె సర్వోన్నతుడవు, విశ్వకారకుడవు, విశ్వసంహారకుడవు నీవే. సృష్టిచేయు విధాతలలో నీవు సర్వశ్రేష్ఠుడవు. శ్రద్ధాళువులెల్లవేళల నిన్ను ఆరాధిస్తారు. చంద్రసూర్యులు నీ నేత్రాలు. నీవే అగ్నివి. నీవే ప్రపితామహుడవు. సరస్వతీరూపాన నిన్నారాధించిన నరుడు వాక్కును సంపాదిస్తాడు. రాత్రింబవళ్ళు నీవే. కన్నులు మూయుట, తెరచుట నీవే.

న బ్రహ్మా న చ గోవిందః పౌరాణా ఋషయో న తే ।
మాహాత్మ్యం వేదితుం శక్తా యాథాతథ్యేన శంకర ॥146॥

పుంసాం శతసహస్రాణి యత్సమావృత్య తిష్ఠతి ।
మహతస్తమసః పారే గోప్తా మంతా భవాన్ సదా ॥147॥

యం వినిద్రా జితశ్వాసాః సత్త్వస్థాః సంయతేంద్రియాః ।
జ్యోతిః పశ్యంతి యుంజానాస్తస్మై యోగాత్మనే నమః ॥148॥

ఓ మంగళస్వరూపా! నీ మహిమను యథార్థముగా తెలిసికొనుట బ్రహ్మవిష్ణులకు ప్రాచీనమహర్షులకు కూడా సాధ్యం కాదు. వేలాది ప్రజలను ఆవరించి నిబిడీకృతమైన మోహాంధకారానికవ్వల వెలుగుచు, నీవు వారినందరిని రక్షిస్తూ, నడుపుతూ వుంటావు. నిద్రాప్రాణాలను నిరోధించి, జితేంద్రియులై, సత్త్వగుణప్రధానులైన మహాత్ములు జ్యోతిస్వరూపంలో దర్శించే యోగాత్మవు, పరమాత్మవు నీవే. అట్టి నీకు నమస్కారము.

యా మూర్తయశ్చ సూక్ష్మాస్తే న శక్యా యాని దర్శితుమ్ ।
తాభిర్మాం సతతం రక్ష పితాపుత్రమివౌరసమ్ ॥149॥

రక్ష మాం రక్షణీయోఽహం తవానఘ నమోఽస్తు తే ।
భక్తానుకంపీ భగవాన్ భక్తశ్చాహం సదా త్వయి ॥150॥

నిర్దేశించుటకు సాధ్యం కాని సూక్ష్మాతిసూక్ష్మమైన నీ అనంతమూర్తులతో తండ్రి కన్నకొడుకును వలె నీవు నన్ను రక్షింపుము. నేను నీచే రక్షింపబడదగినవాడను. కావున నన్ను సదా రక్షింపుము. ఓ పాపరహితా! నీకు నమస్సులు. భక్తానుకంపివైన భగవాన్! నేను ఎల్లవేళలా నీకు భక్తుడను.

జటినే దండినే నిత్యం లంబోదర శరీరిణే ।
కమండలునిషంగాయ తస్మై రుద్రాత్మనే నమః ॥151॥

యస్య కేశేషు జీమూతా నద్యః సర్వాంగసంధిషు ।
కుక్షౌ సముద్రాశ్చత్వారస్తస్మై తోయాత్మనే నమః ॥152॥

ఓ జటాధరా!, దండీ!, లంబోదరశరీరీ!, కమండలుధరా!, రుద్రరూపా! నీకు నమస్కారము. నీ కేశాలలో మేఘాలున్నాయి. సర్వాంగసంధులయందు నదులున్నాయి. నీ కుక్షి చతుస్సముద్రాలకు నిలయం. ఆ విధంగా జలాత్మకుడవైన నీకు ప్రణామాలు.

సంభక్ష్య సర్వభూతాని యుగాన్తే పర్యుపస్థితే ।
యశ్శేతే జలమధ్యస్థస్తం ప్రపద్యేఽమ్బుశాయినమ్ ॥153॥

యుగాంతవేళలో సకలజీవరాశిని భక్షించి, జలాలలో విశ్రమించే జలశయానుడైన ప్రభువును శరణు వేడుతున్నాను.

ప్రవిశ్య వదనం రాహోర్యః సోమం పిబతే నిశి ।
గ్రసత్యర్కం చ స్వర్భానూ రక్షితస్తవ తేజసా ॥154॥

యే చాత్ర పతితా గర్భా రుద్రగంధస్య రక్షణే ।
నమస్తేఽస్తు స్వధా స్వాహా ప్రాప్నువంతి తదద్భుతే ॥155॥

యేఽఙ్గుష్ఠమాత్రాః పురుషా దేహస్థాః సర్వదేహినామ్ ।
రక్షంతు తే హి మాం నిత్యం తే మామాప్యాయయంతు వై ॥156॥

ఆప్రభువు రాహువు నోటిలో ప్రవేశించి, రాత్రివేళలలో సోమపానం చేస్తాడు. నీ తేజస్సు రక్షాకవచం కాగా, రాహువు సూర్యుణ్ణి మ్రింగుతున్నాడు. రుద్రగంధరక్షణలో ఇచ్చట గర్భపాతాలు జరుగుతున్నాయి. నీ తేజస్సులే అద్భుతంగా స్వధా, స్వాహాగా మారుతున్నాయి. అట్టి నీకు నమస్కారము. అంగుష్ఠమాత్రపురుషాకృతిలో సకలశరీరులలో నెలకొన్న ప్రభువు ప్రతినిత్యము నన్ను రక్షించుగాక!. ముందుకు నడుపు గాక!.

యే నదీషు సముద్రేషు పర్వతేషు గుహాసు చ ।
వృక్షమూలేషు గోష్ఠేషు కాంతారగహనేషు చ ॥157॥
చతుష్పథేషు రథ్యాసు చత్వరేషు సభాసు చ ।
హస్త్యశ్వరథశాలాసు జీర్ణోద్యానాలయేషు చ ॥158॥

యే చ పంచసు భూతేషు దిశాసు విదిశాసు చ ।
చంద్రార్కయోర్మధ్యగతా యే చ చంద్రార్కరశ్మిషు ॥159॥

రసాతలగతా యే చ యే చ తస్మాత్ పరంగతాః ।
నమస్తేభ్యో నమస్తేభ్యో నమస్తేభ్యశ్చ నిత్యశః ॥160॥

యేషాం న విద్యతే సంఖ్యా ప్రమాణం రూపమేవ చ ।
అసంఖ్యేయగణా రుద్రా నమస్తేభ్యోఽస్తు నిత్యశః ॥161॥

ప్రసీద మమ భద్రం తే తవ భావగతస్య చ ।
త్వయి మే హృదయం దేవ త్వయి బుద్ధిర్మతిస్త్వయి ॥162॥

స్తుత్వైవం స మహాదేవం విరరామ ద్విజోత్తమః ॥163॥

నదులలో, సముద్రాలలో, పర్వతాలలో, గుహలలో, వృక్షమూలాలలో, గోశాలలలో, కీకారణ్యాలలో, చతుష్పథాలలో, రాజమార్గాలలో, సభలలో, గజాశ్వరథశాలలలో, శిథిలాలయాలలో, ఉద్యానవనాలలో, పంచభూతాలలో, దిక్కులలో, దిక్కుల మూలలలో, చంద్రసూర్యుల మధ్య గల చంద్రార్కకాంతులలో, పాతాళవాసులలో, తదితర స్థానాలలో, సర్వత్రా వ్యాపించియుండే ఆ పరబ్రహ్మస్వరూపులకు ప్రతినిత్యం నమస్సులు, ప్రణామాలు, నమస్కారాలు చేస్తున్నాను. లెక్కకు మిక్కుటమైన రూపాకృతులలో అసంఖ్యాకగణాల రూపంలో సర్వత్రా వ్యాపించియున్న రుద్రులకు ప్రతినిత్యం నమస్కరిస్తున్నాను. నీ భక్తిభావనతోనున్న నాయందు మీరందరు ప్రసన్నులగుదురు గాక!. మీకు కల్యాణమగు గాక!. ఓ దేవదేవా! నా హృదయము నీయందే లగ్నమైనది. నా బుద్ధి, మతి నీయందే నిలచియున్నాయి. నీకు నమస్సులు. ఆ విధంగా మహాదేవుడైన శంకరుని స్తుతించి, ద్విజోత్తముడైన వేనుడు విరమించాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారద సంవాదే సరోమాహాత్మ్యే వేనరాజచరితం నామ సప్తచత్వారింశోఽధ్యాయః ॥47॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్య నారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి వేనరాజు చరిత్ర అనే నలభైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టచత్వారింశోఽధ్యాయః - నలబైఎనిమిదవ అధ్యాయం

స్థాణుతీర్థప్రభావకథనమ్ - స్థాణుతీర్థప్రభావకథనం

సనత్కుమార ఉవాచ - సనత్కుమార మహర్షి పలికాడు.

అథైనమబ్రవీద్ దేవస్త్రైలోక్యాధిపతిర్భవః ।
ఆశ్వాసనకరం చాస్య వాక్యవిద్వాక్యముత్తమమ్ ॥1॥

అహో తుష్టోఽస్మి తే రాజన్ స్తవేనానేన సువ్రత ।
బహునాత్ర కిముక్తేన మత్సమీపే వసిష్యసి ॥2॥

ఉషిత్వా సుచిరం కాలం మమ గాత్రోద్భవః పునః ।
అసురోహ్యంధకో నామ భవిష్యసి సురాంతకృత్ ॥3॥

హిరణ్యాక్షగృహే జన్మ ప్రాప్య వృద్ధిం గమిష్యసి ।
పూర్వధర్మేణ ఘోరేణ వేదనిన్దాకృతేన చ ॥4॥

సాభిలాషో జగన్మాతుర్భవిష్యసి యదా తదా ।
దేహం శూలేన హత్వాహం పావయిష్యే సమార్బుదమ్ ॥5॥

తత్రాప్యకల్మషో భూత్వా స్తుత్వా మాం భక్తితః పునః ।
ఖ్యాతో గణాధిపో భూత్వా నామ్నా భృంగిరిటిః స్మృతః ॥6॥

మత్సన్నిధానే స్థిత్వా త్వం తతః సిద్ధిం గమిష్యసి ।
వేనప్రోక్తం స్తవమిమం కీర్తయేద్ యః శ్రుణోతి చ ॥7॥

నాశుభం ప్రాప్నుయాత్ కించిద్ దీర్ఘమాయురవాప్నుయాత్ ।
యథా సర్వేషు దేవేషు విశిష్టో భగవాన్ శివః ॥8॥

తథా స్తవో వరిష్ఠోఽయం స్తవానాం వేననిర్మితః ।
యశో రాజ్యసుఖైశ్వర్యధనమానాయ కీర్తితః ॥9॥

శ్రోతవ్యో భక్తిమాస్థాయ విద్యాకామైశ్చ యత్నతః ।
వ్యాధితో దుఃఖితో దీనశ్చౌరరాజభయాన్వితః ॥10॥

రాజకార్యవిముక్తో వా ముచ్యతే మహతో భయాత్ ।
అనేనైవ తు దేహేన గణానాం శ్రేష్ఠతాం వ్రజేత్ ॥11॥

తేజసా యశసా చైవ యుక్తో భవతి నిర్మలః ।
న రాక్షసాః పిశాచా వా న భూతా న వినాయకాః ॥12॥

విఘ్నం కుర్యుర్గృహే తత్ర యత్రాయం పఠ్యతే స్తవైః ।

అంతట త్రిలోకేశ్వరుడైన శివుడు వాక్యకోవిదుడైన వేనునకు తృప్తి గొలుపునట్టి ఉత్తమవాక్యాలు ఇలా పలికాడు. "సువ్రతుడవగు రాజా! నీ స్తోత్రానికి నేను సంతోషించాను. వేయేల నీవెల్లప్పుడు నా సమీపాననే నివసించగలవు. చాలాకాలం నావద్దనుండి అనంతరం నా శరీరంనుండియే జన్మించి, అంధకాసురుడనే దేవాంతకుడవు కాగలవు. పూర్వం నీవు చేసిన వేదనిందాపూర్వకమైన అధర్మాచరణం వలన హిరణ్యాక్షుని ఇంట్లో పుట్టి, పెద్దవాడవు కాగలవు. ఆ జన్మలో నీవు ఎప్పుడు జగన్మాతపై మరులు చెందెదవో అప్పుడు నేను నీదేహాన్ని శూలంతో ఛేదించి, నిన్ను అర్బుదుని వలె పవిత్రుణ్ణి చేస్తాను. అప్పుడు కూడా ఈ విధంగా నన్ను స్తోత్రం చేసి, మెప్పించి, నా శివగణాలలో ప్రథమునిగా భృంగిరిటి అనే పేరుతో ప్రసిద్ధి పొందగలవు. నా సన్నిధిలోనే ఉంటూ నీవు సిద్ధిని పొందగలవు. వేనుడుగావించిన ఈ దివ్యస్తోత్రాన్ని పఠించేవారు, వినేవారు ఎట్టి అశుభాలు లేకుండా దీర్ఘాయుష్మంతులౌతారు. దేవతలందరిలో శివునకు వలెనే స్తోత్రాలన్నిటిలో ఈ వేనుడు చేసిన స్తవం విశిష్టత కలిగియుంటుంది. యశస్సుని, రాజ్యసుఖాన్ని, ఐశ్వర్యాన్ని, ధనాన్ని, గౌరవాన్ని ఇచ్చేదిగా ఈ స్తవం కీర్తిగాంచింది. విద్యాకాములు ప్రయత్నపూర్వకంగానైన దీనిని భక్తితో వినాలి. వ్యాధిపీడితులు, దుఃఖార్తులు, దీనులు, చోర, రాజభయాన్వితులు ప్రయత్నపూర్వకంగా దీనిని వినాలి. రాజసేవనుండి తొలగింపబడినవారు, సర్వభయాలనుండి విముక్తులౌతారు. ఈదేహంతోనే గణాలలో శ్రేష్ఠులౌతారు. నిర్మలమైన తేజస్సుతో, యశస్సుతో కూడినవారౌతారు. ఈ స్తోత్రపాఠం జరిగే గృహాలలో రాక్షస, పిశాచ, భూత బాధలు ఉండవు. వీరెవరు ఎటువంటి విఘ్నాలు కలుగజేయలేరు.

శ్రుణుయాద్ యా స్తవం నారీ అనుజ్ఞాం ప్రాప్య భర్తృతః ॥13॥

మాతృపక్షే పితుః పక్షే పూజ్యా భవతి దేవవత్ ।
శ్రుణుయాద్ యః స్తవం దివ్యం కీర్తయేద్వా సమాహితః ॥14॥

తస్య సర్వాణి కార్యాణి సిద్ధిం గచ్ఛన్తి నిత్యశః ।
మనసా చిన్తితం యచ్చ యచ్చ వాచాஉనుకీర్తితమ్ ॥15॥

సర్వం సంపద్యతే తస్య స్తవనస్యానుకీర్తనాత్ ।
మనసా కర్మణా వాచా కృతమేనో వినశ్యతి ।
వరం వరయ భద్రం తే యత్త్వయా మనసేప్సితమ్ ॥16॥

"భర్త అనుమతితో ఈ స్తవాన్ని ఏ గృహిణులు వింటారో వారు మాతృపక్షాన, పితృపక్షాన కూడా దేవతల వలె పూజ్యులౌతారు. ఎవరైతే ఈ స్తవాన్ని రోజూ మానసికమైన ఏకాగ్రతతో గానం చేస్తారో లేదా వింటారో వారి సర్వకార్యాలు సిద్ధిస్తాయి. వారు మనస్సులో సంకల్పించినవి, నోటితో ఉచ్చరించినవి అన్నీ సిద్ధిస్తాయి. మనో వాక్కాయకర్మల ద్వారా చేసిన పాపాలన్నీ నశిస్తాయి. ఓ వేనమహారాజా! నీకు శుభమగుగాక!, నీ మనోభీష్టమైన వరాన్ని కోరుకొనుము".

వేన ఉవాచ – వేనుడు పలికాడు.

అస్య లింగస్య మాహాత్మ్యాత్ తథా లింగస్య దర్శనాత్ ।
ముక్తోఽహం పాతకైః సర్వైస్తవ దర్శనతః కిల ॥17॥

యది తుష్టోఽసి మే దేవ యది దేయో వరో మమ ।
దేవ స్వభక్షణాజ్జాతం శ్వయోనౌ తవ సేవకమ్ ॥18॥

ఏతస్యాపి ప్రసాదం త్వం కర్తుమర్హసి శంకర ।
ఏతస్యాపి భయాన్మధ్యే సరసోఽహం నిమజ్జితః ॥19॥

దేవైర్నివారితః పూర్వం తీర్థేఽస్మిన్ స్నానకారణాత్ ।
అయం కృతోపకారశ్చ ఏతదర్థే వృణోమ్యహమ్ ॥20॥

తస్యైతద్ వచనం శ్రుత్వా తుష్టః ప్రోవాచ శంకరః ।
ఏషోఽపి పాపనిర్ముక్తో భవిష్యతి న సంశయః ॥21॥

ప్రసాదాన్మే మహాబాహో శివలోకం గమిష్యతి ।
తథా స్తవమిమం శ్రుత్వా ముచ్యతే సర్వపాతకైః ॥22॥

కురుక్షేత్రస్య మాహాత్మ్యం సరసోఽస్య మహీపతే ।
మమ లింగస్య చోత్పత్తిం శ్రుత్వా పాపైః ప్రముచ్యతే ॥23॥

"ప్రభో!, శంకరా!, ఈ లింగమాహాత్మ్యంవల్ల, ఈ లింగదర్శనంవల్ల, నీదర్శనంవల్ల, నేను సకల పాపాలనుండి విముక్తుడనైనాను. ఓ దేవా! నీవు నాయందు ప్రసన్నుడవైనచో నీవు నాకు వరమీయదలచినచో దేవద్రవ్యభక్షణం కారణంగా శునకయోనిలో పుట్టిన ఈ నీ సేవకుని అనుగ్రహింపుము. ఓ శంకరా! ఈ శునకానికి భయపడియే నేను ఈ సరస్సులో మునగడం జరిగింది. మొదట దేవతలు నన్ను ఈ తీర్థంలో స్నానం చేయవద్దని శాసించారు. ఆపని నాచేత చేయించి, ఈ శునకము నాకు మహోపకారం చేసింది. కనుకనే నేను మిమ్ములను వరం అర్థిస్తున్నాను. ఈ శునకానికి ముక్తినివ్వండి". వేనుని ఈ మాటలు విని, శంకరుడు సంతోషించి, " ఈ శునకం కూడా పాపంనుండి విముక్తిని పొందుతుంది. ఇందులో సందేహంలేదు. నా అనుగ్రహంవల్ల దీనికి శివలోకప్రాప్తి కలుగుతుంది. నా ఈ స్తవం వినినందున దీని పాపాలన్నీ తొలగిపోతాయి. ఓ రాజా! ఈ కురుక్షేత్ర మాహాత్మ్యం, ఈ సరస్సు మాహాత్మ్యం, నా లింగోత్పత్తి వృత్తాంతాలను వినినవారు పాపాలనుండి విముక్తులౌతారు". అని పలికాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారమహర్షి పలికాడు.

ఇత్యేవముక్త్వా భగవాన్ సర్వలోకనమస్కృతః ।
పశ్యతాం సర్వలోకానాం తత్రైవాన్తరధీయత ॥24॥

స చ శ్వా తత్క్షణాదేవ స్మృత్వా జన్మ పురాతనమ్ ।
దివ్యమూర్తిధరో భూత్వా తం రాజానముపస్థితః ॥25॥

కృత్వా స్నానం తతో వైన్యః పితృదర్శనలాలసః ।
స్థాణుతీర్థే కుటీం శూన్యాం దృష్ట్వా శోకసమన్వితః ॥26॥

దృష్ట్వా వేనోఽబ్రవీద్ వాక్యం హర్షేణ మహతాఽన్వితః ।
సత్పుత్రేణ త్వయా వత్స త్రాతోఽహం నరకార్ణవాత్ ॥27॥

త్వయాభిషించితో నిత్యం తీర్థస్య పులినే స్థితః ।
అస్య సాధోః ప్రసాదేన స్థాణోర్దేవస్య దర్శనాత్ ॥28॥

ముక్తపాపశ్చ స్వర్లోకం యాస్యే యత్ర శివః స్థితః ।
ఇత్యేవముక్త్వా రాజానం ప్రతిష్ఠాప్య మహేశ్వరమ్ ॥29॥

స్థాణుతీర్థే యయౌ సిద్ధిం తేన పుత్రేణ తారితః ।
స చ శ్వా పరమాం సిద్ధిం స్థాణుతీర్థప్రభావతః ॥30॥

విముక్తః కలుషైః సర్వైర్జగామ భవమందిరమ్ ।
రాజా పితృఋణైర్ముక్తః పరిపాల్య వసుంధరామ్ ॥31॥

పుత్రానుత్పాద్య ధర్మేణ కృత్వా యజ్ఞం నిరర్గలమ్ ।
దత్త్వా కామాంశ్చ విప్రేభ్యో భుక్త్వా భోగాన్ పృథగ్విధాన్ ॥32॥

సుహృదోఽథ ఋణైర్ముక్త్వా కామైః సంతర్ప్య చ స్త్రియః ।
అభిషిచ్య సుతం రాజ్యే కురుక్షేత్రం యయౌ నృపః ॥33॥

తత్ర తప్త్వా తపో ఘోరం పూజయిత్వా చ శంకరమ్ ।
ఆత్మేచ్ఛయా తనుం త్యక్త్వా ప్రయాతః పరమం పదమ్ ॥34॥

ఏతత్ప్రభావం తీర్థస్య స్థాణోర్యః శ్రుణుయాన్నరః ।
సర్వపాపవినిర్ముక్తః ప్రయాతి పరమాం గతిమ్ ॥35॥

సర్వలోకవంద్యుడైన పరమశివుడు ఇలా పలికి అందరు చూస్తూ ఉండగానే అక్కడే అంతర్హితుడయ్యాడు. ఆ కుక్కకు వెంటనే పూర్వజన్మ స్మృతి కలిగి, దివ్యదేహంతో రాజు ఎదుట నిలబడింది. అక్కడ వేనుని పుత్రుడు తీర్థస్నానం చేసి, తండ్రిని దర్శించాలనే కుతూహలంతో వచ్చి, కుటీరం శూన్యంగా ఉండడం చూసి, ఎంతో దుఃఖించాడు. అంతట మహాసంతోషంతో తన ఉత్తమపుత్రుని చూచి వేనుడిలా పలికాడు. "వత్సా! నీవంటి సత్పుత్రుని పొంది నేను నరకసముద్రంనుండి రక్షింపబడ్డాను. నీవు నాకు ప్రతినిత్యం చేసిన తీర్థజలాభిషేకం, ఈ మహనీయుని

(శ్వానం) అనుగ్రహం, ఈ తీర్థతీరనివాసం, స్థాణుదేవుని దర్శనానుగ్రహాల వల్ల పాపవిముక్తుడనై, స్వర్లోకానికి, శివలోకానికి వెళుతున్నాను". ఇట్లు రాజు కుమారునితోపలికి అచ్చట మహేశ్వరుని ప్రతిష్ఠించి, ఆ స్థాణుతీర్థంలో పుత్రునివలన ఉద్ధరింపబడిన వేనుడు సిద్ధిపొందాడు. కుక్కకూడా స్థాణుతీర్థ మహిమవలన సర్వ కలుషాలనుండి విముక్తిని పొంది, శివమందిరం చేరింది. ఆ రాజు కూడా ఆ విధంగా పితృఋణం తీర్చుకొని, భూమండలాన్ని చక్కగా పాలించి, ధర్మమార్గంలో పుత్రవంతుడై, నిర్విఘ్నంగా యజ్ఞాలను నిర్వహించి, బ్రాహ్మణుల కోర్కెలను తీర్చి, సమస్తసుఖాలు అనుభవించి, బంధుమిత్రులను ఋణవిముక్తులను గావించి, భార్యల కోర్కెలనన్నిటిని తీర్చి, తన కుమారునకు రాజ్యాభిషేకం గావించి, చివరకు కురుక్షేత్రానికి చేరాడు. ఆ పవిత్రక్షేత్రంలో ఘోరతపస్సు గావించి, శంకరుని పూజించి, స్వేచ్ఛతో శరీరం వదలి, పరమపదం చేరాడు. ఈ స్థాణుతీర్థప్రభావం, స్థాణ్వీశ్వరుని మహిమను శ్రద్ధగా శ్రవణం గావించినవారు సర్వపాపాలు వదలి పరమగతిని పొందుతారు.

ఇతి శ్రీవామన మహాపురాణే సరోమాహాత్మ్యే పులస్త్య నారద సంవాదే స్థాణుతీర్థప్రభావకథనం నామ అష్టచత్వారింశోఽధ్యాయః ॥48॥

శ్రీవామన మహాపురాణము నందలి సరోమాహాత్మ్యమందలి పులస్త్య నారదసంవాదంలోని స్థాణుతీర్థ ప్రభావ కథనమనే నలభైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనపంచాశత్తమోఽధ్యాయః - నలభైతొమ్మిదవ అధ్యాయం
స్థాణుతీర్థమాహాత్మ్యమ్ - స్థాణుతీర్థమాహాత్మ్యం

మార్కండేయ ఉవాచ - మార్కండేయమహర్షి పలికాడు.

చతుర్ముఖానాముత్పత్తిం విస్తరేణ మమానఘ ।
తథా బ్రహ్మేశ్వరాణాం చ శ్రోతుమిచ్ఛా ప్రవర్తతే ॥1॥

అనఘా! చతుర్ముఖాల ఉత్పత్తి అట్లే బ్రహ్మేశ్వరుల ఉత్పత్తిప్రకారం విశదంగా వినాలని కుతూహలంగా ఉన్నది. కాబట్టి నాకు వివరించండి.

సనత్కుమార ఉవాచ - సనత్కుమారమహర్షి పలికాడు.

శ్రుణు సర్వమశేషేణ కథయిష్యామి తేఽనఘ ।
బ్రహ్మణః స్రష్టుకామస్య యద్వృత్తం పద్మజన్మనః ॥2॥

ఉత్పన్న ఏవ భగవాన్ బ్రహ్మా లోకపితామహః ।
ససర్జ సర్వభూతాని స్థావరాణి చరాణి చ ॥3॥

పునశ్చిన్తయతః సృష్టిం జజ్ఞే కన్యా మనోరమా ।
నీలోత్పలదలశ్యామా తనుమధ్యా సులోచనా ॥4॥

తాం దృష్ట్వాభిమతాం బ్రహ్మా మైథునాయాజుహావ తామ్ ।
తేన పాపేన మహతా శిరోఽశీర్యత వేధసః ॥5॥

తేన శీర్ణేన స యయౌ తీర్థం త్రైలోక్య విశ్రుతమ్ ।
సాన్నిహిత్యం సరఃపుణ్యం సర్వపాపక్షయావహమ్ ॥6॥

ఓ నిష్పాపుడగు మార్కండేయా! పద్మసంభవుడైన బ్రహ్మ సృష్టిచేయదలచగా జరిగిన వృత్తాంతమంతయు విశదీకరిస్తాను. వినుము. లోక పితామహుడైన బ్రహ్మ పుట్టగానే సమస్తజీవులను, స్థావరాలను, జంగమాలను సృష్టించాడు. మరల సృష్టికి సంకల్పించి, నల్లకలువ రేకులవంటి నేత్రాలు, సన్నని నడుము కలిగి, మనోహరమైన చక్కని నేత్రాలు గల ఒక కన్యను సృష్టించాడు. ఆ బాలిక అందానికి ముగ్ధుడై తానే ఆమెను మైథునక్రీడకు ఆహ్వానించాడు. ఆ ఘోర పాపఫలంగా బ్రహ్మతల తెగిపోయింది. ఆ విధంగా తల తెగిన బ్రహ్మ త్రిలోకప్రసిద్ధము, సర్వపాప క్షయకరమునైన సాన్నిహిత్యపుణ్యసరస్సు వద్దకు వెళ్ళాడు.

తత్ర పుణ్యే స్థాణుతీర్థే ఋషిసిద్ధనిషేవితే ।
సరస్వత్యుత్తరే తీరే ప్రతిష్ఠాప్య చతుర్ముఖః ॥7॥

ఆరాధయామాస తదా ధూపైర్గంధైర్మనోరమైః ।
ఉపహారైస్తథా హృద్యైః రౌద్రసూక్తైర్దినేదినే ॥8॥

తస్యైవం భక్తియుక్తస్య శివపూజాపరస్య చ ।
స్వయమేవాజగామాథ భగవాన్నీలలోహితః ॥9॥

తమాగతం శివం దృష్ట్వా బ్రహ్మా లోకపితామహః ।
ప్రణమ్య శిరసా భూమౌ స్తుతిం తస్య చకార హ ॥10॥

అక్కడ ఋషిసిద్ధసేవితమైన పవిత్రస్థాణుతీర్థంలో సరస్వతీనదికి ఉత్తరాన చతుర్ముఖుడు శివుని ప్రతిష్ఠించి ధూపమనోహరగంధాలతో, హృద్యమైన ఉపాహారాలతో, రుద్రసూక్తపారాయణలతో, ప్రతిదినం ఆరాధించాడు. భక్తియుక్తుడైన ఆ శివపూజాదురంధరుని వద్దకు భగవంతుడైన నీలలోహితుడు స్వయంగా వచ్చాడు. ఆ విధంగా వచ్చిన శివుని చూసి లోకపితామహుడైన బ్రహ్మ భూమిపై సాష్టాంగప్రణామం చేసి ఇలా స్తోత్రం చేశాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

నమస్తేఽస్తు మహాదేవ భూతభవ్యభవాశ్రయ ।
నమస్తే స్తుతినిత్యాయ నమస్త్రైలోక్యపాలినే ॥11॥

నమః పవిత్రదేహాయ సర్వకల్మషనాశినే ।
చరాచరగురో గుహ్యగుహ్యానాం చ ప్రకాశకృత్ ॥12॥

రోగా న యాంతి భిషజైః సర్వరోగవినాశన ।
రౌరవాజినసంవీత వీతశోక నమోఽస్తు తే ॥13॥

వారికల్లోలసంక్షుబ్ధమహాబుద్ధివిఘట్టినే ।
త్వన్నామ జాపినో దేవ న భవంతి భవాశ్రయాః ॥14॥

నమస్తే నిత్యనిత్యాయ నమస్త్రైలోక్యపాలన ।
శంకరాయాప్రమేయాయ వ్యాధీనాం శమనాయ చ ॥15॥

పరాయాపరిమేయాయ సర్వభూతప్రియాయ చ ।
యోగేశ్వరాయ దేవాయ సర్వపాపక్షయాయ చ ॥16॥

నమః స్థాణ్వే ప్రసిద్ధాయ సిద్ధవందిస్తుతాయ చ ।
భూతసంసారదుర్గాయ విశ్వరూపాయ తే నమః ॥17॥

ఫణీంద్రోక్తమహిమ్నే తే ఫణీంద్రాంగదధారిణే ।
ఫణీంద్రవరహారాయ భాస్కరాయ నమో నమః ॥18॥

ఓ మహాదేవా! భూతభవ్యభవాశ్రయా! నీకు నమస్సులు. ఓ స్తుతినిత్యా!, త్రైలోక్యపాలకా! నీకు నమస్కారం. పవిత్రదేహా!, సర్వకల్మషనాశకా!, చరాచరగురో! రహస్యప్రత్యక్షవిషయాలనన్నిటిని తెలుపువాడా! నీకు నమస్కారం.

వైద్యులకసాధ్యమైన సకలరోగాలు నశింపజేయువాడా! రురుమృగచర్మధారీ!, శోకరహితా!, శివా! నీకు నమస్సులు. అజ్ఞానపు నీటికెరటాలు ఉవ్వెత్తుగా ఎగసి, జీవుల మహాబుద్ధిని కల్లోలపరచి చెదరగొట్టినప్పుడు దానిని స్థిరంగా నిలిపి రక్షించేవాడా!, దేవా! నీ నామం జపించువారు సంసారంలో చిక్కుకొనరు. నిత్యులలో నిత్యుడా!, త్రిలోకపాలకా!, శంకరా!, అప్రమేయా!, వ్యాధినాశకా!, పరా!, అపరిమేయా!, సర్వజీవప్రియా!, యోగేశ్వరా!, దేవా!, సర్వపాపక్షయకరా!, నీకు నమస్సులు. స్థాణునకు, ప్రసిద్ధునకు, సిద్ధుల వందిమాగధులచే స్తుతింపబడువానికి సంసారంలోని జీవులకు దుర్గమమైన విశ్వరూపునకు నమస్సులు. సర్పరాజులచేత వర్ణింపబడే మహిమలు కలవాడా!, సర్పరాజులనే కంకణాలుగా ధరించినవాడా!, సర్పాల మాలలను ధరించినవాడా!, భాస్కరా! నీకు అనేక నమస్సులు.

ఏవం స్తుతో మహాదేవో బ్రహ్మాణం ప్రాహ శంకరః ।
న చ మన్యుస్త్వయా కార్యో భావిన్యర్థే కదాచన ॥19॥

పురా వరాహకల్పే తే యన్మయాఽపహతం శిరః ।
చతుర్ముఖం చ తదభూన్నకదాచిన్నశిష్యతి ॥20॥

అస్మిన్ సన్నిహితే తీర్థే లింగాని మమ భక్తితః ।
ప్రతిష్ఠాయ విముక్తస్త్వం సర్వపాపైర్భవిష్యసి ॥21॥

సృష్టికామేన చ పురా త్వయాఽహం ప్రేరితః కిల ।
తేనాహం త్వాం తథేత్యుక్త్వా భూతానాం దేశవర్తివత్ ॥22॥

దీర్ఘకాలం తపస్తప్త్వా మగ్నః సంనిహితే స్థితః ।
సుమహాన్తం తతః కాలం త్వం ప్రతీక్షాం మమాకరోః ॥23॥

స్రష్టారం సర్వభూతానాం మనసా కల్పితం త్వయా ।
సోఽబ్రవీత్ త్వాం తదా దృష్ట్వా మాం మగ్నం తత్ర చాంభసి ॥24॥

ఈ విధంగా స్తుతించిన బ్రహ్మతో శంకరుడిలా పలికాడు. "పితామహా! భవిష్యత్తులో జరుగబోవు కార్యాలకు నీవు చింతించనవసరం లేదు. పూర్వం వరాహకల్పంలో నీ తలలలో ఒకదానిని నేను సంహరించాను. అంతట నీకు నాలుగు తలలే మిగిలాయి. అవిఎన్నడూ నశించవు. ఈ సాన్నిహిత్యతీర్థంలో భక్తితో నా లింగస్థాపన చేసినచో సర్వపాపాలనుండి ముక్తుడవు కాగలవు. ప్రాచీనకాలంలో సృష్టిచేయు కోరికతో నీవు నన్ను ప్రేరేపించగానే అట్లేయని సన్నిహిత సరస్సులో మునిగి, చిరకాలం తపస్సు గావింపగా నీవు నా కొరకు చాలాకాలం ప్రతీక్షించావు. అంతట నీవు సంకల్పమాత్రాన పుట్టించిన సృష్టికర్త నీతో నన్ను తాను నీళ్ళలో మునిగియుండగా చూశానని చెప్పాడు.

యది మే నాగ్రజస్త్వన్యస్తతః స్రక్ష్యామ్యహం ప్రజాః ।
త్వయైవోక్తశ్చ నైవాస్తి త్వదన్యః పురుషోఽగ్రజః ॥25॥
స్థాణురేష జలే మగ్నో వివశః కురు మద్ధితమ్ ।
స సర్వభూతానసృజద్ దక్షాదీంశ్చ ప్రజాపతీన్॥26॥

యైరిమం ప్రకరోత్ సర్వం భూతగ్రామం చతుర్విధమ్ ।
తాః సృష్టమాత్రాః క్షుధితాః ప్రజాః సర్వాః ప్రజాపతిమ్ ॥27॥

భిభక్షయిషవో బ్రహ్మన్ సహసా ప్రాద్రవంస్తథా ।
సభక్ష్యమాణస్త్రాణార్థీ పితామహముపాద్రవత్ ॥28॥

అథాసాం చ మహోవృత్తిః ప్రజానాం సంవిధీయతాన్ ।
దత్తం తాభ్యస్త్వయా హ్యన్నం స్థావరాణాం మహౌషధీః ॥29॥

జంగమాని చ భూతాని దుర్బలాని బలీయసామ్ ।
విహితాన్నాః ప్రజాః సర్వాః పునర్జగ్ముర్యథాగతమ్ ॥30॥

తతో వవృధిరే సర్వాః ప్రీతియుక్తాః పరస్పరమ్ ।
భూతగ్రామే వివృద్ధే తు తుష్టే లోకగురౌ త్వయి ॥31॥

తనకంటె పెద్దవారు లేనిచో తాను ప్రజాసృష్టి చేస్తాననగా అప్పుడు నీవు ఆతనితో నీకంటే జ్యేష్ఠులెవరు లేరు. ఇక్కడ స్థాణువు విధి లేక నీటిలో పడియున్నాడు కాబట్టి నీవు నాకు హితం చేయవలెనని కోరావు. అంతట అతడు సకల జీవరాశులను, దక్షుడు మున్నగు ప్రజాపతులను సృష్టించాడు. వారు జీవులనందరిని నాల్గు విధాలుగా విభజించారు. అలా సృష్టింపబడిన వెంటనే ఆ ప్రజలంతా ఆకలితో అలమటిస్తూ, ప్రజాపతిని భక్షించడానికి పరుగెత్తారు. ఆ ప్రజాపతి తన ప్రాణాలను కాపాడుకోవడానికి పితామహునివద్దకు పరుగుతీసి, ఈ జీవరాసుల జీవిత విధానాన్ని నిర్ణయించమని కోరాడు. అప్పుడు నీవు వారలకు భోజన విధానం ఏర్పాటు చేశావు. స్థావరములకు మహౌషధములను భోజనంగా చేశావు. జంగమజీవులలో బలవంతులకు దుర్బలులను తిండిగా నియమించావు. ఈ విధంగా జీవరాశులన్నియు తమతమ అన్నవిధానాన్ని తెలుసుకొని, ఆ వచ్చినవారంతా తమ తమ స్థానాలకు తిరిగి వెళ్ళారు. అప్పటినుండి జీవులన్నియు పరస్పరం ప్రేమతో వర్ధిల్లాయి. ఆ విధంగా సృష్టి వృద్ధి పొందడం చూసి లోకగురువు నీయందు సంతుష్టి చెందాడు.

సముత్తిష్ఠన్ జలాత్ తస్మాత్ ప్రజాః సందృష్టవానహమ్ ।
తతోఽహం తాః ప్రజా దృష్ట్వా విహితాః స్వేన తేజసా ॥32॥

క్రోధేన మహతా యుక్తో లింగముత్పాట్య చాక్షిపమ్ ।
తత్ క్షిప్తం సరసో మధ్యే ఊర్ధ్వమేవ యదా స్థితమ్ ॥33॥

తదా ప్రభృతి లోకేషు స్థాణురిత్యేష విశ్రుతః ।
సకృద్ దర్శనమాత్రేణ విముక్తః సర్వకిల్బిషైః ॥34॥

ప్రయాతి మోక్షం పరమం యస్మాన్నావర్తతే పునః ।
యశ్చేహ తీర్థే నివసేత్ కృష్ణాష్టమ్యాం సమాహితః ॥35॥

స ముక్తః పాతకైః సర్వైరగమ్యాగమనోద్భవైః ।
ఇత్యుక్త్వా భగవాన్దేవస్తత్రైవాన్తరధీయత ॥36॥

అంతట నేను జలమధ్యం నుండి బయటకువచ్చి, ఆ ప్రజలను చూసి, వారిని నా తేజస్సుతో నింపాను. తీవ్రమైన కోపంతో నా లింగాన్ని పెరికి, సరస్సు మధ్యకు విసిరివేశాను. అది నీటిలో నిటారుగా పైకి నిలబడడంతో నాటినుండి ఇది లోకంలో స్థాణులింగంగా విఖ్యాతమయ్యింది. దానిని ఒక్కమారు దర్శించినను అన్ని పాపాలు తొలగిపోతాయి. పునరావృత్తిరహితమైన మోక్షం ప్రాప్తిస్తుంది. ఈ తీర్థంలో కృష్ణపక్ష అష్టమినాడు నిర్మలచిత్తంతో నివసించినచో పరదారగమన, గురుతల్పగతాది సమస్తపాతకాలనుండి ముక్తుడౌతాడని తెలియజేసి, మహాదేవుడు అక్కడనే అంతర్హితుడయ్యాడు.

బ్రహ్మో విశుద్ధపాపస్తు పూజ్యం దేవం చతుర్ముఖమ్ ।
లింగాని దేవదేవస్య ససృజే సరమధ్యతః ॥ 37॥

ఆద్యం బ్రహ్మసరః పుణ్యం హరిపార్శ్వే ప్రతిష్ఠితమ్ ।
ద్వితీయం బ్రహ్మసదనం స్వకీయే హ్యాశ్రమే కృతమ్ ॥38॥

తస్యైవ పూర్వదిగ్భాగే తృతీయం చ ప్రతిష్ఠితమ్ ।
చతుర్థం బ్రహ్మణా లింగం సరస్వత్యాస్తటే కృతమ్ ॥39॥

ఏతాని బ్రహ్మతీర్థాని పుణ్యాని పావనాని చ ।
యే పశ్యన్తి నిరాహారాస్తే యాన్తి పరమాం గతిమ్ ॥40॥

కృతేయుగే హరేః పార్శ్వే త్రేతాయాం బ్రహ్మణాశ్రమే ।
ద్వాపరే తస్య పూర్వేణ సరస్వత్యాస్తటే కలౌ ॥41॥

ఏతాని పూజయిత్వా చ దృష్ట్వా భక్తిసమన్వితాః ।
విముక్తాః కలుషైః సర్వైః ప్రయాన్తి పరమాం గతిమ్ ॥42॥

సృష్టికాలే భగవతా పూజితస్తు మహేశ్వరః ।
సరస్వత్యుత్తరే తీరే నామ్నా ఖ్యాతశ్చతుర్ముఖః ॥43॥

తం ప్రణమ్య శ్రద్దధానో ముచ్యతే సర్వకిల్బిషైః ।
లోలాసంకరసంభూతైస్తథా వై భాండసంకరైః ॥44॥

తథైవ ద్వాపరే ప్రాప్తే స్వాశ్రమే పూజ్య శంకరమ్ ।
విముక్తో రాజసైర్భావైర్వర్ణసంకరసంభవైః ॥45॥

తతః కృష్ణచతుర్దశ్యాం పూజయిత్వా తు మానవః ।
విముక్తః పాతకైః సర్వైరభోజ్యస్యాన్నసంభవైః ॥46॥

అంతట పాపవిముక్తుడైన బ్రహ్మ చతుర్ముఖభవుని పూజించి, ఆ దేవదేవుని లింగాలను సరోవరం మధ్యన ప్రతిష్ఠించాడు. అందులో మొదటిది హరిపార్శ్వాన ప్రతిష్ఠింపబడిన మహాపుణ్యలింగం. బ్రహ్మసరం రెండవది. తన ఆశ్రమంలోనే నెలకొల్పిన బ్రహ్మసదనం. దానికి తూర్పుగా మూడవలింగం ప్రతిష్ఠించాడు. నాల్గవదైన బ్రహ్మలింగం సరస్వతీతీరాన స్థాపించాడు. ఈ నాలుగు బ్రహ్మతీర్థాలు పరమపవిత్రాలు. ఉపవసించి వీనిని దర్శించినవారికి పరమగతి లభిస్తుంది. కృతయుగంలో హరిపార్శ్వంలో వున్న లింగాన్ని, త్రేతాయుగంలో బ్రహ్మ ఆశ్రమంలోని లింగాన్ని, ద్వాపరంలో దానికి తూర్పున ఉన్నదాన్ని, కలియుగంలో సరస్వతీనదీతీరంలోనున్న లింగాన్ని భక్తితో దర్శించి అర్చిస్తే సర్వపాపాలు తొలగి, పరమగతి లభిస్తుంది. సృష్ట్యాదిలో భగవంతుడు సరస్వతి ఉత్తరతీరాన పూజించిన మహేశ్వరలింగానికి చతుర్ముఖ లింగమని పేరు. దానికి శ్రద్ధాభక్తులతో నమస్కరిస్తే సమస్తకిల్బిషాలనుండి ముక్తులౌతారు. కామపశుప్రవృత్తితో గావించిన వర్ణాంతరసంగమదోషాలు, దూషితాన్నం భుజించిన దోషం తొలగిపోతాయి. అదే విధంగా ద్వాపరయుగంలో శంకరుని ఆయన ఆశ్రమంలోనే పూజిస్తే రజోగుణసముద్భూతమైన వర్ణసంకరదోషాలు తొలగి పోతాయి. ఇక ప్రతి కృష్ణపక్షచతుర్దశినాడు (మాసశివరాత్రి) శంకరుని పూజించిన మానవుడు తినకూడని పదార్థాలు తిన్నందున సంభవించిన పాపాలనుండి, పాతకాలనుండి విముక్తుడౌతాడు.

కలికాలే తు సంప్రాప్తే వసిష్ఠాశ్రమమాస్థితః ।
చతుర్ముఖం స్థాపయిత్వా యయౌ సిద్ధిమనుత్తమామ్ ॥47॥

తత్రాపి యే నిరాహారాః శ్రద్దధానా జితేంద్రియాః ।
పూజయన్తి మహాదేవం తే యాన్తి పరమం పదమ్ ॥48॥

ఇత్యేతత్ స్థాణుతీర్థస్య మాహాత్మ్యం కీర్తితం తవ ।
యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముక్తో భవతి మానవః ॥49॥

కలియుగంరాగా బ్రహ్మ వసిష్ఠాశ్రమంలో ఉండి, చతుర్ముఖలింగాన్ని స్థాపించి, ఉత్తమసిద్ధిని పొందాడు. అక్కడ కూడా ఎవరు శ్రద్ధాభక్తులతో, నిరాహారులై, జితేంద్రియులై, ఆ మహాదేవుని పూజిస్తారో వారు పరమపదాన్ని పొందుతారు. ఈ విధంగా నీకు స్థాణుతీర్థమాహాత్మ్యాన్ని సమగ్రంగా వివరించాను. దీనిని ఏమానవుడు వింటాడో అతడు కూడా సమస్తపాపాలనుండి విముక్తుడై ముక్తిని పొందుతాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే సరోమాహాత్మ్యే స్థాణుతీర్థ మాహాత్మ్యం నామ ఏకోనపంచాశత్తమోఽధ్యాయః ॥49॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని సరోమాహాత్మ్యమందలి స్థాణుతీర్థమాహాత్మ్యం అనే నలబైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



పంచాశత్తమోஉధ్యాయః - యాభైయవ అధ్యాయం
ఉమాసంభవే కురుక్షేత్రమాహాత్మ్యమ్ - ఉమాసంభవంలో కురుక్షేత్రమాహాత్మ్యం

సనత్కుమార ఉవాచ - సనత్కుమార మహర్షి పలికాడు.

తతోஉబ్రవీద్దేవవరస్తు తీర్థం యస్మాద్భవానేకతయా ప్రయాతి ।
పృథూదకేత్యేవ చ నామ తుభ్యం భవిష్యతే తీర్థవరః పృథివ్యాః ॥1॥

అంతట దేవదేవుడు ఈ భూమండలంలో తీర్థవరంగా పృథూదకనామంతో ప్రసిద్ధి చెందిన తీర్థానికి వెళ్ళవలసినదిగా దేవతలతో ఈవిధంగా పలికాడు.

ఏవం పృథూదకం దేవాః పుణ్యం పాపభయాపహమ్ ।
తత్ గచ్ఛధ్వం మహాతీర్థం యావత్సన్నిధిబోధితమ్ ॥2॥

ఈ విధంగా పృథూదకక్షేత్రం పుణ్యము, పాపభయనివారకం. కావున దేవతలారా! మీరు దానిసాన్నిధ్యాన్ని తెలుసుకొని అక్కడకు వెళ్ళింది.

యదా మృగశిరో ఋక్షే శశిసూర్యౌ బృహస్పతిః ।
తిష్ఠన్తి సా తిథిః పూర్వాత్వక్షయా పరిగీయతే ॥3॥

మృగశిర నక్షత్రంలో సూర్యచంద్రబృహస్పతులు చేరిన పవిత్రతిథి అక్షయ అని పరిగణింపబడుతుంది.

తం గచ్ఛధ్వం సురశ్రేష్ఠా యత్ర ప్రాచీసరస్వతీ ।
పితౄనారాధయధ్వం చ తత్ర శ్రాద్ధేన భక్తితః ॥4॥

ఎక్కడ సరస్వతి తూర్పుగా ప్రవహించుచున్నదో అక్కడకు వెళ్ళి, భక్తితో శ్రాద్ధకర్మ నిర్వర్తించి, పితరులను ఆరాధించండి.

తతో మురారివచనం శ్రుత్వా దేవాః సవాసవాః ।
సమాజగ్ముః కురుక్షేత్రే పుణ్యం తీర్థం పృథూదకమ్ ॥5॥

మురారి చెప్పిన ఈ హితోక్తులు విని, ఇంద్రునితో కలిసి, దేవతలందరు కురుక్షేత్రంలోని పావనపృథూదక తీర్థానికి వెళ్ళారు.

తత్ర స్నాత్వా సురాస్సర్వే బృహస్పతిమచోదయన్ ।
వివస్వన్ భగవన్ ఋక్షమిమం మృగశిరం కురు ॥6॥

పుణ్యాం తిథిం పాపహరాం తవ కాలోయஉమాగతః ।
ప్రవర్తతే రవిస్తత్ర చంద్రమాஉపి విశత్యసౌ ॥7॥

తవాయత్తం గురో కార్యం సురాణాం తత్కురుష్వ చ ।
ఇత్యేవముక్తో దేవైస్తు దేవాచార్యోஉబ్రవీదిదమ్ ॥8॥

అక్కడ స్నానం చేసి దేవతలు బృహస్పతిని ఇలా ప్రార్థించారు. "మహాత్మా! మృగశిరానక్షత్రంలో ప్రవేశించి, ఈ తిథిని పాపవినాశకమైన పవిత్రతిథిగా గావించండి. మీరు ఈవిధంగా నిర్దిష్టం చేయవలసిన సమయం ఆసన్నమైనది. సూర్యుడు ఆ స్థానంలోనే ఉన్నాడు. అట్లే చంద్రుడు కూడా ఇందులో ప్రవేశిస్తున్నాడు. ఓ గురుదేవా! దేవతల కార్యమంతా నీ మీద ఆధారపడియున్నది. దానిని మీరు పూర్తిగావించండని పలికిన దేవతలతో దేవగురుడైన బృహస్పతి ఇలా పలికాడు.

యది వర్షాధిపోఽహం స్యాం తతో యాస్యామి దేవతాః ।
బాఢమూచుః సురాః సర్వే తతోఽసౌ ప్రాక్రమన్మృగమ్ ॥9॥

ఆషాఢే మాసి మార్గర్క్షే చంద్రక్షయతిథిర్హి యా ।
తస్యాం పురందరః ప్రీతః పిండం పితృషు భక్తితః ॥10॥

ప్రాదాత్తిలమధూన్మిశ్రం హవిష్యాన్నం కురుష్వథ ।
తతః ప్రీతాస్తు పితరస్తాం ప్రాహుస్తనయాం నిజామ్ ॥11॥

మేనాం దేవాశ్చ శైలాయ హిమయుక్తాయ వై దదుః ।
తాం మేనాం హిమవాన్ లబ్ధ్వా ప్రసాదాద్దైవతేష్వథ ।
ప్రీతిమానభవచ్చాసౌ రరామ చ యథేచ్ఛయా ॥12॥

తతో హిమాద్రిః పితృకన్యయా సమం సంతర్పయన్వై విషయాన్యథేష్టమ్ ।
అజీజనత్సా తనయాశ్చ తిస్రో రూపాతియుక్తాః సురయోషితస్తు ॥13॥

దేవతలారా! ఈ సంవత్సరానికి నన్ను అధిపతిని చేసినచో నేను మృగశిరానక్షత్రంలో ప్రవేశిస్తానని బృహస్పతి పలుకగా దానికి దేవతలందరు అంగీకరించారు. అంతట బృహస్పతి మృగశిరానక్షత్రంలో ప్రవేశించాడు. ఆషాఢమాసం లో మృగశిరానక్షత్రయుక్త అమావాస్యనాడు దేవేంద్రుడు ప్రీతిపూర్వకంగా కురుక్షేత్రంలో పితరులకు తిలమధూసమ్మిశ్రిత హవిష్యాన్నంతో పిండప్రదానం చేశాడు. అందులకు సంతుష్టులై, పితృదేవతలు తన కుమార్తెయైన మేనాదేవిని హిమవంతునితో వివాహం చేయడానికి దేవతలకు అప్పగించారు. దేవతలు ప్రసాదరూపంలో స్వీకరించిన ఆ మేనాదేవిని హిమవంతునకు అప్పగించగా ఆమెతో ఇష్టసుఖాలను అనుభవించాడు. ఆ విధంగా హిమవంతుడు పితృకన్యయైన మేనాదేవికి యథేచ్ఛగా విషయసుఖాలతో సంతృప్తిని కలిగించాడు. ఆ మేనాదేవి దేవకన్యలతో సమానమైన సుందరీమణులైన ముగ్గురుకుమార్తెలకు జన్మనిచ్చింది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే ఉమాసంభవే కురుక్షేత్ర మాహాత్మ్యం నామ పంచాశత్తమోఽధ్యాయః ॥50॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్యనారదసంవాదంలోని ఉమాసంభవమందలి కురుక్షేత్రమాహాత్మ్యమనే యాభైయవ అధ్యాయం సమాప్తం.

ఏకపంచాశత్తమోఽధ్యాయః - యాభైఒకటవ అధ్యాయం

ఉమాసంభవే మందరగిరిప్రవేశః - ఉమాసంభవంలో శంకరుడు మందరగిరికి చేరుట

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

మేనాయాః కన్యకాస్తిస్రో జాతా రూపగుణాన్వితాః ।
సునాభ ఇతి చ ఖ్యాతశ్చతుర్థస్తనయోఽభవత్ ॥1॥

ఆ మేనాదేవి గుణసంపన్నులైన ముగ్గురుకుమార్తెలను, సునాభుడని ఖ్యాతిగాంచిన ఒక పుత్రుని ప్రసవించింది.

రక్తాంగీ రక్తనేత్రా చ రత్నాంబరవిభూషితా ।
రాగిణీ నామ సంజాతా జ్యేష్ఠా మేనాసుతా మునే ॥2॥

ఓ నారదమునీ! ఎర్రని శరీరకాంతి కలిగినట్టియు, ఎర్రని నేత్రాలతో, రక్తాంబరములతో విభూషితమైన రాగిణి అను పేరుగల పుత్రిక మేనాదేవి పెద్దకుమార్తె.

శుభాంగీ పద్మపత్రాక్షీ నీలకుంజితమూర్ధజా ।
శ్వేతమాల్యాంబరధరా కుటిలా నామ చాపరా ॥3॥

శుభాంగియు, పద్మపత్రాక్షియు, నల్లని నొక్కుల జుత్తుతో ప్రకాశించునట్టియు, శ్వేతమాల్యాంబరములు ధరించినట్టియు కుటిల మేనాదేవి మరియొక కుమార్తె.

నీలాంజనచయప్రఖ్యా నీలేందీవరలోచనా ।
రూపేణానుపమా కాళీ జఘన్యా మేనకా సుతా ॥4॥

నల్లని కాటుకవంటి దేహకాంతితో విరాజిల్లునదియు, నల్లని కలువలవంటి కన్నులు కలదియు, చక్కని జఘనసౌందర్యం కలదియు, అనుపమమైన అందంతో ప్రకాశించునదియునగు కాళి మేనకాదేవి మూడవకుమార్తె.

జాతాస్తాః కన్యకాస్తిస్రః షడబ్దాత్ పరతో మునే ।
కర్తుం తపః ప్రయాతాస్తా దేవాస్తా దదృశుః శుభాః ॥5॥

ఓ నారదమహర్షీ! ఆ ముగ్గురు కుమార్తెలు పుట్టిన ఆరేండ్ల తరువాత తపస్సు చేయనారంభించారు. ఆ శుభాంగనలను దేవతలు చూచారు.

తతో దివాకరైః సర్వైర్వసుభిశ్చ తపస్వినీ ।
కుటిలా బ్రహ్మలోకం తు నీతా శశికరప్రభా ॥6॥

అంతట చంద్రకిరణాల శోభతో వెలుగొందే కుటిల అను కన్యను ఆదిత్యులు, వసువులు బ్రహ్మలోకానికి తీసుకొనిపోయారు.

అథోచుర్దేవతాః సర్వాః కింత్వియం జనయిష్యతి ।
పుత్రం మహిషహన్తారం బ్రహ్మన్ వ్యాఖ్యాతుమర్హసి ॥7॥

దేవతలందరు బ్రహ్మతో ఇలా పలికారు. "ఓ బ్రహ్మదేవా! ఈమె మహిషాసురుని చంపగల పుత్రునకు జన్మనీయగలదా? తెలియజేయండి." అని పలికారు.

తతోఽబ్రవీత్ సురపతిర్నేయం శక్తా తపస్వినీ ।
శార్వం ధారయితుం తేజో వరాకీ ముచ్యతాం త్వియమ్ ॥8॥

అందులకు బ్రహ్మ "ఈ తపస్విని శివవీర్యాన్ని భరింపగలిగిన శక్తికలిగినది కాదు. కావున ఈ చిన్నదానిని వదలిపెట్టండి". అని దేవతలతో పలికాడు.

తతస్తు కుటిలా క్రుద్ధా బ్రహ్మాణం ప్రాహ నారద ।
తథా యతిష్యే భగవన్ యథా శార్వం సుదుర్ధరమ్ ॥9॥

ధారయిష్యామ్యహం తేజస్తథైవ శృణు సత్తమ ।
తపసాహం సుతప్తేన సమారాధ్య జనార్దనమ్ ॥10॥

యథా హరస్య మూర్ధానం నమయిష్యే పితామహ ।
తథా దేవ కరిష్యామి సత్యం సత్యం మయోదితమ్ ॥11॥

బ్రహ్మ మాటలకు కోపించిన కుటిల బ్రహ్మతో "భగవాన్! నేను జనార్దనునిగూర్చి తీవ్రమైన తపస్సు చేసి, శివవీర్యం ధరించగల శక్తిని సంపాదించి, శివుని పాదాక్రాంతుని చేసుకోగలను. ఓ పితామహా! నేను ఆవిధంగా చేయగలను. అందులకు తీవ్రంగా ప్రయత్నించగలను. నేను పలికినది ముమ్మాటికి సత్యం". అని పలికింది.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తతః పితామహః క్రుద్ధః కుటిలాం ప్రాహ దారుణామ్ ।
భగవానాదికృద్బ్రహ్మా సర్వేశోఽపి మహామునే ॥12॥

ఓ మహామునీ! కుటిల మాటలు విని, బ్రహ్మ దారుణమైన కోపాన్ని పొంది ఇలా పలికాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

యస్మాన్మద్వచనం పాపే న క్షాన్తం కుటిలే త్వయా ।
తస్మాన్మచ్ఛాపనిర్దగ్ధా సర్వాస్వాపో భవిష్యసి ॥13॥

పాపిష్ఠమైన కుటిలా! నా హితవాక్యాలను ధిక్కరించినందులకు నిన్ను నా శాపాగ్నితో దహిస్తాను. నీవు తక్షణమే నీరుగా మారిపోదువుగాక! అని బ్రహ్మ కుటిలను శపించాడు.

ఇత్యేవం బ్రహ్మణా శప్తా హిమవద్దుహితా మునే ।
ఆపోమయీ బ్రహ్మలోకం ప్లావయామాస వేగినీ ॥14॥

"ఓ నారదమునీ! ఈ విధంగా బ్రహ్మశాపానికి గురైన కుటిల నీరుగా మారి, బ్రహ్మలోకాన్ని ముంచివేయ బోయింది.

తాముద్ధతజలాం దృష్ట్వా ప్రబబంధ పితామహః ।
ఋక్సామాథర్వయజుర్భిర్బంధనైః సర్వతో దృఢమ్ ॥15॥

ఆవిధంగా ఉద్ధతమైన జలాన్ని చూసి పితామహుడు ఋగ్యజుస్సామాథర్వణ వేదాలతో ఆమెను గట్టిగా బంధించాడు.

సా బద్ధా సంస్థితా బ్రహ్మంస్తత్రైవ గిరికన్యకా ।
ఆపోమయీ ప్లావయన్తీ బ్రహ్మణో విమలాలయమ్ ॥16॥

ఆమె కూడా బ్రహ్మదేవుని జటామండలాన్ని తడుపుతూ అక్కడే ఉండిపోయింది. బ్రహ్మలోకాన్ని కూడా తడుపుతూ ఉండిపోయింది.

యా సా రాగవతీ నామ సాఽపి నీతా సురైర్దివమ్ ।
బ్రహ్మణే తాం నివేద్యైవ తామప్యాహ ప్రజాపతిః ॥17॥

అంతట **రాగిణి** అను బాలికను కూడా దేవతలు బ్రహ్మవద్దకు తీసుకొనిపోగా ఆ బాలిక కూడా శివవీర్య ధారణకు అనర్హురాలని ఆయన తెలియజేశాడు.

సాఽపి క్రుద్ధాఽబ్రవీచ్చైనం తథా తప్స్యే మహత్తపః ।
యథా మన్నామసంయుక్తో మహిషఘ్నో భవిష్యతి ॥18॥

ఆమె కూడా కోపించి ఇలా పలికింది. "నేను నిశ్చయంగా కఠినమైన తపస్సు చేస్తాను. దానితో నా పేరుతో కూడిన పుత్రుడే మహిషుని సంహరింపగలడు" అని పలికింది.

తాం శశాపాథ స బ్రహ్మా సంధ్యారాగో భవిష్యతి ।
యా మద్వాక్యమలంఘ్యం వై సురైర్లంఘయసే బలాత్ ॥19॥

అంతట బ్రహ్మ ఆమెను కూడా ఇలా శపించాడు. "పాపాత్మురాలా! నా మాటలను దేవతలు కూడా ఉల్లంఘింపలేరు. నీవు అట్టి నా మాటలను అహంకారంతో పరిగణించడం లేదు. కావున నీవు సంధ్యవు కాగలవు" అని శపించాడు.

సాఽపి జాతా మునిశ్రేష్ఠ సంధ్యా రాగవతీ తతః ।
ప్రతీచ్ఛన్ కృత్తికాభాగే శైలేయ్యా విగ్రహం దృఢమ్ ॥20॥

మునిశ్రేష్ఠా! తదనంతరం ఆ శైలతనయయైన రాగవతి (రాగిణి) సంధ్యగా పిలవబడుతోంది. అంతేగాక ఆరోగ్యవంతమైన, దృఢమైన శరీరాన్ని ధరించి ఆ పర్వతంపై కృత్తికాయోగం కొరకు ఎదురుచూడసాగింది.

తతో గతే కన్యకే ద్వే జ్ఞాత్వా మేనా తపస్వినీ ।
తపసో వారయామాస ఉమేత్యేవాబ్రవీచ్చ సా ॥21॥

ఆ విధంగా తన కుమార్తెలిరువురు తన చేతినుండి జారిపోవడం చూసిన మేనాదేవి మూడవకుమార్తెయైన కాళిని చూసి, ఉ-మా (అమ్మా! నీవు తపస్సు చేయవద్దు) అని నివారించింది.

తదేవ మాతా నామాస్యాశ్చక్రే పితృశ్రుతా శుభా ।
ఉమేత్యేవ హి కన్యాయాః సా జగామ తపోవనమ్ ॥22॥

ఆనాటినుండి ఆ తల్లి ఆ బిడ్డను **ఉమా** అని సంబోధింపసాగింది. అంతట ఉమ అనబడే ఆ కన్య తపోవనానికి వెళ్ళింది.

తతః సా మనసా దేవం శూలపాణిం వృషధ్వజమ్ ।
రుద్రం చేతసి సంధార్య తపస్తేపే సుదుష్కరమ్ ॥23॥

అక్కడ ఆమె తన మనస్సులో శూలపాణి, వృషధ్వజుడునైన రుద్రుని సంధానించుకొని ఘోరమైన తపోదీక్షలో మునిగిపోయింది.

తతో బ్రహ్మాఽబ్రవీద్దేవాన్ గచ్ఛధ్వం హిమవత్సుతామ్ ।
ఇహానయధ్వం తత్కాలం తపస్యంతీం హిమాలయే ॥24॥

అంతట బ్రహ్మ హిమాలయాలపై తపస్సు గావించుచున్న హిమగిరిపుత్రియైన కాళిని ఇక్కడకు తీసుకు రావలసినదిగా దేవతలతో చెప్పాడు.

తతో దేవాః సమాజగ్ముర్దదృశుః శైలనందినీమ్ ।
తేజసా విజితాస్తస్యా న శేకురుపసర్పితుమ్ ॥25॥

అంతట దేవతలందరు శైలనందినిని తీసుకొని వచ్చుటకు హిమాలయానికి వెళ్ళగా ఆమె తపోగ్నికి భయపడి ఆమె దగ్గరకు కూడా వెళ్ళలేకపోయారు.

ఇంద్రో మరుద్గణైః సార్ధం నిర్ధూతస్తేజసా తయా ।
బ్రహ్మణోఽధికతేజోఽస్యా వినివేద్య ప్రతిష్ఠితః ॥26॥

ఆమె ముందర మరుద్గణాలతో కూడిన ఇంద్రుడు కూడా తన తేజస్సును కోల్పోయి ఆమె తేజస్సు బ్రహ్మతేజాన్ని కూడా మించినదని వక్కాణించాడు.

తతో బ్రహ్మాఽబ్రవీద్దేవాన్ ధ్రువం శంకరవల్లభా ।
యూయం సతేజసో నూనం విక్షిప్తాస్తు హతప్రభాః ॥27॥

తస్మాద్వ్రజధ్వం స్వం స్వం హి స్థానం భో విగతజ్వరాః ।
సతారకం హి మహిషం విదధ్వం నిహతం రణే ॥28॥

అది విని బ్రహ్మ "మిమ్ములనందరిని తన తేజస్సుతో నిర్జించిన ఆ బాలికయే శంకరవల్లభ. ఇది సత్యం. కావున మీరందరు మీ మీ చింతలు మాని, మీ మీ స్థానాలకు వెళ్ళండి. తారకాసురునితోబాటు మహిషాసురుడు కూడా యుద్ధంలో చంపబడినాడని నమ్మండి" అని దేవతలతో పలికాడు.

ఇత్యేవముక్తా దేవేన బ్రహ్మణా సేంద్రకాః సురాః ।
జగ్ముః స్వాన్యేవ ధిష్ణ్యాని సద్యో వై విగతజ్వరాః ॥ 29॥

బ్రహ్మదేవుడు ఇట్లు పలుకగా ఇంద్రాది దేవతలందరు భయాందోళనలు వదలి, తమ తమ నివాసాలకు వెళ్ళారు.

ఉమామపి తపస్యన్తీం హిమవాన్ పర్వతేశ్వరః ।
నివర్త్య తపసస్తస్మాత్ సదారో హ్యనయద్ గృహాన్ ॥30॥

అంతట తపస్సు చేస్తున్న ఉమను కూడా పర్వతేశ్వరుడు భార్యతో కూడి వెళ్ళి, వారించి ఇంటికి తీసుకువెళ్ళాడు.

దేవోఽప్యాశ్రిత్య తద్రౌద్రం వ్రతం నామ నిరాశ్రయమ్ ।
విచచార మహాశైలాన్మేరుప్రాగ్ర్యాన్మహామతిః ॥31॥

ఆ దినాలలో శంకరుడు నిరాశ్రయమనే కఠోరతపస్సులో మునిగి, మేరువు మొదలైన మహాశైలాలలో తిరుగసాగాడు.

స కదాచిన్మహాశైలం హిమవన్తం సమాగతః ।
తేనార్చితః శ్రద్ధయాఽసౌ తాం రాత్రిమవసద్ధరః ॥32॥

అతడు ఒకసారి మహాశైలమైన హిమవన్తానికి వచ్చాడు. హిమవంతుడు ఆతనిని యథావిధిగా, శ్రద్ధగా అర్చించాడు. ఆ రాత్రి శివుడు అచటనే ఉండిపోయాడు.

ద్వితీయేఽహ్ని గిరీశేన మహాదేవో నిమంత్రితః ।
ఇహైవ తిష్ఠస్వ విభో తపస్సాధనకారణాత్ ॥33॥

మరునాడు హిమవంతుడు మహాదేవుని ఆహ్వానించి, తపస్సు సమయమంతా తనవద్దనే గడుపుమని అర్థించాడు.

ఇత్యేవముక్తో గిరిణా హరశ్చక్రే మతిం చ తామ్ ।
తథా చాశ్రమమాశ్రిత్య త్యక్త్వా స స్వం నిరాశ్రమమ్ ॥34॥

పర్వతేశుని ప్రార్థన మన్నించి, హరుడు అచ్చటనే ఉండుటకు నిశ్చయించి, తన నిరాశ్రయవ్రతాన్ని వదలి అచ్చటనే నిలిచాడు.

వసతోఽప్యాశ్రమే తస్య దేవదేవస్య శూలినః ।
తం దేశమగమత్కాలీ గిరిరాజసుతా శుభా ॥35॥

అచటనొక ఆశ్రమంలో శూలపాణి యుండగా గిరికన్యయైన కాలీ తన సఖులతో కలసి అచ్చటకు వెళ్ళింది.

తామాగతాం హరో దృష్ట్వా భూయో జాతాం ప్రియాం సతీమ్ ।
స్వాగతేనాభిసంపూజ్య తస్థౌ యోగరతో హరః ॥36॥

అలా వచ్చిన గిరికన్యను చూసి హరుడు మరల జన్మించిన తన భార్యయైన సతీదేవిగా గుర్తించిన శివుడు ఆమెకు స్వాగతం పలికి, తిరిగి తపస్సులో మునిగిపోయాడు.

సా చాభ్యేత్య వరారోహా కృతాంజలిపరిగ్రహా ।
వవందే చరణౌ శైవౌ సఖీభిః సహ భామినీ ॥37॥

అందమైన నడుము కల ఆ కాళి శివునివద్దకు వచ్చి, చేతులు జోడించి, సఖులతో సహా హరుని పాదాలకు నమస్కరించింది.

తతస్తు సుచిరాచ్ఛర్వః సమీక్ష్య గిరికన్యకామ్ ।
న యుక్తం చైవముక్త్వాఽథ సగణోఽన్తర్దధే తతః ॥38॥

అంతట ఆ గిరికన్యను శివుడు చాలాసేపు తదేకదృష్టితో చూసి, అలా చేయడం యుక్తం కాదని పలుకుతూ గణాలతో సహా అంతర్హితుడయ్యాడు.

సాఽపి శర్వవచో రౌద్రం శ్రుత్వా జ్ఞానసమన్వితా ।
అంతర్దుఃఖేన దహ్యన్తీ పితరం ప్రాహ పార్వతీ ॥39॥

జ్ఞానసంపన్నురాలైన ఉమ శివుని తీవ్రవచనాలను విని, దుఃఖించి, తండ్రివద్దకు వెళ్ళి ఇలా పలికింది.

తాత యాస్యే మహారణ్యే తప్తుం ఘోరం మహత్తపః ।
ఆరాధనాయ దేవస్య శంకరస్య పినాకినః ॥40॥

"తండ్రీ! పినాక ఆయుధం గల మహాదేవుడైన శంకరుని ఆరాధించడానికి నేను మహారణ్యానికి వెళ్ళి ఘోరమైన తపస్సు చేస్తాను.

తథేత్యుక్తం వచః పిత్రా పాదే తస్యైవ విస్తృతే ।
లలితాఖ్యా తపస్తేపే హరారాధనకామ్యయా ॥ 41॥

అందులకు తండ్రి సమ్మతించగా హిమవత్పర్వత మూలంలో పార్వతి లలిత అనే పేరుతో ఘోరతపస్సు చేయసాగింది.

తస్యాః సఖ్యస్తదా దేవ్యాః పరిచర్యాం తు కుర్వతే ।
సమిత్కుశఫలం చాపి మూలాహరణమాదితః ॥42॥

ఆమె చెలికత్తెలు కందమూలఫలాలు, సమిధలు, కుశలు తెచ్చి ఆమెకు పరిచర్యలు చేయసాగారు.

వినోదనార్థం పార్వత్యా మృణ్మయః శూలధృగ్వరః ।
కృతశ్చ తేజోయుక్తశ్చ రుద్రో మేఽస్త్వితి సాఽబ్రవీత్ ॥43॥

పూజాం కరోతి తస్యైవ తం పశ్యంతీ ముహుర్ముహుః ।
తతోఽస్యాస్తుష్టిమగమచ్ఛ్రద్ధయా త్రిపురాంతకృత్ ॥44॥

పార్వతి వినోదానికై వారు శూలపాణియైన శివుని మట్టిబొమ్మను అందంగా చేసి చూపారు. తేజోవంతమైన ఆ బొమ్మను చూసి ఆమె ఆనందించి, మాటిమాటికి దానినే చూస్తూ పూజ గావిస్తూ యున్నది. అంతట ఆమె శ్రద్ధను చూసి త్రిపురాసురుని సంహరించిన శంకరుడు ప్రసన్నుడయ్యాడు.

వటురూపం సమాధాయ ఆషాఢీ ముంజమేఖలీ ।
యజ్ఞోపవీతీ ఛత్రీ చ మృగాజినధరస్తథా ॥45॥

కమండలువ్యగ్రకరో భస్మారుణితవిగ్రహః ।
ప్రత్యాశ్రమం పర్యటన్స తం కాల్యాశ్రమమాగతః ॥46॥

పలాశదండం, ముంజమేఖల, యజ్ఞోపవీతం, ఛత్రం, కృష్ణాజినం, కమండలం ధరించి, భస్మాంకిత విగ్రహంతో బ్రహ్మచారివేషం ధరించి, ప్రతిఆశ్రమం పర్యటిస్తూ కాళి ఆశ్రమానికి చేరాడు.

తముత్థాయ తదా కాలీ సఖీభిః సహ నారద ।
పూజయిత్వా యథా న్యాయం పర్యపృచ్ఛదిదం తతః ॥47॥

నారదా! ఆ విధంగా వచ్చిన హరుని చూసి కాళి సఖులతో లేచి, హరునకు స్వాగతం పలికి యథావిధిగా అతిథిసత్కారం గావించిన పిమ్మట ఆమె ఇలా ప్రశ్నించింది.

ఉమోవాచ – ఉమాదేవి పలికింది.

కస్మాదాగమ్యతే భిక్షో కుత్ర స్థానే తవాశ్రమః ।
కుతస్త్వం పరిగంతాసి మమ శీఘ్రం నివేదయ ॥48॥

ఓ భిక్షూ! మీరెక్కడినుండి వస్తున్నారు?. మీ ఆశ్రమమెక్కడ?. ఎక్కడకు వెళ్ళుచున్నారు?. నాకు త్వరగా తెలియజేయండి.

భిక్షురువాచ – భిక్షువు పలికాడు.

మమాశ్రమపదం బాలే వారాణస్యాం శుచివ్రతే ।
అథైతత్తీర్థయాత్రాయాం గమిష్యామి పృథూదకమ్ ॥49॥

ఓ బాలా! నా ఆశ్రమం వారాణసిలో వున్నది. తీర్థయాత్రలు చేసుకుంటూ పృథూదకతీర్థానికి వెళ్ళుచున్నాను.

దేవ్యువాచ – దేవి పలికింది.

కిం పుణ్యం తత్ర విప్రేంద్ర యద్యాసి త్వం పృథూదకే ।
పథి స్నానేన చ ఫలం కేషు కిం లబ్ధవానసి ॥50॥

ఓ విప్రేన్ద్రా! పృథూదకంలో నీవు ఏమి పుణ్యమార్జించావు? దారిలో స్నానం చేసిన తీర్థాలలో నీవెట్టి ఫలాన్ని పొందావు?

భిక్షురువాచ – భిక్షువు పలికాడు.

మయా స్నానం ప్రయాగే తు కృతం ప్రథమమేవ హి ।
తతోఽథ తీర్థే కుబ్జామ్రే జయన్తే చండికేశ్వరే ॥51॥

బన్ధువృందే చ కర్కంధే తీర్థే కనఖలే తథా ।
సరస్వత్యామగ్నికుండే భద్రాయాం తు త్రివిష్టపే ॥52॥

కోనటే కోటితీర్థే చ కుబ్జకే చ కృశోదరి ।
నిష్కామేన కృతం స్నానం తతోఽభ్యాగాం తవాశ్రమమ్ ॥53॥

ఓ కృశోదరీ! మొట్టమొదటగా నేను తీర్థరాజమైన ప్రయాగలో స్నానం చేశాను. తదనంతరం పవిత్రమైన కుబ్జామ్రం, జయన్తం, చండికేశ్వరం, బంధువృందం, కర్కన్ధం, కనఖలం, సరస్వతీతీర్థంలోని అగ్నికుండం, భద్రాతీర్థంలోని త్రివిష్టపం, కోనటం, కోటితీర్థం, కుబ్జకం మున్నగు తీర్థాలలో స్నానం చేశాను. ఓ పవిత్రురాలా! నేనెటువంటి కోరిక లేకుండా ఈ తీర్థాలను సేవించి నీ ఆశ్రమానికి చేరాను.

ఇహస్థాం త్వాం సమాభాష్య గమిష్యామి పృథూదకమ్ ।
పృచ్ఛామి యదహం త్వాం వై తత్ర న క్రోద్ధుమర్హసి ॥54॥

ఇక్కడనున్న నీతో మాట్లాడిన పిమ్మట పృథూదకతీర్థానికి వెళతాను. నీవు కోపపడకపోతే ఒక విషయం అడుగుతాను.

అహం యస్తపసాఽఽత్మానం శోషయామి కృశోదరి ।
బాల్యేఽపి సంయతతనుస్తతః శ్లాఘ్యం ద్విజన్మనామ్ ॥55॥

నేను చిన్ననాటినుండి ఇంద్రియాలను నిగ్రహించి, తపస్సు వలన శరీరాన్ని కృశింపజేసుకోవడానికి కారణం ఇవి అన్నియు బ్రాహ్మణులకు విధివిహితమగుటయే. అవి నా యెడ శ్లాఘ్యమే.

కిమర్థం భవతీ రౌద్రం ప్రథమే వయసి స్థితా ।
తపః సమాశ్రితా భీరు సంశయః ప్రతిభాతి మే ॥56॥

కాని నీవు ఈ చిన్నవయస్సులోనే భయంకరమైన తపస్సునకు ఎందుకు పూనుకున్నావు? అని నాకు సందేహం కలుగుతోంది.

ప్రథమే వయసి స్త్రీణాం సహ భర్త్రా విలాసిని ।
సుభోగా భోగితాః కాలా వ్రజన్తి స్థిరయౌవనే ॥57॥

ఓ సుందరీ! యౌవనదశలో స్త్రీలు భర్తలతో కలసి చక్కని భోగాలు అనుభవిస్తూ కాలం గడుపుతారు.

తపసా వాంఛయన్తీహ గిరిజే స చరాచరాః ।
రూపాభిజనమైశ్వర్యం తచ్చ తే వర్తతే బహు ॥58॥

సాధారణంగా చరాచరజీవులు అందం, పవిత్రత, ఐశ్వర్యం ఇత్యాదులు కాంక్షించి తపస్సు చేస్తూ ఉంటారు. కాని నీకు అవి అన్నియు చాలా అధికంగా ఉన్నాయి.

తత్కిమర్థమపాస్యైతానలంకారాన్ జటా ధృతాః ।
చీనాంశుకం పరిత్యజ్య కిం త్వం వల్కలధారిణీ ॥59॥

మరి నీవు ఏ కారణంవల్ల సర్వాలంకారాలు వదలి, జటాధారిణివై, పట్టుచీరలను విడచి, నారచీరలు ధరించి, తపిస్తున్నావు?

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తతస్తు తపసా వృద్ధా దేవ్యాః సోమప్రభా సఖీ ।
భిక్షవే కథయామాస యథావత్సా హి నారద ॥ 60॥

ఓ నారదా! బ్రహ్మచారి మాటలకు ఉమాదేవి సఖియైన సోమప్రభ అనే వృద్ధాంగన భిక్షువునకు వాస్తవస్థితిని ఇలా చెప్పసాగింది.

సోమప్రభోవాచ – సోమప్రభ పలికింది.

తపశ్చర్యా ద్విజశ్రేష్ఠ పార్వత్యా యేన హేతునా ।
తం శ్రుణుష్వ మహాకాలీ హరం భర్తారమిచ్ఛతి ॥61॥

ఓ ద్విజశ్రేష్ఠా! ఈ నా సఖి పార్వతి పరమశివుడగు హరుని భర్తగా పొందడానికి ఈ విధంగా తపస్సు చేస్తున్నది.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

సోమప్రభాయా వచనం శ్రుత్వా సంకంప్య వై శిరః ।
విహస్య చ మహాహాసం భిక్షురాహ వచస్త్విదమ్ ॥62॥

ఓ నారదా! సోమప్రభ మాటలు విని బ్రహ్మచారి శిరఃకంపనం చేసి పకపక గట్టిగా నవ్వుతూ ఇలా పలికాడు.

భిక్షురువాచ – భిక్షువు పలికాడు.

వదామి తే పార్వతి వాక్యమేవం కేన ప్రదత్తా తవ బుద్ధిరేషా ।
కథం కరః పల్లవకోమలస్తే సమేష్యతే శార్వకరం ససర్పమ్ ॥63॥

తథా దుకూలాంబరశాలినీ త్వం మృగారిచర్మాభివృతస్తు రుద్రః ।
త్వం చందనాక్తా స చ భస్మభూషితో న యుక్తరూపం ప్రతిభాతి మే త్విదమ్ ॥64॥

ఓ పార్వతీ! నీకీ సలహా ఎవడిచ్చాడని అడుగుతున్నాను? చిగురుటాకుల వలె కోమలమైన నీ చేతితో సర్పములతో కూడిన శివుని కరగ్రహణం ఎలా సంభవం?. నీవు పట్టుపుట్టాలు ధరిస్తావు. అతడు పులితోలు కప్పుకొనే భయంకరుడైన రుద్రుడు. నీవు చందనలేపనం చేసుకుంటే, అతడు బూడిద పూసుకుంటాడు. ఈ సంబంధం నాకేమాత్రము నచ్చలేదు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏవం వాదిని విప్రేన్ద్ర పార్వతీ భిక్షుమబ్రవీత్ ।
మామైవం వద భిక్షో త్వం హరః సర్వగుణాధికః ॥65॥

శివో వాఽప్యథవా భీమః సధనో నిర్ధనోఽథవా ।
అలంకృతో వా దేవేశస్తథా వాఽప్యనలంకృతః ॥ 66॥

యాదృశస్తాదృశోవాఽపి స మే నాథో భవిష్యతి ।
నివార్యతామయం భిక్షుర్వివక్షుః స్ఫురితాధరః ।
న తథా నిన్దకః పాపీ యథా శ్రోతా శశిప్రభే ॥67॥

ఓ నారదా! ఆ విధంగా మాట్లాడుతున్న భిక్షువుతో పార్వతి ఇలా పలికింది. "ఓ భిక్షూ! అలా అనకూడదు. హరుడు సర్వగుణాధికుడు. ఆ ప్రభువు మంగళరూపిగాని, భయంకరుడుగాని, ధనవంతుడుగాని, నిర్ధనుడుగాని, సర్వాలంకారుడుగాని, నిరలంకారుడుగాని, ఎటువంటివాడైనా ఆయనే, నాకు భర్త కాగలడు. ఓ శశిప్రభా! ఈతని పెదవులు కదులుతున్నాయి. ఇంకా ఏదో వదరబోవుచున్నాడు. ఇతనిని నివారించండి. ఇతరులను నిందించేవానికంటే ఆ నిందలను వినేవారే ఎక్కువ పాపం మూటగట్టుకుంటారు" అని నిశ్చయంగా వెల్లడించింది.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్త్వా వరదా సముత్థాతుమథైచ్ఛత ।
తతోఽ త్యజద్భిక్షురూపం స్వరూపస్థోఽ భవచ్ఛివః ॥68॥

ఓ నారదా! అలా పలికి, అచ్చటనుండి లేచి వెళ్ళుటకు ఉద్యమించిన పార్వతి ఎదుట శివుడు తన నిజరూపంతో నిలచి ఇలా పలికాడు.

భూత్వోవాచ ప్రియే గచ్ఛ స్వమేవ భవనం పితుః ।
తవార్థాయ ప్రహేష్యామి మహర్షీన్ హిమవద్గృహే ॥69॥

ప్రియా! నీవు సుఖంగా ఇంటికి వెళ్ళు. నేను త్వరలోనే నిన్ను పొందడానికి మహర్షులను నీ తండ్రియైన హిమవంతుని ఇంటికి పంపుతాను.

యచ్చేహ రుద్రమీహన్త్యా మృణ్మయశ్చేశ్వరః కృతః ।
అసౌ భద్రేశ్వరేత్యేవం ఖ్యాతో లోకే భవిష్యతి ॥70॥

దేవదానవగన్ధర్వా యక్షాః కింపురుషోరగాః ।
పూజయిష్యన్తి సతతం మానవాశ్చ శుభేప్సవః ॥71॥

నీవు పూజించిన ఈ మృణ్మయశంకరప్రతిమ నేటినుండి భద్రేశ్వరుడుగా లోకంలో ప్రఖ్యాతమౌతుంది. దీనిని దేవదానవగన్ధర్వయక్షకింపురుషనాగమనుష్యాదులు సదా సేవించి శుభాలు పొందుతారు.

ఇత్యేవముక్తా దేవేన గిరిరాజసుతా మునే ।
జగామాంబరమావిశ్య స్వమేవ భవనం పితుః ॥72॥

ఓ నారదమునీ! హరుని ఈ మాటలువిని ఆనందించిన గిరికన్య వెంటనే ఆకాశమార్గాన తన తండ్రి భవనానికి వెళ్ళింది.

శంకరోఽ పి మహాతేజా విసృజ్య గిరికన్యకామ్ ।
పృథూదకం జగామాథ స్నానం చక్రే విధానతః ॥73॥

మహాతేజస్వియైన శంకరుడు హిమవత్పుత్రిని వదలి పృథూదకక్షేత్రానికి వెళ్ళి, యథావిధిగా స్నానమాచరించాడు.

తతస్తు దేవప్రవరో మహేశ్వరః పృథూదకే స్నానమపాస్తకల్మషః ।
కృత్వా సనన్దీ సగణః సవాహనో మహాగిరిం మన్దరమాజగామ ॥74॥

దేవశ్రేష్ఠుడైన మహేశ్వరుడు పృథూదకస్నానంతో పవిత్రుడై, నందీశ్వరుడు ప్రమథగణము, వాహనములతో కూడి మన్దరమహాశైలానికి తరలి వెళ్ళాడు.

ఆయాతి త్రిపురాన్తకే సహగణైర్బ్రహ్మర్షిభిః సప్తభి
రారోహత్పులకో బభౌ గిరివరః సంహృష్టచిత్తః క్షణాత్ ।

చక్రే దివ్యఫలైర్జలేన శుచినా మూలైశ్చ కందాదిభిః
పూజాం సర్వగణేశ్వరైః సహ విభోరద్రిస్త్రినేత్రస్య తు ॥75॥

అనంతరం ప్రమథగణాలు సప్తర్షులతో కలసి తన ఇంటికి ఏతెంచిన ఆ త్రిపురసంహరుని దర్శించి, హర్షసంభ్రమాశ్చర్యాలతో పులకించిన ఆ పర్వతరాజు ఆ దేవదేవునకు స్వాగతం పలికి, కందమూలఫలాలు, దివ్యజలాలు, సుగంధ కుసుమాదులతో వారినందరిని ఘనంగా పూజించాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే ఉమాసంభవే మందరగిరి ప్రవేశో నామ ఏకపంచాశత్తమోఽధ్యాయః ॥51॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని ఉమాసంభవమందలి మందరగిరి ప్రవేశమనే యాభైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్విపంచాశత్తమోఽధ్యాయః - యాభైరెండవ అధ్యాయం

ఉమాసంభవే గౌరీవివాహే హిమవతః అంగీకారకథనమ్ - ఉమాసంభవంలో గౌరీశంకరుల వివాహానికి హిమవంతుడు అంగీకరించిన వృత్తాంతం

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

తతః సంపూజితో రుద్రః శైలేన ప్రీతిమానభూత్ ।
సస్మార చ మహర్షీంస్తు అరుంధత్యా సమంతతః ॥1॥

ఆ విధంగా పర్వతశ్రేష్ఠునిచే సంభావింపబడిన శంకరుడు సంతోషించినవాడై అరుంధతీ సహితులగు మహర్షులను స్మరించాడు.

సంస్మృతాస్తే తు ఋషయః శంకరేణ మహాత్మనా ।
సమాజగ్ముర్మహాశైలం మందరం చారుకన్దరమ్ ॥2॥

మహాత్ముడైన శంకరునిచే స్మరింపబడిన మహర్షులు అందమైన గుహలతో కూడిన మందరమహాశైలానికి చేరుకున్నారు.

తానాగతాన్ సమీక్ష్యైవ దేవస్త్రిపురనాశనః ।
అభ్యుత్థాయాభిపూజ్యైతానిదం వచనమబ్రవీత్ ॥3॥

త్రిపురాన్తకుడగు హరుడు అచ్చటికేతెంచిన మహర్షులను చూసి, ఎదురేగి, ఆహ్వానించి, పూజించి వారితో ఇలా పలికాడు.

ధన్యోఽయం పర్వతశ్రేష్ఠః శ్లాఘ్యః పూజ్యశ్చ దైవతైః ।
ధూతపాపస్తథా జాతో భవతాం పాదపంకజైః ॥4॥

స్థీయతాం విస్తృతే రమ్యే గిరిప్రస్థే సమే శుభే ।
శిలాసు పద్మవర్ణాసు శ్లక్ష్ణాసు చ మృదుష్వథ ॥5॥

"మీ ఆగమనం వల్ల, మీపాదపద్మాలు తాకడం వల్ల ఈ పర్వతేశ్వరుడు సర్వపాపవిముక్తుడై, శ్లాఘ్యుడై, దేవతలకు కూడా పూజ్యుడయ్యాడు. అందాలు వెదజల్లే ఈ విశాలమైన గిరిప్రదేశాన పద్మరాగశిలలతో నునుపుగా, మృదువుగా వుండే భూభాగాన విశ్రమించండి.

ఇత్యేవముక్తా దేవేన శంకరేణ మహర్షయః ।
సమవేత్య త్వరుంధత్యా వివిశుః శైలసానుని ॥6॥

ఓ నారదమహర్షీ! ఈ విధముగా శంకరునిచే సంభావింపబడిన మహర్షులు అరుంధతితో కూడి ఆ శైలసానువులపై ఆసీనులయ్యారు.

ఉపవిష్టేషు ఋషిషు నన్దీ దేవగణాగ్రణీః ।
అర్ఘ్యాదిభిః సమభ్యర్చ్య స్థితః ప్రయతమానసః ॥ 7॥

ఆ విధంగా ఆసీనులైన మహర్షులకు దేవగణాగ్రగణ్యుడైన నందీశ్వరుడు వారందరకు అర్ఘ్యపాద్యాదులిచ్చి, వినయంగా నిలబడ్డాడు.

తతోఽబ్రవీత్సురపతిర్ధర్మ్యం వాక్యం హితం సురాన్ ।
ఆత్మనో యశసో బుద్ధ్యై సప్తర్షీన్వినయాన్వితాన్ ॥8॥

అంతట దేవదేవుడైన హరుడు వినయావనతులైన ఆ ఋషులతో తన యశస్సునకు తగినవిధంగా ధర్మయుక్తము, క్షేమంకరమునైన వాక్యాలు ఇలా పలికాడు.

హర ఉవాచ – హరుడు పలికాడు.

కశ్యపాత్రే వారుణేయ గాధేయ శృణు గౌతమ ।
భరద్వాజ శృణుష్వ త్వమంగిరస్త్వం శృణుష్వ చ ॥9॥

మమాసీద్దక్షతనుజా ప్రియా సా దక్షకోపతః ।
ఉత్ససర్జ సతీ ప్రాణాన్యోగం దృష్ట్వా పురా కిల ॥10॥

సాఽద్య భూయః సముద్భూతా శైలరాజసుతా ఉమా ।
తాం మదర్థాయ శైలేన్ద్రో యాచ్యతాం ద్విజసత్తమాః ॥11॥

ఓ కశ్యపా!, అత్రీ!, వసిష్ఠా!, విశ్వామిత్రా!, గౌతమా!, భరద్వాజా!, అంగీరసా! శ్రద్ధగా వినండి. నా ప్రియురాలు దాక్షాయణీసతి దక్షుని కోపకారణంగా యోగశక్తితో తన ప్రాణాలు వదలింది కదా!. ఓ బ్రాహ్మణోత్తములారా! ఆమె మరలా ఇప్పుడు హిమవంతుని పుత్రికయైన ఉమగా జన్మించింది. నా కొరకు ఆమెను మీరు పర్వతరాజైన హిమవంతుని అర్థించండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

సప్తర్షయశ్చైవముక్తా బాఢమిత్యబ్రువన్వచః ।
ఓం నమః శంకరాయేతి ప్రోక్త్వా జగ్ముర్హిమాలయమ్ ॥12॥

శివుని మాటలకు సరేయని అంగీకరించి సప్తర్షులు **ఓం నమశ్శంకరాయ** అంటూ ఆయనకు నమస్కరించి, హిమవంతుని ఇంటికి వెళ్ళారు.

తతోఽప్యరుంధతీం శర్వః ప్రాహ గచ్ఛస్వ సుందరి ।
పురంధ్ర్యో హి పురంధ్రీణాం గతిం ధర్మస్య వై విదుః ॥13॥

ఇత్యేవముక్తా దుర్లంఘ్యం లోకాచారా త్వరుంధతీ ।
నమస్తే రుద్ర ఇత్యుక్త్వా జగామ పతినా సహ ॥14॥

అంతట శివుడు అరుంధతితో "సుందరీ! నీవు కూడా వెళ్ళుము. పురంధ్రీమణులే ఉత్తమగృహిణుల విధానములను ఎరుంగుదురు గదా!" అని పలికాడు. అలంఘ్యమైన లోకాచారాన్ని గ్రహించిన ఆ సతీమణి శివుని మాటలకు అంగీకరించి "రుద్రా! నీకు నమస్కారమని" ప్రణామం గావించి తన భర్తతో బాటు వెళ్ళింది.

గత్వా హిమాద్రిశిఖరమోషధిప్రస్థమేవ చ ।
దదృశుః శైలరాజస్య పురందరపురీమివ ॥15॥

వారందరు ఓషధులతో కళకళలాడుతూ ఇంద్రపురిని పోలిన పర్వతేశ్వరుని నగరానికి చేరారు.

తతః సంపూజ్యమానాస్తే శైలయోషిద్భిరాదరాత్ ।
సునాభాదిభిరవ్యగ్రైః పూజ్యమానా తు పర్వతైః ॥16॥

గన్ధర్వైః కిన్నరైర్యక్షైస్తథాఽన్యైస్తత్పురస్సరైః ।
వివిశుర్భువనం రమ్యం హిమాద్రేర్హాటకోజ్జ్వలమ్ ॥17॥

అక్కడ పర్వతాంగనలు, సునాభాది పర్వతులు, మిక్కిలి ఆదరంతో పూజింపగా గన్ధర్వ కిన్నర యక్షాదులు గావించిన అతిథిసత్కారాలను గ్రహించి, బంగారు కోటగోడలతో వెలిగిపోతున్న హిమవంతుని భవనం చేరుకున్నారు.

తతః సర్వే మహాత్మానస్తపసా ధౌతకల్మషాః ।
సమాసాద్య మహాద్వారం సంతస్థుర్ద్వాఃస్థకారణాత్ ॥18॥

మహాత్ములు, తపస్సుచే పాపరహితులునైన ఆ మునీశ్వరులు భవనద్వారం వద్దకు చేరి, ద్వారపాలకుని నిరీక్షిస్తూ అచ్చట ఆగిపోయారు.

తతస్తు త్వరితోఽభ్యాగాద్ ద్వాఃస్థోఽద్రిర్గంధమాదనః ।
ధారయన్ వై కరే దణ్డం పద్మరాగమయం మహత్ ॥19॥

అప్పుడు ద్వారపాలకుడగు గన్ధమాదనపర్వతుడు చేతిలో పద్మరాగమణులు పొదిగిన దండం పట్టుకొని వేగంగా వారివద్దకు వచ్చాడు.

తతస్తమూచుర్మునయో గత్వా శైలపతిం శుభమ్ ।
నివేదయాస్మాన్ సంప్రాప్తాన్మహత్కార్యార్థినో వయమ్ ॥20॥

అంతట ఋషులు ద్వారపాలునితో "మేము గొప్ప కార్యార్థులమై వచ్చియున్నాము. నీవు వెళ్ళి నీ ప్రభువునకు తెలియజేయవలసినదని పలికి అతనిని పంపారు.

ఇత్యేవముక్తః శైలేన్ద్రమృషిభిర్గన్ధమాదనః ।
జగామ తత్ర యత్రాస్తే శైలరాజోఽద్రిభిర్వృతః ॥21॥

గన్ధమాదనపర్వతుడు అట్లేయని పలికి పర్వతవీరులతో పరివేష్టితుడైన హిమవంతుని వద్దకు వెళ్ళాడు.

నిషణ్ణో భువి జానుభ్యాం దత్త్వా హస్తౌ ముఖే గిరిః ।
దణ్డం నిక్షిప్య కక్షాయామిదం వచనమబ్రవీత్ ॥22॥

అక్కడ హిమవంతుని దర్శించి గన్ధమాదనుడు మోకాళ్ళపై వంగి, చేతులు జోడించి, చంకలో దండము ఇముడ్చుకుని ఇలా విన్నవించాడు.

గన్ధమాదన ఉవాచ – గన్ధమాదనుడు పలికాడు.

ఇమే హి ఋషయః ప్రాప్తా శైలరాజ తవాజిరే ।
ద్వారే స్థితాః కార్యిణస్తే తవ దర్శనలాలసాః ॥23॥

ఓ శైలరాజా! నీ దర్శనాభిలాషులైన మహర్షులు కార్యార్థులై వచ్చి ద్వారం వద్ద వేచియున్నారు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ద్వాఃస్థవాక్యం సమాకర్ణ్య సముత్థాయాచలేశ్వరః ।
స్వయమభ్యాగమద్ద్వారి సమాదాయార్ఘ్యముత్తమమ్ ॥24॥

తానర్చ్యార్ఘ్యాదినా శైలః సమానీయ సభాతలమ్ ।
ఉవాచ వాక్యం వాక్యజ్ఞః కృతాసనపరిగ్రహాన్ ॥25॥

ద్వారపాలుని మాట వినగానే పర్వతేశ్వరుడు లేచి, ఉత్తమమైన అర్ఘ్యాదులు తీసుకుని స్వయంగా వెళ్ళి, ద్వారం వద్దనున్న మహర్షులను పూజించి, సభాభవనంలోనికి తీసుకుని వెళ్ళాడు. ఉత్తమాసనాల మీద వారిని కూర్చుండబెట్టి, వాక్యజ్ఞుడైన హిమవంతుడు ఇలా పలికాడు.

హిమవానువాచ – హిమవంతుడు పలికాడు.

అనభ్రవృష్టిః కిమియముతాహోఽకుసుమం ఫలమ్ ।
అప్రతర్క్యమచింత్యం చ భవదాగమనం త్విదమ్ ॥26॥

అహో! మేఘం లేని వర్షం, పువ్వు లేని ఫలం వలె ఆలోచనకు తర్కానికి సైతం అందనిది మీయొక్క రాక. మాకు మేలు కలుగు గాక!

అద్య ప్రభృతి ధన్యోఽస్మి శైలరాజోఽస్మి సత్తమాః ।
సంశుద్ధదేహోఽస్మ్యద్యైవ యద్భవన్తో మమాజిరమ్ ॥27॥

మునిసత్తములారా! ఈ శైలాధిపతి ఈనాటినుండి ధన్యుడయ్యాడు. మీవంటి వారు రావడంతో ఈనాడే నేను సంశుద్ధదేహుడనయ్యాను.

ఆత్మసంసర్గసంశుద్ధం కృతవన్తో ద్విజోత్తమాః ।
దృష్టిపూతం పదాక్రాన్తం తీర్థం సారస్వతం యథా ॥28॥

ద్విజోత్తములారా! నా గృహం పావనమయ్యింది. తనకు ప్రదక్షిణం చేసి దర్శించినంతనే పవిత్రం గావించే సారస్వతతీర్థం వలె తమ చరణసంస్పర్శసంపర్కాలచేత మేము పవిత్రులమయ్యాము.

దాసోఽహం భవతాం విప్రాః కృతపుణ్యశ్చ సాంప్రతమ్ ।
యేనార్థినో హి తే యూయం తన్మామనుజ్ఞాతుమర్హథ ॥29॥

ద్విజోత్తములారా! నేను మీ దాసుడను. నా పుణ్యాతిశయాన్ని మీరు అర్థులై రావడమే చాటుతోంది. ఆలస్యం చేయక ఆజ్ఞాపించండి.

సదారోఽహం సమం పుత్రైర్భృత్యైర్నప్తృభిరవ్యయాః ।
కింకరోఽస్మి స్థితో యుష్మదాజ్ఞాకారీ తదుచ్యతామ్ ॥30॥

భార్య, పుత్ర, భృత్య, పౌత్రాదులతో సహ నేను మీకు కింకరుడను. మీ ఆజ్ఞను శిరసావహించి నెరవేరుస్తాను. సెలవివ్వండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శైలరాజవచః శ్రుత్వా ఋషయః సంశితవ్రతాః ।
ఊచురంగిరసం వృద్ధం కార్యమద్రౌ నివేదయ ॥31॥

హిమవంతుని మాటలను విని సంశితవ్రతులైన మహర్షులు తమలో వృద్ధుడైన అంగిరసమునిని తాము వచ్చిన పనిని పర్వతేశ్వరునకు తెలియజేయవలసినదిగా కోరారు.

ఇత్యేవం చోదితః సర్వైరృషిభిః కశ్యపాదిభిః ।
ప్రత్యువాచ పరం వాక్యం గిరిరాజం తమంగిరాః ॥32॥

కశ్యపాది సమస్త ఋషులచేత అర్థింపబడిన అంగిరసముని హిమవంతునితో ఉత్తమమైన వచనాలు ఇలా పలికాడు.

అంగిరా ఉవాచ – అంగిరసమహర్షి పలికాడు.

శ్రూయతాం పర్వతశ్రేష్ఠ యేన కార్యేణ వై వయమ్ ।
సమాగతాస్త్వత్సదనమరుంధత్యా సమం గిరే ॥33॥

ఓ పర్వతాగ్రణీ! అరుంధతీ సాధ్వితో గూడి మేమంతా నీ వద్దకు వచ్చిన కార్యం చెబుతున్నాము వినుము.

యోఽసౌ మహాత్మా సర్వాత్మా దక్షయజ్ఞక్షయంకరః ।
శంకరః శూలధృక్ శర్వస్త్రినేత్రో వృషవాహనః ॥34॥

జీమూతకేతుః శత్రుఘ్నో యజ్ఞభోక్తా స్వయంప్రభుః ।
యమీశ్వరం వదంత్యేకే శివం స్థాణువరం హరమ్ ॥35॥

భీమముగ్రం మహేశానం మహాదేవం పశోః పతిమ్ ।
వయం తేన ప్రేషితాః స్మస్త్వత్సకాశం గిరీశ్వర ॥36॥

ఓ పర్వతాగ్రణీ! సర్వాన్తరాత్ముడు, దక్షయజ్ఞధ్వంసకుడు, శూలపాణి, శర్వుడు, త్రినేత్రుడు, వృషవాహనుడు, శంకరుడు, జీమూతకేతువు, శత్రుఘ్నుడు, యజ్ఞభోక్త, స్వయంప్రభువు, ఏకైక ఈశ్వరుడు, శివుడు, స్థాణుడు, హరుడు, భయంకరుడు, ఉగ్రుడు, మహేశానుడు, మహాదేవుడు, పశుపతియునైన పరమశివుడు పంపగా మేము మీ వద్దకు వచ్చినాము.

ఇయం యా త్వత్సుతా కాలీ సర్వలోకేషు సుందరీ ।
తాం ప్రార్థయతి దేవేశస్తాం భవాన్దాతుమర్హసి ॥37॥

ఓ గిరీశ్వరా! త్రిలోకసుందరి నీ కుమార్తెయునైన కాళిని మహేశ్వరుడు కోరుతున్నాడు. నీవామెను భవునకర్పించి ధన్యుడవు కమ్ము.

స ఏవ ధన్యో హి పితా యస్య పుత్రీ పతిం శుభమ్ ।
రూపాభిజనసంపత్త్యా ప్రాప్నోతి గిరిసత్తమ ॥38॥

ఓ గిరీశ్వరా! ఎవని కుమార్తెకు సుందరుడు, శుభంకరుడు, మంచి ఆభిజాత్యము కలిగిన వరుడు లభిస్తాడో ఆ తండ్రి భాగ్యమే భాగ్యము. అతడే ధన్యుడు.

యావన్తో జంగమాగమ్యా భూతాః శైల చతుర్విధాః ।
తేషాం మాతా త్వియం దేవీ యతః ప్రోక్తః పితా హరః ॥39॥

హరుని చెట్టపట్టిన వెంటనే ఈ దేవి చరాచరజీవులకు, సృష్టిలోని చతుర్విధప్రాణులకు (జరాయుజ, అండజ, ఉద్భిజ, స్వేదజ) తల్లి జగన్మాత కాగలదు. ఎందుకనగా శంకరుడు జగత్పితరుడు గదా!

ప్రణమ్య శంకరం దేవాః ప్రణమంతు సుతాం తవ ।
కురుష్వ పాదం శత్రూణాం మూర్ధ్ని భస్మపరిప్లుతమ్ ॥40॥

శంకరునకు ప్రణమిల్లు దేవతలందరు నీ పుత్రికకు పాదాక్రాంతులు అవుతారు. ధూళితో నిండిన నీ పాదాన్ని శత్రువుల తలలపైనుంచి తరువాతి కార్యక్రమమునకు ఉపక్రమింపుము.

యాచితారో వయం శర్వో వరో దాతా త్వమప్యుమా ।
వధూః సర్వజగన్మాతా కురు యచ్ఛ్రేయసే తవ ॥41॥

మేము యాచకులము. ఈ శంకరుడు వరుడు. నీవు కన్యాదాతవు. ఉమ వధువు. ఈమెను జగన్మాతను చేసి, అదృష్టాన్ని అనుభవింపుము.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తద్వచోఽఙ్గిరసః శ్రుత్వా కాలీ తస్థావధోముఖీ ।
హర్షమాగమ్య సహసా పునర్దైన్యముపాగతా ॥42॥

అంగిరసుని మాటలు వినినవెంటనే సంతోషంతో అధోముఖియై కాళి నిలబడింది. కాని ఆమె వెంటనే దైన్యంతో నిండిపోయింది.

తతః శైలపతిః ప్రాహ పర్వతం గంధమాదనమ్ ।
గచ్ఛ శైలానుపామంత్ర్య సర్వానాహర్తుమర్హసి ॥43॥

అంతట శైలాధిపతి గంధమాదనుని పిలిచి నీవు వెంటనే వెళ్ళి మనపర్వతబంధువులనందరిని పిలుచుకుని రమ్మని ఆదేశించాడు.

తతః శీఘ్రతరః శైలో గృహాద్గృహమగాజ్జవీ ।
మేర్వాద్యాన్పర్వతశ్రేష్ఠానాజుహావ సమంతతః ॥44॥

అంతట గంధమాదనుడు కడువేగంతో మేరువు మున్నగు పర్వత ప్రముఖులనందరిని వారి వారి ఇండ్లకు వెళ్ళి పిలుచుకుని వచ్చాడు.

తేఽ ప్యాజగ్ముస్త్వరావన్తః కార్యం మత్వా మహత్తదా ।
వివిశుర్విస్మయావిష్టాః సౌవర్ణేష్వాసనేషు చ ॥45॥

మేరువు మొదలైనవారంతా విషయప్రాముఖ్యాన్ని గుర్తించి వెంటనే సంభ్రమాశ్చర్యాలతో హిమవంతుని ఇంటికి వచ్చి, తమకు ఏర్పాటు చేయబడిన బంగారు ఆసనాల మీద కూర్చున్నారు.

ఉదయో హేమకూటశ్చ రమ్యకో మన్దరస్తథా ।
ఉద్దాలకో వారుణశ్చ వరాహో గరుడాసనః ॥46॥

శుక్తిమాన్వేగసానుశ్చ దృఢశృంగోఽ పి శృంగవాన్ ।
చిత్రకూటస్త్రికూటశ్చ తథాఽ న్యే క్షుద్రపర్వతాః ।
ఉపవిష్టాః సభాయాం వై ప్రణిపత్య ఋషీంశ్చ తాన్ ॥47॥

ఉదయాచలం, హేమకూటం, రమ్యకం, మందరం, ఉద్దాలకం, వారుణం, వరాహం, గరుడాసనం, శుక్తిమంతం, వేగసానువు, దృఢశృంగం, శృంగవన్తం, చిత్రకూటం, త్రికూటం తదితర చిన్న పర్వతములు ఋషులకు నమస్కరించి సభాభవనంలో కూర్చున్నారు.

తతో గిరీశః స్వాం భార్యాం మేనామాహూతవాన్ స్వయమ్ ।
సమాగచ్ఛతు కల్యాణీ సమం పుత్రేణ భామినీ ॥48॥

అంతట హిమవంతుడు తన భార్యయైన మేనాదేవిని స్వయంగా పిలిచి "కల్యాణీ! మన కుమార్తెను పుత్రునితోకూడా తీసుకొని రమ్మని" ఆదేశించాడు.

సాఽ భివంద్య ఋషీణాం చ చరణాంశ్చ తపస్వినీ ।
సర్వాన్ జ్ఞాతీన్ సమాభాష్య వివేశ ససుతా తదా ॥49॥

ఆమెయునట్లే కాళిని వెంటబెట్టుకుని వచ్చి, మహర్షులకు ప్రణమిల్లి ఇతరులను కుశలప్రశ్నలతో సంభావించి, సభలో ఆసీనురాలయ్యింది.

తతోఽద్రిషు మహాశైల ఉపవిష్టేషు నారద ।
ఉవాచ వాక్యం వాక్యజ్ఞః సర్వానాభాష్య సుస్వరమ్ ॥50॥

ఓ నారదా! ఆ విధంగా వచ్చి కూర్చున్న తన జ్ఞాతి పర్వతవరులందరితో వాక్యజ్ఞుడైన హిమవంతుడు సుమధుర స్వరంతో ఇలా పలికాడు.

హిమవానువాచ – హిమవంతుడు పలికాడు.

ఇమే సప్తర్షయః పుణ్యా యాచితారః సుతాం మమ ।
మహేశ్వరార్థం కన్యాం తు తచ్చావేద్యం భవత్సు వై ॥51॥

"ఓ బంధువులారా! పుణ్యమూర్తులైన ఈ సప్తర్షివర్యులు నా కుమార్తెను పరమశివునకు అర్ధాంగిని గావించుటకై హరుని పక్షాన వచ్చి యాచిస్తున్నారు. ఇది మీరందరు తెలిసికొని అనుమతించవలసిన విషయం. కావున మిమ్ములనందరిని ఆహ్వానించాను.

తద్వదధ్వం యథా న్యాయం జ్ఞాతయో యూయమేవ మే ।
నోల్లంఘ్య యుష్మాన్దాస్యామి తత్ క్షమం వక్తుమర్హథ ॥52॥

జ్ఞాతులైన మీరంతా ఆలోచించి నాకు సలహానివ్వవలసినదిగా కోరుచున్నాను. మీ మాటలను ఉల్లంఘించి నేను కన్యాదానం చేయను. మీరు చక్కగా యోచింపగల సమర్థులు".

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

హిమవద్వచనం శ్రుత్వా మేర్వాద్యాః స్థావరోత్తమాః ।
సర్వ ఏవాబ్రువన్ వాక్యం స్థితాస్తేష్వాసనేషు తే ॥53॥

నారదా! హిమవంతుని పలుకులు విని మేరువు మొదలైన ప్రముఖులు తమ ఆసనాలపై కూర్చుని ఇలా పలికారు.

యాచితారశ్చ మునయో వరస్త్రిపురహా హరః ।
దీయతాం శైల కాలీయం జామాతాఽభిమతో హి నః ॥54॥

"యాచింపవచ్చినవారు మహర్షులు. వరుడు త్రిపురారియైన హరుడు. ఓ పర్వతరాజా! వెంటనే కాళీ కుమారిని శివునకిచ్చి వివాహమొనరించుము, పరమశివుడు అల్లుడగుట మాకు సమ్మతమే".

మేనాఽథ ప్రాహ భర్తారం శ్రుణు శైలేన్ద్ర మే వచః ।
పితృభిస్తనయా మహ్యం దత్తాఽనేనైవ హేతునా ॥55॥

యస్తస్యాం భూతపతినా పుత్రో దత్తో భవిష్యతి ।
స హనిష్యతి దైత్యేన్ద్రం మహిషం తారకం తథా ॥56॥

అంతట మేనాదేవి తనభర్తయైన హిమవంతునితో ఇలా పలికింది. "ఓ శైలేంద్రా! నా పలుకులనాలకించండి. ఈ పవిత్రబంధం కొరకే పితృదేవతలు నా కోరికను మన్నించి నాకు ఈ పుత్రికను ప్రసాదించారు. భూతపతియైన శివుడు ఈమెకు ఒకపుత్రుని ప్రసాదించగలడు. ఆ పుత్రుడే దైత్యేంద్రులైన తారకాసురుని, మహిషాసురుని సంహరిస్తాడు.

ఇత్యేవం మేనయా ప్రోక్తః శైలే శైలేశ్వరః సుతామ్ ।
ప్రోవాచ పుత్రి దత్తాఽసి శర్వాయ త్వం మయాఽధునా ॥57॥

ఋషీనువాచ కాలీయం మమ పుత్రీ తపోధనాః ।
ప్రణామం శంకరవధూర్భక్తినమ్రా కరోతి వః ॥58॥

మేనాదేవి ఈ విధంగా పలుకగా శైలాధిపతియైన హిమవంతుడు ఇతర పర్వతవర్యులతో కలసి కుమార్తె కాళితో "అమ్మా! నీవిప్పుడే శర్వునకు ఇవ్వబడ్డావు" అని పలికి మహర్షులనుద్దేశించి "తపోధనులారా! నా పుత్రికయైన ఈ కాళి శంకరవధువు మీకందరకు భక్తితో ప్రణామాలు చేస్తున్నది. స్వీకరించండి" అని అర్థించాడు.

తతోఽప్యరుంధతీ కాలీమంకమారోప్య చాటుకైః ।
లజ్జమానాం సమాశ్వాస్య హరనామోచితైః శుభైః ॥59॥

అంతట సిగ్గుదొంతరలతో ముడుచుకొనిపోవుచున్న కాళిని ప్రేమతో తన ఒడిలో కూర్చుండబెట్టుకొని అరుంధతీదేవి హరనామాంకితమైన మృదుమధురవచనాలతో అలరింపజేసింది.

తతః సప్తర్షయః ప్రోచుః శైలరాజ నిశామయ ।
జామిత్రగుణసంయుక్తాం తిథిం పుణ్యాం సుమంగలామ్ ॥60॥

ఉత్తరాఫల్గునీయోగం తృతీయేఽహ్ని హిమాంశుమాన్ ।
గమిష్యతి చ తత్రోక్తో ముహూర్తో మైత్రనామకః ॥61॥

తస్యాం తిథౌ హరః పాణిం గ్రహిష్యతి సమన్త్రకమ్ ।
తవ పుత్ర్యా వయం యామస్తదనుజ్ఞాతుమర్హసి ॥62॥

అంతట సప్తర్షులు నగాధిరాజును చూసి ఇలా పలికారు. "శైలరాజా!, శ్రద్ధగా వినుము. సప్తమశుద్ధితో కూడిన, పవిత్రమైన మంగళకరమైన తిథి వస్తోంది. మూడవనాడు చంద్రుడు ఉత్తరఫల్గుణిలో ప్రవేశిస్తాడు. ఆ శుభసమయాన్ని మైత్రముహూర్తమంటారు. ఆ తిథినాడు శివుడు సమంత్రకంగా నీ కుమార్తె పాణిగ్రహణం చేస్తాడు. ఇక మేము వెళ్ళివస్తాము. అనుమతించండి".

తతః సంపూజ్య విధినా ఫలమూలాదిభిః శుభైః ।
విసర్జయామాస శనైః శైలరాడృషిపుంగవాన్ ॥63॥

అంతట మహదానందంతో హిమవంతుడు మహర్షులనందరిని శుభంకరమైన ఫలమూలాదులతో చక్కగా పూజించి, సాగనంపాడు.

తేఽ ప్యజగ్మర్మహావేగాత్స్వాక్రమ్య మహదాలయమ్ ।
ఆసాద్య మందరగిరిం భూయోఽ పశ్యన్త శంకరమ్ ॥64॥

సప్తర్షులందరు వెంటనే మహావేగంగా ఆకాశమార్గాన మందరపర్వతానికి వెళ్ళి, తిరిగి శంకరుని దర్శించారు.

ప్రణమ్యోచుర్మహేశానం భవాన్భర్తాఽద్రిజా వధూః ।
సబ్రహ్మకాస్త్రయో లోకా ద్రక్ష్యంతి ఘనవాహనమ్ ॥65॥

వారందరు శివునకు నమస్కరించి ఇలా పలికారు. "దేవా! పార్వతీకుమారికి నీవే భర్తవు. బ్రహ్మపురస్సరంగా ముల్లోకాలు త్వరలో దివ్యవాహనంగల నీ దర్శనం చేసుకుంటాయి" అని విన్నవించారు.

తతో మహేశ్వరః ప్రీతః ఋషీన్సర్వాననుక్రమాత్ ।
పూజయామాస విధినా అరుంధత్యా సమం హరః ॥66॥

అంతట మహేశ్వరుడు సంతోషించి యథాక్రమంగా అరుంధతితో పాటు ఆ మహర్షులందరిని పూజించాడు.

తతః సంపూజితా జగ్ముః సురాణాం మంత్రణాయతే ।
తేఽథాజగ్మర్ద్వారం ద్రష్టుం బ్రహ్మవిష్ణ్వింద్రభాస్కరాః ॥67॥

తదనంతరం ఆ మహర్షులు దేవతలతో సంప్రదించుటకు ప్రయాణమై వెళ్ళారు. ఇంతలో బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, భాస్కరుడు శివుని దర్శించుటకు వచ్చారు.

తతః సమభ్యేత్య మహేశ్వరస్య కృతప్రణామా వివిశుర్మహర్షే ।
సస్మార నందిప్రముఖాంశ్చ సర్వానభ్యేత్య తే వంద్య హరం నిషణ్ణాః ॥68॥

ఓ నారదమహర్షీ! వారు ఆయన ఇంటికి వెళ్ళి, భక్తితో ప్రణామాలు చేసి, ఆసీనులయ్యారు. శివుని ఆదేశానుసారం నంది మొదలైనవారు చేరి హరునికి నమస్కరించారు.

దేవైర్గణైశ్చాపి వృతో గణేశః సంశోభతే ముక్తజటాగ్రభారః ।
యథా వనే సర్జ కదంబమధ్యే ప్రరోహమూలోఽథ వనస్పతిర్వా ॥69॥

ఆ విధంగా దేవతలతో, భూతగణాలతో పరివేష్టింపబడిన గణేశుడు, వదలిన జటాభారం గాలిలో తేలియాడుతూ ఉంటే అరణ్యంలో సర్జ కదంబాల మధ్య ఆకాశాన్ని తాకే మహావృక్షం వలె వెలిగిపోయాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే ఉమాసంభవే గౌరీవివాహే ద్విపంచాశత్తమోఽధ్యాయః॥52॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని ఉమాసంభవమందలి గౌరీవివాహములోని యాభైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రిపంచాశత్తమోఽధ్యాయః - యాభైమూడవ అధ్యాయం

ఉమాసంభవే గౌరీవివాహవర్ణనమ్ - ఉమాసంభవంలో గౌరీశంకరుల కల్యాణవర్ణన

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

సమాగతాన్ సురాన్ దృష్ట్వా నందిరాఖ్యాతవాన్విభోః ।
అథోత్థాయ హరిం భక్త్యా పరిష్వజ్య న్యపీడయత్ ॥1॥

అక్కడ చేరిన దేవతలను చూసి, నంది ఏదో పలుకగా మహేశ్వరుడు లేచి భక్తితో శ్రీహరిని కౌగిలించుకున్నాడు.

బ్రహ్మాణం శిరసా నత్వా సమాభాష్య శతక్రతుమ్ ।
ఆలోక్యాన్యాన్సురగణాన్సంభావయత్స శంకరః ॥2॥

అంతట బ్రహ్మకు శిరసా నమస్కరించి, ఇంద్రుని సంభావించి, ఇతర దేవతలనందరిని యథోచితంగా శంకరుడు పలుకరించాడు.

గణాశ్చ జయదేవేతి వీరభద్ర పురోగమాః ।
శైవాః పాశుపతాద్యాశ్చ వివిశుర్మందరాచలమ్ ॥3॥

వీరభద్రపురోగాములై శివగణాలు పాశుపతగణాలు జయజయధ్వానాలు చేస్తూ మందరగిరి చేరారు.

తతస్తస్మాన్మహాశైలం కైలాసం సహ దైవతైః ।
జగామ భగవాన్ శర్వః కర్తుం వైవాహికం విధిమ్ ॥4॥

అక్కడనుండి దేవగణాలతో కూడి మహేశ్వరుడు వైవాహికవిధికై కైలాసశిఖరాలకు వెళ్ళాడు.

తతస్తస్మిన్మహాశైలే దేవమాతాదితిః శుభా ।
సురభిః సురమా చాన్యాశ్చక్రుర్మండనమాకులాః ॥5॥

ఆ పర్వతంపై దేవమాత అదితి, సురభి, సురమ మొదలగు ముత్తయిదువలు అలంకరణకార్యంలో నిమగ్నమయ్యారు.

మహాస్థిశేఖరీ చారురోచనాతిలకో హరః ।
సింహాజినీ చాతినీలభుజంగకృతకుండలః ॥6॥

మహాహిరత్నవలయహారకేయూరనూపురః ।
సమున్నతజటాభారో వృషభస్థో విరాజతే ॥7॥

ముఖాన గోరోజనతిలకం, మహాస్థిమకుటం, సింహచర్మం, తుమ్మెదల వంటి నల్లటి సర్పకుండలాలు, నాగమణులు కూర్చిన కంకణహారకేయూరనూపురాలు, సమున్నతజటాభారం ధరించి, వృషభారూఢుడై, హరుడు అపూర్వమైన శోభతో కనులకు విందుగావించాడు.

తస్యాగ్రతో గణాః స్వైః స్వైరారూఢా యాంతి వాహనైః ।
దేవాశ్చ పృష్ఠతో జగ్ముర్హుతాశనపురోగమాః ॥8॥

ఆయనకు ముందుభాగాన శివగణాలందరు తమ తమ వాహనాల మీద వెళ్ళగా వెనుకవైపున అగ్నిని ముందుంచుకుని దేవతలందరు నడిచారు.

వైనతేయం సమారూఢః సహ లక్ష్మ్యా జనార్దనః ।
ప్రయాతి దేవ పార్శ్వస్థో హంసేన చ పితామహః ॥9॥

నారాయణుడు లక్ష్మీదేవితో కూడి, గరుత్మంతుని మీద అధిరోహించి బయలుదేరాడు. బ్రహ్మ హంసనెక్కి శివుని ప్రక్కగా సాగాడు.

గజాధిరూఢో దేవేంద్రశ్ఛత్రం శుక్లపటం విభోః ।
ధారయామాస వితతం సహేంద్రాణ్యా సహస్రదృక్ ॥10॥

శచీదేవితో కలిసి ఇంద్రుడు శివునకు తెల్లని పట్టువస్త్రాన్ని కట్టించి వెలిగొడుగును పట్టాడు.

యమునా సరితాం శ్రేష్ఠా వాలవ్యజనముత్తమమ్ ।
శ్వేతం ప్రగృహ్య హస్తేన కచ్ఛపే సంస్థితా యయౌ ॥11॥

సరిత్తులలో శ్రేష్ఠురాలైన యమున ఉత్తమమైన వాలవ్యజనం పట్టుకుని తాబేలుమీద బయలుదేరింది.

హంసకుందేందుసంకాశం వాలవ్యజనముత్తమమ్ ।
సరస్వతీ సరిచ్ఛ్రేష్ఠా గజారూఢా సమాదధే ॥12॥

అదే విధంగా సరస్వతి కూడా హంస వలె, మల్లెపూవు వలె, చంద్రుని వలె, తెల్లనైన చామరం ధరించి, గజాన్ని అధిరోహించి పయనమయ్యింది.

ఋతవః షట్ సమాదాయ కుసుమం గంధసంయుతమ్ ।
పంచవర్ణం మహేశార్థే జగ్ముస్తే కామచారిణః ॥13॥

కామచారిణులైన ఆరు ఋతువులు పంచవన్నెల పరిమళభరితకుసుమాలతో హరుని వెంటవెళ్లాయి.

మత్తమైరావతనిభం గజమారుహ్య వేగవాన్ ।
అనులేపనమాదాయ యయౌ తత్ర పృథూదకః ॥14॥

ఐరావతం వంటి మదపుటేనుగునెక్కి, అనులేపన ద్రవ్యాలను తీసుకుని, పృథూదకతీర్థం బయలుదేరింది.

గంధర్వాస్తుంబురుముఖా గాయంతో మధురస్వరమ్ ।
అనుజగ్ముర్మహాదేవం వాదయంతశ్చ కిన్నరాః ॥15॥

తుంబురుడు మున్నగు గంధర్వులు మధురస్వరంతో గానం చేస్తున్నారు. కిన్నరులు వాయిద్యాలు వాయిస్తూ శివుని అనుసరించి నడిచారు.

నృత్యన్త్యప్సరసశ్చైవ స్తువంతో మునయశ్చ తమ్ ।
గంధర్వా యాంతి దేవేశం త్రినేత్రం శూలపాణినమ్ ॥16॥

అప్సరసలు నృత్యం చేస్తున్నారు. మునులు స్తోత్రం చేస్తున్నారు. గంధర్వగణమంతా త్రినేత్రుడు, శూలపాణి, దేవేశుడునైన పరమేశ్వరుని వెంట నడిచారు.

ఏకాదశ తథా కోట్యో రుద్రాణాం తత్ర వై యయుః ।
ద్వాదశైవాదితేయానామష్టౌ కోట్యో వసూనపి ॥17॥

సప్తషష్టిస్తథాకోట్యో గణానాం ఋషిసత్తమాః ।
చతుర్వింశత్తదా జగ్ముర్గణానామూర్ధ్వరేతసామ్ ॥18॥

ఓ నారదా! పదకొండుకోట్ల రుద్రులు, పన్నెండు కోట్ల ఆదిత్యులు, ఎనిమిది కోట్ల వసువులు, అరవయ్యేడు కోట్ల గణాలు, ఊర్ధ్వరేతస్కులైన ఇరువదినాలుగుమంది పరమ ఋషులు పరమశివుని వెంట నడిచారు.

అసంఖ్యాతాని యూథాని యక్షకిన్నరరక్షసామ్ ।
అనుజగ్ముర్మహేశానం వివాహాయ సమాకులాః ॥19॥

వీరుగాక శంకరుని వివాహయాత్రలో లెక్కకు మించిన యక్షకిన్నరరాక్షసయూథాలు మహాకోలాహలంగా పాల్గొన్నారు.

తతః క్షణేన దేవేశః క్ష్మాధరాధిపతేస్తలమ్ ।
సంప్రాప్తశ్చాగమన్ శైలాః కుంజరస్థాః సమంతతః ॥20॥

ఈ విధంగా క్షణకాలంలో శివుడు తనవారితో పర్వతాధిపతి నగరసమీపానికి చేరాడు. పెండ్లివారికి ఎదుర్కోళ్ళు చెప్పడానికి పర్వతవీరులు నలువైపులనుండి ఏనుగుల మీద వచ్చి నిలిచారు.

తతో ననామ భగవాన్ త్రినేత్రః స్థావరాధిపమ్ ।
శైలాః ప్రణేమురీశానం తతో௨సౌ ముదితో௨భవత్ ॥21॥

అంతట భగవానుడైన శంకరుడు స్థావరాధిపుడైన హిమవంతునకు నమస్కరించాడు. తక్కిన గిరులన్ని ఈశానునకు నమస్కరించాయి. అందులకు శర్వుడు ఎంతో ఆనందించాడు.

సమం సురైః పార్షదైశ్చ వివేశ వృషకేతనః ।
నందినా దర్శితే మార్గే శైలరాజపురం మహత్ ॥22॥

ఆ విధంగా తన పార్షదులతో, దేవతలతో, మహావైభవంగా వృషకేతనుడైన శంకరుడు నందీశ్వరుడు చూపిన మార్గంలో గొప్పదైన శైలరాజు పట్టణంలో ప్రవేశించాడు.

జీమూతకేతురాయాత ఇత్యేవం నగరస్త్రియః ।
నిజకర్మ పరిత్యజ్య దర్శనాయాదృతాభవన్ ॥23॥

జీమూతకేతువు వచ్చినాడని నగరస్త్రీలు అందరు తాము చేస్తున్న పనులు పరిత్యజించి, ఉత్కంఠతో పెండ్లి కుమారుని చూడడానికి బయలుదేరారు.

మాల్యదామ సమాదాయ కరేణైకేన భామినీ ।
కేశపాశం ద్వితీయేన శంకరాభిముఖీ గతా ॥24॥

ఒకసుందరి పూలమాలను ఒకచేతితో పట్టుకుని రెండవచేతితో ముడివేసికొనుచున్న కేశపాశాలను పట్టుకుని శివుని చూడడానికి శివునకు ఎదురుగా వచ్చి నిలబడింది.

అన్యాஉలక్తకరాగాఢ్యం పాదం కృత్వాஉஉకులేక్షణా ।
అనలక్తకమేకం హి హరం ద్రష్టుముపాగతా ॥25॥

మరొకవనిత ఒకపాదానికి పారాణిపెట్టుకుని, రెండవపాదానికి పెట్టుకోకుండానే శంకరునిదగ్గరకు వెళ్ళి చూచింది.

ఏకేనాక్ష్ణాஉఞ్జితేనైవ శ్రుత్వా భీమముపాగతమ్ ।
సాంజనాం చ ప్రగృహ్యాన్యా శలాకాం సుష్ఠు ధావతి ॥26॥

మరొక వనిత ఒక కంటికే కాటుక పెట్టుకుని, చేతితో కాటుక పెట్టుకునే కమ్మిని పట్టుకుని వీధిలోనికి పరుగుతీసింది.

అన్యా సరశనం వాసః పాణినాஉஉదాయ సుందరీమ్ ।
ఉన్మత్తేవాగమన్నగ్నా హరదర్శనలాలసా ॥27॥

మరియొక స్త్రీ మొలనూలు వస్త్రం చేతితో పట్టుకుని, వాటిని ధరించకుండా ఉన్మత్తురాలు వలె నగ్నంగా శివుని దర్శించాలని పరుగుపెట్టింది.

అన్యాஉతిక్రాన్తమీశానం శ్రుత్వా స్తనభరాలసా ।
అనిన్దత కుచౌ బాలా యౌవనం స్వ కృశోదరీ ॥28॥

వక్షోజాల బరువుతో వేగంగా నడవలేక ఒక జవ్వని పెండ్లికుమారుడు తన గుమ్మం దాటి వెళ్ళాడని తెలుసుకుని తన పాలిండ్లనీ, యౌవనభారాన్నీ నిందించుకున్నది.

ఇత్థం చ నగరస్త్రీణాం క్షోభం సంజనయన్ హరః ।
జగామ వృషభారూఢో దివ్యం శ్వశురమందిరమ్ ॥29॥

ఈ విధంగా ఆ నగరస్త్రీలలో సంక్షోభాన్ని రేకెత్తిస్తూ హరుడు వృషభారూఢుడై దివ్యమైన మామగారి భవనానికి చేరాడు.

తతః ప్రవిష్టం ప్రసమీక్ష్య శంభుం శైలేంద్రవేశ్మన్యబలా బ్రువంతి ।
స్థానే తపో దుశ్చరమంబికాయాశ్చీర్ణం మహానేషసురస్తు శంభుః ॥30॥

ఆ విధంగా భవనంలో అడుగిడిన శివుని చూసి హిమవంతుని ఇంటిలో గల ఆడువారు “ఆహా! అంబిక చేసిన తపస్సు కడుగొప్పది గదా! ఆ ఫలమే దేవశ్రేష్ఠుడైన ఈ హరుని రూపంలో లభించింది.

స ఏష యేనాంగమనంగతాం కృతం కందర్పనామ్నః కుసుమాయుధస్య ।
క్రతోః క్షయీ దక్షవినాశకర్తా భగాక్షిహా శూలధరః పినాకీ ॥31॥

కుసుమాయుధుడైన మన్మథుని అనంగునిగా చేసినది, దక్షయజ్ఞం విధ్వంసం చేసినది, ఈ పినాకపాణియే. ఈ శూలపాణియే. సూర్యుని నేత్రాన్ని హరించినవాడు ఇతడే గదా!" అని ఆశ్చర్యపడుతు భవుని ఇలా స్తుతించారు.

నమో నమః శంకర శూలపాణే మృగారిచర్మాంబర కాలశత్రో ।
మహాహిహారాంకితకుండలాయ నమో నమః పార్వతివల్లభాయ ॥32॥

"శంకరా!, త్రిశూలధరా!, వ్యాఘ్రచర్మధరా!, కాలశత్రో!, మహాసర్ప కుండలధరా!, నాగేంద్రహారా!, పార్వతీ వల్లభా! నీకు అనేక ప్రణామాలు".

ఇత్థం సంస్తూయమానః సురపతివిధృతేనాతపత్రేణ శంభుః
సిద్ధైర్వంద్యః సయక్షైరహికృతవలయీ చారుభస్మోపలిప్తః ।
అగ్రస్థేనాగ్రజేన ప్రముదితమనసా విష్ణునా చానుగేన
వైవాహీం మంగళాఢ్యాం హుతవహముదితామారురోహాథ వేదీమ్ ॥33॥

అంతఃపురాంగనలు ఈ విధంగా స్తోత్రవాక్యాలు పలుకుతుండగా, దేవేంద్రుడు గొడుగు పట్టుకొనగా, సిద్ధ యక్షులకు వందనీయుడగు ఆ నాగకంకణుడు భస్మాలంకృతసర్వాంగుడై విరించి మనస్సును ప్రమోదభరితం గావిస్తూ, విష్ణువు వెంటనంటిరాగా, పవిత్రాగ్నులతో వెలుగొందుచున్న వివాహమంగళవేదికను అలంకరించాడు.

ఆయాతే త్రిపురాంతకే సహచరైః సార్ధం చ సప్తర్షిభిః
వ్యగ్రోఽభూద్ గిరిరాజవేశ్మని జనః కాల్యాః సమాలంకృతౌ ।

వ్యాకుల్యం సముపాగతాశ్చ గిరయః పూజాదినా దేవతాః
ప్రాయో వ్యాకులితా భవన్తి సుహృదః కన్యావివాహోత్సుకాః ॥34॥

సపరివారుడై సప్తర్షులతో వచ్చిన త్రిపురహరుని చూడగానే అక్కడివారంతా కాళీకుమారిని పెండ్లి కుమార్తెగా ముస్తాబు చేయుటలో నిమగ్నులయ్యారు. పర్వత ప్రవరులు వచ్చిన పెండ్లివారికి సపర్యలు చేయడంలో హడావుడి పడసాగారు. నిజమేగదా! ఆడపిల్ల పెండ్లిలో వధువు వైపువారు ఆదుర్దా పడడం సహజమే గదా!.

ప్రసాధ్య దేవీం గిరిజాం తతః స్త్రియో దుకూలశుక్లాభివృతాంగయష్టికామ్ ।
భ్రాత్రా సునాభేన తతోత్సవే కృతే సా శంకరాభ్యాశమథోపపాదితా ॥35॥

అంతఃపుర స్త్రీలు పార్వతిని శ్వేతాంబరాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన పిమ్మట ఆమె సోదరుడు సునాభుడు విహితమైన పూర్వాంగకృత్యాలు నెరవేర్చగా, కాళిని వెంటబెట్టుకుని శంకరుని వద్దకు తీసుకుని వెళ్ళారు.

తతః శుభే హర్మ్యతలే హిరణ్మయే స్థితాః సురాః శంకరకాలిచేష్టితమ్ ।
పశ్యంతి దేవోఽపి సమం కుశాంగ్యా లోకానుజుష్టం పదమాససాద ॥36॥

స్వర్ణనిర్మితమైన ఆ మంగళవేదిక వద్ద కూర్చొని దేవతలు వధూవరులు నెరవేర్చదగు వివాహకృత్యాలు గమనించసాగారు. శివుడు పార్వతితో కలసి లోకానుమోదితాలైన వైవాహికాచారాలు యథాక్రమంగా నెరవేర్చారు.

యత్ర క్రీడా విచిత్రాః సుకుసుమతరవో వారిణో బిందుపాతై
ర్గంధాఢ్యైర్గంధచూర్ణైః ప్రవిరలమవనౌ గుణ్ఠితౌ గుండికాయామ్ ।
ముక్తాదామైః ప్రకామం హరగిరితనయా క్రీడనార్థం తదాఽఘ్నుత్
పశ్చాత్ సిందూరపుంజైరవిరతవితతైశ్చక్రతుః క్ష్మాం సురక్తామ్ ॥37॥

ఆ సందర్భంలో చిత్రవిచిత్రమైన వినోదక్రీడలతో, పుష్పభరితమైన వృక్షాలతో, సుగంధాలు జల్లే పన్నీరు జలసేచనాలతో సుగంధభరితమైన గంధపు చూర్ణాలు చల్లుకోవడంతో, రంగురంగుల ముగ్గులతో, ముత్యాల పేరుల తోరణాలతో, శివపార్వతుల క్రీడార్థం ఆ ప్రదేశాన్నంతటిని సిందూరరంజితం గావించారు.

ఏవం క్రీడాం హరఃకృత్వా సమం చ గిరికన్యయా ।
ఆగచ్ఛద్ దక్షిణాం వేదిమృషిభిః సేవితాం దృఢామ్ ॥38॥

ఆ విధంగా గిరికన్యతో క్రీడించి, హరుడు ఋషులతో నిండిన దక్షిణవేదిక వద్దకు చేరాడు.

అథాజగామ హిమవాన్ శుక్లాంబరధరః శుచిః ।
పవిత్రపాణిరాదాయ మధుపర్కమథోజ్జ్వలమ్ ॥39॥

చక్కగా నిర్మింపబడిన దృఢమైన మండపం వద్దకు శ్వేతాంబరములు ధరించి, పవిత్రపాణియై, ఉజ్జ్వల మధుపర్కాలతో హిమవంతుడు వచ్చాడు.

ఉపవిష్ట స్త్రినేత్రస్తు శాక్రీం దిశమపశ్యత ।
సప్తర్షికాంశ్చ శైలేంద్రః సూపవిష్టో విలోకయన్ ॥40॥

పూర్వాభిముఖుడై త్రినేత్రుడు ఉపవిష్టుడు కాగా కన్యాదాత సప్తర్షులవైపు తిరిగి కూర్చున్నాడు.

సుఖాసీనస్య శర్వస్య కృతాంజలిపుటో గిరిః ।
ప్రోవాచ వచనం శ్రీమాన్ ధర్మసాధనమాత్మనః ॥ 41॥

సుఖాసనం మీదనున్న జామాతయైన శర్వునితో ఆ నగపతి అంజలిఘటించి, ధర్మసమ్మితమైన వాక్యం ఇలా పలికాడు.

హిమవానువాచ – హిమవంతుడు పలికాడు.

మత్పుత్రీం భగవన్కాలీం పౌత్రీం చ పులహాగ్రజే ।
పితౄణామపి దౌహిత్రీం ప్రతీచ్ఛేమాం మయోదితామ్ ॥42॥

ఓ దేవా! నాపుత్రికయు, పులహుని అన్నగారి పౌత్రియు, పితృదేవతల దౌహిత్రియునైన ఈ కాళీ కన్యను నీకు దత్తం చేస్తున్నాను. పరిగ్రహించి నన్నునుగ్రహింపుము.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్త్వా శైలేంద్రో హస్తం హస్తేన యోజయన్ ।
ప్రాదాత్ ప్రతీచ్ఛ భగవన్ ఇదముచ్చైరుదైరయన్ ॥43॥

ఈ విధంగా పలుకుచు హిమవంతుడు తన కుమార్తె చేతిని హరుని చేతిలోనుంచి అందరు వినునట్లుగా దేవా! ఈమెను స్వీకరింపుమని ఉచ్చైఃస్వరంతో పలికాడు.

హర ఉవాచ – హరుడు పలికాడు.

న మేఽస్తి మాతా న పితా తథైవ న జ్ఞాతయో వాఽపి చ బాంధవాద్యాః ।
నిరాశ్రయోఽహం గిరిశృంగవాసీ సుతాం ప్రతీచ్ఛామి తవాద్రిరాజ ॥44॥

ఓ పర్వతరాజా! నాకు తల్లి లేదు. తండ్రి లేదు. జ్ఞాతులుగాని, బంధువులుగాని ఎవరు లేరు. నేను నిరాశ్రయుడను. గిరిశృంగవాసిని. అట్టి నేను మీ కుమార్తెను స్వీకరిస్తున్నాను.

ఇత్యేవముక్త్వా వరదోఽవపీడయత్కరం కరేణాద్రికుమారికాయాః ।
సా చాపి సంస్పర్శమవాప్య శంభోః పరాం ముదం లబ్ధవతీ సురర్షే ॥45॥

అని పలికి వరదాయకుడైన శర్వుడు పార్వతీకరమును తన కరముతో గ్రహించాడు. ఓ నారదా! ఆమె కూడా శంభుని కరస్పర్శకు పులకించి పరమానందాన్ని పొందింది.

తథాఽధిరూఢో వరదోఽథ వేదిం సహాద్రిపుత్ర్యా మధుపర్కమశ్నన్ ।
దత్వా చ లాజాన్కలమస్య శుక్లాంస్తతో విరించీ గిరిజామువాచ ॥46॥

అనంతరం వరదుడైన శంకరుడు పార్వతీదేవితో వేదికను ఎక్కి, మధుపర్కప్రాశనంచేసి, మిక్కిలి తెల్లనైన పేలాలు సమర్పించాడు. అంతట బ్రహ్మ పార్వతితో ఇలా పలికాడు.

కాలి పశ్యస్వ వదనం భర్తుః శశిధరప్రభమ్ ।
సమదృష్టిః స్థిరా భూత్వా కురుష్వగ్నేః ప్రదక్షిణమ్ ॥47॥

"ఓ కాళీ! స్థిరదృష్టితో చంద్రకాంతితో సమానంగా వెలుగుచున్న నీ భర్తముఖాన్ని చక్కగా చూడుము. అగ్నికి ప్రదక్షిణ గావింపుము.

తతోఽమ్బికా హరముఖే దృష్టే శైత్యముపాగతా ।
యథార్కరశ్మిసంతప్తా ప్రాప్యవృష్టిమివావనిః ॥48॥

వేసవికి తపించిపోయిన భూమి వానజల్లుకు చల్లబడినట్లుగా భర్తముఖదర్శనంతో అంబిక అపూర్వమైన చల్లదనాన్ని పొందింది.

భూయః ప్రాహ విభోర్వక్త్రమీక్షస్వేతి పితామహః ।
లజ్జయా సాఽపి దృష్టేతి శనైర్బ్రహ్మాణమబ్రవీత్ ॥49॥

బ్రహ్మ మరల ఆమెను భర్త ముఖం చూడమనగా ఆమె చూశానని సిగ్గుతో మెల్లగా బ్రహ్మగారికి చెప్పింది.

సమం గిరిజయా తేన హుతాశస్త్రిఃప్రదక్షిణమ్ ।
కృతో లాజాశ్చ హవిషా సమం క్షిప్తా హుతాశనే ॥50॥

అంతట గిరిజతో కలసి హరుడు అగ్నికి ముమ్మారు ప్రదక్షిణంచేసి, హవిస్సు, లాజలు అగ్నిలో వ్రేల్చాడు.

తతో హరాంఘ్రిమాలిన్యా గృహీతో దాయ కారణాత్ ।
కిం యాచసి చ దాస్యామి ముంచస్వేతి హరోఽబ్రవీత్ ॥51॥

అంతట బహుమతి కోసం మాలిని శివుని పాదాలను రెండిటిని గట్టిగా పట్టుకున్నది. అంతట హరుడు "నీవు అడిగినది ఇస్తాను. కాళ్ళు వదులుము" అని మాలినితో పలికాడు.

మాలినీ శంకరం ప్రాహ మత్సఖ్యా దేహి శంకర ।
సౌభాగ్యం నిజగోత్రీయం తతో మోక్షమవాప్స్యసి ॥52॥

అంతట మాలిని శంకరునితో ఇలా పలికింది. "ప్రభూ! శంకరా! నా యీ చెలికి మీ గోత్రసౌభాగ్యం ప్రసాదించండి. అనంతరం ఆమె మోక్షాన్ని పొందగలదు" అని పలికింది.

అథోవాచ మహాదేవో దత్తం మాలిని ముంచ మామ్ ।
సౌభాగ్యం నిజగోత్రీయం యోఽస్యాస్తం శృణు వచ్మి తే ॥53॥

అంతట మహాదేవుడు "మాలినీ! అట్లే ఇచ్చితిని. నీవు నన్నిక వదలుము. నా గోత్రసౌభాగ్యం ఎటువంటిదో చెబుతున్నాను వినుము.

యోఽసౌ పీతాంబరధరః శంఖధృఙ్మధుసూదనః ।
ఏతదీయో హి సౌభాగ్యో దత్తోఽస్మద్గోత్రమేవ హి ॥54॥

పీతాంబరధారి, శంఖం ధరించినవాడునైన మధుసూదనుని సౌభాగ్యం నేను నా గోత్రంగా ప్రసాదించినదే".

ఇత్యేవముక్తే వచనే ప్రముమోచ వృషధ్వజమ్ ।
మాలినీ నిజగోత్రస్య శుభచారిత్రమాలినీ ॥55॥

శివుని ఈ పలుకులు విని నిజగోత్ర, శుభచరిత్రశాలియైన ఆ మాలిని హరుని పాదాలు వదలిపెట్టింది.

యదా హరో హి మాలిన్యా గృహీతశ్చరణే శుభే ।
తదా కాలీముఖం బ్రహ్మ దదర్శ శశినోఽధికమ్ ॥56॥

మాలిని శివుని పాదాలు పట్టుకున్న సమయంలో బ్రహ్మ చంద్రునికంటె మిన్నగా వెలుగుచున్న కాళీ ముఖాన్ని చూశాడు.

తద్ దృష్ట్వా క్షోభమగమచ్ఛుక్రచ్యుతిమవాప చ ।
తచ్ఛుక్రం వాలుకాయాం చ ఖిలీచక్రే ససాధ్వసః ॥57॥

ఆమెను చూసి క్షుబ్ధుడయ్యాడు. అతనికి వీర్యచ్యుతి కలిగింది. భయంతో ఆ వీర్యాన్ని ఇసుకలో దాచాడు.

తతోఽబ్రవీద్ధరో బ్రహ్మన్ న ద్విజాన్ హంతుమర్హసి ।
అమీ మహర్షయో ధన్యా వాలఖిల్యాః పితామహ ॥58॥

అంతట శివుడు బ్రహ్మతో "పితామహా! నీవు బ్రాహ్మణులను హత్య చేయరాదు. ఓ బ్రహ్మన్! ఈ వాలఖిల్య మహర్షులు ధన్యాత్ములు" అన్నాడు.

తతో మహేశవాక్యాన్తే సముత్తస్థుస్తపస్వినః ।
అష్టాశీతిసహస్రాణి వాలఖిల్యా ఇతి స్మృతాః ॥59॥

పరమశివుడు ఆ విధంగా పలుకగానే 88 వేల వాలఖిల్యమహర్షులు లేచి నిలబడ్డారు.

తతో వివాహే నిర్వృత్తే ప్రవిష్టః కౌతుకం హరః ।
రేమే సహోమయా రాత్రిం ప్రభాతే పునరుత్థితః ॥60॥

ఆ విధంగా వివాహం సంపన్నం కాగానే హరుడు సంతుష్టుడై, ఉమతో కలసి, ఆ రాత్రి యథేష్టసుఖాలను అనుభవించి మరునాడు ఉదయాన్నే లేచాడు.

తతోఽద్రిపుత్రీం సమవాప్య శంభుః సర్వైః సమం భూతగణైశ్చ హృష్టః ।
సంపూజితః పర్వతపార్థివేన స్వమందిరం శీఘ్రముపాజగామ ॥61॥

ఆ విధంగా శంభుడు పార్వతిని పొంది మిక్కిలి సంతోషించాడు. సమస్తమైన దేవతాగణం, ప్రమథగణం, భూతగణం కూడా ఆనందాన్ని పొందారు. తదనంతరం పర్వతరాజైన హిమవంతుని సత్కారాలనందుకుని ఆయన తన మందిరానికి వేగంగా తిరిగి వెళ్ళాడు.

తతః సురాన్ బ్రహ్మహరీంద్రముఖ్యాన్ ప్రణమ్య సంపూజ్య యథావిభాగమ్ ।
విసృజ్య భూతైః సహితో మహీధ్రమధ్యావసన్మందరమష్టమూర్తిః ॥62॥

తన వివాహానికి విచ్చేసిన బ్రహ్మ విష్ణు ఇంద్రాది దేవతలను యథావిధిగా సత్కరించి, వీడ్కోలు పలికినవాడై, ఆ అష్టమూర్తి తన శివగణాలతో మందరగిరి మీద నివాసం ఏర్పరుచుకున్నాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే ఉమాసంభవే గౌరీవివాహో నామ త్రిపంచాశత్తమోఽధ్యాయః ॥53॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని ఉమాసంభవమందలి గౌరీవివాహమనే యాభైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుష్పంచాశత్తమోఽధ్యాయః - యాభైనాల్గవ అధ్యాయం
ఉమాసంభవే వినాయకోత్పత్తిః - ఉమాసంభవంలో వినాయకజననం

పులస్త్య ఉవాచ - పులస్త్య మహర్షి పలికాడు.

తతో గిరౌ వసన్ రుద్రః స్వేచ్ఛయా విచరన్మునే ।
విశ్వకర్మాణమాహూయ అవోచత్ కురు మే గృహమ్ ॥1॥

ఓ మునీ! హరుడు ఆ గిరిమీద పార్వతితో యథేచ్ఛగా విహరిస్తూ విశ్వకర్మను పిలిచి తనకొక గృహం నిర్మించమన్నాడు.

తతశ్చకార శర్వస్య గృహం స్వస్తికలక్షణమ్ ।
యోజనాని చతుఃషష్టిః ప్రమాణేన హిరణ్మయమ్ ॥2॥

అంతట విశ్వకర్మ స్వస్తికలక్షణంతో 64 యోజనాల ప్రమాణం గల మేలిమిబంగారుభవనాన్ని నిర్మించాడు.

దంతతోరణనిర్వ్యూహం ముక్తాజాలాంతరం శుభమ్ ।
శుద్ధస్ఫటికసోపానం వైడూర్యకృతరూపకమ్ ॥3॥

సప్తకక్షం సువిస్తీర్ణం సర్వం సముదితం గుణైః ।
తతో దేవపతిశ్చక్రే యజ్ఞం గార్హస్థ్యలక్షణమ్ ॥4॥

దంతాలతో చేసిన తోరణాలు, ముత్యాలు పొదిగిన గవాక్షాలు, వాకిళ్ళు, స్ఫటిక మెట్ల వరుసలు, వైడూర్యాల చిత్తర్వులు, ఏడు విశాలమైన గదులు సకలవిధాలవసతులు కలిగి, ఆ భవనం అన్నిభవనాలకంటె గొప్పగా రూపొందింది. అందులో చేరిన దేవదేవుడు గృహస్థులు చేయదగిన యజ్ఞం చేశాడు.

తం పూర్వచరితం మార్గమనుయాతి స్మ శంకరః ।
తథా తతస్త్రినేత్రస్య మహాన్కాలోఽభ్యగాన్మునే ॥5॥

రమతః సహ పార్వత్యా ధర్మాపేక్షీ జగత్పతిః ।
తతః కదాచిద్బ్రహ్మార్థం కాలీత్యుక్తా భవేన హి ॥6॥

ఇందులో హరుడు పూర్వీకుల పద్ధతిని అవలంబించాడు. ఆ సుందరభవనంలో చాలాకాలం పార్వతితో సుఖాలను అనుభవిస్తూ శంకరుడు గడిపాడు. అంతనొకనాడు బ్రహ్మనుగూర్చితపస్సు చేయించాలనే ఉద్దేశ్యంతో పార్వతిని "కాళీ" (నల్లపిల్ల) యని సంబోధించాడు.

పార్వతీ మన్యునావిష్టా శంకరం వాక్యమబ్రవీత్ ।
సంరోహతీషుణా విద్ధం వనం పరశునాహతమ్ ॥
వాచా దురుక్తం బీభత్సం న ప్రరోహతి వాక్ క్షతమ్ ॥7॥

పార్వతి కోపించి శంకరునితో ఇలా పలికింది. "బాణవిద్ధమైన వృక్షం, గొడ్డలి వేటుకు తెగిన కొమ్మ తిరిగి చిగురించగలవు. నోటినుండి వెలువడిన దురుక్తితో, అపశబ్దాలతో ఏర్పడిన వ్రణం తిరిగి మానిపోదు".

వాక్సాయకాః వదనాన్నిష్పతంతి తైరాహతః శోచతి రాత్ర్యహాని ।
న తాన్విముంచేత హి పండితో జనస్తదద్య ధర్మం వితథం త్వయా కృతమ్ ॥8॥

తస్మాద్వ్రజామి దేవేశ తపస్తప్తుమనుత్తమమ్ ।
తథా యతిష్యే న యథా భవాన్కాలీతి వక్ష్యతి ॥9॥

నోటినుండి వెలువడిన శబ్దబాణాలకు గురియైన మానవుడు రాత్రింబవళ్ళు విచారిస్తూనే ఉంటాడు. కాబట్టి అపశబ్దాలు, దురుక్తులు, పలుకరాదని పండితులు ధర్మశాసనం చేశారు. ఆ ధర్మాన్ని నేడు నీవు అతిక్రమించావు. దానివలన నా మనస్సును నొప్పించావు. కావున ఓ దేవేశా! నేను తపస్సుచేయడానికి తపోవనానికి వెళుతున్నాను. నా తపస్సునంతా వెచ్చించి మరలా మీచేత కాళీ అని పిలిపించుకోకుండా యుండేటట్లు సిద్ధమై తిరిగి వస్తాను".

ఇత్యేవముక్త్వా గిరిజా ప్రణమ్య చ మహేశ్వరమ్ ।
అనుజ్ఞాతా త్రినేత్రేణ దివమేవోత్పపాత హ ॥10॥

సముత్పత్య చ వేగేన హిమాద్రేః శిఖరం శివమ్ ।
టంకచ్ఛిన్నం ప్రయత్నేన విధాత్రా నిర్మితం యథా ॥11॥

గిరిజ మహేశ్వరునితో ఇట్లు పలికి, త్రినేత్రుని అనుమతినిపొంది, వెంటనే ఆకాశమార్గాన వేగంగా వెళ్ళి, హిమాద్రి శిఖరాన్ని చేరుకున్నది. అది అత్యంతరమణీయంగా, మనోహరంగా, సాక్షాత్తు బ్రహ్మ ప్రయత్న పూర్వకంగా నిర్మించాడా? అన్నట్లుగా ఉంది.

తతోఽవతీర్య సస్మార జయాం చ విజయాం తథా ।
జయంతీం చ మహాపుణ్యాం చతుర్థీమపరాజితామ్ ॥12॥

ఆ విధంగా హిమాద్రి శిఖరంపై దిగగానే జయ, విజయ, జయన్తి, అపరాజిత అను నలుగురు దేవాంగనలను పార్వతి స్మరించింది.

తాః సంస్మృతాః సమాజగ్ముః కాలీం ద్రష్టుం హి దేవతాః ।
అనుజ్ఞాతాస్తథా దేవ్యాః శుశ్రూషాం చక్రిరే శుభాః ॥13॥

ఆ విధంగా స్మరించగానే ఆ నలుగురు దేవాంగనలు ఆమెను దర్శించడానికి విచ్చేశారు. ఆమె అనుజ్ఞతో వారు ఆమెకు శుశ్రూషలు చేయసాగారు.

తతస్తపసి పార్వత్యాం స్థితాయాం హిమవద్వనాత్ ।
సమాజగామ తం దేశం వ్యాఘ్రో దంష్ట్రానఖాయుధః ॥14॥

ఆ విధంగా పార్వతి తపస్సులోనుండగా హిమాద్రివనంనుండి తీవ్రమైన కోరలు, నఖములు గల ఒక పెద్దపులి అక్కడకు వచ్చింది.

ఏకపాదస్థితాయాం వై దేవ్యాం వ్యాఘ్రస్త్వచింతయత్ ।
యదా పతిష్యతే చేయం తదా దాస్యామి వై అహమ్ ॥15॥

ఇత్యేవం చిన్తయన్నేవ దత్తదృష్టిర్మృగాధిపః ।
పశ్యమానస్తద్వదనమేకదృష్టిరజాయత ॥ 16॥

ఒంటికాలిమీద నిలబడి తపస్సుచేస్తున్న కాళీదేవిని చూచి, "ఈమె క్రింద పడిపోయిన పిదప ఈమెను తినవచ్చును" అని నిశ్చయించుకుని ఆమె ముఖమునందే దృష్టిని లగ్నంచేసి, ఆమె ముఖాన్నే చూస్తూ ఆ పెద్దపులి అలాగే నిలబడిపోయింది. దానికి ఏకాగ్రదృష్టి లభించింది.

తతో వర్షశతం దేవీ గృణంతీ బ్రహ్మణః పదమ్ ।
తపోఽ తప్యత్తతోఽ భ్యాగాద్బ్రహ్మా త్రిభువనేశ్వరః ॥17॥

పార్వతీదేవి బ్రహ్మను గూర్చి ఆ విధంగా నూరుసంవత్సరాలు తపస్సు చేయగా పితామహుడు ప్రత్యక్షమయ్యాడు.

పితామహస్తథోవాచ దేవీం ప్రీతోఽస్మి శాశ్వతే ।
తపసా ధూతపాపాఽసి వరం వృణు యథేప్సితమ్ ॥18॥

ఆ విధంగా ప్రత్యక్షమైన బ్రహ్మ పార్వతీదేవితో "దేవీ!, శాశ్వతీ! నీ తపస్సునకు సంతోషించాను. తపస్సువలన పాపాలన్నీ తొలగినదానవయ్యావు. కావున నీకు ఇష్టమైన వరం కోరుకొనుము" అని పలికాడు.

అథోవాచ వచః కాలీ వ్యాఘ్రస్య కమలోద్భవ ।
వరదో భవ తేనాహం యాస్యే ప్రీతిమనుత్తమామ్ ॥19॥

అంతట కాళి "కమలోద్భవా! ముందుగా ఈ పెద్దపులికి కోరిన వరమివ్వండి. దానితో నాకెంతో తృప్తి కలుగుతుంది" అని పలికింది.

తతః ప్రాదాద్వరం బ్రహ్మా వ్యాఘ్రస్యాద్భుతకర్మణః ।
గాణపత్యం విభౌ భక్తిమజేయత్వం చ ధర్మితామ్ ॥20॥

అంతట బ్రహ్మ అద్భుతకర్మనాచరించిన ఆ వ్యాఘ్రానికి గణపతియందు భక్తి, అజేయత్వం, ధర్మబుద్ధి వరాలుగా ప్రసాదించాడు.

వరం వ్యాఘ్రాయ దత్త్వైవం శివకాంతామథాబ్రవీత్ ।
వృణీష్వ వరమవ్యగ్రా వరం దాస్యే తవాంబికే ॥21॥

ఈ విధంగా వ్యాఘ్రానికి వరాలనిచ్చిన బ్రహ్మ శివకాంతతో " నీవు కోరిన వరం ప్రసాదిస్తాను. వరాన్ని కోరుకొనుము" అని పలికాడు.

తతో వరం గిరిసుతా ప్రాహ దేవీ పితామహమ్ ।
వరః ప్రదీయతాం బ్రహ్మన్ వర్ణం కనకసంనిభమ్ ॥22॥

అంతట గిరిసుతయైన పార్వతీదేవి "బ్రహ్మన్!, పితామహా! నా శరీరం బంగారుకాంతితో మారేటట్లు వరాన్ని అనుగ్రహించండి" అని బ్రహ్మను వరం కోరింది.

తథేత్యుక్త్వా గతో బ్రహ్మా పార్వతీ చాభవత్ తతః ।
కోశం కృష్ణం పరిత్యజ్య పద్మకింజల్కసన్నిభా ॥23॥

అంతట బ్రహ్మ తథాస్తు! అని పలికి తన నివాసానికి వెళ్ళాడు. అంతట పార్వతి శరీరం మీది నల్లని కోశం (పొర) తొలగిపోయి పద్మకింజల్కసన్నిభమైన కాంతితో వెలుగొందింది.

తస్మాత్కోశాచ్చ సా జాతా భూయః కాత్యాయనీ మునే ।
తామభ్యేత్య సహస్రాక్షః ప్రతిజగ్రాహ దక్షిణామ్ ।
ప్రోవాచ గిరిజాం దేవో వాక్యం స్వార్థాయ వాసవః ॥24॥

నారదమునీ! ఆ విధంగా తొలగిపోయిన నల్లటి పొరనుండి కాత్యాయని ఆవిర్భవించింది. అంతట సహస్రాక్షుడు ఆమెను సమీపించి, ఆ కాత్యాయనిని దక్షిణగా స్వీకరించి, పార్వతీదేవిని స్వార్థంతో ఇలా అర్థించాడు.

ఇంద్రోవాచ – ఇంద్రుడు పలికాడు.

ఇయం ప్రదీయతాం మహ్యం భగినీ మేఽస్తు కౌశికీ ।
త్వత్కోశసంభవా చేయం కౌశికీ కౌశికోఽప్యయమ్ ॥25॥

దేవీ! ఈమెను నాకిచ్చివేయుము. నీ కోశమునుండి వెలువడిన ఈ కౌశికి నాకు సోదరి కాగలదు. అందువలన నేను కౌశికుడనౌతాను.

తాం ప్రాదాదితి సంశ్రుత్య కౌశికీం రూపసంయుతామ్ ।
సహస్రాక్షోఽపి తాం గృహ్య వింధ్యం వేగాజ్జగామ చ ॥26॥

ఇంద్రుని కోర్కెను మన్నించి ఆ సుందరి కౌశికిని అతనికి ఇచ్చివేసింది. సహస్రాక్షుడు ఆ కౌశికిని వెంటబెట్టుకుని త్వరత్వరగా వింధ్యాద్రికి చేరుకున్నాడు.

తత్ర గత్వా త్వథోవాచ తిష్ఠ చాత్ర మహాబలే ।
పూజ్యమానా సురైర్నామ్నా ఖ్యాతా త్వం వింధ్యవాసినీ ॥27॥

తత్ర స్థాప్య హరిర్దేవీం దత్వా సింహం చ వాహనమ్ ।
భవామరారిహంత్రీ చేత్యుక్త్వా స్వర్గముపాగమత్ ॥28॥

"ఓ మహాబలశాలినీ! నీవీ వింధ్యాచలమునందు నివసింపుము. వింధ్యవాసిని అను పేరుతో సర్వదేవతలచేత కీర్తింపబడుతు విరాజిల్లుము" అని పలికి ఆమెను అచ్చట నిలిపి, సింహవాహనాన్ని యిచ్చి, దీనిపై విహరిస్తూ దేవతల శత్రువులనందరిని సంహరింపుమని పలికి దేవరాజు స్వర్గానికి వెళ్ళాడు.

ఉమాఽపి తం వరం లబ్ధ్వా మందరం పునరేత్య చ ।
ప్రణమ్య చ మహేశానం స్థితా సవినయం మునే ॥29॥

తతోఽమరగురుః శ్రీమాన్ పార్వత్యా సహితోఽవ్యయః ।
తస్థౌ వర్షసహస్రం హి మహామోహనకే మునే ॥30॥

నారదా! ఉమాదేవి కూడా బ్రహ్మనుండి అట్లు వరాన్ని పొంది, తిరిగి మందరగిరికి వచ్చి, భర్తయైన శివునకు మ్రొక్కి, వినయంతో నిలబడింది. ఓ నారదమునీ! అంతట పార్వతితో కూడిన దేవాధిదేవుడు వేయి సంవత్సరాలు కామోపభోగాలు అనుభవించాడు.

మహామోహస్థితే రుద్రే భువనాశ్చేలురుద్ధతాః ।
చుక్షుభుః సాగరాః సప్త దేవాశ్చ భయమాగమన్ ॥31॥

అలా శివుడు కామక్రీడలలో మునిగియుండగా ముల్లోకాలు క్షోభించిపోయాయి. సముద్రాలు ఘూర్ణిల్లాయి. దేవతలందరు భయకంపితులయ్యారు.

తతః సురా మహేంద్రేణ బ్రహ్మణః సదనం గతాః ।
ప్రణమ్యోచుర్మహేశానం జగత్ క్షుబ్ధం తు కింత్విదమ్ ॥32॥

అంతట ఇంద్రునితో కలిసి దేవతలందరు బ్రహ్మ వద్దకు వెళ్ళి, నమస్కరించి, ఈ సంక్షోభానికి కారణమేమని అడిగారు.

తానువాచ భవో నూనం మహామోహనకే స్థితః ।
తేనాక్రాన్తాస్త్విమే లోకా జగ్ముః క్షోభం దురత్యయమ్ ॥33॥

ఇత్యుక్త్వా సోఽభవత్తూష్ణీం తతోఽప్యూచుః సురా హరిమ్ ।
ఆగచ్ఛ శక్ర గచ్ఛామో యావత్తన్న సమాప్యతే ॥34॥

సమాప్తే మోహనే బాలో యః సముత్పత్స్యతేఽవ్యయః ।
స నూనం దేవరాజస్య పదమైన్ద్రం హరిష్యతి ॥35॥

శివుడు పార్వతితో మహామైథునక్రీడలో మునిగియున్నాడు. ఆ తీవ్రతకు లోకాలన్నీ కంపించిపోతున్నాయని బ్రహ్మ దేవతలతో చెప్పి మౌనం వహించాడు. అంతట దేవతలు ఇంద్రునితో "దేవపతీ! త్వరపడుము. శివపార్వతుల మైథునకర్మ ముగిసేలోపల మనమక్కడకు వెళ్ళాలి. అది పూర్తియై బాలకుడు జన్మించినచో అతడు నీ ఇంద్రాధిపత్యాన్ని హరించివేస్తాడు" అని భయపెట్టారు.

తతోఽమరాణాం వచనాద్దివౌకో బలఘాతినః ।
భయాత్ జ్ఞానం తతో నష్టం భావికర్మ ప్రచోదనాత్ ॥36॥

దేవతల మాట వినగానే జరగబోయే పనిని తలచుకొన్న ఇంద్రునిలో వివేకం, విచక్షణాజ్ఞానం నశించి, భయం చోటుచేసుకుంది.

తతః శక్రః సురైః సార్ధం వహ్నినా చ సహస్రదృక్ ।
జగామ మందరగిరిం తచ్ఛృంగేష్వపి సత్తమ ॥37॥

అంతట ఇంద్రుడు తక్షణమే దేవతలతోపాటు అగ్నిని వెంటబెట్టుకుని మందరగిరిశిఖరానికి చేరాడు.

అశక్తాః సర్వ ఏవైతే ప్రవేష్టుం తద్భవాజిరమ్ ।
చింతయిత్వా తు సుచిరం పావకం తే వ్యసర్జయన్ ॥38॥

శివుని భవనంలోనికి వెళ్ళేందుకు వారికి అందరికి ధైర్యం చాలక చాలాసేపు తమలో తాము ఆలోచించుకుని చివరకు అగ్నిని పంపించారు.

స చాభ్యేత్య సురశ్రేష్ఠో దృష్ట్వా ద్వారే చ నందినమ్ ।
దుష్ప్రవేశం చ తం దృష్ట్వా చింతాం వహ్నిఃపరాంగతః ॥39॥

స తు చింతార్ణవే మగ్నః ప్రాపశ్యచ్ఛంభుసద్మనః ।
నిష్క్రామన్తీం మహాపంక్తిం హంసానాం విమలాం తథా ॥40॥

అగ్ని శివుని భవన ప్రాంగణం వద్దకు వెళ్ళి ద్వారం వద్దనిలిచి ఉన్న నందీశ్వరుణిచూచి ఈ భవనంలోపలికి ప్రవేశించలేను అనితలచి గొప్ప ఆలోచనలలో పడిపోయాడు. ఇంతలో ఒక పెద్ద హంసలగుంపు ఈశ్వరభవనం నుండి బయటకు రావడం కనిపించింది.

అసావుపాయ ఇత్యుక్త్వా హంసరూపీ హుతాశనః ।
వంచయిత్వా ప్రతీహారం ప్రవివేశ హరాజిరమ్ ॥41॥

ఇదియే తగిన ఉపాయమని భావించి అగ్నికూడా ఒకహంసరూపం ధరించి, నంది కన్నుగప్పి, లోపలకు ప్రవేశించాడు.

ప్రవిశ్య సూక్ష్మమూర్తిశ్చ శిరోదేశే కపర్దినః ।
ప్రాహ ప్రహస్య గంభీరం దేవా ద్వారి స్థితా ఇతి ॥42॥

అక్కడ ఇంకా సూక్ష్మరూపంలో త్రినేత్రుని జటామండలం మీద ఎగురుతూ శివునికి వినబడేటట్లు మెల్లగా దేవతలు ద్వారం వద్ద వేచియున్నారని చెప్పాడు.

తచ్ఛ్రుత్వా సహసోత్థాయ పరిత్యజ్య గిరేః సుతామ్ ।
వినిష్క్రాంతోఽజిరాచ్ఛర్వో వహ్నినా సహ నారద ॥43॥

ఆ మాటలు విని వెంటనే శివుడు పార్వతిని వదలి, అగ్నితో కలసి ప్రాంగణంలోనికి వచ్చాడు.

వినిష్క్రాన్తే సురపతౌ దేవా ముదితమానసాః ।
శిరోభిరవనీం జగ్ముః సేంద్రార్క శశిపావకాః ॥44॥

నారదా! ఆ విధంగా బయటకు వచ్చిన హరుని చూసి, దేవతలు సంతోషించారు. ఇంద్రుడు, అగ్ని మున్నగు దేవతలందరు భూమికి తలలు ఆనించి నమస్కారాలు చేశారు.

తతః ప్రీత్యా సురానాహ వదధ్వం కార్యమాశు మే ।
ప్రణామావనతా వో హి దాస్యేఽహం వరముత్తమమ్ ॥45॥

అంతట శివుడు సంతోషించి మీ కోరిక తీరుస్తాను. మీరెందుకు వచ్చినారో వెంటనే తెలియజేయండి మీరందరు తలలు వంచి నమస్కరిస్తున్నారు. మీకు మంచిగొప్పవరాన్నిస్తాను అని అన్నాడు.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

యది తుష్టోఽసి దేవానాం వరం దాతుమిహేచ్ఛసి ।
తదిహ త్యజ్యతాం తావన్మహామైథునమీశ్వర ॥46॥

"ఓ ప్రభూ! నీవు సంతోషించి మాకు వరమీయదలచినచో మీ యీ మహామైథునక్రీడను చాలించండి" అని దేవతలు ఈశ్వరునకు విన్నవించారు.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు పలికాడు.

ఏవం భవతు సంత్యక్తో మయా భావోఽమరోత్తమాః ।
మమేదం తేజ ఉద్రిక్తం కశ్చిదేవ ప్రతీచ్ఛతు ॥47॥

ఈశ్వరుడు అట్లేయగు గాక! ఓ దేవోత్తములారా! ఈ కామభావాన్ని వదిలిపెట్టాను. కాని ఉద్రిక్తమైన నా యీ శుక్రాన్ని ఎవరు పరిగ్రహిస్తారని ప్రశ్నించాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యుక్తాః శంభునా దేవాః సేంద్ర చంద్ర దివాకరాః ।
అసీదంత యథామగ్నాః పంకే గావస్తథా సురాః ॥48॥

శంకరుని ప్రశ్నకు ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు మున్నగు దేవతలు ఊబిలో కూరుకుపోయిన గోవుల వలె హతాశులయ్యారు.

సీదత్సు దైవతేష్వేవం హుతాశోఽభ్యేత్య శంకరమ్ ।
ప్రోవాచ ముంచ తేజస్త్వం ప్రతీచ్ఛామ్యేవ శంకర ॥49॥

దేవతల దైన్యాన్ని చూసి అగ్ని ముందుకు వచ్చి "శివా! నీశుక్రాన్ని నేను భరిస్తాను. వెంటనే విడువుము" అని పలికాడు.

తతో ముమోచ భగవాన్ తద్రేతః స్కన్నమేవ తు ।
జలం తృషార్తో వై యద్వత్తైలపానం పిపాసితః ॥50॥

పిమ్మట పరమేశ్వరుడు తన తేజస్సును జారవిడువగా అగ్ని తాను దప్పికగొని తైలాన్నిత్రాగినట్లుగా దాహార్తుడు జలమును గ్రహించునట్లు దానిని గ్రహించాడు.

తతః పీతే రేతసి వై శార్వే దేవేన వహ్నినా ।
స్వస్థాః సురాః సమామంత్ర్య హరం జగ్ముస్త్రివిష్టపమ్ ॥51॥

శివతేజాన్ని అగ్ని పానం చేయగానే దేవతలు స్వస్థులై తమ తమ నెలవులకు వెళ్ళిపోయారు.

సంప్రయాతేషు దేవేషు హరోఽపి నిజమందిరమ్ ।
సమభ్యేత్య మహాదేవీమిదం వచనమబ్రవీత్ ॥52॥

దేవతలు వెళ్ళిన తరువాత శివుడు కూడా తన మందిరంలోనికి వెళ్ళి పార్వతీదేవితో ఇలా పలికాడు.

దేవి దేవైరిహాభ్యేత్య యత్నాత్ప్రేష్య హుతాశనమ్ ।
తతః ప్రోక్తో నిషిద్ధస్తు పుత్రోత్పత్తిం తవోదరాత్ ॥53॥

"దేవీ! దేవతలందరు వచ్చి ఎంతో కష్టంతో అగ్నిని లోపలకు పంపి నన్ను బయటకు పిలిపించుకున్నారు. నీ గర్భంనుండి పుత్రుడు కలుగకుండా నన్ను నివారించి వెళ్ళిపోయారు" అని శివుడు పార్వతితో పలికాడు.

సాఽపి భర్తుర్వచః శ్రుత్వా క్రుద్ధా రక్తాంతలోచనా ।
శశాప దేవతాః సర్వా నష్టపుత్రోద్భవా శివా ॥54॥

యస్మాన్నేచ్ఛంతి తే దుష్టా మమ పుత్రం మమౌరసమ్ ।
తస్మాత్తే న జనిష్యన్తి స్వాసు యోషిత్సు పుత్రకాన్ ॥55॥

పార్వతీదేవి తన భర్త పలుకులు వినినంతనే కోపంతో నిప్పులు క్రక్కుచు "దేవతలలో ఎవరికీ కూడా తమ భార్యలయందు పుత్రులను కనకుందురు గాక!" అని శపించింది. నాకు ఔరసుడు కలుగకుండా కుట్రను పన్నిన దుష్టులు అపుత్రకులుగా ఉండిపోదురు గాక! అని శపించింది.

ఏవం శప్త్వా సురాన్గౌరీ శౌచశాలాముపాగమత్ ।
ఆహూయ మాలినీం స్నాతుం మతిం చక్రే తపోధన ॥56॥

ఓ తపోధనా! ఈ విధంగా దేవతలకు శాపమిచ్చి గౌరీదేవి శౌచాలయానికి వెళ్ళి మాలినిని పిలిచి స్నానానికి ఏర్పాట్లు చేయమన్నది.

మాలినీ సురభిం గృహ్య శ్లక్ష్ణముద్వర్తనం శుభా ।
దేవ్యంగముద్వర్తయతే కరాభ్యాం కనకప్రభా ॥57॥

తచ్ఛౌచం పార్వతీ నైవం మేనే కీటగుణేన హి ।
ఉద్వర్త్య పార్వతీం తాం తు శుభేనోద్వర్తనేన చ ॥58॥

బంగారుకాంతి గల మాలిని మంచి పరిమళం గల నలుగుపిండిని తన చేతులతో పార్వతిశరీరానికి బలంగా నలుగు పెట్టింది. కాని పార్వతి మాలిని చేసిన నలుగును శౌచంగా భావించలేదు. మాలిని మాత్రం పార్వతికి శుభం కలిగే విధంగా నలుగుపెట్టింది.

మాలినీ తూర్ణమగమద్గృహం స్నానస్య కారణాత్ ।
తస్యాం గతాయాం శైలేయీ మలాచ్చక్రే గజాననమ్ ॥59॥

చతుర్భుజం పీనవక్షః పురుషం లక్షణాన్వితమ్ ।
కృత్వోత్ససర్జ తం భూమ్యాం స్థితా భద్రాసనే పునః ॥60॥

ఈ విధంగా మాలిని పార్వతీదేవికి నలుగు పెట్టిన తరువాత స్నానం చేయించడానికి తగు ఏర్పాట్లకై లోపలకు వెళ్ళింది. ఆమె వెళ్ళగానే తన వంటినుండి రాలిన నలుగుపిండితో గజముఖము, నాలుగు చేతులు, విశాలమైన వక్షఃస్థలం కలిగిన పురుషాకృతి గల బొమ్మను చేసి పార్వతి భూమిపై నిలబెట్టింది. తాను మరల తన ఆసనంపై కూర్చున్నది.

మాలినీ తచ్ఛిరస్స్నానం దదౌ విహసతీ తదా ।
ఈషద్ధాసముఖీం దృష్ట్వా మాలినీం ప్రాహ నారద ॥61॥

ఓ నారదా! ఇంతలో మాలిని వచ్చి పార్వతీదేవికి శిరస్స్నానం చేయిస్తూ మధ్య మధ్యలో తనలో తాను చిరునవ్వు నవ్వుకోవడం సాగించింది. ఈ విధంగా చిరునవ్వు నవ్వుతున్న మాలినితో పార్వతీదేవి ఇలా పలికింది.

కిమర్థం భీరు శనకైర్హససి త్వమతీవ చ ।
సాఽథోవాచ హసామ్యేవం భవత్యాస్తనయః కిల ॥62॥

భవిష్యతీతి దేవేన ప్రోక్తో నన్దీ గణాధిపః ।
తచ్ఛ్రుత్వా మమ హాసోఽయం సంజాతోఽద్య కృశోదరి ॥63॥

యస్మాదేవీః పుత్రకామాచ్ఛంకరో వినివారితః ।
ఏతచ్ఛ్రుత్వా వచో దేవీ సస్నౌ తత్ర విధానతః ॥64॥

స్నాత్వాఽర్చ్య శంకరం భక్త్యా సమభ్యాగాద్ గృహంప్రతి ।

ఓ మాలినీ! నీలో నీవు మాటిమాటికి ఎందుకలా నవ్వుతున్నావని పార్వతి అడిగింది. అందుకు మాలిని నవ్వుతూ “శివుడు గణాధిపతియైన నందితో నీకు కొడుకు జన్మిస్తాడని చెబుతుంటే విన్నాను. దేవతలు ఆయనకు

పుత్రుడు కలుగకుండా నివారించారు గదా! అందుకే నాకు నవ్వువస్తోందని" మాలిని పార్వతితో పలికింది. మాలిని మాటలు విని పార్వతి యథావిధిగా స్నానం చేసి భక్తితో శంకరుని అర్చించి తన భవనంలో ప్రవేశించింది.

తతః శంభుః సమాగత్య తస్మిన్భద్రాసనేఽపి చ ॥65॥

స్నాతస్తస్య తతస్తస్మాత్ స్థితః సమలపూరుషః ।
ఉమాస్వేదం భవస్వేదం జలభూమిసమన్వితమ్ ॥66॥

తత్సంపర్కాత్సముత్తస్థౌ ఫూత్కృత్య కరముత్తమమ్ ।
అపత్యం హి విదిత్వా చ ప్రీతిమాన్ భువనేశ్వరః ॥67॥

అనంతరం శంకరుడు కూడా వచ్చి పార్వతి కూర్చున్న భద్రాసనం మీదనే కూర్చుండి స్నానం చేశాడు. అప్పుడాయన క్రింద నిలబెట్టబడిన నలుగుపిండి బొమ్మను చూశాడు. ఆ బొమ్మ పార్వతీదేవి నలుగుపిండి శివుని శరీరంపైనున్న విభూతినీరు కలిస్తేనే తయారయ్యింది. ఆ నేల ఉమాశంకరుల చెమటతో తడిసినందున ఆ బొమ్మ జీవం గల పురుషుడుగా తుండంతో ఫూత్కారం చేస్తూ నిలబడింది. ఆ గజాననుని చూసి తన పుత్రునిగా గుర్తించి శివుడు పరమానందాన్ని పొందాడు.

తం చాదాయ హరో నందిమువాచ భగనేత్రహా ।
రుద్రః స్నాత్వాఽర్చ్య దేవాదీన్ వాగ్భిరద్భిః పితౄనపి ॥68॥

జప్త్వా సహస్రనామానముమాపార్శ్వముపాగతః ।
సమేత్య దేవీం విహసన్ శంకరః శూలధృగ్వచః ॥69॥

ప్రాహ త్వం పశ్య శైలేయీ త్వత్సుతం గుణసంయుతమ్ ।
ఇత్యుక్తా పర్వతసుతా హ్యుపేత్యాపశ్యదద్భుతమ్ ॥70॥

యస్త్వదంగమలాద్దివ్యః కృతో గజముఖో నరః ।
తతః ప్రీతా గిరిసుతా తం పుత్రం పరిషస్వజే ॥71॥

అతనిని వెంటబెట్టుకుని నందికి చూపించి, హరుడు అతని సమాచారాన్ని చెప్పాడు. అనంతరం స్నానం చేసి ఆత్మపూజ, దేవపితృపూజలు పవిత్రమంత్రాలతో గావించి, సహస్రనామాలు జపిస్తూ ఉమను సమీపించి, నవ్వుతూ "పర్వతపుత్రీ! సకలగుణాఢ్యుడైన ఈ నీ కుమారుని చూడుము" అని పలికాడు. అంతట పార్వతి తన నలుగుపిండితో చేసిన బొమ్మ గజముఖంతో కూడిన నరునిగా మారడం చూసి సంతోషించి కౌగిలించుకున్నది.

మూర్ధ్ని చైనముపాఘ్రాయ తతః శర్వోఽబ్రవీదుమామ్ ।
నాయకేన వినా దేవి మయా భూతోఽపి పుత్రకః ॥72॥

యస్మాజ్జాతస్తతో నామ్నా భవిష్యతి వినాయకః ।
ఏష విఘ్నసహస్రాణి దేవాదీనాం హనిష్యతి ॥73॥

పూజయిష్యన్తి దేవాశ్చ దేవి లోకాశ్చరాచరాః ।
ఇత్యేవముక్త్వా దేవ్యాస్తు దత్తవాంస్తనయం స హి ॥74॥

ముఖంపై ముద్దాడిన ఉమను చూసి శర్వుడిలా పలికాడు. "నాయకుడు (తండ్రి) లేకుండా పుట్టిన ఈ బిడ్డ వినాయకుడు. ఆ పేరుతో మన కుమారుడు దేవతల వేలాది విఘ్నాలను తొలగిస్తాడు. ఇతనిని దేవతలు, చరాచర జీవులు అందరు పూజిస్తారు" అని పలికి శివుడు ఆ కుమారుని ఉమకు అప్పగించాడు.

సహాయం తు గణశ్రేష్ఠం నామ్నాఖ్యాతం ఘటోదరమ్ ।
తథా మాతృగణా ఘోరా భూతా విఘ్నకరాశ్చ యే ॥75॥

తే సర్వే పరమేశేన దేవ్యాః ప్రీత్యోపపాదితాః ।
దేవీ చ తం సుతం దృష్ట్వా పరాం ముదమవాప చ ॥76॥

సర్వగణాలలో శ్రేష్ఠుడైన ఘటోదరుడను వానిని, విఘ్నాలు కలుగజేసే మాతృగణాలను, భూతాలను వినాయకునకు సహాయకులుగా నియమించాడు. వీరినందరిని పరమేశ్వరుడు పార్వతి ప్రీతికోసం నియమించాడు. పార్వతీదేవి తన కుమారుని చూసి నిజంగానే పరమానందాన్ని పొందింది.

రేమేఽథ శంభునా సార్ధం మందిరే చారుకందరే ।
ఏవం భూయోఽభవద్దేవీ ఇయం కాత్యాయనీ విభో ।
యా జఘాన మహాదైత్యౌ పురా శుంభనిశుంభకౌ ॥77॥

తదనంతరం పార్వతి మందరగిరిసుందరకందరాలలో శివునితో కలసి క్రీడించింది. "ఓ నారదా! ఈ విధంగా పూర్వం శుంభనిశుంభులను సంహరించిన కాత్యాయనియే మరల పార్వతిగా జన్మించింది.

ఏతత్తవోక్తం వచనం సుభాష్యం యథోద్భవః పర్వతతో మృడాన్యాః ।
స్వర్గ్యం యశస్యం చ తథాఽఘహారి ఆఖ్యానమూర్జస్కరమద్రిపుత్ర్యాః ॥78॥

"పర్వత పుత్రిగా మృడాని జన్మగాథ మిక్కిలి మంగళకరమైనది. పాపాలను పోగొట్టేది. స్వర్గాన్ని, యశస్సును చేకూర్చగలిగేది. ఈ భవ్యవృత్తాంతం నీకు వివరంగా వినిపించాను".

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే ఉమాసంభవే వినాయకోత్పత్తిర్నామ చతుష్పంచాశత్తమోఽధ్యాయః ॥54॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని ఉమాసంభవమందలి వినాయకోత్పత్తియనే యాభైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచపంచాశత్తమోఽధ్యాయః - యాభైఐదవ అధ్యాయం

దేవీమాహాత్మ్యే చండ,ముండవధః - దేవీమాహాత్మ్యంలో చండాసుర, ముండాసురులవధ

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

కశ్యపస్య దనుర్నామ్నా భార్యాఽఽసీద్ ద్విజసత్తమ ।
తస్యాః పుత్రత్రయం చాసీత్సహస్రాక్షాద్బలాధికమ్ ॥1॥

ఓ ద్విజసత్తమా! కశ్యపమహర్షికి దనువు అను పేరు గల భార్య కలదు. ఆమెకు ఇంద్రుని కంటె బలవంతులైన ముగ్గురు కుమారులు కలిగారు.

జ్యేష్ఠః శుంభ ఇతి ఖ్యాతో నిశుంభశ్చాపరోఽసురః ।
తృతీయో నముచిర్నామ మహాబలసమన్వితః ॥2॥

వారిలో జ్యేష్ఠుడు శుంభుడు, రెండవవాడు నిశుంభుడు. మూడవవాడు మహాబలసమన్వితుడైన నముచి.

యోఽసౌ నముచిరిత్యేవం ఖ్యాతో దనుసుతోఽసురః ।
తం హన్తుమిచ్ఛతి హరిః ప్రగృహ్య కులిశం కరే ॥3॥

త్రిదివేశం సమాయాంతం నముచిస్తు భయాదథ ।
ప్రవివేశ రథం భానోస్తతో నాశకదచ్యుతః ॥4॥

నముచిగా విఖ్యాతుడైన ఈ అసురుని సంహరించడానికి ఇంద్రుడు వజ్రాయుధంతో సముద్యుక్తుడు కాగా నముచి భయంతో సూర్యుని రథంలో ప్రవేశించాడు. ఇంద్రుడు అతనిని చంపలేకపోయాడు.

శక్రస్తేనాథ సమయం ప్రచక్రే స మహామనాః ।
అవధ్యత్వం వరం ప్రాదాచ్ఛస్త్రైరస్త్రైశ్చ నారద ॥5॥

ఓ నారదా! అతనిని చంపడానికి వీలిగాక వానితో ఇంద్రుడు సంధి చేసుకుని, అతనికి శస్త్రాస్త్రాలతో చావులేకుండునట్లు వరమిచ్చాడు.

తతోఽవధ్యత్వమాజ్ఞాయ శస్త్రైరస్త్రైశ్చ నారద ।
సంత్యజ్య భాస్కరరథం పాతాలముపయాదథ ॥6॥

ఓ నారదా! ఆ విధంగా శస్త్రాస్త్రాలతో అవధ్యుడని తెలుసుకొనిన నముచి సూర్యరథాన్ని విడిచి పాతాళం చేరుకున్నాడు.

స నిమజ్జన్నపి జలే సాముద్రం ఫేనముత్తమమ్ ।
దదృశే దానవపతిస్తం ప్రగృహ్యేదమబ్రవీత్ ॥7॥

నీటిలో మునిగిన రాక్షసునకు సముద్రపునురుగు కనిపించగా ఆ నురుగును అతడు చేతితో పట్టుకుని ఇలా పలికాడు.

యదుక్తం దేవపతినా వాసవేన వచోఽస్తు తత్ ।
అయం స్పృశతు మాం ఫేనః కరాభ్యాం గృహ్య దానవః ॥8॥

ముఖనాసాది కర్ణాదీన్ సమాపూర్య యథేచ్ఛయా ।
తస్మిన్ శక్రోఽసృజద్వజ్రమంతర్హితమపీశ్వరః ॥9॥

"దేవపతియైన ఇంద్రుడు చెప్పినట్లు జరుగుగాక" అని పలికి ఆ నురుగును దానవుడు చేతితో పట్టుకొని, నోటిని, ముక్కును, చెవులను దానితో గట్టిగా రుద్దుకున్నాడు. ఆ మడుగులో ఇంద్రుడు రహస్యంగా తన వజ్రాయుధాన్ని సృష్టించాడు.

తేనాసౌ రుద్ధనాసాస్యః పపాత చ మమార చ ।
సమయే చ తథా నష్టే బ్రహ్మహత్యాఽస్పృశద్ధరిమ్ ॥10॥

దానివలన దానవుని ముక్కు చెవులు భిన్నమై, మరణించాడు. ఇంద్రుని వాగ్దానానికి భంగం కలుగుతూ అయిన దనుజవధ వల్ల ఇంద్రునకు బ్రహ్మహత్యాపాతకం కలిగింది.

స చైతత్తీర్థమాసాద్య స్నాతః పాపాదముచ్యత ।
తతోఽస్య భ్రాతరౌ వీరౌ క్రుద్ధౌ శుంభనిశుంభకౌ ॥11॥

ఉద్యోగం సుమహత్కృత్వా సురాన్బాధితుమాగతౌ ।
సురాస్తేఽపి సహస్రాక్షం పురస్కృత్య వినిర్యయుః ॥12॥

ఇంద్రుడు ఈ తీర్థంలో స్నానమాచరించి బ్రహ్మహత్యా పాతకంనుండి విముక్తుడయ్యాడు. అంతట ఆ దానవుని సోదరులైన శుంభనిశుంభులు కోపాతిరేకంతో గొప్ప సన్నాహం చేసి, దేవతలను బాధించడానికి వచ్చారు. దేవతలు ఇంద్రుని నాయకత్వంలో వారితో యుద్ధం చేసి ఓడిపోయారు.

జితాస్త్వాక్రమ్య దైత్యాభ్యాం సబలాః స పదానుగాః ।
శక్రస్యాహృత్య చ గజం యామ్యం చ మహిషం బలాత్ ॥13॥

దానవులచే ఓడింపబడిన దేవతల బలాలను, బలగాలను దానవులు ఆక్రమించుకున్నారు. ఇంద్రుని ఐరావతాన్ని, యముని మహిషాన్ని బలవంతంగా దానవులు లాక్కున్నారు.

వరుణస్య మణిచ్ఛత్రం గదాం వై మరుతస్య చ ।
నిధయః శంఖపద్మాద్యా హృతాస్త్వాక్రమ్య దానవైః ॥14॥

వరుణుని మణిమయమైన ఛత్రాన్ని, మరుత్తుల గదను, కుబేరుని శంఖపద్మాది నిధులను, దానవులు బలప్రదర్శనం చేసి అపహరించారు.

త్రిలోకీ వశగా చాస్తేఽనయోర్నారద దైత్యయోః ।
ఆజగ్మతుర్మహీపృష్ఠం దదృశాతే మహాసురమ్ ॥15॥

రక్తబీజమథోచుస్తే కో భవానితి సోऽబ్రవీత్ ।

నారదా! ఆవిధంగా ముల్లోకాలను వశం చేసుకుని ఆ దానవులు భూలోకానికి వచ్చి అక్కడ మహాసురుడగు రక్తబీజుని చూసి నీవు ఎవ్వడవు? అని ప్రశ్నించారు.

స చాహ దైత్యోऽస్మి విభో సచివో మహిషస్య తు ॥16॥

రక్తబీజేతి విఖ్యాతో మహావీర్యో మహాభుజః ।
అమాత్యౌ రుచిరౌ వీరౌ చండముండావితి శ్రుతౌ ॥17॥

తావాస్తాం సలిలే మగ్నౌ భయాద్దేవ్యా మహాభుజౌ ।
యస్స్వాసీత్ప్రభురస్మాకం మహిషో నామ దానవః ॥18॥

నిహతః స మహాదేవ్యా వింధ్యశైలే సువిస్తృతే ।
భవన్తౌ కస్య తనయౌ కిం వా నామ్నా పరిశ్రుతౌ ।
కిం వీర్యౌ కిం ప్రభావౌ చ ఏతచ్ఛంసితుమర్హథ ॥19॥

అంతట అతడు "విభో! నేను దైత్యుడను. మహిషునకు సచివుడను. రక్తబీజుడని విఖ్యాతుడను. మహా బలుడను. మహాపరాక్రమవంతుడను. మా ప్రభువు మంత్రులైన చండముండులనే వీరులు దేవికి భయపడి ఈ జలాలలో దాగుకున్నారు. మా ప్రభువులైన మహిషుడు దేవిచేత సువిశాలమైన వింధ్యపర్వతంపై సంహరింప బడ్డాడు. మీరెవరి కుమారులు? మీ పేర్లు ఏమిటి? మీ బలపరాక్రమాలేమిటో తెలియజేయండి" అని శుంభ నిశుంభులను అర్థించాడు.

శుంభనిశుంభావూచతుః – శుంభనిశుంభులు పలికారు.

అహం శుంభ ఇతి ఖ్యాతో దనోః పుత్రస్తథౌరసః ।
నిశుంభోऽయం మమ భ్రాతా కనీయాన్ శక్రదర్పహా ॥20॥

అనేన బహుశో దేవాః సేంద్రరుద్రదివాకరాః ।
సమేత్య నిర్జితా వీరా యే చాన్యే బలవత్తరాః ॥21॥

నేను దనువు కుమారుడను. శుంభుడని పేరొందినవాడను. ఇతడు నా తమ్ముడు. ఇంద్రుని మదమడచినవాడు. నిశుంభుడు. ఇతనిచే ఇంద్ర, రుద్ర, దివాకరాది దేవతలు ఇతరులైన అనేకబలవంతులు జయింపబడ్డారు.

తదుచ్యతాం కథం దైత్యో నిహతో మహిషాసురః ।
యావత్తాన్ఘాతయిష్యావః ససైన్యపరివారితౌ ॥22॥

ఇత్థం తయోస్తు వదతోర్నర్మదాయాస్తటే మునే ।
జలవాసాద్వినిష్క్రాన్తౌ చండముండౌ చ దానవౌ ॥23॥

తతో౽ భ్యేత్యాసురశ్రేష్ఠౌ రక్తబీజం సమాశ్రితౌ ।
ఊచతుర్వచనం శ్లక్ష్ణం కో౽ యం తవ పురస్సరః ॥24॥

"మహిషాసురుడనే దైత్యుడు ఏ విధంగా సంహరింపబడ్డాడో తెలుపుము. వెంటనే సైన్యంతో వెళ్ళి, వారిని సంహరించి వస్తాము" అని నర్మదానదీతీరంలో శుంభనిశుంభులు పలుకగా చండముండులనే దానవులు జలావాసం నుండి బయటకువచ్చి రక్తబీజుని ఆశ్రయించి, మృదువైన భాషతో నీవెవరితో మాట్లాడుచున్నావని రక్తబీజుని ప్రశ్నించారు.

స చోభౌ ప్రాహ దైత్యో౽ సౌ శుంభో నామ సురార్దనః ।
కనీయానస్య చ భ్రాతా ద్వితీయో హి నిశుంభకః ॥25॥

దానికతడు వారితో ఇలా పలికాడు. "వీరిరువురు దైత్యులు. ఇతడు సురార్దనుడైన శుంభుడు. రెండవవాడు ఇతని కనిష్ఠసోదరుడు నిశుంభుడు".

ఏతావాశ్రిత్య తాం దుష్టాం మహిషఘ్నీం న సంశయః ।
అహం వివాహయిష్యామి రత్నభూతాం జగత్త్రయే ॥26॥

నేను నిశ్చయంగా వీరిద్దరి సహాయం తీసుకొని ముల్లోకాలలో మహిళారత్నస్వరూపురాలు, మహిషుని సంహరించిన దుష్టురాలునైన ఈమెను వివాహమాడతాను.

చండ ఉవాచ – చండుడు పలికాడు.

న సమ్యగుక్తం భవతా రత్నార్హో౽ సి న సాంప్రతమ్ ।
యః ప్రభుః స్యాత్స రత్నార్హస్తస్మాచ్ఛుంభాయ యోజ్యతామ్ ॥27॥

తదా౽ ౽ చచక్షే శుంభాయ నిశుంభాయ చ కౌశికీమ్ ।
భూయో౽ పి తద్విధాం జాతాం కౌశికీం రూపశాలినీమ్ ॥28॥

"మీరు పలికిన మాటలు ఉచితమైనవి కావు. ఎందుకనగా మీరు దీనికి తగినవారు కారు. ఈ త్రిలోకరత్నం ప్రభువైన శుంభునకే తగినది. కావున ఈమెను శుంభునకు ఏర్పాటు చేద్దాము. అదే విధంగా రూపశాలినియైన కౌశికిని నిశుంభునకు ఏర్పాటు చేద్దాము" అని చండుడు పలికాడు.

తతః శుంభో నిజం దూతం సుగ్రీవం నామ దానవమ్ ।
దైత్యం చ ప్రేషయామాస సకాశం వింధ్యవాసినీమ్ ॥29॥

తదనంతరం శుంభుడు తన దూతయైన సుగ్రీవుడను పేరు గల దానవుని వింధ్యవాసిని చెంతకు పంపాడు.

స గత్వా తద్వచః శ్రుత్వా దేవ్యాగత్య మహాసురః ।
నిశుంభశుంభావాహేదం మన్యునా౽ భిపరిప్లుతః ॥30॥

అతడు వెళ్ళి దేవితో మాట్లాడి, కోపంతో తిరిగివచ్చి, శుంభనిశుంభులతో ఇలా పలికాడు.

సుగ్రీవ ఉవాచ – సుగ్రీవుడు పలికాడు.

యువయోర్వచనాద్దేవీ ప్రదిష్టా దైత్యనాయకౌ ।
గతవానహమద్యైవ తామహం వాక్యమబ్రవమ్ ॥ 31॥

"ఓ దైత్యనాయకులారా! మీ వచనానుసారం దేవితో మాట్లాడడానికి నేను వెళ్ళాను. నేను నేడే వెళ్ళి ఆమెతో ఇలా పలికాను.

యథా శుంభోఽతివిఖ్యాతః కకుదం దానవేష్వపి ।
స త్వాం ప్రాహ మహాభాగే ప్రభురస్మి జగత్త్రయే ॥32॥

ఓ భాగ్యశాలినీ! సుప్రసిద్ధదానవశ్రేష్ఠుడైన శుంభుడు నీతో ఇలా మాట్లాడమన్నాడు. "నేను ఈ ముల్లోకాలకు ప్రభువును.

యాని స్వర్గే మహీపృష్ఠే పాతాళే చాపి సుందరీ ।
రత్నాని సన్తి తావన్తి మమ వేశ్మని నిత్యశః ॥33॥

ఓ సుందరీ! స్వర్గ మర్త్య పాతాళలోకాలలోని రత్నాలన్నీ నా గృహంలో శాశ్వతంగా ఉన్నాయి.

త్వముక్తా చండముండాభ్యాం రత్నభూతా కృశోదరీ ।
తస్మాద్భజస్వ మాం వా త్వం నిశుంభం వా మమానుజమ్ ॥34॥

ఓ కృశోదరీ! నీవు స్త్రీరత్నానివని చండముండులు చెప్పగా విన్నాము. కావున నీవు నన్ను గాని, నా అనుజుడైన నిశుంభుని గాని, వివాహమాడుము" అని నా ద్వారా సందేశం పంపాడని ఆమెతో పలికాను.

సా చాహ మాం విహసతీ శృణు సుగ్రీవ మద్వచః ।
సత్యముక్తం త్రిలోకేశః శుంభో రత్నార్హ ఏవ చ ॥ 35॥

నా మాటలకామె పకపకా నవ్వి నాతో ఇలా పలికింది. "ఓ సుగ్రీవా! నీవు పలికినది నిజమే. త్రిలోకాధిపతియైన శుంభుడు ముల్లోకాలలోని రత్నాలనన్నిటిని ఉంచుకోవడానికి అర్హుడే.

కిం త్వస్తి మద్వినీతాయా హృదయే మే మనోరథః ।
యో మాం విజయతే యుద్ధే స భర్తా స్యాన్మహాసురః ॥36॥

"కాని మహాసురా! అభిమానవతియైన నా హృదయానికొక కోరిక కలదు. యుద్ధంలో నన్నెవడు జయిస్తాడో అతడే నాభర్త" అని సమాధానం చెప్పింది.

మయా చోక్తాఽవలిప్తాఽసి యో జయేత్స సురాసురాన్ ।
స త్వాం కథం న జయతే సా త్వముత్తిష్ఠ భామిని ॥37॥

సాఽథ మాం ప్రాహ కిం కుర్మో యదనాలోచితః కృతః ।
మనోరథస్తు తద్గచ్ఛ శుంభాయ త్వం నివేదయ ॥38॥

అందులకు నేను త్రిలోకాలను జయించినవాడు నిన్ను జయింపలేడా? వేరు మాటాడక రావలసినదని ఆమెతో పలుకగా అందులకామె "నేనేమి చేయగలను. అనాలోచితంగా నేనొక నిర్ణయం తీసుకున్నాను. కావున నీవు వెళ్ళి శుంభునకు నా మనోరథాన్ని తెలియజేయుము" అని నాతో పలికింది.

తయైవముక్తస్త్వభ్యాగం త్వత్సకాశం మహాసురః ।
తాం చాగ్ని కోటిసంకాశాం మత్వైవం కురు యత్ క్షమమ్ ॥39॥

"ఓ మహాసురా! ఆమె ఆవిధంగా పలుకగానే ఆ మాటలను నీకు తెలియజేసేందుకు నీవద్దకు తిరిగి వచ్చాను. ఆమె కోటి అగ్నులతో సమానంగా వెలుగొందుతోంది. ఇది మనస్సులో పెట్టుకుని తదనంతరం తగిన విధంగా చేయుమని" సుగ్రీవుడు శుంభునితో పలికాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇతి సుగ్రీవవచనం నిశమ్య స మహాసురః ।
ప్రాహ దూరస్థితం శుంభో దానవం ధూమ్రలోచనమ్ ॥40॥

ఇట్లు పలికిన సుగ్రీవుని మాటలను మహాసురుడైన శుంభుడు విని, దూరంగానున్న ధూమ్రలోచనుడనే దానవునితో ఇలా పలికాడు.

శుంభ ఉవాచ – శుంభుడు పలికాడు.

ధూమ్రాక్ష గచ్ఛ తాం దుష్టాం కేశాకర్షణవిహ్వలామ్ ।
సాపరాధాం యథా దాసీం కృత్వా శీఘ్రమిహానయ ॥41॥

ధూమ్రాక్షా! ఈ క్షణమే వెళ్ళి ఆ దుష్టురాలిని, నేరస్తురాలిని దాసినిగా చేసి, జుట్టుపట్టుకుని, ఈడ్చుకుని, వేగంగా ఇచ్చటకు తీసుకొని రమ్ము!

యశ్చాస్యాః పక్షకృత్ కశ్చిత్ భవిష్యతి మహాబలః ।
స హన్తవ్యోఽవిచార్యైవ యది హి స్యాత్ పితామహః ॥42॥

ఆమె పక్షాన ఎవరైనా నిలబడినచో అతడు పితామహుడైనా వానిని నిర్దాక్షిణ్యంగా వధించి, ఆమెను తీసుకొని రావలెనని శుంభుడు ఆజ్ఞాపించాడు.

స ఏవముక్తః శుంభేన ధూమ్రాక్షోఽక్షౌహిణీ శతైః ।
వృతః షడ్భిర్మహాతేజా విన్ధ్యం గిరిముపాద్రవత్ ॥43॥

శుంభుని ఆదేశానుసారం ధూమ్రాక్షుడు ఆరువందల అక్షౌహిణుల బలంతో వింధ్యాద్రికి పరుగుతీశాడు.

స తత్ర దృష్ట్వా తాం దుర్గాం భ్రాంతదృష్టిరువాచ హ ।
ఏహ్యేహి మూఢే భర్తారం శుంభమిచ్ఛస్వ కౌశికీ ।
న చేద్ బలాన్నయిష్యామి కేశాకర్షణ విహ్వలామ్ ॥44॥

అక్కడ దుర్గను చూసిన వెంటనే దిగ్భ్రాంతి చెందిన ధూమ్రాక్షుడు "ఓ మూర్ఖురాలా!, కౌశికీ! శుంభుని భర్తగా స్వీకరించుము. లేనిచో నేను నిన్ను బలవంతంగా జుట్టపట్టుకుని లాగుకొని పోతానని" గర్జించాడు.

శ్రీదేవ్యువాచ – శ్రీదేవి పలికింది.

ప్రేషితోఽసీహ శుంభేన బలాన్నేతుం హి మాం కిల ।
తత్ర కిం హ్యబలా కుర్యాద్యథేచ్ఛసి తథా కురు ॥45॥

"శుంభుడు నన్ను బలవంతంగా తీసుకుని వెళ్ళడానికి నిశ్చయించుకుని నిన్ను పంపితే ఈ విషయంలో అబలనైన నేనేమి చేయగలను? నీ ఇష్టప్రకారమే చేయుము" అని దేవి ధూమ్రాక్షునితో పలికింది.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏవముక్తో విభావర్యా బలవాన్ ధూమ్రలోచనః ।
సమభ్యధావత్ త్వరితో గదామాదాయ వీర్యవాన్ ॥46॥

ఈ విధంగా పలికిన దేవిమీదకు వీర్యవంతుడు బలవంతుడునైన ధూమ్రలోచనుడు గదను తీసుకుని వేగంగా పరుగెత్తి లంఘించాడు.

తమాపతంతం సగదం హుంకారేణైవ కౌశికీ ।
సబలం భస్మసాచ్చక్రే శుష్కమగ్నిరివేంధనమ్ ॥47॥

తన మీదకు గదాతో దూకుచున్న ఆ దుష్టుని చూసి అంబిక హుంకారం చేసింది. ఆ హుంకారం తోడనే తన సైన్యంతో సహా ధూమ్రాక్షుడు అగ్నిలోపడిన ఎండిన సమిధల వలె బూడిదయ్యాడు.

తతో హాహాకృతమభూజ్జగత్యస్మింశ్చరాచరే ।
సబలం భస్మసాన్నీతం కౌశిక్యా వీక్ష్య దానవమ్ ॥48॥
తచ్చ శుంభోఽపి శుశ్రావ మహచ్ఛబ్దముదీరితమ్ ।
అథాదిదేశ బలినౌ చండముండౌ మహాసురౌ ॥49॥

రురుం చ బలినాం శ్రేష్ఠం తదాఽఽజగ్ముర్ముదాఽన్వితాః ।
తేషాం చ సైన్యమతులం గజాశ్వరథసంకులమ్ ॥50॥

సమాజగామ సహసా యత్రాస్తే కోశసంభవా ।
తదాయాన్తం రిపుబలం దృష్ట్వా కోటిశతావరమ్ ॥51॥

సింహో౽ద్రవద్ ధుతసటః పాటయన్ దానవాన్ రణే ।
కాంశ్చిత్ కరప్రహారేణ కాంశ్చిదాస్యేన లీలయా ॥52॥

నఖరైః కాంశ్చిదాక్రమ్య ఉరసా ప్రమమాథ చ ।
తే వధ్యమానాః సింహేన గిరికన్దరవాసినా ॥53॥

భూతైశ్చ దేవ్యనుచరైశ్చన్డముణ్డౌ సమాశ్రయన్ ।
తావార్తం స్వబలం దృష్ట్వా కోపప్రస్ఫురితాధరౌ ॥54॥

సమాద్రవేతాం దుర్గాం వై పతఙ్గావివ పావకమ్ ।
తావాపతంతౌ రౌద్రౌ వై దృష్ట్వా క్రోధపరిప్లుతా ॥55॥

త్రిశాఖాం భ్రుకుటీం వక్త్రే చకార పరమేశ్వరీ ।
భ్రుకుటీ కుటిలాద్ దేవ్యా లలాటఫలకాద్ద్రుతమ్ ।
కాలీ కరాలవదనా నిఃసృతా యోగినీ శుభా ॥56॥

దానితో చరాచరజగత్తంతా హాహాకారాలతో దద్దరిల్లింది. ఆ భీషణశబ్దాన్ని శుంభుడు కూడా విని, మహాబలవంతులైన చండముండులను బలవంతులలో శ్రేష్ఠుడైన రురుని దేవితో యుద్ధం చేయడానికి పంపగా వారందరు అత్యుత్సాహంతో యుద్ధానికి బయలుదేరారు. వారంతా గజ, అశ్వ, రథ, పదాతులతో కూడిన అసంఖ్యాకమైన సైన్యంతో కౌశికి ఉన్నచోటుకి వెళ్ళారు. వందల, కోట్ల సంఖ్యలో వస్తున్న ఆ రాక్షస సేనను చూడడం తోడనే కౌశికి వాహనమైన సింహం జూలు ఝళిపించి, పంజా చాపి, గర్జిస్తూ దానవ సమూహంపైబడి సంహారకాండ సాగించింది. కొందరిని పంజా దెబ్బలతోను, కొందరిని కోరలతోను చీల్చింది. మరికొందరిని గోళ్ళతో వక్షఃస్థలాలను చీల్చి సంహరించింది. ఈ విధంగా సింహం చేతను, గిరికందరాలలోనున్న భూతగణాలచేతను, తదితర దేవీఅనుచరగణాలచేతను, చావుదెబ్బలు తింటూ తన నాయకులైన చండముండుల వద్దకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. ఆర్తనాదాలు చేస్తున్న తన బలగాలను చూసి, ఆ మహాసురులు మండిపడి, అగ్ని మీదకు దూకే మిడతల వలె దేవి మీదకు దూకారు. క్రోధోన్మత్తులై తనపై దూకుతున్న వారిని చూడగానే కోపంతో దేవి భ్రుకుటి ముడిపడింది. అంతట ఆమె ఫాలభాగం నుండి కరాళాకృతితో కళ్యాణియైన కాళి వెలువడింది.

ఖట్వాంగమాదాయ కరేణ రౌద్రమసిం చ కాలాంజనకోశముగ్రమ్ ।
సంశుష్కగాత్రా రుధిరాప్లుతాంగీ నరేన్ద్ర మూర్ధ్నా స్రజముద్వహన్తీ ॥57॥

కాంశ్చిత్ ఖడ్గేన చిచ్ఛేద ఖట్వాంగేన పరాన్ రణే ।
న్యషూదయత్ భృశం క్రుద్ధా సరథాశ్వగజాన్ రిపూన్ ॥58॥

ఆ కాళి ఖట్వాంగం, కరవాలం ధరించింది. ఆ కరవాలం నల్లనికాటుకతో సమానమైన కాంతితో కూడి, మిక్కిలి భయంకరంగానున్నది. ఆమె మాంసశుష్కమై, రక్తసిక్తమైన శరీరంతో నరముఖమాల మెడలో వ్రేలాడుచుండగా

శత్రుమూకలను సంహరింపసాగింది. కొందరిని ఖడ్గంతో నరికింది. ఇతరుల తలను ఖట్వాంగంతో నుగ్గు చేసింది. ఎందరినో రథగజాశ్వాలతో సహా యమసదనానికి పంపించింది.

చర్మాంకుశం ముద్గరం చ సధనుష్కం సఘంటికమ్ ।
కుంజరం సహయంత్రేణ ప్రచిక్షేప ముఖేఽమ్బికా ॥59॥

కాళిక తన నోటిలోనికి ఎందరో శత్రువీరులను చర్మాంకుశముద్గరఘంటాధనుర్గజయంత్రాలతో సహా విసిరివేసింది.

సచక్రకూబరరథం ససారథితురంగమమ్ ।
సమం యోధేన వదనే క్షిప్య చర్వయతేఽమ్బికా ॥60॥

చక్రములు, కాడి గుఱ్ఱములు మరియు యోధులతో సహా రథాలను తన నోటిలో పడవేసుకుని వారినందరిని నమిలి పొడిపొడి గావించింది.

ఏకం జగ్రాహ కేశేషు గ్రీవాయామపరం తథా ।
పాదేనాక్రమ్య చైవాన్యం ప్రేషయామాస మృత్యవే ॥61॥

ఒకరిని జుట్టు పట్టుకుని, మరొకరిని మెడ పట్టుకుని, కొందరిని నేలపై పడగొట్టి, కొందరిని కాళ్ళతో మర్దించి మృత్యుదేవతకు అప్పగించింది.

తతస్తు తద్బలం దేవ్యా భక్షితం సబలాధిపమ్ ।
రురుర్దృష్ట్వా ప్రదుద్రావ తం చండీ దదృశే స్వయమ్ ॥62॥

ఆజఘానాథ శిరసి ఖట్వాంగేన మహాసురమ్ ।
స పపాత హతో భూమ్యాం ఛిన్నమూల ఇవ ద్రుమః ॥63॥

ఆ విధంగా దేవి సైన్యాధిపతితో సహా శత్రుబలాలనన్నిటిని భక్షించడం చూసి రురుడు పారిపోసాగాడు. ఆ విధంగా పారిపోవుచున్న రురుని చూసి దుర్గ తన ఖట్వాంగంతో వాని తలమీద ప్రహారం చేయగా వాడు నరకబడిన మహావృక్షం వలె నేలకూలాడు.

తతస్తం పతితం దృష్ట్వా పశోరివ విభావరీ ।
కోశముత్కర్తయామాస కర్ణాదిచరణాన్తికమ్ ॥64॥

ఆ విధంగా నేలమీద పడిపోయిన ఆ అసురుని చూసి పశువుయొక్క చెవినుండి పాదాలవరకు గల చర్మాన్ని కోసినట్లుగా వాని కవచాన్ని కత్తిరించింది.

సా చ కోశం సమాదాయ బబన్ధ విమలా జటాః ।
ఏకా న బంధమగమత్ తాముత్పాట్యాక్షిపద్ భువి ॥65॥

ఆ విధంగా కోసిన కవచం (కోశం) తీసుకుని దుర్గాదేవి దానితో జడలల్లింది. అందులో ఒకటి ఉపయోగ పడకపోవడంతో దానిని కోపంతో నేలమీదకు విసరికొట్టింది.

సా జాతా సుతరాం రౌద్రీ తైలాభ్యక్తశిరోరుహా ।
కృష్ణార్ధమర్ధశుక్లం చ ధారయంతీ స్వకం వపుః ॥ 66॥

దానినుండి నూనె కారుతున్న జుత్తుతో సగం నలుపు, సగం తెలుపు గల దేహంతో ఒక రౌద్రాకృతి ఉద్భవించింది.

సాఽబ్రవీత్ వరమేకన్తు మారయామి మహాసురమ్ ।
తస్యా నామ తదా చక్రే చండమారీతి విశ్రుతమ్ ॥67॥

ఆమె నేనొక శ్రేష్ఠుడైన మహాసురుని సంహరిస్తానని అరిచింది. అందుచేత దేవి ఆ రౌద్రాకృతికి **చండమారి** అని నామకరణం చేసింది.

ప్రాహ గచ్ఛస్వ సుభగే చండముండావిహానయ ।
స్వయం హి మారయిష్యామి తావానేతుం త్వమర్హసి ॥68॥

దేవి చండమారితో "సుభగే! నీవు వెళ్ళి చండముండులనిరువురిని ఇక్కడకు తీసుకురమ్ము! వారిరువురిని నేను సంహరిస్తాను. వారిరువురిని పట్టి తీసుకుని రావడంలో నీవు సమర్థురాలవు" అని పలికింది.

శ్రుత్వైవం వచనం దేవ్యాః సాఽభ్యద్రవత తావుభౌ ।
ప్రదుద్రువతుర్భయార్తౌ దిశమాశ్రిత్య దక్షిణామ్ ॥69॥

దుర్గాదేవి ఆజ్ఞను వినిన చండమారి చండముండులను వెంబడించగా వారు భయార్తులై మిక్కిలి వేగంగా దక్షిణదిశగా పరుగిడసాగారు.

తతస్తావపి వేగేన ప్రాధావత్ త్యక్తవాససౌ ।
సాఽధిరుహ్యా మహావేగం రాసభం గరుడోపమమ్ ॥70॥

ఆ విధంగా వారు వేగంగా పరుగెట్టడం వల్ల వస్త్రములు ఊడిపోవుచున్నను గణింపక మిక్కిలి వేగంగా పరుగిడసాగారు. అంతట ఆ దేవి గరుడుని వేగంతో సమానమైన వేగం గల గాడిదను ఎక్కి వారిని వెంబడించసాగింది.

యతో గతౌ చ తౌ దైత్యౌ తత్రైవానుయయౌ శివా ।
సా దదర్శ తదా పౌండ్రం మహిషం వై యమస్య చ ॥71॥

ఆ రాక్షసులు ఎక్కడకు వెళ్ళుచున్నారో మంగళకరమైన ఆ దేవి కూడా వారిని వెంబడించి వెళ్లసాగింది. ఆ విధంగా వెళుతున్న సమయంలో ఆమెకు యముని వాహనమైన పౌండ్రమను పేరుగల మహిషం కనబడింది.

సా తస్యోత్పాటయామాస విషాణం భుజగాకృతిమ్ ।
తం ప్రగృహ్యా కరేణైవ దానవావన్వగాజ్జవాత్ ॥72॥

అంతట ఆ దేవి భుజగాకృతితోనున్న దాని కొమ్మును పెకలించి, పట్టుకుని ఆ దానవులిరువురిని వేగంగా వెంబడించింది.

తౌ చాపి భూమిం సంత్యజ్య జగ్మతుర్గగనం తదా ।
వేగేనాభిసృతా సా చ రాసభేన మహేశ్వరీ ॥73॥

అంతట ఆ దానవవీరులు ఇరువురు భూమిని వదలి, ఆకాశమార్గంలో పోవుచుండగా ఆ దేవి కూడా వారివెంట గాడిదమీద అనుసరించింది.

తతో దదర్శ గరుడం పన్నగేంద్రం చిఖాదిషుమ్ ।
కర్కోటకం స దృష్ట్వైవ ఊర్ధ్వరోమా వ్యజాయత ॥74॥

అంతట ఒకచోట కర్కోటకమహాసర్పాన్ని తినబోవుచున్న గరుడుడు కనిపించాడు. దేవిని చూడగానే భయంతో దానికి (గరుడపక్షికి) రోమాంచం కలిగింది.

భయార్తశ్చైవ గరుడో మాంసపిండోపమో బభౌ ।
న్యపతంస్తస్య పత్రాణి రౌద్రాణి హి పతత్రిణః ॥75॥

ఆ గరుడపక్షి భయంతో కంపించి మాంసం ముద్దగా అయిపోయింది. దాని వంటిమీది రెక్కలు ఊడిపడ్డాయి.

ఖగేన్ద్రపత్రాణ్యాదాయ నాగం కర్కోటకం తథా ।
వేగేనానుసరద్దేవీ చండముండౌ భయాతురౌ ॥76॥

అంతట ఆ దేవి గరుడుని రెక్కలను, కర్కోటక మహాసర్పాన్ని చేజిక్కించుకుని భయాతురులైన చండముండులను వెంబడించింది.

సంప్రాప్తౌ చ తదా దేవ్యా చండముండౌ మహాసురౌ ।
బద్ధౌ కర్కోటకేనైవ బద్ధ్వా వింధ్యముపాగమత్ ॥77॥

దేవి మహాసురులైన చండముండులను చేరగానే వారిని పట్టుకుని కర్కోటకమహాసర్పంతో బంధించి వింధ్యపర్వతానికి కొనివచ్చింది.

నివేదయిత్వా కౌశిక్యై కోశమాదాయ భైరవమ్ ।
శిరోభిర్దానవేంద్రాణాం తార్క్ష్యపత్రైశ్చ శోభనైః ॥78॥

కృత్వా స్రజమనౌపమ్యాం చండికాయై న్యవేదయత్ ।

అంతట భయంకరమైన ఆ కవచాన్ని కౌశికీదేవికి సమర్పించింది. అట్లే గరుడుని ఈకలతో అలంకరింపబడి ఆ దానవేంద్రుల తలలను అద్వితీయమైన మాలగా తయారుచేసి, చండికకు సమర్పించింది.

ఘర్ఘరాం చ మృగేంద్రస్య చర్మణః సా సమార్పయత్ ॥79॥

స్రజమన్యైః ఖగేన్ద్రస్య పత్రైర్మూర్ధ్ని నిబధ్య చ ।
ఆత్మనా సా పపౌ పానం రుధిరం దానవేష్వపి ॥80॥

దానితో బాటు సింహంచర్మంతో చేసిన వడ్డాణాన్ని కూడా సమర్పించింది. మిగిలిన గరుత్మంతుని ఈకలతో తయారుచేసిన మాలను తన శిరస్సునకు కట్టుకుని కడుపారా రాక్షసుల రక్తాన్ని చండమారి త్రాగింది.

చండాత్త్వాదాయ చండం చ ముండం చాసురనాయకమ్ ।
చకార కుపితా దుర్గా విశిరస్కౌ మహాసురౌ ॥81॥

ఆ చండమారి సమర్పించిన మహాసురులైన ఆ చండముండులను చేతితో పట్టుకుని కుపితయైన దుర్గాదేవి వారి శిరస్సులను ఖండించింది.

తయోరేవాహినా దేవీ శేఖరం శుష్కరేవతీ ।
కృత్వా జగామ కౌశిక్యాః సకాశం మార్యయా సహ ॥82॥

సమేత్య సాఽబ్రవీద్దేవీ గృహ్యతాం శేఖరోత్తమః ।
గ్రథితో దైత్యశీర్షాభ్యాం నాగరాజేన వేష్టితః ॥83॥

అంతట శుష్కరేవతీదేవి వారి శిరస్సులను నాగరాజుతో కూర్చి ఒక శిరోభూషణాన్ని తయారుచేసి, చండమారితో కలసి, కౌశికి వద్దకు వెళ్ళి, భగవతీ! నాగరాజుతో వేష్టితమైనట్టియు, దైత్యుల శిరస్సులతో కూర్చినట్టియు, ఈ ఉత్తమమైన శిరోవేష్టనాన్ని స్వీకరించుమని పలికి ఆమెకు సమర్పించింది.

తం శేఖరం శివా గృహ్య చండాయా మూర్ధ్ని విస్తృతమ్ ।
బబన్ధ ప్రాహ చైవైనాం కృతం కర్మ సుదారుణమ్ ॥84॥

శేఖరం చండముండాభ్యాం యస్మాద్ధారయసే శుభమ్ ।
తస్మాల్లోకే తవ ఖ్యాతిశ్చాముండేతి భవిష్యతి ॥85॥

కౌశికీదేవి దానిని తీసుకుని చండమారి శిరస్సును అలంకరించి "నీవు భయంకరమైన కార్యం సాధించావు. ఈ చండముండుల శిరోమాలను ధరించి, నేటినుండి చాముండ అనే శుభనామంతో ఖ్యాతిని గాంచగలవని పలికింది.

ఇత్యేవముక్త్వా వచనం త్రినేత్రా సా చండముండస్రజధారిణీం వై ।
దిగ్వాససం చాభ్యవదత్ ప్రతీతా నిషూదయ స్వారిబలాన్యమూని ॥86॥

ఇట్లు పలికి త్ర్యంబకేశ్వరి "ఇక వెళ్ళి మిగిలిన శత్రువులనందరిని సంహరింపుమని చండముండుల శిరోమాల ధరించి దిగంబరంగానున్న చాముండనాదేశించింది.

సాత్త్వేవముక్తాఽథ విషాణకోట్యా సువేగయుక్తేన చ రాసభేన ।
నిషూదయన్తీ రిపుసైన్యముగ్రం చచార చాన్యానసురాంశ్చఖాద ॥87॥

అట్లేయని రాసభవాహినియైన చాముండ వేగంగా వెళ్లి దున్నపోతు కొమ్ముతో విజృంభించింది. ఉగ్రమైన శత్రుసైన్యాన్ని సంహరించింది. ఇంకను మిగిలినవారినందరిని మ్రింగివేసింది.

తతోఽమ్బికాయాస్త్వథ చర్మముండయా మార్యా చ సింహేన చ భూతసంఘైః ।
నిపాత్యమానా దనుపుంగవాస్తే కకుద్మినం శంభుముపాశ్రయంత ॥88॥

ఆ విధంగా అంబిక యొక్క సింహంచేత, చర్మముండచేత, భూతగణాలచేత నిశ్శేషంగా వధింపబడిన దానవ పుంగవులందరు శంభుని లోకానికి చేరారు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే దేవీమాహాత్మ్యే చండముండవధో నామ పంచపంచాశత్తమోఽధ్యాయః ॥55॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని దేవీమాహాత్మ్యమందలి చండముండవధ అనే యాభైఐదవ అధ్యాయం సమాప్తం.



షట్పంచాశత్తమోఽధ్యాయః – యాభైఆరవ అధ్యాయం

దేవీమాహాత్మ్యే శుంభ, నిశుంభవధః – దేవీమాహాత్మ్యంలో శుంభ, నిశుంభులవధ

పులస్త్య ఉవాచ – పులస్త్య మహర్షి పలికాడు.

చండముండౌ చ నిహతౌ దృష్ట్వా సైన్యం చ విద్రుతమ్ ।
సమాదిదేశాతిబలం రక్తబీజం మహాసురమ్ ।
అక్షౌహిణీనాం త్రింశద్భిః కోటిభిః పరివారితమ్ ॥1॥

ఓ నారదా! చండముండులు వధింపబడుట, తమ సైన్యమంతా చెల్లాచెదురగుట చూచి శుంభనిశుంభులు రక్తబీజుడనే ఘోరరాక్షసుని దేవితో యుద్ధం చేయడానికి ముప్పదికోట్ల అక్షౌహిణీసైన్యంతో పంపించారు.

తమాపతంతం దైత్యానాం బలం దృష్ట్వైవ చండికా ।
ముమోచ సింహనాదం వై తాభ్యాం సహ మహేశ్వరీ ॥2॥

తనతో యుద్ధానికి వస్తున్న దైత్యుల బలాన్ని చూచిన చండిక వారితో బాటు తాను కూడా భయంకరమైన సింహనాదం చేసింది.

నినదత్యాస్తతో దేవ్యా బ్రహ్మాణీ ముఖతోఽభవత్ ।
హంసయుక్తవిమానస్థా సాక్షసూత్రకమండలుః ॥3॥

ఆ విధంగా ఆమె గర్జిస్తూ ఉండగా ఆమె నోటినుండి అక్షమాల, కమండలాలు ధరించి, హంసవిమానం మీద కూర్చున్న బ్రహ్మాణి వెలువడింది.

మాహేశ్వరీ త్రినేత్రా చ వృషారూఢా త్రిశూలినీ ।
మహాహివలయా రౌద్రా జాతా కుండలినీ క్షణాత్ ॥4॥

మరుక్షణంలో త్రినేత్ర, త్రిశూల, సర్పకుండలాలు, వలయాలు ధరించి, వృషారూఢయై మాహేశ్వరి ఉద్భవించింది.

కంఠాదథ చ కౌమారీ బర్హిపత్రా చ శక్తినీ ।
సముద్భూతా చ దేవర్షే మయూరవరవాహనా ॥5॥

మహర్షీ! అంతట ఆమె కంఠంనుండి నెమలి ఈకలు, శక్తిని ధరించి, నెమలి వాహనారూఢయైన కౌమారి జన్మించింది.

బాహుభ్యాం గరుడారూఢా శంఖచక్రగదాసినీ ।
శార్ఙ్గబాణధరా జాతా వైష్ణవీ రూపశాలినీ ॥6॥

మహర్షీ! ఆమె బాహువులనుండి శంఖచక్రగదాశార్ఙ్గ బాణములను ధరించినట్టియు, గరుడారూఢ యైనట్టియు, రూపసియైనట్టియు వైష్ణవి జన్మించింది.

మహోగ్రముసలా రౌద్రా దంష్ట్రోల్లిఖితభూతలా ।
వారాహీ పృష్ఠతో జాతా శేషనాగోపరిస్థితా ॥ 7॥

ఆమె పృష్ఠభాగం నుండి మహోగ్రయై, రోకలి పట్టుకుని, క్రోధం పొంది, దంష్ట్రలతో భూమిని తవ్వుతూ, శేషనాగంపై కూర్చొని వారాహీదేవి ఆవిర్భవించింది.

వజ్రాంకుశోద్యతకరా నానాలంకారభూషితా ।
జాతా గజేంద్రపృష్ఠస్థా మాహేన్ద్రీ స్తనమండలాత్ ॥ 8॥

ఆమె స్తనమండలంనుండి నానాలంకారభూషితురాలు, వజ్రాంకుశములు ధరించి పైకెత్తబడిన చేతులు కలదియు, గజేంద్రుని అధిరోహించినట్టియు మాహేంద్రి ఆవిర్భవించింది.

విక్షిపంతీ సటాక్షేపైర్గ్రహనక్షత్రతారకాః ।
నఖినీ హృదయాజ్జాతా నారసింహీ సుదారుణా ॥ 9॥

తదనంతరం ఆ దేవి హృదయం నుండి భయంకరమైన జూలు విదిల్చి ఆ సటలతో ఆకాశంలోని గ్రహనక్షత్ర తారలను చెదరగొట్టుచూ, వాడియైన గోళ్ళతో భయంకరాకారయైన నారసింహి బయటకు వచ్చింది.

తాభిః నిపాత్యమానం తు నిరీక్ష్య బలమాసురమ్ ।
ననాద భూయో నాదాన్వై చండికా నిర్భయా రిపూన్ ।
తన్నినాదం మహచ్ఛ్రుత్వా త్రైలోక్యప్రతిపూరకమ్ ॥ 10॥

సమాజగామ దేవేశః శూలపాణిః త్రిలోచనః ।
అభ్యేత్య వంద్య చైవైనాం ప్రాహ వాక్యం తదాఽమ్బికే ॥ 11॥

ఆ విధంగా ఆవిర్భవించినవారిచేత సంహరింపబడిన రాక్షసబలాన్ని చూసి నిర్భయంగా ఆ చండిక మరొకమారు భయంకరంగా గర్జించింది. ముల్లోకాలలో నిండిన ఆ మహానాదాన్ని విని దేవదేవుడు, త్రిశూలి, త్రినేత్రుడు అచటకు వచ్చి అంబికకు అభివాదం చేసి ఇలా పలికాడు.

సమాయాతోఽస్మి వై దుర్గే దేహ్యాజ్ఞాం కిం కరోమి తే ।
తద్వాక్యసమకాలం చ దేవ్యా దేహోద్భవా శివా ॥ 12॥

దుర్గే! నేను చేయవలసిన కర్తవ్యాన్ని ఆజ్ఞాపించమని కోరాడు. ఆయన ఆ వాక్యాలు పలికే సమయంలో దేవి శరీరంనుండి శివ బయటకు వచ్చింది.

జాతా సా చాహ దేవేశం గచ్ఛ దౌత్యేన శంకర ।
బ్రూహి శుంభం నిశుంభం చ యది జీవితుమిచ్ఛథ ॥ 13॥

తద్గచ్ఛధ్వం దురాచారాః సప్తమం హి రసాతలమ్ ।
వాసవో లభతాం స్వర్గం దేవాస్సన్తు గతవ్యథాః ॥ 14॥

ఆ విధంగా జన్మించిన శివ దేవేశుడైన శంకరునితో ఇలా పలికింది. ఓ శంకరా! నీవు శుంభనిశుంభుల వద్దకు దూతగా వెళ్ళి వారితో మీరు బ్రతుకదలచినచో వెంటనే సపరివారంగా సప్తపాతాళానికి వెళ్ళండి. స్వర్గం ఇంద్రునికి ఇచ్చివేయండి. దేవతలకందరకు వ్యథ కలుగకుండా ఉండాలి.

యజన్తు బ్రాహ్మణాద్యామీ వర్ణా యజ్ఞాంశ్చ సాంప్రతమ్ ।
నోచేద్బలావలేపేన భవంతో యోద్ధుమిచ్ఛథ ॥ 15॥

తదా గచ్ఛధ్వమవ్యగ్రా ఏషాఽహం వినిషూదయే ।

బ్రాహ్మణులు నిర్విఘ్నంగా యజ్ఞయాగాదులు చేసుకుంటారు. అట్లుగాక బలంతో క్రొవ్వి యుద్ధం చేయదలచుకుంటే అవశ్యంగా రండి. మిమ్ములనందరిని యమలోకానికి పంపుతామని తెలియజేయవలసినది అని చెప్పింది.

యతస్తు సా శివం దౌత్యే న్యయోజయత నారద ॥16॥

తతో నామ మహాదేవ్యాః శివదూతీత్యజాయత ।
తే చాపి శంకరవచః శ్రుత్వా గర్వసమన్వితమ్ ।
హుం కృత్వాఽభ్యద్రవన్ సర్వే యత్ర కాత్యాయనీ స్థితా ॥17॥

ఓ నారదా! ఆ మహాదేవి శివుని రాక్షసుల చెంతకు దూతగా పంపిన కారణంగా నాటినుండి ఆమెకు శివదూతి అనేపేరు కలిగింది. శంకరుని పలుకులు వినిన ఆ రాక్షసులు గర్వసమన్వితులై హుంకారాలు చేస్తూ కాత్యాయని ఉన్న వైపునకు పరుగులు తీశారు.

తతః శరైః శక్తిభిరంకుశైర్వరైః పరశ్వథైః శూలభుశుండిపట్టిశైః ।
ప్రాసైః సుతీక్ష్ణైః పరిఘైశ్చ విస్తృతైర్వవర్షతుర్దైత్యవరౌ సురేశ్వరీమ్ ॥18॥

అంతట ఆ రాక్షసులు బాణాలు, శక్తులు, అంకుశాలు, శ్రేష్ఠమైన పరశువులు, శూల భుశుండి పట్టిశాలు, వాడిగల ప్రాసలు, పరిఘులు మున్నగువానిని దేవిమీద విస్తృతంగా వర్షించారు.

సా చాపి బాణైర్వరకార్ముకచ్యుతైశ్చిచ్ఛేద శస్త్రాణ్యథ బాహుభిః సహ ।
జఘాన చాన్యాన్ రణచండవిక్రమా మహాసురాన్ బాణశతైర్మహేశ్వరీ ॥19॥

ఆ మహేశ్వరి కూడా ఉత్తమమైన ధనుస్సును సంధించి శరపరంపర కురిపించి, ప్రచండ విక్రమంతో మహాసురుల శస్త్రాలను తునాతునకలు చేయడమే గాక వారి బాహువులను కూడా ఖండించింది. ఆమె వందలాది బాణాలతో తక్కిన రణచండవిక్రములైన మిగిలిన మహాసురులను కూడా సంహరించింది.

మారీ త్రిశూలేన జఘాన చాన్యాన్ ఖట్వాంగపాతైరపరాంశ్చ కౌశికీ ।
మహాజలక్షేపహతప్రభావాన్ బ్రాహ్మీ తథాన్యానసురాంశ్చకార ॥20॥

చండమారి త్రిశూలంతో కొందరిని పరిమార్చింది. కౌశికి ఖట్వాంగంతో చాలామందిని వధించింది. అట్లే బ్రాహ్మి జలరాశిని రాక్షసులపై చిలకరించి వారి పరాక్రమాన్ని నిర్వీర్యం గావించి నశింపజేసింది.

మాహేశ్వరీ శూలవిదారితోరసశ్చకార దగ్ధానపరాంశ్చ వైష్ణవీ ।
శక్త్యా కుమారీ కులిశేన చైంద్రీ తుండేన చక్రేణ వరాహరూపిణీ ॥21॥

నఖైర్విభిన్నానపి నారసింహీ అట్టాట్టహాసైరపి రుద్రదూతీ ।
రుద్రస్త్రిశూలేన తథైవ చాన్యాన్ వినాయకశ్చాపి పరశ్వధేన ॥22॥

మాహేశ్వరి శూలంతో శత్రువుల వక్షాలను చీల్చి చంపగా వైష్ణవి దగ్ధం గావించి ఎందరినో రాక్షసులను నాశనం చేసింది. కుమారి శక్తితోను, ఐంద్రి వజ్రాయుధంతోను, వారాహి ముట్టెతోను, చక్రంతోను, నారసింహి తన వాడియైన గోళ్ళతో చీల్చియు, శివదూతి వికటాట్టహాసధ్వనులతోను ఎందరినో యమసదనానికి పంపించారు. ఇంకను మిగిలిన రాక్షసులను ఎందరినో రుద్రుడు త్రిశూలంతోను, వినాయకుడు పరశువుతోను హతమార్చారు.

ఏవం హి దేవ్యా వివిధైస్తు రూపైర్నిపాత్యమానా దనుపుంగవాస్తే ।
పేతుః పృథివ్యాం భువి చాపి భూతైస్తే భక్ష్యమాణాః ప్రలయం ప్రజగ్ముః ॥23॥

ఈ విధంగా పరమేశ్వరి తన అసంఖ్యాకమైన రూపాలతో దైత్యముఖ్యులనెందరినో సంహరించింది. ఆ విధంగా భూపతితులైన రాక్షసులనందరిని భూతగణాలు తినివేయడంతో మహాప్రళయం ఏర్పడింది.

తే వధ్యమానాస్త్వథ దేవతాభిర్మహాసురా మాతృభిరాకులాశ్చ ।
విముక్తకేశాస్తరలేక్షణా భయాత్ తే రక్తబీజం శరణం హి జగ్ముః ॥24॥

ఈ విధంగా దేవతల చేతను, మాతృశక్తిగణాల చేతను, మహాసురులు సంహరింపబడుచుండగా జుట్టు ముడులువీడి, భయంతో కూడిన చూపులతో అటునిటు చూస్తున్న వారునైన తక్కిన రాక్షసులు రక్తబీజుని శరణుజొచ్చారు.

స రక్తబీజః సహసాభ్యుపేత్య వరాస్త్రమాదాయ చ మాతృమండలమ్ ।
విద్రావయన్ భూతగణాన్ సమన్తాద్ వివేశ కోపాత్ స్ఫురితాధరశ్చ ॥25॥

అంతట ఆ రక్తబీజుడు భయంకరంగా గర్జిస్తూ శ్రేష్ఠమైన అస్త్రాలతో మాతృగణాలను, భూతగణాలను, చీకాకు పరుస్తూ, కోపంతో పెదవులు అదురుతూండగా కదనరంగంలో దూకాడు.

తమాపతన్తం ప్రసమీక్ష్య మాతరః శస్త్రైః శితాగ్రైర్దితిజం వవర్షుః ।
యో రక్తబిందుర్న్యపతత్ పృథివ్యాం స తత్ప్రమాణస్త్వసురోఽపి జజ్ఞే ॥26॥

ఆ విధంగా తమతో యుద్ధానికి ఉద్యుక్తుడైన రక్తబీజుని చూసి మాతృకాగణాలు వాడియైన శస్త్రాస్త్రాలను వానిపై వర్షించగా ఆ రాక్షసుని శరీరంనుండి రక్తబిందువులు నేలపై పడసాగాయి. ఆ విధంగా నేలపైబడిన రక్తబిందువులలోని ఒక్కొక్క రక్తబిందువునుండి ఆ రాక్షసునితో సమానమైన ఒక్కొక్క రాక్షసుడు పుట్టసాగాడు.

తతస్తదాశ్చర్యమయం నిరీక్ష్య సా కౌశికీ కేశినిమభ్యువాచ ।
పిబస్వ చండే రుధిరం త్వరాతేర్వితత్య వక్త్రం బడబానలాభమ్ ॥27॥

ఆ విచిత్రాన్ని గమనించిన కౌశికి కేశినిని పిలిచి "ఓ చండీ! బడబానలసదృశమైన నీ నోటిని విశాలంగా తెరచి ఆ రాక్షసుని శరీరంనుండి క్రిందపడే ప్రతిరక్తబిందువును నీవు త్రాగుము" అని ఆదేశించింది.

సా త్వేవముక్తా వరదాఽమ్బికా హి వితత్య వక్త్రం వికరాలముగ్రమ్ ।
ఓష్ఠం నభస్స్పృక్ పృథివీం స్పృశన్తం కృత్వాఽధరం తిష్ఠతి చర్మముండా ॥28॥

దేవి ఆదేశం ప్రకారం పైపెదవి ఆకాశాన్ని, క్రిందిపెదవి భూమిని తాకేటట్లు తన భయంకరమైన నోటిని తెరిచింది.

తతోఽంబికా కేశవికర్షణాకులం కృత్వా రిపుం ప్రాక్షిపత్ స్వే చ వక్త్రే ।
బిభేద శూలేన తథాఽప్యురస్తః క్షతోద్భవాన్యే న్యపతంశ్చ వక్త్రే ॥29॥

తతస్తు శోషం ప్రజగామ రక్తం రక్తక్షయే హీనబలో బభూవ ।
తం హీనవీర్యం శతధా చకార చక్రేణ చామీకరభూషితేన ॥30॥

అంతట అంబిక ఆ శత్రువును జుట్టుపట్టుకుని తన నోటిలో వేసుకుని మ్రింగివేసింది. శూలంతో వాని వక్షఃస్థలం ఛేదించి ఆరక్తబిందువులనుండి పుట్టిన రాక్షసులను కూడా మ్రింగివేసింది. శరీరంలోని రక్తమంతా పోవడంతో రక్తబీజుడు రక్తహీనుడయ్యాడు. వానిని వెంటనే స్వర్ణాలంకృతమైన తన చక్రంతో నూరు ముక్కలుగా ఖండించింది.

తస్మిన్ విశస్తే దనుసైన్యనాథే తే దానవా దీనతరం వినేదుః ।
హా తాత హా భ్రాతరితి బ్రువంతః క్వ యాసి తిష్ఠస్వ ముహూర్తమేహి ॥31॥

ఆ విధంగా రాక్షససైన్యాధిపతి మరణించడంతో దానవులంతా దైన్యంతో "హా తండ్రీ!, హా సోదరా! ఎక్కడకు వెళుతున్నావు? క్షణం ఆగుము! ఆగుము!" అంటూ ఆర్తనాదాలు గావించారు.

తథాఽపరే విలులితకేశపాశా విశీర్ణవర్మాభరణా దిగంబరాః ।
నిపాతితా ధరణితలే మృడాన్యా ప్రదుద్రువుర్గిరివరముహ్య దైత్యాః ॥32॥

జుట్టు విరబోసుకుని, వస్త్రాలు ఊడిపోగా, కవచాలు, ఆభరణాలు ముక్కలు కాగా భయకంపితులైన ఇతర దానవులనందరిని ఆ మృడాని నేలపై పడగొట్టింది. వారందరు బ్రతుకుజీవుడాయని ఆ పర్వతాన్ని వదలి పారిపోయారు.

విశీర్ణవర్మాయుధభూషణం తద్ బలం నిరీక్ష్యైవ హి దానవేన్ద్రః ।
విశీర్ణచక్రాక్షరథో నిశుంభః క్రోధాన్మృడానీం సముపాజగామ ॥33॥

ఆ విధంగా కవచాలు, ఆయుధాలు, భూషణాలు, భిన్నమై దిగంబరంగా పారిపోయి వచ్చిన తన బలాలను చూసి దానవేంద్రుడైన నిశుంభుడు చక్రాలు దెబ్బతిని ఇరుసులు ఊడుచున్న రథంతో క్రోధోన్మత్తుడై మృడానీదేవిని సమీపించాడు.

ఖడ్గం సమాదాయ చ చర్మ భాస్వరం ధున్వన్ శిరః ప్రేక్ష్య చ రూపమస్యాః ।
స స్తంభమోహజ్వరపీడితోఽథ చిత్రే యథాఽసౌ లిఖితో బభూవ ॥34॥

అంతట నిశుంభుడు మెరుస్తున్న ఖడ్గము, డాలు పట్టుకుని నిలబడి, ఆ దేవి సౌందర్యానికి ముగ్ధుడై చిత్ర లిఖితప్రతిమలాగ స్తంభించిపోయాడు.

తం స్తంభితం వీక్ష్య సురారిమగ్రే ప్రోవాచ దేవీ వచనం విహస్య ।
అనేన వీర్యేణ సురాస్త్వయా జితా అనేన మాం ప్రార్థయసే బలేన ॥35॥

ఆ విధంగా స్తంభించిపోయి ఎదురుగానున్న రాక్షసుని చూసి దేవి పకపక నవ్వుతూ, "ఈ పౌరుషంతోనేనా నీవు దేవతలను జయించింది? ఈ వీరత్వం చూచుకొనియేనా నీవు నన్ను పొందాలని చూస్తున్నది?" అని గేలిచేసింది.

శ్రుత్వా తు వాక్యం కౌశిక్యా దానవః సుచిరాదివ ।
ప్రోవాచ చింతయిత్వాఽథ వచనం వదతాం వరః ॥36॥

కౌశికి మాటలు విని, మాటకారియైన ఆ రాక్షసుడు క్షణకాలం ఆలోచించి ఇలా పలికాడు.

సుకుమార శరీరోఽయం మచ్ఛస్త్రపతనాదపి ।
శతధా యాస్యతే భీరు ఆమపాత్రమివాంభసి ॥37॥

ఓ భీరూ! నీ శరీరం అతిసుకుమారం. నా బాణాలు అతితీక్ష్ణాలు. ఒక్కవేటునకు నీళ్ళలోపడిన పచ్చికుండ వలె నూరు ముక్కలౌతుందని విచారిస్తున్నాను.

ఏతద్విచింతయన్నర్థం త్వాం ప్రహర్తుం న సుందరీ ।
కరోమి బుద్ధిం తస్మాత్త్వం మాం భజస్వాయతేక్షణే ॥38॥

ఈ విధంగా ఆలోచించడం చేత నిన్ను కొట్టేందుకు నా మనస్సు అంగీకరించడం లేదు. కాబట్టి ఓ విశాలాక్షీ!, ఓ సుందరీ! నీవు నన్ను సేవింపుము.

మమ ఖడ్గనిపాతం హి నేంద్రో ధారయితుం క్షమః ।
నివర్తయ మతిం యుద్ధాద్ భార్యా మే భవ సాంప్రతమ్ ॥39॥

నా కత్తివేటును ఇంద్రుడు కూడా భరింపజాలడు. కావున యుద్ధసంకల్పం వదలి నన్ను వివాహం చేసికొనుము.

ఇత్థం నిశుంభవచనం శ్రుత్వా యోగీశ్వరీ మునే ।
విహస్య భావగంభీరం నిశుంభం వాక్యమబ్రవీత్ ॥40॥

ఓ నారదా! నిశుంభుని ఈ మాటలు విని యోగీశ్వరి అర్థగర్భితంగా అతనితో ఇలా పలికింది.

నా జితాఽహం రణే వీర భవే భార్యా హి కస్యచిత్ ।
భవాన్ యదిహ భార్యార్థీ తతో మాం జయ సంయుగే ॥41॥

ఓ వీరా! యుద్ధంలో ఓడిపోకుండా నేనెవరికి భార్యనగుట సాధ్యం కాదు గదా! నీకు నేను భార్య కావాలని నీవు కోరుకున్నచో యుద్ధంలో నీవు నన్ను జయింపుము.

ఇత్యేవముక్తే వచనే ఖడ్గముద్యమ్య దానవః ।
ప్రచిక్షేప తదా వేగాత్ కౌశికీం ప్రతి నారద ॥42॥

ఓ నారదా! కౌశికియొక్క మాటలు వినగానే దానవుడైన నిశుంభుడు ఖడ్గాన్ని బలం కొలది దేవి మీదకు వేగంగా విసిరాడు.

తమాపతన్తం నిస్త్రింశం షడ్భిర్బర్హిణరాజితైః ।
చిచ్ఛేద చర్మణా సార్ధం తదద్భుతమివాఽభవత్ ॥43॥

తన మీదకు ప్రయోగింపబడిన ఖడ్గాన్ని, డాలును కౌశికి నెమలి పుంఖాలుకల ఆరుబాణాలు ప్రయోగించి ముక్కలు ముక్కలు గావించింది. ఇది చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఖడ్గే స చర్మణి ఛిన్నే గదాం గృహ్య మహాసురః ।
సమాద్రవత్ కోశభవాం వాయువేగసమో జవే ॥44॥

డాలుతో సహా ఖడ్గం ఛిన్నం కాగానే మహాసురుడు మహాకోపంతో గదను తీసుకుని వాయువేగంతో కౌశికి మీదకు దుమికాడు.

తస్యాపతత ఏవాశు కరౌ శ్లిష్టౌ సమౌ దృఢౌ ।
గదయా సహ చిచ్ఛేద క్షురప్రేణ రణేఽమ్బికా ॥45॥

అంతట అంబిక ఒక క్షురప్రంతో (అర్ధచంద్రబాణంతో) గదతో కూడిన ఆ దానవుని దృఢమైన రెండు చేతులను కూడా వెంటనే నరకివేసింది.

తస్మిన్నిపతితే రౌద్రే సురశత్రౌ భయంకరే ।
చండాద్యా మాతరో హృష్టాశ్చక్రుః కిలకిలా ధ్వనిమ్ ॥46॥

భయంకరుడు, రౌద్రుడు, దేవతలకు శత్రువగు ఆ రాక్షసుడు నేలకొరగగా చండమారి మొదలైన మాతృశక్తులు సంతోషంతో కిలకిలా శబ్దాలు చేశాయి.

గగనస్థాస్తతో దేవాః శతక్రతుపురోగమాః ।
జయస్వ విజయేత్యూచుర్హృష్టాః శత్రౌ నిపాతితే ॥47॥

తతస్తూర్యాణ్యవాద్యన్త భూతసంఘైః సమన్తతః ।
పుష్పవృష్టిం చ ముముచుః సురాః కాత్యాయనీం ప్రతి ॥48॥

శత్రువులు మరణించగానే ఇంద్రునితో సహా ఆకాశంలోనున్న దేవతలు సంతోషంతో జయజయధ్వానాలు చేశారు. భూతగణాలు తూర్యాలు మ్రోగించారు. దేవతలు కాత్యాయనీదేవిపై పుష్పవర్షం కురిపించారు.

నిశుంభం పతితం దృష్ట్వా శుంభః క్రోధాన్మహామునే ।
బృందారకం సమారుహ్య పాశపాణిః సమభ్యగాత్ ॥49॥

నిశుంభుని మరణాన్ని చూసిన శుంభుడు కోపంతో పాశం ధరించి, బృందారకమనే ఏనుగు మీదనెక్కి దేవిపైకి లంఘించాడు.

తమాపతన్తం దృష్ట్వాఽథ సగజం దానవేశ్వరమ్ ।
జగ్రాహ చతురో బాణాంశ్చంద్రార్ధాకారవర్చసః ॥50॥

ఆ విధంగా గజారూఢుడై వచ్చే రాక్షసాధముని గాంచి అంబిక అలవోకగా నవ్వుతూ అర్ధచంద్రాకారబాణాలు నాలుగు చేతితో తీసికున్నది.

క్షురప్రాభ్యాం సమం పాదౌ ద్వౌ చిచ్ఛేద ద్విపస్య సా ।
ద్వాభ్యాం కుంభే జఘానాథ హసంతీ లీలయాంబికా ॥51॥

అంబిక లీలగా రెండు క్షురప్రాలతో వాని ఏనుగు రెండుకాళ్ళను నరకి, తక్కిన రెండుబాణాలతో దాని కుంభస్థలాన్ని బద్దలు గావించింది.

నికృత్తాభ్యాం గజః పద్భ్యాం నిపపాత యథేచ్ఛయా ।
శక్రవజ్రసమాక్రాన్తం శైలరాజశిరో యథా ॥52॥

రెండుకాళ్ళు తెగిన ఆ ఏనుగు దేవేంద్రుని వజ్రఘాతానికి విరిగిన పర్వతశిఖరం వలె కుప్పకూలిపోయింది.

తస్యావర్జితనాగస్య శుంభస్యాప్యుత్పతిష్యతః ।
శిరశ్చిచ్ఛేద బాణేన కుండలాలంకృతం శివా ॥53॥

కూలిన ఏనుగునుండి క్రిందకు శుంభుడు దిగుతుండగానే పరమేశ్వరి మరొక బాణంతో కుండలాలతో వెలుగుతున్న శుంభుని తలను ఖండించింది.

ఛిన్నే శిరసి దైత్యేంద్రో నిపపాత సకుంజరః ।
యథా సమహిషః క్రౌంచో మహాసేనసమాహతః ॥54॥

కార్తికేయుని బాణాహతికి మహిషంతో కూడా నేలకొరిగిన క్రౌంచం వలె తల తెగిన ఆ మహాదైత్యుడు ఏనుగుతో బాటు నేలకొరిగాడు.

శ్రుత్వా సురాః సురరిపూ నిహతౌ మృడాన్యా సేంద్రాః ససూర్యమరుదశ్వివసుప్రధానాః ।
ఆగత్య తం గిరివరం వినయావనమ్రా దేవ్యాస్తదా స్తుతిపదం త్విదమీరయంతః ॥55॥

పరమేశ్వరి దేవశత్రువును వధించినవార్త విని, ఇంద్రుని ముందుంచుకుని సూర్య, యమ, మరుదశ్వినీ వసువులు మొదలైన దేవతలంతా వింధ్యగిరికి ఏతెంచి వినయావనతులై, చేతులుజోడించి, ఆ జగదంబికను ఇలా స్తుతించారు.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

నమోఽస్తు తే భగవతి పాపనాశిని నమోఽస్తు తే సురరిపుదర్పశాతని ।
నమోఽస్తు తే హరిహరరాజ్యదాయిని నమోఽస్తు తే మఖభుజకార్యకారిణి ॥56॥

హే భగవతీ!, పాపనాశినీ! నీకు నమస్సులు. దేవవిరోధుల దర్పం నాశమొనర్చు తల్లీ! హరిహరులకు రాజ్యమిచ్చు జననీ!, యజ్ఞకార్యాలు రక్షించు తల్లీ! నీకు నమస్సులు.

నమోఽస్తు తే త్రిదశరిపుక్షయంకరి నమోఽస్తు తే శతమఖపాదపూజితే ।
నమోఽస్తు తే మహిషవినాశకారిణి నమోఽస్తు తే హరిహరభాస్కరస్తుతే ॥57॥

దేవశత్రువులను దునుమాడు తల్లీ!, ఇంద్రునిచే పూజింపబడిన పాదాలు గల జననీ!, మహిషవినాశకారిణి యైన ఓ మాతా!, హరిహరభాస్కరులచే స్తుతింపబడిన జననీ! నీకు నమస్సులు.

నమోఽస్తు తేఽష్టాదశబాహుశాలిని నమోఽస్తు తే శుంభనిశుంభఘాతిని ।
నమోఽస్తు లోకార్తిహరే త్రిశూలిని నమోఽస్తు నారాయణి చక్రధారిణి ॥58॥

పద్ధెనిమిదిబాహువులతో శోభిల్లు తల్లీ! నీకు నమస్కారము. శుంభనిశుంభులను సంహరించిన నీకు నమస్సులు. త్రిశూలినీ!, లోకార్తిహారిణీ! నీకు నమస్కారము. నారాయణీ!, చక్రధారిణీ! నీకు నమస్కారము.

నమోఽస్తు వారాహి సదా ధరాధరే త్వాం నారసింహి ప్రణతా నమోఽస్తు తే ।
నమోఽస్తు తే వజ్రధరే గజధ్వజే నమోఽస్తు కౌమారి మయూరవాహిని ॥59॥

ఎల్లప్పుడూ భూమిని ధరించు వారాహీ! నీకు నమస్కారం. నారసింహీ! నీ పాదాలకు ప్రణతులు, నీకు నమస్కారం. వజ్రాయుధమును ధరించిన ఐంద్రీ! నీకు నమస్కారం. గజధ్వజే! నీకు నమస్కారం. మయూర వాహినీ! నీకు నమస్కారం.

నమోఽస్తు పైతామహహంసవాహనే నమోఽస్తు మాలావికటే సుకేశిని ।
నమోఽస్తు తే రాసభపృష్ఠవాహిని నమోఽస్తు సర్వార్తిహరే జగన్మయే ॥60॥

హంసవాహినివగు బ్రాహ్మీ! నీకు నమస్కారం. మాలాధారిణివగు సుకేశినీ! నీకు నమస్కారం. గార్దభారూఢవగు తల్లీ! నీకు నమస్కారం. సర్వార్తినాశనీ! జగన్మయీ! నీకు నమస్కారం.

నమోఽస్తు విశ్వేశ్వరి పాహి విశ్వం నిషూదయారీన్ ద్విజదేవతానామ్ ।
నమోఽస్తు తే సర్వమయి త్రినేత్రే నమో నమస్తే వరదే ప్రసీద ॥61॥

దేవబ్రాహ్మణ శత్రువులను సంహరింపుము, విశ్వమును రక్షింపుము విశ్వేశ్వరీ!, సర్వమయీ! నీకు నమస్కారం. మమ్ము రక్షింపుము. త్ర్యంబకే!, వరదాయినీ! నీకు ప్రణామాలు. మమ్ము అనుగ్రహింపుము.

బ్రహ్మాణీ త్వం మృడానీ వరశిఖిగమనా శక్తిహస్తా కుమారీ ।
వారాహీ త్వం సువక్త్రా ఖగపతిగమనా వైష్ణవీ త్వం సశార్ఙ్గీ ॥

దుర్దృశ్యా నారసింహీ ఘురఘురితరవా త్వం తథైంద్రీ సవజ్రా ।
త్వం మారీ చర్మముండా శవగమనరతా యోగినీ యోగసిద్ధా ॥62॥

నీవు బ్రహ్మాణివి. మృడానివి, నెమలి మీదనెక్కు శక్తిహస్తవైన కౌమారివి. వారాహివి. గరుడారూఢవై శార్ఙ్గం ధరించిన వైష్ణవీదేవివి నీవు. చూచుటకు భయంకరివై, ఘుర్ఘురధ్వనులు చేసే నారసింహివి నీవు. అట్లే వజ్రాయుధధారిణివైన మాహేంద్రివి నీవు. చండముండవు నీవు. శవగమనప్రియవు నీవు. నీవు యోగినివి. యోగసిద్ధవు. నీకు నమస్సులు.

నమస్తే త్రినేత్రే భగవతి తవ చరణానుషితా యే అహరహర్వినత శిరసోఽవనతాః ।
న హి న హి పరమస్త్యశుభం చ స్తుతిబలికుసుమకరాః సతతం యే ॥63॥

త్రినయనా!, భగవతీ! రాత్రింబవళ్ళు అవనతశిరులై నీ చరణాలను సేవించేవారికి స్తోత్రాలతో, బలి అన్నాలతో, పుష్పాలతో నిన్ను పూజించు ఘనులకు, జీవితంలో ఎట్టి అశుభం ఎన్నడూ కలుగనే కలుగదు. తల్లీ! నీకు నమోవాకములు.

ఏవం స్తుతా సురవరైః సురశత్రునాశినీ ప్రాహ ప్రహస్య సురసిద్ధమహర్షివర్యాన్ ।
ప్రాప్తో మయాఽద్భుతతమో భవతాం ప్రసాదాత్ సంగ్రామమూర్ధ్ని సురశత్రుజయః ప్రమర్దాత్ ॥64॥

ఈ స్తోత్రం విని రాక్షసనాశినియైన అంబిక వారితో "మీ ప్రసాదం వలననే సంగ్రామరంగంలో శత్రు విజయం నాకు చేకూరినదని" నవ్వుతూ పలికింది.

ఇమాం స్తుతిం భక్తిపరా నరోత్తమా భవద్భిరుక్తామనుకీర్తయంతి ।
దుఃస్వప్ననాశో భవితా న సంశయో వరస్తథాన్యో వ్రియతామభీప్సితః ॥65॥

మీరందరు గావించిన ఈ స్తోత్రాన్ని భక్తితో కీర్తించు మానవులకు దుఃస్వప్ననాశనం కలుగుతుంది. సందేహంలేదు. ఇక మీకు కావలసిన వరం కోరుకొనుమని ఆ తల్లి ఆదేశించింది.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

యది వరదా భవతీ త్రిదశానాం ద్విజశిశుగోషు యతస్వ హితాయ ।
పునరపి దేవరిపూనపరాంస్త్వం ప్రదహ హుతాశనతుల్యశరీరే ॥66॥

తల్లీ! దేవతలకు మరొక వరం ఈయదలచినచో బ్రాహ్మణశిశుగోవులకు మేలు గావింపుము. మరల నీ అగ్నిశరీరంతో రాక్షసులను భస్మమొనరింపుము.

దేవ్యువాచ – దేవి పలికింది.

భూయో భవిష్యామ్యసృగుక్షితాననా హరాననస్వేదజలోద్భవా సురాః ।
అంధాసురస్యాప్రతిపోషణే రతా నామ్నా ప్రసిద్ధా భువనేషు చర్చికా ॥67॥

దేవతలారా! నేను మరల శంకరుని ముఖమందలి స్వేదంనుండి రక్తంతో తడిసిన ముఖంతో జన్మించి అంధకాసురుని సంహరిస్తాను. అప్పుడు నన్ను చర్చిక అంటారు.

భూయో వధిష్యామి సురారిముత్తమం సంభూయ నందస్య గృహే యశోదయా ।
తం విప్రచిత్తిం లవణం తథాఽపరౌ శుంభం నిశుంభం దశనప్రహారిణీ ॥68॥

మరల నందుని ఇంట యశోదకు జన్మించి విప్రచిత్తిని, లవణాసురుని, శుంభనిశుంభాదులను నా దంతాదులతో చీల్చి చంపుతాను.

భూయః సురాస్తిష్య యుగే నిరాశనాన్నిరీక్ష్య మారీ చ గృహే శతక్రతోః ।
సంభూయ దేవ్యాఽమితసత్యధామయా సురా భరిష్యామి చ శాకసంకరైః ॥69॥

దేవతలారా! కలియుగంలో జనులు తిండిలేక మాడిపోవుచున్న సమయాన ఇంద్రుని ఇంట మరల నేను మారిగా పుట్టి అమితసత్యధామాదేవి సహాయంతో దేవతలకందరకు అన్ని రకాల కూరగాయలు సమకూర్చి రక్షిస్తాను. అప్పటి నా పేరు శాకంభరి.

భూయో విపక్షక్షపణాయ దేవా వింధ్యే భవిష్యామ్యృషిరక్షణార్థమ్ ।
దుర్వృత్తచేష్టాన్ వినిహత్య దైత్యాన్ భూయః సమేష్యామి సురాలయం హి ॥70॥

మరల శత్రువులను సంహరించి ఋషులను రక్షించుటకు వింధ్యగిరులలో పుట్టి, దుర్మార్గమైన చేష్టలు గల దైత్యులను సంహరించి మరల సురాలయానికి చేరుకుంటాను.

యదాఽరుణాక్షో భవితా మహాసురః తదా భవిష్యామి హితాయ దేవతాః ।
మహాలిరూపేణ వినష్టజీవితం కృత్వా సమేష్యామి పునస్త్రివిష్టపమ్ ॥71॥

తదనంతరం అరుణాక్షుడను మహాసురుడు ప్రజలను బాధించునప్పుడు నేనొక పెద్ద గండుతుమ్మెదగా పుట్టి ఆ రాక్షసుని చంపి, దేవతలకు మేలు గావించి, మరలా స్వర్గానికి వెళతాను.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్త్వా వరదా సురాణాం కృత్వా ప్రణామం ద్విజపుంగవానామ్ ।
విసృజ్య భూతాని జగామ దేవీ ఖం సిద్ధసంఘైరనుగమ్యమానా ॥72॥

వరదాయినియైన ఆ అంబిక ఈ విధంగా వరప్రదానం చేసి, బ్రాహ్మణశ్రేష్ఠులకు అభివాదం చేసి, భూతగణాదుల నందరిని పంపివైచి సిద్ధసంఘాదులు తన వెంటరాగా ఆకాశానికి వెళ్ళింది.

ఇదం పురాణం పరమం పవిత్రం దేవ్యా జయం మంగళదాయి పుంసామ్ ।
శ్రోతవ్యమేతన్నియతైః సదైవ రక్షోఘ్నమేతద్భగవానువాచ ॥73॥

అంబిక యొక్క విజయగాథలు తెలిపే ఈ ఆఖ్యానం చాలా పవిత్రమైనది, ప్రాచీనమైనది. ఈ పురాణం అన్ని శుభాలు చేకూర్చుతుంది. ఇది సకల రాక్షసనాశకమని, భగవానుడు స్వయంగా వక్కాణించినాడు. కావున మానవులందరు దీనిని సదా శ్రవణం చేస్తూ ఉండాలి.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే దేవీమాహాత్మ్యే శుంభనిశుంభవధో నామ షట్పంచాశత్తమోఽధ్యాయః ॥56॥

శ్రీవామన మహాపురాణమందలి పులస్త్యనారదసంవాదంలో దేవీమాహాత్మ్యమందు శుంభనిశుంభవధ అనే పేరుగల యాభైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తపంచాశత్తమోఽధ్యాయః – యాభైఏడవ అధ్యాయం

కార్తికేయోత్పత్తిః దేవసేనానాయకత్వప్రాప్తిశ్చ –

కార్తికేయజననం, దేవసేనానాయకుడుగా అభిషిక్తుడైన వృత్తాంతం

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కథం స మహిషః క్రౌంచో భిన్నః స్కందేన సువ్రత ।
ఏతన్మే విస్తరాద్ బ్రహ్మన్ కథయస్వామితద్యుతే ॥1॥

ఓ బ్రహ్మన్! ఓ గొప్పతేజస్సుకలవాడా! మహిషంతో కూడా క్రౌంచపర్వతాన్ని స్కందుడు ఏ విధంగా చీల్చాడు? విపులంగా నాకు తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శృణుష్వ కథయిష్యామి కథాం పుణ్యాం పురాతనీమ్ ।
యశోవృద్ధిం కుమారస్య కార్తికేయస్య నారద ॥2॥

ఓ నారదా! ఇది చాలా పురాతనమైన గాథ! చాలా పవిత్రమైనది. కార్తికేయుని యశోవృద్ధిని వివరించే ఈ కథను చెబుతున్నాను. శ్రద్ధగా వినుము.

యత్తత్పీతం హుతాశేన స్కన్నం శుక్రం పినాకినః ।
తేనాక్రాన్తోఽభవద్ బ్రహ్మన్ మందతేజా హుతాశనః ॥3॥

నారదా! శివుని వీర్యాన్ని మ్రింగిన అగ్నిదేవుడు ఆ తేజస్సును భరించలేక తన తేజస్సును కోల్పోయాడు.

తతో జగామ దేవానాం సకాశమమితద్యుతిః ।
తైశ్చాపి ప్రహితస్తూర్ణం బ్రహ్మలోకం జగామ హ ॥4॥

అంత ఆ అగ్నిదేవుడు దేవతల సమీపానికి వెళ్లగా వారందరు కలసి అతనిని బ్రహ్మలోకానికి పంపగా వేగంగా బ్రహ్మలోకానికి వెళ్ళాడు.

స గచ్ఛన్ కుటిలాం దేవీం దదర్శ పథి పావకః ।
తాం దృష్ట్వా ప్రాహ కుటిలే తేజ ఏతత్సుదుర్ధరమ్ ॥5॥

అగ్నిదేవుడు మార్గమధ్యంలో కుటిలాదేవిని చూసి ఆమెతో అమ్మా! ఈ శివతేజం భరింపలేకున్నాను.

మహేశ్వరేణ సంత్యక్తం నిర్దహేద్ భువనాన్యపి ।
తస్మాత్ ప్రతీచ్ఛ పుత్రోఽయం తవ ధన్యో భవిష్యతి ॥6॥

మహేశ్వరునిచే విడువబడిన ఇది ముల్లోకాలను దహిస్తుంది. అందుచేత దీనిని నీవు ధరిస్తే నీవు చక్కని పుత్రుని పొంది ధన్యురాలవు కాగలవు.

ఇత్యగ్నినా సా కుటిలా స్మృత్వా స్వమతముత్తమమ్ ।
ప్రక్షిపస్వాంభసి మమ ప్రాహ వహ్నిం మహాపగా ॥7॥

ఈ విధంగా చెప్పిన అగ్ని పలుకులు విని కుటిల తన వెనుకటి ఉదంతాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని నదీరూపం ధరించి ఆ శివవీర్యాన్ని తన నీటిలో విడువుమని అగ్నితో పలికింది.

తతస్త్వధారయద్దేవీ శార్వం తేజస్త్వపూపుషత్ ।
హుతాశనోఽపి భగవాన్ కామచారీ పరిభ్రమన్ ॥8॥

పంచవర్షసహస్రాణి ధృతవాన్ హవ్యభుక్ తతః ।
మాంసమస్థీని రుధిరం మేదోఽస్త్ర రేతసీ త్వచః ॥9॥

రోమ శ్మశ్వక్షి కేశాద్యాః సర్వే జాతా హిరణ్మయాః ।
హిరణ్యరేతా లోకేషు తేన గీతశ్చ పావకః ॥10॥

తదనంతరం ఆ దేవి శివవీర్యాన్ని ధరించి పోషించింది. అగ్ని కూడా తన బాధ వదిలించుకుని స్వేచ్ఛగా వెళ్ళిపోయాడు. అగ్ని ఐదువేలసంవత్సరాలు ఆ అద్భుతతేజాన్ని ధరించినందువల్ల దాని ప్రభావంచే అతని రక్తమాంసాస్థిమేదోంత్రరేతస్సులు, చర్మం, రోమాలు, కేశాలతో సహా అన్నీ బంగారుమయమైనాయి. ఆ కారణం చేత హుతాశనుడు ఈనాటికీ లోకాలన్నిటిలో హిరణ్యరేత అని కీర్తింపబడుతున్నాడు.

పంచవర్షసహస్రాణి కుటిలా జ్వలనోపమమ్ ।
ధారయన్తీ తదా గర్భం బ్రహ్మణః స్థానమాగతా ॥ 11॥

కుటిల కూడా ఐదువేలసంవత్సరాలు అగ్నిసమానమైన ఆ దివ్యవీర్యాన్ని తన గర్భంలో ధరించి ఆ వేడిని భరింపలేక బ్రహ్మవద్దకు వచ్చింది.

తాం దృష్టవాన్ పద్మజన్మా సంతప్యన్తీం మహాపగామ్ ।
దృష్ట్వా పప్రచ్ఛ కేనాయం తవ గర్భః సమాహితః ॥12॥

ఆ మహానది శివవీర్యజ్వాలలతో తాపం పొందుచుండడాన్ని చూసిన బ్రహ్మ ఆ శుక్రం నీ గర్భంలో ఎవరు ఉంచారు? అని ప్రశ్నించాడు.

సా చాహ శాంకరం యత్తచ్ఛుక్రం పీతం హి వహ్నినా ।
తదశక్తేన తేనాద్య నిక్షిప్తం మయి సత్తమ ॥13॥

ఓ మహానుభావా! శివశుక్రాన్ని త్రాగిన అగ్ని దానిని భరించలేక నాలో నిక్షిప్తం చేశాడని కుటిల బ్రహ్మతో చెప్పింది.

పంచవర్ష సహస్రాణి ధారయన్త్యాః పితామహ ।
గర్భస్య వర్తతే కాలో న పపాత చ కర్హిచిత్ ॥14॥

ఓ పితామహా! ఐదువేలసంవత్సరాలనుండి నేను దీనిని ధరిస్తున్నాను. అది ఇంకను పక్వదశకు వచ్చి బయట పడలేదని కుటిల తన గోడును బ్రహ్మతో చెప్పుకున్నది.

తచ్ఛ్రుత్వా భగవానాహ గచ్ఛ త్వముదయం గిరిమ్ ।
తత్రాస్తి యోజనశతం రౌద్రం శరవణం మహత్ ॥15॥

ఆమె మాటలను వినిన బ్రహ్మ ఆమెతో ఇలా పలికాడు నీవు వెంటనే ఉదయాద్రికి వెళ్ళుము. అక్కడ నూరుయోజనాల భయంకరమైన రెల్లువనం కలదు.

తత్రైనం క్షిప సుశ్రోణి విస్తీర్ణే గిరిసానుని ।
దశవర్షసహస్రాన్తే తతో బాలో భవిష్యతి ॥16॥

ఓ సుందరీ! ఈ తేజాన్ని సువిశాలమైన ఆ పర్వతసానువులలో ఉంచుము. పదివేలసంవత్సరాలు గడిచిన పిదప అందుండి బాలుడుద్భవించగలడు.

సా శ్రుత్వా బ్రహ్మణో వాక్యం రూపిణీ గిరిమాగతా ।
ఆగత్య గర్భం తత్యాజ ముఖేనైవాద్రినందినీ ॥17॥

బ్రహ్మ పలికిన ఈ పలుకులు విని ఆ సుందరి ఉదయగిరికి వెళ్ళి తన గర్భంలోని మహావీర్యాన్ని నోటితో వమనం గావించి, అచ్చట విడిచింది.

సా తు సంత్యజ్య తం బాలం బ్రహ్మాణం సహసాగమత్ ।
ఆపోమయీ మంత్రవశాత్ సంజాతా కుటిలా సతీ ॥18॥

బాలుడుగా పరిణమించనున్న ఆ మహావీర్యాన్ని అచ్చట విడిచిన కుటిల తిరిగి బ్రహ్మ చెంతకు చేరి, మంత్రశక్తి వలన తిరిగి నదిగా మారిపోయింది.

తేజసా చాపి శార్వేణ రౌక్మం శరవణం మహత్ ।
తన్నివాసరతాశ్చాన్యే పాదపా మృగపక్షిణః ॥19॥

శర్వుని తేజస్సువలన ఆ రెల్లువనమేగాక తత్సమీపమందలి వృక్షాలు, మృగాలు, పక్షులు మున్నగునవి అన్నియు బంగారు కాంతితో ప్రకాశింపసాగాయి.

తతో దశసు పూర్ణేషు శరద్దశశతేష్వథ ।
బాలార్కదీప్తిః సంజాతో బాలః అమలలోచనః ॥20॥

పదివేలసంవత్సరాలు గడచిన పిదప అందుండి ఉదయభానుని కాంతితో తామరపువ్వురేకులవంటి నేత్రాలతో చక్కని బాలుడు ఉద్భవించాడు.

ఉత్తానశాయీ భగవాన్ దివ్యే శరవణే స్థితః ।
ముఖేఽఙ్గుష్ఠం సమాక్షిప్య రురోద ఘనరాడివ ॥21॥

ఆ బాలుడు రెల్లువనంలో వెల్లకిలా పడుకొని, బొటనవ్రేలు నోటిలో పెట్టుకుని, మేఘగంభీరస్వనంతో ఏడ్వసాగాడు.

ఏతస్మిన్నంతరే దేవ్యః కృత్తికాః షట్ సుతేజసః ।
దదృశుః స్వేచ్ఛయా యాన్త్యో బాలం శరవణే స్థితమ్ ॥22॥

ఇంతలో ఆ ప్రాంతంలో స్వేచ్ఛగా సంచరిస్తున్న ఆరుగురు కృత్తికాసుందరీమణులు రెల్లువనంలోనున్న బాలుని చూశారు.

కృపాయుక్తాః సమాజగ్ముర్యత్ర స్కన్దః స్థితోఽభవత్ ।
అహంపూర్వమహంపూర్వం తస్మై స్తన్యేఽభిచుక్రుశుః ॥23॥

దయగల ఆ సుందరీమణులు స్కందుడున్న చోటుకు వచ్చారు. వారు నేను ముందంటే నేను ముందని ఆ బాలునికి స్తన్యం ఇచ్చేందుకు పోటీపడ్డారు.

వివదన్తీః స తా దృష్ట్వా షణ్ముఖః సమజాయత ।
అబీభరంశ్చ తాః సర్వాః శిశుం స్నేహాచ్చ కృత్తికాః ॥24॥

భ్రియమాణః స తాభిస్తు బాలో వృద్ధిమగాన్మునే ।
కార్తికేయేతి విఖ్యాతో జాతః స బలినాం వరః ॥25॥

ఆ కృత్తికల తగవు చూసి ఆ బాలుడు ఆరుముఖాలు కలవాడయ్యాడు. అంతట ఆరుగురు కృత్తికలు వాత్సల్యంతో మిక్కిలి ప్రేమతో ఆ బిడ్డకు పాలు త్రాగించారు. ఓ నారదా! ఆ విధంగా కృత్తికల స్తన్యపానం చేసి ఆ బాలకుడు దినదిన ప్రవర్ధమానుడయ్యాడు. బలవంతులలో శ్రేష్ఠుడైన ఆ బాలుడు కార్తికేయుడుగా ప్రసిద్ధి వహించాడు.

ఏతస్మిన్నంతరే బ్రహ్మన్ పావకం ప్రాహ పద్మజః ।
కియత్ప్రమాణః పుత్రస్తే వర్తతే సాంప్రతం గుహః ॥26॥

ఓ నారదా! ఈ లోపల బ్రహ్మ అగ్నిని "నీ కుమారుడు గుహుడు ఎంతవాడయ్యాడు?" అని ప్రశ్నించాడు.

స తద్వచనమాకర్ణ్య అజానంస్తం హరాత్మజమ్ ।
ప్రోవాచ పుత్రం దేవేశ న వేద్మి కతమో గుహః ॥27॥

శివవీర్యం బాలకుని రూపం ధరించడం తెలియకపోవడం వలన అగ్ని బ్రహ్మతో "ఆ పుత్రుడెవడో, గుహుడెవడో నాకు తెలియదు" అని పలికాడు.

తం ప్రాహ భగవాన్ యత్తు తేజః పీతం పురా త్వయా ।
త్ర్యంబకం త్రిలోకేశ జాతః శరవణే శిశుః ॥28॥

అంతట బ్రహ్మ అగ్నితో నీవు పూర్వం త్రాగి కుటిలానదీ జలాలలో విడిచిన శివవీర్యం శరవణంలో బాలకుడుగా రూపొందింది.

శ్రుత్వా పితామహవచః పావకస్త్వరితోఽభ్యగాత్ ।
వేగినం మేషమారుహ్య కుటిలా తం దదర్శ హ ॥29॥

పితామహుని వాక్కులు విని, మహావేగంగా పరుగెత్తేమేకమీద కూర్చుని శరవణానికి వెళ్ళు చున్న అగ్నిని కుటిల చూచింది.

తతః పప్రచ్ఛ కుటిలా శీఘ్రం క్వ వ్రజసే కవే ।
సోఽబ్రవీత్ పుత్రదృష్ట్యర్థం జాతం శరవణే శిశుమ్ ॥30॥

ఓ అగ్నిదేవా! ఇంతవేగంగా ఎక్కడకు వెళ్ళుచున్నావని కుటిల అగ్నిని ప్రశ్నించింది. అంతట అగ్ని కుటిలతో శరవణంలో జన్మించిన నా పుత్రుని చూడడానికి వెళ్ళుతున్నానని జవాబిచ్చాడు.

సాఽబ్రవీత్ తనయో మహ్యం మమేత్యాహ చ పావకః ।
వివదన్తౌ దదర్శాథ స్వేచ్ఛాచారీ జనార్దనః ॥31॥

ఆ బిడ్డడు నా కుమారుడని కుటిలయు, నా కుమారుడని అగ్నియు వాదులాడుకొనుచుండగా ఆ ప్రాంతంలో సంచరిస్తున్న జనార్దనుడు వారిని చూశాడు.

తౌ పప్రచ్ఛ కిమర్థం వా వివాదమిహ చక్రథః ।
తావూచతుః పుత్రహేతో రుద్రశుక్రోద్భవాయ హి ॥32॥

తావువాచ హరిర్దేవో గచ్ఛ తం త్రిపురాన్తకమ్ ।
స యద్ వక్ష్యతి దేవేశస్తత్కురుధ్వమసంశయమ్ ॥33॥

అంతట జనార్దనుడు మీరిరువురు ఎందులకు వాదులాడుచున్నారని వారిని అడిగాడు. శివశుక్రం వలన జన్మించిన బాలకుని కొరకు మేము తగవులాడుకొనుచున్నామని వారిరువురు జనార్దనునితో పలికారు. అంతట విష్ణుదేవుడు "ఈ విషయం నిర్ణయించవలసినది త్రిపురాన్తకుడే. ఆయన ఏ విధంగా నిర్ణయిస్తే ఆ విధంగా చేయండి. మీరు త్రిపురాన్తకుని చెంతకు వెళ్ళండి" అని వారితో చెప్పాడు.

ఇత్యుక్తౌ వాసుదేవేన కుటిలాగ్నీ హరాన్తికమ్ ।
సమభ్యేత్యోచతుస్తథ్యం కస్య పుత్రేతి నారద ॥34॥

ఓ నారదా! వాసుదేవుని పలుకులు వినిన కుటిలాగ్నులు ఇరువురు హరుని నివాసానికి వెళ్ళి "ఆ బిడ్డ ఎవరి కుమారుడు, నిజం చెప్పండి" అని అర్థించారు.

రుద్రస్తద్వాక్యమాకర్ణ్య హర్షనిర్భరమానసః ।
దిష్ట్యా దిష్ట్యేతి గిరిజాం ప్రోద్భూతపులకోఽబ్రవీత్ ॥35॥

వారి మాటలు వినిన శంకరుడు హర్షనిర్భరమానసుడయ్యాడు. దానితో గద్గదకంఠంతో పార్వతితో ఇలా పలికాడు. "ఆహా ఎంత మంచిమాట! ఆహా ఎంత మంచిమాట!" అని.

తతోఽమ్బికా ప్రాహ హరం దేవ గచ్ఛామ తం శిశుమ్ ।
ప్రష్టుం సమాశ్రయేద్ యం స తస్య పుత్రో భవిష్యతి ॥36॥

అంబిక శివుని మాటలు విని, ఇలా పలికింది. "నాథా! మనము ఆ శిశువు వద్దకు వెళదాము. దగ్గరకు రమ్మని ఆ బాలుని పిలుద్దాము. ఆ బాలుడు ఎవరి వద్దకు వస్తాడో అతడే ఆ బాలునికి తండ్రి కాగలడు" అని పార్వతి చెప్పింది.

బాఢమిత్యేవ భగవాన్ సముత్తస్థౌ వృషధ్వజః ।
సహోమయా కుటిలయా పావకేన చ ధీమతా ॥37॥

అంతట శివుడు మంచిది అంటూ లేచి ఉమా కుటిల అగ్నులు వెంటరాగా శరవణానికి వెళ్ళాడు.

సంప్రాప్తాస్తే శరవణం హరాగ్ని కుటిలాంబికాః ।
దదృశుః శిశుకం తం చ కృత్తికోత్సంగశాయినమ్ ॥38॥

శరవణం చేరిన ఆ నలుగురు, కృత్తికల ఒడిలో శయనించిన ఆ బాలుని చూశారు.

తతః స బాలకస్తేషాం మత్వా చింతితమాదరాత్ ।
యోగీ చతుర్మూర్తిరభూత్ షణ్ముఖః స శిశుస్త్వపి ॥39॥

యోగియైన ఆ బాలుడు ఆ నలుగురి మదిలోని ఆలోచనలను గమనించి, బాగుగా ఆలోచించి షణ్ముఖుడైన ఆ శిశువు నాలుగు రూపాలు ధరించాడు.

కుమారః శంకరమగాద్ విశాఖో గౌరిమాగమత్ ।
కుటిలామగమచ్ఛాఖో మహాసేనోఽగ్ని మభ్యయాత్ ॥40॥

వారిలో కుమారుడు శంకరుని సమీపించాడు. విశాఖుడు గౌరి ఒడిలోనికి చేరాడు. శాఖుడు కుటిలను ఆశ్రయించగా, మహాసేనుడు అగ్నిని చేరాడు.

తతః ప్రీతియుతో రుద్ర ఉమా చ కుటిలా తథా ।
పావకశ్చాపి దేవేశః పరాం ముదమవాప చ ॥41॥

దానితో రుద్రుడు, ఉమాదేవి, కుటిల, అగ్ని మున్నగు నలుగురు కూడా పరమానందాన్ని పొందారు.

తతోఽబ్రువన్ కృత్తికాస్తాః షణ్ముఖః కిం హరాత్మజః ।
తా అబ్రవీద్ధరః ప్రీత్యా విధివత్ వచనం మునే ॥42॥

ఓ నారదమహర్షీ! అంతట కృత్తికలు "ఈ షణ్ముఖబాలకుడు శివుని కుమారుడా?" అని అడిగారు. అంతట హరుడు అందరికి సంతోషం కలుగునట్లుగా ఒక నిర్ణయం వినిపించాడు.

నామ్నా తు కార్తికేయో హి యుష్మాకం తనయస్త్వసౌ ।
కుటిలాయా కుమారేతి పుత్రోఽయం భవితాఽవ్యయః ॥43॥

స్కంద ఇత్యేవ విఖ్యాతో గౌరీపుత్రో భవత్వసౌ ।
గుహ ఇత్యేవ నామ్నా చ మమాసౌ తనయః స్మృతః ॥44॥

మహాసేన ఇతి ఖ్యాతో హుతాశనస్యాస్తు పుత్రకః ।
శారద్వత ఇతి ఖ్యాతః సుతః శరవణస్య చ ॥45॥

ఏవమేవ మహాయోగీ పృథివ్యాం ఖ్యాతిమేష్యతి ।
షడాస్యత్వాన్మహాబాహుః షణ్ముఖో నామ గీయతే ॥46॥

ఈ బాలకుడు మీ కుమారుడైనందున కార్తికేయుడు గాను, కుమారుడనే పేరుతో కుటిలకు పుత్రుడు గాను, ఈ అవ్యయుడు స్కందుడనే పేరుతో ఉమాతనయుడు గాను ప్రఖ్యాతుడౌతాడు. ఇక గుహుడు అను పేరుతో నాకు ఔరసుడు. మహాయోగియైన ఇతడు మహాసేనుడుగా హుతాశనుని పుత్రుడు. ఈ శరవణంలో పుట్టినందున శారద్వతుడుగాను ప్రసిద్ధుడు అవుతాడు. ఈ విధంగా మహాయోగియైన ఈ బాలుడు ఈ లోకంలో ఖ్యాతిని పొందుతాడు. ఇతనికి ఆరుముఖాలు ఉన్నందున ఇతడు షణ్ముఖుడని కూడా పిలవబడతాడు.

ఇత్యేవముక్త్వా భగవాన్ శూలపాణిః పితామహమ్ ।
సస్మార దైవతైః సార్ధం తేఽ ప్యాజగ్ముస్త్వరాన్వితాః ॥47॥

ఈ విధంగా పలికిన శివభగవానుడు బ్రహ్మాది దేవతలనందరను స్మరించాడు. వారందరు తక్షణమే వేగంగా అచ్చటకు వచ్చారు.

ప్రణిపత్య చ కామారిముమాం చ గిరినందినీమ్ ।
దృష్ట్వా హుతాశనం ప్రీత్యా కుటిలాం కృత్తికాస్తథా ॥48॥

దదృశుర్బాలమత్యుగ్రం షణ్ముఖం సూర్యసన్నిభమ్ ।
ముష్ణన్తమివ చక్షూంషి తేజసా స్వేన దేవతాః ॥49॥

కౌతుకాభివృతాస్సర్వే ఏవమూచుః సురోత్తమాః ।

వారందరు శివపార్వతులకు నమస్కరించి, అగ్ని, కుటిల, కృత్తికలను ప్రీతితో సంభావించి, శరీర కాంతితో దేవతల కండ్లకు మిరుమిట్లు గొలుపుతు సూర్యుని వలె ఉగ్రమైన తేజస్సుతో వెలుగొందుచున్న షణ్ముఖుని చూసి, మహానందభరితులై ఇలా పలికారు.

దేవకార్యం త్వయా దేవ కృతం దేవ్యాఽగ్నినా తథా ॥50॥
తదుత్తిష్ఠ వ్రజామోఽ ద్య తీర్థమౌజసమవ్యయమ్ ।
కురుక్షేత్రే సరస్వత్యామభిషించామ షణ్ముఖమ్ ॥51॥

సేనాయాః పతిరస్త్వేష దేవగంధర్వకిన్నరాః ।
మహిషం ఘాతయత్వేష తారకం చ సుదారుణమ్ ॥52॥

ఓ హరా!, దేవా! మీరు, అంబిక, అగ్నిదేవుడు ఈ విధంగా దేవకార్యాన్ని సంపన్నం గావించారు. వెంటనే లేవండి. మనమందరము ఈక్షణమే మహాశక్తివంతము, అవ్యయము అయిన కురుక్షేత్రతీర్థానికి వెళ్ళి, సరస్వతీ జలాలతో షణ్ముఖుని అభిషిక్తుని గావించుదాము. దేవగన్ధర్వకిన్నరసేనలకు ఇతడు నాయకుడు అవుతాడు. భయంకరుడైన మహిషాసుర, తారకాసురులను ఇతడు వధింపగలడు.

బాఢమిత్యబ్రవీచ్ఛర్వః సముత్తస్థుః సురాస్తతః ।
కుమారసహితా జగ్ముః కురుక్షేత్రం మహాఫలమ్ ॥53॥

అది విని హరుడు మంచిదంటూ లేచాడు. దేవతలు కూడా ఆయన వెంట కుమారునితో కలసి మహాఫలదాయి అయిన కురుక్షేత్రానికి చేరుకున్నారు.

తత్రైవ దేవతాః సేన్ద్రా రుద్రబ్రహ్మజనార్దనాః ।
యత్నమస్యాభిషేకార్థం చక్రుర్మునిగణైః సహ ॥54॥

హరిహరబ్రహ్మేంద్రాది దేవతలు, మునులు, అందరు కలసి షణ్ముఖుని అభిషిక్తుని చేయడానికి కావలసిన ప్రయత్నాలు చేశారు.

తతోఽమ్బునా సప్తసముద్రవాహినీ నదీజలేనాపి మహాఫలేన ।
వరౌషధీభిశ్చ సహస్రమూర్తిభిస్తదాభ్యషించన్ గుహమచ్యుతాద్యాః ॥55॥

అంతట అచ్యుతాదులు మహాఫలదాయకాలైన నదీజలాలు, సప్తసముద్రోదకాలు, శ్రేష్ఠమైన ఓషధులు వేయింటిని కలిపి ఆ గుహునకు మంగళాభిషేకం చేయించారు.

అభిషించతి సేనాన్యాం కుమారే దివ్యరూపిణి ।
జగుర్గంధర్వపతయో ననృతుశ్చాప్సరోగణాః ॥56॥

సమస్తదేవసేనానాయకుడుగా కుమారుని అభిషేకించు సమయాన గంధర్వులు గానం చేశారు. అప్సరసలు నాట్యాలు గావించారు.

అభిషిక్తం కుమారం చ గిరిపుత్రీ నిరీక్ష్య హి ।
స్నేహాదుత్సంగగం స్కందం మూర్ధ్న్యజిఘ్రన్ముహుర్ముహుః ॥57॥

ఆ విధంగా సేనానాయకుడుగా అభిషేకింపబడిన కుమారుని చూసి గిరిపుత్రి వాత్సల్యాతిరేకంతో ఒడిలోనికి తీసుకుని, అతని శిరస్సును అనేకమార్లు ముద్దాడింది.

జిఘ్రతీ కార్తికేయస్య అభిషేకార్ద్రమాననమ్ ।
భాత్యద్రిజా యథేంద్రస్య దేవమాతాఽదితిః పురా ॥58॥

అభిషేకంతో తడిగానున్న కార్తికేయుని ముఖాన్ని మాటిమాటికి ముద్దాడిన పార్వతి ఇంద్రుని ఒడిలోనుంచుకుని ముద్దాడిన దేవమాత అదితిని తలపించింది.

తదాఽభిషిక్తం తనయం దృష్ట్వా శర్వో ముదం యయౌ ।
పావకః కృత్తికాశ్చైవ కుటిలా చ యశస్వినీ ॥59॥

అలా అభిషేకింపబడిన తనయుని చూసి శివుడు ఆనందభరితుడయ్యాడు. అగ్ని, కృత్తికలు, కుటిల కూడా ఎంతగానో ఆనందించారు.

తతోఽభిషిక్తస్య హరః సేనాపత్యే గుహస్య తు ।
ప్రమథాంశ్చతురః ప్రాదాచ్ఛక్రతుల్యపరాక్రమాన్ ॥60॥

దేవసేనాపతిగా అభిషిక్తుడైన గుహునకు హరుడు ఇంద్రతుల్యపరాక్రమవంతులైన నలుగురు ప్రసిద్ధులైన ప్రమథులను కానుకగా ఇచ్చాడు.

ఘంటాకర్ణం లోహితాక్షం నందిసేనం చ దారుణమ్ ।
చతుర్థం బలినాం ముఖ్యం ఖ్యాతం కుముదమాలినమ్ ॥61॥

ఆ ప్రమథులు ఘంటాకర్ణుడు, లోహితాక్షుడు, దారుణమైన నందిసేనుడు, బలవంతులలో ముఖ్యుడుగా ఖ్యాతిగాంచిన కుముదమాలి.

హరదత్తాన్ గణాన్ దృష్ట్వా దేవాః స్కన్దస్య నారద ।
ప్రదదుః ప్రమథాన్ స్వాన్ స్వాన్ సర్వే బ్రహ్మపురోగమాః ॥62॥

ఓ నారదా! శివుడు తన గణముఖ్యులను స్కందునకు ఇవ్వడం చూసిన బ్రహ్మాది దేవతలందరు తమ తమ ప్రమథులను స్కందునకు సమర్పించారు.

స్థాణుం బ్రహ్మా గణం ప్రాదాద్ విష్ణుః ప్రాదాద్ గణత్రయమ్ ।
సంక్రమం విక్రమం చైవ తృతీయం చ పరాక్రమమ్ ॥63॥

బ్రహ్మ స్థాణుగణాన్ని ఇచ్చాడు. విష్ణువు సంక్రమ, విక్రమ, పరాక్రమాలనే మూడు గణాలను ఇచ్చాడు.

ఉత్కేశం పంకజం శక్రో రవిర్దండకపింగలౌ ।
చంద్రోమణి వసుమణిమశ్వినౌ వత్సనందినౌ ॥64॥

ఇంద్రుడు ఉత్కేశ, పంకజులను, రవి దండక, పింగళులను సమర్పించారు. చంద్రుడు మణి, వసు మణులను, అశ్వినీదేవతలు వత్స, నందినులను ఇచ్చారు.

జ్యోతిర్హుతాశనః ప్రాదాజ్జ్వలజ్జిహ్వం తథాపరమ్ ।
కుందం ముకుందం కుసుమం త్రీన్ ధాతాఽనుచరాన్ దదౌ ॥65॥

హుతాశనుడు జ్యోతి, జ్వల, జిహ్వలను, ధాత కుంద, ముకుంద, కుసుములనే ముగ్గురు అనుచరులను ఇచ్చారు.

చక్రానుచక్రౌ త్వష్టా చ వేధాతిస్థిరసుస్థిరౌ ।
పాణీత్యజం కాలకం చ ప్రాదాత్ పూషా మహాబలౌ ॥66॥

త్వష్ట చక్రానుచక్రులను ఇరువురను, వేధ అతిస్థిర, సుస్థిరులను ఇచ్చారు. పూషుడు పాణీత్యజ, కాలకులనే మహాబలులిరువురను ఇచ్చాడు.

స్వర్ణమాలం ఘనాహ్వం చ హిమవాన్ ప్రమథోత్తమౌ ।
ప్రదాదేవోచ్ఛ్రితో వింధ్యస్త్వతిశృంగం చ పార్షదమ్ ॥67॥

హిమవంతుడు స్వర్ణమాలుడు, ఘనాహ్వుడు అనే ఉత్తమ ప్రమథులనిచ్చాడు. వింధ్యుడు తన ఔన్నత్యానికి తగినట్లుగా అతిశృంగుడు, పార్షదులను ఇచ్చాడు.

సువర్చసం చ వరుణః ప్రదదౌ చాతివర్చసమ్ ।
సంగ్రహం విగ్రహం చాబ్ధిర్నాగా జయమహాజయౌ ॥68॥

వరుణుడు సువర్చస, అతివర్చసులను, సముద్రుడు సంగ్రహవిగ్రహులను, నాగులు జయమహాజయులను స్కందునకు ఇచ్చారు.

ఉన్మాదం శంకుకర్ణం చ పుష్పదన్తం తథాఽమ్బికా ।
ఘసం చాతిఘసం వాయుః ప్రాదాదనుచరావుభౌ ॥69॥

అంబిక ఉన్మాదుడు, శంకుకర్ణ, పుష్పదంతులను, వాయుదేవుడు ఘస, అతిఘసులను ఇరువురు తన అనుచరులను ఇచ్చారు.

పరిఘం చటకం భీమం దహాతి దహనౌ తథా ।
ప్రదదావంశుమాన్ పంచ ప్రమథాన్ షణ్ముఖాయ హి ॥70॥

అంశుమంతుడు పరిఘ, చటక, భీమ, దహాతి, దహనుడు అను ఐదుగురు ప్రమథులను షణ్ముఖునకు ఇచ్చాడు.

యమః ప్రమాథమున్మాథం కాలసేనం మహాముఖమ్ ।
తాలపత్రం కాలజంఘం షడేవానుచరాన్ దదౌ ॥71॥

యముడు ప్రమాథ, ఉన్మాథ, కాలసేన, మహాముఖ, తాళపత్ర, కాలజంఘుడు అను అనుచరుల నారుగురిని షణ్ముఖునకు ఇచ్చాడు.

సుప్రభం చ సుకర్మాణం దదౌ ధాతా గణేశ్వరౌ ।
సువ్రతం సత్యసంధం చ మిత్రః ప్రాదాద్ ద్విజోత్తమ ॥72॥

ఓ ద్విజోత్తమా! ధాత సుప్రభ సుకర్ములను రెండు గణాలను మహాసేనునకు అర్పించాడు. మిత్రుడు సువ్రత, సత్యసంధులను స్కందునకు అర్పించాడు.

అనన్తః శంఖుపీఠశ్చ నికుంభః కుముదోఽమ్బుజః ।
ఏకాక్షః కునటీ చక్షుః కిరీటీ కలశోదరః ॥73॥

సూచీవక్త్రః కోకనదః ప్రహాసః ప్రియకోఽచ్యుతః ।
గణాః పంచదశైతే హి యక్షైర్దత్తా గుహస్య తు ॥74॥

అనంత, శంఖుపీఠ, నికుంభ, కుముద, అంబుజ, ఏకాక్ష, కునటి, చక్షు, కిరీటి, కలశోదర, సూచీవక్త్ర, కోకనద, ప్రహాస, ప్రియక, అచ్యుతులను పదిహేనుగణాలను గుహునకు యక్షులు ఇచ్చారు.

కాలింద్యా కాలకందశ్చ నర్మదాయా రణోత్కటః ।
గోదావర్యా సిద్ధయాత్రస్తమసాసాద్రికంపకౌ ॥75॥

సహస్రబాహుః సీతాయా వంజులాయాః సితోదరః ।
మందాకిన్యాస్తథానందో విపాశాయాః ప్రియంకరః ॥76॥

కాళిందీనది కాలకందుని, నర్మద రణోత్కటుని, గోదావరి సిద్ధయాత్రుని, తమసానది అగ్నికంపకులను, సీత సహస్రబాహుని, వంజుల సితోదరుని, మందాకిని నందుని, విపాశ ప్రియంకరుని షణ్ముఖునకిచ్చారు.

ఐరావత్యా చతుర్దంష్ట్రః షోడశాక్షో వితస్తయా ।
మార్జారం కౌశికీ ప్రాదాత్ క్రథక్రౌంచౌ చ గౌతమీ ॥77॥

బాహుదా శతశీర్షం చ వాహా గోనందనందినౌ ।
భీమం భీమరథీ ప్రాదాద్ వేగారిం సరయూర్దదౌ ॥78॥

ఐరావతి చతుర్దంష్ట్రుని, వితస్త షోడశాక్షుని, కౌశికి మార్జారుని, గౌతమి క్రథ, క్రౌంచులను బాహుద శతశీర్షులనం, వాహానది గోనందనందికులను, భీమరథీనది భీముని, సరయూనది వేగారిని షణ్ముఖునకు సమర్పించారు.

అష్టబాహుం దదౌ కాశీ సుబాహుమపి గండకీ ।
మహానదీ చిత్రదేవం చిత్రా చిత్రరథం దదౌ ॥79॥

కాశీ అష్టబాహుని, గండకి సుబాహుని, మహానది చిత్రదేవుని, చిత్రానది చిత్రరథుని ఇచ్చారు.

కుహూః కువలయం ప్రాదాన్మధువర్ణం మధూదకా ।
జంబూకం ధూతపాపా చ వేణా శ్వేతాననం దదౌ ॥80॥

కుహూ కువలయుని, మధూదక మధువర్ణుని, ధూతపాప జంబూకుని, వేణ శ్వేతానసుని ఇచ్చారు.

శ్రుతవర్ణం చ పర్ణాసా రేవా సాగరవేగినమ్ ।
ప్రభావార్థం సహం ప్రాదాత్ కాంచనా కనకేక్షణమ్ ॥81॥

పర్ణాస శ్రుతవర్ణుని, రేవానది సాగరవేగిని, ప్రభావనది అర్థుని, సహుని, కాంచన కనకేక్షణుని ఇచ్చారు.

గృధ్రపత్రం చ విమలా చారువక్త్రం మనోహరా ।
ధూతపాపా మహారావం కర్ణా విద్రుమసంనిభమ్ ॥82॥

విమల గృధ్రపత్రుని, మనోహర చారువక్త్రను, ధూతపాప మహారావాన్ని, కర్ణానది విద్రుమసంనిభుని ఇచ్చారు.

సుప్రసాదం సువేణుశ్చ జిష్ణుమోఘవతీ దదౌ ।
యజ్ఞబాహుం విశాలా చ సరస్వత్యో దదుర్గణాన్ ॥83॥

సువేణు సుప్రసాదుని, ఓఘవతి జిష్ణుని, విశాల యజ్ఞబాహువును స్కందునకు ప్రదానం చేశారు. ఆ విధంగా సరస్వతి మున్నగు నదులన్నియు తమ గణాలను స్కందునకు ప్రదానం చేశాయి.

కుటిలా తనయస్యాదాద్ దశ శక్రబలాన్ గణాన్ ।
కరాళం సితకేశం చ కృష్ణకేశం జటాధరమ్ ॥84॥

మేఘనాథం చతుర్దంష్ట్రం విద్యుజ్జిహ్వం దశాననమ్ ।
సోమాప్యాయనమేవోగ్రం దేవయాజినమేవ చ ॥85॥

కుటిల తన ప్రియపుత్రునకు దేవేంద్రునితో సమానబలులైన కరాళ, సితకేశ, కృష్ణకేశ, జటాధర, మేఘనాథ, చతుర్దంష్ట్ర, విద్యుజ్జిహ్వ, దశానన, సోమాప్యాయన, దేవయాజి మున్నగు పదిమంది గణ ప్రముఖులను ఇచ్చింది.

హంసాస్యం కుండజఠరం బహుగ్రీవం హయాననమ్ ।
కూర్మగ్రీవం చ పంచైతాన్ దదుః పుత్రాయ కృత్తికాః ॥86॥

ఇక కృత్తికలందరు తన పుత్రుడైన కార్తికేయునకు హంసాస్య, కుండజఠర, బహుగ్రీవ, హయానన, కూర్మగ్రీవులనే గణపంచకాన్ని ఇచ్చారు.

స్థాణుజంఘం కుంభవక్త్రం లోహజంఘం మహాననమ్ ।
పిండాకారం చ పంచైతాన్ దదుః స్కందాయ చర్షయః ॥87॥

ఋషులందరు కూడా స్థాణుజంఘ, కుంభవక్త్ర, లోహజంఘ, మహావన, పిండాకారులను ఐదుగురిని స్కందునకు ఆశీస్సులతో ఇచ్చారు.

నాగజిహ్వం చంద్రభాసం పాణికూర్మం శశీక్షకమ్ ।
చాషవక్త్రం చ జంబూకం దదౌ తీర్థః పృథూదకః ॥88॥

స్కందదేవునకు పృథూదకతీర్థం నాగజిహ్వ, చంద్రభాస, పాణికూర్మ, శశీక్షక, చాషవక్త్ర, జంబూక, గణాలను ఇచ్చింది.

చక్రతీర్థం సుచక్రాక్షం మకరాక్షం గయాశిరః ।
గణం పంచశిఖం నామ దదౌ కనఖలః స్వకమ్ ॥89॥

చక్రతీర్థం సుచక్రాక్షుని, గయాశిరతీర్థం మకరాక్షుని, కనఖలతీర్థం పంచశిఖయనే స్వంతగణాన్ని కుమారునకు ఇచ్చాయి.

బంధుదత్తం వాజిశిరో బాహుశాలం చ పుష్కరమ్ ।
సర్వౌజసం మాహిషకం మానసః పింగలం యథా ॥90॥

వాజిశిరం బంధుదత్తుని, పుష్కరతీర్థం బాహుశాలుని, మానసతీర్థం సర్వౌజస, మాహిషక పింగళులను ఇచ్చాయి.

రుద్రమౌశనసః ప్రాదాత్ తతోऽన్యాన్ మాతరో దదుః ।
వసుదామాం సోమతీర్థః ప్రభాసో నందినీమపి ॥ 91॥

ఇంద్రతీర్థం విశోకాం చ ఉదపానో ఘనస్వనామ్ ।

ఔశనసుడు రుద్రుని ప్రదానం చేశాడు. అట్లే ఇతరులు మాతృకలను ఇచ్చారు. సోమతీర్థం వసుదాముని, ప్రభాసతీర్థం నందినిని, ఇంద్రతీర్థం విశోకను, ఉదపానతీర్థం ఘనస్వనను అర్పించాయి.

సప్త సారస్వతః ప్రాదాన్మాతరశ్చతురోద్భుతాః ॥92॥

గీతప్రియాం మాధవీం చ తీర్థనేమిం స్మితాననామ్ ।
ఏకచూడాం నాగతీర్థః కురుక్షేత్రం పలాసదామ్ ॥93॥

సారస్వతతీర్థం ఏడుగురిని, అద్భుతాన్ని గొలిపే గీతప్రియ, మాధవి, తీర్థనేమి, స్మితాననలనే నలుగురు మాతృకలను ఇచ్చింది. నాగతీర్థం ఏకచూడను, కురుక్షేత్రం పలాసదను ఇచ్చాయి.

బ్రహ్మయోనిశ్చండశిలాం భద్రకాళీం త్రివిష్టపః ।
చౌండీం ఖైండీం యోగఖైండీం ప్రాదాచ్చరణపావనః ॥94॥

బ్రహ్మయోని చండశిలను, త్రివిష్టపం భద్రకాళిని, చరణపావనతీర్థం చౌండి, ఖైండి, యోగఖైండి అను గణాలను ఇచ్చాయి.

సోపానీయాం మహీప్రాదాచ్ఛాలికాం మానసో హ్రదః ।
శతఘంటాం శతానన్దాం తథోలూఖలమేఖలామ్ ॥95॥

పద్మావతీం మాధవీం చ దదౌ బదరికాశ్రమః ।

మహి సోపానీయను ప్రదానం చేసింది. మానససరోవరం శాలికను, బదరికాశ్రమం శతఘంటను, శతానందను, ఉలూఖల మేఖలను, పద్మావతిని, మాధవిని ఇచ్చాయి.

సుషమామేకచూడాం చ దేవీం ధమధమాం తథా ॥96॥

ఉత్క్రాథనీం వేదమిత్రాం కేదారో మాతరో దదౌ ।

కేదారక్షేత్రం సుషమ, ఏకచూడ, దేవి, ధమధమా, ఉత్క్రాథనీ, వేదమిత్రలనే మాతృగణాలనిచ్చింది.

సునక్షత్రాం కద్రూలాం చ సుప్రభాతాం సుమంగలామ్ ॥97॥

దేవమిత్రాం చిత్రసేనాం దదౌ రుద్రమహాలయః ।

రుద్రమహాలయం సునక్షత్ర, కద్రూల, సుప్రభాత, సుమంగళ, దేవమిత్ర, చిత్రసేనలను ఇచ్చింది.

కోటరామూర్ధ్వవేణీం చ శ్రీమతీం బహుపుత్రికామ్ ॥98॥

పలితాం కమలాక్షీం చ ప్రయాగో మాతరో దదౌ ।

ప్రయాగ కోటర, ఊర్ధ్వవేణి, శ్రీమతి, బహుపుత్రిక, పలిత, కమలాక్షి అనే మాతృగణాలనిచ్చింది.

సూపలాం మధుకుంభాం చ ఖ్యాతిం దహదహాం పరామ్ ॥99॥

ప్రాదాత్ ఖటకటాం చాన్యాం సర్వపాపవిమోచనః ।

సర్వపాపవిమోచనక్షేత్రం సూపల, మధుకుంభ, ఖ్యాతి, దహదహ, పరా, ఖటకటలను ఇచ్చింది.

సంతానికాం వికలికాం క్రమశ్చత్వరవాసినీమ్ ॥100॥

క్రమతీర్థం సంతానిక, వికలిక, చత్వరవాసినీలను ప్రదానం చేసింది.

జలేశ్వరీం కుక్కుటికాం సుదామాం లోహమేఖలామ్ ।
వపుష్మత్యుల్ముకాక్షీ చ కోకనామా మహాశనీ ।
రౌద్రా కర్కటికా తుండా శ్వేతతీర్థో దదౌ త్విమాః ॥101॥

శ్వేతతీర్థం జలేశ్వరి, కుక్కుటిక, సుదామ, లోహమేఖల, వపుష్మతి, ఉల్ముకాక్షి, కోకనామ, మహాశని, రౌద్ర, కర్కటిక, తుండ అను వారిని ఇచ్చింది.

ఏతాని భూతాని గణాంశ్చ మాతరో దృష్ట్వా మహాత్మా వినతాతనూజః ।
దదౌ మయూరం స్వసుతం మహాజవం తథాఽరుణస్తామ్రచూడం చ పుత్రమ్ ॥102॥

ఈ విధంగా ఇందరు భూతాలు, గణాలు, మాతృకలు, స్కందుని సేవించడం చూసి, వినతాసుతుడు, మహాత్ముడునైన గరుత్మంతుడు తన కుమారుడు మహావేగం కలవాడునైన మయూరుని (నెమలిని) అరుణుడు, తన పుత్రుడునైన తామ్రచూడుని (కోడిని) ఆయనకు సమర్పించారు.

శక్తిం హుతాశోఽద్రిసుతా చ వస్త్రం దండం గురుః సా కుటిలా కమండలుమ్ ।
మాలాం హరిః శూలధరః పతాకాం కంఠే చ హారం మఘవాసురస్తః ॥103॥

అగ్నిదేవుడు శక్తిని, పార్వతి వస్త్రాన్ని, బృహస్పతి దండాన్ని, కుటిల కమండలాన్ని, విష్ణువు పుష్పమాలను, శంకరుడు ధ్వజాన్ని, ఇంద్రుడు తన కంఠంలోని హారాన్ని స్కందునకు ఇచ్చారు.

గణైర్వృతో మాతృభిరన్వయాతో మయూరసంస్థో వరశక్తిపాణిః ।
సైన్యాధిపత్యే స కృతో భవేన రరాజ సూర్యేవ మహావపుష్మాన్ ॥104॥

భూతగణాలందరు పరివేష్టించి కొలువగా, మాతృగణాలు వెంటరాగా, దేవసేనాధిపత్యం వహించిన హరాత్మజుడు మయూరవాహనారూఢుడై, శ్రేష్ఠమైన శక్తిపాణియై, భాస్కరప్రభతో ప్రకాశించాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే కార్తికేయోత్పత్తిః దేవసేనానాయకత్వప్రాప్తిర్నామ సప్తపంచాశత్తమోఽధ్యాయః ॥57॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని కార్తికేయోత్పత్తి దేవసేనానాయకత్వమనే యాభైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టపంచాశత్తమోఽధ్యాయః – యాభైఎనిమిదవ అధ్యాయం
మహిషాసుర, తారకవధోపాఖ్యానే క్రౌంచభేదనమ్ – మహిషాసుర, తారకాసుర వధోపాఖ్యానంలో క్రౌంచపర్వత భేదనం

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

సేనాపత్యేఽభిషిక్తస్తు కుమారో దైవతైరథ ।
ప్రణిపత్య భవం భక్త్యా గిరిజాం పావకం శుచిమ్ ॥1॥

షట్ కృత్తికాశ్చ శిరసా ప్రణమ్య కుటిలామపి ।
బ్రహ్మాణం చ నమస్కృత్య ఇదం వచనమబ్రవీత్ ॥2॥

దేవతలు తనను దేవసేనలకు అధిపతిగా అభిషేకించిన పిమ్మట కుమారస్వామి భక్తితో శివునకు, పవిత్రురాలైన పార్వతీదేవికి, అగ్నిదేవునకు నమస్కరించాడు. అనంతరం ఆరుగురు కృత్తికలకు, కుటిలకు, బ్రహ్మకు, శిరస్సువంచి నమస్కరించి ఇలా పలికాడు.

కుమార ఉవాచ – కుమారస్వామి పలికాడు.

నమోఽస్తు భవతాం దేవా ఓం నమోఽస్తు తపోధనాః ।
యుష్మత్ప్రసాదాజ్జేష్యామి శత్రూ మహిషతారకౌ ॥3॥

శిశురస్మి న జానామి వక్తుం కించన దేవతాః ।
దీయతాం బ్రహ్మణా సార్ధమనుజ్ఞా మమ సాంప్రతమ్ ॥4॥

ఓ దేవతలారా! మీకు నమస్సులు. ఓ తపోధనులారా! మీకు ప్రణామాలు. మీ అందరి అనుగ్రహం వలన శత్రువులైన మహిషాసుర తారకాసురులను జయిస్తాను. నేను శిశువునగుటచే మీతో మాట్లాడడం నాకు తెలియదు. బ్రహ్మతో కూడిన మీరందరు వెంటనే నాకు అనుజ్ఞనివ్వండి.

ఇత్యేవముక్తే వచనే కుమారేణ మహాత్మనా ।
ముఖం నిరీక్షంతి సురాః సర్వే విగత సాధ్వసాః ॥5॥

ఈ విధంగా మాటలాడిన కుమారుని పలుకులను విని దేవతలందరు భయాన్ని వీడి, ఒకరి ముఖం మరియొకరు చూసుకున్నారు.

శంకరోఽపి సుతస్నేహాత్ సముత్థాయ ప్రజాపతిమ్ ।
ఆదాయ దక్షిణే పాణౌ స్కందాన్తికముపాగమత్ ॥6॥

శివుడుకూడా పుత్రవాత్సల్యంతో లేచి, విరించి చేయిపట్టుకుని, స్కందుని వద్దకు తీసుకొని వెళ్ళాడు.

అథోమా ప్రాహ తనయం పుత్ర ఏహ్యేహి శత్రుహన్! ।
వందస్వ చరణౌ దివ్యౌ విష్ణోర్లోకనమస్కృతౌ ॥7॥

అంతట ఉమాదేవి కుమారునితో "నాయనా!, పుత్రా! రమ్ము! రమ్ము!. ఓ శత్రుసంహారకా! సర్వలోక వంద్యుడైన శ్రీ మహావిష్ణువు దివ్యచరణాలకు నమస్కరింపుము" అని పలికింది.

తతో విహస్యాహ గుహః కోఽయం మాతర్వదస్వ మామ్ ।
యస్యాదరాత్ ప్రణామోఽయం క్రియతే మద్విధైర్జనైః ॥8॥

ఉమాదేవి పలుకులకు స్కందుడు నవ్వి, "అమ్మా! నాలాంటివారు గౌరవంతో నమస్కరింపదగిన ఆయన ఎవరమ్మా?" అని అడిగాడు.

తం మాతా ప్రాహ వచనం కృతే కర్మణి పద్మభూః ।
వక్ష్యతే తవ యోఽయం హి మహాత్మా గరుడధ్వజః ॥9॥

కేవలం త్విహ మాం దేవస్త్వత్పితా ప్రాహ శంకరః ।
నాన్యః పరతరోఽస్మాద్ధి వయమన్యే చ దేహినః ॥10॥

అందులకు అంబిక "ముందుగా నీవు ఆయనకు నమస్కరింపుము. తదనంతరం ఆయనను గూర్చి నీకు బ్రహ్మ వివరింపగలడు. మాతోసహా మరెవ్వరు ఆయనను మించిన పరదైవం లేరని నీ తండ్రియైన శివుడు నాతో చెప్పినాడు. కావున గరుడధ్వజునకు నమస్కరింపుము" అని స్కందునితో పలికింది.

పార్వత్యా గదితే స్కందః ప్రణిపత్య జనార్దనమ్ ।
తస్థౌ కృతాంజలిపుటస్త్వాజ్ఞాం ప్రార్థయతేఽచ్యుతాత్ ॥11॥

కృతాంజలిపుటం స్కందం భగవాన్ భూతభావనః ।
కృత్వా స్వస్త్యయనం దేవో హ్యనుజ్ఞాం ప్రదదౌ తతః ॥12॥

పార్వతి వచనానుసారం స్కందుడు జనార్దనునకు నమస్కరించి, అతని అనుజ్ఞ కొరకు వేచిచూస్తూ, చేతులు జోడించి నిలబడ్డాడు. అంతట విష్ణువు చేతులు జోడించి నిలబడిన స్కందునకు స్వస్తివాచనం గావించి, అనుజ్ఞనిచ్చాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

యత్తత్ స్వస్త్యయనం పుణ్యం కృతవాన్ గరుడధ్వజః ।
శిఖిధ్వజాయ విప్రర్షే తన్మే వ్యాఖ్యాతుమర్హసి ॥13॥

ఓ బ్రహ్మర్షీ! శిఖిధ్వజునకు గరుడధ్వజుడొనర్చిన పవిత్రమైన స్వస్తివాచనం నాకు వివరించండి.

పులస్త్య ఉవాచ – పులస్త్య మహర్షి పలికాడు.

శృణు స్వస్త్యయనం పుణ్యం యత్ప్రాహ భగవాన్ హరిః ।
స్కందస్య విజయార్థాయ మహిషస్య వధాయ చ ॥14॥

ఓ నారదా! స్కందునకు విజయము, మహిషునకు సర్వనాశనమును కలిగించునది, పుణ్యప్రదమైనది, శ్రీహరిచే గావించబడినదియైన స్వస్తివాచనం వివరిస్తున్నాను. శ్రద్ధగా వినుము.

స్వస్తి తే కురుతాం బ్రహ్మ పద్మయోనీ రజోగుణః ।
స్వస్తి చక్రాంకిత కరో విష్ణుస్తే విదధాత్వజః ॥15॥

ఓ శిఖిధ్వజా! రజోగుణుడు, పద్మయోనియునైన బ్రహ్మ నీకు క్షేమం కలుగజేయుగాక! అజుడు, చక్రధరుడునైన విష్ణువు నీకు మేలు సేయుగాక!

స్వస్తి తే శంకరో భక్త్యా సపత్నీకో వృషధ్వజః ।
పావకః స్వస్తి తుభ్యం చ కరోతు శిఖివాహన! ॥16॥

ఓ శిఖివాహనా! వృషధ్వజుడైన శంకరుడు సపత్నీకుడై, నీకు శుభమొనర్చుగాక! పావకుడు (అగ్ని) నీకు మేలు చేయుగాక!

దివాకరః స్వస్తి కరోతు తుభ్యం సోమః స భౌమః స బుధో గురుశ్చ ।
కావ్యః సదా స్వస్తి కరోతు తుభ్యం శనైశ్చరః స్వస్త్యయనం కరోతు ॥17॥

దివాకరుడు నీకు స్వస్తి కలిగించుగాక!, చంద్రుడు, అంగారకుడు, బుధుడు, గురుడు, శుక్రుడు, నీకు సర్వదా స్వస్తి కలిగింతురుగాక! శనైశ్చరుడు నీకు స్వస్తి కలిగించుగాక!

మరీచిరత్రిః పులహః పులస్త్యః క్రతుర్వసిష్ఠో భృగురంగిరాశ్చ ।
మృకండుజస్తే కురుతాం హి స్వస్తి స్వస్తి సదా సప్తమహర్షయశ్చ ॥18॥

మరీచి, అత్రి, పులహుడు, పులస్త్యుడు, క్రతు, వసిష్ఠులు, భృగువు, అంగిరసుడు, మార్కండేయుడు నీకు స్వస్తి కలిగింతురుగాక! నీకు సదా సప్తర్షులు స్వస్తి కలుగజేయుదురుగాక!.

విశ్వేశ్వినౌ సాధ్యమరుద్గణాగ్నయో దివాకరాః శూలధరా మహేశ్వరాః ।
యక్షాః పిశాచా వసవోఽథ కిన్నరాస్తే స్వస్తి కుర్వంతు సదోద్యతాస్త్వమీ ॥19॥

విశ్వేదేవతలు, అశ్వినీదేవతలు, సాధ్యులు, మరుత్తులు, అగ్నులు, ఆదిత్యులు, శూలధరులైన రుద్రులు, యక్షులు, పిశాచులు, వసువులు, కిన్నరులు నీకు సదా స్వస్తి కలుగజేయుదురుగాక!

నాగాః సుపర్ణాః సరితః సరాంసి తీర్థాని పుణ్యాయతనాః సముద్రాః ।
మహాబలా భూతగణా గణేంద్రాస్తే స్వస్తి కుర్వంతు సదా సముద్యతాః ॥20॥

నాగులు, గరుడులు, నదులు, సరస్సులు, తీర్థాలు, పవిత్ర క్షేత్రాలు, సముద్రాలు, మహాబలులైన భూతగణాలు, గణాధ్యక్షులు, అందరు నీకు క్షేమం కలుగజేయడానికి సదా సన్నద్ధులై యుందురుగాక!.

స్వస్తి ద్విపాదికేభ్యస్తే చతుష్పాదేభ్య ఏవ చ ।
స్వస్తి తే బహుపాదేభ్యస్త్వపాదేభ్యోఽప్యనామయమ్ ॥21॥

ద్విపాదులు, చతుష్పాదులు, బహుపాదులు, పాదాలు లేని జీవులందరి నుండి నీకు రక్ష కలుగుగాక!

ప్రాచీం దిగ్రక్షతాం వజ్రీ దక్షిణాం దండనాయకః ।
పాశీ ప్రతీచీం రక్షతు యక్షేశః పాతు చోత్తరామ్ ॥22॥

తూర్పుదిక్కున ఇంద్రుడు, దక్షిణాన దండధరుడు, పశ్చిమదిక్కులో వరుణుడు, ఉత్తరదిక్కునందు యక్షేశ్వరుడు (కుబేరుడు) నిన్ను రక్షింతురుగాక!

వహ్నిర్దక్షిణపూర్వాం చ కుబేరో దక్షిణాపరామ్ ।
ప్రతీచీముత్తరాం వాయుః శివః పూర్వోత్తరామపి ॥23॥

ఆగ్నేయదిక్కున అగ్ని, నైరృతిదిక్కున కుబేరుడు, వాయువ్యంలో వాయువు, ఈశాన్యదిక్కులో ఈశానుడు నిన్ను కాపాడుచుందురుగాక!

ఉపరిష్టాద్ధ్రువః పాతు అధస్తాచ్చ ధరాధరః ।
ముసలీ లాంగలీ చక్రీ ధనుష్మానంతరేషు చ ॥24॥

ఊర్ధ్వదిక్కులో ధ్రువుడు, అధోదిశలో ఆదిశేషుడు, దిశాంతరాలలో ముసలం, నాగలి, చక్రం, ధనుస్సు ధరించినవారు, (సంకర్షణ వాసుదేవులు) నిన్ను రక్షింతురుగాక!

వారాహోఽమ్బునిధౌ పాతు దుర్గే పాతు నృకేసరీ ।
సామవేదధ్వనిః శ్రీమాన్ సర్వతః పాతు మాధవః ॥25॥

సముద్ర జలాలలో వారాహ ప్రభువు, సంకట స్థలాలలో నరసింహుడు, అంతటా సామవేద స్వరూపుడైన మాధవుడు నిన్ను రక్షింతురుగాక!.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏవం కృతస్వస్త్యయనో గుహః శక్తిధరోఽగ్రణీః ।
ప్రణిపత్య సురాన్ సర్వాన్ సముత్పతత భూతలాత్ ॥26॥

ఈవిధంగా శ్రీహరి పలికిన స్వస్తివచనాలను స్వీకరించి శక్తిధరులలో శ్రేష్ఠుడైన గుహుడు (స్కందుడు) దేవతలందరికి సాష్టాంగప్రణామం గావించి, భూతలంనుండిలేచి పైకి ఎగిరాడు.

తమన్వేవ గణాః సర్వే దత్తా యే ముదితైః సురైః ।
అనుజగ్ముః కుమారం తే కామరూపా విహంగమాః ॥27॥

సంతుష్టులై దేవతలిచ్చిన సమస్త భూతగణాలు కూడా కామరూపులగుటచే పక్షుల రూపంలో కుమారుని అనుసరించి, ఆకాశమార్గంలో బయలుదేరారు.

మాతరశ్చ తథా సర్వాః సముత్పేతుర్నభస్తలమ్ ।
సమం స్కందేన బలినా హన్తుకామా మహాసురాన్ ॥28॥

మాతృగణం కూడా రాక్షసవధార్థం ఆకాశంలో ప్రయాణం చేస్తున్న స్కందుని అనుసరించారు.

తతః సుదీర్ఘమధ్వానం గత్వా స్కందోఽబ్రవీద్గణాన్ ।
భూమ్యాం తూర్ణం మహావీర్యాః కురుధ్వమవతారణమ్ ॥29॥

ఆ విధంగా ఆకాశమార్గాన చాలాదూరం ప్రయాణించిన పిమ్మట స్కందుడు ఆ గణాలనన్నిటిని త్వరగా భూమిమీదకు దిగవలసినదని ఆదేశించాడు.

గణా గుహవచః శ్రుత్వా అవతీర్య మహీతలమ్ ।
ఆరాత్ పతంతస్తద్దేశం నాదం చక్రుర్భయంకరమ్ ॥30॥

గుహుని వచనానుసారం వారంతా మహీతలానికి దిగి, భయంకరంగా గర్జించారు.

తన్నినాదో మహీం సర్వామాపూర్య చ నభస్తలమ్ ।
వివేశార్ణవరంధ్రేణ పాతాలం దానవాలయమ్ ॥31॥

ఆ మహాధ్వని భూమ్యాకాశాలంతటా నిండి, సముద్రబిలం గుండా రాక్షసులకు నిలయమైన పాతాలానికి వ్యాపించింది.

శ్రుతః స మహిషేణాథ తారకేణ చ ధీమతా ।
విరోచనేన జంభేన కుజంభేనాసురేణ చ ॥32॥

ఆ మహానాదాన్ని మహిషుడు, తారకుడు, విరోచనుడు, జంభుడు, కుజంభుడు మున్నగు అసురులందరు విన్నారు.

తే శ్రుత్వా సహసా నాదం వజ్రపాతోపమం దృఢమ్ ।
కిమేతదితి సంచింత్య తూర్ణం జగ్ముస్తదాంధకమ్ ॥33॥

వారు ఆ ప్రళయగర్జనను విని, పిడుగుపాటువలెనున్న ఇది ఏమి శబ్దమని వితర్కించుకుని, అందరు కలసి అంధకాసురుని చెంతకు వెళ్ళారు.

తే సమేత్యాంధకేనైవ సమం దానవపుంగవాః ।
మంత్రయామాసురుద్విగ్నాస్తం శబ్దం ప్రతి నారద! ॥34॥

ఓ నారదా! ఆవిధంగా వారందరు అంధకుని సమీపించి, మిక్కిలి ఉద్వేగాన్ని పొందినవారై, ఆ ధ్వనిని గూర్చి ఆలోచించసాగారు.

మంత్రయత్సు చ దైత్యేషు భూతలాత్ సూకరాననః ।
పాతాలకేతుర్దైత్యేంద్రః సంప్రాప్తోఽథ రసాతలమ్ ॥35॥

స బాణవిద్ధో వ్యథితః కంపమానో ముహుర్ముహుః ।
అబ్రవీద్వచనం దీనం సమభ్యేత్యాంధకాసురమ్ ॥36॥

వారందరు అట్లు సంప్రదించుకుంటూ ఉండగా భూలోకం నుండి పాతాలకేతువనే సూకరముఖుడైన దానవేంద్రుడు బాణం దెబ్బ తగిలి వ్యథితుడై, వణుకుతూ రసాతలంలోని అంధకాసురుని సమీపించి, దీనవదనంతో పదేపదే ఇలా పలికాడు.

పాతాలకేతురువాచ – పాతాళకేతువు పలికాడు.

గతోఽహమాసం దైత్యేంద్ర! గాలవస్యాశ్రమం ప్రతి ।
తం విధ్వంసయితుం యత్నః సమారబ్ధో బలాన్మయా ॥37॥

ఓ దైత్యేంద్రా! నేను భూలోకంలో గాలవమహర్షి ఆశ్రమాన్ని ధ్వంసం చేసే సంకల్పంతో బలవంతంగా ఆశ్రమంలో ప్రవేశించి, ధ్వంసం చేయడానికి యత్నించాను.

యావత్సూకరరూపేణ ప్రవిశామి తమాశ్రమమ్ ।
న జానే తం నరం రాజన్ యేన మే ప్రహితః శరః ॥38॥

శరసంభిన్నజత్రుశ్చ భయాత్ తస్య మహాజవః ।
ప్రణష్ట ఆశ్రమాత్ తస్మాత్ స చ మాం పృష్ఠతోఽన్వగాత్ ॥39॥

తురంగఖురనిర్ఘోషః శ్రూయతే పరమోఽసుర ।
తిష్ఠ తిష్ఠేతి వదతస్తస్య శూరస్య పృష్ఠతః ।
తద్భయాదస్మి జలధిం సంప్రాప్తో దక్షిణార్ణవమ్ ॥40॥

యావత్ పశ్యామి తత్రస్థాన్ నానావేషాకృతీన్ నరాన్ ।
కేచిద్గర్జన్తి ఘనవత్ ప్రతిగర్జన్తి చాపరే ॥41॥

అన్యే చోచుర్వయం నూనం నిఘ్నామో మహిషాసురమ్ ।
తారకం ఘాతయామోఽద్య వదన్త్యన్యే సుతేజసః ॥42॥

ఆ ఆశ్రమాన్ని నాశనం చేయడానికి నేను సూకర రూపంలో ప్రవేశించగానే ఎవడో మానవుడు తన బాణంతో నా మెడయెముకను గట్టిగా పగులగొట్టాడు. నేను ఆ చావుదెబ్బకు భయపడి, మిక్కిలివేగంతో ఆ ఆశ్రమాన్ని వదలి పారిపోగా వాడు నన్ను వెంబడించాడు. గుఱ్ఱపుడెక్కల ధ్వనుల మధ్య "నిలు!నిలు!" మంటు ఆ వీరుడు నన్ను వెంబడించాడు. నేను ఆ భయంతో దక్షిణ సముద్రం చివరకు పరుగు తీసి, అప్పుడు కొంచెం వెనుకకు తిరిగి వారెవ్వరాయని పరికించాను. అంతట రకరకాలవేషాలు ధరించిన ఎందరో మనుష్యులు కనిపించారు. వారిలో కొందరు మేఘాలవలె గర్జిస్తూ ఉండగా మరికొందరు ప్రతిగర్జనలు చేస్తున్నారు. మరికొందరు ఈరోజు తప్పకుండా మహిషాసురుని చంపేస్తామనియు, తారకాసురుని కూడ సంహరిస్తామనియు గట్టిగా కేకలు పెడుతున్నారు.

తచ్ఛ్రుత్వా సుతరాం త్రాసో మమ జాతోఽసురేశ్వర! ।
మహార్ణవం పరిత్యజ్య పతితోఽస్మి భయాతురః ॥43॥

ధరణ్యాం వివృతం గర్తం స మామన్వపతద్బలీ ।
తద్భయాత్ సంపరిత్యజ్య హిరణ్యపురమాత్మనః ॥ 44॥

తవాన్తికమనుప్రాప్తః ప్రసాదం కర్తుమర్హసి ।

"ప్రభూ! వారి కేకలకు నేను మిక్కిలి భయపడి, ఆ మహాసముద్రాన్ని విడిచి, భూలోకంలోని పెద్ద బిలంలో పడిపోయాను. అతడు నన్ననుసరించాడు. ఆ భయంతోనే నా హిరణ్యపురాన్ని కూడా విడిచిపెట్టాను. మీ సమీపానికి చేరాను. నాయందు దయయుంచి నన్ను రక్షించండి". అని ప్రార్థించాడు.

తచ్ఛ్రుత్వా చాంధకో వాక్యం ప్రాహ మేఘస్వనం వచః ॥45॥

సూకరముఖుని దీనవచనాలను అంధకాసురుడు విని, మేఘగంభీరస్వరంతో ఇలా పలికాడు.

న భేతవ్యం త్వయా తస్మాత్ సత్యం గోప్తాఽస్మి దానవ! ।
మహిషస్తారకశ్చోభౌ బాణశ్చ బలినాం వరాః ॥46॥

అనాఖ్యాయైవ తే వీరాస్త్వంధకం మహిషాదయః ।
స్వపరిగ్రహసంయుక్తా భూమిం యుద్ధాయ నిర్యయుః ॥47॥

యత్ర తే దారుణాకారా గణాశ్చక్రుర్మహాస్వనమ్ ।
తత్ర దైత్యాః సమాజగ్ముః సాయుధాః సబలా మునే ॥48॥

"ఓ దానవా! నీవు వారివలన భయపడవద్దు. నిన్ను తప్పక రక్షిస్తాను. బలవంతులైన మహిషాసురుడు, తారకాసురుడు, బాణుడు మొదలైన రాక్షసవీరులు అంధకునికి తెలుపకుండానే తమతమ బలాలతో భూలోకానికి యుద్ధం చేయడానికి వెళ్ళారు". ఎక్కడైతే దారుణమైన ఆకారాలతో వారు మహానాదాన్ని చేశారో అక్కడకు మహిషాది దానవ వీరులందరు తమతమ ఆయుధాలతో, బలాలతో చేరుకున్నారు".

దైత్యానాపతతో దృష్ట్వా కార్తికేయగణాస్తతః ।
అభ్యద్రవన్త సహసా స చోగ్రో మాతృమండలః ॥49॥

తేషాం పురస్సరః స్థాణుః ప్రగృహ్య పరిఘం బలీ ।
నిషూదయన్ పరబలం క్రుద్ధో రుద్రః పశూనివ ॥50॥

ఓ నారదా! ఆ విధంగా రక్కసిమూకలు విరుచుకుపడడం చూచి, కార్తికేయుని గణాలు మహావేగంగా మాతృగణాలతో సహా ఉగ్రంగా శత్రువులపై లంఘించారు. వారిలో ముందుభాగాన బలశాలియైన స్థాణువు, బలమైన పరిఘను తీసుకొని క్రుద్ధుడైన రుద్రుడు పశువులను సంహరించునట్లుగా శత్రుసైన్యాన్ని సంహరింపసాగాడు.

తం నిఘ్నన్తం మహాదేవం నిరీక్ష్య కలశోదరః ।
కుఠారం పాణినాఽఽదాయ హన్తి సర్వాన్ మహాసురాన్ ॥51॥

మహాదేవుడు చేసే సంహారకార్యాన్ని చూచి కలశోదరుడు గొడ్డలిని తీసుకొని మహాసురులందరిని సంహరించాడు.

జ్వాలాముఖో భయంకరః కరేణాదాయ చాసురమ్ ।
సరథం సగజం సాశ్వం విస్తృతే వదనేఽక్షిపత్ ॥52॥

భయంకరుడైన జ్వాలాముఖుడు అగ్నిగుండంలాంటి నోరు తెరచికొని చేతులతో, రథాలను, గజాలను, అశ్వాలతో సహా రాక్షసులను పట్టుకుని, విశాలమైన తన నోటిలో పడవైచి సంహరించాడు.

దండకశ్చాపి సంక్రుద్ధః ప్రాసపాణిర్మహాసురమ్ ।
సవాహనం ప్రక్షిపతి సముత్పాట్య మహార్ణవే ॥53॥

భయంకరమైన ప్రాసను పట్టుకుని దండకుడు కోపంతో విజృంభించి, ఆ మహాసురుని వాహనంతో సహా యెత్తి మహాసముద్రంలోనికి విసరివేశాడు.

శంకుకర్ణశ్చ ముసలీ హలేనాకృష్య దానవాన్ ।
సంచూర్ణయతి మంత్రీవ రాజానం ప్రాసభృద్వశీ ॥54॥

ప్రజలను వశపరచుకున్న మంత్రి ప్రాసాయుధంతో రాజుతల ముక్కలు చేసినట్లు శంకుకర్ణుడు రాక్షసులను నాగలితో తనవైపునకులాగి రోకలితో వారి తలలను బద్దలుకొట్టసాగాడు.

ఖడ్గచర్మధరో వీరః పుష్పదంతో గణేశ్వరః ।
ద్విధా త్రిధా చ బహుధా చక్రే దైతేయ దానవాన్ ॥55॥

గణనాయకుడైన పుష్పదన్తుడు ఖడ్గము, డాలు పట్టుకుని రాక్షసులను రెండు మూడు ముక్కలుగాను, అనేక ఖండాలుగాను నరకసాగాడు.

పింగళో దండముద్యమ్య యత్ర యత్ర ప్రధావతి ।
తత్ర తత్ర ప్రదృశ్యన్తే రాశయః శావదానవైః ॥56॥

భయంకరమైన దండాన్ని త్రిప్పుతూ పింగళుడు రాక్షసులు ఎక్కడకు వెళితే అక్కడకు వెళ్ళి వారిని శవాల కుప్పలుగా చేయసాగాడు.

సహస్రనయనః శూలం భ్రామయన్ వై గణాగ్రణీః ।
నిజఘానాసురాన్ వీరః సవాజి రథకుంజరాన్ ॥57॥

గణాగ్రణియైన సహస్రనయనుడు శూలం త్రిప్పుతూ రథాశ్వగజాలతోసహా రాక్షస వీరులను సంహరించాడు.

భీమో భీమశిలావర్షైః సపురస్సరతోఽసురాన్ ।
నిజఘాన యథైవేంద్రో వజ్రవృష్ట్యా నగోత్తమాన్ ॥58॥

ఇంద్రుడు వజ్రధారలతో పర్వతాలను పిండి చేసినట్లు భీముడు భయంకరమైన శిలావృష్టితో ఎదురుగా వచ్చిన అసురులనందరిని సంహరించాడు.

రౌద్రః శకటచక్రాక్షో గణః పంచశిఖో బలీ ।
భ్రామయన్ ముద్గరం వేగాన్నిజఘాన బలాద్రిపూన్ ॥59॥

ఐదుజటలు గల శకటచక్రాక్షుడనే గణాధిపతి ముద్గరాన్ని మహావేగంతో త్రిప్పుతూ, శత్రువులను ఎందరినో సంహరించాడు.

గిరిభేదీ తలేనైవ సారోహం కుంజరం రణే ।
భస్మ చక్రే మహావేగో రథం చ రథినా సహ ॥60॥

గిరిభేది అనేవాడు తన అరచేతి దెబ్బలతోనే ఏనుగులతో సహా గజారోహకులను, రథాలతో సహా రథికులను, బూడిదగాను, పొడిపొడిగాను చేశాడు.

నాడీజంఘోఽఙ్ఘ్రిపాతైశ్చ ముష్టిభిర్జానునాఽసురాన్ ।
కీలాభిర్వజ్రతుల్యాభిర్జఘాన బలవాన్ మునే! ॥61॥

ఓ నారదమునీ! బలశాలియైన నాడీజంఘుడు తన పాదాలతోను, మోకాళ్ళతోను, వజ్రాలవంటి ముష్టిఘాతాలతోను, ఉక్కుగుండ్లతోను శత్రునాశనం గావించాడు.

కూర్మగ్రీవో గ్రీవయైవ శిరసా చరణేన చ ।
లుంఠనేన తథా దైత్యాన్ నిజఘాన సవాహనాన్ ॥62॥

కూర్మగ్రీవుడు తనమెడతోను, తలతోను, పాదాలతోను శత్రువులమీదపడి దొర్లి, శత్రువులను వాహనాలతో సహా చీల్చి సంహరించాడు.

పిండారకస్తు తుండేన శృంగాభ్యాం చ కలిప్రియ ।
విదారయతి సంగ్రామే దానవాన్ సమరోద్ధతాన్ ॥63॥

సమరోద్ధతులైన దానవులను పిండారకుడు తన తుండంతోను, శృంగములతోను చీల్చి చెండాడాడు.

తతస్తత్సైన్య మతులం వధ్యమానం గణేశ్వరైః ।
ప్రదుద్రావాథ మహిషస్తారకశ్చ గణాగ్రణీః ॥64॥

తే హన్యమానాః ప్రమథా దానవాభ్యాం వరాయుధైః ।
పరివార్య సమంతాత్తే యుయుధుః కుపితాస్తదా ॥65॥

ఎదురులేని ఆ రాక్షససైన్యం గణాధిపతుల చేతులలో హతమైపోవడం చూచి, మహారోషంతో మహిషుడు, తారకుడు, ప్రచండసేనాధిపతులు తమ తమ దివ్యాయుధాలతో ముందుకు లంఘించారు. ఆ యిద్దరు దైత్యనాయకులు

శ్రేష్ఠమైన తమ ఆయుధాలతో ప్రమథులను ప్రహరించడంచూచి, వారిని నలువైపులనుండి చుట్టుముట్టి యుద్ధం చేయసాగారు.

హంసాస్యః పట్టిశేనాథ జఘాన మహిషాసురమ్ ।
షోడశాక్షస్త్రిశూలేన శతశీర్ష్ణో వరాసినా ॥66॥

శ్రుతాయుధస్తు గదయా విశోకో ముసలేన తు ।
బంధుదత్తస్తు శూలేన మూర్ధ్ని దైత్యమతాడయన్ ॥67॥

హంసాస్యుడు మహిషుని పట్టిసంతో చావమోదాడు. షోడశాక్షుడు త్రిశూలంతోను, శతశీర్షుడు వాడియైన కరవాలంతోను, శ్రుతాయుధుడు గదతోను, విశోకుడు రోకలితోను, బంధుదత్తుడు శూలంతోను ఒకేమారు ఆ రాక్షసుని మాడుమీద కొట్టారు.

తథాఽన్యైః పార్షదైర్యుద్ధే శూలశక్త్యృష్టిపట్టిశైః ।
నాకంపత్ తాడ్యమానోఽపి మైనాక ఇవ పర్వతః ॥68॥

ఇంకా అనేకమంది పార్షదులు కూడా శూలాలు, శక్తులు, పట్టిసాలతో ఆ మహిషుని ప్రహరించినప్పటికి ఆ వీరుడు మాత్రం మైనాకపర్వతంవలె ఏమాత్రం చలించలేదు.

తారకో భద్రకాల్యా చ తథోలూఖలయా రణే ।
వధ్యతే చైకచూడాయా దార్యతే పరమాయుధైః ॥69॥

తౌ తాడ్యమానౌ ప్రమథైర్మాతృభిశ్చ మహాసురౌ ।
న క్షోభం జగ్మతుర్వీరౌ క్షోభయన్తౌ గణానపి ॥70॥

భద్రకాళి, ఉలూఖలుడు, ఏకచూడుడు, తమ తమ దివ్యాయుధాలతో తారకాసురుని బాధింపసాగారు. ఆ విధంగా ప్రమథులు, మాతృగణాలు ఆ మహాసురులనిర్వురను ప్రహరిస్తున్నను ఆ రాక్షసవీరులిరువురు ఏమాత్రం బాధకు లోనుకాలేదు.అంతేగాక వారిరువురు దేవగణాలను హింసింపసాగారు.

మహిషో గదయా తూర్ణం ప్రహారైః ప్రమథానథ ।
పరాజిత్య పరాధావత్ కుమారం ప్రతి సాయుధః ॥71॥

మహిషుడు ప్రచండ గదాయుధంతో ప్రమథులను ప్రహరించి, ఓడించి, కార్తికేయుడున్న వైపునకు సాయుధుడై పరుగు తీశాడు.

తమాపతన్తం మహిషం సుచక్రాక్షో నిరీక్ష్య హి ।
చక్రముద్యమ్య సంక్రుద్ధో రురోధ దనునందనమ్ ॥72॥

ఆ విధంగా మీదకు లంఘిస్తున్న మహిషుని చూసి సుచక్రాక్షుడు మహాకోపంతో, చక్రాయుధంతో మహిషుని నిరోధించాడు.

గదాచక్రాంకితకరౌ గణాసురమహారథౌ ।
అయుధ్యేతాం తదా బ్రహ్మన్ లఘు చిత్రం చ సుష్ఠు చ ॥73॥

ఓ బ్రహ్మర్షీ! ఆ విధంగా మహారథులైన గణాధ్యక్షులు, రాక్షసాధిపతులు, గదలు, చక్రాయుధాలు, చేబట్టి పరస్పరం ప్రహరించుకుంటూ సమ ఉజ్జీలుగా, భయంకరంగా, అలవోకగా యుద్ధం చేశారు.

గదాం ముమోచ మహిషః సమావిధ్య గణాయ తు ।
సుచక్రాక్షో నిజం చక్రముత్ససర్జాసురం ప్రతి ॥74॥

గదాం ఛిత్వా సుతీక్ష్ణారం చక్రం మహిషమాద్రవత్ ।
తత ఉచ్చుక్రుశుర్దైత్యా హా హతో మహిషస్త్వితి ॥75॥

మహిషుడు గదను ప్రయోగించగా సుచక్రాక్షుడు చక్రాన్ని వాని మీదకు ప్రయోగించాడు. భయంకరమైన అంచులుగల ఆ చక్రం గదను పొడిపొడి గావించి, మహిషుని మీదకు వచ్చింది. అది చూసి దైత్యులంతా "అయ్యో! మహిషుడు మరణించాడుగదా!" అని ఆక్రోశింపసాగారు.

తచ్ఛ్రుత్వాఽభ్యద్రవద్బాణః ప్రాసమావిధ్య వేగవాన్ ।
జఘాన చక్రం రక్తాక్షః పంచముష్టిశతేన హి ॥76॥

అది విని బాణుడు ప్రాసాయుధాన్ని తీసుకుని రక్తాక్షుడై, వేగంగా 500 ముష్టిఘాతాలతో చక్రాయుధాన్ని ఎదుర్కొన్నాడు.

పంచబాహుశతేనాపి సుచక్రాక్షం బబంధ సః ।
బలవానపి బాణేన నిష్ప్రయత్నగతిః కృతః ॥77॥

500 బాహువులతో సుచక్రాక్షుని బాణుడు బంధించాడు. సుచక్రాక్షుడు బలవంతుడైనా బాణునిముందు ఏమీ చేయలేకపోయాడు.

సుచక్రాక్షం సచక్రం హి బద్ధం బాణాసురేణ హి ।
దృష్ట్వాఽద్రవద్గదాపాణిర్మకరాక్షో మహాబలః ॥78॥

గదయా మూర్ధ్ని బాణం హి నిజఘాన మహాబలః ।
వేదనార్తో ముమోచాథ సుచక్రాక్షం మహాసురః ॥79॥

స చాపి తేన సంయుక్తో వ్రీడాయుక్తో మహామనాః ।
స సంగ్రామం పరిత్యజ్య సాలిగ్రామముపాయయౌ ॥80॥

సుచక్రాక్షుని చక్రంతో సహా బాణుడు బంధించడం చూసి మహాబలుడైన మకరాక్షుడు గదాపాణియై పరుగు పరుగున వచ్చాడు. మహాబలుడైన ఆ మకరాక్షుడు గదతో బాణుని నెత్తిమీద మోదాడు. ఆ దెబ్బకు తాళలేక

బాణుడు సుచక్రాక్షుని వదలిపెట్టాడు. దానితో సిగ్గుతో తలవంచుకొనిన సుచక్రాక్షుడు యుద్ధభూమిని విడిచి సాలిగ్రామానికి వెళ్ళిపోయాడు.

బాణోఽపి మకరాక్షేణ తాడితోఽభూత్ పరాఙ్ముఖః ।
ప్రభజ్యత బలం సర్వం దైత్యానాం సురతాపస! ॥81॥

తతః స్వబలమీక్ష్యైవ ప్రభగ్నం తారకో బలీ ।
ఖడ్గోద్యతకరో దైత్యః ప్రదుద్రావ గణేశ్వరమ్ ॥82॥

మకరాక్షునిచేత చావుదెబ్బలు తిన్న బాణుడు కూడ కాలికి బుద్ధి చెప్పాడు. ఓ దేవర్షీ! రాక్షససైన్యమంతా భగ్నమైపోవడం చూచి మహాబలియైన తారకాసురుడు మండిపడి, ఖడ్గం తీసుకొని గణేశ్వరులనందరిని వెంబడించి, తరిమి తరిమి కొట్టాడు.

తతస్తు తేనాప్రతిమేన సాసినా తే హంసవక్త్రప్రముఖా గణేశ్వరాః ।
సమాతరశ్చాపి పరాజితా రణే స్కందం భయార్తాః శరణం ప్రపేదిరే ॥83॥

అప్రతిమానపరాక్రమంగల తారకాసురుని కత్తిదెబ్బలకు గురియైన హంసాస్యుడు మున్నగు గణపతులు, మాతృగణాలు, భయార్తులై పారిపోయి స్కందుని శరణుజొచ్చారు.

భగ్నాన్ గణాన్ వీక్ష్య మహేశ్వరాత్మజస్తం తారకం సాసినమాపతన్తమ్ ।
దృష్ట్వైవ శక్త్యా హృదయే బిభేద స భిన్న మర్మా న్యపతత్ పృథివ్యామ్ ॥84॥

మహేశ్వరాత్మజుడైన స్కందుడు భగ్నులైన తమ గణాలపై కత్తితో మృత్యువులాగ పడుచున్న, వెంబడిస్తున్న తారకాసురుని చూసి, తన భయంకరమైన శక్తి అనే ఆయుధంతో తారకుని వక్షఃస్థలంపై కొట్టగానే ఆ రాక్షసుని మర్మాంగాలన్నీ భిన్నమై, ప్రాణాలు కోల్పోయి, నేలపై బడ్డాడు.

తస్మిన్హతే భ్రాతరి భగ్నదర్పో భయాతురోఽభూన్మహిషో మహర్షే ।
సంత్యజ్య సంగ్రామశిరో దురాత్మా జగామ శైలం స హిమాచలాఖ్యమ్ ॥85॥

ఓ నారదమహర్షీ! ఆ విధంగా తన సోదరుడు నేలకూలడం చూచిన మహిషుని పొగరంతా నీరుకారిపోయింది. భయంతో గడగడ వణకుతూ మహిషుడు యుద్ధభూమిని విడిచి హిమాచలానికి పారిపోయాడు.

బాణోఽపి వీరే నిహతేఽథ తారకే గతే హిమాద్రిం మహిషే భయార్తే ।
భయాద్వివేశోగ్రమపాం నిధానం గణైర్బలే వధ్యతి సాపరాధే ॥86॥

తారకుడు స్కందుని శక్తికి బలికావడం, మహిషుడు హిమాచలానికి పారిపోవడం, రాక్షసబలాలను స్కందగణాలు చీల్చిచెండాడడం చూసిన బాణాసురుడు కూడా భయంతో సముద్రజలాలలో ప్రవేశించి అదృశ్యుడయ్యాడు.

హత్వా కుమారో రణమూర్ధ్ని తారకం ప్రగృహ్య శక్తిం మహతా జవేన ।
మయూరమారుహ్య శిఖండమండితం యయౌ నిహంతుం మహిషాసురంచ ॥87॥

కుమారస్వామి యుద్ధాగ్రంలో ఆ విధంగా తారకుని సంహరించడంతో భయపడి పారిపోవుచున్న మహిషుని సంహరించడానికి శక్తి అనే ఆయుధాన్ని ధరించి, మయూరవాహనాన్ని అధిరోహించి వేగంగా మహిషుని వెంబడించాడు.

స పృష్ఠతః ప్రేక్ష్య శిఖండికేతనం సమాపతన్తం వరశక్తిపాణినమ్ ।
కైలాసముత్సృజ్య హిమాచలం తథా క్రౌంచం సమభ్యేత్య గుహాం వివేశ ॥88॥

ఆ మహిషుడు వెనుదిరిగి చూడగా మయూరధ్వజుడు శక్తిపాణుడై, తనను వెంబడించడం గమనించి, కైలాసాన్ని, హిమాచలాన్ని వదలి క్రౌంచగిరిగుహలో ప్రవేశించి దాగుకున్నాడు.

దైత్యం ప్రవిష్టం స పినాకిసూనుర్జుగోప యత్నాద్భగవాన్ గుహోఽపి ।
స్వబన్ధుహన్తా భవితా కథం త్వహం స చిన్తయన్నేవ తతః స్థితోఽభూత్ ॥89॥

ఆ విధంగా క్రౌంచపర్వత గుహలో ప్రవేశించిన మహిషుని స్కందుడు చంపకుండా స్వబంధుహంతకుడనెట్లు కాగలనని ఆలోచిస్తూ స్తబ్ధుడై యుండిపోయాడు.

తతోఽభ్యగాత్ పుష్కరసంభవస్తు హరో మురారిస్త్రిదశేశ్వరశ్చ ।
అభ్యేత్య చోచుర్మహిషం సశైలం భిందస్వ శక్త్యా కురు దేవకార్యమ్ ॥90॥

అంతట బ్రహ్మవిష్ణుమహేశ్వరులు, త్రిదశేశ్వరుడైన ఇంద్రుడు మున్నగువారు అచ్చటకు వచ్చి, క్రౌంచపర్వతంతో సహా మహిషుని శక్తితో భేదించుము. దేవకార్యాన్ని పరిపూర్తి చేయుమని స్కందునితో చెప్పారు.

తత్కార్తికేయః ప్రియమేవ తథ్యం శ్రుత్వా వచః ప్రాహ సురాన్ విహస్య ।
కథం హి మాతామహ నప్తృకం వధే స్వభ్రాతరం భ్రాతృసుతం చ మాతుః ॥91॥

వారి మాటలను విని, కార్తికేయుడు చిరునవ్వుతో "మీరు చెప్పినది బాగానే ఉన్నది కానీ నా మాతామహుని మనుమడు, నా మేనమామపుత్రుడు మరియు నాకు సోదరునితో సమానుడు అయిన వీనిని ఏవిధంగా చంపగలను?

గాం బ్రాహ్మణం వృద్ధమథాప్తవాక్యం బాలం స్వబన్ధుం లలనామదుష్టామ్ ।
కృతాపరాధా అపి నైవ వధ్యా ఆచార్యముఖ్యా గురవస్తథైవ ॥92॥

ఏషా శ్రుతిశ్చాపి పురాతనీ కిల గాయన్తి యాం వేదవిదో మహర్షయః ।
కృత్వా చ యస్యా మతముత్తమాయాః స్వర్గం వ్రజన్తి త్వతిపాపినోఽపి ॥93॥

ఏవం జానన్ ధర్మమగ్ర్యం సురేంద్రా నాహం హన్యాం భ్రాతరం మాతులేయమ్ ।
యదా దైత్యో నిర్గమిష్యద్గుహాన్తస్తదా శక్త్యా ఘాతయిష్యామి శత్రుమ్ ॥94॥

గోవులను, బ్రాహ్మణులను, వృద్ధులను, ఆప్తవాక్యం పలుకువారిని, బాలురను, స్వబంధువులను, దుష్టులుకాని స్త్రీలను, గురువులను, ఆచార్యవర్యులను వారు అపరాధం చేసినను వధింపరాదుగదా!. ఇది పురాతనమైన వేదశాసనం కదా! ఈ శ్రుతివాక్యాన్ని వేదవేత్తలైన మహర్షులు ఉత్తమవ్రతంగా పాటిస్తున్నారుగదా! ఈ నీతిని పాటించి, అతిపాపులైనవారు కూడ స్వర్గాన్ని పొందుతున్నారుగదా!. ఇట్టి శ్రేష్ఠమైన ధర్మం తెలిసికూడా నా మేనమామ కుమారుని నాకు సోదరునివంటివాడు అయిన వీనిని నేను సంహరింపలేను. ఆ దైత్యుడు గుహనుండి ఎప్పుడు బయటకు వస్తాడో అప్పుడే నేను నా శక్తితో ఆ శత్రువును వధిస్తాను" అని దేవతా శ్రేష్ఠులతో స్కందుడు పలికాడు.

శ్రుత్వా కుమారవచనం భగవన్మహర్షే కృత్వా మతిం స్వహృదయే గుహమాహ శక్రః ।
మత్తో భవాన్ న మతిమాన్ వదసే కిమర్థం వాక్యం శృణుష్వ హరిణా గదితం హి పూర్వమ్ ॥95॥

ఓ నారదమహర్షీ! కుమారుడు చెప్పిన పలుకులు విని, దేవేంద్రుడు తన మనసులో బాగుగా ఆలోచించి, అతనితో ఇలా పలికాడు. "కుమారా! నీవు నాకంటే అధికమైన బుద్ధిమంతుడవు కావు. నీవిలా ఎందుకు మాట్లాడుతున్నావో నాకు అర్థం కావడం లేదు. పూర్వకాలంలో శ్రీహరి స్వయంగాచెప్పిన ధర్మసూక్ష్మం చెబుతాను వినుము.

నైకస్యార్థే బహూన్ హన్యాదితి శాస్త్రేషు నిశ్చయః ।
ఏకం హన్యాద్ బహుభ్యోఽర్థే న పాపీ తేన జాయతే ॥96॥

ఏతచ్ఛ్రుత్వా మయా పూర్వం సమయస్థేన చాగ్నిజ ।
నిహతో నముచిః పూర్వం సోదరోఽపి మమానుజః ॥97॥

తస్మాద్బహూనామర్థాయ స క్రౌంచం మహిషాసురమ్ ।
ఘాతయస్వ పరాక్రమ్య శక్త్యా పావకదత్తయా ॥98॥

ఒకరి కొరకు అనేకమందిని సంహరింపరాదు. అదేవిధంగా ఎక్కువమందిని రక్షించడానికి ఒక్కరిని చంపడం పాపం కానేరదు. ఇది శాస్త్రాలలో నిశ్చయింపబడిన ధర్మం. ఓ అగ్నిపుత్రా! ఈ ధర్మశాస్త్రాన్ని వినినందున నేను పూర్వకాలం యుద్ధంలో నా తమ్ముడైన నముచిదైత్యుని సోదరుడని భావింపక సంహరించాను. కాబట్టి ఎందరో దేవతల రక్షణ కొరకు నీవు పరాక్రమించి, అగ్నిదత్తమైన శక్తి ఆయుధంతో క్రౌంచపర్వతంతో సహా ఈ మహిషుని సంహరింపుము" అని ఇంద్రుడు గుహునితో పలికాడు.

పురందరవచః శ్రుత్వా క్రోధాదారక్తలోచనః ।
కుమారః ప్రాహ వచనం కంపమానః శతక్రతుమ్ ॥99॥

ఇంద్రుని మాటలువిని, క్రోధంతో ఎర్రబడిన కన్నులుగల కుమారుడు కోపంతో ఆవేశంతో కంపిస్తూ ఇంద్రునితో ఇలా పలికాడు.

మూఢ కిం తే బలం బాహ్వోః శారీరం చాపి వృత్రహన్ ।
యేనాధిక్షిపసే మాం త్వం ధ్రువం న మతిమానసి ॥100॥

ఓ వృత్రహన్తా! నీవు మూఢుడవు. నన్నిలా ఆక్షేపణ చేస్తున్నావు. నీవెంత? నీబలమెంత? నిజంగా నీవు బుద్ధిహీనుడవు.

తమువాచ సహస్రాక్షస్త్వత్తోఽహం బలవాన్ గుహ ।
తం గుహః ప్రాహ ఏహ్యేహి యుద్ధ్యస్వ బలవాన్ యది ॥101॥

అంతట ఇంద్రుడు "ఓ గుహా! నీకంటే నేనే బలశాలిని!" అన్నాడు. అయితే రమ్ము! ఎవడు బలవంతుడో యుద్ధంలో తేల్చుకుందామని గుహుడన్నాడు.

శక్రః ప్రాహాథ బలవాన్ జ్ఞాయతే కృత్తికాసుత ।
ప్రదక్షిణం శీఘ్రతరం యః కుర్యాత్ క్రౌంచమేవ హి ॥102॥

అంతట ఇంద్రుడు "ఓ కృత్తికాసుతా! బలవంతుడెవడో తెలియడానికి యుద్ధమవసరం లేదు. ఈ క్రౌంచపర్వతానికి ఎవడు ముందుగా ప్రదక్షిణం చేసి వస్తాడో వాడే బలవంతుడు" అని గుహునితో పలికాడు.

శ్రుత్వా తద్వచనం స్కందో మయూరం ప్రోహ్య వేగవాన్ ।
ప్రదక్షిణం పాదచారీ కర్తుం తూర్ణతరోఽభ్యగాత్ ॥103॥

ఇంద్రుని మాటలను విని స్కందుడు వేగంగా నెమలిమీదనుండి క్రిందకు దిగి, పాదచారియై త్వరత్వరగా ప్రదక్షిణం చేయడానికి వెళ్ళాడు.

శక్రోఽవతీర్య నాగేంద్రాత్ పాదేనాథ ప్రదక్షిణమ్ ।
కృత్వా తస్థౌ గుహోఽభ్యేత్య మూఢ కిం సంస్థితో భవాన్ ॥104॥

ఇంద్రుడు ఐరావతంనుండి దిగి, నిలబడియున్నాడు. పాదచారియై ప్రదక్షిణం చేసివచ్చిన గుహుడు "ఓ మూఢా! నీవిలా నిలబడినావేల?" అని ఇంద్రుని ప్రశ్నించాడు.

తమింద్రః ప్రాహ కౌటిల్యం మయా పూర్వం ప్రదక్షిణః ।
కృతోఽస్య న త్వయా పూర్వం కుమారః శక్రమబ్రవీత్ ॥105॥

అంతట ఇంద్రుడు ఈ క్రౌంచగిరికి నీకంటె పూర్వమే నేను ప్రదక్షిణ పూర్తిగావించానని గుహునితో చెప్పగా గుహుడు కాదు. నీకంటె నేనే ముందు చేశానని ఇంద్రునితో అన్నాడు.

మయా పూర్వం మయా పూర్వం వివదన్తౌ పరస్పరమ్ ।
ప్రాప్యోచతుర్మహేశాయ బ్రహ్మణో మాధవాయ చ ॥106॥

ఆ విధంగా నేను ముందు చేశానంటే నేను ముందు చేశానని పరస్పరం వాదించుకుంటున్న వారిరువురు బ్రహ్మవిష్ణుమహేశ్వరుల చెంతకు వెళ్ళి, వివాదాన్ని వారికి తెలియజేశారు.

అథోవాచ హరిః స్కందం ప్రష్టుమర్హసి పర్వతమ్ ।
యోఽయం వక్ష్యతి పూర్వం స భవిష్యతి మహాబలః ॥107॥

అంతట విష్ణువు స్కందునితో "ఎవరో తీర్పుచెప్పవలసిన అవసరమేమున్నది? క్రౌంచపర్వతాన్నే ముందుగా ప్రదక్షిణ చేసిన వాడెవడని అడిగినచో అతడే ముందుగా ప్రదక్షిణ గావించినవాడు, మహాబలుడెవడో చెప్పగలడు" అని పలికాడు.

తన్మాధవవచః శ్రుత్వా క్రౌంచమభ్యేత్య పావకిః ।
పప్రచ్ఛాద్రిమిదం కేన కృతం పూర్వం ప్రదక్షిణమ్ ॥108॥

మాధవుని మాటలు విని, స్కందుడు ముందుగా ఈ పర్వతానికి ప్రదక్షిణ చేసినవాడెవడో తెలియజేయవలసినదని క్రౌంచపర్వతాన్ని అడిగాడు.

ఇత్యేవముక్తః క్రౌంచస్తు ప్రాహ పూర్వం మహామతిః ।
చకార గోత్రభిత్ పశ్చాత్త్వయా కృతమథో గుహ! ॥109॥

అంతట క్రౌంచపర్వతం గుహునితో ఇలా చెప్పాడు. "ఓ గుహా! మహామతియు, గోత్రభేదియునైన ఇంద్రుడే ముందుగా నాకు ప్రదక్షిణం చేశాడు. తదనంతరమే నీవు ప్రదక్షిణం గావించావు" అని చెప్పాడు.

ఏవం బ్రువంతం క్రౌంచం స క్రోధాత్ప్రస్ఫురితాధరః ।
బిభేద శక్త్యా కౌటిల్యో మహిషేణ సమం తదా ॥110॥

క్రౌంచగిరి పలికిన పలుకులకు స్కందునకు కోపంతో కన్నులు ఎర్రబడ్డాయి. అధరం కంపించింది. పట్టరాని కోపంతోనున్న కుటిలాతనయుడైన స్కందుడు వెంటనే భయంకరమైన తన శక్తి అనే ఆయుధంతో ఆ క్రౌంచగిరిని, అందున్న మహిషుని కూడా చీల్చి సంహరించాడు.

తస్మిన్ హతేఽథ తనయే బలవాన్ సునాభో వేగేన భూమిధరపార్థివజస్తథాగాత్ ।
బ్రహ్మేన్ద్రరుద్రమరుదశ్వివసుప్రధానా జగ్ముర్దివం మహిషమీక్ష్య హతం గుహేన ॥111॥

ఆ విధంగా తన కుమారుడు మరణించగా, నగాధిరాజకుమారుడైన బలవంతుడైన సునాభుడు అక్కడకు వచ్చాడు. గుహునిచే సంహరింపబడిన మహిషుని చూచి, సంతోషంతో బ్రహ్మేంద్రరుద్రమరుత్తులు, అశ్వినీ దేవతలు, వసువులు, మున్నగు దేవతా ముఖ్యులందరు స్వర్గానికి వెళ్ళారు.

స్వమాతులం వీక్ష్య బలీ కుమారః శక్తిం సముత్పాట్య నిహంతుకామః ।
నివారితశ్చక్రధరేణ వేగాదాలింగ్య దోర్భ్యాం గురురిత్యుదీర్య ॥112॥

ఆ విధంగా వచ్చిన తన మేనమామయైన సునాభుని చూసి కుమారుడు తన శక్తిని పెరికి సునాభుని కూడా వధించుటకు ఉద్యుక్తుడయ్యాడు. వెంటనే శ్రీహరి స్కందుని కౌగిలించుకొని, సునాభుడు నీకు పూజ్యుడు గాన వధింపరాదని పలికి నివారించాడు.

సునాభమభ్యేత్య హిమాచలస్తు ప్రగృహ్య హస్తేఽన్యత ఏవ నీతవాన్ ।
హరిః కుమారం సశిఖండినం నయద్వేగాద్దివం పన్నగశత్రుపత్రః ॥113॥

హిమవంతుడు కూడా అచ్చటకు వచ్చి, సునాభుని చేయి పట్టుకుని వేరొకచోటుకు తీసుకుపోయాడు. అంతట గరుడారూఢుడైన హరి మయూరంతో సహా కార్తికేయుని తనవెంట స్వర్గానికి వేగంగా తీసుకొనిపోయాడు.

తతో గుహః ప్రాహ హరిం సురేశం మోహేన నష్టో భగవన్! వివేకః ।
భ్రాతా మయా మాతులజో నిరస్తస్తస్మాత్ కరిష్యే స్వశరీరశోషమ్ ॥114॥

అంతట గుహుడు శ్రీహరిని చూసి శోకంతో అజ్ఞానం వల్ల నాకు సోదరసమానుడూ, మేనమామకొడుకూ అయిన వానిని వధించాను. ఆ పాపానికి పరిహారంగా నేను శరీరత్యాగం చేస్తానని పలికాడు.

తం ప్రాహ విష్ణుర్వ్రజ తీర్థవర్యం పృథూదకం పాపతరోః కుఠారమ్ ।
స్నాత్వౌఘవత్యాం హరమీక్ష్య భక్త్యా భవిష్యసే సూర్యసమప్రభావః ॥115॥

అంతట విష్ణువు స్కందునితో ఇలా పలికాడు. "ఓ స్కందా! పాపాలనే వృక్షాలను తొలగించు గొడ్డలి వంటిదియు, తీర్థశ్రేష్ఠమైనట్టిదియు అగు పృథూదకమనే తీర్థానికి వెళ్ళుము. ఆ ఓఘవతిలో స్నానమాచరించి, భక్తితో శివదర్శనం చేసుకుంటే సమస్తపాపాలు తొలగిపోయి, సూర్యసమానతేజస్సుతో ప్రకాశిస్తావు" అని విష్ణువు గుహుని ఆదేశించాడు.

ఇత్యేవముక్తో హరిణా కుమారస్త్వభ్యేత్య తీర్థం ప్రసమీక్ష్య శంభుమ్ ।
స్నాత్వార్చ్య దేవాన్ స రవిప్రకాశో జగామ శైలం సదనం హరస్య ॥116॥

శ్రీహరి ఆజ్ఞ ప్రకారం కుమారుడు పృథూదకతీర్థానికివెళ్ళి, స్నానం చేసి, భక్తితో శంకరదర్శనం గావించి, విధ్యుక్తంగా దేవతలనందరిని అర్చించాడు. దానితో సూర్యప్రభాభాసమానుడైన స్కందుడు శివుడు నివసించే కైలాసానికి వెళ్ళాడు.

సుచక్రనేత్రోఽపి మహాశ్రమే తపశ్చకార శైలే పవనాశనస్తు ।
ఆరాధయానో వృషభధ్వజం తదా హరోఽస్య తుష్టో వరదో బభూవ ॥117॥

యుద్ధభూమినుండి వెళ్ళిన సుచక్రాక్షుడు కూడా అదే పర్వతంపై వాయుభక్షణం చేస్తూ, వృషభధ్వజుని ఆరాధిస్తూ కఠోరమైన తపస్సు గావించాడు. దానికి పరమశివుడు కూడా సంతుష్టుడై వరం కోరుకొనుమని పలికాడు.

దేవాత్ స వవ్రే వరమాయుధార్థే క్రౌంచాంతకారీ రిపుబాహుఖండమ్ ।
ఛింద్యాద్యథా త్వప్రతిమం కరేణ బాణస్య తన్మే భగవాన్ దదాతు ॥118॥

అందులకాతడు "ఓ మహేశ్వరా! నన్ను అవమానించిన బాణాసురుని బాహువులను చేతితో ఖండించ గలిగేశక్తిని నాకు అనుగ్రహించుము" అనే వరాన్ని శివునినుండి కోరుకున్నాడు.

తమాహ శంభుర్వ్రజ దత్తమేతద్ వరం హి చక్రస్య తవాయుధస్య ।
బాణస్య తద్బాహుబలం ప్రవృద్ధం సంఛేత్స్యతే నాత్ర విచారణాస్తి ॥119॥

అందులకు శివుడు "నీవు కోరినవరాన్ని నీకు అనుగ్రహిస్తున్నాను. రోజురోజుకు వృద్ధినొందుచున్న బాణాసురుని సహస్రబాహువులను నీచక్రాయుధం ఖండించగలదు. ఇది బాణాసురుని బాహువులను ఖండిస్తుంది. ఇందులో సంశయంలేదు" అని పలికి గణనాయకుడైన సుచక్రాక్షునికి వరప్రదానం చేశాడు.

వరే ప్రదత్తే త్రిపురాన్తకేన గణేశ్వరః స్కందముపాజగామ ।
నిపత్య పాదౌ ప్రతివంద్య హృష్టో నివేదయామాస హరప్రసాదమ్ ॥120॥

ఆ విధంగా త్రిపురాన్తకునిచే వరం పొందిన గణనాయకుడైన సుచక్రాక్షుడు స్కందుని వద్దకు వెళ్ళి, పాదాలపై పడి, నమస్కరించి, సంతోషంతో హరుడు తనకు ప్రసాదించిన వరాన్ని గూర్చి వివరంగా తెలియజేశాడు.

ఏవం తవోక్తం మహిషాసురస్య వధం త్రినేత్రాత్మజశక్తిభేదాత్ ।
క్రౌంచస్య మృత్యుః శరణాగతార్థం పాపాపహం పుణ్యవివర్ధనం చ ॥121॥

ఓ మహర్షీ! త్రినేత్రుని కుమారుడైన స్కందుడు దివ్యమైన తన శక్తిఆయుధంతో గావించిన మహిషాసురవధ, క్రౌంచపర్వతభేదనం, శరణాగతుని రక్షించడానికి ఆ పర్వతం గావించిన ప్రాణత్యాగం నీవు కోరిన విధంగా వివరంగా నీకు వినిపించాను. పవిత్రమైన ఈ కథ పాపాలను పోగొట్టి, పుణ్యాన్ని పెంపొందింపజేస్తుంది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే మహిషాసురతారకవధోపాఖ్యానే క్రౌంచభేదనం నామాష్టపంచాశత్తమోఽధ్యాయః ॥58॥

శ్రీవామన మహాపురాణమందలి పులస్త్యనారదసంవాదంలోని మహిషాసురతారకవధోపాఖ్యానంలోని క్రౌంచపర్వతభేదనమనే యాభైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



నవపంచాశత్తమోఽధ్యాయః – యాభైతొమ్మిదవ అధ్యాయం

భైరవప్రాదుర్భావే అంధకస్య పాతాలద్రావణమ్ – భైరవప్రాదుర్భావంలో అంధకాసురుడు పాతాళానికి పారిపోయిన వృత్తాంతం

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

యోఽసౌ మంత్రయతాం ప్రాప్తో దైత్యానాం శరతాడితః ।
స కేన వద నిర్భిన్నః శరేణ దితిజేశ్వరః ॥1॥

ఓ మహర్షీ! ఆ రాక్షసులు తమలో తాము చర్చించుకొనుచుండగా ఆ దైత్యేశ్వరుని బాణాలతో కొట్టి, చీల్చినవాడెవడు? నాకు వివరంగా తెలియజేయుము.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఆసీన్నృపో రఘుకులే రిపుజిన్మహర్షే తస్యాత్మజో గుణగణైకనిధిర్మహాత్మా ।
శూరోఽరి సైన్యదమనో బలవాన్ సుహృత్సు విప్రాంధ దీన కృపణేషు సమానభావః ॥2॥

ఋతధ్వజో నామ మహాన్ మహీయాన్ స గాలవార్థే తురగాధిరూఢః ।
పాతాలకేతుం నిజఘాన పృష్ఠే బాణేన చంద్రార్ధనిభేన వేగాత్ ॥3॥

నారదా! రఘువంశంలో రిపుజిత్ (శత్రుఘ్నుడు) అనే రాజు ఉండేవాడు. అతనికి సర్వసద్గుణాల నిధియు, మహాత్ముడు, శూరుడు, శత్రుసైన్యమర్దనుడు, బలవంతుడు, స్నేహితులయందును, విప్రులయందును, అంధులయందును, దీనులయందును, దరిద్రులయందును సమదృష్టి కలవాడునునైన ఋతధ్వజుడనే పేరుగల తనయుడుండేవాడు. మహానుభావుడు, మహితాత్ముడునైన ఆ రాజకుమారుడు గాలవమహర్షికొరకు జవాశ్వాన్ని అధిరోహించి, అర్ధచంద్రబాణంతో దుష్టుడైన పాతాళకేతువు వీపు పగలగొట్టాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కిమర్థం గాలవస్యాసౌ సాధయామాస సత్తమః ।
యేనాసౌ పత్రిణా దైత్యం నిజఘాన నృపాత్మజః ॥4॥

మహాత్మా! ఆ విధంగా గాలవముని కొరకు ఆ ఋతధ్వజుడు పాతాళకేతువునెందులకు ప్రహరించాడని నారదుడు పులస్త్యమహర్షిని ప్రశ్నించాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

పురా తపస్తప్యతి గాలవర్షిః మహాశ్రమే స్వే సతతం నివిష్టః ।
పాతాలకేతుస్తపసోఽస్య విఘ్నం కరోతి మౌఢ్యాత్ స సమాధిభంగమ్ ॥5॥

న చేష్యతేఽసౌ తపసో వ్యయం హి శక్తోఽపి కర్తుం త్వథ భస్మసాత్ తమ్ ।
ఆకాశమీక్ష్యాథ స దీర్ఘముష్ణం ముమోచ నిఃశ్వాసమనుత్తమం హి ॥6॥

తతోఽమ్బరాద్వాజివరః పపాత బభూవ వాణీ త్వశరీరిణీ చ ।
అసౌ తురంగో బలవాన్ క్రమేత అహ్నా సహస్రాణి తు యోజనానామ్ ॥7॥

స తం ప్రగృహ్యాశ్వవరం నరేంద్రః ఋతధ్వజం యోజ్య తదాత్తశస్త్రమ్ ।
స్థితస్తపస్యేవ తతో మహర్షిః సమేత్య దైత్యం విశిఖైర్బిభేద ॥8॥

ఓ నారదా! పూర్వం గాలవముని తన ఆశ్రమంలో తపస్తప్తుడై యుండగా మూఢుడైన పాతాలకేతువనే దైత్యుడు ఆయనకు తపోభంగం, సమాధిభంగం గావించాడు. ఆ మునీశ్వరుడు ఆ రాక్షసుని శాపదగ్ధుని చేయగలిగినను తపోవ్యయానికి ఇష్టపడక ఆ విధంగా అతనికి శాపమీయక మహావ్యధతో ఆకాశంవైపు చూస్తూ వేడినిట్టూర్పులు విడిచాడు. అంతట ఆకాశం నుండి ఒక ఉత్తమమైన గుర్రం భూమిమీద పడింది. అంతేగాక ఆ గుఱ్ఱం రోజునకు వేయి యోజనాలు పరుగిడగలదని అశరీరవాణి వినిపించింది. ఆ గుఱ్ఱాన్ని ఆ మహర్షి తాను స్వీకరించి, దానిని ఋతధ్వజునకిచ్చి తాను మరల తపోదీక్షలో మునిగిపోగా మహావీరుడైన ఆ రాజకుమారుడు ఆ అశ్వాన్ని అధిరోహించి, ఆ రాక్షసునిచేరి, బాణాలతో ప్రహరించాడు అని పులస్త్యమహర్షి నారదునితో చెప్పాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కేనాంబరతలాద్ వాజీ నిసృష్టో వద సువ్రత ।
వాక్యస్యాఽదేహినీ జాతా పరం కౌతూహలం మమ ॥9॥

ఓ సువ్రతా! ఆకాశంనుండి గుఱ్ఱాన్ని ఎవరు విడిచారు? అశరీరవాణిగా పలికినది ఎవరు? నాకు వినాలని మిక్కిలి కుతూహలంగా ఉన్నది.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

విశ్వావసుర్నామ మహేంద్రగాయనో గన్ధర్వరాజో బలవాన్ యశస్వీ ।
విసృష్టవాన్ భూవలయే తురంగం ఋతధ్వజస్యైవ సుతార్థమాశు ॥10॥

ఇంద్రుని ఆస్థానగాయకుడైన విశ్వావసుడనే గంధర్వరాజు అశ్వాన్ని ఋతధ్వజుని కొఱకే తన కుమార్తె కారణంగా భూమిమీదకు వదిలాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కోఽర్థో గన్ధర్వరాజస్య యేనాప్రైషీన్మహాజవమ్ ।
రాజ్ఞః కువలయాశ్వస్య కోఽర్థో నృపసుతస్య చ ॥11॥

ఆ గంధర్వరాజు ఈ మహాజవాశ్వాన్ని ఎందులకు భూమిమీదకు వదిలాడు? కువలయాశ్వునకు, రాజకుమారునకు దీనివలన కలిగే ప్రయోజనమేమిటి?

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

విశ్వావసోః శీలగుణోపపన్నా ఆసీత్పురంధ్రీషు వరా త్రిలోకే ।
లావణ్యరాశిః శశికాన్తితుల్యా మదాలసా నామ మదాలసైవ ॥12॥

ఆ విశ్వావసునకు శీలగుణాలలో ముల్లోకాలలో శ్రేష్ఠురాలైనదియు, లావణ్యరాశియు, చంద్రకాంతితో సమానమైన కాంతిగలదియు, మదాలసయునైన మదాలస అను కుమార్తె కలదు.

తాం నందనే దేవరిపుస్తరస్వీ సంక్రీడతీం రూపవతీం దదర్శ ।
పాతాలకేతుస్తు జహార తన్వీం తస్యార్థతః సోఽశ్వవరః ప్రదత్తః ॥13॥

హత్వా చ దైత్యం నృపతేస్తనూజో లబ్ధ్వా వరోరూమపి సంస్థితోఽభూత్ ।
దృష్టో యథా దేవపతిర్మహేన్ద్రః శచ్యా తథా రాజసుతో మృగాక్ష్యా ॥14॥

ఆమె ఒకనాడు నందనోద్యానంలో చెలికత్తెలతో విహరిస్తూ ఉండగా చూసి, దుష్టుడైన పాతాలకేతువు ఆ సుందరాంగిని అపహరించాడు. ఆమెరక్షణకొఱకు విశ్వావసువు ఆ అశ్వాన్ని రాజకుమారునకు ఇచ్చాడు. ఆ రాజకుమారుడు పాతాళకేతువును సంహరించి, ఆమెను విడిపించి, మృగాక్షియైన ఆమెతో కూడి శచీదేవితో కూడిన ఇంద్రునివలె ప్రకాశించాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

ఏవం నిరస్తే మహిషే తారకే చ మహాసురే ।
హిరణ్యాక్షసుతో ధీమాన్ కిమచేష్టత వై పునః ॥15॥

ఆ విధంగా మహాసురులైన మహిషుడు, తారకుడు సంహరింపబడిన పిమ్మట ధీమంతుడైన హిరణ్యాక్షుని కుమారుడు మరలా ఏమి చేశాడు?

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తారకం నిహతం దృష్ట్వా మహిషం చ రణేఽన్ధకః ।
క్రోధం చక్రే సుదుర్బుద్ధిర్దేవానాం దేవసైన్యహా ॥16॥

యుద్ధంలో తారకాసురుడు, మహిషాసురుడు సంహరింపబడడం చూసి, దుర్బుద్ధియు, దేవతలను, దేవసైన్యాన్ని సంహరించువాడునైన అంధకాసురుడు ఆగ్రహోదగ్రుడయ్యాడు.

తతః స్వల్పపరీవారః ప్రగృహ్య పరిఘం కరే ।
నిర్జగామాథ పాతాలాద్విచచార చ మేదినీమ్ ॥17॥

దానితో అతడు తనకున్న స్వల్పపరివారంతో పరిఘపాణియై, పాతాళంనుండి భూమిమీదకు వచ్చి, భూమిపై నలువైపులా తిరుగసాగాడు.

తతో విచరతా తేన మందరే చారుకందరే ।
దృష్టా గౌరీ చ గిరిజా సఖీమధ్యే స్థితా శుభా ॥18॥

ఆ విధంగా సంచరిస్తూ ఉండగా ఒకనాడు అందమైనగుహలతో కూడిన మందరపర్వతంపై సఖుల మధ్యనున్న గిరికుమారి సౌందర్యాన్ని చూశాడు.

తతోऽభూత్ కామబాణార్తః సహసైవాన్ధకోऽసురః ।
తాం దృష్ట్వా చారుసర్వాంగీం గిరిరాజసుతాం వనే ॥19॥

అథోవాచాసురో మూఢో వచనం మన్మథాన్ధకః ।
కస్యేయం చారుసర్వాంగీ వనే చరతి సున్దరీ ॥20॥

ఇయం యది భవేన్నైవ మమాన్తః పురవాసినీ ।
తన్మదీయేన జీవేన క్రియతే నిష్ఫలేన కిమ్ ॥21॥

యదస్యాస్తనుమధ్యాయా న పరిష్వంగవానహమ్ ।
అతో ధిఙ్మమ రూపేణ కిం స్థిరేణ ప్రయోజనమ్ ॥22॥

స మే బన్ధుః స సచివః స భ్రాతా సామ్పరాయికః ।
యో మామసితకేశాం తాం యోజయేన్మృగలోచనామ్ ॥21॥

వెంటనే అంధకాసురుడు సర్వాంగసుందరియైన గిరిరాజకన్యను చూసి, కామార్తుడయ్యాడు. కామాంధుడు, మూఢుడునైన ఆ అంధకాసురుడు ఇలా వదరుతున్నాడు "ఈ వనంలో విహరించే ఈ సౌందర్యరాశి ఎవరు?. ఈమె నా అంతఃపురవాసిని కానినాడు నా యీ జీవితం నిష్ఫలమే గదా!. ఈ తనుమధ్యను కౌగలించుకొనలేకపోయినచో అహో! నా రూపసంపదకు ప్రయోజనమేమున్నది?. ఈ మృగనేత్రను, నన్ను కూర్చగలవాడే నాకు నిజమైన బంధువు, సచివుడు, సోదరుడు, నా సర్వస్వమూ".

ఇత్థం వదతి దైత్యేంద్రే ప్రహ్లాదో బుద్ధిసాగరః ।
పిధాయ కర్ణౌ హస్తాభ్యాం శిరఃకంపం వచోऽబ్రవీత్ ॥24॥

దైత్యేంద్రుడైన అంధకాసురుడు ఈ విధంగా పలుకుతుండగా బుద్ధిసాగరుడైన ప్రహ్లాదుడు తన రెండుచేతులతో రెండు చెవులు మూసుకొని, శిరఃకంపంతో అతనితో ఇలా పలికాడు.

మా మైవం వద దైత్యేంద్ర జగతో జననీ త్వియమ్ ।
లోకనాథస్య భార్యేయం శంకరస్య త్రిశూలినః ॥25॥

ఓ దైత్యేంద్రా! ఆ విధంగా మాట్లాడవద్దు!, మాట్లాడవద్దు! ఈమె జగజ్జనని. ఈమె త్రిశూలియు, లోకేశ్వరుడు నైన శంకరుని ఇల్లాలు.

మా కురుష్వ సుదుర్బుద్ధిం సద్యః కులవినాశినీమ్ ।
భవతః పరదారేయం మా నిమజ్జ రసాతలే ॥26॥

వంశక్షయానికి దారితీసే ఇటువంటి దుష్టాలోచనలు చేయవద్దు. ఈమె మీకు పరదార. ఈమెను కోరి నీవు రసాతలంలో పడిపోకుము.

సత్సు కుత్సితమేవం హి అసత్స్వపి హి కుత్సితమ్ ।
శత్రవస్తే ప్రకుర్వన్తు పరదారావగాహనమ్ ॥27॥

దుర్మార్గులకే కాదు సజ్జనులకు కూడా ఇటువంటి కుత్సితమైన సంకల్పం మంచిది కాదు. ఇతరులభార్యలను గ్రహించడం నీ శత్రువులు చేయుదురుగాక!

కించిత్ త్వయా న శ్రుతం దైత్యనాథ గీతం శ్లోకం గాధినా పార్థివేన ।
దృష్ట్వా సైన్యం విప్రధేను ప్రసక్తం తథ్యం పథ్యం సర్వలోకే హితం చ ॥28॥

ఓ దైత్యనాథా! గాధిరాజు విప్రధేనువులను అపహరించిన సైనికులను చూసి పలికిన హితవాక్యాలు నీవు వినలేదా? ఆ పలుకులు తథ్యమైనవి, పథ్యమైనవి. సర్వలోకహితకరమైనవి. ఆ పలుకులు వినుము.

వరం ప్రాణాస్త్యజ్యా న చ పిశున వాదేష్వభిరతిః
వరం మౌనం కార్యం న చ వచనముక్తం యదనృతమ్ ।
వరం క్లీబైర్భావ్యం న చ పరకలత్రాభిగమనం
వరం భిక్షార్థిత్వం న చ పరధనాస్వాదమసకృత్ ॥29॥

ఇతరులపై చాడీలు చెప్పడంకంటే మరణించడం మేలు. అసత్యం పలకడంకంటే మౌనంగా ఉండడం మంచిది. పరభార్యలను కోరుకోవడంకంటే నపుంసకత్వం ఉత్తమమైనది. పరధనాపహరణం కంటే బిచ్చమెత్తుకుని జీవించడం శ్రేష్ఠము.

స ప్రహ్లాదవచః శ్రుత్వా క్రోధాన్ధో మదనార్దితః ।
ఇయం సా శత్రుజననీత్యేవముక్త్వా ప్రదుద్రువే ॥30॥

క్రోధాంధుడు, మదనార్దితుడునైన ఆ దుష్టుడు ప్రహ్లాదుని మాటలు విని, ఈమె నా విరోధి తల్లి అని అరుస్తూ ఆమె వైపు పరుగు తీశాడు.

తతోఽన్వధావన్ దైతేయా యంత్రముక్తా ఇవోపలాః ।
తాన్ రురోధ బలాన్నన్దీ వజ్రోద్యతకరోఽవ్యయః ॥31॥

అంతట రాక్షసులంతా యంత్రం నుండి వెడలిన శిలలవలె అతనివెంట పరుగులు తీశారు. వారిని బలపూర్వకంగా వజ్రపాణియైన నందీశ్వరుడు నిరోధించాడు.

మయతార పురోగాస్తే వారితా ద్రావితాస్తథా ।
కులిశేనాహతాస్తూర్ణం జగ్ముర్భీతా దిశో దశ ॥32॥

మయుడు తారునితో బాటు ఆ దైత్యులంతా నందీశ్వరుని వజ్రాఘాతాలకు తల్లడిల్లి, భయంతో పదిదిక్కులకు పారిపోయారు.

తానర్దితాన్ రణే దృష్ట్వా నన్దినాంధకదానవః ।
పరిఘేణ సమాహత్య పాతయామాస నన్దినమ్ ॥33॥

ఆ విధంగా నన్దిచే మర్దింపబడిన దానవులనందరినీ చూసి అంధకాసురుడు కోపంతో పరిఘతో నందిని గట్టిగా ప్రహరించి నేల పడగొట్టాడు.

శైలాదిం పతితం దృష్ట్వా ధావమానం తథాన్ధకమ్ ।
శతరూపాఽభవద్గౌరీ భయాత్తస్య దురాత్మనః ॥34॥

నంది మూర్ఛిల్లడం ఆ దుష్టుడు తన మీదకు పరుగుతో రావడం చూసి, ఆ దురాత్మునికి భయం కలిగించే విధంగా గౌరి నూరు రూపాలు ధరించింది.

తతః స దేవీగణమధ్యసంస్థితః పరిభ్రమన్ భాతి మహాఽసురేన్ద్రః ।
యథా వనే మత్తకరీ పరిభ్రమన్ కరేణుమధ్యే మదలోలదృష్టిః ॥35॥

ఆ స్త్రీలమధ్య ఆ దురాత్ముడు వనంలో ఆడ ఏనుగుల మధ్య కామదృష్టితో పరుగులు తీసే మదపుటేనుగువలె గంతులేయసాగాడు.

న పరిజ్ఞాతవాంస్తత్ర కా తు సా గిరికన్యకా ।
నాత్రాశ్చర్యం న పశ్యన్తి చత్వారోఽమీ సదైవ హి ॥36॥

న పశ్యతీ హి జాత్యన్ధో రాగాన్ధోఽపి న పశ్యతి ।
న పశ్యతి మదోన్మత్తో లోభాక్రాన్తో న పశ్యతి ।
సోఽపశ్యమానో గిరిజాం పశ్యన్నపి తదాన్ధకః ॥37॥

అంధకుడు వారిమధ్యనున్న అసలు గౌరి ఎవరో తెలుసుకోలేకపోయాడు. ఇందులో ఆశ్చర్యమేమున్నది? ఈ నలుగురు చూడలేనివారు. పుట్టిగుడ్డివాడు చూడలేడుగదా! అట్లే రాగాన్ధుడు అనగా మోహంతో కళ్ళు మూసుకొని పోయినవాడు కూడా చూడలేడు. మదాంధుడు, లోభంతో నిండిపోయినవాడు కూడా చూడలేడుగదా! ఈనలుగురు కళ్ళు తెరచుకొనియున్నప్పటికి ఎదురుగానున్న వస్తువునుకూడా చూడలేరు. అదేవిధంగా అంధకుడు కూడా మదాంధుడైనందున ఎదురుగానున్న గౌరీదేవిని గుర్తించలేకపోయాడు.

ప్రహారం నాదదత్ తాసాం యువత్య ఇతి చిన్తయన్ ।
తతో దేవ్యా స దుష్టాత్మా శతావర్యా నిరాకృతః ॥38॥

కుట్టితః ప్రవరైః శస్త్రైర్నిపపాత మహీతలే ।
వీక్ష్యాన్ధకం నిపతితం శతరూపా విభావరీ ॥39॥

తస్మాత్ స్థానాదపాక్రమ్య గతాఽన్తర్ధానమంబికా ।

యువతులనే భావనతో అంధకుడు వారలపై ఎట్టి ప్రహారము చేయలేదు. అంతట గౌరీదేవి నూరు రూపాలతో ఆ దుష్టాత్మునిపై విజృంభించింది. ఆ దేవిశక్తులన్నీ వానిపైబడి శస్త్రాస్త్రాలతో మర్దించి నేలపడగొట్టాయి. అంధకుడు ఆ విధంగా భూపతితుడు కాగానే శతరూపాలు ధరించిన అంబిక ఆ స్థానంనుండి ప్రక్కకు తొలగి, వెంటనే అంతర్ధానమయ్యింది.

పతితం చాన్ధకం దృష్ట్వా దైత్యదానవయూథపాః ॥40॥

కుర్వన్తః సుమహాశబ్దం ప్రాద్రవన్త రణార్థినః ।
తేషామాపతతాం శబ్దం శ్రుత్వా తస్థౌ గణేశ్వరః ॥41॥

ఆదాయ వజ్రం బలవాన్ మఘవానివ కోపితః ।
దానవాన్ సమయాన్ వీరః పరాజిత్య గణేశ్వరః ॥42॥

సమభ్యేత్యాంబికాం దృష్ట్వా వవన్దే చరణౌ శుభౌ ।
దేవీ చ తా నిజా మూర్తీః ప్రాహ గచ్ఛధ్వమిచ్ఛయా ॥43॥

విహరధ్వం మహీపృష్ఠే పూజ్యమానా నరైరిహ ।
వసతిర్భవతీనాం చ ఉద్యానేషు వనేషు చ ॥44॥

వనస్పతిషు వృక్షేషు గచ్ఛధ్వం విగతజ్వరాః ।

భూపతనమైన తమ నాయకుడైన అంధకునిజూచి దైత్యదానవవీరులంతా హాహాకారాలు చేస్తూ యుద్ధానికి తలబడగా గణేశ్వరుడు తన గణాలతో వజ్రం చేతబట్టి బలవంతుడైన ఇంద్రునివలె వారిని ఎదిరించి నిలిచాడు. ఆ విధంగా విజృంభించిన దానవులందరిని మయునితోబాటుగా పారద్రోలి, అంబిక చెంతకుచేరి, శుభంకరమైన అంబిక పాదాలకు నమస్కరించాడు. అంతట గౌరి తన రూపాలనన్నిటిని విసర్జించి వారితో ఇలా పలికింది. "మీరు స్వేచ్ఛగా భూలోకమంతా సంచరించండి. మానవులచేత పూజలు స్వీకరించండి. ఉద్యానవనాలలో, అరణ్యాలలో, వనస్పతులలో, వృక్షాలలో మీరు నివసించండి. నిశ్చింతగా విహరించండి".

తాస్త్వేవ ముక్తాః శైలేయ్యా ప్రణిపత్యాంబికాం క్రమాత్ ॥45॥

దిక్షు సర్వాసు జగ్ముస్తాః స్తూయమానాశ్చ కిన్నరైః ।
అన్ధకోఽపి స్మృతిం లబ్ధ్వా అపశ్యన్నద్రినందినీమ్ ।
స్వబలం నిర్జితం దృష్ట్వా తతః పాతాలమాద్రవత్ ॥46॥

తతో దురాత్మా స తదాన్ధకో మునే పాతాలమభ్యేత్య దివా న భుజ్క్తే ।
రాత్రౌ న శేతే మదనేషు తాడితో గౌరీం స్మరన్ కామబలాభిపన్నః ॥47॥

ఆ గిరినందిని ఆదేశాన్ని తలదాల్చి శతావరులందరు క్రమంగా అంబికకు ప్రణమిల్లి కిన్నరులు తమను కీర్తిస్తూ ఉండగా వారందరు అన్ని దిక్కులకు వెళ్ళిపోయారు. అంధకుడు కూడా మూర్ఛనుండి తేరుకుని అచ్చట

గౌరీదేవి కన్పించకపోవుటయు, తన బలాలన్నీ ఓడిపోయి పారిపోయినట్లుగ్రహించి ఆ దుష్టుడు కూడా పాతాళానికి జారుకున్నాడు. ఓ నారదమునీ! ఆ దురాత్ముడు పాతాళం చేరిననాటినుండి కామోపహతుడై, గౌరిని స్మరిస్తూ, పగలు తిండి, రాత్రులు నిద్ర మాని మదనమదాభిభూతుడయ్యాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే భైరవప్రాదుర్భావే అంధకస్య పాతాలద్రావణం నామ నవపంచాశత్తమోఽధ్యాయః ॥59॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని భైరవప్రాదుర్భావమందలి అంధకాసురుడు పాతాళానికి పారిపోవు వృత్తాంతం అనే యాభైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



షష్టితమోஉధ్యాయః – అరవైయవ అధ్యాయం

భైరవప్రాదుర్భావే కేదారతీర్థమాహాత్మ్యవర్ణనం, యమమురసంవాదశ్చ – భైరవప్రాదుర్భావంలో కేదారతీర్థమాహాత్మ్యం మరియు యమ, మురాసురులసంవాదం

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

క్వ గతః శంకరో హ్యాసీద్ యేనాంబా నందినా సహ ।
అన్ధకం యోధయామాస ఏతన్మే వక్తుమర్హసి ॥1॥

అంధకాసురునితో అంబిక, నంది ఇరువురే యుద్ధం ఎందులకు గావించారు? ఆ సమయంలో శంకరుడు ఎచ్చటకు వెళ్ళాడు. ఈ వివరాలన్నియు నాకు వివరించండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

యదా వర్షసహస్రన్తు మహామోహే స్థితోஉభవత్ ।
తదా ప్రభృతి నిస్తేజాః క్షీణవీర్యః ప్రదృశ్యతే ॥2॥

స్వమాత్మానం నిరీక్ష్యాథ నిస్తేజోஉఙ్గం మహేశ్వరః ।
తపోஉర్థాయ తథా చక్రే మతిం మతిమతాంవరః ॥3॥

స మహావ్రతముత్పాద్య సమాశ్వాస్యాంబికాం విభుః ।
శైలాదిం స్థాప్య గోప్తారం విచచార మహీతలమ్ ॥4॥

నారదమహామునీ! వెయ్యేండ్లు మహామోహంలో మునిగినందున నాటినుండి శివుడు క్షీణవీర్యుడై, తేజోహీనుడైనాడు. తన శరీరంలోని అంగాలు ఆ విధంగా తేజస్సును కోల్పోవడం గమనించిన మహేశ్వరుడు బాగుగా ఆలోచించి తపశ్చర్యకు పూనుకున్నాడు. ఆ విధంగా తపోదీక్షను పూని బుద్ధిమంతులలో వరిష్ఠుడైన పరమశివుడు పార్వతిని సమాధానపరచి, ఆమెకు కాపుగా నందిని నియమించి, తాను భూమండలమందు తిరుగసాగాడు.

మహాముద్రార్పితగ్రీవో మహాహికృత కుండలః ।
ధారయాణః కటీదేశే మహాశంఖస్య మేఖలామ్ ॥5॥

కపాలం దక్షిణే హస్తే సవ్యే గృహ్యా కమండలుమ్ ।
ఏకాహవాసీ వృక్షే హి శైలసానునదీష్వటన్ ॥6॥

స్థానం త్రైలోక్యమాస్థాయ మూలాహారోஉమ్బుభోజనః ।
వాయ్వాహారస్తదా తస్థౌ నవవర్షశతం క్రమాత్ ॥7॥

మహాముద్రాకృతిలో మెడను నిల్పి, మహాసర్పాల కుండలాలు, మానవాస్థికల మేఖల ధరించి, కుడిచేతిలో కపాలం, ఎడమచేతిలో కమండలం పట్టుకుని ఎక్కడా ఒకరోజుకంటే అధికకాలం ఉండక చెట్ల క్రింద, గిరులలో,

సానువులలో, నదులవెంట తిరగడం ప్రారంభించాడు. దుంపలు, నీరు, వాయువు భక్షిస్తూ ముల్లోకాలలో ఆ విధంగా 900 సంవత్సరాలు పర్యటించాడు.

తతో వీటాం ముఖే క్షిప్య నిరుచ్ఛ్వాసో௨భవద్యతిః ।
విస్తృతే హిమవత్పృష్ఠే రమ్యే సమశిలాతలే ॥8॥

తతో వీటా విదార్యైవ కపాలం పరమేష్ఠినః ।
సార్చిష్మతీ జటామధ్యాన్నిషణ్ణా ధరణీతలే ॥9॥

వీటయా తు పతంత్యా௨ద్రిర్దారితః క్ష్మాసమో௨భవత్ ।
జాతస్తీర్థవరః పుణ్యః కేదార ఇతి విశ్రుతః ॥10॥

తతో హరో వరం ప్రాదాత్ కేదారాయ వృషధ్వజః ।
పుణ్యవృద్ధికరం బ్రహ్మన్! పాపఘ్నం మోక్షసాధనమ్ ॥11॥

అనంతరం నోటిలో గడ్డిపరకలు పెట్టుకుని, ప్రాణవాయువును నిరోధించి, కుంభకయోగంతో రమణీయమైన హిమవంతం మీద ఒక సమతలప్రదేశంలో పరమేశ్వరుడు నిలిచిపోయాడు. అంతట వెలుగులు చిమ్మే ఆ గడ్డిపరకలు పరమేష్ఠి కపాలాన్ని బద్దలు చేసి జటామండలమధ్యనుండి జారి ధరణీతలంపై పడింది. గడ్డిపరకలు ఆవిధంగా క్రింద పడడంతో గిరిశిఖరం బ్రద్దలై, అక్కడ సమతలభూమి ఏర్పడి, పవిత్రమైన తీర్థం ఏర్పడింది. అదియే కేదారతీర్థం గా విఖ్యాతి చెందింది. ఓ మహర్షీ! అంతట ఆ వృషకేతనుడు ఆ తీర్థానికి పాపాలు పోగొట్టి, పుణ్యవృత్తి గావించి, మోక్షసాధకమౌనట్లుగా వరప్రదానం చేశాడు.

యే జలం తావకే తీర్థే పీత్వా సంయమినో నరాః ।
మధుమాంసనివృత్తా యే బ్రహ్మచారివ్రతే స్థితాః ॥12॥

షణ్మాసాద్ధారయిష్యన్తి నివృత్తాః పరపాకతః ।
తేషాం హృత్పంకజేష్వేవ మల్లిఙ్గం భవితా ధ్రువమ్ ॥13॥

న చాస్య పాపాభిరతిర్భవిష్యతి కదాచన ।
పితౄణామక్షయం శ్రాద్ధం భవిష్యతి న సంశయః ॥14॥

స్నానదానతపాంసీహ హోమజప్యాదికాః క్రియాః ।
భవిష్యన్త్యక్షయా నృణాం మృతానామపునర్భవః ॥15॥

ఏతద్వరం హరాత్తీర్థం ప్రాప్య పుష్ణాతి దేవతాః ।
పునాతి పుంసాం కేదారస్త్రినేత్రవచనం యథా ॥16॥

"ఓ తీర్థరాజమా! ఏ మానవులు ఆరునెలలపాటు నీ తీర్థంలోని జలాన్ని సేవిస్తూ, మధుమాంసాలను, ఇతరులు వండిన భోజనాదులను వర్జించి బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ దీక్ష వహిస్తారో వారి హృదయకమలాలలో నా లింగం స్థిరంగా ఉంటుంది. ఇది నిశ్చయము. అట్టివారి బుద్ధి తిరిగి ఎన్నడూ పాపకార్యాల వైపునకు పోదు.

అట్టివారి పితృదేవతలకు అక్షయశ్రాద్ధఫలం లభిస్తుంది. స్నాన,దాన, తపో,హోమ, జపాదులనొనరించువారికి అక్షయఫలం లభిస్తుంది. వారు మృతిచెందిన పిమ్మట పునర్జన్మ సంభవింపదు. ఆ విధంగా శివునిచే వరం పొంది, కేదారం అతి పవిత్రతీర్థమై, త్రినేత్రుని వచనానుసారం మానవులను పవిత్రులను గావిస్తూ, దేవతలను తృప్తిపరుస్తూ విరాజిల్లుతోంది.

కేదారాయ వరం దత్త్వా జగామ త్వరితో హరః ।
స్నాతుం భానుసుతాం దేవీం కాలిన్దీం పాపనాశినీమ్ ॥17॥

కేదారతీర్థానికి హరుడు ఆ విధంగా వరాలనిచ్చి త్వరత్వరగా సూర్యతనయ, పాపనాశినియైన యమునానదికి స్నానం చేయడానికి వెళ్ళాడు.

తత్ర స్నాత్వా శుచిర్భూత్వా జగామాథ సరస్వతీమ్ ।
వృతాం తీర్థశతైః పుణ్యైః ప్లక్షజాం పాపనాశినీమ్ ॥18॥

అవతీర్ణస్తతః స్నాతుం నిమగ్నశ్చ మహాంభసి ।
ద్రుపదాం నామ గాయత్రీం జజాపాంతర్జలే హరః ॥19॥

అక్కడ స్నానం చేసి, శుచియై, హరుడు నూరుతీర్థాలమధ్య వెలుగుచున్న పాపవిధ్వంసిని, ప్లక్షవృక్ష సంభవయు నైన సరస్వతీనదికి వెళ్ళాడు. ఆ నదీజలాలలో ప్రవేశించి, మునిగి, శివుడు "ద్రుపదగాయత్రీ మహామంత్రం" జపిస్తూ ఆ మహాజలం మధ్యలోనే ఉండిపోయాడు.

నిమగ్నే శంకరే దేవ్యాం సరస్వత్యాం కలిప్రియ! ।
సాగ్రః సంవత్సరో జాతో న చోన్మజ్జత ఈశ్వరః ॥20॥

నారదా! సరస్వతీనదీజలాలలో మునిగిన శంకరుడు సంవత్సరకాలం గడచినను నీటినుండి బయటకు రాలేదు.

ఏతస్మిన్నన్తరే బ్రహ్మన్ భువనాః సప్త సార్ణవాః ।
చేలుః పేతుర్ధరణ్యాం చ నక్షత్రాస్తారకైః సహ ॥21॥

నారదా! ఇంతలో సప్తలోకాలు సముద్రాలతో సహా చలించిపోయాయి. నక్షత్రాలతో సహా గ్రహాలు నేలమీద రాలిపడ్డాయి.

ఆసనేభ్యః ప్రచలితా దేవాః శక్రపురోగమాః ।
స్వస్త్యస్తు లోకేభ్య ఇతి జపంతః పరమర్షయః ॥22॥

ఇంద్రాది దేవతల ఆసనాలు కదిలిపోయాయి. మహర్షులంతా లోకాలకు శుభము కలుగుగాక! యని స్వస్తి వాచనాలు చేయసాగారు.

తతః క్షుబ్ధేషు లోకేషు దేవా బ్రహ్మాణమాగమన్ ।
దృష్ట్వోచుః కిమిదం లోకాః క్షుబ్ధాః సంశయమాగతాః ॥23॥

లోకసంక్షోభానికి క్షుభితులైన దేవతలు బ్రహ్మను సమీపించి "ప్రభూ! ఏమిటీ సంక్షోభం? దీనికి కారణమేమి?" అని అడిగారు.

తానాహ పద్మసంభూతో నైతద్వేద్మి చ కారణమ్ ।
తదాగచ్ఛత వో యుక్తం ద్రష్టుం చక్రగదాధరమ్ ॥24॥

అందులకా పద్మసంభవుడు దీనికి కారణం తనకు కూడా తెలియదని వారికి సమాధానమిచ్చి మనమందరము చక్రగదాధరుడైన అచ్యుతుని దర్శిద్దామని చెప్పాడు.

పితామహేనైవముక్తా దేవాః శక్రపురోగమాః ।
పితామహం పురస్కృత్య మురారిసదనం గతాః ॥25॥

పితామహుడు ఇలా చెప్పగానే ఇంద్రాదిదేవతలందరు బ్రహ్మను ముందిడుకుని మురారి నివాసానికి వెళ్ళారు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కోఽసౌ మురారిర్దేవర్షే దేవో యక్షో ను కిన్నరః ।
దైత్యో వా రాక్షసో వాఽపి పార్థివో వా తదుచ్యతామ్ ॥26॥

ఓ మహర్షీ! ఆ మురారి ఎవరు? దేవుడా? యక్షుడా? కిన్నరుడా? దైత్యుడా? రాక్షసుడా? లేక మానవుడా? వివరింపుమని అడిగాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

యోఽసౌ రజః సత్త్వమయో గుణవాంశ్చ తమోమయః ।
నిర్గుణః సర్వగో వ్యాపీ మురారిర్మధుసూదనః ॥27॥

"సత్త్వరజస్తమోగుణాలు కలిగినవాడూ, వాటికి అతీతుడైనవాడూ, నిర్గుణుడైనవాడూ, సర్వత్రా వ్యాపించిన వాడూ నైన మధుసూదనుడే ఆ మురారి" అని పలికాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

యోఽసౌ మురః ఇతి ఖ్యాతః కస్య పుత్రః స గీయతే ।
కథంచ నిహతః సంఖ్యే విష్ణునా తద్వదస్వ మే ॥28॥

ముర అని ఖ్యాతుడైన వీడెవని కుమారుడు? వానిని యుద్ధంలో విష్ణువు ఎందులకు వధించాడు?

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రూయతాం కథయిష్యామి మురాసురనిబర్హణమ్ ।
విచిత్రమిదమాఖ్యానం పుణ్యం పాపప్రణాశనమ్ ॥29॥

ఓ నారదా! పుణ్యప్రదము, పాపప్రణాశనము, విచిత్రమునైన మురాసురవధ వృత్తాంతాన్ని చెబుతున్నాను. శ్రద్ధగా వినుము.

కశ్యపస్యౌరసః పుత్రో మురో నామ దనూద్భవః ।
స దదర్శ రణే శస్తాన్ దితిపుత్రాన్ సురోత్తమైః ॥30॥

మురాసురుడు దనువు కుమారుడు. కశ్యపునకు ఔరసపుత్రుడు. ప్రముఖులైన దేవతలచే దైత్యులు యుద్ధంలో సంహరింపబడడం వాడు చూశాడు.

తతః స మరణాద్భీతస్తప్త్వా వర్షగణాన్బహూన్ ।
ఆరాధయామాస విభుం బ్రహ్మాణమపరాజితమ్ ॥31॥

అంతట వాడు మరణానికి భయపడి, అనేక సంవత్సరాలు అపరాజితుడైన బ్రహ్మను గూర్చి తపస్సు చేశాడు.

తతోఽస్య తుష్టో వరదః ప్రాహ వత్స! వరం వృణు ।
స చ వవ్రే వరం దైత్యో వరమేనం పితామహాత్ ॥32॥

వాని తపస్సునకు సంతోషించిన పితామహుడు వత్సా! వరము కోరుకొనుమని అనుగ్రహించాడు. వాడు బ్రహ్మనుండి ఈ విధమైన వరాన్ని కోరాడు.

యం యం కరతలేనాహం స్పృశేయం సమరే విభో ।
స స మద్ధస్తసంస్పృష్టస్త్వమరోఽపి మ్రియేదజ ॥33॥

ఓ పితామహా! "నేను యుద్ధంలో ఎవరిని అరచేతితో తాకుతానో వారు అమరులైనను మరణించునట్లు వరమనుగ్రహించండి". అని బ్రహ్మను అర్థించాడు.

బాఢమిత్యాహ భగవాన్ బ్రహ్మా లోకపితామహః ।
తతోఽభ్యాగాన్మహాతేజా మురః సురగిరిం బలీ ॥34॥

సమేత్యాహ్వయతే దేవం యక్షం కిన్నరమేవ వా ।
న కశ్చిద్ యుయుధే తేన సమం దైత్యేన నారద! ॥35॥

అంతట బ్రహ్మ అట్లేయని పలికి అంతర్ధానమందాడు. అంతట మురాసురుడు దేవనివాసమైన మేరుపర్వతానికి వెళ్ళి, దేవయక్షకిన్నరాదులను యుద్ధానికి ఆహ్వానించాడు. ఓ నారదా! ఆ దైత్యునితో యుద్ధం చేయడానికి ఏ ఒక్కరూ రాలేదు.

తతోఽమరావతీం క్రుద్ధః స గత్వా శక్రమాహ్వయత్ ।
న చాస్య సహ యోద్ధుం వై మతిం చక్రే పురన్దరః ॥36॥

అంతట మురాసురుడు కోపంతో అమరావతికి వెళ్ళి, ఇంద్రుని యుద్ధానికి ఆహ్వానించాడు. ఇంద్రుడు కూడా ఇతనితో యుద్ధం చేయడానికి సమ్మతించలేదు.

తతః స కరముద్యమ్య ప్రవివేశామరావతీమ్ ।
ప్రవిశన్తం న తం కశ్చిన్నివారయితుముత్సహేత్ ॥37॥

అంతనాతడు చేతిని పైకెత్తి, అమరావతీ నగరంలోనికి చొచ్చుకొనిపోగా, అతనిని నివారించుటకు ఎవ్వరును ఉత్సహించుట లేదు.

స గత్వా శక్రసదనం ప్రోవాచేన్ద్రం మురస్తదా ।
దేహి యుద్ధం సహస్రాక్ష! నోచేత్ స్వర్గం పరిత్యజ ॥38॥

వాడు ఇంద్రభవనానికి వెళ్ళి ఇంద్రునితో ఇలా పలికాడు. "ఓ ఇంద్రా! నీవు నాతో యుద్ధం సాగించు. లేదా స్వర్గాన్ని విడిచివెళ్ళు!"

ఇత్యేవముక్తో మురుణా బ్రహ్మన్ హరిహయస్తదా ।
స్వర్గరాజ్యం పరిత్యజ్య భూచరః సమజాయత ॥39॥

ఓ నారదా! ఈ విధంగా మురాసురుడు పలుకగా వేరే మార్గం లేక, వానితో యుద్ధం చేయలేక, దేవేంద్రుడు స్వర్గాన్ని వదలి భూలోకం చేరాడు.

తతో గజేన్ద్రకులిశౌ హృతౌ శక్రస్య శత్రుణా ।
సకలత్రో మహాతేజాః సహ దేవైః సుతేన చ ॥40॥

కాలిన్ద్యా దక్షిణే కూలే నివేశ్య స్వపురం స్థితః ।
మురశ్చాపి మహాభోగాన్ బుభుజే స్వర్గసంస్థితః ॥41॥

అంతట మురాసురునిచే ఇంద్రుని ఐరావతం, వజ్రాయుధం కూడా అపహరింపబడగా సురపతి భార్యాబిడ్డలు, దేవతలు తోడురాగా యమునానది దక్షిణతీరానికిచేరి, తనకొక నగరాన్ని నిర్మించుకున్నాడు. మురాసురుడు సకల భోగాలను అనుభవిస్తూ, స్వర్గంలో ఉండిపోయాడు.

దానవాశ్చాపరే రౌద్రా మయతార పురోగమాః ।
మురమాసాద్య మోదన్తే స్వర్గే సుకృతినో యథా ॥ 42॥

మయుడు, తారుడు మున్నగు ఇతర దనుజులు కూడా మురాసురుని చేరి పుణ్యాత్ములు స్వర్గసుఖాలను అనుభవించినట్లుగా వారందరు స్వర్గంలో ఆనందాలను అనుభవింపసాగారు.

స కదాచిన్మహీపృష్ఠం సమాయాతో మహాసురః ।
ఏకాకీ కుంజరారూఢః సరయూం నిమ్నగాం ప్రతి ॥43॥

ఆ దానవుడు ఒకనాడు ఏకాకిగా భూమండలంలో సంచరిస్తూ గజారూఢుడై సరయూనదికి వెళ్ళాడు.

స సరయ్వాస్తటే వీరం రాజానం సూర్యవంశజమ్ ।
దదృశే రఘునామానం దీక్షితం యజ్ఞకర్మణి ॥44॥

ఆ సరయూనదీతీరంలో సూర్యవంశపు రాజు, మహావీరుడునైన రఘుమహారాజు యజ్ఞదీక్షితుడై కనిపించాడు.

తముపేత్యాబ్రవీద్ దైత్యో యుద్ధం మే దీయతామితి ।
నో చేన్నివర్తతాం యజ్ఞో నేష్టవ్యా దేవతాస్త్వయా ॥45॥

ఆ దానవుడు రఘువును సమీపించి, నీవు నాతో యుద్ధం చేయుము. "లేనిచో నీవు యజ్ఞాన్ని చేయరాదు. మానుకోవాలి, దేవతలను యజ్ఞాలతో ఆరాధించడం పనికిరాదు" అని శాసించాడు.

సముపేత్య మహాతేజా మిత్రావరుణసంభవః ।
ప్రోవాచ బుద్ధిమాన్ బ్రహ్మన్ వసిష్ఠస్తపతాం వరః ॥46॥

అంతట మిత్రావరుణసంభవుడు, మహాతేజుడు, బుద్ధిమంతుడు, మహాతపస్వియునైన వసిష్ఠుడు ఆ దానవుని సమీపించి ఇలా పలికాడు.

కిం తే జితైర్నరైర్దైత్య అజితాననుశాసయ ।
ప్రహర్తుమిచ్ఛసి యది తం నివారయ చాన్తకమ్ ॥47॥

ఓ దైత్యవీరా! జితులైన మానవులను జయించినందున నీకేమి ప్రయోజనము? అజేయులైనవారిని శాసింపుము. నీకు నిజంగా యుద్ధం చేయాలనుకుంటే యమధర్మరాజును నివారించుము.

స బలీ శాసనం తుభ్యం న కరోతి మహాసుర ।
తస్మిన్ జితే హి విజితం సర్వం మన్యస్వ భూతలమ్ ॥48॥

ఓ మహాసురా! మహాబలవంతుడైన యమధర్మరాజును జయించినచో భూలోకాన్నంతా జయించినట్లే అవుతుంది.

స తద్వసిష్ఠవచనం నిశమ్య దనుపుఙ్గవః ।
జగామ ధర్మరాజానం విజేతుం దండపాణినమ్ ॥49॥

వసిష్ఠుని ఈ పలుకులు దానవుడు విని, దండపాణియైన యమధర్మరాజును జయించేందుకు బయలుదేరాడు.

తమాయాన్తం యమః శ్రుత్వా మత్వాఽవధ్యం చ సంయుగే ।
స సమారుహ్య మహిషం కేశవాన్తికమాగమత్ ॥50॥

మురాసుడు అవధ్యుడనియు, తనపై దండెత్తి వస్తున్నాడనియు విని, యముడు మహిషమును ఆరోహించి, కేశవుని చెంతకు వెళ్ళాడు.

సమేత్య చాభివాద్యైనం ప్రోవాచ మురచేష్టితమ్ ।
స చాహ గచ్ఛ మామద్య ప్రేషయస్వ మహాసురమ్ ॥51॥

అట్లు యముడు శ్రీహరి చెంతకు చేరి, నమస్కరించి, మురాసురుని చేష్టితాన్ని గూర్చి వివరించాడు. అందులకు ఆ జనార్దనుడు నీవు వెళ్ళి ఆ రక్కసుని నా వద్దకు పంపమని యముని ఆదేశించాడు.

స వాసుదేవవచనం శ్రుత్వాఽభ్యగాత్ త్వరాన్వితః ।
ఏతస్మిన్నంతరే దైత్యః సంప్రాప్తో నగరీం మురః ॥52॥

వాసుదేవుని వచనానుసారం యముడు త్వరగా తిరిగి తన నగరానికి వచ్చేసరికి మురాసురుడు కూడా అచ్చటకు వచ్చి చేరాడు.

తమాగతం యమః ప్రాహ కిం మురో కర్తుమిచ్ఛసి ।
వదస్వ వచనం కర్తా త్వదీయం దానవేశ్వర ॥53॥

అట్లు వచ్చిన దానవేశ్వరునితో యముడు ఇలా పలికాడు. "ఓ దానవేశ్వరా! నీయిష్టప్రకారం చేస్తాను. నేనేమి చేయాలో తెలియజేయుము".

మురురువాచ – మురాసురుడు పలికాడు.

యమ! ప్రజా సంయమనాన్నివృత్తిం కర్తుమర్హసి ।
నోచేత్ తవాద్య ఛిత్త్వాఽహం మూర్ధానం పాతయే భువి ॥54॥

"యమా! ఈ క్షణంనుండి నీవు జీవుల ప్రాణాలను అపహరించరాదు. లేనిచో నీ తల నరికి భూమిపై పారవేస్తాను" అని మురుడు యమునితో పలికాడు.

తమాహ ధర్మరాడ్ బ్రహ్మన్! యది మాం సంయమాద్ భవాన్ ।
గోపాయతి మురో సత్యం కరిష్యే వచనం తవ ॥55॥

ఓ నారదా! అంతట యముడు ఆ దానవునితో "నీవు నా అధికారినుండి నన్ను కాపాడినచో నేను నా కర్తవ్యాన్ని వదలి, నీ ఆదేశాన్ని పాటిస్తాను". అన్నాడు.

మురస్తమాహ భవతః కః సంయన్తా వదస్వ మామ్ ।
అహమేనం పరాజిత్య వారయామి న సంశయః ॥56॥

అంతట మురాసురుడు యమునితో "నీ మీద అధికారం నెఱపువాడెవడో తెలుపుము? నేను వానిని నిర్జించి నిన్ను తప్పక రక్షిస్తాను. ఇందులో సందేహం లేదు". అని పలికాడు.

యమస్తం ప్రాహ మాం విష్ణుర్దేవశ్చక్రగదాధరః ।
శ్వేతద్వీపనివాసీ యః స మాం సంయమతేఽవ్యయః ॥57॥

అంతట యముడు ఆ దానవేంద్రునితో "శ్వేతద్వీపనివాసియు, చక్రగదాధరుడునైన విష్ణుదేవుని ఆజ్ఞకు బద్ధుడనై నేను ప్రవర్తిస్తానని" చెప్పాడు.

తమాహ దైత్యశార్దూలః క్వాసౌ వసతి దుర్జయః ।
స్వయం తత్ర గమిష్యామి తస్య సంయమనోద్యతః ॥58॥

దుర్జయుడైన ఆ విష్ణువు ఎచ్చట నివసిస్తాడో తెలియజేసినచో నేను స్వయంగా అతనిని నియంత్రించడానికి వెళ్ళగలనని మురాసురుడు యమునితో పలికాడు.

తమువాచ యమో గచ్ఛ క్షీరోదం నామ సాగరమ్ ।
తత్రాస్తే భగవాన్ విష్ణుర్లోకనాథో జగన్మయః ॥59॥

యముడు అది విని, "దానవేశ్వరా! నీవు క్షీరసాగరానికి వెళ్ళుము. జగన్మయుడు, లోకనాథుడునైన విష్ణు భగవానుడు అక్కడే నివసిస్తున్నాడని పలికాడు.

మురస్తద్వాక్యమాకర్ణ్య ప్రాహ గచ్ఛామి కేశవమ్ ।
కిం తు త్వయా న తావద్ధి సంయమ్యా ధర్మ మానవాః ॥60॥

దానితో మురాసురుడు "ఇప్పుడే ఆ కేశవుని చెంతకు వెళుతున్నాను. కాని నేను తిరిగి వచ్చేవరకు నీవు నీ మానవసంయమనకర్తవ్యాన్ని నెరవేర్చరాదు సుమా?" అని యమునితో పలికాడు.

స ప్రాహ గచ్ఛ త్వం తావత్ ప్రవర్తిష్యే జయం ప్రతి ।
సంయన్తుర్వా యథా స్యాద్ధి తతో యుద్ధే సమాచర ॥61॥

ఇత్యేవముక్త్వా వచనం దుగ్ధాబ్ధిమగమన్మురః ।
యత్రాస్తే శేషపర్యఙ్కే చతుర్మూర్తిర్జనార్దనః ॥62॥

అంతట యముడు "సరే! నీ ఇష్టప్రకారమే చేస్తాను. కాని నీవు ఏ విధంగానైనను నాకు నియంతయైన విష్ణువును జయించేందుకు ప్రయత్నం చేయుము. గట్టిగా యుద్ధం చేయుము" అని మురాసురునితో అన్నాడు. ఆ మురాసురుడు అలాగేనని పలికి, శేషపర్యంకంపై నాల్గు రూపాలతో విరాజిల్లే జనార్దనుని నివాసమైన క్షీరసాగరానికి ప్రయాణమయ్యాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

చతుర్మూర్తిః కథం విష్ణురేక ఏవ నిగద్యతే ।
సర్వగత్వాత్ కథమపి అవ్యక్తత్వాచ్చ తద్వద ॥63॥

ఒక్కడైన విష్ణువు నాల్గు రూపాలు కలవాడుగా ఎందులకు చెప్పబడ్డాడు? అందులకు కారణం ఆయన సర్వగుడు అగుటయా? లేక అవ్యక్తుడగుటయా? తెలియజేయుము.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

అవ్యక్తః సర్వగోఽపీహ ఏక ఏవ మహామునే ।
చతుర్మూర్తిర్జగన్నాథో యథా బ్రహ్మంస్తథా శృణు ॥64॥

అప్రతర్క్య మనిర్దేశ్యం శుక్లం శాన్తం పరం పదమ్ ।
వాసుదేవాఖ్యమవ్యక్తం స్మృతం ద్వాదశపత్రకమ్ ॥65॥

మహామునీ! అవ్యక్తుడూ, సర్వగుడూ, ఒక్కడూ అయ్యుండియూ ఆ జగన్నాథుడు చతుర్మూర్తియైన విధం చెబుతున్నాను వినుము. వాసుదేవుడుగా పేర్కొనబడే ఆ పరతత్త్వం తర్కానికి అతీతమైనది. ఇది అని నిర్దేశింపరానిది. శుక్లవర్ణం కలిగినది. శాంతియే రూపంగా కలిగినది. అవ్యక్తమైనది. అది ద్వాదశపత్రకమైనది.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కథం శుక్లం కథం శాన్తమప్రతర్క్యమనిన్దితమ్ ।
కాన్యస్య ద్వాదశైవోక్తా పత్రకా తాని మే వద ॥66॥

బ్రహ్మర్షీ! ఏవిధంగా ఆ తత్త్వం శుక్లమైనది? శాంతమైనది? తర్కాతీతమైనది? ఉత్తమమైనది? దానిలో గల ద్వాదశపత్రాలు ఏవియో వివరించవలసినదిగా వేడుచున్నాను.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శృణుష్వ గుహ్యం పరమం పరమేష్ఠి ప్రభాషితమ్ ।
శ్రుతం సనత్కుమారేణ తేనాఖ్యాతం చ తన్మమ ॥67॥

అత్యన్తరహస్యమైన ఈ తత్త్వాన్ని మొట్టమొదట పరమేష్ఠి, ప్రజాపతి, సనత్కుమారునకు తెలిపారు. ఆయననుండి నేను విన్నాను. దానిని నీకు వినిపిస్తున్నాను. శ్రద్ధగా వినుము.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కోఽయం సనత్కుమారేతి యస్యోక్తం బ్రహ్మణా స్వయమ్ ।
తవాపి తేన గదితం వద మామనుపూర్వశః ॥68॥

బ్రహ్మ స్వయంగా వినిపించిన ఆ సనత్కుమారుడెవరు? అతనిచే నీకు చెప్పబడినదంతయు క్రమంగా నాకు తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ధర్మస్య భార్యాఽహింసాఖ్యా తస్యాం పుత్రచతుష్టయమ్ ।
సంజాతం మునిశార్దూల యోగశాస్త్ర విచారకమ్ ॥69॥

ఓ మునిశార్దూలా! ధర్మునకు అహింస అనే భార్యవలన యోగశాస్త్రవిదులైన నలుగురు కుమారులు జన్మించారు.

జ్యేష్ఠః సనత్కుమారోఽభూద్ ద్వితీయశ్చ సనాతనః ।
తృతీయః సనకో నామ చతుర్థశ్చ సనన్దనః ॥70॥

వారిలో జ్యేష్ఠుడు సనత్కుమారుడు. రెండవవాడు సనాతనుడు. మూడవవాడు సనకుడు. నాల్గవవాడు సనన్దనుడు.

సాంఖ్య వేత్తారమపరం కపిలం వోఢుమాసురిమ్ ।
దృష్ట్వా పంచశిఖం శ్రేష్ఠం యోగయుక్తం తపోనిధిమ్ ॥71॥

వీరుగాక సాంఖ్యవేత్తలు కపిల, వోఢు, ఆసురి, యోగివరుడు తపోనిధియునైన పంచశిఖుడు కూడా యున్నారు.

జ్ఞానయోగం న తే దద్యుర్జ్యాయాంసోఽపి కనీయసామ్ ।
మానముక్తం మహాయోగం కపిలాదీనుపాసతః ॥72॥

వారు పెద్దవారై యుండియు చిన్నవారలకు జ్ఞానయోగం చెప్పలేదు. మహాయోగప్రమాణం మాత్రమే చెప్పారు.

సనత్కుమారశ్చాభ్యేత్య బ్రహ్మాణం కమలోద్భవమ్ ।
అపృచ్ఛద్యోగవిజ్ఞానం తమువాచ ప్రజాపతిః ॥73॥

అంతట సనత్కుమారుడు కమలభవుడైన బ్రహ్మను చేరి, యోగవిజ్ఞానాన్ని అర్థించగా ఆయన ఇలా పలికాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

కథయిష్యామి తే సాధ్య యది పుత్రత్వమిచ్ఛసి ।
యస్య కస్య న వక్తవ్యం తత్సత్యం నాన్యథేతి హి ॥74॥

ఓ సాధ్యుడా! నీవు నా పుత్రుడవగుటకు అంగీకరించినచో నీకు నేను ఆ శాస్త్రాన్ని చెప్పగలను. ఎవరికి పడితే వారికి ఈ సత్యం చెప్పరాదు. ఇది తిరుగు లేనిది.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారమహర్షి పలికాడు.

పుత్ర ఏవాస్మి దేవేశ యతః శిష్యోఽస్మ్యహం విభో ।
న విశేషోఽస్తి పుత్రస్య శిష్యస్య చ పితామహ ॥75॥

ఓ దేవేశా! నేను నీకు శిష్యుడను కనుక నేను నీకు పుత్రుడనే గదా! పుత్రునకు శిష్యునకు భేదమేమియు లేదు గదా? పితామహా! శిష్యునికంటె పుత్రునకు విశేషమేమియు లేదు గదా!

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

విశేషః శిష్య పుత్రాభ్యాం విద్యతే ధర్మనన్దన ।
ధర్మకర్మసమాయోగే తథాపి గదతః శృణు ॥76॥

"ఓ ధర్మనందనా! శిష్యునికంటే పుత్రునిలో విశేషమున్నది. అది ధర్మకర్మనిర్వహణకు సంబంధించినది. అయినప్పటికి చెబుతాను వినుము.

పున్నామ్నో నరకాత్ త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।
శేషపాపహరః శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥77॥

పుత్ అనే నరకం నుండి రక్షించేవాడు పుత్రుడని చెప్పబడుచుండగా శేషించిన పాపాన్ని హరించువాడు శిష్యుడనబడుతున్నాడన్నది శ్రుతివచనం" అని బ్రహ్మ విశ్లేషించి తెలియజేశాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారమహర్షి పలికాడు.

కోఽయం పున్నామకో దేవ నరకాత్ త్రాతి పుత్రకః ।
కస్మాచ్ఛేషం తతః పాపం హరేచ్ఛిష్యశ్చ తద్వద ॥78॥

ఓ దేవా! పున్నామనరకమంటే ఏమిటి? ఏ పున్నామనరకం నుండి పుత్రుడు రక్షిస్తాడు? ఎవరి నుండి మిగిలిన పాపాలను శిష్యుడు హరిస్తాడు? నాకు విపులంగా తెలియజేయండి అని సనత్కుమారుడు బ్రహ్మను కోరాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

ఏతత్ పురాణం పరమం మహర్షే యోగాఙ్గయుక్తం చ సదైవ యచ్చ ।
తథైవ చోగ్రం భయహారి పుణ్యం వదామి తే శామ్యతి యేన పాపమ్ ॥79॥

ఓ సాధ్యా! యోగాంగయుక్తమైన ఈ విజ్ఞానం చాలా పురాతనమైనది. ఉగ్రమైనది. భయాలను పోగొట్టేది. పాపాలను పోగొట్టేది అది నీకు చెబుతున్నాను. దీనిని శ్రద్ధగా వినుము.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్య నారద సంవాదే భైరవప్రాదుర్భావే కేదారతీర్థమాహాత్మ్యవర్ణనం, యమమురసంవాదమితి షష్టితమోఽధ్యాయః ॥60॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని భైరవప్రాదుర్భావమందలి కేదారతీర్థమాహాత్మ్యం మరియు యమమురాసురుల సంవాదమనే అరవైయవ అధ్యాయం సమాప్తం.



ఏకషష్టితమోஉధ్యాయః – అరవైఒకటవ అధ్యాయం

మురవధః – మురాసురవధ

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

పరదారాభిగమనం పాపీయాంసోపసేవనమ్ ।
పారుష్యం సర్వభూతానాం ప్రథమం నరకం స్మృతమ్ ॥1॥

పరదారసంగమం, పాపులను సేవించడం, సమస్తప్రాణులందు కఠినంగా వ్యవహరించడం మొదటి నరకమని చెప్పబడుతోంది.

ఫలస్తేయం మహాపాపం ఫలహీనం తథాஉటనమ్ ।
ఛేదనం వృక్షజాతీనాం ద్వితీయం నరకం స్మృతమ్ ॥2॥

ఫలాలు దొంగిలించడం, పనిపాటలు లేకుండా వ్యర్థంగా తిరగడం, వృక్షజాతులను నరకడం మున్నగు మహాపాపకార్యాలన్నీ రెండవ నరకంగా కీర్తింపబడుతోంది.

వర్జ్యాదానం తథా దుష్టమవధ్యవధబంధనమ్ ।
వివాదమర్థహేతూత్థం తృతీయం నరకం స్మృతమ్ ॥3॥

నిషేధింపబడిన వస్తువులు గ్రహించుట, అవధ్యులను వధించుట, బంధించుట, డబ్బుకొరకు కలహించడం మూడవ నరకమని చెప్పబడుతోంది.

భయదం సర్వసత్త్వానాం భవభూతివినాశనమ్ ।
భ్రంశనం నిజధర్మాణాం చతుర్థం నరకం స్మృతమ్ ॥4॥

సమస్తప్రాణులకు భీతి కలిగించడం, ప్రపంచంలోని వస్తువులను నాశనం చేయడం, నిజధర్మాలనుండి భ్రష్టులు కావడం నాల్గవ నరకమనబడుతోంది.

మారణం మిత్రకౌటిల్యం మిథ్యాஉభిశపనం చ యత్ ।
మిష్టైకాశనమిత్యుక్తం పంచమం తు నృపాచనమ్ ॥5॥

ఇతరజీవులను చంపడం, మిత్రులపట్ల కుటిలంగా ప్రవర్తించడం, తప్పుడు ప్రమాణాలు చేయడం, మధురపదార్థాలను ఒంటరిగా భుజించడం ఐదవనరకంగా పరిగణింపబడుతోంది.

పత్రఫలాది హరణం యమనం యోగనాశనమ్ ।
యాన యుగ్యస్య హరణం షష్ఠముక్తం నృపాచనమ్ ॥6॥

పత్రఫలాదులను దొంగిలించడం, ఇతరుల మార్గాన్ని అడ్డుకోవడం, కలిసినవారిని విడదీసి నాశనం చేయడం, యానసాధనాలను అపహరించడం ఆరవ నరకంగా చెప్పబడుతోంది.

రాజభాగహరం మూఢం రాజజాయానిషేవణమ్ ।
రాజ్యే త్వహితకారిత్వం సప్తమం నిరయం స్మృతమ్ ॥7॥

రాజునకు చేరవలసినదానిని, చెందవలసినదానిని హరించడం, రాజభార్యలతో సంగమించడం, రాజ్యానికి ద్రోహం చేయడం ఏడవ నరకమవుతుంది.

లుబ్ధత్వం లోలుపత్వం చ లబ్ధధర్మార్థనాశనమ్ ।
లాలాసంకీర్ణమేవోక్తమష్టమం నరకం స్మృతమ్ ॥8॥

లోభిత్వం, అత్యాశ, లభించిన ధర్మాన్ని ధనాన్ని నాశనం చేయడం, నోట చొల్లు కారుస్తూ మాట్లాడడం ఎనిమిదవ నరకమనబడుతోంది.

విప్రోష్యం బ్రహ్మహరణం బ్రాహ్మణానాం వినిన్దనమ్ ।
విరోధం బన్ధుభిశ్చోక్తం నవమం నరపాచనమ్ ॥9॥

బ్రాహ్మణులను తమ ఇండ్లనుండి వెళ్ళగొట్టడం, వారిని అపహరించుకుపోవడం, బ్రాహ్మణులను నిందించడం, తన బంధువులతో విరోధం పూనడం తొమ్మిదవ నరకమని చెప్పబడుతోంది.

శిష్టాచారవినాశం చ శిష్టద్వేషం శిశోర్వధమ్ ।
శాస్త్రస్తేయం ధర్మనాశం దశమం పరికీర్తితమ్ ॥10॥

శిష్టాచారాలను నాశనం చేయడం, శిష్టులను ద్వేషించడం, శిశువులను వధించడం, శాస్త్రాలను దొంగిలించడం, ధర్మనాశనం అనగా సన్మార్గాతిక్రమణం చేయడం పదియవనరకంగా పరిగణింపబడుతోంది.

షడఙ్గనిధనం ఘోరం షాడ్గుణ్యప్రతిషేధనమ్ ।
ఏకాదశమమేవోక్తం నరకం సద్భిరుత్తమమ్ ॥11॥

6 అంగాలు ఖండించి హత్యచేయడం, ప్రభువు తనకు విధించిన 6 పనులను ప్రదర్శించకుండా నిరోధించడం, పదకొండవనరకమని సజ్జనుల అభిప్రాయం.

సత్సు నిత్యం సదా వైరమనాచారమసత్క్రియా ।
సంస్కారపరిహీనత్వమిదం ద్వాదశమం స్మృతమ్ ॥12॥

సజ్జనులతో ఎల్లప్పుడు శత్రుత్వం, అనాచారం, చెడుపనులు చేయడం, విధ్యుక్తమైన సంస్కారాలను గాలికి వదిలేయడం పన్నెండవనరకమనబడుతుంది.

హానిర్ధర్మార్థకామానాం అపవర్గస్య హారణమ్ ।
సంభేదః సంవిదామేతత్ త్రయోదశమముచ్యతే ॥13॥

ధర్మార్థకామమోక్షాలను పురుషార్థసాధనలో అడ్డుపడడం. వాటి అపహరణం. మంచివారిలో అభిప్రాయ భేదాలు సృష్టించడం పదమూడవనరకమనబడుతుంది.

కృపణం ధర్మహీనం చ యద్వర్జ్యం యచ్చ వహ్నిదమ్ ।
చతుర్దశమమేవోక్తం నరకం తత్ విగర్హితమ్ ॥14॥

విడువదగిన కృపణత్వం, ధర్మహీనత్వం, దహనకాండ జరపడం, నింద్యమైన పదునాల్గవనరకమనబడుతుంది.

అజ్ఞానం చాప్యసూయత్వమశౌచమశుభావహమ్ ।
స్మృతం తత్ పంచదశమమసత్యవచనాని చ ॥15॥

అజ్ఞానం, అసూయ, అశౌచం మున్నగు అశుభకార్యాలు చేయడం, అసత్యవచనాలు పలకడం, 15వ నరకమని తలంచబడుతుంది.

ఆలస్యం వై షోడశ కం సక్రోధం చ విశేషతః ।
సర్వస్య చాతతాయిత్వమావాసేష్వగ్నిదీపనమ్ ॥16॥

సోమరితనం, అతిగా ఇతరులమీద క్రోధపడడం, ఆతతాయిత్వము, నివాసములను అగ్నిలో దహించడం పదహారవనరకమనబడుతుంది.

ఇచ్ఛా చ పరదారేషు నరకాయ నిగద్యతే ।
ఈర్ష్యాభావశ్చ సత్యేషు ఉద్వృత్తం తు విగర్హితమ్ ॥17॥

ఏతైస్తు పాపైః పురుషః పున్నామాద్యైర్నసంశయః ।
సంయుక్తః ప్రీణయేద్దేవం సంతత్యా జగతః పతిమ్ ॥18॥

పరదారాభిలాష, ఈర్ష్యాభావం, సత్యం పట్ల వైముఖ్యం, నరకానికి కారణాలు. ఇట్టి పాపాలతో చిక్కుకున్న మానవుడు పుత్ నామ నరకాన్ని పొందుతాడు. ఇందులో సందేహం లేదు. వీటినుండి బయటపడడానికి సుతుని ద్వారా భగవంతుని ప్రసన్నం చేసుకోవాలి.

ప్రీతః సృష్ట్యా తు శుభయా స పాపాద్ యేన ముచ్యతే ।
పున్నామనరకం ఘోరం వినాశయతి సర్వతః ॥19॥

ఏతస్మాత్కారణాత్ సాధ్య! సుతః పుత్రేతి గద్యతే ।

భగవంతుడు ప్రసన్నుడై సత్పుత్రుని ప్రసాదిస్తాడు. తద్వారా పితరులు పున్నామనరకముక్తులవుతారు. అందువలననే ఓ సాధ్యా! సుతునకు పుత్రుడని పేరు కలిగింది.

అతః పరం ప్రవక్ష్యామి శేషపాపస్య లక్షణమ్ ॥20॥

ఋణం దేవర్షి భూతానాం మనుష్యాణాం విశేషతః ।
పితౄణాంచ ద్విజశ్రేష్ఠ సర్వవర్ణేషు చైకతా ॥21॥

ఓంకారాదపి నిర్వృత్తిః పాపకార్యకృతశ్చ యః ।
మత్స్యాదశ్చ మహాపాపమగమ్యాగమనం తథా ॥22॥

ఘృతాది విక్రయం ఘోరం చండాలాది పరిగ్రహః ।
స్వదోషాచ్ఛాదనం పాపం పరదోష ప్రకాశనమ్ ॥23॥

మత్సరిత్వం వాగ్దుష్టత్వం నిష్ఠురత్వం తథాపరమ్ ।
టాకిత్వం తాలవాదిత్వం నామ్నా వాచాఽప్యధర్మజమ్ ॥24॥

దారుణత్వమధార్మిక్యం నరకావహముచ్యతే ।
ఏతైశ్చ పాపైః సంయుక్తః ప్రీణయేద్యది శంకరమ్ ॥25॥

జ్ఞానాధికమశేషేణ శేషపాపం జయేత్ తతః ।

ఓ ద్విజశ్రేష్ఠా! ఇక శేషపాపాల లక్షణాలు చెబుతున్నాను. శ్రద్ధగా వినుము. దేవతలకు, ఋషులకు, పితరులకు విశేషించి మానవులకు ఋణపడడం, సర్వవర్ణసాంకర్యం, ప్రణవ (ఓంకారం) విసర్జన, పాపకర్మిత్వం, మత్స్యభక్షణం, నిషిద్ధమైన వారితో సంగమించడం వలన వచ్చిన మహాపాపం, నేయి విక్రయించడం, చండాలుర పరిగ్రహం, తన దోషాలను కప్పిపుచ్చుకోవడం, ఇతరుల దోషాలను బయట పెట్టడం, మాత్సర్యం, దుష్టభాషణం, ఇతరులపట్ల నిష్ఠురంగా ప్రవర్తించడం, టాకిత్వం (దుష్టులపేర్లు ఉచ్చరించుట), తాలవాదిత్వం (దుష్టులతో మాట్లాడడం), మున్నగు వాచాదోషాలు చేయడం, దారుణత్వం, అధార్మికత్వం, మున్నగునవన్నియు నరకకారకాలైన పాపాలు. ఈ రకమైన పాపాలతో కూడినవాడు శంకరుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకున్నచో శంకరుడు అశేషజ్ఞానమూర్తి అగుటచే ఈ శేషపాపాలను శంకరుని అనుగ్రహం ద్వారా జయించగలుగుతాడు.

శారీరం వాచికం యత్తు మానసం కాయికం తథా ॥26॥

పితృమాతృకృతం యచ్చ కృతం యాచ్చాశ్రితైర్నరైః ।
భ్రాతృభిర్బాంధవైశ్చాపి తస్మిన్ జన్మని ధర్మజ ॥27॥

తత్సర్వం విలయం యాతి సధర్మః సుతశిష్యయోః ।
విపరీతే భవేత్ సాధ్య విపరీతః పదక్రమః ॥28॥

తస్మాత్పుత్రశ్చ శిష్యశ్చ విధాతవ్యౌ విపశ్చితా ।
ఏతదర్థమభిధ్యాయ శిష్యాచ్ఛ్రేష్ఠతరః సుతః ।
శేషాత్ తారయతే శిష్యః సర్వతోఽపి హి పుత్రకః ॥29॥

ఓ ధర్మజా! ఆ జన్మలో మాతాపితలు, ఆశ్రితులు, సోదరులు, బంధువులు, గావించిన శారీరక, వాచిక, మానసికాలైన పాపాలన్నిటిని పుత్రుని ద్వారా, శిష్యుని ద్వారా పోగొట్టుకోవచ్చును. ఆ పాపాలన్నిటిని తొలగింపజేయడమే సుతశిష్యుల ధర్మము. అందులకు వారు సమర్థులు. అందులకు వ్యతిరేకంగా జరిగితే ఫలితాలు కూడా విపరీతంగానే సంభవిస్తాయి. కాబట్టి ఓ సాధ్యా! జ్ఞానియైనవాడు పుత్రులను, శిష్యులను కలిగియుండాలి.

దీని ఆంతర్యం గ్రహించినచో శిష్యునికంటే పుత్రుడే శ్రేష్ఠుడని విదితమవుతుంది. ఎందువలన అనగా శిష్యుడు శేషించిన పాపాలనుండి మాత్రమే కాపాడతాడు. పుత్రుడు సమస్తపాపాలనుండి రక్షిస్తున్నాడుగదా!

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

పితామహవచః శ్రుత్వా సాధ్యః ప్రాహ తపోధనః ।
త్రిః సత్యం తవ పుత్రోఽహం దేవయోగం వదస్వ మే ॥30॥

నారదా! తపోధనుడైన ఆ సాధ్యుడు పితామహుని వచనాలను విని ఓ ప్రభూ! నేను ముమ్మాటికి మీకు పుత్రుడను, దయచేసి నాకు దేవయోగాన్ని తెలియజేయండని బ్రహ్మతో పలికాడు.

తమువాచ మహాయోగీ త్వన్మాతాపితరౌ యది ।
దాస్యేతే చ తతః సూనుర్దాయాదౌ మేఽసి పుత్రక ॥31॥

సనత్కుమారః ప్రోవాచ దాయాదపరికల్పనా ।
యే యం హి భవతా ప్రోక్తా తాం మే వ్యాఖ్యాతుమర్హసి ॥32॥

సనత్కుమారుని మాటలు విని పరమేష్ఠి వత్సా! నీ తల్లిదండ్రులు నిన్ను నాకు ఇచ్చినచో నీవు నాకు "దాయాదపుత్రుడువు కాగలవు!" అని పలుకగా అతడు దేవా! నీ చేత ఏ దాయాద శబ్దము ఉచ్చరింపబడినదో దానిని వ్యాఖ్యానించవలసినదిగా కోరుచున్నానని బ్రహ్మతో పలికాడు.

తదుక్తం సాధ్యముఖ్యేన వాక్యం శ్రుత్వా పితామహః ।
ప్రాహ ప్రహస్య భగవాన్ శృణు వత్సేతి నారద ॥33॥

నారదమహర్షీ! సనత్కుమారుడు పలికిన పలుకులు విని పితామహుడు నవ్వి వత్సా! వినుమని సనత్కుమారునితో ఇలా చెప్పసాగాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

ఔరసః క్షేత్రజశ్చైవ దత్తః కృత్రిమ ఏవ చ ।
గూఢోత్పన్నోఽపవిద్ధశ్చ దాయాదా బాన్ధవాస్తు షట్ ॥34॥

ఔరసుడు, క్షేత్రజుడు, దత్తుడు, కృత్రిముడు, గూఢోత్పన్నుడు, అపవిద్ధుడు అని దాయాదులు 6 రకాలు.

అమీషు షట్సు పుత్రేషు ఋణపిణ్డ ధనక్రియాః ।
గోత్రసామ్యం కులే వృత్తిః ప్రతిష్ఠా శాశ్వతీ తథా ॥35॥

ఈ ఆరుగురకు ఋణ, పిండ, ధన, క్రియ, గోత్రసామ్య, కులవృత్తి, ప్రతిష్ఠలనేవి తల్లిదండ్రులనుండి సహజంగా సంక్రమిస్తాయి.

కానీనశ్చ సహోఢశ్చ క్రీతః పౌనర్భవస్తథా ।
స్వయందత్తః పారశవః షడ్దాయాద బాన్ధవాః ॥36॥

వీరుగాక కానీనుడు, సహోఢుడు, క్రీతుడు, పునర్భవుడు, స్వయందత్తుడు, పారశవుడు అనే 6 రకాల దాయాదులు ఉన్నారు.

అమీభిః ఋణపిండాది కథా నైవేహ విద్యతే ।
నామధారకా ఏవేహ న గోత్రకులసమ్మతాః ॥37॥

కాని వీరికి మాత్రం ఋణపిండదానక్రియా గోత్రకుల వృత్తి ప్రతిష్ఠాదులు సంక్రమింపవు. వీరు పేరుకు మాత్రమే పుత్రులుగాని కులగోత్రసంభవులు కారు.

తత్తస్య వచనం శ్రుత్వా బ్రహ్మణః సనకాగ్రజః ।
ఉవాచైషాం విశేషం మే బ్రహ్మన్ వ్యాఖ్యాతుమర్హసి ॥38॥

బ్రహ్మ మాటలు విని సనత్కుమారుడు భగవన్! వీరల తారతమ్యవిశేషాదులు దయతో వ్యాఖ్యానించ వలసినదిగా అర్థిస్తున్నానని పలికాడు.

తతోఽబ్రవీత్ సురపతిర్విశేషం శృణు పుత్రక ।
ఔరసో యః స్వయంజాతః ప్రతిబింబమివాత్మనః ॥39॥

అంతట పితామహుడు పుత్రకా! వినుమని సనత్కుమారునితో పలికి ఇలా వివరింపసాగాడు. తనవలన తన భార్యకు స్వయంగా బింబనుండి ప్రతిబింబంవలె జన్మించినవాడు ఔరసుడు. ఇతడు తండ్రికి ప్రతిరూపమైనవాడు.

క్లీబోన్మత్తే వ్యసనిని పత్యౌ తస్యాజ్ఞయా తు యా ।
భార్యా హ్యనాతురా పుత్రం జనయేత్ క్షేత్రజస్తు సః ॥40॥

భర్త నపుంసకుడగుటచేగాని, వ్యసనపరుడగుటచేగాని, మద్యపానాది మత్తుడగుటచేగాని, దుర్బలుడుకాగా అట్టి భర్త అనుమతితో భార్య మరొకరివలన పొందిన పుత్రుడు క్షేత్రజుడు.

మాతాపితృభ్యాం యో దత్తః స దత్తః పరిగీయతే ।
మిత్రపుత్రం మిత్రదత్తం కృత్రిమం ప్రాహురుత్తమాః ॥41॥

తల్లిదండ్రులచే దత్తమైన పుత్రుడు దత్తుడుగా పరిగణింపబడతాడు. మిత్రుడు ఇచ్చిన సుతుడుగాని, మిత్రుని సుతుడుగాని కృత్రిముడని పెద్దలు నిర్ణయించారు.

న జ్ఞాయతే గృహే కేన జాతస్త్వితి స గూఢకః ।
బాహ్యతః స్వయమానీతః సోఽపవిద్ధః ప్రకీర్తితః ॥42॥

ఏ ఇంట ఎవనికి పుట్టినవాడో తెలియనివాడు గూఢకుడు అనబడతాడు. బయటనుండి స్వయంగా తెచ్చి పెంచుకొననవాడు 'అపవిద్ధు' అని చెప్పబడుతాడు.

కన్యాజాతస్తు కానీనః సగర్భోఢః సహోఢకః ।
మూల్యైర్గృహీతః క్రీతః స్యాద్ద్వివిధః స్యాత్పునర్భవః ॥43॥

దత్త్వైకస్య చ యా కన్యా హృత్వాఽన్యస్య ప్రదీయతే ।
తజ్జాతస్తనయో జ్ఞేయో లోకే పౌనర్భవో మునే! ॥44॥

పెండ్లికాని కన్యకు పుట్టినవాడు కానీనుడు. వివాహానికి పూర్వమే గర్భవతియైన భార్యకు జన్మించినవాడు సహోఢుడు. మూల్యం చెల్లించి తెచ్చుకున్నవాడు క్రీతుడు. రెండు లక్షణాలు కలవాడు పునర్భవుడు. ఓ సనత్కుమారా! ఒకనికి ఇచ్చిన కన్యను బలవంతంగా అతనినుండి లాగుకునివచ్చి వేరొకనితో వివాహం చేయగా ఆ భర్తవలన ఆ భార్యకు కలిగిన పుత్రుడు పునర్భవుడు అనబడతాడు.

దుర్భిక్షో వ్యసనే చాపి యేనాత్మా వినివేదితః ।
స స్వయందత్త ఇత్యుక్తస్తథాన్యః కారణాన్తరైః ॥45॥

కరువు కాటకాలలో ఆకలితో అల్లాడుతూ కాని, తదితరవిపరీతపరిస్థితులలోగాని, స్వయంగా వచ్చి తనను తాను సమర్పించుకునేవాడు స్వయందత్తుడు.

బ్రాహ్మణస్య సుతః శూద్ర్యాం జాయతే యస్తు సువ్రత ।
ఊఢాయాం వాప్యనూఢాయాం స పారశవ ఉచ్యతే ॥46॥

వివాహితయైనను కాకున్నను శూద్రస్త్రీయందు బ్రాహ్మణునివలన కలిగిన సుతుడు పారశవుడు అనబడతాడు.

ఏతస్మాత్కారణాత్పుత్ర న స్వయం దాతుమర్హసి ।
స్వమాత్మానం గచ్ఛ శీఘ్రం పితరౌ సముపాహ్వాయ ॥47॥

వత్సా! ఈ కారణాలవలన నీవు స్వయంగా పుత్రునిగా స్వీకరింపుమనుట ఉచితం కాదు. నేను నిన్ను పుత్రునిగా అంగీకరింపజాలను. కావున నీవు త్వరగా వెళ్ళి నీ తల్లిదండ్రులను ఆహ్వానించుకొని రమ్ము.

తతః స మాతాపితరౌ సస్మార వచనాద్విభోః ।
తావాజగ్మతురీశానం ద్రష్టుం వై దంపతీ మునే ॥48॥

ఓ నారదమునీ! సనత్కుమారుడు వెంటనే తన తల్లిదండ్రులను స్మరించినంత మాత్రం చేతనే ఈశానదర్శనార్థం వారచ్చటకు వచ్చారు.

ధర్మోఽహింసా చ దేవేశం ప్రణిపత్య న్యషీదతామ్ ।
ఉపవిష్టౌ సుఖాసీనౌ సాధ్యో వచనమబ్రవీత్ ॥49॥

ఆ విధంగా అచ్చటకు వచ్చిన ధర్ముడు అహింసాదేవి పరమేష్ఠికి ప్రణామం చేసి కూర్చున్నారు. ఆ విధంగా సుఖాసీనులైన తల్లిదండ్రులను చూచి సనత్కుమారుడు ఇలా పలికాడు.తెచ్చుకుని పెంచుకొనబడిన పుత్రుడు అపవిద్ధుడు అనబడతాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారమహర్షి పలికాడు.

యోగం జిగమిషుస్తాత బ్రహ్మాణం సమచూచుదమ్ ।
స చోక్తవాన్ మాం పుత్రార్థే తస్మాత్ త్వం దాతుమర్హసి ॥50॥

తండ్రీ! యోగవిద్యను గ్రహించాలని నేను పితామహుని అర్థించగా ఆయన నన్ను తన పుత్రుని కమ్మన్నాడు. కావున మీరు నన్ను ఆయనకు పుత్రునిగా దత్తం చేయవలెనని కోరుచున్నానని సనత్కుమారుడు తన తల్లిదండ్రులకు చెప్పాడు.

తావేవముక్తౌ పుత్రేణ యోగాచార్యం పితామహమ్ ।
ఉక్తవన్తౌ ప్రభోऽయం హి ఆవయోస్తనయస్తవ ॥51॥

అద్యప్రభృత్యయం పుత్రస్తవ బ్రహ్మన్ భవిష్యతి ।
ఇత్యుక్త్వా జగ్మతుస్తూర్ణం యేనైవాభ్యాగతౌ యథా ॥52॥

తన కుమారుని మాటలను విని ధర్మాహింసలు తన కుమారుని యోగాచార్యుడైన పితామహునితో ఇలా పలికారు. "భగవాన్! ఈ మా కుమారుడు నేటినుండి మీ పుత్రుడు కాగలడు" అని పలికి వారిరువురు వెంటనే తాము వచ్చిన చోటుకు తిరిగి బయలుదేరి వెళ్ళిపోయారు.

పితామహోऽపి తం పుత్రం సాధ్యం సద్వినయాన్వితమ్ ।
సనత్కుమారం ప్రోవాచ యోగం ద్వాదశపత్రకమ్ ॥53॥

అంతట పితామహుడు కూడా సాధ్యపుత్రుడు, వినయాన్వితుడునైన సనత్కుమారునకు ద్వాదశపత్రకయోగం ఇలా ఉపదేశించాడు.

శిఖా సంస్థం తు ఓంకారం మేషోऽస్య శిరసి స్థితః ।
మాసో వైశాఖ నామ్నా చ ప్రథమం పత్రకం స్మృతమ్ ॥54॥

శిఖమీద ఓంకారముంటుంది. దాని తలమీద మేషరాశి ఉంటుంది. దీనికి మాసం వైశాఖం. ఇది ప్రథమ పత్రకం.

నకారో ముఖసంస్థో హి వృషస్తత్ర ప్రకీర్తితః ।
జ్యేష్ఠమాసశ్చ తత్పత్రం ద్వితీయం పరికీర్తితమ్ ॥55॥

ముఖంమీద నకారం. వృషభరాశి జ్యేష్ఠమాసంతో కూడినది రెండవ పత్రకము.

మోకారో భుజయోర్యుగ్మం మిథునస్తత్ర సంస్థితః ।
మాసో ఆషాఢ నామా చ తృతీయం పత్రకం స్మృతమ్ ॥56॥

రెండు భుజాలమీద మోకారం మిథునరాశి, ఆషాఢమాసయుక్తమైనది మూడవ పత్రకము.

భకారం నేత్రయుగలం తత్ర కర్కటకః స్థితః ।
మాసః శ్రావణ ఇత్యుక్తశ్చతుర్థం పత్రకం స్మృతమ్ ॥57॥

రెండు నేత్రాల మీద భకారం. కర్కటక రాశితో శ్రావణమాసంతో కూడియుంటుంది. ఇది చతుర్థ పత్రకము.

గకారం హృదయం ప్రోక్తం సింహో వసతి తత్ర చ ।
మాసో భాద్రస్తథా ప్రోక్తః పంచమం పత్రకం స్మృతమ్ ॥58॥

హృదయదేశాన గకారంతో సింహరాశితో భాద్రపదమాసంతో యుక్తమై యుంటుంది. ఇది పంచమ పత్రకంగా పరిగణింపబడుతోంది.

వకారం కవచం విద్యాత్ కన్యా తత్ర ప్రతిష్ఠితా ।
మాసశ్చాశ్వయుజోనామ షష్ఠం తత్ పత్రకం స్మృతమ్ ॥59॥

వకారం కవచనిష్ఠమై, కన్యారాశితో ఆశ్వయుజమాసంతో కూడియుంటుంది. ఇది ఆరవ పత్రకము.

తేకారమస్త్రగ్రామం చ తులారాశిః కృతాశ్రయః ।
మాసశ్చ కార్తికో నామ సప్తమం పత్రకం స్మృతమ్ ॥60॥

బ్రహ్మ అస్త్రసమూహాన్ని ఆశ్రయించి తేకారం తులారాశితో ఉంటుంది. కార్తికమాసం కలిగిన ఈ పత్రకం ఏడవది.

వాకారం నాభిసంయుక్తం స్థితస్తత్ర తు వృశ్చికః ।
మాసో మార్గశిరో నామ త్వష్టమం పత్రకం స్మృతమ్ ॥61॥

నాభితో కూడి వాకారం ఉంటుంది. వృశ్చికరాశి మార్గశిరమాసహితమైన ఈ పత్రకం ఎనిమిదవది.

సుకారం జఘనం ప్రోక్తం తత్రస్థశ్చ ధనుర్ధరః ।
పౌషేతి గదితో మాసో నవమం పరికీర్తితమ్ ॥62॥

నడుమునాశ్రయించి ధనువు రాశితో సుకారముంటుంది. మాసం పుష్యం. ఇది నవమ పత్రకము.

దేకారశ్చోరుయుగళం మకరోఽప్యత్ర సంస్థితః ।
మాఘో నిగదితో మాసః పత్రకం దశమం స్మృతమ్ ॥63॥

ఊరువుల మీద దేకారం మకరరాశి ఉంటాయి. మాసం మాఘం. ఇది పదవ పత్రకము.

వాకారో జానుయుగ్మం చ కుంభస్తత్రాది సంస్థితః ।
పత్రకం ఫాల్గునం ప్రోక్తం తదేకాదశముత్తమమ్ ॥64॥

మోకాళ్ళమీద వాకారం, కుంభరాశి, ఫాల్గుణ మాసాలతో ఏకాదశపత్రంగా విలసిల్లుతుంది.

పాదౌ యకారో మీనోఽపి స చైత్రే వసతే మునే ।
ఇదం ద్వాదశమం ప్రోక్తం పత్రం వై కేశవస్య హి ॥65॥

ఇక పన్నెండవ పత్రకం పాదాల మీద యకారం మీనరాశితో చైత్రమాసంలో ఉంటుంది.

ద్వాదశారం తథా చక్రం షణ్ణాభిః ద్వియుతం తథా ।
త్రివ్యూహమేకమూర్తిశ్చ తథోక్తః పరమేశ్వరః ॥66॥

ఈ విధంగా ద్వాదశపత్రకమైన కేశవ వాసుదేవ పరమాత్మ చక్రం 12 అరలు (అంచులు). 2 నాభులు కలిగియుంటుంది. 3 మూర్తులలో కన్పించిన ఆ పరమేశ్వరుడు ఒక్కడే.

ఏతత్తవోక్తం దేవస్య రూపం ద్వాదశపత్రకమ్ ।
యస్మిన్ జ్ఞాతే మునిశ్రేష్ఠ న భూయో మరణం భవేత్ ॥67॥

ఓ మునిశ్రేష్ఠా! ద్వాదశపత్రకమైన ఈ పరమేశ్వరస్వరూపం తెలిసినవారలకు మరల మరణం ఉండదు.

ద్వితీయముక్తం సత్త్వాఢ్యం చతుర్వర్ణం చతుర్ముఖమ్ ।
చతుర్బాహుముదారాఙ్గం శ్రీవత్సధరమవ్యయమ్ ॥68॥

ఈ బ్రహ్మ రెండవ రూపం సత్త్వగుణ సంపన్నం. నాలుగు వర్ణాలలో నాలుగు ముఖాలు, నాలుగు బాహువులు, చక్కని అంగప్రత్యంగాలతో శ్రీవత్సధరమై, నయనానందకరంగా ఉంటుంది.

తృతీయస్తామసో నామ శేషమూర్తిః సహస్రపాత్ ।
సహస్రవదనః శ్రీమాన్ ప్రజాప్రలయకారకః ॥69॥

మూడవది తమఃప్రధానమైన శేషమూర్తి. లక్ష్మీవరుడైన ఈ మూర్తి సహస్రముఖాలు, సహస్రపాదాలతో ప్రజాప్రళయకారకుడై యుంటాడు.

చతుర్థో రాజసో నామ రక్తవర్ణశ్చతుర్ముఖః ।
ద్విభుజో ధారయన్మాలాం సృష్టికృచ్చాదిపూరుషః ॥70॥

రజోగుణసమ్మితమైన నాల్గవరూపం ఎర్రటిరంగులో నాల్గుముఖాలు, రెండుచేతులతోనొప్పు ఆదిపురుషుడు మాలాధరుడై సృష్టికార్యం నెరవేరుస్తూ ఉంటాడు.

అవ్యక్తాత్ సంభవంత్యేతే త్రయో వ్యక్తా మహామునే ।
అతో మరీచిప్రముఖాస్తథాన్యేఽపి సహస్రశః ॥71॥

అవ్యక్తబ్రహ్మనుండి నిర్గమించిన ఈ మూడు వ్యక్త(ప్రత్యక్ష) రూపాలు. అంతేగాక ఆ ప్రభువునుండి మరీచి మొదలైన ఋషులు వేలసంఖ్యలో జన్మించారు.

ఏతత్తవోక్తం మునివర్య రూపం విభోఃపురాణం మతిపుష్టివర్ధనమ్ ।
చతుర్భుజం తం స మురుర్దురాత్మా కృతాన్తవాక్యాత్ పునరాససాద ॥72॥

ఓ మునిశ్రేష్ఠా! ఈ విధంగా నీకు మతి పుష్టివర్ధకమైన పరమాత్మపురాణరూపాన్ని వివరించి చెప్పాను. అటువంటి చతుర్భుజుడైన పరమాత్మను దురాత్ముడైన మురాసురుడు యముని మాటప్రకారం సమీపించాడు.

తమాగతం ప్రాహ మునే మధుఘ్నః ప్రాప్తోఽసి కేనాసుర కారణేన ।
స ప్రాహ యోద్ధుం సహ వై త్వయాద్య తం ప్రాహ భూయః సురశత్రుహన్తా ॥73॥

యదీహ మాం యోద్ధుముపాగతోఽసి తత్కమ్పతే తే హృదయం కిమర్థమ్ ।
జ్వరాతురస్యేవ ముహుర్ముహుర్వై తన్నాస్మి యోత్స్యే సహ కాతరేణ ॥74॥

ఓ మునివరా! ఆ విధంగా వచ్చిన వారిని చూచి, మధుసూదనుడు "ఓ రాక్షసా! నీవెవరవు? ఎందులకు వచ్చితివి?" అని అడిగాడు. అంతట వాడు నేడు నీతో యుద్ధం చేయడానికి వచ్చానని సమాధానమిచ్చాడు. అంతట రాక్షసాంతకుడు నాతో యుద్ధం చేయడానికి వచ్చినవాడవైతే నీ గుండె భయంతో ఎందులకు అలా కొట్టుకుంటున్నది? జ్వరార్తులవలె వణకిపోయే పిరికివారితో నేను యుద్ధం చేయను సుమా!" అని మురాసురునితో పలికాడు.

ఇత్యేవముక్తో మధుసూదనేన మురుస్తదా స్వే హృదయే స్వహస్తమ్ ।
కథం క్వ కస్యేతి ముహుస్తథోక్త్వా నిపాతయామాస విపన్నబుద్ధిః ॥75॥

హరిశ్చ చక్రం మృదులాఘవేన ముమోచ తద్ధృత్కమలస్య శత్రోః ।
చిచ్ఛేద దేవాస్తు గతవ్యథాభవన్ దేవం ప్రశంసన్తి చ పద్మనాభమ్ ॥76॥

ఏతత్తవోక్తం మురదైత్యనాశనం కృతం హి యుక్త్యా శితచక్రపాణినా ।
అతః ప్రసిద్ధిం సముపాజగామ మురారిరిత్యేవ విభుర్నృసింహః ॥77॥

మధుసూదనుడు ఇట్లు పలుకగానే మురాసురుడు గుండెమీద చేయిపెట్టుకుని, "ఎవరిగుండె? ఎట్లు? ఎక్కడ? కొట్టుకుంటున్నది?" అంటూ ఉండగా ఆ హరి అతిలాఘవంతో మృదువుగా తన చక్రాన్ని ప్రయోగించి, చేతితో సహా మురాసురుని వక్షఃస్థలాన్ని చీల్చి సంహరించాడు. దేవతలందరు తమ బాధలు తొలగినవారై, ఆ కమలనాభుని జయజయధ్వానాలతో కీర్తించారు. ఓ నారదా! ఈ విధంగా చక్రధరుడు యుక్తితో గావించిన మురాసుర సంహారకథ నీకు వివరించాను. ఇందువలననే ఆ నృసింహవిభుడు మురారిగా ఖ్యాతి వహించాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే మురవధో నామైక షష్టితమోఽధ్యాయః ॥61॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని మురాసురవధ అనే అరవైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్విషష్టితమోఽధ్యాయః - అరవైరెండవ అధ్యాయం

భైరవప్రాదుర్భావే తప్తకృచ్ఛ్రవ్రతాచరణ విధిః, హరిహరాత్మక విశ్వరూపదర్శనం చ -

భైరవప్రాదుర్భావంలో తప్తకృచ్ఛ్రవ్రతాచరణ విధానం, హరిహరాత్మక విశ్వరూపదర్శనం

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

తతో మురారిభవనం సమభ్యేత్య సురాస్తతః ।
ఊచుర్దేవం నమస్కృత్య జగత్సంక్షుబ్ధికారణమ్ ॥1॥

ఓ నారదా! అంతట దేవతలందరు మురారిభవనానికి వెళ్ళి ఆ దేవునకు ప్రణామాలు గావించి, జగత్సంక్షోభానికి కారణమేమిటని ప్రశ్నించారు.

తచ్ఛ్రుత్వా భగవాన్ ప్రాహ గచ్ఛామో హరమందిరమ్ ।
స వేత్స్యతి మహాజ్ఞానీ జగత్ క్షుబ్ధం చరాచరమ్ ॥2॥

అది విని శ్రీహరి మనమందరము శ్రీశంకరుని నివాసానికి వెళ్ళుదము. మహాజ్ఞానియగు మహేశ్వరుడే జగత్సంక్షోభకారణం చెప్పగలడని దేవతలతో పలికాడు.

తథోక్తా వాసుదేవేన దేవాః శక్రపురోగమాః ।
జనార్దనం పురస్కృత్య ప్రజగ్ముర్మందరం గిరిమ్ ।
న తత్ర దేవం న వృషం న దేవీం న చ నందినమ్ ॥3॥

జనార్దనుని మాటప్రకారం ఆయనను ముందిడుకుని ఇంద్రునితో కలసి దేవతలందరు మందరపర్వతానికి వెళ్ళారు. కాని అక్కడ శివపార్వతులుగాని, వృషభంగాని, నందిగాని కన్పించలేదు.

శూన్యం గిరిమపశ్యంత అజ్ఞానతిమిరావృతాః ।
తాన్ మూఢదృష్టీన్ సంప్రేక్ష్య దేవాన్ విష్ణుర్మహాద్యుతిః ॥4॥

ప్రోవాచ కిం న పశ్యధ్వం మహేశం పురతః స్థితమ్ ।
తమూచుర్నైవ దేవేశం పశ్యామో గిరిజాపతిమ్ ॥5॥

న విద్మః కారణం తచ్చ యేన దృష్టిర్హతా హి నః ।

అజ్ఞానాంధకారం వల్ల మూర్ఖులై, వెర్రిచూపులతో శూన్యమందిరాన్ని చూస్తూ, నిలచిన దేవతలను మహాతేజస్వి యగు శ్రీమహావిష్ణువు "ఇదేమి? ఎదురుగా ఆసీనుడైన మహాదేవుడు మీకు కనబడలేదా?" అని ప్రశ్నించాడు. అందుకు దేవతలు తమకు గిరిజానాథుడు కనబడడం లేదని, తమదృష్టి ఏకారణాన నశించిందో తెలియదని వాపోయారు.

తానువాచ జగన్మూర్తిర్యూయం దేవస్య సాగసః ॥6॥

పాపిష్ఠా గర్భహన్తారో మృడాన్యాః స్వార్థతత్పరాః ।
తేన జ్ఞాన వివేకో వై హృతో దేవేన శూలినా ॥7॥

అంతట శ్రీహరి దేవతలతో ఇలా పలికాడు. "మీరు శివద్రోహం చేశారు. మీరు పాపిష్ఠులు, మీరు స్వార్థంతో గ్రుడ్డివారై మృడాని గర్భహననం గావించారు. అందుచేత మీ జ్ఞానం, వివేకం, ఆ శూలపాణి హరించాడు."

యేనాగ్రతః స్థితమపి పశ్యన్తోఽపి న పశ్యథ ।
తస్మాత్ కాయవిశుద్ధ్యర్థం దేవదృష్ట్యర్థమాదరాత్ ॥8॥

తప్తకృచ్ఛ్రేణ సంశుద్ధాః కురుధ్వం స్నానమీశ్వరే ।
క్షీరస్నానం ప్రయుంజీత సార్ధం కుంభశతం సురాః ॥9॥

కనుకనే ఎట్టఎదుట ఆయన ఉన్నను కళ్ళు తెరుచుకొని కూడా మీరు ఆ ప్రభువును చూడలేకపోతున్నారు. కాబట్టి ఆ పాపపరిహారానికి దేవదృష్ట్యర్థం తప్తకృచ్ఛ్రవ్రతం ద్వారా కాయశుద్ధి చేసుకోండి. మీరు ఆ దేవుని చూడగలగడానికి, ఆ మహనీయునకు అభిషేకం చేయండి. 150 కడవల పాలతో ముందుగా అభిషేకం చేయండి.

దధిస్నానే చతుష్షష్టిర్ద్వాత్రింశద్ధవిషోఽర్హణే ।
పంచగవ్యస్య శుద్ధస్య కుంభాః షోడశ కీర్తితాః ॥10॥

అనంతరం 64 కుంభాల పెరుగుతోను, తరువాత 32 కడవల నేయితోను, తరువాత 16 కడవల పంచగవ్యం (ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవునేయి, ఆవుపేడ, ఆవుమూత్రం కలిపిన మిశ్రమం) తోను మహాదేవుని అభిషేకించండి.

మధునోఽష్టౌ జలస్యోక్తాః సర్వే తే ద్విగుణాః సురాః ।
తతో రోచనయా దేవమష్టోత్తరశతేన హి ॥11॥

అనంతరం 8 కడవల తేనెతోను అభిషేకించి, చివరిగా పైవానికన్నింటికి రెండురెట్ల కడవల శుద్ధోదకంతో స్వామిని అభిషేకించండి. స్నానానంతరం దేవదేవుని దేహానికి గోరోచనం 108 పర్యాయాలు పూయండి.

అనులింపేత్ కుంకుమేన చందనేన చ భక్తితః ।
బిల్వపత్రైః స కమలైః ధత్తూరసురచందనైః ॥12॥

మందారైః పారిజాతైశ్చ అతిముక్తైస్తథాఽర్చయేత్ ।
అగురుం సహ కాలేయం చందనేనాపి ధూపయేత్ ॥13॥

కుంకుమ, చందనాలతో భక్తిపూర్వకంగా అలంకరించి, బిల్వదళాలు, కమలాలు, ఉమ్మెత్తపూవులు, సురచందనం, మందారం, పారిజాతం, అతిముక్తకుసుమాలతో అర్చించాలి. అగరు, కేశర, నల్లచందనంతో కలిపి స్వామికి ధూపం వేయాలి.

జప్తవ్యం శతరుద్రీయం ఋగ్వేదోక్తైః పదక్రమైః ।
ఏవం కృతే తు దేవేశం పశ్యధ్వం నేతరేణ చ ॥14॥

తదనంతరం ఋగ్వేదోక్తమైన పదక్రమవిన్యాసంతో హరుని శతరుద్రీయమంత్రజపం చేయాలి. ఈ విధంగా చేసినచో మీ పాపాలు తొలగి, ఆ స్వామి ప్రసన్నుడై నష్టమైన మీ దృష్టిని తిరిగి అనుగ్రహిస్తాడు. తదితరమైన మార్గమేదియు లేదు.

ఇత్యుక్తా వాసుదేవేన దేవాః కేశవమబ్రువన్ ।
విధానం తప్తకృచ్ఛ్రస్య కథ్యతాం మధుసూదన ।
యస్మింశ్చీర్ణే కాయశుద్ధిర్భవతే సార్వకాలికీ ॥15॥

వాసుదేవుని మాటలు వినిన దేవతలు ప్రభూ! ఎట్టి తప్తకృచ్ఛ్రవ్రతమాచరించినచో సార్వకాలికమైన కాయ శుద్ధి కలుగుతుందో అట్టి తప్తకృచ్ఛ్రవ్రతాచరణవిధానం తెలియజేయుమని కేశవుని అడిగారు.

వాసుదేవ ఉవాచ – వాసుదేవుడు పలికాడు.

త్ర్యహముష్ణం పిబేదాపః త్ర్యహముష్ణం పయః పిబేత్ ।
త్ర్యహముష్ణం పిబేత్సర్పిర్వాయుభక్షో దినత్రయమ్ ॥16॥

పలా ద్వాదశ తోయస్య పలాష్టౌ పయసః సురాః ।
షట్పలం సర్పిషః ప్రోక్తం దివసే దివసే పిబేత్ ॥17॥

మూడు రోజులు వేడినీరు త్రాగుతు, మూడు రోజులు పాలు త్రాగుతు, మూడురోజులు వేడినేయి త్రాగి, తక్కిన మూడురోజులు వాయుభక్షణం చేస్తూ గడపాలి. తదనంతరం రోజు క్రమంగా 12 పలాలు నీరు, 8 పలాలు పాలు, 6 పలాలు నేయి త్రాగాలి. ఇది తప్తకృచ్ఛ్రనియమం.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్తే వచనే సురాః కాయవిశుద్ధయే ।
తప్తకృచ్ఛ్రరహస్యం వై చక్రుః శక్రపురోగమాః ॥18॥

నారదా! ఆ విధానాన్ని వినిన దేవతలు ఇంద్రునితో కలిసి కాయశుద్ధికోసం తప్తకృచ్ఛ్రవ్రతం ఆచరించారు.

తతో వ్రతే సురాశ్చీర్ణే విముక్తాః పాపతోఽభవన్ ।
విముక్తపాపా దేవేశం వాసుదేవమథాబ్రువన్ ॥19॥

తప్తకృచ్ఛ్రవ్రతమాచరించి పాపవిముక్తులైన దేవతలు దేవేశుడైన వాసుదేవునితో ఇలా పలికారు.

క్వాసౌ వద జగన్నాథ! శంభుస్తిష్ఠతి కేశవ! ।
యం క్షీరాద్యభిషేకేణ స్నాపయామో విధానతః ॥20॥

ఓ భగవత్స్వరూపుడా! జగన్నాథా! శంభుడు ఎక్కడ ఉంటాడో తెలియజేసినచో క్షీరాదులతో యథావిధిగా అభిషేకించ గలము అని పలికారు.

అథోవాచ సురాన్విష్ణురేష తిష్ఠతి శఙ్కరః ।
మద్దేహే కిం న పశ్యధ్వం యోగశ్చాయం ప్రతిష్ఠితః ॥21॥

అంతట విష్ణువు దేవతలతో "శంకరుడు నాతో కలసి నా దేహంలోనే యున్నాడు. మీకు కనిపించడం లేదా?" అని పలికాడు.

తమూచుర్నైవ పశ్యామస్త్వత్తో వై త్రిపురాన్తకమ్ ।
సత్యం వద సురేశాన మహేశానః క్వ తిష్ఠతి? ॥22॥

దానికి దేవతలు శివుడు మాకు కనిపించడం లేదనియు, త్రిపురాన్తకుడైన ఈశ్వరుడు నిజంగా ఎక్కడున్నాడో తెలియజేయుమనియు మధుసూదనుని ప్రార్థించారు.

తతోఽవ్యయాత్మా స హరిః స్వహృత్పంకజశాయినమ్ ।
దర్శయామాస దేవానాం మురారిర్లింగమైశ్వరమ్ ॥23॥

అంతట అవ్యయుడైన శ్రీహరి ఈశ్వరలింగాన్ని తనహృదయకమలం మీద శయనించినట్లుగా దేవతలకు చూపించాడు.

తతః సురాః క్రమేణైవ క్షీరాదిభిరనన్తరమ్ ।
స్నాపయాంచక్రిరే లిఙ్గం శాశ్వతం ధ్రువమవ్యయమ్ ॥24॥

అంతట దేవతలు సంతోషించి, శాశ్వతము, ధ్రువము, అవ్యయమునైన ఈశ్వరలింగమూర్తిని విధివిధానంగా క్షీరాదులతో క్రమంగా అభిషేకించారు.

గోరోచనయా త్వాలిప్య చందనేన సుగంధినా ।
బిల్వపత్రాంబుజైర్దేవం పూజయామాసురంజసా ॥25॥

ధూపయిత్వాఽగరుం భక్త్యా నివేద్య పరమౌషధీః ।
జప్త్వాఽష్టశతనామాని ప్రణామం చక్రిరే తతః ॥26॥

గోరోచనలేపనం, చందనాదులతో అలంకరించారు. బిల్వపత్రములతోను, పద్మములతోను భక్తితో పూజచేసి, అగరుధూపంవేసి, మహౌషధులు నైవేద్యం గావించారు. అష్టోత్తరశత నామజపం చేసి, ప్రణామం గావించారు.

ఇత్యేవం చింతయన్తశ్చ దేవావేతౌ హరీశ్వరౌ ।
కథం యోగం తమాపన్నౌ సత్త్వేన తమసాఽవృతౌ ॥27॥

పరస్పరవిరుద్ధమైన సత్త్వతమోగుణాత్మకులైన ఈ హరిహరులు ఒకటిగా కలియుట ఎట్లు సంభవమా? అని దేవతలు ఆలోచింపసాగారు.

పులస్త్య ఉవాచ – పులస్త్య మహర్షిపలికాడు.

సురాణాం చింతితం జ్ఞాత్వా విశ్వమూర్తిరభూద్విభుః ।
సర్వలక్షణసంయుక్తః సర్వాయుధధరోऽవ్యయః ॥28॥

దేవతల ఆలోచనలను తెలిసికొని ప్రభుడు, అవ్యయుడు, సర్వాయుధధరుడు సర్వలక్షణసంపన్నుడునయిన ఆ ప్రభువు విశ్వరూపం ధరించాడు.

సార్ధం త్రినేత్రం కమలాహి కుణ్డలం జటాగుడాకేశ ఖగర్షభధ్వజమ్ ।
స మాధవం హారభుజఙ్గ వక్షసం పీతాజినాచ్ఛన్నకటిప్రదేశమ్ ॥29॥

చక్రాసిహస్తం హలశార్ఙ్గపాణిం పినాకశూలాజగవాన్వితం చ ।
కపర్ద ఖట్వాఙ్గ కపాలఘంటా సశంఖ టంకార రవం మహర్షే ॥30॥

మాధవునితో కలిసిన శివుడు మూడు నేత్రాలు, సర్ప పద్మ కుండలాలు, జటాజూటం, గరుడ వృషభధ్వజం, సర్పహారాలు, పీతాంబరం, వ్యాఘ్రాజినం కలిగిన కటిప్రదేశంతోను, చక్రం, ఖడ్గం, హలం, శార్ఙ్గం, పినాకం, శూలం, అజగవం, ఖట్వాంగం, కపాలం, ఘంటాది ఆయుధాలు (శివకేశవులకు సంబంధించినవి) చేతులతో ధరించిన హరిహరాత్మకమైన అద్భుతరూపంలో దర్శనమిచ్చాడు.

దృష్ట్వైవ దేవా హరిశఙ్కరం తం నమోऽస్తు తే సర్వగతావ్యయేతి ।
ప్రోక్త్వా ప్రణామం కమలాసనాద్యాశ్చక్రుర్మతిం చైకతరాం నియుజ్య ॥31॥

హరిహరాత్మకమైన ఆ విశ్వరూపాన్ని దర్శించి, బ్రహ్మాది దేవతలందరు ఓ సర్వగతా! అవ్యయా! ప్రభూ! మీకు నమస్కృతులని పలుకుతూ ప్రణామాలు గావించి, హరిహరులు ఒకటేయని తెలుసుకున్నారు.

తానేకచిత్తాన్ విజ్ఞాయ దేవాన్ దేవపతిర్హరిః ।
ప్రగృహ్యాభ్యద్రవత్తూర్ణం కురుక్షేత్రం సమాశ్రమమ్ ॥32॥

ఆ విధంగా ఏకాభిప్రాయంతో దేవతలందరు ఉన్నట్లు తెలిసికొనిన దేవపతియైన శ్రీహరి వారినందరిని తీసికొని వేగంగా తన ఆశ్రమస్థానమైన కురుక్షేత్రానికి వెళ్ళాడు.

తతోऽపశ్యన్త దేవేశం స్థాణుభూతం జలే శుచిమ్ ।
దృష్ట్వా నమః స్థాణవేతు ప్రోక్త్వా సర్వే హ్యుపావిశన్ ॥33॥

అచ్చటి జలాలలో స్థాణువుగా నిలిచిన శంకరుని ప్రభూ! స్థాణుదేవా! నీకు నమస్సులంటూ కీర్తించి, దేవతలందరు ఉపవిష్టులయ్యారు.

తతోऽబ్రవీత్ సురపతిరేహ్యేహి దీయతాం వరః ।
క్షుబ్ధం జగజ్జగన్నాథ ఉన్మజ్జస్వ ప్రియాతిథే ॥34॥

అంతట సురపతి ప్రభూ!, జగన్నాథా! జగత్తంతయు సంక్షోభంలో నున్నది. నీవు నీటినుండి బయటకు వచ్చి, వరమనుగ్రహించి, మమ్ముద్ధరింపుమని ప్రార్థించాడు.

తతస్తాం మధురాం వాణీం శుశ్రావ వృషభధ్వజః ।
శ్రుత్వోత్తస్థౌ చ వేగేన సర్వవ్యాపీ నిరంజనః ॥35॥

దేవేంద్రుని మధురమైన వాక్కులను ఆలకించి, సర్వవ్యాపియు, నిరంజనుడు, వృషభధ్వజుడునైన పరమేశ్వరుడు వేగంగా నీటినుండి పైకిలేచి నిలబడ్డాడు.

నమోఽస్తు సర్వదేవేభ్యః ప్రోవాచ ప్రహసన్హరః ।
స చాగతః సురైః సేన్ద్రైః ప్రణతో వినయాన్వితైః ॥36॥

ఆ విధంగా నీటినుండి పైకిలేచిన హరుడు నవ్వుతూ "సమస్తదేవతలకు నమస్సులు" అని పలికాడు. ఇంద్రునితో కూడిన దేవతలందరు వినయాన్వితులై ఆ హరునకు ప్రణామం గావించారు.

తమూచుర్దేవతాః సర్వాస్త్యజ్యతాం శంకర ద్రుతమ్ ।
మహావ్రతం త్రయో లోకాః క్షుబ్ధాస్త్వత్తేజసాఽఽవృతాః ॥37॥

శంకరా! ముల్లోకాలు నీ తపోగ్నికి క్షోభించిపోతున్నాయి. కావున ఈ కఠోరవ్రతాన్ని వెంటనే వదలండని దేవతలందరు హరుని ప్రార్థించారు.

అథోవాచ మహాదేవో మయా త్యక్తో మహావ్రతః ।
తతః సురా దివం జగ్ముః హృష్టాః ప్రయతమానసాః ॥38॥

అంతట మహాదేవుడు తన మహావ్రతాన్ని త్యజించినట్లు దేవతలకు తెలియజేయగా వారందరు సంతుష్టాంతరంగులై స్వర్గానికి వెళ్ళారు.

తతోఽపి కంపతే పృథ్వీ సాబ్ధిద్వీపాచలా మునే ।
తతోఽభిచిన్తయద్రుద్రః కిమర్థం క్షుభితా మహీ ॥39॥

మునీంద్రా! తదనంతరం కూడా సముద్రాలు, ద్వీపాలతో సహా భూమి కంపిస్తూనే ఉన్నది. అందులకు కారణమేమిటని రుద్రుడు ఆలోచింపసాగాడు.

తతః పర్యచరచ్ఛూలీ కురుక్షేత్రం సమన్తతః ।
దదర్శౌఘవతీ తీరే ఉశనసం తపోనిధిమ్ ॥40॥

తతోఽబ్రవీత్సురపతిః కిమర్థం తప్యతే తపః ।
జగత్ క్షోభకరం విప్ర! తచ్ఛీఘ్రం కథ్యతాం మమ ॥41॥

అందులకు కారణం గూర్చి శివుడు కురుక్షేత్ర పరిసరప్రాంతమంతా పర్యటించగా ఓఘవతీ నదీతీరంలో కఠోరతపస్సు చేస్తున్న శుక్రుడు కన్పించాడు. అంతట శివుడు ఆయనకు ఓ ఉశనసా! ఏ కోరికతో జగత్సంక్షోభం కలిగించే ఈ తపస్సు చేస్తున్నావని అడిగాడు.

ఉశనా ఉవాచ – ఉశనసుడు పలికాడు.

తవారాధనకామార్థం తప్యతే హి మహత్తపః ।
సంజీవనీం శుభాం విద్యాం జ్ఞాతుమిచ్ఛే త్రిలోచన ॥42॥

ఓ త్రినేత్రా! శుభంకరమైన సంజీవనీ విద్యను తెలుసుకోవాలనే కోరికతో నీకు ప్రీతికరంగా నేనీ మహాతపస్సు చేస్తున్నానని పలికాడు.

హర ఉవాచ – హరుడు పలికాడు.

తపసా పరితుష్టోఽస్మి సుతప్తేన తపోధన ।
తస్మాత్ సంజీవనీం విద్యాం భవాన్ జ్ఞాస్యతి తత్త్వతః ॥43॥

ఓ తపోధనా! నీ తపస్సునకు నేను పరితుష్టుడనయ్యాను. కావున సంజీవనీ విద్యను నీవు తెలుసుకోగలుగుతావని హరుడు శుక్రునకు వరమిచ్చాడు.

వరం లబ్ధ్వా తతః శుక్రస్తపసః సంన్యవర్తత ।
తథాఽపి చలతే పృథ్వీ సాబ్ధిభూభృన్నగావృతా ॥44॥

తతోఽగమన్ మహాదేవః సప్తసారస్వతం శుచిః ।
దదర్శ నృత్యమానం చ ఋషిం మంకణసంజ్ఞితమ్ ॥45॥

శివునినుండి వరం పొందిన శుక్రుడు తపస్సునుండి విరమించాడు. అయినప్పటికి పర్వతసముద్రాలతో సహా భూమి ఇంకనూ కంపిస్తూనే వుంది. అంతట శివుడు పవిత్రమైన సప్తసారస్వతక్షేత్రానికి వెళ్ళి, అక్కడ మంకణ మహాముని ఆనందాతిరేకంతో నాట్యం చేయడం చూశాడు.

భావేన పోప్లూయతి బాలవత్ స భుజౌ ప్రసార్యైవ ననర్త వేగాత్ ।
తస్యైవ వేగేన సమాహతా తు చచాల భూర్భూమిధరైః సహైవ ॥46॥

ఆ మంకణకుడు పిల్లవానివలె చేతులు త్రిప్పుతూ, నేలమీద దొర్లుతూ, వేగంగా గంతులేస్తు ఉన్నాడు. ఆ వేగానికి భూమి భూధరాలతోసహా కంపించిపోతోంది.

తం శంకరోఽభ్యేత్య కరే నిగృహ్య ప్రోవాచ వాక్యం ప్రహసన్ మహర్షే ।
కిం భావితో నృత్యసి కేన హేతునా వదస్వ మామేత్య కిమత్ర తుష్టిః ॥47॥

శంకరుడు అతనిని సమీపించి, నవ్వుతూ ఓ మహర్షీ! ఎందుకిలా నృత్యం చేస్తున్నావు? నీ ఈ ఆనందానికి కారణమేమిటో నాకు చెప్పుమని పలుకుతూ, చేయి పట్టుకొని నిలదీశాడు.

స బ్రాహ్మణః ప్రాహ మమాద్య తుష్టిర్యేనేహ జాతా శృణు తద్ ద్విజేన్ద్ర ।
బహూన్ గణాన్ వై మమ తప్యతస్తపః సంవత్సరాన్ కాయవిశోషణార్థమ్ ॥48॥

తతోఽనుపశ్యామి కరాత్ క్షతోత్థం నిర్గచ్ఛతే శాకరసం మమేహ ।
తేనాద్య తుష్టోఽస్మి భృశం ద్విజేన్ద్ర యేనాస్మి నృత్యామి సుభావితాత్మా ॥49॥

అంతట బ్రాహ్మణుడైన మంకణుడు ఇలా పలికాడు. "ఓ ద్విజేన్ద్రా! నా ఆనందానికి కారణం విను, ఎన్నో సంవత్సరాలుగా కాయశుద్ధి కోసం నేను చేస్తున్న తపస్సు నేడు ఫలించింది. ఓ ద్విజేంద్రా! నా చేతికి గాయమైనచోట రక్తానికి బదులు శాకరసం (ఆకుకూర రసం) కారుతోంది. ఇంతకంటే ఆనందమేముంటుంది?. ఆ ఆనందంతోనే నేనిలా నృత్యం చేస్తున్నానని చెప్పాడు.

తం ప్రాహ శంభుర్ద్విజ పశ్య మహ్యం భస్మప్రవృత్తోఽఙ్గులితోఽతిశుక్లమ్ ।
సంతాడనాదేవ న చ ప్రహర్షో మమాస్తి నూనం హి భవాన్ ప్రమత్తః ॥50॥

అది విని శివుడు మంకణునితో ఓ ద్విజా! నా వంక చూడుము. నేను వ్రేలితో కొట్టినంతమాత్రం చేతనే స్వచ్ఛమైన భస్మం వస్తున్నది. అందులకు నేనేమీ శరీరం మరచి నృత్యం చేయడం లేదే! నిజంగా నీకు మత్తెక్కినట్లుందని పలికాడు.

శ్రుత్వాథ వాక్యం వృషభధ్వజస్య మత్వా మునిర్మంకణకో మహర్షే ।
నృత్యం పరిత్యజ్య సువిస్మితోఽథ వవన్ద పాదౌ వినయావనమ్రః ॥51॥

ఓ మహర్షీ! వృషభధ్వజుని మాటలు విని, మంకణుడు నృత్యాన్ని విడిచి, ఆశ్చర్యచకితుడై, వినయావనమ్రుడై, శివుని పాదాలకు నమస్కరించాడు.

తమాహ శంభుర్ద్విజ గచ్ఛ లోకం తం బ్రహ్మణో దుర్గమమవ్యయస్య ।
ఇదం చ తీర్థం ప్రవరం పృథివ్యాం పృథూదకస్యాస్తు సమం ఫలేన ॥52॥

సాంనిధ్యమత్రైవ సురాసురాణాం గంధర్వవిద్యాధరకిన్నరాణామ్ ।
సదాఽస్తు ధర్మస్య నిధానమగ్ర్యం సారస్వతం పాపమలాపహారి ॥53॥

అంతట శంభుడు మంకణునితో ఇలా పలికాడు. "ఓ ద్విజా! దుర్గమము, అవ్యయమునైన బ్రహ్మలోకానికి పొమ్ము!. ఈ ప్రదేశం కూడా పృథూదకంతో సమానమైన పుణ్యతీర్థంగా పరిఢవిల్లుతుంది. ఈ సారస్వతతీర్థంలో సురాసుర గంధర్వ విద్యాధర కిన్నరాదులు నిత్యం సన్నిహితులై యుంటారు. ఇది ధర్మానికి పట్టుకొమ్మగా ఉంటూ పాపపు మలాన్ని నశింపజేస్తుంది.

సుప్రభా కాంచనాక్షీ చ సువేణుర్విమలోదకా ।
మనోహరా చౌఘవతీ విశాలా చ సరస్వతీ ॥54॥

ఏతాః సప్త సరస్వత్యో నివసిష్యంతి నిత్యశః ।
సోమపానఫలం సర్వాః ప్రయచ్ఛన్తి సుపుణ్యదాః ॥55॥

సుప్రభ, కాంచనాక్షి, సువేణు, విమలోదకంతో కూడిన మనోహర, ఓఘవతి, విశాల, సరస్వతి, అనెడు సప్తసరస్వతులు ఇచ్చట నిత్యనివాసముంటాయి. ఈ సప్తసారస్వత తీర్థాన్ని సేవించిన వారికందరికి ఇచ్చటి సప్త సరస్వతులు సోమపానం చేయడంవలన కలిగే పుణ్యఫలాన్ని కలుగుజేస్తాయి.

భవానపి కురుక్షేత్రే మూర్తిం స్థాప్య గరీయసీమ్ ।
గమిష్యతి మహాపుణ్యం బ్రహ్మలోకం సుదుర్గమమ్ ॥56॥

నీవు కూడా ఈ కురుక్షేత్రంలో మహిమగల మూర్తిస్థాపనంచేసి, దుర్లభము, మహాపుణ్యనిలయము నైన బ్రహ్మలోకానికి వెళ్ళుమని మంకణుని పరమశివుడు ఆదేశించాడు.

ఇత్యేవముక్తో దేవేన శంకరేణ తపోధనః ।
మూర్తిం స్థాప్య కురుక్షేత్రే బ్రహ్మలోకమగాద్వశీ ॥57॥

శంకర భగవానుని ఆదేశం ప్రకారం తపోధనుడైన మంకణుడు కురుక్షేత్రంలో మూర్తిస్థాపన గావించి, బ్రహ్మలోకానికి వెళ్ళాడు.

గతే మంకణకే పృథ్వీ నిశ్చలా సమజాయత ।
అథాగాన్మందరం శంభుర్నిజమావసథం శుచిః ॥58॥

మంకణుడు వెళ్ళడంతో భూమి కంపించడం తగ్గి, నిశ్చలస్థితికి చేరుకుంది. అంతట శంభుడు కూడా నిజ నివాసము, పవిత్రము అయిన మందరగిరికి వెళ్ళాడు.

ఏతత్తవోక్తం ద్విజ శంకరస్తు గతస్తదాసీత్ తపసేఽథ శైలే ।
శూన్యేఽభ్యగాద్ దుష్టమతిర్హి దేవ్యా సంయోధితో యేన హి కారణేన ॥59॥

ఓ బ్రహ్మర్షీ! శంకరుడు మందరగిరిని వదలి, ఎందులకు తపస్సునకు వెళ్ళినాడో నీకు వివరించాను. ఆయన లేని సమయంలోనే దుర్బుద్ధియైన అంధకుడు వెళ్ళడం, అంబికతో యుద్ధం చేయడం జరిగింది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్య నారదసంవాదే భైరవప్రాదుర్భావే తప్తకృచ్ఛ్రవ్రతాచరణవిధిః హరిహరాత్మక విశ్వరూపదర్శనం నామ ద్విషష్టితమోఽధ్యాయః ॥62॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్య నారదసంవాదంలోని భైరవప్రాదుర్భావమందలి తప్తకృచ్ఛ్రవ్రతాచరణవిధానం హరిహరాత్మక విశ్వరూపదర్శనమనే అరవైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రిషష్టితమోఽధ్యాయః – అరవైమూడవ అధ్యాయం

భైరవప్రాదుర్భావే దండోపాఖ్యానమ్ – భైరవప్రాదుర్భావంలో దండోపాఖ్యానం

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

గతేఽన్ధకస్తు పాతాలే కిమచేష్టత దానవః ।
శంకరో మందరస్థోఽపి యచ్చకార తదుచ్యతామ్ ॥1॥

ఓ మహర్షీ! ఆ విధంగా పాతాలానికి వెళ్ళిన దానవుడైన అంధకుడు ఏమి చేశాడు? మందరపర్వతంపైనున్న శంకరుడు కూడా ఏమి చేశాడు?. తెలియజేయవలసినదిగా కోరుతున్నాను.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

పాతాలస్థోఽన్ధకో బ్రహ్మన్ బాధ్యతే మదనాగ్నినా ।
సంతప్తవిగ్రహః సర్వాన్ దానవానిదమబ్రవీత్ ॥2॥

నారదా! పాతాళానికి పారిపోయిన అంధకుడు మదనజ్వాలలలో తగలబడుతూ, భరించలేక దానవులతో ఇలా పలికాడు.

స మే సుహృత్స మే బంధుః స భ్రాతా స పితా మమ ।
యస్తామద్రిసుతాం శీఘ్రం మమాన్తికముపానయేత్ ॥3॥

అద్రిసుతయైన ఆమెను వేగంగా నా చెంతకు ఎవడు తీసుకొని వస్తాడో వాడే నాకు నిజమైన స్నేహితుడు, బంధువు, సోదరుడు, తండ్రి అని పలికాడు.

ఏవం బ్రువతి దైత్యేంద్రే అన్ధకే మదనాతురే ।
మేఘగంభీరనిర్ఘోషం ప్రహ్లాదో వాక్యమబ్రవీత్ ॥4॥

ఇలా పలికిన మదనాంధుడు, దైత్యేంద్రుడునైన అంధకునితో ప్రహ్లాదుడు మేఘగంభీరస్వరంతో ఇలా పలికాడు.

యేయం గిరిసుతా వీర సా మాతా ధర్మతస్తవ ।
పితా త్రినయనో దేవః శ్రూయతామత్రకారణమ్ ॥5॥

వత్సా! వీరా! ఈ గిరిసుత ఎవరనుకున్నావు? ధర్మంగా ఆమె నీకు తల్లి అవుతుంది. తండ్రి త్రినేత్రుడు. దీనికి కారణం విను.

తవ పిత్రా హ్యపుత్రేణ ధర్మనిత్యేన దానవ ।
ఆరాధితో మహాదేవః పుత్రార్థాయ పురా కిల ॥6॥

ఓ దానవా! ధర్మనిరతుడైన నీ తండ్రి అపుత్రకుడైనందున పుత్రార్థియై పూర్వం మహాదేవుని ఆరాధించాడు.

తస్మై త్రిలోచనేనాసీద్ దత్తోఽన్ధోఽప్యేవ దానవ ।
పుత్రకః పుత్రకామస్య ప్రోక్త్వేత్థం వచనం విభో ॥7॥

అతనికి అంధుడైన బిడ్డనిస్తూ శంకరుడు నీ తండ్రితో ఇలా పలికాడు.

నేత్రత్రయం హిరణ్యాక్ష నర్మార్థముమయా మమ ।
పిహితం యోగసంస్థస్య తతోఽన్ధమభవత్తమః ॥8॥

తస్మాచ్చ తమసో జాతో భూతో నీలఘనస్వనః ।
తదిదం గృహ్యతాం దైత్య తవౌపయికమాత్మజమ్ ॥9॥

యదా తు లోకవిద్విష్టం దుష్టం కర్మ కరిష్యతి ।
త్రైలోక్యజననీం చాపి అభివాంఛిష్యతేఽధమః ॥10॥

ఘాతయిష్యతి వా విప్రం యదా ప్రక్షిప్య చాసురాన్ ।
తదాస్య స్వయమేవాహం కరిష్యే కాయశోధనమ్ ॥11॥

ఏవముక్త్వా గతః శంభుః స్వస్థానం మందరాచలమ్ ।
త్వత్పితాఽపి సమభ్యాగాత్ త్వామాదాయ రసాతలమ్ ॥12॥

"హిరణ్యాక్షా! ఒకమారు వినోదార్థం పార్వతి నా మూడు నేత్రాలు మూసింది. దానితో యోగంలోనున్న నా ఎదుట అంధకారం ఆవరించింది. ఆ చీకటిలోనుండి నీలమేఘంలాంటి గొంతుతో ఒక భూతం ఆవిర్భవించింది. అటువంటి ఈ అంధకుని నీకు తగిన పుత్రునిగా ఇస్తున్నాను. తీసుకొనిపొమ్ము.వీడు అధర్మానికి పాల్పడి దుష్టుడై, ఎప్పుడు లోకులకు బాధలు కలిగిస్తాడో, ఎప్పుడు ముల్లోక జననియైన పార్వతీదేవిని వాంఛిస్తాడో, ఎప్పుడు తన రాక్షసులను పంపి విప్రులను సంహరిస్తాడో అప్పుడు నేనే స్వయంగా వీనికి దేహశుద్ధి చేస్తాను" ఇలా పలికి శంకరుడు తన మందరాచలానికి తిరిగి వెళ్ళాడు. నీ తండ్రి నిన్ను తీసుకొని రసాతలానికి వచ్చాడు.

ఏతేన కారణేనాంబా శైలేయీ భవితా తవ ।
సర్వస్యాపీహ జగతో గురుః శంభుః పితా ధ్రువమ్ ॥13॥

ఈ కారణంచేత శైలపుత్రి నీకు తల్లి అవుతుంది. సర్వలోక గురుడైన శివుడు నీకు సాక్షాత్తు తండ్రి అవుతాడు. ఇది నిశ్చయం.

భవానపి తపోయుక్తః శాస్త్రవేత్తా గుణాప్లుతః ।
నేదృశే పాపసంకల్పే మతిం కుర్యాద్ భవద్విధః ॥14॥

నీవు కూడా తపస్సంపన్నుడవు. శాస్త్రవేత్తవు. గుణవంతుడవు. నీవంటివాడు ఇటువంటి పాపసంకల్పాలను మనసులోనికి రానీయరాదు.

త్రైలోక్యప్రభురవ్యక్తో భవః సర్వైర్నమస్కృతః ।
అజేయస్తస్య భార్యేయం న త్వమర్హో౽మరార్దన ॥15॥

ఓ అమరమర్దనా! భవుడు త్రైలోక్యప్రభువు. అవ్యక్తుడు. సర్వులూ నమస్కరించేవాడు, అజేయుడు. అతని భార్యయైన శైలపుత్రిని కోరడం నీకు తగదు.

న చాపి శక్తః ప్రాప్తుం తాం భవాన్ శైలనృపాత్మజామ్ ।
అజిత్వా సగణం రుద్రం స చ కామో౽ద్య దుర్లభః ॥16॥

అంతేగాక నీవు శైలరాజపుత్రికను పొందడానికి అశక్తుడవు. ఎందులకనగా గణాలతో కూడిన రుద్రుని జయింపక ఈ నీ కోరిక ఈనాడు పొందడం దుర్లభం.

యస్తరేత్ సాగరం దోర్భ్యాం పాతయేద్భువి భాస్కరమ్ ।
మేరుముత్పాటయేద్వాపి న జయేచ్ఛూలపాణినమ్ ॥17॥

సముద్రాన్ని చేతులతో ఈది దాటగలవాడు, సూర్యుని నేలమీద పడవేయగలవాడు, మేరుపర్వతాన్ని పెకలింపగలిగినవాడు కూడా శూలపాణిని జయించలేడు.

ఉతాహోస్విదిమాః శక్యాః క్రియాః కర్తుం నరైర్బలాత్ ।
న చ శక్యో హరో జేతుం సత్యం సత్యం మయోదితమ్ ॥18॥

ఒకవేళ ఇటువంటి శక్తులున్నవారందరు ఏకమైనప్పటికి హరుని జయిండం సాధ్యం కాదు. నా మాట ముమ్మాటికి నిజం.

కిం త్వయా న శ్రుతం దైత్య యథా దండో మహీపతిః ।
పరస్త్రీకామవాన్ మూఢః స రాష్ట్రో నాశమాప్తవాన్ ॥19॥

ఓ దానవా! దండుడనే రాజు పరస్త్రీవాంఛతో మూఢుడై, రాజ్యంతో సహా నశించిపోయిన విషయం నీవు వినలేదా?

ఆసీద్దండో నామ నృపః ప్రభూతబలవాహనః ।
స చ వవ్రే మహాతేజాః పౌరోహిత్యాయ భార్గవమ్ ॥20॥

ఒకప్పుడు దండుడనే మహాబలశాలియైన మహారాజు ఉండేవాడు. అతడు మహాతేజస్వియైన శుక్రాచార్యుని పురోహితునిగా నియమించుకున్నాడు.

ఈజే చ వివిధైర్యజ్ఞైః నృపతిః శుక్రపాలితః ।
శుక్రస్యాసీచ్చ దుహితా అరజా నామ నామతః ॥21॥

శుక్రః కదాచిదగమద్ వృషపర్వాణమాసురమ్ ।
తేనార్చితశ్చిరం తత్ర తస్థౌ భార్గవసత్తమః ॥22॥

ఒకానొకప్పుడు శుక్రుడు రాక్షసరాజైన వృషపర్వుని చెంతకు వెళ్ళి, అతనిచేత సేవింపబడుతూ చిరకాలం అక్కడే ఉండిపోయాడు.

అరజా స్వగృహే వహ్నిం శుశ్రూషన్తీ మహాసుర ।
అతిష్ఠత సుచార్వఙ్గీ తతోఽభ్యగాన్నరాధిపః ॥23॥

మహాసురా! అరజ తన ఆశ్రమంలో అగ్నిహోత్రాలను సేవించుకుంటూ ఉండేది. అంతట ఒకనాడు మహారాజైన దండుడు ఆశ్రమానికి వచ్చాడు.

స పప్రచ్ఛ క్వ శుక్రేతి తమూచుః పరిచారికాః ।
గతః స భగవాన్ శుక్రో యాజనాయ దనోస్సుతమ్ ॥24॥

అతడు "శుక్రుడెక్కడ?" అని అడుగగా పరిచారికలు అతనికి "శుక్రాచార్యులు దనువు కుమారుడైన వృషపర్వుడు చేసే యజ్ఞానికి వెళ్ళార" ని చెప్పారు.

పప్రచ్ఛ నృపతిః కా తు తిష్ఠతే భార్గవాశ్రమే ।
తాస్తమూచుః గురోః పుత్రీ సంతిష్ఠత్యరజా నృప ॥25॥

రాజు భార్గవాశ్రమంలో ఎవరుంటున్నారని అడుగగా పరిచారికలు ఓ రాజా! గురుపుత్రికయైన అరజ ఆశ్రమంలో ఉంటున్నదని సమాధానం చెప్పారు.

తామాశ్రమే శుక్రసుతాం ద్రష్టుమిక్ష్వాకునందనః ।
ప్రవివేశ మహాబాహుర్దదర్శారజసం తతః ॥26॥

ఇక్ష్వాకునందనుడైన దండుడు శుక్రసుతయైన అరజను చూడడానికి ఆశ్రమంలో ప్రవేశించాడు. అంతట మహాబలశాలియైన ఆ రాజు అక్కడ అరజను చూశాడు.

తాం దృష్ట్వా కామసన్తప్తస్తత్క్షణాదేవ పార్థివః ।
సంజాతోఽన్ధక దండస్తు కృతాన్తబలచోదితః ॥27॥

అంధకా! కాలునిచే ప్రేరేపింపబడిన దండుడు ఆమెను చూచిన క్షణంలోనే కామసంతప్తుడయ్యాడు.

తతో విసర్జయామాస భృత్యాన్ భ్రాతౄన్ సుహృత్తమాన్ ।
శుక్రశిష్యానపి బలీ ఏకాకీ నృప అవ్రజత్ ॥28॥

దానితో రాజు తన భృత్యులను, సోదరులను, స్నేహితులను విసర్జించాడు. అంతేగాక శుక్రాచార్యుని శిష్యులను కూడా బయటకు పంపి, బలవంతుడైన తానొక్కడే అరజ ఉన్నచోటుకి వెళ్ళాడు.

తమాగతం శుక్రసుతా ప్రత్యుత్థాయ యశస్వినీ ।
పూజయామాస సంహృష్టా భ్రాతృభావేన దానవ ॥29॥

శుక్రసుతయైన ఆమె ఆవిధంగా వచ్చిన రాజునుచూచి, సంతోషంతో లేచి, సోదరభావంతో అతనికి పూజ చేసింది.

తతస్తామాహ నృపతిర్బాలే కామాగ్నితాపితమ్ ।
మాం సమాహ్లాదయస్వాద్య స్వపరిష్వఙ్గవారిణా ॥30॥

అంతట ఆ రాజు ఆమెతో ఓ బాలా! నన్ను కామాగ్ని దహిస్తోంది. నీ కౌగిలి అనే చల్లని నీటిని జల్లి నేడు నన్ను ఆనందపరచుమని పలికాడు.

సాఽపి ప్రాహ సువినీతా తమాసురమ్ ।
పితా మమ మహాక్రోధాత్ త్రిదశానపి నిర్దహేత్ ॥31॥

అంతట ఆమె రాజుతో "ఓ రాజశ్రేష్ఠా! నీవు తొందరపడి ఆత్మనాశనం చేసుకోవద్దు. నా తండ్రి మహాకోపంతో దేవతలనుకూడా దహించగలడు.

మూఢబుద్ధే భవాన్ భ్రాతా మమాపి స్వయమాగతః ।
భగినీ ధర్మతస్తేఽహం భవాన్ శిష్యః పితుర్మమ ॥32॥

మూఢబుద్ధి గలవాడా! నీవు నాతండ్రికి శిష్యుడవు. అందుచేత నీవు నాకు ధర్మప్రకారం సోదరుడవయ్యావు. స్వయముగా వచ్చిన నీవు నాకు సోదరుడవు. నేను నీకు సోదరిని" అని పలికింది.

సోఽబ్రవీద్ భీరు మాం శుక్రః కాలేన పరిధక్ష్యతి ।
కామాగ్నిర్నిర్దహతి మామద్యైవ తనుమధ్యమే ॥33॥

అంతట దండుడిలా పలికాడు. "ఓ భీరురాలా! శుక్రుడు భవిష్యత్తులో ఏదోసమయంలో నన్ను దహిస్తాడు. కాని కృశోదరీ! కామాగ్ని ఇప్పుడే నన్ను దహించివేస్తోంది" అన్నాడు అరజతో.

సా ప్రాహ దండం నృపతిం ముహూర్తం పరిపాలయ ।
తమేవ యాచస్వ గురుం స తే దాస్యత్యసంశయమ్ ॥34॥

దండమహారాజుతో ఆమె ఇలా పలికింది. "రాజా! ఒక్కక్షణం ప్రతీక్షించు. నీవు గురువును యాచించు. అతడు నన్ను నీకు నిస్సందేహంగా కన్యాదానం చేస్తాడు". అని.

దండోఽబ్రవీత్ సుతన్వంగి కాలక్షేపో న మే క్షమః ।
చ్యుతావసరకర్తృత్వే విఘ్నో జాయేత సుందరి ॥35॥

దండుడిలా పలికాడు. "ఓ సుందరీ! సమయం కొరకు నేను వేచిచూడజాలను. చేజిక్కిన అవకాశాన్ని వదులుకుంటే తరువాత విఘ్నాలు కలుగవచ్చు. కావున ఇప్పుడు నిన్ను నేను వదలను". అని

తతోఽబ్రవీచ్చ విరజా నాహం త్వాం పార్థివాత్మజ ।
దాతుం శక్తా స్వమాత్మానం స్వతంత్రా న హి యోషితః ॥36॥

అంతట అరజ రాజుతో ఓ రాజపుత్రా! స్త్రీలు స్వతంత్రులు కారు. కావున నన్ను నేను నీకు ఆత్మసమర్పణం చేసుకొనజాలనని పలికింది.

కిం వా తే బహునోక్తేన మా త్వం నాశం నరాధిప ।
గచ్ఛస్వ శుక్రశాపేన సభృత్యజ్ఞాతిబాన్ధవాః ॥37॥

"ఓ నరాధిపా! పెక్కు మాటలేల? శుక్రుని శాపానలంలో భృత్యజ్ఞాతిబాన్ధవులతోసహా నాశనం కావద్దు!. వెళ్ళిపో!". అనికూడా పలికింది.

తతోఽబ్రవీన్నరపతిః సుతను శృణు చేష్టితమ్ ।
చిత్రాఙ్గదాయా యద్వృత్తం పురా దేవయుగే శుభే ॥38॥

దానితో ఆ రాజు ఆమెతో "సుందరాంగీ! పూర్వం శుభకరమైన దేవయాగంలో చిత్రాంగద చేసిన పని చెబుతాను" వినుమని పలికాడు.

విశ్వకర్మసుతా సాధ్వీ నామ్నా చిత్రాంగదాఽభవత్ ।
రూపయౌవనసంపన్నా పద్మహీనేవ పద్మినీ ॥39॥

విశ్వకర్మకు చిత్రాంగద యను పేరుగల సాధ్వియైన కుమార్తె గలదు. ఆమె రూపయౌవన సంపన్నురాలు. పద్మినీజాతికి చెందిన స్త్రీ.

సా కదాచిన్మహారణ్యం సఖీభిః పరివారితా ।
జగామ నైమిశం నామ స్నాతుం కమలలోచనా ॥40॥

ఆమె ఒకానొకప్పుడు సఖులతోకూడి మహారణ్యంలోని నైమిశానికి స్నానార్థమై వెళ్ళింది.

సా స్నాతుమవతీర్ణా చ అథాభ్యాగాన్నరేశ్వరః ।
సుదేవతనయో ధీమాన్ సురథో నామ నామతః ।
తాం దదర్శ చ తన్వఙ్గీం శుభాఙ్గో మదనాతురః ॥41॥

ఆమె స్నానం చేయడానికి నీటిలోనికి దిగగానే అచ్చటకు సుదేవుని కుమారుడు, ధీమంతుడు, సురథుడను పేరుగల మహారాజు వచ్చాడు. అతడు సుందరాంగియైన ఆ చిత్రాంగదను చూసి మదనాతురుడయ్యాడు.

తం దృష్ట్వా సా సఖీ ఆహ వచనం సత్యసంయుతమ్ ।
అసౌ నరాధిపసుతో మదనేన కదర్థ్యతే ॥42॥

ఆ రాజునుచూచి ఆ సుందరి తన సఖులతో ఈ రాజకుమారుడు నన్ను మోహించి కామాగ్నిలో వేగుతున్నాడని ఉన్న వాస్తవం చెప్పింది.

మదర్థే చ క్షమం మేఽస్య స్వప్రదానం సురూపిణః ।
సఖ్యస్తామబ్రువన్ బాలా న ప్రగల్భాఽసి సున్దరి! ॥43॥

అస్వాతంత్ర్యం తవాస్తీహ ప్రదానే స్వాత్మనోఽనఘే ।
పితా తవాస్తి ధర్మిష్ఠః సర్వశిల్పవిశారదః ॥44॥

న తే యుక్తమిహాత్మానం దాతుం నరపతేః స్వయమ్ ।

అందువలన ఈ సౌందర్యశాలికి నన్ను నేను ప్రదానం చేసుకోవడమే తగినదని సఖులతో పలికింది. ఆమె పలుకులు వినిన సఖులు "ఓ సుందరీ! నీవింత సాహసం చేయవద్దు. నిన్ను నీవు సమర్పించుకోవడానికి నీకు స్వతంత్రత లేదు. సకలధర్మపరుడు, శిల్పశాస్త్ర పారంగతుడునైన నీ తండ్రి యుండగా నిన్ను నీవు స్వయంగా ఈ మహారాజునకు ఆత్మదానం చేసుకోవడం తగ"దని చిత్రాంగదను వారించారు.

ఏతస్మిన్నన్తరే రాజా సురథః సత్యవాక్ సుధీః ॥45॥

సమభ్యేత్యాఽబ్రవీదేనాం కందర్పశరపీడితః ।
త్వం ముగ్ధే మోహయసి మాం దృష్ట్వైవ మదిరేక్షణే ॥46॥

త్వద్దృష్టిశరపాతేన స్మరేణాభ్యేత్య తాడితః ।
తన్మాం కుచతలే తల్పే అభిశాయితుమర్హసి ॥47॥

నోచేత్ ప్రధక్ష్యతే కామో భూయో భూయోఽతిదర్శనాత్ ।

ఇంతలో బుద్ధిమంతుడు, సత్యవాక్కునైన సురథుడు మన్మథబాణాలచే పీడింపబడినవాడై అచ్చటకు సమీపించి, ఆమెతో ఇలా పలికాడు."మదిరేక్షణా! నీ చూపులతోనే నీవు నన్ను మోహింపజేశావు. నీ చూపులనే బాణాలతోబాటు మన్మథుని బాణాలు కూడా నన్ను ప్రహరిస్తున్నాయి. కావున నీ కుచాలనే మెత్తటి శయ్యమీద నన్ను పరుండ బెట్టుకో!. లేనిచో నీ చూపులతో కాముడు నన్ను మరలా మరలా ప్రహరిస్తూనే యుంటాడు".

తతః సా చారుసర్వాఙ్గీ రాజ్ఞీ రాజీవలోచనా ॥48॥

వార్యమాణా సఖీభిస్తు ప్రాదాదాత్మానమాత్మనా ।
ఏవం పురా తయా తన్వ్యా పరిత్రాతః స భూపతిః ॥49॥

అంతట సర్వాంగసుందరియు, రాజీవలోచనయునైన ఆ రాణి తనసఖులు వారిస్తున్నా వినక ఆ మహారాజునకు తనను తాను సమర్పించుకున్నది. ఆ విధంగా పూర్వకాలంలో ఆ కోమలి ఆ రాజు ప్రాణాలు కాపాడింది.

తస్మాన్మామపి సుశ్రోణి త్వం పరిత్రాతుమర్హసి ।
అరజస్కాఽబ్రవీద్ దణ్డం తస్యా యద్వృత్తముత్తరమ్ ॥50॥

కిం త్వయా న పరిజ్ఞాతం తస్మాత్ తే కథయామ్యహమ్ ।
తదా తయా తు తన్వ్యంగ్యా సురథస్య మహీపతేః ॥51॥

ఆత్మా ప్రదత్తః స్వాతంత్ర్యాత్ తతస్తామశపత్ పితా ।
యస్మాద్ ధర్మం పరిత్యజ్య స్త్రీభావాన్మందచేతసే ॥52॥

ఆత్మా ప్రదత్తస్తస్మాద్ధి న వివాహో భవిష్యతి ।
వివాహరహితా నైవ సుఖం లప్స్యసి భర్తృతః ॥53॥

న చ పుత్రఫలం నైవ పతినా యోగమేష్యసి ।

ఓ సుశ్రోణీ! ఆ విధంగా నీవు కూడా ఆమె వలె నన్ను రక్షింపుమని దండుడు అరజతో పలుకుతూ ఉండగా అరజ అతని మాటలను అందుకుని "ఓ రాజా! తదనంతరం ఏమి జరిగిందో నీవు వినలేదా! ఈ విషయం నేను చెబుతాను విను". ఆ విధంగా తన కుమార్తె స్వతంత్రించి సురథునకు ఆత్మ సమర్పణం చేసుకోవడం వినగానే ఆమె తండ్రి ఇలా శపించాడు. "ఓసీ! మతిలేనిదానా! ధర్మం వదలి స్త్రీ దౌర్బల్యానికి లోనై ఒకనికి ఆత్మసమర్పణం చేసుకున్నావు. కావున నీకు భవిష్యత్తులో వివాహం జరుగదు. కాబట్టి భర్తప్రేమ, పురుషసౌఖ్యం నీకు లభింపవు. నీకు పుత్రులు కూడా జన్మింపరు" అని చిత్రాంగదను తండ్రి శపించాడు.

ఉత్సృష్టమాత్రే శాపే తు హ్యపోవాహ సరస్వతీ ॥54॥

అకృతార్థం నరపతిం యోజనాని త్రయోదశ ।
అపకృష్టే నరపతౌ సాఽపి మోహముపాగతా ॥55॥

ఆ శాపవచనాలు వినబడినంతనే కృతకృత్యుడు కాని సురథుని సరస్వతీనది తన ప్రవాహంలో 13 యోజనాల దూరం తీసికొనిపోయి విడిచింది. రాజు కనబడకపోవడంతో ఆమె కూడా మూర్ఛితురాలయ్యింది.

తతస్తాం సిషిచుః సఖ్యః సరస్వత్యా జలేన హి ।
సా సిచ్యమానా సుతరాం శిశిరేణాప్యథాంభసా ॥56॥

మృతకల్పా మహాబాహో విశ్వకర్మసుతాఽభవత్ ।
తాం మృతామితి విజ్ఞాయ జగ్ముః సఖ్యస్త్వరాన్వితాః ॥57॥

కాష్ఠాన్యాహర్తుమపరా వహ్నిమానేతుమాకులాః ।
సా చ తాస్వపి సర్వాసు గతాసు వనముత్తమమ్ ॥58॥

అంతట సఖులు సరస్వతీ శీతలోదకాలు ఆమె మీద చల్లి, సేదతీర్చడానికి చాలాసేపు ప్రయత్నించారు. అయినప్పటికి విశ్వకర్మ కుమార్తెయైన చిత్రాంగద చచ్చినదానివలె పడియున్నది. దానితో ఆమె నిజంగానే మరణించినదని భావించి, దహనం చేయడానికి ఒకరు కట్టెలు తేవడానికి, మరియొకరు అగ్నిని తీసుకురావడానికి ఈ విధంగా ఆమె చెలికత్తెలందరు వ్యాకులచిత్తంతో త్వరత్వరగా సమీపంలోని అరణ్యంలోనికి వెళ్లిపోయారు.

సంజ్ఞాం లేభే సుచార్వంగీ దిశశ్చేత్సవలోక్య చ ।
అపశ్యన్తీ నరపతిం తథా స్నిగ్ధం సఖీజనమ్ ॥59॥

నిపపాత సరస్వత్యాః పయసి స్ఫురితేక్షణా ।
తాం వేగాత్ కాంచనాక్షీ తు మహానద్యాం నరేశ్వర ॥60॥

గోమత్యాం పరిచిక్షేప తరంగకుటిలే జలే ।
తయాఽపి తస్యాస్తద్భావం విదిత్వాఽథ విశాంపతే ॥61॥

మహావనే పరిక్షిప్తా సింహవ్యాఘ్ర భయాకులే ।
ఏవం తస్యాః స్వతంత్రాయా ఏషాఽవస్థా శ్రుతా మయా ।
తస్మాన్న దాస్యామ్యాత్మానం రక్షన్తీ శీలముత్తమమ్ ॥62॥

అంతట మూర్ఛనుండి తేరుకునిన చిత్రాంగద నలుదిక్కులకు చూచి, మహారాజునుగాని, స్నేహితురాండ్రను గాని కానక దుఃఖంతో సరస్వతీనదిలో పడిపోయింది. ఓ మహారాజా! ఆ కాంచనాక్షియైన సరస్వతీనది ఆ అభాగ్యురాలిని మహావేగంతో తీసికొనిపోయి అలల సుడులతో నిండిన గోమతీనదిలోనికి నెట్టివేసింది. గోమతీనది కూడా ఆమె దుస్థితిని తెలిసికొని సింహవ్యాఘ్రాలతో నిండిన భయంకరమైన ఒక మహారణ్యంలోనికి ఆమెను నెట్టివేసింది. ఈవిధంగా ధర్మాన్ని విడిచి స్వతంత్రించిన చిత్రాంగద ఇటువంటి దురవస్థకు గురియైనదని నేను విన్నాను. కాబట్టి నేను స్వతంత్రించి ప్రాణపదంగా కాపాడుకుంటున్న నా శీలాన్ని నాకు నేనుగా నీకు అర్పించజాలను. అని అరజ దండునితో పలికింది.

తస్యా తద్వచనం శ్రుత్వా దండః శక్రసమో బలీ ।
విహస్య త్వరజాం ప్రాహ స్వార్థమఙ్గక్షయఙ్కరమ్ ॥63॥

ఇంద్రసమానమైన బలంగల దండమహారాజు అఙ్గక్షయం కలుగజేసే ఆమె సమాధానం విని, స్వార్థంతో నవ్వుతూ అరజతో ఇలా పలికాడు.

దండ ఉవాచ – దండుడు పలికాడు.

తస్యా యదుత్తరం వృత్తం తత్పితుశ్చ కృశోదరీ ।
సురథస్య తథా రాజ్ఞస్తచ్ఛ్రోతుం మతిమాదధ ॥64॥

ఓ కృశోదరీ! తదనంతరం ఆమె తండ్రికి పట్టినగతి, సురథమహారాజు వృత్తాన్తం కూడా చెబుతాను, మనసు పెట్టి విను.

యదావకృష్టే నృపతౌ పతితా సా మహావనే ।
తదా గగన సంచారీ దృష్టవాన్ గుహ్యకోఽఞ్జనః ॥65॥

ఆ విధంగా ఆ మహారణ్యంలో పడిపోయిన ఆ సుందరాంగిని ఆకాశమార్గంలో ప్రయాణిస్తున్న అంజనుడు అనే యక్షుడు చూశాడు.

తతః సోఽభ్యేత్య తాం బాలాం పరిసాన్త్వ్య ప్రయత్నతః ।
ప్రాహ మా గచ్ఛ సుభగే విషాదం సురథం ప్రతి ॥66॥

ధ్రువమేష్యసి తేన త్వం సంయోగమసితేక్షణే ।
తస్మాద్గచ్ఛస్వ శీఘ్రం త్వం ద్రష్టుం శ్రీకంఠమీశ్వరమ్ ॥67॥

అంతట ఆ యక్షుడు ఆమెను సమీపించి, ఆ బాలికను ప్రయత్నపూర్వకంగా సాంత్వనపరచి, ఆమెతో ఇలా పలికాడు."నీవు ఇప్పుడు సురథుని గూర్చి విచారించకు. తప్పకుండా మీరిరువురకు సమాగమం కలుగుతుంది. కాని నీవు వెంటనే శ్రీకంఠేశ్వరుని దర్శనానికి వెళ్ళు".

ఇత్యేవముక్తా సా తేన గుహ్యకేన సులోచనా ।
శ్రీకంఠమాగతా తూర్ణం కాలింద్యా దక్షిణే తటే ॥68॥

దృష్ట్వా మహేశం శ్రీకంఠం స్నాత్వా రవిసుతాజలే ।
అతిష్ఠత శిరోనమ్రా యావన్మధ్యస్థితో రవిః ॥69॥

యక్షుడు ఇలా చెప్పగా సులోచనయైన ఆమె వేగంగా కాళిందీనదికి దక్షిణతీరంలోనున్న శ్రీకంఠుని తీర్థానికి వచ్చి యమునానదిలో స్నానమాచరించి, శ్రీకంఠేశ్వరుని దర్శించి, తలవంచుకుని సూర్యుడు నడిమింటికి వచ్చేవరకు అక్కడనే కూర్చున్నది.

అథాజగామ దేవస్య స్నానం కర్తుం తపోధనః ।
శుభః పాశుపతాచార్య సామవేదీ ఋతధ్వజః ॥70॥

అంతట అక్కడకు మహాతపస్వి, సామవేది, పాశుపతాచార్యుడునైన ఋతధ్వజుడు శ్రీకంఠుని దర్శించి, స్నానమాచరించడానికి వచ్చాడు.

దదర్శ తత్ర తన్వఙ్గీం మునిశ్చిత్రాఙ్గదాం శుభామ్ ।
రతీమివ స్థితాం పుణ్యామనఙ్గపరివర్జితామ్ ॥71॥

తాం దృష్ట్వా స మునిర్ధ్యానమగమత్ కేయమిత్యుత ।
అథ సా తమృషిం వంద్య కృతాంజలిరుపస్థితా ॥72॥

మన్మథుని విడిచిన రతీదేవివలె దీనయైయున్న ఆ సుందరిని (చిత్రాంగదను)చూచి, ఈమె ఎవతెయో గదా! యని కొంతసేపు ధ్యానమగ్నుడయ్యాడు. అంతట ఆమె ఆ మునికి నమస్కరించి, చేతులు జోడించి, అతని సమీపంలో నిలబడింది.

తాం ప్రాహ పుత్రికస్యాసి సుతా సురసుతోపమా ।
కిమర్థమాగతాసీహ నిర్మనుష్యమృగే వనే ॥73॥

అప్పుడు ఆ ముని "పుత్రీ! దేవాంగనవలెనున్న నీవు ఎవతెవు? ఈ నిర్జనారణ్యంలోనికి ఎందులకు వచ్చావు?" అని చిత్రాంగదను అడిగాడు.

తతః సా ప్రాహ తమృషిం యాథాతథ్యం కృశోదరీ ।
శ్రుత్వర్షిః కోపమగమదశపచ్ఛిల్పినాం వరమ్ ॥74॥

అంతట ఆమె జరిగిన వృత్తాంతమంతటిని యథాతథంగా ఆ మునికి వివరించింది. ఆమె కథను అంతను వినిన ఆ ముని మహాకోపంతో దేవశిల్పిని ఇలా శపించాడు.

యస్మాత్ స్వతనుజాతేయం పరదేయాఽపి పాపినా ।
యోజితా నైవ పతినా తస్మాచ్ఛాఖామృగోఽస్తు సః ॥75॥

ఇత్యుక్త్వా స మహాయోగీ భూయః స్నాత్వా విధానతః ।
ఉపాస్య పశ్చిమాం సంధ్యాం పూజయామాస శంకరమ్ ॥76॥

"తగిన వరునకీయవలసిన తన కుమార్తెను ఆ విధంగా ఇవ్వకపోవడమేగాక పతితో సమాగమం కలుగకుండా చేసిన పాపాత్ముడు కావున దేవశిల్పి శాఖామృగ(వానర) మౌగాక!" అని ఋతధ్వజుడు శాపాక్షరాలు పలికి మరల విధివిధానంగా యమునానదిలో స్నానమాచరించి, సాయంసంధ్యోపాసన గావించి, శ్రీకంఠుని పూజించాడు.

సంపూజ్య దేవదేవేశం యథోక్తవిధినా హరమ్ ।
ఉవాచాగమ్య తాం సుభ్రూం సుదతీం పతిలాలసామ్ ॥77॥

దేవదేవేశుడైన పరమేశ్వరుని యథావిధిగా పూజించిన ఆ మహర్షి భర్తకొరకు తపించే సుందరాంగియైన చిత్రాంగదతో ఇలా పలికాడు.

గచ్ఛస్వ సుభగే దేశం సప్తగోదావరం శుభమ్ ।
తత్రోపాస్య మహేశానం మహాన్తం హాటకేశ్వరమ్ ॥78॥

ఓ సుందరీ! నీవు వెంటనే శుభప్రదమైన సప్తగోదావరీక్షేత్రానికి వెళ్ళు. అచ్చట కొలువైన మహానుభావుడైన హాటకేశ్వరస్వామిని ఉపాసించు.

తత్ర స్థితా యా రంభోరు ఖ్యాతా దేవవతీ శుభా ।
ఆగమిష్యతి దైత్యస్య పుత్రీ కన్దరమాలినః ॥79॥

ఓ రంభోరు! నీవక్కడ ఉండగా కందరమాలియను పేరుగల దైత్యుని పుత్రిక దేవవతి అచ్చటకు వస్తుంది.

తథాఽన్యా గుహ్యకసుతా నన్దయన్తీతి విశ్రుతా ।
అంజనస్యైవ తత్రాపి సమేష్యతి తపస్వినీ ॥80॥

అట్లే అంజనుడను యక్షుని కుమార్తె నందయన్తీ అను పేరుగల తపస్విని కూడా అక్కడకు వస్తుంది.

తథాఽపరా వేదవతీ పర్జన్యదుహితా శుభా ।
యదా తిస్రః సమేష్యన్తి సప్తగోదావరే జలే ॥81॥

హాటకాఖ్యే మహాదేవే తదా సంయోగమేష్యసి ।
ఇత్యేవముక్త్వా మునినా బాలా చిత్రాఙ్గదా తదా ॥82॥

సప్తగోదావరం తీర్థమగమత్ త్వరితా తతః ॥83॥

అట్లే శుభాంగియైనదియు, పర్జన్యుని కుమార్తెయునగు వేదవతి యను మరియొక యువతికూడా అక్కడకు వస్తుంది. ఆ విధంగా మీరు ముప్పురు హాటకేశ్వరుని పాదాల చెంతనున్న సప్తగోదావరీ జలాలలో కలిసినప్పుడు నీవు నీ భర్తను కలుసుకోగలవు అని పలికిన ముని మాటలు వినినంతనే మిక్కిలి త్వరగా చిత్రాంగద సప్తగోదావరీ తీర్థానికి వెళ్ళింది.

సంప్రాప్య తత్ర దేవేశం పూజయన్తీ త్రిలోచనమ్ ।
సమధ్యాస్తే శుచిపరా ఫలమూలాశనాఽభవత్ ॥84॥

అక్కడకు చేరిన చిత్రాంగద శుచిగా, భక్తిశ్రద్ధలతో, కందమూల ఫలాలు తింటూ, త్రిలోచనుడైన హాటకేశ్వరుని పూజింపసాగింది.

స చర్షిః జ్ఞానసంపన్నః శ్రీకంఠాయతనేఽలిఖత్ ।
శ్లోకమేకం మహాఖ్యానం తస్యాశ్చ ప్రియకామ్యయా ॥85॥

జ్ఞానసంపన్నుడైన ఆ మహర్షి శ్రీకంఠేశ్వరాలయం మీద చిత్రాంగదకు హితం చేసే సంకల్పంతో మహాఖ్యాన గర్భితమైన ఒక శ్లోకాన్ని ఇలా వ్రాశాడు.

న సోఽస్తి కశ్చిత్ త్రిదశోఽసురో వా యక్షోఽథ మర్త్యో రజనీచరో వా ।
ఇదం హి దుఃఖం మృగశాబనేత్ర్యా నిర్మార్జయేద్ యః స్వపరాక్రమేణ ॥86॥

ఇత్యేవముక్త్వా స మునిర్జగామ ద్రష్టుం విభుం పుష్కరనాథమీడ్యమ్ ।
నదీం పయోష్ణీం మునివృందవంద్యాం సంచింతయన్నేవ విశాలనేత్రామ్ ॥87॥

"ఈ మృగశాబలోచన, దుఃఖాన్వితయునగు ఈమె దుఃఖాన్ని పరాక్రమంతో పోగొట్టగలిగిన త్రిదశుడు గాని, అసురుడుగాని, యక్షుడుగాని, మానవుడుగాని, రాక్షసుడుగాని లేడు". ఈ విధంగా విశ్వకర్మ పుత్రికతో పలికిన మునివర్యుడు మునివృందవంద్యుడైన పుష్కరనాథుని, పయోష్ణినదిని సేవించడానికి విశాలాక్షిని సంస్మరిస్తూ వెళ్ళాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే భైరవప్రాదుర్భావే దండోపాఖ్యానే త్రిషష్టితమోఽధ్యాయః ॥63॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని భైరవప్రాదుర్భావమందలి దండోపాఖ్యానమనే అరవైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుఃషష్టితమోఽధ్యాయః - అరవైనాల్గవ అధ్యాయం

జాబాలివిముక్తిః - జాబాలివిముక్తి

దండ ఉవాచ - దండుడు పలికాడు.

చిత్రాంగదాయాస్త్వరజే తత్ర సత్యా యథా సుఖమ్ ।
స్మరన్త్యాః సురథం వీరం మహాన్కాలః సమభ్యగాత్ ॥1॥

ఓ అరజా! ఆ చిత్రాంగద వీరుడైన సురథుని స్మరిస్తూ అక్కడ చాలాకాలం ఉండిపోయింది.

విశ్వకర్మాఽపి మునినా శప్తో వానరతాం గతః ।
న్యపతన్మేరుశిఖరాత్ భూపృష్ఠం విధిచోదితః ॥2॥

దైవోపహతుడైన విశ్వకర్మ కూడా మునిశాపం వలన వానరత్వాన్ని పొంది, మేరుశిఖరం నుండి భూమి మీద పడిపోయాడు.

వనం ఘోరే సుగుల్మాఢ్యం నదీం శాలూకినీమను ।
శాల్వేయం పర్వతశ్రేష్ఠం సమావసతి సుందరి ॥3॥

ఓ సుందరీ! భయంకరారణ్యంలో శాలూకినీ నదీతీరంలోని శాల్వేయపర్వతం వద్ద ఆ వానరం నివసింపసాగాడు.

తత్రాసతోఽస్య శుచిరం ఫలమూలాన్యథాశ్నతః ।
కాలోఽత్యగాద్ వరారోహే బహువర్షగణో వనే ॥4॥

అక్కడ వానరాకారుడైన విశ్వకర్మ ఫలమూలాదులను తింటూ, చాలాకాలం గడిపాడు.

ఏకదా దైత్యశార్దూలః కందరాఖ్యః సుతాం ప్రియామ్ ।
ప్రతిగృహ్య సమభ్యాగాత్ ఖ్యాతాం దేవవతీమితి ॥5॥

ఒకనాడు కందరుడనే దైత్యరాజు దేవవతిగా ప్రసిద్ధిగాంచిన తన ప్రియపుత్రికను వెంటబెట్టుకొని అక్కడకు వచ్చాడు.

తాం చ తద్వనమాయాన్తీం సమం పిత్రా వరాననామ్ ।
దదర్శ వానరశ్రేష్ఠః ప్రజగ్రాహ బలాత్కరే ॥6॥

తండ్రితో కలసివస్తున్న సుందరాస్యను చూచి, ఆ వానరశ్రేష్ఠుడు బలవంతంగా ఎత్తుకుపోయాడు.

తతో గృహీతాం కపినా స దైత్యః స్వసుతాం శుభే ।
కన్దరో వీక్ష్య సంక్రుద్ధః ఖడ్గముద్యమ్య చాద్రవత్ ॥7॥

తనకుమార్తెను వానరుడు హరించుకుపోవడంచూచి, క్రుద్ధుడైన కందరుడు కత్తి దూసి వానిని వెంబడించాడు.

తమాపతన్తం దైత్యేన్ద్రం దృష్ట్వా శాఖామృగో బలీ ।
తథైవ సహ చార్వఙ్గ్యా హిమాచలముపాగతః ॥8॥

తన మీదకు దూకుతున్న దైత్యేంద్రుని చూసి బలవంతుడైన వానరుడు దేవవతితో సహా హిమాలయ పర్వతానికి పారిపోయాడు.

దదర్శ చ మహాదేవం శ్రీకంఠం యమునాతటే ।
తస్యావిదూరే గహనమాశ్రమం ఋషివర్జితమ్ ॥9॥

తస్మిన్మహాశ్రమే పుణ్యే స్థాప్య దేవవతీం కపిః ।
న్యమజ్జత స కాలింద్యాం పశ్యతో దానవస్య హి ॥10॥

అక్కడ యమునానదీతీరంలోని శ్రీకంఠేశ్వరుని దర్శించి, ఆ క్షేత్రానికి సమీపంలో ఋషివర్జితమైన ఒక మహాశ్రమంలో దేవవతిని ఉంచి, దైత్యేంద్రుడు చూస్తుండగా ఆ వానరుడు కాళిందీజలాలలో మునిగిపోయాడు.

సోఽజానత్ తాం మృతాం పుత్రీం సమం శాఖామృగేణ హి ।
జగామ చ మహాతేజాః పాతాలం నిలయం నిజమ్ ॥11॥

వానరంతో బాటు తన కుమార్తె కూడా కాళిందీనదిలో మునిగి చనిపోయిందని భావించి దైత్యేంద్రుడు నిజనివాసమైన పాతాళానికి వెళ్ళిపోయాడు.

స చాపి వానరో దేవ్యా కాలిన్ద్యా వేగతో హృతః ।
నీతః శివీతి విఖ్యాతం దేశం శుభజనావృతమ్ ॥12॥

వానరుడు ఆ విధంగా కాళిందీనదీప్రవాహవేగంలో కొట్టుకొనిపోయి, సజ్జనులకు ఆవాసమైన శివి అనే పుణ్యదేశానికి చేరాడు.

తతస్తీర్త్వాఽథ వేగేన స కపిః పర్వతం ప్రతి ।
గన్తుకామో మహాతేజా యత్ర న్యస్తా సులోచనా ॥13॥

ఆ విధంగా నీటిలోనుండి బయటపడిన వానరుడు సులోచనయైన దేవవతిని ఉంచిన పర్వతప్రాంతానికి వెళ్ళాలని త్వరగా బయలుదేరాడు.

అథాపశ్యత్ సమాయాన్తమంజనం గుహ్యకోత్తమమ్ ।
నన్దయన్త్యా సమం పుత్ర్యా గత్వా జిగమిషుః కపిః ॥14॥

తాం దృష్ట్వాఽమన్యత శ్రీమాన్ సేయం దేవవతీ ధ్రువమ్ ।
తన్మే వృథాశ్రమో జాతో జలమజ్జనసంభవః ॥15॥

అంతట అంజనుడను యక్షశ్రేష్ఠుడు తన కుమార్తెయైన నందయతితో అటువైపు రావడం చూసిన వానరుడు ఈమెయే దేవవతియని నిశ్చయించుకుని తాను నీటిలో దూకిన శ్రమ అంతయూ వ్యర్థమైనదని భావించాడు.

ఇతి సంచిన్తయన్నేవ సమాద్రవత సుందరీమ్ ।
సా తద్భయాచ్చ న్యపతన్నదీం చైవ హిరణ్వతీమ్ ॥16॥

ఇలా భావించిన వానరుడు ఆ సుందరిని పట్టుకోవడానికి లంఘించగా దానితో భయపడిన ఆమె హిరణ్వతీ నదీప్రవాహంలో పడిపోయింది.

గుహ్యకో వీక్ష్య తనయాం పతితామాపగాజలే ।
దుఃఖశోకసమాక్రాన్తో జగామాఞ్జనపర్వతమ్ ॥17॥

ఆ విధంగా తన పుత్రిక నదీప్రవాహంలో పడిపోవడం చూసిన యక్షుడు దుఃఖశోకసమాక్రాంతుడై అంజన పర్వతానికి వెళ్ళిపోయాడు.

తత్రాసౌ తప ఆస్థాయ మౌనవ్రతధరః శుచిః ।
సమాస్తే వై మహాతేజాః సంవత్సరగణాన్ బహూన్ ॥18॥

అక్కడ ఆ యక్షుడు పవిత్రుడై, మౌనవ్రతాన్ని బూని, అనేక సంవత్సరాలు తపస్సులో ఉండిపోయాడు.

నన్దయన్త్యపి వేగేన హిరణ్వత్యాఽపవాహితా ।
నీతా దేశం మహాపుణ్యం కోశలం సాధుభిర్యుతమ్ ॥19॥

హిరణ్వతీప్రవాహంలో కొట్టుకొనిపోయిన నందయన్తి కూడా సజ్జనులతో కూడినదియు, మహాపుణ్య భూమియుఐన కోశలదేశం చేరింది.

గచ్ఛన్తీ సా చ రుదతీ దదృశే వటపాదపమ్ ।
ప్రరోహ ప్రావృతతనుం జటాధరమివేశ్వరమ్ ॥20॥

కోశలదేశంలో విలపిస్తూ సంచరిస్తున్న నందయన్తి పోయిపోయి అసంఖ్యాకమైన ఊడలతో విశాలమైన ప్రదేశంలో శివుని జటాజూటం వలె విస్తరించిన ఒక మఱ్ఱిచెట్టును చూచింది.

తం దృష్ట్వా విపులచ్ఛాయం విశశ్రామ వరాననా ।
ఉపవిష్టా శిలాపట్టే తతో వాచం ప్రశుశ్రువే ॥21॥

విశాలమైన ఆ మఱ్ఱిచెట్టు నీడలో ఒక శిలావేదిక మీద కూర్చుని, విశ్రాంతి తీసుకుంటున్న ఆమె కొన్ని మాటలను విన్నది.

న సోఽస్తి పురుషః కశ్చిద్ యస్తం బ్రూయాత్తపోధనమ్ ।
యథా స తనయస్తుభ్యముద్బద్ధో వటపాదపే ॥22॥

సా శ్రుత్వా తాం తదా వాణీం విస్పష్టాక్షరసంయుతామ్ ।
తిర్యగూర్ధ్వమధశ్చైవ సమంతాదవలోకయత్ ॥23॥

"నీ పుత్రుడు మఱ్ఱిచెట్టుకు బంధింపబడియున్నాడని, తపోధనుడైన నా తండ్రికి చెప్పగల పురుషుడులేడా?" స్పష్టాక్షరాలతో కూడిన ఈ మాటలను వినిన నన్దయన్తి పైకి క్రిందకు ప్రక్కలకు అంతటా పరికించి చూసింది.

దదృశే వృక్షశిఖరే శిశుం పంచాబ్దికం స్థితమ్ ।
పింగలాభిర్జటాభిస్తు ఉద్బద్ధం యత్నతః శుభే ॥24॥

తం విద్రువన్తం దృష్ట్వైవ నన్దయన్తీ సుదుఃఖితా ।
ప్రాహ కేనాసి బద్ధస్త్వం పాపినా వద బాలక ॥25॥

అంతట ఆమె ఆ మఱ్ఱిచెట్టు చిటారుకొమ్మపై పింగలవర్ణంతో నున్న తనజటలతో గట్టిగా బంధింపబడియున్న ఐదేండ్ల వయస్సుగల ఒకబాలుని చూసింది. ఆ విధంగా కట్టబడిన బాలుని చూసిన నందయన్తి మిక్కిలి దుఃఖించి, "ఓ బాలకా! ఏ పాపాత్ముడు నిన్నిలా బంధించాడని" అడిగింది.

స తామాహ మహాభాగే బద్ధోఽస్మి కపినా వటే ।
జటాస్వేవం సుదుష్టేన జీవామి తపసో బలాత్ ॥26॥

అంతట ఆ బాలకుడు నందయన్తితో ఇలా అన్నాడు. "ఓ మహనీయురాలా! పరమదుర్మార్గుడైన ఒక కపి నన్నిక్కడ జడలతో మఱ్ఱిచెట్టుకు బంధించాడు. నేను తపోబలంతో మాత్రమే బ్రతికియున్నాను.

పురోన్మత్తపురేత్యేవ తత్ర దేవో మహేశ్వరః ।
తత్రాస్తి తపసో రాశిః పితా మమ ఋతధ్వజః ॥27॥

తస్యాస్మి జపమానస్య మహాయోగం మహాత్మనః ।
జాతోఽలివృందసంయుక్తః సర్వశాస్త్రవిశారదః ॥28॥

మహేశ్వరునకు ఆవాసమైన పురోన్మత్తపురంలో నా తండ్రి, పరమ తపోరాశియునైన ఋతధ్వజుడున్నాడు. ఆ మహాయోగి జపసమాధిలోనుండగా సర్వశాస్త్రవిశారదుడనై, తుమ్మెదలతో ఆవరింపబడి, నేను జన్మించాను.

తతో మామబ్రవీత్ తాతో నామకృత్వా శుభాననే ।
జాబాలీతి పరిఖ్యాయ తచ్ఛృణుష్వ శుభాననే ॥29॥

అందుచేత నా తండ్రి నాకు జాబాలి అని నామకరణం చేసి, నాతో ఇలా పలికాడు.

పఞ్చవర్షసహస్రాణి బాల ఏవ భవిష్యసి ।
దశవర్ష సహస్రాణి కుమారత్వే చరిష్యసి ॥30॥

వింశతిం యౌవనస్థాయీ వీర్యేణ ద్విగుణం తతః ।
పఞ్చవర్షశతాన్ బాలో భోక్ష్యసే బంధనం దృఢమ్ ॥31॥

"నీవు 5 వేల సంవత్సరాలు బాలునిగానే ఉంటావు. పదివేల సంవత్సరాలు కౌమారంలో ఉంటావు. 20 వేల సంవత్సరాలు యౌవనంలోను, తదనంతరం నలభైవేలసంవత్సరాలు వీర్యవంతునిగాను ఉంటావు. ఇందులో బాల్యంలో ఐదువందల సంవత్సరాలు దృఢబంధనం అనుభవిస్తావు.

దశవర్షశతాన్యేవ కౌమారే కాయపీడనమ్ ।
యౌవనే పరమాన్ భోగాన్ ద్విసహస్రసమాస్తథా ॥32॥

చత్వారింశచ్ఛతాన్యేవ వార్ధకే క్లేశముత్తమమ్ ।
లప్స్యసే భూమిశయ్యాధ్యం కదన్నాశనభోజనమ్ ॥33॥

కౌమారంలో వేయి సంవత్సరాలు శారీరక బాధతో కష్టపడతావు. యౌవనంలో రెండువేలసంవత్సరాలు పరమసౌఖ్యాలు అనుభవిస్తావు. వార్ధక్యంలో నాల్గువేలసంవత్సరాలు భూమిమీద శయనిస్తూ దుష్టాన్నం భుజిస్తూ చాలా బాధలు అనుభవిస్తావు".

ఇత్యేవముక్తః పిత్రాఽహం బాలః పంచాబ్దదేశికః ।
విచరామి మహీపృష్ఠం గచ్ఛన్ స్నాతుం హిరణ్వతీమ్ ॥34॥

ఇలా నా గురించి నా తండ్రి వివరించాడు. నేను అయిదేండ్లబాలునిగా ఈ భూమిపై సంచరిస్తూ స్నానానికై హిరణ్వతీనదికి వెళుతున్నాను.

తతోఽపశ్యం కపివరం సోఽవదన్మాం క్వ యాస్యసి ।
ఇమాం దేవవతీం గుహ్యం మూఢ న్యస్తాం మహాశ్రమే ॥35॥

తతోఽసౌ మాం సమాదాయ విస్ఫురన్తం ప్రయత్నతః ।
వటాగ్రేఽస్మిన్నుద్బబన్ధ జటాభిరపి సున్దరి ॥36॥

ఆ సమయంలో ఆ కపివీరుడు నన్నుచూచి, "మూర్ఖుడా! నా ఆశ్రమంలో నేను దాచిన దేవవతిని తీసుకుని ఎక్కడకు వెళుతున్నావ"ని భయంతో గడగడలాడుతున్న నన్ను పట్టుకుని నా జడలతోనే నన్ను ఈ వటవృక్షాగ్రానికి గట్టిగా బంధించాడు.

తథా చ రక్షా కపినా కృతా భీరు నిరన్తరైః ।
లతాపాశైర్మహాయన్త్రమధస్తాద్ దుష్టబుద్ధినా ॥37॥

అభేద్యోఽయమనాక్రమ్య ఉపరిష్టాత్ తథాప్యధః ।
దిశాం ముఖేషు సర్వేషు కృతం యన్త్రం లతామయమ్ ॥38॥

సంయమ్య మాం కపివరః ప్రయాతోఽమరపర్వతమ్ ।
యథేచ్ఛయా మయా దృష్టమేతత్ తే గదితం శుభే ॥39॥

ఆ దుష్టుడు నేను క్రిందపడకుండా తీగలతో, త్రాళ్ళతో, క్రిందా, పైనా నలువైపులా అభేద్యంగా బంధించాడు. ఇలా లతాయంత్రంలో బద్ధుని గావించి, ఆ వానరుడు అమరపర్వతానికి వెళ్ళిపోయాడు. ఓ శుభాంగీ! నేను చూసినదంతా యథాతథంగా నీకు చెప్పాను" అని బాలుడు నందయన్తితో చెప్పాడు.

భవతీ కా మహారణ్యే లలనా పరివర్జితా ।
సమాయాతా సుచార్వఙ్గీ కేన సార్ధేన మాం వద ॥40॥

ఓ లలనా! నీవెవరవు? ఎవరితో కలిసివచ్చి ఈ మహారణ్యంలో ఒంటరిగా చిక్కుబడిపోయావు. నాకు తెలియజేయుమని ఆ బాలుడు నందయన్తిని అడిగాడు.

సాఽబ్రవీదంజనో నామ గుహ్యకేంద్రః పితా మమ ।
నన్దయన్తీతి మే నామ ప్రమ్లోచాగర్భసంభవా ॥41॥

తత్ర మే జాతకే ప్రోక్తం ఋషిణా ముద్గలేన హి ।
ఇయం నరేన్ద్ర మహిషీ భవిష్యతి న సంశయః ॥42॥

తద్వాక్యసమకాలంచ వ్యనదద్ దేవదుందుభిః ।
శివాచాశివ నిర్ఘోషా తతో భూయోఽబ్రవీన్మునిః ॥43॥

అందులకు ఆ నందయన్తి అంజనుడను యక్షునకు ప్రమ్లోచ వలన కలిగిన కుమార్తెను నేను. పేరు నందయన్తి. ముద్గలమహర్షి నా జాతకం చూసి, నేను నరేంద్రమహిషిని కాగలనని ఇందులో సందేహం లేదని జోస్యం చెప్పాడు. ఆ పలుకులు పలుకుతుండగానే శుభసూచకంగా దేవదుందుభులు మ్రోగాయి. అశుభ సూచకమైన భయంకరధ్వనులు కూడా వ్యాపించాయి. అంతట ఆ మహర్షి మరలా ఇలా పలికాడు.

న సందేహో నరపతేర్మహారాజ్ఞీ భవిష్యతి ।
మహాన్తం సంశయం ఘోరం కన్యాభావే గమిష్యసి ।
తతో జగామ స ఋషిరేవముక్త్వా వచోఽద్భుతమ్ ॥44॥

నిస్సందేహంగా ఈ బాలిక మహారాణి కాగలదు. కాని కన్యగానున్న దినాలలో మహా ఆపదలలో ఘోరంగా చిక్కుకోగలదనికూడా ఆ ఋషి అద్భుతమైన మాటలు చెప్పి వెళ్ళిపోయాడు.

పితా మామపి చాదాయ సమాగన్తుమథైచ్ఛత ।
తీర్థం తతో హిరణ్వత్యాస్తీరాత్ కపిరథోత్పతత్ ॥45॥

నా తండ్రి కూడా నన్ను తీసికొని పవిత్రతీర్థానికి వెళ్తుండగా హిరణ్వతీనదీతీరాన ఒక వానరం నా మీదకు దూకింది.

తద్భయాచ్చ మయా హ్యాత్మా క్షిప్తః సాగరగాజలే ।
తయాఽస్మి దేశమానీతా ఇమం మానుషవర్జితమ్ ॥46॥

ఆ భయంతో నేను సాగరాభిముఖంగా ప్రవహిస్తున్న హిరణ్వతీప్రవాహంలో పడిపోయి, నిర్మానుష్యమైన ఈ దేశానికి కొట్టుకువచ్చాను అని తనవృత్తాంతాన్ని నందయన్తి ఆ బాలునకు చెప్పింది.

శ్రుత్వా జాబాలిరథ తద్వచనం వై తయోదితమ్ ।
ప్రాహ సున్దరి గచ్ఛస్వ శ్రీకంఠం యమునాతటే ॥47॥

ఆమె చెప్పినదంతయు జాబాలి విని, ఆమెతో ఓసుందరీ! నీవు యమునాతీరాన గల శ్రీకంఠేశ్వరక్షేత్రానికి వెళ్ళు.

తత్రాగచ్ఛతి మధ్యాహ్నే మత్పితా శర్వమర్చితుమ్ ।
తస్మై నివేదయాత్మానం తత్ర శ్రేయోఽధిలప్స్యసే ॥48॥

ప్రతిదినం మధ్యాహ్న సమయంలో అచ్చటకు నా తండ్రి శివుని అర్చించడానికి వస్తాడు. నీవు నీ వృత్తాంతాన్ని ఆయనకు తెలియజేసి, ఆయనను ఆశ్రయిస్తే నీకు మేలు కలుగుతుందని చెప్పాడు.

తతస్తు త్వరితా కాలే నందయన్తీ తపోనిధిమ్ ।
పరిత్రాణార్థమగమద్ధిమాద్రేర్యమునాం నదీమ్ ॥49॥

సా త్వదీర్ఘేణ కాలేన కన్దమూలఫలాశనా ।
సంప్రాప్తా శంకరస్థానం యత్రాగచ్ఛతి తాపసః ॥50॥

అంతట నందయన్తి ఆ మహర్షిని దర్శించి, తన కష్టాలు పోగొట్టుకొని, తన కోర్కెను నెరవేర్చుకోవడానికి హిమాచలంలో యమునా తీరాన గల శ్రీకంఠక్షేత్రానికి బయలుదేరి, కందమూలఫలాలు తింటూ ప్రయాణించి, అచిరకాలంలోనే ఋతధ్వజమహర్షి వచ్చే శంకరస్థానమైన శ్రీకంఠేశ్వరక్షేత్రానికి చేరింది.

తతః సా దేవదేవేశం శ్రీకంఠం లోకవన్దితమ్ ।
ప్రతివన్ద్య తతోఽపశ్యదక్షరాంస్తాన్మహామునే ॥51॥

ఓమహామునీ! ఆమె లోకవంద్యుడు, దేవదేవేశుడు అగు శ్రీకంఠునికి ప్రణమిల్లి అచ్చట వ్రాయబడిన శ్లోకం చూసింది.

తేషాం అర్థం హి విజ్ఞాయ సా తదా చారుహాసినీ ।
తజ్జాబాల్యుదితం శ్లోకమలిఖచ్చాన్యమాత్మనః ॥52॥

ఆ శ్లోకార్థం తెలిసికొని ఆమె నవ్వుకుంటూ దాని క్రింద జాబాలి చెప్పిన మరియొక శ్లోకాన్ని తాను వ్రాసింది.

ముద్గలేనాస్మి గదితా రాజపత్నీ భవిష్యతి ।
సా చావస్థామిమాం ప్రాప్తా కశ్చిన్మాం త్రాతుమీశ్వరః ॥53॥

ఇత్యుల్లిఖ్య శిలాపట్టే గతా స్నాతుం యమస్వసామ్ ।
దదృశే చాశ్రమవరం మత్తకోకిలనాదితమ్ ॥54॥

"ముద్గలుడు రాజపత్నిని కాగలనని నాకు జోశ్యం చెప్పాడు. కాని, నాకు ఈ దురవస్థ ప్రాప్తించింది. నన్ను రక్షించగలిగిన ఈశ్వరుడు ఎవరో గదా!" అని అచ్చట మరొక శిలాఫలకంపై వ్రాసి, యమునానదిలో స్నానం చేయడానికి వెళ్లింది. అక్కడ మత్తకోకిలనాదాలతో మారుమ్రోగుతున్న శ్రేష్ఠమైన ఆశ్రమాన్ని చూసింది.

తతోఽమన్యత సాత్రర్షిర్ధ్యానం తిష్ఠతి సత్తమః ।
ఇత్యేవ చింతయన్తీ సా సంప్రవిష్టా మహాశ్రమమ్ ॥55॥

ఆ ఋషివర్యుడు అక్కడ తప్పకుండా ఉంటాడని భావిస్తూ ఆమె ఆ మహాశ్రమంలో ప్రవేశించింది.

తతో దదర్శ దేవాభాం స్థితాం దేవవతీం శుభామ్ ।
సంశుష్కాస్యాం చలన్నేత్రాం పరిమ్లానామివాబ్జినీమ్ ॥56॥

అక్కడ దివ్యకాంతితో వెలుగొందుతున్న పవిత్రురాలైన దేవవతి ముఖం ఎండిపోయి, చలిస్తున్న నేత్రాలతో వాడిన పద్మంవలె కన్పించింది.

సా చాపతన్తీం దదృశే యక్షజాం దైత్యనందినీ ।
కేయమిత్యేవ సంచింత్య సముత్థాయ స్థితాఽభవత్ ॥57॥

ఆ యక్షపుత్రి తనవైపు రావడం చూసి, దైత్యకుమారి లేచి, నిలబడి, ఈమె ఎవరా? అని ఆలోచింపసాగింది.

తతోఽన్యోన్యం సమాలింగ్య గాఢం గాఢం సుహృత్తయా ।
పప్రచ్ఛతుస్తథాన్యోఽన్యం కథయామాసతుస్తదా ॥58॥

సంపరిజ్ఞాతతత్త్వార్థే అన్యోన్యం లలనోత్తమే ।
సమాసీనే కథాభిస్తే నానారూపాభిరాదరాత్ ॥59॥

అంతట వారిరువురు ఒకరినొకరు సమీపించి, స్నేహపురస్సరంగా గాఢాతిగాఢంగా కౌగిలించుకుని, ఒకరినొకరు ప్రశ్నించుకుని, నానారూపాలుగా ఉన్న పరస్పరవృత్తాంతాలను ఆదరంతో తెలుసుకున్నారు.

ఏతస్మిన్నన్తరే ప్రాప్తః శ్రీకంఠం స్నాతుమాదరాత్ ।
స తత్త్వజ్ఞో మునిశ్రేష్ఠో అక్షరాణ్యవలోకయన్ ॥60॥

స దృష్ట్వా వాచయిత్వా చ తమర్థమధిగమ్య చ ।
ముహూర్తం ధ్యానమాస్థాయ వ్యజానాచ్చ తపోనిధిః ॥61॥

ఇంతలో తత్త్వదర్శియైన మునిశ్రేష్ఠుడు, ఋతధ్వజుడు స్నానార్థం శ్రీకంఠేశ్వరాలయానికి వచ్చి, అచ్చటి శిలాఫలకంపై వ్రాయబడిన అక్షరాలను చూసి, చదువుకొని, అవగాహన చేసికొని, ముహూర్తకాలం ధ్యానమగ్నుడై జరిగినదంతా సాకల్యంగా తెలుసుకున్నాడు.

తతః సంపూజ్య దేవేశం త్వరయా స ఋతధ్వజః ।
అయోధ్యామగమత్ క్షిప్రం ద్రష్టుమిక్ష్వాకుమీశ్వరమ్ ॥62॥

అంతట ఋతధ్వజుడు దేవదేవేశుడైన శ్రీకంఠేశ్వరుని అర్చించి, త్వరగా ఇక్ష్వాకువంశప్రభువును దర్శించడానికి అయోధ్యానగరానికి వెళ్ళాడు.

తం దృష్ట్వా నృపతిశ్రేష్ఠం తాపసో వాక్యమబ్రవీత్ ।
శ్రూయతాం నరశార్దూల విజ్ఞప్తిర్మమ పార్థివ ॥63॥

మమ పుత్రో గుణైర్యుక్తః సర్వశాస్త్రవిశారదః ।
ఉద్బద్ధః కపినా రాజన్ విషయాన్తే తవైవ హి ॥64॥

తపస్వియైన ఋతధ్వజుడు రాజశ్రేష్ఠుని గాంచి ఇలా పలికాడు. "ఓ నరశార్దూలా!, రాజా! నా విజ్ఞప్తిని విను. సర్వగుణోపేతుడు, సర్వశాస్త్రపారంగతుడునైన నా కుమారుని ఒక వానరుడు నీ రాజ్యంలో బంధించాడు.

తం హి మోచయితుం నాన్యః శక్తస్త్వత్తనయాదృతే ।
శకునిర్నామ రాజేన్ద్ర స హ్యస్త్రవిధిపారగః ॥65॥

ఓ రాజేంద్రా! అస్త్రశాస్త్రనిధియైన నీ కుమారుడు శకుని తప్ప మరెవ్వరు నా కుమారుని విడిపించలేరు.

తన్మునేర్వాక్యమాకర్ణ్య పితా మమ కృశోదరి ।
ఆదిదేశ ప్రియం పుత్రం శకునిం తాపసాన్వయే ॥66॥

కృశోదరియైన అరజా! ఆ ముని మాటలు విని, నా తండ్రి తన ప్రియపుత్రుడైన శకునిని ఆ మునివర్యుని వెంట వెళ్ళవలసిందని ఆదేశించాడు.

తతః స ప్రహితః పిత్రా భ్రాతా మమ మహాభుజః ।
సంప్రాప్తో బన్ధనోద్దేశ్యం సమం హి పరమర్షిణా ॥67॥

మహాభుజుడైన నా సోదరుడు తండ్రి ఆదేశానుసారం ఆ మునివెంట వెళ్ళి, మునికుమారుని బంధించిన ప్రాంతానికి చేరుకున్నాడు.

దృష్ట్వా న్యగ్రోధమత్యుచ్చం ప్రరోహాస్తృతదిఙ్ముఖమ్ ।
దదర్శ వృక్షశిఖరే ఉద్బద్ధమృషిపుత్రకమ్ ॥68॥

అక్కడ ఊడలతో దిశలన్నీ కప్పివేస్తున్న ఒకబ్రహ్మాండమైన మఱ్ఱిచెట్టును చూసి, దానిచివర కట్టబడి ఉన్న మునికుమారుని చూశాడు.

తాంశ్చ సర్వాంల్లతాపాశాన్ దృష్టవాన్ స సమన్తతః ।
దృష్ట్వా స మునిపుత్రం తం స్వజటాసంయతం వటే ॥69॥

ఆ బాలుని నలువైపులా లతలు గట్టిగా బంధించి ఉన్నాయి. అతని జడలతోనే మరియొక కొమ్మకు బంధింపబడి ఉన్న మునిపుత్రుని శకుని చూశాడు.

ధనురాదాయ బలవానధిజ్యం స చకార హ ।
లాఘవాదృషిపుత్రం తం రక్షం చిచ్ఛేద మార్గణైః ॥70॥

అంత ఆ రాజకుమారుడు విల్లు ఎక్కుపెట్టి అతినేర్పుతో బాలకునకు దెబ్బతగలకుండా లతాబంధాలను మాత్రం తెగగొట్టాడు.

కపినా యత్కృతం సర్వం లతాపాశం చతుర్దిశమ్ ।
పంచవర్షశతే కాలే గతే శక్తస్తదా శరైః ॥71॥

నలువైపులా కపిచే కట్టబడిన లతాపాశాలన్నీ ఐదువందల సంవత్సరాల తరువాత ఆ మహావీరుని బాణఘాతాలకు తెగిపోయాయి.

లతాచ్ఛన్నం తతస్తూర్ణమారురోహ మునిర్వటమ్ ।
ప్రాప్తం స్వపితరం దృష్ట్వా జాబాలిః సంయతోఽపి సన్ ॥72॥

ఆదరాత్ పితరం మూర్ధ్నా వవన్దే తు విధానతః ।
సంపరిష్వజ్య స మునిర్మూర్ధ్న్యాఘ్రాయ సుతం తతః ॥73॥

వెంటనే ఆ ముని తెగిన లతలతో కప్పబడిన ఆ వటశాఖాగ్రానికి త్వరగా ఎక్కి, కుమారుని చూడగా ఆ బాలుడు జడలతో బంధితుడైనందున శిరోనమ్రభావంతో తండ్రికి నమస్కరించాడు. పుత్రస్నేహంతో ఋతధ్వజుడు కూడా జాబాలిని కౌగిలించుకుని నుదుటిపై మాటిమాటికి ముద్దుపెట్టుకున్నాడు.

ఉన్మోచయితుమారబ్ధో న శశాక సుసంయతమ్ ।
తతస్తూర్ణం ధనుర్న్యస్య బాణాంశ్చ శకునిర్బలీ ॥74॥

ఆరురోహ వటం తూర్ణం జటా మోచయితుం తదా ।
న చ శక్నోతి సంచ్ఛన్నం దృఢం కపివరేణ హి ॥75॥

కట్లన్నీ గట్టిగా కట్టబడి యుండడంచేత కుమారుని కట్లు పూర్తిగా విప్పడానికి తండ్రి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అంతట బలవంతుడైన శకుని విల్లంబులతో వేగంగా చెట్టునెక్కి తాను కూడా జటాబంధాలను విడిపించడానికి ప్రయత్నించాడు. కాని ఆ కపివరుడు దృఢంగా వేసినందున వాటిని తెంచడానికి శకునికి కూడా సాధ్యంకాలేదు.

యదా న శకితాస్తేన సంప్రమోచయితుం జటాః ।
తదాఽవతీర్ణః శకునిః సహితః పరమర్షిణా ॥76॥

జటాబంధనాలు త్రెంచడం వీలుగాకపోవడంతో శకుని మహర్షితో సహా చెట్టు దిగాడు.

జగ్రాహ చ ధనుర్బాణాంశ్చకార శరమణ్డపమ్ ।
లాఘవాదర్ధచంద్రైస్తాం శాఖాం చిచ్ఛేద స త్రిధా ॥77॥

చెట్టు దిగినవెంటనే శకుని విల్లంబులు గ్రహించి, అతిలాఘవంగా బాణాలతో ఒక శరమండపాన్ని నిర్మించి, ఆ కొమ్మను మూడు ముక్కలుగా ఖండించాడు.

శాఖయా కృత్తయా చాసౌ భారవాహీ తపోధనః ।
శరసోపానమార్గేణ అవతీర్ణోఽథ పాదపాత్ ॥78॥

తస్మిం స్తదా స్వే తనయే ఋతధ్వజస్త్రాతే నరేన్ద్రస్య సుతేన ధన్వినా ।
జాబాలినా భారవహేన సంయుతః సమాజగామాథ నదీం స సూర్యజామ్ ॥79॥

అంతట జాబాలి, తలకు కట్టబడిన చిరుకొమ్మల బరువుతోసహా బాణాల మెట్లమీదుగా మెల్లగా క్రిందకు దిగాడు. ఆ విధంగా ధానుష్కుడైన రాజకుమారునిచే రక్షింపబడిన తన కుమారుడైన జాబాలిని తలమీద బరువుతో సహా వెంటబెట్టుకుని ఋతధ్వజుడు యమునానదికి వెళ్ళాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్య నారదసంవాదే జాబాలివిముక్తిర్నామ చతుఃషష్టితమోఽధ్యాయః ॥64॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్య నారదసంవాదంలోని జాబాలివిముక్తి అనే అరవైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచషష్టితమోఽధ్యాయః - అరవైఐదవ అధ్యాయం

చిత్రాంగదావివాహః - చిత్రాంగదవివాహం

దండ ఉవాచ - దండుడు పలికాడు.

ఏతస్మిన్నన్తరే బాలే యక్షాసురసుతే శుభే ।
సమాగతే హరం ద్రష్టుం శ్రీకంఠం యోగినాం వరమ్ ॥1॥

ఓ బాలా! ఈ లోపల యోగీశ్వరుడైన శ్రీకంఠేశ్వరుని దర్శనానికి యక్ష, అసురకన్యకలు ఆలయానికి వచ్చారు.

దదృశాతే పరిమ్లానసంశుష్కకుసుమం విభుమ్ ।
బహునిర్మాల్యసంయుక్తం గతే తస్మిన్ ఋతధ్వజే ॥2॥

అక్కడ వారు వాడిపోయిన పూలు, అక్షతాదులతో, బహునిర్మాల్యంతో నిండి ఉన్న శివలింగాన్ని దర్శించారు. అది ఋతధ్వజుడు గావించిన పూజా నిర్మాల్యం.

తతస్తం వీక్ష్య దేవేశం తే ఉభే అపి కన్యకే ।
స్నాపయేతాం విధానేన పూజయేతామహర్నిశమ్ ॥3॥

ఆ విధంగానున్న దేవేశుని ఆ కన్యలిరువురు చూసి, నిర్మాల్యం తొలగించి, విధివిధానంగా అభిషేకం గావించి, రాత్రింబవళ్ళు పూజిస్తూ ఉన్నారు.

తాభ్యాం స్థితాభ్యాం తత్రైవ ఋషిరభ్యాగమద్వనమ్ ।
ద్రష్టుం శ్రీకంఠమవ్యక్తం గాలవో నామ నామతః ॥4॥

వారిరువురు ఆ విధంగా శ్రీకంఠేశ్వరుని సేవిస్తూ అక్కడ ఉండగా, అవ్యక్తుడైన శ్రీకంఠేశ్వరుని దర్శించడానికి ఒకనాడు గాలవమహర్షి అక్కడకు వచ్చాడు.

స దృష్ట్వా కన్యకాయుగ్మం కస్యేదమితి చిన్తయన్ ।
ప్రవివేశ శుచిః స్నాత్వా కాలిన్ద్యా విమలే జలే ॥5॥

గాలవుడు ఆ కన్యలిరువురిని చూచి, వీరెవరా? అని ఆలోచిస్తూ పుణ్యస్నానం చేయడానికి నిర్మల కాళిందీ జలాలలోనికి దిగాడు.

తతోఽను పూజయామాస శ్రీకంఠం గాలవో మునిః ।
గాయేతే సుస్వరం గీతం యక్షాసురసుతే తతః ॥6॥

స్నానానంతరం గాలవముని శ్రీకంఠుని పూజచేస్తూ ఉండగా ఆ కన్యకలిరువురు కమనీయంగా భగవంతుని గుణగానం చేశారు.

తతః స్వరం సమాకర్ణ్య గాలవస్తే అజానత ।
గన్ధర్వకన్యకే చైతే సందేహో నాత్ర విద్యతే ॥7॥

వారి స్వరమాధుర్యం విని, గాలవుడు వీరిరువురు గన్ధర్వకన్యలే, ఇందులో సందేహంలేదని నిశ్చయించుకున్నాడు.

సంపూజ్య దేవమీశానం గాలవస్తు విధానతః ।
కృతజప్యః సమధ్యాస్తే కన్యాభ్యామభివాదితః ॥8॥

తతః పప్రచ్ఛ స మునిః కన్యకే కస్య కథ్యతామ్ ।
కులాలంకారకరణే భక్తియుక్తే భవస్య హి ॥9॥

గాలవుడు విధివిధానంగా శ్రీకంఠుని పూజించి, జపాదులను నెరవేర్చగా ఆ కన్యలిద్దరు ఆ మహర్షికి నమస్కరించారు. అంతట ఆ ముని "శివభక్తియుక్తులై మీ వంశాలకు అలంకారాలుగా వెలిగే మీరెవరు? ఎవరి కుమార్తెలు? తెలియజేయండి?" అని ఆ కన్యలనిరువురిని అడిగాడు.

తమూచతుర్మునిశ్రేష్ఠం యాథాతథ్యం శుభాననే ।
జాతో విదితవృత్తాన్తో గాలవస్తపతాం వరః ॥10॥

సముష్య తత్ర రజనీం తాభ్యాం సంపూజితో మునిః ।
ప్రాతరుత్థాయ గౌరీశం సంపూజ్య చ విధానతః ॥11॥

తే ఉపేత్యాబ్రవీద్వాస్యే పుష్కరారణ్యముత్తమమ్ ।
ఆమన్త్రయామి వాం కన్యే సమనుజ్ఞాతుమర్హథః ॥12॥

శుభాననా! అరజా! ఆ కన్యలిరువురు తమతమ గాథలు యథాతథంగా వివరించి చెప్పారు. అది వినిన గాలవమహర్షి ఆ రాత్రి అచ్చటనే ఉండి, మరునాడు ఉదయం మరల శివుని అర్చించి, వారితో పుష్కరారణ్యానికి వెళుతున్నానని చెప్పాడు. త్వరలో మీరిరువురను అచ్చటకు పిలిపిస్తాను, నాకు అనుమతినీయండని గాలవుడు వారితో చెప్పాడు.

తతస్తే ఊచతుర్బ్రహ్మన్ దుర్లభం దర్శనం తవ ।
కిమర్థం పుష్కరారణ్యం భవాన్ యాస్యత్యథాదరాత్ ॥13॥

అంతట ఆ యక్షాసురకన్యలిరువురు గాలవమునికి చేతులు జోడించి, ఇలా పలికారు. "మహాత్మా! మీవంటివారి దర్శనం దుర్లభం. మీరు మిక్కిలి ప్రీతితో పుష్కరారణ్యానికి ఎందులకు వెళుతున్నారు?" అని అడిగారు.

తే ఉవాచ మహాతేజా మహత్కార్యసమన్వితః ।
కార్తికీ పుణ్యదా భావి మాసాన్తే పుష్కరేషు హి ॥14॥

అందులకు తేజస్వియైన గాలవుడు రాబోవు నెలలో కార్తికపూర్ణిమాపర్వం పుష్కరారణ్యంలో అత్యంత వైభవంగా నిర్వహింపబడుతుంది. అందులకే వెళుతున్నానని వారితో చెప్పాడు.

తే ఊచతుర్వయం యామో భవాన్ యత్ర గమిష్యతి ।
న త్వయా స్మ వినా బ్రహ్మన్నిహ స్థాతుం హి శక్నువః ॥15॥

దానితో వారిరువురు "మహానుభావా! మీరెక్కడకు వెళితే మేము కూడా అక్కడకు వస్తాము. మిమ్ము వదలి ఇక్కడ మేము ఉండలేము. కావున మమ్ముకూడా మీతో తీసుకుని వెళ్ళం"దని గాలవుని ప్రార్థించారు.

బాఢమాహ ఋషిశ్రేష్ఠస్తతో నత్వా మహేశ్వరమ్ ।
గతే తే ఋషిణా సార్ధం పుష్కరారణ్యమాదరాత్ ॥16॥

"మంచిది. అలాగే రండి" అని సమ్మతించి, ఆ ఋషిశ్రేష్ఠుడు పరమేశ్వరునకు మ్రొక్కి, ఆ కన్యలను ఇరువురిని వెంటబెట్టుకొని ఆదరంగా పుష్కరారణ్యానికి వెళ్ళాడు.

తథాఽన్యే ఋషయస్తత్ర సమాయాతాః సహస్రశః ।
పార్థివా జానపద్యాశ్చ ముక్త్వైకం తమృతధ్వజమ్ ॥17॥

అచ్చటకు వేలసంఖ్యలో ఇతర ఋషులు, నరపతులు, జానపదులు వచ్చి చేరుకున్నారు. ఒక్క ఋతధ్వజుడు మాత్రం వెళ్ళలేదు.

తతః స్నాతాశ్చ కార్తిక్యామృషయః పుష్కరేష్వథ ।
రాజానశ్చ మహాభాగా నాభాగేక్ష్వాకుసంయుతాః ॥18॥

ఆ కార్తికపర్వంలో ఋషులంతా ఇక్ష్వాకునరేశుడు నాభాగుడాదిగా గల రాజులంతా పుష్కరజలాలలో స్నానాలు చేశారు.

గాలవోఽపి సమంతాభ్యాం కన్యకాభ్యామవాతరత్ ।
స్నాతుం సపుష్కరే తీర్థే మధ్యమే ధనుషాకృతౌ ॥19॥

గాలవముని కూడా ఆ కన్యలిరువురితో బాటు పుష్కరతీర్థంలో మధ్యలో ధనురాకారంలోనున్నచోట స్నానార్థం దిగాడు.

నిమగ్నశ్చాపి దదృశే మహామత్స్యం జలేశయమ్ ।
బహ్వీభిర్మత్స్యకన్యాభిః ప్రీయమాణం పునః పునః ॥20॥

నీటిలో మునిగిన గాలవుడు ఆ జలాశయం మధ్యలో ఒక పెద్దచేపతో ఎందరో మత్స్యాంగనలు మళ్ళీ మళ్ళీ ప్రీతితో తిరుగుతుండగా చూశాడు.

స తాశ్చాహ తిమిర్ముగ్ధా యూయం ధర్మం న జానథ ।
జనాపవాదం ఘోరం హి న శక్తః సోఢుముల్బణమ్ ॥21॥

ఆడచేపలు ఆ విధంగా తిమింగలంతో ప్రేమకలాపాలు జరుపబోగా ఆ మహామత్స్యం వాటితో "ఓ ముగ్ధాంగనలారా! మీరు ధర్మమెరుగరు. అందువల్ల కలిగే విపరీతమైన జనాపవాదాన్ని భరించడం నా వల్లకాదు" అని పలికింది.

తాస్తమూచుర్మహామత్స్యం కిం న పశ్యసి గాలవమ్ ।
తాపసం కన్యకాభ్యాం వై విచరన్తం యథేచ్ఛయా ॥22॥

యద్యసావపి ధర్మాత్మా న బిభేతి తపోధనః ।
జనాపవాదాత్ తత్కిం త్వం బిభేతి జలమధ్యగః ॥23॥

అది విని మత్స్యాఙ్గనలు తిమింగలంతో "కన్యకలను వెంటబెట్టుకుని యథేచ్ఛగా సంచరిస్తున్న గాలవమునిని నీవు చూడలేదా! తపోధనుడు, ధర్మాత్ముడునైన గాలవమునియే జనాపవాదానికి భయపడడం లేదు. ఆ మహాత్మునికి లేని భయం జలమధ్యంలోనున్న నీకెందులకు?" అన్నారు.

తతస్తాశ్చాహ స తిమిర్నైష వేత్తి తపోధనః ।
రాగాన్ధో నాపి చ భయం విజానాతి సుబాలిశః ॥24॥

అంతట ఆ తిమింగలం ఆడచేపలతో "తపోధనుడైనను గాలవుడు జనాపవాదానికి భయపడడు. ఎందులకనగా రాగాంధుడైనవాడు భయాన్ని లజ్జను వదిలేస్తాడు" అని పలికింది.

తచ్ఛ్రుత్వా మత్స్యవచనం గాలవో వ్రీడయా యుతః ।
నోత్తతార నిమగ్నోఽపి తస్థౌ స విజితేన్ద్రియః ॥25॥

ఆ మత్స్యవచనాన్ని విని, నీటిలోనున్న గాలవుడు సిగ్గుపడి బయటకు రాకుండా అలాగే ఉండిపోయాడు.

స్నాత్వా ద్వే తేఽపి రంభోరూ సముత్తీర్య తటే స్థితే ।
ప్రతీక్ష్యన్త్యౌ మునివరం తద్దర్శనసముత్సుకే ॥26॥

అరటి కాండలవంటి తొడలుగల ఆ కన్యకలిరువురు స్నానం ముగించుకుని ఒడ్డుకు చేరి, నీటిలో మునిగిన మునివరుడైన గాలవుని కొరకు నిరీక్షిస్తూ ఉండిపోయారు.

వృత్తా చ పుష్కరే యాత్రా గతా లోకా యథాగతమ్ ।
ఋషయః పార్థివాశ్చాన్యే నానాజానపదాస్తదా ॥27॥

పుష్కరపర్వం ముగిసింది. వచ్చినవారంతా వచ్చినదారిలోనే తిరిగి వెళ్ళిపోయారు. ఋషులు, రాజులు, జానపదులు తదితరులందరుకూడా తిరిగి వెళ్ళిపోయారు.

తత్ర స్థితైకా సుదతీ విశ్వకర్మతనూరుహా ।
చిత్రాఙ్గదా సుచార్వఙ్గీ వీక్షన్తీ తనుమధ్యమే ॥28॥

తే స్థితే చాపి వీక్షన్త్యౌ ప్రతీక్షన్త్యౌ చ గాలవమ్ ।
సంస్థితే నిర్జనే తీర్థే గాలవోఽన్తర్జలే తథా ॥29॥

విశ్వకర్మ కుమార్తెయు, సర్వాంగసుందరియునైన చిత్రాంగద యొక్కతే నలువైపులా చూస్తూ ఉండిపోయింది. గాలవునితో వచ్చిన కన్యలిద్దరూ కూడా గాలవుడు నీటిలోమునిగి ఇంకా రానందున అతని కొరకు వేచిచూస్తూ తీరాన ఉండిపోయారు.

తతోఽభ్యాగాద్ వేదవతీ నామ్నా గంధర్వకన్యకా ।
పర్జన్య తనయా సాధ్వీ ఘృతాచీగర్భసంభవా ॥30॥

ఇంతలో పర్జన్యుని కుమార్తెయు, ఘృతాచిగర్భసంజాతయునైన వేదవతి అను పేరుగల గంధర్వకన్య అక్కడకు వచ్చింది.

సా చాభ్యేత్య జలే పుణ్యే స్నాత్వా మధ్యమపుష్కరే ।
దదర్శ కన్యాత్రితయముభయోస్తటయోః స్థితమ్ ॥31॥

ఆమె పుష్కరమధ్యజలాలలో పుణ్యస్నానం చేసి, సరోవరానికి ఉభయతీరాలలోనున్న ముగ్గురు కన్యలను చూచింది.

చిత్రాంగదామథాభ్యేత్య పర్యపృచ్ఛదనిష్ఠురమ్ ।
కాసి కేన చ కార్యేణ నిర్జనే స్థితవత్యసి ॥32॥

చిత్రాంగదను సమీపించి, మృదువుగా నీవెవరవు? ఏ కారణంచేత ఏ పనినిమిత్తం ఈ నిర్జన ప్రదేశంలో ఉన్నావని వేదవతి ప్రశ్నించింది.

సా తామువాచ పుత్రీం మాం విద్దస్వ సురవర్ధకే ।
చిత్రాఙ్గదేతి సుశ్రోణి విఖ్యాతాం విశ్వకర్మణః ॥33॥

ఆ చిత్రాంగద తన కథను ఇలా వినిపించింది. నేను ప్రఖ్యాత దేవశిల్పి విశ్వకర్మ కుమార్తెను, చిత్రాంగదను.

సాఽహమభ్యాగతా భద్రే స్నాతుం పుణ్యాం సరస్వతీమ్ ।
నైమిషే కాఞ్చనాక్షీం తు విఖ్యాతాం ధర్మమాతరమ్ ॥34॥

నేనొకనాడు నైమిశారణ్యంలో ధర్మమాతగా ప్రఖ్యాతి చెందిన కాంచనాక్షియైన సరస్వతిలో పవిత్రస్నానం చేయడానికి వెళ్ళాను.

తత్రాగతాథ రాజ్ఞాఽహం దృష్ట్వా వైదర్భకేణ హి ।
సురథేన స కామార్తో మామేవ శరణం గతః ॥35॥

అక్కడకు వచ్చిన విదర్భరాజు సురథుడు నన్ను చూసి కామాతురుడై నన్నే శరణు వేడాడు.

మయాత్మా తస్య దత్తశ్చ సఖీభిర్వార్యమాణయా ।
తతః శప్తాఽస్మి తాతేన వియుక్తాస్మి చ భూభుజా ॥36॥

సఖులు వారించినా వినక నేను అతనికి ఆత్మసమర్పణ చేసుకున్నాను. ఆ కారణంచేత నా తండ్రి నన్ను శపించడం వలన నేను భర్తకు దూరమయ్యాను.

మర్తుం కృతమతిర్భద్రే వారితా గుహ్యకేన చ ।
శ్రీకంఠమగమం ద్రష్టుం తతో గోదావరీజలమ్ ॥37॥

అందువలన నేను ఆత్మహత్యకు ప్రయత్నించగా ఒక యక్షుడు నన్ను వారించి, శ్రీకంఠక్షేత్రానికి పంపాడు. అక్కడినుండి సప్తగోదావరికి వచ్చాను.

తస్మాదిమం సమాయాతా తీర్థప్రవరముత్తమమ్ ।
న చాపి దృష్టః సురథః స మనోహ్లాదనః పతిః ॥38॥

తదనంతరం ఈ తీర్థరాజానికి వచ్చాను. ఇక్కడ కూడా నా మనోహ్లాదనకారకుడైన నాభర్త సురథుడు కనబడలేదు.

భవతీ చాత్ర కా బాలే వృత్తే యాత్రా ఫలేఽధునా ।
సమాగతా హి తచ్ఛంస మమ సత్యేన భామిని ॥39॥

ఓ భామినీ! ఇక నీవెవరో, యాత్ర ముగిసిన తరువాత కూడా ఇచ్చటికేలవచ్చితివో దాచకుండా నిజాన్ని తెలియజేయుమని చిత్రాంగద అడిగింది.

సాఽబ్రవీచ్ఛ్రూయతాం యాఽస్మి మందభాగ్యా కృశోదరీ ।
యథా యాత్రా ఫలే వృత్తే సమాయాతాఽస్మి పుష్కరమ్ ॥40॥

అందులకు ఆ బాలిక ఓ కృశోదరీ! అయితే ఈ మందభాగ్యురాలి కథ విను. యాత్రాఫలం సమాప్తమైన పిమ్మట ఈ పుష్కరానికి ఎందులకు వచ్చానో కూడా చెబుతాను విను.

పర్జన్యస్య ఘృతాచ్యాం తు జాతా వేదవతీతి హి ।
రమమాణా వనోద్దేశే దృష్టాఽస్మి కపినా సఖి ॥41॥

నేను పర్జన్యునకు ఘృతాచికి పుట్టినదానను. నా పేరు వేదవతి. ఒక పర్యాయం వనప్రాంతంలో క్రీడిస్తూ ఉండగా ఒక బలశాలియైన వానరం నన్ను చూచింది.

స చాభ్యేత్యాబ్రవీత్ కా త్వం యాసి దేవవతీతి హి ।
ఆనీతాస్యాశ్రమాత్ కేన భూపృష్ఠాన్మేరుపర్వతమ్ ॥42॥

తతో మయోక్తో నైవాస్మి కపే దేవవతీత్యహమ్ ।
నామ్నా వేదవతీత్యేవం మేరోరపి కృతాశ్రయా ॥43॥

ఆ వానరం నన్ను సమీపించి, "ఓ దేవవతీ! ఎక్కడకు వెళుతున్నావు? భూతలంలో నిన్ను ఉంచిన ఆశ్రమం నుంచి ఈ మేరుపర్వతానికి ఎవరు తీసుకు వచ్చా"రని అడుగగా "నా పేరు వేదవతి. నేను దేవవతినికాదు.

ఈ మేరుపర్వతమే నా నివాసమ"ని ఆ కపికి సమాధానం చెప్పాను.

తతస్తేనాతిదుష్టేన వానరేణ హ్యభిద్రుతా ।
సమారూఢాస్మి సహసా బన్ధుజీవం నగోత్తమమ్ ॥44॥

అంతట ఆ ధూర్తవానరం వినక నా వెంట పడగా నేను భయపడి ప్రక్కనే ఉన్న ఒక ఎత్తైన బంధుజీవ వృక్షం మీదకు ఎక్కాను.

తేనాపి వృక్షస్తరసా పాదాక్రాన్తస్త్వభజ్యత ।
తతోఽస్య విపులాం శాఖాం సమాలిఙ్గ్య స్థితా త్వహమ్ ॥45॥

అంతట ఆ దుష్టవానరం యొక్క ప్రచండకరాఘాతానికి ఆ చెట్టు అతని పాదాలపై బడగా నేనొక కొమ్మను గట్టిగా కౌగలించుకొని ఉన్నాను.

తతః ప్లవఙ్గమో వృక్షం ప్రాక్షిపత్ సాగరామ్భసి ।
సహ తేనైవ వృక్షేణ పతితాస్మ్యహమాకులా ॥46॥

అంతట ఆ వానరం ఆ వృక్షాన్ని సముద్రజలాలలోనికి విసరివేయగా నేను కూడా ఆ చెట్టుతోబాటు విలవిలలాడుతూ పడిపోయాను.

తతోఽమ్బరతలాద్ వృక్షం నిపతన్తం యదృచ్ఛయా ।
దదృశుః సర్వభూతాని స్థావరాణి చరాణి చ ॥47॥

తతో హాహాకృతం లోకైర్మాం పతన్తీం నిరీక్ష్య హి ।
ఊచుశ్చ సిద్ధగన్ధర్వాః కష్టం సేయం మహాత్మనః ॥48॥

ఇంద్రద్యుమ్నస్య మహిషీ గదితా బ్రహ్మణా స్వయమ్ ।
మనోః పుత్రస్య వీరస్య సహస్రక్రతుయాజినః ॥49॥

తాం వాణీం మధురాం శ్రుత్వా మోహమస్మ్యాగతా తతః ।
న చ జానే స కేనాపి వృక్షశ్ఛిన్నః సహస్రధా ॥50॥

ఆ విధంగా ఆకాశంనుండి క్రిందికి పడుతున్న సమయంలో ఆ చెట్టును, దానితో బాటు నన్ను స్థావర జఙ్గమ ప్రాణులందరు చూసి హాహాకారాలు చేశారు. సిద్ధులు, గంధర్వులు "అయ్యో! ఎంతకష్టం! మహాత్ముడైన మనుపుత్రుడు వేయి యజ్ఞాలు చేసిన వీరుడునైన ఇంద్రద్యుమ్నమహారాజునకు పట్టపురాణి కాగలదని స్వయంగా బ్రహ్మచేత దీవింపబడిన ఈ సాధ్వికా ఈ దుర్దశ?" అంటూ విలపించారు. వారి మధురవాణి వినబడగానే నేను మూర్ఛిల్లి పడిపోయాను. అందువలన ఈ వృక్షాన్ని వేయి ముక్కలుగా నరికినవారెవరో తెలుసుకోలేకపోయాను.

తతో౽స్మి వేగాద్ బలినా హృతానలసఖేన హి ।
సమానీతాస్మ్యహమిమం త్వం దృష్ట్వా చాద్య సున్దరి ॥51॥

అంతట అగ్నిమిత్రుడైన వాయువు ప్రచండ వేగంతో నన్నిక్కడకు విసరివైచాడు. ఓ సుందరీ! ఇక్కడ నిన్ను చూశాను.

తదుత్తిష్ఠస్వ గచ్ఛావః పృచ్ఛావః క ఇమే స్థితే ।
కన్యకే అనుపశ్యేహ పుష్కరస్యోత్తరే తటే ॥52॥

ఏవముక్త్వా వరాఙ్గీ సా తయా సుతనుకన్యయా ।
జగామ కన్యకే ద్రష్టుం ప్రష్టుం కార్య సముత్సుకా ॥53॥

"ఇక లే!. మనం వెళ్ళి పుష్కరానికి ఉత్తరతీరాన కనబడుతున్న ఆ ఇద్దరు కాంతలెవరో అడిగి తెలుసుకుందాం". అని చెప్పి వేదవతి చిత్రాంగదతో కలిసి ఆ కాంతలిద్దరి గాథ అడగాలనే ఉత్సుకతతో వారి చెంతకు వెళ్ళింది.

తతో గత్వా పర్యపృచ్ఛత్ తే ఊచతురుభే అపి ।
యాథాతథ్యం తయోస్తాభ్యాం స్వమాత్మానం నివేదితమ్ ॥54॥

వారిరువురు ఆ కాంతలిరువురి చెంతకు వెళ్ళి అడుగగా ఆ కాంతలిద్దరు తమతమ వృత్తాంతాలు నివేదించారు.

తతస్తాశ్చతురో౽పీహ సప్తగోదావరం జలమ్ ।
సంప్రాప్య తీర్థే తిష్ఠన్తి అర్చన్త్యో హాటకేశ్వరమ్ ॥55॥

అంతట ఆ కన్యలు నలుగురు సప్తగోదావరి క్షేత్రానికి వెళ్లి, హాటకేశ్వరమహాదేవుని అర్చిస్తూ ఉండిపోయారు.

తతో బహూన్ వర్షగణాన్ బభ్రముస్తే జనాస్త్రయః ।
తాసామర్థాయ శకునిర్జాబాలిః స ఋతధ్వజః ॥56॥

అంతట శకుని, జాబాలి, ఋతధ్వజుడు ముగ్గురు ఆ కాంతలను వెదుకుతూ చాలా సంవత్సరాలు తిరిగారు.

భారవాహీ తతః ఖిన్నో దశాబ్దశతికే గతే ।
కాలే జగామ నిర్వేదాత్ సమం పిత్రా తు శాకలమ్ ॥57॥

వేయేండ్ల తరువాత జటాభారంతో అలసిపోయిన జాబాలి తన తండ్రితో శాకలానికి వెళ్ళాడు.

తస్మిన్నరపతిః శ్రీమానింద్రద్యుమ్నో మనోః సుతః ।
సమధ్యాస్తే స విజ్ఞాయ సార్ఘపాత్రో వినిర్యయౌ ॥58॥

ఆ నగరాధిపతి ఇంద్రద్యుమ్నుడు మహర్షులు వచ్చుట తెలిసికొని, అర్ఘ్యపాత్రతో వారికి ఎదురు వెళ్ళాడు.

సమ్యక్ సంపూజితస్తేన స జాబాలిరృతధ్వజః ।
స చేక్ష్వాకుసుతో ధీమాన్ శకునిర్భ్రాతృజోఽర్చితః ॥59॥

ఇంద్రద్యుమ్నుడు జాబాలీఋతధ్వజులను చక్కగా పూజించి, సోదరపుత్రుడైన శకునిని సంభావించాడు.

తతో వాక్యం మునిః ప్రాహ ఇంద్రద్యుమ్నమృతధ్వజః ।
రాజన్ నష్టాఽబలాస్మాకం నన్దయన్తీతి విశ్రుతా ॥60॥

తస్యార్థే చైవ వసుధా అస్మాభిరటితా నృప ।
తస్మాదుత్తిష్ఠ మార్గస్య సాహాయ్యం కర్తుమర్హసి ॥61॥

అంతట ఋతధ్వజుడు "ఓ రాజా! మా బిడ్డ నందయన్తి తప్పిపోయింది. ఆమెకోసం మేము భూమండలమంతా గాలించాము. కాని ఫలితం లేదు. కావున మీరు వెంటనే లేచి, ఆమెను వెదకి మాకు సహాయం చేయం"దని మహారాజును అర్థించాడు.

అథోవాచ నృపో బ్రహ్మన్ మమాపి లలనోత్తమా ।
నష్టా కృతశ్రమస్యాపి కస్యాహం కథయామి తామ్ ॥62॥

అంతట ఆ ఇంద్రద్యుమ్నమహారాజు కూడా మహామునీ! నేనుకూడా ఒక లలనామణి కొరకు వెతుకుతున్నాను. ఆమె కోసం వెదకి విసిగిపోయాను. నా బాధ ఎవరితో చెప్పుకోవాలి?.

ఆకాశాత్ పర్వతాకారః పతమానో నగోత్తమః ।
సిద్ధానాం వాక్యమాకర్ణ్య బాణైశ్ఛిన్నః సహస్రధా ॥63॥

సిద్ధుల మాటలు విని, ఆకాశంనుండి పడిపోతున్న ఒక పర్వతం వంటి వృక్షాన్ని లాఘవంగా బాణపరంపరతో వేయి ఖండాలుగా ఖండించాను.

న చైవ సా వరారోహా విభిన్నా లాఘవాన్మయా ।
న చ జానామి సా కుత్ర తస్మాద్ గచ్ఛామి మార్గితుమ్ ॥64॥

ఆ వృక్షానికున్న సుందరికి మాత్రం ఏ దెబ్బా తగలలేదు. కాని ఆమె ఎక్కడ పడిపోయిందో, ఎక్కడుందో తెలియక నిరంతరం వెదుకుతున్నాను. కాబట్టి నేను ఆమెను వెదకడానికి వెళుతున్నాను.

ఇత్యేవముక్త్వా స నృపః సముత్థాయ త్వరాన్వితః ।
స్యన్దనాని ద్విజాభ్యాం స భ్రాతృపుత్రాయ చార్పయత్ ॥65॥

తేఽధిరుహ్య రథాంస్తూర్ణం మార్గన్తే వసుధాం క్రమాత్ ।
బదర్యాశ్రమమాసాద్య దదృశుస్తపసాం నిధిమ్ ॥66॥

అనిచెప్పి, త్వరగా లేచి, రథాలను తెప్పించి ఋషులిరువురకు, సోదరుని కుమారుడైన శకునికిచ్చి తాను కూడా రథారూఢుడై వారందరు భూమండలమంతా వెదకుతూ బదరీ ఆశ్రమానికి చేరుకుని, అచ్చట ఒక తపోనిధియైన మహర్షిని చూశారు.

తపసా కర్శితం దీనం మలపంకజటాధరమ్ ।
నిఃశ్వాసాయాసపరమం ప్రథమే వయసి స్థితమ్ ॥67॥

యౌవనవయస్సులోనున్న ఆ ముని తపస్సుచే వేగిపోతూ, దుమ్ము పట్టిన జటలు ధరించి, కృశించిపోయి, ఎంతో కష్టంగా ఊపిరి పీలుస్తూ ఉన్నాడు.

తముపేత్యాబ్రవీద్ రాజా ఇంద్రద్యుమ్నో మహాభుజః ।
తపస్విన్ యౌవనే ఘోరమాస్థితోఽసి సుదుశ్చరమ్ ॥68॥

తపః కిమర్థం తచ్ఛంస కిమభిప్రేతముచ్యతామ్ ।

మహాభుజుడైన ఇంద్రద్యుమ్న మహారాజు ఆ తాపసిని సమీపించి, "తపస్వీ! యౌవనంలోనే ఇంతటి ఘోరమైన, కఠినమైన తపస్సు చేస్తున్నావు. నీవు దేనికొరకు తపస్సు చేస్తున్నావు?. దేనిని ఆశించి చేస్తున్నావు?. దానిని తెలియజేయుమని" ప్రశ్నించాడు.

సోఽబ్రవీద్ కో భవాన్ బ్రూహి మమాత్మానం సుహృత్తయా ॥69॥
పరిపృచ్ఛసి శోకార్తం పరిఖిన్నం తపోఽన్వితమ్ ।

అంతట ఆ తపస్వి శోకార్తుడనై, పరిఖిన్నుడనై, తపోన్వితుడనైన నాగురించి మిక్కిలి ప్రేమానురాగాలతో అడుగుతున్న మీరెవరని మహారాజును అడిగాడు.

స ప్రాహ రాజాఽస్మి విభో తపస్విన్ శాకలే పురే ॥70॥

మనోః పుత్రః ప్రియో భ్రాతా ఇక్ష్వాకోః కథితం తవ ।
స చాస్మై పూర్వచరితం సర్వం కథితవాన్ నృపః ॥71॥

ఆ తపస్వికి రాజు "నేను మనువు కుమారుడను. ఇక్ష్వాకునకు ప్రియసోదరుడను. శాకలనగరాధీశుడ ననిచెప్పగా ఆ యువతపస్వి తన పూర్వగాథనంతా వివరించాడు.

శ్రుత్వా ప్రోవాచ రాజర్షిర్మాం ముంచస్వ కలేబరమ్ ।
ఆగచ్ఛ యామి తన్వఙ్గీం విచేతుం భ్రాతృజోఽసి మే ॥72॥

ఇత్యుక్త్వా సంపరిష్వజ్య నృపం ధమనిసంతతమ్ ।
సమారోప్య రథం తూర్ణం తాపసాభ్యాం న్యవేదయత్ ॥73॥

అది విని రాజర్షి ఆ యువతపస్వితో "నీవు శరీరాన్ని విడువవద్దు. నీవు నా సోదరుని కుమారుడవే. నాతో రమ్ము. నీ ప్రియురాలిని అన్వేషించడానికే మేము వెళుతున్నామని పలికి అతనిని కౌగిలించుకుని, రథంపై కూర్చుండబెట్టుకుని, వేగంగా ఋషులవద్దకు తీసికొనిపోయాడు.

ఋతధ్వజః స పుత్రస్తు తం దృష్ట్వా పృథివీపతిమ్ ।
ప్రోవాచ రాజన్నేహ్యేహి కరిష్యామి తవ ప్రియమ్ ॥74॥

యాసౌ చిత్రాంగదా నామ త్వయా దృష్టా హి నైమిషే ।
సప్తగోదావరం తీర్థం సా మయైవ విసర్జితా ॥75॥

తదాగచ్ఛథ గచ్ఛామః సౌదేవస్యైవ కారణాత్ ।
తత్రాస్మాకం సమేష్యన్తి కన్యాస్త్రిస్తథాపరాః ॥76॥

పుత్రునితో కూడిన ఋతధ్వజుడు అతనిని చూసి, అతనితో ఇలా పలికాడు. "ఓ రాజా! రా! రా! నేను నీకు ప్రియం కలుగజేస్తాను. నీవు నైమిశారణ్యంలో చూచిన చిత్రాంగదను నేనే సప్తగోదావరీతీర్థంలో విడిచి వచ్చాను. మీరంతా ఇటురండి! మనమందరం సుదేవుని కుమారుని కొరకు సప్తగోదావరి సంగమానికి వెళదాం. అక్కడే ముగ్గురు కన్యలు, ఇతరులు మనకు కనిపిస్తారు.

ఇత్యేవముక్త్వా స ఋషిః సమాశ్వాస్య సుదేవజమ్ ।
శకునిం పురతః కృత్వా సేన్ద్రద్యుమ్నః సపుత్రకః ॥77॥

స్యన్దనేనాశ్వయుక్తేన గన్తుం సముపచక్రమే ।
సప్తగోదావరీతీర్థం యత్ర తాః కన్యకా గతాః ॥78॥

ఋతధ్వజుడు ఇలాపలికి సుదేవకుమారుని సమాశ్వాసపరచి, శకునిని ముందిడుకుని, తన పుత్రునితో ఇంద్రద్యుమ్నునితో కలిసి అందరూ రథారూఢులై, ఆ కన్యకలు వెళ్ళిన సప్తగోదావరి తీర్థానికి ప్రయాణమయ్యారు.

ఏతస్మిన్నన్తరే తన్వీ ఘృతాచీ శోకసంయుతా ।
విచచారోదయగిరిం విచిన్వతీ సుతాం నిజామ్ ॥79॥

ఇంతలో ఘృతాచి తన కుమార్తెను గానక, శోకమగ్నురాలై, ఉదయగిరినంతటిని తనకుమార్తె కొరకు వెదుకుతు తిరిగింది.

తమాససాద చ కపిం పర్యపృచ్ఛత్ తథాప్సరా ।
కిం బాలా న త్వయా దృష్టా కపే సత్యం వదస్వ మామ్ ॥ 80॥

దారిలో తారసిల్లిన వానరాన్ని చూసి, ఆ అప్సరస "ఓ కపీ! ఒక బాలికను ఎవరినైనా నీవు చూశావా? నాకు నిజం చెప్పు?" అని అడిగింది.

తస్యాస్తద్వచనం శ్రుత్వా స కపిః ప్రాహ బాలికామ్ ।
దృష్టా దేవవతీ నామ్నా మయా న్యస్తా మహాశ్రమే ॥81॥

కాలిన్ద్యా విమలే తీర్థే మృగపక్షిసమన్వితే ।
శ్రీకణ్ఠాయతనస్యాగ్రే మయా సత్యం తవోదితమ్ ॥82॥

ఆమె మాటలను వినిన కపి "దేవవతి అనే పేరుగల బాలికను చూశాను. ఆ బాలికను కాళిందీతీరాన మృగపక్షిసమాకీర్ణమైన అరణ్యంలోని ఒక మహాశ్రమంలో వదలివచ్చాను. ఆ ఆశ్రమం శ్రీకంఠేశ్వరాలయానికి ఎదురుగా ఉంది. ఇది నిజ"మని ఘృతాచితో పలికాడు.

సా ప్రాహ వానరపతే నామ్నా వేదవతీతి సా ।
న హి దేవవతీ ఖ్యాతా తదాగచ్ఛ వ్రజావహే ॥83॥

ఆ మాటలకు ఆ ఘృతాచి "ఓ వానరశ్రేష్ఠా! ఆ బాలికపేరు వేదవతి. దేవవతి కాదు. రా! మనమచ్చటకు వెళదా"మని పలికింది.

ఘృతాచ్యాస్తద్వచః శ్రుత్వా వానరస్త్వరితక్రమః ।
పృష్ఠతోఽస్యాః సమాగచ్ఛన్నదీమన్వేవ కౌశికీమ్ ॥84॥

తే చాపి కౌశికీం ప్రాప్తా రాజర్షిప్రవరాస్త్రయః ।
ద్వితయం తాపసాభ్యాం చ రథైః పరమవేగిభిః ॥85॥

ఘృతాచి మాటలు విని, ఆ వానరం ఘృతాచిని వెంటబెట్టుకుని త్వరగా కౌశికీనదికి వెళ్ళింది. ఆ రాజర్షులు ముగ్గురు, తాపసులు ఇద్దరు కూడా రథాల మీద వేగంగా పయనించి కౌశికీనదికి చేరుకున్నారు.

అవతీర్య రథేభ్యస్తే స్నాతుమభ్యాగమన్ నదీమ్ ।
ఘృతాచ్యపి నదీం స్నాతుం సుపుణ్యామాజగామ హ ॥86॥

వారు రథాలు దిగి, నదిలో పవిత్రస్నానం చేయడానికి వెళ్ళారు. ఘృతాచి కూడా పుణ్యస్నానం చేయడానికి నదిలోనికి దిగింది.

తామన్వేవ కపిః ప్రాయాద్ దృష్టో జాబాలినా తథా ।
దృష్ట్వైవ పితరం ప్రాహ పార్థివం చ మహాబలమ్ ॥87॥

స ఏవ పునరాయాతి వానరస్తాత వేగవాన్ ।
పూర్వం జటాస్వేవ బలాద్యేన బద్ధోఽస్మి పాదపే ॥88॥

జాబాలి ఆ ప్రక్కనేయున్న వానరాన్ని చూడగానే తన తండ్రితోను, మహావీరుడైన చక్రవర్తితోను ఇలా పలికాడు. "తండ్రీ! పూర్వం నా జడలతో చెట్టుకు బంధించిన వానరుడితడే. ఆ దుష్టవానరుడు వేగంగా మళ్ళీ ఇటే వస్తున్నాడు".

తజ్జాబాలివచః శ్రుత్వా శకునిః క్రోధసంయుతః ।
స శరం ధనురాదాయ ఇదం వచనమబ్రవీత్ ॥89॥

బ్రహ్మన్ ప్రదీయతాం మహ్యమాజ్ఞాం తాత వదస్వ మామ్ ।
యావదేనం నిహన్మ్యద్య శరేణైకేన వానరమ్ ॥90॥

ఇత్యేవముక్తే వచనే సర్వభూతహితే రతః ।
మహర్షిః శకునిం ప్రాహ హేతుయుక్తం వచో మహత్ ॥91॥

న కశ్చిత్తాత కేనాపి బధ్యతే హన్యతేఽపి వా ।
వధబన్ధౌ పూర్వకర్మవశ్యౌ నృపతినన్దన ॥92॥

శకుని మాటలను విని, సర్వభూతహితుడైన ఋతధ్వజుడు వారించి, హేతుయుక్తంగా ఇలా పలికాడు. "వత్సా! ఈ లోకంలో ఎవరూ ఎవరిని బంధింపజాలరు. అంతే కాదు చంపజాలరు కూడా. ఓ రాజకుమారా! మరణాలు గాని, బన్ధనాలు గాని, వారి వారి పూర్వకర్మలను అనుసరించియే కలుగుతాయి".

ఇత్యేవముక్త్వా శకునిమృషిర్వానరమబ్రవీత్ ।
ఏహ్యేతి వానరాస్మాకం సాహాయ్యం కర్తుమర్హసి ॥93॥

ఋతధ్వజుడు ఈ విధంగా శకునికి చెప్పి, వానరంతో ఇలా పలికాడు. "వానరా! ఇటు రమ్ము. నీ వలన మాకొక సహాయం కావాలి". అన్నాడు.

ఇత్యేవముక్తో మునినా బాలే స కపికుఞ్జరః ।
కృతాంజలిపుటో భూత్వా ప్రణిపత్యేదమబ్రవీత్ ।
మమాజ్ఞా దీయతాం బ్రహ్మన్ శాధి కిం కరవాణ్యహమ్ ॥94॥

ఆ ముని మాటలు వినిన వానరం చేతులు జోడించి, ప్రణామం చేసి, "ఓ బ్రహ్మర్షీ! ఆజ్ఞాపించండి, నేనేమి చేయాలో శాసించండి" అని ప్రార్థించాడు.

ఇత్యుక్తే ప్రాహ స మునిస్తం వానరపతిం వచః ।
మమ పుత్రస్త్వయోద్బద్ధో జటాసు వటపాదపే ॥95॥

అలా పలికిన వానరపతితో ఋతధ్వజుడు "పూర్వం నీవు నా కుమారుని జటలతో వటవృక్షానికి బంధించావు.

న చోన్మోచయితుం వృక్షాచ్ఛక్నుయామోఽపి యత్నతః ।
తదనేన నరేంద్రేణ త్రిధా కృత్వా తు శాఖినః ॥96॥

శాఖాం వహతి మత్సూనుః శిరసా తాం విమోచయ ।
దశవర్షశతాన్యస్య శాఖాం వై వహతోఽగమన్ ॥97॥

న చ సోఽస్తి పుమాన్ కశ్చిద్ యోహ్యున్మోచయితుం క్షమః ।
స ఋషేర్వాక్యమాకర్ణ్య కపిర్జ్హాలినో జటాః ॥98॥

శనైరున్మోచయామాస క్షణాదున్మోచితాశ్చ తాః ।
తతః ప్రీతో మునిశ్రేష్ఠో వరదోఽభూదృతధ్వజః ॥99॥

కపిం ప్రాహ వృణీష్వ త్వం వరం యన్మనసేప్సితమ్ ।

జాబాలి మాటలను శకుని విని, కోపంతో మండిపడి, ధనుర్బాణాలను స్వీకరించి, రాజుతోను, మహర్షితోను ఇలా పలికాడు. "బ్రహ్మన్! నాకు అనుజ్ఞనీయండి! తండ్రీ! మీరొక్కమాట చెప్పండి. వెంటనే ఒకే బాణంతో ఈ దుష్టవానరాన్ని సంహరిస్తాను" అన్నాడు. ఎంత ప్రయత్నించినా ఆ బంధనం నుండి విడిపించుకొనలేక పోయాం. ఈ మహారాజు సాయంతో ఆ కొమ్మను మూడు ఖండాలుగా నరికి బాలుని విడిపించుకున్నాం. కాని జడలతో నీవు కొమ్మకు బిగించిన కట్లు విప్పడం ఎవరికీ శక్యం కాకపోవడంచేత ఆ బాలుడు గతించిన వేయి సంవత్సరాలనుండి తలకు కట్టబడిన కొమ్మబరువు మోస్తూ తిరుగుతున్నాడు. కావున ఆ కట్లు విప్పి వానికి పూర్తిగా బరువునుండి విముక్తి కలిగించుమని పలికాడు. ఆ ఋషి మాటలను విని వానరం మెల్లగా జాబాలి జటల చిక్కుముడులు విప్పి జాబాలికి క్షణంలో విముక్తి కలిగించాడు. అంతట మునిశ్రేష్ఠుడు మిక్కిలి ప్రీతుడై ఆ కపిని నీకు కావలసిన ఏదేని వరం కోరుకొమ్మని చెప్పాడు.

ఋతధ్వజవచశ్శ్రుత్వా ఇమం వరమయాచత ॥100॥

విశ్వకర్మా మహాతేజాః కపిత్వే ప్రతిసంస్థితః ।
బ్రహ్మన్ భవాన్ వరం మహ్యం యది దాతుమిహేచ్ఛసి ॥101॥

తత్ స్వదత్తో మహాఘోరో మమ శాపో నివర్త్యతామ్ ।
చిత్రాఙ్గదాయాః పితరం మాం త్వష్టారం తపోధన ॥102॥

అభిజానీహి భవతః శాపాద్వానరతాం గతమ్ ।
సుబహూని చ పాపాని మయా యాని కృతాని హి ॥103॥

కపిచాపల్యదోషేణ తాని మే యాంతు సంక్షయమ్ ।

ఋతధ్వజుని మాటలు వని, వానరుడుగానున్న మహాతేజస్వియైన విశ్వకర్మ ఇలా వరమడిగాడు. "బ్రహ్మన్! భగవాన్! మీరు నాకు వరమీయదలచినచో ఒకనాడు తమరు నాకిచ్చిన మహాకఠోరశాపాన్ని ఉపసంహరించండి. ఓ తపోధనా! తమచే శాపం పొంది, వానరుడనైన చిత్రాంగద తండ్రినీ, అభాగ్యుడనైన దేవశిల్పిని, విశ్వకర్మను, నేనేనని తెలుపుకుంటున్నాను. కపిచాపల్యం వల్ల నాచే చేయబడిన పాపాలనన్నిటిని నశింపజేసి, నన్ను అనుగ్రహించండి" అని వరమడిగాడు.

ఋతధ్వజస్తతః ప్రాహ శాపస్యాన్తో భవిష్యతి ॥104॥

యదా ఘృతాచ్యాం తనయం జనిష్యసి మహాబలమ్ ।

అంతట ఋతధ్వజుడు ఏనాడు నీవు ఘృతాచి వలన మహాబలుడైన కుమారుని పొందుతావో ఆనాటితో నీకు కలిగిన శాపం సమాప్తమవుతుందని వానరంతో పలికాడు.

ఇత్యేవముక్తః సంహృష్టః స తదా కపికుంజరః ॥105॥

స్నాతుం తూర్ణం మహానద్యామవతీర్ణః కృశోదరి ।
తతస్తు సర్వే క్రమశః స్నాత్వా చ పితృదేవతాః ॥106॥

జగ్ముర్హృష్టా రథేభ్యస్తే ఘృతాచీ దివముత్పతమ్ ।
తమన్వేవ మహావేగః స కపిః ప్లవతాం వరః ॥107॥

ఋతధ్వజుని శాపాంతసూచనలను వినిన కపివరుడు సంతసించి, స్నానార్థం మహానదిలో దిగాడు. ఇతరులందరు కూడ క్రమంగా పవిత్రస్నానాలు చేసి, పితృదేవతలనర్చించారు. వారందరు సంతుష్టులై తమ తమ రథాలనెక్కి వెళ్ళిపోయారు. ఘృతాచి గగనమార్గానికి ఎగిరిపోగా ఆ కపివరుడు మహావేగంగా ఆమెను వెంబడించాడు.

దదృశే రూపసంపన్నాం ఘృతాచీం స ప్లవఙ్గమః ।
సాఽపి తం బలినాం శ్రేష్ఠం దృష్ట్వైవ కపికుంజరమ్ ॥108॥

జ్ఞాత్వాఽథ విశ్వకర్మాణం కామయామాస కామినీ ।
తతోఽనుపర్వతశ్రేష్ఠే ఖ్యాతే కోలాహలే కపిః ॥109॥

రమయామాస తాం తన్వీం సా చ తం వానరోత్తమమ్ ।
ఏవం రమన్తౌ సుచిరం సంప్రాప్తౌ విన్ధ్యపర్వతమ్ ॥110॥

ఆ వానరుడు సర్వాఙ్గసుందరియైన ఘృతాచిని సమీపించి దర్శించాడు. ఆమె కూడా బలవంతుడైన కపిశ్రేష్ఠుని గాంచి, విశ్వకర్మగా గుర్తించి, అతనిని కామించింది. అంతట వారిరువురు కోలాహలపర్వతప్రాంతంలో యథేచ్ఛగా రమిస్తూ, ఒకరినొకరు సంతృప్తి పరచుకుంటూ విహరించారు. అలా విహరిస్తూ చాలాకాలానికి వింధ్యపర్వతానికి చేరుకున్నారు.

రథైః పంచాపి తత్తీర్థం సంప్రాప్తాస్తే నరోత్తమాః ।
మధ్యాహ్నసమయే ప్రీతాః సప్తగోదావరీజలమ్ ॥111॥

ఋతధ్వజుడు, మిగిలిన రాజులు మొత్తం ఐదుగురు రథాలమీద మధ్యాహ్నవేళకు సప్తగోదావరీక్షేత్రానికి ప్రీతితో చేరుకున్నారు.

ప్రాప్య విశ్రామహేత్వర్థమవతేరుస్త్వరాన్వితాః ।
తేషాం సారథయశ్చాశ్వాన్ స్నాత్వా పీతోదకాప్లుతాన్ ॥112॥

రమణీయే వనోద్దేశే ప్రచారార్థే సముత్సృజన్ ।
శాద్వలాఢ్యేషు దేశేషు ముహూర్తాదేవ వాజినః ॥113॥

తృప్తాః సమాద్రవన్ సర్వే దేవాయతనముత్తమమ్ ।
తురఙ్గఖురనిర్ఘోషం శ్రుత్వా తా యోషితాం వరాః ॥114॥

కిమేతదితి చోక్త్వైవ ప్రజగ్ముర్హాటకేశ్వరమ్ ।
ఆరుహ్య వలభీం తాస్తు సముద్వైక్షన్త సర్వశః ॥115॥

అచ్చటకు చేరి, విశ్రాంతి కోసం త్వరత్వరగా రథాలు దిగారు. సారథులు గుఱ్ఱాలను కడిగి, నిర్మలోదకాలు త్రావించి, చుట్టుప్రక్కల గల అందమైన పచ్చిక బయళ్ళలోనికి మేతకై వదిలారు. అవి ముహూర్తకాలంలో కడుపునిండా మేత మేసి, తృప్తి చెందాయి. అనంతరం అందరు రథాలెక్కి హాటకేశ్వరాలయానికి వెళ్ళారు. అచ్చటనున్న స్త్రీరత్నాలు గుఱ్ఱపుడెక్కల చప్పుళ్ళు విని, అదిఏమో తెలుసుకుందామని దేవాలయ పైభాగానికి ఎక్కి, నలువైపులా తేరిపార చూడసాగారు.

అపశ్యంస్తీర్థసలిలే స్నాయమానాన్ నరోత్తమాన్ ।
తతశ్చిత్రాఙ్గదా దృష్ట్వా జటామండలధారిణమ్ ।
సురథం హసతీ ప్రాహ సంరోహత్పులకా సఖీమ్ ॥116॥

వారందరు పవిత్రతీర్థంలో స్నానాలుచేస్తున్న రాజులను చూశారు. వారిలో జటామండలధారియైన సురథుని చిత్రాంగద చూసి, సంతోషంతో శరీరం గగుర్పాటుపొందగా తన సఖులతో ఇలా పలికింది.

యోఽసౌ యువా నీలఘనప్రకాశః సందృశ్యతే దీర్ఘభుజః సురూపః ।
స ఏవ నూనం నరదేవసూనుర్వృతో మయా పూర్వతరం పతిర్యః ॥117॥

యశ్చైష జాంబూనదతుల్యవర్ణః శ్వేతం జటాభారమధారయిష్యత్ ।
స ఏవ నూనం తపతాం వరిష్ఠ ఋతధ్వజో నాత్ర విచారమస్తి ॥118॥

"అడుగో అక్కడ నల్లనిమేఘంవలె ప్రకాశిస్తున్న యువకుడు, అందగాడు, దీర్ఘబాహువులు గలవాడు, పూర్వం నాచే వరింపబడిన రాజకుమారుడు, నా భర్త అతడే. నిశ్చయంగా అతడే. బంగారు వన్నెతో ప్రకాశిస్తూ తెల్లని జటాభారం ధరించిన తాపసశ్రేష్ఠుడు ఎవడైతే ఉన్నాడో అతడే ఋతధ్వజుడు. ఇందులో ఏమాత్రం సందేహం లేదు".

తతోఽబ్రవీదథో దృష్ట్వా నందయన్తీ సఖీజనమ్ ।
ఏషోఽపరోఽస్యైవ సుతో జాబాలిర్నాత్ర సంశయః ॥119॥

అంతట నందయన్తి కూడా చూచి, ఆనందంతో "అడుగో అక్కడ ఇంకొకడు ఉన్నాడు కదా! అతడు ఋతధ్వజుని కుమారుడైన జాబాలిమహర్షియే. ఇందులో సందేహమేమీలేద"ని సఖులతో పలికింది.

ఇత్యేవముక్త్వా వచనం వలభ్యా అవతీర్య చ ।
సమాసతాగ్రతః శంభోర్గాయంత్యో గీతికాం శుభామ్ ॥120॥

వారందరు ఇలాపలికి వలభి (మేడ) నుండి క్రిందకు దిగి, హాటకేశ్వరమహాదేవునికభిముఖంగా నిలబడి, ఆ భక్తవత్సలుడైన మహాదేవుని ఇలా స్తోత్రం చేయసాగారు.

ఓం నమోఽస్తు శర్వ శంభో త్రినేత్ర చారుగాత్ర త్రైలోక్యనాథ ఉమాపతే దక్షయజ్ఞవిధ్వంసకర కామాంగ నాశన ఘోరపాపప్రణాశన మహాపురుష మహోగ్రమూర్తే సర్వసత్త్వక్షయంకర శుభంకర మహేశ్వర త్రిశూలధారిన్ స్మరారే గుహావాసిన్ దిగ్వాసః మహాశంఖశేఖర జటాధర కపాలమాలావిభూషితశరీర వామచక్షుః వామదేవ ప్రజాధ్యక్ష భగాక్ష్ణోః క్షయంకర భీమసేన మహాసేననాథ పశుపతే కామాఙ్గదహన చత్వరవాసిన్ శివ మహాదేవ ఈశాన శంకర భీమ భవ వృషభధ్వజ జటిల ప్రౌఢ మహానాట్యేశ్వర భూరిరత్న అవిముక్తక రుద్ర రుద్రేశ్వర స్థాణో ఏకలింగ కాలిందీప్రియ శ్రీకంఠ నీలకంఠ అపరాజిత రిపుభయంకర సంతోషపతే వామదేవ అఘోర తత్పురుష మహాఘోర అఘోరమూర్తే శాంత సరస్వతీకాన్త సహస్రమూర్తే మహోద్భవ విభో కాలాగ్నిరుద్ర రుద్ర హర మహీధరప్రియ సర్వతీర్థాధివాస హంస కామేశ్వర కేదారాధిపతే పరిపూర్ణ ముచుకుంద మధునివాసిన్ కృపాణపాణే భయంకర విద్యారాజ సోమరాజ కామరాజ రంజక అంజనరాజకన్యాహృదచలవసతే సముద్రశాయిన్ గజముఖ ఘంటేశ్వర గోకర్ణ బ్రహ్మయోనే సహస్రవక్త్రాక్షిచరణ హాటకేశ్వర నమోఽస్తు తే ॥121॥

ఓ శర్వా నమస్కారం! ఓ శంభో! ఓ త్రినేత్రా! ఓ చారుగాత్రా! ఓ త్రైలోక్యనాథా! ఓ ఉమాపతే! ఓ దక్షయజ్ఞ విధ్వంసకరా! ఓ కామాంగనాశనా! ఓ ఘోరపాపప్రణాశనా! ఓ మహాపురుషా! ఓ మహోగ్రమూర్తే! ఓ సర్వసత్త్వక్షయంకరా (సర్వజీవులను లయమొనర్చువాడా)! ఓ శుభంకరా! ఓ మహేశ్వరా! ఓ త్రిశూలధారీ! ఓ స్మరారే (మదనునకు శత్రుడా)! ఓ గుహావాసీ! ఓ దిగ్వాసా (దిగంబరా)! ఓ మహాశంఖ శేఖరా(కపాలధరా)! ఓ జటాధరా! ఓ కపాలమాలా విభూషిత శరీరా (కపాలమాలచే అలంకరింపబడిన శరీరం కలవాడా)! ఓ వామచక్షూ (చక్కని కన్నులు కలవాడా)! ఓ వామదేవా! ఓ ప్రజాధ్యక్షా! ఓ భగాక్షిక్షయంకరా (భగుని కన్ను చిదిమినవాడా)! ఓ భీమసేనా! ఓ మహాసేనానాథా! ఓ పశుపతీ! ఓ కామాంగదహనా! ఓ చత్వరవాసీ (యజ్ఞవేదికయందు నివసించువాడా)! ఓ శివా! ఓ మహాదేవా! ఓ ఈశానా! ఓ శంకరా! ఓ భీమా! ఓ భవా! ఓ వృషభధ్వజా! ఓ జటిలా(జటాధరా)! ఓ ప్రౌఢా! ఓ మహానాట్యేశ్వరా! ఓ భూరిరత్నా (మహారత్నకాంతిధరా)! ఓ అవిముక్తకా! ఓ రుద్రా! ఓ రుద్రేశ్వరా! ఓ స్థాణూ! ఓ ఏకలింగేశ్వరా! ఓ కాళిందీప్రియా! ఓ శ్రీకంఠా! ఓ నీలకంఠా! ఓ అపరాజితా (అజేయుడా)! ఓ రిపుభయంకరా(శత్రు భయంకరుడా)! ఓ సంతోషపతీ! ఓ వామదేవా! ఓ అఘోరా! ఓ తత్పురుషా! ఓ మహాఘోరా! ఓ అఘోరమూర్తీ (సౌమ్యమూర్తీ)! ఓ శాన్తా! ఓ సరస్వతీకాన్తా (సరస్వతీ వల్లభా)! ఓ సహస్రమూర్తీ! ఓ మహోద్భవా! ఓ విభూ! ఓ కాలాగ్నిరుద్రా! ఓ రుద్రా! ఓ హరా! ఓ మహీధరప్రియా! ఓ సర్వతీర్థాధివాసా! ఓ హంసా! ఓ కామేశ్వరా! ఓ కేదారనాథా! ఓపరిపూర్ణా! ఓముచుకుందా! ఓమధునివాసా(తేనెలోని తీపిరూపంలో ఉండే ప్రభూ)! ఓ కృపాణపాణీ (ఖడ్గపాణీ)! ఓ భయంకరా! ఓ విద్యారాజా! ఓ సోమరాజా! ఓ కామరాజా! ఓ రంజకా (రంజింపజేయువాడా)! ఓ అంజనరాజకన్యా హృదయాచలవాసా! ఓ సముద్రశాయీ! ఓ గజముఖా! ఓ ఘంటేశ్వరా! ఓ గోకర్ణేశ్వరా! ఓ బ్రహ్మయోనీ! ఓ సహస్ర వక్త్రాక్షి చరణా (వేలాది తలలు నేత్రాలు చరణాలు కలవాడా)! ఓ హాటకేశ్వరా! నీకు నమస్సులు.

ఏతస్మిన్నన్తరే ప్రాప్తాః సర్వ ఏవర్షిపార్థివాః ।
ద్రష్టుం త్రైలోక్యకర్తారం త్ర్యంబకం హాటకేశ్వరమ్ ॥122॥

ఇట్లు ఆ కోమలులు గానం చేస్తుండగా ఆ ఋషులు, నరపతులు, ముల్లోకకర్తయు, త్రినేత్రుడునైన హాటకేశ్వరుని దర్శించడానికి వచ్చారు.

సమారూఢాశ్చ సుస్నాతా దదృశుర్యోషితశ్చ తాః ।
స్థితాస్తు పురతస్తస్య గాయన్త్యో గేయముత్తమమ్ ॥123॥

ఆలయంలో హాటకేశ్వరుని ఎదుట కూర్చుని గీతాలాపన చేస్తున్న ఆ కన్యలను స్నానానంతరం వారు చూశారు.

తతః సుదేవతనయో విశ్వకర్మసుతాం ప్రియామ్ ।
దృష్ట్వా హృషితచిత్తస్తు సంరోహత్పులకో బభౌ ॥124॥

సుదేవకుమారుడు గీతాలాపన చేస్తున్న వారిలో విశ్వకర్మతనయను గుర్తుపట్టి సంతోషంతో గగుర్పాటు పొందాడు.

ఋతధ్వజోఽపి తన్వంగీం దృష్ట్వా చిత్రాంగదాం స్థితామ్ ।
ప్రత్యభిజ్ఞాయ యోగాత్మా బభౌ ముదితమానసః ॥125॥

ఋతధ్వజుడు కూడా చిత్రాంగదను చూచి, గుర్తించి యోగదృష్టితో సర్వమూ తెలిసికొని ఆనందించాడు.

తతస్తు సహసాఽభ్యేత్య దేవేశం హాటకేశ్వరమ్ ।
సంపూజయన్తస్త్ర్యక్షం తే స్తువన్తః సంస్థితాః క్రమాత్ ॥126॥

అంతట వారందరు లేచి, త్వరగా హాటకేశ్వరుని సమీపించి, పూజించి క్రమంగా స్తోత్రాలు గావించారు.

చిత్రాంగదాపి తాన్ దృష్ట్వా ఋతధ్వజపురోగమాన్ ।
సమంతాభిః కృశాంగీభిరభ్యుత్థాయాభ్యవాదయన్ ॥127॥

ఋతధ్వజునితో కలిసివచ్చిన వారలను చూచి చిత్రాంగద తన సఖులతో లేచి వారికి నమస్కరించింది.

స చ తాః ప్రతివంద్యైవ సమం పుత్రేణ తాపసః ।
సమం నృపతిభిర్హృష్టః సంవివేశ యథా సుఖమ్ ॥128॥

అంతట ఆ మహర్షికుమారుడు తక్కిన రాజులతో కలసి వారికందరికి ప్రత్యభివందనాలు చేశాడు. సంతోషంతో అందరూ కూర్చున్నారు.

తతః కపివరః ప్రాప్తో ఘృతాచ్యా సహ సున్దరి ।
స్నాత్వా గోదావరీతీర్థే దిదృక్షుర్హాటకేశ్వరమ్ ॥129॥

అదే సమయంలో వానరవీరుడు ఘృతాచితో కలిసి అక్కడకు వచ్చి గోదావరీతీర్థంలో స్నానమాచరించి, హాటకేశ్వరదర్శనానికి ఆలయంలో ప్రవేశించాడు.

తతోఽపశ్యత్ సుతాం తన్వీం ఘృతాచీ శుభదర్శనామ్ ।
సాఽపి తాం మాతరం దృష్ట్వా హృష్టాఽభూద్వరవర్ణినీ ॥130॥

అక్కడనున్న తన కుమార్తెను చూచి ఘృతాచియు, తల్లిని చూసి వేదవతియు, ఆనందాతిరేకం పొందారు.

తతో ఘృతాచీ స్వాం పుత్రీం పరిష్వజ్య న్యపీడయత్ ।
స్నేహాత్ సబాష్పనయనాం ముహుస్తాం పరిజిఘ్రతీ ॥131॥

అప్పుడు ఘృతాచి తన కుమార్తెను చూసి, గాఢంగా కౌగిలించుకొని, ఆనందంతో కన్నీళ్ళు జలజలా రాల్చింది. చిత్రాంగద కూడా అట్లే తల్లిని కౌగిలించుకుని ఆనందంతో కన్నీరు కార్చింది.

ఋతధ్వజస్తతః శ్రీమాన్ కపిం వచనమబ్రవీత్ ।
గచ్ఛానేతుం గుహ్యకం త్వమంజనాద్రౌ మహాంజనమ్ ॥132॥

పాతాలాదపి దైత్యేశం వీరం కన్దరమాలినమ్ ।
స్వర్గాత్ గంధర్వరాజానం పర్జన్యం శీఘ్రమానయ ॥133॥

అంతట ఋతధ్వజుడు ఆ వానరవీరునితో ఇలా పలికాడు. "నీవు వెంటనే అంజనాద్రికి వెళ్ళి యక్షేశ్వరుడైన అంజనుని, అట్లే పాతాళంనుండి దైత్యేంద్రుడైన కందరమాలిని, స్వర్గానికివెళ్ళి గంధర్వరాజైన పర్జన్యుని వేగంగా తీసుకొని రా!" అని ఆదేశించాడు.

ఇత్యేవముక్తే మునినా ప్రాహ దేవవతీ కపిమ్ ।
గాలవం వానరశ్రేష్ఠ ఇహానేతుం త్వమర్హసి ॥134॥

ఋతధ్వజుడు ఇట్లు పలుకగానే దేవవతికూడా వానరశ్రేష్ఠునితో "ఓ వానరశ్రేష్ఠా! గాలవమహర్షిని కూడా ఇక్కడకు తీసికొనిరా!" అని అర్థించింది.

ఇత్యేవముక్తే వచనే కపిర్మారుతవిక్రమః ।
గత్వాంజనం సమామంత్ర్య జగామామరపర్వతమ్ ॥135॥

పర్జన్యం తత్ర చామంత్ర్య ప్రేషయిత్వా మహాశ్రమే ।
సప్తగోదావరీతీర్థే పాతాలమగమత్కపిః ॥136॥

వారిట్లు ఆదేశించగానే వాయువిక్రముడైన వానరవీరుడు వాయువేగంతో వెళ్ళి, అంజనుని పిలచి, అమరపర్వతానికి వెళ్ళి, పర్జన్యుని సప్తగోదావరి మహాశ్రమానికి వెళ్ళమని పంపించి, తాను పాతాళానికి వెళ్ళాడు.

తత్రామంత్ర్య మహావీర్యః కపిః కన్దరమాలినమ్ ।
పాతాలాదభినిష్క్రమ్య మహీం పర్యచరజ్జవీ ॥137॥

గాలవం తపసో యోనిం దృష్ట్వా మాహిష్మతీమను ।
సముత్పత్యానయచ్ఛీఘ్రం సప్తగోదావరం జలమ్ ॥138॥

అక్కడ గొప్ప బలవంతుడైన ఆ వానరవీరుడు కందరమాలిని పిలిచి, పాతాళంనుండి వేగంగా నిష్క్రమించి, భూమిమీదకు చేరి, గాలవముని కొరకు మాహిష్మతికి వెళ్ళాడు. అచ్చట తపస్వియైన గాలవుని చూసి, తనతో ఆకాశమార్గాన సప్తగోదావరానికి తీసుకొని వచ్చాడు.

తత్ర స్నాత్వా విధానేన సంప్రాప్తో హాటకేశ్వరమ్ ।
దదృశే నన్దయన్తీ చ స్థితాం దేవవతీమపి ॥139॥

వారిరువురు సప్తగోదావరీతీర్థంలో స్నానం చేసి, హాటకేశ్వరుని చెంతకు చేరారు. అచ్చట ఆ ముని నందయన్తినీ, దేవవతినీ చూశాడు.

తం దృష్ట్వా గాలవం చైవ సముత్థాయాభ్యవాదయత్ ।
స చార్చిష్యన్ మహాదేవం మహర్షీనభ్యవాదయత్ ॥
తే చాపి నృపతిశ్రేష్ఠాస్తం సంపూజ్య తపోధనమ్ ॥140॥
ప్రహర్షమతులం గత్వా ఉపవిష్టా యథాసుఖమ్ ।

అ కన్యలిద్దరు లేచి, గాలవమునికి వినయంతో నమస్కరించారు. గాలవుడు మహాదేవుని అర్చించి, అచ్చటనున్న ఋషులకు అభివాదనం చేశాడు. అచ్చటనున్న రాజశ్రేష్ఠులు ఆ తపోధనుడైన గాలవుని యథావిధిగా అర్చించారు. అందరు సంతోషాన్వితులై సుఖంగా కూర్చున్నారు.

తేషూపవిష్టేషు తదా వానరోపనిమంత్రితాః ॥141॥

సమాయాతా మహాత్మానో యక్షగన్ధర్వదానవాః ।
తానాగతాన్ సమీక్ష్యైవ పుత్ర్యస్తాః పృథులోచనాః ॥142॥

స్నేహార్ద్రనయనాః సర్వాస్తదా సస్వజిరే పితౄన్ ।
నన్దయన్త్యాదికా దృష్ట్వా సపితృకా వరాననా ॥143॥

సబాష్పనయనా జాతా విశ్వకర్మసుతా తదా ।
అథ తామాహ స మునిః సత్యం సత్యధ్వజో వచః ॥144॥

వారావిధంగా కూర్చొనియుండగా వానరునిచే పిలువబడిన యక్షగన్ధర్వ దైత్యులు వచ్చి చేరారు. అంతట ప్రేమతో చెమ్మగిల్లిన నేత్రాలతో ఆ ముగ్గురు తమ తప్పిపోయిన పుత్రికలను కౌగిలించుకున్నారు. నందయంతీ మొదలైనవారు తండ్రులను చూసి, ఆనందంతో కంటతడి పెట్టారు. విశ్వకర్మ కుమార్తెయైన చిత్రాంగద తన తండ్రి రానందుకు కన్నీరు విడిచింది. దానిని చూచిన ఋతధ్వజుడు సత్యవాక్యాన్ని ఇలా పలికాడు.

మా విషాదం కృథాః పుత్రి పితాఽయం తవ వానరః ।
సా తద్వచనమాకర్ణ్య వ్రీడోపహతచేతనా ॥145॥

కథం తు విశ్వకర్మాఽసౌ వానరత్వం గతోఽధునా ।
దుష్పుత్ర్యాం మయి జాతాయాం తస్మాత్ త్యక్ష్యే కలేబరమ్ ॥146॥

ఇతి సంచింత్య మనసా ఋతధ్వజమువాచ హ ।
పరిత్రాయస్వ మాం బ్రహ్మన్ పాపోపహతచేతనామ్ ॥147॥

పితృఘ్నీ మర్తుమిచ్ఛామి తదనుజ్ఞాతుమర్హసి ।

ఓ పుత్రీ! విచారింపకుము. ఈ కపివరుడే నీతండ్రి అని సత్యం వెల్లడించగా ఆ బాలిక సిగ్గుతో విశ్వకర్మకు వానరత్వమెట్లు కలిగిందో గదా? నా వంటి దుష్పుత్రిక జన్మించినందువలననే ఈ దుస్థితి కలిగియుంటుంది. కాబట్టి ఈ శరీరాన్ని విడుస్తానని నిశ్చయించుకొని ఋతధ్వజునితో ఇలా పలికింది. "స్వామీ! నన్ను రక్షించండి. నేను పాపాత్మురాలను. పితృహంతకురాలిని. కావున నేను మరణించాలని నిశ్చయించుకున్నాను. కావున నాకు మరణించడానికి అనుమతించు" మని ఋతధ్వజుని వేడుకున్నది.

అథోవాచ మునిస్తన్వీం మా విషాదం కృతాధునా ॥148॥
భావ్యస్య నైవ నాశోఽస్తి తన్మాత్యాక్షీః కలేబరమ్ ।
భవిష్యతి పితా తుభ్యం భూయోఽప్యమరవర్ధకిః ॥149॥

జాతేఽపత్యే ఘృతాచ్యాస్తు నాత్ర కార్యా విచారణా ।

అందులకు ఆ ముని "నీవిప్పుడు విచారింపకుము. భవితవ్యాన్ని ఎవరు తప్పించుకోలేరు. నీవు శరీరాన్ని విడువవద్దు. మరలా ఇతడు నీ తండ్రిరూపాన్ని పొందుతాడు. ఈ వానరునకు ఘృతాచివలన పుత్రుడు కలుగగానే ఇతనికి శాపం తొలగిపోయి, పూర్వపు రూపం పొందుతాడు. ఇందులో ఆలోచించవలసినది ఏమియూ లేదు" అని చిత్రాంగదను ఓదార్చాడు.

ఇత్యేవముక్తే వచనే మునినా భావితాత్మనా ॥150॥

ఘృతాచీ తాం సమభ్యేత్య ప్రాహ చిత్రాంగదాం వచః ।
పుత్రి త్యజస్వ శోకం త్వం మాసైర్దశభిరాత్మజః ॥151॥

భవిష్యతి పితుస్తుభ్యం మత్సకాశాన్న సంశయః ।
ఇత్యేవముక్త్వా సంహృష్టా బభౌ చిత్రాంగదా తదా ॥152॥

ఆ ముని చిత్రాంగదతో ఇలా పలుకగా ఘృతాచి ఆమెను సమీపించి, పుత్రీ విచారించకు. పది నెలలలో నా వల్ల నీ తండ్రికి పుత్రుడు కలుగుతాడు. ఇందులో సందేహంలేదు. అంతవరకు వేచియుండుమని నచ్చచెప్పింది. అది విని చిత్రాంగద సంతోషించింది.

ప్రతీక్షన్తీ సుచార్వఙ్గీ వివాహే పితృదర్శనమ్ ।
సర్వాస్తా అపి తావన్తం కాలం సుతనుకన్యకాః ॥153॥

ప్రత్యైక్షన్త వివాహం హి తస్యా ఏవ ప్రియేప్సయా ।
తతో దశసు మాసేషు సమతీతేష్వథాప్సరాః ॥154॥

తస్మిన్ గోదావరీతీర్థే ప్రసూతా తనయం నలమ్ ।
జాతేఽపత్యే కపిత్వాచ్చ విశ్వకర్మాప్యముచ్యత ॥155॥

తండ్రి సమక్షంలో వివాహం చేసుకోవాలని తలంచిన చిత్రాంగద అందుకొరకు ప్రతీక్షించసాగింది. తక్కిన ముగ్గురు కన్యలు కూడా తమ నెచ్చెలితో బాటే తమ వివాహాలు కూడా వాయిదా వేసుకున్నారు. ఆ స్నేహితురాండ్ర సంకల్పం ఫలించి పదినెలలు గడచిన తరువాత ఘృతాచి ఆ గోదావరీతీర్థంలో నలుడను కుమారుని ప్రసవించింది. పుత్రుడు కలుగగానే కపిరూపం వదలి విశ్వకర్మ తన రూపాన్ని పొందాడు.

సమభ్యేత్య ప్రియాం పుత్రీం పర్యష్వజత చాదరాత్ ।
తతః ప్రీతేన మనసా సస్మార సురవర్ధకిః ॥156॥

సురాణామధిపం శక్రం సహైవ సురకిన్నరైః ।
త్వష్ట్రాఽథ సంస్మృతః శక్రోః మరుద్గణవృతస్తదా ॥157॥

సురైః స రుద్రైః సంప్రాప్తస్తత్తీర్థం హాటకాహ్వయమ్ ।

తన నిజరూపమైన విశ్వకర్మ రూపం పొందగానే మిక్కిలి ప్రేమతో తన ప్రియపుత్రికను ఆలింగనం చేసుకున్నాడు. ఆ విధంగా సంతోషాంతరంగుడైన విశ్వకర్మ దేవరాజైన ఇంద్రుని, సురకిన్నరాదులను మనసా స్మరించుకున్నాడు. దేవశిల్పి ఆ విధంగా స్మరించగానే శక్రుడు, మరుత్తులు, సురలు, రుద్రగణాలతోసహా హాటకేశ్వర క్షేత్రానికి వచ్చిచేరారు.

సమాయాతేషు దేవేషు గన్ధర్వేష్వప్సరస్సు చ ॥158॥

ఇంద్రద్యుమ్నో మునిశ్రేష్ఠమృతధ్వజమువాచ హ ।
జాబాలేర్దీయతాం బ్రహ్మన్ సుతా కందరమాలినః ॥159॥

గృహ్ణాతు విధివత్ పాణిం దైతేయ్యాస్తనయస్తవ ।
నన్దయన్తీం చ శకునిః పరిణేతుం స్వరూపవాన్ ॥160॥

మమేయం వేదవత్యస్తు త్వాష్ట్రేయీ సురథస్య చ ।
బాఢమిత్యబ్రవీత్ హృష్టో మునిర్మనుసుతం నృపమ్ ॥161॥

తతోఽనుచక్రుః సంహృష్టా వివాహవిధిముత్తమమ్ ।

ఆ విధంగా దేవతలు, గంధర్వులు, అప్సరసలు అంతా వచ్చిన తరువాత ఇంద్రద్యుమ్నుడు ఋషిసత్తముడైన ఋతధ్వజునితో ఇలా పలికాడు. "బ్రహ్మర్షీ! కన్దరమాలికుమార్తెను నీ పుత్రుడు జాబాలికిచ్చి విధిపూర్వకంగా వివాహం జరిపించండి. రూపవంతుడైన శకునిని నన్దయన్తి పరిణయమాడగలదు. నేను వేదవతిని గ్రహిస్తాను. విశ్వకర్మ పుత్రికను సురథుడు వివాహమాడతాడు" ఇట్లు పలికిన ఇంద్రద్యుమ్నుని పలుకులకు ఋతధ్వజుడు మంచిదని సంతోషంతో అంగీకరించాడు. తదనంతరం సంతోషంతో వారందరు వివాహానికి ఉపక్రమించారు.

ఋత్విజోఽభూద్ గాలవస్తు హుత్వా హవ్యం విధానతః ॥162॥

గాయన్తే తత్ర గన్ధర్వా నృత్యన్తేఽప్సరసస్తథా ।
ఆదౌ జాబాలినః పాణిర్గృహీతో దైత్యకన్యయా ॥163॥

గాలవముని ఋత్విజుడై, వైవాహికహోమాలు యథావిధిగా నిర్వర్తించాడు. అంతట గంధర్వులు మంగళగీతాలు పాడారు. అట్లే అప్సరసలు నాట్యం చేశారు. ముందుగా జాబాలి దైత్యేంద్రుడైన కందరమాలి కుమార్తెను పాణిగ్రహణం చేసుకున్నాడు.

ఇంద్రద్యుమ్నేన తదను వేదవత్యా విధానతః ।
తతః శకునినా పాణిర్గృహీతో యక్షకన్యయా ॥164॥

తరువాత వరుసగా ఇంద్రద్యుమ్నుడు వేదవతిని విధివిధానంగా వివాహమాడాడు. తదనంతరం శకుని యక్షకన్యను పరిణయమాడాడు.

చిత్రాంగదాయాః కల్యాణి సురథః పాణిమగ్రహీత్ ।
ఏవం క్రమాద్ వివాహాస్తు నిర్వృత్తాస్తనుమధ్యమే ॥165॥

ఓ కళ్యాణీ! తదనంతరం సురథుడు చిత్రాంగద పాణిగ్రహణం చేశాడు. ఓ సన్నని నడుముగల అరజా! ఈ విధంగా క్రమంగా వివాహాలన్నీ నిర్వర్తింపబడ్డాయి.

వృత్తే మునిర్వివాహే తు శక్రాదీన్ ప్రాహ దైవతాన్ ।
అస్మింస్తీర్థే భవద్భిస్తు సప్తగోదావరే సదా ॥166॥

స్థేయం విశేషతో మాసమిమం మాధవముత్తమమ్ ।
బాఢముక్త్వా సురాః సర్వే జగ్ముర్హృష్టా దివం క్రమాత్ ॥167॥

ఈ విధంగా వివాహవిధి సుసంపన్నమైన తరువాత ఋతధ్వజమహర్షి ఇంద్రాది దేవతలతో ఇలా పలికాడు. "మీరందరు ఈ సప్తగోదావరీతీర్థంలో సదా నివాసముండాలి. విశేషించి, ఉత్తమమైన వైశాఖమాసంలో మీరందరు ఇచ్చట తప్పనిసరిగా నివాసముండాలి". దీనికి వారందరు సంతోషంతో అంగీకరించి క్రమంగా స్వర్గానికి వెళ్ళారు.

మునయో మునిమాదాయ సపుత్రం జగ్మురాదరాత్ ।
భార్యాశ్చాదాయ రాజానః స్వం స్వం నగరమాగతాః ॥168॥

మునులందరు ఋతధ్వజజాబాలురతో గూడి స్వస్థానాలకు వెళ్ళారు. రాజులందరు తమ తమ భార్యలతో తమ తమ నగరాలకు వెళ్ళారు.

ప్రహృష్టాః సుఖినస్తస్థుః భుంజతే విషయాన్ ప్రియాన్ ।
చిత్రాంగదాయాః కల్యాణి ఏవం వృత్తం పురా కిల ।
తన్మాం కమలపత్రాక్షి భజస్వ లలనోత్తమే ॥169॥

వారందరు ఇష్టభోగాలను అనుభవిస్తూ, సంతుష్టాంతరంగులై, సుఖంగానున్నారు. ఓ కల్యాణీ! అరజా! పూర్వకాలంలో ఈ విధంగా జరిగిన చిత్రాంగద వృత్తాంతమంతా సమగ్రంగా నీకు వినిపించాను. ఓ కమలపత్రాక్షీ! లలనోత్తమా! ఇక ఆలస్యం చేయక నీవు నన్ను సేవింపుమని దండకమహారాజు పలికాడు.

ఇత్యేవముక్త్వా నరదేవసూనుస్తాం భూమిదేవస్య సుతాం వరోరుమ్ ।
స్తువన్మృగాక్షీం మృదునా క్రమేణ సా చాపి వాక్యం నృపతిం బభాషే ॥170॥

ఈ విధంగా దండకమహారాజు శుక్రుని కుమార్తెయైన అరజ అందాన్ని పొగడుతూ పలుకగా ఆమె మృదువచనాలతో అతనికి ఇలా సమాధానం చెప్పింది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే చిత్రాంగదవివాహోనామ పంచషష్టితమోऽధ్యాయః ॥65॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని చిత్రాంగద వివాహమనే అరవైఐదవ అధ్యాయం సమాప్తం.

షట్‌షష్టితమోఽధ్యాయః - అరవైఆరవ అధ్యాయం

భైరవప్రాదుర్భావే అంధకసైన్యనిర్గమనమ్ - భైరవప్రాదుర్భావంలో అంధకసైన్యం నిర్గమించుట

అరజా ఉవాచ - అరజ పలికింది.

నాత్మానం తవ దాస్యామి బహునోక్తేన కిం తవ ।
రక్షన్తీ భవతః శాపాదాత్మానం చ మహీపతే ॥1॥

ఓ రాజా! నీవు ఎన్నిచెప్పినా నిన్ను శాపంనుండి కాపాడడానికి, నన్ను నేను నీకు అర్పించుకొనలేను.

ప్రహ్లాద ఉవాచ - ప్రహ్లాదుడు (అంధకునితో) పలికాడు.

ఇత్థం వివదమానాం తాం భార్గవేన్ద్రసుతాం బలాత్ ।
కామోపహతచిత్తాత్మా వ్యధ్వంసయత మందధీః ॥2॥

తాం కృత్వా చ్యుతచారిత్రాం మదాన్ధః పృథివీపతిః ।
నిశ్చక్రామాశ్రమాత్ తస్మాద్గతశ్చ నగరం నిజమ్ ॥3॥

ఈ విధంగా వాదులాడుతున్న శుక్రపుత్రికను బుద్ధిహీనుడు, కామాంధుడునైన రాజు బలాత్కరించి, ఆమె శీలాన్ని ధ్వంసం గావించాడు. ఆ విధంగా అరజ శీలాన్ని దోచిన మదాంధుడైన ఆ దండుడు ఆశ్రమాన్ని వదలి, తన నగరానికి వెళ్ళిపోయాడు.

సాఽపి శుక్రసుతా తన్వీ అరజా రజసా ప్లుతా ।
ఆశ్రమాదథ నిర్గత్య బహిస్తస్థావధోముఖీ ॥4॥

చిన్తయన్తీ స్వపితరం రుదతీ చ ముహుర్ముహుః ।
మహాగ్రహోపతప్తేవ రోహిణీ శశినః ప్రియా ॥5॥

శుక్రుని కుమార్తెయైన అరజ కూడా రజస్రావంతో తడిసి, ఆశ్రమంనుండి బయటకు తలవంచుకుని వచ్చి, తండ్రిని తలచుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ, రాహుగ్రస్తచంద్రుని ప్రియురాలైన రోహిణి వలె కూర్చున్నది.

తతో బహుతిథే కాలే సమాప్తే యజ్ఞకర్మణి ।
పాతాలాదాగమచ్ఛుక్రః స్వమాశ్రమపదం మునిః ॥6॥

అనంతరం చాలాకాలానికి యజ్ఞం పూర్తిచేసుకుని శుక్రాచార్యుడు పాతాళంనుండి తన ఆశ్రమానికి తిరిగి వచ్చాడు.

ఆశ్రమాన్తే చ దదృశే సుతాం దైత్యరజస్వలామ్ ।
మేఘలేఖామివాకాశే సంధ్యారాగేణ రంజితామ్ ॥7॥

శుక్రాచార్యుడు ఆశ్రమం బయట ఋతుస్రావపు మరకలతో నల్లటి మేఘశకలంతో కూడిన సాయంసంధ్యలాగ పడియున్న ప్రియపుత్రికను చూశాడు.

తాం దృష్ట్వా పరిపప్రచ్ఛ పుత్రి కేనాసి ధర్షితా ।
కః క్రీడతి సరోషేణ సమమాశీవిషేణ హి ॥8॥

కోఽద్యైవ యామ్యాం నగరీం గమిష్యతి సుదుర్మతిః ।
కస్త్వాం శుద్ధసమాచారాం విధ్వంసయతి పాపకృత్ ॥9॥

అంతట శుక్రుడు కోపంతో అదిరిపడి గర్జిస్తూ "పుత్రీ! నిన్ను చెరచిన దుర్మార్గుడెవడు? బుసలుకొట్టే కొండత్రాచుతో ఆడే దౌర్భాగ్యుడెవడు?. శుద్ధాచార సంపన్నురాలైన నీ శీలాన్ని ధ్వంసం చేసిన దుర్మార్గుడు ఈనాడే యమపురికి వెళ్ళాలి. వాడెవడు?" అని అడిగాడు.

తతః స్వపితరం దృష్ట్వా కంపమానా పునః పునః ।
రుదన్తీ వ్రీడయోపేతా మందం మందమువాచ హ ॥10॥

తవ శిష్యేణ దండేన వార్యమాణేన చాసకృత్ ।
బలాదనాథా రుదతీ నీతాఽహం వచనీయతామ్ ॥11॥

అంతట ఆ బాలిక తన తండ్రిని చూసి విలపిస్తూ, మరల మరల కంపించిపోతూ, లజ్జాభారంతో మెల్లమెల్లగా ఇలా జవాబిచ్చింది. "తండ్రీ! నీ శిష్యుడైన దండుడు నేను విలపిస్తూ ఎంతగా వారించినా లెక్కపెట్టక అనాథనైన నన్ను బలవంతంగా నాశనం చేశాడు" అని తెలియజేసింది.

ఏతత్ పుత్ర్యా వచః శ్రుత్వా క్రోధసంరక్తలోచనః ।
ఉపస్పృశ్య శుచిర్భూత్వా ఇదం వచనమబ్రవీత్ ॥12॥

యస్మాత్ తేనావినీతేన మత్తో హ్యభయముత్తమమ్ ।
గౌరవం చ తిరస్కృత్య చ్యుతధర్మాఽరజా కృతా ॥13॥

తస్మాత్ సరాష్ట్రః సబలః సభృత్యో వాహనైః సహ ।
సప్తరాత్రాన్తరాద్భస్మ గ్రావవృష్ట్యా భవిష్యతి ॥14॥

తన పుత్రిక పలుకులు విన్న శుక్రాచార్యుడు కోపంతో కళ్ళెర్రజేసి, ఆచమనం చేసి, శుచియై, ఇలా శపించాడు. "నాచేత అభయం పొంది కూడా కృతఙ్ఞత వదలి గురువనే గౌరవం కూడా లేకుండా పవిత్రురాలైన, నా కుమార్తెయైన అరజకు ధర్మచ్యుతి కలిగించిన ఆ దుర్వినీతుడైన దండుడు ఏడు రాత్రుల లోపల తన బల పరివార వాహనాదులతో సహా రాష్ట్రసమేతంగా శిలావృష్టికి గురియై, భస్మీపటలం కాగలడని" భయంకరంగా శపించాడు.

ఇత్యేవముక్త్వా మునిపుంగవోఽసౌ శప్త్వా స దండం స్వసుతామువాచ ।
త్వం పాపమోక్షార్థమిహైవ పుత్రి తిష్ఠస్వ కల్యాణి తపశ్చరన్తీ ॥15॥

ఈ విధంగా మునిపుంగవుడు దండుని శపించిన తరువాత తన కుమార్తెనుచూసి, "కల్యాణీ! నీవింక పాపవిమోచనానికై తపస్సు చేస్తూ ఉండు"మని పలికాడు.

శప్త్వేత్థం భగవాన్ శుక్రో దండమిక్ష్వాకునన్దనమ్ ।
జగామ శిష్యసహితః పాతాలం దానవాలయమ్ ॥16॥

దండోఽపి భస్మసాద్భూతః సరాష్ట్రబలవాహనః ।
మహతా గ్రావవర్షేణ సప్తరాత్రాన్తరే తదా ॥17॥

ఇక్ష్వాకు తనయుడైన దండుని అలా శపించి, శుక్రాచార్యుడు శిష్యులతోగూడి దానవుల నెలవైన పాతాళానికి వెళ్ళాడు. ఏడురాత్రులు ఎడతెరిపి లేకుండా కురిసిన శిలావృష్టికి భస్మసాద్భూతమై, రాష్ట్రసైన్య వాహనాదులతో సహా దండుడు సర్వనాశనమయ్యాడు.

ఏవం తే దణ్డకారణ్యం పరిత్యజన్తి దేవతాః ।
ఆలయం రాక్షసానాం తు కృతం దేవేన శంభునా ॥18॥

ఏవం పరకలత్రాణి నయంతి సుకృతీనపి ।
భస్మభూతాన్ ప్రాకృతాంస్తు మహాన్తం చ పరాభవమ్ ॥19॥

తస్మాదంధక దుర్బుద్ధిర్న కార్యా భవతా త్వియమ్ ।
ప్రాకృతాఽపి దహేన్నారీ కిముతాహోద్రినందినీ ॥20॥

శంకరోఽపి న దైత్యేశ శక్యో జేతుం సురాసురైః ।
న ద్రష్టుమప్యమితౌజస్కః కిము యోధయితుం రణే ॥21॥

ఆనాటినుండి అరణ్యంగా మారిన దండుని రాజ్యమైన దండకారణ్యాన్ని దేవతలు వర్జించారు. దేవేశుడైన శంభుడు దానిని రాక్షసులకు నివాసంగా చేశాడు. ఈ విధంగా పరకాంతలు సుకృతం చేసిన వారిని కూడా భస్మం చేయగలిగియుండగా ఇతరుల విషయం చెప్పవలెనా?. కాబట్టి ఓ అంధకా! దుర్బుద్ధితో కూడిన ఈ ప్రయత్నం విరమించుకో. సాధారణస్త్రీయే తన స్పర్శతో దహింపగలిగియుండగా ఇక జగజ్జననియైన పార్వతి విషయం చెప్పనేల!. ఓ దైత్యేశా! దేవదానవులంతా ఏకమైనా శంకరుని జయింపజాలరు. యుద్ధంలో అమిత తేజస్కుడైన ఆ శంకరుని చూడలేరనినచో ఆయనతో యుద్ధం చేసే ప్రశ్నే యుండదుగదా!" అని ప్రహ్లాదుడు అంధకాసురునితో పలికాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్తే వచనే క్రుద్ధస్తామ్రేక్షణః శ్వసన్ ।
వాక్యమాహ మహాతేజాః ప్రహ్లాదం చాంధకాసురః ॥22॥

కిం మమాసౌ రణే యోద్ధుం శక్తస్త్రినయనోఽసుర ।
ఏకాకీ ధర్మరహితో భస్మారుణితవిగ్రహః ॥23॥

నాంధకో బిభియాదింద్రాన్నామరేభ్యః కథంచన ।
స కథం వృషపత్రాక్షాద్ బిభేతి స్త్రీముఖేక్షకాత్ ॥24॥

ప్రహ్లాదుని మాటలు వినిన అంధకుడు క్రుద్ధుడై, బుసలు కొడుతూ, ప్రహ్లాదునితో ఇలా పలికాడు. "ఏమేమీ?, ఏకాకీ, ధర్మదూరుడూ, బూడిదపూసుకొన్న విగ్రహం కలవాడూ, త్రినయనుడూ అయిన శివుడు నాతో పోరాడగలడా? ఇంద్రాది దేవతలకే భయపడని ఈ అంధకుడు ఆకులు మెక్కుతూ ఆడవారి ముఖాలు చూస్తూ ఉండేవానికి భయపడడమా?" అని అంధకుడు శివుని అపహసిస్తూ ప్రహ్లాదునితో పలికాడు.

తచ్ఛ్రుత్వాఽస్య వచో ఘోరం ప్రహ్లాదః ప్రాహ నారద ।
న సమ్యగుక్తం భవతా విరుద్ధం ధర్మతోఽర్థతః ॥25॥

హుతాశన పతంగాభ్యాం సింహక్రోష్టుకయోరివ ।
గజేన్ద్రమశకాభ్యాం చ రుక్మపాషాణయో రివ ॥26॥

ఏతేషామేవ గదితం యావదన్తరమంధక ।
తావదేవాన్తరం చాస్తి భవతో వా హరస్య చ ॥27॥

వారితోఽసి మయావీర భూయో భూయశ్చ వార్యసే ।
శృణుష్వ వాక్యం దేవర్షేరసితస్య మహాత్మనః ॥28॥

ఓ నారదా! అంధకుని ఈ కఠోర వచనాలు విని చలించిన ప్రహ్లాదుడు అంధకునితో ఇలా పలికాడు. "నీవు చెప్పినది ధర్మదృష్టితో చూచినా, వ్యావహారికంగా చూచినా చాలా అనుచితంగానున్నది. అంధకేశ్వరా! అగ్నికి శలభాలకు, సింహశృగాలాలకు, ఏనుగు-దోమలకు, బంగారం-రాతికి, ఎంత తేడా ఉంటుందో నీకు శివునకు అంత అంతరముంది. నీవు నాచే వారింపబడ్డావు. నేను నిన్ను మళ్ళీ మళ్ళీ వారిస్తూనే ఉన్నాను. అయినా ఇంకా చెబుతాను విను. మహాత్ముడైన దేవర్షి అసితుని హితవచనాలు విను.

యో ధర్మశీలో జితమానరోషో విద్యావినీతో న పరోపతాపీ ।
స్వదారతుష్టః పరదారవర్జీ న తస్య లోకే భయమస్తి కించిత్ ॥29॥

ధర్మశీలుడు, అభిమానాన్ని క్రోధాన్ని జయించినవాడు, విద్యావినయసంపన్నుడు, ఇతరులకు హాని కలిగించనివాడు, తన భార్యతోనే తృప్తిపడి పరకాంతలను కోరనివాడు ఈ లోకంలో ఎవరికీ భయపడడు. అతనికెక్కడా భయమనేది ఉండదు.

యో ధర్మహీనః కలహ ప్రియః సదా పరోపతాపీ శ్రుతిశాస్త్రవర్జితః ।
పరార్థదారేప్సురవర్ణసంగమీ సుఖం న విందేత పరత్ర చేహ ॥30॥

ధర్మదూరునకు, కలహప్రియునకు, ఇతరులను బాధించేవానికి, వేదశాస్త్రాలను వదలినవానికి, పర ధనాలను పరదారలను హరించేవానికి, వర్ణసంకరం చేసేవానికి ఇహపరాలలో ఎక్కడా సుఖం కలుగదు.

ధర్మాన్వితోఽభూద్ భగవాన్ ప్రభాకరః సంత్యక్తరోషశ్చ మునిః స వారుణిః ।
విద్యాన్వితోఽభూన్మనురర్కపుత్రః స్వదారసంతుష్టమనాస్త్వగస్త్యః ॥31॥

ఏతాని పుణ్యాని కృతాన్యమీభిర్మయా నిబద్ధాని కులక్రమోక్త్యా ।
తేజోఽన్వితాః శాపవరక్షమాశ్చ జాతాశ్చ సర్వే సురసిద్ధపూజ్యాః ॥32॥

భాస్కరుడు ధర్మాన్వితుడు, వసిష్ఠుడు క్రోధం వదలినవాడు, సూర్యతనయుడు మనువు విద్యాన్వితుడు, అగస్త్యుడు తన భార్యతోనే తృప్తి చెందినవాడు. వీరందరు నేను చెప్పిన పుణ్యాలు చేసినవారు. కావున కులక్రమాన్ని తప్పని ఈ మహనీయులంతా తేజోన్వితులై శాపానుగ్రహసామర్థ్యం కలిగి, దేవతలకు, సిద్ధులకు పూజనీయులయ్యారు.

అధర్మయుక్తోఽఙ్గసుతో బభూవ విభుశ్చ నిత్యం కలహప్రియోఽభూత్ ।
పరోపతాపీ నముచిర్దురాత్మా పరాబలేప్సుర్నహుషశ్చ రాజా ॥33॥

పరార్థలిప్సుర్దితిజో హిరణ్యదృక్ మూర్ఖస్తు తస్యాప్యనుజః సుదుర్మతిః ।
అవర్ణసంగీ యదురుత్తమౌజా ఏతే వినష్టాస్త్వనయాత్ పురా హి ॥34॥

తస్మాద్ధర్మో న సంత్యాజ్యో ధర్మో హి పరమా గతిః ।
ధర్మహీనా నరా యాన్తి రౌరవం నరకం మహత్ ॥35॥

అంగసుతుడైన వేనుడు ధర్మహీనుడు, అధర్మయుక్తుడు. విభువనేవాడు సదా కలహప్రియుడు. దురాత్ముడైన నముచి పరపీడకుడు. నహుషుడు పరస్త్రీలాలసుడు. హిరణ్యాక్షుడు పరధనాల మీద కన్నువేసినవాడు. వాని తమ్ముడైన హిరణ్యకశిపుడు మూర్ఖుడు, దుర్బుద్ధి. ప్రతాపియైన యదురాజు ఇతర వర్ణాలవారిని భోగించినవాడు. వీరంతా గొప్పరాజులైనా నామరూపాలు లేకుండా గతంలో నశించిపోయారు. కాబట్టి ధర్మాన్ని ఏనాడు విడువరాదు. ధర్మమే ఉత్తమగతి. ధర్మహీనుడైన మానవుడు రౌరవాది నరకాలను పొందుతాడు.

ధర్మస్తు గదితః పుమ్భిస్తారణే దివి చేహ చ ।
పతనాయ తథాఽధర్మ ఇహ లోకే పరత్ర చ ॥36॥

త్యాజ్యం ధర్మాన్వితైర్నిత్యం పరదారోపసేవనమ్ ।
నయన్తి పరదారా హి నరకానేకవింశతిమ్ ।
సర్వేషామపి వర్ణానామేష ధర్మో ధ్రువోఽన్ధక ॥37॥

మానవులకు స్వర్గమర్త్యలోకాలలో ధర్మమే తరణోపాయం. అధర్మమే ఇహపరాలలో పతన హేతువు. ధర్మాన్వితులైనవారు పరదారలకు సదా దూరంగా ఉండాలి. పరదారాసేవనమనే ఒక్క పాపమే మానవుని ఇరవైయొక్క నరకాలలోనికి నెట్టివేస్తుంది. ఓ అంధకా! అన్ని వర్ణాలవారికి ఇదియే ధర్మం. ఇది నిశ్చయం.

పరార్థపరదారేషు యదా వాంఛాం కరిష్యతి ।
స యాతి నరకం ఘోరం రౌరవం బహులాః సమాః ॥38॥

ఏవం పురాఽసురపతే దేవర్షిరసితోఽవ్యయః ।
ప్రాహ ధర్మవ్యవస్థానం ఖగేంద్రాయారుణాయ హి ॥39॥

తస్మాత్ సుదూరతో వర్జేత్ పరదారాన్ విచక్షణః ।
నయన్తి నికృతిప్రజ్ఞం పరదారాః పరాభవమ్ ॥40॥

ఓ అసురేశ్వరా! పరధనాన్ని, పరదారలను వాంఛించినవాడు అనేక సంవత్సరాలు ఘోరమైన రౌరవ నరకయాతనలను పొందుతాడు. ఈ ధర్మవ్యవస్థను పూర్వకాలంలో అవ్యయుడు, దేవర్షియు అయిన అసితుడు గరుత్మంతునకు, అరుణునకు వివరించాడు. కాబట్టి విచక్షణుడైనవాడు పరదారలను సుదూరంగా వర్జించాలి. పరస్త్రీలు ప్రజ్ఞాహీనులైనవారిని పరాభవానికి గురిచేస్తారు". అని ప్రహ్లాదుడు అంధకునికి తెలియజేశాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్తే వచనే ప్రహ్లాదం ప్రాహ చాన్ధకః ।
భవాన్ ధర్మపరస్త్వేకో నాహం ధర్మం సమాచరే ॥41॥

ఇత్యేవముక్త్వా ప్రహ్లాదమంధకః ప్రాహ శంబరమ్ ।
గచ్ఛ శంబర శైలేన్ద్రం మన్దరం వద శంకరమ్ ॥42॥

ఈ విధంగా పలికిన ప్రహ్లాదుని ధర్మోపదేశం విని అంధకుడు నీవొక్కడవే ధర్మపరుడవు కమ్ము. నాకు ధర్మాచరణం సమ్మతం కాదని ప్రహ్లాదునితో పలుకుతు, శంబరాసురునితో ఇలా పలికాడు. "శంబరా! శైలేంద్రమైన మందరగిరికి వెంటనే వెళ్ళి, శంకరునితో నా యీ మాటలు చెప్పు.

భిక్షో కిమర్థం శైలేన్ద్రం స్వర్గతుల్యం సకన్దరమ్ ।
పరిభుంజసి కేనాద్య తవ దత్తో వదస్వ మామ్ ॥43॥

తిష్ఠన్తి శాసనే మహ్యం దేవాః శక్రపురోగమాః ।
తత్కిమర్థం నివససే మామనాదృత్య మందరే ॥44॥

యదీష్టస్తవ శైలేన్ద్రః క్రియతాం వచనం మమ ।
యేయం హి భవతః పత్నీ సా మే శీఘ్రం ప్రదీయతామ్ ॥45॥

ఇత్యుక్తః స తదా తేన శంబరో మన్దరం ద్రుతమ్ ।
జగామ తత్ర యత్రాస్తే సహ దేవ్యా పినాకధృక్ ॥46॥

"ఓ బిచ్చగాడా! అందమైన కందరాలతో స్వర్గం వలె ఉండే మందరగిరి నీకెందులకు? నీకెవరిచ్చారని దానిని ఇంకా నీవు అనుభవిస్తున్నావో నాకు చెప్పు?. ఇంద్రాది దేవతలందరు నా శాసనాన్ని శిరసావహిస్తూ ఉంటే నన్ను లెక్కచేయక ఇంకా నీవెందులకు మందరపర్వతమునందే నివసిస్తున్నావు?. మందర పర్వతం అంతగా నీకు ప్రీతిపాత్రమైతే నేను చెప్పినట్లు చేయి. నీ భార్యయైన ఈమెను వెంటనే నాకు అర్పించు" అని శంబరునితో అంధకుడు పలుకగా శంబరుడు వెంటనే పార్వతీదేవితో సహా శంకరుడు నివాసమున్న మందరగిరికి వెళ్ళాడు.

గత్వోవాచాన్ధకవచో యాథాతథ్యం దనోః సుతః ।
తముత్తరం హరః ప్రాహ శృణ్వత్యా గిరికన్యయా ॥47॥

మమాయం మందరో దత్తః సహస్రాక్షేణ ధీమతా ।
తన్న శక్నోమ్యహం త్యక్తుం వినాజ్ఞాం వృత్రవైరిణః ॥48॥

యచ్చాబ్రవీద్దీయతాం మే గిరిపుత్రీతి దానవః ।
తదేషా యాతు స్వం కామం నాహం వారయితుం క్షమః ॥49॥

శంబరుడు మందరాచలానికి వెళ్ళి అంధకాసురుడు పలికిన పలుకులు యథాతథంగా శంకరునికి చెప్పాడు. అందులకు పార్వతి వినునట్లుగా హరుడు ఇలా జవాబిచ్చాడు. "మందరగిరి నాకు ధీమంతుడైన సహస్రాక్షు డిచ్చాడు. కావున ఇంద్రుని ఆజ్ఞ లేకుండా నేను మందరగిరిని విడిచి వెళ్ళజాలను. ఇక గిరిపుత్రియైన పార్వతిని ఈయవలసినదిగా దానవుడు కోరియున్నాడు. అది ఆమె ఇష్టానికి సంబంధించినది. ఆమె వెళ్ళడానికి నిర్ణయించుకుంటే నేను వారించడానికి సమర్థుడను కాను" అని శంకరుడు శంబరునికి సమాధానం చెప్పాడు.

తతోఽబ్రవీద్గిరిసుతా శంబరం మునిసత్తమ ।
బ్రూహి గత్వాన్ధకం వీర మమ వాక్యం విపశ్చితమ్ ॥50॥

అహం పతాకా సంగ్రామే భవానీశస్తదా హి నౌ ।
ప్రాణద్యూతం పరిస్తీర్య యో జేష్యతి స లప్స్యతే ॥51॥

ఓ మునిసత్తమా! అంతట గిరితనయ శంబరునితో ఇలా పలికింది. "ఓ వీరా! బుద్ధిగలవాడైన అంధకునితో నా యీ మాటలు తెలుపు. నేను సంగ్రామంలోని జయపతాకం. నీవు, ఈశ్వరుడు జూదరులు. ఈ జీవనద్యూతంలో ఎవరు గెలుస్తారో వారే నన్ను పొందగలరు" అని పలికింది.

ఇత్యేవముక్తో మతిమాన్ శంబరోఽన్ధకమాగమత్ ।
సమాగమ్యాబ్రవీద్వాక్యం శర్వగౌర్యోశ్చ భాషితమ్ ॥52॥

గిరితనయ ఇలా పలుకగానే మతిమంతుడైన శంబరుడు అంధకుని చెంతకువెళ్ళి, శివపార్వతుల సందేశాలను యథాతథంగా అంధకునికి వినిపించాడు.

తచ్ఛ్రుత్వా దానవపతిః క్రోధదీప్తేక్షణః శ్వసన్ ।
సమాహూయాబ్రవీద్వాక్యం దుర్యోధనమిదం వచః ॥53॥

గచ్ఛ శీఘ్రం మహాబాహో భేరీం సాన్నాహికీం దృఢామ్ ।
తాడయస్వ సువిశ్రబ్ధం దుఃశీలామివ యోషితమ్ ॥54॥

సమాదిష్టోఽన్ధకేనాథ భేరీం దుర్యోధనో బలాత్ ।
తాడయామాస వేగేన యథా ప్రాణేన భూయసా ॥55॥

అది విని దానవపతి క్రోధంతో బుసలు కొడుతూ దుర్యోధనుని పిలిచి ఇలా పలికాడు. "ఓ దుర్యోధనా! మహావీరా! వెంటనే కులటయైన స్త్రీని మోదినట్లుగా యుద్ధభేరీని దృఢంగా మ్రోగించు"మని ఆదేశించాడు. అంతట ఆ దుర్యోధనుడు యుద్ధభేరీని తన శక్తికొలదీ వేగంగా, దృఢంగా మ్రోగింపసాగాడు.

సా తాడితా బలవతా భేరీ దుర్యోధనేన హి ।
సత్వరం భైరవం రావం రురావ సురభీ యథా ॥56॥

దుర్యోధనుని బలవంతమైన దెబ్బలకు ఆ భేరి సురభివలె భయంకరమైన ధ్వనితో అరిచింది.

తస్యాస్తం స్వరమాకర్ణ్య సర్వ ఏవ మహాసురాః ।
సమాయాతాః సభాం తూర్ణం కిమేతదితి వాదనః ॥57॥

ఆ భేరీధ్వనిని విని, మహాదైత్యులందరు ఇదేమిటని అంటూ వెంటనే సభాస్థలికి చేరుకున్నారు.

యాథాతథ్యం చ తాన్ సర్వానాహ సేనాపతిర్బలీ ।
తే చాపి బలినాం శ్రేష్ఠాః సన్నద్ధా యుద్ధకాంక్షిణః ॥58॥

అంతట మహాసేనాపతి విషయాన్నంతటిని ఉన్నదున్నట్లుగా వివరించగా బలవంతులైన వారంతా యుద్ధ సన్నద్ధులయ్యారు.

సహాంధకా నిర్యయుస్తే గజైరుష్ట్రైర్హయైః రథైః ।
అంధకో రథమాస్థాయ పంచనల్వప్రమాణతః ॥ 59॥

త్ర్యంబకం స పరాజేతుం కృతబుద్ధిర్వినిర్యయౌ ।

అంధకునితో కలిసి దైత్యవీరులందరు ఏనుగులు, ఒంటెలు, రథాలు, గుఱ్ఱాలు ఎక్కి బయలుదేరారు. ఐదు ఫర్లాంగుల ప్రమాణం గల రథమెక్కి అంధకుడు ఫాలాక్షుని జయించడానికి బయలుదేరాడు.

జంభః కుజంభో హుండశ్చ తుహుండః శంబరో బలిః ॥ 60॥

బాణః కార్తస్వరో హస్తీ సూర్యశత్రుర్మహోదరః ।
అయః శంకుః శిబిః శాల్వో వృషపర్వా విరోచనః ॥61॥

హయగ్రీవః కాలనేమిః సంహ్లాదః కాలనాశనః ।
శరభః శలభశ్చైవ విప్రచిత్తిశ్చ వీర్యవాన్ ॥62॥

దుర్యోధనశ్చ పాకశ్చ విపాకః కాలశంబరౌ ।
ఏతే చాన్యే చ బహవో మహావీర్యా మహాబలాః ।
ప్రజగ్మురుత్సుకా యోద్ధుం నానాయుధధరా రణే ॥63॥

జంభుడు, కుజంభుడు, హుండతుహుండులు, శంబరుడు, బాణుడు, కార్తస్వరుడు, హస్తి, సూర్యశత్రువు, మహోదరుడు, అయశ్శంకువు, శిబి, శాల్వుడు, వృషపర్వ విరోచనులు, హయగ్రీవుడు, కాలనేమి, సంహ్లాదుడు, కాలనాశనుడు, శరభుడు, శలభుడు, విప్రచిత్తి, దుర్యోధనుడు, పాక, విపాక, కాల, శంబరాదులు తదితర మహాబలులెందరో నానా ఆయుధాలు ధరించి, యుద్ధం చేయాలనే కోరికతో యుద్ధభూమికి నడిచారు.

ఇత్థం దురాత్మా దనుసైన్యపాలస్తదాన్ధకో యోద్ధుమనా హరేణ ।
మహాచలం మన్దరమభ్యుపేయివాన్ సకాలపాశావసితో హి మందధీః ॥64॥

ఈ విధంగా సన్నద్ధుడై, దురాత్ముడైన అంధకాసురుడు హరునితో యుద్ధం చేయడానికి కాలచోదితుడై, బుద్ధిని కోల్పోయి మందరగిరికి చేరాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే భైరవప్రాదుర్భావే అన్ధకసైన్యనిర్గమనం నామ షట్షష్టితమోఽధ్యాయః ॥66॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని భైరవప్రాదుర్భావమందలి అంధకసైన్యనిర్గమనమనే అరవైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తషష్టితమోఽధ్యాయః – అరవైఏడవ అధ్యాయం
భైరవప్రాదుర్భావే సదాశివదర్శనమ్ – భైరవప్రాదుర్భావంలో సదాశివదర్శనం

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

హరోఽపి శంబరే యాతే సమాహూయాథ నందినమ్ ।
ప్రాహామన్త్రయ శైలాదీన్ యే స్థితాస్తవ శాసనే ॥1॥

శంబరాసురుడు వెళ్ళినపిమ్మట హరుడు నందిని పిలిచి తన ఏలుబడిలోనున్న వారినందరిని వెంటనే పిలువుమని ఆదేశించాడు.

తతో మహేశ వచనాన్నందీ తూర్ణతరం గతః ।
ఉపస్పృశ్య జలం శ్రీమాన్ సస్మార గణనాయకాన్ ॥2॥

మహేశ్వరుని మాటలు వినిన నంది వెంటనే వెళ్లి, ఆచమనం గావించి పవిత్రుడై, శివగణాల నాయకుల నందరిని స్మరించాడు.

నందినా సంస్మృతాస్సర్వే గణనాథాః సహస్రశః ।
సముత్పత్య త్వరాయుక్తాః ప్రణతాస్త్రిదశేశ్వరమ్ ॥3॥

శ్రీమంతుడైన నందీశ్వరుడు స్మరించిన వెంటనే వేలాది సంఖ్యలో గణనాయకులందరు ఎగిరివచ్చి దేవదేవునకు ప్రణమిల్లారు.

ఆగతాంశ్చ గణాన్నన్దీ కృతాంజలిపుటోఽవ్యయః ।
సర్వాన్ నివేదయామాస శంకరాయ మహాత్మనే ॥4॥

వచ్చిన గణనాయకులందరికి నంది ప్రణమిల్లి, చేతులు జోడించి, వారినందరిని మహాత్ముడైన శంకరునకు నివేదించాడు.

నంద్యువాచ – నంది పలికాడు.

యానేతాన్ పశ్యసే శంభో త్రినేత్రాన్ జటిలాన్ శుచీన్ ।
ఏతే రుద్రా ఇతి ఖ్యాతాః కోట్య ఏకాదశైవ తు ॥5॥

ప్రభూ! శంకరా! త్రినేత్రులు, జటాధరులు, శుచులునైన వీరు రుద్రులుగా ఖ్యాతి పొందారు. వీరు పదకొండు కోట్ల సంఖ్యలో నున్నారు.

వానరాస్యాన్ పశ్యసే యాన్ శార్దూలసమవిక్రమాన్ ।
ఏతేషాం ద్వారపాలాస్తే మన్నామానో యశోధనాః ॥6॥

శార్దూలవిక్రమం కలిగి, వానరముఖాలతో కనిపించే ఈ యశోధనులు నా పేరుతో విరాజిల్లే శూరులు. వీరు మీ ద్వారపాలకులు.

షణ్ముఖాన్ పశ్యసే యాంశ్చ శక్తిపాణీం శిఖిధ్వజాన్ ।
షట్ చ షష్టిస్తథా కోట్యః స్కందనామ్నః కుమారకాన్ ॥7॥

శక్తిపాణులై, శిఖి కేతనాలతో కనిపించే షణ్ముఖులైన వీరు అరవైయారుకోట్లు. స్కందులనే పేరు గల ఆ వీరులు కుమారులు.

ఏతావత్యస్తథా కోట్యః శాఖా నామ షడాననాః ।
విశాఖాస్తావదేవోక్తా నైగమేయాశ్చ శంకర ॥8॥

సప్తకోటిశతం శంభో అమీ వై ప్రమథోత్తమాః ।
ఏకైకం ప్రతి దేవేశ తావత్యో హ్యపి మాతరః ॥9॥

ఆరు తలలు గల వీరు శాఖులు. వీరి సంఖ్య కూడా అంతే. ఇంక ఆ విశాఖులు, నైగమేయులు అనేవారు కూడా షడాననులే. వారు కూడా అరవైయారుకోట్ల సంఖ్యలో నున్నారు. ఓ శంభూ! ఆ ప్రమథోత్తములు ఏడువందల కోట్లు. వారందరికి ఒక్కొక్కరకు ఒక్కొక్క మాతృక కూడా కలదు.

భస్మారుణితదేహాశ్చ త్రినేత్రాః శూలపాణయః ।
ఏతే శైవా ఇతి ప్రోక్తాస్తవ భక్తా గణేశ్వరాః ॥10॥

భస్మారుణశరీరాలతో, మూడుకన్నులతో శూలపాణులైన వీరు శైవులనే గణనాయకులు. వీరు నీ భక్తులు.

తథా పాశుపతాశ్చాన్యే భస్మప్రహరణా విభో ।
ఏతే గణాస్త్వసంఖ్యాతాః సహాయార్థం సమాగతాః ॥11॥

భస్మప్రహారంతోనే శత్రునాశనం చేసే పాశుపతగణాధిపతులు వీరు. మీ సహాయార్థం వచ్చిన వీరు లెక్కకు మించి ఉన్నారు.

పినాకధారిణో రౌద్రా గణాః కాలముఖాః పరే ।
తవ భక్తాః సమాయాతా జటామండలినోఽద్భుతాః ॥12॥

పినాకపాణులై, జటాధారులై వచ్చిన కాలముఖులనే వీరు భయంకరులు, నీ భక్తగణాలు.

ఖట్వాంగయోధినో వీరా రక్తచర్మసమావృతాః ।
ఇమే ప్రాప్తా గణా యోద్ధుం మహావ్రతిన ఉత్తమాః ॥13॥

ఎర్రని కవచాలు ధరించి, ఖట్వాంగాలతో యుద్ధంచేసే ఉత్తమ వ్రతధారులైన ఈ భక్తగణాలు యుద్ధం చేయడానికి వచ్చారు.

దిగ్వాససో మౌనినశ్చ ఘంటాప్రహరణాస్తథా ।
నిరాశ్రయా నామ గణాః సమాయాతా జగద్గురో ॥14॥

ఓ జగద్గురూ! మౌనధారులై, ఘంటాప్రహారాలు చేసే వీరు దిగంబరులై నిరాశ్రయులనబడే గణనాయకులు. వీరు కూడా యుద్ధం చేయడానికి వచ్చారు.

సార్ధద్వినేత్రాః పద్మాక్షాః శ్రీవత్సాంకితవక్షసః ।
సమాయాతాః ఖగారూఢా వృషభధ్వజినోఽవ్యయాః ॥15॥

కమలాలను పోలిన రెండున్నర కన్నులతో, శ్రీవత్సలాంఛనాలు ధరించి, ఖగారూఢులై, వృషభకేతనాలతో కొందరు వచ్చారు.

మహాపాశుపతా నామ చక్రశూలధరాస్తథా ।
భైరవో విష్ణునా సార్ధమభేదేనార్చితో హి యైః ॥16॥

వారు మహాపాశుపతులు. చక్రశూలధరులు. వారు భైరవుని (శివుని) విష్ణువును అభేదబుద్ధితో అర్చిస్తారు.

ఇమే మృగేన్ద్రవదనాః శూలబాణధనుర్ధరాః ।
గణాస్త్వద్రోమసంభూతా వీరభద్రపురోగమాః ॥17॥

శూలబాణచాపాలు ధరించి, వీరభద్రుని ముందిడుకుని, వచ్చిన ఈ గణాలు మృగేంద్ర వదనులు. వీరు నీ యొక్క రోమాల నుండి ఉద్భవించినవారు.

ఏతే చాన్యే చ బహవః శతశోఽథ సహస్రశః ।
సాహాయ్యార్థం తవాయాతా యథా ప్రీత్యాదిశస్వ తాన్ ॥18॥

ఓ ప్రభూ! వీరేగాక ఇంకను వందలవేల సంఖ్యలో ఎన్నో గణాలు నీకు సహాయం చేయడానికి వచ్చాయి. వీరందరికి తగిన ఆదేశాలు జారీ చేయండి.

తతోఽభ్యేత్య గణాః సర్వే ప్రణేముర్వృషభధ్వజమ్ ।
తాన్ కరేణైవ భగవాన్ సమాశ్వాస్యోపవేశయత్ ॥19॥

అలా వచ్చిన ఆ గణాలవారందరు వృషభధ్వజుని సమీపించి, ప్రణామాలు గావించారు. శివభగవానుడు వారినందరిని చేతితో సంభావించి, సైగచేసి, కూర్చుండజేశాడు.

మహాపాశుపతాన్ దృష్ట్వా సముత్థాయ మహేశ్వరః ।
సంపర్యష్వజతాధ్యక్షాంస్తే ప్రణేముర్మహేశ్వరమ్ ॥20॥

మహాపాశుపతులను చూసి, మహేశ్వరుడు స్వయంగా లేచి వెళ్ళి, కౌగిలించుకొనగా వారు మహేశ్వరునికి నమస్కారాలు గావించారు.

తతస్తదద్భుతతమం దృష్ట్వా సర్వే గణేశ్వరాః ।
సుచిరం విస్మితాక్షాశ్చ వైలక్ష్యమగమత్పరమ్ ॥21॥

శివుని అద్భుతమైన ఆ ప్రవర్తనను చూసి, గణాధిపతులందరు చాలా ఆశ్చర్యపడి, మిక్కిలి సిగ్గుపడ్డారు.

విస్మితాక్షాన్ గణాన్ దృష్ట్వా శైలాదిర్యోగినాం వరః ।
ప్రాహ ప్రహస్య దేవేశం శూలపాణిం గణాధిపమ్ ॥22॥

ఆశ్చర్యంతో చూస్తున్న గణాలనుచూసి, నందీశ్వరుడు ఆదిగా గల యోగులు నవ్వుతూ సకల గణాధిపుడైన ఆ శూలపాణిని చూసి ఇలా పలికారు.

విస్మితా హి గణా దేవ సర్వ ఏవ మహేశ్వర ।
మహాపాశుపతానాం హి యత్త్వయాలిఙ్గనం కృతమ్ ॥23॥

తదేతేషాం మహాదేవ స్ఫుటం త్రైలోక్యవిన్దకమ్ ।
రూపం జ్ఞానం వివేకం చ వదస్వ స్వేచ్ఛయా విభో ॥24॥

ప్రమథాధిపతేర్వాక్యం విదిత్వా భూతభావనః ।
బభాషే తాన్ గణాన్ సర్వాన్ భావాభావవిచారిణః ॥25॥

"ఓ దేవా! మీరొక మహాపాశుపతులను మాత్రమే కౌగలించుకొని, ఆదరించడం చూసి, ఇతరులంతా ఆశ్చర్య చకితులయ్యారు. అందుచేత ముల్లోకాలు అభినందింపదగిన రూప జ్ఞాన వివేకాది విశేషలక్షణాలు వారిలో ఏమేమి గలవో అన్నీ వివరించండి". ప్రమథాధిపతియైన నందీశ్వరుని మాటలు విని, భూతభావనుడైన హరుడు భావాభావ విచక్షణులైన గణాలనన్నిటితో ఇలా పలికాడు.

రుద్ర ఉవాచ – రుద్రుడు పలికాడు.

భవద్భిర్భక్తిసంయుక్తైర్హరో భావేన పూజితః ।
అహంకారవిమూఢైశ్చ నిందద్భిర్వైష్ణవం పదమ్ ॥26॥

మీరందరు భక్తిభావంతో హరుని పూజించినా, అహంకార విమూఢులై విష్ణుపదకమలాలను నిందిస్తారు.

తేనాజ్ఞానేన భవతో నాదృత్యానువిరోధితాః ।
యోఽహం స భగవాన్ విష్ణుర్విష్ణుర్యః సోఽహమవ్యయః ॥27॥

మీలోని ఈ అజ్ఞానం వలన మిమ్ములను నిరాకరించడం సంభవించింది. నేను భగవంతుడగు విష్ణువునే. ఆ విష్ణువే అవ్యయుడనైన నా స్వరూపం.

నావయోర్వై విశేషోఽస్తి ఏకామూర్తిర్ద్విధా స్థితా ।
తదమీభిర్నరవ్యాఘ్రైర్భక్తిభావయుతైర్గణైః ॥28॥

యథాహం వై పరిజ్ఞాతో న భవద్భిస్తథా ధ్రువమ్ ।
యేనాహం నిందితో నిత్యం భవద్భిర్మూఢబుద్ధిభిః ॥29॥

మాకు భేదం లేదు. ఒకే తత్త్వం రెండు రూపాలలోనూ ఉన్నది. ఈ రహస్యాన్ని ఈ మానవశార్దూలాలు గుర్తించినట్లుగా ఈ ఇతర గణాలవారందరు తెలిసుకొనలేకపోయారు. శివభక్తులుగా పరిగణింపబడే మీవంటి మూర్ఖుల కారణంగా నేను నిందలకు గురి అవుతున్నాను.

తేన జ్ఞానం హి వై నష్టం నాతస్త్వాలిఙ్గితా మయా ।
ఇత్యేవముక్తే వచనే గణాః ప్రోచుర్మహేశ్వరమ్ ॥30॥

ఆ భేదబుద్ధి వల్ల మీలోని జ్ఞానం నశించినందున నేను మిమ్ములను ఆలింగనం చేసుకోలేదు. అని మహేశ్వరుడు పలుకగా గణాధిపతులందరు మరల మహేశ్వరునితో ఇలా అన్నారు.

కథం భవాన్ యథైక్యేన సంస్థితోఽస్తి జనార్దనః ।
భవాన్ హి నిర్మలః శుద్ధః శాన్తః శుక్లో నిరంజనః ॥31॥

సచాప్యంజనసంకాశః కథం తేనేహ యుజ్యతే ।
తేషాం వచనమర్థాఢ్యం శ్రుత్వా జీమూతవాహనః ॥32॥

విహస్య మేఘగంభీరం గణానిదమువాచ హ ।

"ప్రభూ! మీరు, జనార్దనుడూ ఒక్కరే ఎలా కాగలరు? మీరు నిర్మల శుద్ధ శాంత శుక్ల నిరంజన స్వరూపులు. ఆ విష్ణువు కాలాంజన (నల్లని కాటుక) సన్నిభుడు గదా! ఆయన మీతో కలయడం ఎలా సాధ్యం?" అర్థయుక్తమైన వారి ఈ మాటలు విని జీమూతవాహనుడు (హరుడు) నవ్వి, మేఘగంభీరస్వరంతో ఆ గణాలకు ఇలా చెప్పసాగాడు.

శ్రూయతాం సర్వమాఖ్యాస్యే స్వయశోవర్ధనం వచః ॥33॥

న త్వేవ యోగ్యా యూయం హి మహాజ్ఞానస్య కర్హిచిత్ ।
అపవాదభయాద్గుహ్యం భవతాం హి ప్రకాశయే ॥34॥

ప్రియత్వం మయి చైతేన యన్మచ్చిత్తాస్తు నిత్యశః ।
ఏకరూపాత్మకం దేహం కురుధ్వం యత్నమాస్థితాః ॥35॥

నా కీర్తిప్రతిష్ఠలను వృద్ధిపరచే విషయాలు చెబుతాను. అందరు వినండి. మీరు ఉన్నత జ్ఞానానికి ఎన్నడూ అర్హులు కారు. అపవాదభయంతో నేను మీకు ఆ రహస్యాన్ని వెల్లడిస్తున్నాను. నాయందు మీకు గల ప్రేమచేత మీ చిత్తాలన్నీ నాయందే లగ్నమైయున్నాయి. మీ శరీరాలను ప్రయత్నంతో ఏకరూపంగా చేసికొని వినండి.

పయసాం హవిషాద్యైశ్చ స్నపనేన ప్రయత్నతః ।
చందనాదిభిరేకాగ్రైర్న మే ప్రీతిః ప్రజాయతే ॥36॥

యత్నాత్ క్రకచమాదాయ ఛిన్దధ్వం మమ విగ్రహమ్ ।
నరకార్హా భవద్భక్తా రక్షామి స్వయశోఽర్థతః ॥37॥

మాఽ యం వదిష్యతే లోకో మహాన్తమపవాదినమ్ ।
యథా పతన్తి నరకే హరభక్తాస్తపస్వినః ॥38॥

వ్రజన్తి నరకం ఘోరమిత్యేవం పరివాదినః ।
అతోఽ ర్థం సక్షిపామ్యద్య భవతో నరకేఽ ద్భుతే ॥39॥

"మీరు నాకు గావించే క్షీరహవిస్సులు, అభిషేకాలు ఏకాగ్రచిత్తంతో చేసే చందన లేపాది అర్చనలు, నాకు సంతోషాన్ని కలిగించవు. మీరు ఒక రంపంతో నాదేహాన్ని రెండుగా చీల్చండి. నరకగాములైన మీవంటి శివభక్తులను రక్షించుకోవడానికే నేనిలా చెబుతున్నాను. ఎందుకనగా శివభక్తులందరు నరకానికి అర్హులనే అపనింద ఈ లోకం నాకు అంటగడుతుంది. తపస్సంపన్నులైన శివభక్తులు కూడా నరకానికే పోతారనే అపవాదునకు పాత్రులయ్యేవారు, ఘోర నరకాలలో పడకుండా చేయడానికే నేనిలా చేస్తున్నాను.

యన్నిన్దధ్వం జగన్నాథం పుష్కరాక్షం చ మన్మయమ్ ।
స చైవ భగవాన్ శర్వః సర్వవ్యాపీ గణేశ్వరః ॥40॥

న తస్య సదృశో లోకే విద్యతే సచరాచరే ।
శ్వేతమూర్తిః స భగవాన్ పీతో రక్తోఽ ఞ్జనప్రభః ॥41॥

తస్మాత్ పరతరం లోకే నాన్యద్ధర్మం హి విద్యతే ।
సాత్త్వికం రాజసం చైవ తామసం మిశ్రకం తథా ।
స ఏవ ధత్తే భగవాన్ సర్వపూజ్యః సదాశివః ॥42॥

శివమయుడు, కమలపత్రాక్షుడు, జగన్నాథుడు ఐన ఏ విష్ణువును మీరు నిందిస్తున్నారో ఆయన నేనే. మరెవరో కాదు. ఆయన సర్వవ్యాపియైన శర్వుడే. సర్వగణాధిపుడు ఆయనయే. శ్వేతపీతరక్తకృష్ణ వర్ణాలు కలవాడు ఆయనయే. అటువంటి ప్రభువు చరాచరజగత్తులో మరియొకడు లేడు. ఆయనను మించిన ధర్మం లోకంలో మరియొకటి కానరాదు. ఆ సర్వపూజ్యుడు, భగవంతుడునగు సదాశివుడే. సాత్త్విక, రాజస, తామస, మిశ్రమ గుణాశ్రయుడు ఆయనయే సుమా!".

శంకరస్య వచః శ్రుత్వా శైవాద్యాః ప్రమథోత్తమాః ।
ప్రత్యూచుర్భగవన్ బ్రూహి సదాశివవిశేషణమ్ ॥43॥

తేషాం తద్భాషితం శ్రుత్వా ప్రమథానామథేశ్వరః ।
దర్శయామాస తద్రూపం సదా శైవం నిరంజనమ్ ॥44॥

శంకరుడు పలికిన ఈ అద్భుతవచనాలు విని, శైవాదులైన ప్రమథోత్తములు విస్మయంతో ప్రభో! "ఆ సదాశివుని మహిమావిశేషాదులు ఎట్టివో అనుగ్రహింపు" మని ప్రార్థించగా ఆ హరుడు ప్రమథులకు సదాశైవమూ, నిరంతకమూ అయిన రూపాన్ని చూపించాడు.

తతః పశ్యన్తి హి గణాః తమీశం వై సహస్రశః ।
సహస్రవక్త్రచరణం సహస్రభుజమైశ్వరమ్ ॥45॥

దండపాణిం సుదుర్దృశ్యం లోకైర్వ్యాప్తం సమన్తతః ।
దండసంస్థాఽస్య దృశ్యన్తే దేవప్రహరణాస్తథా ॥46॥

అంతట ఆ గణాలు ఆ ఈశ్వరుని సహస్రరూపాలతో, సహస్రముఖాలు, కరచరణాదులతో దండపాణియై, సర్వవ్యాపియైన విశ్వమూర్తిగా అవలోకించారు. ఆ తేజస్సును చక్కగా చూడలేకపోయారు. ఆ ప్రభువు చేతిలోని దండాన్ని ఆశ్రయించుకుని సర్వదేవతల ఆయుధాలు కనిపించాయి.

తత ఏకముఖం భూయో దదృశుః శంకరం గణాః ।
రౌద్రైశ్చ వైష్ణవైశ్చైవ వృతం చిహ్నైః సహస్రశః ॥47॥

అంతట ఆ ప్రభువు శంకరుడు ఆ గణాలకు ఏకముఖంతో శరీరంనిండా వేలాది శైవ వైష్ణవ చిహ్నాలతో దర్శనమిచ్చాడు.

అర్ధేన వైష్ణవవపురర్ధేన హరవిగ్రహః ।
ఖగధ్వజం వృషారూఢం ఖగారూఢం వృషధ్వజమ్ ॥48॥

ఆ హరుని విగ్రహంలో సగభాగం విష్ణువు, సగభాగం శివుడు. గరుడధ్వజం ధరించి, వృషభంమీద కూర్చొని ఒకమారు, వృషభధ్వజం పట్టుకుని ఖగవాహనుడై మరొకమారు కన్పించాడు.

యథా యథా త్రినయనో రూపం ధత్తే గుణాగ్రణీః ।
తథా తథా త్వజాయన్త మహాపాశుపతా గణాః ॥49॥

సర్వగణాగ్రేసరుడైన ఆ త్రినేత్రునిలో ఈ విధంగా అనంతరూపాలు దర్శిస్తూ ఉండగా మహాపాశుపత గణాలవారు అసంఖ్యాకంగా జనిస్తూ ఉన్నారు.

తతోఽభవచ్చైకరూపీ శంకరో బహురూపవాన్ ।
ద్విరూపశ్చాభవద్ యోగీ ఏకరూపోఽప్యరూపవాన్ ।
క్షణాచ్ఛ్వేతః క్షణాద్రక్తః పీతో నీలః క్షణాదపి ॥50॥

అంతలో ఆ బహురూపి ఏకరూపి అయ్యాడు. ద్విరూపధరుడయ్యాడు. ఆ మహాయోగి రూపరహితుడయ్యాడు. తిరిగి అంతలోనే ఏకరూపియైనాడు. క్షణకాలం తెల్లగా, మరొక క్షణంలో ఎరుపుగా, పచ్చగా, నల్లగా క్షణాలలో మార్పు చెందాడు.

మిశ్రకో వర్ణహీనశ్చ మహాపాశుపతస్తథా ।
క్షణాద్భవతి రుద్రేన్ద్రః క్షణాచ్ఛంభుః ప్రభాకరః ॥51॥

క్షణార్ధాచ్ఛంకరో విష్ణుః క్షణాచ్ఛర్వః పితామహః ।
తతస్తదద్భుతతమం దృష్ట్వా శైవాదయో గణాః ॥52॥

అజానన్త తదైక్యేన బ్రహ్మవిష్ణీశభాస్కరాన్ ।
యదాఽభిన్నమమన్యన్త దేవదేవం సదా శివమ్ ॥53॥

తదా నిర్ధూతపాపాస్తే సమజాయన్త పార్షదాః ।

మరుక్షణంలో ఆ రుద్రేంద్రుడు మిశ్రవర్ణంలో కనిపిస్తే, మరుక్షణంలో వర్ణరహితుడయ్యాడు. మహా పాశుపతుడయ్యాడు. క్షణంలో శంభుడయ్యాడు. ప్రభాకరుడయ్యాడు. క్షణంలో ఇంద్రుడయ్యాడు. అనంతరం క్షణార్ధంలో శంకరుడు విష్ణువుగా మారాడు. క్షణంలో శర్వుడు పితామహుడయ్యాడు. మిక్కిలి అద్భుతమైన దీనిని చూచిన శైవాది గణాలకు బ్రహ్మవిష్ణుశివభాస్కరుల ఏకరూపత బాగా అవగతమయ్యింది. దేవదేవుడైన సదాశివుడు బ్రహ్మవిష్ణ్వాది సమస్తరూపాలు అభిన్నమని చూపగానే పార్షదులందరు పాపరహితులయ్యారు.

తేష్వేవం ధూతపాపేషు అభిన్నేషు హరీశ్వరః ॥54॥

ప్రీతాత్మా విబభౌ శంభుః ప్రీతియుక్తోఽబ్రవీద్వచః ।
పరితుష్టోఽస్మి వః సర్వే జ్ఞానేనానేన సువ్రతాః ॥55॥

వృణుధ్వం వరమానన్త్యం దాస్యే వో మనసేప్సితమ్ ।
ఊచుస్తే దేహి భగవన్ వరమస్మాకమీశ్వర ।
భిన్నదృష్ట్యుద్భవం పాపం యత్తద్భ్రంశం ప్రయాతు నః ॥56॥

ఇలా పాపాలను పోగొట్టుకొనిన తన గణాలను చూచి ఆనందించిన హరిహరుడైన సదాశివుడు వారితో ఇలా పలికాడు. “శివకేశవాభిన్నజ్ఞానాన్ని పొందిన మీరందరు ధన్యులు. మీ వ్రతాలు ఫలించాయి. మిమ్ములను గాంచి నాకు చాలా ఆనందం కలిగింది. మిక్కిలి సంతృప్తి చెందాను. మీకు కావలసిన వరం కోరుకుంటే మిమ్మల్నీ అనుగ్రహిస్తానని” పలుకగానే ఓ దేవా! భగవన్! ఇంతవరకు భేదదృష్టితో వ్యవహరించి మేము మూటకట్టుగొన్న పాపాలనన్నింటిని నశించునట్లనుగ్రహింపుమని వారు వేడుకున్నారు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

బాఢమిత్యబ్రవీచ్ఛర్వశ్చక్రే నిర్ధూతకల్మషాన్ ।
సంపరిష్వజతావ్యక్తస్తాన్ సర్వాన్ గణయూథపాన్ ॥57॥


ఇతి విభునా ప్రణతార్తిహరేణ గణపతయో వృషమేఘరథేన ।
శ్రుతిగదితానుగమేనేవ మన్దరం గిరిమవతత్య సమధ్యవసన్తమ్ ॥58॥

ఆచ్ఛాదితో గిరివరః ప్రమథైర్ఘనాభైరాభాతి శుక్లతనురీశ్వరపాదజుష్టః ।
నీలాజినాతతతనుః శరదభ్రవర్ణో యద్వద్విభాతి బలవాన్ వృషభో హరస్య ॥59॥

ఓ నారదా! అంతట శంభుడు "మంచిది. అట్లే జరుగుతుందని" పలికి వారందరిని పాపరహితులను చేశాడు. ఆ సమస్తగణసమూహాలను కౌగలించుకొని వారినందరిని ఆనందపరిచాడు. ప్రణతార్తిహరుడు, వృషభ మేఘవాహనుడునగు ప్రభువు చెప్పిన మాటలు విని, గణాధిపతులందరు వేదోక్తమైన క్రమంలో మందరగిరిని ఆక్రమించి నిలబడ్డారు. ఆ విధంగా శివుని పాదాలను నలువైపులా పరివేష్టించి, నీలమేఘకాంతితో నిలబడిన అసంఖ్య గణాలతో ఆ శ్వేతమందరమహాపర్వతం నల్లని చర్మంతో కప్పబడిన శరత్కాలమేఘం వలె వెలిగే హరుని వృషభరాజం విరాజిల్లింది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే భైరవప్రాదుర్భావే సదాశివదర్శనం నామ సప్తషష్టితమోఽధ్యాయః ॥67॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని భైరవప్రాదుర్భావమందలి సదాశివదర్శనమనే అరవైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టషష్టితమోఽధ్యాయః – అరవైఎనిమిదవ అధ్యాయం

దైత్యపరాజయః – దైత్యుల ఓటమి

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏతస్మిన్నన్తరే ప్రాప్తః సమం దైత్యైస్తథాఽన్ధకః ।
మన్దరం పర్వతశ్రేష్ఠం ప్రమథాశ్రితకన్దరమ్ ॥1॥

ఈ లోపల ప్రమథులకు ఆశ్రయాలైన కన్దరాలతో కూడిన పర్వతశ్రేష్ఠమైన మన్దరగిరికి అంధకాసురుడు తన సేనలతో వచ్చి చేరాడు.

ప్రమథా దానవాన్ దృష్ట్వా చక్రుః కిలకిలాధ్వనిమ్ ।
ప్రమథాశ్చాపి సంరబ్ధా జఘ్నుస్తూర్యాణ్యనేకశః ॥2॥

ప్రమథులందరు ఆ దానవులను చూసి, కిలకిల ధ్వనులు చేసి, గొప్ప సంరంభంతో అనేకమైన తూర్యాలు, భేరీలు మ్రోగించారు.

స చావృణోన్మహానాదో రోదసీప్రలయోపమః ।
శుశ్రావ వాయుమార్గస్థో విఘ్నరాజో వినాయకః ॥3॥

సమభ్యయాత్ సుసంక్రుద్ధః ప్రమథైరభిసంవృతః ।
మన్దరం పర్వతశ్రేష్ఠం దదృశే పితరం తథా ॥4॥

ప్రణిపత్య తథా భక్త్యా వాక్యమాహ మహేశ్వరమ్ ।
కిం తిష్ఠసి జగన్నాథ సముత్తిష్ఠ రణోత్సుకః ॥5॥

ఆ మహానాదం ప్రళయఘోష వలె ఆకాశమంతట వ్యాపించింది. ఆకాశమార్గాన వెళుతున్న విఘ్నరాజైన వినాయకుడు ఆ మహానాదాన్ని విని, మిక్కిలి క్రుద్ధుడై తన ప్రమథులతోకూడి పర్వతశ్రేష్ఠమైన మన్దరానికి వచ్చి, తండ్రిని దర్శించి, భక్తితో మ్రొక్కి, మహేశ్వరునితో ఇలా పలికాడు. "ఓ జగన్నాథా! ఇంకా ఇలా కూర్చున్నారేల? లేవండి? రణసన్నద్ధులు కండి" అని పలికాడు.

తతో విఘ్నేశవచనాజ్జగన్నాథోఽమ్బికాం వచః ।
ప్రాహ యాస్యేఽన్ధకం హన్తుం స్థేయమేవాప్రమత్తయా ॥6॥

విఘ్నేశ్వరుని మాటలు వినిన మహేశ్వరుడు అంబికను చూసి, "అంధకుని సంహరించడానికి వెళుతున్నాను. నీవు అప్రమత్తురాలుగా ఉండా"లని పలికాడు.

తతో గిరిసుతా దేవం సమాలిఙ్గ్య పునః పునః ।
సమీక్ష్య సస్నేహం హరం ప్రాహ గచ్ఛ జయాన్ధకమ్ ॥7॥

తతోఽమరగురోర్గౌరీ చందనం రోచనాంజనమ్ ।
ప్రతిపద్య సుసంప్రీతా పాదావేవాభ్యవందత ॥8॥

అంతట గిరిసుత ప్రాణేశ్వరుని మాటిమాటికి గాఢంగా కౌగిలించుకుని స్నేహాతిశయంతో "ప్రభూ! వెళ్ళండి! అంధకుని జయించండ"ని పలికింది. అంతట ఆమె చందన గోరోచనాంజనాది మంగళద్రవ్యాలతో భర్తను పూజించి, అత్యంతప్రేమతో మహేశ్వరుని పాదాలకు నమస్కరించింది.

తతో హరః ప్రాహ వచో యశస్యం మాలినీమపి ।
జయాం చ విజయాం చైవ జయన్తీం చాపరాజితామ్ ॥9॥

యుష్మాభిరప్రమత్తాభిః స్థేయం గేహే సురక్షితే ।
రక్షణీయా ప్రయత్నేన గిరిపుత్రీ ప్రమాదతః ॥10॥

ఇతి సందిశ్య తాః సర్వాః సమారుహ్య వృషం విభుః ।
నిర్జగామ గృహాత్తుష్టో జయేప్సుః శూలధృగ్బలీ ॥11॥

అంతట హరుడు మాలిని, జయ, విజయ, జయన్తి, అపరాజితలను చూచి, "మీరందరు ఇంటిలో అప్రమత్తంగా నుండి గిరిపుత్రికకు ఎటువంటి ప్రమాదము కలుగకుండా కాపాడుతు ఉండండ"ని ఆదేశించాడు వారికందరికి ఇట్లు ఆదేశించిన హరుడు సంతోషంతో వృషభారూఢుడై, శూలాన్ని ధరించి, అంధకుని జయించాలనే కోరికతో ఇంటినుండి బయలుదేరి వెళ్ళాడు.

నిర్గచ్ఛతస్తు భవనాదీశ్వరస్య గణాధిపాః ।
సమంతాత్ పరివార్యైవ జయశబ్దాంశ్చ చక్రిరే ॥12॥

ఈశ్వరుడావిధంగా తన భవనంనుండి బయల్వెడలగానే ప్రమథగణాధిపులందరు ఆయనను చుట్టుముట్టి, జయజయధ్వానాలు చేశారు.

రణాయ నిర్గచ్ఛతి లోకపాలే మహేశ్వరే శూలధరే మహర్షే ।
శుభాని సౌమ్యాని సుమంగలాని జాతాని చిహ్నాని జయాయ శంభోః ॥13॥

ఓ నారదమహర్షీ! లోకపాలుడైన మహేశ్వరుడావిధంగా శూలం ధరించి, రణభూమికి బయలుదేరగానే ఆయన విజయాన్ని సూచించే మంగళకరమైన శుభశకునాలెన్నో కలిగాయి.

శివా స్థితా వామతరేఽథ భాగే ప్రయాతి చాగ్రే స్వనమున్నదంతీ ।
క్రవ్యాదసంఘాశ్చ తథామిషైషిణః ప్రయాన్తి హృష్టాస్తృషితాసృగర్థే ॥14॥

ఎడమవైపుగా ఆడనక్క మోర ఎత్తుకుని అరుస్తూ నడిచింది. మాంసం మీద కోరిక, రక్తదాహం గల మృగాలు కూడా సంతోషంతో తమ దాహం తీర్చుకొనేందుకు ఆయనను వెంబడించాయి.

దక్షిణాంగం నఖాంతం వై సమకంపత శూలినః ।
శకునిశ్చాపి హారీతో మౌనీ యాతి పరాఙ్ముఖః ॥15॥

నిమిత్తమీదృశం దృష్ట్వా భూతభవ్యభవో విభుః ।
శైలాదిం ప్రాహ వచనం సస్మితం శశిశేఖరః ॥16॥

ఆ పరమశివుని దక్షిణాంగం నఖశిఖపర్యన్తం కంపించింది. హారీతపక్షి మౌనంగా మెడ త్రిప్పుకుని వెళ్ళింది. ఈ శుభశకునాలను చూచి, భూతభవిష్యద్వర్తమానప్రభువైన చంద్రశేఖరుడు నందీశ్వరునితో చిరునవ్వులు చిందిస్తూ ఇలా పలికాడు.

హర ఉవాచ – హరుడు పలికాడు.

నన్దిన్ జయోఽద్య మే భావీ న కథంచిత్పరాజయః ।
నిమిత్తానీహ దృశ్యన్తే సంభూతాని గణేశ్వర ॥17॥

ఓ నన్దీ! గణేశ్వరా! నాకీరోజు జయమే కలుగుతుంది. పరాజయం కలుగనే కలుగదని ఈ శుభశకునాలన్నీ సూచిస్తున్నాయి.

తచ్ఛంభువచనం శ్రుత్వా శైలాదిః ప్రాహ శఙ్కరమ్ ।
కస్సందేహో మహాదేవ యత్త్వం జయసి శాత్రవాన్ ॥18॥

ఇత్యేవముక్త్వా వచనం నన్దీ రుద్రగణాంస్తథా ।
సమాదిదేశ యుద్ధాయ మహాపాశుపతైస్సహ ॥19॥

శివుని మాటలను శిలాదపుత్రుడైన నంది విని "మహాదేవా! నీవు జయించడంలోను, శాత్రవులను పరిమార్చడంలోను సందేహమేముంటుంది?" అని పలికి నంది మహాపాశుపతాదులతో సహా రుద్రగణాలనందరిని యుద్ధానికి ఆదేశించాడు.

తేఽభ్యేత్య దానవబలం మర్దయన్తి స్మ వేగితాః ।
నానాశస్త్రధరా వీరా వృక్షానశనయో యథా ॥20॥

తే వధ్యమానా బలిభిః ప్రమథైర్దైత్యదానవాః ।
ప్రవృత్తాః ప్రమథాన్ హన్తుం కూటముద్గరపాణయః ॥21॥

శివగణాలవారందరు నానాశస్త్రాస్త్రాలు ధరించి, దానవబలం మీద పడి, పిడుగులు చెట్లను కూల్చినట్లు వారలను మర్దించసాగారు. బలవంతులైన ప్రమథుల దాడిని త్రిప్పికొట్టడానికి దైత్యదానవులంతా రోకళ్ళు, గుదిబండలు ధరించి ప్రమథులను చంపడానికి ఉద్యమించారు.

తతోఽమ్బరతలే దేవాః సేన్ద్రవిష్ణుపితామహాః ।
ససూర్యాగ్నిపురోగాస్తు సమాయాతా దిదృక్షవః ॥22॥

ఆ సమయంలో ఆకాశంలో నిలబడి ఇంద్రవిష్ణుబ్రహ్మసూర్యాగ్నులతో కూడి దేవతలందరు ఆ దృశ్యాన్ని చూడసాగారు.

తతోఽమ్బరతలే ఘోషః సస్వనః సమజాయత ।
గీతవాద్యాది సమ్మిశ్రో దుందుభీనాం కలిప్రియ ॥23॥

ఓ నారదా! అంతట అంబరవీధియందంతటా దుందుభుల శబ్దాలతో, గీతవాద్యాల ఘోషలతో నిండిపోయింది.

తతః పశ్యత్సు దేవేషు మహాపాశుపతాదయః ।
గణాస్తద్దానవం సైన్యం జిఘాంసన్తి స్మ కోపితాః ॥24॥

ఆ విధంగా దేవగణమంతా చూస్తూ ఉండగా మహాపాశుపతాది గణాలవారందరు మహాకోపంతో దానవులను సంహరింపసాగారు.

చతురంగబలం దృష్ట్వా హన్యమానం గణేశ్వరైః ।
క్రోధాన్వితస్తు హుండస్తు వేగేనాభిససార హ ॥25॥

ఆదాయ పరిఘం ఘోరం పట్టోద్బద్ధమయస్మయమ్ ।
రాజతం రాజతేఽత్యర్థమింద్రధ్వజమివోచ్ఛ్రితమ్ ॥26॥

తం భ్రామయానో బలవాన్ నిజఘాన రణే గణాన్ ।
రుద్రాద్యాః స్కన్దపర్యన్తాస్తేఽభజ్యన్త భయాతురాః ॥27॥

దైత్యసేనాధిపతి తుహుండుడు తమ చతురంగబలాలు సంహరింపబడడం చూసి, క్రోధోద్రిక్తుడై, మహావేగంతో పట్టుకుచ్చులతో వెలిగే ప్రచండమైన వెండి పరిఘ చేతబట్టుకొని ఇంద్రధ్వజం ధరించినవానివలె శత్రువుల మీద విరుచుకుపడ్డాడు. ఆ పరిఘను గిరగిర త్రిప్పుతు అనేక గణాలను సంహరించాడు. ఆ దైత్యుని ధాటికి రుద్రగణాలు మొదలు స్కందగణాలవరకు భయంతో పారిపోవసాగారు.

తత్రప్రభగ్నం బలం దృష్ట్వా గణనాథో వినాయకః ।
సమాద్రవత వేగేన తుహుండం దనుపుంగవమ్ ॥28॥

ఆ విధంగా భయంతో భగ్నమౌతున్న తన బలాన్ని చూచి, గణాధిపతియైన వినాయకుడు తుహుండుని వైపు వేగంగా పరుగెత్తాడు.

ఆపతన్తం గణపతిం దృష్ట్వా దైత్యో దురాత్మవాన్ ।
పరిఘం పాతయామాస కుంభపృష్ఠే మహాబలః ॥29॥

ఆ విధంగా వస్తున్న వినాయకుని కుంభస్థలాన్ని గురి చూసి, ఆ దురాత్ముడైన తుహుండుడు తన పరిఘను విసిరాడు.

వినాయకస్య తత్కుంభే పరిఘం వజ్రభూషణమ్ ।
శతధా త్వగమద్ బ్రహ్మన్ మేరోః కూట ఇవాశనిః ॥30॥

ఓ బ్రహ్మర్షీ! వజ్రంచే అలంకరింపబడిన ఆ పరిఘ వినాయకుని కుంభప్రదేశానికి తగిలి, మేరుశిఖరంపై పడి ముక్కలైన పిడుగు వలె వందల ముక్కలయ్యింది.

పరిఘం విఫలం దృష్ట్వా సమాయాన్తం చ పార్షదమ్ ।
బబన్ధ బాహుపాశేన రాహూ రక్షన్ హి మాతులమ్ ॥31॥

పరిఘను విఫలం గావించి, తన మేనమామ (తుహుండుని) మీద లంఘిస్తున్న వినాయకునిచూచి, తన మేనమామను రక్షించడానికి రాహువు తన బాహుపాశాలతో గట్టిగా బంధించాడు.

సబద్ధో బాహుపాశేన బలాదాకృష్య దానవమ్ ।
సమాజఘాన శిరసి కుఠారేణ మహోదరః ॥32॥

అంతట ఆ మహోదరుడు వాని బాహుపాశాన్ని విడిపించుకోవడానికి వానిని లాగి తనగొడ్డలితో తలమీద కొట్టాడు.

కాష్ఠవత్స ద్విధాభూతో నిపపాత ధరాతలే ।
తథాపి నాత్యజద్ రాహుర్బలవాన్ దానవేశ్వరః ।
సమోక్షార్థేఽకరోద్ యత్నం న శశాక చ నారద ॥33॥

ఆ వ్రేటుకు ఎండినకట్టె వలె తల రెండుగా చీలి, క్రిందపడినా రాహువు తన పట్టును వదలలేదు. నారదా! వినాయకుడెంత ప్రయత్నించినా తప్పించుకోలేకపోయాడు.

వినాయకం సంయతమీక్ష్య రాహుణా కుండోదరో నామ గణేశ్వరోఽథ ।
ప్రగృహ్య తూర్ణం ముసలం మహాత్మా రాహుం దురాత్మానమసౌ జఘాన ॥34॥

రాహువు బంధనంలో చిక్కిన వినాయకుని చూసి కుండోదరుడనే గణేశ్వరుడు రోకలి పట్టుకుని మహావేగంతో దురాత్ముడైన రాహువును మోదాడు.

తతో గణేశః కలశధ్వజస్తు ప్రాసేన రాహుం హృదయే బిభేద ।
ఘటోదరో వై గదయా జఘాన ఖడ్గేన రక్షోఽధిపతిః సుకేశీ ॥35॥

కలశధ్వజుడనే గణపతి ప్రాసంతో రాహువు గుండెలు చీల్చాడు. ఘటోదరుడు గదతో కొట్టాడు. సుకేసి దైత్యుని ఖడ్గంతో కొట్టాడు.

స తైశ్చతుర్భిః పరితాడ్యమానో గణాధిపం రాహురథోత్ససర్జ ।
సంత్యక్తమాత్రోఽథ పరశ్వథేన తుహుండమూర్ధానమథో బిభేద ॥36॥

ఆ విధంగా నలువైపులనుండి చావుదెబ్బలు తిని, వివశుడై రాహువు వినాయకుని వదలిపెట్టాడు. వెంటనే ఆ గణేశ్వరుడు గండ్రగొడ్డలితో తుహుండుని తల బ్రద్దలు గావించాడు.

హతే తుహుండే విముఖే చ రాహౌ గణేశ్వరాః క్రోధవిషం ముముక్షవః ।
పంచైకకాలానలసన్నికాశా విశన్తి సేనాం దనుపుంగవానామ్ ॥37॥

తుహుండుడు మరణించడంతో, రాహువు తిరుగుముఖం పట్టడంతోను, కాలానల సదృశులైన గణేశ్వరులు ఐదుగురు రాక్షసవీరుల సేనలోనికి తమ క్రోధవిషజ్వాలలు వర్షింపజేయడానికి చొచ్చుకునిపోయారు.

తాం వధ్యమానాం స్వచమూం సమీక్ష్య బలిర్బలీ మారుతతుల్యవేగః ।
గదాం సమావిధ్య జఘాన మూర్ధ్ని వినాయకం కుంభతటే కరే చ ॥38॥

ఈ విధంగా గణేశ్వరులచేత వధింపబడుతున్న తన సేనలను చూసి, మహాబలశాలియైన బలి వాయువేగంతో వినాయకుని కుంభస్థలంపై గదతో మోదాడు.

కుండోదరం భగ్నకటిం చకార మహోదరం శీర్ణశిరఃకపాలమ్ ।
కుంభధ్వజం చూర్ణితసన్ధిబన్ధం ఘటోదరం చోరువిభిన్నసన్ధిమ్ ॥39॥

కుండోదరుని నడుము విరగగొట్టాడు. మహోదరుని శిరఃకపాలాన్ని పగులగొట్టాడు. కుంభధ్వజుని కీళ్ళు ఊడగొట్టాడు. ఘటోదరుని తొడలు, సంధులు పొడిపొడి చేశాడు.

గణాధిపాంస్తాన్ విముఖాన్ స కృత్వా బలాన్వితో వీరతరోఽసురేంద్రః ।
సమభ్యధావత్ త్వరితో నిహన్తుం గణేశ్వరాన్ స్కన్దవిశాఖముఖ్యాన్ ॥40॥

అలా అయిదుగురు గణాధిపతులను తిరుగుముఖం పట్టించగా రెట్టించిన శౌర్యంతో ఆ రాక్షసశ్రేష్ఠుడు స్కందవిశాఖాది గణాల మీదకు లంఘించాడు.

తమాపతన్తం భగవాన్ సమీక్ష్య మహేశ్వరః శ్రేష్ఠతమం గణానామ్ ।
శైలాదిమామన్త్ర్య వచో బభాషే గచ్ఛస్వ దైత్యాన్ జహి వీర యుద్ధే ॥41॥

అలా విరుచుకుపడుతున్న బలిని చూసి మహేశ్వరుడు గణశ్రేష్ఠుడైన నందీశ్వరుని పిలిచి, "ఓ వీరా! వెళ్ళి దైత్యులను జయించి రమ్మ"ని పంపాడు.

ఇత్యేవముక్తో వృషభధ్వజేన వజ్రం సమాదాయ శిలాదసూనుః ।
బలిం సమభ్యేత్య జఘాన మూర్ధ్ని సమ్మోహితః సోఽవనిమాససాద ॥42॥

వృషభధ్వజుని ఆదేశాన్ని శిరసావహించి, శిలాదసూనుడైన నందీశ్వరుడు వజ్రాయుధం గ్రహించి, బలి తలమీద గట్టిగా కొట్టాడు. దానితో బలి స్పృహతప్పి నేలమీద పడిపోయాడు.

సమ్మోహితం భ్రాతృసుతం విదిత్వా బలీ కుజంభో ముసలం ప్రగృహ్య ।
సంభ్రామయంస్తూర్ణతరం స వేగాత్ ససర్జ నన్దిం ప్రతిజాతకోపః ॥43॥

తన సోదరుని కుమారుడు ఆ విధంగా మూర్ఛపోవడం చూసి కుజంభుడు రోకలి పట్టుకుని మహాబలంతో వేగంగా త్రిప్పి నందిమీదకు విసిరాడు.

తమాపతన్తం ముసలం ప్రగృహ్య కరేణ తూర్ణం భగవాన్ స నన్దీ ।
జఘాన తేనైవ కుజంభమాహవే స ప్రాణహీనో నిపపాత భూమౌ ॥44॥

అలా వస్తున్న రోకలిని మధ్యలోనే పట్టుకుని మహాబలశాలియైన నంది దానితోనే కుజంభుని తల పగులగొట్టి, ప్రాణహీనునిచేసి, నేలమీద పడగొట్టాడు.

హత్వా కుజంభం ముసలేన నన్దీ వజ్రేణ వీరః శతశో జఘాన ।
తే వధ్యమానా గణనాయకేన దుర్యోధనం వై శరణం ప్రపన్నాః ॥45॥

ముసలంతో కుజంభుని చంపి, నంది వజ్రాయుధంతో వందల రాక్షసులను సంహరించాడు. చావగా మిగిలిన రాక్షసులందరు నంది చేతిలో చావుదెబ్బలు తిని, పారిపోయి దుర్యోధనుని శరణువేడారు.

దుర్యోధనః ప్రేక్ష్య గణాధిపేన వజ్రప్రహారైర్నిహతాన్ దితీశాన్ ।
ప్రాసం సమావిధ్య తడిత్ప్రకాశం నన్దిం ప్రచిక్షేప హతోఽసి వై బ్రువన్ ॥46॥

నందిచేత వజ్రాయుధ దెబ్బలు తినివచ్చిన తన వీరులను చూచి దైత్యవీరుడైన దుర్యోదనుడు 'ఈ దెబ్బతో నీవు చావరా!' అంటూ నందిమీదకు మెరుపుతీగెవంటి ప్రాసాయుధాన్ని విసిరాడు.

తమాపతన్తం కులిశేన నన్దీ బిభేద గుహ్యం పిశునో యథా నరః ।
తత్ప్రాసమాలక్ష్య తదా నికృత్తం సంవర్త్య ముష్టిం గణమాససాద ॥ 47॥

తనమీదకు వస్తున్న ప్రచండప్రాసాన్ని కొండెగాడు గూఢరహస్యాలు బయటపెట్టి బ్రద్దలు చేసినట్లు నంది తన వజ్రాయుధంతో బ్రద్దలు చేశాడు. అంతట తన ప్రాసాయుధం వ్యర్థం కావడంతో దుర్యోధనుడు పిడికిలి బిగించి, గణేశ్వరుని మీదకు దుమికాడు.

తతోఽస్య నన్దీ కులిశేన తూర్ణం శిరోఽచ్ఛినత్ తాలఫలప్రకాశమ్ ।
హతోఽథ భూమౌ నిపపాత వేగాద్ దైత్యాశ్చ భీతా విగతా దిశో దశ ॥48॥

అంతట నందీశ్వరుడు వజ్రాయుధాన్ని వేగంగా ఆ రాక్షసునిపై ప్రయోగించి, వాని తలను తాటిపండువలె పగలగొట్టి నేల పడగొట్టాడు. దుర్యోధనుడు నేలకొరిగిపోవడంతో రాక్షసులందరు భయభ్రాంతులై దశదిశలకు పారిపోయారు.

తతో హతం స్వం తనయం నిరీక్ష్య హస్తీ తదా నన్దినమాజగామ ।
ప్రగృహ్య బాణాసనముగ్రవేగం బిభేద బాణైర్యమదణ్డకల్పైః ॥49॥

తన కుమారుడావిధంగా హతుడు కావడంచూసి వానితండ్రియైన హస్తి భయంకరమైన విల్లు ధరించి, నందీశ్వరుని మీదకురికి, యమదండాల వంటి బాణాలు ప్రయోగించి ఆయన శరీరాన్ని చిల్లులు పడేట్లుచేశాడు.

తే ఛాద్యమానాసురబాణజాలైర్వినాయకాద్యా బలినోఽపి వీరాః ।
సింహప్రణున్నా వృషభా యథైవ భయాతురా దుద్రువిరే సమన్తాత్ ॥50॥

ఆ దైత్యుని బాణజలధారలలో నందీశ్వరునితో బాటు వినాయకాది గణాలవారందరు మునిగిపోయి, ఆ బాణవృష్టికి తట్టుకోలేక తాము బలవంతులు, వీరులు అయినప్పటికి సింహాన్ని చూచిన వృషభాల వలె భయార్తులై, నల్దిక్కులకు పారిపోసాగారు.

పరాఙ్ముఖాన్ వీక్ష్య గణాన్ కుమారః శక్త్యా పృషత్కానథ వారయిత్వా ।
తూర్ణం సమభ్యేత్య రిపుం సమీక్ష్య ప్రగృహ్య శక్త్యా హృదయే బిభేద ॥51॥

ఆ విధంగా తమ గణాధిపతులు వెనుకంజ వేయడం చూసి, కుమారస్వామి తనశక్త్యాయుధంతో దైత్యుని బాణవృష్టిని నివారించి ప్రచండ వేగంతో శత్రువును సమీపించి, శక్తితో అతని వక్షఃస్థలాన్ని చీల్చాడు.

శక్తినిర్భిన్నహృదయో హస్తీ భూమ్యాం పపాత హ ।
మమార చారిపృతనా జాతా భూయః పరాఙ్ముఖీ ॥52॥

స్కందుని శక్తిపాతానికి హస్తి హృదయం చీల్చబడి, మరణించి, నేలపైబడ్డాడు. దానితో శత్రుసైన్యం మరలా పలాయనం చిత్తగించింది.

అమరారిబలం దృష్ట్వా భగ్నం క్రుద్ధా గణేశ్వరాః ।
పురతో నన్దినం కృత్వా జిఘాంసన్తి స్మ దానవాన్ ॥53॥

అసురసైన్యం ఆ విధంగా భగ్నం కావడం చూసి, నంది మున్నగు గణముఖ్యులు మహాక్రోధంతో విజృంభించి దానవసైన్యాన్ని సంహరింపసాగారు.

తే వధ్యమానాః ప్రమథైర్దైత్యాశ్చాపి పరాఙ్ముఖాః ।
భూయో నివృత్తా బలినః కార్తస్వరపురోగమాః ॥54॥

అట్లు ప్రమథుల ధాటికి వెనుదిరిగి పారిపోయిన దైత్యులు కార్తస్వరరాక్షసరాజు నాయకత్వంలో తిరిగి యుద్ధభూమికి వచ్చారు.

తాన్ నివృత్తాన్ సమీక్ష్యైవ క్రోధదీప్తేక్షణః శ్వసన్ ।
నందిషేణో వ్యాఘ్రముఖో నివృత్తశ్చాపి వేగవాన్ ॥55॥

ఆ విధంగా తిరిగి యుద్ధానికి సిద్ధమైన దైత్యసేనలను చూసి, ప్రచండక్రోధంతో బుసలుకొడుతూ వ్యాఘ్రముఖుడైన నందిషేణుడుకూడా వేగంగా తిరిగి యుద్ధానికుపక్రమించాడు.

తస్మిన్నివృత్తే గణపే పట్టిశాగ్రకరే తదా ।
కార్తస్వరో నివవృతే గదామాదాయ నారద ॥56॥

ఓ నారదా! వాడిమొనదేలిన పట్టిశాయుధంతో నందిషేణుడు, గద చేతబట్టుకుని కార్తస్వరుడు యుద్ధానికి తలబడ్డారు.

తమాపతన్తం జ్వలనప్రకాశం గణః సమీక్ష్యైవ మహాసురేన్ద్రమ్ ।
తం పట్టిశం భ్రామ్య జఘాన మూర్ధ్ని కార్తస్వరం విస్వరమున్నదన్తమ్ ॥57॥

ఆ విధంగా అగ్నిశిఖలా దూకుతున్న కార్తస్వరమహాదైత్యుని చూసి, నందిషేణుడు పట్టిశాన్ని గిరగిరా త్రిప్పి, ప్రచండవేగంతో దైత్యుని నుదుటిమీద కొట్టగా కార్తస్వరుడు వికృతస్వరంతో చావుకేక పెట్టి మరణించాడు.

తస్మిన్హతే భ్రాతరి మాతులేయే పాశం సమావిధ్య తురఙ్గకన్ధరః ।
బబన్ధ వీరః సహ పట్టిశేన గణేశ్వరం చాప్యథ నన్దిషేణమ్ ॥58॥

తన మేనమామ కుమారుడు ఆ విధంగా హతుడు కావడంతో తురంగముఖుడు కాలపాశం వంటి పాశం ధరించి, దానితో నందిషేణుని పట్టిశాయుధంతో సహా బంధించాడు.

నన్దిషేణం తథా బద్ధం సమీక్ష్య బలినాం వరః ।
విశాఖః కుపితోఽభ్యేత్య శక్తిపాణిరవస్థితః ॥59॥

బద్ధుడైన నందిషేణుని చూసి, మహాబలశాలియైన విశాఖుడు శక్తి ఆయుధాన్ని ధరించి, కోపంతో వచ్చి నిలిచాడు.

తం దృష్ట్వా బలినాం శ్రేష్ఠః పాశపాణిరయఃశిరాః ।
సంయోధయామాస బలీ విశాఖం కుక్కుటధ్వజమ్ ॥60॥

అది చూసి మేటివీరుడైన అయఃశిరుడు పాశాన్ని ధరించి, కుక్కుటధ్వజుడైన విశాఖునితో తలబడ్డాడు.

విశాఖం సంనిరుద్ధం వై దృష్ట్వా యః శిరసా రణే ।
శాఖశ్చ నైగమేయశ్చ తూర్ణమాద్రవతాం రిపుమ్ ॥61॥

యుద్ధంలో అయఃశిరునిచే నిరోధింపబడిన విశాఖుని చూసి, శాఖుడు, నైగమేయుడు అనే గణనాయకులు వేగంగా శత్రువులవైపు పరుగుతీశారు.

ఏకతో నైగమేయేన భిన్నః శక్త్యా త్వయఃశిరాః ।
ఏకతశ్చైవ శాఖేన విశాఖప్రియకామ్యయా ॥62॥

విశాఖునికి ప్రియం కలిగించాలనే కోరికతో ఒకవైపు నుండి నైగమేయుడు, మరియొక వైపు నుండి శాఖుడు శక్తి ఆయుధంతో అయఃశిరుని ఛేదించారు.

స త్రిభిః శంకరసుతైః పీడ్యమానో జహౌ రణమ్ ।
తే ప్రాప్తాః శంబరం తూర్ణం ప్రేక్ష్యమాణా గణేశ్వరాః ॥63॥

ఆ విధంగా శంకర పుత్రులు ముగ్గురు పీడింపగా దానవులు రణభూమిని వదలి పారిపోయి, గణేశ్వరులు చూస్తూ ఉండగా శంబరుని చేరారు.

పాశం శక్త్యా సమాహత్య చతుర్భిః శంకరాత్మజైః ।
జగామ విలయం తూర్ణమాకాశాదివ భూతలమ్ ॥64॥

శివుని నల్గురు పుత్రులు తమ శక్త్యాయుధాలతో శంబరుని పాశాన్ని నాల్గు ముక్కలుగా ఖండించారు. ఆ ముక్కలు ఆకాశంనుండి నేలమీద వేగంగా పడ్డాయి.

పాశే నిరాశతాం యాతే శంబరః కాతరేక్షణః ।
దిశోఽథ భేజే దేవర్షే కుమారః సైన్యమర్దయత్ ॥65॥

ఓ నారదా! దేవర్షీ! ఆ విధంగా తన పాశపు ముక్కలు ఆకాశంనుండి క్రిందబడడం చూసి, శంబరుడు గడగడలాడుతు పారిపోయాడు. కుమారస్వామి రాక్షసులను మర్దించాడు.

తైర్వధ్యమానా పృతనా మహర్షే సా దానవీ రుద్రసుతైర్గణైశ్చ ।
విషణ్ణరూపా భయవిహ్వలాఙ్గీ జగామ శుక్రం శరణం భయార్తా ॥66॥

రుద్రగణాలచేతను, రుద్రసుతులచేతను, మర్దింపబడిన ఆ దానవసేన విషణ్ణవదనంతో, భయాందోళనలతో పారిపోయి, శుక్రాచార్యుని శరణుజొచ్చింది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్య నారదసంవాదే దైత్యపరాజయో నామాష్టషష్టితమోఽధ్యాయః ॥68॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్యనారదసంవాదంలోని దైత్యుల ఓటమి అనే అరవై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



నవషష్టితమోఽధ్యాయః - అరవైతొమ్మిదవ అధ్యాయం

భైరవప్రాదుర్భావే జంభ, కుజంభవధః - భైరవప్రాదుర్భావంలో జంభ, కుజంభుల వధ

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

తతః స్వసైన్యమాలక్ష్య నిహతం ప్రమథైరథ ।
అన్ధకోఽభ్యేత్య శుక్రం తు ఇదం వచనమబ్రవీత్ ॥1॥

ప్రమథుల చేతిలో హతమైన తన సైన్యాన్ని చూసి, అంధకుడు రాక్షసగురువైన శుక్రాచార్యుని సమీపించి ఇలా పలికాడు.

భగవంస్త్వాం సమాశ్రిత్య వయం బాధామ దేవతాః ।
అథాన్యానపి విప్రర్షే గన్ధర్వసురకిన్నరాన్ ॥2॥

ఓ విప్రర్షీ! మేము మిమ్ములను ఆశ్రయించి, మీ అండ చూసుకుని, దేవగన్ధర్వకిన్నరాదులను బాధిస్తున్నాము.

తదియం పశ్య భగవన్ మయా గుప్తా వరూథినీ ।
అనాథేవ యథా నారీ ప్రమథైరపి కాల్యతే ॥3॥

భగవన్! ఇటు చూడండి. నాచే రక్షింపబడిన సైన్యమంతయు ప్రమథులచేత పరాభవింపబడి, అనాథయైన స్త్రీవలె పారిపోయి వచ్చింది.

కుజంభాద్యాశ్చ నిహతా భ్రాతరో మమ భార్గవ ।
అక్షయాః ప్రమథాశ్చామీ కురుక్షేత్రఫలం యథా ॥4॥

భార్గవా! నా సోదరులైన కుజంభాదులు సంహరింపబడ్డారు. ప్రమథులు మాత్రం కురుక్షేత్రఫలం లాగా అక్షయంగా నున్నారు.

తస్మాత్ కురుష్వ శ్రేయో నో న జయేమ యథా పరైః ।
జయేమ చ పరాన్ యుద్ధే తథా త్వం కర్తుమర్హసి ॥5॥

కాబట్టి మేము శత్రువుల చేతిలో పరాజయం పొందకుండాను, శత్రువులను జయించే విధంగాను ఏ విధంగా చేయాలో ఉపాయం తెలియజేయండి.

శుక్రోఽన్ధకవచః శ్రుత్వా సాంత్వయన్ పరమాద్భుతమ్ ।
వచనం ప్రాహ దేవర్షే బ్రహ్మర్షిర్దానవేశ్వరమ్ ।
త్వద్ధితార్థం యతిష్యామి కరిష్యామి తవ ప్రియమ్ ॥6॥

ఓ నారదా! బ్రహ్మర్షియైన శుక్రాచార్యుడు దానవేశ్వరుడైన అంధకుని మాటలను విని, వానినిలా ఓదార్చాడు. "ఓ అంధకా! నీ మేలు కొఱకు ప్రయత్నిస్తాను. నీకు ప్రియం కలిగిస్తాను" అని ఓదార్చాడు.

ఇత్యేవముక్త్వా వచనం విద్యాం సంజీవనీం కవిః ।
ఆవర్తయామాస తదా విధానేన శుచివ్రతః ॥7॥

శుక్రాచార్యుడీవిధంగా అంధకుని ఓదార్చి, తాను శుచిర్భూతుడై, విధివిధానంగా సంజీవనీవిద్యను వినియోగించాడు.

తస్యామావర్త్యమానాయాం విద్యాయామసురేశ్వరాః ।
యే హతాః ప్రథమం యుద్ధే దానవాస్తే సముత్థితాః ॥8॥

ఆ విధంగా శుక్రుడు సంజీవనీవిద్యను వినియోగించగానే ముందుగా యుద్ధంలో మరణించిన అసురేశ్వరులు, దానవులు లేచి కూర్చున్నారు.

కుజంభాదిషు దైత్యేషు భూయ ఏవోత్థితేష్వథ ।
యుద్ధాయాభ్యాగతేష్వేవ నన్దీ శంకరమబ్రవీత్ ॥9॥

తదనంతరం కుజంభాది దైత్యులందరు తిరిగి లేచి, యుద్ధానికి సిద్ధం కాగా, నంది శంకరునితో ఇలా పలికాడు.

మహాదేవ వచో మహ్యం శృణు త్వం పరమాద్భుతమ్ ।
అవిచిన్త్యమసహ్యం చ మృతానాం జీవనం పునః ॥10॥

మహాదేవా! పరమాద్భుతాన్ని కలిగించే నా మాటలు వినండి. "ఇది అనూహ్యం, అసంభవం, అసహ్యం. మరణించినవారు మరలా జీవించడం సంభవించింది.

యే హతాః ప్రమథైర్దైత్యా యథా శక్త్యా రణాజిరే ।
తే సముజ్జీవితా భూయో భార్గవేణాథ విద్యయా ॥ 11॥

తదిదం తైర్మహాదేవం మహత్కర్మకృతం రణే ।
సంజాతం స్వల్పమేవేశ శుక్రవిద్యాబలాశ్రయాత్ ॥12॥

ప్రమథుల శక్తివలన యుద్ధంలో మరణించిన దైత్యులందరు భార్గవుని విద్యచేత బ్రతికింపబడ్డారు. ఆ విధంగా మేము గావించిన మహాసంగ్రామమంతా శుక్రాచార్యుని విద్యాబలంవలన వ్యర్థమయ్యింది".

ఇత్యేవముక్తే వచనే నన్దినా కులనన్దినా ।
ప్రత్యువాచ ప్రభుః ప్రీత్యా స్వార్థసాధనముత్తమమ్ ॥13॥

కులానందకరుడైన నంది పలికిన ఈ మాటలు విని, మహాదేవుడు స్వకార్యసిద్ధి కొఱకు స్నేహపూర్వకంగా నందితో ఇలా పలికాడు.

గచ్ఛ శుక్రం గణపతే మమాన్తికముపానయ ।
అహం తం సంయమిష్యామి యథా యోగం సమేత్య హి ॥14॥

"ఓ గణపతీ! నీవు వెళ్ళి శుక్రుని నా సమీపానికి తీసికొని రా!. నేను యోగక్రియద్వారా అతనిని నిరోధిస్తా".

ఇత్యేవముక్తో రుద్రేణ నన్దీ గణపతిస్తతః ।
సమాజగామ దైత్యానాం చమూం శుక్రజిఘృక్షయా ॥15॥

రుద్రుడు ఇలా పలుకగానే గణపతియైన నంది శుక్రాచార్యుని పట్టి తీసికొని రావడానికి రాక్షససేనా సమూహం చెంతకు వెళ్ళాడు.

తం దదర్శాసురశ్రేష్ఠో బలవాన్ హయకన్ధరః ।
స రురోధ తదా మార్గం సింహస్యేవ పశుర్వనే ॥16॥

సముపేత్యాహనన్నన్దీ వజ్రేణ శతపర్వణా ।
స పపాతాథ నిఃసంజ్ఞో యయౌ నన్దీ తతస్త్వరన్ ॥17॥

తతః కుజంభో జంభశ్చ బలో వృత్రస్త్వయఃశిరాః ।
పంచదానవశార్దూలా నందినం సముపాద్రవన్ ॥18॥

ఆ విధంగా వస్తున్న నందిని చూసి రాక్షసశ్రేష్ఠుడైన హయకన్ధరుడు అడ్డగించాడు. అడవిలో సింహాన్ని ఎదిరించిన పశువువలె తనకు ఎదురైన ఆ రాక్షసుని మీదకు లంఘించి, నూరంచులుగల తన వజ్రాయుధంతో మోదగా వాడు మూర్ఛనొంది, నేలమీద పడ్డాడు. దానితో నంది వేగంగా ముందుకు సాగగా కుజంభ, జంభ, బలి, వృత్ర, అయఃశిరులనే ఐదుగురు దానవశ్రేష్ఠులు నందిని చుట్టుముట్టారు.

తథాఽన్యే దానవశ్రేష్ఠా మయహ్లాదపురోగమాః ।
నానాప్రహరణా యుద్ధే గణనాథమభిద్రవన్ ॥19॥

తతో గణానామధిపం కుట్యమానం మహాబలైః ।
సమపశ్యన్త దేవాస్తం పితామహపురోగమాః ॥20॥

మయుడు, హ్లాదుడు మొదలుగా గల ఇతర దానవవీరులు కూడా అనేక ఆయుధాలు చేబట్టి నందిమీద దాడి చేశారు. ఆ విధంగా రాక్షస వీరులచే దెబ్బలు తింటున్న గణాధిపతియైన నందిని ఆకాశంలో నిలబడి బ్రహ్మాది దేవతలు చూశారు.

తం దృష్ట్వా భగవాన్ బ్రహ్మా ప్రాహ శక్రపురోగమాన్ ।
సాహాయ్యం క్రియతాం శంభోరేతదన్తరముత్తమమ్ ॥21॥

పితామహోక్తం వచనం శ్రుత్వా దేవాః సవాసవాః ।
సమాపతన్త వేగేన శివసైన్యమథాంబరాత్ ॥22॥

ఆ స్థితిని చూచిన భగవానుడైన బ్రహ్మ ఇంద్రాది దేవతలతో మీరందరు వెళ్ళి ఈ సమయంలో శంకరునకు సహాయపడండని పలికాడు. బ్రహ్మ పలుకులను వినిన ఇంద్రాది దేవతలందరు వేగంగా శివసైన్యానికి బాసటగా ఆకాశంనుండి క్రిందకుదిగి నిలబడ్డారు.

తేషామాపతతాం వేగః ప్రమథానాం బలే బభౌ ।
ఆపగానాం మహావేగం పతన్తీనాం మహార్ణవే ॥23॥

తతో హలహలాశబ్దః సమజాయత చోభయోః ।
బలయోర్ఘోరసంకాశోఽసురప్రమథయోరథ ॥24॥

తమన్తరముపాగమ్య నన్దీ సంగృహ్య వేగవాన్ ।
రథాద్భార్గవమాక్రామత్ సింహః క్షుద్రమృగం యథా ॥25॥

మహానదులన్నీ త్వరత్వరగా మహాసముద్రంలో కలిసినట్లు దేవతలందరు శివసైన్యంలో కలిసిపోయారు. ఆ విధంగా దేవతలు శివసైన్యంలో కలిసిపోవడంతో ఆ సమయంలో రెండు వర్గాలలోను హలహలాశబ్దం వ్యాపించింది. దేవదానవసైన్యాల మధ్య భయంకరంగా యుద్ధం సాగింది. ఈ మధ్యలో నందీశ్వరుడు తప్పించుకుని వేగంగా వెళ్లి సింహం మృగాన్ని లాగిన విధంగా శుక్రుని రథం నుండి లాగి ఒడిసిపట్టుకున్నాడు..

తమాదాయ హరాభ్యాశమాగమద్ గణనాయకః ।
నిపాత్య రక్షిణః సర్వానథ శుక్రం న్యవేదయత్ ॥26॥

శుక్రుని రక్షించడానికి వచ్చిన వారినందరిని నేలపడకొట్టి శుక్రుని శివునిముందుకు తెచ్చి, శివునకు అప్పగించాడు.

తమానీతం కవిం శర్వః ప్రాక్షిపద్వదనే ప్రభుః ।
భార్గవం త్వావృతతనుం జఠరే స న్యవేశయత్ ॥27॥

స శంభునా కవిశ్రేష్ఠో గ్రస్తో జఠరమాస్థితః ।
తుష్టావ భగవన్తం తం మునిర్వాగ్భిరథాదరాత్ ॥28॥

ఆ విధంగా తీసికొనివచ్చిన శుక్రుని శివుడు అమాంతంగా తన నోటిలో వేసికొని మ్రింగివేశాడు. ఆ విధంగా శివుని జఠరంలో బంధింపబడిన శుక్రుడు భక్త్యాదరాలతో ఆ మహాదేవుని ఇలా స్తుతించాడు.

శుక్ర ఉవాచ – శుక్రుడు పలికాడు.

వరదాయ నమస్తుభ్యం హరాయ గుణశాలినే ।
శంకరాయ మహేశాయ త్ర్యంబకాయ నమోనమః ॥29॥

ఓ మహేశ్వరా! వరదుడువైన నీకు నమస్కారం. గుణశాలివైన హరునకు, శంకరునకు, మహేశునకు, త్ర్యంబకునకు నమస్సులు.

జీవనాయ నమస్తుభ్యం లోకనాథ వృషాకపే ।
మదనాగ్నే కాలశత్రో వామదేవాయ తే నమః ॥30॥

ఓ లోకనాథా! వృషాకపీ! జీవనస్వరూపుడవైన నీకు నమస్కారం. మదనుని పాలిట అగ్నిస్వరూపుడవైనవాడా! కాలశత్రుడా! వామదేవుడా! నీకు నమస్సులు.

స్థాణవే విశ్వరూపాయ వామనాయ సదాగతే ।
మహాదేవాయ శర్వాయ ఈశ్వరాయ నమోనమః ॥31॥

ఓ స్థాణూ! విశ్వరూపా! వామనా! సదాగతీ! మహాదేవా! శర్వా! ఈశ్వరా! నీకు నమోవాకాలు.

త్రినయన హర భవ శంకర ఉమాపతే జీమూతకేతో ।
గుహాగృహ శ్మశాననిరత భూతివిలేపన శూలపాణే ।
పశుపతే గోపతే తత్పురుషసత్తమ నమో నమస్తే ॥32॥

ఓ త్రినయనా! హరా! భవా! శంకరా! ఉమాపతే! జీమూతకేతూ! గుహావాసీ! శ్మశానప్రియా! భూతిధరా! శూలపాణీ! పశుపతీ! గోపతీ! తత్పురుషోత్తమా! నీకు మాటిమాటికీ నమస్సులు.

ఇత్థం స్తుతః కవివరేణ హరోఽథ భక్త్యా ప్రీతో వరం వరయ దద్మి తవేత్యువాచ ।
స ప్రాహ దేవవర దేహి వరం మమాద్య యద్వై తవైవ జఠరాత్ ప్రతినిర్గమోఽస్తు ॥33॥

ఇలా భక్తితో స్తుతించిన శుక్రునిపట్ల ప్రీతుడై శంకరుడు శుక్రాచార్యుని వరం కోరుకొనుమనగా శుక్రుడు దేవవరా! నీ ఉదరంనుండి బయటపడేటట్లు వరమనుగ్రహించండని వేడుకున్నాడు.

తతో హరోఽక్షిణీ తదా నిరుధ్య ప్రాహ ద్విజేన్ద్రాద్య వినిర్గమస్వ ।
ఇత్యుక్తమాత్రో విభునా చచార దేవోదరే భార్గవపుఙ్గవస్తు ॥34॥

అంతట హరుడు తన నేత్రాలు మూసుకుని ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! నా కడుపులోనుండి బయటకు వెళ్ళమని శుక్రుని ఆదేశించాడు. ఇలా పలికినంత మాత్రం చేతనే భార్గవుడు మహాదేవుని ఉదరం నుండి బయటకు రావడానికి చేసే ప్రయత్నంలో మహాదేవుని ఉదరంలో సంచరింపసాగాడు.

పరిభ్రమన్ దదర్శాథ శంభోరేవోదరే కవిః ।
భువనార్ణవపాతాలాన్ వృతాన్ స్థావరజఙ్గమైః ॥35॥

ఆదిత్యాన్ వసవో రుద్రాన్ విశ్వేదేవాన్ గణాంస్తథా ।
యక్షాన్ కింపురుషాంశ్చైవ గన్ధర్వాప్సరసాం గణాన్ ॥36॥

మునీన్ మనుజసాధ్యాంశ్చ పశుకీటపిపీలికాన్ ।
వృక్షగుల్మాన్ గిరీన్ వల్ల్యః ఫలమూలౌషధాని చ ॥37॥

స్థలస్థాంశ్చ జలస్థాంశ్చానిమిషాన్నిమిషానపి ।
చతుష్పదాన్ స ద్విపదాన్ స్థావరాఙ్జగమానపి ॥38॥

అవ్యక్తాంశ్చైవ వ్యక్తాంశ్చ సగుణాన్నిర్గుణానపి ।
స దృష్ట్వా కౌతుకావిష్టః పరిబభ్రామ భార్గవః ॥39॥

తత్రాసతో భార్గవస్య దివ్యః సంవత్సరో గతః ।
న చాన్తమలభద్ బ్రహ్మంస్తతః శ్రాన్తోఽభవత్కవిః ॥40॥

సశ్రాన్తం వీక్ష్య చాత్మానం నాలభన్నిర్గమం వశీ ।
భక్తినమ్రో మహాదేవం శరణం సముపాగమత్ ॥41॥

బయటకు వచ్చే ప్రయత్నంలో శివుని ఉదరంలో తిరుగుతున్న శుక్రుడు అందులో పాతాలాది భువనాలను, సప్తసముద్రాలను, చరాచరజీవులను, ఆదిత్యులను, వసువులను, రుద్రులను, విశ్వేదేవులను, యక్షకింపురుష గంధర్వాప్సరసాది గణాలను, మునులను, మానవులను, సాధ్యులను, పశుకీటక పిపీలాదులను, వృక్షాలను, పొదలను, పర్వతాలను, లతలను, ఫలమూలౌషధాలను, భూచరాలను, జలచరాలను, అనిమిషలను, నిమిషులను, చతుష్పాదులను, ద్విపాదులను, స్థావరజంగమాలను, అవ్యక్తాలను, వ్యక్తాలను, సగుణాలను, నిర్గుణాలను చూస్తూ అత్యన్తకౌతుకంతో పరిభ్రమిస్తూ ఒక దివ్యసంవత్సరం గడిపినా బయటపడేదారి కనుగొనలేకపోయాడు. ఓ నారదా! శుక్రుడు అలా తిరిగి తిరిగి అలసిపోయి కర్తవ్యం తోచక భక్తితో పరమశివునకు శరణాగతుడై ఇలా ప్రార్థించాడు.

శుక్ర ఉవాచ – శుక్రుడు పలికాడు.

విశ్వరూప మహారూప విశ్వరూపాక్షసూత్రధృక్ ।
సహస్రాక్ష మహాదేవ త్వామహం శరణం గతః ॥42॥

నమోఽస్తు తే శంకర శర్వ శంభో సహస్ర నేత్రాంఘ్రి భుజఙ్గభూషణ ।
దృష్ట్వైవ సర్వాన్ భువనాంస్తవోదరే శ్రాన్తో భవన్తం శరణం ప్రపన్నః ॥43॥

ఓ విశ్వరూపా! మహారూపా! అక్షసూత్రాలను ధరించిన విశ్వమూర్తీ! సహస్రాక్షా! మహాదేవా! నేను నిన్ను శరణు పొందాను. ఓ శంకరా! శర్వా! శంభో! సహస్రనేత్ర! సహస్రచరణ! భుజఙ్గభూషణా! నీ విశాల ఉదరంలో సమస్తభువనాలను దర్శించి, అలసిపోయి మిమ్ములను శరణుజొచ్చాను.

ఇత్యేవముక్తే వచనే మహాత్మా శంభుర్వచః ప్రాహ తతో విహస్య ।
నిర్గచ్ఛ పుత్రోఽసి మమాధునా త్వం శిశ్నేన భో భార్గవవంశచన్ద్రః ॥44॥

నామ్నా తు శుక్రేతి చరాచరాస్త్వాం స్తోష్యన్తి నైవాత్ర విచారమన్యత్ ।
ఇత్యేవముక్త్వా భగవాన్ముమోచ శిశ్నేన శుక్రం స చ నిర్జగామ ॥45॥

శుక్రుని పలుకులు విని, మహాత్ముడగు శంభుడు నవ్వి, ఇలా పలికాడు. "భార్గవా! నీవు నాకు ఇప్పుడు పుత్రుడవైనావు. నా శిశ్నం ద్వారా బయటకు రా!. నేటినుండి శుక్రుడనే పేరుతో నీవు చరాచరజీవులందరకు స్తవనీయుడవు కాగలవు. ఇందులో వేరేగా ఆలోచించన అవసరం లేదు". అని చెప్పి శంకరుడు భార్గవుని శిశ్న మార్గం ద్వారా బయటకు వదిలాడు.

వినిర్గతో భార్గవవంశచంద్రః శుక్రత్వమాసాద్య మహానుభావః ।
ప్రణమ్య శంభుం స జగామ తూర్ణం మహాసురాణాం బలముత్తమౌజాః ॥46॥

ఆ విధంగా శిశ్నం ద్వారా వెలుబడిన భార్గవుడు శుక్రత్వాన్ని పొంది, శుక్రమహానుభావుడుగా, ఓజస్వంతుడుగా విఖ్యాతుడయ్యాడు. అంతట అతడు శంభునకు ప్రణమిల్లి త్వరగా రాక్షససేనలోనికి వెళ్ళి చేరాడు.

భార్గవే పునరాయాతే దానవా ముదితాభవన్ ।
పునర్యుద్ధాయ విదధుర్మతిం సహ గణేశ్వరైః ॥47॥

భార్గవుడు తిరిగివచ్చినందులకు దానవులు మిక్కిలి సంతోషించారు. వారు గణాధిపతులతో మరల యుద్ధానికి సన్నద్ధులయ్యారు.

గణేశ్వరాస్తానసురాన్ సహామరగణైరథ ।
యుయుధుః సంకులం యుద్ధం సర్వ ఏవ జయేప్సవః ॥48॥

శివగణాధిపతులు కూడా దేవగణాలతో కలసి విజయకాంక్షతో దానవులతో సంకులసమరం గావించారు.

తతో౾సురగణానాం చ దేవతానాం చ యుధ్యతామ్ ।
ద్వంద్వయుద్ధం సమభవద్ఘోరరూపం తపోధన ॥49॥

ఓ తపోధనా! పరస్పర జయకాంక్షతో తలబడిన వారిరువురి పోరు భయంకరమైన ద్వంద్వయుద్ధాలతో మరింత ఘోరంగా రూపొందింది.

అంధకో నందినం యుద్ధే శంకుకర్ణం త్వయశ్శిరాః ।
కుంభధ్వజం బలిర్ధీమాన్ నన్దిషేణం విరోచనః ॥50॥

అశ్వగ్రీవో విశాఖం చ శాఖో వృత్రమయోధయత్ ।
బాణస్తథా నైగమేయం బలం రాక్షసపుంగవః ॥51॥

అంధకుడు నందితోను, అయశ్శిరుడు శంకుకర్ణునితోను, బలి కుంభధ్వజునితోను, విరోచనుడు నంది సేనునితోను, అశ్వగ్రీవుడు విశాఖునితోను, వృత్రుడు శాఖునితోను, బాణుడు నిగముని కొడుకైన బలునితోను తలబడ్డారు.

వినాయకో మహావీర్యః పరశ్వథధరో రణే ।
సంక్రుద్ధో రాక్షసశ్రేష్ఠం తుహుండం సమయోధయత్ ॥52॥

మహావీరుడగు వినాయకుడు కోపంతో గండ్రగొడ్డలిని ధరించి, రాక్షసశ్రేష్ఠుడైన తుహుండునితో యుద్ధం చేశాడు.

దుర్యోధనశ్చ బలినం ఘంటాకర్ణమయోధయత్ ।
హస్తీ చ కుండజఠరం హ్లాదో వీరం ఘటోదరమ్ ॥53॥

ఏతే హి బలినాం శ్రేష్ఠా దానవాః ప్రమథాస్తథా ।
సంయోధయన్తి దేవర్షే దివ్యాబ్దానాం శతాని షట్ ॥54॥

దుర్యోధనుడు మహాబలియైన ఘంటాకర్ణునితో పెనుగులాట మొదలుపెట్టాడు. హస్తి కుండోదరునితో, హ్లాదుడు వీరుడైన ఘటోదరునితో యుద్ధం చేశారు. ఓ దేవర్షీ! ఈ విధంగా పరాక్రమవంతులైన రాక్షసులు, ప్రమథులు పరస్పరం ఆరువందల దివ్యసంవత్సరాలు యుద్ధం చేశారు.

శతక్రతుమథాయాన్తం వజ్రపాణిమభిష్ఠితమ్ ।
వారయామాస బలవాన్ జంభో నామ మహాసురః ॥55॥

అంతవరకు ప్రక్కన నిలబడియున్న ఇంద్రుడు వజ్రాయుధంతో యుద్ధానికి రాగా జంభుడను మహాబలవంతుడైన దైత్యుడు ఇంద్రుని అడ్డగించాడు.

శంభునామాఽసురపతిః సబ్రహ్మాణమయోధయత్ ।
మహౌజసం కుజంభశ్చ విష్ణుం దైత్యాన్తకారిణమ్ ॥56॥

శంభుడనే పేరు గల దైత్యుడు బ్రహ్మతోను, మహాపరాక్రమవంతుడైన కుజంభుడు రాక్షసాంతకుడు, మహౌజసుడునైన విష్ణువుతో యుద్ధం సాగించారు.

వివస్వన్తం రణే శాల్వో వరుణం త్రిశిరాస్తథా ।
ద్విమూర్ధా పవనం సోమం రాహుర్మిత్రం విరూపధృక్ ॥57॥

శాల్వుడు వివస్వంతునితోను, త్రిశిరుడు వరుణునితోను, ద్విమూర్ధుడు వాయువుతోను, రాహువు చంద్రునితోను, విరూపధృక్కు మిత్రునితోను పోరు సాగించారు.

అష్టౌ యే వసవః ఖ్యాతా ధరాద్యాస్తే మహాసురాన్ ।
అష్టావేవ మహేష్వాసాన్ వారయామాసురాహవే ॥58॥

సరభః శలభః పాకః పురోఽథ విపృథుః పృథుః ।
వాతాపీ చేల్వలశ్చైవ నానాశస్త్రాస్త్రయోధినః ॥59॥

ధరుడు మొదలుగా గల ఎనమండుగురు వసువులు సరభ, శలభ, పాక, పృథు, విపృథు, వాతాపి, ఇల్వలుడు మొదలుగా గల నానాశస్త్రాస్త్రయోధులైన దైత్యులను యుద్ధంలో వారించారు.

విశ్వేదేవగణాన్సర్వాన్ విష్వక్సేనపురోగమాన్ ।
ఏక ఏవ రణే రౌద్రః కాలనేమిర్మహాసురః ॥60॥

విష్వక్సేనుని ముందిడుకొనిన విశ్వేదేవగణాలవారినందరిని రౌద్రుడైన కాలనేమి అనే మహాసురుడొక్కడే ఎదుర్కొన్నాడు.

ఏకాదశైవ యే రుద్రాస్తానేకోఽపి రణోత్కటః ।
యోధయామాస తేజస్వీ విద్యున్మాలీ మహాసురః ॥61॥

విద్యున్మాలి అనే మహాదైత్యుడొక్కడే రణకుతూహలంతో ఏకాదశరుద్రులతో యుద్ధం సాగించాడు.

ద్వావశ్వినౌ చ నరకో భాస్కరానేవ శంబరః ।
సాధ్యాన్ మరుద్గణాంశ్చైవ నివాతకవచాదయః ॥62॥

ఏవం ద్వంద్వసహస్రాణి ప్రమథానాం చ దానవైః ।
సంజాతానాం సురాబ్దానాం షట్శతాని మహామునే ॥63॥

ఇరువురు అశ్వినీదేవతలతో నరకుడు, ద్వాదశాదిత్యులతో శంబరుడు, నివాత కవచులు ఇరువురు మిగిలిన సాధ్యులతోను, మరుద్గణాలతోను పోరు సాగించారు. ఓ మహామునీ! ఈ విధంగా ప్రమథులు, దేవతలు దానవవీరులతో వేలాది జంటలుగా ఏర్పడి అరవైదివ్యసంవత్సరాలు ఘోరంగా ద్వంద్వయుద్ధం కొనసాగించారు.

యదా న శకితా యోద్ధుం దైవతైరమరాదయః ।
తదా మాయాం సమాశ్రిత్య గ్రసన్తః క్రమశోఽవ్యయాన్ ॥64॥

ఈ విధంగా అసురులు దేవగణంతో యుద్ధం చేయడంలో ఎప్పుడు అసమర్థులయ్యారో అప్పుడు మాయయొక్క సహకారం తీసికొని దేవతాగణాలను మ్రింగివేయడం ప్రారంభించారు.

తతోఽభవచ్ఛైలపృష్ఠం ప్రావృడభ్రసమప్రభైః ।
ఆవృతం వర్జితం సర్వైః ప్రమథైరమరైరపి ॥65॥

ఆ విధంగా ప్రమథులను, దేవతలను, రాక్షసులు మ్రింగివేయగా ఆ మన్దరగిరిశిఖరం నల్లని వర్షాకాలపు మేఘాలతో కప్పివేయబడిన కొండకొమ్ము వలె కనబడింది.

దృష్ట్వా శూన్యం గిరిప్రస్థం గ్రస్తాంశ్చ ప్రమథామరాన్ ।
క్రోధాదుత్పాతయామాస రుద్రో జృంభాయికాం వశీ ॥66॥

రాక్షసులు దేవతలను మ్రింగివేయగా శూన్యమైన మందరగిరిని చూసి, రాక్షసుల మాయలను గ్రహించిన మహేశ్వరుడు ఉగ్రుడై ఒక్కసారి గట్టిగా ఆవులించాడు.

తయా స్పృష్టా దనుసుతా అలసా మన్దభాషిణః ।
వదనం వికృతం కృత్వా ముక్తశస్త్రం విజృంభిరే ॥ 67॥

జృంభమాణేషు చ తదా దానవేషు గణేశ్వరాః ।
సురాశ్చ నిర్యయుస్తూర్ణం దైత్యదేహేభ్య ఆకులాః ॥68॥

ఆయన ఆవులింతగాలి సోకినంతనే దానవులందరు సోమరితనంతో స్ఫూర్తిని కోల్పోయి మెల్లగా గొణుగు కుంటూ, వికారంగా తమ నోళ్ళను తెరచి చేతులలోని ఆయుధాలు జారవిడచి ఆవులింపసాగారు. ఆ విధంగా దైత్యులంతా నోళ్ళు తెరవగానే వారు మ్రింగిన ప్రమథులు, దేవతలందరు వ్యాకులతతో రాక్షసుల శరీరాలనుండి బయటపడ్డారు.

మేఘప్రభేభ్యో దైత్యేభ్యో నిర్గచ్ఛన్తోఽమరోత్తమాః ।
శోభన్తే పద్మపత్రాక్షా మేఘేభ్య ఇవ విద్యుతః ॥69॥

గణామరేషు చ సమం నిర్గతేషు తపోధన ।
అయుధ్యన్త మహాత్మానో భూయ ఏవాతికోపితాః ॥70॥

కారుమేఘాలవంటి రాక్షసుల నోళ్ళనుండి దేవతలు, ప్రమథులు పద్మపత్రాలవంటి తమ నేత్రకాంతులతో బయట పడడంతో ఆ దృశ్యం మెరుపుతీగలతో నిండిన మేఘాలవలె శోభిల్లింది. ఓ తపోధనా! అలా బయటపడిన ప్రమథులు, దేవతలు ఇనుమడించిన క్రోధంతో తిరిగి దానవులతో యుద్ధం చేయసాగారు.

తతస్తు దేవైః సగణైః దానవాః శర్వపాలితైః ।
పరాజీయన్త సంగ్రామే భూయో భూయస్త్వహర్నిశమ్ ॥71॥

అంతట శర్వరక్షితులైన ప్రమథదేవగణాల చేతిలో దానవులు వరసగా రాత్రింబవళ్ళు మాటిమాటికి చావుదెబ్బలు తిని ఓడిపోతున్నారు.

తతస్త్రినేత్రః స్వాం సంధ్యాం సప్తాబ్దశతికే గతే ।
కాలేఽభ్యుపాసత తదా సోఽష్టాదశ భుజోఽవ్యయః ॥72॥

సంస్పృశ్యాపః సరస్వత్యాం స్నాత్వా చ విధినా హరః ।
కృతార్థో భక్తిమాన్ మూర్ధ్నా పుష్పాంజలిముపాక్షిపత్ ॥73॥

తతో ననామ శిరసా తతశ్చక్రే ప్రదక్షిణమ్ ।
హిరణ్యగర్భేత్యాదిత్యముపతస్థే జజాప హ ॥74॥

ఆ విధంగా ఏడువందలసంవత్సరాలు గడచిన తరువాత త్రినేత్రుడు తాను సంధ్యోపాసన చేసేందులకు సంకల్పించి అష్టాదశభుజాలు ధరించి, సరస్వతీనదిలో విధిపూర్వకంగా స్నానం చేసి, ఆచమనం చేశాడు. భక్తియుక్తుడై దోసిలితో పుష్పాలు తీసికొని సమర్పించాడు. శిరస్సు వంచి, హిరణ్యగర్భ ... మొదలైన మంత్రాలు జపిస్తూ, సూర్యునకు ప్రదక్షిణం గావించాడు.

త్వష్టే నమో నమస్తేఽస్తు సమ్యగుచ్చార్య శూలధృక్ ।
ననర్త భావగంభీరం దోర్దండం భ్రామయన్ బలాత్ ॥75॥

అంతట శూలపాణి, "ఓ త్వష్టా! నీకు నమస్సులు" అని స్పష్టంగా ఉచ్చరిస్తూ, బాహుదండాలు త్రిప్పుతూ భావగంభీరంగా నృత్యం చేయసాగాడు.

పరినృత్యతి దేవేశే గణాశ్చైవామరాస్తథా ।
నృత్యంతే భావసంయుక్తా హరస్యానువిలాసినః ॥76॥

సంధ్యాముపాస్య దేవేశః పరినృత్య యథేచ్ఛయా ।
యుద్ధాయ దానవైః సార్ధం మతిం భూయః సమాదధే ॥77॥

తతోఽమరగణైః సర్వైస్త్రినేత్ర భుజపాలితైః ।
దానవా నిర్జితాః సర్వే బలిభిర్భయవర్జితైః ॥78॥

పరమశివుడు నాట్యం చేయడంచూసి భావవిహ్వలులై ప్రమథులు దేవతలందరు ఆయనతో బాటు నృత్యం చేయసాగారు. ఆవిధంగా తృప్తిగా సంధ్యోపాసనం, సాంధ్యనృత్యం నిర్వర్తించి దేవాధిపులు రాక్షసులతో మరల యుద్ధానికి సిద్ధపడ్డారు. త్రినేత్రుని అండ చూసుకుని దేవప్రమథగణాలు నిర్భయంగా విజృంభించి, దైత్యదానవు లందరిని పరాజితులను గావించాయి.

స్వబలం నిర్జితం దృష్ట్వా మత్వాఽజేయం చ శంకరమ్ ।
అన్ధకః సున్దమాహూయ ఇదం వచనమబ్రవీత్ ॥79॥

తన బలాలు నిర్జింపబడడం చూసి, శంకరుడు అజేయుడని తలంచి, అంధకుడు సుందుని పిలిచి ఇలా పలికాడు.

సున్ద భ్రాతాఽసి మే వీర విశ్వాస్యః సర్వవస్తుషు ।
తద్వదామ్యద్య యద్వాక్యం తచ్ఛ్రుత్వా యత్ క్షమం కురు ॥80॥

దుర్జయోఽసౌ రణపటుర్ధర్మాత్మా కారణాన్తరైః ।
సమాసతే హి హృదయే పద్మాక్షీ శైలనన్దినీ ॥81॥

తదుత్తిష్ఠస్వ గచ్ఛామో యత్రాస్తే చారుహాసినీ ।
తత్రైనాం మోహయిష్యామి హరరూపేణ దానవ ॥82॥

భవాన్ భవస్యానుచరో భవ నన్దీ గణేశ్వరః ।
తతో గత్వాఽథ భుక్త్వా తాం జేష్యామి ప్రమథాన్ సురాన్ ॥83॥

ఇత్యేవముక్తే వచనే బాఢం సుందోఽభ్యభాషత ।
సమజాయత శైలాదిరన్ధకః శంకరోఽప్యభూత్ ॥84॥

"ఓ వీరా! సున్దా! నీవు నా సోదరుడవు. అన్నివిధాలా అందరిలోను విశ్వసింపదగినవాడవు నీవే. నేను పలికిన పలుకులు విని నీకు చేతనైనంతగా నాకు సహాయం చేయి. రణపండితుడైన శంకరుడు ఇతర కారణాల వలన దుర్జయుడుగా నున్నాడు. పద్మాక్షియైన శైలపుత్రి నా మనస్సును మోహపరుస్తోంది. కాబట్టి చారుహాసినియైన ఆమె ఎచ్చటనున్నదో అచ్చటకు మారువేషాలలో వెళ్ళి, మోహింపజేద్దాం. నీవు గణేశ్వరుడు, శివానుచరుడునైన నందిగా మారు. నేను శివునిగా రూపం ధరిస్తాను. అప్పుడు మనమక్కడకు వెళ్ళి, ఆమెను అనుభవించి వచ్చిన తరువాత ప్రమథులను, దేవతలను జయించవచ్చును". అంధకుని ఈ మాటలకు సుందుడు మంచిదని పలికి సుందుడు నందిగాను, అంధకుడు శంకరునిగాను రూపాలు దాల్చారు.

నన్దిరుద్రౌ తతో భూత్వా మహాసురచమూపతీ ।
సంప్రాప్తౌ మన్దరగిరిం ప్రహారైః క్షతవిగ్రహౌ ॥85॥

హస్తమాలంబ్య సుందస్య అన్ధకో హరమందిరమ్ ।
వివేశ నిర్విశఙ్కేన చిత్తేనాసురసత్తమః ॥86॥

ఆ విధంగా అంధకుడు, సుందుడు యుద్ధపు దెబ్బలతో క్షతగాత్రులైన శివనందులుగా రూపాలు ధరించి, మందరగిరి చేరారు. అంధకుడు సుందుని చేయూత తీసికొని మనస్సులో ఏ విధమైన శంక లేకండా హరమందిరంలో ప్రవేశించాడు.

తతో గిరిసుతా దూరాదాయాన్తం వీక్ష్య చాంధకమ్ ।
మహేశ్వరవపుశ్ఛన్నం ప్రహారైర్జర్జరచ్ఛవిమ్ ॥87॥

సుందం శైలాది రూపస్థమవష్టభ్యావిశత్ తతః ।
తం దృష్ట్వా మాలినీం ప్రాహ సుయశాం విజయాం జయామ్ ॥88॥

మహేశ్వరరూపంతో, యుద్ధంలోని దెబ్బలతో శిథిలమైన శరీర కాంతితో దూరంనుండి వస్తున్న అంధకుని, నందిరూపం ధరించి వస్తున్న సుందుని చూచి, తాను కూర్చున్న తరువాత మాలిని, సుయశ, విజయ, జయలతో శైలసుత ఇలా పలికింది.

జయే పశ్యస్వ దేవస్య మదర్థే విగ్రహం కృతమ్ ।
శత్రుభిర్దానవవరైస్తదుత్తిష్ఠస్వ సత్వరమ్ ॥89॥

ఘృతమానయ పౌరాణాం వీజికాం లవణం దధి ।
వ్రణభంగం కరిష్యామి స్వయమేవ పినాకినః ॥90॥

"జయా! చూడు శత్రువులైన దానవశ్రేష్ఠులతో యుద్ధంచేసి, అలసిపోయి నా కొఱకు శరీరాన్ని నిలుపుకొని స్వామి వచ్చాడు. నీవు వేగంగా లేచివెళ్ళి, పాతనెయ్యి, పెరుగు, ఉప్పు, వింజామరాదులు తెమ్ము. నేను స్వయంగా వాటినన్నింటిని కలిపి స్వామి గాయాలు మానేటట్లు చేస్తాను. ఓ సుయశా! నీవు త్వరగా నా స్వామి గాయాలు నాశనమగుటకు కావలసిన ఈ పనిచేయి అని పలికింది.

కురుష్వ శీఘ్రం సుయశే స్వభర్తృవ్రణనాశనమ్ ।
ఇత్యేవముక్తా వచనం సముత్థాయ వరాసనాత్ ॥91॥

అభ్యుద్యయౌ తదా భక్త్యా మన్యమానా వృషధ్వజమ్ ।
శూలపాణేస్తతః స్థిత్వా రూపం చిహ్నాని యత్నతః ॥92॥

అన్వియేష తతో బ్రహ్మన్ నోభౌ పార్శ్వస్థితౌ వృషౌ ।
సా జ్ఞాత్వా దానవం రౌద్రం మాయాచ్ఛాదితవిగ్రహమ్ ॥ 93॥

అపయానం తదా చక్రే గిరిరాజసుతా మునే ।

అంతట జయ "యశస్వినీ! నీ భర్త గాయాలకు వెంటనే చికిత్స గావింపు"మని పలుకగా గిరిపుత్రిక తన ఉత్తమాసనంనుండి లేచి, శివుడని భ్రమించి, భక్తితో వానికి ఎదురుగా వెళ్ళింది. నారదమునీ! శూలపాణి రూపాన్ని నిశితంగా పరిశీలించగా ఇరు పార్శ్వాలలో ఉండవలసిన వృషచిహ్నాలు లేకపోవడంతో అతడు రుద్రుని మాయావిగ్రహం దాల్చిన దానవునిగా గుర్తించి, శైలరాజపుత్రిక అక్కడినుండి వేగంగా పారిపోయింది.

దేవ్యాశ్చింతితమాజ్ఞాయ సుందం త్యక్త్వాన్ధకోఽసురః ॥94॥

సమాద్రవత వేగేన హరకాన్తాం విభావరీమ్ ।
సమాద్రవత దైతేయో యేన మార్గేణ సాఽగమత్ ॥95॥

కుర్వతీ చ తిరస్కారం పాదప్లుతినిరాకులా ।
తమాపతన్తం దృష్ట్వైవ గిరిజా ప్రాద్రవద్భయాత్ ॥96॥

గృహం త్యక్త్వా హ్యుపవనం సఖీభిః సహితా తదా ।
తత్రాప్యనుజగామాసౌ మదాన్ధో మునిపుంగవ ॥97॥

దేవి ఆన్తర్యాన్ని గ్రహించిన అంధకాసురుడు సుందుని వదలి వేగంగా హరపత్నిని వెంబడించాడు. ఆమె ఏ మార్గంలో వెళుతుంటే ఆ మార్గంలోనే వెంబడించి వస్తున్న దైత్యుని చూసి, గిరిరాజకన్య భయంతో కాళ్ళు తడబడగా ఇల్లు వదలి చెలికత్తెలతోసహా బయట ఉద్యానవనంలోనికి పరుగెత్తింది. ఓ మునిశ్రేష్ఠా! మదాంధుడైన అంధకుడు విడువక అక్కడ కూడా ఆమెను వెంబడించాడు.

తథాపి న శశాపైనం తపసో గోపనాయ తు ।
తద్భయాదావిశద్గౌరీ శ్వేతార్కకుసుమం శుచి ॥98॥

విజయాద్యా మహాగుల్మే సంప్రయాతా లయం మునే ।
నష్టాయామథ పార్వత్యాం భూయో హైరణ్యలోచనిః ॥99॥

సుందం హస్తే సమాదాయ స్వసైన్యం పునరాగమత్ ।

ఆ దేవి తపోవ్యయానికి భయపడి వానిని శపించక పవిత్రురాలైన తాను తెల్లజిల్లేడుపువ్వులో లీనమయ్యింది. ఓ మునీ! విజయ మొదలైన ఆమె సఖులు కూడా ఆ చెట్లపొదలలో అదృశ్యమయ్యారు. అంతట అంధకుడు పార్వతి నశించినదని తలంచి, సుందుని చేయి పట్టుకుని తిరిగి తన సేనను చేరాడు.

అన్ధకే పునరాయాతే స్వబలం మునిసత్తమ ।।100।।

ప్రావర్తత మహాయుద్ధం ప్రమథాసురయోరథ ।
తతోఽమరగణశ్రేష్ఠో విష్ణుశ్చక్రగదాధరః ।।101।।

నిజఘానాసురబలం శంకరప్రియకామ్యయా ।
శార్ఙ్గచాపచ్యుతైర్బాణైః సంస్యూతా దానవర్షభాః ।।102।।

పంచ షట్ సప్త చాష్టౌ వా బ్రధ్నపాదైర్ఘనా ఇవ ।
గదయా కాంశ్చిదవధీచ్చక్రేణాన్యాన్ జనార్దనః ।।103।।

ఓ మునిసత్తమా! అంధకుడు తన సైన్యానికి తిరిగిరాగానే ప్రమథాసురులమధ్య మరలా మహాయుద్ధం ప్రారంభమైనది. అంతట దేవగణశ్రేష్ఠుడైన శ్రీమహావిష్ణువు శంకరునకు ప్రియం చేయడానికై చక్రగదాధరుడై రాక్షసబలాన్ని సంహరింపసాగాడు. శార్ఙ్గ ధనుస్సునుండి విడువబడిన బాణాలు ఒక్కొక్కటి ఐదుగురిని, ఆరుగురిని, ఏడుగురిని, ఎనిమిదిమందిని చీకట్లను ఛేదించే సూర్యకిరణాల వలె చీల్చసాగాయి. శ్రీహరి కొందరిని గదతోను, మరికొందరిని చక్రంతోను సంహరించాడు.

ఖడ్గేన చ చకర్తాన్యాన్ దృష్ట్యాన్యాన్ భస్మసాద్ వ్యధాత్ ।
హలేనాకృష్య చైవాన్యాన్ ముసలేన వ్యచూర్ణయత్ ।।104।।

కొందరిని ఖడ్గంతో శ్రీమహావిష్ణువు నరికాడు. మరికొందరిని చూపులతోనే భస్మం చేయసాగాడు. మరికొందరిని నాగలితో లాగి, రోకలితో కొట్టి, చూర్ణం చేయసాగాడు.

గరుడః పక్షపాతాభ్యాం తుండేనాప్యురసాఽహనత్ ।
స చాది పురుషో ధాతా పురాణః ప్రపితామహః ।।105।।

భ్రామయన్ విపులం పద్మమభ్యషించత వారిణా ।
సంస్పృష్టా బ్రహ్మతోయేన సర్వతీర్థమయేన హి ।।106।।

గణామరగణాశ్చాసన్ నవనాగశతాధికాః ।
దానవాస్తేన తోయేన సంస్పృష్టాశ్చాఘహారిణా ।।107।।

సవాహనాః క్షయం జగ్ముః కులిశేనేవ పర్వతాః ।

గరుత్మంతుడు తన రెక్కల దెబ్బలతోను, వజ్రంలాంటి ముక్కుతోను, వక్షఃస్థలంతోను దొరికిన రాక్షసుల నందరిని సంహరించాడు. ఇక ఆదిపురుషుడు, ప్రపితామహుడునైన బ్రహ్మ తన విశాలమైన కమలాన్ని త్రిప్పుతూ

సమస్త దేవగణాలను జలంతో అభిషిక్తులను గావించాడు. సర్వతీర్థమయమైన బ్రహ్మజలంతో ప్రోక్షించి దేవగణాలకందరికి శతాధికమైన ఏనుగుల శక్తిని నూతనంగా చేకూర్చుతుండగా ఆ అఘమర్షణజలబిందువులు తాకిన దానవులు పిడుగుపాటువలన కూలిన కొండశిఖరాలవలె కూలిపోయారు.

దృష్ట్వా బ్రహ్మహరీ యుద్ధే ఘాతయానౌ మహాసురాన్ ॥108॥

శతక్రతుశ్చ దుద్రావ ప్రగృహ్య కులిశం బలీ ।
తమాపతన్తం సంప్రేక్ష్య బలో దానవసత్తమః ॥109॥

ముక్త్వా దేవం గదాపాణిం విమానస్థం చ పద్మజమ్ ।
శక్రమేవాద్రవద్ యోద్ధుం ముష్టిముద్యమ్య నారద ।
బలవాన్ దానవపతిరజేయో దేవదానవైః ॥110॥

తమాపతన్తం త్రిదశేశ్వరస్తు దోష్ణాం సహస్రేణ యథాబలేన ।
వజ్రం పరిభ్రామ్య బలస్య మూర్ధ్ని చిక్షేప హే మూఢ హతోఽస్యుదీర్య ॥111॥

ఆ విధంగా బ్రహ్మవిష్ణువులు యుద్ధం చేయడం, రాక్షసులను సంహరించడం చూచి ఇంద్రుడు వజ్రాయుధాన్ని గ్రహించి యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఓ నారదా! ఆ విధంగా తమ సైన్యంపై పడుతున్న ఇంద్రుని చూసి బలుడనే దానవసత్తముడు తాను యుద్ధం చేస్తున్న గదాధరుడైన విష్ణువును, విమానస్థుడైన బ్రహ్మను వదలి, ఇంద్రునితో మాత్రమే యుద్ధం చేయడానికి పిడికిలి బిగించి అతనిని వెంబడించాడు. దేవదానవులకు అజేయుడైన ఆ బలశాలి మీద దేవరాజు వేయి అంచులు గల తన వజ్రాయుధాన్ని బలం కొలది గిరగిరా త్రిప్పి "మూర్ఖా! ఈ దెబ్బతో నీవు చచ్చా"వంటూ బలుని నెత్తిమీదకు విసిరాడు.

స తస్య మూర్ధ్ని ప్రవరోఽపి వజ్రో జగామ తూర్ణం హి సహస్రధా మునే ।
బలోఽద్రవద్ దేవపతిశ్చ భీతః పరాఙ్ముఖోఽభూత్ సమరాన్మహర్షే ॥112॥

ఓ నారదమునీ! ఆ వజ్రాయుధం బలుని నెత్తికి తగిలి వేయి ముక్కలైపోయింది. అంతట బలుడు ఇంద్రుని ఎదుర్కొనగా ఇంద్రుడు భయంతో యుద్ధభూమిని వదలి పరాఙ్ముఖుడయ్యాడు.

తం చాపి జంభో విముఖం నిరీక్ష్య భూత్వాఽగ్రతః ప్రాహ న యుక్తమేతత్ ।
తిష్ఠస్వ రాజాఽసి చరాచరస్య న రాజధర్మే గదితం పలాయనమ్ ॥113॥

పరాఙ్ముఖుడైన ఇంద్రుని చూసి జంభుడు వానిముందు నిలబడి "చరాచరజగత్తుకంతటికి నీవు రాజువు. కావున ఇలా చేయడం తగదు. యుద్ధభూమిలో నిలబడు. పలాయనమనునది రాజధర్మం కాదని" ఇంద్రునితో పలికాడు.

సహస్రాక్షో జంభవాక్యం నిశమ్య భీతస్తూర్ణం విష్ణుమాగాన్మహర్షే ।
ఉపేత్యాహ శ్రూయతాం వాక్యమీశ త్వం మే నాథో భూతభవ్యేశ విష్ణో ॥114॥

జంభస్తర్జయతేఽత్యర్థం మాం నిరాయుధమీక్ష్య హి ।
ఆయుధం దేహి భగవన్ త్వామహం శరణం గతః ॥115॥

ఓ మహర్షీ! సహస్రాక్షుడు జంభుని మాటలువిని, భయపడి, వేగంగా విష్ణువును సమీపించి "ప్రభూ! నీవు నా స్వామివి. నేను నిన్ను శరణుజొచ్చినవాడను. నిరాయుధుడనైన నన్ను జంభుడు తరుముతున్నాడు. భగవన్! నాకు ఆయుధాన్ని ప్రదానం చేయవలసినదని" విష్ణువును ప్రార్థించాడు.

తమువాచ హరిః శక్రం త్యక్త్వా దర్పం వ్రజాధునా ।
ప్రార్థయస్వాయుధం వహ్నిం స తే దాస్యత్యసంశయమ్ ॥116॥

అందులకు విష్ణువు "ఇంద్రా! నీవు గర్వాన్ని వదలి, అగ్నిదేవుని చెంతకు వెళ్ళి ప్రార్థిస్తే ఆయన నీకు ఆయుధాన్ని నిస్సంశయంగా ఇస్తా"డని ఇంద్రునితో చెప్పాడు.

జనార్దనవచః శ్రుత్వా శక్రస్త్వరితవిక్రమః ।
శరణం పావకమగాదిదం చోవాచ నారద ॥117॥

ఓ నారదా! ఇంద్రుడు జనార్దనుని మాటలు విని, పరుగు పరుగున అగ్నివద్దకు పోయి, శరణు పొంది అగ్నితో ఇలా పలికాడు.

శక్ర ఉవాచ – ఇంద్రుడు పలికాడు.

నిఘ్నతో మే బలం వజ్రం కృశానో శతధా గతమ్ ।
ఏష చాహూయతే జంభస్తస్మాద్దేహ్యాయుధం మమ ॥118॥

"ఓ అగ్నిదేవా! బలుని సంహరించడంలో నా వజ్రాయుధం తునాతునకలయ్యింది. ఈ జంభుడు నన్ను యుద్ధానికి పిలుస్తున్నాడు. అందువలన దయతో నాకు ఆయుధప్రదానం చేయు"మని ఇంద్రుడగ్నిని ప్రార్థించాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తమాహ భగవాన్ వహ్నిః ప్రీతోఽస్మి తవ వాసవ ।
యత్త్వం దర్పం పరిత్యజ్య మామేవ శరణం గతః ॥119॥

ఇత్యుచ్చార్య స్వశక్త్యాస్తు శక్తిం నిష్క్రామ్య భావతః ।
ప్రాదాదిన్ద్రాయ భగవాన్ రోచమానో దివం గతః ॥120॥

అంతట అగ్నిదేవుడు ఇంద్రునితో "ఓ ఇంద్రా! నీవు దర్పాన్ని విడిచి, నన్ను శరణు పొందినందుకు ప్రీతుడనయ్యా"నని పలికి తన శక్తితో కూడిన అమోఘమైన శక్తి అనే ఆయుధాన్ని ఇంద్రునకిచ్చి అగ్నిదేవుడు స్వర్గానికి వెళ్ళాడు.

తమాదాయ తదా శక్తిం శతఘంటాం సుదారుణామ్ ।
ప్రత్యుద్యయౌ తదా జంభం హన్తుకామోఽరిమర్దనః ॥121॥

ఓ నారదా! ఆ విధంగా అగ్నిదత్తమై నూరు ఘంటలతో కూడిన భయంకరమైన శక్తిని గ్రహించి శత్రుమర్దనుడైన ఇంద్రుడు జంభుని సంహరించడానికి తిరిగి ఉద్యమించాడు.

తేనాతియశసా దైత్యః సహసైవాభిసంద్రుతః ।
క్రోధం చక్రే తదా జంభో నిజఘాన గజాధిపమ్ ॥122॥

అత్యంతయశస్వియైన ఇంద్రుడు జంభునిపై మెరుపుదాడి చేయగా జంభుడు మిక్కిలి కోపంతో ఇంద్రుని వాహనమైన ఐరావతగజాన్ని కొట్టాడు.

జంభముష్టినిపాతేన భగ్నకుంభకటో గజః ।
నిపపాత యథా శైలః శక్రవజ్రహతః పురా ॥123॥

జంభుని ముష్టిఘాతం వలన ఐరావతం కుంభస్థలం చితికింది. దానితో పూర్వకాలంలో ఇంద్రుని వజ్రాయుధంచే తెగగొట్టబడిన పర్వతంలాగా ఐరావతం కూలిపోయింది.

పతమానాద్ద్విపేంద్రాత్తు శక్రశ్చాప్లుత్య వేగవాన్ ।
త్యక్త్వైవ మన్దరగిరిం పపాత వసుధాతలే ॥124॥

ఆ విధంగా కూలిపోవుచున్న ఐరావతంనుండి వేగంగా దూకి, ఇంద్రుడు మందరగిరిని వదలి వసుధాతలంపై పడబోయాడు.

పతమానం హరిం సిద్ధాశ్చారణాశ్చ తదాఽబ్రువన్ ।
మా మా శక్ర పతస్వాద్య భూతలే తిష్ఠ వాసవ ॥125॥

ఆ విధంగా ఐరావతంనుండి క్రిందకు పడిపోవుచున్న ఇంద్రుని చూసి సిద్ధులు, చారణులు ఇలా పలికారు. "ఓ ఇంద్రా! పడిపోకు. ఓ వాసవా! అక్కడే నిలబడియుండు" అని చెప్పారు.

స తేషాం వచనం శ్రుత్వా యోగీ తస్థౌ క్షణం తదా ।
ప్రాహ చైతాన్ కథం యోత్స్యే అపత్రః శత్రుభిస్సహ ॥126॥

వారిమాటలు విని ఇంద్రుడు తన యోగశక్తితో క్షణకాలం అచ్చటనే నిలబడి రథం లేకుండా శత్రువులతో ఎలా పోరాగడలనని సిద్ధులు, చారణలతో పలికాడు. (పత్రశబ్దానికి వాహనమని అర్థం)

తమూచుర్దేవగన్ధర్వా మా విషాదం వ్రజేశ్వర ।
యుధ్యస్వ త్వం సమారుహ్య ప్రేషయామో జగద్రథమ్ ॥127॥

అంతట దేవతలు, గంధర్వులు "ఓ వ్రజేశ్వరా! చింతించకు, మేము రథం పంపుతున్నాం. నీవు దానిపై అధిరోహించి యుద్ధం చేయి" అని ఇంద్రునితో పలికారు.

ఇత్యేవముక్త్వా విపులం రథం స్వస్తికలక్షణమ్ ।
వానరధ్వజసంయుక్తం హరిభిర్హరిభిర్యుతమ్ ॥128॥

శుద్ధజాంబూనదమయం కింకిణీజాలమండితమ్ ।
శక్రాయ ప్రేషయామాసుర్విశ్వావసుపురోగమాః ॥129॥

ఇలా పలికిన మరుక్షణమే శుభలక్షణాలు కలిగినదీ, మిక్కిలి విశాలమైనదీ, వానరధ్వజంతో కూడినదీ, ఆకుపచ్చని ఉత్తమాశ్వాలు పూన్చబడినదీ, చిరుగంటలతో కూడినదీ, శుద్ధ బంగారంతో నిర్మింపబడినట్టిదీ అయిన రథాన్ని విశ్వావసు మొదలైన దేవతలు ఇంద్రుని కొరకు పంపించారు.

తమాగతముదీక్ష్యాథ హీనం సారథినా హరిః ।
ప్రాహ యోత్స్యే కథం యుద్ధే సంయమిష్యే కథం హయాన్ ॥130॥
యది కశ్చిద్ధి సారథ్యం కరిష్యతి మమాధునా ।
తతో௨హం ఘాతయే శత్రూన్ నాన్యథేతి కథంచన ॥131॥

ఆ విధంగా వచ్చిన రథాన్ని చూసి, అందులో సారథి లేకపోవడాన్ని గమనించి, సారథి లేకుండా గుఱ్ఱాలను అదుపులో పెట్టుకుంటూ యుద్ధంలో ఏ విధంగా పోరాడగలను? కాబట్టి సారథినెవరినైనా పంపించినచో నేను యుద్ధంచేసి శత్రుసంహారం చేస్తాను. లేనిచో వీలుపడదని ఇంద్రుడు గంధర్వాదులతోనన్నాడు.

తతో௨బ్రువంస్తే గంధర్వా నాస్మాకం సారథిర్విభో ।
విద్యతే స్వయమేవాశ్వాంస్త్వం సంయన్తుమిహార్హసి ॥132॥

నారదా! ఇంద్రుని పలుకులకు గంధర్వులందరు "దేవరాజా! మా వద్ద సారథి ఎవ్వరూ లేరు. మీరే స్వయంగా గుఱ్ఱాలను అదుపులో పెట్టుకుని రథం నడుపుకుంటూ యుద్ధం చేయవలసిం"దని ఇంద్రునితో చెప్పారు.

ఇత్యేవముక్తే భగవాంస్త్యక్త్వా స్యందనముత్తమమ్ ।
క్ష్మాతలం నిపపాతైవ పరిభ్రష్టస్రగంబరః ॥133॥

చలన్మౌలిర్ముక్తకచః పరిభ్రష్టాయుధాఙ్గదః ।
పతమానం సహస్రాక్షం దృష్ట్వా భూః సమకమ్పత ॥134॥

గంధర్వులిలా చెప్పగానే ఇంద్రుడు ఉత్తమమైన ఆ రథాన్ని విడిచి శరీరం మీది వస్త్రాలు, ఆభరణాలు జారిపోగా జుట్టుముడి, కవచం, ఆయుధాలు జారిపోగా తలవణకిపోతుండగా భూమి మీద పడబోయాడు. ఆ విధంగా నేలమీద పడబోతున్న సహస్రాక్షుని చూసి భూమి కంపించింది.

పృథివ్యాం కంపమానాయాం శమీకర్షేస్తపస్వినీ ।
భార్యా௨బ్రవీత్ ప్రభో బాలం బహిః కురు యథాసుఖమ్ ॥135॥

స తు శీలావచః శ్రుత్వా కిమర్థమితి చాబ్రవీత్ ।
సా చాహ శ్రూయతాం నాథ దైవజ్ఞ పరిభాషితమ్ ॥136॥

యదేయం కంపతే భూమిస్తదా ప్రక్షిప్యతే బహిః ।
యద్బాహ్యతో మునిశ్రేష్ఠ తద్భవేద్ద్విగుణం మునే ॥137॥

ఏతద్వాక్యం తదా శ్రుత్వా బాలమాదాయ పుత్రకమ్ ।
నిరాశఙ్కో బహిః శీఘ్రం ప్రాక్షిపత్ క్ష్మాతలే ద్విజ ॥138॥

ఇలా కంపిస్తున్న భూమిని చూచి, శమీకమహర్షిభార్య భర్తతో "నాథా! వెంటనే మన పసివాడిని బయట పడవేయండి". శీలవతి మాటలను వినిన భర్త "దేనికి? కారణమేమిట"ని అడుగగా ఆమె భర్తతో "స్వామీ! భూమి కంపించిన క్షణంలో బయట పడవేసిన వస్తువులు ద్విగుణంగా వృద్ధి చెందుతాయని దైవజ్ఞుల వచన"మని పలికింది. ఆమె మాటలు వినిన మునిశ్రేష్ఠుడు వెంటనే తన పసిబాలుని నిరాటంకంగా ఇంటిలోనుండి బయటకు పడవేశాడు.

భూయో గోయుగలార్థాయ ప్రవిష్టో భార్యయా ద్విజః ।
నివారితో గతా వేలా అర్థహానిర్భవిష్యతి ॥139॥

ఆ ముని ఇంటిలో కట్టిన రెండెడ్లను కూడా బయటకు పంపడానికి తిరిగి ఇంటిలోనికి వెళ్ళాడు. అంతట ఆమె "నాథా! సమయం మించిన తరువాత బయటవేసిన వస్తువులలో సగం నశిస్తుం"దని చెప్పి ఆ ప్రయత్నాన్ని విరమింపజేసింది.

ఇత్యేవముక్తే దేవర్షేర్బహిర్నిర్గమ్య వేగవాన్ ।
దదర్శ బాలద్వితయం సమరూపమవస్థితమ్ ॥140॥

తం దృష్ట్వా దేవతాః పూజ్యభార్యాం చాద్భుతదర్శనామ్ ।
ప్రాహ తత్త్వం న విన్దామి యత్పృచ్ఛామి వదస్వ తత్ ॥141॥

ఓ దేవర్షీ! శమీకుడు వేగంగా బయటకు వెళ్ళి చూడగా సమానమైన రూపాలుగల ఇద్దరు బాలురు కనిపించారు. ఈ అద్భుతం చూసి శమీకుడు ఆనందపరవశుడయ్యాడు. ఆ రెండవ బాలకుడు దేవతాప్రార్థన చేయడం చూసి, యోగ్యురాలైన తనభార్యతో ఈ అద్భుతంలోని రహస్యం నాకు తెలియడం లేదు. కాబట్టి నేనడిగినవానికి జవాబులిమ్మని శమీకుడు ఆమెతో అన్నాడు.

బాలస్యాస్య ద్వితీయస్య కేఽభవిష్యన్గుణా వద ।
భాగ్యాని చాస్య యచ్చోక్తం కర్మ తత్ కథయాధునా ॥142॥

సాఽబ్రవీన్నాద్య తే వక్ష్యే వదిష్యామి పునః ప్రభో ।
సోఽబ్రవీద్ వద మేఽద్యైవ నోచేన్నాశ్నామి భోజనమ్ ॥143॥

ఈ రెండవ బాలుని భవిష్యద్గుణగణాలు, భవిష్యత్తు, అదృష్టం, వాడు చేయబోయే కర్మలు ఎలాఉంటాయో తెలియజేయవలసినదని ముని భార్యనడిగాడు. అందులకామె "నాథా! ఆ విషయాలు నేడు చెప్పను మరొకప్పుడు చెబుతా"ననగా అందులకు ఆ బ్రాహ్మణుడు "అలా కాదు, నాకిప్పుడే చెప్పుము, లేనిచో నేనీరోజు భోజనం చేయ"నని పట్టుబట్టాడు.

సా ప్రాహ శ్రూయతాం బ్రహ్మన్ వదిష్యే వచనం హితమ్ ।
కాతరేణాద్య యత్పృష్టం భావ్యః కారురయం కిల ॥144॥

ఇత్యుక్తవతి వాక్యే తు బాల ఏవ త్వచేతనః ।
జగామ సాహ్యం శక్రస్య కర్తుం సౌత్యవిశారదః ॥145॥

అంతట ఆమె "బ్రహ్మన్! మీరు కాతరులై ఈ రోజు అడిగినారుగాన మీకు హితవాక్యాలు చెబుతాను. ఈ బాలకుడు రథచోదకుడౌతా"డని చెప్పింది. ఆ మాటలు ఆమె నోటినుండి వెలువడగానే అచేతనంగానున్న ఆ బాలుడు పైకెగిరి ఇంద్రునకు సహాయం చేయడానికి వెళ్ళాడు.

తం వ్రజన్తం హి గన్ధర్వా విశ్వావసుపురోగమాః ।
జ్ఞాత్వేన్ద్రస్యైవ సాహాయ్యే తేజసా సమవర్ధయన్ ॥146॥

గన్ధర్వతేజసా యుక్తః శిశుః శక్రం సమేత్య హి ।
ప్రోవాచైహ్యేహి దేవేశ ప్రియో యన్తా భవామి తే ॥147॥

ఆ బాలుడు ఇంద్రునకు సహాయం చేయడానికి వెళుతున్న సంగతి గ్రహించిన విశ్వావసువు మున్నగు గంధర్వులందరు తమ తేజస్సును అతనికి ధారవోసి, తేజోవంతుని చేశారు. గంధర్వ తేజోయుక్తుడైన శిశువు శక్రుని సమీపించి "దేవరాజా! రండు రండు మీకు ప్రియం కలిగేటట్లుగా సాథ్యం చేస్తానన్నాడు".

తచ్ఛ్రుత్వాస్య హరిః ప్రాహ కస్య పుత్రోఽసి బాలక ।
సంయంతాఽసి కథం చాశ్వాన్ సంశయః ప్రతిభాతి మే ॥148॥

ఆ బాలుని మాటలు విని, ఇంద్రుడు "బాలకా! నీవెవరి పుత్రుడవు? అశ్వాలను ఏ విధంగా అదుపులో పెట్టగలవోయని నాకు సందేహంగా యున్న"దని బాలునితో పలికాడు.

సోఽబ్రవీదృషితేజోత్థం క్ష్మాభవం విద్ధి వాసవ ।
గన్ధర్వతేజసా యుక్తం వాజియానవిశారదమ్ ॥149॥

అందులకాశిశువు "సురేశ్వరా! ఋషితేజస్సుతో భూమినుండి ఉద్భవించాను. గంధర్వతేజంతో వృద్ధి పొందాను. అశ్వయానవిశారదుడనయ్యా"నని పలికాడు.

తచ్ఛ్రుత్వా భగవాంఛక్రః ఖం భేజే యోగినాం వరః ।
స చాపి విప్రతనయో మాతలిర్నామ విశ్రుతః ॥150॥

తతోఽధిరూఢస్తు రథం శక్రస్త్రిదశపుఙ్గవః ।
రశ్మీన్ శమీకతనయో మాతలిః ప్రగృహీతవాన్ ॥151॥

అది విని యోగివరుడైన ఇంద్రుడు మాతలియని ఖ్యాతి వహించిన బ్రాహ్మణబాలుడు వినువీథికి వెళ్ళారు. త్రిదశాధీశ్వరుడైన ఇంద్రుడు ఉత్తమరథం మీద కూర్చుండగా శమీకమహర్షిపుత్రుడైన మాతలి గుఱ్ఱాలపగ్గాలను పట్టుకుని నిలబడ్డాడు.

తతో మన్దరమాగమ్య వివేశ రిపువాహినీమ్ ।
ప్రవిశన్ దదృశే శ్రీమాన్ పతితం కార్ముకం మహత్ ॥152॥

సశరం పంచవర్ణాభం సితరక్తాసితారుణమ్ ।
పాండుచ్ఛాయం సురశ్రేష్ఠస్తం జగ్రాహ సమార్గణమ్ ॥153॥

తతస్తు మనసా దేవాన్ రజః సత్త్వతమోమయాన్ ।
నమస్కృత్య శరం చాపే సాధిజ్యే వినియోజయత్ ॥154॥

అంతట దేవరాజు మందరగిరికి వెళ్ళి శత్రుసేనలోనికి ప్రవేశించాడు. అక్కడ 5 వర్ణాలతో ప్రకాశించేది, తెలుపు, ఎరుపు, గోధుమ, పసుపు ఛాయలతో, బాణసమూహంతో కూడి పడియున్న ఒక మహాధనుస్సు ఇంద్రునకు కనిపించింది. అంతట సంతోషంతో సురశ్రేష్ఠుడు ఆ ధనుర్బాణాలను గ్రహించాడు. తదనంతరం సత్త్వరజస్తమో గుణాత్మకమైన త్రిమూర్తులకు మనసా నమస్కరించి, ఆ మహాధనుస్సును సంధించి, బాణాలను ప్రయోగించాడు.

తతో నిశ్చేరురత్యుగ్రాః శరా బర్హిణవాససః ।
బ్రహ్మేశవిష్ణునామాఙ్కాః సూదయంతోఽసురాన్ రణే ॥155॥

ఆకాశం విదిశః పృథ్వీం దిశశ్చ సశరోత్కరైః ।
సహస్రాక్షోఽతిపటుభిశ్ఛాదయామాస నారద ॥156॥

ఇంద్రుని ధనుస్సునుండి నెమలిఈకలరెక్కలతో రెపరెపలాడుతూ మహోగ్రంగా పుంఖానుపుంఖాలుగా వెలువడిన బాణాలు అసురులనందరిని సంహరింపసాగాయి. ఓ నారదా! బ్రహ్మవిష్ణుశివ నామాంకితమై శత్రువులను సంహరిస్తూ వెళ్ళిన ఆ బాణపరంపర భూమ్యాకాశాలను, దిశవిదిశలను కప్పివేసింది.

గజో విద్ధో హయో భిన్నః పృథివ్యాం పతితో రథః ।
మహామాత్రో ధరాం ప్రాప్తః సద్యః సీదచ్ఛరాతురః ॥157॥

పదాతిః పతితో భూమ్యాం శక్రమార్గణతాడితః ।
హతప్రధాన భూయిష్ఠం బలం తదభవద్రిపోః ॥158॥

నారదా! బాణాల తాకిడికి ఏనుగులు పీనుగలయ్యాయి. గుఱ్ఱాల శ్వాసలెగిసిపోయాయి. రథాలు విరిగి నేలమీద పడ్డాయి. మావటివాండ్రు విలవిల నేలకు ఒరిగిపోయారు. ఇంద్రుని బాణాలచే తాడితులైన పదాతి సైన్యమంతా నేలకు ఒరిగింది. ఈ విధంగా శత్రుసైన్యంలోని మహావీరులందరు సంహరింపబడ్డారు.

తం శక్రబాణాభిహతం దురాసదం సైన్యం సమాలక్ష్య తదా కుజంభః ।
జంభాసురశ్చాపి సురేశమవ్యయం ప్రజగ్మతుర్గృహ్య గదే సుఘోరే ॥159॥

ఇంద్రుని బాణాగ్నికి దహించుకుపోతున్న తమ సైన్యాన్నిచూచి జంభకుజంభులిరువురు భయంకరమైన గదాదండాలు త్రిప్పుతూ క్రోధోన్మత్తులై ఆ మహాత్ముడగు సురనాయకుని సమీపించారు.

తావాపతన్తౌ భగవాన్నిరీక్ష్య సుదర్శనేనారివినాశనేన ।
విష్ణుః కుజంభం నిజఘాన వేగాత్ స స్యన్దనాద్ గామగమద్గతాసుః ॥160॥

అలా ఇంద్రుని మీద పడుతున్న వారిరువురినిచూచి శ్రీహరి శత్రువినాశనకరమైన సుదర్శనచక్రం వేగంగా త్రిప్పి కుజంభుని మీదకు ప్రయోగింపగా వాడు ఆ అగ్నిజ్వాలలకు దగ్ధుడై రథంనుండి క్రిందకు పడిపోయాడు.

తస్మిన్హతే భ్రాతరి మాధవేన జంభస్తతః క్రోధవశం జగామ ।
క్రోధాన్వితః శక్రముపాద్రవద్రణే సింహం యూథైణోఽతివిపన్నబుద్ధిః ॥161॥

తమాపతన్తం ప్రసమీక్ష్య శక్రస్త్యక్త్వైవ చాపం సశరం మహాత్మా ।
జగ్రాహ శక్తిం యమదణ్డకల్పాం తామగ్నిదత్తాం రిపవే ససర్జ ॥162॥

అలా మాధవుని చేతిలో తన సోదరుడు మరణించడం చూచిన జంభుడు కోపంతో చావుబుద్ధితో లేడి సింహం మీదకు లంఘించిన విధంగా దేవరాజుపై విరుచుకుపడ్డాడు. అలా తనమీదకు దండెత్తి వస్తున్న జంభుని చూసి శక్రుడు ధనుర్బాణాలు వదలి అగ్ని ఇచ్చిన మృత్యుదండంవంటి శక్తిని తీసికొని జంభుని మీదకు గట్టిగా విసిరాడు.

శక్తిం సఘంటాం కృతనిఃస్వనాం వై దృష్ట్వా పతన్తీం గదయా జఘాన ।
గదాం చ కృత్వా సహసైవ భస్మసాద్ బిభేద జంభం హృదయే చ తూర్ణమ్ ॥163॥

శక్త్యా సభిన్నో హృదయే సురారిః పపాత భూమ్యాం విగతాసురేవ ।
తం వీక్ష్య భూమౌ పతితం విసంజ్ఞే దైత్యాస్తు భీతా విముఖా బభూవుః ॥164॥

జంభే హతే దైత్యబలే చ భగ్నే గణాస్తు హృష్టా హరిమర్చయన్తః ।
వీర్యం ప్రశంసన్తి శతక్రతోశ్చ సగోత్రభిచ్ఛర్వముపేత్య తస్థౌ ॥165॥

గంటల ధ్వనులతోకూడి తన మీదకు వస్తున్న శక్తి అనే ఆయుధాన్ని జంభుడు గదతో కొట్టాడు. ఆ శక్తి ఆ గదను క్షణకాలంలో భస్మంచేసి సూటిగా వెళ్ళి, జంభుని హృదయాన్ని చీల్చింది. దేవవిరోధియైన జంభుని హృదయం శక్తిచే భిన్నం కాగా అతడు ప్రాణాలు కోల్పోయి నేలకొరిగాడు. ఆ విధంగా జంభుడు మరణించడాన్ని చూసి దైత్యులంతా భీతులై పలాయనం చిత్తగించారు. జంభుడు హతుడై రాక్షసబలాలు భగ్నం కావడంతో ప్రమథ దేవగణాలు జనార్దనుని పూజించాయి. ఇంద్రుని పరాక్రమాన్ని ప్రశంసించారు. అంతట పర్వతభేదియైన ఇంద్రుడు శర్వుని సమీపించి నిలచాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే భైరవప్రాదుర్భావే జంభకుజంభవధో నామ నవషష్టితమోఽధ్యాయః ॥69॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని భైరవప్రాదుర్భావమందలి జంభకుజంభవధయనే అరవైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



సప్తతితమోఽధ్యాయః – డెబ్బైయవ అధ్యాయం

భైరవప్రాదుర్భావే అంధకవరప్రదానమ్ – భైరవప్రాదుర్భావంలో అంధకవరప్రదానం

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తస్మింస్తదా దైత్యబలే చ భగ్నే శుక్రోఽబ్రవీదంధకమాసురేన్ద్రమ్ ।
ఏహ్యేతి వీరాద్య గృహం మహాసుర యోత్స్యామ భూయో హరమేత్య శైలమ్ ॥1॥

అలా దైత్యబలం భగ్నం కావడం చూసి శుక్రాచార్యుడు అంధకాసురునితో "వీరా! ఈనాటికి ఇంటికిరా! ఓ మహాసురా! మరలా వచ్చి మందరగిరిపై హరునితో పోరాడుదా"మని పలికాడు.

తమువాచాన్ధకో బ్రహ్మన్ న సమ్యగ్భవతోదితమ్ ।
రణాన్నైవాపయాస్యామి కులం వ్యపదిశన్ స్వయమ్ ॥2॥

పశ్య త్వం ద్విజశార్దూల మమ వీర్యం సుదుర్ధరమ్ ।
దేవదానవగన్ధర్వాన్ జేష్యే సేంద్ర మహేశ్వరమ్ ॥3॥

ఇత్యేవముక్త్వా వచనం హిరణ్యాక్షసుతోఽన్ధకః ।
సమాశ్వాస్యాబ్రవీచ్ఛంభుం సారథిం మధురాక్షరమ్ ॥4॥

సారథే వాహయ రథం హరాభ్యాశం మహాబల ।
యావన్నిహన్మి బాణౌఘైః ప్రమథామరవాహినీమ్ ॥5॥

"బ్రహ్మర్షీ! తమరు చెప్పేది యుక్తం కాదు. నా కుల గౌరవప్రతిష్ఠలను యుద్ధభూమిలో విడిచి రాలేను. ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! చూస్తూ ఉండండి. నా అమోఘవీర్యాన్ని ప్రదర్శించి ఇంద్రమహేశ్వరులతో సహా దేవదానవ గన్ధర్వులనందరిని జయిస్తాను. అని హిరణ్యాక్షకుమారుడైన అంధకుడు శుక్రాచార్యునితో పలికి తన సారథిని బుజ్జగిస్తూ మధురంగా ఇలా పలికాడు."సారథీ! మహాబలా! మన రథాన్ని శంకరుడున్న వైపునకు నడుపు. నా బాణ పరంపరతో ప్రమథామరసైన్యమును సంహరిస్తాను".

ఇత్యన్ధకవచః శ్రుత్వా సారథిస్తురగాంస్తదా ।
కృష్ణవర్ణాన్ మహావేగాన్ కశయాఽభ్యాహనన్మునే ॥6॥

తే యత్నతోఽపి తురగాః ప్రేర్యమాణా హరం ప్రతి ।
జఘనేష్వవసీదన్తః కృచ్ఛ్రేణోహుశ్చ తం రథమ్ ॥7॥

వహన్తస్తురగా దైత్యం ప్రాప్తాః ప్రమథవాహినీమ్ ।
సంవత్సరేణ సాగ్రేణ వాయువేగసమా అపి ॥8॥

ఓ నారదమునీ! అంధకుని మాటలు విని సారథి నల్లని వర్ణం కలిగి, మహావేగంగా పరుగెత్తే ఉత్తమాశ్వాలను కోలతో గట్టిగా కొట్టాడు. శంకరుని వైపు ప్రయత్నపూర్వకంగా రథాన్ని నడిపించడానికి ప్రయత్నించినా మహావేగంతో

పరుగెత్తే ఆ అశ్వాల నడుములు నొప్పిపెట్టగా ఎంతప్రయత్నించినా అశ్వాలు వేగమందుకోలేక పోయాయి. ఆ దైత్యుని మోస్తున్న గుఱ్ఱాలు వాయువేగసమానంగా ప్రయాణించగలిగినవైనా ప్రమథసైన్యాన్ని చేరడానికి సంవత్సరకాలం పట్టింది.

తతః కార్ముకమానమ్య బాణజాలైర్గణేశ్వరాన్ ।
సురాన్ సంఛాదయామాస సేంద్రోపేంద్ర మహేశ్వరాన్ ॥9॥

బాణైశ్ఛాదితమీక్ష్యైవ బలం త్రైలోక్యరక్షితా ।
సురాన్ ప్రోవాచ భగవాంశ్చక్రపాణిర్జనార్దనః ॥10॥

అంతట అంధకుడు ప్రచండమైన ధనుస్సును ఎక్కుపెట్టి తన బాణవృష్టితో ఇంద్రోపేంద్రమహేశ్వర సహితంగా ప్రమథదేవగణాలనందరిని ముంచివేశాడు. త్రిలోకరక్షకుడు, భగవానుడు, చక్రపాణియునైన జనార్దనుడు బాణాలతో కప్పబడిన ఆ సైన్యాన్ని చూసి వారితో ఇలా పలికాడు.

విష్ణురువాచ – విష్ణువు పలికాడు.

కిం తిష్ఠధ్వం సురశ్రేష్ఠా హతేనానేన వై జయః ।
తస్మాన్మద్వచనం శీఘ్రం క్రియతాం వై జయేప్సవః ॥11॥

ఓ దేవశ్రేష్ఠులారా! ఆగారెందుకు? లేవండి? వీరు మరణిస్తేనే మనకు జయం. గుర్తు పెట్టుకోండి. కాబట్టి మీరు విజయం పొందదలిస్తే నేను చెప్పినట్లు చేయండని జనార్దనుడు ప్రమథగణాలతో పలికాడు.

శాత్యన్తామస్య తురగాః సమం రథకుటుంబినా ।
భజ్యతాం స్యన్దనశ్చాపి విరథః క్రియతాం రిపుః ॥12॥

సారథితో సహా వీరి అశ్వాలను మట్టుబెట్టండి. రథాన్ని భగ్నం చేసి, శత్రువును విరథుని చేయండి.

విరథం తు కృతం పశ్చాదేనం ధక్ష్యతి శంకరః ।
నోపేక్ష్యః శత్రురుద్దిష్టో దేవాచార్యేణ దేవతాః ॥13॥

మీరు విరథుని చేసిన అనంతరం శంకరుడు శత్రువును దగ్ధం చేస్తాడు. ఈ దుష్టుని ఏ మాత్రమూ ఉపేక్షించరాదని విష్ణువు దేవతలను, దేవాచార్యుడైన బృహస్పతిని ఉద్దేశించి పలికాడు.

ఇత్యేవముక్తాః ప్రమథా వాసుదేవేన సామరాః ।
చక్రుర్వేగం సహేన్ద్రేణ సమం చక్రధరేణ చ ॥14॥

అలా విష్ణువుచే హెచ్చరింపబడిన ప్రమథులు, దేవగణాలు, ఇంద్రుడు, చక్రపాణి తోడు రాగా వేగాన్ని పెంచారు.

తురగాణాం సహస్రం తు మేఘాభానాం జనార్దనః ।
నిమిషాన్తరమాత్రేణ గదయా స వ్యపోథయత్ ॥15॥

జనార్దనుడైన విష్ణువు రెప్పపాటుకాలంలో తన గదతో నల్లని మేఘాల కాంతిలోనున్న వేయి గుఱ్ఱాలను మట్టుబెట్టాడు.

హతాశ్వాత్ స్యందనాత్ స్కందః ప్రగృహ్య రథసారథిమ్ ।
శక్త్యా విభిన్నహృదయం గతాసుం వ్యసృజద్భువి ॥16॥

గుఱ్ఱాలు చావగానే సారథిని స్కందుడు పట్టుకుని, తనశక్తి ఆయుధంతో అతని గుండెలు చీల్చి, రథంనుండి లాగి, నేలమీదకు విసిరి కొట్టాడు.

వినాయకాద్యాః ప్రమథాః సమం శక్రేణ దైవతైః ।
సధ్వజాక్షం రథం తూర్ణమభంజంత తపోధనాః ॥17॥

సారథి మరణించడంతో వినాయకాది ప్రమథులు ఇంద్రాది దేవతలు చక్రాలు, ఇరుసు, కేతనంతో సహా రథాన్ని వేగంగా ముక్కలు గావించారు.

సహసా సమహాతేజా విరథస్త్యజ్య కార్ముకమ్ (త్యక్తకార్ముకః) ।
గదామాదాయ బలవానభిదుద్రావ దైవతాన్ ॥18॥

అంతట మహాతేజస్వియైన అంధకుడు రథాన్ని, ధనుస్సును వదలి, గదను తీసికొని దేవతల మీదకు లంఘించాడు.

పదాన్యష్టౌ తతో గత్వా మేఘగంభీరయా గిరా ।
స్థిత్వా ప్రోవాచ దైత్యేంద్రో మహాదేవం సహేతుమత్ ॥19॥

భిక్షో భవాన్ సహానీకస్త్వసహాయోఽస్మి సాంప్రతమ్ ।
తథాఽపి త్వాం విజేష్యామి పశ్చిమేఽద్య పరాక్రమమ్ ॥20॥

ఎనిమిది అడుగులు వెళ్ళి, నిలబడి, మేఘగంభీరస్వరంతో హేతుబద్ధంగా అంధకుడు శివుని చూసి ఇలా పలికాడు. "ఓ భిక్షూ! నీకు ఇందరు సహాయపడుతుండగా నేను అసహాయకునిగా నిలచిపోయాను. అయినా నిన్ను జయించి తీరుతాను. చూడు నా పరాక్రమం" అన్నాడు.

తద్వాక్యం శంకరః శ్రుత్వా సేంద్రాన్సురగణాంస్తదా ।
బ్రహ్మణా సహితాన్ సర్వాన్ స్వశరీరే న్యవేశయత్ ॥21॥

శరీరస్థాంస్తాన్ ప్రమథాన్ కృత్వా దేవాంశ్చ శంకరః ।
ప్రాహ ఏహ్యేహి దుష్టాత్మన్ అహమేకోఽపి సంస్థితః ॥22॥

తం దృష్ట్వా మహదాశ్చర్యం సర్వామరగణక్షయమ్ ।
దైత్యః శంకరమభ్యాగాద్ గదామాదాయ వేగవాన్ ॥23॥

అంధకుని మాటలు వినిన శంకరుడు బ్రహ్మేంద్రాది దేవతలనందరిని తన శరీరంలోనికి ప్రవేశపెట్టుకున్నాడు. అలా అందరిని తనశరీరంలో ఉంచుకుని శంకరుడు "అరే! దుష్టా! రా రా! నేను కూడా ఒక్కడనేరా!" అని వానిని యుద్ధానికి ఆహ్వానించాడు. క్షణంలో సర్వామరగణాలు మాయం కావడం చూసి దైత్యుడు మిక్కిలి ఆశ్చర్యమును పొంది, గద తీసికొని వేగంగా శంకరుని మీదకు దూకాడు.

తమాపతన్తం భగవాన్ దృష్ట్వా త్యక్త్వా వృషోత్తమమ్ ।
శూలపాణిర్గిరిప్రస్థే పదాతిః ప్రత్యతిష్ఠత ॥24॥

ఆ దైత్యుడు తనపై దాడి చేయడానికి రావడం చూసిన హరుడు వృషభంనుండి దిగి, శూలపాణియై గిరిప్రస్థం మీద నిలబడ్డాడు.

వేగేనైవాపతన్తం చ బిభేదోరసి భైరవః ।
దారుణం సుమహద్రూపం కృత్వా త్రైలోక్యభీషణమ్ ॥25॥

దంష్ట్రాకరాలం రవికోటిసంనిభం మృగారిచర్మాభివృతం జటాధరమ్ ।
భుజఙ్గహారామలకంఠకందరం వింశార్ధబాహుం సషడర్ధలోచనమ్ ॥26॥

ఏతాదృశేన రూపేణ భగవాన్భూతభావనః ।
బిభేద శత్రుం శూలేన శుభదః శాశ్వతః శివః ॥27॥

సశూలం భైరవం గృహ్య భిన్నేప్యురసి దానవః ।
విజహారాతివేగేన క్రోశమాత్రం మహామునే ॥28॥

ఆ రాక్షసుడు దగ్గరకు రాగానే త్రిలోకభయంకమైన భైరవరూపం ధరించి, వాడి హృదయాన్ని ఛేదించాడు. ఓ నారదమునీ! ఆ సమయంలో భయంకరమైన దంష్ట్రలతో, కోటిసూర్యుల కాంతితో పులితోలు ధరించి, జటాధారియై, మెడలో భుజంగహారాలు వ్రేలాడుతుండగా పదిబాహువులతో, మూడు నేత్రాలతో కూడిన భైరవరూపంతో భగవానుడు, భూతభావనుడు, శాశ్వతుడు, శుభాకారుడునైన పరమశివుడు వెలుగొందాడు. ఓ మహామునీ! తన వక్షఃస్థలం పగలగా ఆ మహాదైత్యుడు భైరవమూర్తిని శూలంతో పాటు ఎత్తి, వేగంగా క్రోశదూరం వరకు లాగుకొని పోయాడు.

తతః కథంచిద్భగవాన్ సంస్తభ్యాత్మానమాత్మనా ।
తూర్ణముత్పాటయామాస శూలేన సగదం రిపుమ్ ॥29॥

తదనంతరం భగవానుడెట్లో తనకు తాను నిలదొక్కుకుని మహావేగంతో శత్రువును గదతో సహా శూలానికి గ్రుచ్చి చీల్చాడు.

దైత్యాధిపస్త్వపి గదాం హరమూర్ధ్ని న్యపాతయత్ ।
కరాభ్యాం గృహ్య శూలం చ సముత్పతత దానవః ॥30॥

దైత్యాధిపుడు కూడా గదతో శివుని శిరస్సుపై గట్టిగా కొట్టాడు. శివుని చేతిలోని శూలాన్ని లాగుకొని, ఎగిరి దూకాడు.

సంస్థితః స మహాయోగీ సర్వాధారః ప్రజాపతిః ।
గదాపాతక్షతాద్భూరి చతుర్ధాఽసృగథాపతత్ ॥31॥

సర్వాధారుడు, ప్రజాపతి, మహాయోగీ అయిన శివుని శత్రుగదాఘాతంతో ఏర్పడిన గాయం నుండి నాలుగు ధారలుగా రక్తం కారింది.

పూర్వధారా సముద్భూతో భైరవోఽగ్నిసమప్రభః ।
విద్యారాజేతి విఖ్యాతః పద్మమాలావిభూషితః ॥32॥

తూర్పుదిక్కున జారిన రక్తధారనుండి అగ్ని సమానకాంతితో పద్మమాలావిభూషితుడై విద్యారాజుగా విఖ్యాతుడైన భైరవుడు జన్మించాడు.

తథా దక్షిణధారోత్థో భైరవః ప్రేతమణ్డితః ।
కాలరాజేతి విఖ్యాతః కృష్ణాంజనసమప్రభః ॥33॥

దక్షిణం వైపు జారిన రక్తధారనుండి నల్లనికాటుక కాంతితో వెలుగొందుతూ, ప్రేతాలను అలంకరించుకొని కాలరాజుగా విఖ్యాతుడైన కాలభైరవుడు ఉద్భవించాడు.

అథ ప్రతీచీధారోత్థో భైరవః పత్రభూషితః ।
అతసీకుసుమప్రఖ్యః కామరాజేతి విశ్రుతః ॥34॥

పడమరవైపు జారిన రక్తధారనుండి పత్రభూషితుడు, దిరిసెనపువ్వువంటి కాంతితో వెలుగొందువాడు, కామరాజుగా కీర్తినందినవాడు అయిన భైరవుడు ప్రాదుర్భావం చెందాడు.

ఉదగ్ధారాభవశ్చాన్యో భైరవః శూలభూషితః ।
సోమరాజేతి విఖ్యాతశ్చక్రమాలా విభూషితః ॥35॥

ఉత్తరంవైపు రక్తధారనుండి మరియొక భైరవుడు ఉద్భవించాడు. అతడు శూలభూషితుడు, చక్రమాలా విభూషితుడునై సోమరాజుగా ప్రసిద్ధుడు.

క్షతస్య రుధిరాజ్జాతో భైరవః శూలభూషితః ।
స్వచ్ఛందరాజో విఖ్యాత ఇంద్రాయుధసమప్రభః ॥36॥

రక్తసిక్తమైన గాయంనుండి శూలభూషితుడు, ఇంద్రధనుస్సుకాంతితో సమానమైన కాంతితో వెలుగొందు వాడు, స్వచ్ఛందరాజుగా విఖ్యాతుడూ అయిన భైరవుడు పుట్టాడు.

భూమిస్థాద్రుధిరాజ్జాతో భైరవః శూలభూషితః ।
ఖ్యాతో లలితరాజేతి సౌభాంజనసమప్రభః ॥37॥

భూమిమీద పడిన రక్తం నుండి సౌభాంజనకాంతితో వెలుగొందుతూ, శూలభూషితుడై, లలితరాజుగా ఖ్యాతినొందిన భైరవుడు జన్మించాడు.

ఏవం హి సప్తరూపోఽసౌ కథ్యతే భైరవో మునే ।
విఘ్నరాజోఽష్టమః ప్రోక్తో భైరవాష్టకముచ్యతే ॥38॥

ఓ నారదమునీ! ఈ విధంగా వీరు సప్తభైరవమూర్తులుగా కీర్తింపబడతారు. విఘ్నరాజు ఎనిమిదవ భైరవమూర్తిగా పిలవబడుతున్నాడు. ఇట్లు వీరందరిని భైరవాష్టకంగా పేర్కొంటారు.

ఏవం మహాత్మనా దైత్యః శూలప్రోతో మహాసురః ।
ఛత్రవద్ధారితో బ్రహ్మన్ భైరవేణ త్రిశూలినా ॥39॥

వీరందరు పరివేష్టించి ఉండగా ప్రధానభైరవమూర్తి అయిన త్రిశూలి, అంధకుని దేహాన్ని శూలం చివర గ్రుచ్చి పైకెత్తి ఛత్రం వలె ధరించాడు.

తస్యాసృగుల్బణం బ్రహ్మన్ శూలభేదాదవాపతత్ ।
యేనాకంఠం మహాదేవో నిమగ్నః సప్తమూర్తిమాన్ ॥40॥

బ్రహ్మర్షీ! ఆ అంధకుని శరీరం నుండి ధారాపాతంగా రక్తం ప్రవహించింది. శూలపాణీ, సప్తభైరవమూర్తీ అయిన మహాదేవుని కంఠం వరకు ఆ రక్తప్రవాహం ముంచివేసింది.

తతః స్వేదోఽభవద్భూరి శ్రమజః శంకరస్య తు ।
లలాటఫలకే తస్మాజ్జాతా కన్యాఽసృగాప్లుతా ॥41॥

అంతట విపరీతమైన అలసట వలన శంకరుని ఫాలభాగం నుండి చెమట బిందువులు జారగా వానినుండి రక్తసిక్తమైన దేహంతో ఒక బాలిక ఉద్భవించింది.

యద్భూమ్యాం న్యపతద్విప్ర స్వేదబిందుః శివాననాత్ ।
తస్మాదంగారపుంజాభో బాలకః సమజాయత ॥42॥

శివుని ముఖం నుండి జారిన స్వేదబిందువులు భూమిమీద పడగా అందుండి ఎఱ్ఱని నిప్పుకణాలవంటి బాలకుడు పుట్టాడు.

స బాలస్తృషితోఽత్యర్థం పపౌ రుధిరమాన్ధకమ్ ।
కన్యా చోత్కృత్య సంజాతమసృగ్విలిలిహేఽద్భుతా ॥43॥

ఆ బాలుడు తనకు విపరీతమైన దాహం కలగడంతో అంధకుని రక్తాన్ని త్రాగాడు. ఆ కన్య కూడా ఆశ్చర్యం గొలుపుతు ఆ రక్తాన్ని నాలుకతో నాకివేసింది.

తతస్తామాహ బాలార్కప్రభాం భైరవమూర్తిమాన్ ।
శంకరో వరదో లోకే శ్రేయోఽర్థాయ వచో మహత్ ॥44॥

ఓ నారదా! అప్పుడా భైరవమూర్తియైన శంకరుడు బాలసూర్యుని కాంతితో వెలుగొందుచున్న ఆ బాలికను చూసి, లోకశ్రేయస్సు కొఱకు ఇలా పలికాడు.

త్వాం పూజయిష్యన్తి సురా ఋషయః పితరోరగాః ।
యక్షవిద్యాధరాశ్చైవ మానవాశ్చ శుభంకరీ ॥45॥

త్వాం స్తోష్యన్తి సదా దేవి బలిపుష్పోత్కరైః కరైః ।
చర్చికేతి శుభం నామ యస్మాద్రుధిరచర్చితా ॥46॥

"ఓ శుభంకరీ! నిన్ను ఋషులు, దేవతలు, పితరులు, ఉరగులు, యక్షవిద్యాధరులు, మానవులు భక్తితో పూజిస్తారు. ఎల్లప్పుడు నీకు బలులు, పుష్పాంజలులు సమర్పించి స్తోత్రాలు చేస్తారు. రక్తం లేపనంగా కలదానవగుటచే నిన్ను చర్చిక అనే చక్కని పేరుతో పిలుస్తారు" అని శంకరుడు వరమిచ్చాడు.

ఇత్యేవముక్తా వరదేన చర్చికా భూతానుజాతా హరిచర్మవాసినీ ।
మహీం సమన్తాద్విచచార సుందరీ స్థానం గతా హైంగులతాద్రిముత్తమమ్ ॥47॥

తస్యాం గతాయాం వరదః కుజస్య ప్రాదాద్వరం సర్వవరోత్తమం యత్ ।
గ్రహాధిపత్యం జగతాం శుభాశుభం భవిష్యతి త్వద్వశగం మహాత్మన్ ॥48॥

ఈ విధంగా వరదుడైన పరమేశ్వరునిచే అనుజ్ఞాతయై భూతానుజయైన చర్చిక సింహపుచర్మం ధరించి, భూమి నలువైపులా సంచరించి, ఉత్తమమైన హైంగులతాద్రికి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన పిమ్మట వరదుడైన పరమేశ్వరుడు భూమినుండి పుట్టినబాలకుడైన కుజునకు సర్వోత్తమమైన వరప్రదానం చేస్తూ, "మహాత్మా! జగత్తులకు శుభాశుభకరమైన గ్రహాధిపత్యాన్ని నీకు అనుగ్రహిస్తున్నాను. దీనితో సమస్తజగత్తు నీ వశమై ఉంటుంది" అని పలికాడు.

హరోఽన్ధకం వర్ష సహస్రమాత్రం దివ్యం స్వనేత్రార్కహుతాశనేన ।
చకార సంశుష్కతనుం త్వశోణితం త్వగస్థిశేషం భగవాన్ స భైరవః ॥49॥

తత్రాగ్నినా నేత్రభవేన శుద్ధః సముక్తపాపోఽసురరాడ్బభూవ ।
తతః ప్రజానాం బహురూపమీశం నాథం హి సర్వస్య చరాచరస్య ॥50॥

జ్ఞాత్వా స సర్వేశ్వరమీశమవ్యయం త్రైలోక్యనాథం వరదం వరేణ్యమ్ ।
సర్వైః సురాద్యైర్నతమీడ్యమాద్యం తతోఽన్ధకః స్తోత్రమిదం చకార ॥51॥

భైరవరూపధారియైన శివభగవానుడు తన సూర్యాగ్నినేత్రాలతో వేయి దివ్యసంవత్సరాలవరకు అంధకుని శరీరంలోని రక్తాన్ని నశింపజేసి, చర్మం, ఎముకలు మాత్రమే మిగిలేటట్లు చేశాడు. పరమశివుని నేత్రాగ్నిలో అంధకుడు తన పాపాలనన్నిటిని భస్మం గావించుకొని పరిశుద్ధుడయ్యాడు. అంతట సర్వేశ్వరుడు, సర్వరూపి, చరాచర జగన్నాథుడు, అవ్యయుడు, త్రిలోకాధిపతి, వరదుడు సమస్తదేవతారాధ్యుడునైన ఆ మహాదేవుని నిజతత్త్వాన్ని అవగాహన చేసికొని, చేతులు జోడించి ఇలా స్తోత్రం చేశాడు.

అంధక ఉవాచ – అంధకుడు పలికాడు.

నమోఽస్తు తే భైరవ భీమమూర్తే త్రిలోకగోప్త్రే శితశూలధారిణే ।
వింశార్ధబాహో భుజగేశహార త్రినేత్ర మాం పాహి విపన్నబుద్ధిమ్ ॥52॥

ఓ భైరవా! భీమరూపధారీ! త్రిలోకరక్షకా! శితశూలధారీ! దశభుజధారీ! నాగేంద్రహారా! త్రినేత్రా! దుర్బుద్ధినైన నన్ను కాపాడు.

జయస్వ సర్వేశ్వర విశ్వమూర్తే సురాసురైర్వన్దితపాదపీఠ ।
త్రైలోక్యమాతుర్గురవే వృషాఙ్క భీతః శరణ్యం శరణాగతోఽస్మి ॥53॥

ఓ సర్వేశ్వరా! ఓ విశ్వమూర్తీ! నీకు జయమగుగాక! సురాసురవన్దితచరణా! త్రిజగన్మాతకు నీవు భర్తవు. వృషకేతనా! శరణ్యుడవైన నిన్ను భీతితో శరణువేడుతున్నాను.

త్వాం నాథ దేవాః శివమీరయన్తి సిద్ధా హరం స్థాణుం మహర్షయశ్చ ।
భీమం చ యక్షా మనుజా మహేశ్వరం భూతాశ్చ భూతాధిపమామనన్తి ॥54॥

ప్రభో! దేవతలు నిన్ను శివుడని కీర్తిస్తారు. సిద్ధులు హరుడని, మహర్షులు స్థాణువని, యక్షులు భీముడని, మానవులు మహేశ్వరుడవని, భూతగణాలు భూతనాథుడవని నీకు ప్రణతులౌతారు.

నిశాచరా ఉగ్రముపార్చయన్తి భవేతి పుణ్యాః పితరో నమన్తి ।
దాసోఽస్మి తుభ్యం హర పాహి మహ్యం పాపక్షయం మే కురు లోకనాథ ॥55॥

లోకనాథా! నిశాచరులు ఉగ్రుడని, పుణ్యులు, పితరులు భవుడని, నీకు నమస్కరిస్తారు. ఓ హరా! నా పాపాలు హరించు, నేను నీకు దాసుడను. నన్ను క్షమించు.

భవాంస్త్రిదేవస్త్రియుగస్త్రిధర్మా త్రిపుష్కరాశ్చాసి విభో త్రినేత్ర ।
త్రయ్యారుణిస్త్రిశ్రుతిరవ్యయాత్మన్ పునీహి మాం త్వాం శరణం గతోఽస్మి ॥56॥

విభో! త్రినేత్రా! త్రిదేవులు, మూడు యుగాలు, మూడు ధర్మాలు, మూడు పుష్కరాలు నీవే. మూడు వేదాలూ సర్పాభరణాలుగా కలవాడవు నీవే. త్రివేదాలు నీవే. ఓ అవ్యయా! నేను నిన్ను శరణు పొందాను. కాబట్టి నీవు నన్ను పవిత్రుని చేయి. రక్షించు.

త్రిణాచికేతస్త్రిపదప్రతిష్ఠః షడఙ్గవిత్ త్వం విషయేష్వలుబ్ధః ।
త్రైలోక్యనాథోఽసి పునీహి శంభో దాసోఽస్మి భీతః శరణాగతస్తే ॥57॥

మూడు విధాలైన నాచికేతాగ్నిలు నీవే. త్రిపదప్రతిష్ఠ గాంచినవాడవు, వేదాఙ్గవేత్తవు, విషయాలకు అతీతుడవు, ముల్లోకాధిపతివి, కల్యాణరూపుడవు నీవు. ఓ శంభో! భీతుడనైన నేను నిన్ను శరణుగోరాను. నేను నీకు దాసుడను. నా భయం పోగొట్టి నన్ను రక్షించు.

కృతం మహచ్ఛంకర తేఽపరాధం మయా మహాభూతపతే గిరీశ ।
కామారిణా నిర్జితమానసేన ప్రసాదయే త్వాం శిరసా నతోఽస్మి ॥58॥

ఓ మంగళకరా! ఘోరశత్రువైన కామునకు లొంగిపోయిన మనస్సుతో నేను భయంకరమైన అపరాధం చేశాను. ఓ సర్వభూతాధీశ్వరా! గిరీశా! నీకు తలవంచి వందనం చేస్తున్నాను. నా యెడల ప్రసన్నుడవు కమ్ము.

పాపోఽహం పాపకర్మాఽహం పాపాత్మా పాపసంభవః ।
త్రాహి మాం దేవ ఈశాన సర్వపాపహరో భవ ॥59॥

నేను పాపుడను, పాపకర్ముడను, పాపాత్ముడను, పాపసంభవుడను, ఓ దేవా! ఈశానా! సర్వపాపహరుడవైన భవా! నన్ను రక్షించు.

మా మే కృధ్యస్వ దేవేశ త్వయా చైతాదృశోఽస్మ్యహమ్ ।
సృష్టః పాపసమాచారో మే ప్రసన్నో భవేశ్వర ॥60॥

ప్రభూ! నీవే సర్వకారణుడవు. నన్నీ విధంగా పుట్టించావు. కాబట్టి తండ్రీ! నామీద కోపింపవద్దు. నన్ను పాపాచారునిగా నీవే సృష్టించావు. కావున నాపట్ల ప్రసన్నుడవు కమ్ము.

త్వం కర్తా చైవ ధాతా చ త్వం జయస్త్వం మహాజయః ।
త్వం మంగళస్త్వమోంకారస్త్వమీశానో ధ్రువోఽవ్యయః ॥61॥

నీవే కర్తవు. ధాతవు. నీవే జయానివి. మహాజయానివీ నీవే. నీవే శుభానివి. ఓంకారమూ నీవే. ఈశానుడవు, ధ్రువమైనవాడవు, అవ్యయుడవు నీవే.

త్వం బ్రహ్మా సృష్టికృన్నాథస్త్వం విష్ణుస్త్వం మహేశ్వరః ।
త్వమిన్ద్రస్త్వం వషట్కారో ధర్మస్త్వం చ సురోత్తమః ॥62॥

సూక్ష్మస్త్వం వ్యక్తరూపస్త్వం త్వమవ్యక్తస్త్వమీశ్వరః ।
త్వయా సర్వమిదం వ్యాప్తం జగత్ స్థావరజఙ్గమమ్ ॥63॥

బ్రహ్మవు నీవు. సృష్టికర్తవు నీవు. పాలించే విష్ణుడవు నీవు. మహేశ్వరుడవు నీవు. ఇంద్రుడవు నీవు. వషట్కారానివి ధర్మానివీ నీవే. సురోత్తముడవు నీవు. సూక్ష్మానివి, వ్యక్తానివి, అవ్యక్తానివి అన్నీ నీవే. స్థావర జఙ్గమాత్మకమైన విశ్వమంతా ఆవరించియున్న ఈశ్వరుడవు నీవే.

త్వమాదిరన్తో మధ్యశ్చ త్వమనాదిః సహస్రపాత్ ।
విజయస్త్వం సహస్రాక్షో విరూపాక్షో మహాభుజః ॥64॥

అనన్తః సర్వగో వ్యాపీ హంసః ప్రాణాధిపోఽచ్యుతః ।
గీర్వాణపతిరవ్యగ్రో రుద్రః పశుపతిః శివః ॥65॥

త్రైవిద్యస్త్వం జితక్రోధో జితారిర్విజితేన్ద్రియః ।
జయశ్చ శూలపాణిస్త్వం త్రాహి మాం శరణాగతమ్ ॥66॥

ఆదిమధ్యాంతము నీవే. అనాదివి నీవే. సహస్రపాదుడవు నీవే. విజయుడవు నీవే. సహస్రాక్షుడవు, విరూపాక్షుడవు, మహాభుజుడవు నీవు. అనంతుడవు, అన్నింటా ఉండేవాడివి నీవే. సర్వవ్యాపివి, ప్రాణస్వరూపుడవైన హంసవు నీవే. నీకు చ్యుతిలేదు. గీర్వాణుల నేతవు. నీవు శాంతుడవు. రుద్రుడవు. పశుపతివి. శివుడవు. నీవే వేదవిద్యవు. త్రయీమయుడవు. జితక్రోధుడవు. జితారివి. జితేంద్రియుడవు. జయస్వరూపానివి. ఓ త్రిశూలధరా! శరణాగతుడవైన నన్ను రక్షించు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్థం మహేశ్వరో బ్రహ్మన్ స్తుతో దైత్యాధిపేన తు ।
ప్రీతియుక్తః పిఙ్గలాక్షో హైరణ్యాక్షిమువాచ హ ॥67॥

సిద్ధోఽసి దానవపతే పరితుష్టోఽస్మి తేఽన్ధక ।
వరం వరయ భద్రం తే యమిచ్ఛసి వినాఽమ్బికామ్ ॥68॥

ఓ నారదా! ఆ విధంగా దైత్యాధిపతి చేసిన స్తోత్రానికి సంతోషించి పింగళాక్షుడు హిరణ్యాక్షపుత్రునితో ఇలా పలికాడు. "అంధకా! రాక్షసాధిపా! నీవు సిద్ధుడవైనావు. నేను సంతోషించాను. అంబిక తప్ప మరేదైనా నీ అభీష్టవరాన్ని కోరుకో. ప్రసాదిస్తాను. నీకు భద్రమగుగాక!".

అంధక ఉవాచ – అంధకుడు పలికాడు.

అంబికా జననీ మహ్యం భగవాంస్త్ర్యంబకః పితా ।
వన్దామి చరణౌ మాతుర్వన్దనీయా మమాంబికా ॥69॥

వరదోఽసి యదీశాన తద్యాతు విలయం మమ ।
శారీరం మానసం వాగ్జం దుష్కృతం దుర్విచింతితమ్ ॥70॥

తథా మే దానవో భావో వ్యపయాతు మహేశ్వర ।
స్థిరాఽస్తు త్వయి భక్తిస్తు వరమేతత్ ప్రయచ్ఛ మే ॥71॥

"ప్రభూ! అంబిక నాకు తల్లి. భగవానుడైన త్రినేత్రుడే నా తండ్రి. వందనీయురాలైన ఆ మాతృశ్రీ చరణార విందాలకు నా వందనాలు. మహేశ్వరా! నీవు వరదుడవు. నేనింతవరకు మనోవాక్కాయ కర్మల ద్వారా చేసిన దుష్టాలోచనలు, దుర్భాషలు, శరీరంతో చేసిన దుష్కృత్యాలు, అన్నీ విలయమైపోయేటట్లు అనుగ్రహించు. అట్లే నాకు జన్మతః సంక్రమించిన దానవభావం నశింపజేసి, నీ పాదపద్మాల పట్ల అచంచలమైన, స్థిరమైన భక్తి కలిగేటట్లు వరాన్ని నాకు అనుగ్రహించు" అని అంధకుడు మహేశ్వరుని ప్రార్థించాడు.

మహాదేవ ఉవాచ – మహాదేవుడు పలికాడు.

ఏవం భవతు దైత్యేంద్ర పాపం తే యాతు సంక్షయమ్ ।
ముక్తోఽసి దైత్యభావాచ్చ భృంగీ గణపతిర్భవ ॥72॥

ఇత్యేవముక్త్వా వరదః శూలాగ్రాదవతార్య తమ్ ।
నిర్మార్జ్య నిజహస్తేన చక్రే నిర్వ్రణమన్ధకమ్ ॥73॥

ఓ దైత్యేంద్రా! అట్లే అగుగాక! నీ పాపమంతా నశించిపోతుంది. నీలోని దైత్యభావంనుండి ముక్తుడవయ్యావు. నేటినుండి నీవు భృంగి అనే పేరుతో గణాధిపతివయ్యావని వరమిచ్చి, త్రిశూలాగ్రం నుండి అంధకుని క్రిందకు దింపాడు. అతని శరీరంలోని వ్రణాలనన్నిటిని తన చేతితో నిమిరి, మాన్పి ఆరోగ్యవంతుని చేశాడు.

తతః స్వదేహతో దేవాన్ బ్రహ్మాదీనాజుహావ సః ।
తే నిశ్చేరుః మహాత్మానో నమస్యన్తస్త్రిలోచనమ్ ॥74॥

గణాన్ సనన్దీనాహూయ సన్నివేశ్య తదాగ్రతః ।
భృంగినం దర్శయామాస ధ్రువం నైవోఽన్ధకేతి హి ॥75॥

తం దృష్ట్వా దానవపతిం సంశుష్కపిశితం రిపుమ్ ।
గణాధిపత్యమాపన్నం ప్రశశంసుర్వృషధ్వజమ్ ॥76॥

అంతట మహేశ్వరుడు తన శరీరంనుండి బ్రహ్మాది దేవతలనందరిని బయటకు రమ్మని పిలువగా, ఆ మహనీయులందరు బయటకు వచ్చి, త్రిలోచనునకు నమస్కరించారు. అంతట త్రిలోచనుడు నందితో సహా గణాలనందరిని సమావేశపరచి, వారలకు భృంగిని చూపి, "ఇతడు గణాధిపతి. అంధకుడు కాదు. ఇది నిశ్చయ" మని పలికాడు. గణాధిపత్యం సంపాదించి, రక్తమాంసహీనుడై నిలబడియున్న తమ శత్రువైన దానవేశ్వరుని చూచి అందరు వృషధ్వజుని ప్రశంసించారు.

తతస్తాన్ ప్రాహ భగవాన్ సంపరిష్వజ్య దేవతాః ।
గచ్ఛధ్వం స్వాని ధిష్ణ్యాని భుంజధ్వం త్రిదివం సుఖమ్ ॥77॥

సహస్రాక్షోఽపి సంయాతు పర్వతం మలయం శుభమ్ ।
తత్ర స్వకార్యం కృత్వైవ పశ్చాద్యాతు త్రివిష్టపమ్ ॥78॥

అంతట శివభగవానుడు దేవతలనందరిని ఆలింగనం చేసికొని మీ మీ నెలవులకు వెళ్ళి, సుఖభోగాలను అనుభవించండి. ఇంద్రుడు కూడా శుభప్రదమైన మలయాద్రికి వెళ్ళి తనకార్యం నిర్వర్తించుకొని తదనంతరం స్వర్గానికి వెళతాడు.

ఇత్యేవముక్త్వా త్రిదశాన్ సమాభాష్య వ్యసర్జయత్ ।
పితామహం నమస్కృత్య పరిష్వజ్య జనార్దనమ్ ॥79॥

తే విసృష్టా మహేశేన సురా జగ్ముస్త్రివిష్టపమ్ ।
మహేన్ద్రో మలయం గత్వా కృత్వా కార్యం దివంగతః ॥80॥

ఇట్లు పలికి దేవతలకు వీడ్కోలు చెప్పాడు. తదనంతరం పితామహునకు నమస్కరించి, జనార్దనుని కౌగిలించుకొని, వీడ్కోలు పలికాడు. ఆ విధంగా మహేశ్వరుని వీడ్కోలు తీసికొని దేవతలందరు త్రివిష్టపానికి వెళ్ళిపోయారు. మహేంద్రుడు మలయాద్రికి వెళ్ళి, తనకార్యం చక్కబెట్టుకొని స్వర్గానికి వెళ్ళాడు.

గతేషు శక్రప్రాగ్ర్యేషు దేవేషు భగవాన్ శివః ।
విసర్జయామాస గణాననుమాన్య యథార్హతః ॥81॥

గణాశ్చ శంకరం దృష్ట్వా స్వం స్వం వాహనమాస్థితాః ।
జగ్ముస్తే శుభలోకాని మహాభోగాని నారద ॥82॥

యత్ర కామదుఘా గావః సర్వకామఫలద్రుమాః ।
నద్యస్త్వమృతవాహిన్యో హ్రదాః పాయసకర్దమాః ॥83॥

నారదా! ఆ విధంగా ఇంద్రాది దేవతలందరు వెళ్ళిన పిమ్మట శివభగవానుడు ప్రమథగణాలనందరిని యథోచితంగా గౌరవించి, అనుమతించగా వారందరు తమ తమ వాహనాల మీద శుభలోకాలకు వెళ్ళారు. అక్కడ వారు కామధేనువులు, కల్పవృక్షాలు, అమృతనదులతోకూడి, వెన్నతెట్టెలు కట్టే క్షీర సరోవరాల మధ్య మహాభోగాలు అనుభవించారు.

స్వాం స్వాం గతిం ప్రయాతేషు ప్రమథేషు మహేశ్వరః ।
సమాదాయాన్ధకం హస్తే సనన్దిః శైలమభ్యగాత్ ॥84॥

ద్వాభ్యాం వర్షసహస్రాభ్యాం పునరాగాద్ధరో గృహమ్ ।
దదృశే చ గిరేః పుత్రీం శ్వేతార్కకుసుమస్థితామ్ ॥85॥

సమాయాతం నిరీక్ష్యైవ సర్వలక్షణసంయుతమ్ ।
త్యక్త్వార్కపుష్పం నిర్గత్య సఖీస్తాః సముపాహ్వయత్ ॥86॥

సమాహూతాశ్చ దేవ్యా తా జయాద్యాస్తూర్ణమాగమన్ ।
తాభిః పరివృతా తస్థౌ హరదర్శనలాలసా ॥87॥

ప్రమథులు తమ తమ స్థానాలకు వెళ్ళడానికి ప్రయాణమైన పిమ్మట మహేశ్వరుడు అంధకుని చేతిని తన చేతితో పట్టుకుని నందితో సహా తన పర్వతానికి తీసికొని వెళ్ళాడు. మహేశ్వరుడు రెండువేలసంవత్సరాల తరువాత తన నివాసానికి తిరిగి వచ్చాడు. వారందరు శ్వేతార్కపుష్పమందున్న గిరిపుత్రిని చూశారు. సర్వచిహ్నాలతో కూడిన శంకరుడు రాగా పార్వతి శంకరుని దర్శిస్తూ, అర్కపుష్పాన్ని వదలి బయటకు వచ్చి, తన చెలికత్తెలను పిలిచింది. ఆ విధంగా పార్వతీదేవిచే పిలువబడిన జయ మొదలైన చెలికత్తెలు వేగంగా అక్కడకు వచ్చారు. సఖీజనంతో కూడి పార్వతీదేవి శివదర్శనలాలసురాలై నిలబడింది.

తతస్త్రినేత్రో గిరిజాం దృష్ట్వా ప్రేక్ష్య చ దానవమ్ ।
నందినం చ తదా హర్షాదాలింగఙ్చ గిరేః సుతామ్ ॥88॥

అంతట త్రినేత్రుడు పార్వతిని చూసి, మరలా అంధకునియందు, నందియందు దృష్టి సారించి, పార్వతీదేవిని ఆలింగనం చేసుకున్నాడు.

అథోవాచైష దాసస్తే కృతో దేవి మయాన్ధకః ।
పశ్యస్వ ప్రణతిం యాతం స్వసుతం చారుహాసిని ॥89॥

ఇత్యుచ్యార్యాన్ధకం చైవ పుత్ర ఏహ్యేతి సత్వరమ్ ।
వ్రజస్వ శరణం మాతురేషా శ్రేయస్కరీ తవ ॥90॥

ఇత్యుక్తో విభునా నందీ అంధకశ్చ గణేశ్వరః ।
సమాగమ్యాంబికాపాదౌ వవన్దతురుభావపి ॥91॥

తదనంతరం శంకరుడు "దేవీ! ఈ అంధకాసురుని నీకు దాసునిగా చేసి, తీసికొని వచ్చాను. చారుహాసినీ! నమస్కరిస్తున్న నీ పుత్రుని చూడు"మని పార్వతీదేవితో పలికాడు. పార్వతీదేవితో ఇలా పలికిన పిమ్మట "పుత్రా! వేగంగా ఇక్కడకు రమ్ము! నీకు శ్రేయస్కారిణి అయిన ఈ నీతల్లిని శరణు పొందు" శివభగవానుడు ఇట్లు చెప్పగానే నంది, గణేశ్వరుడైన అంధకుడు, అంబికాదేవి పాదాల చెంతకు వచ్చి, అంబిక పాదారవిందాలకు నమస్కరించారు.

అంధకోఽపి తదా గౌరీం భక్తినమ్రో మహామునే ।
స్తుతిం చక్రే మహాపుణ్యాం పాపఘ్నీం శ్రుతిసమ్మితామ్ ॥92॥

ఓ నారద మహర్షీ! అంతట అంధకుడు భక్తినమ్రుడై మహాపుణ్యకరమూ, పాపాపహారీ, వేదసమ్మతమూ అయిన ఈ దేవీస్తోత్రాన్ని చేశాడు.

అంధక ఉవాచ – అంధకుడు పలికాడు.

ఓం నమస్తేస్తు భవానీం భూతభవ్యప్రియాం లోకధాత్రీం జనత్రీం స్కన్దమాతరం మహాదేవప్రియాం ధారిణీం స్యన్దినీం చేతనాం త్రైలోక్యమాతరం ధరిత్రీం దేవమాతరమథేజ్యాం శ్రుతిం స్మృతిం దయాం లజ్జాం కాన్తిమగ్ర్యా మసూయాం మతిం సదాపావనీం దైత్యసైన్యక్షయకరీం మహామాయాం వైజయన్తీం సుశుభాం కాలరాత్రిం గోవిన్దభగినీం శైలరాజపుత్రీం సర్వదేవార్చితాం సర్వభూతార్చితాం విద్యాం సరస్వతీం త్రినయనమహిషీం నమస్యామి మృడానీం శరణ్యాం శరణముపాగతోఽహం నమో నమస్తే ॥93॥

ఇత్థం స్తుతా సాన్ధకేన పరితుష్టా విభావరీ ।
ప్రాహ పుత్ర ప్రసన్నాఽస్మి వృణుష్వ వరముత్తమమ్ ॥94॥

"ఓం భవానీమాతకు ప్రణామాలు. భూతభవిష్యాలలో లోకప్రియం గావించే లోకధాత్రికి, జనయిత్రికి, స్కందమాతకు, మహాదేవప్రియురాలికి నమస్సులు. సకలాధారిణికి, క్షీరప్రదాయినికి, చైతన్యరూపిణికి, త్రిలోకజననికి

నమస్సులు. ఓ ధరిత్రీ! దేవమాతా! యజ్ఞరూపిణీ! వేదరూపిణీ! స్మృతీ! దయా! లజ్జా! కాంతిరూపిణీ! అగ్ర్యా!, అసూయా!, మతీ! సదా పావనీ! దైత్యసైన్యనాశినీ! మహామాయా! వైజయన్తీ! సుశుభా! కాళరాత్రీ! గోవిందసోదరీ! హిమవన్నగపుత్రీ! సర్వదేవపూజితా! సర్వభూతగణార్చితా! విద్యా! సరస్వతీ! త్రినేత్రుని పట్టపురాణీ! నీకు నమస్కరిస్తున్నాను. మృడాని!, సర్వశరణ్యురాలు అయిన నిన్ను నేను శరణుగోరి వచ్చాను. నన్ను రక్షించు. నీకు నమస్సులు". అంధకుడు ఇలా స్తోత్రం చేయగా సంతోషించి విభావరి, కాంతిమతియైన పార్వతీదేవి "పుత్రా! ప్రసన్నురాలనయ్యాను. నీకు కావలసిన ఉత్తమమైన వరాన్ని కోరుకొను"మని అంధకునితో పలికింది.

భృంగి రువాచ – భృంగి పలికాడు.

పాపం ప్రశమమాయాతు త్రివిధం మమ పార్వతి ।
తథేశ్వరే చ సతతం భక్తిరస్తు మమాంబికే ॥95॥

ఓ పార్వతీమాతా! మనస్సు, మాట, శరీరం అనే త్రికరణములచే నేను చేసిన పాపాలనన్నిటిని ఉపశమింపజేయి. అట్లే అంబికా! ఈశ్వరచరణాల పట్ల నాకు ఎల్లప్పుడు స్థిరమైన భక్తి ఉండేటట్లు అనుగ్రహింపుమని భృంగి పార్వతీమాతను ప్రార్థించాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

బాఢమిత్యబ్రవీద్గౌరీ హిరణ్యాక్షసుతం తతః ।
స చాస్తే పూజయన్ శర్వం గణానామధిపోఽభవత్ ॥96॥

భృంగి ప్రార్థింపగా పార్వతీదేవి అట్లేయని హిరణ్యాక్షపుత్రుని దీవించింది. అతడు హరుని ఆరాధించి, గణాధిపతి అయ్యాడు.

ఏవం పురా దానవసత్తమం తం మహేశ్వరేణాథ విరూపదృష్ట్యా ।
కృత్వైవ రూపం భయదం చ భైరవం భృంగిత్వమీశేన కృతం స్వభక్త్యా ॥97॥

ఏతత్ తవోక్తం హరకీర్తివర్ధనం పుణ్యం పవిత్రం శుభదం మహర్షే ।
సంకీర్తనీయం ద్విజసత్తమేషు ధర్మాయురారోగ్య ధనైషిణా సదా ॥98॥

"ఓ నారదా! ప్రాచీనకాలంలో విరూపాక్షుడైన పరమశివుడు మహోగ్రమైన భైరవరూపం దాల్చి అంధక మహాదైత్యుని మదమణచి, తనకత్యంతభక్తుడైన భృంగిగా మార్చిన ఈ అద్భుతగాథను నీకు వినిపించాను. ఇది పుణ్యప్రదమైనది. పవిత్రమైనది. శుభాలనిచ్చునది. శివభక్తిని వర్ధిల్లజేయునది. ఉత్తములగు బ్రాహ్మణులు, ధర్మం ఆయురారోగ్యసంపత్తులు కాంక్షించేవారు సదా కీర్తింపదగినది" అని పులస్త్యుడు నారద మహర్షితో పలికాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే భైరవప్రాదుర్భావే అంధకవరప్రదానం నామ సప్తతితమోఽధ్యాయః ॥70॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని భైరవప్రాదుర్భావమందలి అంధకవరప్రదానమనే డెబ్భైయవ అధ్యాయం సమాప్తం.

ఏకసప్తతితమోఽధ్యాయః – డెబ్బైఒకటవ అధ్యాయం

శక్రచరితే మరుదుత్పత్తిః – శక్రచరిత్రలో మరుత్తులపుట్టుక

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

మలయేఽపి మహేంద్రేణ యత్కృతం బ్రాహ్మణర్షభ ।
నిష్పాదితం స్వకం కార్యం తన్మే వ్యాఖ్యాతుమర్హసి ॥1॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! మలయపర్వతం మీద ఇంద్రుడు తన సొంత పనులెలా నిర్వర్తించాడో వివరంగా తెలియజేయవలసిందని పులస్త్యుని నారదుడు ప్రార్థించాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రూయతాం యన్మహేన్ద్రేణ మలయే పర్వతోత్తమే ।
కృతం లోకహితం బ్రహ్మన్నాత్మనశ్చ తథా హితమ్ ॥2॥

నారదా! మలయపర్వతానికి వెళ్ళి ఇంద్రుడు లోకానికి తనకు హితకరంగా చేసిన పనిని గురించి చెబుతాను. విను.

అంధాసురస్యానుచరా మయతారపురోగమాః ।
తే నిర్జితాః సురగణైః పాతాలగమనోత్సుకాః ॥3॥

దదృశుర్మలయం శైలం సిద్ధాధ్యుషితకన్దరమ్ ।
లతావితానసంఛన్నం మత్తసత్త్వసమాకులమ్ ॥4॥

చందనైరురగాక్రాంతైః సుశీతైరతిసేవితమ్ ।
మాధవీ కుసుమామోదం ఋష్యర్చితహరం గిరిమ్ ॥5॥

అంధకాసురుని అనుచరులలో యుద్ధంలో ఓడిపోయిన మయ తారాది రాక్షసులు పాతాలానికి వెళ్ళాలని ఉత్సాహంతో వెడుతూ దారిలో సిద్ధులకు నివాసాలైన గుహలతో, లతాసమూహాలతో, మదించిన మృగాలతో అలరారే మలయపర్వతాన్ని చూచారు. మహాసర్పాలతో చుట్టుకొనబడిన చల్లని చందనతరువులతో మాధవీ కుసుమ పరిమళంతో నిండిన ఆ గిరిమీద ఋషులు శివార్చనలు గావిస్తున్నారు.

తం దృష్ట్వా శీతలచ్ఛాయం శ్రాన్తా వ్యాయామకర్షితాః ।
మయతారపురోగాస్తే నివాసం సమరోచయన్ ॥6॥

తేషు తత్రోపవిష్టేషు ప్రాణతృప్తిప్రదోఽనిలః ।
వివాతి శీతః శనకైర్దక్షిణో గంధసంయుతః ॥7॥

తత్రైవ చ రతిం చక్రుః సర్వ ఏవ మహాసురాః ।
కుర్వన్తో లోకసంపూజ్యే విద్వేషం దేవతాగణే ॥8॥

యుద్ధవ్యాయామంతో అలసిపోయిన మయుడు, తారుడు మొదలైన రాక్షసులు అచ్చటి చల్లని వాతావరణం చూచి ఆ చెట్లనీడలో కూర్చొనియుండగా సుగంధంతో కూడిన దక్షిణవాయువు మెల్లగా వీచింది. ఆ సుఖానికి ముగ్ధులైన రాక్షసులందరు అచ్చటనే స్థిరంగా ఉండిపోయారు. లోకపూజ్యులైన దేవతలను ద్వేషింపసాగారు.

తాన్ జ్ఞాత్వా శంకరః శక్రం ప్రేషయన్ మలయేఽసురాన్ ।
స చాపి దదృశే గచ్ఛన్ పథి గోమాతరం హరిః ॥9॥

తస్యాః ప్రదక్షిణాం కృత్వా దృష్ట్వా శైలం చ సుప్రభమ్ ।
దదృశే దానవాన్ సర్వాన్ సంహృష్టాన్ భోగసంయుతాన్ ॥10॥

ఆ విషయం తెలిసికొనిన శివుడు ఇంద్రుని మలయాచలానికి పంపాడు. అక్కడకు వెళుతున్న దారిలో ఇంద్రుడు కామధేనువును చూశాడు. ఆ గోమాతకు ప్రదక్షిణం చేసి, వెళ్ళి, అందమైన మలయాచలాన్ని, అచ్చట ఇష్టభోగాలలో మునిగి ఉన్న దానవులందరిని చూశాడు.

అథాజుహావ బలహా సర్వానేవ మహాసురాన్ ।
తే చాప్యాయయురవ్యగ్రా వికిరంతః శరోత్కరాన్ ॥11॥

తానాగతాన్ బాణజాలైః రథస్థోఽద్భుతదర్శనః ।
ఛాదయామాస విప్రర్షే గిరీన్ వృష్ట్యా యథా ఘనః ॥12॥

తతో బాణైరవచ్ఛాద్య మయాదీన్ దానవాన్ హరిః ।
పాకం జఘాన తీక్ష్ణాగ్రైర్మార్గణైః కంకవాససైః ॥13॥

తత్ర నామ విభుర్లేభే శాసనత్వాత్ శరైర్దృఢైః ।
పాకశాసనతాం శక్రః సర్వామరపతి4ర్విభుః ॥14॥

వెంటనే బలారి రాక్షసులనందరిని యుద్ధానికి ఆహ్వానించాడు. వారందరు బాణవర్షం కురిపిస్తూ ఇంద్రుని మీదకు దండెత్తి వచ్చారు. ఓ నారదా! అద్భుతదర్శనుడైన ఇంద్రుడు బాణజాలంతో వచ్చిన రాక్షసులను చూసి, రథం మీద కూర్చొని, కొండలను మేఘాలు కమ్ముకున్నట్లు తన బాణాలతో దానవులనందరిని కప్పివేశాడు. మయుడు మున్నగు రాక్షసులనందరిని బాణాలతో ముంచెత్తిన తరువాత ఇంద్రుడు పాకుడనే మహారాక్షసుని వాడియైన మొనకలిగి, గ్రద్ద ఈకలతో అలంకరింపబడిన బాణాలతో సంహరించాడు. పాకదానవుని శాసించినందున ఇంద్రునకు నాటినుండి **పాకశాసనుడనే** పేరు కలిగింది.

తథాన్యం పురనామానం బాణాసురసుతం శరైః ।
సుపుంఖైర్దారయామాస తతోఽభూత్ స పురందరః ॥15॥

అట్లే బాణాసురపుత్రుడైన పురుడనే మరొక రాక్షసుని కూడా ఇంద్రుడు తన బాణపరంపరతో చీల్చి చెండాడి పురందరుడయ్యాడు.

హత్వేత్థం సమరేఽజైషీద్గోత్రభిద్దానవం బలమ్ ।
తచ్చాపి విజితం బ్రహ్మన్ రసాతలముపాగమత్ ॥16॥

ఏతదర్థం సహస్రాక్షః ప్రేషితో మలయాచలమ్ ।
త్ర్యంబకేన మునిశ్రేష్ఠ కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛసి ॥17॥

ఆ విధంగా గోత్రభేదియైన ఇంద్రుడు యుద్ధంలో రాక్షసులనందరిని సంహరించాడు. వారందరు మరణించిన తరువాత మిగిలిన రాక్షసబలాలు ఓడిపోయి పాతాలానికి వెళ్ళిపోయారు. ఈ పని నిర్వహించడానికే త్రినేత్రుడు ఇంద్రుని మలయాచలానికి పంపాడు. ఓ మునిశ్రేష్ఠా! నీవింకా ఏమి వినదలుచుకుంటివో తెలియజేయి.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కిమర్థం దైవతపతిర్గోత్రభిత్ కథ్యతే హరిః ।
ఏష మే సంశయో బ్రహ్మన్ హృది సంపరివర్తతే ॥18॥

ఓ బ్రాహ్మణోత్తమా! దేవపతియైన ఇంద్రునకు గోత్రభేది అనే పేరు ఎలా కలిగిందో తెలియజేసి, నా సందేహాన్ని నివృత్తి చేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రూయతాం గోత్రభిచ్ఛక్రః కీర్తితో హి యథా మయా ।
హతే హిరణ్యకశిపౌ యచ్చకారారిమర్దనః ॥19॥

నారదా! హిరణ్యకశిపుని మరణానంతరం ఇంద్రుడు ఏమి చేసినది, గోత్రభేది అను పేరు ఎలా వచ్చినదీ వివరంగా చెబుతాను. సావధానంగా విను.

దితిర్వినష్టపుత్రా తు కశ్యపం ప్రాహ నారద ।
విభో నాథోఽసి మే దేహి శక్రహన్తారమాత్మజమ్ ॥20॥

కశ్యపస్తామువాచాథ యది త్వమసితేక్షణే ।
శౌచాచారసమాయుక్తా స్థాస్యసే దశతీర్దశ ॥21॥

సంవత్సరాణాం దివ్యానాం తతస్త్రైలోక్యనాయకమ్ ।
జనయిష్యసి పుత్రం త్వం శత్రుఘ్నం నాన్యథా ప్రియే ॥22॥

ఇత్యేవముక్తా సా భర్త్రా దితిర్నియమమాస్థితా ।
గర్భాధానమృషిః కృత్వా జగామోదయపర్వతమ్ ॥23॥

ఓ నారదా! తన కుమారులు చంపబడడం చూసి, దితి కశ్యపమహర్షిని చేరి "నాథా! నా భర్తవగు నీవు నాకు ఇంద్రుని వధించగల పుత్రుని అనుగ్రహింపుమని ప్రార్థించింది". అందులకు ఆ కశ్యపమహర్షి "ప్రియా! నీవు

నూరు దివ్య సంవత్సరాలు శుచిగా ఆచారానుష్ఠానం చేస్తే శత్రుహన్త, లోకాధిపతీ అయిన పుత్రుడు కలుగుతా"డని చెప్పగా దితి అందులకు సమ్మతించింది. అంతట ఆ బ్రహ్మర్షి ఆమెకు గర్భాధానం చేసి తాను ఉదయగిరికి వెళ్ళిపోయాడు.

గతే తస్మిన్ మునిశ్రేష్ఠే సహస్రాక్షోఽపి సత్వరమ్ ।
తమాశ్రమముపాగమ్య దితిం వచనమబ్రవీత్ ॥24॥

కరిష్యామ్యనుశుశ్రూషాం భవత్యా యది మన్యసే ।
బాఢమిత్యబ్రవీద్దేవీ భావికర్మ ప్రచోదితా ॥25॥

సమిదాహరణాదీని తస్యాశ్చక్రే పురందరః ।
వినీతాత్మా చ కార్యార్థీ ఛిద్రాన్వేషీ భుజంగవత్ ॥26॥

కశ్యపమహర్షి వెళ్ళిన వెంటనే సహస్రాక్షుడు ఆశ్రమంలో చేరి, దితిని సమీపించి ఇలా పలికాడు. "అమ్మా! నీవు అంగీకరిస్తే ఈ స్థితిలో నీకు శుశ్రూష చేస్తా!" అని పలికాడు. ఆమె మంచిదని అందులకు ఒప్పుకోగా పురందరుడు అత్యంతవినయంతో సమిధలు, ఆకులు వగైరాలు ఆమెకు తెచ్చియిస్తూ బిలం కోసం వెతికే మహాసర్పం వలె కార్యార్థియై ఆమెను కనిపెట్టియున్నాడు.

ఏకదా సా తపోయుక్తా శౌచే మహతి సంస్థితా ।
దశవర్షశతాంతే తు శిరః స్నాతా తపస్వినీ ॥27॥

జానుభ్యాముపరి స్థాప్య ముక్తకేశా నిజం శిరః ।
సుష్వాప కేశప్రాంతైస్తు సంశ్లిష్టచరణాఽభవత్ ॥28॥

తమంతరమశౌచస్య జ్ఞాత్వా వేదః సహస్రదృక్ ।
వివేశ మాతురుదరం నాసారంధ్రేణ నారద ॥29॥

నారదా! ఒకానొకప్పుడు ఆమె తపోనిష్ఠలో ఉండగా పదివందలసంవత్సరాలు పూర్తికాబోతుండగా ఆ తపస్విని తలకు స్నానం చేసి, జుట్టు విరబోసుకుని, మోకాళ్ళ మీద తలను ఆన్చి, వెంట్రుకలు పాదాలకు తాకేటట్లు ఒంగి, చిన్న కునుకు తీసింది. అలా ఆమె అశుచిగా ఉండడం గమనించిన వెంటనే ఆ సహస్రాక్షుడు ఆమె ముక్కు రంధ్రాలద్వారా తల్లి జఠరంలో ప్రవేశించాడు.

ప్రవిశ్య జఠరం క్రుద్ధో దైత్యమాతుః పురన్దరః ।
దదర్శోర్ధ్వముఖం బాలం కటిన్యస్తకరం మహత్ ॥30॥

తస్యైవాస్తేఽథ దదృశే పేశీం మాంసస్య వాసవః ।
శుద్ధస్ఫటికసంకాశాం కరాభ్యాం జగృహేఽథ తామ్ ॥31॥

తతః కోపసమాధ్మాతో మాంసపేశీం శతక్రతుః ।
కరాభ్యాం మర్దయామాస తతః సా కఠినాఽభవత్ ॥32॥

ఊర్ధ్వేనార్ధం చ వవృధే త్వథోఽథ వవృధే తథా ।
శతపర్వాఽథ కులిశః సంజాతో మాంసపేశితః ॥33॥

తేనైవ గర్భం దితిజం వజ్రేణ శతపర్వణా ।
చిచ్ఛేద సప్తధా బ్రహ్మన్ స రురోద చ విస్వరమ్ ॥34॥

తతోఽప్యబుధ్యత దితిరజానాచ్ఛక్రచేష్టితమ్ ।
శుశ్రావ వాచం పుత్రస్య రుదమానస్య నారద ॥35॥

పురందరుడు ఆ విధంగా దితి గర్భంలో ప్రవేశించి అక్కడ నడుము మీద చేతులుంచుకుని పైకి చూస్తూ తేజస్వియైన శిశువును చూశాడు. ఆ బాలుని ముఖం మీద శుద్ధస్ఫటికం వంటి మాంసపేశిని (ముక్కను) చూచి, రెండుచేతులతో పట్టుకుని, కోపంతో శక్రుడు గట్టిగా దానిని మర్దించాడు. దానితో అది గట్టిగా మారింది. అది పై భాగాన క్రింది భాగాన సాగి, పెద్దదై నూరంచులు గల వజ్రంగా మారింది. ఓ నారదా! ఆ వజ్రంతోనే ఇంద్రుడు దితి గర్భంలోని శిశువును ఏడు ముక్కలుగా ఖండించాడు. ఆ శిశువు కీచుగొంతుతో ఏడ్వసాగాడు. నారదా! తదనంతరం దితి నిద్రనుండి లేచి, ఇంద్రుడు చేసిన పనిని తెలిసికొని, విస్వరంతో రోదిస్తున్న శిశువు రోదనాన్ని కూడా విన్నది.

శక్రోఽపి ప్రాహ మా మూఢ రుదస్వేతి సుఘర్ఘరమ్ ।
ఇత్యేవముక్త్వా చైకైకం భూయశ్చిచ్ఛేద సప్తధా ॥36॥

తే జాతా మరుతో నామ దేవభృత్యాః శతక్రతోః ।
మాతురేవాపచారేణ చలన్తే తే పురస్కృతాః ॥37॥

తతః సకులిశః శక్రో నిర్గమ్య జఠరాత్తదా ।
దితిం కృతాంజలిపుటః ప్రాహ భీతస్తు శాపతః ॥38॥

మమాస్తి నాపరాధోఽయం యచ్ఛస్తస్తనయస్తవ ।
తవైవాపనయాచ్ఛస్తస్తన్మే న క్రోద్ధుమర్హసి ॥39॥

ఇంద్రుడు కూడా మూఢా! ఏడవకుము. అంటూ ఆ ఏడుముక్కలను ఒక్కొక్క ముక్కను మరల ఏడేసి ముక్కలుగా ఖండించాడు. ఆ విధంగా ఇంద్రుడు ఖండించినందువలన ఆ నలుబదితొమ్మిదిమంది మరుత్తులయ్యారు. తల్లిగావించిన అపచారం వల్ల అలా జన్మించి, ఇంద్రుని భృత్యులై, వాయువులై ఇంద్రునకు ముందు నడుస్తుంటారు. అంతట వజ్రపాణియైన ఇంద్రుడు మాతృగర్భంలోనుండి బయటకు వచ్చి, శాపభయంతో దితి ఎదుట చేతులు జోడించి, "తల్లీ! నీ కుమారుని మృతికి నేను కారణం కాదమ్మా! నీవు అశుచివైనందుననే ఇలా జరిగింది. నామీద కోపపడకు తల్లీ!" అని అర్థించాడు.

దితిరువాచ – దితి పలికింది.

> **న తవాత్రాపరాధోఽస్తి మన్యే దిష్టమిదం పురా ।**
> **సంపూర్ణే త్వపి కాలే వై యాఽశౌచత్వముపాగతా ॥40॥**

"ఇందులో నీ తప్పు లేదు. దైవవిధి ఈ విధంగానే ఉన్నది. కాకపోతే వ్రతసమాప్తిదశలో నేనెందుకు అశుచిగా ప్రవర్తించానా?" అని దితి సమాధానపడింది. ఆలోచింపసాగింది.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

> **ఇత్యేవముక్త్వా తాన్ బాలాన్ పరిసాన్త్వ్య దితిః స్వయమ్ ।**
> **దేవరాజా సహైతాంస్తు ప్రేషయామాస భామినీ ॥41॥**

> **ఏవం పురా స్వానపి సోదరాన్ స గర్భస్థితానుజ్జరితుం భయార్తః ।**
> **బిభేద వజ్రేణ తతః స గోత్రభిత్ ఖ్యాతో మహర్షే భగవాన్ మహేంద్రః ॥42॥**

అంతట దితి ఆ బాలకులను స్వయంగా సముదాయించి, దేవరాజైన ఇంద్రునితో వారిని పంపివేసింది. నారదా! ఈ విధంగా పూర్వకాలంలో ఇంద్రుడు భయార్తుడై తన కుటుంబానికి (గోత్రానికి) చెందిన స్వంత సోదరులను వజ్రంతో భిన్నం చేసినందున భగవంతుడైన మహేంద్రుడు గోత్రభిత్తు గా పిలువబడ్డాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్య నారదసంవాదే శక్రచరితే మరుదుత్పత్తిర్నామైక సప్తతితమోఽధ్యాయః ॥71॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్య నారదసంవాదంలోని శక్రచరిత్రలో మరుత్తుల పుట్టుక అనే డెబ్బైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్విసప్తతితమోఽధ్యాయః – డెబ్బైరెండవ అధ్యాయం

శక్రచరితే మరుదుత్పత్తిః – శక్రచరిత్రలో మరుత్తులపుట్టుక

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

యదమీ భవతా ప్రోక్తా మరుతో దితిజోత్తమాః ।
తత్కేన పూర్వమాసన్ వై మరున్మార్గేణ కథ్యతామ్ ॥1॥

పూర్వమన్వన్తరేష్వేవ సమతీతేషు సత్తమ ।
కే త్వాసన్ వాయుమార్గస్థాస్తన్మే వ్యాఖ్యాతుమర్హసి ॥2॥

ఓ మహర్షీ! దితిపుత్రులు మరుత్తులైనారని నీవు చెప్పియున్నావు గదా! అయితే వీరు వాయుమార్గంలో చరించడానికి గల కారణమేమిటో తెలియజేయండి. పూర్వపు మన్వంతరాలలో మరుత్తులుగానున్నవారెవరు? ఈ వివరాలను కూడా నాకు తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రూయతాం పూర్వమరుతాముత్పత్తిం కథయామి తే ।
స్వాయంభువం సమారభ్య యావన్మన్వంతరం త్విదమ్ ॥3॥

నారదా! స్వాయంభువమనువునుండి వర్తమానకాలపు మనువు వరకు గల మన్వంతరాలలో మరుత్తులు ఎవరెవరున్నారో వివరంగా చెబుతున్నాను, శ్రద్ధగా విను.

స్వాయంభువస్య పుత్రోఽభూన్మనోర్నామ ప్రియవ్రతః ।
తస్యాసీత్ సవనో నామ పుత్రస్త్రైలోక్యపూజితః ॥4॥

స చానపత్యో దేవర్షే నృపః ప్రేతగతిం గతః ।
తతోఽరుదత్తస్య పత్నీ సుదేవా శోకవిహ్వలా ॥5॥

న దదాతి తదా దగ్ధుం సమాలింగ్య స్థితా పతిమ్ ।
నాథ నాథేతి బహుశో విలపంతీ త్వనాథవత్ ॥6॥

తామన్తరిక్షాదశరీరిణీ వాక్ ప్రోవాచ మా రాజపత్నీహ రోదీః ।
యద్యస్తి తే సత్యమనుత్తమం తదా భవత్వయం తే పతినా సహాగ్నిః ॥7॥

స్వాయంభువ మనువుకుమారుడు ప్రియవ్రతుడను మనువు. అతని పుత్రుడు త్రిలోక పూజితుడు సవనుడు. ఆ సవనుడు అపుత్రకుడుగా మరణించగా ప్రేతగతిని పొందాడు. అంతట అతని భార్య సుదేవ శోకవిహ్వలయై రోదిస్తోంది. భర్త శరీరాన్ని దహనం చేయనీయకుండా ఆలింగనం చేసికొని కూర్చున్నది. నాథా! నాథా! అంటూ ఆ సతి అనాథ వలె విలపిస్తూ ఉండగా అంతరిక్షంనుండి ఒక అశరీరవాణి ఓ కల్యాణీ! విచారింపకుము. నీ పతిభక్తి నిజమైనదైతే నీభర్తతోబాటు అగ్నిలో ప్రవేశించు అని ఆదేశించిది.

సా తాం వాణీమన్తరిక్షాన్నిశమ్య ప్రోవాచేదం రాజపుత్రీ సుదేవా ।
శోచామ్యేనం పార్థివం పుత్రహీనం నైవాత్మానం మందభాగ్యం విహఙ్గ ॥8॥

సోఽథాబ్రవీన్మా రుదస్వాయతాక్షి పుత్రాస్త్వత్తో భూమిపాలస్య సప్త ।

భవిష్యన్తి వహ్నిమారోహ శీఘ్రం సత్యం ప్రోక్తం శ్రద్దధత్స్వ త్వమద్య ॥9॥

అంతరిక్షంనుండి వచ్చిన అశరీరవాణిని రాజపుత్రియైన సుదేవ విని, "నేను నాకోసం విలపించడం లేదు. నా భర్త పుత్రహీనుడైనందులకే రోదిస్తున్నా"నని పలికింది. అంతట నభోవాణి "ఓ విశాలాక్షీ! ఏడువకు! వెంటనే నీవు చితినెక్కు. నీకు నీ భర్తవలన ఏడుగురు పుత్రులు కలుగుతారు. ఇది సత్యం. నా మాటమీద నమ్మకముంచి వెంటనే అగ్నినారోహించు"మని మరలా నభోవాణి పలికింది.

ఇత్యేవముక్తా ఖచరేణ బాలా చితౌ సమారోప్య పతిం వరార్హమ్ ।
హుతాశమాసాహ్య పతివ్రతా తం సంచింతయన్తీ జ్వలనం ప్రపన్నా ॥10॥

తతో ముహూర్తాన్నృపతిః శ్రియాయుతః సముత్తస్థౌ సహితో భార్యయాఽసౌ ।
సముత్పపాతాథ స కామచారీ సమం మహిష్యా చ సునాభపుత్ర్యా ॥11॥

తస్యాంబరే నారద పార్థివస్య జాతా రజోగా మహిషీ తు గచ్ఛతః ।
స దివ్యయోగాత్ ప్రతిసంస్థితోఽంబరే భార్యాసహాయో దివసాని పంచ ॥12॥

తతస్తు షష్ఠేఽహని పార్థివేన ఋతుర్న వంధ్యోఽద్య భవేద్విచింత్య ।
రరామ తన్వ్యా సహ కామచారీ తతోఽమ్బరాత్ ప్రాచ్యవతాస్య శుక్రమ్ ॥13॥

శుక్రోత్సర్గావసానే తు నృపతిర్భార్యయా సహ ।
జగామ దివ్యయా గత్యా బ్రహ్మలోకం తపోధన ॥ 14॥

తదమ్బరాత్ ప్రచలితమభ్రవర్ణం శుక్రం సమానా నలినీ వపుష్మతీ ।
చిత్రా విశాలా హరితాలినీ చ సప్తర్షిపత్న్యో దదృశుర్యథేచ్ఛయా ॥15॥

నభోవాణి పలుకులు విన్నంతనే సుదేవ తనభర్త పవిత్రదేహాన్ని చితిమీద పెట్టి, భర్తనే ధ్యానిస్తూ, దాని మీదనే తాను కూడా కూర్చొని అగ్నికి ఆహుతి అయ్యింది. తదనంతరం ముహూర్తకాలంలో ఆ రాజు భార్యతో కూడా చితినుండి పైకి లేచి ఆకాశానికి ఎగిరిపోయాడు. అక్కడ కామగమనంతో ఆ సునాభకుమార్తెయైన సుదేవతో సంచరిస్తూ ఉండగా ఆమె ఋతుమతి అయ్యింది. నారదా! అంత తన దివ్యశక్తి వల్ల భార్యాసహితుడై ఆ నృపతి ఆకాశంలోనే ఐదు దినాలు ఉండిపోయాడు. ఆరవనాడు ఋతుస్నాత అయిన తరువాత ఆ ఋతుస్రావం వ్యర్థం కాకూడదనే భావనతో ఆ సుందరితో ఆ రాజు యథేచ్ఛగా రమించాడు. ఫలితంగా అతనికి వీర్యస్ఖలనమై, అది భూమి మీద పడిపోయింది.

ఓ తపోధనా! శుక్రం అలా జారిపడిపోగానే ఆ రాజు సపత్నీకుడై దివ్యగమనంతో బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు. ఆ విధంగా ఆకాశంనుండి జారిన ఆకాశవర్ణపు శుక్రాన్ని సమాన, నళిని, వపుష్మతి, చిత్ర, విశాల, హరిత, అలిని అనే సప్తర్షుల భార్యలు కోరికతో దర్శించారు.

తద్దృష్ట్వా పుష్కరే న్యస్తం ప్రత్యైచ్ఛన్త తపోధన ।
మన్యమానాస్తదమృతం సదా యౌవనలిప్సయా ॥16॥

తతః స్నాత్వా చ విధివత్ సంపూజ్య తాన్ నిజాన్ పతీన్ ।
పతిభిః సమనుజ్ఞాతాః పపుః పుష్కరసంస్థితమ్ ॥17॥

ఓ తపోధనా! అది ఒక పద్మంలో పడియుండగా దానిని వారు అమృతమని భ్రమించారు. ఆ ఋషిపత్నులు ఎల్లప్పుడు జవ్వనులుగా ఉండాలనే కోరికతో అమృతమని భ్రమపడి ఆ రాజశుక్రాన్ని త్రాగాలని నిశ్చయించుకున్నారు. వారు ఆ విషయం తమ భర్తలతో చెప్పి, వారి అనుమతితో యథావిధిగా స్నానాలుచేసి, భర్తలను పూజించి, కమలంలోని ఆ శుక్రాన్ని ఏడుగురు త్రాగారు.

తచ్ఛుక్రం పార్థివేన్ద్రస్య మన్యమానాస్తదాఽమృతమ్ ।
పీతమాత్రేణ శుక్రేణ పార్థివేంద్రోద్భవేన తాః ॥18॥

బ్రహ్మతేజో విహీనాస్తా జాతాః పత్న్యస్తపస్వినామ్ ।
తతస్తు తత్యజుః సర్వే సదోషాస్తాశ్చ పత్నయః ॥19॥

సుషువుః సప్తతనయాన్ రుదంతో భైరవం మునే ।
తేషాం రుదితశబ్దేన సర్వమాపూరితం జగత్ ॥20॥

అథాజగామ భగవాన్ బ్రహ్మా లోకపితామహః ।
సమభ్యేత్యాబ్రవీద్ బాలాన్ మా రుదధ్వం మహాబలాః ॥21॥

మరుతో నామ యూయం వై భవిష్యధ్వం వియచ్చరాః ।
ఇత్యేవముక్త్వా దేవేశో బ్రహ్మా లోకపితామహః ॥22॥

తానాదాయ వియచ్చారీ మారుతానాదిదేశ హ ।
తే త్వాసన్ మరుతస్త్వాద్యా మనోః స్వాయంభువేఽన్తరే ॥23॥

పార్థివేంద్రుని శుక్రాన్ని అమృతమనే భావనతో ఆ తపస్వుల భార్యలు త్రాగినంతనే వారు తమ బ్రహ్మతేజాన్ని కోల్పోయారు. ఆ మునిపత్నులు ఏడుగురు ఏడుగురు కుమారులను కన్నారు. ఆ విధంగా దూషితశీలలైన తమ భార్యలను సప్తర్షులు వదలివేశారు. మునిపత్నులు ప్రసవించిన ఏడుగురు కుమారులు భయంకరంగా రోదించసాగారు. ఓ నారదమునీ! వారి రోదనధ్వని జగత్తంతా నిండిపోయింది. అంతట అచటకు లోకపితామహుడైన బ్రహ్మవచ్చి, రోదిస్తున్న బాలురతో ఓ మహాబలులారా! ఏడవకండి! ఏడవకండి! మీరు మరుత్తులనే పేరుతో

ఆకాశగాములవుతారు అని చెప్పి వారిని తనతో కొనిపోయి ఆకాశగామియై వారిని మరుత్తులుగా ప్రకటించాడు. నారదా! మొట్టమొదటి స్వాయంభువమన్వంతరంలో వెలసిన ఆదిమరుత్తులు వారే.

స్వారోచిషే తు మరుతో వక్ష్యామి శృణు నారద ।
స్వారోచిషస్య పుత్రస్తు శ్రీమానాసీత్ క్రతుధ్వజః ॥24॥

తస్య పుత్రాభవన్ సప్త సప్తార్చిః ప్రతిమా మునే ।
తపోఽర్థం తే గతాః శైలం మహామేరుం నరేశ్వరాః ॥25॥

ఓ నారదా! ఇక స్వారోచిష మన్వంతరంలోని మరుత్తుల కథ విను. స్వారోచిషమనువు పుత్రుడు శ్రీమంతుడైన క్రతుధ్వజుడు. అతనికి అగ్నిసమానులైన ఏడుగురు కుమారులు జన్మించారు. వారు తపస్సు చేయడానికి, మహామేరుపర్వతానికి వెళ్లారు.

ఆరాధయంతో బ్రహ్మాణం పదమైంద్రమభీప్సవః ।
తతో విపశ్చిన్నామాథ సహస్రాక్షో భయాతురః ॥26॥

పూతనామప్సరోముఖ్యాం ప్రాహ నారద వాక్యవిత్ ।
గచ్ఛస్వ పూతనే శైలం మహామేరుం విశాలినమ్ ॥27॥

తత్ర తప్యన్తి హి తపః క్రతుధ్వజసుతా మహత్ ।
యథా హి తపసో విఘ్నం తేషాం భవతి సుందరి ॥28॥

తథా కురుష్వ మా తేషాం సిద్ధిర్భవతు సున్దరి ।
ఇత్యేవముక్తా శక్రేణ పూతనా రూపశాలినీ ॥29॥

తత్రాజగామ త్వరితా యత్ర తప్యన్త తే తపః ।

ఓ నారదా! ఇంద్రపదవిని కాంక్షించి, క్రతుధ్వజుని కుమారులు బ్రహ్మనుగూర్చి తపస్సు చేయడం, సహస్రాక్షుడు తెలిసికొని, భయపడి, అప్సరసలలో శ్రేష్ఠురాలైన పూతననుచూచి ఇలా పలికాడు. "ఓ సుందరీ!. పూతనా! నీవు వెంటనే మహామేరుశైలానికి వెళ్ళు. అక్కడ క్రతుధ్వజుని కుమారులు కఠోరతపస్సు చేస్తున్నారు. నీకు తోచిన యుక్తులన్నీ ప్రయోగించి, వారికి ఏ విధంగానైనా తపోవిఘ్నం కలిగించి తిరిగిరా!. నీకు సిద్ధికలుగుగాక!" ఇంద్రుని ఈ ఆదేశాన్ని తలదాల్చి రూపశాలినియైన పూతన త్వరగా ఆ రాజకుమారులు తపస్సు చేస్తున్న ప్రదేశానికి వెళ్ళింది.

ఆశ్రమస్యావిదూరే తు నదీ మన్దోదవాహినీ ॥30॥

తస్యాం స్నాతుం సమాయాతాః సర్వ ఏవ సహోదరాః ।
సాఽపి స్నాతుం సుచార్వఙ్గీ త్వవతీర్ణా మహానదీమ్ ॥31॥

దదృశుస్తే నృపాః స్నాతాం తతశ్చుక్షుభిరే మునే ।
తేషాం చ ప్రాచ్యవచ్ఛుక్రం తత్పపౌ జలచారిణీ ॥32॥

శంఖినీ గ్రాహముఖ్యస్య మహాశంఖస్య వల్లభా ।
తేఽపి విభ్రష్టతపసో జగ్మూ రాజ్యం తు పైతృకమ్ ॥33॥

సా చాప్సరాః శక్రమేత్య యాథాతథ్యం న్యవేదయత్ ।

ఆ ఆశ్రమానికి దగ్గరగా ఒక నది మెల్లగా ప్రవహిస్తోంది. ఆ ఏడు మంది సోదరులు స్నానార్థం ఆ నదికి వెళ్ళగా అదే వేళకు చక్కని అంగసౌష్ఠవంతో అలరారే పూతన కూడా నీటిలో దిగి స్నానం చేయడం మొదలుపెట్టింది. ఓ నారదా! ఆ అప్సర స్నానం చేస్తుండగా ఆమె సౌందర్యాన్ని చూడగానే రాజకుమారులందరి మనస్సులు వికారానికి లోనై, వారందరి వీర్యం స్ఖలనమై, నీటిలో పడిపోయింది. దానిని ఆ నీటిలో నివసిస్తున్న మకర రాజైన మహాశంఖుని భార్య శంఖిణి మ్రింగింది. అంతట వారు తపోభ్రష్టులై తమ రాజ్యానికి తిరిగి వెళ్ళారు. పూతనాది అప్సరసలు ఇంద్రుని వద్దకు వెళ్ళి, యథాతథంగా జరిగినదంతా చెప్పి పోయారు.

తతో బహుతిథే కాలే సా గ్రాహీ శంఖరూపిణీ ॥ 34॥

సముద్ధృతా మహాజాలైర్మత్స్యబంధేన మానినీ ।
స తాం దృష్ట్వా మహాశంఖీం స్థలస్థాం మత్స్యజీవికః ॥35॥

నివేదయామాస తదా క్రతుధ్వజసుతేషు వై ।
తథాఽభ్యేత్య మహాత్మానో యోగినో యోగధారిణః ॥36॥

నీత్వా స్వమందిరం సర్వే పురవాప్యాం సముత్సృజన్ ।
తతః క్రమాచ్ఛంఖినీ సా సుషువే సప్త వై శిశూన్ ॥37॥

జాతమాత్రేషు పుత్రేషు మోక్షభావమగాచ్చ సా ।
అమాతృపితృకా బాలా జలమధ్యవిహారిణః ॥38॥

స్తన్యార్థినో వై రురుదురథాభ్యాగాత్ పితామహః ।
మా రుదధ్వమితీత్యాహ మరుతో నామ పుత్రకాః ॥39॥

యూయం దేవా భవిష్యధ్వం వాయుస్కన్ధవిచారిణః ।
ఇత్యేవముక్త్వాథాదాయ సర్వాంస్తాన్ దైవతాన్ ప్రతి ॥40॥

నియోజ్య చ మరున్మార్గే వైరాజం భవనం గతః ।
ఏవమాసంశ్చ మరుతో మనోః స్వారోచిషేఽన్తరే ॥41॥

ఆ పిమ్మట చాలాకాలం తరువాత శంఖరూపంలోనున్న ఆడమొసలి జాలరివాళ్ళ పెద్దవలలో చిక్కింది. వారు విలక్షణమైన ఆ మొసలిని బయట పడవైచి, ఆ విషయం క్రతుధ్వజుని కుమారులకు తెలియజేశారు.

యోగులైన ఆ మహాత్ములందరు ఆలోచించుకుని దానిని తమ గృహ ఆవరణంలోనున్న బావిలో వదిలారు. తదనంతరం క్రమంగా ఆ శంఖిణి ఏడుగురు శిశువులను ప్రసవించి వెంటనే దేహాన్ని విడిచింది. తల్లిదండ్రులు లేని ఆ బాలురు స్తన్యపానం కోసం బావిలో బిగ్గరగా రోదిస్తూ ఉండగా వారివద్దకు పితామహుడు వచ్చి పుత్రులారా! ఏడవకండి. మీరిప్పటినుండి మరుత్తులనే పేరుతో వాయుస్కంధాలమీద సంచరిస్తూ, దేవతలౌతారని చెప్పి వారిని తనతో తీసికొనిపోయి, వాయుమార్గాన వారిని వదలి, తన లోకానికి వెళ్ళిపోయాడు. ఈ విధంగా స్వారోచిష మన్వంతరంలో మరుత్తులు వెలిశారు.

ఉత్తమే మరుతో యే చ తాన్ శృణుష్వ తపోధన ।
ఉత్తమస్యాన్వవాయే తు రాజాసీన్నిషధాధిపః ॥42॥

వపుష్మానితి విఖ్యాతో వపుషా భాస్కరోపమః ।
తస్య పుత్రో గుణశ్రేష్ఠో జ్యోతిష్మాన్ ధార్మికోఽభవత్ ॥43॥

స పుత్రార్థీ తపస్తేపే నదీం మన్దాకినీమను ।
తస్య భార్యా చ సుశ్రోణీ దేవాచార్యసుతా శుభా ॥44॥

తపశ్చరణయుక్తస్య బభూవ పరిచారికా ।
సా స్వయం ఫలపుష్పాంబుసమిత్కుశం సమాహరత్ ॥45॥

చకార పద్మపత్రాక్షీ సమ్యక్ చాతిథిపూజనమ్ ।
పతిం శుశ్రూషమాణా సా కృశా ధమనిసన్తతా ॥46॥

తేజోయుక్తా సుచార్వఙ్గీ దృష్టా సప్తర్షిభిర్వనే ।
తాం తథా చారుసర్వాఙ్గీం దృష్ట్వాఽథ తపసా కృశామ్ ॥47॥

పప్రచ్ఛుస్తపసో హేతుం తస్యాస్తద్భర్తురేవ చ ।
సాఽబ్రవీత్ తనయార్థాయ ఆవాభ్యాం వై తపః క్రియా ॥48॥

తే చాస్యై వరదా బ్రహ్మన్ జాతాః సప్తమహర్షయః ।
వ్రజధ్వం తనయాః సప్త భవిష్యన్తి న సంశయః ॥49॥

యువయోర్గుణసంయుక్తా మహర్షీణాం ప్రసాదతః ।
ఇత్యేవముక్త్వా జగ్ముస్తే సర్వ ఏవ మహర్షయః ॥50॥

ఓ తపోధనా! ఉత్తముడు మనువుగానున్న కాలంలోని మరుత్తుల జన్మవిధానం చెబుతున్నాను, వినుము. ఉత్తమ మన్వంతరంలో నిషధ దేశాధిపతి, సూర్యసమానతేజుడు, వపుష్మానుడనేవాడు రాజ్యం ఏలేవాడు. అతనికి గుణవంతుడు, ధార్మికుడునైన పుత్రుడు జ్యోతిష్మంతుడనేవాడు ఉండేవాడు. అతడు పుత్రుల కొరకై మందాకినీ నదీతీరాన తపస్సు చేస్తూ ఉండగా దేవగురువు పుత్రికయైన సుందరి కూడా భర్తకు పరిచర్య చేస్తూ తపోజీవనం గడపసాగింది. ఫలపుష్ప సమిధలు సమకూర్చుతూ, అతిథిసత్కారాలు చేస్తూ, అరణ్యావాసం చేయడం వల్ల ఆమె

కృశించి, శల్యమై పోయింది. తపస్తేజంతో వెలుగుతూ కృశించి వనంలో తిరుగుతూ వున్న ఆమెను ఒకమారు సప్తర్షులు చూసి, ఈ అరణ్యంలో ఇలా కఠోరతపస్సు చేయడానికి కారణమేమిటని వారిని ప్రశ్నించారు. అందులకు ఆమె తానూ తనభర్త తనయులకొరకు తపోదీక్షలోనున్నామని చెప్పగా సప్తర్షులు కరుణించి, "అమ్మా! మీరు ఇంటికి వెళ్ళండి. మీకు ఏడుగురు కుమారులు కలుగుతారు. మీ సద్గుణాలకు మహర్షులమైన మా అనుగ్రహం తోడై, మీ కోరిక నెరవేరుతుంది" అని పలికి మహర్షులందరు వెళ్ళిపోయారు.

స చాపి రాజర్షిరగాత్ సభార్యో నగరం నిజమ్ ।
తతో బహుతిథే కాలే సా రాజ్ఞో మహిషీ ప్రియా ॥51॥

అవాప గర్భం తన్వఙ్గీ తస్మాన్నృపతిసత్తమాత్ ।
గుర్విణ్యామథ భార్యాయాం మమారాసౌ నరాధిపః ॥52॥

సా చాప్యారోఢుమిచ్ఛన్తీ భర్తారం వై పతివ్రతా ।
నివారితా తదామాత్యైర్న తథాపి వ్యతిష్ఠత ॥53॥

సమారోప్యాథ భర్తారం చితాయామారుహచ్చ సా ।
తతోఽగ్నిమధ్యాత్ సలిలే మాంసపేశ్యపతన్మునే ॥54॥

సాఽమ్భసా సుఖశీతేన సంసిక్తా సప్తధాఽభవత్ ।
తేఽజాయన్తాథ మరుత ఉత్తమాస్యాన్తరే మనోః ॥55॥

అంతట ఆ రాజర్షి భార్యతో సహా తన నగరానికి వెళ్ళిపోయాడు. తదనంతరం చాలాకాలం తరువాత ఆ రాజుభార్య గర్భం ధరించింది. తన భార్య గర్భిణిగానున్న సమయంలోనే ఆ మహారాజు మృతి చెందాడు. పతివ్రతయైన ఆ రాజుభార్య అమాత్యులు వలదని వారించినా అంగీకరించక, భర్తచితిపై తాను కూడా సహగమనం చేయడానికి నిర్ణయించుకుంది. ఆమె తన భర్తను చితిపైనుంచి, తాను కూడా చితిపై అగ్నిలో ప్రవేశించింది. ఓ మహర్షీ! అంతట అగ్నిమధ్యం నుండి ఆమె గర్భంలోని మాంసఖండం ఎగిరివచ్చింది. ఆ మాంసఖండం నీటిలో పడి, ఆ శైత్యానికి అది ఏడు భాగాలై, మరుత్తులుగా ఉత్తముని మన్వంతరంలో ఉద్భవించారు.

తామసస్యాన్తరే యే చ మరుతోఽప్యభవన్ పురా ।
తానహం కీర్తయిష్యామి గీతనృత్యకలిప్రియ ॥56॥

తామసస్య మనోః పుత్రో ఋుతధ్వజ ఇతి శ్రుతః ।
స పుత్రార్థీ జుహావాగ్నౌ స్వమాంసం రుధిరం తథా ॥57॥

అస్థీని రోమకేశాంశ్చ స్నాయుమజ్జాయకృద్ఘనమ్ ।
శుక్రం చ చిత్రకో రాజా సుతార్థీ ఇతి నః శ్రుతమ్ ॥58॥

సప్తస్వేవార్చిషు తతః శుక్రపాతాదనన్తరమ్ ।
మా మా క్షిపస్వేత్యభవచ్ఛబ్దః సోఽపి మృతో నృపః ॥59॥

ఓ నారదా! తామసుని మన్వంతరంలో మరుత్తులుగా జన్మించినవారి గాథను శ్రద్ధగా విను. తామసమనువుకుమారుడు ఋతధ్వజుడని ప్రఖ్యాతి చెందినవాడు కలడు. అతడు పుత్రార్థియై యజ్ఞం ప్రారంభించి, ఆ అగ్నిలో తమ రక్త మాంస అస్థి రోమ కేశ స్నాయువులు, మజ్జా యకృత్తు, చక్కని శుక్రం అన్నీ హోమం చేయసాగాడు. పుత్రార్థియై శుక్రం హోమం చేస్తుండగా శుక్రం అగ్నిలో పడుతున్న సమయంలో వద్దు! వద్దు! శుక్రం హోమం చేయవద్దు! అనే శబ్దం బయల్వెడలిన వెంటనే ఆ రాజు మృతుడయ్యాడు.

తతః తస్మాద్ధుతవహాత్ సప్తతత్తేజసోపమాః ।
శిశవః సమజాయన్త తే రుదన్తోఽభవన్ మునే ॥60॥

తేషాం తు ధ్వనిమాకర్ణ్య భగవాన్ పద్మసంభవః ।
సమాగమ్య నివార్యాథ స చక్రే మరుతః సుతాన్ ॥61॥

తే త్వాసన్ మరుతో బ్రహ్మంస్తామసే దేవతా గణాః ।

ఓ నారదా! అంతట హవ్యవాహనునినుండి ఆయనవంటి తేజస్సుతో ప్రకాశిస్తూ ఏడుగురు శిశువులు రోదిస్తూ బయటపడ్డారు. వారి ఏడుపు విని, పద్మసంభవుడు వచ్చి, ఏడ్పు మాన్పించి, వారిని మరుత్తులను గావించాడు. ఆ విధంగా తామసమన్వంతరంలో మరుద్దేవగణాలు వెలిశాయి.

యేఽభవన్ రైవతే తాంశ్చ శ్రుణుష్వ త్వం తపోధన ॥62॥

రైవతస్యాన్వవాయే తు రాజాసీద్రిపుజిద్వశీ ।
రిపుజిన్నామతః ఖ్యాతో న తస్యాసీత్ సుతః కిల ॥63॥

స సమారాధ్య తపసా భాస్కరం తేజసాం నిధిమ్ ।
అవాప కన్యాం సురతిం తాం ప్రగృహ్య గృహం యయౌ ॥64॥

ఓ తపోధనా! రైవతమన్వంతరంలోని మరుత్తుల జన్మప్రకారం చెబుతాను విను. రైవతుని వంశంలో శత్రుభయంకరుడగు రిపుజిత్తు అనే రాజు ఉండేవాడు. రిపుజిత్తు అనే పేరుతో ప్రఖ్యాతుడైన అతనికి సంతానం లేదు. ఆ రిపుజిత్తు తేజోనిధియైన భాస్కరుని ఉపాసించి సురతి అను పుత్రికను పొంది, ఇంటికి తీసికొని వెళ్ళాడు.

తస్యాం పితృగృహే బ్రహ్మన్ వసన్త్యాం స పితా మృతః ।
సాఽపి దుఃఖపరీతాంగీ స్వాం తనుం త్యక్తుముద్యతా ॥65॥

ఓ నారదా! తండ్రి ఇంటిలో ఆ బాలిక పెరుగుతూ ఉండగా తండ్రియైన రిపుజిత్తు మరణించాడు. ఆమె కూడా పితృవియోగం సహించలేక దేహత్యాగానికి ఉద్యుక్తురాలయ్యింది.

తతస్తాం వారయామాసుః ఋషయః సప్తమానసాః ।
తస్యామాసక్తచిత్తాస్తు సర్వ ఏవ తపోధనాః ॥66॥

ఓ తపోధనా! బ్రహ్మమానసపుత్రులైన సప్తర్షులు అందరూ వచ్చి, సురతి దేహత్యాగప్రయత్నాన్ని నివారించారు.

అపారయన్తీ తద్దుఃఖం ప్రజ్వాల్యాగ్నిం వివేశ హ ।
తే చాపశ్యన్త ఋషయస్తచ్చిత్తా భావితాస్తథా ॥67॥

తాం మృతామృషయో దృష్ట్వా కష్టం కష్టేతి వాదినః ।
ప్రజగ్ముర్జ్వలనాచ్చాపి సప్తాజాయన్త దారకాః ॥68॥

తే చ మాత్రా వినా భూతా రురుదుస్తాన్ పితామహః ।
నివారయిత్వా కృతవాన్ లోకనాథో మరుద్గణాన్ ॥

రైవతస్యాన్తరో జాతా మరుతోఽమీ తపోధన ।

ఇతర తపస్వులు కూడా ఆమెయందు ఎంతయో వాత్సల్యం కలిగియున్నారు. కాని ఆమె దుఃఖసాగరం భరించలేక చితి పేర్చుకొని అందులో దగ్ధమైపోయింది. ఆ విధంగా మరణించిన ఆమెను చూసి ఋషులందరు అయ్యో ఎంత కష్టం! ఎంత కష్టం! అని ఆక్రోశించారు. తగులబడుతున్న ఆమె శరీరాగ్నినుండి ఏడుగురు బాలకులు ఉద్భవించారు. తల్లిని కోల్పోయి, ఏడుస్తున్న వారిని విరించియు, లోకపతియునైన బ్రహ్మ మరుద్గణాలుగా నియమించాడు. ఓ తపోధనా! వారే రైవతమన్వంతరంలోని మరుత్తులు.

శృణుష్వ కీర్తయిష్యామి చాక్షుషస్యాన్తరే మనోః ॥70॥

ఆసీన్మంకిరితి ఖ్యాతస్తపస్వీ సత్యవాక్ శుచిః ।
సప్తసారస్వతే తీర్థే సోఽతప్యత మహత్తపః ॥71॥

విఘ్నార్థం తస్య తుషితా దేవాః సంప్రేషయన్ వపుమ్ ।
సా చాభ్యేత్య నదీతీరే క్షోభయామాస భామినీ ॥72॥

ఓ నారదా! ఇక చాక్షుషమన్వంతరంలోని మరుత్తుల వృత్తాంతం విను. ఆ కాలంలో సప్తసారస్వతతీర్థంలో సత్యవాది, శుచివ్రతుడునైన మంకి అనే తపోధనుడు ఘోరతపస్సులో నుండగా దానికి విఘ్నం కలిగించడానికి తుషితదేవతలు వపువు అనే సుందరిని నియోగించారు. ఆ భామిని నదీతీరాన చేరి, ఆయనకు మనోవికారం కలుగజేసింది.

తతోఽస్య ప్రాచ్యవచ్ఛుక్రం సప్తసారస్వతే జలే ।
తాం చైవాప్యశపన్ముగ్ధాం మునిర్మంకణకో వపుమ్ ॥73॥

గచ్ఛ లబ్ధాఽసి మూఢే త్వం పాపస్యాస్య మహత్ఫలమ్ ।
విధ్వంసయిష్యతి హయో భవతీం యజ్ఞసంసది ॥74॥

ఏవం శప్త్వా ఋషిః శ్రీమాన్ జగామాథ స్వమాశ్రమమ్ ।
సరస్వతీభ్యః సప్తభ్యః సప్త వై మరుతోఽభవన్ ॥75॥

ఏతత్తవోక్తా మరుతః పురా యథా జాతా వియద్వ్యాప్తికరా మహర్షే ।
యేషాం శ్రుతే జన్మని పాపహానిర్భవేచ్చ ధర్మాభ్యుదయో మహాన్ వై ॥76॥

అంతట అతని శుక్రం జారి సప్తసారస్వతజలాలలో పడిపోయింది. అందులకు మంకణకుడు ఆగ్రహోదగ్రుడై వపును చూసి గర్జిస్తూ ఓసీ మూఢురాలా! ఈ పాపానికి తగిన ఫలం తప్పక అనుభవిస్తావు. వెళ్ళు, నీవు యజ్ఞ సభావేదిక వద్దనుండగా ఒక గుణ్ఠం నిన్ను నాశనం చేస్తుందని శపించి, శ్రీమంతుడైన మహర్షి తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. ఆ సప్తసారస్వతీజలంలో నుండి ఏడుగురు మరుత్తులు జన్మించారు. ఓ నారదా! ఈ విధంగా పూర్వపు మన్వంతరాలలో ఆకాశవ్యాపకులైన మరుత్తులు జన్మించిన విధానాన్ని నీకు విపులంగా వివరించాను. వీరి జన్మగాథలు చక్కగా శ్రవణం చేసినచో వారి పాపం పరిహారమై, ధర్మాభ్యుదయం కూడా కలుగుతుంది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్య నారద సంవాదే శక్రచరితే మరుదుత్పత్తిర్నామ ద్విసప్తతితమోఽధ్యాయః॥72॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్య నారదసంవాదంలోని శక్రచరిత్రలో మరుత్తుల పుట్టుక అనే డెబ్బైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రిసప్తతితమోऽధ్యాయః - డెబ్బైమూడవ అధ్యాయం

కాలనేమివధః - కాలనేమివధ

పులస్త్య ఉవాచ - పులస్త్య మహర్షి పలికాడు.

ఏతదర్థం బలిర్దైత్యః కృతో రాజా కలిప్రియ ।
మంత్రప్రదాతా ప్రహ్లాదః శుక్రశ్చాసీత్ పురోహితః ॥1॥

ఓ కలిప్రియా!, నారదా! ఈ కారణం చేతనే బలిని దైత్యరాజును గావించారు. ప్రహ్లాదుడు మంత్రి అయ్యాడు. శుక్రాచార్యుడు పురోహితుడయ్యాడు.

జ్ఞాత్వాऽభిషిక్తం దైతేయం విరోచనసుతం బలిమ్ ।
దిదృక్షవః సమాయాతాః సమయాః సర్వ ఏవ హి ॥2॥

తానాగతాన్నిరీక్ష్యైవ పూజయిత్వా యథాక్రమమ్ ।
పప్రచ్ఛ కులజాన్ సర్వాన్ కిం ను శ్రేయస్కరం మమ ॥3॥

విరోచనసుతుడైన బలి దైత్యరాజ్యాభిషిక్తుడు కావడం వినగానే మయదానవునితో సహా రాక్షసులందరు తమ ప్రభువును దర్శించడానికి వచ్చి చేరారు. అలా వచ్చిన దైత్యులనందరిని యథావిధిగా పూజించి, వినయశీలియైన బలిరాజేంద్రుడు నాకు శ్రేయస్కరమైన కర్తవ్యాన్ని చెప్పండని అర్థించాడు.

తమూచుః సర్వ ఏవైనం శృణుష్వ సురమర్దన ।
యత్తే శ్రేయస్కరం కర్మ యదస్మాకం హితం తథా ॥4॥

పితామహస్తవ బలీ ఆసీద్దానవపాలకః ।
హిరణ్యకశిపుర్వీరః స శక్రోऽభూజ్జగత్త్రయే ॥5॥

అంతట ఆ దైత్యులందరు బలితో ఇలా పలికారు. "సురమర్దనా! శ్రద్ధగా వినుము. మీకు, మాకు మనవారందరకు శ్రేయస్కరమైన విషయం చెబుతున్నాము. నీ పితామహుడు హిరణ్యకశిపుడు సర్వదైత్యపాలకుడై, ముల్లోకాలకు ఇంద్రుడై యున్నాడు.

తమాగమ్య సురశ్రేష్ఠో విష్ణుః సింహవపుర్ధరః ।
ప్రత్యక్షం దానవేంద్రాణాం నఖైస్తం హి వ్యదారయత్ ॥6॥

అంతట సురశ్రేష్ఠుడైన విష్ణువు సింహరూపంలో వచ్చి, అందరూ చూస్తుండగా హిరణ్యకశిపుని గోళ్ళతో చీల్చి సంహరించాడు.

అపకృష్టం తథా రాజ్యమంధకస్య మహాత్మనః ।
తేషామర్థే మహాబాహో శంకరేణ త్రిశూలినా ॥7॥

తథా తవ పితృవ్యోऽపి జంభః శక్రేణ ఘాతితః ।
కుజంభో విష్ణునా చాపి ప్రత్యక్షం పశువత్ తవ ॥8॥

శంభుః పాకో మహేంద్రేణ భ్రాతా తవ సుదర్శనః ।
విరోచనస్తవ పితా నిహతః కథయామి తే ॥9॥

మహాత్ముడైన అంధకుని రాజ్యాన్ని అపహరించేందుకు త్రిశూలియైన శంకరుడు కుట్ర పన్ని, అతనిని సంహరింపజేశాడు. అట్లే నీ పినతండ్రి జంభుని ఇంద్రుడు, కుజంభుని విష్ణువు పశువులమాదిరిగా వధించారు. మహేంద్రుడు శంభు, పాకదైత్యులను, నీ సోదరుడైన సుదర్శనుని, నీ తండ్రియైన విరోచనుని హతమార్చాడు. ఈ అత్యాచారాలన్నీ నీకు జ్ఞాపకం చేస్తున్నాము" అని పలికారు.

శ్రుత్వా గోత్రక్షయం బ్రహ్మన్ కృతం శక్రేణ దానవః ।
ఉద్యోగం కారయామాస సహ సర్వైర్మహాసురైః ॥10॥

రథైరన్యే గజైరన్యే వాజిభిశ్చాపరేఽసురాః ।
పదాతయస్తథైవాన్యే జగ్ముర్యుద్ధాయ దైవతైః ॥11॥

మయోఽగ్రే యాతి బలవాన్ సేనానాథో భయంకరః ।
సైన్యస్య మధ్యే చ బలిః కాలనేమిశ్చ పృష్ఠతః ॥12॥

వామపార్శ్వమవష్టభ్య శాల్వః ప్రథితవిక్రమః ।
ప్రయాతి దక్షిణం ఘోరం తారకాఖ్యో భయంకరః ॥13॥

దానవానాం సహస్రాణి ప్రయుతాన్యర్బుదాని చ ।
సంప్రయాతాని యుద్ధాయ దేవైః సహ కలిప్రియ! ॥14॥

ఓ నారదా! ఆ విధంగా ఇంద్రుని కారణంగా జరిగిన తన వంశనిర్మూలన వివరాలన్నీ విని, బలి రాక్షసులందరను కూడదీసుకుని ప్రతీకారానికి ఉద్యమించాడు. వారంతా మహోత్సాహంతో రథాల మీద కొందరు, ఏనుగుల మీద కొందరు, గుఱ్ఱాలెక్కి కొందరు, పాదచారులై కొందరు మహాశస్త్రాస్త్రాలు ధరించి, యుద్ధానికి బయలుదేరారు. దేవతలతో తలబడడానికి బయలుదేరిన రాక్షసబలాన్ని ముందుండి సేనాపతి భయంకరాకారుడు మయదానవుడు, మధ్యభాగాన బలి, వెనుకనుండి కాలనేమి, ఎడమపార్శ్వాన మహావీరుడైన శాల్వుడు, కుడివైపున మహాభయంకరుడైన తారకాసురుడు నడిపించారు. ఆ దానవవీరులు వేలు, లక్షలు, అర్బుదాల సంఖ్యలో భూమ్యాకాశాలు ఆక్రమించి, ప్రచండఘోషతో బయలుదేరారు.

శ్రుత్వాఽసురాణాముద్యోగం శక్రః సురపతిః సురాన్ ।
ఉవాచ యోగం దైత్యానాం యోద్ధుం సబలసంయుతః ॥15॥

ఇత్యేవముక్త్వా వచనం సురరాట్ స్యందనం బలీ ।
సమారురోహ భగవాన్ యతమాతలివాజినమ్ ॥16॥

రాక్షసులు యుద్ధానికి వస్తున్న విషయం విని, దేవరాజైన ఇంద్రుడు మనం కూడా మన సైన్యాలతో వెళ్ళి, దానవులతో పోరాడుదాం రండని పురిగొల్పాడు. ఇంద్రుడు వెంటనే మాతలి తీసికొని వచ్చిన రథాన్ని అధిరోహించాడు.

సమారూఢే సహస్రాక్షే స్యన్దనం దేవతాగణాః ।
స్వం స్వం వాహనమారుహ్య నిశ్చేరుర్యుద్ధకాంక్షిణః ॥17॥

ఆదిత్యా వసవో రుద్రాః సాధ్యా విశ్వేఽశ్వినౌ తథా ।
విద్యాధరా గుహ్యకాశ్చ యక్షరాక్షసపన్నగాః ॥18॥

రాజర్షయస్తథా సిద్ధా నానాభూతాశ్చ సంహతాః ।
గజానన్యే రథానన్యే హయానన్యే సమారుహన్ ॥19॥

విమానాని చ శుభ్రాణి పక్షివాహ్యాని నారద ।
సమారుహ్యాద్రవన్ సర్వే యతో దైత్యబలం స్థితమ్ ॥20॥

ఇంద్రుడు రథారూఢుడు కాగానే ఇతర దేవతలందరు తమతమ వాహనాలను అధిరోహించి, యుద్ధకాంక్షతో బయలుదేరారు. ఆదిత్యులు, వసువులు, రుద్రులు, సాధ్యులు, విశ్వేదేవతలు, అశ్వినీదేవతలు, విద్యాధరులు, గుహ్యకులు, యక్షులు, రాక్షసులు, పన్నగులు, రాజర్షులు, సిద్ధులు, నానాభూతగణాలు ఏనుగుల మీద కొందరు, రథాల మీద కొందరు, అశ్వాల మీద కొందరు, విమానాలపై కొందరు, పక్షివాహనాలను అధిరోహించి కొందరు, బయలుదేరి, దైత్యసైన్యాలున్న చోటుకు వెళ్ళారు.

ఏతస్మిన్నన్తరే శ్రీమాన్ వైనతేయః సమాగతః ।
తస్మిన్విష్ణుః సురశ్రేష్ఠ అధిరుహ్య సమభ్యగాత్ ॥21॥

నారదా! ఇంతలో ఈ విషయం తెలిసికొని వినతాసుతుడైన గరుడుడు, గరుడారూఢుడై సురశ్రేష్ఠుడైన విష్ణువు కూడ వచ్చి చేరారు.

తమాగతం సహస్రాక్షస్త్రైలోక్యపతిమవ్యయమ్ ।
వవంద మూర్ధ్నావనతః సహ సర్వైః సురోత్తమైః ॥22॥

తతోఽగ్రే దేవసైన్యస్య కార్తికేయో గదాధరః ।
పాలయఞ్జఘనం విష్ణుర్యాతి మధ్యే సహస్రదృక్ ॥23॥

వామం పార్శ్వమవష్టభ్య జయన్తో వ్రజతే మునే ।
దక్షిణం వరుణః పార్శ్వమవష్టభ్యావ్రజద్ బలీ ॥24॥

తతోఽమరాణాం పృతనా యశస్వినీ స్కన్దేంద్రవిష్ణ్వంబుపసూర్యపాలితా ।
నానాస్త్రశస్త్రోద్యతదోఃసమూహా సమాససాదారిబలం మహీధ్రే ॥25॥

ఉదయాద్రితటే రమ్యే శుభే సమశిలాతలే ।
నిర్వృక్షే పక్షిరహితే జాతో దేవాసురో రణః ॥26॥

సంనిపాతస్తయో రౌద్రః సైన్యయోరభవన్మునే ।
మహీధరోత్తమే పూర్వం యథా వానరహస్తినోః ॥27॥

వచ్చిన త్రిలోకనాథుని చూసి, ఇంద్రుడు దేవతలందరితో కలసి, వినమ్రపూర్వకంగా ప్రణామాలు గావించాడు. దేవసేనాసమూహానికి ముందు గదాధారియై స్కందుడు నడిచాడు. మధ్యభాగాన ఇంద్రుడు, జఘనభాగాన విష్ణువు, వామభాగాన జయంతుడు, కుడివైపున మహాబలశాలి వరుణుడు సేనా సంచాలనం గావించారు. ఆ విధంగా స్కంద, ఇంద్ర, విష్ణు, వరుణ భాస్కరులు రక్షిస్తూ ఉండగా యశస్వినియైన ఆ దైవసేన నానా ఆయుధాలతో ముస్తాబై ఉదయగిరి పార్శ్వాన చెట్టుచేమలు, పక్షిమృగాలు లేకుండా సమతలంగా అందంగానున్న శిలామైదానానికి చేరుకుంది. అంతట ఆ ప్రదేశంలో దేవాసురుల సైన్యాలు రెండు భయంకరంగా ఒకదానినొకటి ఢీకొనగా ప్రాచీనకాలంలో వానర గజాల మధ్య జరిగిన ఘోరసంగ్రామాన్ని తలపిస్తూ తుములయుద్ధం సాగింది.

రణరేణూ రథోద్ధూతః పింగలో రణమూర్ధని ।
సంధ్యాఽనురక్తః సదృశో మేఘః ఖే సురతాపస! ॥28॥

ఓ దేవమునీ! యుద్ధానికి ముందుభాగాన రథాల వేగానికి రేగిన ఎఱ్ఱని ధూళిమేఘాలు సంధ్యాకాలంలో పడమటి దిశను కమ్ముకునే అరుణమేఘాలను మరపింపజేశాయి.

తదాసీత్ తుములం యుద్ధం న ప్రాజ్ఞాయత కించన ।
శ్రూయతే త్వనిశం శబ్దశ్ఛింది భిన్ధీతి సర్వతః ॥29॥

తతో విశసనో రౌద్రో దైత్యానాం దైవతైః సహ ।
జాతో రుధిరనిష్యన్దో రజః సంయమనాత్మకః ॥30॥

ఆ సంకులసమరంలో ఏదీ సరిగా తెలియరాలేదు. కనిపించలేదు. కొట్టండి! చంపండి! పొడవండి! అనే భయంకరధ్వనులు తెరపి లేకుండా నలువైపులా వ్యాపించాయి. రోమహర్షకమైన ఆ యుద్ధంలో ఇరుపక్షాలలోను హతులైనవారి రుధిరధారలలో ఆ ధూళిమేఘాలు అణగిపోయాయి.

శాంతే రజసి దేవాద్యాస్తద్దానవబలం మహత్ ।
అభిద్రవన్తి సహితాః సమం స్కందేన ధీమతా ॥31॥

నిజఘ్నుర్దానవాన్ దేవాః కుమారభుజపాలితాః ।
దేవాన్ నిజఘ్నుర్దైత్యాశ్చ మయగుప్తాః ప్రహారిణః ॥32॥

తతోఽమృతరసాస్వాదాద్ వినా భూతాః సురోత్తమాః ।
నిర్జితాః సమరే దైత్యైః సమం స్కందేన నారద ॥33॥

వినిర్జితాన్ సురాన్ దృష్ట్వా వైనతేయధ్వజోఽరిహా ।
శార్ఙ్గమానమ్య బాణౌఘైర్నిజఘాన తతస్తతః ॥34॥

తే విష్ణునా హన్యమానాః పతత్రిభిరయోముఖైః ।
దైతేయాః శరణం జగ్ముః కాలనేమిం మహాసురమ్ ॥35॥

ఆ విధంగా ధూళి తగ్గగానే స్కందునివెంట దేవసైన్యాలన్నీ ఒక్కసారిగా రాక్షసుల మీద విరుచుకుపడ్డాయి. దేవసేనాపతి రక్షణలో దేవతలు దానవులను సంహరింపగా మయుని అండ చూసుకొని రాక్షసులు సురలను చెండాడసాగారు. ఓ నారదా! అంతవరకు అమృతపానానికి నోచుకోని దేవతలంతా స్కందునితో సహా రాక్షసుల ధాటికి నిలువలేక ఓటమిపాలయ్యారు. దేవతల ఓటమిని చూసి శత్రుహంత అయినట్టియు, గరుడధ్వజుడైనట్టియు శ్రీహరి తన శార్ఙ్గచాపాన్ని ఎక్కుపెట్టి బాణవర్షంతో నలువైపులా గల శత్రువులను సంహరింపసాగాడు. ఉక్కు మొనలతో, పిడుగులవలె తాకే ఆ బాణాలకు హతశేషులైన రక్కసులు వెన్నిచ్చి పారిపోయి మహాదైత్యుడైన కాలనేమిని శరణు పొందారు.

తేభ్యః స చాభయం దత్త్వా జ్ఞాత్వాஉజేయం చ మాధవమ్ ।
వివృద్ధిమగమద్ బ్రహ్మన్ యథా వ్యాధిరుపేక్షితః ॥36॥

యం యం కరేణ స్పృశతి దేవం యక్షం సకిన్నరమ్ ।
తం తమాదాయ చిక్షేప విస్తృతే వదనే బలీ ॥37॥

భయాతురులైన దానవులకు అభయమిచ్చి మాధవుడజేయుడని తెలిసికొనిన కాలనేమి చికిత్స చేయకుండా ఉపేక్షించిన జబ్బు మాదిరిగా తన శరీరాన్ని మాయతో పెంచసాగాడు. ఓ నారదా! అలా దేహాన్ని పెంచి, చేతికందిన దేవతలనందరిని వారు యక్షులైనా, కిన్నరులైనా, ఒడిసిపట్టి తన విశాలమైన నోటిలో వేసుకోసాగాడు.

సంరంభాద్దానవేంద్రో విమృదతి దితిజైః సంయుతో దేవసైన్యం
సేంద్రం సార్కం సచంద్రం కరచరణనఖైరస్త్రహీనోஉపి వేగాత్ ।

చక్రైర్వైశ్వానరాభైస్త్వవనిగగనయోస్తిర్యగూర్ధ్వం సమన్తాత్ ।
ప్రాప్తేஉన్తే కాలవహ్నేర్జగదఖిలమిదం రూపమాసీద్ దిధక్షోః ॥38॥

ఆ సంరంభంలో కాలనేమి రాక్షసుల సహాయంతో ఇంద్రచంద్రసూర్యాదులతో సహా దేవతలనందరిని చేతిలో ఆయుధమంటూ ఏదీ లేకపోయినా కాళ్ళతో, చేతులతో, గోళ్ళతో మర్దించడం మొదలుపెట్టాడు. వాడి దేహం ప్రళయకాలాన భూమ్యాకాశాలను భస్మం చేసే కాలాగ్నిచక్రంలాగ దుర్నిరీక్ష్యంగా వెలిగిపోసాగింది.

తం దృష్ట్వా వర్ధమానం రిపుమతిబలినం దేవగన్ధర్వముఖ్యాః
సిద్ధాః సాధ్యాశ్విముఖ్యా భయతరలదృశః ప్రాద్రవన్ దిక్షు సర్వే ।

ప్రోప్లాయన్తశ్చ దైత్యా హరిమమరగణైరర్చితం చారుమౌలిం ।
నానాశస్త్రాస్త్రపాతైర్విగలితయశసం చక్రురుత్సిక్తదర్పాః ॥39॥

ఆ విధంగా దిక్కులనన్నిటిని ఆక్రమిస్తూ పెరిగిపోతున్న ప్రబలశత్రువు దేహాన్ని చూసి దేవగంధర్వయక్షసిద్ధ సాధ్యాది సకలదేవతలు భయంతో వణకిపోతూ ఎటుబడితే అటు పారిపోసాగారు. దానితో గర్వంతో కనులు కానని దైత్యులు ఆనందంతో గంతులు వేస్తూ సర్వదేవతలచే అర్చింపబడు శ్రీహరి మీద తమ తమ నానారకాలైన శస్త్రాస్త్రాలు వర్షించి ఆయన యశస్సును కళంకితం చేయడానికి ఉపక్రమించారు.

తానిత్థం ప్రేక్ష్య దైత్యాన్ మయబలిపురగాన్ కాలనేమిప్రధానాన్
బాణైరాకృష్యశార్ఙ్గం త్వనవరతమురోభేదిభిర్వ్రజకల్పైః ।
కోపాదారక్తదృష్టిః సరథగజహయాన్ దృష్టినిర్ధూతవీర్యాన్
నారాచాఖ్యైః సుపుంఖైర్జలద ఇవ గిరీన్ ఛాదయామాస విష్ణుః ॥40॥

కాలనేమి అండతో మయుడు బలితో కలిసి అలా విజృంభించే రాక్షసులను చూచి క్రోధారుణ నేత్రాలతో నిప్పులు వర్షిస్తూ శార్ఙ్గధనుస్సు ఎక్కుపెట్టి శత్రుహృదయాలను చీల్చి చెండాడే పిడుగులవంటి బాణాలు పుంఖాను పుంఖాలుగా శ్రీహరి గుప్పించి, మేఘాలు పర్వతాలను కప్పివేసినట్లు రథగజహయాల సహితంగా శత్రువులను ముంచివేశాడు.

తైర్బాణైశ్ఛాద్యమాణా హరికరనుదితైః కాలదండప్రకాశై
ర్నారాచైరర్ధచంద్రైర్బలిమయపురగా భీతభీతాస్త్వరన్తః ।
ప్రారంభే దానవేంద్రం శతవదనమథో ప్రేషయత్ కాలనేమిం
స ప్రాయాద్దేవసైన్యప్రభుమమితబలం కేశవం లోకనాథమ్ ॥41॥

ఆయన చూపులకే శత్రువుల తేజం హరించుకుపోయింది. కాలదండాలవంటి అర్ధచంద్రబాణాలతో గుంపులుగట్టి మేఘాలు పర్వతాన్ని ఆక్రమించినట్లు ఆక్రమించగా ఆ ధాటికోర్వలేక భయాతురులై మయుడు బలి మొదలైనవారంతా వెనుకకు తగ్గి, బీభత్సం సృష్టిస్తున్న కాలనేమిని ముందుకు పంపారు. వాడు గట్టిగా అరుస్తూ లోకేశ్వరుడైన కేశవుని సమీపించాడు.

తం దృష్ట్వా శతశీర్షముద్యతగదం శైలేంద్రశృంగాకృతిమ్
విష్ణుః శార్ఙ్గమపాస్య సత్వరమథో జగ్రాహ చక్రం కరే ।
సోఽప్యేనం ప్రసమీక్ష్య దైత్యవిటపప్రచ్ఛేదనం మానినం
ప్రోవాచాథ విహస్య తం చ సుచిరం మేఘస్వనో దానవః ॥42॥

శ్రేష్ఠమైన పర్వతశిఖరం వలె గదను ధరించి తన మీదకు వస్తున్న కాలనేమిని చూసి, హరి ధనుస్సును వదలి వేగంగా చక్రం బట్టి నిలబడ్డాడు. దైత్యవృక్షమూలచేదకుడైన హరిని చూచి చాలాసేపు వికటాట్టహాసం చేసి ఆ రాక్షసుడు మేఘగర్జనధ్వనితో ఇలా పలికాడు.

అయం స దనుపుత్రసైన్యవిత్రాసకృద్రిపుః పరమకోపితః స మధోర్విఘాతకృత్ ।
హిరణ్యనయనాన్తకః కుసుమపూజారతిః క్వ యాతి మమ దృష్టిగోచరే నిపతితః ఖలః ॥43॥

"వీడే! రాక్షస సైన్యాన్ని నాశనం చేసిన శత్రువు, మహాకోపిష్టి వీడే!. మధువును సంహరించినవాడు, హిరణ్యాక్షుని అంతమొందించినవాడు, పూల పూజయందు ప్రీతిగలవాడు వీడే!. ఈనాటికి నా ఎదుటబడ్డాడు. ఇక ఖలుడైన వీడెక్కడకు పోగలడు?

యద్యేష సంప్రతి మమాహవమభ్యుపైతి నూనం న యాతి నిలయం నిజమమ్బుజాక్షః ।
మన్ముష్టిపిష్టశిథిలాంగముపాత్తభస్మ సంద్రక్ష్యతే సురజనో భయకాతరాక్షః ॥44॥

నాతో యుద్ధం చేయడానికి సిద్ధపడిన ఆ రాజీవాక్షుడు, తిరిగి తన ఇంటికి పోజాలడు. ఇది నిశ్చయం. నా ముష్టిఘాతాలకు నుగ్గైపోయే వీని సర్వాంగాలను దేవతలు భయవిహ్వలనేత్రాలతో చూచే గడియ ఆసన్నమయ్యింది".

ఇత్యేవముక్త్వా మధుసూదనం వై స కాలనేమిః స్ఫురితాధరోష్ఠః ।
గదాం ఖగేన్ద్రోపరి జాతకోపో ముమోచ శైలే కులిశం యథేంద్రః ॥45॥

అని పలుకుతూ పెదవులు కంపిస్తూ ఉండగా కాలనేమిదైత్యుడు మహేంద్రుడు పర్వతం మీద తన వజ్రాన్ని ప్రయోగించినట్లు తన ప్రచండగదాదండాన్ని గరుత్మంతుని మీదకు వేగంగా ప్రయోగించాడు.

తామాపతన్తీం ప్రసమీక్ష్య విష్ణుర్ఘోరాం గదాం దానవబాహుముక్తామ్ ।
చక్రేణ చిచ్ఛేద సుదుర్గతస్య మనోరథం పూర్వకృతేవ కర్మ ॥46॥

దానవుని బాహువుల నుండి విడువబడిన భయంకరమైన గద మీదకు రావడం చూసిన మధుసూదనుడు తన చక్రాన్ని దానిపైకి వదలి, దానిని ముక్కలు గావించాడు. మనోరథాన్ని పూర్వకృతకర్మఫలం భగ్నం చేసిన విధంగా దానవుడు ప్రయోగించిన గదను విష్ణుచక్రం భగ్నం గావించింది.

గదాం ఛిత్వా దానవాభ్యాశమేత్య భుజౌ పీనౌ సంప్రచిచ్ఛేద వేగాత్ ।
భుజాభ్యాం కృత్తాభ్యాం దగ్ధశైలప్రకాశః సందృశ్యేతాప్యపరః కాలనేమిః ॥47॥

గదను భగ్నం చేసిన విష్ణుచక్రం వేగంగా దానవుని సమీపించి, బాగుగా బలిసిన అతని పెనుబాహువులను వేగంగా నరికివేసింది. బ్రహ్మాండమైన తన చేతులు రెండు తెగిపోవడంతో ఎఱ్ఱగా మండిపోతున్న పర్వతం వలెను, వేరొక వ్యక్తి వలెను ఆ కాలనేమి కనిపించాడు.

తతోఽస్య మాధవః కోపాచ్ఛిరశ్చక్రేణ భూతలే ।
ఛిత్వా నిపాతయామాస పక్వం తాలఫలం యథా ॥48॥

తథా విబాహుర్విశిరా ముండతాలో యథా వనే ।
తస్థౌ మేరురివాకంప్యః కబంధః క్ష్మాధరేశ్వరః ॥49॥

అంతట మాధవుడు కోపంతో వాడితలను తన చక్రంతో నరికి, పండిన తాటిపండువలె నేలమీద పడగొట్టాడు. ఆ విధంగా బాహువులు లేనట్టియు, శిరస్సు లేనట్టియు కాలనేమిరాక్షసుడు అరణ్యంలోని మొండి తాటిచెట్టు వలె కబన్ధమాత్రుడుగా మిగిలిన ఆ మహాదైత్యుడు చలించని మేరుపర్వతం వలె నిలిచాడు.


తం వైనతేయోఽప్యురసా ఖగోత్తమో నిపాతయామాస మునే ధరణ్యామ్ ।
యథాఽమ్బరాద్బాహుశిరః ప్రణష్టబలం మహేంద్రః కులిశేన భూమ్యామ్ ॥50॥

తస్మిన్హతే దానవసైన్యపాలే సంపీడ్యమానాస్త్రిదశైస్తు దైత్యాః ।
విముక్తశస్త్రాలక చర్మవస్త్రాః సంప్రాద్రవన్ బాణమృతేఽ సురేంద్రాః ॥51॥

ఓ నారదా! మహేంద్రుడు తన వజ్రాయుధంతో బాహువులు, శిరస్సు లేని బలుని నేలమీద పడవేసినట్లుగా బాహువులు శిరస్సులేని రాక్షసేంద్రుని మొండెమును ఖగేంద్రుడైన గరుత్మంతుడు తన వక్షోభాగంతో నేలమీద పడేటట్లు చేశాడు. ఆ విధంగా తన ప్రధానసేనాధ్యక్షుడు హతుడు కాగా దేవసేనల చేతిలో చావుదెబ్బలు తిని, శేషించిన దైత్యులు ఆయుధాలు, కవచాలు, కట్టుబట్టలను కూడా వదలి, ప్రాణాలు కాపాడుకోవడానికి పారిపోయారు. ఒక్క బాణాసురుడు మాత్రం యుద్ధభూమిని వదలి వెళ్ళలేదు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్య నారదసంవాదే వామనప్రాదుర్భావే కాలనేమివధో నామ త్రిసప్తతితమోఽధ్యాయః ॥73॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో కాలనేమివధ అనే డెబ్భైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుఃసప్తతితమోఽధ్యాయః – డెబ్బైనాల్గవ అధ్యాయం

బలింప్రతి ప్రహ్లాదస్య హితోపదేశః – బలిచక్రవర్తికి ప్రహ్లాదుని హితోపదేశం

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

సంనివృత్తే తతో బాణే దానవాః సత్వరం పునః ।
నివృత్తా దేవతానాం చ సశస్త్రా యుద్ధలాలసాః ॥1॥

విష్ణురప్యమితౌజాస్తం జ్ఞాత్వాఽజేయం బలేః సుతమ్ ।
ప్రాహామన్త్ర్య సురాన్ సర్వాన్ యుధ్యధ్వం విగతజ్వరాః ॥2॥

విష్ణునాఽథ సమాదిష్టా దేవాః శక్రపురోగమాః ।
యుయుధుర్దానవైః సార్ధం విష్ణుస్త్వన్తరధీయత ॥3॥

ఓ నారదా! బాణుడు త్వరగా తిరిగి యుద్ధానికి రావడంతో ఇతరదైత్యవీరులు కూడా తమ తమ శస్త్రాస్త్రాలతో యుద్ధోత్సాహులై తిరిగివచ్చారు. మహాతేజస్వియైన విష్ణువు బాణుడజేయుడని తెలిసికొని దేవతలను పిలిపించి, దేవతలారా! మీరు నిర్భయంగా యుద్ధం చేయండని ఆదేశించాడు. విష్ణువు ఆదేశం మేరకు ఇంద్రాది దేవతలందరు దానవులతో యుద్ధం చేయసాగారు. కాని విష్ణువు మాత్రం అంతర్ధానమయ్యాడు.

మాధవం గతమాజ్ఞాయ శుక్రో బలిమువాచ హ ।
గోవిన్దేన సురాస్త్యక్తాస్త్వం జయస్వాధునా బలే ॥4॥

మాధవుడు వెళ్లిపోయిన సంగతి తెలిసికొన్న శుక్రుడు బలితో ఓ బలీ! గోవిందునిచే దేవతలు విడువబడ్డారు. కావున ఇప్పుడు నీవు వారిని జయింపుమని పలికాడు.

స పురోహితవాక్యేన ప్రీతో యాతే జనార్దనే ।
గదామాదాయ తేజస్వీ దేవసైన్యమభిద్రుతః ॥5॥

పురోహితుడైన శుక్రుని మాటలకు ప్రీతుడై తేజస్వియైన బలి గదను తీసికొని దేవసైన్యం మీద దాడి చేశాడు.

బాణో బాహుసహస్రేణ గృహ్య ప్రహరణాన్యథ ।
దేవసైన్యమభిద్రుత్య నిజఘాన సహస్రశః ॥6॥

బాణుడు తన వేయిచేతులతో పెక్కు ఆయుధాలనుపయోగించి వేలాది దేవతలను సంహరించాడు.

మయోఽపి మాయామాస్థాయ తైస్తైరూపాన్తరైర్మునే ।
యోధయామాస బలవాన్ సురాణాం చ వరూధినీమ్ ॥7॥

మయుడు కూడా తన మాయను విస్తరించి, వారి వారి రూపాలను ధరించి, దేవసైన్యాన్ని చిందరవందర చేయసాగాడు.

విద్యుజ్జిహ్వః పారిభద్రో వృషపర్వా శతేక్షణః ।
విపాకో విక్షరః సైన్యం తేఽపి దేవానుపాద్రవన్ ॥8॥

తే హన్యమానా దితిజైర్దేవాః శక్రపురోగమాః ।
గతే జనార్దనే దేవే ప్రాయశో విముఖాఽభవన్ ॥9॥

విద్యుజ్జిహ్వుడు, పారిభద్రుడు, వృషపర్వుడు, శతాక్షుడు, విరూపాక్షుడు, విక్షరుడు మొదలగు వీరులంతా దేవసైన్యాన్ని చండాడసాగారు. ఆ విధంగా దానవుల చేత పరాజితులైన ఇంద్రాది దేవతలందరు విష్ణువు లేకపోవడంతో వెనుకంజ వేశారు.

తాన్ ప్రభగ్నాన్ సురగణాన్ బలిబాణపురోగమాః ।
పృష్ఠతశ్చాద్రవన్ సర్వే త్రైలోక్యవిజిగీషవః ॥10॥

సంబాధ్యమానా దైతేయైర్దేవాః సేంద్రా భయాతురాః ।
త్రివిష్టపం పరిత్యజ్య బ్రహ్మలోకముపాగతాః ॥11॥

ఆ విధంగా భగ్నమైన దేవగణాలను బలిబాణాదులు వెన్నంటి తరిమివేశారు. త్రిలోకవిజయానికి సన్నద్ధులైన అసురుల దెబ్బలకు తాళలేక ఇంద్రాది దేవతలందరు స్వర్గాన్ని వదలిపెట్టి, బ్రహ్మలోకానికి వెళ్ళిపోయారు.

బ్రహ్మలోకం గతేష్విత్థం సేంద్రేష్వపి సురేషు వై ।
స్వర్గభోక్తా బలిర్జాతః సపుత్రభ్రాతృబాంధవః ॥12॥

శక్రోఽభూద్భగవాన్ బ్రహ్మన్ బలిబాణో యమోఽభవత్ ।
వరుణోఽభూన్మయః సోమో రాహుర్హ్లాదో హుతాశనః ॥13॥

స్వర్భానురభవత్ సూర్యః శుక్రశ్చాసీద్ బృహస్పతిః ।
యేఽన్యేఽప్యధికృతా దేవాస్తేషు జాతాః సురారయః ॥14॥

ఆ విధంగా ఇంద్రసమేతులై దేవతలు బ్రహ్మలోకానికి వెళ్ళడంతో పుత్రమిత్రబంధుపరివారంతో సహా బలి నిష్కంటకమైన స్వర్గాధిపతి యయ్యాడు. ఓ నారదా! ఇంద్రపీఠాన్ని కైవసం చేసికొని బలి ఇంద్రుడయ్యాడు. బాణుడు యముడయ్యాడు. మయుడు వరుణుడయ్యాడు. రాహువు చంద్రుడుగా, హ్లాదుడు అగ్నిగా, స్వర్భానుడు సూర్యుడుగా ఆయా అధికారాలను చేజిక్కించుకున్నారు. బృహస్పతి స్థానానికి శుక్రుని అభిషేకించారు. తక్కిన అధికారాలు ఇతర దైత్యులకు అప్పగించారు.

పంచమస్య కలేరాదౌ ద్వాపరాన్తే సుదారుణః ।
దేవాసురోఽభూత్ సంగ్రామో యత్ర శక్రోఽప్యభూద్బలిః ॥15॥

ఐదవ కలిద్వాపర యుగాల సంధికాలంలో ఆ భయంకరమైన దేవాసురసంగ్రామం జరిగి బలి ఇంద్రపదవిని అలంకరించాడు.

పాతాలాః సప్త తస్యాసన్ వశే లోకత్రయం తథా ।
భూర్భువఃస్వరితి ఖ్యాతం దశలోకాధిపో బలిః ॥16॥

స్వర్గే స్వయం నివసతి భుంజన్ భోగాన్ సుదుర్లభాన్ ।
తత్రోపాసన్త గన్ధర్వా విశ్వావసుపురోగమాః ॥17॥

తిలోత్తమాద్యప్సరసో నృత్యన్తి సురతాపస ।
వాదయన్తి చ వాద్యాని యక్షవిద్యాధరాదయః ॥18॥

ఓ దేవమునీ! సప్తపాతాళాలు, భూర్భువస్స్వరాది త్రిలోకాలు వశం గావించుకొని దశలోకాధిపతిగా బలి విఖ్యాతి పొందాడు. స్వర్గసింహాసనాన్ని అధిరోహించి ఎనలేని దుర్లభసౌఖ్యాలననుభవింపసాగాడు. విశ్వావసు మొదలైన గంధర్వులు గానం చేస్తూవుంటే, తిలోత్తమాదిగా గల అప్సరసలు నాట్యం చేసేవారు. యక్షకిన్నరవిద్యాధరులు వివిధ వాద్యాలు వాయిస్తూ బలిరాజేంద్రుని సంతోషపెట్టేవారు.

వివిధానపి భోగాంశ్చ భుంజన్ దైత్యేశ్వరో బలిః ।
సస్మార మనసా బ్రహ్మన్ ప్రహ్లాదం స్వపితామహమ్ ॥19॥

సంస్మృతో నప్తృణా చాసౌ మహాభాగవతోఽసురః ।
సమభ్యాగాత్ త్వరాయుక్తః పాతాలాత్ స్వర్గమవ్యయమ్ ॥20॥

ఓ నారదా! దైత్యేశ్వరుడైన బలి ఆ విధంగా వివిధస్వర్గభోగాలు అనుభవించి ఒకనాడు తన పితామహుడు, పరమభాగవతోత్తముడునైన ప్రహ్లాదుని మనసారా స్మరించాడు. మహాభాగవతాసురుడైన ప్రహ్లాదుడు మనుమడు స్మరించిన వెంటనే త్వరగా పాతాళం నుండి స్వర్గానికి చేరుకున్నాడు.

తమాగతం సమీక్ష్యైవ త్యక్త్వా సింహాసనం బలిః ।
కృతాంజలిపుటో భూత్వా వవన్దే చరణావుభౌ ॥21॥

పాదయోః పతితం వీరం ప్రహ్లాదస్త్వరితో బలిమ్ ।
సముత్థాప్య పరిష్వజ్య వివేశ పరమాసనే ॥22॥

అలా వచ్చిన తాతగారిని చూడగానే బలి సింహాసనం దిగి, రెండుచేతులు జోడించి, ఆ మహనీయుని పాదద్వయానికి నమస్కరించాడు. పాదాలచెంత పడియున్న ఆ మహావీరుని ప్రహ్లాదుడు ప్రేమతో లేవనెత్తి, కౌగిలించుకొని, శ్రేష్ఠమైన ఆసనం మీద కూర్చుండబెట్టాడు.

తం బలిః ప్రాహ భోస్తాత త్వత్ప్రసాదాత్ సురా మయా ।
నిర్జితాః శక్రరాజ్యం చ హృతం వీర్యబలాన్మయా ॥23॥

తదిదం తాత మద్వీర్య వినిర్జితసురోత్తమమ్ ।
త్రైలోక్యరాజ్యం భుంక్ష్వ త్వం మయి భృత్యే పురఃస్థితే ॥24॥

ఏతావతా పుణ్యయుతః స్యామహం తాత యత్ స్వయమ్ ।
త్వదంఘ్రిపూజాభిరతస్త్వదుచ్ఛిష్టాన్నభోజనః ॥25॥

న సా పాలయతో రాజ్యం ధృతిర్భవతి సత్తమ ।
యాధృతిర్గురుశుశ్రూషాం కుర్వతో జాయతే విభో ॥26॥

అంతట బలి తన పితామహుడైన ప్రహ్లాదునితో ఇలా పలికాడు. "పితామహా! తమ ప్రసాదం వల్ల నాచేత దేవతలు నిర్జింపబడ్డారు. నా బలాధిక్యత ప్రదర్శించి, ఇంద్రరాజ్యాన్ని హరించాను. ఈ విధంగా నాబలంచే సాధింపబడిన త్రిలోకరాజ్యాన్ని తమరనుభవించండి. నేను భృత్యుడనై మిమ్ము సేవిస్తాను. దీనివలన నేను పుణ్యయుతుడనౌతాను. మీ చరణాబ్జపూజ చేస్తూ, తమ ఉచ్ఛిష్టాన్నం భుజిస్తూ, జీవించగలిగినచో నావంటి భాగ్యశాలి మరొకడు ఉండబోడు. ప్రభో! తమవంటి మహనీయుల సేవలో గలుగు తృప్తి, సార్థకత్వం ఈ రాజ్యపాలనలో నాకు కలగడం లేదు".

తతస్తదుక్తం బలినా వాక్యం శ్రుత్వా ద్విజోత్తమ ।
ప్రహ్లాదః ప్రాహ వచనం ధర్మకామార్థసాధనమ్ ॥27॥

ఓ ద్విజోత్తమా! అలా బలి పలికిన మాటలు విని, ప్రహ్లాదుడు ధర్మకామార్థసాధకాలైన వాక్యాలు ఇలా పలికాడు.

మయా కృతం రాజ్యమకంటకం పురా ప్రశాసితా భూః సుహృదోఽనుపూజితాః ।
దత్తం యథేష్టం జనితాస్తథాత్మజాః స్థితో బలే సంప్రతి యోగసాధకః ॥28॥

గృహీతం పుత్ర విధివన్మయా భూయోఽర్పితం తవ ।
ఏవం భవ గురూణాం త్వం సదా శుశ్రూషణే రతః ॥29॥

ఇత్యేవముక్త్వా వచనం కరే త్వాదాయ దక్షిణే ।
శాక్రే సింహాసనే బ్రహ్మన్ బలిం తూర్ణం న్యవేశయత్ ॥30॥

సోపవిష్టో మహేంద్రస్య సర్వరత్నమయే శుభే ।
సింహాసనే దైత్యపతిః శుశుభే మఘువానివ ॥31॥

"పుత్రా! పూర్వకాలంలో బంధుమిత్రపరివారంతో పూజింపబడుచూ, రాజ్యమంతా నాచే నిష్కంటకంగా పరిపాలింపబడింది. కోరినవారికందరికి కోరినవన్నీ దానం చేశాను. పుత్రులను పొందాను. ఈ భూలోకాధిపత్యాన్ని వదలి, ఇప్పుడు యోగసాధనలోనున్నాను. నీవు నాకు సమర్పించిన ఈ రాజ్యాన్ని తిరిగి నీకే ఇస్తున్నాను. ఇదే విధంగా పెద్దలను సేవించడంలో ఎల్లప్పుడు అనురక్తి కలిగియుండుము". అని పలికి ప్రహ్లాదుడు తన కుడిచేతితో బలి చేయి పట్టుకుని తిరిగి అతనిని వేగంగా ఇంద్రసింహాసనం మీద కూర్చుండబెట్టాడు . నారదా! బలి మహేంద్రుని సర్వరత్నవిభూషితమైన సింహాసనం మీద కూర్చుండినవాడై మహేంద్రుని వలె ప్రకాశించాడు.

తత్రోపవిష్టశ్చైవాసౌ కృతాంజలిపుటో నతః ।
ప్రహ్లాదం ప్రాహ వచనం మేఘగంభీరయా గిరా ॥32॥

ఆ విధంగా బలి సింహాసనంపై కూర్చొని, చేతులు జోడించి, మేఘగంభీరధ్వనితో ప్రహ్లాదునితో ఇలా పలికాడు.

యన్మయా తాత కర్తవ్యం త్రైలోక్యం పరిరక్షతా ।
ధర్మార్థకామమోక్షేభ్యస్తదాదిశతు మే భవాన్ ॥33॥

"తండ్రీ! త్రైలోక్యరాజ్యపరిరక్షణ చేస్తూ, ధర్మార్థకామమోక్షసాధకాలైన కర్తవ్యాలు ఏ విధంగా అనుష్ఠించాలో మీరు నాకు దయతో ఆదేశించండి".

తద్వాక్యసమకాలం చ శుక్రః ప్రహ్లాదమబ్రవీత్ ।
యద్యుక్తం తన్మహాబాహో వదస్వాద్యోత్తరం వచః ॥34॥

బలి పలుకులనందుకుని శుక్రాచార్యుడు కూడా ప్రహ్లాదునితో ఇలా పలికాడు. ఓ మహాబాహూ! ఇప్పుడు మీరు యుక్తమైన సమాధానంతో కర్తవ్యోపదేశం చేయండి అని శుక్రుడు అర్థించాడు.

వచనం బలిశుక్రాభ్యాం శ్రుత్వా భాగవతోఽసురః ।
ప్రాహ ధర్మార్థసంయుక్తం ప్రహ్లాదో వాక్యముత్తమమ్ ॥35॥

బలిశుక్రుల అభ్యర్థనను భాగవతుడైన ప్రహ్లాదుడు విని, ధర్మార్థయుక్తమైన, ఉత్తమమైన ఉపదేశమిచ్చాడు.

యదాయత్యాం క్షమం రాజన్ యద్ధితం భువనస్య చ ।
అవిరోధేన ధర్మస్య అర్థస్యోపార్జనం చ యత్ ॥36॥

సర్వసత్త్వానుగమనం కామవర్గఫలం చ యత్ ।
పరత్రేహ చ యచ్ఛ్రేయః పుత్ర తత్కర్మ ఆచర ॥37॥

యథా శ్లాఘ్యం ప్రయాస్యద్య యథా కీర్తిర్భవేత్తవ ।
యథా నా యశసో యోగస్తథా కురు మహామతే! ॥38॥

వత్సా! భవిష్యత్తులో ఉపయోగపడేది, ప్రపంచానికి హితకరమైనదియైన ధనాన్ని ధర్మవిరుద్ధం కాని విధంగా సంపాదించాలి. కామ్యసాధనం ఎల్లరకు అనుకూలంగా ఇహపరాలలో శ్రేయం కలిగించే విధంగా ఆచరించాలి. ఓ మహామతీ! అడుగడుగునా శ్లాఘింపబడేటట్లుగా, కీర్తి కలిగేటట్లుగా, అపయశస్కరం కానివిధంగా కర్మాచరణ చేయుము.

ఏతదర్థం శ్రియం దీప్తాం కాంక్షన్తే పురుషోత్తమాః ।
యేనైతాని గృహేఽస్మాకం నివసన్తి సునిర్వృతాః ॥39॥

కులజో వ్యసనే మగ్నః సఖా చార్థబహిఃకృతః ।
వృద్ధో జ్ఞాతిర్గుణీ విప్రః కీర్తిశ్చ యశసా సహ ॥40॥

ఉత్తములైనవారు ఉత్కృష్టమైన లక్ష్మిని కోరుకోవడానికి కారణం ఆపదలో చిక్కుకున్న ఉత్తముని, ధనహీనుడైన మిత్రుని, వృద్ధులను, జ్ఞాతులను, గుణవంతులను, బ్రాహ్మణులను, తమ ఇండ్లలో శాంతిగా నివసించేటట్లు చేయడానికే. అలా చేయడం వారికి యశస్సును, కీర్తిని కలుగజేస్తాయి.

తస్మాద్యథైతే నివసన్తి పుత్ర రాజ్యస్థితస్యేహ కులోద్గతాద్యాః ।
తథా యతస్వామలసత్త్వచేష్ట యథా యశస్వీ భవితాఽసి లోకే ॥41॥

కాబట్టి పుత్రా! నీ రాజ్యంలో ఉత్తమకులజులు, యోగ్యులైన తదితరులు, నిశ్చింతగా నివసించదానికి తగిన ఉత్తమకార్యాలు నిర్వహిస్తూ నీ యశస్సు దశదిశలా వ్యాపించేటట్లు నడుచుకొనుము.

భూమ్యాం సదా బ్రాహ్మణభూషితాయాం క్షత్రాన్వితాయాం దృఢవాపితాయామ్ ।
శుశ్రూషణాసక్తసముద్భవాయామృద్ధిం ప్రయన్తీహ నరాధిపేంద్రాః ॥42॥

ఎల్లప్పుడు భూమి బ్రాహ్మణులతోనలంకరింపబడి, క్షత్రియులతో పరివృతమై, సస్యసమృద్ధమై, సేవాభావం గలవారితో కళకళలాడుతు ఉన్నప్పుడే దానిని పరిపాలించే రాజులు అభివృద్ధిని పొందగలుగుతారు.

తస్మాద్ ద్విజాగ్ర్యాః శ్రుతిశాస్త్రయుక్తా నరాధిపాంస్తే ప్రతియాజయన్తు ।
దివ్యైర్యజన్తు క్రతుభిర్ద్విజేన్ద్రా యజ్ఞాగ్నిధూమేన నృపస్య శాన్తిః ॥43॥

కావున రాజుకు, రాజ్యానికి కళ్యాణం కలిగే పవిత్ర యజ్ఞయాగాదులు, ఉత్తములైన శ్రుతిశాస్త్రవేత్తలను చేయునట్లుగాను, దివ్యమైన క్రతువులు, తపస్సు చేయునట్లుగాను, విప్రులకు అనుకూలమైన వాతావరణం నెలకొల్పుము. యజ్ఞాగ్ని ధూమం వల్లనే రాజులకు శాంతి సౌఖ్యాలు కలుగుతాయి.

తపోఽధ్యయనసంపన్నా యాజనాధ్యాపనే రతాః ।
సన్తు విప్రా బలే పూజ్యాస్త్వత్తోఽనుజ్ఞామవాప్య హి ॥44॥

స్వాధ్యాయయజ్ఞనిరతా దాతారః శస్త్రజీవినః ।
క్షత్రియాః సన్తు దైత్యేంద్ర ప్రజాపాలనధర్మిణః ॥45॥

యజ్ఞాధ్యయనసంపన్నా దాతారః కృషికారిణః ।
పాశుపాల్యం ప్రకుర్వన్తు వైశ్యా విపణిజీవినః ॥46॥

బ్రాహ్మణక్షత్రియవిశాం సదా శుశ్రూషణే రతాః ।
శూద్రాః సన్త్వసురశ్రేష్ఠ తవాజ్ఞాకారిణః సదా ॥47॥

యదా వర్ణాః స్వధర్మస్థా భవన్తి దితిజేశ్వర ।
ధర్మవృద్ధిస్తదా స్యాద్వై ధర్మవృద్ధౌ నృపోదయః ॥48॥

ఓ బలీ! నీ రాజ్యంలో నీ అనుజ్ఞతో ఎల్లెడలా తపస్సంపన్నులు, యజన యాజనాధ్యాపనం చేసే విప్రోత్తములు, పూజార్చనలు అందుకొనునట్లుగా యత్నింపుము. దైత్యేంద్రా! స్వాధ్యాయ, యజ్ఞరత, దానరత, శస్త్రజీవులైన క్షత్రియులు ప్రజాపాలన చేయునట్లుగా ప్రోత్సహింపుము. వాణిజ్యప్రవీణులగు వైశ్యులు దాతలై, యజ్ఞాధ్యయనాలు చేస్తూ, వ్యవసాయం, పశుపాలన, చక్కగా నిర్వర్తించునట్లు జాగ్రత్త వహింపుము. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు వారి ధర్మనిర్వహణలో సేవాసహకారాలు అందిస్తూ, సదా నీ ఆజ్ఞానుసారులై శూద్రులు మెలగునట్లు చూసుకొనుము. ఓ దైత్యరాజా నాల్గు వర్ణాలవారు తమ తమ ధర్మాలు చక్కగా ఆచరించిననాడు ధర్మవృద్ధి కలుగుతుంది. ధర్మవృద్ధితో రాజులకు అభ్యుదయం చేకూరుతుంది.

తస్మాద్వర్ణాః స్వధర్మస్థాస్త్వయా కార్యాః సదా బలే ।
తద్వృద్ధౌ భవతో వృద్ధిస్తద్ధానౌ హాని రుచ్యతే ॥49॥

కాబట్టి ఓ బలీ! నీ రాజ్యంలోని అన్ని వర్ణాలవారు సదా స్వధర్మనిరతులయ్యేటట్లు నీవు చేయాలి. ధర్మవృద్ధియే వృద్ధి. ధర్మహానియే హానియనియు పెద్దల నిర్ణయం.

ఇత్థం వచః శ్రావ్య మహాసురేంద్రో బలిం మహాత్మా స బభూవ తూష్ణీమ్ ।
తతో యదాజ్ఞాపయసే కరిష్యే ఇత్థం బలిః ప్రాహ వచో మహర్షే! ॥50॥

ఈ విధంగా తన పౌత్రునకు హితోపదేశం చేసి, ప్రహ్లాదుడు మౌనం వహించాడు. ఓ నారదా! బలిచక్రవర్తి తమ ఆదేశం శిరసావహిస్తానని ప్రహ్లాదునితో పలికి, చేతులు జోడించి నమస్కరించాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే బలింప్రతి ప్రహ్లాదస్య హితోపదేశో నామ చతుఃసప్తతితమోఽధ్యాయః ॥74॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో బలిచక్రవర్తికి ప్రహ్లాదుని హితోపదేశం అనే డెబ్బైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచసప్తతితమోఽధ్యాయః – డెబ్బైఐదవ అధ్యాయం

బలిరాజ్యపాలనే కలిస్వభావనాశః, ధర్మయుతపాలనం చ – బలిరాజ్యపాలనలో కలిస్వభావం నశించుట, ధర్మయుతపాలన

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తతో గతేషు దేవేషు బ్రహ్మలోకం ప్రతి ద్విజ ।
త్రైలోక్యం పాలయామాస బలిర్ధర్మాన్వితః సదా ॥1॥

ఓ నారదా! అలా దేవతలంతా స్వర్గాన్ని వదలి బ్రహ్మలోకానికి వెళ్లగా బలి ముల్లోకాలను ఎల్లప్పుడు ధర్మం తప్పకుండా పరిపాలించాడు.

కలిస్తదా ధర్మయుతం జగదృష్ట్వా కృతే యథా ।
బ్రహ్మాణం శరణం భేజే స్వభావస్య నిషేవణాత్ ॥2॥

జగత్తంతా కృతయుగంగా ధర్మయుతంగా మారిపోవడం గమనించిన కలి భయంతో తన స్వభావానికి తగినట్లుగా సత్యలోకానికి వెళ్ళి బ్రహ్మను శరణు వేడాడు.

గత్వా స దదృశే దేవం సేంద్రైర్దేవైః సమన్వితమ్ ।
స్వదీప్త్యా ద్యోతయన్తం చ స్వదేశం స సురాసురమ్ ॥3॥

అక్కడ ఇంద్రాది దేవతలతో కూడినట్టియు, సురాసురులతో కూడినట్టియు బ్రహ్మ తన తేజస్సుతో తన పరిసరాన్నంతటిని వెలిగింపజేస్తూ దర్శనమిచ్చాడు.

ప్రణిపత్య తమాహాథ తిష్యో బ్రహ్మాణమీశ్వరమ్ ।
మమ స్వభావో బలినా నాశితో దేవసత్తమ! ॥4॥

బ్రహ్మకు కలి నమస్కరించి, ప్రభో! రక్షించండి! బలి నా స్వభావాన్నే నాశనం చేశాడని విన్నవించాడు.

తం ప్రాహ భగవాన్ యోగీ స్వభావం జగతోఽపి హి ।
న కేవలం హి భవతో హృతం తేన బలీయసా ॥5॥

పశ్యస్వ తిష్య దేవేన్ద్రం వరుణం చ సమారుతమ్ ।
భాస్కరోఽపి హి దీనత్వం ప్రయాతో హి బలాద్బలేః ॥6॥

న తస్య కశ్చిత్ త్రైలోక్యే ప్రతిషేద్ధాఽస్తి కర్మణః ।
ఋతే సహస్రం శిరసం హరిం దశశతాంఘ్రికమ్ ॥7॥

స భూమిం చ తథా నాకం రాజ్యం లక్ష్మీం యశోఽవ్యయః ।
సమాహరిష్యతి బలేః కర్తుః సద్ధర్మగోచరమ్ ॥8॥

అది విని మహాయోగియైన విరించి "నీవొక్కడి స్వభావాన్నే కాదు, ఆ మహాబలి మొత్తం లోకస్వభావాన్ని నశింపజేశాడు. ఇంద్రుడు, వరుణుడు, అగ్ని, వాయువు, చివరకు సూర్యుడు కూడా బలిబలం వల్ల ఎలా తేజస్సు

కోల్పోయి కూర్చున్నారో చూడు. ఒక్క సహస్రశీర్షుడు, సహస్రపాదుడునగు శ్రీహరి తప్ప ఈనాటి బలి అభ్యుదయాన్ని నిరోధించగలవాడు ముల్లోకాలలోను వేరొకడు లేడు. అవ్యయుడైన లక్ష్మీపతియే ధర్మనిరతుడైన బలిచక్రవర్తియొక్క రాజ్యాన్ని, భూమండలాన్ని, స్వర్గాన్ని, సంపదను, కీర్తిని, అన్నిటిని హరించగల సమర్థుడు"

ఇత్యేవముక్తో దేవేన బ్రహ్మణా కలిరవ్యయః ।
దీనాన్ దృష్ట్వా స శక్రాదీన్ విభీతకవనం గతః ॥9॥

బ్రహ్మదేవుడు కలితో ఇలా పలుకగా వినిన కలి దీనవదనాలతోనున్న ఇంద్రాదులను చూసి, విభీతక వనానికి వెళ్ళిపోయాడు.

కృతః ప్రావర్తత తదా కలేర్నాశాజ్జగత్రయే ।
ధర్మోఽభవచ్చతుష్పాదశ్చాతుర్వర్ణ్యేఽపి నారద! ॥10॥

ఓ నారదా! కలి ఆ విధంగా నిర్గమించిన కారణంగా ముల్లోకాలలోను అప్పుడు కృతయుగం ప్రవర్తించింది. నాల్గు వర్ణాలవారిలోను ధర్మం నాల్గుపాదాలతో నిలిచింది.

తపోఽహింసా చ సత్యం చ శౌచమింద్రియనిగ్రహః ।
దయా దానం త్వానృశంస్యం శుశ్రూషా యజ్ఞకర్మ చ ॥11॥

ఏతాని సర్వజగతః పరివ్యాప్య స్థితాని హి ।
బలినా బలవాన్ బ్రహ్మన్ తిష్యోఽపి హి కృతః కృతః ॥12॥

స్వధర్మస్థాయినో వర్ణా హ్యాశ్రమాంశ్చావిశన్ ద్విజాః ।
ప్రజాపాలన ధర్మస్థాః సదైవ మనుజర్షభాః ॥13॥

ధర్మోత్తరే వర్తమానే బ్రహ్మన్నస్మిన్ జగత్రయే ।
త్రైలోక్యలక్ష్మీర్వరదా త్వాయాతా దానవేశ్వరమ్ ॥14॥

ఓ నారదా! తపస్సు, అహింస, సత్యం, శౌచం, ఇంద్రియనిగ్రహం, దయ, దానం, అక్రౌర్యం, శుశ్రూష, త్యాగరూపాలైన యజ్ఞకర్మలు జగతిలో సర్వత్రా వెల్లివిరిశాయి. బలవంతుడైన బలి కలినే కృతయుగంగా మార్చేశాడు. ద్విజులు స్వధర్మనిరతులై, తమ ఆశ్రమధర్మాలలో స్థిరులైపోయారు. నరపతులు అప్రమత్తులై ప్రజాపాలన చేయసాగారు. ఓ బ్రాహ్మణోత్తమా! ఆ విధంగా ముల్లోకాలు ధర్మంలో స్థిరపడి నిలవడంతో వరదాత్రియైన త్రైలోక్యలక్ష్మి దానవేశ్వరుని చెంతకు వెళ్ళింది.

తామాగతాం నిరీక్ష్యైవ సహస్రాక్షశ్రియం బలిః ।
పప్రచ్ఛ కాఽసి మాం బ్రూహి కేనాప్యర్థేన చాగతా ॥15॥

ఆ విధంగా తన వద్దకు వచ్చిన ఇంద్రశ్రీని చూచి, అమ్మా! నీవెవరు? ఎందుకోసం నీవిక్కడకు వచ్చావని బలి ఆమెను అడిగాడు.

సా తద్వచనమాకర్ణ్య ప్రాహ శ్రీః పద్మమాలినీ ।
బలే శృణుష్వ యాఽస్మి త్వామాయాతా మహిషీ బలాత్ ॥16॥

బలి పలుకులు విని పద్మమాలినియైన లక్ష్మీదేవి ఇలా పలికింది. “ఓ బలీ! నేనెవరినో, రాణినైన నేను విధిలేక నీ చెంతకు ఎందుకు వచ్చానో చెబుతాను వినుము.

అప్రమేయబలో దేవో యోఽసౌ చక్రగదాధరః ।
తేన త్యక్తస్తు మఘవా తతోఽహం త్వామిహాగతా ॥17॥

అప్రమేయబలశాలియైన చక్రగదాధరుడు ఇంద్రుని విడిచిపెట్టాడు. ఇప్పుడు నేను ఇంద్రుని వదలి నీ చెంతకు వచ్చాను.

స నిర్మమే యువతయశ్చతస్రో రూపసంయుతాః ।
శ్వేతాంబరధరా చైవ శ్వేతస్రగనులేపనా ॥18॥

శ్వేతవృన్దారుకారూఢా సత్త్వాఢ్యా శ్వేతవిగ్రహా ।
రక్తాంబరధరా చాన్యా రక్తస్రగనులేపనా ॥19॥

రక్తవాజి సమారూఢా రక్తాంగీ రాజసీ హి సా ।
పీతాంబరా పీతవర్ణా పీతమాల్యానులేపనా ॥20॥

సౌవర్ణస్యన్దనచరా తామసం గుణమాశ్రితా ।
నీలాంబరా నీలమాల్యా నీలగన్ధానులేపనా ॥21॥

నీలవృషసమారూఢా త్రిగుణా సా ప్రకీర్తితా ।

శ్రీమహావిష్ణువు రూపసంపన్నులైన నలుగురు యువతులను సృష్టించాడు. వారిలోనొకతె తెల్లని వస్త్రాలు ధరించి, తెల్లని మాలలు, పరిమళద్రవ్యాలు ధరించి, సత్త్వగుణప్రధానయై, తెల్లని ఏనుగు మీద ఆసీనురాలై యుంటుంది. రెండవ యువతి రక్తవస్త్రాలు ధరించి, రక్తవర్ణం గల మాలలు, పరిమళద్రవ్యాలు ధరించి, ఎఱ్ఱని గుఱ్ఱం అధిరోహించి, రజోగుణప్రధానమైనది. పీతాంబరాన్ని ధరించి, పీతమాల్యానులేపనాలతో పీతవర్ణం కలిగి, స్వర్ణరథారూఢయై సంచరించే తామసగుణ ప్రధానమైన యువతి మూడవది. నీలవర్ణం గల వస్త్రాలు ధరించి, నీలవర్ణం గల మాలలు, గంధానులేపనాలతో నీలవర్ణం గల వృషభారూఢయై, త్రిగుణాత్మకంగా ప్రకీర్తితమైన యువతి నాల్గవది.

యా సా శ్వేతాంబరా శ్వేతా సత్త్వాఢ్యా కుంజరస్థితా ॥22॥

సా బ్రహ్మాణం సమాయాతా చన్ద్రం చన్ద్రానుగానపి ।
యా రక్తా రక్తవసనా వాజిస్థా రజసాన్వితా ॥23॥

తాం ప్రాదాద్ దేవరాజాయ మనవే తత్సమేషు చ ।
పీతాంబరా యా శుభగా రథస్థా కనకప్రభా ॥24॥

ప్రజాపతిభ్యస్తాం ప్రాదాచ్ఛుక్రాయ చ విశఃసు చ ।
నీలవస్త్రాఽలిసదృశీ యా చతుర్థీ వృషస్థితా ॥25॥

సా దానవాన్ నైరృతాంశ్చ శూద్రాన్ విద్యాధరానపి ।

సత్త్వగుణాత్మికయై, శ్వేతవర్ణంతో, శ్వేతగజారూఢయైన యువతి బ్రహ్మ, చంద్రుడు, చంద్రానుయాయుల చెంతకు వెళ్ళి చేరింది. రక్తవర్ణంతో, రక్తవస్త్రాలతో, రక్తవర్ణం గల గుఱ్ఱం మీద విరాజిల్లే రజోగుణాత్మికయైన యువతిని శ్రీమహావిష్ణువు ఇంద్రునకు, మనువునకు, ఆయనవంటివారలకు ప్రదానం చేశాడు. పీతాంబరాన్ని ధరించి, కనక రథారూఢయైన సుందరిని ప్రజాపతులకు, శుక్రాచార్యునకు, వైశ్యులకు విష్ణువు ప్రదానం చేశాడు. నల్లని తుమ్మెద కాంతి గల వస్త్రాలు ధరించి, నీలవృషారూఢయైన నాల్గవ యువతిని దానవులకు, నిరృతికి, విద్యాధరులకు, శూద్రులకు ప్రదానం చేశాడు.

విప్రాద్యాః శ్వేతరూపాం తాం కథయన్తి సరస్వతీమ్ ॥26॥

స్తువన్తి బ్రహ్మణా సార్ధం మఖే మంత్రాదిభిః సదా ।

శ్వేతరూపిణియైన ఆ యువతిని బ్రాహ్మణులు సరస్వతియని పిలుస్తూ బ్రహ్మతో కలసి యజ్ఞయాగాలలో మంత్రాలతో స్తోత్రం చేస్తారు.

క్షత్రియా రక్తవర్ణాం తాం జయశ్రీమితి శంసిరే ॥27॥

సా చేంద్రేణాసురశ్రేష్ఠ మనునా చ యశస్వినీ ।

క్షత్రియులు రక్తవర్ణం కలిగిన ఆ యువతిని జయశ్రీ అని ప్రశంసించారు. ఓ దానవశ్రేష్ఠా! ఆమె ఇంద్రునితోను, మనువుతోను కలిసి యశస్విని అయినది.

వైశ్యాస్తాం పీతవసనాం కనకాంగీం సదైవ హి ॥28॥

స్తువన్తి లక్ష్మీమిత్యేవం ప్రజాపాలాస్తథైవ హి ।

వైశ్యులు, ప్రజాపాలకులు, పీతవస్త్రాలను ధరించిన ఆ కనకాంగిని లక్ష్మి అనే పేరుతో సదా స్తుతిస్తూ ఉంటారు.

శూద్రాస్తాం నీలవర్ణాంగీం స్తువన్తి చ సుభక్తితః ॥29॥

శ్రియా దేవీతి నామ్నా తాం సమం దైత్యైశ్చ రాక్షసైః ।
ఏవం విభక్తాస్తా నార్యస్తేన దేవేన చక్రిణా ॥30॥

దైత్యవిద్యాధరశూద్రాదులు నీలవర్ణాంగిని శ్రీదేవి అంటూ భక్తితో స్తోత్రం చేస్తుంటారు. ఆ నలుగురు స్త్రీలను చక్రధారియైన విష్ణుదేవుడు ఈ విధంగా విభజించాడు.

ఏతాసాం చ స్వరూపస్థాస్తిష్ఠన్తి నిధయోఽ వ్యయాః ।
ఇతిహాసపురాణాని వేదాః సాంగాస్తథోక్తయః ॥31॥

చతుఃషష్టికలాః శ్వేతా మహాపద్మో నిధిః స్థితః ।

ఈ నలుగురు అక్షయనిధుల రూపాలలో నివసిస్తారు. ఇతిహాస, పురాణ, వేద, వేదాఙ్గాలు వాటిచే కీర్తింపబడిన అరవైనాలుగు కళలు, శ్వేతాంగికి సంబంధించినవి. మహాపద్మనిధిరూపంలో ఈ శ్వేతాంగి నివసిస్తుంది.

ముక్తా సువర్ణ రజతం రథాశ్వగజభూషణమ్ ॥32॥

శస్త్రాస్త్రాధికవస్త్రాణి రక్తా పద్మోనిధిః స్మృతః ।

వెండి బంగారాలు, ముత్యాలు, రథాశ్వగజభూషణాలు, శస్త్రాస్త్రాదికాలు, వస్త్రాలు పద్మనిధి పేరుతో రక్తవర్ణాంగికి చెందినవి.

గోమహిష్యః ఖరోష్ట్రం చ సువర్ణాంబరభూమయః ॥33॥

ఔషధ్యః పశవః పీతా మహానీలో నిధిః స్థితః ।
సర్వాసామపి జాతీనాం జాతిరేకా ప్రతిష్ఠితా ॥34॥

అన్యేషామపి సంహర్త్రీ నీలా శంఖో నిధిః స్థితః ।

గోమహిషసంతతులు, ఖరఉష్ట్రాదులు, భూమి, ఓషధులు, పశువులు, "పీతకు" చెందిన మహానీలనిధిలోనివి. ఈ జాతులన్నిటికి చెందినవీ, ఇంకా మిగిలినవీ అన్ని కలిపి నీలవర్ణాంగికి చెందినవై "శంఖనిధిగా" పరిగణింపబడతాయి.

ఏతాసు సంస్థితానాం చ యాని రూపాణి దానవ! ।
భవన్తి పురుషాణాం వై తాన్ నిబోధ వదామి తే ॥35॥

ఓ దానవవీరా! ఈ నాల్గు విధాలైన నిధులకు చెందిన మానవుల ప్రత్యేకలక్షణాలు, రూపాలు ఇక చెబుతాను, తెలిసికొనుము.

సత్యశౌచాభిసంయుక్తా మఖదానోత్సవే రతాః ।
భవన్తి దానవపతే మహాపద్మాశ్రితా నరాః ॥36॥

సత్యశౌచనిరతులై, యజ్ఞదానాది క్రియలలో వినోదించే నరులు మహాపద్మనిధిని ఆశ్రయించేవారు.

యజ్వినః సుభగా దృప్తా మానినో బహుదక్షిణాః ।
సర్వసామాన్యసుఖినో నరాః పద్మాశ్రితాః స్మృతాః ॥37॥

దర్పం, అభిమానాలతో యజ్ఞాలు చేస్తూ, స్ఫురద్రూపులై, ఉదారంగా దక్షిణలిస్తూ, సర్వసామాన్యసుఖాల ననుభవించేవారు పద్మనిధికి చెందినవారు.

సత్యానృతసమాయుక్తా దానాహరణదక్షిణాః ।
న్యాయాన్యాయవ్యయోపేతా మహానీలాశ్రితా నరాః ॥38॥

సత్యాలు అసత్యాలు పలుకుతూ, దానం చేయడంలోను, స్వీకరించడంలోను సమర్థులైనవారు, న్యాయాన్యాయపరులైనవారు, మహానీలనిధికి చెందినవారు.

నాస్తికాః శౌచరహితాః కృపణా భోగవర్జితాః ।
స్తేయానృతకథాయుక్తా నరాః శంఖశ్రితా బలే ॥39॥

ఇత్యేవం కథితస్తుభ్యం తేషాం దానవ నిర్ణయః ॥40॥

ఓ బలీ! నాస్తికులు, శౌచహీనులు, కృపణులు, భోగవర్జితులైన లోభులు, చోరులు, అనృతాల పట్ల ఆసక్తి కలవారు శంఖనిధికి సంబంధించినవారు. ఓ దానవా! ఇలా ఈ నాల్గునిధులకు చెందిన మానవుల స్వరూప స్వభావాలు నిశ్చయంగా నీకు తెలియజేశాను.

అహం సా రాగిణీ నామ జయశ్రీస్త్వాముపాగతా ।
మమాస్తి దానవపతే ప్రతిజ్ఞా సాధుసమ్మతా ॥41॥

సమాశ్రయామి శౌర్యాఢ్యం న చ క్లీబం కథంచన ।
న చాస్తి భవతస్తుల్యో త్రైలోక్యేఽపి బలాధికః ॥42॥

త్వయా బలవిభూత్యా హి ప్రీతిర్మే జనితా ధ్రువా ।
యత్త్వయా విధివిక్రమ్య దేవరాజో వినిర్జితః ॥43॥

ఓ దానవేంద్రా! ఆ నలుగురు యువతులలో రజఃప్రాధాన్యం కలిగిన జయశ్రీ అనే దానను నేనే. నిన్నాశ్రయించడానికి వచ్చాను. నేను సాధుసమ్మతమైన ఒక ప్రతిజ్ఞను చేశాను. అది ఏమనగా నేను మహాశౌర్య నిధులను ఆశ్రయించియుంటానేగాని నపుంసకులను ఎట్టి పరిస్థితులలోను ఆశ్రయించనని. ముల్లోకాలలో నీతో సమానమైన బలాధికుడు లేడు. నీ బలాధిక్యానికి, శౌర్యానికి నాకు నీ యందు ధ్రువమైన ప్రీతి కలిగింది. యుద్ధంలో విక్రమించి, ఇంద్రుని సైతం నిర్జించిన మహావీరుడవు నీవు.

అతో మమ పురా ప్రీతిర్జాతా దానవ శాశ్వతీ ।
దృష్ట్వా తే పరమం సత్త్వం సర్వేభ్యోఽపి బలాధికమ్ ॥44॥

శౌండీర్యమానినం వీరం తతోఽహం స్వయమాగతా ।
నాశ్చర్యం దానవశ్రేష్ఠ హిరణ్యకశిపోః కులే ॥45॥

ప్రసూతస్యాసురేంద్రస్య తవ కర్మ యదీదృశమ్ ।
విశేషితస్త్వయా రాజన్ దైతేయః ప్రపితామహః ॥46॥

విజితం విక్రమాద్యేన త్రైలోక్యం వై పరైర్వృతమ్ ।
ఇత్యేవముక్త్వా వచనం దానవేంద్రం తదా బలిమ్ ॥47॥

జయశ్రీశ్చంద్రవదనా ప్రవిష్టాఽ ద్యోతయచ్ఛుభా ।
తస్యాం చాథ ప్రవిష్టాయాం విధవా ఇవ యోషితః ॥48॥

సమాశ్రయన్తి బలినం హ్రీశ్రీధీ ధృతి కీర్తయః ।
ప్రభా మతిః క్షమా భూతిర్విద్యా నీతిర్దయా తథా ॥49॥

శ్రుతిః స్మృతిర్ధృతిః కీర్తిర్మూర్తిః శాన్తిః క్రియాన్వితాః ।
పుష్టిస్తుష్టీ రుచిస్త్వన్యా తథా సత్త్వాశ్రితా గుణాః ।
తాః సర్వా బలిమాశ్రిత్య వ్యశ్రామ్యన్త యథాసుఖమ్ ॥50॥

"ఈ విధమైన గుణసంపన్నుడవైన నీ అపూర్వసత్త్వం సర్వాధికమైన శౌర్యవీర్యాలు చూసి, పరమప్రీతితో స్వయంగా నీ వద్దకు వచ్చాను. దానవశ్రేష్ఠా! హిరణ్యకశిపుని వంశంలో జన్మించిన నీవిలాంటి ఘనకార్యాలు చేయడంలో ఆశ్చర్యమేమాత్రము లేదు. అంతేగాక ఓ రాజా! నీ ప్రపితామహుడైన దితిజుడు కూడా పరుల పహరించిన త్రైలోక్యరాజ్యలక్ష్మిని శత్రునిర్మూలనం గావించడానికి విశేషంగా విక్రమించి వశపరచుకున్నాడు." ఈ విధంగా దానవేంద్రుడైన బలికి తనగాధనంతటిని తెలియజేసి చంద్రవదనయు, శుభాంగియునగు జయశ్రీ బలిచక్రవర్తిలో ప్రవేశించి, తన విభూతులను ప్రదర్శించింది. జయలక్ష్మి ఆ విధంగా బలిలో ప్రవేశించగానే హ్రీ (లజ్జ), శ్రీ, ధీశక్తి, ధృతి, కీర్తి, ప్రభ(వెలుగు), మతి, క్షమ, భూతి(ఐశ్వర్యం), విద్య, నీతి, దయ, శ్రుతి, స్మృతి, శాంతి, క్రియాశక్తి, పుష్టి, తుష్టి, రుచి, సత్త్వాశ్రయాలైన తదితర మంగళకరగుణాలు బలినాశ్రయించి సుఖంగా విశ్రమించాయి.

ఏవం గుణోఽ భూద్దనుపుంగవోఽ సౌ బలిర్మహాత్మా శుభబుద్ధిరాత్మవాన్ ।
యజ్వా తపస్వీ మృదురేవ సత్యవాగ్ దాతా విభర్తా స్వజనాభిగోప్తా ॥51॥

త్రివిష్టపం శాసతి దానవేంద్రే నాసీత్ క్షుధార్తో మలినో న దీనః ।
సదోజ్జ్వలో ధర్మరతోఽ థ దాన్తః కామోపభోక్తా మనుజోఽ పి జాతః ॥52॥

సద్బుద్ధి, సుబుద్ధి, మహనీయుడునగు బలిరాజేంద్రుడు ఆ విధంగా సకలవిభూతులు తన్నాశ్రయించగా మృదుభాషి, మధురభాషి, సత్యభాషియునై, తపోయజ్ఞాలు చేస్తూ, భూరి దానాలుచేస్తూ, తన వారిని రక్షించుకుంటూ, త్రిలోకపాలన గావించాడు. ఓ నారదమహర్షీ! దానవేంద్రుడైన బలి త్రివిష్టపాన్ని పరిపాలించే సమయంలో క్షుధార్తుడైనవాడుగాని, దీనుడుగాని, అశుచిగాని, ఏ ఒక్కడు లేడు. మానవసమాజమంతా ధర్మపరాయణమై, జితేంద్రియమై, ఇచ్ఛానుసారమైన భోగానుభవంతో సుసంపన్నమయ్యింది.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే బలిరాజ్యపాలనే కలిస్వభావనాశః, ధర్మయుతపాలనం నామ పంచసప్తతితమోఽ ధ్యాయః ॥75॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో బలిరాజ్యపాలనలో కలిస్వభావం నశించుట, ధర్మయుతపాలన అనే డెబ్బైఐదవ అధ్యాయం సమాప్తం.

షట్సప్తతితమోஉధ్యాయః - డెబ్బైఆరవ అధ్యాయం

విష్ణువరప్రదానం, అదితిగర్భప్రవేశశ్చ - విష్ణువు అదితిగర్భంలో ప్రవేశించుట

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

గతే త్రైలోక్యరాజ్యే తు దానవేషు పురన్దరః ।
జగామ బ్రహ్మసదనం సహ దేవైః శచీపతిః ॥1॥

ఓ నారదా! త్రైలోక్యరాజ్యం దానవాధీనం కావడంతో శచీపతియైన ఇంద్రుడు దేవతలతో సహా బ్రహ్మలోకానికి వెళ్ళాడు.

తత్రాపశ్యత్స దేవేశం బ్రహ్మాణం కమలోద్భవమ్ ।
ఋషిభిః సార్ధమాసీనం పితరం స్వం చ కశ్యపమ్ ॥2॥

అక్కడ ఋషులతోను, తన తండ్రియైన కశ్యపునితోను కూడిన కమలోద్భవుడైన బ్రహ్మను దర్శించాడు.

తతో ననామ శిరసా శక్రః సురగణైస్సహ ।
బ్రహ్మాణం కశ్యపం చైవ తాంశ్చ సర్వాంస్తపోధనాన్ ॥3॥

అంతట దేవతలతో కూడిన ఇంద్రుడు బ్రహ్మగారికి, కశ్యపునకు, అచ్చటనున్న తపోధనులందరికి శిరస్సు వంచి నమస్కరించాడు.

ప్రోవాచేన్ద్రః సురైః సార్ధం దేవనాథం పితామహమ్ ।
పితామహ హృతం రాజ్యం బలినా బలినా మమ ॥4॥

దేవనాథుడైన పితామహునితో దేవగణసహితుడైన ఇంద్రుడు ఓ పితామహా! నా రాజ్యాన్ని బలి బలవంతంగా హరించాడని పలికాడు.

బ్రహ్మా ప్రోవాచ శక్రైతద్ భుజ్యతే స్వకృతం ఫలమ్ ।
శక్రః పప్రచ్ఛ భో బ్రూహి కిం మయా దుష్కృతం కృతమ్ ॥5॥

అంతట బ్రహ్మ ఇంద్రునితో అది అంతా నీ స్వయంకృత అపరాధ ఫలితమే అన్నాడు. దానికి శక్రుడు భగవాన్! నేను చేసిన దోషమేమిటో సెలవీయండని బ్రహ్మను ప్రశ్నించాడు.

కశ్యపోஉప్యాహ దేవేశం భ్రూణహత్యా కృతా త్వయా ।
దిత్యుదరాత్ త్వయా గర్భః కృత్తో వై బహుధా బలాత్ ॥6॥

అంతట అచ్చటనేయున్న కశ్యపుడు ఇంద్రా! అది భ్రూణహత్యాపాపం. దితి గర్భస్థపిండాన్ని నీవు అనేక ముక్కలు గావించిన పాపఫలమేనని ఇంద్రునకు తెలియజేశాడు.

పితరం ప్రాహ దేవేంద్రః స మాతుర్దోషతో విభో! ।
కృన్తనం ప్రాప్తవాన్ గర్భో యదశౌచా హి సాஉభవత్ ॥7॥

ఇంద్రుడు తన తండ్రియైన కశ్యపునితో ఇలా పలికాడు. "విభో! తల్లి గావించిన దోషం వలననే గర్భం ఛిన్నమయ్యింది. ఆమె గావించిన దోషమేమనగా ఆమె అశుచిగా ఉండడమే" అని పలికాడు.

తతోఽబ్రవీత్ కశ్యపస్తు మాతుర్దోషః సదాసతామ్ ।
గతస్తతో వినిహతో దాసోఽపి కులిశేన భో ॥8॥

అంతట కశ్యపుడు "అశౌచం వల్ల గర్భానికి దాసత్వం కలిగింది. కాని నీవా దాసుని కూడా వజ్రాయుధంతో సంహరించావు గదా!" అని ఇంద్రునితో పలికాడు.

తచ్ఛ్రుత్వా కశ్యపవచః ప్రాహ శక్రః పితామహమ్ ।
వినాశం పాప్మనో బ్రూహి ప్రాయశ్చిత్తం విభో మమ ॥9॥

కశ్యపుని పలుకులు వినిన శక్రుడు ప్రభో! అపరాధం జరిగింది. ఆ పాపానికి పరిహారం ప్రాయశ్చిత్తం సెలవీయండని ఖిన్నుడై పితామహుని ప్రార్థించాడు.

బ్రహ్మా ప్రోవాచ దేవేశం వసిష్ఠః కశ్యపస్తథా ।
హితం సర్వస్య జగతః శక్రస్యాపి విశేషతః ॥10॥

శంఖచక్రగదాపాణిర్మాధవః పురుషోత్తమః ।
తం ప్రపద్యస్వ శరణం స తే శ్రేయో విధాస్యతి ॥11॥

ఇంద్రుని ప్రార్థన విని, బ్రహ్మ, కశ్యపుడు, వసిష్ఠుడు, జగత్తునకు విశేషించి ఇంద్రునకు మేలు కలిగేటట్లు ఓ సహస్రాక్షా! శంఖచక్రగదాధరుడు, పురుషోత్తముడునగు మాధవుని శరణు వేడుకొనుము. ఆయన నీకు శ్రేయస్సును కలిగించగలడని హితం చెప్పారు.

సహస్రాక్షోఽపి వచనం గురూణాం స నిశమ్య వై ।
ప్రోవాచ స్వల్పకాలేన కస్మిన్ ప్రాప్యో బహూదయః ।
తమూచుర్దేవతా మర్త్యే స్వల్పకాలే మహోదయః ॥12॥

ఇత్యేవముక్తః సురరాడ్ విరించినా మరీచిపుత్రేణ చ కశ్యపేన ।
తథైవ మిత్రావరుణాత్మజేన వేగాన్ మహీపృష్ఠమవాప్య తస్థౌ ॥13॥

గురుజనుల హితవాక్యం విని, ఇంద్రుడు స్వల్పకాలంలో అధికమైన అభ్యుదయం సాధించడం ఎక్కడ వీలుపడుతుందో తెలుపమని అడుగగా ఆ మహర్షులు అది మర్త్యలోకంలోనే సాధ్యమని చెప్పారు. ఈ విధంగా బ్రహ్మ, కశ్యపుడు, వసిష్ఠుడు చెప్పిన సలహా వినిన ఇంద్రుడు తత్క్షణమే భూలోకానికి చేరుకున్నాడు.

కాలిఞ్జరస్యోత్తరతః సుపుణ్యస్తథా హిమాద్రేరపి దక్షిణస్థః ।
కుశస్థలాత్ పూర్వత ఏవ విశ్రుతో వసోః పురాత్ పశ్చిమతోఽవతస్థే ॥14॥

పూర్వం గయేన నృవరేణ యత్ర యష్టోఽశ్వమేధః శతకృత్సదక్షిణః ।
మనుష్యమేధః శతకృత్సహస్రకృత్ నరేన్ద్రసూయశ్చ సహస్రకృద్వై ॥15॥

కాలింజరక్షేత్రానికి ఉత్తరాన పవిత్రహిమవత్పర్వతానికి దక్షిణాన కుశస్థలికి తూర్పున వసుపురానికి పశ్చిమానగల పవిత్రక్షేత్రంలో పూర్వం రాజవరుడైన గయుడు సదక్షిణాకంగా నూరు అశ్వమేధయజ్ఞాలు, నూరు నరమేధయజ్ఞాలు, వేయి రాజసూయయాగాలు గావించాడు.

తథా పురా దుర్యజనః సురాసురైః ఖ్యాతో మహామేధ ఇతి ప్రసిద్ధః ।
యత్రాస్య చక్రే భగవాన్ మురారిః వాస్తవ్యమవ్యక్తతనుః ఖమూర్తిమత్ ॥16॥

ఖ్యాతిం జగామాథ గదాధరేతి మహాఘవృక్షస్య శితః కుఠారః ।
యస్మిన్ ద్విజేన్ద్రాః శ్రుతిశాస్త్రవర్జితాః సమత్వమాయాన్తి పితామహేన ॥17॥

సకృత్ పితౄన్ యత్ర చ సంప్రపూజ్య భక్త్యా త్వనన్యేన హి చేతసైవ ।
ఫలం మహామేధ మఖస్య మానవా లభన్త్యనన్త్యం భగవత్ ప్రసాదాత్ ॥18॥

మహానదీ యత్ర సురర్షికన్యా జలాపదేశాద్ధిమశైలమేత్య ।
చక్రే జగత్పాపవినష్టిమగ్ర్యాం సందర్శనప్రాశనమజ్జనేన ॥19॥

అంతేకాదు ఆ గయుడు ఆ ప్రదేశంలో సురాసురులకు దుష్కరమైన మహామేధమనే యజ్ఞం చేశాడు. ఆకాశరూపి, మురమర్దనుడు, అవ్యక్తరూపియునైన విష్ణువు ఆ ప్రదేశాన గదాధరుడుగా వెలిశాడు. ఆ ప్రదేశం భయంకరమైన పాపవృక్షాలను కూల్చే కుఠారంగా ప్రసిద్ధి గాంచింది. వేదశాస్త్రవర్జితులైన ద్విజులు కూడా ఆ ప్రదేశాన్ని సేవించినచో బ్రహ్మతో సమానులౌతారు. ఒక్క పర్యాయమైనా అక్కడ శ్రద్ధగా పిండదానంతో పితృపూజ చేస్తే అది మానవులకు అక్షయమైన మహామేధయజ్ఞఫలాన్నిస్తుంది. దేవర్షికన్యయైన మహానది జలరూపంలో హిమగిరివైపు ప్రవహిస్తూ ఆ ప్రదేశాన తన దర్శన స్నానజల ప్రాశనాదులచే జగత్తులోని పాపాలనన్నిటిని ప్రక్షాళనం చేస్తూ ఉంటుంది.

తత్ర శక్రః సమభ్యేత్య మహానద్యాస్తటేఽద్భుతే ।
ఆరాధనాయ దేవస్య కృత్వాఽఽశ్రమమవస్థితః ॥20॥

ఇంద్రుడు ఆ ప్రదేశానికి వెళ్ళి, అద్భుతమైన మహానదీతీరాన గదాధరుని ఆరాధించడానికి ఆశ్రమమేర్పాటు చేసికొని అక్కడే నిలచిపోయాడు.

ప్రాతః స్నాయీ త్వధః శాయీ ఏకభుక్తస్త్వయాచితః ।
తపస్తేపే సహస్రాక్షః స్తువన్దేవం గదాధరమ్ ॥21॥

తస్యైవం తప్యతః సమ్యగ్జితసర్వేంద్రియస్య హి ।
కామక్రోధవిహీనస్య సాగ్రః సంవత్సరో గతః ॥22॥

తతో గదాధరః ప్రీతో వాసవం ప్రాహ నారద ।
గచ్ఛ ప్రీతోఽస్మి భవతో ముక్తపాపోఽసి సాంప్రతమ్ ॥23॥

నిజం రాజ్యం చ దేవేశ ప్రాప్స్యసే న చిరాదివ ।
యతిష్యామి తథా శక్ర భావిశ్రేయో యథా తవ ॥24॥

నారదా! ప్రతిదినం ఉదయాన్నే నదిలో స్నానం చేసి, నేల మీద శయనిస్తూ, అయాచితంగా లభించినదేదైనా వుంటే రోజుకొక పర్యాయం భుజిస్తూ, సహస్రాక్షుడు గదాధరుని ఆరాధనలో తపించాడు. జితేంద్రియుడై, కామక్రోధాలు విడిచి ఒక సంవత్సరం అలా తపస్సు చేయగా గదాధరుడు సంతోషించి వాసవునితో ఇలా పలికాడు. "ఇంద్రా! నేను సంప్రీతుడనయ్యాను. నీ పాపాలన్నీ తొలగిపోయాయి. వెళ్ళుము. త్వరలోనే నీవు పోగొట్టుకున్న రాజ్యాన్ని తిరిగి పొందగలవు. నీకు శ్రేయస్సు కలిగేటట్లు ప్రయత్నం చేస్తాను".

ఇత్యేవముక్తోఽథ గదాధరేణ విసర్జితః స్నాప్య మనోహరాయామ్ ।
స్నాతస్య దేవస్య తదైనసో నరాస్తం ప్రోచురస్మాననుశాసయస్వ ॥25॥

ఇలా వరమిచ్చి గదాధరుడు వెళ్ళిన పిమ్మట ఇంద్రుడు మనోహరమైన ఆ నదిలో స్నానం చేసిన తరువాత ఆయన పాపాలతో పుట్టిన మానవులలో కొందరు ఆయనను సమీపించి, మాకు హితోపదేశం చేయమని అర్థించారు.

ప్రోవాచ తాన్ భీషణకర్మకారాన్ నామ్నా పులిందాన్ మమ పాపసంభవాః ।
వసధ్వమేవాన్తరమద్రిముఖ్యయోర్హిమాద్రికాలిఞ్జరయోః పులిందాః ॥26॥

ఇత్యేవముక్త్వా సురరాట్ పులిందాన్ విముక్తపాపోఽమరసిద్ధయక్షైః ।
సంపూజ్యమానోఽనుజగామ చాశ్రమం మాతుస్తదా ధర్మనివాసమీడ్యమ్ ॥27॥

అలా వచ్చిన క్రూరకర్ములైన పుళిందులనే కిరాతులను చూసి ఇంద్రుడిలా చెప్పాడు. "మీరు నా పాపఫలంగా జన్మించారు. ఓ పుళిందులారా! ఈ హిమాద్రి కాళింజరాలనే ప్రముఖపర్వతాల మధ్యదేశాన్ని నివాసంగా చేసికొని జీవించండి". అలా పుళిందులను ఆదేశించి, పాపముక్తుడైన వాసవుడు సురసిద్ధయక్షాదుల పూజలందుకుని ధర్మభూమియైన తన తల్లి ఆశ్రమానికి వెళ్ళాడు.

దృష్ట్వాఽదితిం మూర్ధ్ని కృతాంజలిస్తు వినమ్రమౌలిః సముపాజగామ ।
ప్రణమ్య పాదౌ కమలోదరాభౌ నివేదయామాస తపస్తదాత్మనః ॥28॥

తల్లియైన అదితిని చూసి, శిరసా ప్రణామం గావించి, తామరపువ్వులోని భాగం వలె మృదువుగా ఎఱ్ఱగానున్న ఆమె పాదాలను కన్నులకు అద్దుకుని తన తపస్సు విషయాన్ని నివేదించాడు.

పప్రచ్ఛ సా కారణమీశ్వరం తమాఘ్రాయ చాలింగ్య సహాశ్రుదృష్ట్యా ।
స చాచచక్షే బలినా రణే జయం తదాత్మనో దేవగణైశ్చ సార్ధమ్ ॥29॥

శ్రుత్వైవ సా శోకపరిప్లుతాంగీ జ్ఞాత్వా జితం దైత్యసుతైః సుతం తమ్ ।
దుఃఖాన్వితా దేవమనాద్యమీడ్యం జగామ విష్ణుం శరణం వరేణ్యమ్ ॥30॥

ఆమె అశ్రుపూరితనయనాలతో కుమారుని కౌగిలించుకుని, శిరస్సు మూర్కొని, తపస్సునకు కారణమేమని ప్రశ్నించగా శక్రుడు బలిదైత్యునితో యుద్ధంలో ఓడిపోయి, రాజ్యం కోల్పోవడం మున్నగు విషయమంతా వివరించాడు. ఇంద్రుని మాటలు వినిన ఆమె శోకపరిప్లుతాంగియై దితికుమారులచేత పరాభవింపబడిన తన సుతుని దుర్దశను తెలిసికొని, దుఃఖాన్వితయై, ఆద్యన్తరహితుడు, వరేణ్యుడునైన శ్రీమహావిష్ణువును ఆశ్రయించి, శరణు పొందింది.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కస్మిన్ జనిత్రీ సురసత్తమానాం స్థానే హృషీకేశమనన్తమాద్యమ్ ।
చరాచరస్య ప్రభవం పురాణమారాధయామాస శుభే వద త్వమ్ ॥31॥

ఓ మహర్షీ! ఆ దేవమాత ఏ ప్రదేశంలో చరాచర సృష్టికర్తయు, పురాణపురుషుడును, అనంతుడును, చరాచర జగత్తునకంతటికి జనకుడునైన హృషీకేశుని ఆరాధించినదో తెలియజేయండని ప్రార్థించాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్య మహర్షి పలికాడు.

సురారణిః శక్రమవేక్ష్య దీనం పరాజితం దానవనాయకేన ।
సితేఽథ పక్షే మకరర్క్షగేఽర్కే ఘృతార్చిషః స్యాదథ సప్తమేఽహ్ని ॥32॥

దృష్ట్వైవ దేవం త్రిదశాధిపం తం మహోదయే శక్రదిశాధిరూఢమ్ ।
నిరాశనా సంయతవాక్ సుచిత్తా తదోపతస్థే శరణం సురేన్ద్రమ్ ॥33॥

నారదా! తన పుత్రుడావిధంగా బలిచేతిలో ఓడిపోయి, దీనుడైయుండడం చూసి, అదితి మాఘశుద్ధ సప్తమి పవిత్ర దినాన తూర్పున ఉదయించిన త్రిదశాధిపతిని దర్శించి, మౌనం పాటించి, నిరాహారియై, తపోదీక్ష వహించింది. ఆ జగచ్చక్షువును ప్రపన్నురాలై ప్రార్థించింది.

అదితిరువాచ – అదితి పలికింది.

జయస్వ దివ్యాంబుజ కోశచౌర జయస్వ సంసారతరోః కుఠార ।
జయస్వ పాపేన్ధన జాతవేదస్తమౌఘసంరోధ నమో నమస్తే ॥34॥

దివ్యకమలాల గర్భస్థశోభను పరిహసించు సౌందర్యనిధీ! నీకు జయమగుగాక! సంసారతరువును ఛేదించు కుఠారమా! నీకు జయమగుగాక!, పాపాలనే కట్టెల పోగును భస్మం గావించు అగ్నిదేవా! నీకు జయమగుగాక!, పాపసంఘాలను నిరోధించు నీకు నమస్సులు.

నమోఽస్తు తే భాస్కర దివ్యమూర్తే త్రైలోక్యలక్ష్మీతిలకాయ తే నమః ।
త్వం కారణం సర్వచరాచరస్య నాథోఽసి మాం పాలయ విశ్వమూర్తే! ॥35॥

ఓ భాస్కరా!, దివ్యవిగ్రహా!, నీకు నమస్సులు. త్రైలోక్యలక్ష్మీనిధీ! నీకు నమస్సులు. చరాచరజగత్తుకంతటికి నీవే కారకుడవు. సమస్తజగత్తులకు నీవే ప్రభుడవు. ఓ విష్ణుమూర్తీ! నన్ను కాపాడుము.

త్వయా జగన్నాథ జగన్మయేన నాథేన శక్రో నిజరాజ్యహానిమ్ ।
అవాప్తవాన్ శత్రుపరాభవం చ తతో భవన్తం శరణం ప్రపన్నా ॥36॥

జగన్మయుడవు, జగత్పతివియైన నీ వల్లనే ఇంద్రుడు తన రాజ్యాన్ని కోల్పోయాడు. శత్రువులచే పరాభవింపబడ్డాడు. అందుచేతనే నేను నిన్ను శరణువేడాను. నన్ను రక్షింపుము.

ఇత్యేవముక్త్వా సురపూజితం సా ఆలిఖ్య రక్తేన హి చందనేన ।
సంపూజయిత్వా కరవీరపుష్పైః సంధూప్య ధూపైః కణమర్కభోజ్యమ్ ॥37॥

నివేద్య చైవాజ్యయుతం మహార్హమన్నం మహేన్ద్రస్య హితాయ దేవీ ।
స్తవేన పుణ్యేన చ సంస్తువన్తీ స్థితా నిరాహారమథోపవాసమ్ ॥38॥

తతో ద్వితీయేఽహ్ని కృతప్రణామా స్నాత్వా విధానేన చ పూజయిత్వా ।
దత్త్వా ద్విజేభ్యః కణకం తిలాజ్యం తతోఽగ్రతః సా ప్రయతా బభూవ ॥39॥

ఇలా స్తోత్రం చేసి, దేవమాత శ్రీసూర్యనారాయణుని ప్రతిమను రక్తచందనంతో రచించి, కరవీరపుష్పాలతో పూజించి, ధూపదీపాదులచేనర్చించి, ఆజ్యసమ్మిశ్రితమైన అన్నాన్ని నివేదన చేసింది. ఇంద్రుని క్షేమానికై స్వామిని స్తుతిస్తూ దేవజనని ఉపవాసం చేసింది. రెండవరోజు విధివిహితంగా స్నాన పూజాదికాలు నిర్వహించి, బ్రాహ్మణులకు సువర్ణం, తిలలు, ఆజ్యం దానం చేసి, ప్రణామం గావించింది.

తతః ప్రీతోఽభవద్భానుర్ఘృతార్చిః సూర్యమండలాత్ ।
వినిఃసృత్యాగ్రతః స్థిత్వా ఇదం వచనమబ్రవీత్ ॥40॥

వ్రతేనానేన సుప్రీతస్తవాహం దక్షనన్దిని ।
ప్రాప్స్యసే దుర్లభం కామం మత్ప్రసాదాన్న సంశయః ॥41॥

రాజ్యం త్వత్తనయానాం వై దాస్యే దేవి సురారణి ।
దానవాన్ ధ్వంసయిష్యామి సంభూయైవోదరే తవ ॥42॥

అంతట సంప్రీతుడై, ఘృతార్చియైన సూర్యనారాయణుడు సూర్యమండలంనుండి వెలువడి, దక్షకుమార్తెయైన అదితి ఎదుట నిలచి ఇలా పలికాడు. "ఓ దాక్షాయణీ! నీవు గావించిన వ్రతానికి సంతోషించాను. నా ప్రసాదం వల్ల దుర్లభమైనను నీ కోరిక నెరవేరుతుంది. ఇందులో సందేహం లేదు. ఓ దేవజననీ! నీ పుత్రులకు వారి రాజ్యం వారికి ఇచ్చేస్తాను. నీ కడుపున పుట్టి దైత్యులను నాశనం చేస్తాను" అని.

తద్వాక్యం వాసుదేవస్య శ్రుత్వా బ్రహ్మన్ సురారణిః ।
ప్రోవాచ జగతాం యోనిం వేపమానా పునః పునః ॥43॥

వాసుదేవుని ఈ పలుకులకు గడగడ వణుకుతున్న అదితి జగద్యోనియైన భగవానునితో ఇలా పలికింది.

కథం త్వాముదరేణాహం వోఢుం శక్ష్యామి దుర్ధరమ్ ।
యస్యోదరే జగత్సర్వం వసతే స్థాణుజఙ్గమమ్ ॥44॥

కస్త్వాం ధారయితుం నాథ! శక్తస్త్రైలోక్యధార్యసి ।
యస్య సప్తార్ణవాః కుక్షౌ నివసన్తి సహాద్రిభిః ॥45॥

ప్రభో! స్థావరజఙ్గమాత్మకమైన ఈ సృష్టిని ఉదరంలో పెట్టుకుని దుర్ధరుడుగానుండే నిన్ను నా కుక్షిలో నేనెట్లు ధరించగలను?. తండ్రీ!, జగన్నాథా!, ముల్లోకాలు ధరిస్తూ, పర్వత సమూహసహితమైన సప్తసాగరాలను ఉదరంలో నిలుపుకున్న నిన్ను ఈ లోకంలో ఎవరు భరించగలరు?.

తస్మాద్యథా సురపతిః శక్రః స్యాత్ సురరాడిహ ।
యథా చ న మమ క్లేశస్తథా కురు జనార్దన! ॥46॥

కాబట్టి ఓ జనార్దనా! నాకు క్లేశం కలుగని విధంగా ప్రయత్నించుము. శక్రుడు మరల సురపతి అయ్యేటట్లుగా ఎలా చేయాలో అలా చేయుమని అదితి జనార్దనుని ప్రార్థించింది.

విష్ణు రువాచ – విష్ణువు పలికాడు.

సత్యమేతన్మహాభాగే! దుర్ధరోఽస్మి సురాసురైః ।
తథాహి సంభవిష్యామి అహం దేవ్యుదరే తవ ॥47॥

ఆత్మానం భువనాన్ శైలాంస్త్వాం చ దేవి సకశ్యపామ్ ।
ధారయిష్యామి యోగేన మా విషాదం కృథాఽమ్బికే ॥48॥

తవోదరేఽహం దాక్షేయి సంభవిష్యామి వై యదా ।
తదా నిస్తేజసో దైత్యాః సంభవిష్యన్త్యసంశయమ్ ॥49॥

ఇత్యేవముక్త్వా భగవాన్ వివేశ తస్యాశ్చ భూయోఽరిగణప్రమర్దీ ।
స్వతేజసోఽంశేన వివేశ దేవ్యాః తదోదరే శక్రహితాయ విప్ర! ॥50॥

"మహాభాగే! నీవన్నది సత్యమే. సురాసురులచేత నేను దుర్ధరుడనైనప్పటికి నేను నీ కడుపునందే జన్మిస్తాను. ఓ అంబికే! యోగబలంతో నన్ను, ఈ లోకాలను, పర్వతాలను, కశ్యపునితో సహా నిన్ను కూడా కలుపుకుని నీ కడుపులో నుండియే జన్మిస్తాను. దిగులు పడవద్దు. నీకెలాంటి కష్టము కలుగనీయనమ్మా! ఓ దాక్షేయీ! నేను నీ గర్భంనుండి జన్మించగానే రాక్షసలోకమంతా నిర్జీవమైపోతుంది. ఇందులో సందేహంలేదు". ఓ విప్రోత్తమా! ఆ విధంగా దేవమాతను ఊరడించి, శత్రుమర్దనుడైన విష్ణుభగవానుడు తన సమస్తతేజంతో సూక్ష్మాంశతో ఇంద్రుని హితార్థమై అదితిగర్భంలో ప్రవేశించాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే విష్ణువరప్రదానం, అదితిగర్భప్రవేశో నామ షట్సప్తతితమోఽధ్యాయః ॥76॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో విష్ణువు అదితిగర్భంలో ప్రవేశించుట అనే డెబ్బైఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తసప్తతితమోఽధ్యాయః – డెబ్బైఏడవ అధ్యాయం
ప్రహ్లాదేన బలేఃశాపః – ప్రహ్లాదుడు బలిని శపించుట

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

దేవమాతుః స్థితే దేవే ఉదరే వామనాకృతౌ ।
నిస్తేజసోఽసురా జాతా యథోక్తం విశ్వయోనినా ॥1॥

దేవమాత ఉదరంలో వామనాకృతితో భగవంతుడు ప్రవేశించినంతనే ఆ స్వామి చెప్పిన విధంగానే దైత్యులందరు తమ తేజస్సును కోల్పోయారు.

నిస్తేజసోఽసురాన్ దృష్ట్వా ప్రహ్లాదం దానవేశ్వరమ్ ।
బలిర్దానవశార్దూల ఇదం వచనమబ్రవీత్ ॥2॥

అసురులు ఆ విధంగా తేజోవిహీనులు కావడం, దానవశ్రేష్ఠుడైన బలి చూచి దానవేశ్వరుడైన ప్రహ్లాదునితో ఇలా పలికాడు.

బలిరువాచ – బలి పలికాడు.

తాత నిస్తేజసో దైత్యాః కేన జాతాస్తు హేతునా ।
కథ్యతాం పరమజ్ఞోఽసి శుభాశుభవిశారద! ॥3॥

తాతా! మీరు పరమజ్ఞానులు. శుభాశుభవిశారదులు. మన రాక్షసవీరులందరు ఇలా తేజస్సు కోల్పోవడానికి కారణమేదో తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తత్పౌత్రవచనం శ్రుత్వా ముహూర్తం ధ్యానమాస్థితః ।
కిమర్థం తేజసో హానిరితి కస్మాదితీవ చ ॥4॥

పౌత్రుని పలుకులు వినిన ప్రహ్లాదుడు ముహూర్తకాలం ధ్యానమగ్నుడై అసురుల తేజోహానికి కారణమేమాయని ఆలోచించాడు.

స జ్ఞాత్వా వాసుదేవోత్థం భయ దైత్యేష్వనుత్తమమ్ ।
చింతయామాస యోగాత్మా క్వ విష్ణుః సాంప్రతం స్థితః ॥5॥

అందులకు కారణం వాసుదేవుని ద్వారా ఉత్పన్నమైన భయాతిరేకమేనని ప్రహ్లాదుడు తెలిసికొని యోగాత్ముడైన అతడు ఈ సమయంలో వాసుదేవుడెక్కడున్నాడా? యని ఆలోచింపసాగాడు.

అధోనాభేః సపాతాలాన్ సప్త సంచింత్య నారద ।
నాభేరుపరి భూరాదీంల్లోకాంశ్చతుర్మియాద్ వశీ ॥6॥

భూమిం చ పంకజాకారాం తన్మధ్యే పంకజాకృతిమ్ ।
మేరుం దదర్శ శైలేంద్రం శాతకౌంభం మహర్ధిమత్ ॥7॥

తస్యోపరి మహాపుర్యస్త్వష్టౌ లోకపతీంస్తథా ।
తేషాముపరి వైరాజీం దదృశే బ్రహ్మణః పురీమ్ ॥8॥

తదధస్తాన్మహాపుణ్యమాశ్రమం సురపూజితమ్ ।
దేవమాతుః స దదృశే మృగపక్షిగణైర్వృతమ్ ॥9॥

తాం దృష్ట్వా దేవజననీం సర్వ తేజోఽధికాం మునే ।
వివేశ దానవపతిరన్వేష్టుం మధుసూదనమ్ ॥10॥

స దృష్టవాన్ జగన్నాథం మాధవం వామనాకృతిమ్ ।
సర్వభూతవరేణ్యం తం దేవమాతురథోదరే ॥11॥

తం దృష్ట్వా పుండరీకాక్షం శంఖచక్రగదాధరమ్ ।
సురాసురగణైః సర్వైః సర్వతో వ్యాప్తవిగ్రహమ్ ॥12॥

తేనైవ క్రమయోగేన దృష్ట్వా వామనతాం గతమ్ ।
దైత్యతేజోహరం విష్ణుం ప్రకృతిస్థోఽభవత్తతః ॥13॥

నారదా! భగవంతుని నాభికి దిగువన గల సప్తపాతాళాలను ప్రహ్లాదుడు శోధించాడు. తదనంతరం అన్నింటిని తన వశంలోనుంచుకునేవాని నాభికి పైభాగాన గల భూలోకాది లోకాలలో వాసుదేవుని జాడ తెలిసికోవడానికి వెదకసాగాడు. మొదట పద్మాకారంలోనున్న భూమిని, అనంతరం దానికి మధ్యభాగంలో మహాసమృద్ధితో సంపన్నమైన సువర్ణకమలం ఆకారంలోనున్న పర్వతశ్రేష్ఠమైన మేరుపర్వతాన్ని దర్శించాడు. దానికి ఉపరిభాగంలో గల లోకపతుల ఎనిమిది మహాపట్టణాలను దర్శించాడు. వాటికిపైన చక్కగా ప్రకాశిస్తున్న బ్రహ్మపురియైన వైరాజాన్ని చూశాడు. దానికి దిగువభాగంలో మృగపక్షిసమాకులమైనట్టియు, సురలచే పూజింపబడుచున్నట్టియు, పుణ్యాశ్రమం కన్పించింది. ఓ నారదా! ఆ ఆశ్రమంలో దేవమాత అదితిని చూచాడు. సర్వతేజోధికురాలైన దేవమాతను చూసి, దానవపతియైన ప్రహ్లాదుడు మధుసూదనుని వెదకడానికి ఆమెలో ప్రవేశించాడు. ఆ దేవమాత యొక్క ఉదరభాగంలో జగత్పిత, సర్వభూతవరేణ్యుడునైన మాధవుని వామనాకృతిలో దర్శించాడు. ఆ పుండరీకాక్షుడు శంఖచక్రగదాధారియై, సురాసుర పరివేష్టితుడై, సర్వత్రా వ్యాపించి, క్రమంగా మరుగుజ్జు ఆకారంలో యోగశక్తి ద్వారా మాతృకుక్షిస్థుడై కనిపించాడు. దైత్యలోకతేజోహరుడుగా ఆ విష్ణుని గుర్తించి, ప్రహ్లాదుడు ధ్యానముద్రను వీడి, ప్రకృతిస్థుడైనాడు.

అథోవాచ మహాబుద్ధిర్విరోచనసుతం బలిమ్ ।
ప్రహ్లాదో మధురం వాక్యం ప్రణమ్య మధుసూదనమ్ ॥14॥

అంతట ప్రహ్లాదుడు మనసా మధుసూదనునకు ప్రణామం గావించి, మహామతియైన విరోచనుని కుమారుడైన బలితో మధురమైన వాక్యాలు ఇలా పలికాడు.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

> **శ్రూయతాం సర్వమాఖ్యాస్యే యతో వో భయమాగతమ్ ।**
> **యేన నిస్తేజసో దైత్యా జాతా దైత్యేంద్రహేతునా ॥15॥**
>
> **భవతా నిర్జితా దేవాః సేన్ద్రరుద్రార్కపావకాః ।**
> **ప్రయాతాః శరణం దేవం హరిం త్రిభువనేశ్వరమ్ ॥16॥**
>
> **స తేషాం అభయం దత్త్వా శక్రాదీనాం జగద్గురుః ।**
> **అవతీర్ణో మహాబాహురదిత్యా జఠరే హరిః ॥17॥**
>
> **హృతాని వస్తేన బలే తేజాంసీతి మతిర్మమ ।**
> **నాలం తమో విషహితుం స్థాతుం సూర్యోదయం బలే ॥18॥**

"వత్సా! మనకందరకు ఎక్కడినుండి భయం వచ్చిందో, దేనివలన దైత్యులందరు తేజోహీనులయ్యారో దానికి కారణమేమిటో వివరంగా చెబుతాను. వినుము. నీచేతిలో ఓడిపోయిన ఇంద్ర, రుద్ర, సూర్యాగ్నులతో కూడిన దేవతలందరు త్రిభువనేశ్వరుడు, దేవదేవుడునైన హరి కడకు పోయి, శరణు వేడారు. జగద్గురుడైన హరి ఇంద్రాదులకు అభయమిచ్చి తాను అదితిగర్భంలో ప్రవేశించాడు. ఓ బలీ! అతడే మనవారందరి తేజస్సు హరించాడని నా విశ్వాసం. అంధకారం సూర్యోదయాన్ని ఎక్కవ సేపు ఆపలేదు గదా!'.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

> **ప్రహ్లాదవచనం శ్రుత్వా క్రోధప్రస్ఫురితాధరః ।**
> **ప్రహ్లాదమాహాథ బలిర్భావికర్మప్రచోదితః ॥19॥**

ఓ నారదా! ప్రహ్లాదుని పలుకులు విని, కోపంతో పెదవులు కంపింపగా భావికర్మప్రచోదితుడైన బలి ప్రహ్లాదునితో ఇలా పలికాడు.

బలిరువాచ – బలి పలికాడు.

> **తాత కోఽయం హరిర్నామ యతో నో భయమాగతమ్ ।**
> **సన్తి మే శతశో దైత్యా వాసుదేవబలాధికాః ॥20॥**
>
> **సహస్రశో యైరమరాః సేంద్రరుద్రాగ్నిమారుతాః ।**
> **నిర్జిత్య త్యాజితాః స్వర్గం భగ్నదర్పా రణాజిరే ॥21॥**
>
> **యే సూర్యస్య రథాత్ వేగాచ్చక్రం కృష్టం మహాజవమ్ ।**
> **స విప్రచిత్తిర్బలవాన్ మమ సైన్యపురస్సరః ॥22॥**
>
> **అయః శంకుః శివః శంభురసిలోమా విలోమకృత్ ।**
> **త్రిశిరా మకరాక్షశ్చ వృషపర్వా నతేక్షణః ॥23॥**

ఏతే చాన్యే చ బలినో నానాయుధవిశారదాః ।
యేషామేకైకశో విష్ణుః కలాం నార్హతి షోడశీమ్ ॥24॥

"తాతా! మనవారందరి భయాలకు కారణంగా నీవు చెబుతున్న హరి ఎవ్వడు?. ఆ వాసుదేవుని మించిన బలాఢ్యులు నా రాక్షసగణంలో వందలాదిమంది ఉన్నారు. ఇంద్రాగ్ని రుద్రమరుద్గణాలకు చెందిన వేలాది దేవతల దర్పాన్ని భగ్నంచేసి, వారినందరిని యుద్ధంలో ఓడించి, స్వర్గాన్ని విడిచేటట్లు మనవీరులు చేశారు. పరుగిడుతున్న సూర్యుని రథచక్రాన్ని బలవంతంగా ఊడబెరికి విసరికొట్టిన మహాబలుడు విప్రచిత్తి నా సేనానాయకుడు. అయశ్శంకుడు, శివుడు, శంభుడు, అసిలోముడు, విలోమకృత్తు, త్రిశిరుడు, మకరాక్షుడు, వృషపర్వుడు, నతేక్షణుడు, వీరు ఇంకా ఎందరో బలశాలురు, నానాయుధ విశారదులు మన పక్షాన ఉన్నారు. వీరిలో ఏఒక్కని పరాక్రమంలోనైనా పదహారవవంతు పరాక్రమానికికూడా సరికానివాడు ఆ శ్రీహరి".

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

పౌత్రస్యైతద్వచః శ్రుత్వా ప్రహ్లాదః క్రోధమూర్ఛితః ।
ధిగ్ధిగిత్యాహ స బలిం వైకుంఠాక్షేపవాదినమ్ ॥25॥

పౌత్రుని ఈ పలుకులు విని, ప్రహ్లాదుడు క్రోధతామ్రాక్షుడై, వైకుంఠుని ఆక్షేపిస్తున్న అతనిని ధిక్కరిస్తూ, ధిక్ ధిక్ అంటూ ఇలా పలికాడు.

ధిక్ త్వాం పాపసమాచారం దుష్టబుద్ధిం సుబాలిశమ్ ।
హరిం నిందయతో జిహ్వా కథం న పతితా తవ ॥26॥

"ఛీ! ఛీ! మూర్ఖా! దుష్టాత్మా! పాపకర్మా! నీది ఎంతటి పాపిష్టినాలుకరా? ఓరీ! బాలిశుడా! శ్రీహరిని నిందించిన నీ నాలుక ఇంకా తెగి నేలమీద ఎందుకు పడలేదో గదా!.

శోచ్యస్త్వమసి దుర్బుద్ధే! నిందనీయోఽసి సాధుభిః ।
యత్ త్రైలోక్యగురుం విష్ణుమభినిందసి దుర్మతే! ॥27॥

ఓ దుర్బుద్ధీ! త్రిలోకగురువైన విష్ణునింద గావించిన నీవు సాధువులచే నిందింపదగినవాడవు. నీ దుర్బుద్ధి ఎంతైనా చింతింపదగినదిరా!.

శోచ్యశ్చాస్మి న సందేహో యేన జాతః పితా తవ ।
యస్య త్వం కర్కశః పుత్రో జాతో దేవావమాన్యకః ॥28॥

నీవంటివానియొక్క తండ్రిని కన్నందుకు నేనెంతో విచారిస్తున్నాను. నీవంటి కఠోరుడు, దేవనిందకుడు, పౌత్రుడగుట నా దౌర్భాగ్యము.

భవాన్ కిల విజానాతి తథా చామీ మహాసురాః ।
యథా నాన్యః ప్రియః కశ్చిన్మమ తస్మాజ్జనార్దనాత్ ॥29॥

నీవు, ఈ రాక్షసగణము నాకు జనార్దనునికంటే ప్రియులు కారు. నాకు జనార్దనునికంటే వేరే ఏ ఒక్కడు ప్రియుడు కాదు.

జానన్నపి ప్రియతరం ప్రాణేభ్యోఽపి హరిం మమ ।
సర్వేశ్వరేశ్వరం దేవం కథం నిందితవానసి ॥30॥

నాకు ప్రాణాలకంటే ప్రియతరమైనవాడు సర్వేశ్వరేశ్వరుడు, దేవుడునైన శ్రీహరియని తెలిసి కూడా నీవెలా శ్రీహరిని నిందించగలిగావు?.

గురుః పూజ్యస్తవ పితా పూజ్యస్తస్యాప్యహం గురుః ।
మమాపి పూజ్యో భగవాన్ గురుర్లోకగురుర్హరిః ॥31॥

నీకు నీ తండ్రి పూజ్యుడు. నీ తండ్రియైన విరోచనునకు నేను తండ్రినిగాన పూజ్యుడను. గురువును. ఇక నాకు లోకగురువైన శ్రీమహావిష్ణువు పూజ్యతముడైన గురువు. శ్రీమహావిష్ణువు గురువులకే గురువు.

గురోర్గురుగురుర్మూఢ! పూజ్యః పూజ్యతమస్తవ ।
పూజ్యం నిందయతే పాప కథం న పతితోఽస్యధః ॥32॥

మూఢుడా! గురువుల గురువుకే గురువు, పరమగురువునైన ఆ శ్రీహరి నీకు పూజ్యుడు. పూజ్యతముడు, పాపాత్ముడా! అటువంటి పూజనీయుని నిందించిన నీవింకను అధఃపతనం ఎందులకు పొందలేదు?

శోచనీయా దురాచారా దానవామీ కృతాస్త్వయా ।
యేషాం త్వం కర్కశో రాజా వాసుదేవస్య నిన్దకః ॥33॥

నీ మూలంగా ఈ దానవజాతి యావత్తు అప్రతిష్ఠ పాలయ్యింది. నీవంటి క్రూరుడు, వాసుదేవనిందకుడు రాజుగా ఉండడం వీరి దౌర్భాగ్యం.

యస్మాత్ పూజ్యోఽర్చనీయశ్చ భవతా నిన్దితో హరిః ।
తస్మాత్పాపసమాచారరాజ్యనాశమవాప్నుహి ॥34॥

జగత్పూజ్యుడు, అర్చనీయుడునైన హరి నీచే నిందింపబడ్డాడు. నీవు చేసిన ఈ పాపకర్మ ఫలంగా నీకు రాజ్యనాశనం కలుగుతుంది.

యథా నాన్యత్ ప్రియతరం విద్యతే మమ కేశవాత్ ।
మనసా కర్మణా వాచా రాజ్యభ్రష్టస్తథా పత ॥35॥

త్రికరణశుద్ధిగా నాకు కేశవుడే ప్రియతముడైతే నీవు రాజ్యభ్రష్టుడవైపోతావు. పొమ్ము!.

యథా న తస్మాదపరం వ్యతిరిక్తం హి విద్యతే ।
చతుర్దశసు లోకేషు రాజ్యభ్రష్టస్తథా పత ॥36॥

చతుర్దశభువనాలలో ఆ దేవుని రూపం గాని వస్తువేదీ లేకపోవడం సత్యమైతే నీవు రాజ్యభ్రష్టుడవై, పతితుడవౌతావు పొమ్ము!

సర్వేషామపి భూతానాం నాన్యల్లోకే పరాయణమ్ ।
యథా తథాఽనుపశ్యేయం భవన్తం రాజ్యవిచ్యుతమ్ ॥37॥

సృష్టిలోని సకలభూతజాలానికి శ్రీహరికంటె శరణ్యమంటూ వేరే లేకపోయినట్లయితే నీవు రాజ్యభ్రష్టుడవు కావడం త్వరలోనే నేను చూస్తాను".

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏవముచ్చారితే వాక్యే బలిః సత్వరితస్తదా ।
అవతీర్యాసనాద్ బ్రహ్మన్ కృతాంజలిపుటో బలీ ॥38॥

శిరసా ప్రణిపత్యాహ ప్రసాదం యాతు మే గురుః ।
కృతాపరాధానపి హి క్షమన్తి గురవః శిశూన్ ॥39॥

బ్రాహ్మణోత్తమా! ప్రహ్లాదుడు ఇలా పలుకగానే బలి వేగంగా ఆసనంనుండి దిగి, చేతులు జోడించి, ప్రహ్లాదునకు శిరసా నమస్కరించి, పాదాలు పట్టుకుని, ఇలా విన్నపం చేశాడు. గురుజనులు నా యెడ దయ చూపుదురుగాక! శిశువులు అపరాధం చేసినప్పటికి గురువులు క్షమిస్తారు గదా!.

తత్సాధు యదహం శప్తో భవతా దానవేశ్వర! ।
న బిభేమి పరేభ్యోఽహం న చ రాజ్యపరిక్షయాత్ ॥40॥

నైవ దుఃఖం మమ విభో యదహం రాజ్యవిచ్యుతః ।
దుఃఖం కృతాపరాధత్వాద్ భవతో మే మహత్తరమ్ ॥41॥

ఓ దానవేశ్వరా! నేను మీచే శపింపబడడం చాలా మంచిది. నేను శత్రువులకు గాని, రాజ్యనాశనానికి గాని భయపడేవాడను కాను. నేను మీపట్ల చేసిన మహాపరాధం ముందు రాజ్యచ్యుతివలన నాకు కలిగిన దుఃఖం దుఃఖమే కాదు. ఈ అపరాధం చేయడం వల్ల కలిగిన దుఃఖం మహత్తరమైనది.

తత్ క్షమ్యతాం తాత మమాపరాధో బాలోఽస్త్యనాథోఽస్మి సుదుర్మతిశ్చ ।
కృతేఽపి దోష్యే గురవః శిశూనాం క్షమన్తి దైన్యం సముపాగతానామ్ ॥42॥

మూర్ఖుడనై మీ మనస్సు నొప్పించిన నా అపరాధాన్ని క్షమించండి. పితామహా! నేను బాలుడను. అనాథుడను, దుర్మతిని, దీనులై దరిచేరి ప్రార్థించిన శిశువుల అపరాధాలెట్టివైన పెద్దలు వారిని క్షమిస్తారు గదా!".

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

స ఏవముక్తో వచనం మహాత్మా విముక్తమోహో హరిపాదభక్తః ।
చిరం విచిన్త్యాద్భుతమేతదిత్థమువాచ పౌత్రం మధురం వచోఽథ ॥43॥

బలి ఇలా వేడుకొనగా మహాత్ముడు, హరిభక్తాగ్రేసరుడునైన ప్రహ్లాదుడు క్షణికోద్రేకం వదలిపెట్టి, తన తొందరపాటునకు ఆశ్చర్యపడి, మనుమని బుజ్జగిస్తూ మధురవచనాలతో ఇలా ఓదార్చాడు.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

తాత మోహేన మే జ్ఞానం వివేకశ్చ తిరస్కృతః ।
యేన సర్వగతం విష్ణుం జానంస్త్వాం శప్తవానహమ్ ॥44॥

నూనమేతేన భావ్యం వై భవతో యేన దానవ ।
మమావిశన్ మహాబాహో వివేకప్రతిషేధకః ॥45॥

తస్మాద్ రాజ్యం ప్రతి విభో న జ్వరం కర్తుమర్హసి ।
అవశ్యం భావినో హ్యర్థా న వినశ్యన్తి కర్హిచిత్ ॥46॥

పుత్రమిత్రకలత్రార్థే రాజ్యభోగధనాయ చ ।
ఆగమే నిర్గమే ప్రాజ్ఞో న విషాదం సమాచరేత్ ॥47॥

యథా యథా సమాయాన్తి పూర్వకర్మవిధానతః ।
సుఖదుఃఖాని దైత్యేంద్ర! నరస్తాని సహేత్తథా ॥48॥

ఆపదామాగమం దృష్ట్వా న విషణ్ణో భవేద్వశీ ।
సంపదం చ సువిస్తీర్ణాం ప్రాప్య నోఽధృతిమాన్భవేత్ ॥49॥

ధనక్షయే న ముహ్యన్తి న హృష్యన్తి ధనాగమే ।
ధీరాః కార్యేషు చ సదా భవన్తి పురుషోత్తమాః ॥50॥

“నాయనా!, బలీ! క్షణిక మోహం నా వివేకాన్ని మరుగున పడవేసింది. జ్ఞానాన్ని అపహరించింది. కాబట్టి విష్ణువు సర్వోపగతుడనే సత్యం తెలిసి కూడా నిన్ను శపించాను. ఓ దానవా! భవితవ్యం ఇలా ఉన్నందులకే కాబోలు క్షణికమైన మోహం నా వివేకాన్ని అడ్డగించింది. కాబట్టి ఓ రాజా! రాజ్యం పట్ల అనురాగం పెట్టుకొనవద్దు. కానున్న పనులు కాకమానవు. వాటినెవ్వరు అడ్డుకోలేరు. పుత్ర మిత్ర కళత్ర ధన రాజ్యాదులు సంప్రాప్తించినప్పుడు సంతోషించడం గాని, నశించిన సమయంలో దుఃఖించడం గాని ప్రాజ్ఞుడు చేయరాదు. దైత్యేంద్రా! పూర్వకర్మవిధి ననుసరించి, ఏ ఏ సుఖదుఃఖాలు సంప్రాప్తిస్తాయో వాటిని మానవుడు సహనంతో అనుభవించ వలసినదే. ఆపదలు రావడం చూసి ఉత్తముడైనవాడు బాధపడడు. అట్లే విస్తారమైన ధనం వచ్చి చేరినవేళ ధృతిమంతుడు ఆనందంతో గంతులు వేయడు. ధనక్షయం కలిగినప్పుడు దుఃఖింపనివారు, సంపదలు కలిగినప్పుడు ఆనందింపనివారు, స్వకర్మాచరణలో ధీరులైనవారు ఎల్లప్పుడు పురుషోత్తములే అవుతారు. అటువంటివారు పురుషోత్తములు”.

ఏవం విదిత్వా దైత్యేన్ద్ర! న విషాదం కథంచన ।
కర్తుమర్హసి విద్వాంస్త్వం పండితో నావసీదతి ॥51॥

తథాఽన్యచ్చ మహాబాహో! హితం శృణు మహార్థకమ్ ।
భవతోఽథ తథాఽన్యేషాం శ్రుత్వా తచ్చ సమాచర ॥52॥

శరణ్యం శరణం గచ్ఛ తమేవ పురుషోత్తమమ్ ।
స తే త్రాతా భయాదస్మాద్ దానవేన్ద్ర! భవిష్యతి ॥53॥

యే సంశ్రితా హరిమనన్తమనాదిమధ్యం విష్ణుం చరాచరగురుం హరిమీశితారమ్ ।
సంసారగర్తపతితస్య కరావలమ్బం నూనం న తే భువి నరా జ్వరితో భవన్తి ॥54॥

తన్మనా దానవశ్రేష్ఠ! తద్భక్తశ్చ భవాధునా ।
స ఏవ భవతః శ్రేయో విధాస్యతి జనార్దనః ॥55॥

అహం చ పాపోపశమార్థమీశమారాధ్య యాస్యే ప్రతితీర్థయాత్రామ్ ।
విముక్తపాపశ్చ తతో గమిష్యే యత్రాచ్యుతో లోకపతిర్నృసింహః ॥56॥

ఓ దైత్యేంద్రా! నీవు విద్వాంసుడవు, పండితుడవు, కావున ఈ సత్యం తెలిసికొని ఎప్పుడూ బాధపడరాదు. పండితుడైనవాడు ఎన్నడు విషాదాన్ని దరి చేరనీయడు. అంతేగాక నీకు అర్థగర్భితమైన మరొక హితవాక్యం కూడా చెబుతున్నాను. అది నీ క్షేమానికి, ఇతరుల క్షేమానికి, లోకక్షేమానికి కూడా ఆవశ్యకము. తప్పక ఆచరింపుము. దానవేంద్రా! సర్వభావేన శరణ్యుడైన పురుషోత్తముని శరణు బొందుము. ఈ భయంనుండి నిన్ను రక్షింపగలవాడు ఆయన మాత్రమే. అనంతుడు, ఆదిమధ్యాన్తరహితుడు, చరాచరజగద్గురువు, ఈశ్వరుడు, సంసారకూపంలో పడినవారికి చేయూతయైనవాడునగు శ్రీహరిని ఆశ్రయించినవారలకు ఏతాపములు కలుగవు. దానవశ్రేష్ఠా! నీ మనస్సును శ్రీమహావిష్ణువునందే లగ్నం చేసియుంచుము. ఆయన భక్తుడవు కమ్ము. ఆ జనార్దనుడే నీకు సమస్త శ్రేయస్సులు సమకూర్చగలడు. నేను కూడా పాపపరిహారార్థం ఈశ్వరునారాధించి, తదనంతరం తీర్థయాత్రలకు వెళతాను. నేను పాపవిముక్తుడనైనంతనే జగత్పతి, అచ్యుతుడునైన నృసింహస్వామిని చేరుకుంటాను.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవమాశ్వాస్య బలిం మహాత్మా సంస్మృత్య యోగాధిపతిం చ విష్ణుమ్ ।
ఆమంత్ర్య సర్వాన్ దనుయూథపాలాన్ జగామ కర్తుం త్వథ తీర్థయాత్రామ్ ॥57॥

ఓ నారదా! మహాత్ముడైన ప్రహ్లాదుడావిధంగా బలిని ఊరడించి, హితవచనాలు పలికి, యోగీశ్వరుడైన శ్రీహరిని స్మరిస్తూ, దానవగణాధిపులందరికి వీడ్కోలు పలికి, తీర్థయాత్రలకై బయలుదేరాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే ప్రహ్లాదేన బలేః శాపో నామ సప్తసప్తతితమోఽధ్యాయః ॥77॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో ప్రహ్లాదుడు బలిని శపించుట అనే డెబ్బైఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టసప్తతితమోఽధ్యాయః – డెబ్బైఎనిమిదవ అధ్యాయం

ధుంధుపరాజయకథనమ్ – ధుంధుపరాజయకథనం

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కాని తీర్థాని విప్రేన్ద్ర ప్రహ్లాదోఽనుజగామ హ ।
ప్రహ్లాదతీర్థయాత్రాం మే సమ్యగాఖ్యాతుమర్హసి ॥1॥

ఓ విప్రేంద్రా! ప్రహ్లాదుడు ఏ యే తీర్థాలకు వెళ్ళాడు?. ప్రహ్లాదుని తీర్థయాత్రా విశేషాలను నాకు చక్కగా వివరించవలసినదిగా కోరుతున్నాను.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శృణుష్వ కథయిష్యామి పాపపంకప్రణాశినీమ్ ।
ప్రహ్లాదతీర్థయాత్రాం తే శుద్ధపుణ్య ప్రదాయినీమ్ ॥2॥

ఓ నారదా! వినుము! పాపపంకాన్ని ప్రక్షాళనం చేయగలిగినదియు, శుద్ధపుణ్యప్రదాయినియునైన ప్రహ్లాదుని తీర్థయాత్రావిశేషాలు చెబుతున్నాను శ్రద్ధగా వినుము.

సంత్యజ్య మేరుం కనకాచలేన్ద్రం తీర్థం జగామామరసంఘజుష్టమ్ ।
ఖ్యాతం పృథివ్యాం శుభదం హి మానసం యత్ర స్థితో మత్స్యవపుః సురేశః ॥3॥

ప్రహ్లాదుడు బంగారు పర్వతం మేరువును వదలి భూలోకంలో దేవతలచే చుట్టబడి, కళ్యాణప్రదంగా భావింపబడే మానసతీర్థానికి వెళ్ళాడు. ఆ తీర్థంలోనే శ్రీహరి మత్స్యశరీరంలో ఉన్నాడు.

తస్మింస్తీర్థవరే స్నాత్వా సంతర్ప్య పితృదేవతాః ।
సంపూజ్య చ జగన్నాథమచ్యుతం శ్రుతిభిర్యుతమ్ ॥4॥

ఉపోష్య భూయః సంపూజ్య దేవర్షిపితృమానవాన్ ।
జగామ కచ్ఛపం ద్రష్టుం కౌశిక్యాం పాపనాశనమ్ ॥5॥

శ్రేష్ఠమైన ఆ తీర్థంలో స్నానం చేసి, పితృదేవతలకు తర్పణాలు చేసి, అచ్చటనున్న అచ్యుతుని వేదోక్తవిధిగా పూజించి, ఉపవసించి, దేవఋషిపితృమానవులను అర్చించి, పాపనాశినియగు కౌశికీ తటానగల కూర్మభగవానుని దర్శించడానికి వెళ్ళాడు.

తస్యాం స్నాత్వా మహానద్యాం సంపూజ్య చ జగత్పతిమ్ ।
సముపోష్య శుచిర్భూత్వా దత్త్వా విప్రేషు దక్షిణామ్ ॥6॥

నమస్కృత్య జగన్నాథమథ కూర్మవపుర్ధరమ్ ।

ఆ మహానదిలో స్నానం చేసి, జగన్నాథుని బాగా పూజించి, ఉపవసించి, శుచియై, విప్రులకు దక్షిణలిచ్చాడు. అచ్చటనున్న కూర్మరూపధారియైన జగన్నాథునకు మరల నమస్కరించాడు.

తతో జగామ కృష్ణాఖ్యం ద్రష్టుం వాజిముఖం ప్రభుమ్ ॥7॥

తత్ర దేవహ్రదే స్నాత్వా తర్పయిత్వా పితౄన్ సురాన్ ।
సంపూజ్య హయగ్రీవం చ జగామ గజసాహ్వయమ్ ॥8॥

తత్ర దేవం జగన్నాథం గోవిందం చక్రపాణినమ్ ।
స్నాత్వా సంపూజ్య విధివజ్జగామ యమునాం నదీమ్ ॥9॥

తస్యాం స్నాతః శుచిర్భూత్వా సంతర్ప్యర్షిసురాన్ పితౄన్ ।
దదర్శ దేవదేవేశం లోకనాథం త్రివిక్రమమ్ ॥10॥

అటుపిమ్మట కృష్ణుడనే పేరుగల హయముఖవిష్ణుదేవుని సన్నిధికి వెళ్ళాడు. అక్కడ పవిత్రసరస్సులో మునిగి, దేవపితృతర్పణాలు గావించి, హయగ్రీవమూర్తిని పూజించి, అక్కడినుండి పవిత్ర క్షేత్రమైన హస్తినాపురికి వెళ్ళాడు. అక్కడ విధ్యుక్తంగా స్నానం చేసి, చక్రపాణి గోవిందుని పూజించి, అక్కడినుండి యమునానదికి వెళ్ళాడు. ఆ నదిలో స్నాతుడై, శుచిర్భూతుడై, దేవర్షి పితృదేవతలకు తర్పణాలిచ్చి, దేవదేవేశుడు, లోకనాథుడునైన త్రివిక్రముని దర్శించాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

సాంప్రతం భగవాన్ విష్ణుస్త్రైలోక్యాక్రమణం వపుః ।
కరిష్యతి జగత్స్వామీ బలేర్బంధనమీశ్వరః ॥11॥

తత్కథం పూర్వకాలేఽపి విభురాసీత్ త్రివిక్రమః ।
కస్య వా బంధనం విష్ణుః కృతవాంస్తచ్చ మే వద ॥12॥

మహర్షీ! ఇదేమి? ప్రస్తుతం వామనదేవుడు ఆవిర్భవించి, బలిని బంధించి, ముల్లోకాలను ఆక్రమించబోవు చుండగా ఇంతకు పూర్వమే త్రివిక్రముడు వెలసినట్లు చెబుతున్నారు గదా! ఇది ఎలా కుదురుతుంది? అప్పుడు విష్ణువు ఎవరిని బంధించాడో తెలియజేయండని నారదుడు పులస్త్యమహర్షిని ప్రశ్నించాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రూయతాం కథయిష్యామి యోఽయం ప్రోక్త స్త్రివిక్రమః ।
యస్మిన్కాలే సంబభూవ యం చ వంచితవానసౌ ॥13॥

ఓ నారదా! చెబుతాను వినుము. ఆ విష్ణువు ఎవరో, ఎప్పుడు అవతరించాడో, ఎవరిని వంచించాడో, ఆ త్రివిక్రముడెవరో చెబుతాను.

ఆసీద్ ధున్ధురితి ఖ్యాతః కశ్యపస్యౌరసః సుతః ।
దనుగర్భసముద్భూతో మహాబలపరాక్రమః ॥14॥

స సమారాధ్య వరదం బ్రహ్మాణం తపసాఽసురః ।
అవధ్యత్వం సురైః సేంద్రైః ప్రార్థయత్ స తు నారద ॥15॥

తద్వరం తస్య చ ప్రాదాత్ తపసా పంకజోద్భవః ।
పరితుష్టః స చ బలీ నిర్జగామ త్రివిష్టపమ్ ॥16॥

చతుర్థస్య కలేరాదౌ జిత్వా దేవాన్ సవాసవాన్ ।
ధున్ధుః శక్రత్వమకరోద్ధిరణ్యకశిపౌ సతి ॥17॥

తస్మిన్కాలే స బలవాన్ హిరణ్యకశిపుస్తతః ।
చచార మన్దరగిరౌ దైత్యం ధున్ధుం సమాశ్రితః ॥18॥

తతోఽసురా యథా కామం విహరన్తి త్రివిష్టపే ।
బ్రహ్మలోకే చ త్రిదశాః సంస్థితా దుఃఖసంయుతాః ॥19॥

ధున్ధుడనే కశ్యపముని ఔరసుడు దను గర్భాన జన్మించాడు. వాడు మహాబలపరాక్రమవంతుడు. అతడు తపస్సు ద్వారా బ్రహ్మను బాగుగా ఆరాధించి, మెప్పించి, ఇంద్రాది సమస్తదేవతలచేత మరణం లేకుండా వరం కోరాడు. పంకజోద్భవుడైన బ్రహ్మ అతనికి కోరిన వరం ప్రసాదించాడు. దానితో అతడు పరితుష్టుడై విజృంభించి స్వర్గం మీదకు దండెత్తాడు. నాల్గవ కలియుగారంభంలో వాడలా విజృంభించి, ఇంద్రాది దేవతలను పారద్రోలి, తానే ఇంద్రాసనం మీద కూర్చున్నాడు. అది హిరణ్యకశిపుడు జీవించివున్న సమయం. ఆ ధుంధుని ఆశ్రయించి హిరణ్యకశిపుడు విక్రమించి, మందరగిరి ప్రదేశంలో సంచరిస్తూ ఉండగా అసురులందరు త్రివిష్టపంలో యథేచ్ఛగా విహరింపసాగారు. దేవతలందరు దుఃఖార్తులై, బ్రహ్మలోకంలో నున్నారు.

తతోఽమరాన్ బ్రహ్మసదో నివాసినః శ్రుత్వాఽథ ధున్ధుర్దితిజానువాచ ।
వ్రజామ దైత్యా వయమగ్రజస్య సదో విజేతుం త్రిదశాన్ సశక్రాన్ ॥20॥

అలా దేవతలు బ్రహ్మలోకంలో ఉంటున్నారని విని, ధుంధుడు దైత్యులతో ఇలా అన్నాడు. "మనమందరం ఇంద్రునితో సహా దేవతలను జయించడానికి బ్రహ్మలోకం వెళదాం పదండి" అని.

తే ధున్ధువాక్యం తు నిశమ్య దైత్యాః ప్రోచుర్న నో విద్యతి లోకపాల ।
గతిర్యయా యామ పితామహాజిరం సుదుర్గమోఽయం పరతో హి మార్గః ॥21॥

ధుంధుని మాటలకు దైత్యులిలా బదులు పలికారు. "ఓ దైత్యశ్రేష్ఠా! బ్రహ్మసదనానికి వెళ్ళగల శక్తి మనకు లేదు. ఆ మార్గం చాలా దుర్గమమైనది.

ఇతః సహస్రైర్బహుయోజనాఖ్యైర్లోకో మహర్నామ మహర్షిజుష్టః ।
యేషాం హి దృష్ట్వార్పణచోదితేన దహ్యన్తి దైత్యాః సహసేక్షితేన ॥22॥

తతోఽపరో యోజనకోటినా వై లోకో జనో నామ వసన్తి యత్ర ।
గోమాతరోఽస్మాసు వినాశకారి యాసాం రజోఽపీహ మహాసురేంద్ర ॥23॥

తతో౽పరో యోజనకోటిభిస్తు షడ్భిస్తపో నామ తపస్విజుష్టః ।
తిష్ఠన్తి యత్రాసురసాధ్యవర్యా యేషాం హి నిశ్వాసమరుత్త్వసహ్యాః ॥24॥

తతో౽పరో యోజనకోటిభిస్తు త్రింశద్భిరాదిత్యసహస్రదీప్తిః ।
సత్యాభిధానో భగవాన్ నివాసో వరప్రదో౽భూద్భవతో హి యో౽సౌ ॥25॥

ఇక్కడకు అనేకవేలయోజనాలకు అవతల మహర్షులచే సేవింపబడే మహర్లోకం ఉంది. ఆ మహర్షుల దృష్టి సోకినంతమాత్రం చేతనే దైత్యులు దగ్ధమైపోతారు. దానిపైన కోటియోజనాల తరువాత జనోలోకం వుంది. అక్కడ గోమాతలు నివసిస్తాయి. ఆ గోవుల పాదరజం తాకినంతనే మనం భస్మమైపోతాము. ఓ మహాసురేంద్రా! దానిపైన ఆరుకోట్లయోజనాల దూరాన తపస్వులచే నిండిన తపోలోకం వుంది. అక్కడ వుండే సాధ్యదేవతలు నిశ్వాస మారుతపు తీవ్రతను మనం భరించి బ్రతుకలేము. దానికావల ముప్పదికోట్లయోజనాల దూరాన వేయిమంది సూర్యుల ప్రభతో వెలిగే సత్యలోకముంది. దాని అధిపతియే నీకు వరాలు ప్రసాదించిన బ్రహ్మ.

యస్య వేదధ్వనిం శ్రుత్వా వికసన్తి సురాదయః ।
సంకోచమసురాయాన్తి యే చ తేషాం సధర్మిణః ॥26॥

తస్మాన్మా త్వం మహాబాహో మతిమేతాం సమాదధః ।
వైరాజ్యభువనం ధున్ధో దురారోహం సదా నృభిః ॥27॥

అక్కడి వేదధ్వని విని, సురాదులు వికసిస్తారు. దైత్యులు, వారివంటి ఇతరులు ముడుచుకొని పోతారు. కాబట్టి ఓ మహావీరా! నీ సంకల్పం మానుకో. వైరాజ్యభువనప్రాప్తి నరులకు ఎప్పుడూ దుష్కరమే.

తేషాం వచనమాకర్ణ్య ధున్ధుః ప్రోవాచ దానవాన్ ।
గంతుకామః స సదనం బ్రహ్మణో జేతుమీశ్వరాన్ ॥28॥

కథం తు కర్మణా కేన గమ్యతే దానవర్షభాః ।
కథం తత్ర సహస్రాక్షః సంప్రాప్తః సహ దైవతైః ॥29॥

తే ధుంధునా దానవేంద్రాః పృష్టాః ప్రోచుర్వచో౽ధిపమ్ ।
కర్మ తన్న వయం విద్మః శుక్రస్తద్ వేత్త్యసంశయమ్ ॥30॥

వారి మాటలు విని, ధుంధుడు మరలా రాక్షసులతో నాకు బ్రహ్మలోకానికి వెళ్ళి, దేవతలను జయించాలని పట్టుదలగా వుంది. ఏ కర్మలు చేస్తే మనమక్కడకు పోగలము? సహస్రాక్షుడు దేవతలతో కలసి అక్కడకు ఎలా వెళ్ళగలిగాడు?

ఆ రహస్యోపాయం నాకుచెప్పండనగా ఆ రాక్షసులు తమకు తెలియదనియు, శుక్రాచార్యులా రహస్యం చెప్పగలరనియు, ధున్ధునితో చెప్పారు.

దైత్యానాం వచనం శ్రుత్వా ధున్ధుర్దైత్యపురోహితమ్ ।
పప్రచ్ఛ శుక్రం కిం కర్మ కృత్వా బ్రహ్మసదో గతిః ॥31॥

రాక్షసులు పలికిన పలుకులు విని, ధుంధుడు రాక్షస పురోహితుడైన శుక్రాచార్యుని పిలిచి, గురుదేవా! ఏ కర్మచేస్తే బ్రహ్మలోకగమనం సిద్ధిస్తుందని అడిగాడు.

తతోఽస్మై కథయామాస దైత్యాచార్యః కలిప్రియః ।
శక్రస్య చరితం శ్రీమాన్ పురా వృత్రరిపోః కిల ॥32॥

శక్రః శతం తు పుణ్యానాం క్రతూనామయజత్ పురా ।
దైత్యేంద్ర వాజిమేధానాం తేన బ్రహ్మసదో గతిః ॥33॥

ఓ నారదా! అందులకా శుక్రుడు దైత్యేంద్రా! పూర్వకాలంలో వృత్రాసురశత్రువైన శక్రుడు పవిత్రమైన అశ్వమేధయజ్ఞాలు నూరు ఆచరించాడు. ఆ పుణ్యప్రభావం వల్లనే అతడు బ్రహ్మలోకానికి వెళ్ళగలిగాడని ధుంధునితో పలికాడు.

తద్వాక్యం దానవపతిః శ్రుత్వా శుక్రస్య వీర్యవాన్ ।
యష్టుం తురగమేధానాం చకార మతిముత్తమామ్ ॥34॥

అథామన్త్ర్యాసురగురుం దానవాంశ్చాప్యనుత్తమాన్ ।
ప్రోవాచ యక్ష్యేఽహం యజ్ఞైరశ్వమేధైః సదక్షిణైః ॥35॥

తదాగచ్ఛధ్వమవనీం గచ్ఛామో వసుధాధిపాన్ ।
విజిత్య హయమేధాన్వై యథా కామగుణాన్వితాన్ ॥36॥

ఆహూయంతాం చ నిధయస్త్వాజ్ఞాప్యంతాం చ గుహ్యకాః ।
ఆమన్త్ర్యంతాం చ ఋషయః ప్రయామో దేవికాతటమ్ ॥37॥

సా హి పుణ్యసరిచ్ఛ్రేష్ఠా సర్వసిద్ధికరీ శుభా ।
స్థానం ప్రాచీనమాసాద్య వాజిమేధాన్ యజామహే ॥38॥

శుక్రుని మాటలు విని, దానవపతి నూరు అశ్వమేధాలు చేయాలని సంకల్పించుకున్నాడు. వెంటనే తనవారినందరిని, అసురగురువును సమావేశపరచి, తన నిశ్చయం ఇలా చెప్పాడు. "నేను దక్షిణలతోసహా నూరు అశ్వమేధాలు చేయ నిశ్చయించాను. మనమందరం భూలోకానికి వెళదాం పదండి. అక్కడి రాజులందరిని ఓడించి, అవసరమైన ధనరాసులు సేకరించుదాం. యక్షులను పిలిచి, నవనిధులను రప్పించుకుందాం. పవిత్రమైన దేవికాతీరానికి ఋషులనందరిని పిలిపించండి. ఆ నది పరమపవిత్రమైనది. సర్వసిద్ధిప్రదాయిని. దానికి తూర్పుతీరాన అశ్వమేధయాగాన్ని ఆచరిస్తాము" అని.

ఇత్థం సురారేర్వచనం నిశమ్యాసురయాజకః ।
బాఢమిత్యబ్రవీద్ ధృష్టో నిధయః సందిదేశ సః ॥39॥

దానవేంద్రుని మాటలు విని, అసురపురోహితుడు సంతోషించి, తథాస్తు! అని పలికి ధనరాశుల కోసం ఆదేశించాడు.

తతో ధుంధుర్దేవికాయాః ప్రాచీనే పాపనాశనే ।
భార్గవేంద్రేణ శుక్రేణ వాజిమేధాయ దీక్షితః ॥40॥

సదస్యా ఋత్విజశ్చాపి తత్రాసన్ భార్గవా ద్విజాః ।
శుక్రస్యానుమతే బ్రహ్మన్ శుక్రశిష్యాశ్చ పండితాః ॥41॥

యజ్ఞభాగభుజస్తత్ర స్వర్భానుప్రముఖా మునే ।
కృతశ్చాసురనాథేన శుక్రస్యానుమతేఽసురాః ॥42॥

యజ్ఞసంబారాలు చేరగానే ధుంధుడు పాపవినాశనియైన దేవికానదీ తూర్పుతీరాన ఒక శుభముహూర్తంలో భార్గవేంద్రుడైన శుక్రాచార్యుని ద్వారా అశ్వమేధ యాగదీక్ష స్వీకరించాడు. ఆ యజ్ఞంలో భార్గవుని వంశానికి చెందిన విప్రులే ఋత్విజులు, సదస్యులుగా శుక్రుని అనుమతితో పాల్గొన్నారు. శుక్రశిష్యులే అక్కడ పండితులుగా నియమింపబడ్డారు. ఓ నారదా! శుక్రాచార్యుని అనుమతితో దైత్యేంద్రుడు స్వర్భాను మున్నగు అసురులను యజ్ఞ భాగరక్షకులుగాను, భోక్తలుగాను, నియమించాడు.

తతః ప్రవృత్తో యజ్ఞస్తు సముత్సృష్టస్తథా హయః ।
హయస్యానుయయౌ శ్రీమానసిలోమా మహాసురః ॥43॥

తతోఽగ్నిధూమేన మహీ సశైలా వ్యాప్తా దిశః ఖం విదిశశ్చ పూర్ణాః ।
తేనోగ్రగన్ధేన దివస్పృశేన మరుద్వవౌ బ్రహ్మలోకే మహర్షే ॥44॥

యజ్ఞాన్ని నిర్వహించిన తరువాత యజ్ఞాశ్వం విడువబడింది. దాని రక్షణకై అసిలోముడనే మహాదైత్యుడు వెంట వెళ్ళాడు. ఓ నారదమహర్షీ! ఆ మహాయజ్ఞకుండం నుండి బయలుదేరిన ధూమపటలాలు భూమి మీద పర్వత, వన సరిత్ప్రదేశాల మీద దశదిశలా వ్యాపించి, స్వర్గాన్ని తాకింది. స్వర్గాన్ని ఆవరించిన యజ్ఞధూమవాసనలను వాయువు బ్రహ్మలోకం దాకా తీసుకొని వెళ్ళాడు.

తం గంధమాఘ్రాయ సురా విషణ్ణా జానంత ధున్ధుం హయమేధదీక్షితమ్ ।
తతః శరణ్యం శరణం జనార్దనం జగ్ముః సశక్రా జగతః పరాయణమ్ ॥45॥

ప్రణమ్య వరదం దేవం పద్మనాభం జనార్దనమ్ ।
ప్రోచుః సర్వే సురగణా భయగద్గదయా గిరా ॥46॥

భగవన్ దేవదేవేశ చరాచరపరాయణ ।
విజ్ఞప్తిః శ్రూయతాం విష్ణో సురాణామార్తినాశన ॥47॥

ధుంధుర్నామాసురపతిర్బలవాన్ వరబృంహితః ।
సర్వాన్ సురాన్ వినిర్జిత్య త్రైలోక్యమహరద్బలిః ॥48॥

ఋతే పినాకినో దేవాన్ త్రాతాఽస్మాన్ నయతో హరే ।
అతో వివృద్ధిమగమద్యథా వ్యాధిరుపేక్షితః ॥49॥

సాంప్రతం బ్రహ్మలోకస్థానపి జేతుం సముద్యతః ।
శుక్రస్య మతమాస్థాయ సోఽశ్వమేధాయ దీక్షితః ॥50॥

శతం క్రతూనామిష్ట్వాఽసౌ బ్రహ్మలోకం మహాసురః ।
ఆరోఢుమిచ్ఛతి వశీ విజేతుం త్రిదశానపి ॥51॥

తస్మాదకాలహీనం తు చిన్తయస్వ జగద్గురో ।
ఉపాయం మఖవిధ్వంసే యేన స్యామ సునిర్వృతాః ॥52॥

ఓ నారదా! ఆ యజ్ఞగంధాన్ని ఆఘ్రాణించి దేవతలు దిగాలు పడి అది హయమేధదీక్షితుడైన ధుంధుని యజ్ఞశాలలోనిదని తెలిసికొన్నారు. తదనంతరం ఇంద్రునితో సహా దేవతలందరు జగద్రక్షకుడు, శరణ్యుడునైన జనార్దనుని శరణు పొందారు. సురగణమంతా వరదుడు, పద్మనాభుడునైన జనార్దనునకు నమస్కరించి, భయంతో గద్గదమైన వాక్కుతో ఇలా పలికారు. "భగవన్! దేవదేవేశా! చరాచరరక్షకా! విష్ణో! దేవతల ఆర్తినాశకా! మా విజ్ఞప్తిని వినండి. బ్రహ్మదత్తవరాలచే విజృంభించి, బలవంతుడైన ధుంధుడనే రాక్షసుడు దేవతలనందరిని జయించి, స్వర్గరాజ్యం అపహరించాడు. అతని అభ్యుదయాన్ని పినాకపాణియైన శివుడు తప్ప ఇతరులెవ్వరు అడ్డుకోలేకుండా ఉన్నారు. అందువల్ల ఉపేక్షింపబడిన రోగంవలె దానవుడింకా బలవంతుడై, ఇప్పుడు బ్రహ్మలోకనివాసులను కూడా జయించే ఉద్దేశ్యంతో శుక్రాచార్యుని మంత్రాంగంతో శతాశ్వమేధదీక్ష వహించాడు. నూరు అశ్వమేధాలను పూర్తిచేసి, ఆ మహాసురుడు బ్రహ్మలోకం చేరి, దేవతలను జయించాలని కోరుకుంటున్నాడు. కాబట్టి విష్ణుదేవా! ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఆ దుష్టుని యజ్ఞం పూర్తి కాకుండా వెంటనే దానిని ధ్వంసం చేసే విధానాన్ని గూర్చి ఆలోచించండి. దానితో మా కష్టాలు తీరిపోతాయి.

శ్రుత్వా సురాణాం వచనం భగవాన్ మధుసూదనః ।
దత్త్వాఽభయం మహాబాహుః ప్రేషయామాస సాంప్రతమ్ ।
విసృజ్య దేవతాస్సర్వా జ్ఞాత్వాఽజేయం మహాసురమ్ ॥53॥

బంధనాయ మతిం చక్రే ధుంధోర్ధర్మధ్వజస్య వై ।

దేవతల మాటలు విని, మధుసూదనుడు వారికి అభయమిచ్చి పంపాడు. దైత్యుడజేయుడని ఎరింగిన శ్రీహరి మాయోపాయం చేత ధర్మనిష్ఠితుడైన ధుంధుని బంధించాలని నిశ్చయించుకున్నాడు.

తతః కృత్వా స భగవాన్ వామనం రూపమీశ్వరః ॥54॥

దేహం త్యక్త్వా నిరాలంబం కాష్ఠవద్దేవికాజలే ।
క్షణాన్ మజ్జంస్తథోన్మజ్జన్ముక్తకేశో యదృచ్ఛయా ॥55॥

దృష్టోఽథ దైత్యపతినా దైత్యైశ్చాన్యైస్తథార్షిభిః ।
తతః కర్మ పరిత్యజ్య యజ్ఞియం బ్రాహ్మణోత్తమాః ॥56॥

సముత్తారయితుం విప్రమాద్రవన్త సమాకులాః ।
సదస్యా యజమానశ్చ ఋత్విజోఽథ మహౌజసః ॥57॥

నిమజ్జమానముజ్జహ్రుః సర్వే తే వామనం ద్విజమ్ ।
సముత్తార్య ప్రసన్నాస్తే పప్రచ్ఛుః సర్వ ఏవ హి ।
కిమర్థం పతితోఽసీహ కేనాక్షిప్తోఽసి నో వద ॥58॥

అంతట తానొక వామనరూపం ధరించి, దేవికానదీజలాలలో శరీరం విడిచిపెట్టి, ఒక కొయ్యలాగ పడిపోయాడు. ఏ ఆధారం లేకుండా అలా నదీజలాలలో మునిగి, వీడిన వెంట్రుకలతో పైకిలేస్తూ, మునుగుతూ, మళ్ళీతేలుతూ, యాదృచ్ఛికంగా యజ్ఞదీక్షితుడైన దైత్యుని కంటపడ్డాడు. వెంటనే ఇతర దైత్యులు, ఋషులు అందరూ చూశారు. అంతట మునిగిపోతున్న బ్రాహ్మణకుమారుని రక్షించడానికి యజ్ఞశాల వదలి, బ్రాహ్మణులు, సదస్యులు యజమాని ధుంధుడు, అందరు పరుగెత్తి నదిలో మునిగిపోతున్న వామనబ్రాహ్మణుని బయటకు లాగారు. ఆ విధంగా బయటకు తీసిన వామనుని చూసి, ప్రసన్నులై, వారందరు నీవెవరవు? ఎందుకు నీటిలో పడిపోయావు. నిన్నెవరు నదిలో పడద్రోశారో మాకు తెలియజేయవలసినదని అడిగారు.

తేషామాకర్ణ్య వచనం కంపమానో ముహుర్ముహుః ।
ప్రాహ ధున్ధు పురోగాంస్తాన్ శ్రూయతామత్రకారణమ్ ॥59॥

వారి మాటలు విని, గడగడ వణకిపోతూ, బ్రాహ్మణుడు ధుంధుని, ఇతరులను మాటిమాటికి చూస్తూ దీనికి కారణం చెబుతాను, వినమని వారితో ఇలా పలికాడు.

బ్రాహ్మణో గుణవానాసీత్ ప్రభాస ఇతి విశ్రుతః ।
సర్వశాస్త్రార్థవిత్ ప్రాజ్ఞో గోత్రతశ్చాపి వారుణః ॥60॥

తస్య పుత్రద్వయం జాతం మందప్రజ్ఞం సుదుఃఖితమ్ ।
తత్ర జ్యేష్ఠో మమ భ్రాతా కనీయానపరస్త్వహమ్ ॥61॥

ప్రభాసుడనే పేరుగల గుణవంతుడైన బ్రాహ్మణుడుండేవాడు. అతడు సర్వశాస్త్రార్థవేత్త. ప్రాజ్ఞుడు. వారుణ గోత్రీకుడు. అతనికి ఇద్దరు కుమారులు కలిగారు. వారు మందబుద్ధులు, దుఃఖభాజనులు అయినవారు. వారిలో పెద్దవాడు నా సోదరుడు. చిన్నవాడి నేను.

నేత్రభాస ఇతి ఖ్యాతో జ్యేష్ఠో భ్రాతా మమాసుర ।
మమ నామ పితా చక్రే గతిభాసేతి కౌతుకాత్ ॥62॥

ఓ మహాసురా! ధుంధో! నా అన్నగారిపేరు నేత్రభాసుడు. మా తండ్రిగారు నాకు ఎంతో సంతోషంతో గతిభాసుడని పేరు పెట్టారు.

రమ్యశ్చావసథో ధుంధో శుభశ్చాసీత్ పితుర్మమ ।
త్రివిష్టపగుణైర్యుక్తశ్చారురూపో మహాసుర ॥63॥

తతః కాలేన మహతా ఆవయోః స పితా మృతః ।
తస్యోర్ధ్వదేహికం కృత్వా గృహమావాం సమాగతౌ ॥64॥

ఓ మహాసురా! మా తండ్రిగారి ఇల్లు స్వర్గలోకం లాంటి వసతులతో, శుభప్రదంగా ఎంతో అందంగా ఉన్నది. చాలాకాలం తరువాత మా తండ్రిగారు మృతి చెందారు. మేమిరువురము మా త్రండికి అంతిమ సంస్కారాలు, కర్మలు యథావిధిగా చేసి ఇంటికి బయలుదేరాము.

తతో మయోక్తః స భ్రాతా విభజామ గృహం వయమ్ ।
తేనోక్తో నైవ భవతో విద్యతే భాగ ఇత్యహమ్ ॥65॥

కుబ్జవామనఖంజానాం క్లీబానాం శ్విత్రిణామపి ।
ఉన్మత్తానాం తథాన్ధానాం ధనభాగో న విద్యతే ॥66॥

శయ్యాసనస్థానమాత్రం స్వేచ్ఛయాన్నభుజక్రియా ।
ఏతావద్దీయతే తేభ్యో నార్ధభాగహరా హి తే ॥67॥

అంతట నేను మా అన్నను చూసి, తండ్రి వదలిన ఈ గృహాన్ని మనమిద్దరం పంచుకుందామని అడిగాను. దానికి మా అన్న నీకు ఇందులో భాగం లేదన్నాడు. కుబ్జుడు, వామనుడు, కుంటివాడు, నపుంసకుడు, కుష్ఠువాడు, పిచ్చివాడు, గ్రుడ్డివాడు ఆస్తిలో భాగానికి అర్హులు కారు, బ్రతికినంతకాలం తిండితింటూ ఇంట్లో ఉండటమే నీ వంతనియు, నీకింతమాత్రమే ఈయబడుతుందనియు, నీవు అర్ధభాగం పొందడానికి అర్హుడవు కావనియు చెప్పి నన్ను పొమ్మన్నాడు. కాని మంచం వేసుకునేంత చోటు (స్థలం), చక్కగా స్వేచ్ఛగా అన్నం తింటూ ఉండటం, ఇంత మాత్రమే. ఈ రెండూ ఇవ్వబడతాయి. కాని సగభాగం ఇవ్వడం కుదరదు అని అన్నాడు.

ఏవముక్తే మయా సోక్తః కిమర్థం పైతృకాద్గృహాత్ ।
ధనార్ధభాగమర్హామి నాహం న్యాయేన కేన వై ॥68॥

ఇత్యుక్తవతి వాక్యేఽసౌ భ్రాతా మే కోపసంయుతః ।
సముత్క్షిప్యాక్షిపన్నద్యామస్యాం మామితి కారణాత్ ॥69॥

మమాస్యాం నిమ్నగాయాన్తు మధ్యేన ప్లవతో గతః ।
కాలః సంవత్సరాఖ్యస్తు యుష్మాభిరిహచోద్ధృతః ॥70॥

వాడిలా చెప్పగానే తండ్రిగారి గృహంలో నాకు అర్ధభాగం ఎందుకు రాదు? నాకు న్యాయంగా అర్ధభాగం వస్తుంది.

ఏ న్యాయప్రకారం అర్ధభాగం పొందడానికి నేను అర్హుడను కానో తెలియజేయమని కోరగా నా సోదరుడు కోపంతో మండిపడి, అశక్తుడనైన నన్ను అమాంతంగా ఎత్తి ఈ నదిలో పడేశాడు. సంవత్సరకాలంగా నేనీ నదీజలాలలో కొట్టుకొనిపోతూ ఉండగా ఈనాడు మీచేత ఈ నదీజలాలనుండి బయటకు తీయబడ్డాను.

కే భవన్తోఽత్ర సంప్రాప్తాః సస్నేహా బాంధవా ఇవ ।
కోఽయం చ శక్రప్రతిమో దీక్షితో యో మహాభుజః ॥71॥

తన్మే సర్వం సమాఖ్యాత యాథాతథ్యం తపోధనాః ।
మహర్షిసదృశా యూయం సానుకంపాశ్చ మే భృశమ్ ॥72॥

ఇంతకారుణ్యభావంతో బంధువులవలె నన్ను బయటకు తీసి రక్షించిన ఆపద్బాంధవులైన మీరందరు ఎవరో చెప్పండి. అపరదేవేంద్రుని వలె వెలిగిపోతున్నట్టియు, యజ్ఞదీక్షితుడైనట్టియు ఈ మహాభుజుడెవరు? మహర్షులతో సమానంగావున్న ఓ తపోధనులారా! నా మీద ఎంతో దయచూపించిన మీరు ఉన్నదున్నట్లు మొత్తం నాకు చెప్పండి.

తద్వామనవచః శ్రుత్వా భార్గవా ద్విజసత్తమాః ।
ప్రోచుర్వయం ద్విజా బ్రహ్మన్ గోత్రతశ్చాపి భార్గవాః ॥73॥

అసావపి మహాతేజా ధుంధుర్నామ మహాసురః ।
దాతా భోక్తా విభక్తా చ దీక్షితో యజ్ఞకర్మణి ॥74॥

వామనుని మాటలు విని, భార్గవులైన ఋత్విజులు మేము భృగువంశీయులమైన బ్రాహ్మణులమని వామనునితో చెప్పారు. ఈ మహాతేజస్వి ధుంధుడను రాక్షసచక్రవర్తి. మహాభోగి, మహాదాత, మహావితరణశీలి, యజ్ఞదీక్షలో నున్నాడని కూడా వామనునకు బ్రాహ్మణోత్తములు తెలియజేశారు.

ఇత్యేవముక్త్వా దేవేశం వామనం భార్గవాస్తతః ।
ప్రోచుర్దైత్యపతిం సర్వే వామనార్థకరం వచః ॥75॥

దీయతామస్య దైత్యేంద్ర సర్వోపస్కారసంయుతమ్ ।
శ్రీమదావసథం దాస్యో రత్నాని వివిధాని చ ॥76॥

భార్గవులు దేవేశుడైన వామనునితో ఇలా పలికిన పిమ్మట వామనునకు లాభకరమైన మాటలు ధుంధునితో ఇలా పలికారు. ఓ దైత్యేంద్రా! ఇతనికి సర్వోపస్కారాలతో శ్రీమంతమైన ఆవాసం, వివిధరత్నాలు ఈయదగును" అని పలికారు.

ఇతి ద్విజానాం వచనం శ్రుత్వా దైత్యపతిర్వచః ।
ప్రాహ ద్విజేంద్ర తే దద్మి యావదిచ్ఛసి వై ధనమ్ ॥77॥

దాస్యే గృహం హిరణ్యం చ వాజినః స్యందనాన్ గజాన్ ।
ప్రయచ్ఛామ్యద్య భవతో వ్రియతామీప్సితం విభో ॥78॥

బ్రాహ్మణుల ఈ మాటలు విని, దైత్యపతి వామనునితో ఓ బ్రాహ్మణోత్తమా! నీకు కావలసినదంతయు ఇస్తాను. కోరుకొమ్ము. గృహం, హిరణ్యం, అశ్వాలు, రథాలు, గజాలు నీకేది ప్రియమో దానిని నీకిప్పుడిస్తానని పలికాడు .

తద్వాక్యం దానవపతేః శ్రుత్వా దేవోఽథ వామనః ।
ప్రాహాఽసురపతిం ధుంధుం స్వార్థసిద్ధికరం వచః ॥79॥

సోదరేణాపి హి భ్రాత్రా హ్రియన్తే యస్య సంపదః ।
తస్యా క్షమస్వ యద్దత్తం కిమన్యో న హరిష్యతి ॥80॥

దాసీ దాసాంశ్చ భృత్యాంశ్చ గృహం రత్నే పరిచ్ఛదమ్ ।
సమర్థేషు ద్విజేంద్రేషు ప్రయచ్ఛస్వ మహాభుజ ॥81॥

మమ ప్రమాణమాలోక్య మామకం చ పదత్రయమ్ ।
సంప్రయచ్ఛస్వ దైత్యేంద్ర నాధికం రక్షితుం క్షమః ॥82॥

దానవపతి మాటలు విని, భగవంతుడైన వామనుడు ధుంధునితో స్వార్థసిద్ధికరమైన మాటలిలా పలికాడు. తోడబుట్టిన సోదరుడపహరించిన ఆస్తిని కాపాడుకోలేని అసమర్థుడు నీవిచ్చే ధనరాశులను రక్షించుకొనగలడా? వీటిని ఇతరులపహరించరా?. ఈ దాసదాసీలు, భృత్యులు, గృహం, రత్నాలు, వస్త్రాలు మొదలైనవన్నియు సమర్థుడైన విప్రోత్తమునకిమ్ము. ఓ దైత్యేంద్రా! నా శరీరప్రమాణాన్ని దృష్టిలోనుంచుకొని అందులకు సరిపడేటట్లుగా మూడడుగుల నేలను ఇమ్ము. అంతకు మించిన దానిని నేను రక్షించుకొనజాలనని వామనుడు దైత్యేంద్రుని కోరాడు.

ఇత్యేవముక్తే వచనే మహాత్మనా విహస్య దైత్యాధిపతిః స ఋత్విజః ।
ప్రాదాద్ ద్విజేంద్రాయ పదత్రయం తదా యదా స నాన్యం ప్రగృహాణ కించిత్ ॥83॥

క్రమత్రయం తావదవేక్ష్య దత్తం మహాసురేంద్రేణ విభుర్యశస్వీ ।
చక్రే తతో లంఘయితుం త్రిలోకీం త్రివిక్రమం రూపమనంతశక్తిః ॥84॥

కృత్వా చ రూపం దితిజాంశ్చ హత్వా ప్రణమ్య చర్షీన్ ప్రథమక్రమేణ ।
మహీం మహీధ్రైః సహితాం మహార్ణవాం జహార రత్నాకరపత్తనైర్యుతామ్ ॥85॥

భువం సనాకం త్రిదశాధివాసం సోమార్కఋక్షైరభిమండితం నభః ।
దేవో ద్వితీయేన జహార వేగాత్ క్రమేణ దేవప్రియమీప్సురీశ్వరః ॥86॥

క్రమం తృతీయం చ యదాఽస్య పూరితం తదాఽతికోపాద్దనుపుంగవస్య ।
పపాత పృష్ఠే భగవాంస్త్రివిక్రమో మేరుప్రమాణేన తు విగ్రహేణ ॥87॥

ఆ మహాత్ముని వచనాలు విని, ఋత్విజులు, దైత్యపతి నవ్వుకున్నారు. అతడు పాదత్రయం నేల తప్ప మరేమియు గ్రహించనన్నందున ధుంధుడు వామనునకు మూడడుగుల నేల ప్రదానం చేశాడు. ఆ మహాసురుడు, యశోధనుడు మూడడుగుల నేల దానమీయగానే అనంతశక్తి సంపన్నుడైన వామనుడు విరాట్ స్వరూపం ధరించి, తివిక్రముడై, ముల్లోకాలను ఆక్రమింపసాగాడు. వామనుడు త్రివిక్రముడై, రాక్షసులందరిని హతమార్చి, ఋషులకు ప్రణామం గావించి, మొదటి అడుగుతో సముద్ర పర్వత పట్టణాలతో నిండిన భూమండలాన్నంతటిని ఆక్రమించాడు.

దేవతల ప్రియాన్ని కూర్చే స్వామి తన రెండవ అడుగుతో దేవతల నివాసమైన స్వర్గసహితమైన భువర్లోకాన్ని, సూర్యచంద్రగ్రహనక్షత్రమండలాలతో నిండిన నభోమండలాన్ని నింపివేశాడు. ఆ విధంగా దివిని, భువిని, తొక్కిపెట్టి ఇస్తానన్న మూడవ అడుగునకు చోటు లేకపోవడంతో భగవంతుడైన త్రివిక్రమదేవుడు క్రోధాతిరేకంతో మేరుపర్వతం వంటి తన శరీరంతో ఆ దానవవీరుని వీపుమీద పడ్డాడు.

పతతా వాసుదేవేన దానవోపరి నారద ।
త్రింశద్యోజన సాహస్రీ భూమేర్గర్తా దృఢీకృతా ॥88॥

తతో దైత్యం సముత్పాట్య తస్యాం ప్రక్షిప్య వేగతః ।
అవర్షత్ సికతా వృష్ట్యా తాం గర్తామపూరయత ॥89॥

తతః స్వర్గం సహస్రాక్షో వాసుదేవప్రసాదతః ।
సురాశ్చ సర్వే త్రైలోక్యమవాపుర్నిరుపద్రవాః ॥90॥

భగవానపి దైత్యేంద్రం ప్రక్షిప్య సికతార్ణవే ।
కాలిన్ద్యా రూపమాధాయ తత్రైవాన్తరధీయత ॥91॥

ఏవం పురా విష్ణురభూచ్చ వామనో ధున్ధుం విజేతుం చ త్రివిక్రమోఽభూత్ ।
యస్మిన్ స దైత్యేంద్రసుతో జగామ మహాశ్రమే పుణ్యయుతో మహర్షే ॥92॥

ఓ నారదా! వాసుదేవుడలా ధుంధుని మీద పడిన వెంటనే ఆ ప్రదేశంలో ముప్పదివేలయోజనాల మేరకు భూమిలో బ్రహ్మాండమైన గోయి ఏర్పడింది. అంతట వాసుదేవుడా దైత్యుని దేహాన్ని చీల్చి, ఆ గోతిలోనికి విసరివేసి, బ్రహ్మాండమైన ఇసుకను వర్షించి, ఆ గుంటను పూడ్చివేశాడు. తదనంతరం జనార్దనుని ప్రసాదంవల్ల ఇంద్రుడు తాను కోల్పోయిన స్వర్గాధిపత్యాన్ని తిరిగిపొంది, దేవతలతో కలసి నిష్కంటకంగా పరిపాలించాడు. భగవంతుడైన నారాయణుడావిధంగా దైత్యేంద్రుడైన ధుంధును ఇసుకసముద్రంలో పూడ్చివేసిన ఆ ప్రదేశాన్ని కాళిందీనదీరూపంగా తాను ధరించి అంతర్ధానమయ్యాడు. ఓ నారద మహర్షీ! ఈ విధంగా పూర్వకాలంలో శ్రీమహావిష్ణువు ధుంధురాక్షసుని జయించడానికి త్రివిక్రముడయ్యాడు. అట్టి పవిత్రాశ్రమానికి పుణ్యాత్ముడైన దైత్యనందనుడు (ప్రహ్లాదుడు) వెళ్ళాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే ధుంధుపరాజయకథనం నామాష్టసప్తతితమోఽధ్యాయః ॥78॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో ధుంధుపరాజయకథనమనే డెబ్బైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



నవసప్తతితమోఽధ్యాయః – డెబ్బైతొమ్మిదవ అధ్యాయం

ప్రహ్లాదతీర్థయాత్రాయాం పురూరవసః ఉపాఖ్యానమ్ – ప్రహ్లాదతీర్థయాత్రలోని పురూరవుని ఉపాఖ్యానం

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

కాలిన్దీసలిలే స్నాత్వా పూజయిత్వా త్రివిక్రమమ్ ।
ఉపోష్య రజనీమేకాం లింగభేదం గిరిం యయౌ ॥1॥

కాళిందీనదీజలాలలో స్నానం చేసి, త్రివిక్రముని పూజించి, ఒకరాత్రి ఉపవసించి, లింగభేదపర్వతానికి ప్రహ్లాదుడు వెళ్ళాడు.

తత్ర స్నాత్వా చ విమలే భవం దృష్ట్వా చ భక్తితః ।
ఉపోష్య రజనీమేకాం తీర్థం కేదారమావ్రజత్ ॥2॥

అక్కడి నిర్మలజలాలలో స్నానం చేసి, భక్తితో ఈశ్వరుని దర్శించి, ఒకరాత్రి ఉపవసించి, కేదారతీర్థానికి వెళ్ళాడు.

తత్ర స్నాత్వార్చ్య చేశానం మాధవం చాప్యభేదతః ।
ఉషిత్వా వాసరాన్ సప్త కుబ్జామ్రం ప్రజగామ హ ॥3॥

అక్కడ స్నానం చేసి అభేదబుద్ధితో విష్ణువును, శంకరుని అర్చించి, ఏడు దినాలు ఉపవసించి, అటుపిమ్మట కుబ్జామ్రక్షేత్రానికి వెళ్ళాడు.

తతః సుతీర్థే స్నాత్వా చ సోపవాసీ జితేంద్రియః ।
హృషీకేశం సమభ్యర్చ్య యయౌ బదరికాశ్రమమ్ ॥4॥

తరువాత సుతీర్థంలో స్నానం చేసి, ఉపవాసం చేసి, జితేంద్రియుడై హృషీకేశుని చక్కగా పూజించి, అటుపిమ్మట బదరికాశ్రమానికి వెళ్ళాడు.

తత్రోష్య నారాయణమర్చ్య భక్త్యా స్నాత్వాఽథ విద్వాన్ స సరస్వతీజలే ।
వరాహతీర్థే గరుడాసనం స దృష్ట్వాఽథ సంపూజ్య సుభక్తిమాంశ్చ ॥5॥

అక్కడ ఉండగా ఆ విద్వాంసుడు భక్తిపూర్వకంగా సరస్వతీ జలాలలో స్నానం చేసి, వరాహతీర్థంలో విష్ణువును భక్తితో సేవించాడు.

భద్రకర్ణే తతో గత్వా జయేశం శశిశేఖరమ్ ।
దృష్ట్వా సంపూజ్య చ శివం విపాశామభితో యయౌ ॥6॥

తస్యాం స్నాత్వా సమభ్యర్చ్య దేవదేవం ద్విజప్రియమ్ ।
ఉపవాసీ ఇరావత్యాం దదర్శ పరమేశ్వరమ్ ॥7॥

యమారాధ్య ద్విజశ్రేష్ఠ శాకలే వై పురూరవాః ।
సమవాప పరం రూపమైశ్వర్యం చ సుదుర్లభమ్ ॥8॥

కుష్ఠరోగాభిభూతశ్చ యం సమారాధ్య వై భృగుః ।
ఆరోగ్యమతులం ప్రాప సంతానమపి చాక్షయమ్ ॥9॥

తదనంతరం భద్రకర్ణం చేరి, అచ్చట చంద్రశేఖరుడైన జయేశ్వరుని దర్శించి, చక్కగా పూజించి, ప్రహ్లాదుడు విపాశానదికి వెళ్ళాడు. విపాశానదిలో స్నానమాచరించి, బ్రాహ్మణప్రియుడగు దేవదేవుని పూజించి, ఉపవాసం చేసి, ఇరావతికి వెళ్ళి, పరమేశ్వరదర్శనం చేసికొన్నాడు. ఆ స్వామిని అర్చించి, పూర్వం శాకలనగరంలో పురూరవుడు దుర్లభమైన ఐశ్వర్యసౌందర్యాలు పొందాడు. కుష్ఠురోగపీడితుడైన భృగువు ఆ స్వామి ప్రసాదం వల్ల సంపూర్ణంగా ఆరోగ్యాన్ని పొందడమే గాక, సత్సంతానాన్ని కూడా పొందాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కథం పురూరవా విష్ణుమారాధ్య ద్విజసత్తమ ।
విరూపత్వం సముత్సృజ్య రూపం ప్రాప శ్రియా సహ ॥10॥

బ్రహ్మర్షీ! పురూరవుడేవిధంగా పూర్వకాలాన విష్ణువును ఆరాధించి, తన కురూపత్వాన్ని పోగొట్టుకుని, సౌందర్యసంపదలు పొందినాడో వివరించి చెప్పండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రూయతాం కథయిష్యామి కథాం పాపప్రణాశినీమ్ ।
పూర్వం త్రేతాయుగస్యాదౌ యథావృత్తం తపోధన ॥11॥

ఓ తపోధనా! పూర్వం త్రేతాయుగారంభంలో జరిగిన పాపప్రణాశినియైన పురూరవుని కథ యథాతథంగా చెబుతాను వినండి.

మద్రదేశ ఇతి ఖ్యాతో దేశో వై బ్రహ్మణః సుత ।
శాకలం నామ నగరం ఖ్యాతం స్థానీయముత్తమమ్ ॥12॥

తస్మిన్విపణివృత్తిస్థః సుధర్మాఖ్యోఽభవద్వణిక్ ।
ధనాఢ్యో గుణవాన్ భోగీ నానాశాస్త్రవిశారదః ॥13॥

స త్వేకదా నిజాద్రాష్ట్రాత్సురాష్ట్రం గన్తుముద్యతః ।
సార్థేన మహతా యుక్తో నానావిపణపణ్యవాన్ ॥14॥

గచ్ఛతః పథి తస్యాథ మరుభూమౌ కలిప్రియ ।
అభవద్దస్యుతో రాత్రౌ అవస్కందోఽతిదుస్సహః ॥15॥

తతః స హృతసర్వస్వో వణిగ్దుఃఖసమన్వితః ।
అసహాయో మరౌ తస్మింశ్చచారోన్మత్తవద్వశీ ॥16॥

ఓ నారదా! మద్రదేశంలో శాకలమనే ప్రసిద్ధ నగరముండేది. ఆ నగరంలో ధనవంతుడు, గుణవంతుడు, నానాశాస్త్రకోవిదుడు, మహాభోగియునైన సుధర్ముడనే వణిజుడుండేవాడు. అతడొకనాడు విశేషంగా విలువ గల సరుకులు తీసికొని, చరాస్తి తీసికొని, తనరాష్ట్రం వదలి, సురాష్ట్రదేశానికి వెళుతుండగా మార్గమధ్యంలో ఎడారి ప్రదేశంలో దొంగలు అడ్డగించి, ఆయన సర్వస్వాన్ని దోచుకున్నారు. దానితో అతడు దుస్సహమైన దుఃఖాన్ని పొందాడు. సర్వస్వాన్ని కోల్పోయి, కట్టుబట్టలతో మిగిలిన ఆ వ్యాపారి తన దుర్దశకు మిక్కిలి దుఃఖించి, అసహాయుడై, ఆ ఎడారి ప్రాంతంలో పిచ్చివాని వలె తిరుగసాగాడు.

చరతా తదరణ్యం వై దుఃఖాక్రాన్తేన నారద ।
ఆత్మా ఇవ శమీవృక్షో మరావాసాదితః శుభః ॥17॥

తం మృగైః పక్షిభిశ్చైవం హీనం దృష్ట్వా శమీతరుమ్ ।
శ్రాంతః క్షుత్తృట్ పరీతాత్మా తస్యాధః సముపావిశత్ ॥18॥

సుప్తశ్చాపి సువిశ్రాన్తో మధ్యాహ్నే పునరుత్థితః ।
సమపశ్యదథాయాన్తం ప్రేతం ప్రేతశతైర్వృతమ్ ॥19॥

ఉద్వాహ్యన్తమథాన్యేన ప్రేతేన ప్రేతనాయకమ్ ।
పిండాశిభిశ్చ పురతో ధావద్భి రూక్షవిగ్రహైః ॥20॥

నారదా! అలా అరణ్యంలో వాడు తిరుగుతూ ఉండగా ఒకనాడు తనవలెనే ఏకాకిగా నిలబడిన ఒక జమ్మిచెట్టు వద్దకు చేరాడు. అటు ఇటు ఎక్కడ పక్షులు గాని, మృగాలు గాని లేని ఆ జమ్మిచెట్టును చూసి, నడకశ్రమతో, ఆకలితో తూలిపోతూ, ఆ సుధర్ముడు శమీవృక్షం క్రింద కూలబడ్డాడు. వెంటనే గాఢంగా నిద్రించి, విశ్రాంతిని పొంది, మధ్యాహ్నవేళకు మేలుకునే సరికి ఎదురుగా వందలాది ప్రేతాలచే పరివేష్టితుడైన ఒకానొక ప్రేతాన్ని చూశాడు. ఆ ప్రేతనాయకుని మరొక ప్రేతం మోసుకొని వచ్చింది. ఎందరో పిండభుక్కులైన ప్రేతాలు ఎండిన శరీరాలతో ముందర పరుగిడుతూ వచ్చాయి.

అథాజగామ ప్రేతోఽసౌ పర్యటిత్వా వనాని చ ।
ఉపాగమ్య శమీమూలే వణిక్పుత్రం దదర్శ సః ॥21॥

స్వాగతేనాభివాద్యైనం సమాభాష్య పరస్పరమ్ ।
సుఖోపవిష్టశ్ఛాయాయాం పృష్ట్వా కుశలమాప్తవాన్ ॥22॥

అలా అరణ్యంలో తిరిగివచ్చిన ప్రేతనాయకుడు శమీవృక్షం కింద కోమటిబిడ్డను చూసి, స్వాగతపూర్వకంగా అభివాదనం చేశాడు. ఇద్దరు శ్రమమూలాన సుఖోపవిష్టులై పరస్పరం కుశల ప్రశ్నలు వేసికొన్నారు.

తతః ప్రేతాధిపతినా పృష్టః స తు వణిక్ సఖః ।
కుత ఆగమ్యతే బ్రూహి క్వ సాధో వా గమిష్యసి ॥23॥

కథం చేదం మహారణ్యం మృగపక్షివివర్జితమ్ ।
సమాపన్నోఽసి భద్రం తే సర్వమాఖ్యాతుమర్హసి ॥24॥

అంతట ప్రేతనాయకుడు తన వణిక్ మిత్రునితో ఇలా పలికాడు. "అయ్యా! నీవెవరవు? ఎక్కడినుండి ఇక్కడకు వచ్చావు? ఎక్కడకు వెళుతున్నావు?. మృగపక్షివిహీనమైన ఈ మహారణ్యానికి ఎలా వచ్చి చేరావు? నీకు క్షేమమగుగాక! అంతా వివరంగా చెప్పుమని" ప్రశ్నించాడు.

ఏవం ప్రేతాధిపతినా వణిక్ పృష్టః సమాసతః ।
సర్వమాఖ్యాతవాన్ బ్రహ్మన్ స్వదేశధనవిచ్యుతిమ్ ॥25॥

ఈ విధంగా ప్రేతనాయకుడు వణిజుని అడుగగా అతడు ఉన్నదున్నట్లుగా తాను స్వదేశాన్ని వదలడం, దారిలో సర్వస్వం కోల్పోవడం వివరంగా చెప్పాడు.

తస్య శ్రుత్వా స వృత్తాంతం తస్య దుఃఖేన దుఃఖితః ।
వణిక్ పుత్రం తతః ప్రాహ ప్రేతపాలః స్వబంధువత్ ॥26॥

అది విని వణిక్ పుత్రునితోబాటు ప్రేతనాయకుడు కూడా దుఃఖించి, ప్రేమతో అతనిని ఇలా ఓదార్చాడు.

ఏవం గతేఽపి మా శోకం కర్తుమర్హసి సువ్రత ।
భూయోఽప్యర్థాః భవిష్యన్తి యది భాగ్యబలం తవ ॥27॥

భాగ్యక్షయేఽర్థాః క్షీయంతే భవన్త్యభ్యుదయే పునః ।
క్షీణస్యాస్య శరీరస్య చింతయా నోదయో భవేత్ ॥28॥

ఓ సువ్రతా! ధనం పోయిందని విచారింపకుము. నీ అదృష్టం బలంగా వుంటే తిరిగి నీకు ధనం లభిస్తుంది. భాగ్యం క్షయమైనప్పుడు సంపదలు నశిస్తూ ఉంటాయి. తిరిగి భాగ్యోదయమైనప్పుడు సంపదలు తిరిగి ప్రాప్తిస్తూ ఉంటాయి. కాని శరీరాన్ని నశింపజేసుకుంటే తిరిగి అభ్యుదయం సంభవింపదు గదా! కాబట్టి విచారింపకుము.

ఇత్యుచ్చార్య సమాహూయ స్వాన్ భృత్యాన్ వాక్యమబ్రవీత్ ।
అద్యాతిథిరయం పూజ్యః సదైవ స్వజనో మమ ॥29॥

అస్మిన్దృష్టే వణిక్పుత్రే యథా స్వజనదర్శనమ్ ।
అస్మిన్ సమాగతే ప్రేతాః ప్రీతిర్జాతా మమాతులా ॥30॥

ఏవం హి వదతస్తస్య మృత్పాత్రం సుదృఢం నవమ్ ।
దధ్యోదనేన సంపూర్ణమాజగామ యథేప్సితమ్ ॥31॥

తథా నవా చ సుదృఢా సంపూర్ణా పరమాంభసా ।
వారిధానీ చ సంప్రాప్తా ప్రేతానామగ్రతః స్థితా ॥32॥

తామాగతాం ససలిలాం సాన్నాం వీక్ష్య మహామతిః ।
ప్రాహోత్తిష్ఠ వణిక్ పుత్ర త్వమాహ్నికముపాచర ॥33॥

ఇలా అతనినోదార్చి ప్రేతనాయకుడు తన భృత్యులనందరిని పిలిచి, వారితో ఇలా పలికాడు. "ఇతడు మనకు అతిథి. కాబట్టి పూజ్యుడు. ఇతడెప్పుడూ నా స్వజనంలోని వాడే. ఈ వణిక్ పుత్రునిచూస్తే నా స్వజనులను చూచినంత ఆనందంగా వుంది. ఇతనితో కలవడంవల్ల నాకు సాటిలేని ప్రీతి కలిగింది. అతడిలా పలుకుతూ ఉండగా ఒక దృఢమైన మట్టికుండ పెరుగన్నంతో నిండుగావచ్చి, ఎదుట కనిపించింది. మరొక గట్టి కొత్తకుండ కూడా నిర్మలోదకంతో వారికి ఎదురుగా వచ్చింది. ఆ రెండు పాత్రలను, అందులోని అన్నాన్ని, జలాన్ని చూచి మహామతియైన ప్రేతనాయకుడు ఓ వణిక్‌పుత్రా! లేచి మధ్యాహ్న కర్మలను ఆచరించుకోవలసిందని చెప్పాడు.

తతస్తు వారిధాన్యాస్తౌ సలిలేన విధానతః ।
కృతాహ్నికావుభౌ జాతౌ వణిక్‌ప్రేతపతిస్తథా ॥34॥

తతో వణిక్ సుతాయాదౌ దధ్యోదనమథేచ్ఛయా ।
దత్త్వా తేభ్యశ్చ సర్వేభ్యః పిత్రేభ్యో వ్యదదాత్తతః ॥35॥

భుక్తవత్సు చ సర్వేషు కామతోఽమ్బుసి సేవితే ।
అనంతరం స బుభుజే ప్రేతపాలో వరాశనమ్ ॥36॥

ప్రకామతృప్తే ప్రేతే చ వారిధాన్యోదనం తథా ।
అంతర్ధానమగాద్ బ్రహ్మన్ వణిక్ పుత్రస్య పశ్యతః ॥37॥

అంతట వణిక్ పుత్రుడు, ప్రేతనాయకుడు ఇరువురు కుండలోని నీటితో విధిపూర్వకంగా నిత్యకర్మానుష్ఠానం గావించారు. తదనంతరం ముందుగా వణిక్ పుత్రునకు దధ్యోదనాన్ని పెట్టి, ఆ పిమ్మట ప్రేతలకందరకు అన్నం పెట్టాడు. మొత్తమందరు సంతృప్తిగా భోజనం, జలపానం చేసిన పిమ్మట శ్రేష్ఠమైన అన్నాన్ని ప్రేతనాయకుడు భుజించాడు. ఓ నారదా! ప్రేతనాయకుడు కూడా సంతృప్తిగా భోజనం చేసిన తరువాత వణిక్‌పుత్రుడు చూస్తూ ఉండగానే దధ్యోదనం జలం అంతర్ధానమయ్యాయి.

తతస్తదద్భుతతమం దృష్ట్వా స మతిమాన్ వణిక్ ।
పప్రచ్ఛ తం ప్రేతపాలం కౌతూహలమనా వశీ ॥38॥

ఈ పరమాద్భుతాన్ని చూచిన మతిమంతుడైన వణిజుడు కుతూహలంతో ప్రేతనాయకుని ఇలా ప్రశ్నించాడు.

అరణ్యే నిర్జనే సాధో కుతోఽన్నస్య సముద్భవః ।
కుతశ్చ వారిధానీయం సంపూర్ణాం పరమామ్బుసా ॥39॥

తథామీ తవ యే భృత్యాస్త్వత్తస్తే వర్ణతః కృశాః ।
భవానపి చ తేజస్వీ కించిత్పుష్టవపుః శుభః ॥40॥

శుక్లవస్త్రపరీధానో బహూనాం పరిపాలకః ।
సర్వమేతన్మమాచక్ష్వ కో భవాన్ కా శమీ త్వియమ్ ॥41॥

సాధూ! ఈ నిర్జనారణ్యంలో ఈ దధ్యోదనం నిర్మలజలంతో నిండిన పాత్రలు ఎలావచ్చాయి?. ఈ నీ భృత్యులెవరు?. నీకంటే కృశించి, వర్చస్సు లేకుండా ఎందుకున్నారు?. నీవు వారికంటె పుష్టిగా, తేజస్విగా, ఎందులకున్నావు?. తెల్లని వస్త్రాలు ధరించి, ఇందరినీ పోషిస్తున్న నీవెవరు?. ఈ శమీవృక్షం విషయమేమిటి?. ఈ విషయాలన్నీ నాకు తెలియజేయుము.

ఇత్థం వణిక్సుతవచః శ్రుత్వాఽసౌ ప్రేతనాయకః ।
శశంస సర్వమప్యాద్యం యథావృత్తం పురాతనమ్ ॥42॥

అహమాసం పురా విప్ర! శాకలే నగరోత్తమే ।
సోమశర్మేతి విఖ్యాతో బహులాగర్భసంభవః ॥43॥

మమాస్తి చ వణిక్ శ్రీమాన్ ప్రాతివేశ్యో మహాధనః ।
స తు సోమశ్రవా నామ విష్ణుభక్తో మహాయశాః ॥44॥

సోఽహం కదర్యో మూఢాత్మా ధనేఽపి సతి దుర్మతిః ।
న దదామి ద్విజాతిభ్యో న చాశ్నామ్యన్నముత్తమమ్ ॥45॥

వణిక్ సుతుని ఈ మాటలు ప్రేతనాయకుడు విని, పూర్వం గడిచిన తన జీవనగాథనంతటిని పూసగ్రుచ్చి నట్లుగా ఇలా చెప్పసాగాడు. పూర్వం నేను శాకలనగరంలోని బ్రాహ్మణుడను. సోమశర్మగా ఖ్యాతినందినవాడను. బహుళగర్భంలో జన్మించినవాడను. నా పొరుగుననే మహాధనికుడైన సోమశ్రవుడనే వైశ్యుడుండేవాడు. అతడు విష్ణుభక్తుడు, యశస్వి. నేను పరమమూర్ఖుడను. ధనవంతుడనైనను దుర్బుద్ధి కలవాడనగుటచే ద్విజులకు గాని, అతిథులకు గాని, ఏమీ దానంచేసేవాణ్ణి కాను. కడుపునిండా మంచి భోజనం కూడా చేసేవాణ్ణి కాను.

ప్రమాదాద్యది భుంజామి దధిక్షీరఘృతాన్వితమ్ ।
తతో రాత్రౌ నృభిర్ఘోరైస్తాడ్యతే మమ విగ్రహః ॥46॥

ప్రాతర్భవతి మే ఘోరా మృత్యుతుల్యా విషూచికా ।
న చ కశ్చిన్మమాభ్యాసే తత్ర తిష్ఠతి బాంధవః ॥47॥

కథం కథమపి ప్రాణా మయా వై సంప్రధారితాః ।
ఏవమేతాదృశః పాపీ నివసామ్యతినిర్ఘృణః ॥48॥

సౌవీరతిలపిణ్యాకసక్తుశాకాదిభోజనైః ।
క్షపయామి కదన్నాద్యైరాత్మానం కాలయాపనైః ॥49॥

పొరబాటున ఎప్పుడైనా దధిక్షీరఘృతాదులతో భోజనం చేసినచో ఆ రాత్రి ఎవరో మనుష్యులు వచ్చి, నన్ను ఘోరంగా కొట్టి వెళ్ళిపోయేవారు. తెల్లవారగానే నాకు భయంకరమైన కలరా కలిగి, మరణబాధ పడుతూ ఉండేవాడిని. నా దగ్గర్లో ఏ ఒక్క బంధువూ కూర్చొనేవాడు కాదు. ఇట్లు ఏదో విధంగా ప్రాణాలు ధరించి యుండేవాడిని. ఈ విధంగా పాపాత్ముడనై, సిగ్గుమాలిన జీవితం గడిపేవాడిని. తరవాణి, నువ్వులపిండితో చేసిన చెక్క. పేలపిండి, ఆకుకూరలు, పాడైపోయిన అన్నం, ఇలాంటివాటితో కాలక్షేపం చేసేవాడను.

ఏవం తత్రాసతో మహ్యం మహాన్ కాలోఽభ్యగాదథ ।
శ్రవణద్వాదశీ నామ మాసి భాద్రపదేఽభవత్ ॥50॥

ఈ విధంగా చాలాకాలం గడిచిన తరువాత భాద్రపదమాసంలో ద్వాదశీ పర్వదినం వచ్చింది.

తతో నాగరికో లోకో గతః స్నాతుం హి సంగమమ్ ।
ఇరావత్యా నడ్వలాయా బ్రహ్మక్షత్రపురస్సరః ॥51॥

మా నగరంలోని బ్రాహ్మణులు, క్షత్రియులు, తదితరులు పర్వస్నానం చేయడానికి ఇరావతీ, నడ్వల నదీ సంగమానికి వెళ్ళారు.

ప్రాతివేశ్యప్రసంగేన తత్రాప్యనుగతోఽస్మ్యహమ్ ।
కృతోపవాసః శుచిమానేకాదశ్యాం యతవ్రతః ॥52॥

ఒక సామాన్యస్త్రీ ద్వారా ఈ విషయం తెలుసుకున్న నేను ఏకాదశినాడు వాళ్ళతో కలిసి స్నానం చేసి, నియమంగా ఉపవాసమున్నాను.

తతః సంగమతోయేన వారిధానీం దృఢాం నవామ్ ।
సంపూర్ణాం వస్త్రసంవీతాం ఛత్రోపానహసంయుతామ్ ॥53॥

మృత్పాత్రమపి మిష్టస్య పూర్ణం దధ్యోదనస్య హ ।
ప్రదత్తం బ్రాహ్మణేంద్రాయ శుచయే జ్ఞానధర్మిణే ॥54॥

ఆ పర్వదినం నాడు సంగమస్నానంతో పవిత్రుడైనట్టియు, జ్ఞాని, ధర్మనిష్ఠుడునైన ఒక బ్రాహ్మణునకు క్రొత్త జలకుంభాన్ని నూతన వస్త్రాచ్ఛాదనతో ఒక గొడుగును, ఒకజత పాదరక్షలను కూడా కలిపి, మరొక కలశంలో తియ్యని పెరుగన్నం నింపి, పవిత్రుడైన బ్రాహ్మణునకు దానం చేశాను.

తదేవ జీవతా దత్తం మయా దానం వణిక్సుత ।
వర్షాణాం సప్తతీనాం వై నాన్యద్దత్తం హి కించన ॥55॥

వణిక్సుతా! నాజీవితకాలంలో నేను చేసిన దానం అదొక్కటి మాత్రమే. నా డెబ్బది సంవత్సరాల కాలంలో అది తప్ప మరేదీ ఎవరికీ ఏ దానమూ చేయలేదు.

మృతః ప్రేతత్వమాపన్నో దత్వా ప్రేతాన్నమేవ హి ।
అమీ చాదత్తదానాస్తు మదన్నేనోపజీవినః ॥56॥

మరణానంతరం నేను ప్రేతమయ్యాను. నేను ఆనాడు దానం చేసిన ఆ అన్నమే ఇప్పుడు తింటున్నాను. ఈ మహాప్రేతాలు ఏ దానం చేయకపోవడంతో నా అన్నం తిని జీవిస్తున్నారు.

ఏతత్తే కారణం ప్రోక్తం యత్తదన్నం మయాంభసా ।
దత్తం తదిదమాయాతి మధ్యాహ్నేఽపి దినే దినే ॥57॥

ఇలా నాకు నీటితో కూడా అన్నం రావడానికి తగిన కారణం నీకు చెప్పాను. నేను నాడు దానం చేసిన ఆ జలకుంభం, దధ్యోదనకుంభం, ప్రతిరోజు మధ్యాహ్నవేళకు ఇలాగే వస్తాయి.

యావన్నాహం చ భుంజామి న తావత్ క్షయమేతి వై ।
మయి భుక్తే చ పీతే చ సర్వమంతర్హితం భవేత్ ॥58॥

నేను తినేటంతవరకు అక్షయ్యంగా ఉంటాయి. నేను అన్నం తిని నీరు త్రాగిన వెంటనే అవి అంతర్ధానమై పోతాయి.

యచ్ఛాతపత్రమదదం సోఽయం జాతః శమీతరుః ।
ఉపానద్యుగలే దత్తే ప్రేతో మే వాహనోఽభవత్ ॥59॥

అప్పుడు నేను దానం చేసిన గొడుగే ఈ జమ్మిచెట్టు. ఇది నాకు నీడనిస్తోంది. నేను దానం చేసిన చెప్పులే ప్రేతాలరూపంలో వాహనంగా మారి నన్ను మోసుకొనిపోతాయి.

ఇయం తవోక్తా ధర్మజ్ఞ మాయా కీనాశతాత్మనః ।
శ్రవణద్వాదశీపుణ్యం తవోక్తం పుణ్యవర్ధనమ్ ॥60॥

ఓ ధర్మజ్ఞా! నా లోభగుణాన్ని, శ్రవణద్వాదశీవ్రతమహాఫలాన్ని నీకు వివరించి చెప్పాను. ఇది ఎంతో పుణ్యవర్ధకమైనది.

ఇత్యేవముక్తే వచనే వణిక్పుత్రోఽబ్రవీద్వచః ।
యన్మయా తాత కర్తవ్యం తదనుజ్ఞాతమర్హసి ॥61॥

ప్రేతనాయకుని ఈ మాటలు విని, వణిక్పుత్రుడు ఓ ప్రేతనాయకా! అయితే నీ విషయంలో నేనేమి చెయ్యాలో దయచేసి చెప్పు అని ప్రార్థించాడు.

తత్తస్య వచనం శ్రుత్వా వణిక్పుత్రస్య నారద ।
ప్రేతపాలో వచః ప్రాహ స్వార్థసిద్ధికరం తతః ॥62॥

యత్త్వయా తాత కర్తవ్యం మద్ధితార్థం మహామతే ।
కథయిష్యామి తత్సమ్యక్ తవ శ్రేయస్కరం మమ ॥63॥

గయాయాం తీర్థజుష్టాయాం స్నాత్వా శౌచసమన్వితః ।
మమ నామ సముద్దిశ్య పిండనిర్వాపణం కురు ॥64॥

తత్ర పిండప్రదానేన ప్రేతభావాదహం సఖే ।
ముక్తస్తు సర్వదాతౄణాం యాస్యామి సహ లోకతామ్ ॥65॥

యథేయం ద్వాదశీపుణ్యా మాసి ప్రోష్ఠపదే సితా ।
బుధశ్రవణసంయుక్తా సాఽతిశ్రేయస్కరీ స్మృతా ॥66॥

నారదా! వణిక్పుత్రుని మాటలు విని ప్రేతపాలుడు స్వార్థసిద్ధికరమైన తన పలుకులిలా పలికాడు. "ఓ మహామతీ! నీకు నాకు కూడా శ్రేయస్కరమైన విషయం చెబుతున్నాను. దానిని అనుసరింపుము. అనేక తీర్థాలతో కూడిన గయాక్షేత్రానికి వెళ్ళి, శుచిగా స్నానం చేసి, నా పేరు చెప్పి పిండప్రదానం చేయుము. మిత్రమా! దానితో నాకు ప్రేతదేహవిముక్తి కలుగుతుంది. సర్వదాతలు ఉండే లోకాలకు నేను వెళతాను. ఇక ఈ భాద్రపద శుద్ధ బుధ శ్రవణా నక్షత్రంతో కూడిన ద్వాదశీవ్రతం ఆచరించినచో అనంతసుఖాలు కలుగుతాయని తెలిసికొనుము.

ఇత్యేవముక్త్వా వణిజం ప్రేతరాజోఽనుగైః సహ ।
స్వనామాని యథాన్యాయం సమ్యగాఖ్యాతవాంచ్ఛుచిః ॥67॥

ప్రేతస్కంధే సమారోప్య త్యాజితో మరుమండలమ్ ।
రమ్యేఽథ శూరసేనాఖ్యే దేశే ప్రాప్తః స వై వణిక్ ॥68॥

స్వకర్మధర్మయోగేన ధనముచ్చావచం బహు ।
ఉపార్జయిత్వా ప్రయయౌ గయాశీర్షమనుత్తమమ్ ॥69॥

పిండనిర్వాపణం తత్ర ప్రేతానామనుపూర్వశః ।
చకార స్వపితౄణాం చ దాయాదానామనన్తరమ్ ॥70॥

ఆత్మనశ్చ మహాబుద్ధిర్మహాబోధ్యం తిలైర్వినా ।
పిండనిర్వపణం చక్రే తథాన్యానపి గోత్రజాన్ ॥71॥

ఏవం ప్రదత్తేష్వథ వై పిండేషు ప్రేతభావతః ।
విముక్తాస్తే ద్విజప్రేతా బ్రహ్మలోకం తతో గతాః ॥72॥

అలా చెప్పి ఆ ప్రేతనాయకుడు, అతని అనుచరులు తమ పేర్లను వణిజునకు చక్కగా తెలియజేశారు. అంతట ప్రేతనాయకుడు తన భృత్యులైన ప్రేతల భుజాలపై వణిజుని ఎక్కించి, ఎడారిని దాటించాడు. అంతట ఆ వణిజుడు రమ్యమైన శూరసేనదేశానికి చేరాడు. అచ్చట ఆ వణిజుడు తన కర్మధర్మముల రెండిటి ద్వారా బాగా వ్యాపారం చేసి, ధనమధికంగా సంపాదించి, ఉత్తమమైన గయాతీర్థానికి వెళ్ళాడు. అక్కడ ప్రేతనాయకుడు చెప్పిన విధంగా అతనికి, అతనితోనున్న ప్రేతాలకు నామగోత్రాలతో పిండప్రదానం చేశాడు. తదనంతరం తన పితృదేవతలకు, దాయాదులకు కూడా పిండప్రదానం చేసి, తదనంతరం బుద్ధిమంతుడైన ఆ వణిజుడు తిలలు

లేకుండా తనకు, తన గోత్రంలోని ఇతరులకు కూడా పిండప్రదానం చేసికొన్నాడు. నారదా! ఆ విధంగా ఆ వణిజుడు పిండప్రదానాలు చేసినంతనే ప్రేతాలన్నీ ప్రేతత్వాన్ని వదలి, బ్రహ్మలోకానికి వెళ్లాయి.

స చాపి హి వణిక్పుత్రో నిజమాలయమావ్రజత్ ।
శ్రవణద్వాదశీం కృత్వా కాలధర్మముపేయివాన్ ॥73॥

గంధర్వలోకే సుచిరం భోగాన్ భుక్త్వా సుదుర్లభాన్ ।
మానుష్యం జన్మమాసాద్య స బభౌ శాకలే విరాట్ ॥74॥

స్వ ధర్మకర్మవృత్తిస్థః శ్రవణద్వాదశీ రతః ।
కాలధర్మమవాప్యాసౌ గుహ్యకావాసమాశ్రయత్ ॥75॥

తత్రోష్య సుచిరం కాలం భోగాన్ భుక్త్వాఽథ కామతః ।
మర్త్యలోకమనుప్రాప్య రాజన్యతనయోఽభవత్ ॥76॥

తత్రాపి క్షత్రవృత్తిస్థో దానభోగరతో వశీ ।
గోగ్రహేఽరిగణాన్ జిత్వా కాలధర్మముపేయివాన్ ।
శక్రలోకం స సంప్రాప్య దేవైః సర్వైః సుపూజితః ॥77॥

ఆ వణిక్పుత్రుడు కూడా తన నివాసానికి తిరిగి వెళ్ళాడు. శ్రవణద్వాదశీవ్రతాన్ని చేసి, తదనంతరకాలంలో కాలధర్మం పొందాడు. తదనంతరం అతడు గంధర్వలోకానికి వెళ్ళి, అచ్చట సుదుర్లభమైన భోగాలను అనుభవించి, శాకలనగరంలో ఉత్తమమైన మానవజన్మ పొందాడు. ఆ జన్మలో స్వకర్మధర్మపరాయణుడై, శ్రవణద్వాదశీవ్రతాన్ని ఆచరిస్తూ, అనంతరకాలంలో అతడు కాలధర్మం చెంది, యక్షలోకానికి వెళ్ళాడు. యక్షలోకంలో చాలాకాలం నివసించి, అచ్చట తాను కోరిన భోగాలను అనుభవించి, తిరిగి మర్త్యలోకంలో రాజకుమారుడుగా జన్మించాడు. అక్కడ కూడా క్షాత్రధర్మాన్ని పాటిస్తూ, దానభోగరతుడై, జితేంద్రియుడై, గోవులను విడిపించడానికి శత్రువులతో పోరాడి, జయించి, అనంతరకాలంలో కాలధర్మం పొంది, ఇంద్రలోకం చేరి, అక్కడ సమస్తమైన దేవతలచే పూజింపబడ్డాడు.

పుణ్యక్షయాత్ పరిభ్రష్టః శాకలే సోఽభవద్ద్విజః ।
తతో వికటరూపోఽసౌ సర్వశాస్త్రార్థపారగః ॥78॥

వివాహయద్ద్విజసుతాం రూపేణానుపమాం ద్విజ ।
సాఽవమానే చ భర్తారం సుశీలమపి భామినీ ॥79॥

విరూపమితి మన్వానా తతః సోఽభూత్ సుదుఃఖితః ।
తతో నిర్వేదసంయుక్తో గత్వాశ్రమపదం మహత్ ॥80॥

ఇరావత్యాస్తటే శ్రీమాన్ రూపధారిణమాసదత్ ।
తమారాధ్య జగన్నాథం నక్షత్ర పురుషేణ హి ॥81॥


సురూపతామవాప్యాగ్ర్యాం తస్మిన్నేవ చ జన్మని ।
తతః ప్రియోఽభూద్భార్యాయా భోగవాంశ్చాభవద్వశీ ।
శ్రవణద్వాదశీ భక్తః పూర్వాభ్యాసాదజాయత ॥82॥

ఏవం పురాఽసౌ ద్విజపుంగవస్తు కురూపరూపో భగవత్ప్రసాదాత్ ।
అనంగరూపప్రతిమో బభూవ మృతశ్చ రాజా స పురూరవాఽభూత్ ॥83॥

ఓ నారదా! పుణ్యక్షయం కాగానే ఇంద్రలోకం నుండి భ్రష్టుడై, శాకలనగరంలో ఒక బ్రాహ్మణుడుగా జన్మించాడు. సర్వశాస్త్రవిశారదుడై, ఉత్తమసౌందర్యరాశియైన ఒక బ్రాహ్మణబాలికను వివాహమాడాడు. ఆమె తన భర్త సుశీలుడని తెలిసినను విరూపుడనే భావనతో అతనిని అవమానించింది. దానితో అతడు మిక్కిలి దుఃఖించి, ఇరావతీనదీతటాన గల శ్రీమహావిష్ణువు ఆశ్రమానికి వెళ్ళి, అచ్చటి శ్రీహరిని నక్షత్రపురుషవ్రతయుక్తంగా ఆరాధించి, అందమైన రూపాన్ని వరంగా పొందాడు. అందువలన ఆ జన్మలోనే సుందరవిగ్రహుడయ్యాడు. భార్యవద్దకు పోయి, ఆమె అనురాగాన్ని పొంది, ఆమెతో సకలభోగాలు అనుభవించాడు. పూర్వజన్మవాసనలవలన శ్రవణద్వాదశీ వ్రతాలు చేస్తూ ఆ ద్విజుడు కురూపియై కూడా భగవత్ కృపవల్ల మన్మథరూపుడై, మరణానంతరం అతడే పురూరవ చక్రవర్తి అయ్యాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే ప్రహ్లాదతీర్థయాత్రాయాం పురూరవస ఉపాఖ్యానం నామ నవసప్తతితమోఽధ్యాయః ॥79॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో ప్రహ్లాదతీర్థయాత్రలోని పురూరవోపాఖ్యానమనే డెబ్బైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



అశీతితమోఽధ్యాయః – ఎనబైయవ అధ్యాయం

ప్రహ్లాదతీర్థయాత్రాయాం నక్షత్రపురుషవర్ణనమ్ – ప్రహ్లాదతీర్థయాత్రలోని నక్షత్రపురుషవర్ణన

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

పురూరవా ద్విజశ్రేష్ఠ యథా దేవం శ్రియఃపతిమ్ ।
నక్షత్రపురుషాఖ్యేన ఆరాధయత తద్వద ॥1॥

ఓ విప్రోత్తమా! శ్రియఃపతియైన వాసుదేవుని పురూరవుడు నక్షత్రపురుషవ్రతం ద్వారా ఎలా ఆరాధించాడో చెప్పండి అని పులస్త్యమహర్షిని నారదుడు ప్రశ్నించాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రూయతాం కథయిష్యామి నక్షత్రపురుషవ్రతమ్ ।
నక్షత్రాంగాని దేవస్య యాని యానీహ నారద ॥2॥

నారదా! నక్షత్రపురుషవ్రతాచరణవిధానాన్ని చెబుతున్నాను వినుము. శ్రీహరి నక్షత్రాంగాలను గూర్చి కూడా చెబుతాను వినుము.

మూలర్క్షం చరణౌ విష్ణోర్జంఘే ద్వే రోహిణీ స్మృతే ।
ద్వే జానునీ తథాశ్విన్యౌ సంస్థితే రూపధారిణః ॥3॥

ఆషాఢే ద్వే ద్వయం చోర్వోర్గుహ్యస్థం ఫల్గునీద్వయమ్ ।
కటిస్థాః కృత్తికాశ్చైవ వాసుదేవస్య సంస్థితాః ॥4॥

ప్రోష్ఠపద్యా ద్వయం పార్శ్వే కుక్షిభ్యాం రేవతీ స్థితా ।
ఉరఃసంస్థా త్వనురాధా శ్రవిష్ఠా పృష్ఠసంస్థితా ॥5॥

విశాఖా భుజయోర్హస్తః కరద్వయముదాహృతమ్ ।
పునర్వసురథాంగుల్యో నఖాః సార్పస్తథోచ్యతే ॥6॥

గ్రీవా స్థితా తథా జ్యేష్ఠా శ్రవణం కర్ణయోః స్థితమ్ ।
ముఖసంస్థస్తథా పుష్యః స్వాతిర్దన్తాః ప్రకీర్తితాః ॥7॥

హనూ ద్వే వారుణశ్చోక్తో నాసా పైత్ర ఉదాహృతః ।
మృగశీర్షం నయనయో రూపధారిణి తిష్ఠతి ॥8॥

చిత్రా చైవ లలాటే తు భరణీ తు తథా శిరః ।
శిరోరుహస్థా చైవార్ద్రా నక్షత్రాంగమిదం హరేః ॥9॥

శ్రీహరి చరణాలలో మూలా నక్షత్రం, జంఘలలో రోహిణీ నక్షత్రం ఉంటాయి. మోకాళ్ళలో అశ్వినులు రూపధారులై యుంటారు. వాసుదేవుని తొడలు రెండిటిలో ఆషాఢ నక్షత్రాలు ఉంటే, గుహ్యేంద్రియం రెండు

ఫల్గునీ నక్షత్రాలకు ఆవాసము. కటిభాగంలో కృత్తికలుంటారు. వాసుదేవుని పార్శ్వాలలో భాద్రపద నక్షత్రాలు, కడుపులో రేవతి నివాసం చేస్తూ ఉంటాయి. వక్షఃస్థలం అనూరాధకు, వీపు ధనిష్ఠకు నెలవు. విశాఖ ప్రభువు భుజాలలో ఉంటే హస్తానక్షత్రం రెండు చేతులలో ఉంటుంది. వ్రేళ్ళు పునర్వసుకు, గోళ్ళు ఆశ్లేషకు నెలవు. జ్యేష్ఠా నక్షత్రం స్వామి మెడలోను, శ్రవణం రెండు చెవులలోను ఉంటాయి. నోరు పుష్యమికి ఆవాసం. పలువరుస స్వాతికి నెలవు. వారుణనక్షత్రమైన శతభిషానక్షత్రం దౌడలను ఆశ్రయించి ఉంటే ముక్కు మఖకు ఆశ్రయము. మృగశిర నేత్రాల రూపంలో ఉంటుంది. లలాటభాగంలో చిత్రానక్షత్రం. శిరోదేశాన భరణి, నిలచి యుంటాయి. కేశాల రూపంలో ఆర్ద్రా నక్షత్రం నెలవైయుంటుంది. ఇదే శ్రీమన్నారాయణుని నక్షత్రపురుషరూపము.

విధానం సంప్రవక్ష్యామి యథా యోగేన నారద ।
సంపూజితో హరిః కామాన్ విదధాతి యథేప్సితాన్ ॥10॥

నారదా! నక్షత్రరూపంలో వెలిగే శ్రీవల్లభుని వ్రతవిధానం వినుము. ఆ విధానం ప్రకారం శ్రీహరిని ఆరాధిస్తే కోరిన కోరికలన్నీ ఆ స్వామి సఫలం చేస్తాడు.

చైత్రమాసే సితాష్టమ్యాం యదా మూలగతః శశీ ।
తదా తు భగవత్పాదౌ పూజయేత్తు విధానతః ।
నక్షత్రసంనిధౌ దద్యాద్విప్రేంద్రాయ చ భోజనమ్ ॥11॥

చైత్రశుద్ధఅష్టమినాడు చంద్రుడు మూలానక్షత్రంతో కలిసియున్నప్పుడు శ్రీహరిదివ్యచరణాలను విధివిహితంగా పూజించి, నక్షత్రం గోచరించినంతనే విప్రులకు భోజనం పెట్టాలి.

జానునీ చాశ్వనీయోగే పూజయేదథ భక్తితః ।
దోహదే చ హవిష్యాన్నం పూర్వవద్ద్విజభోజనమ్ ॥12॥

అశ్వినీయోగంలో చంద్రుడున్నప్పుడు భక్తితో స్వామి మోకాళ్ళను పూజించి, హవిష్యాన్నం దోహదకారిగా సమర్పించి, వెనుకటివలెనే బ్రాహ్మణభోజనం చేయించాలి.

ఆషాఢాభ్యాం తథా ద్వాభ్యాం ద్వావూరూ పూజయేద్బుధః ।
సలిలం శిశిరం తత్ర దోహదే చ ప్రకీర్తితమ్ ॥13॥

పూర్వాషాఢ, ఉత్తరాషాఢలలో చంద్రుడున్నప్పుడు శ్రీహరి రెండు ఊరువులను విజ్ఞుడు పూజించి, దోహదకారిగా చల్లని జలం సమర్పించాలి.

ఫాల్గునీ ద్వితయే గుహ్యం పూజనీయం విచక్షణైః ।
దోహదే చ పయో గవ్యం దేయం చ ద్విజభోజనమ్ ॥14॥

చంద్రుడు పూర్వఫల్గుణీ, ఉత్తరఫల్గుణీ నక్షత్రయోగంలో ప్రభువు గుహ్యాంగాన్ని అర్చించి, ఆవుపాలు దోహదంగా ఇచ్చి, బ్రాహ్మణభోజనం చేయించాలి.

కృత్తికాసు కటిః పూజ్యా సోపవాసో జితేంద్రియః ।
దేయం చ దోహదం విష్ణోః సుగంధకుసుమోదకమ్ ॥15॥

చంద్ర కృత్తికాయోగాన జితేంద్రియుడై ఉపవసించి, స్వామి కటిభాగాన్ని పూజించి, సుగంధపుష్పోదకాన్ని దోహదంగా అర్పించాలి.

పార్శ్వే భాద్రపదా యుగ్మే పూజయిత్వా విధానతః ।
గుడం సలేహకం దద్యాద్దోహదే దేవ కీర్తితమ్ ॥16॥

చంద్రుడు పూర్వాభాద్ర, ఉత్తరాభాద్రల యోగంలో శ్రీహరి పార్శ్వభాగాలను పూజించి, ఇష్టసిద్ధికి బెల్లపు ఉండలు అర్పించాలి.

ద్వే కుక్షీ రేవతీయోగే దోహదే ముద్గమోదకాః ।
అనురాధాసు జఠరం షష్ఠికాన్నం చ దోహదే ॥17॥

శ్రవిష్ఠాయాం తథా పృష్ఠం శాలిభక్తం చ దోహదే ।
భుజయుగ్మం విశాఖాసు దోహదే పరమోదనమ్ ॥18॥

హస్తే హస్తౌ తథా పూజ్యౌ యావకం దోహదే స్మృతమ్ ।
పునర్వసావంగులీశ్చ పటోలస్తత్ర దోహదే ॥19॥

శశీ రేవతీయోగంలో పైది క్రిందదియైన కడుపులను పూజించి పెసరలడ్డులు దోహదంగా అర్పించాలి. అనురాధ చంద్రయోగంలో జఠరాన్ని పూజించి, బియ్యపుపేలాలు దోహదంగా ఇవ్వాలి. ధనిష్ఠా యోగంలో వీపు భాగాన్ని పూజించి, శాల్యన్నం దోహదంగా సమర్పించాలి. విశాఖయోగంలో పరమాన్నం దోహదంతో శ్రీహరి రెండు భుజాలు అర్చించాలి. హస్తానక్షత్రయోగంలో రెండు చేతులు పూజించి, యవాన్నం దోహదమివ్వాలి. పునర్వసుయోగంలో శ్రీహరి వ్రేళ్ళను పూజించి, దోసపండ్లు దోహదంగా ఇవ్వాలి.

ఆశ్లేషాసు నఖాన్ పూజ్య దోహదే తిత్తిరామిషమ్ ।
జ్యేష్ఠాయాం పూజయేద్గ్రీవాం దోహదే తిలమోదకమ్ ॥20॥

శ్రవణే శ్రవణౌ పూజ్యౌ దధిభక్తం చ దోహదే ।
పుష్యే ముఖం పూజయేత దోహదే ఘృతపాయసమ్ ॥21॥

స్వాతి యోగే చ దశనా దోహదే తిలశష్కులీ ।
దాతవ్యా కేశవప్రీత్యై బ్రాహ్మణస్య చ భోజనమ్ ॥22॥

చంద్రుడు ఆశ్లేషాయోగంలో స్వామివారి గోళ్ళను పూజించాలి. తిత్తిరమాంసం దోహదంగా సమర్పించాలి. జ్యేష్ఠాయోగంలో నువ్వులలడ్డుల దోహదంతో శ్రీహరి గ్రీవాన్ని (మెడను) అర్చించాలి. చంద్రుడు శ్రవణానక్షత్ర యోగంలో స్వామివారి రెండు చెవులను పూజించి దధ్యోదనం దోహదంగా సమర్పించాలి. పుష్యయోగంలో ముఖాన్ని

పూజించాలి. ఘృతపాయసాన్ని దోహదంగా సమర్పించాలి. స్వాతీనక్షత్రయోగంలో దంతపంక్తిని పూజించి, నువ్వుల వడలు నివేదించాలి. శ్రీవల్లభుని ప్రీత్యర్థం బ్రాహ్మణభోజనం చేయించాలి.

హనూ శతభిషాయోగే పూజయేచ్చ ప్రయత్నతః ।
ప్రియంగురక్తశాల్యన్నం దోహదం మధువిద్విషః ॥23॥

చంద్ర శతభిషాయోగంలో ప్రభువు దౌడలను చక్కగా పూజించి, మధుసూదనునకు ఎర్రబియ్యం ప్రియంగువాన్నం (కొఱ్ఱలు) దోహదమర్పించాలి.

మఘాసు నాసికా పూజ్యా మధుదధ్యాచ్చ దోహదే ।
మృగోత్తమాంగే నయనే మృగమాంసం చ దోహదే ॥24॥

మృగశీర్షయోగంలో నేత్రపూజ, లేడిమాంసం దోహదంగాను, మఘాచంద్రయోగంలో నాసికను పూజించి, తేనె, పెరుగు దోహదంగాను సమర్పించాలి.

చిత్రాయోగే లలాటం చ దోహదే చారుభోజనమ్ ।
ధరణీషు శిరః పూజ్యం చారుభక్తం చ దోహదే ॥25॥

చిత్రా చంద్రుల యోగంలో లలాటపూజ గావించి, చక్కని రుచికరమైన భోజనం దోహదంగా సమర్పించాలి. చంద్ర భరణీయోగంలో శిరస్సును పూజించి, రుచ్యమైన అన్నం దోహదంగా ఇవ్వాలి.

సంపూజనీయా విద్వద్భిరార్ద్రాయోగే శిరోరుహాః ।
విప్రాంశ్చ భోజయేద్ భక్త్యా దోహదే చ గుడార్ద్రకమ్ ॥26॥

విద్వాంసులు ఆర్ద్రా చంద్రయోగంలో స్వామివారి శిరోజాలు పూజించి, అల్లం, బెల్లం కుడుములు దోహదంగా అర్పించాలి. భక్తితో విప్రులకు భోజనం చేయించాలి.

నక్షత్రయోగేష్వేతేషు సంపూజ్య జగతఃపతిమ్ ।
పూజితే దక్షిణాం దద్యాత్ స్త్రీపుంసోశ్చారువాససీ ॥27॥

ఈ విధంగా చంద్ర నక్షత్రయోగాలలో జగన్నాథుని యథావిధిగా భక్తితో పూజించి, వ్రతానంతరం బ్రాహ్మణ దంపతులకు భోజనం పెట్టి, చక్కని వస్త్రాలు దానం చేయాలి. తగినంత దక్షిణలు ఈయాలి.

ఛత్రోపాన శ్వేతయుగం సప్తధాన్యాని కాంచనమ్ ।
ఘృతపాత్రంచ మతిమాన్ బ్రాహ్మణాయ నివేదయేత్ ॥28॥

వృద్ధిని కోరు సజ్జనులు బ్రాహ్మణునకు ఛత్రం, పాదరక్షలు, సప్తవిధాలైన ధాన్యాలు, కాంచనం, ఘృతంతో కూడిన ఘృతపాత్ర, వ్రతోద్యాపనగా భక్తితో సమర్పించాలి.

ప్రతి నక్షత్ర యోగేన పూజనీయా ద్విజాతయః ।
నక్షత్రమయ ఏవైష పురుషః శాశ్వతో మతః ॥29॥

నక్షత్రపురుషాఖ్యం హి వ్రతానాముత్తమం వ్రతమ్ ।
పూర్వం కృతం హి భృగుణా సర్వపాతకనాశనమ్ ॥30॥

అవ్యయుడైన జనార్దనుడు నక్షత్రమయుడు కాబట్టి పూజాక్రమంలో చంద్రుడు ప్రతి నక్షత్రయోగంలో బ్రాహ్మణార్చన జరగాలి. ఈ నక్షత్రపురుషవ్రతం వ్రతాలలోకెల్లా ఉత్తమమైన వ్రతం. పూర్వకాలంలో భృగు మహర్షి సర్వపాపహరమైన ఈ వ్రతమాచరించాడు.

అంగోపాంగాని దేవర్షే పూజయిత్వా జగద్గురోః ।
సురూపాణ్యభిజాయన్తే ప్రత్యంగాంగాని చైవ హి ॥31॥

ఓ దేవర్షీ! జగన్నాథుని అంగోపాంగాలను ఈ విధంగా పూజించినవారి సర్వాంగాలు సుందరంగా, చూడముచ్చటగా ఉంటాయి.

సప్తజన్మకృతం పాపం కులసంగాగతం చ యత్ ।
పితృమాతృసముత్థం చ తత్సర్వం హన్తి కేశవః ॥32॥

గత ఏడు జన్మలలో చేసిన పాపం కులక్రమాగతంగా వచ్చిన దోషాలు, తల్లిదండ్రులు చేసిన పాపాలు, సమస్తమైన పాపాలు, కేశవుడు నశింపజేస్తాడు.

సర్వాణి భద్రాణ్యాప్నోతి శరీరారోగ్యముత్తమమ్ ।
అనంతాం మనసః ప్రీతిం రూపం చాతీవ శోభనమ్ ॥33॥

వాఙ్మాధుర్యం తథా కాన్తిం యచ్చాన్యదభివాంఛితమ్ ।
దదాతి నక్షత్రపుమాన్ పూజితస్తు జనార్దనః ॥34॥

సమస్తమైన శుభాలు పొందుతాడు. ఉత్తమమైన శరీరారోగ్యం, అమితమైన మానసోల్లాసం, చక్కని రూపసౌందర్యం, వాఙ్మాధుర్యం, కాంతి, సర్వత్రా గౌరవం, తదితరమైన ఈప్సితార్థాలనన్నిటిని నక్షత్రపురుషుడైన జనార్దనుని పూజించిన వారికి ప్రసాదిస్తాడు.

ఉపోష్య సమ్యగేతేషు క్రమేణర్క్షేషు నారద ।
అరుంధతీ మహాభాగా ఖ్యాతిమగ్ర్యాం జగామహ ॥35॥

నారదా! ఈ నక్షత్రయోగాలన్నిటియందు చక్కగా ఉపవసించి, ప్రభువును పూజించి, అరుంధతీదేవి స్త్రీ లోకానికి పూజ్యురాలయ్యింది.

ఆదిత్యస్తనయార్థాయ నక్షత్రాంగం జనార్దనమ్ ।
సంపూజయిత్వా గోవిన్దం రేవన్తం పుత్రమాప్తవాన్ ॥36॥

నక్షత్రాంగపురుషుని అర్చించి, సూర్యదేవుడు గోవిందుని కుమారునిగా పొందాడు. అతడే రేవంతుడు.

రంభా రూపమవాపాగ్ర్యం వాఙ్మాధుర్యం చ మేనకా ।
కాంతిం విధురవాపాగ్ర్యాం రాజ్యం రాజా పురూరవాః ॥37॥

ఈ వ్రతమాచరించి, రంభ రూపసౌందర్యాన్ని, మేనక వాఙ్మాధుర్యాన్ని, చంద్రుడు కాంతిని, పురూరవుడు రాజ్యాన్ని పొందారు.

ఏవం విధానతో బ్రహ్మన్ నక్షత్రాఙ్గో జనార్దనః ।
పూజితో రూపధారీయైస్తైః ప్రాప్తా తు సుకామితా ॥38॥

ఏతత్తవోక్తం పరమం పవిత్రం ధన్యం యశస్యం శుభరూపదాయి ।
నక్షత్రపుంసః పరమం విధానం శ్రుణుష్వ పుణ్యామిహ తీర్థయాత్రామ్ ॥39॥

ఓ నారదా! ఈ విధంగా నక్షత్రాంగరూపునిగా జనార్దనుని ఎవరెవరు పూజించారో వారంతా వారివారి కోర్కెలను నెరవేర్చుకున్నారు. పరమపవిత్రము, యశోధనరూపప్రదాయకము, అయిన నక్షత్రపురుషవ్రతవిధానం నీకు వినిపించాను. ఇక ప్రహ్లాదుని పవిత్రతీర్థయాత్రా వివరణ వినుము.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే ప్రహ్లాదతీర్థయాత్రాయాం నక్షత్రపురుషో నామాశీతితమోఽధ్యాయః ॥80॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో ప్రహ్లాదతీర్థయాత్రలోని నక్షత్రపురుషుడనే ఎనబైయవ అధ్యాయం సమాప్తం.



ఏకాశీతితమోఽధ్యాయః – ఎనభైఒకటవ అధ్యాయం

ప్రహ్లాదతీర్థయాత్రాయాం జలోద్భవవధః – ప్రహ్లాదతీర్థయాత్రలో జలోద్భవవధ

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇరావతీమనుప్రాప్య పుణ్యాం తామృషికన్యకామ్ ।
స్నాత్వా సంపూజయామాస చైత్రాష్టమ్యాం జనార్దనమ్ ॥1॥

నక్షత్రపురుషం తీర్త్వా వ్రతం పుణ్యప్రదం శుచిః ।
జగామ స కురుక్షేత్రం ప్రహ్లాదో దానవేశ్వరః ॥2॥

ఓ నారదా! ఋషికన్యయైన పవిత్ర ఇరావతికి వెళ్ళి, స్నానం చేసి, ప్రహ్లాదుడు చైత్ర అష్టమినాడు జనార్దనుని పూజించాడు. అచ్చట శుచియై, పుణ్యప్రదమైన నక్షత్రపురుషవ్రతమాచరించి, దానవేశ్వరుడైన ప్రహ్లాదుడు కురుక్షేత్రానికి వెళ్ళాడు.

ఐరావతేన మంత్రేణ చక్రతీర్థం సుదర్శనమ్ ।
ఉపామంత్ర్య తతః సస్నౌ వేదోక్తవిధినా మునే ॥3॥

ఓ నారదా! ఐరావతమంత్రాలతో సుదర్శనుడగు చక్రతీర్థుని అర్చించి, విధివిధానంగా స్నానమాచరించాడు.

ఉపోష్య క్షణదాం భక్త్యా పూజయిత్వా కురుధ్వజమ్ ।
కృతశౌచౌ జగామాథ ద్రష్టుం పురుషకేసరిమ్ ॥4॥

ఆ రాత్రి ఉపవసించి, భక్తితో కురుధ్వజుని పూజించి, శుచియై, నృసింహదేవుని దర్శించడానికి వెళ్ళాడు.

స్నాత్వా తు దేవికాయాం చ నృసింహం ప్రతిపూజ్య చ ।
తత్రోష్య రజనీమేకాం గోకర్ణం దానవో యయౌ ॥5॥

తస్మిన్ స్నాత్వా తథా ప్రాచీం పూజ్యేశం విశ్వకర్మిణమ్ ।
ప్రాచీనే చాపరే దైత్యో ద్రష్టుం కామేశ్వరం యయౌ ॥6॥

ప్రహ్లాదుడు దేవికానదిలో స్నానం చేసి, నృసింహుని పూజించి, ఆ రాత్రి అక్కడ గడిపి, మరునాడు గోకర్ణ క్షేత్రానికి వెళ్ళాడు. అక్కడ స్నానం చేసి, తూర్పుదిక్కున విశ్వకర్మను పూజించి, కామేశ్వరుని దర్శించడానికి వేరే దిశకు వెళ్ళాడు.

తత్ర స్నాత్వా చ దృష్ట్వా చ పూజయిత్వా చ శంకరమ్ ।
ద్రష్టుం యయౌ చ ప్రహ్లాదః పుండరీకం మహామ్భసి ॥7॥

తత్ర స్నాత్వా చ దృష్ట్వా చ సంతర్ప్య పితృదేవతాః ।
పుండరీకం చ సంపూజ్య ఉవాస దివసత్రయమ్ ॥8॥

అక్కడ స్నాతుడై, కామేశ్వర మహాదేవుని పూజించి, ప్రహ్లాదుడు మహాజలమధ్యన పుండరీకానికి వెళ్ళాడు. అక్కడ స్నానం చేసి, పితృదేవతలకు తర్పణాదులిచ్చి, పుండరీకుని అర్చించి, అచ్చట మూడురోజులు గడిపాడు.

విశాఖయూపే తదను దృష్ట్వా దేవం తథా జితమ్ ।
స్నాత్వా తథా కృష్ణతీర్థే త్రిరాత్రం న్యవసచ్ఛుచిః ॥ 9॥

అనంతరం విశాఖయూపక్షేత్రంలో అజిత భగవానుని దర్శించి, స్నానంచేసి, శుచియై, కృష్ణాతీర్థంలో మూడు రాత్రులు గడిపాడు.

తతో హంసపదే హంసం దృష్ట్వా సంపూజ్య చేశ్వరమ్ ।
జగామాసౌ పయోష్ణ్యామఖణ్డం ద్రష్టుమీశ్వరమ్ ॥10॥

అనంతరం హంసపదంలో ఈశ్వరుని సేవించి, అనంతరం ఆ భాగవతుడు అఖండేశ్వరుని దర్శించడానికి పయోష్ణికి వెళ్ళాడు.

స్నాత్వా పయోష్ణ్యాః సలిలే పూజ్యాఖండం జగత్పతిమ్ ।
ద్రష్టుం జగామ మతిమాన్ వితస్తాయాం కుమారిలమ్ ॥11॥

ఆ పయోష్ణిజలాలలో స్నానం చేసి, అఖండేశ్వరుని అర్చించి, మతిమంతుడు కుమారిలుని దర్శించడానికి వితస్తకు వెళ్ళాడు.

తత్ర స్నాత్వాఽర్చ్య దేవేశం వాలఖిల్యైర్మరీచిభిః ।
ఆరాధ్యమానం యద్యత్ర కృతం పాపప్రణాశనమ్ ॥12॥

వితస్తలో మునిగి, జ్యోతిర్మయులైన వాలఖిల్యఋషులచే ఆరాధింపబడిన దేవేశ్వరుని అర్చించి, తాను చేసిన పాపాలనన్నిటిని నశింపజేసుకున్నాడు.

యత్ర సా సురభిర్దేవీ స్వసుతాం కపిలాం శుభామ్ ।
దేవప్రియార్థమసృజద్ధితార్థం జగతస్తథా ॥13॥

తత్ర దేవహ్రదే స్నాత్వా శంభుం సంపూజ్య భక్తితః ।
విధివద్దధి చ ప్రాశ్య మణిమన్తం తతో యయౌ ॥14॥

దేవతల ప్రీత్యర్థం, లోకకల్యాణార్థము, కామధేనువు కపిల అనే గోవులను కనిన దేవహ్రదమనే తీర్థంలో స్నానం చేసి, భక్తితో శివుని ఆరాధించి, విధివిధానంగా పెరుగు తిని, మణిమంతానికి ప్రయాణమయ్యాడు.

తత్ర తీర్థవరే స్నాత్వా ప్రాజాపత్యే మహామతిః ।
దదర్శ శంభుం బ్రహ్మాణం దేవేశం చ ప్రజాపతిమ్ ॥15॥

విధానతస్తు తాన్ దేవాన్ పూజయిత్వా తపోధన ।
షడ్రాత్రం తత్ర చ స్థిత్వా జగామ మధునందినీమ్ ॥16॥

ప్రజాపతి నిలయమైన ఆ శ్రేష్ఠతీర్థంలో స్నానం చేసి, ఆ మహామతి హరుని, చతుర్ముఖుని దర్శించి, యథావిధిగా పూజించాడు. ఆరురాత్రులు ఆ దివ్యక్షేత్రంలో గడిపి, మధునందినికి వెళ్లాడు.

మధుమత్ సలిలే స్నాత్వా దైవం చక్రధరం హరమ్ ।
శూలబాహుం చ గోవిందం దదర్శ దనుపుంగవః ॥17॥

ఓ నారదా! మధువువంటి తీయగా ఉండే ఆ నదీజలాలలో స్నానమాడి, శూలపాణియైన హరిని, చక్రధరుడైన హరుని, దానవశ్రేష్ఠుడైన ప్రహ్లాదుడు దర్శించాడు.

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

కిమర్థం భగవాన్ శంభుర్దధారాథ సుదర్శనమ్ ।
శూలం తథా వాసుదేవో మమైతద్బ్రూహి పృచ్ఛతః ॥18॥

బ్రహ్మర్షీ! శంకరుడు సుదర్శనాన్ని, వాసుదేవుడు శూలాన్ని ఎందుకు ధరించారో దయచేసి చెప్పండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శ్రూయతాం కథయిష్యామి కథామేతాం పురాతనీమ్ ।
కథయామాస యాం విష్ణుర్భవిష్యమనవే పురా ॥19॥

నారదా! అతిప్రాచీనమైన ఆ కథను చెబుతాను వినుము. దీనిని పూర్వం విష్ణువు భవిష్యమనువుకు చెప్పాడు.

జలోద్భవో నామ మహాసురేంద్రో ఘోరం స తప్త్వా తప ఉగ్రవీర్యః ।
ఆరాధయామాస విరించిమారాత్ స తస్య తుష్టో వరదో బభూవ ॥20॥

ఒకప్పుడు జలోద్భవుడనే మహాదైత్యేంద్రుడు భయంకరమైన తపస్సు చేసి, బ్రహ్మదేవుని ఆరాధించాడు. వరదుడైన ఆయన సంతోషించాడు.

దేవాసురాణామజయో మహాహవే నిజైశ్చ శస్త్రైరమరైరవధ్యః ।
బ్రహ్మర్షిశాపైశ్చ నిరీప్సితార్థో జలే చ వహ్నౌ స్వగుణోపహర్తా ॥21॥

దేవాసురులకు అవధ్యుడుగాను, మహాయుద్ధంలో ఎవరిచేతను స్వంత ఆయుధాలచేత చంపబడకుండునట్టును, బ్రహ్మర్షుల శాపాల ప్రభావం చూపకుండునట్లును, నీటిలో నీటిగుణాన్ని, అగ్నిలో అగ్నిగుణాన్ని, కలిగియుండకుండునట్లు అసాధ్యమైన వరాలు బ్రహ్మ దైత్యేంద్రునకు ప్రదానం చేశాడు.

ఏవం ప్రభావో దనుపుంగవోఽసౌ దేవాన్ మహర్షీన్ నృపతీన్ సమగ్రాన్ ।
ఆబాధమానో విచచార భూమ్యాం సర్వాః క్రియా నాశయదుగ్రమూర్తిః ॥22॥

ఆ వరప్రభావం వల్ల ఆ దానవుడు మదించి, దేవర్షులను, రాజులను, అందరిని పూర్తిగా బాధిస్తూ, భూమి మీద సంచరింపసాగాడు. యజ్ఞాది ధర్మకార్యాలనన్నిటిని ధ్వంసం చేయసాగాడు.

తతోఽమరా భూమిభవాః సభూపాః జగ్ముః శరణ్యం హరిమీశితారమ్ ।
తైశ్చాపి సార్ధం భగవాన్ జగామ హిమాలయం యత్ర హరస్త్రినేత్రః ॥23॥

వాని బాధలు పడలేక, దేవతలు, మానవులు, రాజులు, శరణ్యుడైన శ్రీహరిని శరణుజొచ్చారు. ఆయన వారినందరిని వెంటబెట్టుకుని హరుని నివాసమైన హిమాలయాలకు వెళ్ళాడు.

సమ్మంత్ర్య దేవర్షిహితం చ కార్యం మతిం చ కృత్వా నిధనాయ శత్రోః ।
నిజాయుధానాం చ విపర్యయంతౌ దేవాధిపౌ చక్రతురుగ్రకర్మిణౌ ॥24॥

అక్కడ హరిహరులు ఇరువురు ఆలోచించుకుని ఏ విధంగానైనా దేవతలకు, ఋషులకు మేలు చేసేందుకై, ఆ దానవుని సంహరించడానికి నిశ్చయించుకున్నారు. తమ తమ ఆయుధాలను పరస్పరం మార్చుకున్నారు. ఆ జలోద్భవుని సంహరించేందులకు భయంకరరూపాలు ధరించి, వానిని వెతకసాగారు.

తతశ్చాసౌ దానవో విష్ణుశర్వౌ సమాయాతౌ తజ్జిఘాంసూ సురేశౌ ।
మత్వాఽజేయౌ శత్రుభిర్ఘోరరూపౌ భూయాత్తోయే నిమ్నగాయాం వివేశ ॥25॥

అలా హరిహరులిరువురు ఆయుధాలు మార్చుకొని, తనను చంపడానికి ఘోరరూపాలతో బయలుదేరడం, వారు ఎవరివల్ల చావు లేనివారు కావడం దానవుడు తెలిసికొని, భయకంపితుడై జలాలలో ప్రవేశించాడు.

జ్ఞాత్వా ప్రనష్టం త్రిదివేన్ద్రశత్రుం నదీం విశాలాం మధుమత్సు పుణ్యామ్ ।
ద్వయోః సశస్త్రౌ తటయోర్హరీశౌ ప్రచ్ఛన్నమూర్తీ సహసా బభూవతుః ॥26॥

ఆ దేవశత్రువు నీళ్ళలో మునిగిపోవడం తెలిసికొని, తీయని జలాలు గల పవిత్రమైన విశాలనది ఉభయ తీరాలలో వారిరువురు శస్త్రధారులై, ప్రచ్ఛన్నరూపాలలో నిలిచారు.

జలోద్భవశ్చాపి జలం విముచ్య జ్ఞాత్వా గతౌ శంకరవాసుదేవౌ ।
దిశస్సమీక్ష్య భయకాతరాక్షో దుర్గం హిమాద్రిం చ తదారురోహ ॥27॥

జలోద్భవుడు కూడా కొంతసమయానికి మెల్లగా నీటినుండి బయటకు వచ్చి, బెదురుచూపులతో నలువైపులా చూస్తూ, హరిహరులు వెళ్ళిపోయారని నిశ్చయించుకుని, దుర్గమమైన హిమాద్రిశిఖరానికి ఎగబ్రాకి కూర్చున్నాడు.

మహీధ్రశృంగోపరి విష్ణుశంభూ చంచూర్యమాణం స్వరిపుం చ దృష్ట్వా ।
వేగాదుభౌ దుద్రువతుః సశస్త్రౌ విష్ణుస్త్రిశూలీ గిరిజశ్చ చక్రీ ॥28॥

ఆ విధంగా వాడు పర్వతశ్రేష్ఠం యొక్క శిఖరాన తిరుగుతున్న తన శత్రువును చూసి, త్రిశూలాన్ని ధరించిన విష్ణువు, చక్రాన్ని ధరించిన శంకరుడు అతని వైపునకు వేగంగా పరుగెత్తారు.

తాభ్యాం స దృష్టస్త్రిదశోత్తమాభ్యాం చక్రేణ శూలేన చ భిన్నదేహః ।
పపాత శైలాత్ తపనీయవర్ణో యథాఽన్తరిక్షాద్ విమలా చ తారా ॥29॥

త్రిదశోత్తములైన వారిరువురు జలోద్భవుని చూసి చక్రంతోను, శూలంతోను వాని శరీరాన్ని ఛేదించారు. దానితో చిల్లులు పడిన బంగారు కాంతి గల దానవశరీరం ఆకాశంనుండి తెగిపడే ఉజ్జ్వలనక్షత్రం వలె ఆ పర్వత శిఖరం మీదనుండి పడిపోయింది.

ఏవం త్రిశూలం చ దధార విష్ణుశ్చక్రం త్రినేత్రోఽప్యరిసూదనార్థమ్ ।
యత్రాఘహంత్రీ హ్యభవద్వితస్తా హరాంఘ్రిపాతాచ్ఛిశిరాచలాత్తు ॥30॥

తత్ప్రాప్య తీర్థం త్రిదశాధిపాభ్యాం పూజాం చ కృత్వా హరిశంకరాభ్యామ్ ।
ఉపోష్య భక్త్యా హిమవన్తమాగాద్ ద్రష్టుం గిరీశం శివవిష్ణుగుప్తమ్ ॥31॥

ఆ విధంగా లోకకంటకుడైన జలోద్భవుని సంహరించేందుకు శివుడు చక్రాన్ని, విష్ణువు త్రిశూలాన్ని ధరించ వలసివచ్చింది. ఆ సంఘటన శివుని పాదఘాతం వల్ల శీతలగిరి నుండి ఉద్భవించిన పాపనాశిని వితస్తానదీ పరిసరాలలో జరిగింది. ప్రహ్లాదుడు ఆ ప్రదేశాన్ని దర్శించి, దేవాధిదేవులైన శంకర నారాయణులను పూజించి, భక్తితో ఉపవసించి, శివకేశవుల చేత రక్షితుడైన ఆ నగాధిరాజు హిమవంతుని దర్శించడానికి వెళ్లాడు.

తం సమభ్యర్చ్య విధివద్దత్త్వా దానం ద్విజాతిషు ।
విస్తృతే హిమవత్పాదే భృగుతుంగం జగామ సః ॥32॥

యత్రేశ్వరో దేవవరస్య విష్ణోః ప్రాదాద్రథాంగప్రవరాయుధం వై ।
యేన ప్రచిచ్ఛేద త్రిధైవ శంకరం జిజ్ఞాసమానోఽస్త్రబలం మహాత్మా ॥33॥

ఆ గిరీశుని విధివిధానంగా అర్చించి, బ్రాహ్మణులకు దానాలొసగి, విశాలమైన హిమాలయ పాదప్రదేశాన గల భృగు తుంగ క్షేత్రానికి ప్రహ్లాదుడు వెళ్లాడు. అచ్చట దేవశ్రేష్ఠుడైన విష్ణువునకు శంకరుడు చక్రాయుధాన్ని ప్రదానం చేయగా, దాని శక్తిని పరీక్షింపదలచి, విష్ణువు దానిని ప్రయోగించి, శివుని మూడు ముక్కలుగా ఖండించాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే ప్రహ్లాదతీర్థయాత్రాయాం జలోద్భవవధో నామైకాశీతితమోఽధ్యాయః ॥81॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని ప్రహ్లాదతీర్థయాత్రలో జలోద్భవవధ అనే ఎనబైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వ్యశీతితమోऽధ్యాయః – ఎనభైరెండవ అధ్యాయం

శ్రీదామచరితమ్ – శ్రీదామచరిత్ర

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

భగవన్ లోకనాథాయ విష్ణవే విషమేక్షణః ।
కిమర్థమాయుధం చక్రం దత్తవాన్ లోకపూజితమ్ ॥1॥

భగవన్! ముక్కంటియగు శివుడు లోకనాథుడైన విష్ణువునకు లోకపూజితమైన చక్రాయుధం ఎందులకిచ్చాడు?

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శృణుష్వావహితో భూత్వా కథామేతాం పురాతనీమ్ ।
చక్రప్రదానసంబద్ధాం శివమాహాత్మ్యవర్ధినీమ్ ॥2॥

నారదా! ఈ చక్రప్రదానకథ మహాపురాతనమైనది. శివమాహాత్మ్యాన్ని పెంపొందించేది. దీనిని చెబుతున్నాను, జాగ్రత్తగా వినుము.

ఆసీద్ద్విజాతిప్రవరో వేదవేదాఙ్గపారగః ।
గృహాశ్రమీ మహాభాగో వీతమన్యురితి స్మృతః ॥3॥

తస్యాత్రేయీ మహాభాగా భార్యాసీచ్ఛీలసమ్మతా ।
పతివ్రతా పతిప్రాణా ధర్మశీలేతి విశ్రుతా ॥4॥

తస్యామస్య మహర్షేస్తు ఋతుకాలాభిగామినః ।
సంబభూవ సుతః శ్రీమాన్ ఉపమన్యురితి స్మృతః ॥5॥

ఒకానొకప్పుడు ద్విజాతి ప్రవరుడు, వేదవేదాంగపారగుడు, మహాభాగుడు, గృహస్థాశ్రమంలో ఉన్నవాడునైన వీతమన్యుడనేవాడు ఉండేవాడు. అతనికి శీలసంపన్నురాలు, పతివ్రత, పతియే ప్రాణంగా భావించేదియైన ఆత్రేయి అనే పేరు గల భార్య ఉండేది. ఆమె ధర్మశీల అను పేరుతో ప్రసిద్ధి చెందింది. ఒకప్పుడు ఋతుకాలంలో ఆమెను ఆ మహర్షి కలియగా వారికి ఉపమన్యుడనే కుమారుడు కలిగాడు.

తం మాతా మునిశార్దూల శాలిపిష్టరసేన వై ।
పోషయామాస వదతీ క్షీరమేతత్ సుదుర్గతా ॥6॥

సోऽజానానోऽథ క్షీరస్య స్వాదుతాం పయ ఇత్యథ ।
సంభావనామప్యకరోచ్ఛాలిపిష్టరసేऽపి హి ॥7॥

వారు దరిద్రానికి లోనైన కారణంగా బియ్యపుపిండి కలిపిన నీటిని ప్రతినిత్యం తన పుత్రునకు పాలు అని చెప్పి ఇచ్చేది. పాలరుచి తెలియని ఆ బాలుడు వరిపిండి నీటినే త్రాగుతూ ఉండేవాడు.

స త్వేకదా సమం పిత్రా కుత్రచిద్ద్విజవేశ్మని ।
క్షీరౌదనం చ బుభుజే సుస్వాదు ప్రాణపుష్టిదమ్ ॥8॥

స లబ్ధ్వానుపమం స్వాదం క్షీరస్య ఋషిదారకః ।
మాత్రా దత్తం ద్వితీయేఽహ్ని నాదత్తే పిష్టవారి తత్ ॥9॥

రురోదాథ తతో బాల్యాత్ పయోఽర్థీ చాతకో యథా ।
తం మాతా రుదతీ ప్రాహ బాష్పగద్గదయా గిరా ॥10॥

ఉమాపతౌ పశుపతౌ శూలధారిణి శంకరే ।
అప్రసన్నే విరూపాక్షే కుతః క్షీరేణ భోజనమ్ ॥11॥

యదీచ్ఛసి పయో భోక్తుం సద్యః పుష్టికరం సుత ।
తదారాధయ దేవేశం విరూపాక్షం త్రిశూలినమ్ ॥12॥

తస్మింస్తుష్టే జగద్ధామ్ని సర్వకల్యాణదాయిని ।
ప్రాప్యతేఽమృతపాయిత్వం కిం పునః క్షీరభోజనమ్ ॥13॥

ఒకనాడు తండ్రివెంట ఒక బ్రాహ్మణగృహంలో భోజనానికి వెళ్ళగా అక్కడ మధురమైన క్షీరాన్నం వడ్డించారు. అప్పుడు ప్రాణపుష్టికరమైన ఆ క్షీరాన్నాన్ని తిన్నాడు. అనుపమానమాధుర్యంతో కూడిన పాలరుచిని అనుభవించిన ఆ కుమారుడు మరునాడు తల్లి ఇచ్చిన పిండినీరు త్రాగలేదు. అంతేగాక బాల్యం వల్ల పాలు కావాలని రోదించడం ప్రారంభించాడు. వేరే ఏమిచ్చినా వద్దంటూ, స్వాతిచినుకు కోసం చాతకం వలె పట్టుబట్టాడు. అంతట తల్లి దుఃఖిస్తూ, కన్నీరు కారుస్తూ, గద్గదస్వరంతో ఇలా పలికింది. “ఓ కుమారా! ఉమాపతీ! పశుపతీ! శూలధరుడు! విరూపాక్షుడునైన శంకరుడు ప్రసన్నుడు కాకపోయినచో పాలెక్కడినుండి వస్తాయి? నిజమైన పుష్టినిచ్చే పాలుకావాలంటే త్రిశూలధరుడైన విరూపాక్షుని ఆరాధించు. తండ్రీ! ఆ జగన్మయుడు, సర్వకల్యాణప్రదాత సంతోషిస్తే పాలే కాదు అమృతం కూడా త్రాగవచ్చు. అటువంటిస్థితిలో మరలా పాలభోజనం ఎందుకు కోరుకుంటారు?” అని ధర్మశీల తన కుమారునితో పలికింది.

తన్మాతుర్వచనం శ్రుత్వా వీతమన్యుసుతోఽబ్రవీత్ ।
కోఽయం విరూపాక్ష ఇతి త్వయారాధ్యస్తు కీర్తితః ॥14॥

తతః సుతం ధర్మశీలా ధర్మాఢ్యం వాక్యమబ్రవీత్ ।
యోఽయం విరూపాక్ష ఇతి శ్రూయతాం కథయామి తే ॥15॥

తల్లిమాట సూటిగా మనస్సులో నాటుకోవడంతో ఆ బాలుడు అమ్మా! నీవారాధించమని చెప్పిన ఆ విరూపాక్షుడు ఎవరమ్మా? ఎలా ఉంటాడో చెప్పమ్మా? అని అర్థించగా ధర్మశీల బాబూ! ఆ విరూపాక్షుడెవరో చెబుతున్నాను, వినుమని ఇలా చెప్పసాగింది.

ఆసీన్మహాసురపతిః శ్రీదామ ఇతి విశ్రుతః ।
తేనాక్రమ్య జగత్సర్వం శ్రీర్నీతా స్వవశం పురా ॥16॥

నిఃశ్రీకాస్తు త్రయో లోకాః కృతాస్తేన దురాత్మనా ।
శ్రీవత్సం వాసుదేవస్య హర్తుమైచ్ఛన్మహాబలః ॥17॥

తమస్య దుష్టం భగవానభిప్రాయం జనార్దనః ।
జ్ఞాత్వా తస్య వధాకాంక్షీ మహేశ్వరముపాగమత్ ॥18॥

పూర్వకాలంలో శ్రీదాముడనే మహాసురనాయకుడు ఉండేవాడు. అతడు ముల్లోకాలను జయించి, లక్ష్మీదేవిని తన వశం గావించుకుని తీసుకొనిపోయాడు. ఆ దురాత్ముడు చేసిన దుశ్చేష్ట వల్ల లోకాలన్నీ లక్ష్మీహీనమై పోయాయి. అంతట వాడు వాసుదేవుని శ్రీవత్సాన్ని కూడా హరించాలని సంకల్పించాడు. వాని దురాలోచన గ్రహించిన జనార్దనుడు వానిని వధింపగోరి, మహేశ్వరుని చెంతకు వెళ్లాడు.

ఏతస్మిన్నంతరే శంభుర్యోగమూర్తిధరోఽవ్యయః ।
తస్థౌ హిమాచలప్రస్థమాశ్రిత్య శ్లక్ష్ణభూతలమ్ ॥19॥

అథాభ్యేత్య జగన్నాథం సహస్రశిరసం విభుమ్ ।
ఆరాధయామాస హరిః స్వయమాత్మానమాత్మనా ॥20॥

సాగ్రం వర్షసహస్రం తు పదాఙ్గుష్ఠేన తస్థివాన్ ।
గృణంస్తత్పరమం బ్రహ్మ యోగిజ్ఞేయమలక్షణమ్ ॥21॥

తతః ప్రీతః ప్రభుః ప్రాదాద్విష్ణవే పరమం వరమ్ ।
ప్రత్యక్షం తైజసం శ్రీమాన్ దివ్యం చక్రం సుదర్శనమ్ ॥22॥

ఈ లోపున యోగమూర్తియై, అవ్యయుడైన శివుడు హిమాచలం మీద పీఠభూమిగానున్న సమతలప్రదేశాన స్థానమేర్పరచుకున్నాడు. శ్రీహరి సహస్రశీర్షుడైన మహాదేవుని సమీపించి, ఆయనను తన ఆత్మస్థునిగా భావించి, ఒంటికాలిబొటనవ్రేలు మీద నిలచి, వేయిసంవత్సరాలు యోగగమ్యుడు, లక్షణాతీతుడునైన పరబ్రహ్మను ఆరాధించాడు. విష్ణువుగావించిన ఉగ్రతపస్సునకు సంతోషించి, వరంగా తేజోమయమైన దివ్యసుదర్శనచక్రాన్ని ప్రదానం చేశాడు.

తద్దత్వా దేవదేవాయ సర్వభూతభయప్రదమ్ ।
కాలచక్రనిభం చక్రం శంకరో విష్ణుమబ్రవీత్ ॥23॥

వరాయుధోఽయం దేవేశ సర్వాయుధనిబర్హణః ।
సుదర్శనో ద్వాదశారః షణ్ణాభిర్ద్వియుగో జవీ ॥24॥

ఆరా సంస్థాస్త్వమీ చాస్య దేవా మాసాశ్చ రాశయః ।
శిష్టానాం రక్షణార్థాయ సంస్థితా ఋతవశ్చ షట్ ॥25॥

అగ్నిః సోమస్తథా మిత్రో వరుణోఽథ శచీపతిః ।
ఇంద్రాగ్నీ చాప్యథో విశ్వే ప్రజాపతయ ఏవ చ ॥26॥

హనూమాంశ్చాథ బలవాన్ దేవో ధన్వన్తరిస్తథా ।
తపశ్చైవ తపస్యశ్చ ద్వాదశైతే ప్రతిష్ఠితాః ।
చైత్రాద్యాః ఫాల్గునాన్తాశ్చ మాసాస్తత్ర ప్రతిష్ఠితాః ॥27॥

త్వమేవమాదాయ విభో వరాయుధం శత్రుం సురాణాం జహి మా విశంకిథాః ।
అమోఘ ఏషోఽమరరాజపూజితో ధృతో మయా నేత్రగతస్తపోబలాత్ ॥28॥

దేవదేవుడైన విష్ణువునకు సర్వభూతభయప్రదమైనదియు, కాలచక్రంతో సమానమైనట్టిదియునైన సుదర్శన చక్రాన్ని ఇస్తూ విష్ణువుతో ఇలా పలికాడు. "ఓ దేవేశా! జనార్దనా! ఇది ఇతర ఆయుధాలనన్నిటిని నాశనం చేయగల ఉత్తమాయుధం. ఈ సుదర్శనచక్రం పండ్రెండు ఆకులు, ఆరు నాభులు, రెండు ఇరుసులు కలిగి మహావేగం కలది. దీని ఆకులలో దేవతలు, పండ్రెండు మాసాలు, పండ్రెండు మేషాది రాశులు, ఆరు ఋతువులు ఉన్నాయి. ఇవన్నియు శిష్టరక్షణార్థమే సుదర్శనచక్రంలో నున్నాయి. సూర్యచంద్రాగ్నులు, వరుణుడు, శచీపతి, విశ్వేదేవతలు, ప్రజాపతులు, బలవంతుడైన హనుమంతుడు, ధన్వంతరి, మొదలైన సర్వదేవమయమైనది ఈ ఆయుధం. దీనిలో తపస్సు, తపస్యులు, చైత్రాది ఫాల్గుణాంతం వరకు గల పండ్రెండు మాసాలు ఉన్నాయి. ఇటువంటి దివ్యాయుధాన్ని తీసికొని సురలకు శత్రువైన వానిని సంహరింపుము. సందేహింపవలసిన అవసరం లేదు. ఇంద్రుడారాధించిన ఈ అమోఘాస్త్రాన్ని యోగబలం చేత నేను నా నేత్రాలలో ఇంతవరకు ధరించాను.

ఇత్యుక్తః శంభునా విష్ణుః భవం వచనమబ్రవీత్ ।
కథం శంభో విజానీయామమోఘో మోఘ ఏవ వా ॥29॥

యద్యమోఘో విభో చక్రః సర్వత్రాప్రతిమస్తవ ।
జిజ్ఞాసార్థం తవైవేహ ప్రక్షేప్స్యామి ప్రతీచ్ఛభోః ॥30॥

శంభుడు చెప్పిన ఈ మాటలు విని, శ్రీహరి భవునితో ఓ మహాదేవా! ఈ ఆయుధం అమోఘమైనదో కాదో నాకెలా తెలుస్తుంది? ఈ చక్రాయుధం అమోఘమైనదనియు, దీనికి ఎక్కడా ప్రతిఘటన లేదనియు తెలిసికొనే నిమిత్తం ఈ చక్రాయుధాన్ని నీ మీదనే ప్రయోగించి, నా సందేహాన్ని తీర్చుకుంటాను. సిద్ధంగా ఉండండని పలికాడు.

తద్వాక్యం వాసుదేవస్య నిశమ్యాహ పినాకధృక్ ।
యద్యేవం ప్రక్షిపస్వేతి నిర్విశంకేన చేతసా ॥31॥

తన్మహేశానవచనం శ్రుత్వా విష్ణుః సుదర్శనమ్ ।
ముమోచ తేజో జిజ్ఞాసుః శంకరం ప్రతి వేగవాన్ ॥32॥

మురారికరవిభ్రష్టం చక్రమభ్యేత్య శూలినమ్ ।
త్రిధా చకార విశ్వేశం యజ్ఞేశం యజ్ఞయాజకమ్ ॥33॥

హరం హరిస్త్రిధాభూతం దృష్ట్వా కృత్తం మహాభుజః ।
వ్రీడోపప్లుతదేహస్తు ప్రణిపాతపరోఽభవత్ ॥34॥

పాదప్రణామావనతం వీక్ష్య దామోదరం భవః ।
ప్రాహ ప్రీతిపరః శ్రీమానుత్తిష్ఠేతి పునః పునః ॥35॥

ప్రాకృతోఽయం మహాబాహో వికారశ్చక్రనేమినా ।
నికృత్తో న స్వభావో మే సోఽచ్ఛేద్యోఽదాహ్య ఏవ చ ॥36॥

యద్యదేతాని చక్రేణ త్రీణి భాగాని కేశవ ।
కృతాని తాని పుణ్యాని భవిష్యన్తి న సంశయః ॥37॥

హిరణ్యాక్షః స్మృతోహ్యేకః సువర్ణాక్షస్తథా పరః ।
తృతీయశ్చ విరూపాక్షస్త్రయోఽమీ పుణ్యదా నృణామ్ ॥38॥

ఉత్తిష్ఠ గచ్ఛస్వ విభో నిహంతుమమరార్దనమ్ ।
శ్రీదామ్ని నిహతే విష్ణో నన్దయిష్యన్తి దేవతాః ॥39॥

వాసుదేవుని మాట విని, పినాకపాణి జనార్దనా! అలాగయితే వెంటనే సందేహించకుండా చక్రం నామీద ప్రయోగింపుమని ఆదేశించాడు. ఆ మహేశ్వరుని మాటలు విని, విష్ణువు తేజోరాశియైన సుదర్శన చక్రాన్ని శంకరుని ఉద్దేశించి ప్రయోగించాడు. మురారి చేతినుండి విడువబడిన సుదర్శనచక్రం శివుని విశ్వేశుడు, యజ్ఞేశుడు, యాజకుడనే మూడు భాగాలుగా ఖండించింది. హరుడు మూడుభాగాలుగా ఖండింపబడడం చూచిన విష్ణువు సిగ్గుతో కుంచించుకుపోయాడు. మహేశ్వరునికి పాదాభివందనం గావించాడు. పాదాభివందనం చేయడానికి అవనతుడైన దామోదరుని చూచి, హరుడు ప్రీతితో శ్రీమాన్ లెమ్ము లెమ్మని పలుమార్లు పలికాడు. ఈ మార్పు నాలో కనిపించే భౌతిక దేహానికే వర్తిస్తుంది. కాని నిజరూపం అచ్ఛేద్యం, అదాహ్యం, దానిని ఏ శక్తీ ఖండించలేదు. నీ చక్రప్రయోగంతో ముక్కలైన ఈ శరీరం కూడా కల్యాణప్రదంగా పరిణమిస్తుంది. ఇది నిస్సంశయం. ఈ మూడు భాగాలలో ఒకటి హిరణ్యాక్షమనియు, రెండవది సువర్ణాక్షమనియు, మూడవది విరూపాక్షమనియు ప్రసిద్ధి చెందుతాయి. ఈ మూడు మానవులకందరికి పుణ్యాన్ని కలుగజేస్తాయి. కాబట్టి నీవు లేచి వెళ్ళుము. దేవతలను మర్దించేవారిని సంహరింపుము. ఓ విష్ణూ! నీవు వెళ్ళి, శ్రీదాముని సంహరిస్తే సమస్తదేవతలు సంతోషిస్తారని కూడా హరుడు హరితో పలికాడు.

ఇత్యేవముక్తో భగవాన్ హరేణ గరుడధ్వజః ।
గత్వా సురగిరిప్రస్థం శ్రీదామానం దదర్శ హ ॥40॥

తం దృష్ట్వా దేవదర్పఘ్నం దైత్యం దేవవరో హరిః ।
ముమోచ చక్రం వేగాఢ్యం హతోఽసీతి బ్రువన్ముహుః ॥41॥

తతస్తు తేనాప్రతిపౌరుషేణ చక్రేణ దైత్యస్య శిరో నికృత్తమ్ ।
సంభిన్నశీర్షో నిపపాత శైలాద్ వజ్రాహతం శైలశిరో యథైవ ॥42॥

తస్మిన్హతే దేవరిపౌ మురారిరీశం సమారాధ్య విరూపనేత్రమ్ ।
లబ్ధ్వా చ చక్రం ప్రవరం మహాయుధం జగామ దేవో నిలయం పయోనిధిమ్ ॥43॥

హరుని పలుకులు విని, గరుడధ్వజుడు మేరుపర్వతానికి వెళ్ళి, శ్రీదామదైత్యుని చూశాడు. ఆ దేవదర్ప హరుని మీద చక్రం ప్రయోగించి, ఆ దైత్యుని శిరస్సు తెగవేశాడు. ఆ విధంగా సుదర్శనచక్రధారకు తల తెగిన ఆ రాక్షసుడు వజ్రధారకు తెగిపడే పర్వతశిఖరం వలె నేలమీద పడిపోయాడు. దేవరిపుడైన శ్రీదాముని సంహరించిన మురారి విరూపాక్షుడైన ఈశ్వరుని అర్చించి, మహాయుధమైన సుదర్శనచక్రాన్ని పొంది, తన నివాసమైన క్షీరసాగరానికి వెళ్ళాడు.

సోఽయం పుత్ర విరూపాక్షో దేవదేవో మహేశ్వరః ।
తమారాధయ చేత్ సాధో క్షీరేణేచ్ఛసి భోజనమ్ ॥44॥

కుమారా! ఉపమన్యూ! ఆ ప్రభువే విరూపాక్షుడు, త్రినేత్రుడు. ఆయనను ఆరాధిస్తే నీకు కావలసిన క్షీరాన్నభోజనం లభిస్తుంది అని తల్లి ఉపమన్యునితో పలికింది.

తన్మాతుర్వచనం శ్రుత్వా వీతమన్యుసుతో బలీ ।
తమారాధ్య విరూపాక్షం ప్రాప్తః క్షీరేణ భోజనమ్ ॥45॥

బలవంతుడైన వీతమన్యుకుమారుడైన ఉపమన్యుడు తల్లి పలికిన పలుకులు విని, సంతోషించి, విరూపాక్షుని ఆరాధించి, క్షీరభోజనాన్ని పొందాడు.

ఏవం తవోక్తం పరమం పవిత్రం సంఛేదనం శర్వతనోః పురా వై ।
తత్తీర్థవర్యం స మహాసురో వై సమాససాదాథ సుపుణ్యహేతోః ॥46॥

నారదా! శివుని శరీరం మూడుగా ఛేదింపబడిన, పరమ పవిత్రమైన ప్రాచీనగాథను నీకు తెలియజేశాను. మహాసురుడైన ప్రహ్లాదుడు పుణ్యసంపాదనకై, తీర్థశ్రేష్ఠమైన ఆ తీర్థానికి చేరాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే శ్రీదామచరితం నామ ద్వ్యశీతితమోఽధ్యాయః ॥82॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో శ్రీదామచరితమనే ఎనభైరెండవ అధ్యాయం సమాప్తం.



త్ర్యశీతితమోఽధ్యాయః - ఎనభై మూడవ అధ్యాయం

బ్రహ్మధ్వజాది తీర్థమాహాత్మ్యకథనమ్ - బ్రహ్మధ్వజం మున్నగుతీర్థాల మాహాత్మ్యవర్ణన

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

తస్మింస్తీర్థవరే స్నాత్వా దృష్ట్వా దేవం త్రిలోచనమ్ ।
పూజయిత్వా సువర్ణాక్షం నైమిషం ప్రయయౌ తతః ॥1॥

ప్రహ్లాదుడు ఆ శ్రేష్ఠతీర్థంలో స్నానమాచరించి, త్రిలోచనుని దర్శించి, సువర్ణాక్షుని అర్చించి, నైమిశారణ్యానికి వెళ్లాడు.

తత్ర తీర్థసహస్రాణి త్రింశత్పాపహరాణి చ ।
గోమత్యాః కాంచనాక్ష్యాశ్చ గురుదాయాశ్చ మధ్యతః ॥2॥

తేషు స్నాత్వార్చ్య దేవేశం పీతవాససమచ్యుతమ్ ।
ఋషీనపి చ సంపూజ్య నైమిశారణ్యవాసినః ॥3॥

దేవదేవం తదేశానం సంపూజ్య విధినా తతః ।
గయాయాం గోపతిం ద్రష్టుం జగామ స మహాసురః ॥4॥

అక్కడ గోమతి, కాంచనాక్షి, గురుదానదుల మధ్య ఉన్న పాపనాశకాలైన ముప్పదివేల తీర్థాలలో స్నానమాచరించి, దేవేశుడు, పీతాంబరుడునగు అచ్యుతుని అర్చించి, నైమిశారణ్యవాసులైన ఋషులను కూడా చక్కగా పూజించి, అటుపిమ్మట దేవదేవుడైన ఈశ్వరుని యథావిధిగా ఆరాధించి, తదనంతరం ప్రహ్లాదుడు గయాక్షేత్రంలోని గోపతిని దర్శించడానికి వెళ్ళాడు.

తత్ర బ్రహ్మధ్వజే స్నాత్వా కృత్వా చాస్య ప్రదక్షిణామ్ ।
పిండనిర్వపణం పుణ్యం పితౄణాం స చకార హ ॥5॥

అచ్చటి బ్రహ్మధ్వజంలో స్నానం చేసి, ప్రదక్షిణలు చేసి, పితృదేవతలకు పిండప్రదానం గావించాడు.

ఉదపానే తథా స్నాత్వా తత్రాభ్యర్చ్య పితౄన్ వశీ ।
గదాపాణిం సమభ్యర్చ్య గోపతిం చాపి శంకరమ్ ॥6॥

ఉదపానంలో స్నానం చేసి, పితృతర్పణాలొసగి, గదాధరస్వామిని, గోపతీశ్వరుడైన శంకరుని పూజించాడు.

ఇంద్రతీర్థే తథా స్నాత్వా సంతర్ప్య పితృదేవతాః ।
మహానదీజలే స్నాత్వా సరయూమాజగామ సః ॥7॥

ఇంద్రతీర్థంలో స్నాతుడై, పితృదేవతలకు తర్పణాలు గావించి, మహానదీజలాలలో స్నానమాచరించిన పిదప సరయూనదీతీరానికి ప్రహ్లాదుడు చేరాడు.

తస్యాం స్నాత్వా సమభ్యర్చ్య గోప్రతారే కుశేశయమ్ ।
ఉపోష్య రజనీమేకాం విరజాం నగరీం యయౌ ॥8॥

ఆ తీర్థంలో స్నానమాడి, గోప్రతారంలో కుశేశయప్రభువును అర్చించి, ఒకరాత్రి అచ్చటనే వసించి, అక్కడినుండి విరజా నగరానికి చేరాడు.

స్నాత్వా విరజసే తీర్థే దత్త్వా పిండం పితౄంస్తథా ।
దర్శనార్థం యయౌ శ్రీమానజితం పురుషోత్తమమ్ ॥9॥

తం దృష్ట్వా పుండరీకాక్షమక్షరం పరమం శుచిః ।
షడ్రాత్రముష్య తత్రైవ మహేన్ద్రం దక్షిణం యయౌ ॥10॥

విరజానదిలో స్నానమాడి, పితృదేవతలకు పిండప్రదానం చేసి, అజితుడు, శ్రీమంతుడునైన పురుషోత్తముని దర్శించడానికి ప్రహ్లాదుడు వెళ్ళాడు. అచ్చట శుచియై, అక్షయుడైన పుండరీకాక్షుని దర్శించి, ఆరు రాత్రులు ఆ క్షేత్రంలోనే యుండి, మహేంద్రానికి దక్షిణదిశకు వెళ్ళాడు.

తత్ర దేవవరం శంభుమర్ధనారీశ్వరం హరమ్ ।
దృష్ట్వార్చ్య సంపూజ్య పితౄన్ మహేంద్రం చోత్తరం గతః ॥11॥

అచ్చటనున్న దేవవరుడు, హరుడు, శంభుడునైన అర్ధనారీశ్వరుని దర్శించి, పితృదేవతలను చక్కగా పూజించి, మహేంద్రానికి ఉత్తరదిక్కునకు వెళ్ళాడు.

తత్ర దేవవరం శంభుం గోపాలం సోమపాయినమ్ ।
దృష్ట్వా స్నాత్వా సోమతీర్థే సహ్యాచలముపాగతః ॥12॥

అచ్చట దేవవరుడైన శంభుని, సోమపాయియైన గోపాలుని దర్శించి, సోమతీర్థంలో స్నానం గావించి, తదనంతరం సహ్యాద్రికి చేరాడు.

తత్ర స్నాత్వా మహోదక్యాం వైకుంఠం చార్చ్య భక్తితః ।
సురాన్ పితౄన్ సమభ్యర్చ్య పారియాత్రం గిరిం గతః ॥13॥

తత్ర స్నాత్వా లాంగలిన్యాం పూజయిత్వాఽపరాజితమ్ ।
కశేరుదేశం చాభ్యేత్య విశ్వరూపం దదర్శ సః ॥14॥

యత్ర దేవవరః శంభుర్గణానాం తు సుపూజితమ్ ।
విశ్వరూపమథాత్మానం దర్శయామాస యోగవిత్ ॥15॥

తత్ర మంకుణికాతోయే స్నాత్వాభ్యర్చ్య మహేశ్వరమ్ ।
జగామాద్రిం చ సౌగన్ధిం ప్రహ్లాదో మలయాచలమ్ ॥16॥

అచ్చటి మహోదకిలో స్నానమాడి, భక్తితో నారాయణుని అర్చించి, దేవతలను, పితరులను పూజించి, ప్రహ్లాదుడు పారియాత్రగిరికి వెళ్ళాడు. అచ్చట లాంగలినిలో స్నానమాచరించి, అపరాజితప్రభువును పూజించి, కశేరుదేశం చేరి, విశ్వరూపుని దర్శనం చేసుకున్నాడు. అచ్చటనే సమస్తగణాల ఆరాధ్యదైవతమైనట్టియు, యోగవేదియునైన శంకరుడు తన విశ్వరూపం ప్రదర్శించాడు. అచ్చట మంకుణికాజలాలలో స్నానమాడి, భక్తితో మహేశ్వరుని అర్చించి, ప్రహ్లాదుడు సుగంధమయమైన మలయాద్రికి వెళ్ళాడు.

మహాహ్రదే తతః స్నాత్వా పూజయిత్వా చ శంకరమ్ ।
తతో జగామ యోగాత్మా ద్రష్టుం విన్ధ్యే సదాశివమ్ ॥17॥

అటుపిమ్మట మహాహ్రదంలో స్నానం చేసి, శంకరుని పూజించిన పిమ్మట యోగాత్ముడైన ప్రహ్లాదుడు సదాశివుని దర్శించడానికి వింధ్యకు వెళ్ళాడు.

తతో విపాశాసలిలే స్నాత్వాభ్యర్చ్య సదాశివమ్ ।
త్రిరాత్రం సముపోష్యాథ అవంతీం నగరీం యయౌ ॥18॥

విపాశానదీజలాలలో స్నానమాడి, సదాశివుని అర్చించి, మూడు రాత్రులు అచ్చట ఉపవసించి, అటుపిమ్మట అవంతీ నగరానికి ప్రహ్లాదుడు వెళ్లాడు.

తత్ర శిప్రాజలే స్నాత్వా విష్ణుం సంపూజ్య భక్తితః ।
శ్మశానస్థం దదర్శాథ మహాకాలవపుర్ధరమ్ ॥19॥

అచ్చట శిప్రాజలాలలో స్నానం చేసి, భక్తితో శ్రీమహావిష్ణువును పూజించి, శ్మశాననిలయుడైన మహాకాల దేహుని కూడా దర్శించాడు.

తస్మిన్ హి సర్వసత్త్వానాం తేన రూపేణ శంకరః ।
తామసం రూపమాస్థాయ సంహారం కురుతే వశీ ॥20॥

తత్రస్థేన సురేశేన శ్వేతకిర్నామ భూపతిః ।
రక్షితస్త్వన్తకం దగ్ధ్వా సర్వభూతాపహారిణమ్ ॥21॥

తత్రాతిహృష్టో వసతి నిత్యం శర్వః సహోమయా ।
వృతః ప్రమథకోటీభిర్బహుభిస్త్రిదశార్చితః ॥22॥

తం దృష్ట్వాథ మహాకాలం కాలకాలాన్తకాన్తకమ్ ।
యమసంయమనం మృత్యోర్మృత్యుం చిత్రవిచిత్రకమ్ ॥23॥

శ్మశాననిలయం శంభుం భూతనాథం జగత్పతిమ్ ।
పూజయిత్వా శూలధరం జగామ నిషధాన్ ప్రతి ॥24॥

అక్కడనే తమోగుణాత్మకమైన మహాకాలరూపాన్ని ధరించి, సర్వవశంకరుడైన శంకరుడు ప్రాణులందరిని సంహరిస్తూ ఉంటాడు. అచ్చోటనే దేవేశుడు, సర్వప్రాణిసంహారకుడునైన అనంతుని దగ్ధం చేసి శ్వేతకి అనే రాజుని కాపాడాడు. ఆ పవిత్రక్షేత్రంలో శర్వుడు ఉమాదేవితో సహా ప్రమథకోటిగణాలు, దేవగణాలు సేవిస్తూ ఉండగా సంతోషంతో నిత్యనివాసం చేస్తాడు. మృత్యువునకు సైతం మృత్యువైనవాడును, చిత్రవిచిత్రమైనవాడును, యమునకు సంయమనం కలిగించినవాడును, శ్మశాననిలయుడును, భూతనాథుడును, జగత్పతియును, శూలధరుడును, కాలకాలాన్తకాన్తకుడునైన ఆ మహాకాళేశ్వరుని పూజించిన పిమ్మట ప్రహ్లాదుడు నిషధకు వెళ్ళాడు.

తత్రామరేశ్వరం దృష్ట్వా దృష్ట్వా సంపూజ్య భక్తితః ।
మహోదయం సమభ్యేత్య హయగ్రీవం దదర్శ సః ॥25॥

అశ్వతీర్థే తతః స్నాత్వా దృష్ట్వా చ తురగాననమ్ ।
శ్రీధరం చైవ సంపూజ్య పాంచాలవిషయం యయౌ ॥26॥

ప్రహ్లాదుడు నిషధదేశంలోని అమరేశ్వరుని భక్తితో చక్కగా పూజించి, మహోదయక్షేత్రానికి వెళ్ళి, హయగ్రీవుని దర్శించాడు. అశ్వతీర్థంలో స్నానం చేసి, హయాననుని, శ్రీధరుని దర్శించి, చక్కగా పూజించి, తదనంతరం పాంచాలదేశానికి వెళ్ళాడు.

తత్రేశ్వరగుణైర్యుక్తం పుత్రమర్థపతేరథ ।
పాంచాలికం వశీ దృష్ట్వా ప్రయాగం పరతో యయౌ ॥27॥

జితేంద్రియుడైన ప్రహ్లాదుడు పాంచాలదేశంలోని ఈశ్వరీయగుణసంపన్నుడు, ధనపతియైన కుబేరుని కుమారుడునైన పాంచాలికుని దర్శించి, అచ్చటినుండి ప్రయాగక్షేత్రానికి వెళ్ళాడు.

స్నాత్వా సన్నిహితే తీర్థే యామునే లోకవిశ్రుతే ।
దృష్ట్వా వటేశ్వరం రుద్రం మాధవం యోగశాయినమ్ ॥28॥

ద్వావేవ భక్తితః పూజ్యౌ పూజయిత్వా మహాసురః ।
మాఘమాసమథోపోష్య తతో వారాణసీం గతః ॥29॥

ప్రయాగసమీపంలోని యమునాతీర్థంలో స్నానమాచరించి, తదనంతరం వటేశ్వరుడైన రుద్రుని, యోగశాయియైన మాధవుని దర్శించి, పూజనీయులైన వారిరువురికిని మహాసురుడైన ప్రహ్లాదుడు భక్తితో పూజలు గావించి, మాఘమాసమంతా ఉపవాసంతో ఉండి, తరువాత అచ్చటినుండి వారణాసికి వెళ్ళాడు.

తతోఽస్యాం వరుణాయాం చ తీర్థేషు చ పృథక్ పృథక్ ।
సర్వపాపహరాద్యేషు స్నాత్వాఽర్చ్య పితృదేవతాః ॥30॥

ప్రదక్షిణీకృత్య పురీం పూజ్యావిముక్తకేశవౌ ।
లోలం దివాకరం దృష్ట్వా తతో మధువనం యయౌ ॥31॥

వారణాసిలోని వరుణానదిలో సర్వపాపహరాలైన తీర్థాలన్నింటిలోను విడివిడిగా స్నానమాచరించి, పితృదేవతలను అర్చించాడు. అవిముక్తేశ్వరుని, మాధవుని పూజించి, నగరప్రదక్షిణం గావించాడు. లోలార్క దేవుని సేవించి, అటుపిమ్మట ప్రహ్లాదుడు మధువనానికి చేరుకున్నాడు.

తత్ర స్వాయంభువం దేవం దదర్శాసురసత్తమః ।
తమభ్యర్చ్య మహాతేజాః పుష్కరారణ్యమాగమత్ ॥32॥

తేషు త్రిష్వపి తీర్థేషు స్నాత్వాఽర్చ్య పితృదేవతాః ।
పుష్కరాక్షమయోగన్ధిం బ్రహ్మాణం చాప్యపూజయత్ ॥33॥

అసురేశ్వరుడైన ప్రహ్లాదుడు మధువనంలో స్వయంభూదేవుని దర్శించి, ఆరాధించి, పుష్కరారణ్యానికి వెళ్ళాడు. అచ్చట పుష్కరాక్ష, అయోగన్ధి, బ్రహ్మలను మూడు తీర్థాలలోను స్నానమాచరించి, పితృదేవతలను అర్చించి, పుష్కరాక్షుని, అయోగన్ధిని, బ్రహ్మను కూడా పూజించాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే ప్రహ్లాదతీర్థయాత్రా యాంబ్రహ్మధ్వజాది తీర్థ మాహాత్మ్య కథనమ్ నామ త్ర్యశీతితమోఽధ్యాయః ॥83॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని ప్రహ్లాద తీర్థయాత్రలో బ్రహ్మధ్వజం మున్నగు తీర్థాలమాహాత్మ్య వర్ణనమనే ఎనభైమూడవ అధ్యాయం సమాప్తం.



చతురశీతితమోఽధ్యాయః - ఎనబైనాల్గవ అధ్యాయం

కోటితీర్థాది తీర్థమాహాత్మ్యవర్ణనమ్ - కోటితీర్థం, శాలగ్రామం మున్నగుతీర్థాల మాహాత్మ్యవర్ణన

తతో భూయః సరస్వత్యాస్తీర్థే త్రైలోక్యవిశ్రుతే ।
కోటితీర్థే రుద్రకోటిం దదర్శ వృషభధ్వజమ్ ॥1॥

ఓ నారదమునీ! ప్రహ్లాదుడు అక్కడినుండి మరల త్రిలోక విఖ్యాతమైన సరస్వతీతీరాన కోటితీర్థంలో వెలసిన రుద్రకోటీశ్వరదేవుని సన్నిధికి చేరి, దర్శించాడు.

నైమిషే యా ద్విజవరా మాగధేయాః ససైంధవాః ।
ధర్మారణ్యాః పౌష్కరేయా దండకారణ్యకాస్తథా ॥2॥

చాంపేయా భారుకచ్ఛేయా దేవికా తీరగాశ్చ యే ।
తే తత్ర శంకరం ద్రష్టుం సమాయాతా ద్విజాతయః ॥3॥

నైమిషులు, ద్విజవరులు, మాగధులు, సైంధవులు, ధర్మారణ్యులు, పౌష్కరేయులు, దండకారణ్యవాసులు, చాంపేయులు, భారుకచ్ఛవాసులు, దేవికాతీరస్థులునైన విప్రవరులు అసంఖ్యాకంగా అక్కడ మహాదేవుని చూడడానికి సమావేశమయ్యారు.

కోటిసంఖ్యాస్తపఃసిద్ధా హరదర్శనలాలసాః ।
అహం పూర్వమహం పూర్వమిత్యేవం వాదినో మునే ॥4॥

ఓ మహర్షీ! కోటిసంఖ్యలో వచ్చే తపస్సిద్ధులు హరదర్శనలాలసులై నేను ముందంటే నేను ముందంటూ తోసుకుంటూ ఉబలాటపడ్డారు.

తాన్ సంక్షుబ్ధాన్ హరో దృష్ట్వా మహర్షీన్ దగ్ధకిల్బిషాన్ ।
తేషామేవానుకంపార్థం కోటిమూర్తిరభూద్భవః ॥5॥

అలా సంక్షుబ్ధులైన మహర్షులందరు హరుని దర్శించి, పాపాలను పోగొట్టుకున్నారు. వారినందరిని అనుగ్రహించడానికి దయామయుడైన మయస్కరుడు కోటిరూపాలలో వారికి దర్శనమిచ్చాడు.

తతస్తే మునయః ప్రీతాః సర్వ ఏవ మహేశ్వరమ్ ।
సంపూజయంతస్తస్థుర్వై తీర్థం కృత్వా పృథక్ పృథక్ ॥6॥

ఇత్యేవం రుద్రకోటీతి నామ్నా శంభురజాయత ।
తం దదర్శ మహాతేజాః ప్రహ్లాదో భక్తిమాన్వశీ ॥7॥

దానితో మునులందరు సంతృప్తులయ్యారు. అందుచే అచ్చటి దేవునకు రుద్రకోటీశ్వరుడని పేరు వచ్చింది. ఆ విధంగా కోటిమూర్తులుగా దర్శనమిచ్చే స్వామి తపస్సంపన్నులైన కోటిమంది వేర్వేరు తీర్థాలలో అర్చించి, కోటి తీర్థాలు ఏర్పరిచారు. అటువంటి అద్భుతమైన రుద్రకోటీశ్వరుని ప్రహ్లాదుడు భక్తితో దర్శించాడు.

కోటితీర్థే తతః స్నాత్వా తర్పయిత్వా వసూన్ పితౄన్ ।
రుద్రకోటిం సమభ్యర్చ్య జగామ కురుజాంగలమ్ ॥8॥

అంతట కోటితీర్థంలో స్నానమాచరించి, వసువులకు, పితృదేవతలకు తర్పణమిచ్చి, రుద్రకోటీశ్వరుని చక్కగా అర్చించి, ప్రహ్లాదుడు కురుజాంగలానికి వెళ్లాడు.

తత్ర దేవవరం స్థాణుం శంకరం పార్వతీప్రియమ్ ।
సరస్వతీజలే మగ్నం దదర్శ సురపూజితమ్ ॥9॥

కురుజాంగలంలో సరస్వతీనదీజలాలలో మగ్నమైన సురపూజితుడు, పార్వతీప్రియుడునైన శంకరుని స్థాణుడునైన దేవవరుని, ప్రహ్లాదుడు దర్శించాడు.

సారస్వతేఽమ్భసి స్నాత్వా స్థాణుం సంపూజ్య భక్తితః ।
స్నాత్వా దశాశ్వమేధే చ సంపూజ్య చ సురాన్ పితౄన్ ॥10॥

సహస్రలింగం సంపూజ్య స్నాత్వా కన్యాహ్రదే శుచిః ।
అభివాద్య గురుం శుక్రం సోమతీర్థం జగామ హ ॥11॥

అతడు సారస్వతీజలాలలో స్నానం చేసి, భక్తితో స్థాణుని పూజించి, దశాశ్వమేధంలో కూడా స్నానం చేసి, దేవతలను, పితరులను పూజించాడు. కన్యాహ్రదంలో స్నానమాచరించి, శుచియై, సహస్రలింగానికి పూజగావించి, గురువైన శుక్రునకు అభివాదనం చేసి, సోమతీర్థానికి వెళ్ళాడు.

తత్ర స్నాత్వాఽర్చ్య చ పితౄన్ సోమం సంపూజ్య భక్తితః ।
క్షీరికావాసమభ్యేత్య స్నానం చక్రే మహాయశాః ॥12॥

సోమతీర్థంలో స్నానం చేసి, పితృదేవతలను అర్చించి, భక్తితో సోముని చక్కగా పూజించి, క్షీరికావాసానికి చేరాడు. మహాయశస్వియైన ప్రహ్లాదుడు ఆ తీర్థంలో స్నానం చేశాడు.

ప్రదక్షిణీకృత్య తరుం వరుణం చార్చ్య బుద్ధిమాన్ ।
భూయః కురుధ్వజం దృష్ట్వా పద్మాఖ్యం నగరీం గతః ॥13॥

అచ్చటనున్న తరువుకు ప్రదక్షిణం చేసి, వరుణుని పూజించి, మరలా కురుధ్వజం దర్శించి, పద్మాఖ్య నగరానికి వెళ్ళాడు.

తత్రార్చ్య మిత్రావరుణౌ భాస్కరౌ లోకపూజితౌ ।
కుమారధారామభ్యేత్య దదర్శ స్వామినం వశీ ॥14॥

అచ్చట లోకపూజితులు, తేజస్వులునైన మిత్రావరుణులను పూజించిన పిదప కుమారధారకు వెళ్ళి, అచ్చట స్వామిని దర్శించాడు.

స్నాత్వా కపిలధారాయాం సంతర్ప్యార్చ్య పితౄన్ సురాన్ ।
దృష్ట్వా స్కన్దం సమభ్యర్చ్య నర్మదాయాం జగామ హ ॥15॥

కపిలధారలో స్నానమాచరించి, పితృదేవతలకు తర్పణాలిచ్చి, దేవతలకు అర్చనలు గావించి, స్కందుని దర్శించి, చక్కగా పూజించి, నర్మదాప్రదేశానికి వెళ్ళాడు.

తస్యాం స్నాత్వా సమభ్యర్చ్య వాసుదేవం శ్రియఃపతిమ్ ।
జగామ భూధరం ద్రష్టుం వారాహం చక్రధారిణమ్ ॥16॥

నర్మదాతీర్థంలో స్నానం చేసి, లక్ష్మీపతియైన వాసుదేవుని చక్కగా పూజించి, చక్రధారియైన భూధర, వరాహదేవులను దర్శించడానికి వెళ్లాడు.

స్నాత్వా కోకాముఖే తీర్థే సంపూజ్య ధరణీధరమ్ ।
త్రిసౌవర్ణం మహాదేవమర్బుదేశం జగామహ ॥17॥

కోకాముఖీతీర్థంలో స్నానం గావించి, భూధరుడైన వరాహమూర్తిని పూజించి, అర్బుదేశ్వరుడైన త్రిసౌవర్ణేశ్వరుని దర్శించడానికి వెళ్ళాడు.

తత్ర నారీహ్రదే స్నాత్వా పూజయిత్వా చ శంకరమ్ ।
కాలింజరం సమభ్యేత్య నీలకంఠం దదర్శ సః ॥18॥

అచ్చట నారీహ్రదంలో స్నానం చేసి, శంకరుని పూజించి, అటుపిమ్మట కాళింజరానికి వెళ్ళి ప్రహ్లాదుడు నీలకంఠుని దర్శించాడు.

నీలతీర్థజలే స్నాత్వా పూజయిత్వా తతః శివమ్ ।
జగామ సాగరానూపే ప్రభాసే ద్రష్టుమీశ్వరమ్ ॥19॥

స్నాత్వా చ సంగమే నద్యాః సరస్వత్యార్ణవస్య చ ।
సోమేశ్వరం లోకపతిం దదర్శ స కపర్దినమ్ ॥20॥

నీలతీర్థజలాలలో స్నానమాచరించి, అచ్చటి శివుని పూజించి, అచ్చటనుండి సాగరతీరాన గల అనుపమానమైన ప్రభాసక్షేత్రానికి వెళ్ళాడు. అచ్చట సరస్వతీసాగరసంగమాన స్నానమాడి, లోకనాథుడైన సోమేశ్వరుని దర్శించాడు.

యో దక్షశాపనిర్దగ్ధః క్షయీ తారాధిపః శశీ ।
ఆప్యాయితః శంకరేణ విష్ణునా స కపర్దినా ॥21॥

తావర్చ్య దేవప్రవరౌ ప్రజగామ మహాలయమ్ ।
తత్ర రుద్రం సమభ్యర్చ్య ప్రజగామోత్తరాన్ కురూన్ ॥22॥

దక్షుని శాపం వల్ల కళలు క్షీణించిన తారానాథుడు ఈ ప్రదేశంలోనే శంకరుని ఆరాధించి, కపర్ది కృప వల్ల శ్రీమహావిష్ణువు అనుగ్రహం వల్ల, తిరిగి తన కాంతిని పొందాడు. ఆ క్షేత్రంలో దేవాధిదేవులనిద్దరిని అర్చించి, మహాలయానికి వెళ్ళాడు. అక్కడ రుద్రుని సేవించి, ఉత్తరకురుభూములకు వెళ్ళాడు.

పద్మనాభం చ తత్రార్చ్య సప్తగోదావరీం యయౌ ।
తత్ర స్నాత్వాఽర్చ్య విశ్వేశం భీమం త్రైలోక్యవన్దితమ్ ॥23॥

అచ్చటి పద్మనాభుని సేవించి, సప్తగోదావరీతీర్థానికి వెళ్ళాడు. అక్కడకు వెళ్ళి, గోదావరిలో స్నానమాచరించి, త్రైలోక్యవందితుడు, విశ్వేశుడునైన భీమేశ్వరుని సేవించాడు.

గత్వా దారువనే శ్రీమాన్ లింగం స దదర్శ హ ।
తమర్చ్య బ్రాహ్మణీం గత్వా స్నాత్వాఽర్చ్య త్రిదశేశ్వరమ్ ॥24॥

ప్లక్షావతరణం గత్వా శ్రీనివాసమపూజయత్ ।
తతశ్చ కుండినం గత్వా సంపూజ్య ప్రాణతృప్తిదమ్ ॥25॥

శూర్పారకే చతుర్బాహుం పూజయిత్వా విధానతః ।
మాగధారణ్యమాసాద్య దదర్శ వసుధాధిపమ్ ॥26॥

ప్రహ్లాదుడు దారుకావనానికి వెళ్ళి, శ్రీలింగదర్శనం, అర్చనం చేసికొన్నాడు. అటునుండి బ్రాహ్మణీతీర్థానికి వెళ్ళి, స్నానం చేసి, త్రిదశేశ్వరుని సేవించాడు. అనంతరం ప్లక్షావతరణానికి వెళ్ళి, శ్రీనివాసుని సేవించాడు. తదనంతరం కుండినానికి వెళ్ళి, ప్రాణరక్షకుని అర్చించి, శూర్పారకక్షేత్రంలో చతుర్భుజుని విధివిధానంగా పూజించాడు. అక్కడినుండి మాగధారణ్యానికి వెళ్ళి, అచ్చటి వసుధాధిపుని ప్రహ్లాదుడు దర్శించాడు.

తమర్చయిత్వా విశ్వేశం స జగామ ప్రజాముఖమ్ ।
మహాతీర్థే తతః స్నాత్వా వాసుదేవం ప్రణమ్య చ ॥27॥

శోణం సంప్రాప్య సంపూజ్య రుక్మవర్మాణమీశ్వరమ్ ।
మహాకోశ్యాం మహాదేవం హంసాఖ్యం భక్తిమానథ ॥28॥

పూజయిత్వా జగామాథ సైంధవారణ్యముత్తమమ్ ।

వసుధాధిపుడైన విశ్వేశుని ప్రహ్లాదుడు పూజించి, ప్రజాముఖానికి వెళ్ళాడు. అచ్చట మహాతీర్థంలో స్నాతుడై, వాసుదేవునకు నమస్కరించి, శోణపురి చేరి, రుక్మవర్ణేశ్వరుని పూజించాడు. అనంతరం మహాకోశిలో భక్తుడైన ప్రహ్లాదుడు హంసాఖ్యుడైన మహాదేవుని పూజించి, అచ్చటినుండి ఉత్తమమైన సైంధవారణ్యానికి వెళ్ళాడు.

తత్రేశ్వరం సునేత్రాఖ్యం శంఖశూలధరం గురుమ్ ।
పూజయిత్వా మహాబాహుః ప్రజగామ త్రివిష్టపమ్ ॥29॥

తత్ర దేవం మహేశానం జటాధరమితి శ్రుతమ్ ।
తం దృష్ట్వాఽర్చ్య హరిం చాసౌ తీర్థం కనఖలం యయౌ ॥30॥

సైంధవారణ్యంలో శంఖం శూలం ధరించిన సునేత్రేశ్వరుని పూజించి, ఆ మహాభుజుడు త్రివిష్టపానికి వెళ్ళాడు. అక్కడ జటాధరునిగా ప్రసిద్ధిగాంచిన మహాదేవుని, హరిని, అర్చించి, కనఖలతీర్థానికి వెళ్ళాడు.

తత్రార్చ్య భద్రకాళీశం వీరభద్రం చ దానవః ।
ధనాధిపం చ మేఘాంకం యయావథ గిరివ్రజమ్ ॥31॥

తత్ర దేవం పశుపతిం లోకనాథం మహేశ్వరమ్ ।
సంపూజయిత్వా విధివత్కామరూపం జగామ హ ॥32॥

శశిప్రభం దేవవరం త్రినేత్రం సంపూజయిత్వా సహ వై మృడాన్యా ।
జగామ తీర్థప్రవరం మహాఖ్యం తస్మిన్ మహాదేవమపూజయత్ సః ॥33॥

కనఖలతీర్థంలోని భద్రకాళీశ్వరుని, వీరభద్రుని, కుబేరుని, పూజించి, దానవేశ్వరుడైన ప్రహ్లాదుడు గిరివ్రజానికి వెళ్ళాడు. గిరివ్రజంలోని పశుపతి, లోకనాథుడునైన మహేశ్వరుని చక్కగా విధివిధానంగా పూజించాడు. అక్కడినుండి కామరూపదేశానికి వెళ్ళాడు. అచ్చట చంద్రకాంతితో వెలిగే ఉమాసహితుడగు త్రినేత్రుని చక్కగా పూజించి, తీర్థప్రవరమైన మహాతీర్థానికి వెళ్ళి, ఆ తీర్థంలోని మహాదేవుని పూజించాడు.

తతస్త్రికూటం గిరిమత్రిపుత్రం జగామ ద్రష్టుం స హి చక్రపాణినమ్ ।
తమీడ్య భక్త్యా తు గజేంద్రమోక్షణం జజాప జప్యం పరమం పవిత్రమ్ ॥34॥

తత్రోష్య దైత్యేశ్వరసూనురాదరాన్మాసత్రయం మూలఫలాంబుభక్షీ ।
నివేద్య విప్రప్రవరేషు కాంచనం జగామ ఘోరం స హి దండకం వనమ్ ॥35॥

తదనంతరం ప్రహ్లాదుడు మూడు శిఖరాలతో వెలిగే అత్రిపుత్రమనే పర్వతాన నెలకొన్న చక్రపాణిని దర్శించి, భక్తియుక్తుడై, పరమపవిత్రమైన గజేంద్రమోక్షణస్తవం జపించి, ఆ ప్రభువును ప్రార్థించాడు. ఆ దైత్యేశ్వర పుత్రుడు ఆ క్షేత్రంలో మూడు నెలలబాటు మూలాలు, ఫలాలు, జలం సేవిస్తూ గడిపి, ద్విజోత్తములకు స్వర్ణదానాలు చేసి, అక్కడినుండి ఘోరమైన దండకారణ్యానికి వెళ్ళాడు.

తత్ర దివ్యం మహాశాఖం వనస్పతివపుర్ధరమ్ ।
దదర్శ పుండరీకాక్షం మహాశ్వాపదవారణమ్ ॥36॥

తస్యాధస్తాత్ త్రిరాత్రం స మహాభాగవతోఽసురః ।
స్థితః స్థండిలశాయీ తు పఠన్ సారస్వతం స్తవమ్ ॥37॥

ఓ నారదా! దండకారణ్యంలో మహాశాఖలతో దివ్యమైన వృక్షరూపం ధరించి, క్రూరమృగాలను దరి చేరనీయక, విరాజిల్లే నారాయణుని దర్శించి, ఆ వృక్షం క్రింద భాగవతోత్తముడైన ప్రహ్లాదుడు నేల మీద పరుండి, సారస్వతస్తోత్రపారాయణ చేస్తూ, మూడు రాత్రులు గడిపాడు.

తస్మాత్ తీర్థవరం విద్వాన్ సర్వపాపప్రమోచనమ్ ।
జగామ దానవో ద్రష్టుం సర్వపాపహరం హరిమ్ ॥38॥

అచ్చటనుండి ఆ దానవవిద్వాంసుడు సర్వపాపప్రమోచనమనే క్షేత్రానికి సర్వపాపహరుడైన శ్రీహరిని దర్శించడానికి వెళ్ళాడు.

తస్యాగ్రతో జజాపాసౌ స్తవౌ పాపప్రణాశనౌ ।
యౌ పురా భగవాన్ ప్రాహ క్రోడరూపీ జనార్దనః ॥39॥

పూర్వకాలంలో వరాహరూపుడైన భగవంతుడు ప్రసాదించిన పూర్తిగా పాపాలను పోగొట్టే రెండు స్తోత్రాలను ఆ స్వామి ఎదుట జపించాడు.

తస్మాదథాగాత్ దైత్యేన్ద్రః శాలగ్రామం మహాఫలమ్ ।
యత్ర సంనిహితో విష్ణుశ్చరేషు స్థావరేషు చ ॥40॥

తత్ర సర్వగతం విష్ణుం మత్వా చక్రే రతిం బలీ ।
పూజయన్ భగవత్పాదౌ మహాభాగవతో మునే ॥41॥

అచ్చటనుండి ప్రహ్లాదుడు స్థావరజంగమాలన్నిటిలో విష్ణుని సాన్నిహిత్యం కలిగిన మహాక్షేత్రం శాలగ్రామానికి వెళ్ళాడు. అచ్చట ప్రతి వస్తువులోను సర్వగతుడైన విష్ణుని భావించి, మహాప్రీతితో భగవంతుని పాదాలను పూజించాడు.

ఇయం తవోక్తా మునిసంఘజుష్టా ప్రహ్లాదతీర్థానుగతిః సుపుణ్యా ।
యత్కీర్తనాచ్ఛ్రవణాత్ స్పర్శనాచ్చ విముక్తపాపా మనుజా భవన్తి ॥42॥

నారదా! ఈ విధంగా మహాభాగవతుడైన ప్రహ్లాదుడు గావించిన పుణ్యప్రదమైన తీర్థయాత్రావివరణం నీకు వినిపించాను. దీనిని గానం చేసినా, శ్రవణం చేసినా స్పర్శ గావించినా మానవుడు సర్వపాపాలనుండి విముక్తుడౌతాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే ప్రహ్లాదతీర్థయాత్రాయాం కోటితీర్థమాహాత్మ్యవర్ణనం నామ చతురశీతితమోఽధ్యాయః ॥84॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో ప్రహ్లాదుని తీర్థయాత్రలో కోటితీర్థం, శాలగ్రామం మున్నగుతీర్థాల మాహాత్మ్యవర్ణనమనే ఎనభైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచాశీతితమోఽధ్యాయః – ఎనబైఐదవ అధ్యాయం

గజేంద్రమోక్షణమ్ – గజేంద్రమోక్షణం

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

యాన్ జప్యాన్ భగవద్భక్త్యా ప్రహ్లాదో దానవోఽజపత్ ।
గజేంద్రమోక్షణాదీంస్తు చతురస్తాన్ వదస్వ మే ॥1॥

బ్రహ్మర్షీ! పరమభక్తుడైన ప్రహ్లాదుడు శ్రద్ధగా జపించిన గజేంద్రమోక్షణం మొదలైన నాలుగు స్తోత్రాలు ఏమిటో తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శృణుష్వ కథయిష్యామి జప్యానేతాంస్తపోధన ।
దుఃస్వప్ననాశో భవతి యైరుక్తైః సంశ్రుతైః స్మృతైః ॥2॥

గజేన్ద్రమోక్షణం త్వాదౌ శృణుష్వ తదనంతరమ్ ।
సారస్వతం తతః పుణ్యౌ పాపప్రశమనౌ స్తవౌ ॥3॥

నారదా! వేటిని జపిస్తే, వింటే, స్మరిస్తే దుఃస్వప్నాలు నశిస్తాయో, అట్టి నాలుగు స్తోత్రాలను నీకు తెలియజేస్తాను. ముందుగా గజేంద్రమోక్షణగాథను వినుము. తదనంతరం సారస్వతస్తోత్రాన్ని, అటుపిమ్మట పుణ్యప్రదమైనవి, పాపనాశకమైనవియైన రెండుస్తోత్రాలను చెబుతాను, వినుము.

సర్వరత్నమయః శ్రీమాంస్త్రికూటో నామ పర్వతః ।
సుతః పర్వతరాజస్య సుమేరోర్భాస్కరద్యుతేః ॥4॥

క్షీరోదజలవీచ్యగ్రైర్ధౌతామలశిలాతలః ।
ఉత్థితం సాగరం భిత్త్వా దేవర్షిగణసేవితః ॥5॥

అప్సరోభిః పరివృతః శ్రీమాన్ ప్రస్రవణాకులః ।
గన్ధర్వైః కిన్నరైర్యక్షైః సిద్ధచారణపన్నగైః ॥6॥

విద్యాధరైః సపత్నీకైః సంయతైశ్చ తపస్విభిః ।
వృకద్వీపగజేన్ద్రైశ్చ వృతగాత్రో విరాజతే ॥7॥

పున్నాగైః కర్ణికారైశ్చ బిల్వామలకపాటలైః ।
చూతనీపకదంబైశ్చ చందనాగురుచంపకైః ॥

శాలైస్తాలైస్తమాలైశ్చ సరలార్జునపర్పటైః ।
తథాన్యైర్వివిధైః వృక్షైః సర్వతః సమలంకృతః ॥9॥

సర్వరత్నమయమైన త్రికూటమనే దివ్యమైన పర్వతముంది. సూర్యకాంతితో వెలిగే మేరుపర్వతం యొక్క పుత్రుడు ఈ త్రికూటపర్వతం. దేవర్షిగణాలు సేవించే ఈ పర్వతం క్షీరసాగరాన్ని ఛేదించుకుని పైకి లేచింది. క్షీరసాగరతరంగాలు దీని శిలాతలాలను శుభ్రం చేస్తూ ఉంటాయి. ఈ పర్వతాన్ని గంధర్వులు, కిన్నరులు, అప్సర్సలు, సిద్ధచారణపన్నగవిద్యాధరులు తమ భార్యలతో కలసి సేవిస్తూ ఉంటారు. జితేంద్రియులగు తపస్వులకు ఈ గిరి ఆటపట్టు. తోడేళ్ళు, గజేంద్రాలతో కూడి ఈ పర్వతం విరాజిల్లుతుంటుంది. ఈ పర్వతం నిండా పున్నాగ, కర్ణికార (గన్నేరు), బిల్వ, ఉసిరిక, పాటల, మామిడి, కడిమి, కదంబ, చందన, అగురు, సంపెంగ, సాల, తాళ, తమాల, సరల, అర్జున, పర్పట మొదలైన ఎన్నో రకాల వృక్షాలు ఏపుగా పెరగడంతో ఆ వృక్షాలతో అలంకరింపబడిన ఈ పర్వతం నేత్రపర్వంగా ఉంటుంది.

నానాధాత్వంకితైః శ్రుంగైః ప్రస్రవద్భిః సమంతతః ।
శోభితో రుచిరప్రఖ్యైస్త్రిభిర్విస్తీర్ణసానుభిః ॥10॥

మృగైః శాఖామృగైః సింహైర్మాతంగైశ్చ సదా మదైః ।
జీవం జీవకసంఘుష్టైశ్చకోరశిఖినాదితైః ॥11॥

తస్యైకం కాంచనం శృంగం సేవతే యం దివాకరః ।
నానాపుష్పసమాకీర్ణం నానాగంధాదివాసితమ్ ॥12॥

ద్వితీయం రాజతం శృంగం సేవతే యం నిశాకరః ।
పాండురాంబుదసంకాశం తుషారచయసంనిభమ్ ॥13॥

వజ్రేంద్రనీలవైదూర్యతేజోభిర్భాసయన్ దిశః ।
తృతీయం బ్రహ్మసదనం ప్రకృష్టం శృంగముత్తమమ్ ॥14॥

న తత్ కృతఘ్నాః పశ్యన్తి న నృశంసా న నాస్తికాః ।
నాతప్తతపసో లోకే యే చ పాపకృతో జనాః ॥15॥

అనేక ధాతుమయాలైన దాని శిఖరాలనుండి జాలువారే జలపాతాలతో అందాలు చిందించే మూడు సానువులతో అది అలరారుతూ ఉంటుంది. లేళ్ళు, వానరాలు, సింహాలు, మదపుటేనుగులు, జీవాలను చంపితినే ఇతర జంతువులతో చకోరమయూరాల నాదాలతో ఆ ప్రదేశం కోలాహలంగా ఉంటుంది. ఆ మూడు శిఖరాలలో ఒకటి బంగారు మయమై, దివాకరునికి ఆవాసంగా చక్కని పరిమళాలు వెదజల్లే నానా పుష్పాలతో నిండియుంటుంది. చంద్రునకు ఆవాసమైన రెండవ శిఖరం రజత నిర్మితం. అది తెల్లని మేఘసమూహం వలె తుషారపటలాల వలె, మనోహరంగా ఉంటుంది. ఇంద్రనీల, వజ్రవైదూర్య కాంతులతో దిశలను వెలిగిస్తూ ఉండే మూడవశిఖరం బ్రహ్మకు నెలవైనది. సర్వోత్తమమైనది. అది కృతఘ్నులకు, క్రూరులకు, నాస్తికులకు, తపమాచరింపని పాపులైన జనులకు కనబడదు.

తస్య సానుమతః పృష్ఠే సరః కాంచనపంకజమ్ ।
కారణ్డవసమాకీర్ణం రాజహంసోపశోభితమ్ ॥16॥

కుముదోత్పలకహ్లారైః పుండరీకైశ్చ మండితమ్ ।
కమలైః శతపత్రైశ్చ కాంచనైః సమలంకృతమ్ ॥17॥

పత్రైర్మరకతప్రఖ్యైః పుష్పైః కాంచనసన్నిభైః ।
గుల్మైః కీచకవేణూనాం సమంతాత్ పరివేష్టితమ్ ॥18॥

ఆ పర్వతానికి వెనుకభాగాన బంగారు కమలాలతోనిండిన చక్కని సరోవరం, నీటిబెగ్గురులు, రాజహంసలు, కలధ్వనులతో నయనశ్రవణాభిరామంగా శోభిస్తోంది. కలువలు, నల్లకమలాలు, కల్హారాలు, తెల్లకమలాలు, శతపత్రాలు, కాంచనశోభతో నిండిన పుష్పాలతో ఆ సరస్సు అందంగా అలరిస్తోంది. మరకతమణుల వలె కమల పత్రాలు, నలువైపులా పరుచుకొని ఉన్నాయి. సరోవరం చుట్టూ వెదురు పొదలు, గుల్మాలు వ్యాపించాయి.

తస్మిన్ సరసి దుష్టాత్మా విరూపోఽన్తర్జలే శయః ।
ఆసీద్గ్రాహో గజేంద్రాణాం రిపురాకేకరేక్షణః ॥19॥

ఆ సరస్సులో ఏనుగుల పాలిట మృత్యువు వలె అరమోడ్పు కనులతో నీటిలో కనబడకుండా దాగికొని దుష్టాత్ముడైన ఒక భయంకరమైన మొసలి ఉండేది.

అథ దంతోజ్జ్వలముఖః కదాచిద్గజయూథపః ।
మదస్రావీ, జలాకాంక్షీ పాదచారీవ పర్వతః ॥20॥

వాసయన్ మదగన్ధేన గిరిమైరావతోపమః ।
గజో హ్యంజనసంకాశో మదాచ్చలితలోచనః ॥21॥

తృషితః పాతుకామోఽసౌ అవతీర్ణశ్చ తజ్జలమ్ ।
సలీలః పంకజవనే యూథమధ్యగతశ్చరన్ ॥22॥

గృహీతస్తేన రౌద్రేణ గ్రాహేణావ్యక్తమూర్తినా ।
పశ్యన్తీనాం కరేణూనాం క్రోశన్తీనాం చ దారుణమ్ ॥23॥

అలా ఉండగా ఒక పర్యాయం తెల్లని దంతకాంతులతో ముఖం వెలిగిపోతున్న ఒక గజసమూహనాయకుడు మదజలధారలు గండప్రదేశం నుండి స్రవిస్తూ ఉండగా మదవాసనలతో పర్వతాన్ని ముంచేస్తూ ఐరావతాన్ని పోలిన ఆ గజేంద్రుడు కాటుకకొండ వలె బయలుదేరి, పాదచారియైన పర్వతం వలె దాహార్తియై అచ్చటకు వచ్చాడు. మదఘూర్ణిత నేత్రాలతో, నీరు త్రాగడానికి ఆ సరోవరంలోనికి ఆత్రుతతో దిగాడు. నీరు త్రాగి, ఆ తామరకొలనులో గజేంద్ర సమూహం మధ్యలో ఆ గజేంద్రుడు లీలగా విహరిస్తూ ఉండగా కనబడకుండా నీటిలో దాగియున్న మొసలి కోపంతో ఆడయేనుగులు దారుణంగా ఆక్రోశిస్తూ, చూస్తూ ఉండగా తన దారుణమైన కోరలతో ఆ గజేంద్రుని పట్టుకున్నది.

హ్రియతే పంకజవనే గ్రాహేణాతిబలీయసా ।
వారుణైః సంయతః పాశైర్నిష్ప్రయత్నగతిః కృతః ॥24॥

వేష్ట్యమానః సుఘోరైస్తు పాశైర్నాగో దృఢైస్తథా ।
విస్ఫూర్య చ యథాశక్తి విక్రోశంశ్చ మహారవాన్ ॥25॥

వ్యథితః స నిరుత్సాహో గృహీతో ఘోరకర్మణా ।
పరమాపదమాపన్నో మనసాఽచిన్తయద్ధరిమ్ ॥26॥

ఆ మొసలి మదగజం కాలు పట్టుకుని, సరస్సులోనికి లాగుతుంటే బలమైన వరుణపాశానికి లోనై, విడిపించుకునే ప్రయత్నం కూడా చేయలేని అసహాయస్థితిలో చలనం మాని నిలబడిపోయింది. ఆ గజేంద్రుడు ఆ విధంగా ఘోరమైన పాశాలతో బంధింపబడగా శక్తికొలదీ ఘీంకరిస్తూ పెడబొబ్బలు పెట్టసాగాడు. క్రమంగా శక్తి, ఉత్సాహం కోల్పోయి, ఘోరవిపత్తుకు, బాధకు తట్టుకోలేక మనసారా హరిని స్మరించాడు.

స తు నాగవరః శ్రీమాన్ నారాయణపరాయణః ।
తమేవ శరణం దేవం గతః సర్వాత్మనా తదా ॥27॥

ఏకాత్మా నిగృహీతాత్మా విశుద్ధేనాన్తరాత్మనా ।
జన్మజన్మాంతరాభ్యాసాద్ భక్తిమాన్ గరుడధ్వజే ॥ 28॥

నాన్యం దేవం మహాదేవాత్ పూజయామాస కేశవాత్ ।
మథితామృతఫేనాభం శంఖచక్రగదాధరమ్ ॥29॥

సహస్రశుభనామానమాదిదేవమజం విభుమ్ ।
ప్రగృహ్య పుష్కరాగ్రేణ కాంచనం కమలోత్తమమ్ ।
ఆపద్విమోక్షమన్విచ్ఛన్ గజః స్తోత్రముదీరయత్ ॥30॥

అప్పుడాగజేంద్రుడు శ్రీమన్నారాయణ పరాయణుడై, సర్వాత్మనా శ్రీమన్నారాయణుని శరణు పొందాడు. గజరాజు జన్మజన్మాంతరాభ్యాసం కారణంగా ఏకాగ్రచిత్తుడు, మరియు సంయతచిత్తుడునై, విశుద్ధమైన అంతరాత్మతో గరుడధ్వజుడైన భగవానుని శరణు పొందాడు. కేశవునికంటె వేరే ఏ దైవాన్ని పూజించడం లేదు. అనన్యచిత్తంతో మథించిన అమృతంనుండి వెలువడే నురుగు వలె తెల్లనైన శంఖం, చక్రం, గద ధరించిన కేశవుని మంగళప్రదాలైన వేయి నామాలతో వెలుగొందే అభవుని, సర్వలోకనాయకుని కరాగ్రంలో బంగారు కమలం పట్టుకొని, తన బంధవిముక్తికై, దీనహీనస్వరంతో, శ్రీహరిని ఇలా స్తోత్రం చేయసాగాడు.

గజేంద్ర ఉవాచ – గజేంద్రుడు పలికాడు.

ఓం నమో మూలప్రకృతయే అజితాయ మహాత్మనే ।
అనాశ్రితాయ దేవాయ నిఃస్పృహాయ నమోఽస్తు తే ॥31॥

ఓంకారరూపుడవు, మూలప్రకృతివి, అజేయుడవునగు మహాత్మా! నీకు నమస్కారము. ఆశ్రయరహితుడవు, స్వతంత్రుడవు, నిష్కాముడవునగు నీకు నమస్కారము.

నమ ఆద్యాయ బీజాయ ఆర్షేయాయ ప్రవర్తినే ।
అనన్తరాయ చైకాయ అవ్యక్తాయ నమో నమః ॥32॥

ఆద్యుడవు, బీజభూతుడవు, సర్వప్రథమ ప్రవర్తకుడవు, అనంతుడవు, ఒకే ఒక్కడవు, అవ్యక్తుడవునగు నీకు మాటిమాటికి నమస్సులు.

నమో గుహ్యాయ గూఢాయ గుణాయ గుణవర్తినే ।
అప్రతర్క్యాప్రమేయాయ అతులాయ నమో నమః ॥33॥

రహస్యమయుడవు, గుప్తుడవు, గుణరూపివి, గుణాలలో విహరించేవాడవు, తర్కానికి, ప్రమాణానికి అతీతుడవు, సాటి లేని వాడవునగు నీకు నమస్సులు.

నమః శివాయ శాన్తాయ నిశ్చింతాయ యశస్వినే ।
సనాతనాయ పూర్వాయ పురాణాయ నమో నమః ॥34॥

మంగళకరుడవు, శాంతిస్వరూపుడవు, చింతారహితుడవు, యశస్వివి, సనాతనుడవు, సృష్టికంటె పూర్వుడవు, పురాతనుడవునగు నీకు నమస్కారము.

నమో దేవాధిదేవాయ స్వభావాయ నమో నమః ।
నమో జగత్ప్రతిష్ఠాయ గోవిందాయ నమో నమః ॥35॥

దేవాధిదేవుడవు, స్వభావరూపుడవు, జగత్ప్రతిష్ఠాపకుడవు, గోవిందుడవునగు నీకు నమస్కారము.

నమోఽస్తు పద్మనాభాయ నమో యోగోద్భవాయ చ ।
విశ్వేశ్వరాయ దేవాయ శివాయ హరయే నమః ॥36॥

పద్మనాభుడవైన నీకు నమస్కారము. యోగోద్భవుడవైన నీకు నమస్కారం. విశ్వేశ్వరుడవు, పరమేశ్వరుడవు, హరుడవునగు నీకు నమస్సులు.

నమోఽస్తు తస్మై దేవాయ నిర్గుణాయ గుణాత్మనే ।
నారాయణాయ విశ్వాయ దేవానాం పరమాత్మనే ॥37॥

పరబ్రహ్మస్వరూపుడవైన దేవుడవు, నిర్గుణుడవు, గుణాత్మకుడవు, నారాయణుడవు, విశ్వస్వరూపుడవు, దేవతల పరమాత్మవు, అయిన నీకు ప్రణామములు.

నమో నమః కారణవామనాయ నారాయణాయామితవిక్రమాయ ।
శ్రీశార్ఙ్గచక్రాసిగదాధరాయ నమోఽస్తు తస్మై పురుషోత్తమాయ ॥38॥

ఒక నిమిత్తంగా వామనుడవైన నారాయణుడవు, అమితవిక్రముడవు, లక్ష్మి, శార్ఙ్గము, చక్ర, గదా, ఖడ్గాలను ధరించినవాడవు, పురుషోత్తముడవునైన నీకు నమస్సులు.

గుహ్యాయ వేదనిలయాయ మహోదరాయ సింహాయ దైత్యనిధనాయ చతుర్భుజాయ ।
బ్రహ్మేన్ద్రరుద్రమునిచారణసంస్తుతాయ దేవోత్తమాయ వరదాయ నమోఽచ్యుతాయ ॥39॥

గుహ్యునకు, వేదనిలయునకు, మహోదరునకు, సింహునకు, దైత్యాన్తకునకు, చతుర్భుజునకు, బ్రహ్మేంద్ర రుద్రమునిచారణాదులచే సంస్తుతింపబడువానికి దేవోత్తమునకు, వరదునకు, అచ్యుతునకు నమస్కృతులు.

నాగేంద్రదేహశయనాసనసుప్రియాయ గోక్షీరహేమశుకనీలఘనోపమాయ ।
పీతాంబరాయ మధుకైటభనాశనాయ విశ్వాయ చారుముకుటాయ నమోఽజరాయ ॥40॥

నాగేంద్రుడైన ఆదిశేషునిపై ప్రీతితో శయనించి, నెలకొనియుండువానికి, ఆవుపాలు, బంగారం, శుకం, నీలమేఘం వీనిని పోలినవానికి, పీతాంబరధారికి, మధుకైటభులను సంహరించినవానికి, విశ్వరూపునకు, అందమైన కిరీటం గలవానికి, ముసలితనం లేనివానికి నమస్సులు.

నాభిప్రజాతకమలస్థచతుర్ముఖాయ క్షీరోదకార్ణవనికేతయశోధరాయ ।
నానావిచిత్రముకుటాంగదభూషణాయ సర్వేశ్వరాయ వరదాయ నమో వరాయ ॥41॥

నాభినుండి పుట్టిన కమలంలో చతుర్ముఖాలు కలవాడవు, క్షీరసాగరం నివాసంగా కలిగిన యశోధరుడవు. అనేక చిత్రవిచిత్రమైన కిరీటాంగదాదిభూషణములు ధరించినవాడవు. సర్వేశ్వరుడవు, వరదుడవు, శ్రేష్ఠుడవునైన నీకు నమోవాకములు.

భక్తిప్రియాయ వరదీప్తిసుదర్శనాయ ఫుల్లారవిందవిపులాయతలోచనాయ ।
దేవేంద్రవిఘ్నశమనోద్యతపౌరుషాయ యోగేశ్వరాయ విరజాయ నమో వరాయ ॥42॥

భక్తి ప్రియునకు, శ్రేష్ఠమైన కాంతితో సర్వథా పూర్ణసౌందర్యాన్ని దర్శింపజేయువానికి వికసించిన అరవిందములవలె విశాలమైన నేత్రాలు కలవానికి, దేవేంద్రుని విఘ్నాలను నాశనం చేయడానికి ఉద్యమించు వానికి, పురుషార్థాలు సిద్ధింపజేయు వరస్వరూపునకు, యోగేశ్వరునకు, విరజునకు, సర్వశ్రేష్ఠునకు నమస్సులు.

బ్రహ్మాయనాయ త్రిదశాయనాయ లోకాధినాథాయ భవాపనాయ ।
నారాయణాయాత్మహితాయనాయ మహావరాహాయ నమస్కరోమి ॥43॥

బ్రహ్మాది సమస్తదేవతలకు ఆధారస్వరూపుడైన వానికి, లోకాధినాథునకు, భవాపహారునకు, ఆత్మకల్యాణానికి తెరవైన నారాయణునకు, మహావరాహస్వరూపునకు నమస్కరిస్తున్నాను.

కూటస్థమవ్యక్తమచిన్త్యరూపం నారాయణం కారణమాదిదేవమ్ ।
యుగాన్తశేషం పురుషం పురాణం తం దేవదేవం శరణం ప్రపద్యే ॥44॥

కూటస్థునకు, అవ్యక్తునకు, అచింత్యరూపునకు, కారణస్వరూపునకు, ఆదిదేవునకు, నారాయణునకు, యుగాంతములయందు కూడా మిగిలియుండువానికి, పురాణపురుషునకు, దేవదేవునకు, నేను శరణాగతుడ నగుచున్నాను.

యోగేశ్వరం చారువిచిత్రమౌలిమజ్ఞేయమగ్ర్యం ప్రకృతేః పరస్థమ్ ।
క్షేత్రజ్ఞమాత్మప్రభవం వరేణ్యం తం వాసుదేవం శరణం ప్రపద్యే ॥45॥

యోగేశ్వరుడైనవానిని, సుందరవిచిత్రవర్ణములతో కూడిన కిరీటం ధరించినవానిని, అజ్ఞేయుని, సర్వశ్రేష్ఠుని, ప్రకృతికంటె పరంగా ఉండువానిని, క్షేత్రజ్ఞుని, ఆత్మప్రభువును, వరేణ్యుడునగు వాసుదేవుని నేను శరణు వేడుచున్నాను.

అదృశ్యమవ్యక్తమచిన్త్యమవ్యయం మహర్షయో బ్రహ్మమయం సనాతనమ్ ।
వదంతి యం వై పురుషం సనాతనం తం దేవగుహ్యం శరణం ప్రపద్యే ॥46॥

మహర్షులు ఎవనిని అదృశ్యునిగా, అవ్యక్తునిగా, అచింత్యనీయునిగా, అవ్యయునిగా, బ్రహ్మమయమైన వానిగా, సనాతనపురుషునిగా కీర్తించుచున్నారో అట్టి దేవగుహ్యుని నేను శరణు వేడుచున్నాను.

యదక్షరం బ్రహ్మ వదంతి సర్వగం నిశమ్య యం మృత్యుముఖాత్ ప్రముచ్యతే ।
తమీశ్వరం తృప్తమనుత్తమైర్గుణైః పరాయణం విష్ణుముపైమి శాశ్వతమ్ ॥47॥

ఎవరిని అక్షరునిగా పరబ్రహ్మగా కీర్తించుచున్నారో, సర్వగుడైన ఎవరిని గూర్చి శ్రవణం చేయడంవల్ల మృత్యుముఖం నుండి విముక్తుడౌతాడో అట్టి శ్రేష్ఠగుణయుక్తుడు, ఆత్మతృప్తుడు, శాశ్వతమైన ఆశ్రయస్వరూపుడు నైన శ్రీమహావిష్ణువును శరణు వేడుచున్నాను.

కార్యం క్రియా కారణమప్రమేయం హిరణ్యబాహుం వరపద్మనాభమ్ ।
మహాబలం వేదనిధిం సురేశం వ్రజామి విష్ణుం శరణం జనార్దనమ్ ॥48॥

కార్యము, కారణము, క్రియ, అప్రమేయుడు, హిరణ్యబాహుడు, పద్మనాభుడు, మహాబలుడు, వేదనిధి, సురేశుడు, సర్వవ్యాపియునైన జనార్దనుని శరణు వేడుచున్నాను.

కిరీటకేయూరమహార్హనిష్కైర్మణ్యుత్తమాలంకృతసర్వగాత్రమ్ ।
పీతాంబరం కాంచనభక్తిచిత్రం మాలాధరం కేశవమభ్యుపైమి ॥49॥

అమూల్యమైన కేయూరకిరీటాది స్వర్ణరత్నాలంకృతమైన ఉత్తమాభరణాలు శరీరం నిండా వెలుగుతుండగా పీతాంబరాన్ని, భక్తియనే చిత్రమాలను, ధరించినట్టి కేశవుని ఆశ్రయిస్తున్నాను.

భవోద్భవం వేదవిదాంవరిష్ఠం యోగాత్మనాం సాంఖ్యవిదాం వరిష్ఠమ్ ।
ఆదిత్యరుద్రాశ్వివసుప్రభావం ప్రభుం ప్రపద్యేఽ చ్యుతమాత్మవన్తమ్ ॥50॥

సంసారకారణుడు, వేదవిదులలో శ్రేష్ఠుడు, యోగులలోను, సాంఖ్యులలోను ఉత్తముడు, ఆదిత్య వసు రుద్రాశ్వినుల కాంతితో సర్వులకు ప్రభువై ఆత్మస్వరూపియునైన అచ్యుతుడే నాకు శరణ్యుడు.

శ్రీవత్సాంకం మహాదేవం దేవగుహ్యమనౌపమమ్ ।
ప్రపద్యే సూక్ష్మమచలం వరేణ్యమభయప్రదమ్ ॥51॥

శ్రీవత్సచిహ్నంతో, సాటిలేని శోభతో వెలిగే మహాదేవుని, దేవగుహ్యుని, అనుపమానుని, సూక్ష్మము, స్థిరము అయినవానిని, శ్రేష్ఠుడైనవానిని, అభయప్రదాతను శరణు వేడుచున్నాను.

ప్రభవం సర్వభూతానాం నిర్గుణం పరమేశ్వరమ్ ।
ప్రపద్యే ముక్తసంగానాం యతీనాం పరమాం గతిమ్ ॥52॥

సర్వజీవులకు జనిస్థానమై, నిర్గుణుడై, సంగరహితులకు, యతీంద్రులకు, పరాంగతియైన పరమేశ్వరునకు శరణాగతుడనగుచున్నాను.

భగవన్తం గుణాధ్యక్షమక్షరం పుష్కరేక్షణమ్ ।
శరణ్యం శరణం భక్త్యా ప్రపద్యే భక్తవత్సలమ్ ॥53॥

గుణాధ్యక్షుడు, నాశనం లేనివాడు, పద్మాక్షుడు, శరణ్యుడు, భక్తవత్సలుడునైన భగవంతుని భక్తితో శరణు వేడుచున్నాను.

త్రివిక్రమం త్రిలోకేశం సర్వేషాం ప్రపితామహమ్ ।
యోగాత్మానం మహాత్మానం ప్రపద్యేఽహం జనార్దనమ్ ॥54॥

త్రివిక్రముడు, త్రిలోకేశుడు, సర్వజీవులకు ముత్తాతయైన వాడు, యోగాత్ముడు, మహాత్ముడునైన జనార్దనునకు నేను ప్రపన్నుడనగుచున్నాను.

ఆదిదేవమజం శంభుం వ్యక్తావ్యక్తం సనాతనమ్ ।
నారాయణమణీయాంసం ప్రపద్యే బ్రాహ్మణప్రియమ్ ॥55॥

ఆదిదేవుడు, జన్మరహితుడు, కల్యాణకరుడు, వ్యక్తావ్యక్తుడు, సనాతనుడు, అణురూపి, బ్రాహ్మణప్రియుడు నగు నారాయణుని శరణు వేడుచున్నాను.

నమో వరాయ దేవాయ నమః సర్వసహాయ చ ।
ప్రపద్యే దేవదేవేశమణీయాంసమణోః సదా ॥56॥

శ్రేష్ఠుడైనవానికి, దేవునకు నమస్కారం. సర్వసహాయునకు నమస్సులు. అణువులలో అణుస్వరూపా!, దేవదేవేశా! సర్వదా నిన్ను ఆశ్రయిస్తున్నాను.

ఏకాయ లోకతత్త్వాయ పరతః పరమాత్మనే ।
నమః సహస్రశిరసే అనంతాయ మహాత్మనే ॥57॥

ఒంటరివాడు, లోకతత్త్వస్వరూపుడు, పరాత్పరుడు, సహస్రశీర్షుడు, మహాత్ముడునైన అనంతునకు నమస్కరిస్తున్నాను.

త్వామేవ పరమం దేవమృషయోవేదపారగాః ।
కీర్తయంతి చ యం సర్వే బ్రహ్మాదీనాం పరాయణమ్ ॥58॥

వేదపారంగతులైనవారు, మహర్షులు, నిన్నే పరతత్త్వంగాను బ్రహ్మాదులందరకు ఆధారభూతుడుగాను కొనియాడుతున్నారు. అట్టి నీకు నమస్కారము.

నమస్తే పుండరీకాక్ష భక్తానామభయప్రద ।
సుబ్రహ్మణ్య నమస్తేఽస్తు త్రాహి మాం శరణాగతమ్ ॥59॥

ఓ పుండరీకాక్షా! నీకు నమస్కారం. భక్తులకు అభయప్రదుడా!, సుబ్రహ్మణ్యా! నీకు నమస్కారం. శరణాగతుడనైన నన్ను రక్షింపుము.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

భక్తిం తస్యానుసంచిన్త్య నాగస్యామోఘసంభవః ।
ప్రీతిమానభవద్విష్ణుః శంఖచక్ర గదాధరః ॥60॥

సాన్నిధ్యం కల్పయామాస తస్మిన్ సరసి కేశవః ।
గరుడస్థో జగత్స్వామీ లోకాధారస్తపోధనః ॥61॥

గ్రాహగ్రస్తం గజేంద్రం తం తం చ గ్రాహం జలాశయాత్ ।
ఉజ్జహారాప్రమేయాత్మా తరసా మధుసూదనః ॥62॥

స్థలస్థం దారయామాస గ్రాహం చక్రేణ మాధవః ।
మోక్షయామాస నాగేంద్రం పాశేభ్యః శరణాగతమ్ ॥63॥

స హి దేవలశాపేన హూహూర్గన్ధర్వసత్తమః ।
గ్రాహత్వమగమత్ కృష్ణాద్వధం ప్రాప్య దివంగతః ॥64॥

శంఖచక్రగదాధరుడు, అమోఘసంభవుడునగు విష్ణుదేవుడు గజేంద్రుని భక్తికి సంతోషించి, ఆ సరస్సులో సాన్నిధ్యాన్ని కల్పించుకున్నాడు. లోకాధారుడు, మహాతపోధనుడునైన గరుడవాహనుడు వచ్చి మహావేగంతో మొసలిచే పట్టుబడిన గజేంద్రుని, మొసలిని, రెంటిని కూడా జలాశయంనుండి లాగి, బయట పడవేశాడు. అప్రమేయాత్ముడు, మధుసూదనుడునైన మాధవుడు నేలమీదనున్న ఆ మొసలిని చక్రంతో ఖండించాడు. శరణాగతుడైన గజేంద్రునకు బంధమోక్షణం కలిగించాడు. దేవలుని శాపం వల్ల మకరిగా మారిన హూహూ అనే గంధర్వుడు కృష్ణునిచే వధింపబడి, శాపవిముక్తుడై, దివికి చేరుకున్నాడు.

గజోఽపి విష్ణునా స్పృష్టో జాతో దివ్యవపుః పుమాన్ ।
ఆపద్విముక్తౌ యుగపద్గజగంధర్వసత్తమౌ ॥65॥

ప్రీతిమాన్ పుండరీకాక్షః శరణాగతవత్సలః ।
అభవత్త్వథ దేవేశస్తాభ్యాం చైవ ప్రపూజితః ॥66॥

ఇదం చ భగవాన్ యోగీ గజేంద్రం శరణాగతమ్ ।
ప్రోవాచ మునిశార్దూల మధురం మధుసూదనః ॥67॥

ఓ మునిశార్దూలా! నారదమునీంద్రా! అంతట గజేంద్రుడు కూడా విష్ణుకరస్పర్శ వల్ల దివ్యదేహం ధరించాడు. ఆ విధంగా గజగంధర్వులు ఇరువురు ఆపదలనుండి విముక్తులయ్యారు. వారిరువురిచేత పూజింపబడిన శరణాగత వత్సలుడైన పుండరీకాక్షుడు సంతుష్టుడయ్యాడు. శరణాగతవత్సలుడైన ఆ మహాయోగి మధుసూదనుడు శరణాగతుడైన గజేంద్రునితో మధురమైన వాక్కులతో ఇలా పలికాడు.

శ్రీ భగవాన్ ఉవాచ – శ్రీకృష్ణభగవానుడు పలికాడు.

యే మాం త్వాం చ సరశ్చైవ గ్రాహస్య చ విదారణమ్ ।
గుల్మకీచకరేణూనాం రూపం మేరోః సుతస్య చ ॥68॥

అశ్వత్థం భాస్కరం గంగాం నైమిశారణ్యమేవ చ ।
సంస్మరిష్యన్తి మనుజాః ప్రయతాః స్థిరబుద్ధయః ॥69॥

కీర్తయిష్యన్తి భక్త్యా చ శ్రోష్యన్తి చ శుచివ్రతాః ।
దుఃస్వప్నో నశ్యతే తేషాం సుస్వప్నశ్చ భవిష్యతి ॥70॥

మాత్స్యం కౌర్మం చ వారాహం వామనం తార్క్ష్యమేవ చ ।
నారసింహం చ నాగేంద్రం సృష్టిప్రలయకారకమ్ ॥71॥

ఏతాని ప్రాతరుత్థాయ సంస్మరిష్యంతి యే నరాః ।
సర్వపాపైః ప్రముచ్యన్తే పుణ్యం లోకమవాప్నుయుః ॥72॥

ఓ గజేంద్రా! ఎవరైతే నిన్ను నన్ను, ఈ సరోవరాన్ని, ఇచ్చటి గుల్మకీచక రేణువులను, మేరుపుత్రుడైన గిరిశిఖరాన్ని, మకరసంహారాన్ని, అశ్వత్థవృక్షాన్ని, భాస్కరుని, గంగను, నైమిశారణ్యాన్ని, స్థిరచిత్తంతో, భక్తితో మానవులు ప్రయత్నపూర్వకంగా శుచులై స్మరిస్తారో అట్టివారి దుఃస్వప్నాలు నశించి, శుభస్వప్నాలు కలుగుతాయి. ప్రతిదినం ప్రాతఃకాలాన మేల్కొని, ఏ మానవుడైతే మత్స్య, కూర్మ, వరాహ, వామన, గరుడ, నారసింహావతారాలను, వారి కార్యాలను, సృష్టిప్రళయకారకుడైన నాగేంద్రుని సమాహితచిత్తంతో స్మరిస్తారో వారందరు సమస్త పాపాలనుండి విముక్తులై, పుణ్యలోకాలను పొందుతారు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏవముక్త్వా హృషీకేశో గజేంద్రం గరుడధ్వజః ।
స్పర్శయామాస హస్తేన గజం గన్ధర్వమేవ చ ॥73॥

తతో దివ్యవపుర్భూత్వా గజేంద్రో మధుసూదనమ్ ।
జగామ శరణం విప్ర నారాయణపరాయణః ॥74॥

ఓ నారదా! గరుడధ్వజుడైన హృషీకేశుడు ఈ విధంగా పలికి, ఆ గజగ్రాహాలను తన చేతితో నిమిరాడు. అంతట గజేంద్రుడు దివ్యదేహం ధరించి, నారాయణపరాయణుడై, నారాయణుని శరణు వేడాడు.

తతో నారాయణః శ్రీమాన్ మోక్షయిత్వా గజోత్తమమ్ ।
పాపబంధాచ్చ శాపాచ్చ గ్రాహం చాద్భుతకర్మకృత్ ॥75॥

ఋషిభిః స్తూయమానశ్చ దేవగుహ్యపరాయణైః ।
గతః స భగవాన్ విష్ణుః దుర్విజ్ఞేయగతిః ప్రభుః ॥76॥

అంతట శ్రీమన్నారాయణుడు పాపబంధాలనుండి, శాపబంధంనుండి, గజేంద్రుని, మకరిని, విముక్తులను గావించాడు. తదనంతరం ఋషులు, దేవతలు, గంధర్వులు, యక్షులు, స్తుతిస్తూ ఉండగా అద్భుతకర్ముడు, దుర్విజ్ఞేయగమనుడునైన శ్రీహరి అచ్చటనుండి అంతర్ధానమయ్యాడు.

గజేంద్రమోక్షణం దృష్ట్వా దేవాః శక్రపురోగమాః ।
వవందిరే మహాత్మానం ప్రభుం నారాయణం హరిమ్ ॥77॥

ఇంద్రాది దేవతలందరు గజేంద్రమోక్షణాన్ని చూసి, మహాత్ముడు, ప్రభువు, నారాయణుడునైన శ్రీహరికి నమస్కరించారు.

మహర్షయశ్చారణాశ్చ దృష్ట్వా గజవిమోక్షణమ్ ।
విస్మయోత్ఫుల్లనయనాః సంస్తువన్తి జనార్దనమ్ ॥78॥

గజవిమోక్షణాన్ని దర్శించిన మహర్షులు, చారణులు, ఆశ్చర్యంతో వికసించిన నేత్రాలు కలవారై, జనార్దనుని స్తుతించారు.

ప్రజాపతిపతిర్బ్రహ్మా చక్రపాణివిచేష్టితమ్ ।
గజేంద్రమోక్షణం దృష్ట్వా ఇదం వచనమబ్రవీత్ ॥79॥

చక్రపాణిచే చేయబడిన గజేంద్రమోక్షణరూపమైన కర్మను తిలకించిన ప్రజాపతిపతియైన బ్రహ్మా ఇలా పలికాడు.

య ఇదం శ్రుణుయాన్నిత్యం ప్రాతరుత్థాయ మానవః ।
ప్రాప్నుయాత్పరమాం సిద్ధిం దుఃస్వప్నస్తస్య నశ్యతి ॥80॥

గజేంద్రమోక్షణం పుణ్యం సర్వపాపప్రణాశనమ్ ।
కథితేన స్మృతేనాథ శ్రుతేన చ తపోధన ।
గజేంద్రమోక్షణేనేహ సద్యః పాపాత్ప్రముచ్యతే ॥81॥

ఏతత్ పవిత్రం పరమం సుపుణ్యం సంకీర్తనీయం చరితం మురారేః ।
యస్మిన్ కిలోక్తే బహుపాపబన్ధనాత్ లభ్యేత మోక్షో ద్విరదేన యద్వత్ ॥82॥

అజం వరేణ్యం వరపద్మనాభం నారాయణం బ్రహ్మనిధిం సురేశమ్ ।
తం దేవగుహ్యం పురుషం పురాణం వందామ్యహం లోకపతిం వరేణ్యమ్ ॥83॥

"ప్రాతఃకాలంలో మేల్కొంచి, ఏ మానవుడు గజేంద్రమోక్షణగాథను వింటాడో అట్టి మానవుని దుఃస్వప్నాలు నశించి, పరమసిద్ధిని పొందుతాడు. ఈ గజేంద్రమోక్షణం సర్వపాపప్రశమనం. పుణ్యప్రదం. కావున దీనిని ప్రవచించినవాడు, స్మరించినవాడు, వినినవాడు, గజేంద్రునకు మోక్షం లభించిన విధంగానే వెంటనే సమస్త పాపాలనుండి విముక్తుడౌతాడు. పరమపవిత్రము, సంకీర్తనీయము, పుణ్యప్రదమునైన మురారి యొక్క ఈ గాధను కథనం చేసిన మానవునకు గజేంద్రునకు వలెనే అనేక పాపబంధాలనుండి ముక్తి కలుగుతుంది. అజుడు, వరేణ్యుడు, పద్మనాభుడు, నారాయణుడు, బ్రహ్మనిధి, సురేశుడు, దేవగుహ్యుడు, పురాణపురుషుడునైన లోకస్వామికి నేను నమస్కరించుచున్నాను".

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏతత్తవోక్తం ప్రవరం స్తవానాం స్తవం మురారేర్వరనాగకీర్తనమ్ ।
యం కీర్త్య సంశ్రుత్య తథా విచిన్త్య పాపాపనోదం పురుషో లభేత ॥84॥

ఓ తపోధనా! మురారిస్తోత్రాలలో శ్రేష్ఠమైనది, గజేంద్రునిచే కీర్తింపబడినదియునైన ఈ స్తోత్రాన్ని నీకు నేను వినిపించాను. దీనిని కీర్తించడంవల్ల గాని, వినడంవల్ల గాని, స్మరించడంవల్ల గాని, మానవుడు పాపాలనుండి విముక్తుడౌతాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే గజేంద్రమోక్షణం నామ పంచాశీతితమోஉధ్యాయః ॥85॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో గజేంద్రమోక్షణమనే ఎనబైఐదవ అధ్యాయం సమాప్తం.



షడశీతితమోఽధ్యాయః - ఎనబైఆరవ అధ్యాయం

సారస్వతస్తోత్రమ్ - సారస్వతస్తోత్రం

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

కశ్చిదాసీద్ద్విజద్రోగ్ధా పిశునః క్షత్రియాధమః ।
పరపీడారుచిః క్షుద్రః స్వభావాదపి నిర్ఘృణః ॥1॥

పర్యాసితాః సదా తేన పితృదేవద్విజాతయః ।
స త్వాయుషి పరిక్షీణే జజ్ఞే ఘోరో నిశాచరః ॥2॥

తేనైవ కర్మదోషేణ స్వేన పాపకృతాం వరః ।
క్రూరైశ్చక్రే తతో వృత్తిం రాక్షసత్వాద్విశేషతః ॥3॥

తస్య పాపరతస్యైవం జగ్ముర్వర్షశతాని తు ।
తేనైవ కర్మదోషేణ నాన్యాం వృత్తిమరోచయత్ ॥4॥

యం యం పశ్యతి సత్త్వం స తం తమాదాయ రాక్షసః ।
చఖాద రౌద్రకర్మాసౌ బాహుగోచరమాగతమ్ ॥5॥

ఏవం తస్యాతిదుష్టస్య కుర్వతః ప్రాణినాం వధమ్ ।
జగామ చ మహాన్ కాలః పరిణామం తథా వయః ॥6॥

ఒకప్పుడు బ్రాహ్మణహింసకుడు, దగాకోరు, పరులను పీడించేవాడు, నీచుడు, క్రూరస్వభావుడునైన క్షత్రియాధముడుండేవాడు. పితృదేవతలను, ద్విజులను వాడు ఎల్లప్పుడు ద్వేషించి, హింసించేవాడు. కొంతకాలానికి వాడి ఆయువుతీరి, మరణించి, భయంకరరాక్షసుడుగా జన్మించాడు. ఈ కర్మదోషం వలన రాక్షసయోనిలో కూడా వాడు మరింత జనపీడకుడుగా, నరభక్షకుడుగా రూపొందాడు. అదే రాక్షసవృత్తిలో వాడు నూరేండ్లు గడిపాడు. ఆ పాపం వలన వాడు వేరే వృత్తిని ఆచరించడానికి ఇష్టపడేవాడు కాడు. కంటికి కనబడిన జీవిని, చేతికి అందిన ప్రాణిని ఏ మాత్రం దయాదాక్షిణ్యాలు లేకుండా భక్షించేవాడు. ఆ విధంగా వాడు చాలాకాలం పాపాచారుడుగా జీవించాడు. ప్రాణుల వధ చేస్తూ ఉండేవాడు. వయస్సు బాగా ముదిరిపోయింది.

స కదాచిత్తపస్యన్తం దదర్శ సరితస్తటే ।
మహాభాగమూర్ధ్వభుజం యథావత్సంయతేంద్రియమ్ ॥7॥

అనయా రక్షయా బ్రహ్మన్ కృతరక్షం తపోనిధిమ్ ।
యోగాచార్యం శుచిం దక్షం వాసుదేవపరాయణమ్ ॥8॥

విష్ణుః ప్రాచ్యాం స్థితశ్చక్రీ విష్ణుర్దక్షిణతో గదీ ।
ప్రతీచ్యాం శార్ఙ్గధృగ్విష్ణుర్విష్ణుః ఖడ్గీ మమోత్తరే ॥9॥

హృషీకేశో వికోణేషు తచ్ఛిద్రేషు జనార్దనః ।
క్రోడరూపీ హరిర్భూమౌ నారసింహోఽమ్బరే మమ ॥10॥

క్షురాన్తమమలం చక్రం భ్రమత్యేతత్సుదర్శనమ్ ।
అస్యాంశుమాలా దుష్ప్రేక్ష్యా హన్తుం ప్రేతనిశాచరాన్ ॥11॥

ఓ నారదా! ఒక పర్యాయం వాడొక నదీతీరాన ఊర్ధ్వబాహుడై, జితేంద్రియుడై, తపోదీక్షలో మునిగిన ఒక మహాసాధువును చూశాడు. ఆ యోగిదక్షుడు వాసుదేవపరాయణుడు. ఈ రక్షాస్తోత్రంతో ఆత్మరక్షణ చేసుకుంటూ తపస్సులో మునిగిపోయాడు. "చక్రధారియైన విష్ణువు నాకు తూర్పున ఉండుగాక!. గదాధరుడైన విష్ణువు నాకు దక్షిణ దిశలో నిలుచుగాక!. శార్ఙ్గపాణియైన విష్ణువు నాకు పడమరగాను, ఖడ్గధరుడైన విష్ణువు నాకు ఉత్తరదిశయందును ఉండుగాక!. హృషీకేశుడు దిక్కుల మూలలందును, తక్కిన సందులందు జనార్దనుడు నిలబడి నన్ను కాపాడుదురుగాక! వరాహవిష్ణువు భూమండలంలోను, నృసింహుడు ఆకాశాననుందురుగాక!. పదునైన అంచులతో కన్నులు చెదిరిపోయే సూర్యమండలదీప్తితో వెలిగే సుదర్శనచక్రం ప్రేత రాక్షసాదులను సంహరించడానికి సర్వత్రా తిరుగు గాక!.

గదా చేయం సహస్రార్చిరుద్వమన్ పావకో యథా ।
రక్షోభూతపిశాచానాం డాకినీనాం చ శాతనీ ॥12॥

శార్ఙ్గం విస్ఫూర్జితం చైవ వాసుదేవస్య మద్రిపూన్ ।
తిర్యఙ్మనుష్యకూష్మాండప్రేతాదీన్ హన్త్యశేషతః ॥13॥

ఖడ్గధారాజ్వలజ్జ్యోత్స్నా నిర్ధూతా యే మమాహితాః ।
తే యాంతు సౌమ్యతాం సద్యో గరుడేనేవ పన్నగాః ॥14॥

యే కూష్మాండాస్తథా యక్షా దైత్యా యే చ నిశాచరాః ।
ప్రేతా వినాయకాః క్రూరా మనుష్యా జృంభకాః ఖగాః ॥15॥

సింహాదయో యే పశవో దందశూకాశ్చ పన్నగాః ।
సర్వే భవన్తు మే సౌమ్యా విష్ణుచక్రరవాహతాః ॥16॥

చిత్తవృత్తిహరా యే చ యే జనాః స్మృతిహారకాః ।
బలౌజసాం చ హర్తారశ్ఛాయావిధ్వంసకాశ్చ యే ॥17॥

యే చోపభోగహర్తారో యే చ లక్షణనాశకాః ।
కూష్మాణ్డాస్తే ప్రణశ్యంతు విష్ణుచక్రరవాహతాః ॥18॥

బుద్ధిః స్వాస్థ్యం మనః స్వాస్థం స్వాస్థ్యమైంద్రియకం తథా ।
మమాస్తు దేవదేవస్య వాసుదేవస్య కీర్తనాత్ ॥19॥

పృష్ఠే పురస్తాదథ దక్షిణోత్తరే వికోణతశ్చాస్తు జనార్దనో హరిః ।
తమీడ్యమీశానమనన్తమచ్యుతం జనార్దనం ప్రణిపతతో న సీదతి ॥20॥

యథా పరంబ్రహ్మ హరిస్తదాపరం జగత్స్వరూపశ్చ స ఏవ కేశవః ।
ఋతేన తేనాచ్యుతనామకీర్తనాత్ ప్రణాశమేవం త్రివిధం మమాశుభమ్ ॥21॥

వేయికిరణాల వెలుగును గ్రుమ్మరించే అగ్నివలె విష్ణువుగద రక్షోభూతపిశాచడాకినీశక్తులను సంహరించుగాక!. వాసుదేవుని ధనుస్సు విజృంభించి, నా శత్రువులను, పశుపక్షిమనుష్య కూష్మాండాది ప్రేతలను నిశ్శేషంగా సంహరించుగాక!. గరుడుని చూసి విషసర్పాలు లొంగిపోయిన విధంగా శ్రీమహావిష్ణువు నందకఖడ్గ ధారాజ్వాలలో మాడిపోయి నా శత్రువులు శాంతులగుదురు గాక!. సుదర్శనచక్రధ్వనితరంగాల తాకిడికి యక్షులు, దైత్యులు, కూష్మాండులు, నిశాచరులు, ప్రేతవినాయకాదులు, క్రూరులైన మనుష్యజృంభకులు, ఖగసింహాది మృగాలు, విషసర్పాలు, సర్వులు శక్తి కోల్పోయి, శాంతులగుదురు గాక!. స్మరణశక్తిని, ఆలోచనాశక్తిని, బలపౌరుషాలను, నీడలను, సుఖభోగాలను, శుభలక్షణాలను హరించే కూష్మాండాది దుష్టశక్తులు విష్ణుచక్రధ్వనికి నశించుగాక!. దేవదేవుడైన శ్రీహరికీర్తనవలన నా బుద్ధి, మనస్సు, ఇంద్రియాలు, సంపూర్ణస్వస్థతను భజించు గాక!. నాకు ముందు, వెనుక, కుడి ఎడమలయందు, మూలలందు, మారుమూలలందు, జనార్దనుడుండు గాక!. అనంతుడు, అచ్యుతుడునగు విష్ణునకు ప్రణతుడైనవానికి ఎట్టి కష్టాలు కలుగవు. దుఃఖితుడు కాడు. బ్రహ్మ ఏ విధంగా శ్రేష్ఠుడో అదే విధంగా శ్రీమహావిష్ణువు కూడా శ్రేష్ఠుడే. అతడే పరబ్రహ్మ. జగత్స్వరూపి కూడా విష్ణువే. అత్యంతవిశ్వాసంతో సత్యంగా అచ్యుతనామస్మరణచేసినందున నా త్రివిధాలైన అమంగళాలు నశించుగాక!.

ఇత్యసావాత్మరక్షార్థం కృత్వా వై విష్ణుపంజరమ్ ।
సంస్థితోఽసావపి బలీ రాక్షసః సముపాద్రవత్ ॥22॥

తతో ద్విజనియుక్తాయాం రక్షాయాం రజనీచరః ।
నిర్ధూతవేగః సహసా తస్థౌ మాసచతుష్టయమ్ ॥23॥

ఈ విధంగా విష్ణుపంజరస్తోత్రం ద్వారా ఆత్మరక్ష గావించుకొని, ఆసీనుడైన ఆ తపస్వి మీదకు ఆ రాక్షసుడు లంఘించాడు. అయితే ఆ ద్విజుడు గావించుకున్న విష్ణుపంజరరక్షణ ప్రభావం వల్ల ఆ రాక్షసుని శక్తి వేగాలన్నీ ఉడిగిపోయి, అతడట్లే నాల్గు నెలల కాలం అక్కడే నిలబడిపోయాడు.

యావద్ద్విజస్య దేవర్షే సమాప్తిర్వై సమాధితః ।
జాతే జప్యావసానేఽసౌ తం దదర్శ నిశాచరమ్ ॥24॥

దీనం హతబలోత్సాహం కాందిశీకం హతౌజసమ్ ।
తం దృష్ట్వా కృపయావిష్టః సమాశ్వాస్య నిశాచరమ్ ॥25॥

పప్రచ్ఛాగమనే హేతుం స చాచష్ట యథాతథమ్ ।
స్వభావమాత్మనో ద్రష్టుం రక్షయా తేజసః క్షితిమ్ ॥26॥

కథయిత్వా చ తద్రక్షః కారణం వివిధం తతః ।
ప్రసీదేత్యబ్రవీద్విప్రం నిర్విణ్ణః స్వేన కర్మణా ॥27॥

ఓ నారదమహర్షీ! జపానంతరం సమాధి ముగిసిన తరువాత ద్విజోత్తముడు లేచి, ఎదురుగా తేజస్సు కోల్పోయి, దీనుడుగా, కాందిశీకుడుగా, అసహాయస్థితిలో నిలబడిన రాక్షసుని చూసి, వానిమీద జాలితో ఓదార్పు మాటలతో నీ రాకకు కారణమేమిటని అడిగాడు. అందులకా నిశాచరుడు తన వృత్తాంతమునంతటిని యథాతథంగా చెప్పాడు. వాస్తవమైన తన స్వభావాన్నీ, బ్రాహ్మణుని చూసినవెంటనే తన శక్తులన్నీ ఏ విధంగా నశించినదీ వివరంగా తెలియజేసి, దీనికి కారణం తెలియజేయవలసినదిగాను, తన నికృష్టమైన స్వభావం మీద విరక్తితోనున్న తనను కరుణించవలసినదిగాను ఆ బ్రాహ్మణుని ప్రార్థించాడు. అంతేగాక తన పాపకర్మలను గూర్చి ఇలా పలికాడు.

బహూని పాపాని మయా కృతాని బహవో హతాః ।
కృతాః స్త్రియో మయా బహ్వ్యో విధవాః పుత్రవర్జితాః ॥28॥

అనాగసాం చ సత్త్వానామల్పకానాం క్షయః కృతః ।
తస్మాత్పాపాదహం మోక్షమిచ్ఛామి త్వత్ప్రసాదతః ॥29॥

పాపప్రశమనాయాలం కురు మే ధర్మదేశనమ్ ।
పాపస్యాస్య క్షయకరముపదేశం ప్రయచ్ఛ మే ॥30॥

మహాత్మా! నా చేత చాలా పాపాలు చేయబడ్డాయి. అనేకమంది చంపబడ్డారు. అనేకమంది స్త్రీలు నాచే వితంతువులుగా చేయబడ్డారు. పుత్రహీనులుగా చేయబడ్డారు. ఏ పాపమెరుగని అల్పప్రాణులనెన్నిటినో నేను వధించాను. అటువంటి నేను మీ దయవల్ల పాపాలనుండి ముక్తి పొందాలని కోరుకుంటున్నాను. నా పాపం ప్రశమనం పొందనిదే నాకు సంతృప్తి కలుగదు. కావున నా పాపం పూర్తిగా నశించే ధర్మమార్గాన్ని నాకు తెలియజేయండి. ఈ పాపమంతా నశించే ఉపదేశాన్ని నాకు ప్రసాదించండి.

తస్య తద్వచనం శ్రుత్వా రాక్షసస్య ద్విజోత్తమః ।
వచనం ప్రాహ ధర్మాత్మా హేతుమచ్చ సుభాషితమ్ ॥31॥

కథం క్రూరస్వభావస్య సతస్తవ నిశాచర ।
సహసైవ సమాయాతా జిజ్ఞాసా ధర్మవర్త్మని ॥32॥

రాక్షసుని ఈ పలుకులు విని, ద్విజోత్తముడు ఆశ్చర్యంతో సహేతుకమైన ఈ ప్రశ్నలను అడిగాడు. “ఓ నిశాచరా! ఇంతటి క్రూరస్వభావం కలిగిన నీకు అకస్మాత్తుగా ధర్మమార్గంలో పయనించాలనే జిజ్ఞాస ఎలా కలిగింది? ఇదెలా సంభవం?” అని బ్రాహ్మణుడు రాక్షసుని ప్రశ్నించాడు.

త్వాం వై సమాగతోఽస్మ్యద్య క్షిప్తోఽహం రక్షయా బలాత్ ।
తవ సంసర్గతో బ్రహ్మన్ జాతో నిర్వేద ఉత్తమః ॥33॥

కా సా రక్షా న తాం వేద్మి వేద్మి నాస్యాః పరాయణమ్ ।
యస్యాః సంసర్గమాసాద్య నిర్వేదం ప్రాపితం పరమ్ ॥34॥

త్వం కృపాం కురు ధర్మజ్ఞ మయ్యనుక్రోశమావహ ।
యథా పాపాపనోదో మే భవత్వార్య తథా కురు ॥35॥

ఓ బ్రాహ్మణోత్తమా! మిమ్ములను సమీపించగానే మీరు గావించిన రక్షాస్తోత్రాలు నన్ను నిర్వీర్యుణ్ణి చేశాయి. నా జవసత్వాలన్నీ నశించాయి. మీ సాంగత్యం నాలో నిజమైన నిర్వేదాన్ని, విరక్తిని కలిగించింది. ఆ రక్షా జపాలేవో వాటియందు నేను ఎలా పరాయణుడను కావాలో నాకు తెలియదు. కాని మీ సంసర్గమాత్రం చేతనే నాలో ఉత్తమ మైన నిర్వేదం కలిగింది. కాబట్టి ధర్మజ్ఞా! మీరు నాయందు దయ చూపండి. నా ఆవేదనను అవగాహన చేసికొని ఏ విధంగా చేస్తే నా పాపాలు తొలగిపోతాయో తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్తః స మునిస్తదా వై తేన రక్షసా ।
ప్రత్యువాచ మహాభాగో విమృశ్య సుచిరం మునిః ॥36॥

ఈ విధంగా రాక్షసుడు చేసిన దీనాలాపాలను వినిన మునిసత్తముడు దీర్ఘంగా అలోచించి, రాక్షసుడికిలా జవాబిచ్చాడు.

ఋషిరువాచ – మహర్షి పలికాడు.

యన్మామాహోపదేశార్థం నిర్విణ్ణః స్వేన కర్మణా ।
యుక్తమేతద్ధి పాపానాం నివృత్తిరుపకారికా ॥37॥

కరిష్యే యాతుధానానాం న త్వహం ధర్మదేశనమ్ ।
తాన్ సంపృచ్ఛ ద్విజాన్ సౌమ్య యే వై ప్రవచనే రతాః ॥38॥

"ఓ నిశాచరా! నీ నికృష్టజీవితమందు రోత కలిగి, పాపం పోయే మార్గముపదేశింపుమని నీవు కోరడం యుక్తమే. ఎందుకనగా పాపక్షయం జీవికి ఉపకారకమే గదా!. కానీ నేను నరభక్షకులైన రాక్షసులకు ధర్మోపదేశం చేయజాలను. కావున నీవు ధర్మోపదేశం కొరకు ప్రవచనపరులైన విప్రుల చెంతకు వెళ్ళి ప్రార్థింపుము".

ఏవముక్త్వా యయౌ విప్రశ్చింతామాప స రాక్షసః ।
కథం పాపాపనోదః స్యాదితి చింతాకులేంద్రియః ॥39॥

ఇలా పలికి బ్రాహ్మణోత్తముడు అచ్చటినుండి వెళ్ళిపోయాడు. దానితో తన పాపాలు ఎలా తొలగిపోతాయో గదా! అని రాక్షసుడు చింతాక్రాంతుడై ఆలోచింపసాగాడు.

న చఖాద స సత్త్వాని క్షుధా సంబాధితోఽపి సన్ ।
షష్ఠే షష్ఠే తదా కాలే జన్తుమేకమభక్షయత్ ॥40॥

స కదాచిత్ క్షుధావిష్టః పర్యటన్ విపులే వనే ।
దదర్శాథ ఫలాహారమాగతం బ్రహ్మచారిణమ్ ॥41॥

గృహీతో రక్షసా తేన స తదా మునిదారకః ।
నిరాశో జీవితే ప్రాహ సామపూర్వం నిశాచరమ్ ॥42॥

అట్లు చింతాక్రాంతుడైన రాక్షసుడు తాను ఆకలితో బాధపడుతున్నను, ఆకలిబాధను సహిస్తూ, ఆరురోజుల కొక పర్యాయం మాత్రమే ఏదో ఒక జంతువును చంపి తినసాగాడు. అతడావిధంగా ఆకలిబాధతో విశాలమైన అరణ్యప్రాంతంలో సంచరిస్తూ ఉండగా ఒకానొకమారు ఫలాహారం సేకరించుకోవడానికి వచ్చిన ఒక బ్రహ్మచారి రాక్షసుని కంటబడ్డాడు. వెంటనే ఆ రాక్షసుడు ఆ బ్రాహ్మణబాలుని గట్టిగా పట్టుకొనగా ఆ బ్రహ్మచారి తనకు మరణం నిశ్చయమని భావించి మృదువుగా సామవచనాలతో రాక్షసుడికిలా చెప్పసాగాడు.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు పలికాడు.

భో భద్ర బ్రూహి యత్కార్యం గృహీతో యేన హేతునా ।
తదనుబ్రూహి భద్రం తే అయమస్మ్యనుశాధి మామ్ ॥43॥

అయ్యా! నీకు భద్రమగు గాక! నీవు నన్ను ఎందుకొరకు పట్టుకున్నావో నాకు చెప్పుము. నేను నీ కొరకు ఏమి చేయాలో ఆదేశింపుము.

రాక్షస ఉవాచ – రాక్షసుడు పలికాడు.

షష్ఠే కాలే త్వమాహారః క్షుధితస్య సమాగతః ।
నిఃశ్రీకస్యాతిపాపస్య నిర్ఘృణస్య ద్విజద్రుహః ॥44॥

బ్రాహ్మణబాలకా! ఆరురోజుల నుండి ఆహారం లేకపోవడంచే ఆకలితో బాధపడుతున్న నాకు నీవు లభించావు. నేను నికృష్టుడను. ఘోరపాపిని, దాక్షిణ్యంలేని క్రూరుణ్ణి. బ్రాహ్మణద్రోహిని.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు పలికాడు.

యద్యవశ్యం త్వయా చాహం భక్షితవ్యో నిశాచర ।
ఆయాస్యామి తవాద్యైవ నివేద్య గురవే ఫలమ్ ॥45॥

గుర్వర్థమేతదాగత్య యత్ఫలగ్రహణం కృతమ్ ।
మమాత్ర నిష్ఠా ప్రాప్తస్య ఫలాని వినివేదితుమ్ ॥46॥

స త్వం ముహూర్తమాత్రం మామత్రైవ ప్రతిపాలయ ।
నివేద్య గురవే యావదిహాగచ్ఛామ్యహం ఫలమ్ ॥47॥

ఓ నిశాచరా! నీవు నన్ను తప్పనిసరిగా భక్షింపదలచినచో నేనీ ఫలాలను మా గురుదేవునకు సమర్పించి, వెంటనే వస్తాను. గురువుగారి కొరకే నేనిచ్చటికి వచ్చి, ఈ ఫలాలను సేకరించాను. కాబట్టి గురువుగారి కొరకు

లభించిన ఫలాలు గురువుగారికి సమర్పించడమే నా ధర్మం. అదియే నా వ్రతం. కాబట్టి ఈ ఫలాలను గురువుగారికి సమర్పించి క్షణకాలంలో తిరిగి నేనిక్కడికి వస్తాను. ఒక్క క్షణకాలం నీవు నాకొరకు ఇక్కడేయుండి ఎదురు చూడుము.

రాక్షస ఉవాచ – రాక్షసుడు పలికాడు.

షష్ఠే కాలే న మే బ్రహ్మన్ కశ్చిద్గ్రహణమాగతః ।
ప్రతిముచ్యేత దేవోఽపి ఇతి మే పాపజీవికా ॥48॥

ఏక ఏవాత్ర మోక్షస్య తవ హేతుః శృణుష్వ తత్ ।
ముంచామ్యహమసందిగ్ధం యది తత్కురుతే భవాన్ ॥49॥

ఓ బ్రాహ్మణోత్తమా! ఆరురోజుల తర్వాత లభించిన జంతువేదైనా సరే, దేవుడైనా సరే నేను తినకుండా వదలను. ఇది నా పాపిష్ఠిజీవితచర్యానియమం. ఒకవేళ నీవు ఇప్పుడు నా నుండి తప్పించుకోవాలని భావిస్తే ఒకే ఒక మార్గమున్నది. అది నీవు చేసినట్లయితే నిస్సందేహంగా నిన్ను నేను వదిలేస్తాను.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు పలికాడు.

గురోర్యన్న విరోధాయ యన్న ధర్మోపరోధకమ్ ।
తత్కరిష్యామ్యహం రక్షో యన్న వ్రతహరం మమ ॥50॥

ఓ నిశాచరా! గురువచనానికి, ధర్మమార్గానికి, నా వ్రతనియమానికి, భంగం కానిదేదైనా నేను విధిగా చేస్తాను.

రాక్షస ఉవాచ – రాక్షసుడు పలికాడు.

మయా నిసర్గతో బ్రహ్మన్ జాతిదోషాద్విశేషతః ।
నిర్వివేకేన చిత్తేన పాపకర్మ సదా కృతమ్ ॥51॥

ఆబాల్యాన్మమ పాపేషు న ధర్మేషు రతం మనః ।
తత్పాపసంక్షయాన్మోక్షం ప్రాప్నుయాం యేన తద్వద ॥52॥

యాని పాపాని కర్మాణి బాలత్వాచ్చరితాని చ ।
దుష్టాం యోనిమిమాం ప్రాప్య తన్ముక్తిం కథయ ద్విజ ॥53॥

యద్యేతద్ద్విజపుత్ర త్వం సమాఖ్యాస్యస్యశేషతః ।
తతః క్షుధార్తాన్మత్తస్త్వం నియతం మోక్షమాప్స్యసి ॥54॥

న చేతత్పాపశీలోఽహమత్యర్థం క్షుత్పిపాసితః ।
షష్ఠే కాలే నృశంసాత్మా భక్షయిష్యామి నిర్ఘృణః ॥55॥

బ్రహ్మన్! నా స్వభావం కారణంగాను, విశేషించి రాక్షసజాతిదోషకారణంగాను, వివేకం లేని చిత్తంతో సర్వదా నేను పాపకార్యాలు చేశాను. పుట్టినది మొదలు పాపకార్యాలయందే నా మనస్సు లగ్నమయ్యింది.

ధర్మాచరణమందు ఎన్నడు నా మనస్సు లగ్నం కాలేదు. ఆ విధంగా నాకు కలిగిన పాపాలనుండి విముక్తి ఏ విధంగా కలుగుతుందో నాకు తెలియజేయి. ఓ ద్విజోత్తమా! ఈ దుష్టరాక్షసజన్మను పొంది, బాల్యం నుండి నేనాచరించిన అనేకములైన పాపాలనుండి నాకు విముక్తి ఏ విధంగా కలుగుతుందో చెప్పు. ఓ బ్రాహ్మణ బాలకా! నా పాపాలు నిశ్శేషంగా నశించే ఉపాయం చెప్పినచో నేనెంతటి ఆకలినైనా ఓర్చుకుని నిన్ను నిశ్చయంగా వదలుతాను. లేకపోయినచో మిక్కిలి ఆకలిదప్పికలతో బాధపడుతున్న పాపాచారుడనైన, నిర్దయుడనైన నేను ఈ ఆరవరోజున లభించిన నిన్ను తప్పనిసరిగా తినేస్తాను.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏవముక్తో మునిసుతస్తేన ఘోరేణ రక్షసా ।
చింతామవాప మహతీమశక్తస్తదుదీరణే ॥56॥

స విమృశ్య చిరం విప్రః శరణం జాతవేదసమ్ ।
జగామ జ్ఞానదానాయ సంశయం పరమం గతః ॥57॥

యది శుశ్రూషితో వహ్నిర్గురుశుశ్రూషణాదను ।
వ్రతాని వా సుచీర్ణాని సప్తార్చిః పాతు మాం తతః ॥58॥

న మాతరం న పితరం గౌరవేణ యథా గురుమ్ ।
సర్వదైవాదవగచ్ఛామి తథా మాం పాతు పావకః ॥59॥

యథా గురుం న మనసా కర్మణా వచసాఽపి వా ।
అవజానామ్యహం తేన పాతు సత్యేన పావకః ॥60॥

ఇత్యేవం మనసా సత్యాన్ కుర్వతః శపథాన్ పునః ।
సప్తార్చిషా సమాదిష్టా ప్రాదురాసీత్ సరస్వతీ ॥61॥

ఆ క్రూరరాక్షసునకు కావలసిన తరణోపాయం చెప్పడానికి ఏమీ తోచక ఆ బ్రహ్మచారి గొప్ప విషాదానికి లోనై, చాలాసేపు ఆలోచించి, చేసేదేమీ లేక అగ్నిదేవునకు శరణాగతుడై, తగిన జ్ఞానమిమ్మని అర్థించాడు. అగ్నిని ఇలా ప్రార్థించాడు. "గురుశుశ్రూష తర్వాత శ్రద్ధతో అగ్నిదేవుని సేవించినవాడనైతే పావకుడు నన్ను రక్షించుగాక!, బ్రహ్మచర్యాది వ్రతాలు చక్కగా నిర్వర్తించినవాడనైతే పావకుడు నన్ను రక్షించుగాక!. నేను తల్లిదండ్రులను, గురువులను అగౌరవంతో చూడనివాడనైతే అగ్నిదేవుడు నన్ను రక్షించుగాక!. మనోవాక్కాయకర్మలలో గురువు పట్ల అనాదరం లేనివాడననేది సత్యమైతే ఆ సత్యప్రభావంవల్ల పావకుడు నన్ను కాపాడుగాక!. నేను చెప్పినవన్నీ సత్యాలైతే ఆ సత్యబలం వల్ల పావకుడు నన్ను కాపాడుగాక!". ఈ విధంగా మనస్సులోనే మునికుమారుడు సత్యశపథాలు చేసినంతనే అగ్నిదేవుని ఆదేశానుసారం సరస్వతీదేవి ఆ మునికుమారుని ఎదుట ప్రత్యక్షమయ్యింది.

సా ప్రోవాచ ద్విజసుతం రాక్షసగ్రహణాకులమ్ ।
మాభైర్ద్విజసుతాహం త్వాం మోక్షయిష్యామి సంకటాత్ ॥62॥

యదస్య రక్షసః శ్రేయో జిహ్వాగ్రే సంస్థితా తవ ।
తత్సర్వం కథయిష్యామి తతో మోక్షమవాప్స్యసి ॥63॥

అదృశ్యా రక్షసా తేన ప్రోక్త్వేత్థం సా సరస్వతీ ।
అదర్శనం గతా సోఽపి ద్విజః ప్రాహ నిశాచరమ్ ॥64॥

రాక్షసుడు పట్టుకోవడంతో వ్యాకులుడైన బ్రాహ్మణబాలునితో సరస్వతీదేవి ఇలా పలికింది. "ఓ బ్రాహ్మణ పుత్రా! నీవు భయపడవలదు. నేను నీకు ఈ ఆపదనుండి విముక్తిని కలిగిస్తాను. నేను నీయొక్క జిహ్వాగ్రంలో నిలచి, ఈ రాక్షసునకు శ్రేయోదాయకమైన విషయాలనన్నిటిని చెప్పిన తరువాత నీవు ముక్తుడవౌతావు". రాక్షసునకు కనబడకుండా ఉండి, బ్రాహ్మణపుత్రునితో సరస్వతీదేవి ఇలా పలికిన తరువాత అంతర్ధానమయ్యింది. తదనంతరం బ్రాహ్మణబాలుడు నిశాచరునితో ఇలా పలికాడు.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు పలికాడు.

శ్రూయతాం తవ యచ్ఛ్రేయస్తథాఽన్యేషాం చ పాపినామ్ ।
సమస్తపాపశుద్ధ్యర్థం పుణ్యోపచయదం చ యత్ ॥65॥

ఓ రాక్షసేంద్రా! నీకు, నీవంటి పాపులకు శ్రేయస్సు కలుగజేసేదీ, పాపాలను పోగొట్టేదీ, పుణ్యాన్ని కలుగజేసేదీయైన విధానం చెబుతున్నాను విను.

ప్రాతరుత్థాయ జప్తవ్యం మధ్యాహ్నేఽహ్నః క్షయేఽపి వా ।
అసంశయం సదా జప్యో జపతాం పుష్టిశాంతిదః ॥66॥

ప్రాతఃకాలంలో నిద్ర లేచి, ప్రాతఃసంధ్యలోను, మధ్యాహ్నంలోను, సాయాహ్నంలోను, జపింపదగిన ఈ స్తోత్రాన్ని ఎల్లప్పుడూ జపించాలి. ఈ స్తోత్రాన్ని జపించేవారికి నిస్సంశయంగా ఈ స్తోత్రం శాంతిని, పుష్టిని కలిగిస్తుంది.

ఓం హరిం కృష్ణం హృషీకేశం వాసుదేవం జనార్దనమ్ ।
ప్రణతోఽస్మి జగన్నాథం స మే పాపం వ్యపోహతు ॥67॥

ఓంకారస్వరూపునకు, శ్రీహరికి, శ్రీకృష్ణునకు, హృషీకేశునకు, వాసుదేవునకు, జనార్దనునకు జగన్నాథునకు నమస్కరిస్తున్నాను. ఆయన నా పాపం పోగొట్టుగాక!.

చరాచరగురుం నాథం గోవిందం శేషశాయినమ్ ।
ప్రణతోఽస్మి పరం దేవం స మే పాపం వ్యపోహతు ॥68॥

చరాచరజగత్తునకు గురువు, నాథుడు, శేషశయ్యపై విరాజమానుడు, పరమదేవుడునైన గోవిందునకు నమస్కరిస్తున్నాను. ఆ పరాత్పరుడు నా పాపం పోగొట్టుగాక!.

శంఖినం చక్రిణం శార్ఙ్గధారిణం స్రగ్ధరం పరమ్ ।
ప్రణతోఽస్మి పతిం లక్ష్మ్యాః స మే పాపం వ్యపోహతు ॥69॥

శంఖాన్ని ధరించినవానికి, చక్రధారికి, శార్‌ఙ్గమును ధరించినవానికి, ఉత్తమమైన మాలాధారికి, లక్ష్మీపతికి, నేను ప్రణామాలు సమర్పిస్తున్నాను. ఆయన నా పాపం పోగొట్టుగాక!.

దామోదరముదారాక్షం పుండరీకాక్షమచ్యుతమ్ ।
ప్రణతోఽస్మి స్తుతం స్తుత్యైః స మే పాపం వ్యపోహతు ॥70॥

దామోదరునకు, ఉదారాక్షునకు, పుండరీకాక్షునకు, అచ్యుతునకు, స్తోత్రాలతో స్తుతింపబడినవానికి నేను నమస్కరిస్తున్నాను. ఆ అచ్యుతుడు నా పాపం పోగొట్టుగాక!.

నారాయణం నరం శౌరిం మాధవం మధుసూదనమ్ ।
ప్రణతోఽస్మి ధరాధారం స మే పాపం వ్యపోహతు ॥71॥

నారాయణునకు, నరునకు, శౌరికి, మాధవునకు, మధుసూదనునకు, భూమండలానికి ఆధారభూతుడైన వానికి నేను ప్రణామం చేస్తున్నాను. ఆ నారాయణుడు నా పాపాన్ని పోగొట్టుగాక!.

కేశవం చంద్రసూర్యాక్షం కంసకేశినిషూదనమ్ ।
ప్రణతోఽస్మి మహాబాహుం స మే పాపం వ్యపోహతు ॥72॥

కేశవునకు, సూర్యచంద్రులు నేత్రాలుగా కలవానికి, కంసుని, కేశిని సంహరించినవానికి, మహాబాహువునకు నమస్కరిస్తున్నాను. ఆ కేశవుడు నా పాపం పోగొట్టుగాక!.

శ్రీవత్సవక్షసం శ్రీశం శ్రీధరం శ్రీనికేతనమ్ ।
ప్రణతోఽస్మి శ్రియఃకాంతం స మే పాపం వ్యపోహతు ॥73॥

శ్రీవత్సం వక్షఃస్థలంలో ధరించినవానికి, శ్రీపతికి, శ్రీధరునకు, శ్రీనికేతనునకు, శ్రీకాంతునకు, ప్రణామాలు అర్పిస్తున్నాను. ఆ శ్రీపతియే నా పాపం పోగొట్టుగాక!.

యమీశం సర్వభూతానాం ధ్యాయన్తి యతయోఽక్షరమ్ ।
వాసుదేవమనిర్దేశ్యం తమస్మి శరణం గతః ॥74॥

యోగీశ్వరులు ధ్యానించే సర్వభూతేశ్వరునకు, నాశనం లేని వానికి, అనిర్దేశ్యస్వరూపియునైన వాసుదేవునకు శరణాగతుడనౌతున్నాను.

సమస్తాలంబనేభ్యో యం వ్యావృత్య మనసో గతిమ్ ।
ధ్యాయన్తి వాసుదేవాఖ్యం తమస్మి శరణం గతః ॥75॥

తమమనస్సుల నితరవిషయాలనుండి మళ్ళించి, ధ్యానించే వాసుదేవుడనే పరమాత్మకు శరణాగతుడ నౌతున్నాను.

సర్వగం సర్వభూతం చ సర్వస్యాధారమీశ్వరమ్ ।
వాసుదేవం పరం బ్రహ్మ తమస్మి శరణంగతః ॥76॥

సర్వగమనుడు, సర్వజీవులకు ఆధారభూతుడు, సమస్తజీవస్వరూపుడు, పరబ్రహ్మయునగు వాసుదేవునకు శరణాగతుడనౌతున్నాను.

పరమాత్మానమవ్యక్తం యం ప్రయాన్తి సుమేధసః ।
కర్మక్షయేఽక్షయం దేవం తమస్మి శరణం గతః ॥77॥

విజ్ఞులు తమ కర్మక్షయానంతరం ఏ పరమాత్మను, అవ్యక్తుని, అక్షయుని చేరుదురో అట్టి పరమాత్మునకు శరణాగతుడనౌతున్నాను.

పుణ్యపాపవినిర్ముక్తా యం ప్రవిశ్య పునర్భవమ్ ।
న యోగినః ప్రాప్నువన్తి తమస్మి శరణం గతః ॥78॥

యోగులు పుణ్యపాపవినిర్ముక్తులై ఏ ప్రభువును చేరి, పునర్జన్మరహితులగుచున్నారో అట్టి ప్రభువునకు శరణాగతుడనౌతున్నాను.

బ్రహ్మా భూత్వా జగత్సర్వం సదేవాసురమానుషమ్ ।
యః సృజత్యచ్యుతో దేవస్తమస్మి శరణం గతః ॥79॥

చతుర్ముఖబ్రహ్మరూపంలో దేవాసురమానుషసహితమైన జగత్తునంతటిని సృష్టించే అచ్యుతునకు శరణాగతుడనౌతున్నాను.

బ్రహ్మత్వే యస్య వక్త్రేభ్యశ్చతుర్వేదమయం వపుః ।
ప్రభుః పురాతనో జజ్ఞే తమస్మి శరణం గతః ॥80॥

బ్రహ్మరూపాన్ని ధరించిన ఏ పరబ్రహ్మ నోటినుండి చతుర్వేదాలు వెలువడ్డాయో అట్టి వేదపురుషునకు, పురాణపురుషునకు శరణాగతుడనౌతున్నాను.

బ్రహ్మరూపధరం దేవం జగద్యోనిం జనార్దనమ్ ।
స్రష్టృత్వే సంస్థితం సృష్టౌ ప్రణతోఽస్మి సనాతనమ్ ॥81॥

బ్రహ్మరూపాన్ని ధరించిన జగద్యోనికి, జనార్దనునకు, సనాతనునకు, సృష్టి చేయడానికి స్రష్టరూపంలో ఉన్నవానికి నమస్కరిస్తున్నాను.

స్రష్టా భూత్వా స్థితో యోగీ స్థితావసురసూదనః ।
తమాదిపురుషం విష్ణుం ప్రణతోఽస్మి జనార్దనమ్ ॥82॥

సృష్టికర్తయై, యోగిరూపంలో విద్యమానుడగుచు, స్థితికాలంలో రాక్షసులను నశింపజేయువాడును, ఆదిపురుషుడునునైన విష్ణునకు, జనార్దనునకు నమస్కరిస్తున్నాను.

ధృతా మహీ హతా దైత్యాః పరిత్రాతాస్తథా సురాః ।
యేన తం విష్ణుమాద్యేశం ప్రణతోఽస్మి జనార్దనమ్ ॥83॥

భూమినుద్ధరించి, దైత్యులను వధించి, దేవతలను రక్షించిన ఆదిప్రభువైన విష్ణువునకు, జనార్దనునకు, ప్రణతుడనౌతున్నాను.

యజ్ఞైర్యజన్తి యం విప్రా యజ్ఞేశం యజ్ఞభావనమ్ ।
తం యజ్ఞపురుషం విష్ణుం ప్రణతోఽస్మి సనాతనమ్ ॥84॥

విప్రులు ఏ దేవుని యజ్ఞాల ద్వారా ఆరాధిస్తారో, అట్టి యజ్ఞేశ్వరుడు, యజ్ఞభావనుడు, యజ్ఞపురుషుడు, సనాతనుడునగు విష్ణుదేవునకు ప్రణతుడనౌతున్నాను.

పాతాలవీధీభూతాని తథా లోకాన్నిహన్తి యః ।
తమన్తపురుషం రుద్రం ప్రణతోఽస్మి సనాతనమ్ ॥85॥

పాతాళవీధీభూతాలను, లోకాలను లయింపజేయు అంతకుడగు రుద్రునకు, సనాతనునకు నమస్కరిస్తున్నాను.

సంభక్షయిత్వా సకలం యథా సృష్టమిదం జగత్ ।
యో వై నృత్యతి రుద్రాత్మా ప్రణతోఽస్మి జనార్దనమ్ ॥86॥

సృష్టింపబడిన జగత్తునంతటిని భక్షించి, రుద్రరూపాన తాండవనృత్యం చేయు సనాతనుడగు జనార్దనునకు నమస్కరిస్తున్నాను.

సురాసురాః పితృగణాః యక్షగన్ధర్వరాక్షసాః ।
సంభూతా యస్య దేవస్య సర్వగం తం నమామ్యహమ్ ॥87॥

సురాసురులు, పితృగణాలు, దేవగన్ధర్వయక్షరాక్షసులు, ఏ ప్రభువునుండి ఉద్భవిస్తున్నారో అట్టి సర్వవ్యాపియైన సనాతనునకు నమస్కరిస్తున్నాను.

సమస్తదేవాః సకలా మనుష్యాణాం చ జాతయః ।
యస్యాంశభూతా దేవస్య సర్వగం తం నతోఽస్మ్యహమ్ ॥88॥

సమస్తదేవజాతులు, మానవజాతులు ఎవని అంశాలో అట్టి సర్వవ్యాపియైన పరమాత్మకు నమస్కరిస్తున్నాను.

వృక్షగుల్మాదయో యస్య తథా పశుమృగాదయః ।
ఏకాంశభూతా దేవస్య సర్వగం తం నమామ్యహమ్ ॥89॥

చెట్లు, చేమలు, పొదలు, పశుమృగాదులు, ఏ దేవుని అంశభూతాలో అట్టి సర్వవ్యాపియైన ఆదిదేవునకు నమస్సులు.

యస్మాన్నాన్యత్ పరం కించిద్యస్మిన్ సర్వం మహాత్మని ।
యః సర్వమధ్యగోఽనన్తః సర్వగం తం నమామ్యహమ్ ॥90॥

ఎవనికంటె ఇతరమైనది లేదో, ఏ మహాత్మునిలో అన్నీ ఇమిడియున్నాయో, ఎవడు అన్నిటికి మధ్యన, చివరన యుంటాడో, అనంతుడు, సర్వగుడునైనవాడెవడో అట్టి పరాత్పరునకు నమస్కరిస్తున్నాను.

యథా సర్వేషు భూతేషు గూఢోఽగ్నిరివ దారుషు ।
విష్ణురేవం తథా పాపం మమాశేషం ప్రణశ్యతు ॥91॥

కొయ్యలో అగ్ని నిగూఢమైయున్న విధంగా సమస్తప్రాణులందు అంతర్నిగూఢంగానున్న శ్రీమహావిష్ణువు నాయొక్క సమస్తపాపాలు నిశ్శేషంగా నశింపజేయుగాక!.

యథా విష్ణుమయం సర్వం బ్రహ్మాదిసచరాచరమ్ ।
యచ్చ జ్ఞానపరిచ్ఛేద్యం పాపం నశ్యతు మే తథా ॥92॥

బ్రహ్మాది చరాచరజగత్తంతయు విష్ణుమయమే. జ్ఞానమయమైనది, జ్ఞానగమ్యమైనది అంతయు ఆయన రూపమే. అట్టి ఆ మహనీయుడు నా పాపము నశింపజేయుగాక!.

శుభాశుభాని కర్మాణి రజఃసత్త్వతమాంసి చ ।
అనేకజన్మకర్మోత్థం పాపం నశ్యతు మే తథా ॥93॥

రజస్సత్త్వతమోగుణమయమైన నా జన్మ పరంపరలో శుభాశుభకర్మలవల్ల కలిగిన పాపమంతయు నశించుగాక!.

యన్నిశాయాం చ యత్ప్రాతర్యన్మధ్యాహ్నాపరాహ్ణయోః ।
సంధ్యయోశ్చ కృతం పాపం కర్మణా మనసా గిరా ॥94॥

యత్తిష్ఠతా యద్వ్రజతా యచ్చ శయ్యాగతేన మే ।
కృతం యదశుభం కర్మ కాయేన మనసా గిరా ॥95॥

అజ్ఞానతో జ్ఞానతో వా మదాచ్చలితమానసైః ।
తత్ క్షిప్రం విలయం యాతు వాసుదేవస్య కీర్తనాత్ ॥96॥

మనోవాక్కాయకర్మల ద్వారా రాత్రులందు, ప్రాతఃకాలములయందు, మధ్యాహ్నకాలములయందు, అపరాహ్నకాలములయందు, సంధ్యాకాలములయందు చేసిన పాపాలు, లేస్తూ, నడుస్తూ, శయనిస్తూ, త్రికరణాల ద్వారా చేసిన అశుభకర్మలు, తెలిసి చేసినట్టియు, తెలియక చేసినట్టియు మదాతిరేకంతో చలితమానసుడనై చేసినట్టియు, సమస్తపాపాలు వాసుదేవనామస్మరణమాత్రం చేతనే నశించిపోవుగాక!.

పరదారపరద్రవ్యవాంఛాద్రోహోద్భవం చ యత్ ।
పరపీడోద్భవాం నిందాం కుర్వతా యన్మహాత్మనామ్ ॥97॥

యచ్చ భోజ్యే తథా పేయే భక్ష్యే చోష్యే విలేహనే ।
తద్యాతు విలయం తోయే యథా లవణభాజనమ్ ॥98॥

పరస్త్రీ, పరధనములకాశించి, పరులకు ద్రోహం తల పెట్టి, పరహింసానిందలు గావించి, మహాత్ముల నవమానించి ఆర్జించిన పాపాలు, భక్ష్యపేయచోష్యలేహ్యాల ద్వారా కూడబెట్టిన పాపాలు, నీటిలో వేసిన ఉప్పు వలె కరిగిపోవుగాక!.

యద్బాల్యే యచ్చ కౌమారే యత్పాపం యౌవనే మమ ।
వయఃపరిణతౌ యచ్చ యచ్చ జన్మాన్తరే కృతమ్ ॥99॥

తన్నారాయణ గోవింద హరి కృష్ణేశ కీర్తనాత్ ।
ప్రయాతు విలయం తోయే యథా లవణభాజనమ్ ॥100॥

బాల్యకౌమారయౌవనవార్ధక్యాలలోను, జన్మజన్మాన్తరాలలోను నేను చేసిన పాపసమూహం నారాయణ, గోవింద, హరి, కృష్ణ, ఈశ్వర నామసంకీర్తనం వలన నీటిపాత్రలోని లవణం వలె కరగిపోవుగాక!.

విష్ణవే వాసుదేవాయ హరయే కేశవాయ చ ।
జనార్దనాయ కృష్ణాయ నమో భూయో నమో నమః ॥101॥

వాసుదేవా! విష్ణూ! హరీ! కేశవా! జనార్దనా! కృష్ణా! నీకు అనేకమార్లు నమస్కరిస్తున్నాను.

భవిష్యన్నరకఘ్నాయ నమః కంసవిఘాతినే ।
అరిష్టకేశిచాణూరదేవారిక్షయిణే నమః ॥102॥

భవిష్యత్తులో కలగబోయే నరకాన్ని తొలగించువానికి నమస్కారం. కంసుని సంహరించినవానికి, అరిష్ట, కేశి, చాణూరాది రాక్షసులను నశింపజేసినవానికి నమస్సులు.

కోఽన్యో బలేర్వంచయితా త్వామృతే వై భవిష్యతి ।
కోఽన్యో నాశయతి బలాద్దర్పం హైహయభూపతేః ॥103॥

నీవు దక్క బలిని వంచింపగలవాడెవ్వడు? నీవు దక్క హైహయనరపతియైన కార్తవీర్యుని బాహుబల దర్పాలనణచగలిగిన ప్రభువెవ్వడు?

కః కరిష్యత్యథాఽన్యో వై సాగరే సేతుబంధనమ్ ।
వధిష్యతి దశగ్రీవం కః సామాత్యపురఃసరమ్ ॥104॥

మధుసూదనా! సాగరానికి సేతుబంధనం గావించి, మంత్రిపరివారసైన్యసమేతంగా రావణుని వధింపగల వాడు నీవుతక్క వేరెవరున్నారు?

కస్త్వామృతేఽన్యో నందస్య గోకులే రతిమేష్యతి ।
ప్రలంబపూతనాదీనాం త్వామృతే మధుసూదన ।
నిహన్తాఽప్యథవా శాస్తా దేవదేవ భవిష్యతి ॥105॥

మధుసూదనా! నీవు తక్క మరెవ్వరు నందగోకులంలో విహరిస్తూ ప్రలంబాసురపూతనాది రాక్షసులను వధింపగలరు?. దేవదేవా! నీకంటే రాక్షసులను అదుపాజ్ఞలలో పెట్టగలవారెవ్వరు?.

జపన్నేవం నరః పుణ్యం వైష్ణవం ధర్మముత్తమమ్ ।
ఇష్టానిష్టప్రసంగేభ్యో జ్ఞానతోஉజ్ఞానతోஉపి వా ॥106॥

కృతం తేన తు యత్పాపం సప్తజన్మాంతరాణి వై ।
మహాపాతకసంజ్ఞం వా తథా చైవోపపాతకమ్ ॥107॥

కష్టాలలోను, సుఖాలలోను, ఈ విధంగా పవిత్రములు, పుణ్యప్రదములు, ఉత్తమధర్మమునైన విష్ణుని గుణగణాలు కీర్తిస్తే మానవుడు తెలిసిగాని, తెలియకగాని, ఏడుజన్మలలో చేసిన మహాపాతకాలు, ఉపపాతకాలు నశించిపోతాయి.

యజ్ఞాదీని చ పుణ్యాని జపహోమవ్రతాని చ ।
నాశయేద్యోగినాం సర్వమామపాత్రమివాంభసి ॥108॥

యజ్ఞాలు, జపహోమవ్రతాలు, తపోనిష్ఠ, మున్నగువాటిలో మునిగియుండే యోగులు తమ పాపపుణ్య ఫలాలనన్నిటిని ఈ స్తోత్రం ద్వారా నీటిలో పడవేసిన పచ్చికుండ వలె నశింపజేసుకుంటారు.

నరః సంవత్సరం పూర్ణం తిలపాత్రాణి షోడశ ।
అహన్యహని యో దద్యాత్ పఠత్యేతచ్చ తత్సమమ్ ॥109॥

సంవత్సర కాలం ప్రతినిత్యం పదహారుపాత్రలతో నువ్వులు దానం చేసిన ఫలంతో సమానమైన ఫలం ఈ స్తోత్రం ఒక పర్యాయం పఠిస్తే లభిస్తుంది.

అవిలుప్తబ్రహ్మచర్యం సంప్రాప్య స్మరణం హరేః ।
విష్ణులోకమవాప్నోతి సత్యమేతన్మయోదితమ్ ॥110॥

యథైతత్ సత్యముక్తం మే న హ్యల్పమపి మే మృషా ।
రాక్షసస్త్రస్తసర్వాఙ్గం తథా మామేష ముంచతు ॥111॥

బ్రహ్మచర్యదీక్ష చెడిపోకుండా ఈ స్తోత్రంతో హరిస్మరణ చేసినవాడు విష్ణులోకం పొందుతాడు. ఇది నిజం. నేను చెప్పినదంతా యథార్థమైతే ఇందులో లేశమాత్రమైనా అసత్యం లేకపోయినట్లైతే భయంతో ఒణికిపోతున్న నా సర్వాంగాలను ఈ రాక్షసుడు వదలివేయుగాక!.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏవముచ్చారితే తేన ముక్తో విప్రస్తు రక్షసా ।
అకామేన ద్విజో భూయస్తమాహ రజనీచరమ్ ॥112॥

నారదా! బ్రాహ్మణబాలుడు అలా పలుకగానే రాక్షసుని బంధం నుండి అతడు విముక్తుడయ్యాడు. ముక్తుడైన బ్రాహ్మణబాలుడు ఎటువంటి కోరిక లేకుండానే రాక్షసునితో ఇలా పలికాడు.

బ్రాహ్మణ ఉవాచ – బ్రాహ్మణుడు పలికాడు.

ఏతద్భద్ర మయాఖ్యాతం తవ పాతకనాశనమ్ ।
విష్ణోః సారస్వతం స్తోత్రం యజ్జగాద సరస్వతీ ॥113॥

హుతాశనేన ప్రహితా మమ జిహ్వాగ్రసంస్థితా ।
జగాదైనం స్తవం విష్ణోః సర్వేషాం చోపశాన్తిదమ్ ॥114॥

అనేనైవ జగన్నాథం త్వమారాధయ కేశవమ్ ।
తతః శాపాపనోదం తు స్తుతే లప్స్యసి కేశవే ॥115॥

అహర్నిశం హృషీకేశం స్తవేనానేన రాక్షస ।
స్తుహి భక్తిం దృఢాం కృత్వా తతః పాపాద్విమోక్ష్యసే ॥116॥

స్తుతో హి సర్వపాపాని నాశయిష్యత్యసంశయమ్ ।
స్తుతో హి భక్త్యా నృణాం వై సర్వపాపహరో హరిః ॥117॥

నిశాచరా! భద్రా! నేను నీకు తెలియజేసిన సర్వపాతకనాశకమైన ఈ సారస్వతవిష్ణుస్తోత్రం సరస్వతీదేవిచే చెప్పబడింది. అగ్నిహోత్రుని ఆదేశానుసారం సరస్వతీదేవి నా జిహ్వాగ్రంలో నిలచి, సమస్తమానవులకు శాంతిని కలిగించే ఈ విష్ణుస్తోత్రాన్ని వినిపించింది. నీవు ఈ స్తోత్రంతోనే జగన్నాథుడైన కేశవుని ఆరాధించు. తదనంతరం కేశవుని స్తుతించినచో నీవు శాపవిముక్తుడవు కాగలవు. ఓ రాక్షసా! నీవు దృఢమైన భక్తితో ఈ స్తోత్రంతో రాత్రింబవళ్ళు హృషీకేశుని స్తుతించు. తద్వారా నీవు పాపాలనుండి విముక్తుడవు కాగలవు. ఈ స్తోత్రమే సమస్తపాపాలను నశింపజేస్తుంది. ఇందులో సందేహం లేదు. భక్తితో ఏ మానవుడు శ్రీహరిని ఈ స్తోత్రంతో స్తుతిస్తాడో అట్టిమానవుని సమస్తపాపాలను శ్రీహరి హరింపజేస్తాడు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తతః ప్రణమ్య తం విప్రం ప్రసాద్య స నిశాచరః ।
తదైవ తపసే శ్రీమాన్ శాలగ్రామమగాద్వశీ ॥118॥

నారదా! అంతట రాక్షసుడు బ్రాహ్మణునకు మ్రొక్కి ప్రసన్నుని గావించుకొని, తక్షణమే శాలగ్రామ క్షేత్రంలో తపస్సు చేసేందుకు వెళ్ళాడు.

అహర్నిశం స ఏవైనం జపన్ సారస్వతం స్తవమ్ ।
దేవక్రియారతిర్భూత్వా తపస్తేపే నిశాచరః ॥119॥

ఆ నిశాచరుడు ఇంద్రియాలను అదుపులో నుంచుకొని, రాత్రింబవళ్ళు సారస్వతస్తోత్రాన్ని జపిస్తూ, అత్యధికమైన ప్రీతితో దేవకార్యాలు నెరవేర్చుకుంటూ జగన్నాథుని గూర్చి తపస్సు చేశాడు.

సమారాధ్య జగన్నాథం స తత్ర పురుషోత్తమమ్ ।
సర్వపాపవినిర్ముక్తో విష్ణులోకమవాప్తవాన్ ॥120॥

ఆ రాక్షసుడు శాలగ్రామక్షేత్రంలో పురుషోత్తముడైన జగన్నాథుని చక్కగా ఆరాధించి సర్వపాప వినిర్ముక్తుడై, విష్ణులోకాన్ని పొందాడు.

ఏతత్తే కథితం బ్రహ్మన్ విష్ణోః సారస్వతం స్తవమ్ ।
విప్రవక్త్రస్థయా సమ్యక్ సరస్వత్యా సమీరితమ్ ॥121॥

య ఏతత్పరమం స్తోత్రం వాసుదేవస్య మానవః ।
పఠిష్యతి స సర్వేభ్యః పాపేభ్యో మోక్షమాప్స్యతి ॥122॥

ఓ నారదా! బ్రహ్మన్! బ్రాహ్మణజిహ్వాగ్రంలో వసించి, సరస్వతీదేవి ప్రవచించిన సారస్వతవిష్ణుస్తోత్రాన్ని నీకు వివరించాను. వాసుదేవుని ఉత్తమోత్తమమైన ఈ స్తవాన్ని పఠించిన మానవుడు సర్వపాపాలనుండి విముక్తుడై, మోక్షాన్ని పొందగలడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే సారస్వతస్తోత్రం నామ షడశీతితమోఽధ్యాయః ॥86॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో సారస్వతస్తోత్రమనే ఎనబైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తాశీతితమోఽధ్యాయః - ఎనబైఏడవ అధ్యాయం

పాపప్రశమనస్తోత్రమ్ - పాపప్రశమనస్తోత్రం

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

నమస్తేఽస్తు జగన్నాథ దేవదేవ నమోఽస్తు తే ।
వాసుదేవ నమస్తేఽస్తు బహురూప నమోఽస్తు తే ॥1॥

ఓ జగన్నాథా! నీకు నమస్సులు. దేవదేవా! నీకు నమస్కారం. వాసుదేవా! నీకు ప్రణామం. బహురూపా! నీకు నమస్సులు.

ఏకశృంగ నమస్తుభ్యం నమస్తుభ్యం వృషాకపే ।
శ్రీనివాస నమస్తేఽస్తు నమస్తే భూతభావన ॥2॥

ఏకశృంగా! నీకు నమస్కారం. వృషాకపీ! నీకు నమస్కారం. శ్రీనివాసా! నీకు నమస్సులు. భూతభావనా! నీకు ప్రణామం.

విష్వక్సేన నమస్తుభ్యం నారాయణ నమోఽస్తు తే ।
ధ్రువధ్వజ నమస్తేఽస్తు సత్యధ్వజ నమోఽస్తు తే ॥3॥

విష్వక్సేనా! నీకు నమస్కారం. నారాయణా! నీకు నమస్సులు. ధ్రువధ్వజా! నీకు వందనములు. సత్యధ్వజా! నీకు ప్రణామం.

యజ్ఞధ్వజ నమస్తుభ్యం ధర్మధ్వజ నమోఽస్తు తే ।
తాలధ్వజ నమస్తేఽస్తు నమస్తే గరుడధ్వజ ॥4॥

యజ్ఞధ్వజా! నీకు నమస్కారం. ధర్మధ్వజా! నీకు నమస్సులు. తాలధ్వజా! నీకు నమస్కారం. గరుడధ్వజా! నీకు ప్రణామం.

వరేణ్య విష్ణో వైకుంఠ నమస్తే పురుషోత్తమ ।
నమో జయన్త విజయ జయానన్త పరాజిత ॥5॥

సర్వోత్తమా!, విష్ణూ!, వైకుంఠా!, పురుషోత్తమా! నీకు నమస్కారం. జయన్తా!, విజయా!, జయా!, అనంతా!, పరాజితా! నీకు నమస్కారం.

కృతావర్త మహావర్త మహాదేవ నమోఽస్తు తే ।
అనాద్యాద్యన్త మధ్యాంత నమస్తే పద్మజప్రియ ॥6॥

ఓ కృతావర్తా!, ఓ మహావర్తా!, ఓ మహాదేవా! నీకు నమస్సులు. ఓ అనాదీ!, ఆద్యన్తాలలో విద్యమానుడా!, ఓ మధ్యాన్తా!, ఓ పద్మజప్రియా! నీకు నమస్కారం.

పురంజయ నమస్తుభ్యం శత్రుంజయ నమోఽస్తు తే ।
శుభంజయ నమస్తేఽస్తు నమస్తేఽస్తు ధనంజయ ॥7॥

ఓ పురంజయా! నీకు నమస్కారం. ఓ శత్రుంజయా! నీకు ప్రణామం. ఓ శుభంజయా! నీకు నమస్సులు. ఓ ధనంజయా! నీకు వందనాలు.

సృష్టిగర్భ నమస్తుభ్యం శుచిశ్రవః పృథుశ్రవః ।
నమో హిరణ్యగర్భాయ పద్మగర్భాయ తే నమః ॥8॥

సృష్టినంతటిని నీయందే సురక్షితంగా రక్షించు సృష్టిగర్భా! నీకు నమస్కారం. శ్రవణమాత్రంతోనే పవిత్రుని చేయు ఓ శుచిశ్రవా! ఆర్తజనుల ఆర్తిని విశాలమైన చెవులతో వినే పృథుశ్రవా! నీకు నమస్కారం. హిరణ్యగర్భుడవు, పద్మగర్భుడవునైన నీకు నమస్కారం.

నమః కమలనేత్రాయ కాలనేత్రాయ తే నమః ।
కాలనాభ నమస్తుభ్యం మహానాభ నమో నమః ॥9॥

పద్మనేత్రునకు నమస్సులు. కాలనేత్రుడవైన నీకు నమస్కారం. ఓ కాలనాభా! నీకు నమస్సులు. ఓ మహానాభా! నీకు మాటిమాటికి నమస్కరిస్తున్నాను.

వృష్టిమూల మహామూల మూలావాస నమోఽస్తు తే ।
ధర్మవాస జలావాస శ్రీనివాస నమోఽస్తు తే ॥10॥

ఓ వృష్టిమూలా!, మహామూలా!, మూలావాసా! నీకు నమస్సులు. ఓ ధర్మవాసా!, ఓ జలావాసా!, ఓ శ్రీనివాసా! నీకు నమస్కారం.

ధర్మాధ్యక్ష ప్రజాధ్యక్ష లోకాధ్యక్ష నమో నమః ।
సేనాధ్యక్ష నమస్తుభ్యం కాలాధ్యక్ష నమోఽస్తు తే ॥11॥

ఓ ధర్మాధ్యక్షా!, ప్రజాధ్యక్షా!, లోకాధ్యక్షా! నీకు మాటిమాటికి నమస్కారం. ఓసేనాధ్యక్షా! నీకు నమస్సులు. ఓ కాలాధ్యక్షా! నీకు నమస్సులు.

గదాధర శ్రుతిధర చక్రధారిన్ శ్రియోధర ।
వనమాలాధర హరే నమస్తే ధరణీధర ॥12॥

ఓ గదాధరా!, ఓ శ్రుతిధరా!, ఓ చక్రధరా!, ఓ శ్రీధరా!, ఓ వనమాలాధరా!, ఓ ధరణీధరా! ఓ హరీ! నీకు నమస్కారం.

ఆర్చిషేణ మహాసేన నమస్తేఽస్తు పురుష్టుత ।
బహుకల్ప మహాకల్ప నమస్తే కల్పనాముఖ ॥13॥

గొప్ప వెలుగుతో నిండిన అర్చిషేణా!, మహాసేనాస్వరూపీ!, గొప్పగా కీర్తింపబడువాడా!, బహుకల్ప మహాకల్ప సమస్తకల్పనలకు ప్రధానుడా! నీకు నమస్సులు.

సర్వాత్మన్ సర్వగ విభో విరించే శ్వేతకేశవ ।
నీలరక్త మహానీల అనిరుద్ధ నమోఽస్తు తే ॥14॥

ఓ సర్వాత్మా!, ఓ సర్వగా!, ఓ విభో!, ఓ విరించీ!, ఓ శ్వేతా!, ఓ కేశవా!, ఓ నీలా!, ఓ రక్తా!, ఓ మహానీలా!, ఓ అనిరుద్ధా! నీకు నమస్కారం.

ద్వాదశాత్మక కాలాత్మన్ సామాత్మన్ పరమాత్మక ।
వ్యోమకాత్మక సుబ్రహ్మన్ భూతాత్మక నమోఽస్తు తే ॥15॥

ద్వాదశాదిత్యులను గర్భమునందుంచుకొనిన కాలస్వరూపా!, సామవేదస్వరూపా!, పరమాత్మా!, ఆకాశరూపా!, మంగళకరమగు ఉన్నతతత్త్వమా!, సర్వజీవాత్మకా! నీకు నమస్కారం.

హరికేశ మహాకేశ గుడాకేశ నమోఽస్తు తే ।
ముంజకేశ హృషీకేశ సర్వనాథ నమోఽస్తు తే ॥16॥

పచ్చని కేశములు కలవాడా!, ఓ మహాకేశా!, ఓ గుడాకేశా! (దట్టమైన కేశములు కలవాడా) నీకు నమస్కారములు. ముంజగడ్డివంటి కేశములు కలవాడా!, ఓ హృషీకేశా(ఇంద్రియాధిపతీ), ఓ సర్వనాథా! నీకు నమస్కారం.

సూక్ష్మ స్థూల మహాస్థూల మహాసూక్ష్మ శుభంకర ।
శ్వేతపీతాంబరధర నీలవాస నమోఽస్తు తే ॥17॥

ఓ సూక్ష్మరూపా!, స్థూలరూపా!, మహాస్థూలరూపా!, మహాసూక్ష్మరూపా!, శుభంకరా!, తెలుపు బంగారు రంగుగల వస్త్రాలు ధరించువాడా!, ఓ నీలవస్త్రధారీ! నీకు నమస్సులు.

కుశేశయ నమస్తేఽస్తు పద్మేశయ జలేశయ ।
గోవింద ప్రీతికర్తా చ హంసపీతాంబరప్రియ ॥18॥

ఓ దర్భశయనా! నీకు నమస్సులు. పద్మమునందు శయనించువాడా!, జలమునందు శయనించువాడా!, గోవిందా!, ప్రీతికర్తా!, హంసరూపా!, పీతాంబరప్రియా! నీకు నమస్కారం.

అధోక్షజ నమస్తుభ్యం సీరధ్వజ జనార్దన ।
వామనాయ నమస్తేఽస్తు నమస్తే మధుసూదన ॥ 19॥

ఓ అధోక్షజా! నీకు నమస్కారం. ఓ సీరధ్వజా!, ఓ జనార్దనా!, ఓ వామనా! నీకు నమస్సులు. ఓ మధుసూదనా! నీకు ప్రణామములు.

సహస్రశీర్షాయ నమో బ్రహ్మశీర్షాయ తే నమః ।
నమః సహస్రనేత్రాయ సోమసూర్యానలేక్షణ ॥20॥

సహస్రశీర్షునకు నమస్కారములు. బ్రహ్మశీర్షుడవైన నీకు నమస్కారం. సహస్రనేత్రునకు, సూర్యచంద్రాగ్నులు నేత్రములుగా గలవానికి నమస్కారం.

నమశ్చాథర్వశిరసే మహాశీర్షాయ తే నమః ।
నమస్తే ధర్మనేత్రాయ మహానేత్రాయ తే నమః ॥21॥

అథర్వశీర్షునకు నమస్సులు. మహాశీర్షుడవైన నీకు ప్రణామము. ధర్మనేత్రుడవైన నీకు నమస్సులు. మహానేత్రుడవైన నీకు నమస్కారములు.

నమః సహస్రపాదాయ సహస్రభుజమన్యవే ।
నమో యజ్ఞవరాహాయ మహారూపాయ తే నమః ॥22॥

సహస్రపాదునకు నమస్కారం. సహస్రభుజుడైన బాణునకు శత్రువైన నీకు నమస్కారం. యజ్ఞవరాహుడవు, మహారూపుడవునైన నీకు ప్రణామం.

నమస్తే విశ్వదేవాయ విశ్వాత్మన్ విశ్వసంభవ ।
విశ్వరూప నమస్తేఽస్తు త్వత్తో విశ్వమభూదిదమ్ ॥23॥

విశ్వేదేవుడవైన నీకు నమస్కారం. ఓ విశ్వాత్మా!, విశ్వసంభవా!, విశ్వరూపా! నీకు నమస్కారం. నీవలననే ఈ విశ్వమంతయు ఉత్పన్నమయ్యింది.

న్యగ్రోధస్త్వం మహాశాఖస్త్వం మూలకుసుమార్చితః ।
స్కంధపత్రాంకురలతాపల్లవాయ నమోఽస్తు తే ॥24॥

మహాశాఖలతో ఒప్పుచు, వ్రేళ్ళతోను, కుసుమాలతోను, సేవింపబడుచు, కాండపత్రాంకురలతాపల్లవములతో కూడిన మహావటవృక్ష రూపుడవైన నీకు నమస్కారం.

మూలం తే బ్రాహ్మణా బ్రహ్మన్ స్కంధస్తే క్షత్రియాః ప్రభో ।
వైశ్యాః శాఖాదలం శూద్రా వనస్పతే నమోఽస్తు తే ॥25॥

ఓ బ్రహ్మన్! మహావటవృక్షరూపుడవైన నీకు బ్రాహ్మణులే మూలం. ఓ ప్రభో! నీకు క్షత్రియులే స్కంధం. వైశ్యులు నీకు కొమ్మలు. శూద్రులు పత్రాలు. ఓ వనస్పతీ! నీకు నమస్కారం.

బ్రాహ్మణాః సాగ్నయో వక్త్రాః దోర్దణ్డాః సాయుధా నృపాః ।
పార్శ్వాద్ విశశ్చోరుయుగాజ్జాతాః శూద్రాశ్చ పాదతః ॥26॥

అగ్నిసహితులైన బ్రాహ్మణులు నీ ముఖాలు. అట్లే శస్త్రసహితులైన క్షత్రియులే నీకు భుజాలు. వైశ్యులు నీ ఊరువుల జంటనుండియు, శూద్రులు పాదాలనుండియు జన్మించారు.

నే(త్రాద్భానురభూత్తుభ్యం పద్భ్యాం భూః శ్రోత్రయోర్దిశః ।
నాభ్యా హ్యభూదన్తరిక్షం శశాంకో మనసస్తవ ॥27॥

నీయొక్క నేత్రాలనుండి భానుడుదయించాడు. నీ పాదాలనుండి భూమియు, శ్రోత్రములనుండి దిక్కులు, నాభినుండి అంతరిక్షం, మనస్సునుండి చంద్రుడు ఉద్భవించారు.

ప్రాణాద్వాయుస్సమభవత్ కామాద్బ్రహ్మా పితామహః ।
క్రోధాత్త్రినయనో రుద్రః శీర్ష్ణో ద్యౌః సమవర్తత ॥28॥

నీ ప్రాణాలనుండి వాయువు ఉద్భవించాడు. నీ కోరికనుండి పితామహుడైన బ్రహ్మ, క్రోధంనుండి త్రినేత్రుడైన రుద్రుడు, శిరస్సునుండి స్వర్గం ఆవిర్భవించాయి.

ఇంద్రాగ్నౌ వదనాత్తుభ్యం పశవో మలసంభవాః ।
ఓషధ్యో రోమసంభూతా విరాజస్త్వం నమోఽస్తు తే ॥29॥

నీ వదనం నుండి ఇంద్రాగ్నులు, మలం నుండి పశువులు, రోమాలనుండి ఓషధులు విరాజిల్లజేసిన నీకు నమస్కారం.

పుష్పహాస నమస్తేఽస్తు మహాహాస నమోఽస్తు తే ।
ఓంకారస్త్వం వషట్కారో వౌషట్ త్వం చ స్వధా సుధా ॥30॥

స్వాహాకార నమస్తుభ్యం హన్తకార నమోఽస్తు తే ।
సర్వాకార నిరాకార వేదాకార నమోఽస్తు తే ॥31॥

పుష్పములే నవ్వుగా కలవాడవు, అట్టహాసం గావించువాడవునగు నీకు నమస్సులు. ఓంకారానివి నీవు. వషట్కారానివి, వౌషట్, స్వధా సుధా స్వాహా కారాలు నీవే. అట్టినీకు నమస్కారం. హన్తకారుడవైన నీకు నమస్కారం. సర్వాకారాలు నీవే. నిరాకారుడవు, వేదాకారుడవునైన నీకు ప్రణామం.

త్వం హి వేదమయో దేవః సర్వదేవమయస్తథా ।
సర్వతీర్థమయశ్చైవ సర్వయజ్ఞమయస్తథా ॥32॥

వేదమయుడవైన దేవదేవుడవు నీవే. అట్లే సర్వదేవమయుడవు, సర్వతీర్థమయుడవు, సర్వయజ్ఞమయుడవు నీవే.

నమస్తే యజ్ఞపురుష యజ్ఞభాగభుజే నమః ।
నమః సహస్రధారాయ శతధారాయ తే నమః ॥33॥

ఓ యజ్ఞపురుషా! యజ్ఞభాగభోక్తా! నీకు నమస్సులు. వేయియంచులు, నూరంచులుగల వజ్రస్వరూపుడా! నీకు ప్రణామాలు.

భూర్భువః స్వః స్వరూపాయ గోదాయామృతదాయినే ।
సువర్ణబ్రహ్మదాత్రే చ సర్వదాత్రే చ తే నమః ॥34॥

భూః భువః స్వః లోక స్వరూపుడవైన నీకు నమస్సులు. ఇంద్రియదాయివి, అమృతదాయివి, సువర్ణజ్ఞాన దాతవు, సర్వము ఇచ్చువాడవునగు నీకు నమస్కారం.

బ్రహ్మేశాయ నమస్తుభ్యం బ్రహ్మాదే బ్రహ్మరూపధృక్ ।
పరబ్రహ్మ నమస్తేఽస్తు శబ్దబ్రహ్మ నమోఽస్తు తే ॥35॥

బ్రహ్మేశ్వరుడవగు నీకు నమస్సులు. బ్రహ్మకు ఆదిమూర్తివి, బ్రహ్మరూపధారివి, పరబ్రహ్మవు, శబ్దబ్రహ్మము నైన నీకు ప్రణామం.

విద్యాస్త్వం వేద్యరూపస్త్వం వేదనీయస్త్వమేవ చ ।
బుద్ధిస్త్వమపి బోధ్యశ్చ బోధస్త్వం చ నమోఽస్తు తే ॥36॥

విద్యవు నీవు. వేద్యరూపము నీవే. తెలిసికోదగినవాడవు నీవే. బుద్ధివి, బోధ్యుడవు, బోధజ్ఞానానివి నీవే. అట్టి నీకు నమస్కారం.

హోతా హోమశ్చ హవ్యం చ హూయమానశ్చ హవ్యవాట్ ।
పాతా పోతా చ పూతశ్చ పావనీయశ్చ ఓం నమః ॥37॥

హోతవు, హోమము, హవ్యము, హవ్యముగా అర్పింపబడేది, హవ్యవాహనుడవైన అగ్నివి నీవే. రక్షకుడవు, పవిత్రం గావించువాడవు, పవిత్రుడవు, పావనీయుడవు, సర్వమునైన ప్రణవానివి నీవే. అట్టి నీకు నమస్సులు.

హన్తా చ హన్యమానశ్చ హ్రియమాణస్త్వమేవ చ ।
హర్తా నేతా చ నీతిశ్చ పూజ్యోఽగ్ర్యో విశ్వధార్యసి ॥38॥

చంపువాడవు, చంపబడువాడవు, అపహరింపదగినవాడవు కూడా నీవే. హరించువాడవు, నాయకుడవు, నీతివి, పూజ్యుడవు, మొదటివాడవు, విశ్వాన్ని ధరించేవాడవు నీవే.

స్రుక్స్రువౌ పరధామాసి కపాలోలూఖలోఽరణిః ।
యజ్ఞపాత్రారణే యస్త్వమేకధా బహుధా త్రిధా ॥39॥

యజ్ఞస్త్వం యజమానస్త్వమీడ్యస్త్వమపి యాజకః ।
జ్ఞాతా జ్ఞేయస్తథా జ్ఞానం ధ్యేయో ధ్యాతాఽసి చేశ్వర ॥40॥

ఓ ప్రభో! స్రుక్స్రువాలు నీ రూపాలే. పరమపదము నీవే. కపాలం (పురోడాశమిచ్చే పాత్ర), ఉలూఖలం (రోలు), అరణి (అగ్నికై మథించే కొయ్య) నీవే. యజ్ఞపాత్రయగు ఆరణేయం నీవే. ఒకటిగా, రెండుగా, మూడుగా, రూపొందునదీ నీవే. నీవే యజ్ఞానివి. యజమానుడవు, ఆరాధింపబడువాడవు (ఈడ్యుడు), యాజకుడవు నీవే. తెలిసినవాడవు, తెలిసికోవలసినవాడవు, జ్ఞానానివి నీవే. ధ్యేయము, ధ్యాతవు నీవే.

ధ్యానయోగశ్చ యోగీ చ గతిర్మోక్షో ధృతిః సుఖమ్ ।
యోగాఙ్గాని త్వమీశానః సర్వగస్త్వం నమోఽస్తు తే ॥41॥

ధ్యానయోగము, యోగివి, గతివి, మోక్షము, ధృతి, సుఖము, యోగాంగములు, ఈశానుడవు, సర్వగురుడవు నీవే. నీకు నమస్కారం.

బ్రహ్మా హోతా తథోద్గాతా సామయూపోఽథ దక్షిణా ।
దీక్షా త్వం త్వం పురోడాశస్త్వం పశుః పశువాహ్యసి ॥42॥

బ్రహ్మవు, హోతవు, ఉద్గాతవు, యూపదారువువు, దక్షిణవు, దీక్షవు, నీవే. పురోడాశానివి, యజ్ఞపశువు, పశువును తెచ్చేవాడవు ఈ అన్ని రూపాలలో నీవే వ్యక్తమౌతున్నావు.

గుహ్యో ధాతా చ పరమః శివో నారాయణస్తథా ।
మహాజనో నిరయనః సహస్రార్కేందురూపవాన్ ॥43॥

ద్వాదశారోఽథ షణ్ణాభిస్త్రివ్యూహో ద్వియుగస్తథా ।
కాలచక్రో భవానీశో నమస్తే పురుషోత్తమః ॥44॥

గుహ్యుడవు, ధాతవు, పరమశివుడవు, నారాయణుడవు, జనసమూహము, నిరయనము, వేయి సూర్యచంద్రుల శోభతో వెలుగువాడవునైన నీకు నమస్సులు. పంద్రెండు ఆకులు, ఆరు ఇరుసులు, మూడు వ్యూహాలు, రెండు యుగాలు (కాడి) గల కాలచక్రరూపివి, భవానీశుడవు, పురుషోత్తముడవునగు నీకు నమస్కారాలు.

పరాక్రమో విక్రమస్త్వం హయగ్రీవో హరీశ్వరః ।
నరేశ్వరోఽథ బ్రహ్మేశః సూర్యేశస్త్వం నమోఽస్తు తే ॥45॥

పరాక్రమము, విక్రమము నీవే. హయగ్రీవుడవు, హరీశ్వరుడవు, నరేశ్వరుడవు, బ్రహ్మేశుడవు, సూర్యేశు డవు నీవే. నీకు నమస్సులు.

అశ్వవక్త్రో మహామేధాః శంభుశ్శక్రః ప్రభంజనః ।
మిత్రావరుణమూర్తిస్త్వమమూర్తిరనఘః పరః ॥46॥

ప్రాగ్వంశకాయో భూతాదిర్మహాభూతోఽచ్యుతో ద్విజః ।
త్వమూర్ధ్వకర్తా ఊర్ధ్వశ్చ ఊర్ధ్వరేతా నమోఽస్తు తే ॥47॥

హయముఖుడవు, మహామేధవు, శంభుడవు, శక్రుడవు, ప్రభంజనుడవు, మిత్రావరుణమూర్తివి, రూపం లేనివాడవు, పాపరహితుడవు, పరమపురుషుడవు, రూపుకట్టిన మొదటి వంశానివి, జీవులకన్నింటికి మొదలైనవాడవు, మహాజీవుడవు, అచ్యుతుడవు, ద్విజుడవు, ఊర్ధ్వకర్తవు, ఊర్ధ్వానివి, ఊర్ధ్వ రేతస్కుడవు నీవే. నీకు నమస్కారం.

మహాపాతకహా త్వం చ ఉపపాతకహా తథా ।
అనీశః సర్వపాపేభ్యస్త్వామహం శరణం గతః ॥48॥

మహాపాతకాలను, ఉపపాతకాలను, నశింపజేయువాడవు, సమస్తపాపాలకు అతీతుడవునగు నీకు శరణాగతుడనౌతున్నాను.

ఇత్యేతత్పరమం స్తోత్రం సర్వపాపప్రమోచనమ్ ।
మహేశ్వరేణ కథితం వారాణస్యాం పురా మునే ॥49॥

కేశవస్యాగ్రతో గత్వా స్నాత్వా తీర్థే సితోదకే ।
ఉపశాన్తస్తథా జాతో రుద్రః పాపవశాత్తతః ॥50॥

ఏతత్పవిత్రం త్రిపురఘ్నభాషితం పఠన్నరో విష్ణుపరో మహర్షే ।
విముక్తపాపో హ్యుపశాన్తమూర్తిః సంపూజ్యతే దేవవరైః ప్రసిద్ధైః ॥51॥

ఓ నారదా! పరమోత్తమమైన సర్వపాపప్రమోచనస్తోత్రాన్ని నీకు వినిపించాను. పూర్వకాలంలో దీనిని మహేశ్వరుడు వారణాసిక్షేత్రంలో ప్రకాశింపజేశాడు. పాపవశుడైన రుద్రుడు సితోదకతీర్థంలో స్నానం చేసి, కేశవుని దర్శించుకొని, పిమ్మట పాపవిముక్తుడై ఉపశాంతిని పొందాడు. ఓ మహర్షీ! త్రిపురాంతకుడు ప్రకాశింపజేసిన విష్ణుపరమైన, పవిత్రమైన, ఈ స్తోత్రాన్ని ఏ మానవుడు పఠిస్తాడో ఆ మానవుడు సర్వపాపవిముక్తుడై, శాంతిని పొందుతాడు. ప్రసిద్ధులైన దేవవరులచే కూడా పూజింపబడతాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే పాపప్రశమనస్తవో నామ సప్తాశీతితమోఽధ్యాయః ॥87॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో పాపప్రశమన స్తోత్రమనే ఎనభైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టాశీతితమోఽధ్యాయః – ఎనబైఎనిమిదవ అధ్యాయం

ప్రహ్లాదతీర్థయాత్రాయాం ద్వితీయః పాపనాశనస్తవః – ప్రహ్లాదుని తీర్థయాత్రావర్ణనలో రెండవపాపనాశనస్తవం

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ద్వితీయం పాపశమనం స్తవం వక్ష్యామి తే మునే ।
యేన సమ్యగధీతేన పాపం నాశం తు గచ్ఛతి ॥1॥

ఓ నారదమునీ! రెండవ పాపశమనస్తోత్రం నేను నీకు వినిపిస్తున్నాను. విను. దీనిని చక్కగా అధ్యయనం చేస్తే సమస్తపాపాలు నశించిపోతాయి.

మత్స్యం నమస్యే దేవేశం కూర్మం గోవిందమేవ చ ।
హయశీర్షం నమస్యేఽహం భవం విష్ణుం త్రివిక్రమమ్ ॥2॥

మత్స్యమూర్తికి నమస్సులు. దేవేశ్వరుడగు కూర్మరూపునకు నమస్సులు. గోవిందునకు, హయగ్రీవునకు నమస్సులు. త్రివిక్రముడు, భవుడునగు విష్ణువునకు నమస్సులు.

నమస్యే మాధవేశానౌ హృషీకేశకుమారిణౌ ।
నారాయణం నమస్యేఽహం నమస్తే గరుడాసనమ్ ॥3॥

శివకేశవులకు, హృషీకేశకార్తికేయులకు ప్రణామములు. నారాయణుడవు, గరుడాసనుడవునగు నీకు నమస్సులు.

ఊర్ధ్వకేశం నృసింహం చ రూపధారం కురుధ్వజమ్ ।
కామపాలమఖండం చ నమస్యే బ్రాహ్మణప్రియమ్ ॥4॥

ఊర్ధ్వకేశీ, నృసింహుడు, రూపధారి, కురుధ్వజుడు, కామపాలుడు, అఖండుడు, బ్రాహ్మణప్రియుడు అయిన వానికి నమస్కరిస్తున్నాను.

అజితం విశ్వకర్మాణం పుండరీకం ద్విజప్రియమ్ ।
హంసం శంభుం నమస్యే చ బ్రహ్మాణం సప్రజాపతిమ్ ॥5॥

అజితునకు, విశ్వకర్మునకు, పుండరీకునకు, ద్విజప్రియునకు, హంసునకు, శంభునకు, ప్రజాపతి సహితుడగు విరించికి నమస్సులు.

నమస్యే శూలబాహుం చ దేవం చక్రధరం తథా ।
శివం విష్ణుం సువర్ణాక్షం గోపతిం పీతవాససమ్ ॥6॥

శూలపాణియు,చక్రధరుడునైన శివవిష్ణువులకు, సువర్ణాక్షునకు, గోపతికి, పీతాంబరధారికి ప్రణామం చేస్తున్నాను.

నమస్యే చ గదాపాణిం నమస్యే చ కుశేశయమ్ ।
అర్ధనారీశ్వరం దేవం నమస్యే పాపనాశనమ్ ॥7॥

గదాపాణికి నమస్కరిస్తున్నాను. కుశేశయానునకు నమస్సులు. అర్ధనారీశ్వరుడైన దేవునకు, పాపనాశకునకు నమస్సులు.

గోపాలం చ సవైకుంఠం నమస్యే చాపరాజితమ్ ।
నమస్యే విశ్వరూపం చ సౌగంధిం సర్వదా శివమ్ ॥8॥

వైకుంఠంతో కూడిన గోపాలునకు, అపరాజితునకు నమస్సులు. విశ్వరూపునకు, సౌగంధికి, సదాశివునకు నమస్కరిస్తున్నాను.

పాంచాలికం హయగ్రీవం స్వయంభువమమరేశ్వరమ్ ।
నమస్యే పుష్కరాక్షం చ పయోగన్ధిం చ కేశవమ్ ॥9॥

పాంచాలికునకు, హయగ్రీవునకు, స్వయంభువునకు, అమరేశ్వరునకు, పుష్కరాక్షునకు, పయోగంధికి, కేశవునకు నమస్కారాలు.

అవిముక్తం చ లోలం చ జ్యేష్ఠేశం మధ్యమం తథా ।
ఉపశాన్తం నమస్యేఽహం మార్కండేయం సజంబుకమ్ ॥10॥

అవిముక్తస్వామికి, లోలునకు, జ్యేష్ఠేశునకు, మధ్యమునకు, ఉపశాంతునకు, మార్కండేయ జంబుకులకు నేను నమస్కరిస్తున్నాను.

నమస్యే పద్మకిరణం నమస్యే బడబాముఖమ్ ।
కార్తికేయం నమస్యేఽహం బాహ్లీకం శిఖినం తథా ॥11॥

పద్మకిరణునకు నమస్సులు. బడబాముఖునకు నమస్సులు. కార్తికేయునకు, బాహ్లికశిఖిరూపునకు నేను నమస్కరిస్తున్నాను.

నమస్యే స్థాణుమనఘం నమస్యే వనమాలినమ్ ।
నమస్యే లాంగలీశం చ నమస్యేఽహం శ్రియః పతిమ్ ॥12॥

స్థాణువునకు, అనఘునకు, వనమాలాధరునకు నమస్సులు. లాంగలీశునకు నమస్సులు. శ్రీపతికి నేను నమస్కరిస్తున్నాను.

నమస్యే చ త్రినయనం నమస్యే హవ్యవాహనమ్ ।
నమస్యే చ త్రిసౌవర్ణం నమస్యే ధరణీధరమ్ ॥13॥

త్రినేత్రునకు నమస్సులు. హవ్యవాహనుడైన అగ్నిహోత్రునకు నమస్సులు. త్రిసౌవర్ణునకు నమస్సులు. ధరణీధరునకు నమస్కారం.

త్రిణాచికేతం బ్రహ్మేశం నమస్యే శశిభూషణమ్ ।
కపర్దినం నమస్యే చ సర్వామయవినాశనమ్ ॥14॥

త్రినాచికేతునకు, బ్రహ్మేశునకు, శశిభూషణునకు నమస్కరిస్తున్నాను. అట్లే సమస్తరోగాలను నశింపజేయు కపర్దిభగవానునకు నమస్కారం.

నమస్తే శశినం సూర్యం ధ్రువం రౌద్రం మహౌజసమ్ ।
పద్మనాభం హిరణ్యాక్షం నమస్యే స్కందమవ్యయమ్ ॥15॥

చంద్రునకు, సూర్యునకు, ధ్రువునకు, రుద్రునకు, మహౌజస్వికి, పద్మనాభునకు, హిరణ్యాక్షునకు, స్కందునకు, అవ్యయునకు నమస్కరిస్తున్నాను.

నమస్యే భీమహంసౌ చ నమస్యే హాటకేశ్వరమ్ ।
సదా హంసం నమస్యే చ నమస్యే ప్రాణతర్పణమ్ ॥16॥

భీమహంసదేవులకు నమస్సులు. హాటకేశ్వరునకు నమస్కారం. హంసకునకు సదా నమస్కరిస్తున్నాను. ప్రాణులకు తృప్తిపరచువానికి నమస్కరిస్తున్నాను.

నమస్యే రుక్మకవచం మహాయోగినమీశ్వరమ్ ।
నమస్యే శ్రీనివాసం చ నమస్యే పురుషోత్తమమ్ ॥17॥

బంగారు కవచంతో వెలిగే మహాయోగీశ్వరునకు నమస్సులు. శ్రీనివాసునకు, పురుషోత్తమునకు నమస్కరిస్తున్నాను.

నమస్యే చ చతుర్బాహుం నమస్యే వసుధాధిపమ్ ।
వనస్పతిం పశుపతిం నమస్యే ప్రభుమవ్యయమ్ ॥18॥

చతుర్బాహునకు నమస్కృతులు, వసుధాధిపునకు ప్రణామాలు. వనస్పతికి, పశుపతికి, ప్రభునకు, అవ్యయునకు నమస్సులు.

శ్రీకంఠం వాసుదేవం చ నీలకంఠం సదండినమ్ ।
నమస్యే సర్వమనఘం గౌరీశం నకులీశ్వరమ్ ॥19॥

శ్రీకంఠునకు, వాసుదేవునకు, నీలకంఠునకు, సదండికి నమస్సులు. సర్వుడు, అనఘుడు, గౌరీశుడు, నకులీశ్వరుడునగు భగవానునకు నమస్కరిస్తున్నాను.

మనోహరం కృష్ణకేశం నమస్యే చక్రపాణినమ్ ।
యశోధరం మహాబాహుం నమస్యే చ కుశప్రియమ్ ॥20॥

మనోహరునకు, కృష్ణకేశునకు, చక్రపాణికి నమస్సులు. యశోధరునకు, మహాబాహువునకు, కుశప్రియునకు ప్రణామాలు.

భూధరం ఛాదితగదం సునేత్రం శూలశంఖినమ్ ।
భద్రాక్షం వీరభద్రం చ నమస్యే శంకుకర్ణికమ్ ॥21॥

భూధరునకు, ఛాదితగదునకు, సునేత్రునకు, శూలశంఖునకు, భద్రాక్షునకు, వీరభద్రునకు, శంకుకర్ణునకు నమస్సులు.

వృషధ్వజం మహేశం చ విశ్వామిత్రం శశిప్రభమ్ ।
ఉపేంద్రం చైవ గోవిందం నమస్యే పంకజప్రియమ్ ॥22॥

వృషధ్వజునకు, మహేశునకు, విశ్వామిత్రునకు, శశిప్రభునకు, ఉపేంద్రునకు, గోవిందునకు, పద్మప్రియునకు నమస్సులు.

సహస్రశిరసం దేవం నమస్యే కుందమాలినమ్ ।
కాలాగ్నిం రుద్రదేవేశం నమస్యే కృత్తివాససమ్ ॥ 23॥

సహస్రశీర్షుడైన దేవునకు, కుందమాలాధరునకు, కాలాగ్నిస్వరూపుడైన రుద్రునకు, దేవేశునకు, కృత్తివాసునకు ప్రణామాలు.

నమస్యే ఛాగలేశం చ నమస్యే పంకజాసనమ్ ।
సహస్రాక్షం కోకనదం నమస్యే హరిశంకరమ్ ॥24॥

ఛాగలేశునకు నమస్సులు. పద్మాసనునకు నమస్సులు. సహస్రాక్షునకు, కోకనదునకు, హరిశంకరునకు ప్రణామాలు.

అగస్త్యం గరుడం విష్ణుం కపిలం బ్రహ్మవాఙ్మయమ్ ।
సనాతనం చ బ్రహ్మాణం నమస్యే బ్రహ్మతత్పరమ్ ॥25॥

అగస్త్యునకు, గరుడునకు, విష్ణునకు, కపిలునకు, బ్రహ్మవాఙ్మయమునకు, సనాతనునకు, బ్రహ్మకు, బ్రహ్మతత్పరునకు నమస్కరిస్తున్నాను.

అప్రతర్క్యం చతుర్బాహుం సహస్రాంశుం తపోమయమ్ ।
నమస్యే ధర్మరాజానం దేవం గరుడవాహనమ్ ॥26॥

అప్రతర్క్యునకు, చతుర్భుజునకు, సహస్రకిరణునకు, తపోమయునకు, ధర్మరాజునకు, గరుడవాహనుడైన విష్ణుదేవునకు ప్రణామాలు.

సర్వభూతగతం శాన్తం నిర్మలం సర్వలక్షణమ్ ।
మహాయోగినమవ్యక్తం నమస్యే పాపనాశనమ్ ॥27॥

సర్వజీవులలో అంతర్గతుడైనవానికి, శాంతునకు, నిర్మలునకు, సర్వలక్షణలక్షితుడైనవానికి, మహాయోగికి, అవ్యక్తునకు, పాపనాశకునకు నమస్సులు.

నిరంజనం నిరాకారం నిర్గుణం నిర్మలం పదమ్ ।
నమస్యే పాపహన్తారం శరణ్యం శరణం వ్రజే ॥28॥

నిరంజనుడు, నిరాకారుడు, నిర్గుణుడు, నిర్మలుడు, పరమపదస్వరూపుడు, పాపహంతకుడు అయిన వానికి నమస్కరిస్తున్నాను. శరణ్యుడైనవానికి శరణాగతుడనౌతున్నాను.

ఏతత్ పవిత్రం పరమం పురాణం ప్రోక్తం త్వగస్త్యేన మహర్షిణా చ ।
ధన్యం యశస్యం బహుపాపనాశనం సంకీర్తనాత్ స్మరణాత్ సంశ్రవాచ్చ ॥29॥

పూర్వం అగస్త్యమహర్షిచే చెప్పబడినదీ, పరమపవిత్రమైనదీ, పురాతనమైనదీ అయిన ఈ స్తోత్రాన్ని నీకు వినిపించాను. దీనిని కీర్తించినా, స్మరించినా, శ్రవణం గావించినా అనేకపాపాలు నశించి, యశస్వి, ధన్యుడు అవుతాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే ప్రహ్లాదతీర్థయాత్రాయాం ద్వితీయః పాపనాశనస్తవోనామాష్టాశీతితమోఽధ్యాయః ॥88॥

శ్రీవామన మహాపురాణము నందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో ప్రహ్లాదతీర్థయాత్రలో రెండవ పాపనాశనస్తవమనే ఎనభైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



నవాశీతితమోऽధ్యాయః – ఎనబైతొమ్మిదవ అధ్యాయం

వామనజననమ్ – వామనజననం

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

గతేऽథ తీర్థయాత్రాయాం ప్రహ్లాదే దానవేశ్వరే ।
కురుక్షేత్రం సమభ్యాగాద్ యష్టుం వైరోచనో బలిః ॥1॥

బలికి హితోపదేశం చేసి దానవేశ్వరుడైన ప్రహ్లాదుడు తీర్థయాత్రలకు వెళ్ళిన వెంటనే విరోచనతనయుడైన బలి యజ్ఞం చేయడానికి కురుక్షేత్రానికి వచ్చిచేరాడు.

తస్మిన్ మహాధర్మయుతే తీర్థే బ్రాహ్మణపుంగవః ।
శుక్రో ద్విజాతిప్రవరానామంత్రయత భార్గవాన్ ॥2॥

మహాధర్మయుతమైన ఆ తీర్థంలో బ్రాహ్మణపుంగవుడైన శుక్రాచార్యుడు ద్విజాతిప్రవరులైన భార్గవులను అనగా భృగువంశసంజాతులను ఆహ్వానించాడు.

భృగూనామన్త్ర్యమాణాన్ వై శ్రుత్వాత్రేయాః సగౌతమాః ।
కౌశికాఙ్గిరసశ్చైవ తత్యజుః కురుజాఙ్గలాన్ ॥3॥

ఉత్తరాశాం ప్రజగ్ముస్తే నదీమను శతద్రవీమ్ ।
శాతద్రవే జలే స్నాత్వా విపాశాం ప్రయయుస్తతః ॥4॥

భార్గవులను యజ్ఞానికై పిలిచిన విషయంవినగానే అందున్న ఆత్రేయ, గౌతమగోత్రీయులు, కౌశిక, అంగిరసులగు బ్రాహ్మణులు, కురుజాంగలాన్ని వదలి ఉత్తరదిశగా ప్రయాణించి, శతద్రూనదీ ప్రాంతానికి వెళ్ళిపోయారు. శతద్రునదిలో స్నానం చేసి, తదనంతరం విపాశానదికి వెళ్ళారు.

విజ్ఞాయ తత్రాప్యరతిం స్నాత్వాऽర్చ్య పితృదేవతాః ।
ప్రజగ్ముః కిరణాం పుణ్యాం దినేశకిరణచ్యుతామ్ ॥5॥

తస్యాం స్నాత్వాऽర్చ్య దేవర్షే సర్వ ఏవ మహర్షయః ।
ఐరావతీం సుపుణ్యోదాం స్నాత్వా జగ్మురథేశ్వరీమ్ ॥6॥

ఓ దేవర్షీ! అక్కడకూడా తృప్తి లభించకపోవడంతో విపాశానదిలో స్నానమాడి, పితరులనర్చించి, అచ్చటినుండి సూర్యకిరణాల ద్వారా స్రవించిన కిరణానది చేరి, అక్కడ స్నానమాడి, అర్చించి, మహర్షులందరు పుణ్యజలమగు ఐరావతిలో స్నానం చేసి, ఈశ్వరీనదికి వెళ్ళారు.

దేవికాయా జలే స్నాత్వా పయోష్ణ్యాం చైవ తాపసాః ।
అవతీర్ణా మునే స్నాతుమాత్రేయాద్యాః శుభాం నదీమ్ ॥7॥

తతో నిమగ్నా దదృశుః ప్రతిబింబమథాత్మనః ।
అంతర్జలే ద్విజశ్రేష్ఠ మహదాశ్చర్యకారకమ్ ॥8॥

ఉన్మజ్జనే చ దదృశుః పునర్విస్మితమానసాః ।
తతః స్నాత్వా సముత్తీర్ణా ఋషయః సర్వ ఏవ హి ॥9॥

ఓ నారదమునీ! ఆత్రేయాది మహర్షులందరు దేవికానదిలో స్నానం చేసి, పయోష్ణీనదీమంగళజలాలలో స్నానం చేయడానికి ఆ నదీజలాలలోనికి దిగారు. వారందరు నీటిలో మునిగినంతనే ఆ జలాలలో తమ ప్రతిబింబాలను చూసి ఆశ్చర్యపడ్డారు. మునిగి లేచి, బయటకు వచ్చిన తరువాత కూడా తమ ప్రతిబింబాలు ఆ నదీజలాలలో చూసి, మరలా పరమాశ్చర్యంలో మునిగిపోయారు. తదనంతరం ఆ జలాలలో మహర్షులందరు స్నానం చేసి తీరానికి చేరారు.

జగ్ముస్తతోఽపి తే బ్రహ్మన్ కథయన్తః పరస్పరమ్ ।
చిన్తయన్తశ్చ సతతం కిమేతదితి విస్మితాః ॥10॥

తతో దూరాదపశ్యన్త వనషణ్డం సువిస్తృతమ్ ।
వనం హరగలశ్యామం ఖగధ్వనినినాదితమ్ ॥11॥

ఓ బ్రహ్మన్! తీరం చేరిన పిమ్మట కూడా ఆ మహర్షులు ఆశ్చర్యకరమైన ఆ దృశ్యాన్ని గురించి, పరస్పరం చర్చించుకుంటూ, ఇదేమిటాయని ఆలోచిస్తూ, వారందరు అక్కడినుండి వెళ్ళిపోయారు. అలా వెళుతూ ఉండగా కొంచెం దూరంలో వారికి పక్షుల కలకలధ్వనులతో నిండి, శివుని కంఠసీమ వలె నల్లని కాంతులతో వెలుగొందు విశాలమైన వృక్షాల గుంపు కనిపించింది.

అతితుంగతయా వ్యోమం ఆవృణ్వానం నగోత్తమమ్ ।
విస్తృతాభిర్జటాభిస్తు అంతర్భూమిం చ నారద ॥12॥

ఆ చెట్లపొదలు ఆకాశాన్ని పర్వతాన్ని కప్పివేసి, సుదీర్ఘాలైన ఊడలు, శాఖలతో భూమిని తాకుతున్నాయి.

కాననం పుష్పితైర్వృక్షైరతిభాతి సమన్తతః ।
దశార్ధవర్ణైః సుఖదైర్నభస్తారాగణైరివ ॥13॥

తారాగణంతో ప్రకాశించే ఆకాశం వలె పంచవర్ణాల వృక్షాలతో, పూలతో విరాజిల్లే నిండైన అరణ్యం నయనోత్సవం గావిస్తోంది.

తం దృష్ట్వా కమలైర్వ్యాప్తం పుండరీకైశ్చ శోభితమ్ ।
తద్వత్ కోకనదైర్వ్యాప్తం వనం పద్మవనం యథా ॥14॥

ఆ ప్రదేశంలో రకరకాల కమలాలతో రాజీవాలు, కోకనదాలు, పుండరీకాలతో చిత్తాలకు ఆహ్లాదాన్ని కలిగించే పద్మవనం కనిపించింది.

ప్రజగ్ముస్తుష్టిమతులాం తే హ్లాదం పరమం యయుః ।
వివిశుః ప్రీతమనసో హంసా ఇవ మహాసరః ॥15॥

ఆ వనాన్ని చూడగానే వారుసాటిలేని ఆనందాన్ని, పరమసంతోషాన్ని పొందారు. హంసమహాసరోవరంలో ప్రవేశించినట్లు వారందరు సంతుష్టాంతరంగులై, అచ్చటకు ప్రవేశించారు.

తన్మధ్యే దదృశుః పుణ్యమాశ్రమం లోకపూజితమ్ ।
చతుర్ణాం లోకపాలానాం వర్గాణాం మునిసత్తమ ॥16॥

మునిసత్తమా! ఆ వనం మధ్యభాగాన చతుర్వర్ణాలకు నెలవైన, సర్వజనులచే పూజింపబడే, మహాపుణ్యా శ్రమాన్ని ఆ మునులు దర్శించారు.

ధర్మాశ్రమం ప్రాఙ్ముఖం తు పలాశవిటపావృతమ్ ।
ప్రతీచ్యభిముఖం బ్రహ్మన్ అర్థస్యేక్షువనావృతమ్ ॥17॥

అక్కడ తూర్పుముఖంగా మోదుగచెట్లగుంపులతో ఆవరింపబడిన ధర్మాశ్రమం ఉంటే పశ్చిమముఖంగా చెరకుతోటలతో నిండిన అర్థాశ్రమం నెలకొన్నది.

దక్షిణాభిముఖం కామ్యం రంభాశోకవనావృతమ్ ।
ఉదఙ్ముఖం చ మోక్షస్య శుద్ధస్ఫటికవర్చసమ్ ॥18॥

దక్షిణాభిముఖంగా అరటి, అశోకవృక్షాల మధ్య కామ్య ఆశ్రమం, ఉత్తరముఖంగా శుద్ధస్ఫటికశోభతో వెలిగే మోక్షాశ్రమం విరాజిల్లుతున్నాయి.

కృతాన్తే త్వాశ్రమీ మోక్షః కామస్త్రేతాన్తరే శ్రమీ ।
ఆశ్రమ్యర్థో ద్వాపరాన్తే తిష్యాదౌ ధర్మ ఆశ్రమీ ॥19॥

కృతయుగాంతంలో ఆ ఆశ్రమంలో మోక్షం నివసించగా, త్రేతాయుగాన్తంలో కామం ఆశ్రమవాసం చేస్తోంది. ద్వాపరాంతంలో అర్థానికక్కడ స్థానం లభిస్తే కలియుగారంభంలో ధర్మం ఆ ఆశ్రమంలో వాసం చేస్తోంది.

తాన్యాశ్రమాణి మునయో దృష్ట్వాఽఽత్రేయాదయోఽవ్యయాః ।
తత్రైవ చ రతిం చక్రురఖండే సలిలాప్లుతే ॥20॥

ధర్మాద్యైర్భగవాన్ విష్ణురఖండ ఇతి విశ్రుతః ।
చతుర్మూర్తిర్జగన్నాథః పూర్వమేవ ప్రతిష్ఠితః ॥21॥

తమర్చయన్తి ఋషయో యోగాత్మానో బహుశ్రుతాః ।
శుశ్రూషయాఽథ తపసా బ్రహ్మచర్యేణ నారద ॥22॥

ఆత్రేయాదులగు మహర్షులు ఆ నాల్గు ఆశ్రమాలు, చక్కని జలసమృద్ధితో విలసిల్లే ఆ అఖండగిరిని చూసి, దానిమీద మోజు పడ్డారు. ధర్మాది పురుషార్థచతుష్టయమయుడగుటచే విష్ణుభగవానునకు అఖండతత్త్వమనే పేరు కలిగింది. అందులకు సూచనగా చతుర్భుజుడగు జగన్నాథుడుగా విష్ణువునకు ప్రతిష్ఠ ముందునుండే కలిగి

యుంది. నారదా! ఆ ప్రభువును ఆ ప్రదేశాన బహుశ్రుతులు, యోగాత్ములునగు మునులు ఏకాగ్రచిత్తాలతో బ్రహ్మచర్యదీక్షలో ఆరాధిస్తారు.

ఏవం తే న్యవసంస్తత్ర సమేతా మునయో వనే ।
అసురేభ్యస్తదా భీతాః స్వాశ్రిత్యాఖండపర్వతమ్ ॥23॥

రాక్షసులకు భయపడి మునులంతా ఆ అఖండపర్వతాన్ని ఆశ్రయించుకుని గడుపుతున్నారు.

తథాఽన్యే బ్రాహ్మణా బ్రహ్మన్ అశ్మకుట్టా మరీచిపాః ।
స్నాత్వా జలే హి కాలింద్యాః ప్రజగ్ముర్దక్షిణా ముఖాః ॥24॥

అశ్మకుట్టమరీచికులను బ్రాహ్మణులు కొందరు కాళిందీనదిలో స్నానం చేసి దక్షిణదిశగా వెళ్ళారు.

అవన్తివిషయం ప్రాప్య విష్ణుమాసాద్య సంస్థితాః ।
విష్ణోరపి ప్రసాదేన దుష్ప్రవేశం మహాసురైః ॥25॥

వారు అవంతిదేశం చేరి, విష్ణువును ఆశ్రయించి జీవిస్తున్నారు. విష్ణుమహిమ వలన రాక్షసులకు ఆ దేశంలోనికి ప్రవేశం దుర్లభం.

వాలఖిల్యాదయో జగ్ముఠవశా దానవాద్భయాత్ ।
రుద్రకోటిం సమాశ్రిత్య స్థితాస్తే బ్రహ్మచారిణః ॥26॥

ఇక వాలఖిల్యాదులు దానవుల వల్ల భయంతో వివశులై, బ్రహ్మచర్యదీక్షితులై, రుద్రకోటిని ఆశ్రయించారు.

ఏవం గతేషు విప్రేషు గౌతమాఙ్గిరసాదిషు ।
శుక్రస్తు భార్గవాన్సర్వాన్ నిన్యే యజ్ఞవిధౌ మునే ॥27॥

నారదమునీ! ఈ విధంగా రాక్షసరాజుకు భయపడి గౌతమాంగిరసాదులైన మునులు వెళ్లిపోగా శుక్రాచార్యుడు భృగువంశీయులైన విప్రులందరిని యజ్ఞానికి రప్పించాడు.

అధిష్ఠితే భార్గవైస్తు మహాయజ్ఞేఽమితద్యుతే ।
యజ్ఞదీక్షాం బలేః శుక్రశ్చకార విధినా స్వయమ్ ॥28॥

అమితతేజోమయమైన మహాయజ్ఞవేదియందు భృగ్వాదులగు విప్రోత్తముల మధ్య శుక్రుడు విధివిధానంగా బలిమహారాజును యజ్ఞదీక్షితుని గావించాడు.

శ్వేతాంబరధరో దైత్యః శ్వేతమాల్యానులేపనః ।
మృగాజినావృతః పృష్ఠే బర్హిపత్రవిచిత్రితః ॥29॥

సమాస్తే వితతే యజ్ఞే సదస్యైరభిసంవృతః ।
హయగ్రీవప్రలంబాద్యైర్మయబాణపురోగమైః ॥30॥

పత్నీ వింధ్యావలీ చాస్య దీక్షితా యజ్ఞకర్మణి ।
లలనానాం సహస్రస్య ప్రధానా ఋషికన్యకా ॥31॥

శుక్రేణాశ్వః శ్వేతవర్ణో మధుమాసే సులక్షణః ।
మహీం విహర్తుముత్సృష్టస్తారకాక్షోఽన్వగాచ్ఛ తమ్ ॥32॥

తెల్లనివస్త్రాలు ధరించి, శ్వేతగంధానులేపనం, మాలాధారణం గావించుకొని, కృష్ణాజినంతో వీపును కప్పుకుని, కుశదర్భాంకురాలతో కళకళలాడుతు, విశాలమైన యజ్ఞశాలలో ఋత్విక్కులు, సదస్యులు, హయగ్రీవ ప్రలంబ, బాణ, మయాది దైత్యశ్రేష్ఠులచే పరివేష్ఠితుడై బలిదైత్యేంద్రుడు ఆసీనుడయ్యాడు. వేయిమంది భార్యలలో ఉత్తమురాలు, ఋషిపుత్రియునైన వింధ్యావళి బలి ధర్మపత్ని. ఆమె పతితో బాటు యజ్ఞదీక్షను స్వీకరించి, భర్తననుసరించింది. అంతట శుక్రుడు తెల్లని దేహకాంతితో సర్వలక్షణలక్షితమైన యజ్ఞాశ్వాన్ని భూమిని చుట్టిరావడానికి చైత్రమాసంలో వదలగా దాని రక్షణకై దైత్యవీరుడైన తారకాక్షుడు వెంటవెళ్ళాడు.

ఏవమశ్వే సముత్సృష్టే వితతే యజ్ఞకర్మణి ।
గతే చ మాసత్రితయే హూయమానే చ పావకే ॥33॥

పూజ్యమానేషు దైత్యేషు మిథునస్థే దివాకరే ।
సుషువే దేవజననీ మాధవం వామనాకృతిమ్ ॥34॥

యజ్ఞాశ్వాన్ని విడవడంతో యజ్ఞకర్మ మూడుమాసాలు హోమాదులతో విస్తరించింది. దైత్యులు పూజలందు కుంటూ ఉచ్ఛస్థితిలోనున్న సమయాన సూర్యుడు మిథునరాశిలో ప్రవేశించినవేళ దేవమాతయైన అదితి వాసుదేవుని పుత్రునిగా వామనాకారంలో ప్రసవించింది.

సంజాతమాత్రం భగవంతమీశం నారాయణం లోకపతిం పురాణమ్ ।
బ్రహ్మా సమభ్యేత్య సమం మహర్షిభిః స్తోత్రం జగాదాథ విభోర్మహర్షే ॥35॥

ఓ నారదా! జగత్పతి, ఆదిపురుషుడు, భగవంతుడునగు నారాయణుడు అవతరించగానే బ్రహ్మర్షులతో కలసి బ్రహ్మ ఆ విభుని సమీపించి ఇలా స్తోత్రం చేశాడు.

నమోఽస్తు తే మాధవ సత్త్వమూర్తే నమోఽస్తు తే శాశ్వత విశ్వరూప ।
నమోఽస్తు తే శత్రువనేన్ధనాగ్నే నమోఽస్తు వై పాపమహాదవాగ్నే ॥36॥

ఓ మాధవా!, సత్త్వమూర్తీ! నీకు నమస్సులు. ఓ శాశ్వతా!, విశ్వరూపా! నీకు ప్రణామాలు. శత్రురూపమైన వనాన్ని ఇంధనంగా చేసిన అగ్నిస్వరూపా! నీకు నమస్కారం. పాపమనే వనాన్ని దహించే మహాదావాగ్ని స్వరూపా! నీకు నమోవాకములు.

నమస్తే పుండరీకాక్ష నమస్తే విశ్వభావన ।
నమస్తే జగదాధార నమస్తే పురుషోత్తమ ॥37॥

ఓ పుండరీకాక్షా! నీకు నమస్కారం. ఓ విశ్వభావనా! నీకు ప్రణామం. ఓ జగదాధారా! నీకు వందనం. ఓ పురుషోత్తమా! నీకు నమస్సులు.

నారాయణ జగన్మూర్తే జగన్నాథ గదాధర ।
పీతవాసః శ్రియః కాన్త జనార్దన నమోఽస్తు తే ॥38॥

ఓ నారాయణా!, ఓ జగన్మూర్తీ!, ఓ జగన్నాథా!, ఓ గదాధరా!, ఓ పీతాంబరధారీ!, ఓ శ్రీపతీ!, ఓ జనార్దనా! నీకు నమస్సులు.

భవాంస్త్రాతా చ గోప్తా చ విశ్వాత్మా సర్వగోఽవ్యయః ।
సర్వధారీ ధరాధారీ రూపధారీ నమోఽస్తు తే ॥39॥

మమ్ములను పాలించేవాడవు, రక్షించేవాడవు నీవే. విశ్వాత్ముడవు, అన్నిట ప్రవేశించగలవాడవు. అవ్యయుడవు నీవే. సర్వధారివీ, ధరాధారివీ, సమస్తరూపధారివీ నీవే. నీకు నమస్సులు.

వర్ధస్వ వర్ధితాశేషత్రైలోక్యసురపూజిత ।
కురుష్వ దైవతపతే మఘోనోఽశ్రుప్రమార్జనమ్ ॥40॥

ముల్లోకాలను వర్ధిల్లజేయు ప్రభూ! వర్ధిల్లుము. ఓ సురపూజితా!, దైవతపతీ! దేవరాజు ఇంద్రునకు అశ్రు మోచనం గావింపుము.

త్వం ధాతా చ విధాతా చ సంహర్తా త్వం మహేశ్వరః ।
మహాలయ మహాయోగిన్ యోగశాయిన్ నమోఽస్తు తే ॥41॥

నీవు ధాతవు, విధాతవు, సంహర్తవు, మహేశ్వరుడవు, నీవు మహాలయరూపివి, మహాయోగివి, యోగశాయివి అట్టి నీకు నమస్కారం.

ఇత్థం స్తుతో జగన్నాథః సర్వాత్మా సర్వగో హరిః ।
ప్రోవాచ భగవాన్ మహ్యం కురూపనయనం విభో ॥42॥

ఇలా స్తోత్రం చేసిన తరువాత జగన్నాథుడైన శ్రీహరి భగవాన్! నాకు ఉపనయనం చేయుమని అర్థించాడు.

తతశ్చకార దేవస్య జాతకర్మాదికాః క్రియాః ।
భరద్వాజో మహాతేజా బార్హస్పత్యస్తపోధనః ॥43॥

వ్రతబన్ధం తథేశస్య కృతవాన్ సర్వశాస్త్రవిత్ ।
తతో దదుః ప్రీతియుతాః సర్వ ఏవ వరాన్ క్రమాత్ ॥44॥

బృహస్పతిగోత్రుడు, మహాతేజస్వియునైన భరద్వాజమహర్షి ఆ భగవంతునకు జాతకర్మాది సంస్కారాలు చేశాడు. సర్వశాస్త్రవేత్తయైన భరద్వాజమహర్షి వామనునకు బ్రహ్మచర్యవ్రతదీక్షనిచ్చాడు. సర్వశాస్త్రవేది ఉపనయనకాండ పూర్తిచేయగానే అక్కడనున్నవారందరు వటువునకు కానుకలు అందజేశారు.

యజ్ఞోపవీతం పులహస్త్వహం చ సితవాససీ ।
మృగాజినం కుంభయోనిర్భరద్వాజస్తు మేఖలామ్ ॥45॥

పాలాశమదదద్దణ్డం మరీచిః బ్రహ్మణః సుతః ।
అక్షసూత్రం వారుణిస్తు కౌశ్యం వేదమథాఙ్గిరాః ॥46॥

ఛత్రం ప్రాదాద్రఘూరాజా ఉపానద్యుగలం నృగః ।
కమండలుం బృహత్తేజాః ప్రాదాద్విష్ణోర్బృహస్పతిః ॥47॥

మహావిష్ణువునకు యజ్ఞోపవీతం పులహుడీయగా, నేను (పులస్త్యుడు) తెల్లని కట్టువస్త్రాలనిచ్చాను. మృగచర్మాన్ని అగస్త్యుడీయగా భరద్వాజుడు మేఖలనిచ్చాడు. పాలాశదండాన్ని బ్రహ్మపుత్రుడైన మరీచి ఈయగా, అక్షసూత్రాన్ని వసిష్ఠుడు, అంగిరసుడు కౌశ్యం (దర్భకూర్చి) యిచ్చాడు. రఘుమహారాజు ఛత్రం సమర్పించగా, నృగమహారాజు పాదుకల జతను ఇచ్చాడు. మహాతేజస్వియైన ఆ వటువునకు బృహస్పతి కమండలమిచ్చాడు.

ఏవం కృతోపనయనో భగవాన్ భూతభావనః ।
సంస్తూయమానో ఋషిభిః సాఙ్గం వేదమధీయత ॥48॥

ఈ విధంగా ఉపనయనకర్మ గావించుకొనిన భూతభావనుడైన విష్ణుభగవానుడు మహర్షులు స్తోత్రాలు చేస్తూండగా సాంగోపాంగంగా వేదాన్ని అధ్యయనం చేశాడు.

భరద్వాజాదాఙ్గిరసాత్సామవేదం మహాధ్వనిమ్ ।
మహదాఖ్యానసంయుక్తం గన్ధర్వసహితం మునే ॥49॥

మాసేనైకేన భగవాన్ జ్ఞానశ్రుతిమహార్ణవః ।
లోకాచారప్రవృత్త్యర్థమభూచ్ఛ్రుతివిశారదః ॥50॥

సర్వశాస్త్రేషు నైపుణ్యం గత్వా దేవోఽక్షయోఽవ్యయః ।
ప్రోవాచ బ్రాహ్మణశ్రేష్ఠం భరద్వాజమిదం వచః ॥51॥

ఓ నారదమునీ! భరద్వాజుని వద్ద మహాధ్వనియుక్తము, మహదాఖ్యానాలతో కూడిన సామవేదం గన్ధర్వ సహితంగా అభ్యసించాడు. వేదశాస్త్రసముద్రుడైన భగవానుడు లోకాచారాన్ని ఆచరణ ద్వారా ప్రవర్తింపజేయడానికి ఒక్క నెలరోజులలోనే వేదశాస్త్రపాండిత్యాన్ని సంపాదించాడు. ఆ విధంగా సర్వశాస్త్రపారంగతుడైన తరువాత అక్షరుడు, అవ్యయుడు, కపట బ్రహ్మచారియునైన వామనుడు బ్రాహ్మణశ్రేష్ఠుడైన భరద్వాజునితో ఇలా పలికాడు.

శ్రీవామన ఉవాచ – వామనుడు పలికాడు.

బ్రహ్మన్ వ్రజామి దేహ్యాజ్ఞాం కురుక్షేత్రం మహోదయమ్ ।
తత్ర దైత్యపతేః పుణ్యో హయమేధః ప్రవర్తతే ॥52॥

సమావిష్టాని పశ్యస్వ తేజాంసి పృథివీతలే ।
యే సంనిధానాః సతతం మదంశాః పుణ్యవర్ధనాః ।
తేనాహం ప్రతిజానామి కురుక్షేత్రం గతో బలిః ॥53॥

బ్రహ్మన్! నాకనుజ్ఞనిచ్చినచో మహాభ్యుదయప్రదమైన కురుక్షేత్రానికి వెళతాను. అక్కడ దైత్యపతియైన బలి పుణ్యప్రదమైన అశ్వమేధయాగం చేస్తున్నాడు. పుణ్యవర్ధకమైన నా తేజో అంశాల ప్రభావం వల్లనే వాటి సంనిధానాన్ని పొంది, బలి కురుక్షేత్రంలో యజ్ఞం చేయగలుగుతున్నాడు. వాటినన్నిటిని అచ్చట చూడవచ్చును.

భరద్వాజ ఉవాచ – భరద్వాజమహర్షి పలికాడు.

స్వేచ్ఛయా తిష్ఠ వా గచ్ఛ నాహమాజ్ఞాపయామి తే ।
గమిష్యామో వయం విష్ణో బలేరధ్వరం మా ఖిద ॥54॥

యద్భవన్తమహం దేవ పరిపృచ్ఛామి తద్వద ।
కేషు కేషు విభో నిత్యం స్థానేషు పురుషోత్తమ ।
సాన్నిధ్యం భవతో బ్రూహి జ్ఞాతుమిచ్ఛామి తత్త్వతః ॥55॥

ఓ విష్ణో! నీకు నేను ఆజ్ఞనీయగలిగినవాడను గాను. నీవు స్వేచ్ఛగా ఉండు. లేదా వెళ్ళు. మనమంతా బలిచక్రవర్తి గావించే యజ్ఞానికి వెళదాము. చింతింపవలదు. ఓ దేవా! నేను మిమ్ములనొకటి ప్రశ్నిస్తున్నాను. దానిని తెలియజేయుము. ఓ పురుషోత్తమా! ఇప్పుడు నీవు చెప్పిన తేజో అంశాలు, విభూతులు, ఏ ఏ స్థానాలలో ఉంటాయో నీవు ఏ ఏ స్థానాలలో సన్నిహితుడవై ఉంటావో వాటినన్నిటిని వివరంగా నాకు తెలియజేయుము. వాస్తవమైన నీ స్థానాలు తెలుసుకోవాలని కుతూహలపడుతున్నాను.

శ్రీవామన ఉవాచ – వామనుడు పలికాడు.

శ్రూయతాం కథయిష్యామి యేషు యేషు గురో అహమ్ ।
నివసామి సుపుణ్యేషు స్థానేషు బహురూపవాన్ ॥56॥

గురువర్యా! వినుము. ఏ యే పుణ్యప్రదేశాలలో బహురూపినైన నేను నివసిస్తున్నానో వివరంగా చెబుతాను. వినుము.

మమావతారైర్వసుధా నభస్తలం పాతాలమంభోనిధయో దివం చ ।
దిశః సమస్తా గిరయోఽమ్బుదాశ్చ వ్యాప్తా భరద్వాజ మమానురూపైః ॥57॥

యే దివ్యా యే చ భౌమా జలగగనచరాః స్థావరా జఙ్గమాశ్చ ।
సేన్ద్రాః సార్కాః సచన్ద్రా యమవసువరుణాహ్యగ్నయః సర్వపాలాః ।

బ్రహ్మాద్యాః స్థావరాన్తా ద్విజఖగసహితా మూర్తిమన్తో హ్యమూర్తా ।
స్తే సర్వే మత్ప్రసూతా బహువివిధగుణాః పూరణార్థం పృథివ్యాః ॥58॥

ఏతే హి ముఖ్యాః సురసిద్ధదానవైః పూజ్యాస్తథా సంనిహితా మహీతలే ।
యైర్దృష్టమాత్రైః సహసైవ నాశం ప్రయాతి పాపం ద్విజవర్య కీర్తనైః ॥59॥

భరద్వాజమహర్షీ! భూమి, ఆకాశం, పాతాళం, సముద్రాలు, దివి, దిక్కులు, సమస్తపర్వతాలు, మేఘాలు, ఇవన్నీ నాకనురూపాలుగానుండే నా వివిధావతారాలతోనే నిండియున్నాయి. స్వర్గంలోను, భూమిమీద, ఆకాశంలోను, జలాలలోను, ఉండే స్థావరజఙ్గమాలైన జీవులు, ఇంద్ర, సూర్య, చంద్ర, యమ, వసు, వరుణ, అగ్ని, లోకపాలకులందరు బ్రహ్మమొదలు స్తంభం వరకు స్థూలంగాను, సూక్ష్మంగాను ఉండే బహువిధాలైన మూర్తులు, అమూర్తులు, పశుపక్ష్యాదులు, అన్నీ ఈ భూమిని నింపేందుకు నేను సృష్టించినవే. ఇవన్నియు నానుండి ఉద్భవించినవే. దేవదానవసిద్ధులచే సృజింపబడే నా ప్రధానమైన అంశాలన్నీ మహీతలం మీద ఉన్నాయి. ఓ ద్విజవర్యా! వీటిని చూసినను, కీర్తించినను అప్పటికప్పుడే, తక్షణమే సకలపాపాలు నశిస్తాయి.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే ప్రహ్లాదతీర్థయాత్రాయాం వామనప్రాదుర్భావే వామనజన్మనామ నవాశీతితమోఽధ్యాయః ॥89॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని ప్రహ్లాదతీర్థయాత్రలో వామనప్రాదుర్భావంలో వామనజననమనే ఎనబైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



నవతితమోఽధ్యాయః - తొంబైయవ అధ్యాయం

విష్ణోఃస్వస్థాన కథనమ్ - విష్ణువుయొక్క స్వస్థానకథనం

శ్రీభగవాన్ ఉవాచ - శ్రీకృష్ణభగవానుడు పలికాడు.

ఆద్యం మాత్స్యం మహద్రూపం సంస్థితం మానసే హ్రదే ।
సర్వపాపక్షయకరం కీర్తనస్పర్శనాదిభిః ॥1॥

ఓ బ్రహ్మర్షీ! నా వ్యక్తరూపాలలో మొదటిది, మహోన్నతమైనది ఈ మత్స్యరూపం. మానససరోవరంలో ఉన్నది. అది కీర్తనస్పర్శనాదులచేతనే సర్వపాపాలను నశింపజేస్తుంది.

కౌర్మ్యమన్యత్సన్నిధానం కౌశిక్యాం పాపనాశనమ్ ।
హయశీర్షం చ కృష్ణాంశే గోవిన్దం హస్తినాపురే ॥2॥

త్రివిక్రమం చ కాలిన్ద్యాం లింగభేదే భవం విభుమ్ ।
కేదారే మాధవం శౌరిం కుబ్జామ్రే హృష్టమూర్ధజమ్ ॥3॥

నారాయణం బదర్యాం చ వారాహే గరుడాసనమ్ ।
జయేశం భద్రకర్ణే చ విపాశాయాం ద్విజప్రియమ్ ॥4॥

పాపనాశకమైన కూర్మరూపం కౌశికినదిలో సన్నిహితమైఉంది. కృష్ణాంశతీర్థంలో హయశీర్షం, హస్తినాపురంలో గోవిందరూపాలు ఉన్నాయి. యమునలో త్రివిక్రమరూపం, లింగభేదంలో భవరూపం, కేదారంలో మాధవ శౌరిరూపాలు, కుబ్జామ్రంలో హృష్టమూర్ధజ రూపాలు ఉన్నాయి. బదరికావనంలోని నారాయణుడు, వారాహ క్షేత్రంలో గరుడాసనరూపం, భద్రకర్ణంలో జయేశుడు, విపాశానదీతీరంలో ద్విజప్రియుడు, విద్యమానులౌతారు.

రూపధారమిరావత్యాం కురుక్షేత్రే కురుధ్వజమ్ ।
కృతశౌచే నృసింహం చ గోకర్ణే విశ్వకర్మిణమ్ ॥5॥

ప్రాచీనే కామపాలం చ పుండరీకం మహాంభసి ।
విశాఖయూపే హ్యజితం హంసం హంసపదే తథా ॥6॥

ఇరావతిలోని రూపధరుడు, కురుక్షేత్రంలో కురుధ్వజుడు, కృతశౌచంలో నృసింహుడు, గోకర్ణంలోని విశ్వకర్మ, ప్రాచీనంలో కామపాలుడు, మహాంభసంలోని పుండరీకుడు, విశాఖయూపంలో అజితుడు, హంసపదిలోని హంసుడు, నా రూపాలే.

పయోష్ణాయామఖండం చ వితస్తాయాం కుమారిలమ్ ।
మణిమత్పర్వతే శంభుం బ్రహ్మణ్యే చ ప్రజాపతిమ్ ॥7॥

మధునద్యాం చక్రధరం శూలబాహుం హిమాలయే ।
విద్ధి విష్ణుం మునిశ్రేష్ఠ స్థితమోషధిసానుని ॥8॥

ఓ మునిశ్రేష్ఠా! పయోష్ణిలోని అఖండుడు, వితస్తలోని కుమారిలుడు, మణిపర్వతంలోని శంభుడు, బ్రహ్మణ్య క్షేత్రంలోని ప్రజాపతి, మధునదిలోని చక్రధరుడు, హిమాలయంలోని శూలపాణి, ఓషధిప్రస్థాన గల విష్ణువు, నా రూపాలే.

భృగుతుంగే సువర్ణాక్షం నైమిషే పీతవాససమ్ ।
గయాయాం గోపతిం దేవం గదాపాణినమీశ్వరమ్ ॥9॥

త్రైలోక్యనాథం వరదం గోప్రతారే కుశేశయమ్ ।
అర్ధనారీశ్వరం పుణ్యే మాహేంద్రే దక్షిణే గిరౌ ॥10॥

గోపాలముత్తరే నిత్యం మహేంద్రే సోమపీథినమ్ ।
వైకుంఠమపి సహ్యాద్రౌ పారియాత్రేఽ పరాజితమ్ ॥11॥

భృగుతుంగంలోని సువర్ణాక్షుడు, నైమిశంలోని పీతాంబరుడు, గయలోని గదాధరుడు, గోపతీశ్వరుడు, గోప్రతానంలోని త్రైలోక్యనాథ, వరద, కుశేశయరూపాలు, దక్షిణాన పవిత్రమైన మహేంద్రగిరిపై అర్ధనారీశ్వరుడు, ఉత్తరమహేంద్రంలో గోపాల, సోమపీథిమూర్తులు, సహ్యాద్రిపై వెలసిన వైకుంఠుడు, పారియాత్రాచలంపై అపరాజితుడు నా రూపాలే.

కశేరుదేశే దేవేశం విశ్వరూపం తపోధనమ్ ।
మలయాద్రౌ చ సౌగన్ధిం విన్ధ్యపాదే సదాశివమ్ ॥12॥

అవన్తివిషయే విష్ణుం నిషధేష్వమరేశ్వరమ్ ।
పాంచాలికం చ బ్రహ్మర్షే పాంచాలేషు వ్యవస్థితమ్ ॥13॥

మహోదయే హయగ్రీవం ప్రయాగే యోగశాయినమ్ ।
స్వయంభువం మధువనే అయోగన్ధిం చ పుష్కరే ॥14॥

తథైవ విప్రప్రవర వారాణస్యాం చ కేశవమ్ ।
అవిముక్తకమత్రైవ లోలశ్చాత్రైవ గీయతే ॥15॥

ఓ బ్రహ్మర్షీ! కశేరుదేశంలోని దేవేశ్వరుడు, విశ్వరూపుడు, తపోధనరూపుడు, మలయపర్వతంపైన గల సుగంధి, వింధ్యపాదానగల సదాశివుడు, నా విభూతులేనని తెలుసుకో. భరద్వాజా! అవంతిదేశాన విష్ణువు, నిషధలోని అమరేశ్వరుడు, పాంచాలభూమియందలి పాంచాలికదేవుడు, మహోదయంలోని హయగ్రీవుడు, ప్రయాగలోని యోగశాయి, మధువనంలోని స్వయంభూదేవుడు, పుష్కరంలోని అయోగన్ధిరూపాలు నా అంశాలే. ఓ విప్రవరా! అదే విధంగా వారణాసిలోని కేశవరూపం, అక్కడేవున్న అవిముక్తకరూపం, లోలరూపం కూడా నా రూపాలుగానే యున్నట్లు గానం చేయబడుతోంది.

పద్మాయాం పద్మకిరణం సముద్రే బడబాముఖమ్ ।
కుమారధారే బాహ్లీశం కార్తికేయం చ బర్హిణమ్ ॥16॥

అజేశే శంభుమనఘం స్థాణుం చ కురుజాఙ్గలే ।
వనమాలినమాహుర్మాం కిష్కిన్ధావాసినో జనాః ॥17॥

పద్మక్షేత్రంలో పద్మకిరణరూపంలో, సముద్రంలో బడబాముఖంగా, కుమారధారలో బాహ్లీశ, కార్తికేయ బర్హిణులుగా, అజేశంలో శంభుడు, అనఘరూపాలలో, కురుజాంగలంలో స్థాణువుగా, కిష్కింధవాసులచే వనమాలిగా పిలువబడతూ యున్నాను. ఇవి యన్నియు నా అంశాలే.

వీరం కువలయారూపం శంఖచక్రగదాధరమ్ ।
శ్రీవత్సాఙ్కముదారాంగం నర్మదాయాం శ్రియఃపతిమ్ ॥18॥

మాహిష్మత్యాం త్రినయనం తత్రైవ చ హుతాశనమ్ ।
అర్బుదే చ త్రిసౌపర్ణం క్ష్మాధరం సూకరాచలే ॥19॥

త్రిణాచికేతం బ్రహ్మర్షే ప్రభాసే చ కపర్దినమ్ ।
తథైవాత్రాపి విఖ్యాతం తృతీయం శశిశేఖరమ్ ॥20॥

ఓ బ్రహ్మర్షీ! నర్మదలోనున్న నన్ను వీరుడని, కువలయారూఢుడని, శంఖచక్రగదాధరుడని, శ్రీవత్సాంకుడని, ఉదారాంగుడని, శ్రీపతియనియు పిలుస్తారు. మాహిష్మతిలో త్రినయనుడని, హుతాశనుడని, అర్బుదక్షేత్రంలో త్రిసౌపర్ణుడని, సూకరాచలంలో క్ష్మాధరుడని నాకు పేర్లు. ప్రభాసక్షేత్రంలో త్రినాచికేత, కపర్ది, సోమశేఖర రూపాలలో నేనుంటాను.

ఉదయే శశినం సూర్యం ధ్రువం చ త్రితయం స్థితమ్ ।
హేమకూటే హిరణ్యాక్షం స్కందం శరవణే మునే ॥21॥

ఓ మునివర్యా! ఉదయతీర్థాన శశిసూర్యధ్రువులుగా, హేమకూటంలో హిరణ్యాక్షుడుగా, శరవణంలో స్కందుడుగానున్నాను.

మహాలయే స్మృతం రుద్రముత్తరేషు కురుష్వథ ।
పద్మనాభం మునిశ్రేష్ఠ సర్వసౌఖ్యప్రదాయకమ్ ॥22॥

ఓ మునిశ్రేష్ఠా! మహాలయంలో రుద్రుడుగా, ఉత్తరకురుదేశాన సర్వసౌఖ్యప్రదాయకుడగు పద్మనాభుడుగా నాకు ప్రసిద్ధి.

సప్తగోదావరే బ్రహ్మన్ విఖ్యాతం హాటకేశ్వరమ్ ।
తత్రైవ చ మహాహంసం ప్రయాగేఽపి వటేశ్వరమ్ ॥23॥

బ్రహ్మన్! సప్తగోదావరిక్షేత్రాన హాటకేశ్వరుడుగా, మహాహంసగా, ప్రయాగలో వటేశ్వరుడుగా నాకు పేర్లు.

శోణే చ రుక్మకవచం కుండినే ఘ్రాణతర్పణమ్ ।
భిల్లీవనే మహాయోగం మాద్రేషు పురుషోత్తమమ్ ॥24॥

ప్లక్షావతరణే విశ్వం శ్రీనివాసం ద్విజోత్తమ ।
శూర్పారకే చతుర్బాహుం మగధాయాం సుధాపతిమ్ ॥25॥

గిరివ్రజే పశుపతిం శ్రీకంఠం యమునాతటే ।
వనస్పతిం సమాఖ్యాతం దణ్డకారణ్యవాసినమ్ ॥26॥

ఓ ద్విజోత్తమా! శోణక్షేత్రంలో రుక్మకవచుడను, కుండినంలో ఘ్రాణతర్పణుడను, భిల్లీవనంలో మహాయోగిని, మద్రదేశంలో పురుషోత్తముడను నేనే. ప్లక్షావతరణంలో విశ్వుడుగా, శ్రీనివాసుడుగా, శూర్పారకంలో చతుర్భుజుడుగా, మగధలో సుధాపతిగా నన్ను పేర్కొంటారు. గిరివ్రజంలో పశుపతిగా, యమునాతీరంలో శ్రీకంఠుడుగా, దండకారణ్య వాసులచే వనస్పతిగా కీర్తింపబడుతున్నాను.

కాలిఞ్జరే నీలకంఠం సరయ్వాం శంభుముత్తమమ్ ।
హంసయుక్తం మహాకోశ్యాం సర్వపాపప్రణాశనమ్ ॥27॥

గోకర్ణే దక్షిణే శర్వం వాసుదేవం ప్రజాముఖే ।
వింధ్యశృంగే మహాశౌరిం కంథాయాం మధుసూదనమ్ ॥28॥

త్రికూటశిఖరే బ్రహ్మన్ చక్రపాణినమీశ్వరమ్ ।
లౌహదండే హృషీకేశం కోసలాయాం మనోహరమ్ ॥29॥

కాలింజరంలో నీలకంఠుడను, సరయూతీర్థాన శంభుడను, మహాకోశిలో హంసయుక్తుడను, దక్షిణ గోకర్ణంలో శర్వుడను, ప్రజాముఖతీర్థంలో వాసుదేవుడను, వింధ్యశిఖరాన మహాశౌరిని, కంథలో మధుసూదనుడను గాను ఉన్నాను. ఓ బ్రహ్మన్! త్రికూటశిఖరాన చక్రపాణి, ఈశ్వరులు, లౌహదండంలో హృషీకేశుడుగా, కోసలలో మనోహరుడుగా ఉన్నాను.

మహాబాహుం సురాష్ట్రే చ నవరాష్ట్రే యశోధరమ్ ।
భూధరం దేవికానద్యాం మహోదాయాం కుశప్రియమ్ ॥30॥

గోమత్యాం ఛాదితగదం శంఖోద్ధారే చ శంఖినమ్ ।
సునేత్రం సైంధవారణ్యే శూరం శూరపురే స్థితమ్ ॥31॥

రుద్రాఖ్యం చ హిరణ్వత్యాం వీరభద్రం త్రివిష్టపే ।
శంకుకర్ణం చ భీమాయాం భీమం శాలవనే విదుః ॥32॥

సురాష్ట్రంలో మహాభుజుడుగా, నవరాష్ట్రంలో యశోధరుడుగా, దేవికానదిలో భూధరుడుగా, మహోదంలో కుశప్రియుడుగా నన్ను పేర్కొంటారు. గోమతిలో ఛాదితగదుడుగా, శంఖోద్ధారంలో శంఖువుగా, సైంధవారణ్యంలో సునేత్రుడుగా, శూరపురంలో శూరుడుగా నేనే ఉన్నాను. హిరణ్వతిలో నేను రుద్రుడను, త్రివిష్టపంలో వీరభద్రుడను, భీమతీర్థంలో శంకుకర్ణుడను, శాలవనంలో భీముడను నేనేయని తెలుసుకోవాలి.

విశ్వామిత్రం చ గదితం కైలాసే వృషభధ్వజమ్ ।
మహేశం మహిలాశైలే కామరూపే శశిప్రభమ్ ॥33॥

బలభ్యామపి గోమిత్రం కటాహే పంకజప్రియమ్ ।
ఉపేంద్రం సింహలద్వీపే శక్రాహ్వే కుందమాలినమ్ ॥34॥

రసాతలే చ విఖ్యాతం సహస్రశిరసం మునే ।
కాలాగ్నిరుద్రం తత్రైవ తథాఽన్యం కృత్తివాససమ్ ॥35॥

అక్కడనే నా విశ్వామిత్రరూపమున్నది. కైలాసాన వృషభధ్వజుడను, మహిలాగిరిపై మహేశుడను, కామరూపంలో శశిప్రభుడను, బలభిలో గోమిత్రుడను, కటాహంలో పంకజప్రియుడను, సింహళద్వీపంలో ఉపేంద్రుడను, శక్రతీర్థంలో కుందమాలాధరుడను, రసాతలంలో సహస్రశీర్షుడైన ఆదిశేషునిగా విఖ్యాతుడను. ఓ మునివర్యా! అక్కడనే కాలాగ్నిరుద్ర కృత్తివాసుల రూపాలలోకూడనున్నాను.

సుతలే కూర్మమచలం వితలే పంకజాసనమ్ ।
మహాతలే గురో ఖ్యాతం దేవేశం ఛాగలేశ్వరమ్ ॥36॥

తలే సహస్రచరణం సహస్రభుజమీశ్వరమ్ ।
సహస్రాక్షం పరిఖ్యాతం ముసలాకృష్టదానవమ్ ॥37॥

పాతాలే యోగినామీశం స్థితం చ హరిశంకరమ్ ।
ధరాతలే కోకనదం మేదిన్యాం చక్రపాణినమ్ ॥38॥

ఓ గురూ! సుతలలోకంలో కూర్మ అచలరూపాలలోను, వితలంలో పంకజాసనుడుగాను యున్నాను. మహాతలంలో దేవేశుడుగా, ఛాగలేశ్వరుడుగా విఖ్యాతుడను. తలలోకంలో సహస్రచరణునిగా, సహస్రభుజుడుగా, సహస్రాక్షుడుగా, ఈశ్వరుడుగా, ముసలాకృష్టదానవుడుగా ప్రఖ్యాతి గాంచాను. పాతాళంలో యోగీశ, హరిశంకర రూపాలలోను, ధరాతలంలో కోకనదుడుగాను, మేదినియందు చక్రపాణిగాను ప్రసిద్ధుడనయ్యాను.

భువర్లోకే చ గరుడం స్వర్లోకే విష్ణుమవ్యయమ్ ।
మహర్లోకే తథాఽగస్త్యం కపిలం చ జనే స్థితమ్ ॥39॥

తపోలోకేఽఖిలం బ్రహ్మన్ వాఙ్మయం సత్యసంయుతమ్ ।
బ్రహ్మాణం బ్రహ్మలోకే చ సప్తమే వై ప్రతిష్ఠితమ్ ॥40॥

సనాతనం తథా శైలే పరం బ్రహ్మ చ వైష్ణవే ।
అప్రతర్క్యం నిరాలంబే నిరాకాశే తపోమయమ్ ॥41॥

భువర్లోకాన నేను గరుడుడను, స్వర్లోకంలో అవ్యయుడనైన విష్ణువును, మహర్లోకంలో అగస్త్యుడను, జనోలోకంలో కపిలుడను. ఓ బ్రహ్మన్! తపోలోకంలో అఖిలవాఙ్మయసత్యసంయుతరూపాలు, ఏడవదియగు లోకాన బ్రహ్మరూపంగాను నేను ప్రతిష్ఠనందుతున్నాను. శైవంలో సనాతనుడను, వైష్ణవంలో పరబ్రహ్మను, నిరాలంబస్థితిలో అప్రతర్క్యుడను నేనే. నిరాకాశంలో తపోమయుడను నేనే.

జంబూద్వీపే చతుర్బాహుం కుశద్వీపే కుశేశయమ్ ।
ప్లక్షద్వీపే మునిశ్రేష్ఠ ఖ్యాతం గరుడవాహనమ్ ॥42॥

పద్మనాభం తథా క్రౌంచే శాల్మలే వృషభధ్వజమ్ ।
సహస్రాంశుః స్థితః శాకే ధర్మరాట్ పుష్కరే స్థితః ॥43॥

తథా పృథివ్యాం బ్రహ్మర్షే శాలగ్రామే స్థితోఽస్మ్యహమ్ ।
సజలస్థలపర్యన్తం చరేషు స్థావరేషు చ ॥44॥

ఏతాని పుణ్యాని మమాలయాని బ్రహ్మన్ పురాణాని సనాతనాని ।
ధర్మప్రదానీహ మహౌజసాని సంకీర్తనీయాన్యఘనాశనాని ॥45॥

సంకీర్తనాత్ స్మరణాద్దర్శనాచ్చ సంస్పర్శనాదేవ చ దేవతాయాః ।
ధర్మార్థకామాద్యపవర్గమేవ లభన్తి దేవా మనుజాః ససాధ్యాః ॥46॥

ఏతాని తుభ్యం వినివేదితాని మమాలయానీహ తపోమయాని ।
ఉత్తిష్ఠ గచ్ఛామి మహాసురస్య యజ్ఞం సురాణాం హి హితాయ విప్ర ॥47॥

ఓ మునిశ్రేష్ఠా! జంబూద్వీపంలో చతుర్భుజుడుగాను, కుశద్వీపంలో కుశేశయుడుగాను, ప్లక్షద్వీపంలో గరుడవాహనుడుగాను ఖ్యాతి వహించాను. నన్ను క్రౌంచద్వీపంలో పద్మనాభుడని, శాల్మలంలో వృషభధ్వజుడని, శాకద్వీపంలో సహస్రాంశుడని, పుష్కరద్వీపంలో ధర్మరాట్టని పిలుస్తారు. ఓ బ్రహ్మర్షీ! ఈ పృథివియందు శాలగ్రామంలో నా నివాసం. జలస్థలాలలోగల స్థావరజంగమ జీవులన్నిటిలోను నేను నివసిస్తాను. ఇవి అన్నియు పుణ్యప్రదమైన, పురాతనమైన, సనాతనమైన, ధర్మప్రదమైన, తేజోమయమైన, పాపనాశకమైన నా నివాస స్థానాలుగా కీర్తింపదగినవి. ఈ దేవతారూపాల దర్శన, స్పర్శన, కీర్తన, స్మరణాదులద్వారా దేవమానవసాధ్యులందరు నాల్గు విధాలైన ధర్మార్థకామమోక్షాలనే పురుషార్థాలను సాధించగలుగుతారు. ఇది నిశ్చయం. ఓ బ్రాహ్మణోత్తమా! తపోమయమైన నా విభూతిస్థానాలనన్నిటిని నీకు తెలియజేశాను. లెమ్ము! దేవతలకు శుభం కలిగించడానికి మనం మహాసురుడైన బలి గావిస్తున్న యజ్ఞానికి వెళదాం.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్త్వా వచనం మహర్షే విష్ణుర్భరద్వాజమృషిం మహాత్మా ।
విలాసలీలాగమనో గిరీన్ద్రాత్ స చాభ్యగచ్ఛత్ కురుజాంగలం హి ॥48॥

ఓ నారదమహర్షీ! వామనుడైన విష్ణుభగవానుడు మహాత్ముడైన భరద్వాజమహర్షితో ఈ విధంగా పలికి, లీలావిలాసాలు ప్రకటిస్తూ, ఆ పర్వతం నుండి కురుజాంగలానికి వెళ్ళాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే స్వస్థానకథనం నామ నవతితమోఽధ్యాయః ॥90॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో స్వస్థానకథనమనే తొంబైయవ అధ్యాయం సమాప్తం.

ఏకనవతితమోఽధ్యాయః - తొంబైఒకటవ అధ్యాయం

శుక్ర, బలిసంవాదః - శుక్ర, బలిసంవాదం

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

తతః సమాగచ్ఛతి వాసుదేవే మహీ చకంపే గిరయశ్చ చేలుః ।
క్షుబ్ధాః సముద్రా దివి ఋక్షమణ్డలో బభౌ విపర్యస్తగతిర్మహర్షే ॥1॥

యజ్ఞః సమాగాత్ పరమాకులత్వం న వేద్మి కిం మే మధుహా కరిష్యతి ।
యథా ప్రదగ్ధోఽస్మి మహేశ్వరేణ కిం మాం న సంధక్ష్యతి వాసుదేవః ॥2॥

ఋక్సామమంత్రాహుతిభిర్హుతాభిర్వితానకీయాన్ జ్వలనాస్తు భాగాన్ ।
భక్త్యా ద్విజేంద్రైరపి సంప్రపాదితాన్ నైవ ప్రతీచ్ఛన్తి విభోర్భయేన ॥3॥

తాన్ దృష్ట్వా ఘోరరూపాంస్తు ఉత్పాతాన్దానవేశ్వరః ।
పప్రచ్ఛోశనసం శుక్రం ప్రణిపత్య కృతాంజలిః ॥4॥

నారదా! భగవంతుడైన వామనుడు బయలుదేరగానే భూమి కంపించింది. పర్వతాలు కదలిపోయాయి. సముద్రాలు క్షోభించాయి. ఆకాశంలోని నక్షత్రమండలమంతా తమ గతులు తప్పాయి. యజ్ఞం వ్యాకులమయ్యింది. అయ్యో! మధుసూదనుడు నన్నేమి చేయనున్నాడో గదా! పూర్వం మహేశ్వరునకువలె ఈ వాసుదేవుడుకూడా నన్ను దగ్ధం చేస్తాడా ఏమి?. ఋక్సామమంత్రాలతో బ్రాహ్మణులు చక్కగా సమర్పించినప్పటికి ఆ ప్రభువునకు భయపడి, యజ్ఞాగ్నులు హవిర్భాగాలను స్వీకరించడం లేదు. భయంకరమైన ఈ ఉత్పాతాలను చూసి దైత్యనాయకుడగు బలి చేతులు జోడించి శుక్రాచార్యునితో ఇలా పలికాడు.

కిమర్థమాచార్య మహీ సశైలా రమ్భేవ వాతాభిహతా చచాల ।
కిమాసురీయాన్ సుహుతానపీహ భాగాన్ న గృహ్ణన్తి హుతాశనాశ్చ ॥5॥

క్షుబ్ధాః కిమర్థం మకరాలయాశ్చ భో ఋక్షా న ఖే కిం ప్రచరన్తి పూర్వవత్ ।
దిశః కిమర్థం తమసా పరిప్లుతా దోషేణ కస్యాద్య వదస్వ మే గురో ॥6॥

ఆచార్యా! గాలితాకిడికి కదలిపోయే అరటిచెట్టు వలె భూమి ఎందులకు చలిస్తోంది? పర్వతాలు ఎందులకు ఊగిపోతున్నాయి? మన అసురులు సమర్పించే మంత్రపూతమైన ఆహుతులను, హవిస్సులను, అగ్నులు ఎందుకు స్వీకరించడం లేదు?. అయ్యా! గురువర్యా! సముద్రాలు ఎందుకు క్షోభిస్తున్నాయి? నక్షత్రాలు ఆకాశంలో ఎప్పటి వలె ఎందుకు ప్రకాశించడంలేదు? దిక్కులు చీకట్లతో ఎందుకు నిండిపోయాయి? ఎవరి దోషం వల్ల ఈ విపరీతాలు జరుగుతున్నాయో దయతో తెలియజేయండి.

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

శుక్రస్తద్వాక్యమాకర్ణ్య విరోచనసుతేరితమ్ ।
అథ జ్ఞాత్వా కారణం చ బలిం వచనమబ్రవీత్ ॥7॥

విరోచనుని కుమారుడైన బలి పలికిన మాటలను శుక్రుడువిని, అందులకు కారణాలు గ్రహించి బలితో ఇలా పలికాడు.

శుక్ర ఉవాచ – శుక్రుడు పలికాడు.

శృణుష్వ దైత్యేశ్వర యేన భాగాన్ నామీ ప్రతీచ్ఛన్తి హి ఆసురీయాన్ ।
హుతాశనా మంత్రహుతానపీహ నూనం సమాగచ్ఛతి వాసుదేవః ॥8॥

తదంఘ్రివిక్షేపమపారయన్తీ మహీ సశైలా చలితా దితీశ ।
తస్యాం చలత్యాం మకరాలయామీ ఉద్వృత్తవేలా దితిజాద్య జాతాః ॥9॥

దైత్యేశ్వరా! అసురులచే చక్కగా వ్రేల్చబడిన హవిర్భాగాలను అగ్నులు స్వీకరించడం లేదన్నచో వాసుదేవుడు ఇక్కడకు తప్పక వస్తూంటాడు. ఓ దైత్యేశా! వాసుదేవుని పాదవిక్షేపం వల్ల సముద్రాలన్నీ చలించి చెలియలకట్టలు దాటుతున్నాయి. భూమి కంపిస్తోంది. పర్వతాలు చలిస్తున్నాయి. అందులకే ఇప్పుడు ఇలా జరుగుతోంది.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

శుక్రస్య వచనం శ్రుత్వా బలిర్భార్గవమబ్రవీత్ ।
ధర్మ్యం సత్యం చ పథ్యం చ సర్వోత్సాహసమీరితమ్ ॥10॥

శుక్రుని మాటలువిని, బలి భార్గవునితో మహోత్సాహపూరితుడై సత్యధర్మసహితాలు, హితకరాలు అయిన మాటలిలా పలికాడు.

బలిరువాచ – బలి పలికాడు.

ఆయాతే వాసుదేవే వద మమ భగవన్ ధర్మకామార్థతత్త్వమ్ ।
కిం కార్యం కిం చ దేయం మణికనకమథో భూగజాశ్వాదికం వా ॥

కిం వా వాచ్యం మురారేర్నిజహితమథవా తద్ధితం వా ప్రయుంజే ।
తథ్యం పథ్యం ప్రియం భో మమ వద శుభదం తత్కరిష్యే న చాన్యత్ ॥11॥

భగవన్! వాసుదేవుడే వస్తున్నప్పుడు ధర్మార్థకామసమ్మతంగా నేనేమి చేయాలో, నేనేమి దానం చేయాలో, నా కర్తవ్యమేమిటో తెలియజేయండి. భూగజాశ్వాదులలో నేనీయవలసినదేమిటో, ఆ ప్రభువుతో నేనేమి మాట్లాడాలో, స్వలాభం, స్వామిలాభం వీటిలో దేనిని అనుష్ఠించాలో ఈ విషయాలన్నీ నాకు ప్రియకరంగా, హితకరంగా, సత్యవిహితంగా సెలవివ్వండి. నేనావిధంగానే చేస్తాను. వేరే విధంగా చేయను.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

తద్వాక్యం భార్గవః శ్రుత్వా దైత్యనాథేరితం వరమ్ ।
విచిన్త్య నారద ప్రాహ భూతభవ్యవిదీశ్వరః ॥12॥

ఓ నారదా! దైత్యనాథుడు పలికిన ఉత్తమవాక్యాలు విని, త్రికాలజ్ఞుడైన భార్గవుడు బాగుగా ఆలోచించి అతనితో ఇలా పలికాడు.

త్వయా కృతా యజ్ఞభుజోఽసురేంద్రా బహిష్కృతా యే శ్రుతిదృష్టమార్గే ।
శ్రుతిప్రమాణం మఖభోజినో బహిః సురాస్తదర్థం హరిరభ్యుపైతి ॥13॥

తస్యాధ్వరం దైత్యసమాగతస్య కార్యం హి కిం మాం పరిపృచ్ఛసే యత్ ।
కార్యం న దేయం హి విభో తృణాగ్రం యదధ్వరే భూకనకాదికం వా ॥14॥

వాచ్యం తథా సామ నిరర్థకం విభో కస్తే వరం దాతుమలం హి శక్నుయాత్ ।
యస్యోదరే భూర్భువనాకపాలరసాతలేశా నివసన్తి నిత్యశః ॥15॥

అసురేంద్రా! శ్రద్ధగా వినుము. వేదాలు అసురులకు యజ్ఞభాగభోక్తృత్వాన్ని నిషేధించాయి. శ్రుతి ప్రమాణంగా యజ్ఞభాగార్హులైన దేవతలు నీ యజ్ఞంలో తిరస్కరింపబడ్డారు. వేదోక్తంగా దేవతలకు వారి భాగాలు ఇవ్వకపోవడం, వేదభిన్నంగా దైత్యులకు హవిస్సులు సమర్పించడం చూసి శ్రీహరి ఇచ్చటకు వస్తున్నాడు. ఆయన యజ్ఞానికి వచ్చినప్పుడు ఏమి చేయాలని నన్నడిగావు. అందులకు సమాధానం చెబుతున్నాను. విను. ఈ యజ్ఞంలో విష్ణువునకు భూకనకాదులే కాదు ఒక్క తృణాగ్రం కూడా నీవు ఈయరాదు. అయితే తీపి వ్యర్థపుమాటలు సామవాక్యాల వలె ఆయనతో ఇలా పలకాలి. "ఎవరి ఉదరంలో భూర్భువస్స్వర్లోకాల పాలకులు, రసాతలాధీశులు ఎల్లప్పుడు నివసిస్తూ ఉంటారో అటువంటి నీకు ఎవరుమాత్రం ఏమీయగలరు ప్రభూ?" అని చెప్పాలి.

బలిరువాచ – బలి పలికాడు.

మయా న చోక్తం వచనం హి భార్గవ న చాస్తి మహ్యం న చ దాతుముత్సహే ।
సమాగతేఽప్యర్థిని హీనవృత్తే జనార్దనే లోకపతౌ కథం తు ॥16॥

ఏవం చ శ్రూయతే శ్లోకః సతాం కథయతాం విభో ।
సద్భావో బ్రాహ్మణేష్వేవ కర్తవ్యో భూతిమిచ్ఛతా ।
దృశ్యతే హి తథా తచ్చ సత్యం బ్రాహ్మణసత్తమ ॥17॥

పూర్వాభ్యాసేన కర్మాణి సంభవన్తి నృణాం స్ఫుటమ్ ।
వాక్కాయమానసానీహ యోన్యన్తరగతాన్యపి ॥18॥

కిం వా త్వయా ద్విజశ్రేష్ఠ పౌరాణీ న శ్రుతా కథా ।
యా వృత్తా మలయే పూర్వం కోశకారసుతస్య తు ॥19॥

ఓ భార్గవా! ఎట్టి యాచకుడు వచ్చి యాచించినను నేనింతవరకు "నా దగ్గర ఏమీ లేదు. నేను నీకు ఇచ్చుటకు ఉత్సహించుట లేదు" అని పలుకలేదు. అటువంటప్పుడు లోకపతియైన జనార్దనుడే వచ్చి అర్థిస్తే ఎలా కాదనగలను?. ఓ విభో! ఐశ్వర్యం కాంక్షించేవారందరు బ్రాహ్మణులను గౌరవించాలని ఆర్యోక్తి కలదు గదా!

బ్రాహ్మణోత్తమా! అది నిజమని కూడా ప్రపంచంలో కనిపిస్తోంది. పూర్వాభ్యాసవశాన జన్మాంతరంలో కూడా పూర్వజన్మలోని అలవాట్లు మనోవాక్కాయాలలో వెంటనంటియుంటాయని స్ఫుటంగా తెలుస్తోంది. ఓ ద్విజశ్రేష్ఠా! పూర్వకాలంలో మలయపర్వతంపై జరిగిన కోశకారపుత్రుని వృత్తాంతం నీవు వినలేదా?.

శుక్ర ఉవాచ – శుక్రుడు పలికాడు.

కథయస్వ మహాబాహో కోశకారసుతాశ్రయామ్ ।
కథాం పౌరాణికీం పుణ్యాం మహాకౌతూహలం హి మే ॥20॥

ఓ మహాబాహూ! పురాతనమైనదియు, పుణ్యప్రదమైనదియునైన కోశకారసుతుని కథను నేను వినలేదు. కావున నాకు వినాలని చాలా కుతూహలంగా ఉంది. నీవు వినిపించుమని శుక్రుడు బలిని అడిగాడు.

బలిరువాచ – బలి పలికాడు.

శృణుష్వ కథయిష్యామి కథామేతాం మఖాన్తరే ।
పూర్వాభ్యాసనిబద్ధాం హి సత్యాం భృగుకులోద్వహ ॥21॥

ఓ భృగుకులశ్రేష్ఠా! పూర్వాభ్యాసబలానికి సంబంధించిన యథార్థగాథను ఈ యజ్ఞసమయంలో మీకు వినిపిస్తున్నాను. వినండి.

ముద్గలస్య మునేః పుత్రో జ్ఞానవిజ్ఞానపారగః ।
కోశకార ఇతి ఖ్యాత ఆసీద్బ్రహ్మంస్తపోరతః ॥22॥

తస్యాసీద్దయితా సాధ్వీ ధర్మిష్ఠా నామతః శ్రుతా ।
సతీ వాత్స్యాయనసుతా ధర్మశీలా పతివ్రతా ॥23॥

తస్యామస్య సుతో జాతః ప్రకృత్యా వై జడాకృతిః ।
మూకవన్నాలపతి స న చ పశ్యతి చాన్ధవత్ ॥24॥

తం జాతం బ్రాహ్మణీపుత్రం జడం మూకం త్వచక్షుషమ్ ।
మన్యమానా గృహద్వారి షష్ఠేఽహని సముత్సృజత్ ॥25॥

పూర్వకాలంలో ముద్గలమునిపుత్రుడు, జ్ఞానవిజ్ఞానపారంగతుడు, తపోనిరతుడునగు కోశకారుడనేవాడు ఉండేవాడు. అతని భార్యపేరు ధర్మిష్ఠ. ఆమె వాత్స్యాయనుని కుమార్తె. ధర్మశీల, పతివ్రత. ఆమెవలన ఆ మునికి జడాకృతియైన కుమారుడు కలిగాడు. ఆ శిశువు మూగవాని వలె మాట్లాడలేక, గ్రుడ్డివానివలె చూడలేక యుండగా ఆ బ్రాహ్మణియైన ధర్మిష్ఠ ఆ శిశువును మూగ, గ్రుడ్డి, మొద్దుగా తలచి పుట్టినయారవనాడు తన ఇంటి వాకిటిలో వదిలివేసింది.

తతోఽభ్యాగాద్దురాచారా రాక్షసీ జాతహారిణీ ।
స్వం శిశుం కృశమాదాయ సూర్పాక్షీ నామ నామతః ॥26॥

తత్రోత్సృజ్య స్వపుత్రం సా జగ్రాహ ద్విజనన్దనమ్ ।
తమాదాయ జగామాథ భోక్తుం శాలోదరే గిరౌ ॥27॥

అంతట అక్కడకు సూర్పాక్షి అను పేరు గల పసికందులను అపహరించే పాపిష్ఠిరాక్షసి బక్కచిక్కిన తన శిశువుతో సహా అక్కడకు వచ్చింది. తన పుత్రుని అక్కడ వదలి, ఆ బ్రాహ్మణ శిశువును తీసికొని ఆ శిశువును భక్షించేందులకు శాలోదరపర్వతానికి వెళ్ళింది.

తతస్తామాగతాం వీక్ష్య తస్యా భర్తా ఘటోదరః ।
నేత్రహీనః ప్రత్యువాచ కిమానీతస్త్వయా ప్రియే ॥28॥

సాऽబ్రవీద్రాక్షసపతే మయా స్థాప్య నిజం శిశుమ్ ।
కోశకారద్విజగృహే తస్యానీతః ప్రభో సుతః ॥29॥

స ప్రాహ న త్వయా భద్రే భద్రమాచరితం త్వితి ।
మహాజ్ఞానీ ద్విజేంద్రోऽసౌ తతః శప్స్యతి కోపితః ॥30॥

తస్మాచ్ఛీఘ్రమిమం త్యక్త్వా మనుజం ఘోరరూపిణమ్ ।
అన్యస్య కస్యచిత్పుత్రం శీఘ్రమానయ సున్దరి ॥31॥

ఆ రాక్షసిభర్త గ్రుడ్డివాడైన ఘటోదరుడు. అలా వచ్చిన తన భార్యను వాడు ప్రియా! నీవీరోజు నీతో ఏమి తెచ్చావని అడిగాడు. అందులకా రాక్షసి తన భర్తతో రాక్షసేశ్వరా! నా బిడ్డను కోశకారుడనే విప్రుని ఇంట వదలి అతని కుమారుని తీసుకొని వచ్చానని బదులు పలికింది. అంతట ఆ రాక్షసుడు భద్రే! నీవు పొరబాటు గావించావు. మహాజ్ఞానియైన ఆ బ్రాహ్మణుడు కోపంతో మనలను శపించగలడు. కాబట్టి ఓ సుందరీ! వెంటనే ఈ ఘోరాకారుడైన మానవశిశువును అచ్చట వదలి వేరొక బాలుని ఎవరినైనను తీసుకురమ్మని భార్యతో పలికాడు.

ఇత్యేవముక్తా సా రౌద్రా రాక్షసీ కామచారిణీ ।
సమాజగామ త్వరితా సముత్పత్య విహాయసమ్ ॥32॥

స చాపి రాక్షససుతో నిసృష్టో గృహబాహ్యతః ।
రురోద సుస్వరం బ్రహ్మన్ ప్రక్షిప్యాంగుష్ఠమాననే ॥33॥

సాక్రన్దితం చిరాచ్ఛ్రుత్వా ధర్మిష్ఠా పతిమబ్రవీత్ ।
పశ్య స్వయం మునిశ్రేష్ఠ సశబ్దస్తనయస్తవ ॥34॥

త్రస్తా సా నిర్జగామాథ గృహమధ్యాత్తపస్వినీ ।
స చాపి బ్రాహ్మణశ్రేష్ఠః సమపశ్యత తం శిశుమ్ ॥35॥

భర్త మాటలు విన్నంతనే కామచారిణియైన ఆ భయంకరరాక్షసి త్వరగా ఆకాశమార్గాన ఎగిరిపోయింది. ఓ బ్రహ్మన్! అచ్చట రాక్షసిచే ఇంటిముంగిట విడువబడిన రాక్షసకుమారుడు నోటిలో బొటనవేలు పెట్టుకుని

సుస్వరంగా ఏడ్వసాగాడు. చాలాసేపు ఆ ఏడ్పు విని, ధర్మిష్ఠ భర్తతో ఓ మునిశ్రేష్ఠా! చూడుము. నీ కుమారునకు మాట వచ్చింది. అంటూ భయంతో ఆ మహాసాధ్వి ఇంటినుండి బయటకు వెళ్ళింది. ఆ బ్రాహ్మణుడు కూడా ఇంటినుండి బయటకు వచ్చి ఆ శిశువును చూశాడు.

వర్ణరూపాదిసంయుక్తం యథా స్వతనయం తథా ।
తతో విహస్య ప్రోవాచ కోశకారో నిజాం ప్రియామ్ ॥36॥

ఏతేనావిశ్య ధర్మిష్ఠే భావ్యం భూతేన సాంప్రతమ్ ।
కోఽ ప్యస్మాకం ఛలయితుం సురూపీ భువి సంస్థితః ॥37॥

ఇత్యుక్త్వా వచనం మంత్రీ మంత్రైస్తం రాక్షసాత్మజమ్ ।
బబన్ధోల్లిఖ్య వసుధాం స కుశేనాథ పాణినా ॥38॥

ఆ బ్రాహ్మణుడు రూపురేఖావిలాసాలలో తన కుమారుని వలెనే యున్న ఆ శిశువును చూసి, నవ్వుతూ తన భార్యతో ఇలా పలికాడు. ప్రియా! ధర్మిష్ఠా! మన శిశువునేదోభూతం ఆవేశించినట్లుంది. మంచిరూపం గలవాడెవ్వడో మనలను వంచించడానికి ఈ భూమిమీద తిరుగుతున్నట్లున్నాడని పలికి మంత్రవేత్తయైన కోశకారుడు దర్భను చేతితోపట్టుకుని నేలమీద ఏదో మంత్రం వ్రాసి ఆ శిశువును బంధించాడు.

ఏతస్మిన్నన్తరే ప్రాప్తా సూర్పాక్షీ విప్రబాలకమ్ ।
అంతర్ధానగతా భూమౌ చిక్షేప గృహదూరతః ॥39॥

తం క్షిప్తమాత్రం జగ్రాహ కోశకారః స్వకం సుతమ్ ।
సా చాభ్యేత్య గ్రహీతుం స్వం నాశకద్రాక్షసీసుతమ్ ॥40॥

ఇతశ్చేతస్య విభ్రష్టా సా భర్తారముపాగమత్ ।
కథయామాస యద్వృత్తం స ద్విజాత్మజహారిణమ్ ॥41॥

ఏవం గతాయాం రాక్షస్యాం బ్రాహ్మణేన మహాత్మనా ।
స రాక్షసశిశుర్బ్రహ్మన్ భార్యాయై వినివేదితః ॥42॥

ఇంతలో సూర్పాక్షి తిరిగి వచ్చి వారికి కనిపించకుండా బ్రాహ్మణబాలకుని ఇంటికి దూరంగా నేలమీదకు విసిరేసింది. నేలమీద పడినవెంటనే తన కుమారుని కోశకారుడు పట్టుకున్నాడు. ఆ రాక్షసి మాత్రం మంత్రబద్ధుడైన తన శిశువును తిరిగి తీసికొనజాలక అక్కడక్కడా ఎగురుతూ భర్తవద్దకు వెళ్ళి బ్రాహ్మణపుత్రుని, తన పుత్రుని ఇద్దరిని పోగొట్టుకున్న వృత్తాంతమంతటిని చెప్పసాగింది. రాక్షసి అలా వెళ్ళిపోయిన వెంటనే మహాత్ముడైన కోశకారుడు రాక్షసశిశువును భార్యకు అప్పగించాడు.

స చాత్మతనయః పిత్రా కపిలాయాః సవత్సయాః ।
దధ్నా సంయోజితోఽ త్యర్థం క్షీరేణేక్షురసేన చ ॥43॥

ద్వావేవ వర్ధితౌ బాలౌ సంజాతౌ సప్తవార్షికౌ ।
పిత్రా చ కృతనామానౌ నిశాకరదివాకరౌ ॥44॥

నైశాచరిర్దివాకీర్తిర్నిశాకీర్తిః స్వపుత్రకః ।
తయోశ్చకార విప్రోఽసౌ వ్రతబన్ధక్రియాం క్రమాత్ ॥45॥

తన పుత్రుని మాత్రం తాను స్వయంగా కపిలగోవు పాలు, పెరుగు, చెఱకురసం, త్రాగిస్తూ చక్కగా పెంచాడు. ఇద్దరు బాలురు పెరిగి, ఏడేండ్లప్రాయంవారయ్యారు. తండ్రి తన కుమారునకు నిశాకరుడని, రాక్షసి పుత్రునకు దివాకరుడని పేర్లుపెట్టి వరుసగా ఇరువురకు ఉపనయనం చేశాడు.

వ్రతబన్ధే కృతే వేదం పపాఠాసౌ దివాకరః ।
నిశాకరో జడతయా న పపాఠేతి నః శ్రుతమ్ ॥46॥

తం బాన్ధవాశ్చ పితరౌ మాతా భ్రాతా గురుస్తదా ।
పర్యనిన్దంస్తథా యే చ జనా మలయవాసినః ॥47॥

తతః స పిత్రా క్రుద్ధేన క్షిప్తః కూపే నిరూదకే ।
మహాశిలాం చోపరి వై పిధానమవరోపయత్ ॥48॥

ఉపనయనానంతరం దివాకరుడు వేదాధ్యయనం చేయగా, నిశాకరుడు మందబుద్ధియైనందున చదువుకో లేకపోయాడు. బంధువులు, తల్లిదండ్రులు, సోదరుడు, గురువులు మలయవాసులందరు అతనిని నిందింపసాగారు. అంతట తండ్రి కోపంతో ఆ బాలుని ఒక నీరులేని బావిలో పడద్రోసి ఒక పెద్దబండను ఆ బావికి మూతగా పెట్టాడు.

ఏవం క్షిప్తస్తదా కూపే బహువర్షగణాన్ స్థితః ।
తత్రాస్యామలకీగుల్మః పోషాయ ఫలితోఽభవత్ ॥49॥

తతో దశసు వర్షేషు సమతీతేషు భార్గవ ।
తస్య మాతాఽగమత్కూపం తమంధం శిలయాచితమ్ ॥50॥

సా దృష్ట్వా నిచితం కూపం శిలయా గిరికల్పయా ।
ఉచ్చైః ప్రోవాచ కేనేయం కూపోపరి శిలా కృతా ॥51॥

కూపాన్తస్థః స తాం వాణీం శ్రుత్వా మాతుర్నిశాకరః ।
ప్రాహ ప్రదత్తా పిత్రా మే కూపోపరి శిలా త్వియమ్ ॥52॥

సాఽతిభీతాఽబ్రవీత్కోఽసి కూపాంతస్థోఽద్భుతస్వరః ।
సోఽప్యాహ తవ పుత్రోఽస్మి నిశాకరేతి విశ్రుతః ॥53॥

ఈ విధంగా బావిలో పడవేయబడిన బాలుడు అందులో చాలాకాలం ఉన్నాడు. దానిమీద ఉసిరికచెట్లు పెరిగి కాయలు కాశాయి. ఓ భార్గవాచార్యా! ఆ విధంగా పదేండ్లు గడిచినపిమ్మట వానితల్లి ఎందుకో ఆ అంధకూపం

వద్దకు వెళ్ళి దానిపైనున్న పెద్ద బండను చూసి, ఎవరీబావిని బండతో కప్పివేశారని పెద్దగా అరచింది. బావిలోనున్న నిశాకరుడు తల్లిమాటలను విని, నా తండ్రియే నన్నీ బావిలో పడవేసి ఈ బావిపై బండరాయి పెట్టాడని తల్లితో చెప్పాడు. ఆమె మిక్కిలి భయపడుతూ బావిలోనుండి చక్కగా మాట్లాడుతున్న నీవెవరివని అడిగింది. అందులకాతడు ఆమెతో తల్లీ! నేను నీపుత్రుడును, నిశాకరుడనని బావినుండి సమాధానం చెప్పాడు.

సాఽబ్రవీత్ తనయో మహ్యం నామ్నాఖ్యాతో దివాకరః ।
నిశాకరేతి నామ్నాఽహో న కశ్చిత్ తనయోఽస్తి మే ॥54॥

దివాకరుడనే వాడే నా కుమారుడు. అహో! నిశాకరుడనే కుమారుడెవడూ నాకు లేడని తల్లి జవాబిచ్చింది.

స చాహ పూర్వచరితం మాతుర్నిరవశేషతః ।
సా శ్రుత్వా తాం శిలాం సుభ్రూః సముత్క్షిప్యాన్యతోఽక్షిపత్ ॥55॥

సోత్తీర్య కూపాద్భగవన్ మాతుః పాదావవన్దత ।
సా స్వానురూపం తనయం దృష్ట్వా స్వజనమగ్రతః ॥56॥

తతస్తమాదాయ సుతం ధర్మిష్ఠా పతిమేత్య చ ।
కథయామాస తత్సర్వం చేష్టితం స్వసుతస్య చ ॥57॥

తతోఽన్వపృచ్ఛద్విప్రోఽసౌ కిమిదం తాత కారణమ్ ।
నోక్తవాన్ యద్భవాన్పూర్వం మహత్కౌతూహలం మమ ॥58॥

తచ్ఛ్రుత్వా వచనం ధీమాన్ కోశకారం ద్విజోత్తమమ్ ।
ప్రాహ పుత్రోఽద్భుతం వాక్యం మాతరం పితరం తథా ॥59॥

ఆ బాలుడు గతచరిత్రనంతటిని తల్లికి తెలియజేశాడు. ఆ మాటలు విని, ఆ సుందరి తత్తరపాటుతో బావిపైనున్న బండను తొలగించి వేరే చోట పడవేసింది. భగవన్! ఆ బాలుడు బావినుండి బయటకు వచ్చి, తల్లిపాదాలకు నమస్కరించాడు. ఆమె కూడా స్వచ్ఛంగా తన రూపురేఖలతోనున్న బాలుని చూసి, తనయింటికి తీసికొని వెళ్ళి, తన భర్తకు, తనవారికందరకు చూపి, ఆ బాలుడు చెప్పిన గతచరిత్రనంతటిని వారికి తెలియజేసింది. ఆ మాటలు విని, తండ్రి ప్రేమతో బాబూ! నీవు చిన్నవాడిగా నున్నప్పుడు ఎందులకు మాటాడలేక పోయినావు? కారణం తెలిసికోవాలని నాకు మిక్కిలి కుతూహలంగా నున్నదని కోశకారుడు బాలుని ప్రశ్నించగా ఆ బాలుడు తల్లిదండ్రులకు ఆశ్చర్యం కలిగేటట్లుగా ఇలా బదులిచ్చాడు.

నిశాకర ఉవాచ – నిశాకరుడు పలికాడు.

శ్రూయతాం కారణం తాత యేన మూకత్వమాశ్రితమ్ ।
మయా జడత్వమనఘ తథాఽన్ధత్వం స్వచక్షుషః ॥60॥

పూర్వమాసమహం విప్రకులే వృందారకస్య తు ।
వృషాకపేశ్చ తనయో మాలాగర్భసముద్భవః ॥61॥

తతః పితా పాఠయన్మాం శాస్త్రం ధర్మార్థకామదమ్ ।
మోక్షశాస్త్రం పరం తాత సేతిహాసశ్రుతిం తథా ॥62॥

సోఽహం తాత మహాజ్ఞానీ పరావరవిశారదః ।
జాతో మదాన్ధస్తేనాహం దుష్కర్మాభిరతోఽభవమ్ ॥63॥

తండ్రీ! నేనిన్నిరోజులు మందమతిగా, మూగవానిగా, గ్రుడ్డివానిగా ఎందుకు నడుచుకున్నానో కారణం చెబుతున్నాను వినండి. ఓ విప్రా! పూర్వం నేను వృందారకవంశంలో వృషాకపికి మాలయనే భార్యవల్ల పుత్రునిగా జన్మించాను. తండ్రి నాకు ధర్మార్థకామాలతోబాటు శ్రుతి, స్మృతీతిహాసాలతో కూడిన మోక్షశాస్త్రం నేర్పించాడు. తండ్రీ! నేను సకలశాస్త్రకోవిదుడనైనందున మదాంధుడనై, చెడుదారులు త్రొక్కసాగాను.

మదాత్సమభవల్లోభస్తేన నష్టా ప్రగల్భతా ।
వివేకో నాశమగమత్ మూర్ఖభావముపాగతః ॥64॥

మూఢభావతయా చాథ జాతః పాపరతోఽస్మ్యహమ్ ।
పరదారపరార్థేషు మతిర్మే చ సదాఽభవత్ ॥65॥

పరదారాభిమర్శిత్వాత్ పరార్థహరణాదపి ।
మృతోఽస్మ్యుద్బంధనేనాహం నరకం రౌరవం గతః ॥66॥

మదం వల్ల లోభం, దాని వల్ల తెలివి నశించడంతో వివేకభ్రష్టుడనయ్యాను. మూర్ఖభావాన్ని పొందాను. మూఢత్వం వల్ల పాపాభిరతి ఎక్కువై, పరదారలయందు, పరుల సంపదలయందు ప్రీతి మెండుగా కలిగింది. దాని వల్ల ఇతరుల భార్యలతో రమిస్తూ, ఇతరుల ధనాన్ని దోచుకుంటూ, కాలాన్ని గడిపి, ఉరిశిక్షకు గురియై, మరణించిన పిదప రౌరవనరకానికి వెళ్ళాను.

తస్మాద్వర్షసహస్రాన్తే భుక్తశిష్టే తదాగసి ।
అరణ్యే మృగహా పాపః సంజాతోఽహం మృగాధిపః ॥67॥

వ్యాఘ్రత్వే సంస్థితస్తాత బద్ధః పంజరగః కృతః ।
నరాధిపేన విభునా నీతశ్చ నగరం నిజమ్ ॥68॥

బద్ధశ్చ పంజరస్థస్య వ్యాఘ్రత్వేఽధిష్ఠితస్య హ ।
ధర్మార్థకామశాస్త్రాణి ప్రత్యభాసన్త సర్వశః ॥69॥

తతో నృపతిశార్దూలో గదాపాణిః కదాచన ।
ఏకవస్త్రపరీధానో నగరాన్నిర్యయౌ బహిః ॥70॥

అచ్చట వేయేండ్లు రౌరవనరకయాతనలనుభవించినను పాపం పూర్తిగా తీరక, ఒక మహారణ్యంలో వ్యాఘ్రజన్మను పొందాను. తండ్రీ! వ్యాఘ్రజన్మలోనున్న నేను జీవహింస చేస్తుండగా ఒకరాజు నన్ను పట్టి, బంధించి,

బోనులోనుంచి తన నగరానికి తీసికొనిపోయాడు. వ్యాఘ్రజన్మలో కూడా ధర్మార్థకామశాస్త్రాలన్నీ నాకు కరతలామలకంగానే యున్నాయి. ఆ రాజశ్రేష్ఠుడు ఒకనాడు గదాపాణియై ఒంటరిగా ఏకవస్త్రం ధరించి పట్టణం వెలుపలనున్న అరణ్యానికి వేటకు వెళ్ళాడు.

తస్య భార్యా జితా నామ రూపేణాప్రతిమా భువి ।
సా నిర్గతే తు రమణే మమాన్తికముపాగతా ॥71॥

తాం దృష్ట్వా వవృధే మహ్యం పూర్వాభ్యాసాన్మనోభవః ।
యథైవ ధర్మశాస్త్రాణి తథాహమవదం చ తామ్ ॥72॥

రాజపుత్రి సుకల్యాణి నవయౌవనశాలిని ।
చిత్తం హరసి మే భీరు కోకిలాధ్వనినా యథా ॥73॥

సా మద్వచనమాకర్ణ్య ప్రోవాచ తనుమధ్యమా ।
కథమేవావయోః వ్యాఘ్ర రతియోగముపేష్యతి ॥74॥

తతోఽహమబ్రువం తాత రాజపుత్రీం సుమధ్యమామ్ ।
ద్వారముద్ఘాటయస్వాద్య నిర్గమిష్యామి సత్వరమ్ ॥75॥

మహారాజు అలా బయటకు వెళ్ళిన పిదప రాజుభార్య జిత అను పేరు గల అపూర్వసౌందర్యరాశి నా బోను వద్దకు వచ్చింది. ఆమె అందం అంగసౌష్ఠవం, నవయౌవనం చూడగానే నా పూర్వజన్మవాసనలవలన కామోద్రేకం కలిగి ధర్మశాస్త్రాలు వలెనే కామసంబంధమైన పలుకులు ఆమెతో "ఓ రాజపుత్రీ! నవయౌవనంతో మిసమిసలాడే కల్యాణీ! నీ కోకిలధ్వనితో నా చిత్తాన్ని అపహరించావు" అని పలికాను. నా మాటలు వినిన ఆ సౌందర్యరాశియైన రాణి ఓ వ్యాఘ్రమా! మనిద్దరి మధ్య రతియోగమెలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. అంతట నేను నీవు బోను తలుపుల నూడదీయుము. నేను వెంటనే బయటకు రాగలనని ఆ రాజకుమారితో చెప్పాను.

సాఽప్యబ్రవీద్దివా వ్యాఘ్ర లోకోఽయం పరిపశ్యతి ।
రాత్రావుద్ఘాటయిష్యామి తతో రంస్యావ స్వేచ్ఛయా ॥76॥

తామేవాహమవోచం వై కాలక్షేపేఽహమక్షమః ।
తస్మాదుద్ఘాటయ ద్వారం మాం బన్ధాచ్చ విమోచయ ॥77॥

తతః సా పీవరశ్రోణీ ద్వారముద్ఘాటయన్మునే ।
ఉద్ఘాటితే తతో ద్వారే నిర్గతోఽహం బహిః క్షణాత్ ॥78॥

పాశాని నిగదాదీని ఛిన్నాని హి బలాన్మయా ।
సా గృహీతా చ నృపతేర్భార్యా రమితుమిచ్ఛతా ॥ 79॥

తతో దృష్టోఽస్మి నృపతేః భృత్యైరతులవిక్రమైః ।
శస్త్రహస్తైః సర్వతశ్చ తైరహం పరివేష్టితః ॥80॥

ఓ వ్యాఘ్రమా! పగటిసమయంలో ద్వారాలను పగులగొడితే లోకులు చూస్తారు గాన రాత్రి తలుపు లూడదీస్తాను. అప్పుడు మనమిద్దరం స్వేచ్ఛగా రతిసౌఖ్యాలను అనుభవించవచ్చునని ఆమె నాతో పలికింది. ఓ మునివర్యా! ఆమె అలా పలుకగానే కామాతురుడనైన నేను అంతవరకు సహించడం కష్టం. కావున వెంటనే నా కోర్కెను తీర్చమని, బోను తలుపులు తెరువుమని, బంధంనుండి విడిపింపుమని ఆమెను కోరాను. బలిసిన శ్రోణిగల ఆమె వెంటనే బోను తలుపులు తెరిచింది. క్షణంలో నేను బయటకు వచ్చాను. నా బంధాలు, సంకెళ్ళు అన్నీ నేను బలవంతంగా ఛేదించుకుని రాజుభార్యతో రమించాలనే కాంక్షతో ఆమెను వెంటనే పట్టుకున్నాను. తపోధనా! రాజుభార్యను నేను బలాత్కారంగా రమింపబోవడం చూసి, బలశాలురైన పెక్కురు రాజసేవకులు శస్త్రాలు ధరించి నన్ను చుట్టుముట్టారు.

మహాపాశైః శృంఖలాభిః సమాహత్య చ ముద్గరైః ।
బధ్యమానోఽబ్రువమహం మా మా హింసధ్వమాకులాః ॥81॥

తే మద్వచనమాకర్ణ్య మత్వైవ రజనీచరమ్ ।
దృఢం వృక్షే సముద్బధ్య ఘాతయన్త తపోధన ॥82॥

భూయో గతశ్చ నరకం పరదారనిషేవణాత్ ।
ముక్తో వర్షసహస్రాన్తే జాతోఽహం శ్వేతగర్దభః ॥83॥

రాజభటులు నన్ను రోకళ్ళతో మోది, పాశాలతో, గొలుసులతో బంధిస్తూ ఉండగా హింసింపవద్దు, హింసింపవద్దు అని గట్టిగా అరిచాను. నా మాటలు విని వారు వ్యాకులతతో నన్ను రాక్షసునిగా భావించి ఒక చెట్టుకు గట్టిగా కట్టి చావగొట్టారు. ఆ విధంగా పరదారాగమనం కారణంగా మరలా నరకానికి వెళ్ళి వేయేండ్లు అక్కడ గడిపిన పిమ్మట ఒక తెల్లని గాడిదగా పుట్టాను.

బ్రాహ్మణస్యాగ్నివేశ్యస్య గేహే బహుకలత్రిణః ।
తత్రాపి సర్వవిజ్ఞానం ప్రత్యభాసత్తతో మమ ॥84॥

ఉపవాహ్యః కృతశ్చాస్మి ద్విజయోషిద్భిరాదరాత్ ।
ఏకదా నవరాష్ట్రీయా భార్యా తస్యాగ్రజన్మనః ॥85॥

విమతిర్నామతః ఖ్యాతా గంతుమైచ్ఛద్ గృహం పితుః ।
తామువాచ పతిర్గచ్ఛ ఆరుహ్య శ్వేతగర్దభమ్ ॥86॥

మాసేనాగమనం కార్యం న స్థేయం పరతస్తతః ।
ఇత్యేవముక్తా సా భర్త్రా తన్వీ మామధిరుహ్య చ ॥87॥

బంధనాదవముచ్యాథ జగామ త్వరితా మునే ।
తతోఽర్ధపథి సా తన్వీ మత్పృష్ఠాదవరుహ్య వై ॥88॥

అవతీర్ణా నదీం స్నాతుం స్వరూపా చార్ద్రవాససా ।
సాంగోపాంగాం రూపవతీం దృష్ట్వా తామహమాద్రవమ్ ॥89॥

తపోధనా! పెక్కుమంది భార్యలు గల అగ్నివేశ్యుడనే బ్రాహ్మణగృహంలో శ్వేతగార్దభంగా సర్వశాస్త్రజ్ఞానంతో తిరగసాగాను. ఆ బ్రాహ్మణుని భార్యలను వీపుపై నెక్కించుకుని ఆదరంతో మోస్తూ ఉండేవాడిని. ఒక పర్యాయం ద్విజుని భార్యలలో నవరాష్ట్రానికి చెందిన వినుతియను యువతి పుట్టినింటికి వెళ్ళాలని కోరగా ఆమెభర్త ఆమెతో మన తెల్లగాడిదనెక్కి వెళ్ళవలెననియు, నెలరోజులు మాత్రమే అచ్చటనుండి తిరిగిరావలెననియు, అంతకు మించి అక్కడ ఉండరాదనియు చెప్పాడు. అంతట ఆ సుందరి నా మీద అధిరోహించి, పగ్గాలు వదిలించగా మేము వేగంగా వెళ్లసాగాము. ఆ విధంగా నాపై అధిరోహించి వెళుతున్న ఆ సుందరి మార్గమధ్యంలో ఆగి, నా వీపునుండి దిగి, నదిలో స్నానం చేసి, తడిసిన వస్త్రాలతో పైకి వచ్చింది. తడిసిన చీరలో ఆమె అందమైన శరీరాంగాలు, ఉపాంగాలు నేను స్పష్టంగా చూడడంతో మరలా నాకు కామవాంఛ తీవ్రమై, ఆమె మీదకు పరుగెత్తాను.

మయా చాభిద్రుతా తూర్ణం పతితా పృథివీతలే ।
తస్యాముపరి భో తాత తతోఽహం చ భృశాతురః ॥90॥

దృష్టో భర్త్రానుసృష్టేన నృణా తదనుసారిణా ।
ప్రోత్క్షిప్య యష్టిం మాం బ్రహ్మన్ సమాధావత్ త్వరాన్వితః ॥91॥

తద్భయాత్ తాం పరిత్యజ్య ప్రద్రుతో దక్షిణాముఖః ।
తతోఽభిద్రవతస్తూర్ణం ఖలీనరసనా మునే ॥92॥

మమాసక్తా వంశగుల్మే దుర్మోక్షే ప్రాణనాశనే ।
తత్రాసక్తస్య షడ్రాత్రాన్మమాభూజ్జీవితక్షయః ॥93॥

గతోఽస్మి నరకం భూయస్తస్మాన్ముక్తోఽభవం శుకః ।

ఆమె వెంట వేగంగా పరిగెత్తడంతో ఆమె భయంతో క్రిందపడిపోయింది. ఓ తండ్రీ! కామాతురతతో నేనామెమీద పడ్డాను. యజమానుడు పంపగా ఆమెవెంట వస్తున్న మనుషులు నన్నుచూచి, కఱ్ఱలెత్తుకుని మావైపు పరిగెత్తారు. దానితో భయపడిన నేను ఆమెను విడిచి దక్షిణదిశగా పరుగెత్తాను. అలా వేగంగా పరుగెత్తడంలో ఒక వెదురుపొదకు చిక్కుకుని నా ముక్కుతాడు బిగిసిపోయింది. దానిని విడిపించుకొనలేక అక్కడే నీరు, ఆహారం లేకుండా ఆరురాత్రులు గడిపిన పిమ్మట నా ప్రాణం పోయింది. నేను మరలా నరకానికి వెళ్ళాను. నరకయాతనలను అనుభవించిన పిమ్మట నరకం నుండి విముక్తుడనై చిలుకగా జన్మించాను.

మహారణ్యే తథా బద్ధః శబరేణ దురాత్మనా ॥94॥

పంజరే క్షిప్య విక్రీతో వణిక్పుత్రాయ శాలినే ।
తేనాప్యన్తఃపురవరే యువతీనాం సమీపతః ॥95॥

సర్వశాస్త్రవిదిత్యేవం దోషఘ్నశ్చేత్యవస్థితః ।
తత్రాసతస్తరుణ్యస్తా ఓదనాంబుఫలాదిభిః ॥96॥

భక్ష్యైశ్చ దాడిమఫలైః పుష్ణన్త్యహరహః పితః ।
కదాచిత్ పద్మపత్రాక్షీ శ్యామా పీనపయోధరా ॥97॥

సుశ్రోణీ తనుమధ్యా చ వణిక్పుత్రప్రియా శుభా ।
నామ్నా చంద్రావలీ నామ సముద్ఘాట్యాథ పంజరమ్ ॥98॥

మాం జగ్రాహ సుచార్వఙ్గీ కరాభ్యాం చారుహాసినీ ।
చకారోపరిపీనాభ్యాం స్తనాభ్యాం సా హి మాం తతః ॥99॥

అరణ్యంలో విహరిస్తూ ఉండే ఒక క్రూరుడైన శబరుడు చిలుకగానున్న నన్ను పట్టుకుని పంజరంలో బంధించి, కోమటి పుత్రునకు ఒకనికి నన్ను విక్రయించాడు. అతడు చిలుకను అన్ని శాస్త్రములు తెలిసినదగుటచే ఇంట్లో ఉంచినచో దోషాలన్నీ తొలగిపోతాయనే నమ్మకంతో నన్ను అంతఃపురంలో యువతులైన తన భార్యల వద్దనుంచాడు. వారు నాకు అన్నం, నీరు, దానిమ్మగింజలు, కమ్మని భక్ష్యాలు, ఫలాలు పెడుతుంటే నా పలుకులతో ఆ మదవతులను రంజింపజేయసాగాను. ఒకనాడు తామర రేకులవంటి కన్నులు, బలిసిన చన్నులు, గుండ్రని పిరుదులు, సన్నని నడుము కలిగి, నవయౌవనమదంతో విర్రవీగుతున్న వణిక్పుత్రుని ప్రియురాలు, చంద్రావళి అను పేరు గల సుందరి పంజరాన్ని తెరచి నన్ను చేతితో పట్టుకుని చక్కగా బలిసిన తన చన్నుల మీద ఎక్కించుకుంది.

తతోఽహం కృతవాన్ భావం తస్యాం విలసితుం ప్లవన్ ।
తతోఽనుప్లవతస్తత్ర హారే మర్కటబన్ధనమ్ ॥100॥

బద్ధోఽహం పాపసంయుక్తో మృతశ్చ తదనంతరమ్ ।
భూయోఽపి నరకం ఘోరం ప్రసన్నోఽస్మి సుదుర్మతిః ॥101॥

అంతట నేను కామంతో విజృంభించి, ఆమె యొక్క బిగువైన స్తనాలపైన గెంతుతూ ఆమెను రంజింపజేయ సాగాను. ఇలా నేను ఆమెతో క్రీడిస్తూ ఉండగా ఆమె కంఠహారంలో మర్కటబంధంతో కట్టివేయబడ్డాను. ఆ విధంగా పాపాచారుడనైన నేను మరణించిన పిమ్మట మరల ఘోరమైన నరకానికి వెళ్ళాను.

తస్మాచ్చాహం వృషత్వం వై గతశ్చాణ్డాలపక్వణే ।
స చైకదా మాం శకటే నియోజ్య స్వాం విలాసినీమ్ ॥102॥

సమారోప్య మహాతేజా గన్తుం కృతమతిర్వనమ్ ।
తతోఽగ్రతః స చణ్డాలో గతస్త్వేవాస్య పృష్ఠతః ॥103॥

గాయన్తీ యాతి తచ్ఛ్రుత్వా జాతోఽహం వ్యథితేంద్రియః ।
పృష్ఠతస్తు సమాలోక్య విపర్యస్తస్తథోత్ప్లుతః ॥104॥

పతితో భూమిమగమం తదక్షే క్షణవిక్రమాత్ ।
యోక్త్రే సుబద్ధ ఏవాస్మి పంచత్వమగమం తతః ॥105॥

భూయో నిమగ్నో నరకే దశవర్షశతాన్యపి ।
అతస్తవ గృహే జాతస్త్వహం జాతిమనుస్మరన్ ॥106॥

ఆ నరకంనుండి పాపశేషం వల్ల చండాలుని ఇంట ఎద్దుగా జన్మించాను. ఆ చండాలుడొకనాడు నన్ను బండికికట్టి అడవికి తీసికొని వెళుతున్నాడు. బండిమీద తన భార్యను కూర్చుండబెట్టి తాను ముందు నడుస్తున్నాడు. వాని వెనుక నేను బండి లాగుతూ పోతున్నాను. ఇంతలో ఆ చండాలుని భార్య బండిమీద కూర్చొని హాయిగా గొంతు విప్పి పాటపాడగా వినినవెంటనే నా ఇంద్రియాలు పట్టు తప్పాయి. ఆ సంక్షోభాన్ని అణచుకోలేక ఒకమారు వెనుకకు తిరిగి చూసి అకస్మాత్తుగా వెనుకకు పరుగుతీశాను. కాడికి నా మెడ గట్టిగా బంధింపబడియున్నందున క్రిందబడి మెడ ఆ త్రాడులో బిగుసుకున్నందున ప్రాణాలు విడిచాను. తదనంతరం మరలా నరకంలో మునిగి వేయిసంవత్సరాలు గడిపిన పిమ్మట ఇక్కడ ఇప్పుడు మీ ఇంట్లో ఇలా జన్మించాను.

తావన్త్యేవాద్య జన్మాని స్మరాని చానుపూర్వశః ।
పూర్వాభ్యాసాచ్చ శాస్త్రాణి బన్ధనం చాగతం మమ ॥107॥

తదహం జాతవిజ్ఞానో నాచరిష్యే కథంచన ।
పాపాని ఘోరరూపాణి మనసా కర్మణా గిరా ॥108॥

ఇంతవరకు నేను పొందిన జన్మపరంపర నాకు వరుసగా జ్ఞాపకమున్నది. పూర్వాభ్యాసం వల్ల నాకు శాస్త్రజ్ఞానం, బంధనం కూడా లభించాయి. అందువలన అజ్ఞానంతోనున్న నేను మనోవాక్కాయకర్మల ద్వారా ఎన్నడూ ఘోరమైన పాపకర్మలను చేయను.

శుభం వాఽప్యశుభం వాపి స్వాధ్యాయం శాస్త్రజీవికా ।
బంధనం వా వధో వాఽపి పూర్వాభ్యాసేన జాయతే ॥109॥

జాతిం యదా పౌర్వికీం తు స్మరతే తాత మానవః ।
తదా స తేభ్యః పాపేభ్యో నిర్వృత్తిం హి కరోతి వై ॥110॥

తస్మాద్గమిష్యే శుభవర్ధనాయ పాపక్షయాయాథ మునే హ్యరణ్యమ్ ।
భవాన్ దివా కీర్తిమిమం సుపుత్రం గార్హస్థ్యధర్మే వినియోజయస్వ ॥111॥

శుభాశుభాలు, స్వాధ్యాయం, శాస్త్రజీవిక, బంధనం కాని, వధ గాని పూర్వజన్మాభ్యాసం వల్లనే కలుగుతాయి. పూర్వజన్మల స్మృతి కలిగిన మానవులకు పాపనివృత్తి కలుగుతుంది. ఓ మునీ! మంచిని పెంచుకోవడానికి, పాపాన్ని నశింపజేసుకోవడానికి, నేనరణ్యానికి వెళ్ళి, తపస్సు చేసుకుంటాను. మీరు సుపుత్రుడైన దివాకరుని గార్హస్థ్యధర్మంలో ప్రవేశపెట్టండి.

బలిరువాచ – బలి పలికాడు.

ఇత్యేవముక్త్వా స నిశాకరస్తదా ప్రణమ్య మాతాపితరౌ మహర్షే ।
జగామ పుణ్యం సదనం మురారేః ఖ్యాతం బదర్యాశ్రమమాద్యమీడ్యమ్ ॥112॥

ఏవం పురాభ్యాసరతస్య పుంసో భవన్తి దానాధ్యయనాదికాని ।
తస్మాచ్చ పూర్వం ద్విజవర్య వై మయా అభ్యస్తమాసీన్ననుతే బ్రవీమి ॥113॥

దానం తపో వాఽధ్యయనం మహర్షే స్తేయం మహాపాతకమగ్నిదాహమ్ ।
జ్ఞానాని చైవాభ్యసతాం హి పూర్వం భవంతి ధర్మార్థయశాంసి నాథ ॥114॥

మహర్షీ! ఆచార్యా! నిశాకరుడిలా పలికి, తల్లిదండ్రులకు నమస్కరించి, మురారి పుణ్యసదనము, సంస్తవనీయము, సనాతనమునైన బదరికాశ్రమానికి ఆదిదేవుడైన శ్రీమహావిష్ణువును సేవించడానికి వెళ్ళాడు. ఓ గురూత్తమా! ఈ విధంగా పూర్వాభ్యాసబలం వల్ల మానవులకు దానాధ్యయనాది గుణాలు అలవాట్లు ఏర్పడతాయి. నేను పూర్వపుజన్మలలో దానాధ్యయనాలను ఆచరించాను. కావున అవి నన్ను వదలవు. మహర్షీ! దానం తపస్సు, అధ్యయనం, చౌర్యం, మహాపాతకం, గృహదహనం, జ్ఞానం, ధర్మార్థకామయశోకీర్తులు ఇవన్నీ పూర్వాచరిత కర్మల వలననే సంక్రమిస్తాయి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్త్వా బలవాన్ సశుక్రం దైత్యేశ్వరః స్వం గురుమీశితారమ్ ।
ధ్యాయంస్తదాస్తే మధుకైటభఘ్నం నారాయణం చక్రగదాసిపాణినమ్ ॥115॥

ఓ నారదా! గురువైన శుక్రాచార్యునితో ఇలా పలికి, మహాబలశాలీ, దైత్యేశ్వరుడునైన బలిచక్రవర్తి మధుకైటభులను సంహరించినవాడును, చక్రగదాసిధారియునైన నారాయణుని ధ్యానింపసాగాడు.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే శుక్రబలిసంవాదో నామైకనవతితమోఽధ్యాయః ॥91॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని శుక్ర, బలిసంవాదమనే తొంభైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వినవతితమోఽధ్యాయః - తొంబైరెండవ అధ్యాయం

బలిబంధనమ్ - బలిబంధనం

పులస్త్య ఉవాచ - పులస్త్యమహర్షి పలికాడు.

ఏతస్మిన్నన్తరే ప్రాప్తో భగవాన్ వామనాకృతిః ।
యజ్ఞవాటముపాగమ్య ఉచ్చైర్వచనమబ్రవీత్ ॥1॥

ఓంకారపూర్వాః శ్రుతయో మఖేఽస్మిన్ తిష్ఠన్తి రూపేణ తపోధనానామ్ ।
యజ్ఞోఽశ్వమేధః ప్రవరః క్రతూనాం ముఖ్యస్తథా సత్రిషు దైత్యనాథః ॥2॥

ఇత్థం వచనమాకర్ణ్య దానవాధిపతిర్వశీ ।
సార్ఘ్యపాత్రః సమభ్యాగాద్యత్ర దేవః స్థితోఽభవత్ ॥3॥

నారదా! ఈ లోగా వామనాకృతి ధరించిన భగవానుడు బలి యజ్ఞశాలను సమీపించి, మేఘగంభీరస్వనంతో ఇలా పలికాడు. "ఈ యజ్ఞంలో ఓంకారపూర్వకాలైన వేదాలన్నీ తపోధనుల రూపంలో నెలకొనియున్నాయి. అశ్వమేధము యజ్ఞాలన్నిటిలోను తలమానికమైనది. దానవేంద్రుడైన బలి యజ్ఞకర్తలందరిలోను ఉత్తముడు". ఈ మాటలు వినగానే జితేంద్రియుడైన దానవేంద్రుడు అర్ఘ్యపాత్రతో భగవానుడు నిలచిన చోటుకు వెళ్ళి నిలబడ్డాడు.

తతోఽర్చ్య దేవదేవేశమర్ఘ్యమర్ఘ్యాదినాసురః ।
భరద్వాజర్షిణా సార్ధం యజ్ఞవాటం ప్రవేశయత్ ॥4॥

ప్రవిష్టమాత్రం దేవేశం ప్రతిపూజ్య విధానతః ।
ప్రోవాచ భగవన్ బ్రూహి కిం దద్మి తవ మానద ॥5॥

తదనంతరం బలి దేవదేవేశుని భరద్వాజమహర్షితో సహా అర్ఘ్యపాద్యాదులతో పూజించి, యజ్ఞశాలలోనికి తీసికొనివచ్చాడు. అలా యజ్ఞశాలలో ప్రవేశించగానే యథావిధిగా దేవేశుని మరల పూజించి, భగవన్ !, మానదా! మీకు నేనేమి ఈయవలెనో ఆజ్ఞాపించండని అర్థించాడు.

తతోఽబ్రవీత్ సురశ్రేష్ఠో దైత్యరాజానమవ్యయః ।
విహస్య సుచిరం కాలం భరద్వాజమవేక్ష్య చ ॥6॥

గురోర్మదీయస్య గురుస్తస్యాస్త్యగ్నిపరిగ్రహః ।
న స ధారయతే భూమ్యాం పారక్యాం జాతవేదసమ్ ॥7॥

తదర్థమభియాచేఽహం మమ దానవపార్థివ ।
మచ్ఛరీరప్రమాణేన దేహి రాజన్ పదత్రయమ్ ॥8॥

అంతట అవ్యయుడగు దేవశ్రేష్ఠుడు దానవేశ్వరుని చూసి చాలా సేపు పకపకా నవ్వి, భరద్వాజమహర్షిని చూస్తూ ఇలా పలికాడు "నా గురువునకు గురువైన ఈ మహనీయుడు అగ్నిపరిగ్రహం చేశాడు. ఆ అగ్నిని ఇతరుల

భూమిపైనుంచరాదు. అందులకై ఓ దానవేశ్వరా! నా శరీరప్రమాణానికి సరియైన మూడడుగుల భూమిని నాకొసంగుము. నేనర్థించేది ఇదే".

మురారేర్వచనం శ్రుత్వా బలిర్భార్యామవేక్ష్య చ ।
బాణం చ తనయం వీక్ష్య ఇదం వచనమబ్రవీత్ ॥9॥

న కేవలం ప్రమాణేన వామనోఽయం లఘుః ప్రియే ।
యేన క్రమత్రయం మౌర్ఖ్యాద్యాచతే బుద్ధితోఽపి చ ॥10॥

ప్రాయో విధాతాఽల్పధియాం నరాణాం బహిష్కృతానాం చ మహానుభాగ్యైః ।
ధనాదికం భూరి న వై దదాతి యథేహ విష్ణోర్న బహుప్రయాసః ॥11॥

న దదాతి విధిస్తస్య యస్య భాగ్యవిపర్యయః ।
మయి దాతరి యశ్చాయమద్య యాచేత్ పదత్రయమ్ ॥12॥

మురారి పలుకులు విని, బలిచక్రవర్తి భార్యను, తనయుడైన బాణుని చూస్తూ ఇలా పలికాడు "ప్రేయసీ! చూశావా! ఈ వామనుడు ఆకారంలోనే గాక బుద్ధిలో కూడా లఘువైనవాడే సుమా!. కనుకనే మూర్ఖుడై, మూడడుగుల నేలను మాత్రం యాచించాడు. నిజమే! విధాత సామాన్యంగా అల్పబుద్ధులైనవారికి, భాగ్యరహితులైనవారికి భూరిభోగభాగ్యాలివ్వడు. ఇదిగో అల్పాన్ని యాచించే ఈ విష్ణువునకు వలెనే. భాగ్యం వక్రించినవానికి బ్రహ్మ ప్రదానం చేయడు. నాలాంటి దాతను ఈ పొట్టివాడు మూడడుగుల నేలను యాచించడం అటువంటిదే గదా!".

ఇత్యేవముక్త్వా వచనం మహాత్మా భూయోఽప్యువాచాథ హరిం దనూజః ।
యాచస్వ విష్ణో గజవాజిభూమిం దాసీ హిరణ్యం యదభీప్సితం చ ॥13॥

భవాన్ యాచయితా విష్ణో అహం దాతా జగత్పతిః ।
దాతుర్యాచయితుర్లజ్జా కథం న స్యాత్ పదత్రయే ॥14॥

రసాతలం వా పృథివీం భువం నాకమథాపి వా ।
ఏతేభ్యః కతమం దద్యాం స్థానం యాచస్వ వామన ॥15॥

ఈ విధంగా భార్యాతనయులతో పలికిన మహనీయుడైన దైత్యపతి శ్రీహరితో ఇలా పలికాడు –"విష్ణో! ఏనుగులా?, అశ్వాలా?, రథాలా?, భూమియా?, దాసీజనమా? సువర్ణరాశులా? ఏమి కావాలో కోరుకో?. నీవు యాచించే విష్ణుడవు. నేను దాతనైన త్రిలోకాధిపతిని. ఈ అల్పమైన మూడడుగుల భూమిని కోరడం మనమిద్దరము సిగ్గుపడవలసిన విషయం కాదా?. వామనా! రసాతలంగాని, పృథివీమండలంగాని, భువర్లోకంగాని, స్వర్లోకంగాని వీటిలో నీకు తగినదేదో, కావలసినదేదో అడగవయ్యా? తప్పక ఇస్తాను".

వామన ఉవాచ – వామనుడు పలికాడు.

గజాశ్వభూహిరణ్యాది తదర్థిభ్యః ప్రదీయతామ్ ।
ఏతావతా త్వహం చార్థీ దేహి రాజన్ పదత్రయమ్ ॥16॥

ఓ దానవరాజా! గజాశ్వభూహిరణ్యాదులు వాటిని యాచించినవారికి ఇయ్యి. నాకు కావలసింది మూడడుగుల నేలయే. కాన నేనడిగిన మూడడుగుల నేలనుమాత్రం నాకియ్యి.

ఇత్యేవముక్తే వచనే వామనేన మహాసురః ।
బలిర్భృంగారమాదాయ దదౌ విష్ణోః క్రమత్రయమ్ ॥17॥

వామనుడిలా పలుకగానే మహాదానవుడైన బలిచక్రవర్తి జలపాత్ర తీసికొని మూడడుగుల నేలను విష్ణువుకు దానం చేశాడు.

పాణౌ తు పతితే తోయే దివ్యం రూపం చకార హ ।
త్రైలోక్యక్రమణార్థాయ బహురూపం జగన్మయమ్ ॥18॥

దానజలం చేతిలో పడగానే వామనుడు దివ్యరూపాన్ని ధరించాడు. ముల్లోకాలు ఆక్రమించేందుకు జగన్మయమైన బహురూపాన్ని ధరించాడు.

పాదే భూమిస్తథా జంఘే నభస్త్రైలోక్యవందితమ్ ।
సత్యం తపో జానుయుగ్మే ఊరుభ్యాం మేరుమన్దరౌ ॥19॥

పాదాలతో భూమిని, పిక్కలతో ఆకాశాన్ని, మోకాళ్ళజంటతో సత్యతపోలోకాలను, మేరుమన్దరాలను ఊరువులతోను త్రిలోకవంద్యుడు కప్పివేశాడు.

విశ్వేదేవా కటీభాగే మరుతో వస్తిశీర్షగాః ।
లింగే స్థితో మన్మథశ్చ వృషణాభ్యాం ప్రజాపతిః ॥20॥

కుక్షిభ్యామర్ణవాః సప్త జఠరే భువనాని చ ।
వలిషు త్రిషు నద్యశ్చ యజ్ఞాస్తు జఠరే స్థితాః ॥21॥

ఇష్టాపూర్తాదయః సర్వాః క్రియాస్తత్ర తు సంస్థితాః ।
పృష్ఠస్థా వసవో దేవాః స్కంధౌ రుద్రైరధిష్ఠితౌ ॥22॥

నడుములో విశ్వేదేవతలు, వస్తి (పొత్తికడుపు) ప్రదేశంయొక్క శీర్షభాగంలో మరుద్గణం, లింగంలో మన్మథుడు, వృషణాదులయందు ప్రజాపతులు, పైపొట్ట(కుక్షి)లో సప్తసాగరాలు, క్రింది పొట్టలో సమస్తభువనాలు, పొట్టమీదనున్న మూడుముడతలలో నదులు, యజ్ఞాలు, ఇష్టాపూర్తాలు మున్నగు వైదికక్రియలన్నియు నిలిచాయి. పృష్ఠభాగంలో వసువులు, స్కంధములందు రుద్రులు అధిష్ఠించారు.

బాహవశ్చ దిశః సర్వా వసవోఽష్టౌ కరే స్మృతాః ।
హృదయే సంస్థితో బ్రహ్మా కులిశో హృదయాస్థిషు ॥23॥

శ్రీసముద్రా ఉరోమధ్యే చంద్రమా మనసి స్థితః ।
గ్రీవాదితిర్దేవమాతా విద్యాస్తద్వలయస్థితాః ॥24॥

బాహువులలో దశదిశలు, చేతులలో అష్టవసువులు, హృదయంలో బ్రహ్మ, హృదయంలోని ఎముకలలో వజ్రాయుధం, వక్షోజాల మధ్యభాగంలో లక్ష్మి, సముద్రాలు. మనస్సులో చంద్రుడు, మెడలో దేవమాత అదితి. కంఠంమీది ముడతలలో విద్యలు నిలిచాయి.

ముఖే తు సాగ్నయో విప్రాః సంస్కారా దశనచ్ఛదాః ।
ధర్మకామార్థమోక్షీయాః శాస్త్రాః శౌచసమన్వితాః ॥25॥

లక్ష్మ్యా సహ లలాటస్థాః శ్రవణాభ్యామథాశ్వినౌ ।
శ్వాసస్థో మాతరిశ్వా చ మరుతః సర్వసంధిషు ॥26॥

నోటిలో అగ్నులతో కూడిన విప్రులు. పెదవులలో సంస్కారాలు. లలాటదేశాన లక్ష్మితో కలసి ధర్మార్థకామ మోక్షశౌచసమన్వితాలైన శాస్త్రాలు, చెవులలో అశ్వినీదేవతలు, శ్వాసలో మాతరిశ్వుడు, సర్వసంధులలో మరుత్తులు అధివసించారు.

సర్వసూక్తాని దశనా జిహ్వా దేవీ సరస్వతీ ।
చంద్రాదిత్యౌ చ నయనే పక్ష్మస్థాః కృత్తికాదయః ॥27॥

శిఖాయాం దేవదేవస్య ధ్రువో రాజా న్యషీదత ।
తారకా రోమకూపేభ్యో రోమాణి చ మహర్షయః ॥28॥

గుణైః సర్వమయో భూత్వా భగవాన్ భూతభావనః ।
క్రమేణైకేన జగతీం జహార స చరాచరామ్ ॥29॥

భూమిం విక్రమమాణస్య మహారూపస్య తస్య వై ।
దక్షిణోఽభూత్ స్తనశ్చన్ద్రః సూర్యోఽభూదథ చోత్తరః ।
నభశ్చాక్రమతో నాభిం సూర్యేందూ సవ్యదక్షిణౌ ॥30॥

దంతాలలో సమస్తసూక్తాలు, జిహ్వ మీద సరస్వతి, నేత్రాలలో సూర్యచంద్రులు, కనురెప్పలలో కృత్తికాది నక్షత్రాలు కనిపించాయి. దేవదేవుని శిఖాభాగంలో ధ్రువుడుపవిష్టుడయ్యాడు. రోమకూపాలలో తారకలు, రోమాలలో మహర్షులు నిలిచారు. సర్వగుణమయుడు, సర్వభూతమయుడునగు భగవానుడు ఒకే అడుగులో చరాచర ప్రాణులతో నిండిన జగత్తునంతటిని ఆక్రమించాడు. ఆ విధంగా భగవానుడు భూమినంతటిని ఆక్రమించగా ఆ విశ్వరూపుని కుడిరొమ్ము చంద్రుడయ్యాడు. ఎడమరొమ్ము సూర్యుడయ్యాడు. ఆ ప్రభువు పైకి పెరిగే కొలదీ సూర్యచంద్రులు ఆయన నాభిస్థానానికి ఎడమ, కుడిభాగాలుగా నిలిచారు.

ద్వితీయేన క్రమేణాథ స్వర్మహర్జనతాపసాః ।
క్రాంతార్ధార్ధేన వైరాజం మధ్యేనాపూర్యతాంబరమ్ ॥31॥

తతః ప్రతాపినా బ్రహ్మన్ బృహద్విష్ణుంఘ్రిణాంబరే ।
బ్రహ్మాండోదరమాహత్య నిరాలోకం జగామ హ ॥32॥

రెండవపాదం మొదటి సగంతో స్వర్గమహర్లోక జనతపోలోకాలను కప్పి, మిగిలిన సగంతో వైరాజాన్ని, మిగిలిన మధ్యభాగంతో అంబరాన్ని ఆక్రమించి, అనంతమైన అంతరాళాన్ని నింపి, బ్రహ్మాండకటాహాన్ని (కటాహం=పైపెంకు) ఛేదించి, నిరాలోకమైన, గాడాంధకారపూరితమైన లోకానికి ద్వితీయచరణాన్ని చాపి విరాట్ పురుషుడుగా నిలిచాడు.

విశ్వాంఘ్రిణా ప్రసరతా కటాహో భేదితో బలాత్ ।
కుటిలా విష్ణుపాదే తు సమేత్య కుటిలా తతః ॥33॥

తస్యా విష్ణుపదీత్యేవం నామాఖ్యాతమభూన్మునే ।
తథా సురనదీత్యేవం తామసేవన్త తాపసాః ॥34॥

విశ్వాంఘ్రి తాకిడికి భిన్నమైన బ్రహ్మాండం పైనుండి పాదాలవెంట క్రిందికి గొప్ప ప్రవాహం నిర్గమించింది. అది వక్రగతితో పారినందున ఆ జలం కుటిల అయ్యింది. అదియే విష్ణునది అనే పేరుతో విష్ణుపాదోద్భవగా విఖ్యాతమయ్యింది. నారదా! ఆ పవిత్రజలాలనే తాపసులు భక్తితో సురనదిగా సేవిస్తారు.

భగవానప్యసంపూర్ణే తృతీయే తు క్రమే విభుః ।
సమభ్యేత్య బలిం ప్రాహ ఈషత్ ప్రస్ఫురితాధరః ॥35॥

ఋణాద్భవతి దైత్యేన్ద్ర బన్ధనం ఘోరదర్శనమ్ ।
త్వం పూరయ పదం తన్మే నోచేద్బంధం ప్రతీచ్ఛ భోః ॥36॥

మూడవ పాదానికి చోటులేకపోవడంతో విశ్వరూపుని పెదవులు అదురుతూ ఉండగా బలిని సమీపించి ఇలా పలికాడు. ఓ దైత్యేంద్రా! ఋణశేషం బన్ధనకారణమవుతుంది. మూడవపాదానికి భూమిని చూపించు. లేదా బంధనానికి సిద్ధంగా ఉండు.

తన్మురారివచః శ్రుత్వా విహస్యాథ బలేఃసుతః ।
బాణః ప్రాహామరపతిం వచనం హేతుసంయుతమ్ ॥37॥

మురారి మాటలకు బలిపుత్రుడైన బాణుడు నవ్వి విరాడ్రూపునితో హేతుబద్ధంగా ఇలా పలికాడు.

బాణ ఉవాచ – బాణుడు పలికాడు.

కృత్వా మహీమల్పతరాం జగత్పతే స్వాయంభువాదిభువనాని వై షట్ ।
కథం బలిం ప్రార్థయసే సువిస్తృతాం యాం ప్రాగ్భవాన్ నో విపులామథాకరోత్ ॥38॥

జగన్నాథా! ఈ భూమండలాన్ని మిగిలిన ఆరు భువనాలను నీ విరాడ్రూపంలో అల్పతరంగావించి, నిశ్శేషమైన పిమ్మట దానినెట్లు కోరుతున్నావు? నీవు సృష్టించినదంతయు అదియే గదా? ఇంకనూ ఎక్కడినుండి భూమిని తెచ్చి నీకు ఇవ్వమంటున్నావు?

విభో మహీ యావతీయం త్వయాఽద్య సృష్టా సమేతా భువనాన్తరాలైః ।
దత్తా చ తాతేన హి తావతీయం కిం వాక్ఛలేనైష నిబధ్యతేఽద్య ॥39॥

ప్రభూ! నీవు సృష్టించిన భూమండలం భువనాంతరాళాలతో సహా సర్వస్వమూ నా తండ్రి నీకు ధారపోశాడు గదా!, నీ సృష్టిలో మిగిలినదేదియు లేదు గదా!, ఇంకనూ కపటవచనాలు పలుకుతూ నా తండ్రిని బంధిస్తానంటా వెందులకు?

యా నైవ శక్యా భవతా హి పూరితుం కథం వితన్యాద్దితిజేశ్వరోఽసౌ ।
శక్తస్తు సంపూజయితుం మురారే ప్రసీద మా బన్ధనమాదిశస్వ ॥40॥

నీవు సృష్టించినది లేనప్పుడు నీకు సృష్టించడానికి శక్తి లేనప్పుడు ఈ దైత్యేశ్వరుదేమి చేయగలడు? ఓ మురారీ! ఈయన ప్రస్తుతం చేయగలిగినది, ఆయనకు చేతనైనది, నిన్ను మనసారా పూజించడమొక్కటే. కావున ఆయనను అనుగ్రహించి ప్రసన్నుడవు కమ్ము. బంధనానికి ఆదేశించవద్దు.

ప్రోక్తం శ్రుతౌ భవతాపీశ వాక్యం దానం పాత్రే భవతే సౌఖ్యదాయి ।
దేశే సుపుణ్యే వరదే యచ్చ కాలే తచ్చాశేషం దృశ్యతే చక్రపాణే ॥41॥

దేశకాలపాత్రమెరిగి గావించిన దానం అక్షయమౌతుందని శ్రుతులలో నీవు చెప్పలేదా? ఓ చక్రపాణీ! మా తండ్రి చేసిన దానం సంపూర్ణమైన భూదానంగా కనిపిస్తోంది.

దానం భూమిః సర్వకామప్రదేయం భవాన్ పాత్రం దేవదేవో జితాత్మా ।
కాలో జ్యేష్ఠామూలయోగే మృగాఙ్కః కురుక్షేత్రం పుణ్యదేశం ప్రసిద్ధమ్ ॥42॥

సర్వకామప్రదమైన భూదానం చేయబడింది. దేవదేవుడవు, జితాత్ముడవునైన నీవే ప్రతిగ్రహీతవు. చంద్రమాసం (శ్రావణమాసం) లో జ్యేష్ఠామూలా నక్షత్రాల పవిత్రయోగసమయంలో దానం చేయబడింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కురుక్షేత్రంలో దానం చేయబడింది.

కిం వా దేవోఽస్మద్విధైర్బుద్ధిహీనైః శిక్షాపనీయః సాధు వాఽసాధు చైవ ।
స్వయం శ్రుతీనామపి చాదికర్తా వ్యాప్య స్థితః సదసద్యో జగద్వై ॥43॥

కృత్వా ప్రమాణం స్వయమేవ హీనం పదత్రయం యాచితవాన్భువశ్చ ।
కిం త్వం న గృహ్ణాసి జగత్త్రయం భో రూపేణ లోకత్రయవందితేన ॥44॥

నాత్రాశ్చర్యం యజ్జగద్వై సమగ్రం క్రమత్రయం నైవ పూర్ణం తవాద్య ।
క్రమేణ త్వం లంఘయితుం సమర్థో లీలామేతాం కృతవాన్ లోకనాథ ॥45॥

ప్రమాణహీనాం స్వయమేవ కృత్వా వసున్ధరాం మాధవ పద్మనాభ ।
విష్ణో న బధ్నాసి బలిం న దూరే ప్రభుర్యదేవేచ్ఛతి తత్కరోతి ॥46॥

సర్వజ్ఞుడవైన నీకు బుద్ధిహీనులమైన మేము మంచిచెడులను, విధినిషేధాలను గూర్చి ఏమి చెప్పగలము?. వేదాలను మొదట సృజించినవాడవు నీవు. సదసద్విలసితమైన విశ్వంలో సర్వత్రా నిండియున్న ప్రభుడవు నీవు. నీకు తెలియనిదేమున్నది?. ముందుగా పొట్టివాడుగా వచ్చి, మూడడుగుల భూమిని యాచించావు. ఇప్పుడు లోకత్రయపూజ్యమైన విశ్వరూపం దాల్చి, మూడడుగులకు బదులు మూడులోకాలను నీవు తీసుకున్నావు గదా!. నీ మూడడుగులకు మూడులోకాలు చాలకపోవడంలో ఆశ్చర్యంలేదు. నీవిప్పుడు ఒక్కపాదంతోనే ముల్లోకాలను ఆక్రమించావు గదా! లోకేశ్వరా! ఇదంతయు నీ లీలమాత్రమే గదా!. ఈ భూమిని చిన్నదానినిగా నీవే చేసి, ఇప్పుడు బలిని బంధిస్తావా? మాధవా! పద్మనాభా! విష్ణో! పెద్దలు తమకు నచ్చినదే చేస్తారు. వారేమి చేసినా చెల్లుబాటవుతుంది. కాబట్టి ఓ దేవా! నీ ఇష్టంప్రకారం చెయ్యి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్తే వచనే బాణేన బలిసూనునా ।
ప్రోవాచ భగవాన్ వాక్యమాదికర్తా జనార్దనః ॥47॥

బలికుమారుడైన బాణుడు ఈ విధంగా పలుకగా ఆదికర్తయు, భగవానుడునైన జనార్దనుడు బాణునకిలా బదులు పలికాడు.

త్రివిక్రమ ఉవాచ – త్రివిక్రముడు పలికాడు.

యాన్యుక్తాని వచాంసీత్థం త్వయా బాలేయ సాంప్రతమ్ ।
తేషాం వై హేతుసంయుక్తం శృణు ప్రత్యుత్తరం మమ ॥48॥

బలినందనా! ఈ సందర్భంలో ఈవిధంగా నీవు పలికిన పలుకులకు హేతుబద్ధమైన నా సమాధానాన్ని విను.

పూర్వముక్తస్తవ పితా మయా రాజన్ పదత్రయమ్ ।
దేహి మహ్యం ప్రమాణేన తదేతత్ సమనుష్ఠితమ్ ॥49॥

నేను ముందుగానే నీ తండ్రితో ఇలా పలికాను "ఓ రాజా! నా ప్రమాణాన్ని అనుసరించి నాకు మూడడుగుల భూమినిమ్ము!" అని. దీనికి నీ తండ్రి పూర్తిగా సమ్మతించి నాకు మూడడుగుల నేలను దానమిచ్చాడు.

కిం న వేత్తి ప్రమాణం మే బలిస్తవ పితాసుర ।
ప్రాయచ్ఛద్యేన నిశ్శంకం మమానన్తం క్రమత్రయమ్ ॥50॥

అసురా! నీ తండ్రియైన బలి నా ప్రమాణాన్ని ఎరుగడా! అతడు నిస్సంకోచంగా మూడడుగులు పరిమాణం నాకిస్తాననలేదా!.

సత్యం క్రమేణ చైకేన క్రమేయం భూర్భువాదికమ్ ।
బలేరపి హితార్థాయ కృతమేతత్ క్రమత్రయమ్ ॥51॥

తస్మాద్యన్మమ బాలేయ త్వత్పిత్రాంబుకరే మహత్ ।
దత్తం తేనాయురేతస్య కల్పం యావద్భవిష్యతి ॥52॥

గతే మన్వన్తరే బాణ శ్రాద్ధదేవస్య సాంప్రతమ్ ।
సావర్ణికే చ సంప్రాప్తే బలిరింద్రో భవిష్యతి ॥53॥

ఇత్థం ప్రోక్త్వా బలిసుతం బాణం దేవస్త్రివిక్రమః ।
ప్రోవాచ బలిమభ్యేత్య వచనం మధురాక్షరమ్ ॥54॥

నిజమే! నేను తలచుకొన్నచో ఒక్కపాదంతోనే అన్ని లోకాలను కొలవగలను. కాని నీ తండ్రి హితాన్ని కోరి, మూడడుగులతో భూర్భువాది లోకాలను కొలిచాను. ఓ బాణా! పవిత్రమైన దానధారను నీ తండ్రి నా చేతిలో విడిచాడు. అందువల్ల నీ తండ్రి ఆయుర్దాయం కల్పాంతం వరకు ఉంటుంది. ఇప్పుడు జరుగుచున్న శ్రాద్ధదేవుని మన్వంతరం గడచిన పిమ్మట సావర్ణికమన్వన్తరం ప్రాప్తించిన వెంటనే నీ తండ్రియైన బలి ఇంద్రుడు కాగలడు. ఈ విధంగా త్రివిక్రముడు బాణుని సమాధానపరచి, బలిని చేరి, బలితో మధురమైన వాక్కులిలా పలికాడు.

శ్రీ భగవాన్ ఉవాచ – త్రివిక్రమదేవుడు పలికాడు.

ఆపూరణాద్దక్షిణాయా గచ్ఛ రాజన్ మహాఫలమ్ ।
సుతలం నామ పాతాలం వస తత్ర నిరామయః ॥55॥

రాజా! దానసాద్గుణ్యం కోసం నీవీయవలసిన దక్షిణ పూర్తయ్యేవరకు నీవు నిరామయుడవై సుతలమనే పాతాళంలో నివసింపుము.

బలిరువాచ – బలి పలికాడు.

సుతలే వసతో నాథ మమ భోగాః కృతోఽవ్యయాః ।
భవిష్యన్తి తు యేనాహం నివత్స్యామి నిరామయః ॥56॥

ప్రభో! సుతలంలో నిరామయంగా నేను నివసించగలగడానికి అవసరమైన అక్షయభోగాలు నాకెక్కడినుండి లభిస్తాయో తెలియజేయండి.

త్రివిక్రమ ఉవాచ – త్రివిక్రముడు పలికాడు.

సుతలస్థస్య దైత్యేంద్ర యాని భోగాని తేఽధునా ।
భవిష్యన్తి మహార్హాణి తాని వక్ష్యామి సర్వశః ॥57॥

దైత్యేంద్రా! సుతలంలో ఉన్నప్పుడు నీకు లభించే అపూర్వమైన భోగాలేమిటో వివరిస్తాను విను.

దానాన్యవిధిదత్తాని శ్రాద్ధాన్యశ్రోత్రియాణి చ ।
తథాధీతాన్యవ్రతిభిర్దాస్యన్తి భవతః ఫలమ్ ॥58॥

తథాన్యముత్సవం పుణ్యం వృత్తే శక్రమహోత్సవే ।
ద్వారప్రతిపదా నామ తవ భావీ మహోత్సవః ॥59॥

తత్ర త్వాం నరశార్దూలా హృష్టాః పుష్టాః స్వలంకృతాః ।
పుష్పదీపప్రదానేన అర్చయిష్యన్తి యత్నతః ॥60॥

విధివిధానరహితంగా చేయబడిన దానాలు, వేదమంత్రాలు లేకుండా ఆచరించే శ్రాద్ధాదికర్మలు, బ్రహ్మచర్యవ్రతదీక్ష తీసికొనకుండా చేయబడే వేదాధ్యయనాలు, వీటన్నిటి ఫలాలు భోగాలరూపంలో నీకు లభిస్తాయి. ఇవిగాక నీ పేరిట ఒక మహోత్సవం జనులంతా చేసుకుంటారు. ఇంద్రోత్సవం నిర్వహింపబడిన తరువాత వచ్చే పాడ్యమినాడు ద్వారప్రతిపద అనే పేరుతో పిలువబడే పెద్ద మహోత్సవం చేస్తుంటారు. ఈ ఉత్సవసమయంలో ఆరోగ్యవంతులై, సంతోషస్వాంతులైన మానవులంతా చక్కగా అలంకరించుకొని, పుష్పదానం, దీపదానం ద్వారా శ్రద్ధగా నిన్ను పూజిస్తారు.

తత్రోత్సవో ముఖ్యతమో భవిష్యతి దివానిశం హృష్టజనాభిరామమ్ ।
యథైవ రాజ్యే భవతస్తు సామ్ప్రతం తథైవ సా భావ్యథ కౌముదీ చ ॥61॥

నీరాజ్యంలో ఈసమయంలో ఏప్రకారంగా రాత్రింబవళ్ళు జనులందరు ఆనందోత్సాహాలతో వేడుకలు చేసుకుంటున్నారో అదేవిధంగా అప్పుడుకూడా ఉత్సవాలలో శ్రేష్ఠమైన కౌముది అనే పేరుగల ఉత్సవం నిర్వహింపబడుతుంది.

ఇత్యేవముక్త్వా మధుహా దితీశ్వరం విసర్జయిత్వా సుతలం సభార్యమ్ ।
యజ్ఞం సమాదాయ జగామ తూర్ణం సశక్రసద్మామరసంఘజుష్టమ్ ॥62॥

మధుసూదనుడు దానవేశ్వరుడైన బలితో ఇలా పలికిన పిమ్మట పత్నితో కూడిన బలిని సుతలానికి పంపించాడు. తదనంతరం త్రివిక్రముడు యజ్ఞాన్ని, అగ్నిదేవుని కూడా తీసుకొని దేవతలతో పరివేష్ఠితుడైన ఇంద్రుని సదనానికి వెళ్ళాడు.

దత్త్వా మఘోనే చ విభుస్త్రివిష్టపం కృత్వా చ దేవాన్ మఖభాగభోక్తౄన్ ।
అంతర్దధే విశ్వపతిర్మహర్షే సంపశ్యతామేవ సురాధిపానామ్ ॥63॥

ఓ మహర్షీ! నారదా! త్రివిష్టపాన్ని ఇంద్రునికిచ్చి దేవతలకు వారివారి యజ్ఞభాగాలు పునరుద్ధరించి, ఇంద్రాది దేవతలందరు చూస్తూ ఉండగానే విశ్వనాథుడైన త్రివిక్రముడు అంతర్ధానమయ్యాడు.

స్వర్గం గతే ధాతరి వాసుదేవే శాల్వోఽసురాణాం మహతా బలేన ।
కృత్వా పురం సౌభమితి ప్రసిద్ధం తదాన్తరిక్షే విచచార కామాత్ ॥64॥

మానవుల భాగ్యనిర్ణేతయైన వాసుదేవుడు స్వర్గానికి వెళ్ళగానే శాల్వదైత్యుడు గొప్ప రాక్షసబలంతో అంతరిక్షంలో సౌభమనే నగరాన్ని నిర్మించుకుని యథేచ్ఛగా సంచరింపసాగాడు.

మయస్తు కృత్వా త్రిపురం మహాత్మా సువర్ణతామ్రాయ సమాయ సౌఖ్యమ్ ।
సతారకాక్షః సహ వైద్యుతేన సంతిష్ఠతే భృత్యకలత్రవాన్ సః ॥65॥

మహాత్ముడైన మయుడు స్వర్ణతామ్రలోహనిర్మితమైన త్రిపురమనే పట్టణం సమస్తవసతులతో సర్వాంగ సుందరంగా నిర్మించుకొని, భార్యతోను, పరివారంతోను, తారకాక్షదైత్యులతోను కూడుకుని సుఖనివాసం చేయసాగాడు.

బాణోఽపి దేవేన హృతే త్రివిష్టపే బద్ధే బలౌ చాపి రసాతలస్థే ।
కృత్వా సుగుప్తం భువి శోణితాఖ్యం పురం స చాస్తే సహ దానవేంద్రైః ॥66॥

బాణుడు కూడా శ్రీహరి త్రివిష్టపాన్ని అపహరించిన పిమ్మట తన తండ్రి బద్ధుడై రసాతలంలో నివాసముండగా భూమిమీద శోణితమనే చక్కని నగరదుర్గం నిర్మించుకొని ముఖ్యులైన దైత్యేశ్వరులతో కలసి రాజ్యపాలన గావించాడు.

ఏవం పురా చక్రధరేణ విష్ణునా బద్ధో బలిర్వామనరూపధారిణా ।
శక్రప్రియార్థం సురకార్యసిద్ధయే హితాయ విప్రర్షభగోద్విజానామ్ ॥67॥

ప్రాదుర్భవస్తే పఠితో మహర్షే పుణ్యః శుచిర్వామనస్యాఘహారీ ।
శ్రుతే యస్మిన్ సంస్మృతే కీర్తితే చ పాపం యాతి ప్రక్షయం పుణ్యమేతి ॥68॥

ఏతత్ ప్రోక్తం భవతః పుణ్యకీర్తేః ప్రాదుర్భావో బలిబంధోఽవ్యయస్య ।
యచ్చాప్యన్యచ్ఛ్రోతుకామోఽసి విప్ర తత్ప్రోచ్యతాం కథయిష్యామ్యశేషమ్ ॥69॥

ఓ నారదా! ఈ విధంగా పూర్వకాలంలో దేవకార్యం సిద్ధింపజేయడానికి, ఇంద్రునకు హితం కలిగించడానికి, గోబ్రాహ్మణులకు శుభం కలిగించడానికి, చక్రధరుడైన విష్ణువు వామనరూపం ధరించి బలిని బంధించాడు. నారదమహర్షీ! నేను నీకు పాపములను పోగొట్టునది, పుణ్యప్రదమునైన వామనావతారగాథను వివరించాను. దీనిని వినినా, స్మరించినా, కీర్తించినా పాపక్షయం కలిగి, పుణ్యాన్ని పొందుతారు. ఓ బ్రాహ్మణోత్తమా! పుణ్యశ్లోకుడు, అవ్యయుడునగు శ్రీమహావిష్ణువు వామనునిగా జన్మించి, బలిని బంధించిన గాథను నీకు వినిపించాను. ఇంకను నీవేమి వినదలుచుకున్నావో తెలియజెయ్యి. నేను దానిని వివరంగా తెలియజేస్తాను.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే బలిబన్ధనం నామ ద్వినవతితమోఽధ్యాయః ॥92॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని బలిబంధనమనే తొంబైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రినవతితమోఽధ్యాయః – తొంబైమూడవ అధ్యాయం

బ్రహ్మోక్తస్తవః – బ్రహ్మచేసిన విశ్వరూపస్తవం

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

శ్రుతం యథా భగవతా బలిర్బద్ధో మహాత్మనా ।
కిం త్వస్యన్యత్తు ప్రష్టవ్యం తచ్ఛ్రుత్వా కథయాద్య మే ॥1॥

భగవాన్ దేవరాజాయ దత్వా విష్ణుస్త్రివిష్టపమ్ ।
అంతర్ధానం గతః క్వాసౌ సర్వాత్మా తాత కథ్యతామ్ ॥2॥

సుతలస్థశ్చ దైత్యేంద్రః కిమకార్షీత్ తథా వద ।
కా చేష్టా తస్య విప్రర్షే తన్మే వ్యాఖ్యాతుమర్హసి ॥3॥

భగవన్! మహాత్ముడగు వాసుదేవుడు బలిని బంధించిన గాథ మీ ద్వారా విన్నాను. ఇంకొకవిషయం మిమ్ములను అడుగుతున్నాను. దానిని దయచేసి నాకు తెలియజేయండి. తండ్రీ! దేవేంద్రునకు త్రివిష్టపాన్ని తిరిగి యిచ్చి అంతర్హితుడైన విష్ణువు ఎక్కడకు వెళ్ళాడు? సుతలానికి వెళ్ళిన దైత్యేంద్రుడు ఏమి చేశాడు? విప్రర్షీ! ఇదంతా విపులంగా నాకు తెలియజేయండి.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

అంతర్ధాయ సురావాసం వామనోఽభూదవామనః ।
జగామ బ్రహ్మసదనమధిరుహ్యోరగాశనమ్ ॥4॥

వాసుదేవం సమాయాన్తం జ్ఞాత్వా బ్రహ్మాఽవ్యయాత్మకః ।
సముత్థాయాథ సౌహార్దాత్ సస్వజే కమలాసనః ॥5॥

పరిష్వజ్యార్చ్య విధినా వేధాః పూజాదినా హరిమ్ ।
పప్రచ్ఛ కిం చిరేణేహ భవతాగమనం కృతమ్ ॥6॥

నారదా! అంతర్ధానమైన వెంటనే వామనుడు తన వామనరూపం వదలి నిజరూపంతో గరుడారూఢుడై, బ్రహ్మసదనానికి వెళ్ళాడు. వాసుదేవుడు రావడం తెలిసికొనిన అవ్యయుడైన బ్రహ్మ వెంటనే లేచి, ప్రేమతో ఎదురేగి, ఆలింగనం చేసికొని, లోనికి తీసికొనివచ్చి, విధ్యుక్తంగా పూజించి, చిరకాలం తరువాత మీ రాక కారణమేమిటని బ్రహ్మ వాసుదేవుని ప్రశ్నించాడు.

అథోవాచ జగత్స్వామీ మయా కార్యం మహత్కృతమ్ ।
సురాణాం క్రతుభాగార్థం స్వయం భో బలిబన్ధనమ్ ॥7॥

పితామహస్తద్వచనం శ్రుత్వా ముదితమానసః ।
కథం కథమితి ప్రాహ త్వం మాం దర్శితుమర్హసి ॥8॥

ఇత్యేవముక్తే వచనే భగవాన్ గరుడధ్వజః ।
దర్శయామాస తద్రూపం సర్వదేవమయం లఘు ॥9॥

అందులకా జగత్పతి దేవతలకు వారి క్రతుభాగాలనిప్పించడానికి బలిని బంధించి మహత్కార్యం గావించానని చెప్పగా కమలాసనుడు సంతోషించి, బలిబంధనమెలా గావించారో దానిని నాకు చూపించి అనుగ్రహించండని అర్థించాడు. బ్రహ్మ ఇలా పలుకగానే భగవానుడైన గరుడధ్వజుడు సర్వదేవతామయమైన తన విశ్వరూపాన్ని లఘుప్రమాణంలో బ్రహ్మకు చూపించాడు.

తం దృష్ట్వా పుండరీకాక్షం యోజనాయుతవిస్తృతమ్ ।
తావానేవోర్ధ్వమానేన తతోఽజః ప్రణతోఽభవత్ ॥10॥

తతః ప్రణమ్య సుచిరం సాధుసాధ్వీత్యుదీర్య చ ।
భక్తినమ్రో మహాదేవం పద్మజః స్తోత్రమీరయత్ ॥11॥

పదివేల యోజనాల పొడవు, వెడల్పు, ఎత్తుతో వ్యాపించి నిలచిన పుండరీకాక్షుని విశ్వరూపాన్నిచూసి, విధాత భక్తినమ్రుడై, ప్రణమిల్లాడు. చిరకాలం ఆవిధంగా ప్రణమిల్లి "ఆహా! ఆహా! బాగు! బాగు!" అని పలుకుతూ పద్మజుడు మహాదేవుని ఇలా స్తోత్రం చేశాడు.

ఓం నమస్తే । **దేవాధిదేవ । వాసుదేవ । ఏకశృంగ । బహురూప । వృషాకపే । భూతభావన । సురాసుర వృష । సురాసుర మథన । పీతవాసః । శ్రీనివాస । అసుర నిర్మితాన్త । అమిత నిర్మిత । కపిల । మహాకపిల । విష్వక్సేన । నారాయణ ॥**

ధ్రువధ్వజ । సత్యధ్వజ । ఖడ్గధ్వజ । కాలధ్వజ । వైకుణ్ఠ । పురుషోత్తమ । వరేణ్య । విష్ణో । అపరాజిత । జయ । జయన్త । విజయ । కృతావర్త । మహాదేవ । అనాదే । అనన్త । ఆద్యన్తమధ్యనిధన । పురంజయ । ధనంజయ । శుచిశ్రవ । పృశ్నిగర్భ । కమలగర్భ । కమలాయతాక్ష । శ్రీపతే । విష్ణుమూల । మూలాధివాస । ధర్మాధివాస । ధర్మవాస । ధర్మాధ్యక్ష । ప్రజాధ్యక్ష । గదాధర । శ్రీధర । శ్రుతిధర । వనమాలాధర । లక్ష్మీధర । ధరణీధర । పద్మనాభ ॥

విరించే । ఆర్ష్టిషేణ । మహాసేన । సేనాధ్యక్ష । పురుష్టుత । బహుకల్ప । మహాకల్ప । కల్పనాముఖ । అనిరుద్ధ । సర్వగ । సర్వాత్మన్ । ద్వాదశాత్మక । సూర్యాత్మక । సోమాత్మక । కాలాత్మక । వ్యోమాత్మక । భూతాత్మక । రసాత్మక । పరమాత్మన్ । సనాతన । ముంజకేశ । హరికేశ । గుడాకేశ । కేశవ । నీల । సూక్ష్మ । స్థూల । పీత । రక్త । శ్వేత । శ్వేతాధివాస । రక్తాంబరప్రియ । ప్రీతికర । ప్రీతివాస । హంస । నీలవాస । సీరధ్వజ । సర్వలోకాధివాస । కుశేశయ । అధోక్షజ । గోవిన్ద । జనార్దన । మధుసూదన । వామన నమస్తే ॥

సహస్రశీర్షోఽసి । సహస్రదృగసి । సహస్రపాదోఽసి । త్వం కమలోఽసి । మహాపురుషోఽసి । సహస్రబాహురసి । సహస్రమూర్తిరసి । త్వాం దేవాః ప్రాహుః । సహస్రవదనం । తే నమస్తే ॥

ఓం నమస్తే । **విశ్వదేవేశ । విశ్వభూః । విశ్వాత్మక । విశ్వరూప । విశ్వసంభవ । త్వత్తో విశ్వమిదమభవద్। బ్రాహ్మణాస్త్వన్ముఖేభ్యోఽభవన్ । క్షత్రియాః దోః సంభూతాః । ఊరుయుగ్మాద్విశోఽభవన్ । శూద్రాశ్చరణకమలేభ్యః॥**

నాభ్యా భవతోఽన్తరిక్ష మజాయత । ఇంద్రాగ్నీ వక్త్రతో నేత్రాద్భానురభూన్మనసః శశాంకః । అహం ప్రసాదజస్తవ క్రోధాత్ త్ర్యంబకః । ప్రాణాజ్జాతో భవతో మాతరిశ్వా । శిరసో ద్యౌరజాయత । శ్రోత్రాద్దిశో భూరియం చరణాదభూత్। శ్రోత్రోద్భవా దిశో భవతః । స్వయంభో నక్షత్రాస్తేజోద్భవాః । మూర్తయశ్చామూర్తయశ్చ సర్వే త్వత్తః సముద్భూతాః। అతో విశ్వాత్మకోఽసి ॥

ఓం నమస్తే । పుష్పహాసోఽసి । మహాహాసోఽసి । పరమోఽసి । ఓంకారోఽసి । వషట్కారోఽసి । స్వాహాకారోఽసి । వౌషట్కారోఽసి । స్వధాకారోఽసి । వేదమయోఽసి । తీర్థమయోఽసి । యజమానమయోఽసి । యజ్ఞమయోఽసి । సర్వధాతాఽసి । యజ్ఞభోక్తాఽసి । శుక్రధాతాఽసి । భూర్ద భువర్ద స్వర్ద స్వర్ణద గోద అమృతదోఽసీతి ॥

ఓం బ్రహ్మాదిరసి । బ్రహ్మమయోఽసి । యజ్ఞోఽసి । వేదకామోఽసి । వేద్యోఽసి । యజ్ఞధారోఽసి । మహామీనోఽసి । మహాసేనోఽసి । మహాశిరా అసి । నృకేసర్యసి । హోతాఽసి । హోమ్యోఽసి । హవ్యోఽసి । హూయమానోఽసి । హయమేధోఽసి । పోతాఽసి । పావయితాఽసి । పూతోఽసి । పూజ్యోఽసి । దాతాఽసి । హన్యమానోఽసి । హ్రియమాణోఽసి । హర్తాసీతి ॥

ఓం నీతిరసి । నేతాఽసి । అగ్ర్యోఽసి । విశ్వధామాఽసి । శుభాణ్డోఽసి । ధ్రువోఽసి । ఆరణేయోఽసి । ధ్యానోఽసి । ధ్యేయోఽసి । శ్రేయోఽసి । జ్ఞానోఽసి । యష్టాఽసి । దానోఽసి । భూమాఽసి । ఈక్ష్యోఽసి । బ్రహ్మోఽసి । హోతాఽసి । ఉద్గాతాఽసి । గతిమతాంగతిరసి । జ్ఞానినాం జ్ఞానమసి । యోగినాం యోగోఽసి । మోక్షగామినాం మోక్షోఽసి । శ్రీమతాం శ్రీరసి । గృహ్యోఽసి । పాతాఽసి । పరమసి ॥

సోమోఽసి । సూర్యోఽసి । దీక్షాఽసి । దక్షిణాఽసి । నరోఽసి । త్రినయనోఽసి । మహానయనోఽసి । ఆదిత్యప్రభవోఽసి । సురోత్తమోఽసి । శుచిరసి । శుక్రోఽసి । నభోఽసి । నభస్యోఽసి । ఇషోఽసి । ఊర్జోఽసి । సహోఽసి । సహస్యోఽసి । తపోఽసి । తపస్యోఽసి । మధురసి । మాధవోఽసి । కాలోఽసి । సంక్రమోఽసి । విక్రమోఽసి । పరాక్రమోఽసి । అశ్వగ్రీవోఽసి । మహామేధోఽసి । శంకరోఽసి । హరీశ్వరోఽసి । శంభురసి । బ్రహ్మేశోఽసి । సూర్యోఽసి । మిత్రావరుణోఽసి । ప్రాగ్వంశ కాయోఽసి । భూతాదిరసి । మహాభూతోఽసి । ఊర్ధ్వకర్మాఽసి । కర్తాఽసి । సర్వపాపవిమోచనోఽసి । త్రివిక్రమోఽసి । ఓం నమస్తే ॥ ॥**12**॥

1. **ఓం నమస్తే** : ప్రణవాక్షరమైన ఓంకారస్వరూపివైన నీకు నమస్కారం. ।

2. **దేవాధిదేవా!** : ప్రధానమగు దేవతలకు ప్రభువు. కావున దేవాధిదేవుడని కీర్తింపబడుతున్న నీకు నమస్కారం.

3. **వాసుదేవా!** : 1. వసతీతి వాసుః । దీవ్యతీతి దేవః । వాసుశ్చాసౌ దేవశ్చ వాసుదేవః । అనే వ్యుత్పత్తి ప్రకారం ప్రపంచమంతట నివసించి, సూర్యుని వలె స్వయంగా ప్రకాశించి, ప్రకాశింప జేయువాడు గాన వాసుదేవుడు.
   2. వసుదేవుని కుమారుడు గాన వాసుదేవుడు.

3. **వసంత్యస్మిన్ జగన్తీతి వాసుః ।** అన్ని జగములు తనయందు గల దేవుడు గాన వాసుదేవుడు.

4. **వసతి, వసయతి, ఆచ్ఛాదయతి, సర్వమితి, వాసుదేవః ।** బ్రహ్మాండాలనన్నిటిని కప్పి, ప్రకాశింపజేయు బృహద్భానువు. తానంతటా క్రీడించువాడు, జయించువాడు, ప్రకాశించువాడు, వ్యవహరించువాడు సృష్టించువాడు, తిరుగువాడు. కావున వాసుదేవుడు. అట్టి నీకు నమస్కారం.

4. **ఏకశృంగా!** : శ్లో॥ **హేమాద్రి శిఖరాకారం శుద్ధస్ఫటికసన్నిభమ్ ।**
పూర్ణచంద్రనిభం దేవం ద్విభుజం వామనం స్మరేత్ ॥

అని దధివామనస్తోత్రంలో వామనుడు హేమాద్రి శిఖరాకారుడుగా వర్ణింపబడడం వల్ల శ్రీమహావిష్ణువు ఏకశృంగుడు. అట్టి నీకు నమస్కారం.

5. **బహురూపా!** : **అజాయమానో బహుధా విజాయతే ।** అను శ్రుతిననుసరించి పుట్టుక లేని పరమాత్మ మత్స్యకూర్మాది అనేక అవతారాలు ధరించి బహురూపుడుగా ప్రసిద్ధుడు. అట్టి నీకు నమస్కారం.

6. **వృషాకపీ !** : **। వర్షణాత్ సర్వకామానాం ధర్మో వృషః । కాత్ తోయాత్ భూమిమపాదితి కపిః ।** సర్వకామములను వర్షించునదగుటచే ధర్మము వృషమనబడుచున్నది. **క** శబ్దమునకు జలమని అర్థము. జలమునుండి భూమి **'అపాత్'** ఉద్ధరించినది **'కపి'** అనబడుతుంది. అనగా ఆదివరాహావతారము. వృషరూప కపిరూపాలనుబట్టి పరమాత్మ వృషాకపిగా ప్రసిద్ధుడు. **। కపిర్వరాహశ్రేష్ఠశ్చ ధర్మశ్చ వృష ఉచ్యతే ।** అను మహాభారతవచనం వృషాకపి శబ్దమును వివరిస్తోంది. అట్టి నీకు నమస్కారం.

7. **భూతభావనా !** : **। భూతాని భావయతి, జనయతి, వర్ధయతీతి వా భూతభావనః ।** ప్రాణులను సృష్టించుటవలనను, వృద్ధినొందించుటచేతను, భూతభావనుడు. అనగా ప్రాణిసృష్టి, ప్రాణివృద్ధి చేయువాడు. అట్టి నీకు నమస్కారం.

8. **సురాసుర వృషా !** : సురాసురుల ధర్మస్వరూపుడవైన నీకు నమస్కారం.

9. **సురాసుర మథనా!** : సురాసురులను మథించునట్టి నీకు నమస్కారం.

10. **పీతవాసా !** : పీతాంబరధారివైన నీకు నమస్కారం.

11. **శ్రీనివాసా !** : **యస్య వక్షస్యనపాయినీ శ్రీర్వసతి సః శ్రీనివాసః ।** నిరంతరం వక్షఃస్థలమందు విడువక వసించు శ్రీదేవి కలవాడు కావున శ్రీనివాసుడు.
శ్రీమత్సు నిత్యం వసతీతి శ్రీనివాసః । అను వ్యుత్పత్తినిబట్టి శ్రీమంతులయందు నిత్యం నివసించువాడు కావున శ్రీనివాసుడు. అట్టి నీకు నమస్కారం.

12. **అసుర నిర్మితాన్తా!** : అసురుల సమస్తనిర్మాణములను అంతమొందించువాడవు. అట్టి నీకు నమస్కారం.

13. **అమిత నిర్మితా!** : అమితమైన ప్రకృతినంతటిని సృజించినవాడవు. అట్టి నీకు నమస్కారం.

14. **కపిలా !** : **బడబానలస్య కపిలో వర్ణయితి తద్రూపీ కపిలః ।** కపిలవర్ణంతో నొప్పారు బడబానలస్వరూపుడు కావున పరమాత్మ కపిలుడు. అట్టి నీకు నమస్కారం.

15. **మహాకపిలా !** : **సిద్ధానాం కపిలో మునిః ।** అను స్మృతి వచనానుసారం శుద్ధతత్త్వ విజ్ఞాన రూపుడైన కపిలాచార్యుని స్వరూపుడైనవాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

16. **విష్వక్సేనా !** : **విష్వక్** –అవ్యయం. సర్వేత్యర్థే । **విష్వగంచతిపలాయతే దైత్యసేనా యస్య రణోద్యోగమాత్రేణేతి విష్వక్సేనః ।** సర్వదైత్యసేనను తన యుద్ధోద్యమ మాత్రంచేతనే పలాయనం చేయించువాడు. కావున విష్వక్సేనుడు. అట్టి నీకు నమస్కారం.

17. **నారాయణా !** : 1. **నరస్యేదం నారమ్ । నారం వపురయత ఇతి నారాయణః ।** నరునకు సంబంధించిన శరీరమును పొందినవాడు నారాయణుడు. అనేక మానవావతారాలు కలిగిన పరబ్రహ్మ నారాయణుడు.

2. శ్లో॥ **ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః ।**
అయనం తస్య తాః ప్రోక్తాః తేన నారాయణః స్మృతః ॥ – *మనుస్మృతి.*

జలములకు నారములని పేరు. అట్టి జలములు నివాసస్థానంగా కలవాడు కావున నారాయణుడు.

3. । **నృణాం సమూహః నారమ్ । అయనం స్థానమ్ ।** నరసమూహానికి ఉనికియైనవాడు కావున నారాయణుడు. లేదా నరసమూహం నివాసంగా కలవాడు. కావున నారాయణుడు.

4. । **నరః ఆత్మా । తతో జాతాన్యాకాశాదీని నారాణి – కార్యాణి । తాని కార్యాణి అయం కారణాత్మనా వ్యాప్నోతి । అతశ్చ తాన్యయనమస్యేతి నారాయణః ।**
– *మహాభారతం*

నరుడనగా ఆత్మ. ఆత్మనుండి పుట్టినవి ఆకాశాది కార్యాలు. అట్టి కార్యాలయందు కారణాత్మగా వ్యాపించినవాడు కావున నారాయణుడు. సమస్తజీవులు జన్మించడానికి కారణమైన పంచభూతాలకు కారణమైనవాడు నారాయణుడు. మహాకారణకారణమైన పరబ్రహ్మతత్త్వమే నారాయణుడు.

5. **నారాణాం = జీవానాం, అయనత్వాత్ ప్రలయే ఇతి నారాయణః ।** ప్రళయ కాలంలో జీవులన్నియు ఎవరియందు లయమందునో అతడే నారాయణుడు.

చిట్టచివర అందరికి పొందదగిన తత్త్వమే నారాయణుడు.

6. **నయతీతి నరఃప్రోక్తః, పరమాత్మా సనాతనః ।** అను వ్యాసవచనాన్నిబట్టి సనాతనుడైన పరమాత్మ నరుడని చెప్పబడుచున్నాడు.

నయతి స్వవశం సర్వం ఇతి నరః । ఎదుటనున్న ప్రతిదానిని తనవశం చేసికొన గోరువాడు కావున నరుడు. అతనియందుండువాడు కావున నారాయణుడు. అట్టినీకు నమస్కారం.

18. **ధ్రువధ్వజా!** : నాశరహితుడు, నిత్యుడునైన ధ్రువుడు కేతనంగా గలవాడు. అట్టి నీకు నమస్కారం.

19. **సత్యధ్వజా!** : సత్యమే కేతనంగా గలవాడు. అట్టి నీకు నమస్కారం.

20. **ఖడ్గధ్వజా!** : ఖడ్గమే కేతనంగా గలవాడు. అట్టి నీకు నమస్కారం.

21. **తాలధ్వజా!** : తాలధ్వజునకు నమస్కారం.

22. **వైకుంఠ !** : **। వివిధా కుంఠాగతేః ప్రతిహతిః వికుంఠాయాః కర్తేతి వైకుంఠః । జగదారమ్భే విశ్లిష్టాని భూతాని పరస్పరం సంశ్లేషయన్ తేషాం గతిం ప్రతిబధ్నాతీతి వైకుంఠః ।.**

వివిధమైన గతికి ప్రతిఘాతం వికుంఠ అనబడుతుంది. వికుంఠకర్త వైకుంఠుడు. అనగా జగదారంభమందు వేరుగానున్న భూతాలను పరస్పరం మేళనం చేస్తూ, వాని గతిని ప్రతిబంధించువాడు కావున పరబ్రహ్మ వైకుంఠుడు.

శ్లో॥ **మయా సంశ్లేషితా భూమిరద్భిః వ్యోమ చ వాయునా ।**
వాయుశ్చ తేజసా సార్ధం వైకుంఠత్వం తతో మమ ॥ – *మహాభా. శాం.ప.*

నాచేత భూమి జలంతోను, ఆకాశం వాయువుతోను, వాయువు తేజస్సుతోను, మేళనం చేయబడినవి. గాన నేను వైకుంఠుడనైనాను. అట్టి నీకు నమస్కారం.

23. **పురుషోత్తమా!**: **పురుషాణాముత్తమః ।** అను షష్ఠీ సమాసం ద్వారా పురుషులలో శ్రేష్ఠుడు పురుషోత్తముడు.

పురుషేభ్యః ఉత్తమః । అను పంచమీ సమాసం ద్వారా పురుషులకంటె శ్రేష్ఠుడుపురుషోత్తముడు

శ్లో॥ **యస్మాత్ క్షరమతీతోహమక్షరాదపి చోత్తమః ।**
అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥ – *భగవద్గీత.*

క్షరుడు (నశించువాడు), అక్షరుడు (నాశనంలేనివాడు) వీరిరువురకు అతీతుడు, శ్రేష్ఠుడు పురుషోత్తముడు. అట్టి నీకు నమస్కారం.

24. **వరేణ్యా !** : సర్వశ్రేష్ఠుడా! నీకు నమస్కారం.

25. **విష్ణో !** : 1. **విశ్వం వేవేష్టి = వ్యాప్నోతీతి విష్ణుః ।** విశ్వమంతటిని వ్యాపించి యుండువాడుగాన విష్ణువు.

2. **విషేః వ్యాప్త్యభిధాయినీ నుక్ప్రత్యయాన్తశ్చ రూపం విష్ణుః ।** వ్యాపనమనగా దేశం చేతను, కాలం చేతను, వస్తువుల చేతను కొలత వేయుటకు వీలులేనివాడు విష్ణువు.
3. విశ ధాతువునకు నుక్ ప్రత్యయం చేరగా విష్ణువు సిద్ధిస్తుంది. కాబట్టి ప్రాణులన్నిటి యందు ప్రవేశించువాడు విష్ణువు.
4. శ్లో॥ **వ్యాప్తే మే రోదసీ పార్థ కాన్తిశ్చాభ్యధికా స్థితా ।**
క్రమణాచ్చాప్యహం పార్థ విష్ణురిత్యభిసంజ్ఞితః ॥ – *మహాభారతం, శాం.ప.*

భూమ్యాకాశాలకు వ్యాపింపగా మిక్కిలి అధికంగా ఆ రెండింటిని ఏ కొంచెం వదలక వ్యాపించి యుండడం చేత పరబ్రహ్మకు విష్ణువని పేరు కలిగింది. అట్టి నీకు నమస్కారం.

26. **అపరాజితా !** : **న అన్తరై రాగాదిభిః బాహ్యైరపి దానవాదిభిః శత్రుభిః పరాజిత ఇతి అపరాజితః ।** అంతఃశత్రువులైన రాగద్వేషాదుల చేతను, బహిశ్శత్రువులైన దానవాదుల చేతను, పరాజితుడు కానట్టివాడు. కావున పరమాత్మ అపరాజితుడు. అట్టి నీకు నమస్కారం.

27. **జయా !** : **సమస్తాని భూతాని జయతీతి జయః ।** సమస్తభూతములను జయించువాడు. కావున పరమేశ్వరుడు జయశబ్దవాచ్యుడు. అట్టి నీకు నమస్కారం.

28. **జయన్తా !** : **అరీన్ అతిశయేన జయతి జయహేతుర్వా జయన్తః ।** అధికంగా శత్రువులను జయించువాడు. జయహేతువైనవాడునగుటచే పరమేశ్వరుడు జయంతుడు. అట్టి నీకు నమస్కారం.

29. **విజయా !** : **విజయతే జ్ఞానవైరాగ్యైశ్వర్యాదిభిర్గుణైర్విశ్వమితి విజయః ।** జ్ఞానం వైరాగ్యం, ఐశ్వర్యం మున్నగు గుణాల చేత విశ్వవిజయం గలవాడు గాన విజయుడు. అట్టి నీకు నమస్కారం.

30. **కృతావర్తా !** : **కృత్యన్తే ఇతి కృతః । వృతు వర్తనే ఇతి ఆవర్తః । ఆవర్తం కృతం యేన సః కృతావర్తః ।** సంసారచక్రమును నిర్మించువాడు, ఛేదించువాడు గాన పరమాత్ముడు కృతావర్తుడు. అట్టి నీకు నమస్కారం.

31. **మహాదేవా !** : **సర్వాన్ భావాన్ పరిత్యజ్య । ఆత్మజ్ఞాన యోగైశ్వర్యే మహతి మహీయతే తస్మాదుచ్యతే మహాదేవః ।** సర్వభావాలను వదలి, ఆత్మజ్ఞానయోగమందును, ఐశ్వర్యమందును మహిమోపేతుడు. గాన పరమాత్మ మహాదేవుడు. అట్టి నీకు నమస్కారం.

32. **అనాదీ** : 1. **ఆదిః కారణమస్య న విద్యతే ఇతి అనాదిః ।** ఆది అనగా కారణం. పరమాత్మ సర్వకారణమగుట చేత తనకు కారణం లేనట్టివాడు. కావున అనాది.

2. **ఆదిః జన్మ తద్యస్య న విద్యతే స అనాదిః ।** పరమాత్మ జన్మలేనివాడగుటచే అనాది. అట్టి నీకు నమస్కారం.

33. **అనంతా !** : 1.**వ్యాపిత్వాన్నిత్యత్వాత్సర్వాత్మత్వాత్ దేశతః కాలతో వస్తుతశ్చాయం అపరిచ్ఛిన్నః అనన్తః । సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ ఇతి శ్రుతేః ।**వ్యాపియై, నిత్యుడై, సర్వాత్మకుడై, దేశకాలవస్తుకృత పరిచ్ఛేదం లేనట్టివాడు. గాన పరమాత్మ అనంతః అని కీర్తింపబడుతున్నాడు. సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ అను స్మృతి పరమాత్మయొక్క అనంతత్వాన్ని ప్రతిపాదిస్తోంది. అట్టి నీకు నమస్కారం.

34. **ఆద్యన్తమధ్య నిధనా !** : ఆదిమధ్యాంతరహితుడు. అట్టి నీకు నమస్కారం.

35. **పురంజయా !** : పరమాత్మ త్రిపురాలను జయించిన శివస్వరూపుడు. అట్టి నీకు నమస్కారం.

36. **ధనంజయా !** : **పాండవానాం ధనంజయః ।** అను గీతావాక్యంచే దిగ్విజయంలో అత్యధికమగు ధనం జయించుటచే పరమాత్మ ధనంజయుడనియు, అర్జునుడనియు కీర్తింప బడుచున్నాడు. అట్టి నీకు నమస్కారం.

37. **శుచిశ్రవా !** : **శుచీని శ్రవాంసి నామాని శ్రవణీయాన్యస్యేతి శుచిశ్రవాః ।** శుచిమంతములు, శ్రవణీయములునైన నామములు కలవాడు. గాన పరమేశ్వరుడు శుచిశ్రవుడు. అట్టి నీకు నమస్కారం.

38. **పృశ్నిగర్భా !** : కిరణగర్భుడు. అనగా ప్రకాశం తనయందు కలవాడు. జ్ఞానగర్భుడు. అట్టి నీకు నమస్కారం.

39. **కమలగర్భా !** : హృదయకమలము మధ్యమందు వసించువాడు. కావున పరమాత్మ కమలగర్భుడు. అట్టి నీకు నమస్కారం.

40. **కమలాయతాక్షా !** : కమలపత్రముల వలె విశాలమైన నేత్రములు కలవాడు. అట్టి నీకు నమస్కారం.

41. **శ్రీపతే !** : లక్ష్మికి పతియైనవాడు. అట్టి నీకు నమస్కారం.

42. **విష్ణుమూలా !** : సర్వవ్యాపకత్వానికి మూలకారకుడై, విశ్వమునందంతటను ప్రవేశించి, దేశకాలవస్తుపరిచ్ఛేదశూన్యుడైనవాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

43. **మూలాధివాసా !** : చరాచరసృష్టికంతకు మూలభూతమైనవాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

44. **ధర్మాధివాసా !** : ధర్మియైనవాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

45. **ధర్మవాసా !** : ధర్మమునందుండువాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

46. **ధర్మాధ్యక్షా !** : **ధర్మాధర్మౌ సాక్షాదీక్షాఽనురూపం ఫలం దాతుం తస్మాత్ ధర్మాధ్యక్షః ।**

ధర్మాధర్మాలకు తగిన ఫలమిచ్చుటకై వానిని సాక్షాత్తుగా వీక్షించువాడు. కావున ధర్మాధ్యక్షుడు. అట్టి నీకు నమస్కారం.

47. **ప్రజాధ్యక్షా !** : **ఈశ్వరత్వేన సర్వాసాం ప్రజానాం అధ్యక్షః ప్రజాధ్యక్షః ।**
సర్వప్రజలకు అధ్యక్షుడు పరమాత్మ. సమస్త ప్రజలకు తండ్రి, ప్రభువు అయినవాడు గాన పరమాత్మ ప్రజాధ్యక్షుడు. అట్టి నీకు నమస్కారం.

48. **గదాధరా !** : **బుద్ధితత్త్వాత్మికాం కౌమోదకీం నామ గదాం వహన్ గదాధరః ।**
బుద్ధితత్త్వాత్మకమైన కౌమోదకి అనే గదను ధరించినవాడు. కావున పరమాత్మ గదాధరుడు. అట్టి నీకు నమస్కారం.

49. **శ్రీధరా !** : **సర్వభూతానాం జననీం శ్రియం వక్షసి వహన్ శ్రీధరః ।**
సమస్తప్రాణులకు జననియైన లక్ష్మీదేవిని వక్షఃస్థలమున ధరించినవాడు. కావున పరమాత్మ శ్రీధరుడు. అట్టి నీకు నమస్కారం.

50. **శ్రుతిధరా !** : వేదప్రతిపాద్యుడు గాన పరమాత్మ శ్రుతిధరుడు. అట్టి నీకు నమస్కారం.

51. **వనమాలాధరా !** : **। భూతతన్మాత్రరూపాం వైజయన్త్యాఖ్యాం వనమాలాం ధరతీతి వనమాలాధరః ।**
భూతతన్మాత్ర రూపమైన వైజయంతియను వనమాలను ధరించినవాడు కావున పరమాత్మ వనమాలాధరుడు. అట్టి నీకు నమస్కారం.

52. **లక్ష్మీధరా !** : లక్ష్మీదేవిని తన వక్షఃస్థలమందు నిత్యము ధరించువాడు. కావున పరమాత్మ లక్ష్మీధరుడు. అట్టి నీకు నమస్కారం.

53. **ధరణీధరా !** : **। దిగ్గజాది రూపేణ వరాహరూపేణ చ ధరణీం ధత్తే ఇతి ధరణీధరః ।**
శేషదిగ్గజాది రూపములతోను, వరాహరూపముతోను, ధరణిని ధరించినవాడు కావున పరమాత్మ ధరణీధరుడు. అట్టి నీకు నమస్కారం.

54. **పద్మనాభా !** : **పద్మస్య నాభౌ మధ్యే కర్ణికాయం స్థిత ఇతి పద్మనాభః ।**
హృదయపద్మముయొక్క నాభియందు అనగా మధ్యభాగముననున్న కర్ణికయందు నివసించువాడు. కావున పద్మనాభుడు. పద్మము నాభియందు కలవాడు కావున పద్మనాభుడు. అట్టి నీకు నమస్కారం.

55. **విరించీ !** : **విరచయతి భూతానీతి విరించిః ।** భూతములను సృజించువాడు కావున పరమాత్మ విరించి. **। విభిః హంసైః రిచ్యతే ఇతి విరించి ।**హంసలచేత అనగా యోగీశ్వరులచేత వహింపబడువాడు. అనగా వారి హృదయ పద్మములయందు అధిష్ఠితుడైనవాడు. కావున పరమాత్మ విరించి. అట్టి నీకు నమస్కారం.

56. **ఆర్ష్టిషేణా !** : ఆర్ష్టిషేణా! అట్టి నీకు నమస్కారం.

57. **మహాసేనా !** : గొప్పదైన దేవసేనాస్వరూపుడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

58. **సేనాధ్యక్షా !** : దేవసేనాధిపతియైన కార్తికేయరూపుడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

59. **పురుష్టుతా !** : పెక్కుమందిచే కీర్తింపబడువాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

60. **బహుకల్పా !** : **యథోచిత సంకల్పనం కల్పః । కృపూ సామర్థ్యే ।** అను నిఘంటు ప్రమాణమునుబట్టి యథోచితమైన అనేకసామర్థ్యములు కలవాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

61. **మహాకల్పా !** : గొప్పదైన సామర్థ్యం కలవాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

62. **కల్పనాముఖా !** : కల్పనాముఖుడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

63. **అనిరుద్ధా !** : **1.చతుర్వ్యూహేషు చతుర్థో వ్యూహః అనిరుద్ధః।న నిరుధ్యతే శత్రుభిః కదాచిదితి వా।** వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అను నీ నాల్గు వ్యూహములలో నాల్గవ వ్యూహముగా నొప్పువాడు. శత్రువులచే ఎన్నడును నిరోధింపబడనివాడు నగుటచే పరమాత్మ అనిరుద్ధుడు.

2.**పర, మూర్తి, విభవ, అర్చావ్యూహాః ।** అను ఈ నాల్గు వ్యూహాలద్వారా చేరదగిన వాడు. కాన పరమాత్మ అనిరుద్ధుడు.

3.**న కేనాపి ప్రాదుర్భావేషు నిరుద్ధ ఇతి అనిరుద్ధః ।** ప్రాదుర్భావములలో ఎవ్వని చేతను నిరోధింపబడనివాడు. కాన పరమాత్మ అనిరుద్ధుడు. అట్టి నీకు నమస్కారం.

64. **సర్వగా !** : **సర్వత్ర గచ్ఛతీతి సర్వగః ।** సర్వ కారణమగుటచే సర్వత్ర ప్రవేశించువాడు గావున పరమాత్మ సర్వగుడు.అట్టి నీకు నమస్కారం.

65. **సర్వాత్మన్ !** : చరాచరజగత్తునందలి సర్వప్రాణులయందు ఆత్మరూపమున వసించువాడు. గాన పరమాత్మ సర్వాత్ముడు. అట్టి నీకు నమస్కారం.

66. **ద్వాదశాత్మకా !** : ద్వాదశాదిత్యుల రూపమైనవాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

67. **సూర్యాత్మకా !** : సూర్యమండల మధ్యవర్తియై యుండువాడు పరమాత్మ కావున సూర్యాత్మకుడు. అట్టి నీకు నమస్కారం.

68. **సోమాత్మకా !** : పరమాత్మయొక్క మనస్సునుండి సోముడు జన్మించినందున పరమాత్మ సోమాత్మకుడు. అట్టి నీకు నమస్కారం.

69. **కాలాత్మకా !** : పరమాత్మ కాలస్వరూపుడు కావున కాలాత్మకుడు. అట్టి నీకు నమస్కారం.

70. **వ్యోమాత్మకా !** : పరమాత్మ ఆకాశస్వరూపుడు. కావున వ్యోమాత్మకుడు. అట్టి నీకు నమస్కారం.

71. **భూతాత్మకా !** : **భూతానామంతర్యామీతి భూతాత్మా । ఏషత ఆత్మాన్తర్యామ్యమృతః ఇతి శ్రుతేః ।** భూతములకు, ఆత్మ. అంతర్యామి. కావున పరమాత్మ భూతాత్మకుడు. అట్టి నీకు నమస్కారం.

72. **రసాత్మకా !** : **రసో వై సః ।** అను శ్రుతివాక్యాన్ని బట్టి పరమాత్మరసాత్మకుడు. అట్టి నీకు నమస్కారం.

73. **పరమాత్మా !** : **పరమశ్చాసౌ ఆత్మా చేతి పరమాత్మా ।** కార్య కారణ విలక్షణమై, నిత్యశుద్ధబుద్ధ ముక్తస్వభావము కలవాడు గాన పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

74. **సనాతనా !** : **సనాత్** । అనగా చిరకాలము. కాలము పరమాత్మయొక్క ఒకానొక వికల్పం. కావున పరమాత్మ సనాతనుడు. సర్వకారణత్వాన్ని పురస్కరించుకొని బ్రహ్మాదులు సనాతనులు. పరమాత్మ వారికంటే సనాతనుడు. అట్టి నీకు నమస్కారం.

75. **ముంజకేశా !** : ముంజగడ్డి ఆకారం వంటి కేశములు కలవాడు. అట్టి నీకు నమస్కారం.

76. **హరికేశా !** : 1.హరి యనగా కిరణము. **"అంశవో యే ప్రకాశన్తే మమ తే కేశసంజ్ఞితాః"** అను మహాభారత వచనము కిరణములను కేశములుగా పేర్కొన్నది. కావున కిరణములే కేశములుగా కలవాడు హరికేశుడు.

2.కపిలవర్ణముగల కేశములు కలవాడు. అట్టి నీకు నమస్కారం.

77. **గుడాకేశా !** : 1. । **గుడతి ప్లీహాది రోగేభ్యో గుడా। గుడరక్షాయాం** । ప్లీహాది రోగములనుండి రక్షించు కేశములు కలవాడు.

2. జెముడుకాడల వంటి కేశములు కలవాడు.

3. నిద్రకు లొంగనివాడు. అట్టి నీకు నమస్కారం.

78. **కేశవా !** : 1.। **శోభనాః కేశాః యస్య సః కేశవః** । మంచి కేశములు కలవాడు.

2. । **కేశినం అసురం హతవానితి కేశవః** । **కేశి** అనెడి రాక్షసుని చంపినవాడు గాన కేశవుడు.

3. । **కశ్చ ఈశశ్చ కేశౌ, తావస్మిన్ ఇతి కేశవః** ।

శ్లో॥ క ఇతి బ్రహ్మణో నామ ఈశోఽహం సర్వదేహినామ్ ।
ఆవాం తవాఙ్గే సంభూతౌ తస్మాత్ కేశవ నామవాన్ ॥ - *హరివంశం.*

'క' అని బ్రహ్మయొక్క నామం. సమస్త ప్రాణులకు నేను ఈశ్వరుడను. నియామకుడను. మేమిద్దరము నీ శరీరమునుండి పుట్టినవారము. బ్రహ్మ, ఈశ్వరుడు ఇతనియందు ఉన్నవారు. కావున పరమాత్మ కేశవుడు.

4. । **కశ్చ అశ్చ ఈశశ్చ కేశాః । తే సంత్యస్మిన్నితి కేశవః** । బ్రహ్మవిష్ణురుద్రులు త్రిమూర్తులు ఈయనయందు ఉండుటవలన పరమాత్మ కేశవుడు.

శ్లో॥ **అంశవో యే ప్రకాశన్తే మమ తే కేశసంజ్ఞితాః ।**
సర్వజ్ఞాః కేశవం తస్మాత్ మామాహుః ద్విజసత్తమాః ॥ – *మహాభా. శాం.ప.*
పరబ్రహ్మకు సంబంధించిన కిరణాలు కేశములుగా చెప్పబడుతున్నాయి. కేశములనెడి కిరణములతో సూర్యచంద్రాదులందరు వెలుగుతున్నారు. కావున సర్వజ్ఞులు, బ్రాహ్మణ శ్రేష్ఠులందరు పరబ్రహ్మను కేశవునిగా పేర్కొంటున్నారు.
6. । **బ్రహ్మవిష్ణు శివాఖ్యాశ్శక్తయః కేశసంజ్ఞితాః । త్రయః కేశినః ।** – *ఋక్సంహిత.*
బ్రాహ్మీశక్తి, వైష్ణవీశక్తి, శైవశక్తి ఈమూడు శక్తులకు కేశములని పేరు. అట్టి కేశములు కలవాడు. కావున పరమాత్మ కేశవుడు. ఈ విధంగా కేశవశబ్దం సగుణ, నిర్గుణపరబ్రహ్మవాచకంగా వేదపురాణేతిహాసములయందు పేర్కొనబడింది. అట్టి నీకు నమస్కారం.

79. **నీలా !** : నీల మేఘమువంటి దేహకాంతి గలవాడు. అట్టి నీకు నమస్కారం.

80. **సూక్ష్మా !** : **శబ్దాది స్థూలకారణరహితత్వాత్, శబ్దాదయో హ్యాకాశాదీనాం ఉత్తరోత్తరస్థూలత్వ కారణాని । తదభావాత్ సూక్ష్మ । సర్వగతంసు సూక్ష్మమ్ ।** ఇతి శ్రుతేః. ఆకాశాది భూతములకు శబ్దస్పర్శరూపరసగంధములు ఉత్తరోత్తర స్థూలత్వ కారణములు. అట్టివి లేకుండుటచే పరమాత్మ సూక్ష్మనామముచే విరాజిల్లుచున్నాడు. **"సర్వగతంసు సూక్ష్మం"** అనే శ్రుతి సూక్ష్మశబ్దంచే పరమాత్మ వ్యపదేశ్యుడని వివరిస్తోంది. అట్టి నీకు నమస్కారం.

81 **స్థూలా !** : **స్థూలః ఇతి ఉపచర్యతే సర్వాత్మత్వాత్ ।** సర్వాత్మత్వాన్ని బట్టి ఆరోపిత స్థౌల్యం కలవాడు గాన పరమాత్మ **"స్థూలః"** అని కీర్తింపబడుతున్నాడు. స్థూలశరీరం గలవాడు, సర్వాత్మకుడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

82. **పీతా !** : పరమాత్మ బంగారు వర్ణం కలిగినవాడు. అట్టి నీకు నమస్కారం.

83. **రక్తా !** : శక్తిరూపుడైన పరమాత్మ రక్తవర్ణం గలవాడు. అట్టి నీకు నమస్కారం.

84. **శ్వేతా !** : సత్త్వగుణప్రధానమైన, నిర్మలమైన శ్వేతవర్ణం కలిగినవాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

85. **శ్వేతాధివాసా !** : నిర్మలమైన, తెల్లని, సత్త్వగుణమునందు నివసించువాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

86. **రక్తాంబరప్రియా!** : రక్తాంబరధారిణియైన శక్తిస్వరూపిణికి ప్రియమైనవాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

87. **ప్రీతికరా !** : సమస్తప్రాణులకు ప్రీతిని చేకూర్చువాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

88. **ప్రీతివాసా !** : పరమాత్మ ప్రేమస్వరూపుడు. అట్టి నీకు నమస్కారం.

89. **హంసా !** : 1. **అహం స ఇతి తాదాత్మ్య భావినః సంసారభయం హన్తీతి హంసః ।** హగ్ంసశ్శుచిషత్ ఇతి మంత్రవర్ణాత్ । సోఽహం అని తాదాత్మ్య భావన చేయువారికి సంసారభయమును పోగొట్టువాడు గాన పరమాత్మ హంసయని కీర్తింపబడుచున్నాడు.

2. **హగ్ంసశ్శుచిషత్ ।** అను మంత్రాన్ని అనుసరించి పరమాత్మ సర్వశరీరగామి యగుటవలన హంసయని పిలవబడుచున్నాడు. అట్టి నీకు నమస్కారం.

90. **నీలవాసా !** : నీలాంబరధారియైన బలరామ అవతారస్వరూపుడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

91. **సీరధ్వజా !** : నాగలి గుర్తుగా గలవాడు పరమాత్మ. అట్టి నీకు నమస్కారం.

92. **సర్వలోకాధివాసా !** : పరమాత్మ సమస్తలోకములయందు నివసించువాడు. అట్టి నీకు నమస్కారం.

93. **కుశేశయా !** : పరమాత్మ నీటిపై శయనించువాడు. అట్టి నీకు నమస్కారం.

94. **అధోక్షజా !** : 1. మహాభారతంలోని ఉద్యోగపర్వంలో । **అధో న క్షీయతే జాతు యస్మాత్తస్మాదధోక్షజః।** అను వాక్యమునుబట్టి పరమాత్మ సతతము ఊర్ధ్వరూపుడు, సంసారధర్మస్పర్శరహితుడు గాన అధోక్షజుడు.

2. **ద్యౌరక్షం పృథివీచాధః తయోర్యస్మాదజాయత మధ్యే వైరాజరూపేణ ఇతి వా అధోక్షజః ।** భూమ్యాకాశములమధ్య విరాడ్రూపముతో పరమాత్మ ప్రకాశించు వాడు కావున అధోక్షజుడు.

3. శ్లో॥ **అధోభూతే హ్యక్షగణే ప్రత్యగ్రూప ప్రవాహితే ।**
జాయతే తస్య వై జ్ఞానం తేనాధోక్షజ ఉచ్యతే ॥

అను వచనానుసారం ఇంద్రియాలు అంతర్ముఖంగా ప్రత్యగ్రూపంగా ప్రసారితము లైనప్పుడు నిజరూపజ్ఞానం కలుగునట్టివాడగుటచే పరమాత్మ అధోక్షజుడు. అట్టి నీకు నమస్కారం.

95. **గోవిందా !** : 1. **గామ్ -భూమిం, ధేనుం, స్వర్గం, వేదం వా విన్దతీతి గోవిందః ।** భూమిని పొందువాడు, ధేనువులను పొందువాడు, స్వర్గమును పొందువాడు, వేదమును పొందువాడు పరమాత్మ. అనగా వాటియందు నివసించువాడని అర్థము.

2. శ్లో॥ **నష్టాం వై ధరణీం పూర్వం అవిందం వై గుహాం గతామ్ ।**
గోవింద ఇతి తేనాహం దేవైర్వాగ్భిరభిష్టుతః ॥ - *మోక్షధర్మాలు.*

ఒకప్పుడు భూదేవి భారం వహింప లేక గుహలోనికి వెళ్ళిపోయింది. అట్లు నష్టమైన భూమిని తిరిగి ఉద్ధరించడం చేత యథాతథంగా భూమిని పొంది ఆనందించారు. వారందరు పరమాత్మకు పెట్టిన నామమే గోవిందనామం.

3. శ్లో॥ **అహం కిలేన్ద్రో దేవానాం త్వం గవామిన్ద్రతాం గతః ।**
గోవింద ఇతి లోకాస్త్వాం స్తోష్యన్తి భువి శాశ్వతమ్ ॥

నేను దేవతలకు ఇంద్రుడను. నీవు గోవులకు ఇంద్రుడవు. కావున జనులందరు నిన్ను గోవిందుడని శాశ్వతంగా స్తుతిస్తారని దేవేంద్ర వచనం.

4. శ్లో॥ **గౌరేషా తు తథావాణీ తాం చ విన్దయతే భవాన్ ।**
గోవిందస్తు తతో దేవమునిభిః కథ్యతే భవాన్ ॥ – *హరివంశం.*

గోవు అనగా వాక్కు. వాగ్రూపమైనవాడు పరమాత్మ. ఆ వాక్కులచేతను. వేదవాక్కులచేతను తెలిసి పొందదగినవాడు గాన పరమాత్మ గోవిందుడు. ఆకారణం చేతనే దేవతలు, మునులు మున్నగువారలు పరమాత్మను గోవిందుడని స్తుతిస్తారు.

5. వాక్కు అనగా వైఖరీవాక్కు. ప్రతిమనుజునకు పర పశ్యన్తి మధ్యమములను దాటి, బయటకు వైఖరీవాగ్రూపముగా వెడలునట్టిది. ఇది దైవానుగ్రహంతో మాత్రమే పొందదగినది. అట్టి వాక్కును పొందినవాడు. గావున పరమాత్మ గోవిందుడు. అట్టి నీకు నమస్కారం.

96. **జనార్దనా !** : **జనాన్ దుర్జనానర్దయతి హినస్తి నరకాదీన్ గమయతీతి వా జనార్దనః ।** దుర్జనులను హింసించువాడు. నరకాదులను పొందించువాడు, అభ్యుదయ నిశ్శ్రేయసలక్షణమైన పురుషార్థమునుగూర్చి జనులచే యాచింపబడువాడు నగుటచే పరమాత్మ జనార్దనుడు. అట్టి నీకు నమస్కారం.

97. **మధుసూదనా !** : 1. **మధుం సూదయతీతి మధుసూదనః ।** మధు అనెడి రాక్షసుని సంహరించినవాడు కావున మధుసూదనుడు.

శ్లో॥ **కర్ణమిశ్రోద్భవం చాపి మధు నామ మహాసురమ్ ।**
బ్రహ్మణోపచితం కుర్వన్ జఘాన పురుషోత్తమః ॥

శ్లో॥ **తస్య తాత వధాదేవ దేవదానవమానవాః ।**
మధుసూదన ఇత్యాహుః ఋషయశ్చ జనార్దనమ్ ॥ – *దేవీభాగవతం.*

బ్రహ్మయొక్క చెవులనుండి గువులు వలె మధుకైటభులనెడి ఇద్దరు రాక్షసులు పుట్టారు. దేవీ ఉపదేశామృతంతో విష్ణుని చేతిలో వారిరువురు మరణించారు. ఆ కారణం చేత మధుసూదనుడనే నామం ఏర్పడింది. అట్టి నీకు నమస్కారం.

98. **వామనా !** : **బలిం వామనరూపేణ యాచితవానితి వామనః । స భజనీయ ఇతి వా వామనః ।** బలిని వామనరూపంతో యాచించినవాడు గావున వామనుడు. **మధ్యేవామనమాసీనం విశ్వేదేవా ఉపాసతే ।** అను మంత్రవచనానుసారం ఉపాసింపదగినవాడు కావున పరమాత్మ వామనుడని కీర్తింపబడుతున్నాడు. అట్టి నీకు నమస్కారం.

99. **నమస్తే !** : ఓ పరమాత్మా! నీకు నమస్కారం.



ఓ పరమాత్మా! నీవు వేయి శిరస్సులు కలవాడవు. నీవు వేయి కన్నులు కలవాడవు. నీవు వేయి పాదములు కలవాడవు. నీవు కమలానివి. నీవు మహాపురుషుడవు. నీవు సహస్రబాహుడవు. నీవు అనంత రూపములు కలవాడవు. నిన్ను దేవతలు సహస్రవదనుడని కీర్తిస్తారు. అట్టి నీకు నమస్సులు.

ఓంకారరూపా! నీకు నమస్కారం. విశ్వదేవేశా!, విశ్వస్రష్టా! విశ్వాత్మకా!, విశ్వరూపా!, విశ్వసంభవా! నీనుండియే ఈ విశ్వమంతయు ఆవిర్భవించింది. బ్రాహ్మణులు నీముఖంనుండియే జన్మించారు. క్షత్రియులు నీ బాహువులనుండి జన్మించారు. నీ ఊరుద్వయంనుండి వైశ్యులు ఉద్భవించారు. నీ చరణకమలాలనుండి శూద్రులు ఉద్భవించారు. నీ నాభినుండి అంతరిక్షం ఉద్భవించింది. నీ ముఖంనుండి ఇంద్రాగ్నులు, నీ కన్నులనుండి భానుడు, మనస్సునుండి చంద్రుడు జన్మించారు. నీ ప్రసాదం (దయ) నుండి నేను (బ్రహ్మ) జన్మించాను. నీ కోపంనుండి త్రినేత్రుడు, నీ ప్రాణాలనుండి మాతరిశ్వుడు జన్మించారు. నీ శిరస్సునుండి స్వర్గం పుట్టింది. నీ చెవులనుండి దిక్కులు, చరణాలనుండి భూమి ఆవిర్భవించాయి.

ఓ స్వయంభూ! మీ చెవులనుండి దిక్కులు పుట్టాయి. మీ తేజస్సునుండి నక్షత్రాలు జన్మించాయి. సాకార, నిరాకార వస్తుజాలమంతయు మీనుండి పుట్టాయి. కావున నీవు విశ్వాత్మకుడవయ్యావు.

ఓంకార స్వరూపా! నీకు నమస్కారం. పూల వికాసం నీవు. వికటాట్టహాసం నీవు. పరముడవు నీవు. ఓంకారరూపివి నీవు. వషట్కారం నీవు. స్వాహాకారం నీవు. వౌషట్కారం నీవు. స్వధాకారం నీవే.

నీవు వేదమయుడవు. నీవు తీర్థమయుడవు. యజ్ఞం చేసే యజమానుడవు నీవు. యజ్ఞానివి నీవు. సమస్తాన్నీ నడిపించేది నీవు. యజ్ఞభోక్తవు నీవు. శుక్రం నీవలననే కలుగుతుంది. భూమి, భువం, స్వర్గం, స్వర్ణం, గోవులు, అమృతం మున్నగునవన్నీయు ఇచ్చేది నీవే.

ప్రణవస్వరూపా! బ్రహ్మకు మూలకారణం నీవు. బ్రహ్మమయుడవు నీవు. యజ్ఞానివి నీవు. వేదకాముడవు నీవు. వేద్యుడవు నీవు. యజ్ఞధారకుడవు నీవు. మహామత్స్యమూర్తివి నీవు. మహాసేనుడవు నీవు. మహాశీర్షుడవు నీవు. నరసింహుడవు నీవు. హోతవు నీవు. హోమము నీవు. లక్ష్యము నీవు. హవ్యము నీవు. హూయమానుడవు నీవు. అశ్వమేధయాగానివి నీవు. పోతవు (పురోహితుడవు) నీవు. పవిత్రం చేయువాడవు నీవు. పవిత్రుడవు నీవు. పూజ్యుడవు నీవు. దాతవు నీవు. చంపబడువాడవు నీవు. హరింపబడువాడవు నీవు. హరించువాడవు నీవే.

ప్రణవరూపా! నీతివి నీవు. నేతవు నీవు. ప్రథముడవు (అందరికంటే మొదటివాడవు) నీవు. విశ్వధాముడవు నీవు. శుభాండుడవు నీవు. ధ్రువుడవు నీవు. అరణివలన జన్మించిన అగ్నివినీవే.

ఓ పరమాత్మా! ధ్యానస్వరూపము నీవు. ధ్యేయుడవు నీవు. శ్రేయుడవు నీవు. జ్ఞానానివి నీవు. యజ్ఞకర్తవు నీవు. దానానివి నీవు. భూమా వాచ్యుడవు (సమృద్ధివి) నీవు. చూడదగినవాడవు నీవు. బ్రహ్మవు నీవు. హోతవు నీవు. ఉద్గాతవు(యజ్ఞములో సామగానము చేయువాడు) నీవు. కదిలేవారిలోని కదలిక నీవు. జ్ఞానులలో జ్ఞానానివి నీవు. యోగులలోని యోగానివి నీవు. మోక్షగాములకు లభించే మోక్షానివి నీవు. శ్రీమంతులలోని సిరివి నీవు. గ్రహింపబడేవాడవు నీవు. రక్షకుడవు నీవు. పరం నీవు. నీకు నమస్సులు. ఓ దేవా! సోముడవు నీవు. సూర్యుడవు నీవు. దీక్షవు నీవు. దక్షిణవు నీవు. నరుడవు నీవు. త్రినేత్రుడవు నీవు. మహానేత్రుడవు నీవు. ఆదిత్యులను సృజించినవాడవు నీవు. దేవతాశ్రేష్ఠుడవు నీవు. పవిత్రుడవు నీవు. శుక్రుడవు నీవు. శ్రావణభాద్రపదమాసములు నీవు. ఆశ్వయుజం, పుష్యం, మాఘం, ఫాల్గుణం, చైత్రం, వైశాఖ మాసాల రూపంలో విరాజిల్లే కాలానివి నీవు. సంక్రమణాలు నీవు. విక్రమం నీవు. పరాక్రమం నీవు. అశ్వగ్రీవుడవు నీవు. మహామేధం (యజ్ఞం) నీవు. మంగళకరుడవు నీవు. హరీశ్వరుడవు నీవు. శంభుడవు నీవు. బ్రహ్మేశ్వరుడవు నీవు. సూర్యుడవు నీవు. మిత్రావరుణుడవు నీవు. ముందటి వంశరూపివి నీవు. సకలభూతగణానికి ఆదివి నీవు. మహాభూతానివి (ముక్కాలముల చేత పరిచ్ఛిన్నం కాని స్వరూపం కలవాడు) నీవు. ఊర్ధ్వకర్మవు(మహత్కార్యాలు చేయువాడు) నీవు. కర్తవు నీవు. సర్వపాపవిమోచకుడవు నీవు. త్రివిక్రముడవు నీవు. ఓంకారరూపివి నీవు. అట్టి నీకు నమస్సులు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్థం స్తుతః పద్మభవేన విష్ణుస్తపస్విభిశ్చాద్భుతకర్మకారీ ।
ప్రోవాచ దేవం ప్రపితామహం తు వరం వృణీష్వామలసత్త్వవృత్తే ॥13॥

ఓ నారదా! ఈ విధంగా పద్మభవుని చేతను, తపస్వుల చేతను, స్తుతింపబడిన పిమ్మట అద్భుతకర్మలను చేయు శ్రీమహావిష్ణువు ప్రపితామహునితో ఓ నిర్మలసత్త్వస్వరూపుడా! వరం కోరుకొనుమని పలికాడు.

తమబ్రవీత్ ప్రీతియుతః పితామహో వరం మమేహాద్య విభో ప్రయచ్ఛ ।
రూపేణ పుణ్యేన విభో హ్యనేన సంస్థీయతాం మద్భవనే మురారే ॥14॥

అంతట బ్రహ్మ ప్రీతియుక్తుడై, ఓ మురారీ! ఇప్పుడు నాకు చూపిన పుణ్యప్రదమైన ఈ రూపంతోనే నా భవనంలో సదా నివసించే వరం ప్రసాదించమని శ్రీమహావిష్ణువును ప్రార్థించాడు.

ఇత్థం వృతే దేవవరేణ ప్రాదాత్ ప్రభుస్తథాస్త్వితి తమవ్యయాత్మా ।
తస్థౌ హి రూపేణ హి వామనేన సంపూజ్యమానః సదనే స్వయంభోః ॥15॥

దేవవరుడైన బ్రహ్మ ఇట్టి వరం కోరగా, అవ్యయాత్ముడైన భగవానుడు తథాస్తు! (అట్లేయగు గాక!) అని వరాన్ని ప్రసాదించి, అదే వామనరూపంలో స్వయంభువుడగు బ్రహ్మచే సంపూజ్యమానుడగుచు, బ్రహ్మసదనంలోనే నివాసమున్నాడు.

నృత్యన్తి తత్రాప్సరసాం సమూహా గాయన్తి గీతాని సురేన్ద్రగాయనాః ।
విద్యాధరాస్తూర్యవరాంశ్చ వాదయన్ స్తువన్తి దేవాసురసిద్ధసంఘాః ॥16॥

అప్పుడచ్చట అప్సరోమణుల గుంపులు నృత్యం చేయసాగారు. దేవగాయకులు గీతాలనాలపించారు. విద్యాధరులు వివిధములైన మంగళవాయిద్యములను ప్రయోగింపసాగారు. దేవాసురసిద్ధసంఘాలు స్తోత్రాలు చేయసాగారు.

తతః సమారాధ్య విభుం సురాధిపః పితామహో ధౌతమలః స శుద్ధః ।
స్వర్గే విరించిః సదనాత్ సుపుష్పాణ్యానీయ పూజాం ప్రచకార విష్ణోః ॥17॥

తదనంతరం సురాధిపుడైన పితామహుడు సర్వలోకవిభుడైన విష్ణువును చక్కగా ఆరాధించి, పాపాలను పోగొట్టుకుని పరిశుద్ధుడయ్యాడు. స్వర్గంలో బ్రహ్మ ఇంటినుండి చక్కని పుష్పాలను రప్పించి, ఆ పుష్పాలతో విష్ణువునకు పూజ గావించాడు.

స్వర్గే సహస్రం స తు యోజనానాం విష్ణోః ప్రమాణేన హి వామనోఽభూత్ ।
తత్రాస్య శక్రః ప్రచకార పూజాం స్వయంభువస్తుల్యగుణాం మహర్షే ॥18॥

నారదమహర్షీ! స్వర్గంలో సహస్రయోజన పరిమితమైన వామనుడుగా విష్ణువావిర్భవించగా, ఇంద్రుడు కూడా బ్రహ్మ గావించిన విధంగానే విష్ణువునకు పూజ గావించాడు.

ఏతత్తవోక్తం భగవాంస్త్రివిక్రమశ్చకార యద్దేవహితం మహాత్మా ।
రసాతలస్థో దితిజశ్చకార యత్తచ్ఛృణుష్వాద్య వదామి విప్ర ॥19॥

ఓ విప్రోత్తమా! మహాత్ముడు, భగవానుడునైన త్రివిక్రముడు బలిని రసాతలానికి పంపి, దేవతలకు శుభం కలిగించిన గాథను నీకు వివరించాను. దైత్యేంద్రుడైన బలిచక్రవర్తి రసాతలంలోనుండి ఎట్టి కార్యాలను నిర్వహించాడో వాటిని గూర్చి ఇప్పుడు నీకు వివరిస్తాను. శ్రద్ధగా విను.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే వామనప్రాదుర్భావే బ్రహ్మోక్తస్తవో నామ త్రినవతితమోఽధ్యాయః ॥93॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని వామనప్రాదుర్భావంలో బ్రహ్మచేసిన విశ్వరూపస్తవమనే తొంబైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్నవతితమోఽధ్యాయః – తొంబైనాల్గవ అధ్యాయం

భగవత్ప్రశంసా – భగవత్ప్రశంస

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

గత్వా రసాతలం దైత్యో మహార్హమణిచిత్రితమ్ ।
శుద్ధస్ఫటికసోపానం కారయామాస వై పురమ్ ॥1॥

ఓ నారదా! రసాతలానికి వెళ్ళిన దైత్యేంద్రుడైన బలి శుద్ధస్ఫటికమణిసోపానాలతో, అర్హమైన మహామణులతో, చక్కని నగరం నిర్మించుకున్నాడు.

తత్ర మధ్యే సువిస్తీర్ణః ప్రాసాదో వజ్రవేదికః ।
ముక్తాజాలాన్తరద్వారో నిర్మితో విశ్వకర్మణా ॥2॥

ఆ నగరమధ్యంలో అత్యంతవిస్తృతవజ్రమయవేదికలతోను, ముత్యాలతోరణాల ద్వారాలతోను, విశాలమైన భవనాన్ని విశ్వకర్మ నిర్మించాడు.

తత్రాస్తే వివిధాన్ భోగాన్ భుంజన్ దివ్యాన్ స మానుషాన్ ।
నామ్నా విన్ధ్యావలీత్యేయం భార్యాఽస్య దయితాఽభవత్ ॥3॥

బలి ఆ దివ్యభవనంలో నివాసం చేస్తూ, వివిధాలైన దేవమానుషభోగాలను, వింధ్యావళి అను పేరు గల భార్యతో కలసి అనుభవించాడు.

యువతీనాం సహస్రస్య ప్రధానా శీలమణ్డితా ।
తయా సహ మహాతేజా రేమే వైరోచనిర్మునే ॥4॥

ఓ నారదమునీ! బలిచక్రవర్తియొక్క వేయిమంది భార్యలలో వింధ్యావళి ప్రధానురాలు. శీలవతి, మహాతేజ. ఆమెతో కలసి విరోచనుని కుమారుడైన బలి సకలభోగాలు అనుభవిస్తున్నాడు.

భోగాసక్తస్య దైత్యస్య వసతః సుతలే తదా ।
దైత్యతేజోహరః ప్రాప్తః పాతాలే వై సుదర్శనః ॥5॥

చక్రే ప్రవిష్టే పాతాలం దానవానాం పురే మహాన్ ।
బభౌ హలహలాశబ్దః క్షుభితార్ణవసంనిభః ॥6॥

తం చ శ్రుత్వా మహాశబ్దం బలిః ఖడ్గం సమాదదే ।
ఆః కిమేతదితీత్థం చ పప్రచ్ఛాసురపుంగవః ॥7॥

బలి ఆ విధంగా అప్పుడు సుతలంలో భోగాసక్తుడై యుండగా, దైత్యుల తేజస్సును హరించు సుదర్శన చక్రం పాతాళలోకంలో ప్రవేశించింది. దానవపురమైన పాతాళంలో ఆ విధంగా సుదర్శనచక్రం ప్రవేశించగానే

సముద్రం అల్లకల్లోలమైనపుడు వచ్చే మహాకోలాహలధ్వని పాతాళమంతటా వ్యాపించింది. ఆ మహాశబ్దాన్ని విని, అసురశ్రేష్ఠుడైన బలి ఖడ్గాన్ని ధరించి 'ఏమిటీ ఉపద్రవమని' ప్రశ్నించాడు.

తతో విన్ధ్యావలీ ప్రాహ సాంత్వయన్తీ నిజం పతిమ్ ।
కోశే ఖడ్గం సమావేశ్య ధర్మపత్నీ శుచివ్రతా ॥8॥

అంతట పతివ్రతయు, ధర్మపత్నియునైన వింధ్యావళి అతనిని సాంత్వనపరుస్తూ, ఖడ్గం కోశంలో పెట్టండని చెబుతూ అతనితో ఇలా పలికింది.

ఏతద్భగవతశ్చక్రం దైత్యచక్రక్షయంకరమ్ ।
సంపూజనీయం దైత్యేంద్ర వామనస్య మహాత్మనః ॥9॥

ఇత్యేవముక్త్వా చార్వఙ్గీ సార్ఘ్యపాత్రా వినిర్యయౌ ।
అథాభ్యాగాత్ సహస్రారం విష్ణోశ్చక్రం సుదర్శనమ్ ॥10॥

తతోఽసురపతిః ప్రహ్వః కృతాంజలిపుటో మునే ।
సంపూజ్య విధివచ్చక్రమిదం స్తోత్రముదీరయత్ ॥11॥

దైత్యేంద్రా! ఇది దైత్యసమూహాన్ని సంహరించుటకు, వామనరూపం ధరించిన విష్ణుభగవానుని సుదర్శనచక్రం నుండి వచ్చిన ధ్వని. ఈ సుదర్శనచక్రం ఆరాధనీయమైనదని పలికి, సుందరాంగియైన వింధ్యావళి అర్ఘ్యపాత్రాదులను తీసికొని బయటకు వెళ్ళింది. ఇంతలో వేయి అంచులు గల విష్ణువుయొక్క సుదర్శనచక్రం వారిని సమీపించింది. ఓ నారదమునీ! అంతట అసురపతి వినయపూర్వకంగా చేతులు జోడించి నమస్కరించి, విధివిధానంగా సుదర్శనచక్రాన్ని పూజించి, ఇలా స్తోత్రం గావించాడు.

బలిరువాచ – బలి పలికాడు.

నమస్యామి హరేశ్చక్రం దైత్యచక్రవిదారణమ్ ।
సహస్రాంశుం సహస్రాభం సహస్రారం సునిర్మలమ్ ॥12॥

నమస్యామి హరేశ్చక్రం యస్య నాభ్యాం పితామహః ।
తుండే త్రిశూలధృక్ శర్వ ఆరామూలే మహాద్రయః ॥13॥

ఆరేషు సంస్థితా దేవాః సేంద్రాః సార్కాః సపావకాః ।
జవే యస్య స్థితో వాయురాపోఽగ్నిః పృథివీ నభః ॥14॥

ఆరప్రాన్తేషు జీమూతాః సౌదామిన్యృక్షతారకాః ।
బాహ్యతో మునయో యస్య వాలఖిల్యాదయస్తథా ॥15॥

తమాయుధవరం వన్దే వాసుదేవస్య భక్తితః ।
యన్మే పాపం శరీరోత్థం వాగ్జం మానసమేవ చ ॥16॥

తన్మే దహస్వ దీప్తాంశో విష్ణోశ్చక్ర సుదర్శన ।
యన్మే కులోద్భవం పాపం పైతృకం మాతృకం తథా ॥17॥

తన్మే హరస్వ తరసా నమస్తే అచ్యుతాయుధ ।
ఆధయో మమ నశ్యన్తు వ్యాధయో యాన్తు సంక్షయమ్ ।
త్వన్నామకీర్తనాచ్చక్ర దురితం యాతు సంక్షయమ్ ॥18॥

దైత్యసమూహాన్ని సంహరించునట్టియు, అనంతకిరణాలతో కూడినట్టియు, వేయి అంచులతో, వేయి విధాల ప్రకాశించునట్టియు, సుదర్శనచక్రానికి నమస్కరిస్తున్నాను. సుదర్శనదేవునకు నాభియందు బ్రహ్మ, ముఖభాగాన శూలపాణి శంకరుడు, అంచుల మూలలయందు మహాపర్వతాలు. అంచులలో ఇంద్రార్కాగ్నులతో కూడిన దేవతలు నిలచియున్నారు. సుదర్శనదేవుని వేగం పృథివ్యాపస్తేజోవాయురాకాశాదులనే పంచభూత సమన్వితమైనది. అప్రతిహతమైనది. ఆకులకిరువైపులా మేఘాలు, విద్యుత్తులు, గ్రహతారకలు పరివేష్టించియున్నాయి. బాహ్యప్రాంతాన వాలఖిల్యాది తపోధనులు సేవిస్తూ ఉన్నారు. అటువంటి శ్రేష్ఠమైన, వాసుదేవుని ఆయుధమైన సుదర్శనచక్రానికి భక్తితో నమస్కరిస్తున్నాను. ఓ సుదర్శనదేవా! విష్ణుచక్రరాజా! నేను మనోవాక్కాయకర్మల ద్వారా చేసిన పాపసమూహాన్నంతటిని నీ అగ్నిశిఖలతో కాల్చివేయుము. నా వంశంలో తల్లివైపున, తండ్రివైపున సంభవించిన పాపాలనన్నిటిని తక్షణమే హరించుము. ఓ అచ్యుతాయుధా! నీకు నమస్సులు. నా మానసిక బాధలు, శరీర సంబంధాలైన వ్యాధులు క్షయమగు గాక!. ఓ చక్రేశ్వరా! నీ పవిత్రనామస్మరణంచే నా దురితాలన్నీ క్షయమగు గాక!. నీకనేక నమస్సులు.

ఇత్యేవముక్త్వా మతిమాన్ సమభ్యర్చ్యాథ భక్తితః ।
సంస్మరన్ పుండరీకాక్షం సర్వపాపప్రణాశనమ్ ॥19॥

పూజితం బలినా చక్రం కృత్వా నిస్తేజసోఽసురాన్ ।
నిశ్చక్రామాథ పాతాలాద్విషువే దక్షిణే మునే ॥20॥

ఓ నారదమునీ! ఆ విధంగా స్తోత్రం గావించి, బుద్ధిమంతుడైన బలి సుదర్శనభగవానుని భక్తితో నర్చించి, పాపప్రణాశకుడైన పుండరీకాక్షుని స్మరించాడు. సుదర్శనచక్రం బలిచక్రవర్తి చేసిన పూజను గ్రహించి, అసురుల నందరిని తేజోహీనులను గావించి, దక్షిణవిషువత్కాలంలో (దక్షిణాయనంలో) పాతాళాన్ని విడిచి వెళ్ళిపోయింది.

సుదర్శనే నిర్గతే తు బలిర్వ్యాకులతాం గతః ।
పరమామాపదం ప్రాప్య సస్మార స్వపితామహమ్ ॥21॥

నారదా! సుదర్శనచక్రం అలా వెళ్ళగానే వ్యాకులుడైన బలి ఘోరమైన ఆపదకు లోనై తన తాతయగు ప్రహ్లాదుని స్మరించాడు.

స చాపి సంస్మృతః ప్రాప్తః సుతలం దానవేశ్వరః ।
దృష్ట్వా తస్థౌ మహాతేజాః సార్ఘ్యపాత్రో బలిస్తదా ॥22॥

తమర్చ్య విధినా బ్రహ్మన్ పితుః పితరమీశ్వరమ్ ।
కృతాఞ్జలిపుటో భూత్వా ఇదం వచనమబ్రవీత్ ॥23॥

స్మరించిన వెంటనే ప్రహ్లాదుడు సుతలం చేరుకొని అర్ఘ్యపాత్రతో ఎదురుగా నిలిచిన మనుమడైన బలిని చూశాడు. బ్రహ్మన్! పితామహుడు, ఈశ్వరుడునైన ప్రహ్లాదుని విధివిధానంగా పూజించి, రెండుచేతులు జోడించి, వినమ్రపూర్వకంగా బలి అతనితో ఇలా విన్నవించాడు.

సంస్మృతోఽసి మయా తాత సువిషణ్ణేన చేతసా ।
తన్మే హితం చ పథ్యం చ శ్రేయోఽగ్ర్యం వద తాత మే ॥24॥

కిం కార్యం తాత సంసారే వసతా పురుషేణ హి ।
కృతేన యేన వై నాస్య బన్ధః సముపజాయతే ॥25॥

సంసారార్ణవమగ్నానాం నరాణామల్పచేతసామ్ ।
తరణే యో భవేత్ పోతస్తన్మే వ్యాఖ్యాతుమర్హసి ॥26॥

ఓ పితామహా! వ్యాకులచిత్తంతో నేను నిన్ను స్మరించాను. మీరు ఇచ్చటకు దయచేశారు. నాకీ సమయంలో హితము, పథ్యము, శ్రేయస్కరమునైన కర్తవ్యాన్ని తెలియజేయండి. ఓ తండ్రీ! సంసారంలో ఉంటూ, దాని బంధాలలో పడకుండా ఉండడానికి ఏం చెయ్యాలి? సంసార సముద్రంలో మునిగిన అల్పబుద్ధులైన మానవులకు దానిని దాటింగచల నావ ఏది? ఏమి చేస్తే నరుడీ సంసారసాగరాన్ని దాటగలడో నాకు వివరించవలసినదిగా అభ్యర్థిస్తున్నాను.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏతద్వచనమాకర్ణ్య తత్పౌత్రాద్దానవేశ్వరః ।
విచిన్త్య ప్రాహ వచనం సంసారే యద్ధితం పరమ్ ॥27॥

నారదా! మనుమడైన బలి వేసిన ప్రశ్నకు దానవేశ్వరుడైన ప్రహ్లాదుడు బాగా ఆలోచించి, ప్రపంచ జీవులకు పరహితం కలుగజేసే ఉపాయాన్ని ఇలా వివరించాడు.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు పలికాడు.

సాధు దానవశార్దూల యత్తే జాతా మతిస్త్వియమ్ ।
ప్రవక్ష్యామి హితం తేఽద్య తథాఽన్యేషాం హితం బలే ॥28॥

సాధు! సాధు! దానవశార్దూలా! నీకు చాలా మంచి బుద్ధి కలిగింది. చక్కగా విను. నీకేగాక సంసారకూపంలో పడినవారందరికి హితం కలిగించే విషయమిప్పుడు చెబుతాను.

భవజలధిగతానాం ద్వంద్వవాతాహతానాం సుతదుహితృకలత్రత్రాణభారార్దితానామ్ ।
విషమవిషయతోయే మజ్జతామప్లవానాం భవతి శరణమేకో విష్ణుపోతో నరాణామ్ ॥29॥

వత్సా! బలీ! సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, మంచిచెడ్డలనే పరస్పరవిరుద్ధమైన ద్వంద్వపవనాల తాకిడితో ఎల్లప్పుడూ అల్లకల్లోలంగా వుండే సంసారసాగరంలోని భయంకరమైన విషయవాసనలనే నీటిలో ఎటువంటి నావ లేకుండా భార్యాబిడ్డల పోషణ, రక్షణలనే బరువులను నెత్తిన వేసికొని మునిగే మానవాళికి విష్ణువనే నావ ఒక్కటి మాత్రమే శరణ్యము. తదన్యమైన గతి ఏదియు మానవాళికి కానరాదు.

యే సంశ్రితా హరిమనన్తమనాదిమధ్యం నారాయణం సురగురుం శుభదం వరేణ్యమ్ ।
శుద్ధం ఖగేన్ద్రగమనం కమలాలయేశం తే ధర్మరాజకరణం న విశన్తి ధీరాః ॥30॥

ఆదిమధ్యాంతరహితుడు, సురగురుడు, కళ్యాణప్రదాత, వరేణ్యుడు, పవిత్రుడు, నిర్మలుడు, గరుడ వాహనుడు, శ్రీపతియునైన శ్రీమన్నారాయణుని ఆశ్రయించిన ధీరులకు యమధర్మరాజపట్టణానికి వెళ్ళవలసిన అవసరముండదు.

స్వపురుషమభివీక్ష్య పాశహస్తం వదతి యమః కిల తస్య కర్ణమూలే ।
పరిహర మధుసూదన ప్రపన్నాన్ ప్రభురహమన్యనృణాం న వైష్ణవానామ్ ॥31॥

యముడు పాశహస్తులైన తన భటులకు చెవిలో ఇలా ఆదేశిస్తాడు "దూతలారా! భగవంతుడగు విష్ణువును ఆశ్రయించినవారి చెంతకు మీరు వెళ్ళవద్దు. వైష్ణవులు కాని వారలపైన మాత్రమే మనకు అధికారము కలదు. కాని విష్ణుభక్తులపైన కాదు" అని.

తథాఽన్యదుక్తం నరసత్తమేన ఇక్ష్వాకుణా భక్తియుతేన నూనమ్ ।
యే విష్ణుభక్తాః పురుషాః పృథివ్యాం యమస్య తే నిర్విషయా భవన్తి ॥32॥

నరశ్రేష్ఠుడైనట్టియు, పరమభక్తుడైనట్టియు, ఇక్ష్వాకుప్రభువు ఇలా శాసనం గావించాడు. "విష్ణుభక్తులైన వారిపై యమునికి ఎటువంటి అధికారము లేదు అని.

సా జిహ్వా యా హరిం స్తౌతి తచ్చిత్తం యత్తదర్పితమ్ ।
తావేవ కేవలం శ్లాఘ్యౌ యౌ తత్పూజాకరౌ కరౌ ॥33॥

నూనం న తౌ కరౌ ప్రోక్తౌ వృక్షశాఖాగ్రపల్లవౌ ।
న యౌ పూజయితుం శక్తౌ హరిపాదాంబుజద్వయమ్ ॥34॥

హరిని కీర్తించిన నాల్కయే నాలుక. ఆయనకర్పితమైన చిత్తమే చిత్తము. శ్రీమహావిష్ణువును పూజించే చేతులే చేతులు. శ్లాఘాపాత్రాలు. శ్రీహరిపాదకమలాలను అర్చించనివారి చేతులు చెట్టుకొమ్మల చిగుళ్ళతో సమానములని చెప్పడంలో ఎట్టి సందేహంలేదు. ఇది నిశ్చయం.

నూనం తత్కణ్ఠశాలూకమథవా ప్రతిజిహ్వకా ।
రోగో వాఽన్యో న సా జిహ్వా యా న వక్తి హరేర్గుణాన్ ॥35॥

శ్రీహరి గుణగానం చేయని నాలుక కంఠశాలూక, ప్రతిజిహ్వక, లేక ఇతరమైన రోగంతో కూడినదనుట నిశ్చయం.

శోచనీయః స బంధూనాం జీవన్నపి మృతో నరః ।
యః పాదపంకజం విష్ణోర్న పూజయతి భక్తితః ॥36॥

విష్ణుపాదకమలాలను భక్తితో పూజింపని మానవుడు జీవించినా మరణించినవానితో సమానం. వానిని చూచి బంధువులంతా విచారించపవలసిందే.

యే నరా వాసుదేవస్య సతతం పూజనే రతాః ।
మృతా అపి న శోచ్యాస్తే సత్యం సత్యం మయోదితమ్ ॥37॥

ఎల్లప్పుడూ వాసుదేవుని పూజారతులై యుండి మరణించినను వారి గురించి చింతించనవసరం లేదు. చింతింపరాదు. ఇది సత్యము. ఇది ముమ్మాటికి సత్యం.

శరీరం మానసం వాగ్జం మూర్తామూర్తం చరాచరమ్ ।
దృశ్యం స్పృశ్యమదృశ్యం చ తత్సర్వం కేశవాత్మకమ్ ॥38॥

శారీరకమైనవి, మానసికమైనవి, వాగ్రూపమైనవి, ఆకారం కలవి, నిరాకారమైనవి, చరాచరములు, కనిపించేవి, కనిపించనివి, స్పృశింపదగినవి సమస్తవస్తువులు విష్ణుస్వరూపాలే.

యేనార్చితో హి భగవాన్ చతుర్ధా వై త్రివిక్రమః ।
తేనార్చితా న సందేహో లోకాః సామరదానవాః ॥39॥

భగవంతుడైన త్రివిక్రముని నాలుగువిధాలా పూజించేవారు దేవదానవసహితమైన లోకాలనన్నిటిని పూజించినవారే అవుతారు.

యథా రత్నాని జలధేరసంఖ్యేయాని పుత్రక ।
తథా గుణా హి దేవస్య త్వసంఖ్యాతాస్తు చక్రిణః ॥40॥

పుత్రా! సముద్రంలో ఏ విధంగా అసంఖ్యాకమైన రత్నాలుంటాయో అదే విధంగా చక్రధరుని కల్యాణ గుణాలు కూడా అనంతాలు, అసంఖ్యాకాలు.

యే శంఖచక్రాబ్జకరం స శార్‌ఙ్గిణం ఖగేన్ద్రకేతుం వరదం శ్రియఃపతిమ్ ।
సమాశ్రయన్తే భవభీతినాశనం సంసారగర్తే న పతన్తి తే పునః ॥41॥

శంఖచక్రపద్మశార్‌ఙ్గధరుడు, గరుడధ్వజుడు, వరదుడు, లక్ష్మీపతియు, భవభయనాశకుడునైన విష్ణువును ఆశ్రయించినవారు తిరిగి సంసారకూపంలో పడరు.

యేషాం మనసి గోవిన్దో నివాసే సతతం బలే ।
న తే పరిభవం యాన్తి న మృత్యోరుద్విజన్తి చ ॥42॥

బలీ! ఎవరి మనస్సులో గోవిందుడు సదా నివసిస్తాడో వారికి పరాభవమెన్నడు సంభవింపదు. వారు మృత్యువునకు ఎన్నడు భయపడరు.

దేవం శార్ఙ్గధరం విష్ణుం యే ప్రపన్నాః పరాయణమ్ ।
న తేషాం యమసాలోక్యం న చ తే నరకౌకసః ॥43॥

భక్తపరాయణుడు, శార్ఙ్గధరుడునైన విష్ణుదేవుని శరణు పొందినవారికి యమసాలోక్యంగాని, నరకవాసంగాని లభింపదు.

న తాం గతిం ప్రాప్నువన్తి శ్రుతిశాస్త్రవిశారదాః ।
విప్రా దానవశార్దూల విష్ణుభక్తా వ్రజన్తి యామ్ ॥44॥

దానవశార్దూలా! విష్ణుభక్తులకు కలిగే ఉత్తమగతి కేవలం శ్రుతిశాస్త్రపండితులకుగాని, విప్రులకుగాని లభింపదు.

యాగతిర్దైత్యశార్దూల హతానాం తు మహాహవే ।
తతోఽధికాం గతిం యాన్తి విష్ణుభక్తా నరోత్తమాః ॥45॥

దైత్యశార్దూలా! మహాసంగ్రామంలో మరణించినవారెట్టి మనోహరమైన గతిని పొందుతారో దానికంటే ఉన్నతమైన, మనోహరమైన గతిని విష్ణుభక్తులైన నరోత్తములు పొందుతారు.

యా గతిర్ధర్మశీలానాం సాత్త్వికానాం మహాత్మనామ్ ।
సా గతిర్గదితా దైత్య భగవత్సేవినామపి ॥46॥

ఓ దైత్యోత్తమా! ధర్మశీలురు, సత్త్వగుణసంపన్నులు, మహాత్ములు, ఎట్టి సద్గతిని పొందుతారో భగవత్సేవా తత్పరులు కూడా అట్టి సద్గతినే పొందుతారు.

సర్వావాసం వాసుదేవం సూక్ష్మమవ్యక్తవిగ్రహమ్ ।
ప్రవిశన్తి మహాత్మానం తద్భక్తా నాన్యచేతసః ॥47॥

అనన్యచిత్తంతో వాసుదేవుని భజించేవారు సర్వభూతనివాసి, సూక్ష్ముడు, అవ్యక్తుడునగు ఆ మహాత్ముని దివ్యవిగ్రహంలో లీనమౌతారు.

అనన్యమనసో భక్త్యా యే నమస్యన్తి కేశవమ్ ।
శుచయస్తే మహాత్మానస్తీర్థభూతా భవన్తి తే ॥48॥

అనన్యమనస్కులై భక్తిపూర్వకంగా ఎవరు కేశవునకు నమస్కరిస్తారో వారు పవిత్రతీర్థాలవలె పవిత్రులౌతారు.

గచ్ఛన్ తిష్ఠన్ స్వపన్ జాగ్రత్ పిబన్నశ్నన్నభీక్ష్ణశః ।
ధ్యాయన్ నారాయణం యస్తు న తతోఽన్యోఽస్తి పుణ్యభాక్ ॥49॥

వైకుంఠం ఖడ్గపరశుం భవబన్ధసముచ్ఛిదమ్ ।
ప్రణిపత్య యథాన్యాయం సంసారే న పునర్భవేత్ ॥50॥

నడుస్తూ, కూర్చుంటూ, నిద్రిస్తూ, మేల్కొంటూ, త్రాగుతూ, తింటూ, సర్వకాలసర్వావస్థలలోనూ నారాయణ ధ్యానమగ్నులైనవారిని మించిన పుణ్యాత్ములుండబోరు. భవబన్ధచ్ఛేది, ఖడ్గపరశుధారి ఐన వైకుంఠునకు భక్తులైనవారికి పునర్భవం సంభవింపదు.

క్షేత్రేషు వసతే నిత్యం క్రీడన్నాస్తేఽమితద్యుతిః ।
ఆసీనః సర్వదేహేషు కర్మభిర్న స బధ్యతే ॥51॥

భగవానుడు సర్వక్షేత్రాలలో ఎల్లప్పుడూ క్రీడిస్తూ ఉంటాడు. ఆ మహాతేజస్వి సమస్తదేహాలలో ఆసీనుడై ఉంటాడు. అయినా ఆయన వారల కర్మలచే బంధింపబడడు.

యేషాం విష్ణుః ప్రియో నిత్యం తే విష్ణోః సతతం ప్రియాః ।
న తే పునః సంభవన్తి తద్భక్తాస్తత్పరాయణాః ॥52॥

ఎవరు విష్ణువును నిత్యం ప్రేమిస్తారో వారిని విష్ణువు కూడా నిత్యం ప్రేమిస్తాడు. విష్ణుభక్తిపరాయణు లైనట్టివారు పునర్జన్మను పొందరు.

ధ్యాయేద్దామోదరం యస్తు భక్తినమ్రోఽర్చయేత వా ।
న స సంసారపంకేఽస్మిన్ మజ్జతే దానవేశ్వర ॥53॥

ఓ దానవేశ్వరా! బలీ! భక్తితో సదా వినమ్రుడై, దామోదరుని ధ్యానార్చనాదులు గావించు భగవత్పరాయణుడు ఈ సంసారపంకంలో మునుగడు. అట్టివానికి పునర్జన్మ ఉండదు.

కల్యముత్థాయ యే భక్త్యా స్మరన్తి మధుసూదనమ్ ।
స్తువన్త్యభ్యృశృణ్వన్తి దుర్గాణ్యతితరన్తి తే ॥54॥

ప్రాతఃకాలంలో మేల్కొని మధుసూదనుని భక్తితో స్మరించేవారు, విష్ణుని కల్యాణగాథలు కీర్తించేవారు, వినిపించేవారు, వినేవారు అన్ని ఆపదలను దాటగలుగుతారు.

హరివాక్యామృతం పీత్వా విమలైః శ్రోత్రభాజనైః ।
ప్రహృష్యతి మనో యేషాం దుర్గాణ్యతితరన్తి తే ॥55॥

శ్రీహరివాక్యామృతాన్ని నిర్మలమైన తమ చెవులనే గిన్నెలతో త్రాగి తృప్తినొందిన మనస్సుకలవారు గొప్ప ఆపదలను కూడా దాటగలరు.

యేషాం చక్రగదాపాణౌ భక్తిరవ్యభిచారిణీ ।
తే యాన్తి నియతం స్థానం యత్ర యోగేశ్వరో హరిః ॥56॥

చక్రగదాధరునియందు ఎడతెగని భక్తి ఎవరికి ఉంటుందో అట్టివారు యోగేశ్వరుడైన శ్రీహరి శాశ్వత నివాసస్థానాన్ని పొందుతారు.

విష్ణుకర్మప్రసక్తానాం భక్తానాం యా పరాగతిః ।
సా తు జన్మసహస్రేణ న తపోభిరవాప్యతే ॥57॥

విష్ణుసేవాతత్పరులైన భక్తులకెట్టి పరమగతి ప్రాప్తిస్తుందో అట్టి సద్గతిని వేలాదిజన్మలలో తపమాచరించిన వారు కూడా పొందజాలరు.

కిం జప్యైస్తస్య మంత్రైర్వా కిం తపోభిః కిమాశ్రమైః ।
యస్య నాస్తి పరాభక్తిః సతతం మధుసూదనే ॥58॥

మధుసూదనునియందు నిరంతరం పరమభక్తి లేని మానవునకు జపాల వల్ల, మంత్రాల వల్ల, తపస్సుల వల్ల, ఆశ్రమవాసాల వల్ల ఏం ప్రయోజనం కలుగుతుంది?. భక్తి లేని మంత్రజపాదులు వ్యర్థం.

వృథా యజ్ఞా వృథా వేదా వృథా దానం వృథా శ్రుతమ్ ।
వృథా తపశ్చ కీర్తిశ్చ యో ద్వేష్టి మధుసూదనమ్ ॥59॥

మధుసూదనుని ద్వేషించే మానవుడు చేసే యజ్ఞాలు, వేదపఠనాలు, దానాలు, తపస్సులు, కీర్తి, పురాణ శ్రవణాలు వ్యర్థములే గాని ఎట్టి సత్ఫలితాలనీయజాలవు.

కిం తస్య బహుభిర్మంత్రైర్భక్తిర్యస్య జనార్దనే ।
నమో నారాయణాయేతి మంత్రః సర్వార్థసాధకః ॥60॥

జనార్దనునియందు భక్తి కలిగిన వానికి ఇతర మంత్రాలతో ఏం ప్రయోజనం?. ఓం నమో నారాయణాయ అనే అష్టాక్షరీమహామంత్రమొక్కటియే సర్వార్థసాధకమైనది.

విష్ణురేవ గతిర్యేషాం కుతస్తేషాం పరాజయః ।
యేషామిందీవరశ్యామో హృదయస్థో జనార్దనః ॥61॥

విష్ణువే దిక్కని నమ్మేవారికి పరాజయమెక్కడినుండి వస్తుంది? ఇందీవరశ్యాముడగు జనార్దనుని హృదయంలో ప్రతిష్ఠించుకొన్నవారికి పరాభవమెక్కడినుండి వస్తుంది?.

సర్వమంగలమాంగల్యం వరేణ్యం వరదం ప్రభుమ్ ।
నారాయణం నమస్కృత్య సర్వకర్మాణి కారయేత్ ॥62॥

సర్వమంగళకరుడు, సర్వమాంగల్యమూర్తి, వరేణ్యుడు, వరదుడు, ప్రభువునైన నారాయణునకు నమస్కరించి, సర్వకర్మలను ఆచరించాలి.

విష్టయో వ్యతిపాతాశ్చ యేఽన్యే దుర్నీతిసంభవాః ।
తే నామస్మరణాద్విష్ణోర్నాశం యాన్తి మహాసుర ॥63॥

ఓ మహాసురా! దురాచారాల వల్ల సంభవించే విష్టి, వ్యతిపాతాది ఘోరవిపత్తులన్నియు విష్ణునామస్మరణ మాత్రం చేతనే నశిస్తాయి.

తీర్థకోటిసహస్రాణి తీర్థకోటిశతాని చ ।
నారాయణప్రణామస్య కలాం నార్హన్తి షోడశీమ్ ॥64॥

వేయికోట్ల తీర్థావాసం, నూరుకోట్ల తీర్థస్నానం, శ్రీమన్నారాయణునకు చేసే నమస్కారఫలితంలో పదహారవ భాగానికి కూడా సమానం కాజాలవు.

పృథివ్యాం యాని తీర్థాని పుణ్యాన్యాయతనాని చ ।
తాని సర్వాణ్యవాప్నోతి విష్ణోర్నామానుకీర్తనాత్ ॥65॥

విష్ణునామసంకీర్తనం వలన పృథివిలో గల తీర్థాలనన్నిటినీ సేవించిన ఫలము, దేవాలయాలను దర్శించిన ఫలము, సమస్తపుణ్యకర్మాచరణఫలమూ లభిస్తుంది.

ప్రాప్నువన్తి న తాంల్లోకాన్ వ్రతినో వా తపస్వినః ।
ప్రాప్యన్తే యే తు కృష్ణస్య నమస్కారపరైర్నరైః ॥66॥

శ్రీకృష్ణనమస్కారపరాయణులైన మానవులకు లభించే ఉత్తమలోకాలు ఎన్నెన్నో వ్రతాలు చేసినవారు గాని, కఠోరతపస్సులాచరించినవారు గాని పొందజాలరు.

యోఽప్యన్యదేవతాభక్తో మిథ్యార్చయతి కేశవమ్ ।
సోఽపి గచ్ఛతి సాధూనాం స్థానం పుణ్యకృతాం మహత్ ॥67॥

ఇతరదేవతలనర్చిస్తూ, శ్రీకృష్ణునియందు కపటభక్తిని ప్రదర్శించే నరుడు కూడా సాధువులు, పుణ్యాత్ములు, మహాత్ములు పొందే ఉత్తమగతిని పొందుతాడు.

సాతత్యేన హృషీకేశం పూజయిత్వా తు యత్ఫలమ్ ।
సుచీర్ణతపసాం నృణాం తత్ఫలం న కదాచన ॥68॥

నిరంతరం హృషీకేశుని పూజించేవారికి లభించే ఫలం శాస్త్రోక్తవిధిగా తపమాచరించిన మానవులకు కూడా ఎన్నడూ లభింపదు.

త్రిసంధ్యం పద్మనాభం తు యే స్మరన్తి సుమేధసః ।
తే లభన్త్యుపవాసస్య ఫలం నాస్త్యత్ర సంశయః ॥69॥

మూడుసంధ్యలలోను పద్మనాభుణ్ణి స్మరించే సజ్జనులు ఉపవాసఫలాన్ని పొందుతారు. ఇందులో సందేహమేమీ లేదు.

సతతం శాస్త్రదృష్టేన కర్మణా హరిమర్చయ ।
తత్ప్రసాదాత్పరాం సిద్ధిం బలే ప్రాప్స్యసి శాశ్వతీమ్ ॥70॥

ఓ బలీ! శాస్త్రవిహితకర్మల ద్వారా శ్రీమహావిష్ణువును సదా పూజించు. ఆయన ప్రసాదం వల్ల శాశ్వతమైన పరమసిద్ధిని పొందగలవు.

తన్మనా భవ తద్భక్తస్తద్యాజీ తం నమస్కురు ।
తమేవాశ్రిత్య దేవేశం సుఖం ప్రాప్స్యసి పుత్రక ॥71॥

పుత్రా! నారాయణునియందే మనస్సును లగ్నం చెయ్యి. ఆయనకే భక్తుడవు కమ్ము. ఆయనకు ప్రీతికరముగా యజ్ఞముల నాచరిస్తూ, ఆయనకే నమస్కరిస్తూ. ఆ దేవేశ్వరునే ఆశ్రయిస్తే శాశ్వతమైన సుఖాన్ని పొందగలవు.

ఆద్యం హ్యనన్తమజరం హరిమవ్యయం చ యే వై స్మరన్త్యహరహర్నృవరా భువిస్థాః ।
సర్వత్రగం శుభదం బ్రహ్మమయం పురాణం తే యాన్తి వైష్ణవపదం ధ్రువమక్షయం చ ॥72॥

ఆదిపురుషుడు, అనంతుడు, అజరుడు, అవ్యయుడు ఐన శ్రీహరిని భూమండలంలోని ఏ మనుష్యులు రాత్రింబవళ్ళు నిత్యం స్మరిస్తారో ఆ మానవోత్తములు సర్వత్రా వ్యాపించినదియు, శుభప్రదమైనదియు, బ్రహ్మమయమైనదియు, పురాతనమైనదియు, స్థిరమైనదియు, నాశము లేనిదియునగు విష్ణుపదమును పొందుతారు.

యే మానవా విగతరాగపరా పరజ్ఞా నారాయణం సురగురుం సతతం స్మరన్తి ।
తే ధౌతపాండురపుటా ఇవ రాజహంసాః సంసారసాగరజలస్య తరన్తి పారమ్ ॥73॥

రాగద్వేషాలు వీడి, పర అపర జ్ఞానం కలిగి, ఏ మానవులు సురగురుడగు నారాయణుని సతతం స్మరిస్తారో వారు చక్కగా కడుగబడిన తెల్లని రెక్కలు గల రాజహంసల వలె సంసారసాగరజలాన్ని తరించి తీరానికి చేరుకోగలరు.

ధ్యాయన్తి యే సతతమచ్యుతమీశితారం నిష్కల్మషం ప్రవరపద్మదలాయతాక్షమ్ ।
ధ్యానేన తేన హతకిల్బిషవేదనాస్తే మాతుః పయోధరరసం న పునః పిబన్తి ॥74॥

అచ్యుతుడు, ఈశ్వరుడు, కల్మషదూరుడు, పద్మదళాయతాక్షుడునగు నారాయణుని నిరంతరం ధ్యానించే వారి ధ్యానప్రభావం వలన తమ కిల్బిషాలు, వేదనలు, తొలగిపోవడంతో బాటు తిరిగి మాతృస్తన్యపానం చేయడం సంభవింపదు. పునర్జన్మలేని స్థితి కలుగుతుందని భావం.

యే కీర్తయన్తి వరదం వరపద్మనాభం శంఖాబ్జచక్రవరచాపగదాసిహస్తమ్ ।
పద్మాలయావదనపంకజషట్పదాఖ్యం నూనం ప్రయాన్తి సదనం మధుఘాతినస్తే ॥75॥

వరదుడు, శ్రేష్ఠుడు, పద్మనాభుడు, శంఖచక్రగదాపద్మఖడ్గాసిధనుర్ధరుడు, లక్ష్మీముఖపద్మభ్రమరమగు మధుసూదనుని కీర్తించేవారు నిశ్చయంగా మధుసూదనుని సదనాన్ని చేరతారు.

శృణ్వన్తి యే భక్తిపరా మనుష్యాః సంకీర్త్యమానం భగవన్తమాద్యమ్ ।
తే ముక్తపాపాః సుఖినో భవన్తి యథాఽమృతప్రాశనతర్పితాస్తు ॥76॥

ఏ మానవులు భక్తిపరులై, సంకీర్తనీయుడు, భగవంతుడు, ఆద్యుడునైన శ్రీమన్నారాయణుని లీలలు శ్రవణం చేస్తారో వారు పాపాలనుండి విముక్తులై, అమృతం త్రాగినవారి వలె శాశ్వతసుఖాన్ని ఆనందాన్ని అనుభవిస్తారు.

తస్మాద్ ధ్యానం స్మరణం కీర్తనం వా నామ్నాం శ్రవణం పఠతాం సజ్జనానామ్ ।
కార్యం విష్ణోః శ్రద్ధధానైర్మనుష్యైః పూజాతుల్యం తత్ ప్రశంసన్తి దేవాః ॥77॥


కాబట్టి సజ్జనులగువారు శ్రద్ధతో విష్ణునామస్మరణం, ధ్యానం, కీర్తనం, శ్రవణం, పఠనం చేస్తూ ఉండాలి. దానినే దేవతలు నారాయణుని పూజతో సమానంగా పరిగణించి ప్రశంసిస్తారు.

బాహ్యైస్తథాఽన్తఃకరణైరవిక్లవైర్యో నార్చయేత్ కేశవమీశితారమ్ ।
పుష్పైశ్చ పత్రైర్జలపల్లవాదిభిర్నూనం స ముష్టో విధితస్కరేణ ॥78॥

వైక్లబ్యాన్ని విడిచి, బాహ్యాభ్యంతఃకరణాల ద్వారా ఏ మానవుడు ఈశ్వరుడైన కేశవుని పుష్పాలతోను, పత్రాలతోను, జలాలతోను, పల్లవాదులతోను అర్చించడో అట్టివాడు విధితస్కరుని చేత అనగా బ్రహ్మయనే దొంగచేత సర్వమూ దొంగిలింపబడినవాడు కాగలడు. ఇది తథ్యం.

ఇతి శ్రీవామన మహాపురాణే పులస్త్యనారదసంవాదే భగవత్ప్రశంసా నామ చతుర్నవతితమోఽధ్యాయః ॥94॥

శ్రీవామన మహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని భగవత్ప్రశంస అనే తొంబైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచనవతితమోఽధ్యాయః - తొంబైఐదవ అధ్యాయం

ప్రహ్లాదకృత హితోపదేశః, ఫలశ్రుతిశ్చ - ప్రహ్లాదుడు బలిచక్రవర్తికి చేసిన హితోపదేశం, ఫలశ్రుతి

బలిరువాచ - బలి పలికాడు.

భవతా కథితం సర్వం సమారాధ్య జనార్దనమ్ ।
యా గతిః ప్రాప్యతే లోకే తాం మే వక్తుమిహార్హసి ॥1॥

కేనార్చనేన దేవస్య ప్రీతిః సముపజాయతే ।
కాని దానాని శస్తాని ప్రీణనాయ జగద్గురోః ॥2॥

ఉపవాసాదికం కార్యం కస్యాం తిథ్యాం మహోదయమ్ ।
కాని పుణ్యాని శస్తాని విష్ణోస్తుష్టిప్రదాని వై ॥3॥

యచ్చాన్యదపి కర్తవ్యం హృష్టరూపైరనాలసైః ।
తదప్యశేషం దైత్యేన్ద్ర మమాఖ్యాతుమిహార్హసి ॥4॥

ఓ పితామహా! నాకు మీరంతా వివరించారు. జనార్దనుని చక్కగా ఆరాధించినవారికి ఏ విధమైన సద్గతులు కలుగుతాయో నాకు తెలియజేయండి. ఏ విధంగా ఆరాధిస్తే ప్రభువు సంతోషిస్తాడు? జగద్గురువు ప్రీతికై ఏ యే దానాలు తగినవో, ఉత్తమమైనవో తెలియజేయండి? ఏ యే తిథులలో ఉపవాసాదులు ఆచరిస్తే నారాయణుడు ప్రీతుడౌతాడు? శ్రీమహావిష్ణువు సంప్రీతుడగుటకు ఆచరించవలసిన పుణ్యకార్యాలేవి? ఓ దైత్యేంద్రా! సంతోష స్వాంతులు, సోమరులు కానివారు ఇంకా ఏమేం చేయాలో వాటిని గూర్చి కూడా తెలియజేయండి.

ప్రహ్లాద ఉవాచ - ప్రహ్లాదుడు పలికాడు.

శ్రద్దధానైర్భక్తిపరైర్యాన్యుద్దిశ్య జనార్దనమ్ ।
బలే దానాని దీయన్తే తానూచుర్మునయోఽక్షయాన్ ॥5॥

తా ఏవ తిథయః శస్తా యాస్వభ్యర్చ్య జగత్పతిమ్ ।
తచ్చిత్తస్తన్మయో భూత్వా ఉపవాసీ నరో భవేత్ ॥6॥

ఓ బలీ! శ్రద్ధ గలవారు భక్తితో జనార్దనుణ్ణి ఉద్దేశించి చేసే దానాలు ఉత్తమమైనవనీ, అక్షయఫలాలనిస్తాయనీ, మునులు చెబుతారు. ఏ యే రోజులలో నరుడు భగవద్దత్తమైన చిత్తంతో తన్మయుడై, ఉపవసించి జగత్పతిని ఆరాధిస్తాడో అవే ఉత్తమతిథులు.

పూజితేషు ద్విజేంద్రేషు పూజితః స్యాజ్జనార్దనః ।
ఏతాన్ ద్విషన్తి యే మూఢాస్తే యాన్తి నరకం ధ్రువమ్ ॥7॥

తానర్చయేన్నరో భక్త్యా బ్రాహ్మణాన్ విష్ణుతత్పరః ।
ఏవమాహ హరిః పూర్వం బ్రాహ్మణా మామకీ తనుః ॥8॥

బ్రాహ్మణో నావమన్తవ్యో బుధో వాప్యబుధోఽపి వా ।
సోఽపి దివ్యా తనుర్విష్ణోస్తస్మాత్ తామర్చయేన్నరః ॥9॥

బ్రాహ్మణశ్రేష్ఠులు పూజింపబడితే జనార్దనుడు పూజింపబడినట్లవుతుంది. విప్రులను ద్వేషించే మూఢులు నిశ్చయంగా నరకంలో పడతారు. బ్రాహ్మణులు నా శరీరం. నా భక్తులగు వారు బ్రాహ్మణులను పూజించాలని పూర్వం శ్రీహరి వక్కాణించియున్నాడు. జ్ఞానిగాని, అజ్ఞానిగాని, బ్రాహ్మణుని అవమానించరాదు. బ్రాహ్మణులు విష్ణుదేవుని దివ్యదేహం. కావున వారు పూజార్హులు.

తాన్యేవ చ ప్రశస్తాని కుసుమాని మహాసుర ।
యాని స్యుర్వర్ణయుక్తాని రసగంధయుతాని చ ॥10॥

విశేషతః ప్రవక్ష్యామి పుష్పాణి తిథయస్తథా ।
దానాని చ ప్రశస్తాని మాధవప్రీణనాయ తు ॥11॥

జాతీ శతాహ్వా సుమనాః కుందం బహుపుటం తథా ।
బాణం చ చంపకాశోకం కరవీరం చ యూథికా ॥12॥

పారిభద్రం పాటలా చ బకులం గిరిశాలినీ ।
తిలకం చ జపాకుసుమం పీతకం నాగరం త్వపి ॥13॥

ఏతాని హి ప్రశస్తాని కుసుమాన్యచ్యుతార్చనే ।
సురభీణి తథాన్యాని వర్జయిత్వా తు కేతకీమ్ ॥14॥

ఓ మహాసురా! చక్కనిరంగు, రూపం, సుగంధం, తేనె గల పుష్పాలు భగవంతుని పూజకు ప్రశస్తమైనవి. విశేషించి మాధవునకు ప్రీతికరమైన, ప్రశస్తమైన పుష్పాలను, తిథులను, దానాలను గూర్చి వివరిస్తాను. విను. జాజి, శతాహ్వా, మల్లె, బాణ, చంపక, అశోక, కరవీర, నవమల్లిక, పారిభద్ర, పాటల, వకుళ, గిరిశాలిని, తిలక, జపాకుసుమ, పీతక, నాగరాది పుష్పాలు అచ్యుతుని పూజకు ప్రశస్తమైనవి. తదితరసుగంధభరితమైన పుష్పాలను కూడా పూజలో వాడవచ్చును. కాని మొగలిపువ్వును మాత్రం పూజలో వాడరాదు.

బిల్వపత్రం శమీపత్రం పత్రం భృంగమృగాఙ్కయోః ।
తమాలామలకీపత్రం శస్తం కేశవపూజనే ॥15॥

యేషామపి హి పుష్పాణి ప్రశస్తాన్యచ్యుతార్చనే ।
పల్లవాన్యపి తేషాం స్యుః పత్రాణ్యర్చావిధౌ హరేః ॥16॥

బిల్వపత్రం, శమీపత్రం, భృంగ (గుంటగర) పత్రం, మృగాంక, తమాల, ఉసిరిక పత్రాలు కేశవుని పూజకు ప్రశస్తమైనవి. అచ్యుతార్చనలో ప్రశస్తమైన పుష్పాలకు సంబంధించిన పత్రాలు, చిగుళ్ళు కూడా హరిపూజకు ప్రశస్తమైనవని చెప్పవచ్చును.

వీరుధాం చ ప్రవాలేన బర్హిషా చార్చయేత్తథా ।
నానారూపైశ్చాంబుభవైః కమలేందీవరాదిభిః ॥17॥

ప్రవాలైః శుచిభిః శ్లక్ష్ణైర్జలప్రక్షాలితైర్బలే ।
వనస్పతీనామర్చేత తథా దూర్వాగ్రపల్లవైః ॥18॥

తీగలు, చిగురుటాకులు, దర్భాంకురాలు, రకరకాలైన జలపుష్పాలు, కమలాలు, ఇందీవరాలు, కలువలు, మున్నగువానితో విష్ణువును పూజించాలి. బలీ! నీళ్ళతో కడిగిన చిగుళ్ళతో దూర్వాంకురాదులతో శ్రీమహావిష్ణువును పూజింపవచ్చును.

చందనేనానులింపేత కుంకుమేన ప్రయత్నతః ।
ఉశీరపద్మకాభ్యాం చ తథా కాలీయకాదినా ॥19॥

మహిషాఖ్యం కణం దారు సిహ్లకం నాగరుం తథా ।
శంఖం జాతీఫలం శ్రీశే ధూపాని స్యుః ప్రియాణి వై ॥20॥

ప్రయత్నపూర్వకంగా చందన, కుంకుమ, ఉశీర పద్మకాది, కాలీయకం (సువాసనలున్న పచ్చనిచెక్క) మున్నగువానితో విష్ణువునకు అనులేపనం చేయాలి. దశాంగంలోని మహిష, కోయనచక్కలు సిహ్లక (శిలారసం), అగరు, సిత, శంఖ, జాతీఫలం(జాజికాయ) మున్నగువానితో ధూపం వేసినచో శ్రీశుడు మిక్కిలి ప్రీతుడౌతాడు..

హవిషా సంస్కృతా యే తు యవగోధూమశాలయః ।
తిలముద్గాదయో మాషా వ్రీహయశ్చ ప్రియా హరేః ॥21॥

చక్కగా వండి తయారు చేసిన యవ, గోధుమ, శాల్యన్నములు. తిలలతో, పెసలు, మినుగులతో, వరిబియ్యంతో చేసిన భక్ష్యాలు శ్రీహరికి మిక్కిలి ప్రీతికరమైనవి.

గోదానాని పవిత్రాణి భూమిదానాని చానఘ ।
వస్త్రాన్నస్వర్ణదానాని ప్రీతయే మధుఘాతినః ॥22॥

పవిత్రుడా! గోదానం, భూదానం, వస్త్రదానం, అన్నదానం, స్వర్ణదానం, మధుసూదనునకు ప్రీతికరమైన దానాలు.

మాఘమాసే తిలా దేయాస్తిలధేనుశ్చ దానవ ।
ఇంధనాదీని చ తథా మాధవప్రీణనాయ తు ॥23॥

దానవా! మాఘమాసంలో తిలదానం. తిలధేనుదానం (అనగా తిలలతో చేసిన గోవు). ఇంధనదానం మాధవునకు ప్రీతికరమైనవి. మాధవుని ప్రీతికై దానం చేయాలి.

ఫాల్గునే వ్రీహయో ముద్గా వస్త్రకృష్ణాజినాదికమ్ ।
గోవిందప్రీణనార్థాయ దాతవ్యం పురుషర్షభైః ॥24॥

ఫాల్గుణమాసంలో గోవిందునకు ప్రీతికల్గించడానికి బియ్యం,పెసలు, వస్త్రాలు, కృష్ణాజినం దానం చేయాలి.

చైత్రే చిత్రాణి వస్త్రాణి శయనాన్యాసనాని చ ।
విష్ణోః ప్రీత్యర్థమేతాని దేయాని బ్రాహ్మణేష్వథ ॥25॥

చైత్రంలో రంగురంగుల వస్త్రాలు, పరుపులు, మంచాలు, ఆసనాలు, విష్ణుప్రీతికై బ్రాహ్మణులకు దానం చేయాలి.

గంధమాల్యాని దేయాని వైశాఖే సురభీణి వై ।
దేయాని ద్విజముఖ్యేభ్యో మధుసూదనతుష్టయే ॥26॥

వైశాఖమాసంలో గంధమాల్యాదులు, సుగంధద్రవ్యాలు, బ్రాహ్మణశ్రేష్ఠులకు మధుసూదనప్రీతికై దానం చేయాలి.

ఉదకుంభాంబు ధేనుం చ తాలవృన్తం సుచందనమ్ ।
త్రివిక్రమస్య ప్రీత్యర్థం దాతవ్యం సాధుభిః సదా ॥27॥

త్రివిక్రముని ప్రీతికై జ్యేష్ఠమాసంలో ఉదకుంభదానం (మంచినీటితో కూడిన కొత్తకుండ), అంబుధేనుదానం (జలముతో కూడిన ధేనువు ఆకారంలో ఉండే జలపాత్ర), తాలవృంతాలు (తాటియాకు విసనకఱ్ఱలు), చక్కని చందనాదులు సాధుపురుషులకు దానం చేయాలి.

ఉపానద్యుగలం ఛత్రం లవణామలకాదికమ్ ।
ఆషాఢే వామనప్రీత్యై దాతవ్యాని తు భక్తితః ॥28॥

వామనుని ప్రీతికై ఆషాఢమాసంలో పాదరక్షల జత, గొడుగు, లవణం, ఆమలకం (ఉసిరిక) మున్నగువాటిని భక్తితో దానం చేయాలి.

ఘృతం చ క్షీరకుంభాశ్చ ఘృతధేనుఫలాని చ ।
శ్రావణే శ్రీధరప్రీత్యై దాతవ్యాని విపశ్చితా ॥29॥

బుద్ధిమంతులైన మానవులు శ్రీధరుని ప్రీతికై, శ్రావణమాసంలో నేతితో నింపినట్టియు, పాలతో నింపినట్టియు కుంభాలను, పేరిన నేతితో చేసిన ఘృతధేనువును, ఫలాలను దానం చేయాలి.

మాసి భాద్రపదే దద్యాత్ పాయసం మధుసర్పిషీ ।
హృషీకేశప్రీణనార్థం లవణం సగుడోదనమ్ ॥30॥

భాద్రపదమాసంలో హృషీకేశుని తృప్తి పరచడానికి పాలు, పేరిన నేయి, తేనె, బెల్లంతో వండిన పాయసాన్నం, లవణం దానం చేయాలి.

తిలాస్తురంగం వృషభం దధి తామ్రాయసాధికమ్ ।
ప్రీత్యర్థం పద్మనాభస్య దేయమాశ్వయుజే నరైః ॥31॥

ఆశ్వయుజమాసంలో పద్మనాభుని ప్రీతికై మానవులు తిలలు, గుఱ్ఱము, వృషభం, పెరుగు, రాగి, ఇనుము, దానం చేయాలి.

రజతం కనకం దీపాన్ మణిముక్తాఫలాదికమ్ ।
దామోదరస్య తుష్ట్యర్థం ప్రదద్యాత్కార్తికే నరః ॥32॥

కార్తికమాసంలో దామోదరప్రీత్యర్థం మానవుడు బంగారు వెండి ప్రమిదలలో దీపాలు, రత్నాలు, ముత్యాలు మున్నగునవి దానం చేయాలి.

ఖరోష్ట్రాశ్వతరాన్ నాగాన్ యానయుగ్మమజావికమ్ ।
దాతవ్యం కేశవప్రీత్యై మాసి మార్గశిరే నరైః ॥33॥

ఖర, ఉష్ట్ర, అశ్వ గజ వాహనాదులు, మేకలు, గొఱ్ఱెలు మున్నగువాటిని మార్గశిరమాసంలో కేశవప్రీతికై దానం చేయాలి.

ప్రాసాదనగరాదీని గృహప్రావరణాదికమ్ ।
నారాయణస్య తుష్ట్యర్థం పౌషే దేయాని భక్తితః ॥34॥

భవనాలు, నగరాలు, ఇండ్లు, గృహోపకరణాలు నారాయణుని ప్రీతికై పుష్యమాసంలో మానవులు భక్తితో దానం చేయాలి.

దాసీదాసమలంకారమన్నం షడ్రససంయుతమ్ ।
పురుషోత్తమస్య తుష్ట్యర్థం ప్రదేయం సార్వకాలికమ్ ॥35॥

దాసదాసీజనులు, అలంకారవస్తువులు, షడ్రసోపేతమైన భోజనము సర్వకాలాలలోను దానం చేస్తే పురోషోత్తముడు ఎంతో సంతోషిస్తాడు.

యద్యదిష్టతమం కించిద్యద్వాప్యస్తి శుచిగృహే ।
తత్తద్ధి దేయం ప్రీత్యర్థం దేవదేవాయ చక్రిణే ॥36॥

అన్నిటిలోను తనకిష్టమైన దానిని, తమవద్దనున్న వానిలో పవిత్రమైన వస్తువును దేవదేవుడైన చక్రపాణి ప్రీత్యర్థం దానం చేయాలి.

యః కారయేన్మందిరం కేశవస్య పుణ్యాన్ లోకాన్ స జయేచ్ఛాశ్వతాన్ వై ।
దత్త్వారామాన్ పుష్పఫలాభిపన్నాన్ భోగాన్ భుంక్తే కామతః శ్లాఘనీయాన్ ॥37॥

పితామహస్య పురతః కులాన్యష్టౌ తు యాని చ ।
తారయేదాత్మనా సార్ధం విష్ణోర్మందిరకారకః ॥38॥

విష్ణుదేవునకు ఆలయనిర్మాణం చేయించినవాడు శాశ్వతపుణ్యలోకాలను జయిస్తాడు. పూలతోటలు, పండ్లతోటలు దానం చేసినవాడు శ్లాఘనీయమైన కోరిన కోర్కెలు, భోగాలు అనుభవిస్తాడు. విష్ణ్వాలయాన్ని నిర్మింపజేసినవాడు తనతో సహా పితామహునకు ముందుగానున్న ఎనిమిదితరాలవారు తరింపబడతారు.

ఇమాశ్చ పితరో దైత్య గాథా గాయన్తి యోగినః ।
పురతో యదుసింహస్య జ్యామఘస్య తపస్వినః ॥39॥

అపి నః స కులే కశ్చిద్ విష్ణుభక్తో భవిష్యతి ।
హరిమందిరకర్తా యో భవిష్యతి శుచివ్రతః ॥40॥

అపి నః సన్తతౌ జాయేద్విష్ణ్వాలయవిలేపనమ్ ।
సమ్మార్జనం చ ధర్మాత్మా కరిష్యతి చ భక్తితః ॥41॥

అపి నః సన్తతౌ జాతౌ ధ్వజం కేశవమందిరే ।
దాస్యతే దేవదేవాయ దీపం పుష్పానులేపనమ్ ॥42॥

మహాపాతకయుక్తో వా పాతకీ చోపపాతకీ ।
విముక్తపాపో భవతి విష్ణ్వాయతనచిత్రకృత్ ॥43॥

ఇత్థం పితౄణాం వచనం శ్రుత్వా నృపతిసత్తమః ।
చకారాయతనం భూమ్యాం స్వయం చ లింపతాసుర ॥44॥

యదువంశంలో పరమశ్రేష్ఠుడైన జ్యామఘుని ఎదుట తపస్వులు, యోగులునగు అతని పితరులు ఒకమారిలా గానం చేశారు. "మన వంశంలో ఎవడైనా శ్రీహరిభక్తుడు జన్మిస్తాడా? శుచివ్రతుడై, ఎవడైనా విష్ణ్వాలయం నిర్మింపజేస్తాడా?. విష్ణ్వాలయవిలేపనం చేయించేవాడెవడైనా సంతానంగా జన్మిస్తాడా?. ధర్మాత్ముడై, భక్తితో ఆలయసమ్మార్జనం చేయించేవాడు మన వంశంలో జన్మిస్తాడా?. కేశవమందిరానికి ధ్వజం, దీపసామగ్రి, పూలు, ఇతర పూజాసామగ్రి దానం చేసే ఉత్తములు మన వంశంలో జన్మిస్తారా?. పాతకాలు, మహాపాతకాలు, ఉపపాతకాలు చేసినవారైనప్పటికి విష్ణ్వాలయంలో చిత్రాలు వేయించినవారు సమస్త పాపాలనుండి విముక్తులౌతారు గదా!". మహాసురా! ఈ విధంగా పలికిన పితృదేవతల పలుకులు విని నృపశ్రేష్ఠుడైన జ్యామఘుడు భూలోకంలో విష్ణ్వాలయాన్ని నిర్మింపజేయడమేగాక, తాను స్వయంగా ఆ దేవాలయాన్ని శుభ్రంచేయడం, కడగడం చేశాడు.

విభూతిభిః కేశవస్య కేశవారాధనే రతః ।
నానాధాతువికారైశ్చ పంచవర్ణైశ్చ చిత్రకైః ॥45॥

దదౌ దీపాని విధివద్ వాసుదేవాలయే బలే ।
సుగంధితైలపూర్ణాని ఘృతపూర్ణాని చ స్వయమ్ ॥46॥

నానావర్ణా వైజయన్త్యో మహారజనరంజితాః ।
మంజిష్ఠా నవరంగీయాః శ్వేతపాటలికాశ్రితాః ॥47॥

ఆరామా వివిధా హృద్యాః పుష్పాఢ్యాః ఫలశాలినః ।
లతాపల్లవసంఛన్నా దేవదారుభిరావృతాః ॥48॥

కారితాశ్చ మహామంచాధిష్ఠితాః కుశలైర్జనైః ।
పౌరోగవవిధానజ్ఞై రత్నసంస్కారిభి ర్దృఢైః ॥49॥

తేషు నిత్యం ప్రపూజ్యన్తే యతయో బ్రహ్మచారిణః ।
శ్రోత్రియా జ్ఞానసంపన్నా దీనాన్ధవికలాదయః ॥50॥

ఇత్థం స నృపతిః కృత్వా శ్రద్దధానో జితేంద్రియః ।
జ్యామఘో విష్ణునిలయం గత ఇత్యనుశుశ్రుమః ॥51॥

ఆ దేవాలయాన్ని రంగురంగుల చిత్రాలతో, పంచవర్ణాల ముగ్గులతోను అలంకరించి, కేశవుని వివిధ రకాలైన ఆభరణాలతో, కేశవారాధనారతుడైన జ్యామఘుడు అర్చింపసాగాడు. ఓ బలీ! వాసుదేవాలయంలో వివిధ రకాలైన సుగంధతైలపూర్ణాలు, ఘృతపూర్ణాలు అయిన దీపాలను స్వయంగా స్వామికి సమర్పించాడు. రంగురంగుల ధ్వజపతాకలతోను, ధ్వజస్తంభాలకు తొమ్మిదిరంగుల పతాకలను అలంకరించి, మంజిష్ఠ పూసి, తెల్లని పాటలకుసుమాలతో అలంకరించి, దేవాలయాన్ని శోభాయమానంగా చేశాడు. పుష్పాలతో, ఫలాలతో, లతాపల్లవాలతోను నిండి, హృద్యమైన దేవదారువృక్షాలతో మనోహరమైన అనేక ఉద్యానవనాలను నిర్మింపజేశాడు. తన అంతఃపుర రాజభవనాలను నిర్మించిన శిల్పినిపుణులతోను, రత్నాల నిపుణులతోను, దేవాలయంలోని లోపలిభాగాలను, శిలావేదికలను నిర్మింపజేశాడు. ఆ యా వేదికలయందు ప్రతినిత్యం నియతాచారులు, బ్రహ్మ చారులు, శ్రోత్రియులు, జ్ఞానసంపన్నులు, దీనాంధ వికలాంగులు పూజింపబడుతున్నారు. పితరుల ఆజ్ఞానుసారం జ్యామఘమహారాజు జితేంద్రియుడై, శ్రద్ధాభక్తులతో, వివిధమైన విష్ణుసేవా కార్యాలు నిర్వర్తించడంచేత విష్ణుపదం పొందగలిగాడని పెద్దలు చెప్పగా విన్నాము.

తమేవ చాద్యాపి బలే మార్గం జ్యామఘకారితమ్ ।
వ్రజన్తి నరశార్దూల విష్ణులోకజిగీషవః ॥52॥

విష్ణులోకాన్ని చేరాలనుకునేవారు ఈనాటికి కూడా జ్యామఘమహారాజు అనుసరించిన మార్గంలోనే ప్రయాణిస్తున్నారు.

తస్మాత్ త్వమపి రాజేంద్ర కారయస్వాలయం హరేః ।
తమర్చయస్వ యత్నేన బ్రాహ్మణాంశ్చ బహుశ్రుతాన్ ।
పౌరాణికాన్ విశేషేణ సదాచారరతాన్ శుచీన్ ॥53॥

వాసోభిర్భూషణై రత్నైర్గోభిర్భూకనకాదిభిః ।
విభవే సతి దేవస్య ప్రీణనం కురు చక్రిణః ॥54॥

ఏకం క్రియాయోగరతస్య తేఽద్య నూనం మురారిః శుభదో భవిష్యతి ।
నరా న సీదన్తి బలే సమాశ్రితా విభుం జగన్నాథమనన్తమచ్యుతమ్ ॥55॥

కావున రాజేంద్రా! నీవుకూడా శ్రీహరికి ఆలయాన్ని నిర్మింపజేయుము. ప్రయత్నపూర్వకంగానైనా శ్రీహరిని అర్చించు. ఎంతో చదువుకున్న, తెలిసిన బ్రాహ్మణులను, విశేషించి పౌరాణికులను, సదాచారరతులను పవిత్రులను పూజింపుము. ధనకనకవస్త్రరత్నాభరణాలతోను, గోభూస్వర్ణదానాలతోను వారిని అర్చించి, చక్రధరుడైన విష్ణుదేవుని సంప్రీతుని గావింపుము. నీవుకూడా ఇట్టి క్రియాయోగరతుడవైనచో మురారి నీకిప్పుడు శుభాలను కలిగిస్తాడు. ఓ బలీ! విభుడు, అనంతుడు, అచ్యుతుడునైన జగన్నాథుని ఆశ్రయం పొందిన మానవులకు ఎన్నడు ఏవిధమైన దుఃఖము కలుగదు.

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఇత్యేవముక్త్వా వచనం దితీశ్వరో వైరోచనం సత్యమనుత్తమం హి ।
సంపూజితస్తేన విముక్తిమాయయౌ సంపూర్ణకామో హరిపాదభక్తః ॥56॥

నారదా! దైత్యేశ్వరుడగు బలికి ఈ విధంగా సత్యము సర్వోత్తమమునైన హితవచనములు పలుకగా విరోచనుని కుమారుడైన బలి పితామహుడైన ప్రహ్లాదుని భక్తితో పూజించాడు. సంపూర్ణకాముడు, హరిపాదభక్తుడునైన ప్రహ్లాదుడు మనుమని పూజలు అందుకొనిన పిమ్మట మోక్షమార్గానుయాయుడయ్యాడు.

గతే హి తస్మిన్ ముదితే పితామహే బలేర్బభౌ మందిరమిందువర్ణమ్ ।
మహేంద్రశిల్పిప్రవరోఽథ కేశవం స కారయామాస మహామహీయాన్ ॥57॥

సంతుష్టాంతరంగుడై, ప్రహ్లాదుడు వెళ్ళిన తరువాత బలిగృహం చంద్రకాంతులతో తేజరిల్లింది. దేవశిల్పి వరుడైన విశ్వకర్మచే మహామహిమాన్వితమైన కేశవుని సుందరవిగ్రహాన్ని తయారు చేయించాడు.

స్వయం స్వభార్యాసహితశ్చకార దేవాలయే మార్జనలేపనాదికాః ।
క్రియామహాత్మా యవశర్కరాద్యా బలిం చకారాప్రతిమాం మధుద్రుహః ॥58॥

భార్యాసమేతుడైన బలి కేశవుని సుందరమూర్తిని దేవాలయంలో ప్రతిష్ఠించి, ఆ ఆలయానికి మార్జన లేపనాదులను స్వయంగా నిర్వహించాడు. యవలు, శర్కర మొదలైన వస్తువులు కేశవార్పణం గావిస్తూ, అప్రతిమానమైన భక్తితో మధుసూదనుని ఆరాధింపసాగాడు.

దీపప్రదానం స్వయమాయతాక్షీ వింధ్యావలీ విష్ణుగృహే చకార ।
గేయం స ధర్మ్యశ్రవణం చ ధీమాన్ పౌరాణికైర్విప్రవరైరకారయత్ ॥59॥

బలిచక్రవర్తి భార్యయైన వింధ్యావళి స్వయంగా ఆ విష్ణ్వాలయంలో దీపప్రదానం చేసింది. ధీమంతుడైన బలి పౌరాణికులైన విప్రవరులచే ధార్మికప్రవచనాలు నిర్వహింపజేశాడు. ఆ ధార్మికప్రవచనాలను బలి తాను శ్రద్ధగా శ్రవణం చేయసాగాడు.

తథా విధస్యాసురపుంగవస్య ధర్మే సుమార్గే ప్రతిసంస్థితస్య ।
జగత్పతిర్దివ్యవపుర్జనార్దనస్తస్థౌ మహాత్మా బలిరక్షణాయ ॥60॥

ఆవిధంగా ఉత్తమమైన ధర్మమార్గస్థితుడైన దానవేశ్వరుని రక్షణ బాధ్యతలు స్వీకరించడానికి జగత్పతియు, మహాత్ముడునైన జనార్దనుడు స్వయంగా దివ్యశరీరంతో అచ్చటనే నిలిచాడు.

సూర్యాయుతాభం ముసలం ప్రగృహ్య నిఘ్నన్ స దుష్టానరియూథపాలాన్ ।
ద్వారి స్థితో న ప్రదదౌ ప్రవేశం ప్రాకారగుప్తే బలినో గృహే తు ॥61॥

జనార్దనుడు సుదృఢమైన ప్రాకారంతో రక్షింపబడుచున్న బలిగృహద్వారం చెంత దుష్టులైన శత్రుగణాలను నిరోధించడానికి వేయి సూర్యుల ప్రభతో వెలుగొందుచున్న ముసలాన్ని పట్టుకుని, కాపుగా నిలబడి, బలిగృహం లోనికి ప్రవేశించడానికి ఎవరిని అనుమతించలేదు.

ద్వారి స్థితే ధాతరి రక్షపాలే నారాయణే సర్వగుణాభిరామే ।
ప్రాసాదమధ్యే హరిమీశితారమభ్యర్చయామాస సురర్షిముఖ్యమ్ ॥62॥

సకలకల్యాణగుణాభిరాముడైన నారాయణుడు ద్వారపాలకుడుగా వాకిట నిలబడగా, గృహాభ్యంతరంలో బలిరాజేంద్రుడు సురర్షిముఖ్యుడు, ఈశ్వరుడునగు హరిని భక్తియుక్తుడై, ఆరాధింపసాగాడు.

స ఏవమాస్తేఽసురరాడ్బలిస్తు సమర్చయన్ వై హరిపాదపంకజౌ ।
సస్మార నిత్యం హరిభాషితాని స తస్య జాతో వినయాంకుశస్తు ॥63॥

అసురరాజైన బలి ఈ విధంగా హరిపాదపద్మయుగళాన్ని అర్చిస్తూ, ప్రతినిత్యము హరి ఉపదేశవాక్యాలను స్మరింపసాగాడు. అతడిట్లు వినయసుందరమైన ఆదర్శజీవనం గడిపాడు. బలి భగవంతునికి వినయమనే అంకుశమయ్యాడు.

ఇదం చ వృత్తం స పపాఠ దైత్యరాట్ స్మరన్ సువాక్యాని గురోః శుభాని ।
తథ్యాని పథ్యాని పరత్ర చేహ పితామహస్యేంద్రసమస్య వీరః ॥64॥

దైత్యేశ్వరుడీపవిత్రవృత్తాన్ని పఠిస్తూ, మహేంద్రసమానుడైన తనపితామహుడు గావించిన ఇహపర తారకమైన హితవాక్యాలను, యథార్థవాక్యాలను, గురువర్యుని శుభప్రదమైన చక్కని వాక్యాలను స్మరిస్తూ, కాలం వెళ్ళబుచ్చాడు.

యే వృద్ధవాక్యాని సమాచరన్తి శ్రుత్వా దురుక్తాన్యపి పూర్వతస్తు ।
స్నిగ్ధాని పశ్చాన్నవనీత శుద్ధా మోదన్తి తే నాత్ర విచారమస్తి ॥65॥

ముందుగా కఠినంగా చెప్పబడినప్పటికి తదనంతరకాలంలో నవనీతం వలె మృదువైనట్టియు, శుద్ధ మైనట్టియు, వృద్ధుల వాక్యాలు విని, వాటిననుసరించినవారు నిస్సందేహంగా ఆనందాన్ని పొందుతారు.

ఆపద్భుజంగదష్టస్య మంత్రహీనస్య సర్వదా ।
వృద్ధవాక్యౌషధా నూనం కుర్వన్తి కిల నిర్విషమ్ ॥66॥

వృద్ధుల వాక్యాలనే దివ్యౌషధం, ఆపదరూపమైన సర్పదష్టుడై, మంత్రహీనుడైన మానవుని విషాన్ని సర్వదా నిస్సందేహంగా హరిస్తుందిగదా!.

వృద్ధవాక్యామృతం పీత్వా తదుక్తమనుమాన్య చ ।
యా తృప్తిర్జాయతే పుంసాం సోమపానే కుతస్తథా ॥67॥

వృద్ధుల వచనాలనే అమృతం త్రాగి, తదనుగుణంగా నడుచుకునే వారికి కలిగే తృప్తి సోమరసపానంతో కూడా లభింపదు. సోమరసపానం కూడా వృద్ధుల వచనానుగుణంగా నడుచుకునే వారికి లభించే తృప్తితో సమానమైన తృప్తిని కలుగజేయలేదని భావం.

ఆపత్తౌ పతితానాం యేషాం వృద్ధా న సన్తి శాస్తారః ।
తే శోచ్యా బన్ధూనాం జీవన్తోఽపీహ మృతతుల్యాః స్యుః ॥68॥

ఎవరు ఆపదలలో చిక్కుకుంటారో అట్టివారికి దారి చూపే పెద్దలు (వృద్ధులు) లభింపనిచో వారు జీవించి యున్నప్పటికి మరణించినవారితో సమానులే. అట్టివారి దుర్దశను గూర్చి వారి బంధువులు విచారింపవలసినదే.

ఆపద్గ్రాహగృహీతానాం వృద్ధాః సంతి న పండితాః ।
యేషాం మోక్షయితారో వై తేషాం శాంతిర్న విద్యతే ॥69॥

ఆపద అనెడు మొసలిచేత చిక్కినవారికి, దానినుండి విడిపింపగల వృద్ధులు, పండితులు, లభింపక పోతే శాంతి ఎన్నడు లభింపనే లభింపదు.

ఆపజ్జలనిమగ్నానాం హ్రియతాం వ్యసనోర్మిభిః ।
వృద్ధవాక్యైర్వినా నూనం నైవోత్తారం కథంచన ॥70॥

ఆపదలనబడే జలంలో మునిగిపోయి, వ్యసనాలనే కెరటాల దెబ్బలు తింటూ, సుడిగుండంలోనికి కొట్టుకొని పోయే మానవుని ఉద్ధరించుటకు, తీరము చేర్చుటకు, వృద్ధోపదేశవాక్యాలు దక్క మరేదీ సమర్థము కాజాలదు.

తస్మాద్యో వృద్ధవాక్యాని శృణుయాద్విదధాతి చ ।
స సద్యః సిద్ధిమాప్నోతి యథా వైరోచనో బలిః ॥71॥

కావున వృద్ధోపదేశవాక్యాలను శ్రద్ధగా విని, తదనుగుణంగా ఆచరించే మానవుడు తక్షణమే సిద్ధిని పొందుతాడు. భాగవతోత్తముడు, పితామహుడునైన ప్రహ్లాదుని ఉపదేశవాక్యాలను శ్రద్ధగా విని, తదనుగుణంగా వాసుదేవాలయాన్ని నిర్మింపజేసి, హరిభక్తితత్పరుడై, శ్రీమన్నారాయణునితో బాటు దేవాలయాన్ని కూడా ప్రతినిత్యం సేవించి, విష్ణుపదసిద్ధిని పొందిన బలిచక్రవర్తిగాథయే ఇందులకు తార్కాణం.

ఫలశ్రుతిః – ఫలశ్రుతి

పులస్త్య ఉవాచ – పులస్త్యమహర్షి పలికాడు.

ఏతన్మయా పుణ్యతమం పురాణం తుభ్యం తథా నారదకీర్తితం వై ।
శ్రుత్వా చ కీర్త్యా పరయా సమేతో భక్త్యా చ విష్ణోః పదమభ్యుపైతి ॥72॥

నారదా! పుణ్యతమమైన వామన పురాణాన్ని సంపూర్ణంగా నీకు వినిపించాను. దీనిని శ్రద్ధాభక్తులతో శ్రవణం గావించిన, పఠించిన విష్ణుపదాన్ని పొందుతారు.

యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।
తథా పురాణశ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥73॥

గంగానదీజలాలలో మునిగినందున సమస్తపాపాలు తొలగి, పవిత్రులగుచున్న విధంగా పురాణశ్రవణం వలన సకల దురితాలు నశిస్తాయి.

న తస్య రోగా జాయన్తే న విషం చాభిచారికమ్ ।
శరీరే చ కులే బ్రహ్మన్ యః శృణోతి చ వామనమ్ ॥74॥

బ్రహ్మన్! వామన పురాణ శ్రవణంచేసేవారి శరీరంలోగాని, అట్టివారి వంశంలోవారికిగాని, ఏవిధమైన రోగాలు కలుగవు. విషప్రయోగాలుగాని, మరణమోహన ఉచ్చాటనాది అభిచారిక కర్మలుగాని వారినేవిధంగాను బాధింపజాలవు.

శృణోతి నిత్యం విధివచ్చ భక్త్యా సంపూజయన్ యః ప్రణతశ్చ విష్ణుః ।
స చాశ్వమేధస్య సదక్షిణస్య ఫలం సమగ్రం పరిహీనపాపః ॥75॥

ప్రతిదినము విష్ణుదేవుని విధివిధానంగా పూజించి, నమస్కరించి, భక్తిపూర్వకంగా వామన పురాణాన్ని శ్రవణం చేస్తే సమస్తపాపాలునశించి, దక్షిణలతోసహా అశ్వమేధయాగం చేసినవారికిలభించే సంపూర్ణఫలం లభిస్తుంది.

ప్రాప్నోతి దత్తస్య సువర్ణభూమేరశ్వస్య గోనాగరథస్య చైవ ।
నారీ నరశ్చాపి చ పాదమేకం శృణ్వన్ శుచిః పుణ్యతమః పృథివ్యామ్ ॥76॥

పురుషులుగాని, స్త్రీలుగాని, వామనపురాణంలోని ఒక శ్లోకంగాని, ఒక పాదంగాని భక్తితో వినినవారు ఈ భూమండలంలో పవిత్రులు, పుణ్యాత్ములు అవుతారు. గో భూ స్వర్ణ గజ రథ తురగాదులు దానంచేసిన ఫలంకూడా వీరికి లభిస్తుంది.

స్నానే కృతే తీర్థవరే సుపుణ్యే గంగాజలే నైమిషపుష్కరే వా ।
కోకాముఖే యత్ప్రవదన్తి విప్రాః ప్రయాగమాసాద్య చ మాఘమాసే ॥77॥

స తత్ఫలం ప్రాప్య చ వామనస్య సంకీర్తయన్ నాన్యమనాః పదం హి ।
గచ్ఛేన్మయా నారద తేఽద్య చోక్తం యద్రాజసూయస్య ఫలం ప్రయచ్ఛేత్ ॥78॥

యద్భూమిలోకే సురలోకలభ్యే మహత్సుఖం ప్రాప్య నరః సమగ్రమ్ ।
ప్రాప్నోతి చాస్య శ్రవణాన్మహర్షే సౌత్రామణేర్నాస్తి చ సంశయో మే ॥79॥

నైమిశారణ్య, పుష్కర క్షేత్రాలలో స్నానంచేస్తే, ప్రయాగలో మాఘస్నానాలుచేస్తే, భాగీరథిలో, కోకాముఖ క్షేత్రంలో స్నానంచేస్తే కలిగే పుణ్యఫలం అనన్యచిత్తంతో వామనపురాణం పఠించడంవలన కలుగుతుందని విప్రులు వక్కాణిస్తున్నారు. నారదా! రాజసూయయాగఫలాన్ని ప్రసాదించే వామనపురాణాన్ని నేను నీకు ఈనాడు సంపూర్ణంగా వినిపించాను. ఓమహర్షీ! ఈపురాణాన్ని శ్రవణం గావించిన మానవుడు భూలోకంలోను, సురలోకంలోను లభ్యమయ్యే మహత్సుఖాలు సంపూర్ణంగా పొందడమేగాక సౌత్రామణి క్రతువు నిర్వహించిన వారికి లభించే సంపూర్ణఫలం కూడా పొందుతాడనడంలో నాకెట్టి సంశయమూలేదు.

రత్నస్య దానస్య చ యత్ఫలం భవేద్ యత్సూర్యస్య చేన్ద్వోర్గ్రహణే చ రాహోః ।
అన్నస్య దానేన ఫలం యథోక్తం బుభుక్షితే విప్రవరే చ సాగ్నికే ॥80॥

దుర్భిక్షసంపీడితపుత్రభార్యే యామీ సదా పోషణతత్పరే చ ।
దేవాగ్నివిప్రర్షిరతే చ పిత్రోః శుశ్రూషకే భ్రాతరి జ్యేష్ఠకే చ ।
యత్తత్ఫలం సంప్రవదన్తి దేవాః స తత్ఫలం లభతే చాస్య పాఠాత్ ॥81॥

రాహుగ్రస్త సూర్యచంద్ర గ్రహణాల సమయంలోను, తదితర పవిత్ర పర్వదినాలలోను, రత్నాలు దానం చేసినచో లభించే ఫలము, అగ్నిపూజానిరతుడగు విప్రవరునకు ఆకలిగొన్నవేళ భోజనం పెట్టడంవలన వచ్చేపుణ్యము, కరువు కాటకాలలో ఆకలితో బాధపడే పుత్ర కళత్ర సహితుడైనవాని పోషణ బాధ్యత వహించడం వలన కలిగే పుణ్యము, స్త్రీలకు తోడుగా నిలిచేవారికి, దేవాగ్ని ఋషి బ్రాహ్మణులనర్చించే వారికి కలిగే సత్ఫలము, తల్లిదండ్రులకు, జ్యేష్ఠసోదరులకు శుశ్రూష చేసేవారికి లభించే సత్ఫలము, పవిత్రమైన ఈ వామన పురాణ పఠనం వలన తప్పక లభిస్తుందని దేవతలు వక్కాణిస్తున్నారు.

చతుర్దశం వామనమాహురగ్ర్యం శ్రుతే చ యస్యాఘచయాశ్చ నాశమ్ ।
ప్రయాన్తి నాస్త్యత్ర చ సంశయో మే మహాన్తి పాపాన్యపి నారదాశు ॥82॥

నారదా! పదునాల్గవదైన వామనపురాణం పురాణాలలో అగ్రస్థానంలో నిలిచింది. దీనిని వినినందున సాధారణ పాపాలేగాక, మహాపాతకాలన్నీకూడా శీఘ్రంగా నశిస్తాయి. ఇందులో సందేహం లేదు.

పాఠాత్ సంశ్రవణాద్విప్ర శ్రావణాదపి కస్యచిత్ ।
సర్వపాపా నశ్యన్తి వామనస్య సదా మునే ॥83॥

ఓ నారదమునీ! వామన పురాణాన్ని పఠించినా, వినినా, ఇతరులకు వినిపించినా, సమస్తపాపాలు నశిస్తాయి.

ఇదం రహస్యం పరమం తవోక్తం న వాచ్యమేతద్ధరిభక్తివర్జితే ।
ద్విజస్య నిన్దారతిహీనదక్షిణే సహేతువాక్యావృతపాపసత్త్వే ॥84॥

నారదా! వామన పురాణం పరమ రహస్యమైనది. దీనిని హరిభక్తివర్జితులైనవారికి చెప్పరాదు. పరనింద చేసేవారికి, బ్రాహ్మణులను ద్వేషించేవారికి, కుతర్కాలతో తాము చేసే దురాచారాలను సమర్థించుకునేవారికి కూడా దీనిని చెప్పరాదు. అట్టివారు దీనిని వినడానికి అర్హులుకారు.

నమోనమః కారణవామనాయ నారాయణాయామితవిక్రమాయ ।
శ్రీ శార్ఙ్గచక్రాసిగదాధరాయ నమోఽస్తు తస్మై పురుషోత్తమాయ ॥85॥

ఇత్థం వదేద్యో నియతం మనుష్యః కృష్ణభావనః ।
తస్య విష్ణుః పదం మోక్షం దదాతి సురపూజితః ॥86॥

"దేవకార్యసిద్ధికై వామనావతారం ధరించిన పరాత్పరునకు నమస్కారం. అమితవిక్రముడైన నారాయణునకు నమస్కారం. శ్రీ, శార్ఙ్గం, చక్రం, ఖడ్గం, గద మున్నగువాటిని ధరించిన పురుషోత్తమునకు నమస్కారం". ఈవిధంగా ఏమానవుడు తన భావనలనన్నింటిని శ్రీకృష్ణునకు సమర్పణగావించి, ఈ వామనపురాణాన్ని నిత్యం పఠిస్తాడో అట్టి మానవునకు సురపూజితుడైన విష్ణుభగవానుడు మోక్షపదాన్ని ప్రదానం చేస్తాడు.

వాచకాయ ప్రదాతవ్యం గోభూస్వర్ణవిభూషణమ్ ।
విత్తశాఠ్యం న కర్తవ్యం కుర్వన్ శ్రవణనాశకమ్ ॥87॥

త్రిసంధ్యం చ పఠన్ శృణ్వన్ సర్వపాపప్రణాశనమ్ ।
అసూయారహితం విప్ర సర్వసంపత్ప్రదాయకమ్ ॥88॥

వామన పురాణ ప్రవచనం గావించే పండితులను గో,భూ,హిరణ్య,వస్త్రాభరణాదులతో, భక్తితో సత్కరించాలి. ధనలోభం చూపరాదు. ఆవిధంగా విత్తలోభం చేసినచో పురాణశ్రవణఫలం నశిస్తుంది. ఓ విప్రదేవా! అసూయాది దుర్గుణాలను వదలి, త్రిసంధ్యలలో ఈ పురాణాన్ని పఠించినను, వినినను, సమస్త పాపాలు నశించిపోతాయి. సర్వసంపదలు లభిస్తాయి.

ఇతి శ్రీవామనమహాపురాణే పులస్త్యనారదసంవాదే ప్రహ్లాదకృత హితోపదేశః, ఫలశ్రుతిశ్చ నామ పంచనవతితమోఽధ్యాయః ॥95॥

శ్రీవామనమహాపురాణమునందలి పులస్త్యనారదసంవాదంలోని ప్రహ్లాదుడు బలిచక్రవర్తికి చేసిన హితోపదేశం, ఫలశ్రుతి అనే తొంబైఐదవఅధ్యాయం సమాప్తం.

శ్రీవామనమహాపురాణం సర్వం సంపూర్ణమ్

శ్రీ వామనమహాపురాణం సర్వం సంపూర్ణం.

